# ఔరంగజేబ్

## చరిత్రకెక్కని చారిత్రక కోణాలు




అబుల్ ఫౌజాన్

M.A. (Islamic Studies) M.A. (Urdu)

# ఔరంగజేబ్

## చరిత్రకెక్కని చారిత్రక కోణాలు


అబుల్ ఫౌజాన్

(ముహమ్మద్ సర్వర్)

M.A. (Islamic Studies) M.A. (Urdu)



RYDH & ZAID BROTHERS

Karimnagar - 505 001.

Name of Book : **Aurangazeb - Charitrakekkani Charitraka Konalu**

Written by : **Abul Fouzan,** M.A. (Islamic Studies) M.A. Urdu)
Mobile : 9963867432

*All rights reserved with Author*

First Edition : August, 2017

Copies : 1500

**Price : Rs.400=00**

*Publishers :*

**RYDH & ZAID BROTHERS**

H.No.7-2-1038, Kashmirgadda
Karimnagar - 505 001 Telangana State (India)
**Mob.**9100567136, **Cell :** 9985394757, 7660012481

*Printed at :*
**Cosmic Printers**
Lakkadkote, Chatta Bazar,
Hyderabad - 500 002, Ph. 040-24576237, 24564583

Copies available at :

1. **Telugu Book House**
   Kachiguda, Hyd. 9247446497
2. **Huda Distributors & Publishers**
   Purani Haveli, Hyderabad-500 002
   Ph.040-66481637
3. **Markazi Maktaba Islami,**
   Chatta Bzr, Hyderabad
   Ph.040-66710339, Cell : 099-66710339
4. **S.M. Rasool Sharfi,**
   C/o Shanti Margam, Hyderabad
   H.No.16-1-26/A, Jah Manzil,
   Sayeedabad, Hyderabad-59
   Mobile : 9059956811
5. **Samajika Adhyana Vedika,**
   24-3-1991, Pragathi Nagar,A Block,
   8th Street, Nellore - 524 001
   Mob.9490778602
6. **Syed Naseer Ahmed,**
   # C2,Sriram's Arcade,Amaravathi
   Road, Undavalli-522 501,
   Dist.Guntur, Mob.9440241727
7. **Mohammadia Deeni Book Depot,**
   Dr. Abida Bano Complex, Beside
   Aslami Masjid, Rajiv Chowk,
   Karimnagar-505001
   Mob.9395105961
8. **Zubair Book Stall, Zubair Junction,**
   Hanmakonda. Warangal (T.S.)
   Ph.0870-2447855
9. **Kadapa Islamic Society,**
   # 20/373, Mastan Vali Street,
   Kadapa - 516 001 (A.P.)
   Mob.9393253582, 9885409930

Also avalable at Famous Book stalls

# విషయ సూచిక


పరిచయం : ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ ...... v

ముందుమాట : ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ...... ix

ఆదర్శనీయ రచన : డాక్టర్ జైశెట్టి రమణయ్య ...... xvii

నిలకడమీద నిగ్గుతేలిన నిజాలు : డాక్టర్ నలిమెల భాస్కర్ ...... xxii

చరిత్ర రచనలో బొమ్మ–బొరుసు : శ్రీ కె. శ్రీనివాస్, ఎడిటర్, ఆంధ్రజ్యోతి ...... xxvii

ఉపోద్ఘాతం ...... 01

1. కాల్పనిక, వక్రీకరించిన భారత చరిత్ర ...... 13
2. ఔరంగజేబ్ సమకాలీన చారిత్రక ఆధారాలు ...... 37
3. ఔరంగజేబ్ జననం–బాల్యం–విద్యాభ్యాసం ...... 55
4. దక్కన్ గవర్నరుగా రాకుమారుడు ఔరంగజేబ్ ...... 63
5. గుజరాత్–ముల్తాన్‌ల గవర్నరుగా ఔరంగజేబ్ ...... 70
6. రెండవ పర్యాయము దక్కన్ గవర్నరుగా ఔరంగజేబ్ ...... 76
7. షాజహాన్ కుమారులు–వ్యక్తిత్వాలు, గుణగణాలు ...... 111
8. షాజహాన్ అస్వస్థత–కుమారుల అంతర్యుద్ధాలు ...... 127
9. అంతర్యుద్ధాల పర్యవసానం – ఔరంగజేబ్ పట్టాభిషేకం ...... 149
10. షాజహాన్ నిర్బంధం–ఔరంగజేబ్ ప్రవర్తన ...... 177
11. హిందువుల పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన ...... 187
12. హిందీ భాష–ఔరంగజేబ్ ప్రతిస్పందన ...... 223
13. ఔరంగజేబ్ దర్బారులో హిందూ మన్సబుదారులు–ఉన్నతాధికారులు ...... 229
14. హిందూ మందిరాలు–ఔరంగజేబ్ ఫర్మానాలు ...... 263
15. జిజ్‌యా పన్ను–వాస్తవికత ...... 291
16. బీజాపూర్, గోల్కొండ రాజ్యాల పతనం ...... 318
17. ఔరంగజేబ్–మరాఠాలు ...... 347

18. ఔరంగజేబ్-శిక్కులు ...... 420
19. ఔరంగజేబ్-రాజపుత్రులు ...... 435
20. ఔరంగజేబ్-రాజనీతి ...... 460
21. ఔరంగజేబ్-ధార్మిక నీతి ...... 472
22. ఆరాధనాలయాలు-కూల్చివేత ...... 485
23. పరిపాలనా వ్యవహారాల్లో సంస్కరణలు ...... 512
24. ముక్కల్ని జోడించి సువిశాల భారతంగా మార్చిందెవరు? ...... 532
25. ఔరంగజేబ్ వ్యక్తిత్వం-గుణగణాలు ...... 544
26. మొగలు సామ్రాజ్య పతనానికి కారకులెవ్వరు? ...... 573
27. ముగింపు ...... 585
ఆధార గ్రంథాలు ...... 596
పాద సూచికలు ...... 600
రచయిత సంక్షిప్త పరిచయం ...... 614
కృతజ్ఞతలు ...... 616




**ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ**

ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపకులు

విశ్రాంత ఆచార్యులు & చరిత్ర శాఖాధిపతి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్


# పరిచయం

చరిత్ర రచనకు నిర్దుష్ట ఆధారాలుండాలి. సమకాలీనాలైనా లేదా ఆ తర్వాతనైనా చరిత్రకారుడికి పాక్షిక దృష్టి (Historian's Bias) వుండి తీరాల్సిన అవసరం లేదు. చరిత్రకారుడొక ప్రతిపాదనతో పరిశోధన ప్రారంభిస్తాడు. ఆ ప్రతిపాదనకొక ఉద్దేశపూర్వక ప్రయోజనం కాకున్నా, ఒక లక్ష్యం ఉండాలి. ఆ లక్ష్యానికనుగుణంగా కావల్సిన ఆధారాలను సమకూర్చుకుంటాడు. ఈ విషయాన్నే E.H. Carr, 'What is History' అనే గ్రంథంలో 'Historian and His Fiets' అనే అధ్యాయంలో ప్రతిభావంతంగా వివరిస్తాడు. తన ప్రతిపాదన కనుగుణంగా లభించే ఆధారాలను సేకరించి వాటి నుండి ఎంపికచేసి రచన కొనసాగిస్తాడు. ఆధారాల సేకరణలో తనకు లభించిన యదార్థాలను (Facts) నుపయోగించి చరిత్ర రాస్తాడు. "Facts are sacred Interpretation is True" అన్న సూత్రం చరిత్ర రచనకు ఊపిరి. యదార్థాలను వక్రీకరించడమో పరిహరించడమో జరిగితే చరిత్రకు పాక్షికత (Bias) వస్తుంది. అపోహలు, అపవాదులు చోటు చేసుకుంటాయి. వక్రీకరణ అనేక కారణాల వల్ల జరగవచ్చు. చరిత్రకారుడి ఉపపత్తిని లేదా అతడు అనుకొని సాధించాల్సిన ధ్యేయం – మతం కావచ్చు, రాజకీయ సిద్ధాంతం లేదా మరేదైనా 'స్వార్థ' ప్రయోజనం ఉండొచ్చు. పనిగట్టుకొని ఒక ధ్యేయాన్ని సాధించాలనుకొని రాస్తే అది చరిత్ర కాజాలదు. పైన చెప్పిన E.H. Carr భావంలోని గూఢార్థం అదే!

భారత దేశ చరిత్రను ఎందరో చరిత్రకారులు – భారతీయులు, విదేశీయులు – సంపన్నం చేశారు. చరిత్ర రచన శాస్త్రీయంగా కాకున్నా క్రమపద్ధతిలో రాసిన దాఖలాలు, దాదాపు మలి మధ్య యుగం దాకా లేవు. చరిత్ర రచనకుపకరించే ఎన్నో మత, లౌకిక

గ్రంథాలతో పాటు, సంపన్న సాహిత్యం ఉంది. రాజస్థానాల్లోని విద్వాంసులతో పాటు, విదేశీయాత్రికులు, సమకాలీనులు రాసిన రచనలూ ఉన్నాయి. ఇన్నివున్నా, వీటిని శాస్త్రీయంగా పరిశీలించి రాసిన చరిత్రలు అరుదు, కల్హణుని 'రాజతరంగిణి' మినహా.

19వ శతాబ్ది ప్రారంభంలో J.S. Mill రాసిన "History of British India" వలస పాలకుల కోసం రాసిన గ్రంథం భారతదేశ చరిత్ర రచనను, గమనాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. పాక్షికతతో, వలస పాలనను పరోక్షంగా సమర్థించడానికిది ఉద్దేశింపబడింది. దేశ చరిత్ర రచనలో మతతత్వ పొరవడికి దోహదం చేసింది. హిందూ, ముహమ్మదీయ, బ్రిటిష్ యుగాలుగా చరిత్ర విభజన జరిగింది. మతపరమైన విభజన ఇది! సరే హిందూ యుగమని చెప్పిన కాలంలో ఇతర మతాలకు చెందిన ఎందరో పాలకులు (ఉదా॥ అశోకుడు) మహమ్మదీయ యుగంలో ఇతర మతాలకు చెందిన పాలకులెందరో వున్నారు. మతబీజం ఇక్కడే మొదలైంది. ఈ విభజన అశాస్త్రీయమైందన్న చారిత్రక సత్యాన్ని, 1950 దశకం నుండి గుర్తించడం జరిగింది. చరిత్రలో శాస్త్రీయ దృక్పథానికీ, యుగ విభజనలో ప్రధానంగా చోటు చేసుకోవాల్సిన ఆర్థిక, రాజకీయ, సామాజిక శక్తుల పరస్పర సంపర్కం చోటు చేసుకొంటాయన్న ఎరుకను ప్రధానంగా డి.డి. కోశంబీతో ఆరంభమైంది. ఇప్పుడున్న యుగ విభజన - ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక -లోనూ కొన్ని సమస్యలున్నా, ఇప్పటికిదే శాస్త్రీయం. మిల్ (Mill) రాసిన గ్రంథం, ఆ పొరవడిలో రాసిన చరిత్రలు మధ్య యుగాల చరిత్రను 'చీకటి యుగం'గా, అత్యంత పీడన, అసహనాలతో, క్రూరమైందిగా అభివర్ణించడం, చరిత్రకు జరిగిన తీరని అన్యాయం. మొత్తం ఒక యుగాన్ని, ఇలా 'బదనాం' చేయడం సహేతుకమా?

భారతదేశ చరిత్ర రచనలో చోటు చేసుకున్న పాక్షిక వక్ర భాష్యాలకు పైన పేర్కొన్న అంశం ఒక ఉదాహరణ! ఆర్యులు ఇక్కడివారా లేక వెలుపలి నుండి వచ్చారా అనే చర్చ నుండి అనేకానేక ఉదాహరణలు ఈ కోవలోవే! ఈ వక్రీకరణలు కొన్ని సరైన ఆధారాలు లేక చోటు చేసుకోగా, మరికొన్ని చరిత్రను తమ స్వప్రయోజనాల కొరకు అన్వయించుకోడానికి చేసినవి. వీటిని సవరించి, శాస్త్రీయ పద్ధతిలో, లౌకిక దృష్టితో దేశ చరిత్రను, ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలుగా విభజించి, లబ్ధప్రతిష్టులైన చరిత్రకారులను ఆహ్వానించి, చర్చించి, ఉన్నత పాఠశాల స్థాయి దాకా (12వ తరగతి లేక సమానస్థాయి) పాఠ్యపుస్తకాలను NCERT (ఢిల్లీ) వారు ప్రచురించారు. ప్రపంచ నాగరికత, ప్రపంచ చరిత్రలు గూడ వీరు ప్రచురించారు. చరిత్రే కాదు, ఆర్థిక, సామాజిక, భూగోళ, రాజనీతి శాస్త్రాలపై గూడ ఇదే రీతిలో సాధికారిక పాఠ్యగ్రంథాలు ప్రచురించారు. ఇవి బహుళ ఆదరణ పొందాయి. ఉన్నత పాఠశాల విద్యార్థులే కాకుండా, ఆపై స్థాయివారూ వీటిని చదివారు. రెఫరెన్స్ గ్రంథాలుగా పరిగణించారు. సాధికారిక పాఠ్యగ్రంథాల

తయారీకి ఇవి నమూనాలయ్యాయి. అఖిల భారత చరిత్ర కాంగ్రెస్, ప్రాంతీయ చరిత్ర సంస్థలు, ఈ రీతిలోనే రచనలు సాగించాయి.

ఈ పాఠ్య గ్రంథాల ప్రజాదరణను, అవి అందిస్తున్న శాస్త్రీయ, లౌకిక భావాలను అప్పుడు కేంద్రంలో అధికారం చేపట్టిన మతశక్తులు (NDA ప్రభుత్వం) వీటిని నిషేధించడం, దానిపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు పెల్లుబకడం మనకు తెలుసు.

మధ్య యుగాల చరిత్రను వక్రీకరించడమే గాక ప్రత్యేకించి ఔరంగజేబ్ పాలనను, వ్యక్తిత్వాన్ని మతశక్తులు దుయ్యబట్టారు. మత విధానమే కాదు, వ్యక్తిగత అంశాలపై గూడ కువిమర్శలు చేశారు. పాఠశాల విద్య నుండే ఔరంగజేబ్‌ను ఒక ప్రజాకంటక పాలకుడుగా, హిందూమత వ్యతిరేకిగా, వారి పవిత్ర స్థలాల విధ్వంసకుడుగా చిత్రించడం పరిపాటయింది. అంతేగాకుండా, మొగలు వంశపరిపాలన క్షీణతకూ ఔరంగజేబ్ విధానాలే ప్రధానమన్న సూత్రీకరణలు చేశారు.

అప్పటి రాజ్య వ్యవస్థలో, పాలనా వ్యవహారాల్లో, ఇతర పాలకులకంటే ఔరంగజేబ్ మౌలికంగా భిన్నం కాదన్న చారిత్రక సత్యాన్ని ఇప్పుడు మీ చేతిలో ఉన్న గ్రంథం వివరింప పూనుకుంది. మతం, రాజ్యవిస్తరణ, పన్నులు, దౌత్య వ్యవహారాల్లో, ఒక రాజవంశానికి చెందిన పాలకులందరి వైఖరి ఒకేలా ఉండదు. ఇది ప్రాథమిక చారిత్రకాంశం. చంద్రగుప్త మౌర్యుడుగా అశోకుడు లేడు కదా! ఇలా మరెన్నో దృష్టాంతాలు చరిత్రలో కన్పిస్తాయి. అది దేశ చరిత్రల్లోనూ లేదా ప్రాంతీయ చరిత్రలైనా! సమకాలీన పరిస్థితులు, అప్పటి రాజ్యావసరాలు, వ్యక్తిత్వ లక్షణాలు, ఇష్టాయిష్టాలు – ఇవేగాక, మరెన్నో రాజ్య విధానాన్ని నిర్ధారిస్తాయి. వీటిని దృష్టిలో వుంచుకొని అప్పటి పరిపాలనను, పాలకులను అంచనా వేయాలన్నది చరిత్ర రచనలో మూల సూత్రం.

ఔరంగజేబ్‌ను సమర్థించడానికో, సద్గుణ సంపన్నుడిగా చిత్రీకరించడానికి గాక, ఆయన వ్యక్తిత్వాన్ని అంచనా వేయడంలో చరిత్రకారుల రచనల్లోని అసమతుల్యాన్ని సరిదిద్దడమే ఈ గ్రంథ రచయిత ఆశయం. ప్రతిభావంతంగా, ఔరంగజేబ్ గూర్చి నొలకొన్న కరడుగట్టిన అంచనాలను సరిదిద్దడంలో రచయిత కృతకృత్యులయ్యారు.

రచయిత సంప్రదించిన గ్రంథాలు విపులమైనవే గాక ప్రామాణికమైనవి గూడ. పర్షియన్ భాషా గ్రంథాల పట్ల జరిగిన హాని, డాసన్, ఏలియట్, జాదూనాథ్ సర్కార్ (5 సంపుటాలు) రచనల్లోని అంశాలను నిశితంగా పరిశీలించి, విశ్లేషించారు ఈ రచయిత. ఇవి సరే! ఔరంగజేబ్ కాలం నాటి సమకాలీన చారిత్రకాధారాలు, దాదాపు అరవైకి (60) పైగా సంప్రదించారు.

ఇరవై ఏడు అధ్యాయాలున్న ఈ గ్రంథంలో, పది అధ్యాయాల దాకా బాల్యం, గవర్నర్‌గిరి, పట్టాభిషేకం ఇత్యాది వివరాలు చోటు చేసుకున్నాయి. పదకొండవ అధ్యాయం నుండి 15 వరకు హిందూ మతం, మందిరాలు, 'జిజియా'లపై వివరణలతో కూడిన చర్చ జిజియా గూర్చిన పుట్టుపూర్వోత్తరాలు, ఎందుకు ఎవరి రక్షణ కోసం ఆ పన్నును విధించారు అనే దాని ఆనవాళ్ళు వివరించారు. ఆ తర్వాత అధ్యాయాల్లో ఔరంగజేబ్ – ముస్లిం మతరాజ్యాలు, మహారాష్ట్రులు, రాజపుత్రులు, సిఖ్ఖులతో నెలకొన్న రాజ్య సంబంధాలు, యుద్ధాల గూర్చి వివరణలు. మహారాష్ట్రులు, శివాజీల గూర్చిన అధ్యాయం ప్రత్యేకించి పేర్కొనదగ్గది. జన సామాన్యంలోనే గాక, చరిత్రకారుల్లో ఉన్న అనేకానేక అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తుందీ గ్రంథం. ఆరాధనాలయాల విధ్వంసంపై చర్చోపచర్చలు ఇప్పటికే ఎన్నో జరిగాయి. హిందూ రాజులు గూడ వారి వారి యుద్ధాల్లో దేవాలయాలను విధ్వంసం చేసిన ఉదాహరణలున్నాయి కదా! మిగతా అధ్యాయాల్లో, ముఖ్యంగా, దేశంలోని అనేక చిన్నా, పెద్ద ప్రాంతాలను ఐక్యపరచి సువిశాల భారతాన్ని నెలకొల్పడం, ఔరంగజేబ్ గుణగణాల చర్చ, మొగలు సామ్రాజ్యపతనానికి కారకులెవ్వరు అనే ముఖ్య అధ్యాయం ఉంది. 'ముగింపు' రాశాక, ఔరంగజేబ్ వీలునామాను పొందుపరచి విపులమైన సంప్రదించిన గ్రంథాల పట్టికను చేర్చారు.

ఔరంగజేబ్‌పై ఇంతటి విస్తృత గ్రంథం తెలుగులో రావటం ఇదే ప్రథమం. చరిత్రను పనికట్టుకొని రాసినట్లుగా లేక, కథాకథన రీతిలో విసుగు లేకుండా సాగింది రచనా శైలి. చదివించే గుణం మెండు. ఆధారాలను పేర్కొంటూనే ప్రజారంజక (పాపులర్) చరిత్ర రాయడమెలాగో ఈ గ్రంథం సూచిస్తుంది. గ్రంథకర్త వృత్తిరీత్యా చరిత్రకారుడు కాదు. కాకుంటే ఏం? అలాకాకపోవడమే ఇంతటి ఆసక్తి రావడానికి దోహదం చేసిందని నా అభిప్రాయం. చరిత్రను మతం రంగులో పులుమలేదు. కువిమర్శలకు చోటివ్వలేదు. దేశ సమైక్యత, సమగ్రతలకు చరిత్రను వక్రీకరించగూడదని గ్రంథకర్త దృఢాభిప్రాయం. విద్యావంతుడు, వినయ సంపన్నుడైన అబుల్ ఫౌజాన్ (ముహమ్మద్ సర్వర్) సాహెబు గారిని అభినందిస్తున్నాను.

హైదరాబాద్

**– వకుళాభరణం రామకృష్ణ**



ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ
అధ్యక్షులు,
తెలంగాణ చరిత్ర పరిశోధన కేంద్రం, హైద్రాబాద్
-మరియు-రిటైర్డ్ ప్రొఫెసర్ & చరిత్ర శాఖాధిపతి,
ఉస్మానియా యూనివర్సిటి, హైద్రాబాద్

# ముందుమాట

భారత దేశ చరిత్ర, సంస్కృతి విశ్లేషణలో నాలుగు ప్రధాన రచనా పద్ధతులున్నాయి. అవి వలస వాద/సామ్రాజ్యవాద, జాతీయవాద, శాస్త్రీయ/మార్క్సిస్టు, మతవాద ధోరణులుగా పిలువబడుతున్నాయి. మొదటగా బ్రిటీష్ వలస పాలకులు భారతదేశంపై తమ ఆధిపత్యాన్ని సమర్థించుకోవడానికి భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల్ని తమకు అనుకూలంగా విశ్లేషించి, నూతన చరిత్ర రచనా పద్ధతిని ప్రారంభించారు. తదనుగుణంగా బ్రిటిష్ చరిత్రకారులు వలసపూర్వ భారతదేశ చరిత్ర, సంస్కృతిని మతవాద ధోరణిలో మూడు భాగాలుగా విభజించారు. ముఖ్యంగా జేమ్స్ మిల్ రచించిన "ది హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా"లో భారతదేశ చరిత్రను మతప్రాతిపదికపై హిందూయుగం, ముస్లిం యుగం, ఆధునిక యుగంగా విభజించినాడు. అంతే కాకుండా భారత సంస్కృతి "అనాదిగా మత ఘర్షణలు, విద్వేషాలు, హిందూ-ముస్లిం కలహాలు అంతర్భాగంగా ఉన్నాయని" పేర్కొన్నాడు. దానికి తోడు బ్రిటిష్ పూర్వ యుగ భారతదేశ చరిత్రను మూఢాచారాలు, వెనుకబాటుతనంతో కూడిన అంధకార యుగంగా వర్ణించినాడు. దానిలో భాగంగానే మధ్య యుగాల ముస్లిం రాజుల పాలనా కాలాన్ని అత్యంత క్రూరయుగంగా చిత్రీకరించినాడు. దానికి కారణం ముస్లిం పాలకులు భారతదేశంలో తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకునే క్రమంలో హిందూ మతంపై దాడిచేసి, వారి మత, ఆచార సంప్రదాయాల్ని ధ్వంసం చేసినారు అని మిల్స్ పేర్కొన్నాడు. అందువల్ల మధ్యయుగ భారత దేశంలో బలవంతపు మతమార్పిడులు, మత కలహాలు, రెండు మత సమూహాల మధ్య నిరంతర ఘర్షణలు అనివార్యమైనాయని చెప్పినాడు. మహ్మద్ గజనీ, ఘోరి దండయాత్రల్ని, ఔరంగజేబ్ పాలనా కాలాన్ని హిందూ-ముస్లింల మధ్య నిరంతర అంతర్గత కలహాలకు

నిదర్శనాలని వివరించినాడు. ఒకరకంగా జేమ్స్ మిల్ భారత దేశంలో ద్విజాతి సిద్ధాంతానికి రూపకల్పన చేసినాడు. హిందూ ముస్లిం యుగాలకు భిన్నంగా బ్రిటిష్ వలస పాలన సహేతుకమైనదని, భారతదేశంలో రాజకీయ, పాలనా ఐక్యతను నెలకొల్పి శాంతి భద్రతలను కాపాడి ఆధునికతకు, ఆర్థిక ప్రగతికి దోహదపడిందని జేమ్స్ మిల్స్ తదితర వలసవాద చరిత్రకారులు పేర్కొన్నారు.

ఇరవయ్యవ శతాబ్దంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జాతియోద్యమం నిర్మించే క్రమంలో జాతీయవాద చరిత్రకారులు భారతదేశ చరిత్ర, సంస్కృతిని పునర్నించారు. దానిలో భాగంగానే వలసవాద చరిత్రకారులు ప్రవేశపెట్టిన యుగాల విభజన విధానాన్ని యధాతథంగా కొనసాగించినారు. అయితే వారి దృక్పథంలో ప్రాచీన భారత దేశ సంస్కృతి "బంగారు యుగంగా" విలసిల్లి, మధ్య యుగాల నాటికి "అంధకారయుగం"లోనికి ప్రవేశించింది. అందువల్లనే కొంతమంది మితవాద చరిత్రకారులు, జాతీయవాదులు బ్రిటిష్ పాలనను స్వాగతించి, బ్రిటిష్ పాలనా ఫలితాల్ని కొనియాడినారు. ఢిల్లీ సుల్తానులు, మొగల్ పాలనా కాలం నాటి రాజకీయ అంశాల్ని, యుద్ధాల్ని మతకోణంలో విశ్లేషించడం జరిగింది. హైందవ మత పునరుద్ధరణ, హైందవ వీరులు, హైందవ రాజ్య స్థాపన లాంటి పదజాలం జాతీయ వాద రచనలలో కనిపిస్తుంది. జేమ్స్ మిల్ చరిత్ర రచనా పద్ధతిని కొంతమంది సంప్రదాయ జాతీయవాద చరిత్రకారులు తు.చ. తప్పకుండా అనుకరించినారు. అందుకే ఆర్.సి. మజుందార్, జాదూనాథ్ సర్కార్ లాంటి వారి రచనల్లో హిందూ, ముస్లిం యుగాల విశ్లేషణ వలసవాద చారిత్రక పద్ధతిని అనుకరించినట్లు కన్పిస్తుంది. అదేవిధంగా కొంతమంది మతతత్వ వాద రచయితలు వలసవాద రచనా పద్ధతుల్ని కొనసాగించినారు. వి.డి. సావర్కర్, గోల్వాల్కర్, పి.యన్.ఓక్ లాంటి వారి రచనల్లో ద్విజాతి సిద్ధాంత ప్రభావం కన్పిస్తుంది. మెజారిటీ మైనారిటీ మతతత్వ వాదులు వలసవాద ద్విజాతి సిద్ధాంతాన్ని అంగీకరించడం యాదృచ్ఛికం కాదని తెల్సుకోవాలి. ఎందుకంటే వారి రచనల్లో హిందూ-ముస్లిం మత సమూహాల్లో సోదర భావం, సౌభ్రాతృత్వం, ఐక్యత, మానసిక ఆప్యాయత, భావోద్వేగాలు లేవని తెల్పినారు. సామ్రాజ్యవాద చరిత్రకారులు నిర్దిష్ట ప్రణాళికతో రచించిన గ్రంథాలు భారతీయ సమాజం, సంస్కృతిపై దుష్ప్రభావాలు వేస్తూ ఉన్నాయి. భారతీయుల్లో మతపర మైన అసహనం, వైషమ్యాలు పెరిగి, జాతి సమైక్యతకు, పరస్పర సహకారం, సహనం, ప్రేమాభిమానాలు పెంపొంద డానికి వలసవాద, మతవాద చరిత్ర రచన పద్ధతులు అవరోధాలుగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో అబుల్ ఫౌజాన్ మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్‌పై రచించిన గ్రంథానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమంటే, మధ్యయుగాల్లో భారతదేశంలో సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి, అర్థశతాబ్దం పాటు నిరాటంకంగా పరిపాలించి, పటిష్టమైన పాలనా వ్యవస్థను,

మొగల్ సార్వభౌమాధికారాన్ని కొనసాగించిన ఘనత ఔరంగజేబ్‌కు దక్కుతుంది. అయితే అదే సందర్భంలో ఆయన పాలనా కాలంలో సంభవించిన అనేక రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన అంశాలు వివాదాస్పదమైనాయి. భారతదేశ మధ్య యుగాల చక్రవర్తుల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన ఔరంగజేబ్ పాలనా విధానాలు, ఆయన అనుసరించిన మత, సాంస్కృతిక విధానాలు, పద్ధతులు పరస్పర భిన్నమైన విశ్లేషణలకు దారితీసినాయి.. ఇంకొకరకంగా చెప్పాలంటే ఔరంగజేబ్ వ్యక్తిత్వాన్ని, ఆయన పాలనా విధానాన్ని, ధార్మిక మత, సాంస్కృతిక విధానాల్ని అంచనా వేయడంలో వలసవాద, సంప్రదాయ జాతీయవాద, మతతత్వ చరిత్ర రచనా పద్ధతుల్లో భావసారూప్యత కన్పిస్తుంది. సంక్లిష్టమైన ఔరంగజేబ్ పాలనా కాలాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని, విధానాల్ని సహేతుకంగా, నిష్పక్షపాతంగా, ఆధారసహితంగా విశ్లేషించి, శాస్త్రీయ, హేతుబద్ధమైన రచనను చేపట్టినందుకు ముందుగా నేను రచయిత అబుల్ ఫౌజాన్‌ను అభినందిస్తున్నాను. అత్యంత వివాదాస్పదమైన చారిత్రక అంశాన్ని ఎన్నుకొని, నిర్దిష్టమైన, ప్రామాణిక ఆధారాలను సేకరించి, నిశిత దృష్టితో పరిశీలించి 27 అధ్యాయాల్లో ఔరంగజేబ్‌పై రచించిన ఈ గ్రంథం ఎంతో విలువైందని చెప్పడంలో నాకు ఎలాంటి సంశయం లేదు. చరిత్ర పరిశోధన, రచన విశ్వవిద్యాలయాలకు, ప్రొఫెషనల్ చరిత్రకారులకు మాత్రమే పరిమితం కాకుండా, విశాల స్థాయిలో పౌర సమాజంలోని మేధావులు చరిత్ర రచనను చేయడం ఎంతైనా అవసరం అనేది నా నిశ్చిత అభిప్రాయం. కేవలం డిగ్రీ సముపార్జన దృష్టితో చూసినట్లయితే అబుల్ ఫౌజాన్ రచించిన ఈ గ్రంథం పిహెచ్.డి. డిగ్రీతో సమానం. ఎందుకంటే ఈ గ్రంథ రచనలో ఆయన అత్యుత్తమ పరిశోధనా పద్ధతుల్ని, విధానాల్ని పాటించినాడు. వ్యక్తిగత అభిప్రాయాలకు, అభీష్టాలకు తావులేకుండ ప్రామాణిక చారిత్రక ఆధారాలను సేకరించి, అధ్యయనం చేసి ఔరంగజేబ్ వ్యక్తిత్వాన్ని, గుణగణాల్ని, విధానాల్ని వాటి రూపకల్పన, పర్యవసానాల్ని నిష్పక్షపాతంగా విశ్వేషించినాడు. ఈ గ్రంథ రచనలో ఆయన సేకరించిన ప్రామాణిక ఆధారాలు హిందూ, జైన, ఇస్లాం మతాలకు సంబంధించినాయి. హిందీ, ఇంగ్లీషు, పర్షియన్, అరబిక్, ఉర్దూ భాషా గ్రంథాల్ని పరిశీలించి, విషయసేకరణ చేసి సమగ్ర చరిత్రను రచించినాడు.

అబుల్ ఫౌజాన్ రచించిన ఈ గ్రంథంలో ఔరంగజేబ్ జీవిత చరిత్ర మరియు అర్ధశతాబ్దపు పైబడిన మొగల్ పాలనా చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించబడింది. ఉపోద్ఘాతంతో పాటు మొదటి రెండు అధ్యాయాలు భారత చరిత్ర రచనలోని వివిధ ధోరణులు, వక్రీకరణలు వలసవాద, సాంప్రదాయవాద, మతతత్వ, రచనా విధానాలలోని లోపాల్ని, పరిమితుల్ని విశదీకరించడం జరిగింది. ఈ గ్రంథ రచనకు తోడ్పడిన రచయిత సంప్రదించిన గ్రంథాల వివరాలు రెండవ అధ్యాయంలో పేర్కొనబడినాయి. దాదాపు

వందకు పైగా ప్రామాణిక పుస్తకాల్ని, ఇర్ఫాన్ హబీబ్, హరిబన్స్ ముఖియా లాంటి ప్రసిద్ధ చరిత్రకారుల రచనల్ని సంప్రదించి ఔరంగజేబ్ పరిపాలనా కాలంలోని అనేక అంశాల్ని న్యాయబద్ధంగా బేరీజువేయడం జరిగింది. ఈ గ్రంథ రచన సమగ్రంగా, బహుముఖంగా, నిష్పక్షపాతంగా జరిగిందని చెప్పడానికి, అదేవిధంగా రచయిత ఔరంగజేబ్ జీవిత చరిత్రను బహుకోణాల్లో విశ్లేషించాడని చెప్పడానికి రెండవ అధ్యాయంలో పొందుపరిచిన చారిత్రక ఆధారాలు చక్కని నిదర్శనం. మూడు నుండి 10వ అధ్యాయాల్లో ఔరంగజేబ్ బాల్యం, కుటుంబ వివరాలు, అంతఃకలహాలు, గవర్నర్‌గా పదవీ బాధ్యతలు, పట్టాభిషేకం గురించిన వివరాలు పొందుపరచబడినాయి. 11 నుండి 21వ అధ్యాయాల్లో ఈ గ్రంథ రచనకు కీలకమైన అనేక అంశాలు చర్చించబడినాయి. ముఖ్యంగా హిందువులు, హిందూ మందిరాల పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన, మరాఠాలు, సిక్కులు, రాజపుత్రులు మరియు ఔరంగజేబ్ మధ్య సంబంధాలు, ఔరంగజేబ్ ధార్మిక, రాజనీతి, ఆరాధనాలయాల కూల్చివేత ఆయన చేపట్టిన ధార్మిక నీతి, మత విధానాలు తదితర అంశాల్ని ఈ గ్రంథరచయిత సోదాహరణంగా, కూలంకషంగా, వివరించినాడు. మొత్తంగా భారతదేశ చరిత్ర రచనల్లో ఈ మధ్య కాలంలో చెలరేగిన, రేగుతున్న పలు వివాదాలు, చారిత్రక వక్రీకరణలు, మతతత్వ వాదనల్ని దృష్టిలో పెట్టుకొని పుస్తక రచయిత ఔరంగజేబ్ కాలానికి సంబంధించినవి పలు వివాదాంశాలపై నిజమైన, యదార్థమైన విశ్లేషణ చేసినాడు. ఉదాహరణకు ఔరంగజేబ్ మరాఠాలు, సిక్కులు, రాజపుత్రులు, హిందువుల పట్ల అవలంబించిన రాజకీయ, ధార్మిక అంశాలపై క్షుణ్ణంగా వివిధ కోణాల్నించి అధ్యయనం చేసి వాస్తవిక చరిత్రను రచించడం జరిగింది. ఔరంగజేబ్ హిందువుల పట్ల అవలంబించిన విధానాలు కేవలం మత పరంగా కాకుండా రాజకీయ, పాలనా, వ్యూహాత్మకమైనవని గ్రంథకర్త సోదాహరణంగా వివరించినాడు. ఔరంగజేబ్ శివాజీ, ఆయన కుటుంబ సభ్యుల పట్ల అవలంబించిన విధానాలు, రాజా జైసింగ్‌లాంటి రాజపుత్రుల నియామకం, సిక్కు గురువులు, అధికారులు, పాలకుల పట్ల ఔరంగజేబ్ వైఖరిని నూతన ఆధారాలతో సహేతుకంగా చర్చించి నిష్పక్షపాతమైన వివరణను ఈ పుస్తకంలో పొందుపర్చడం జరిగింది. అబుల్ ఫౌజాన్ ఔరంగజేబ్ కాలం నాటి కీలక, వివాదాస్పద చర్చనీయాంశాలను హేతుబద్ధంగా, ఆధార సహితంగా విశ్లేషించడంలో సఫలీకృతుడైనాడు. ప్రస్తుతం భారతదేశంలో మధ్యయుగాల నాటి ధార్మిక, మత, రాజకీయ, పాలనా విధానాలపై చరిత్రకారుల మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయనే విషయాన్ని ఈ పుస్తక రచయిత దృష్టిలో పెట్టుకొని, తాను ఎంచుకొన్న పరిశోధనా అంశానికి సంబంధించిన పలు ఆధారాల్ని సేకరించి ఔరంగజేబ్ అనుసరించిన విధానాల్ని లోతుగా పరిశీలించి, సమగ్రంగా వివరించినాడు. మొగల్ కాలం నాటి హిందూ ముస్లిం సంబంధాలకు సంబంధించిన పలు నూతన అంశాల్ని కూడ ఈ గ్రంథంలో పొందుపరచడం జరిగింది.

వలసవాద చరిత్రకారులు డాసన్, స్మిత్ తదితరులు, జాధునాథ్ సర్కార్ లాంటి సాంప్రదాయ జాతీయ చరిత్రకారులు చేసిన సూత్రీకరణల్ని, విశ్లేషణల్ని నిశితంగా, హేతుబద్ధంగా పరిశీలించి ఔరంగజేబ్ మరాఠాలు, సిక్కులు, రాజపుత్రుల పట్ల అవలంబించిన విధానాల్ని ఈ పుస్తక రచయిత నూతన దృక్పథంతో సహేతుకంగా వివరించినాడు. దాదాపు 5–6 అధ్యాయాల్లో ఔరంగజేబ్ హిందువుల పట్ల అవలంబించిన పలు విధానాలకు సంబంధించిన అనేక అంశాల్ని పరిశీలించి కొత్త అంశాల్ని, సమాచారాన్ని వెలికితీయడం జరిగింది. ఇది ఒక రకంగా గ్రంథరచయిత సాధించిన గొప్ప ఎకడమిక్ విజయంగా పేర్కొనవచ్చును.

పౌర సమాజంలోని సామాన్య ప్రజానీకంలోను, సాధారణ అకడమిక్ వర్గాల్లోను భారత దేశంలో ముస్లిం పాలనకు సంబంధించి, మహ్మద్ గజనీ, ఔరంగజేబ్‌ల పట్ల భిన్న అభిప్రాయాలు, అపోహలు, అపార్థాలు, స్టీరియో టైప్ విపరీత ధోరణులు బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఇట్లాంటి సందర్భంలో అసంభవం కానప్పటికీ అత్యంత వివాదాస్పదమైన, క్లిష్టమైన చారిత్రక అంశాన్ని ఎన్నుకొని, పరిశోధించడం ఎకడమిక్‌గా సాహసోపేతమైన చర్యగా నేను భావిస్తున్నాను. అయినప్పటికీ అబుల్ ఫౌజాన్ ఒక బాధ్యతాయుతమైన పరిశోధనాంశాన్ని ఎన్నుకుని వివిధ రకాలైన చారిత్రక ఆధారాల్ని సేకరించి, విషయపరిజ్ఞానాన్ని సమకూర్చుకొని పరస్పర విరుద్ధ అభిప్రాయాలు గలిగిన ఔరంగజేబ్ జీవిత చరిత్రను కొన్ని మౌలిక ప్రశ్నల ఆధారంగా విశ్లేషించినాడు. ఆయన మాటల్లో "ఔరంగజేబ్ ఎలాంటివాడు, అతనే పరిస్థితుల్లో సింహాసనాన్ని అధిష్టించాడు? అతని గుణగణాలేమిటి, పాలితుల పట్ల అతని వ్యవహారం ఎలా ఉండేది, కుల మతాలకు సంబంధించి, దేశంలోని వివిధ వర్గాలకు సంబంధించి అతని భావనలు, విశ్వాసాలు ఎలా ఉండేవి, సింహాసనాన్ని, రాజ్యాధికారాన్ని అతనే దృష్టితో చూసేవాడు, దేశం, జాతి పట్ల అతని భావనలేమిటి? ... ఔరంగజేబ్ గురించి నిష్పక్షపాతంగా, న్యాయంగా, నిశిత దృష్టితో అధ్యయనం చేసే సర్వ అవకాశాలున్నాయి. ఔరంగజేబ్ అభిమానులు, వ్యతిరేకులు ఇద్దరి వాదనల్ని ప్రక్కకు పెట్టి, అతని సమకాలీన చరిత్ర గ్రంథాల ఆధారంగా నిష్పక్షపాతంగా అతన్ని అధ్యయనం చేయడం ఎంతో అవసరం. అప్పుడే ఔరంగజేబ్ ఎలాంటివాడనే విషయం బయటపడుతుంది."

ఒక నిర్దిష్టమైన అవగాహనతోటి పరిశోధకుడు తన పరిశోధనాంశాన్ని ఎన్నుకొనటానికి ఒక ప్రణాళికను తయారుచేసుకొని, దాని ప్రకారం విషయసేకరణ చేసి విశ్లేషించడం అనేది చరిత్ర పరిశోధనలో ఒక మౌలిక అంశం. ఈ గ్రంథ రచయిత ప్రామాణికమైన పరిశోధనా పద్ధతుల్ని పాటించి, ఔరంగజేబ్ జీవితంలోని పలు కోణాల్ని పరిశీలించి ఒరిజినల్ ఆధారాల ప్రాతిపదికపై తన రచనను చేసినాడు. ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలపై ఎవరికైనా భేదాభిప్రాయాలు ఉండవచ్చు, కాని, చరిత్ర రచనలో గ్రంథరచయిత

పాటించిన పరిశోధన పద్ధతి శాస్త్రీయ, సహేతుకమైనదని నా అభిప్రాయం. ఈ గ్రంథంలో రచయిత ఔరంగజేబ్ మత విధానం, హిందూమతం, సంప్రదాయం ఆచార వ్యవహారాల పట్ల, ప్రార్థనాలయాల పట్ల విశేషమైన పరిశోధన చేయడానికి సమకాలీన ప్రామాణిక ఆధారాలతో పాటు, లేఖలు, దస్తావేజులు, ఫర్మానాలు పరిశీలించి అనేక నూతన విషయాల్ని వెలికి తీసినాడు. ఉదాహరణకు ఔరంగజేబ్ శివాజీ మరణానంతరం ఆయన కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరించిన తీరు, హిందూ తదితర దేవాలయ నిర్మాణానికి జారీచేసిన ఫర్మానాలు, రాజాజ్ఞలు, సిక్కుల, రాజపుత్రుల పట్ల ఆయన ప్రదర్శించిన వైఖరి లాంటి అంశాలపై లోతైన పరిశోధన చేసి ఇంతవరకు మరుగున పడిన అనేక చారిత్రక వాస్తవాల్ని వెలికితీసినాడు. ఔరంగజేబ్ పేరు వినగానే చాలామందికి గుర్తుకు వచ్చేది దేవాలయాల ధ్వంసం, హిందువుల పట్ల ఆయన కఠిన వైఖరి, జిజియా పన్ను వగైరాలు. ఈ మధ్య కాలంలో కొంతమంది చరిత్రకారులు రిచర్డ్ ఈటన్ లాంటి వారు మధ్య యుగాల నాటి మత, ధార్మిక, రాజకీయ విధానాలపై పరిశోధన చేసి అనేక నూతన అభిప్రాయాల్ని వెలిబుచ్చినారు. ముఖ్యంగా ప్రార్థనాలయాల ధ్వంసం అనేది కేవలం ముస్లిం పాలనాకాలంలోనే జరుగలేదని, ప్రాచీన భారత దేశ చరిత్రలో అనేకమంది రాజులు కాశ్మీర్ పాలకుల (హర్ష్) లాంటివారు ఆర్థిక, వ్యూహాత్మక, మతాతేతర దృక్పథంతో ప్రత్యర్థులకు చెందిన ప్రార్థనాలయాలను ధ్వంసం చేసినారని పేర్కొన్నారు. అదేవిధంగా ఔరంగజేబ్ పాలనా కాలంలో కూడ రాజకీయ, వ్యూహాత్మక, మతాతేతర అంశాల ప్రాతిపదికగా ప్రార్థనాలయాలను ధ్వంసం చేశాడని తెలియవస్తుంది. అంతేకాకుండా కొంతమంది మతతత్వవాద చరిత్రకారులు అంటే సీతారాం గోయల్ లాంటివారు హిందూ దేవాలయాల ధ్వంసం అంశాన్ని సంకుచిత దృష్టితో విశ్లేషించి, వాస్తవ చరిత్రను మరుగుపరిచారనే విషయం కూడ తేటతెల్లమయింది. హిందుత్వ చరిత్రకారుల వాదనలకు భిన్నంగా ఈ గ్రంథరచయిత నిర్దిష్టమైన ఆధారాల సహాయంతో ఔరంగజేబ్ పాలనా కాలం నాటి మత విధానం, దేవాలయాల కూల్చివేతకు సంబంధించిన అంశాల్ని సహేతుకంగా వివరించినాడు. ఫర్మానాలు, లేఖలు, సమకాలీన ప్రామాణిక గ్రంథాలలో లభ్యమైన విషయాల ఆధారంగా ఔరంగజేబ్ పాటించిన ధార్మిక, మత, విద్యా, రాజకీయ, వ్యూహాత్మకపరమైన అనేక అంశాల్ని సోదాహరణంగా ఈ గ్రంథ రచయిత వివరించాడు. అదేవిధంగా ఔరంగజేబ్ కాలంలో ప్రభుత్వ పాలనాయంత్రాంగంలో మన్సబ్‌దారులుగా హిందువుల నియామకం,  మతాలకు, పూజారులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం లాంటి అనేక అంశాలకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు ఈ గ్రంథంలో పొందుపరచబడినాయి. విశాల భారత దేశ నిర్మాణ క్రమంలో ఔరంగజేబ్ అనేక వ్యూహాత్మక చర్యలను చేపట్టినాడు. ఆయన పరిపాలనా దక్షత, రాజ్యాధికార నిర్వహణ కేవలం

సంకుచిత మత దృష్టితో లేదా దృక్పథంతో జరుగలేదు అనే విషయాన్ని గ్రంథ రచయిత విశదీకరించాడు. రచయిత మాటల్లో "మత పక్షపాతాన్ని, ద్వేషాన్ని విడనాడి ఔరంగజేబ్ నడవడికల్ని, కార్యాచరణను అధ్యయనం చేస్తే, అతను మరాఠాలు, రాజపుత్రుల్ని అణచడానికి చేసిన ప్రయత్నాలన్నీ ధార్మిక పక్షపాతంతో, ధార్మికంగా హింసించే ఉద్దేశ్యంతో కాకుండా, ఒక పరిపాలకుడు, ఒక రాజు తన రాజ్యంలో శాంతిభద్రతల కోసం, దేశ సమైక్యత, సమగ్రతల కోసం అరాచకాల్ని, విద్రోహాల్ని, తిరుగుబాట్లను ఎలా అణచివేయాలో అతనూ అలాగే చేశాడని అంగీకరించక తప్పదు. అతను కిరీట, సింహాసనాల పరిరక్షణ కోసం, దేశంలో సమైక్యత, సమగ్రతల్ని ఏర్పాటు చేసే నిమిత్తం రాజపుత్రుల్ని, బుందేలాలను, సత్నామీలను, అఫ్గన్‌లను, బీజాపూర్, గోల్కొండ అందరినీ అణచివేశాడు."

అశోకుడు, సముద్రగుప్తుడు, ఢిల్లీ సుల్తానులు, అక్బర్‌ల కంటే సువిశాలమైన మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించి, సుస్థిర పరిపాలనా యంత్రాంగాన్ని నిర్మించి తన సార్వభౌమాధికారాన్ని పటిష్టపరచుకునే క్రమంలో ఔరంగజేబ్ రాజనీతి, రాజ్యాధికార కాంక్షతో తన ప్రత్యర్థులను కుల, మత, జాతి భేదం లేకుండ అణచివేసినాడు. కాని కేవలం మత ప్రాతిపదికపైన లేదా జాతి, కుల ఆధారంగా ఆయన రాజ్యపాలన చేయలేదు. ఈ విషయాన్ని ఈ గ్రంథ రచయిత చాలా స్పష్టంగా, ప్రామాణిక ఆధారాల సహాయంతో వివరించాడు. అంతేకాకుండా ఈ గ్రంథంలో ఔరంగజేబ్ వ్యక్తిత్వం, గుణగణాల గురించి కూడ చాలా విపులంగా పేర్కొనడం జరిగింది. ఔరంగజేబ్ మత విశ్వాసాలు, నమ్మకాలు, వ్యక్తిగత వికాసం, కుటుంబ సభ్యులు, పెద్దల పట్ల ఆయన అవలంబించిన తీరు వగైరా విషయాల్ని గ్రంథకర్త సమగ్రంగా పరిశీలించి, ఔరంగజేబ్ వ్యక్తిత్వంలోని అనేక నూతన కోణాల్ని వెలికి తీసినాడు. ఔరంగజేబ్‌ను మతఛాందసుడుగా, పరమత ద్వేషిగా, విగ్రహాల/దేవాలయాల ధ్వంసకుడుగా, రక్తపిపాసి, దౌర్జన్యకారుడుగా చిత్రీకరించే రచనల కంటే భిన్నంగా అబుల్ ఫౌజాన్ సమకాలీన ఆధారాలు, ప్రముఖ మేధావుల, చరిత్రకారుల రచనల ఆధారంగా ఔరంగజేబ్ వ్యక్తిత్వం, మత విశ్వాసాలు, మతాచారాలు, మత విధానం, ధార్మికతలోని బహు కోణాల్ని ఈ గ్రంథంలో విశ్లేషించాడు. అందుకే రచయిత అంటాడు, "ఔరంగజేబ్‌పై కలం లేపిన ప్రతి చరిత్రకారుడు, అతని సమర్థకుడైనా, విమర్శకుడైనా, ఔరంగజేబ్ నడవడికల్ని, గుణగణాల్ని అతని శీలాన్ని పొగడకుండా, ప్రశంసించకుండా ఉండలేకపోయారు." ఔరంగజేబ్ వీలునామా చదివిన వారికి ఆయన జీవితం ఎంత సామాన్యమైనది, పవిత్రమైనది, ధర్మనిష్ఠత, ధార్మికత, పాపభీతి, చిత్తశుద్ధి కలిగి ఉండేదో స్పష్టమవుతుంది.

ఔరంగజేబ్ జీవిత చరిత్ర, మొగల్ రాజ్య చరిత్రపై సమగ్ర గ్రంథాన్ని రచించిన అబుల్ ఫౌజాన్ అభినందనీయుడు. ప్రామాణిక చారిత్రక ఆధారాలు, ప్రముఖ చరిత్రకారుల, మేధావుల రచనల్ని క్షుణ్ణంగా చదివి బేరీజు వేసుకొని, న్యాయబద్ధమైన,

నిష్పక్షపాత విశ్లేషణను ఈ గ్రంథంలో పొందుపరచడం జరిగింది. వృత్తిరీత్యా చరిత్రకారుడు కాకపోయినప్పటికీ, ఈ గ్రంథరచయిత పాటించిన చరిత్ర పరిశోధన పద్ధతి, ప్రమాణాలు మెచ్చుకోతగినవి. ఎందుకంటే అత్యంత వివాదాస్పదమైన చరిత్ర పరిశోధనా అంశాన్ని ఎంచుకొని, దానికి న్యాయం చేయటం అంత సులువైన పని కాదనేది నా అభిప్రాయం. ఔరంగజేబ్‌పై అనుకూల, ప్రతికూల రచనలు, వ్యాఖ్యానాలను, గ్రంథాలను నిశిత, విమర్శనాత్మక దృష్టితో పరిశీలించి హేతుబద్ధమైన చారిత్రక గ్రంథాన్ని రచించినందుకు, ఔరంగజేబ్ జీవిత చరిత్రపై నూతన కోణాల్ని ఆవిష్కరించినందుకు రచయితకు ధన్యవాదాలు. ఈ గ్రంథ రచన చేయడంలో అబుల్ ఫౌజాన్ లాయర్‌గా వాద ప్రతివాదాల్ని వినిపించి, న్యాయమూర్తిగా నిష్పక్షపాత తీర్పు నిచ్చాడని చెప్పక తప్పదు. అంతేకాకుండ పరిశోధన అనేది కేవలం ఏదో ఒక రచన లేదా పుస్తకం రూపంలో ఉంటే సరిపోతుందిలే అనే దృష్టి రచయితకు లేదనిపిస్తుంది. ఒక బాధ్యతాయుతమైన సీనియర్ పౌరుడుగా దేశ సమగ్రత, శ్రేయస్సు, జాతి ఐక్యతను పెంపొందించడానికి, భారతదేశ విశిష్ట మిశ్రమ సంస్కృతిని కాపాడటానికి ఈ గ్రంథ రచనకు పూనుకున్నాడనేది నా నిశ్చిత అభిప్రాయం. ప్రస్తుత తరుణంలో విశాల దృక్పథంతో, శాస్త్రీయంగా, హేతుబద్ధంగా, న్యాయంగా చరిత్ర రచనలు జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఎందుకంటే చరిత్ర వక్రీకరణ జాతి, మత సమూహాల మధ్య పగ, ద్వేషాలు, అసహనం పెంపొందించే ప్రమాదం ఉంది. అబుల్ ఫౌజాన్ రచించిన ఈ గ్రంథం భారత దేశ మధ్య యుగాల నాటి చారిత్రక అంశాన్ని సమగ్రంగా విశ్లేషించి, వక్రీకరణలను సవరించి జాతి శ్రేయస్సుకు, సమగ్రతకు తోడ్పడుతుందని ఆశిద్దాం. చివరగా ఆయన మాటల్లో, "నూటయాభై సంవత్సరాల నుండి వక్రీకరించిన చరిత్ర మూలంగా వస్తున్న ఈ రాగద్వేషాలు దూరం కానంతవరకు వారి (భారతీయుల) హృదయాలు తేలికపడవు. ఈ అపార్థాన్ని, అపనమ్మకాన్ని, ద్వేషం, శత్రుత్వాన్ని తొలగించడానికి చేసిన ప్రయత్నమే మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం.సిసలైన జాతీయ సమైక్యత నిర్మల హృదయంతో, అన్యోన్యంగా ఉన్నప్పుడే సాధ్యమౌతుంది. ... నేడు మనం చరిత్రలో చదువుతూ వస్తున్న వివాదాస్పద అంశాలు వట్టి బూటకమని, అభూత కల్పనలని, నిరాధారమైన నిందలు మాత్రమేనని నాకు తెలిసినప్పుడు, ఇంకా ఈ అంశాలే నేడు సిసలైన జాతీయ సమైక్యతకు గొప్ప అవరోధాలుగా నిలుస్తున్నాయని తెలిసినప్పుడు, వాటిని దూరపరచడానికి చేతనైనది చేయడం అసంబద్ధమైన చర్య కాదనుకుంటాను ...జాతీయ సమైక్యత కోసం చరిత్ర ప్రక్షాళన ఎంత అవసరమనే అంశాన్ని విద్వాంసుల, విజ్ఞానుల, చరిత్రకారుల దృష్టికి తేగలిగినా కూడా నేను సఫలీకృతుణ్ణి అయినట్లే. నా ఈ రచన వారి హృదయాలను తట్టి మేల్కొలిపి, ఈ పనిలో వారిని కార్యోన్ముఖులు చేయగలిగినా అంతకుమించి నాకింకేం కావాలి?"

హైదరాబాద్ **- అడపా సత్యనారాయణ**

**డా. జైశెట్టి రమణయ్య**
**Dr. Jaisetty Ramanaiah**
M.A. B.Ed., M.Phil, Ph.D.
Retired Reader (Associate Professor) in History
ప్రముఖ చరిత్రకారులు, విద్యావేత్త
ఇంటి నెం.1-5-29, అరవింద నగర్
జగిత్యాల - 505 327
సెల్ : 9959031450



# ఆదర్శనీయ రచన

లోకంలోకి కోట్లాదిమంది వస్తుంటారు, పోతుంటారు. కాని కొందరే తమ మంచి పనులతో ప్రతిభా పాటవములతో సమాజంపై చెరగని ముద్ర వేస్తారు. అలాంటి వారిలో అబుల్ ఫౌజాన్ గారు ఒకరు. వారు రెవెన్యూ శాఖలో మచ్చలేని ఉద్యోగిగాను మరియు ఒక చక్కటి రచయితగాను ఈ ప్రాంతంలో లబ్ధప్రతిష్ఠులై సమాజముతో ఒక సుస్థిర స్థానం సంపాదించుకోవడము ముదావహము, ప్రశంసనీయము, హర్షదాయకము. ఒక్క ఔరంగజేబు చక్రవర్తి పైననే సహేతుక ఆధారాలను ఉటంకిస్తూ 650 పేజీల చక్కటి బౌండ్ బుక్ వెలువరించడము ఆశ్చర్యకరము.

సుదీర్ఘమైన భారత దేశ చరిత్రలో అలాఉద్దీన్ ఖిల్జీ, ఫిరోజ్ తుగ్లక్, ఔరంగజేబు లాంటి వారిపై పరమత ద్వేష పాలకులుగా ముద్రపడింది. ఓటమి నెరుగని మహా యోధునిగా ఒక్క ఔరంగజేబు మాత్రమే 50 సంవత్సరాలు (1658 - 1707) పాలించాడు. ఒకవేళ పరమత ద్వేషి అయివుంటే అంతకాలము ఇంత పెద్ద హిందూదేశాన్ని ఎలా పాలించగలిగాడు? అనే దృక్కోణములో అబుల్ ఫౌజాన్ గారు ఆలోచించి పలు భాషలలోని అనేకానేక ప్రముఖ చరిత్రకారుల రచనలను అధ్యయనం చేసి సూక్ష్మాతిసూక్ష్మ విషయము లను కూడా పరిగణనలోనికి తీసికొని సహేతుక ప్రాథమిక ఆధారాలతో సవివరంగా చర్చిస్తూ పాఠకుల ముందుంచిన సమగ్రమైన గ్రంథమిది. ఔరంగజేబు జీవితం ఆసాంతము అణువణువు శోధించి, పరిశీలించి, పరిశోధించి నిజానిజాలను నిగ్గుతేల్చి చెప్పిన ప్రప్రథమ రచయిత అబుల్ ఫౌజాన్ గారు కావడము కరీంనగర్ ప్రాంతమునకే గర్వకారణము. ఔరంగజేబు చక్రవర్తిని ఉన్నది ఉన్నట్లుగా అనేకానేక ఆధారాలతో లౌకికవాద (Secularism) దృష్టితో రచన సాగించిన అబుల్ ఫౌజాన్ గారు ఎంతేని

అభినందనీయులు. ఏ ఒక్క అంశమును కూడా వదలకుండా ఔరంగజేబు జీవిత విశేషాలన్నింటిని పొల్లు పోకుండా చిత్రీకరించడంలో రచయిత కృతకృత్యులయ్యారు.

యూనివర్సిటీలలోని ఆచార్యులుకాని, పరిశోధనా విద్యార్థులుగాని చేయని, చేయలేని పనిని చేసి చూపించిన ధీమంతుడు అబుల్ ఫౌజాన్ గారు. ఒక రెవెన్యూ ఉద్యోగి పరిశోధనా పద్ధతులన్నింటిని క్షుణ్ణంగా పాటించడము విశేషము. చివరలో తాను సంప్రదించిన గ్రంథముల పట్టిక Bibliography మరియు పాదపీఠికలు (Foot Notes) గూడా వివరిస్తూ ఒక పరిశోధనా విద్యార్థివలె పద్ధతులన్నింటినీ పాటించారు. వారు Double M.A., అనగా ఉర్దూ మరియు ఇస్లామిక్ స్టడీస్‌లో వేరు వేరుగా ఎం.ఎ.లో రెండు పట్టాలు పొందిన మేధావి. ఇంత పెద్ద ఉద్గ్రంథములో ఉపోద్ఘాతములో గాని, చివరకు గాని తన పుట్టుపూర్వోత్తరములుగాని, విద్యాభ్యాసముల గురించి గాని సవివరంగా తెలుపలేదు. కనీసం తన ఫోటో గూడా ఎచ్చటా ముద్రించని నిరాడంబర రచయిత అబుల్ ఫౌజాన్ గారు. రాబోవు ఉర్దూ పుస్తకములో ఈ లోటును తీరుస్తారని ఆశిస్తున్నాను. ఒక్క పేజీలో కొన్ని వివరములతో వారు వ్రాసిన బయోడాటా సరిపోదు. రాబోవు తరాలు గుర్తుంచుకోవడానికి రచయిత ఫోటోతో పాటు అతని వివరములు ముందు రచనలోనైనా తెలుపాల్సిందిగా కోరుచున్నాను.

ఔరంగజేబు వ్యక్తిగత జీవితము ఆదర్శప్రాయము. అతడు నిరాడంబర చక్రవర్తి, రూమీ టోపీలు కుట్టి, చేతితో ఖురాన్ వ్రాసి వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో తన స్వంత ఖర్చులు వెళ్లతీసుకునేవాడు. ఏనాడూ బొక్కసములోని డబ్బులు తన స్వంత ఖర్చులకై వినియోగించలేదు. చివరకు ఆయన సమాధి గూడా దౌలతాబాద్ సమీపమందున్న ఖుల్తాబాద్‌లో అతి సామాన్య గోరిగా అగుబడుతుంది. నిజాంలు దాని చుట్టూ రేలింగులు పెట్టించారు. నేటి ప్రజాస్వామ్య యుగంలో మతము వ్యక్తిగత అంశము. Religion is purely a Personal and Private affair. కాని మధ్య యుగములో పరిపాలనంతయు మతముతో ముడిపడి ఉంది. ఇస్లామ్‌లో సున్ని శాఖకు చెందిన ఔరంగజేబు దక్కన్‌లోని షియా పాలకులను గూడా వదలకుండా వారితో యుద్ధములు చేయాల్సి వచ్చింది. తన జీవితాంతము గూడా యుద్ధములలోనే నిమగ్నమైన చక్రవర్తి ఔరంగజేబు. కాని పరిపాలనా వ్యవహారములను ఏనాడు నిర్లక్ష్యము చేయలేదు. అందుకే 50 సంవత్సరాలు వరుసగా పరిపాలించగలిగాడు.

నా శ్రేయోభిలాషి, ప్రియమిత్రులైన శ్రీమద్ ఎక్బాల్ అలీ శాతవాహన విశ్వవిద్యాలయ ఫౌండర్ వైస్ ఛాన్సలర్‌గారి సూచన మేరకు రచయిత అబుల్ ఫౌజాన్ గారి పోస్టు ద్వారా పంపిన వారి బృహద్గ్రంథము నాకు తేది 5-5-2021 బుధవారము రోజున అందింది. కాని అతి భయంకరమైన కరోనా మహమ్మారి

భయము వలన కావాలని ఒక దినమంతయు దానిని ముట్టలేదు. నేను నా 13వ ప్రాయము అనగా 1950 నుండి నేటి వరకు 70 సంవత్సరములకు పైగా చరిత్ర అధ్యయనము చేస్తూ, 15 సంవత్సరములు ఉన్నత పాఠశాలలోను, 26 సంవత్సరములు డిగ్రీ కళాశాలలోను చరిత్ర బోధన గావించి గత 25 సంవత్సరముల విశ్రాంత జీవితములో పరిశోధనాత్మకమైన, ప్రామాణిక చరిత్ర గ్రంథములను ఇరువై (20) వరకు వెలువరించిన వ్యక్తిగా, మరునాడే ఆదురదాతో పోస్ట్ ప్యాకెట్ (Post Packet) ను విప్పడం జరిగింది. చూడగానే ఔరంగజేబుపై వ్రాయబడిన ఒక మహత్తర గ్రంథము. తొలుత దానిలోని ప్రతి పేజీని తిరుగవేస్తూ చూడడానికే నాకు రెండు గంటలు పట్టింది. అక్షరములు చిన్న ఫాంట్‌లో ముద్రింపబడుత వలన 83 వయస్సులో ఉన్న నాకు కండ్లు లాగడము ప్రారంభమైంది. అయినప్పటికిని పుస్తకమును వదలకుండా చూడటము, చదవడము జరిగింది. చరిత్రపై మక్కువ ఎక్కువ. తెలంగాణ ప్రముఖ చరిత్రకారునిగా 2015లో ప్రభుత్వము నాకు స్టేట్ అవార్డు ప్రదానము చేస్తూ లక్ష రూపాయల పారితోషికముతో సన్మానించింది. సిద్దిపేట కళాశాలలో రెండు సంవత్సరాలు కే.సి.ఆర్. గారికి ఇంటర్మీడియట్‌లో చరిత్ర పాఠాలు బోధించే అవకాశము లభించింది. అలాంటి చరిత్రకారుణ్ణి ఈ ఔరంగజేబు పుస్తకాన్ని చూడగానే సంభ్రమాశ్చర్యములకు లోనైనాను. 60 సంవత్సరాల పూర్వము ఎం.ఎ. పరీక్షలో మొగలులపై ఒక ప్రత్యేక పేపరు ఉండేది. నాకు అప్పుడే మొగలుల చరిత్రపై చక్కటి అవగాహన ఏర్పడింది.

లావైన ఈ బృహద్గ్రంథము ఉపోద్ఘాతంతో ప్రారంభమై ముగింపు వరకు 27 అధ్యాయాలతో కొనసాగింది. ఒకవేళ అందరు చదువగలిగే సాధారణ ఫాంట్‌లో ముద్రించినట్లైతే 1200 పేజీల వరకు కొనసాగే ఉత్కృష్ట గ్రంథమిది. నాకు సమీపమందే గల కరీంనగర్‌లోని కాశ్మీరుగడ్డ వాసియగు ఒక ముస్లిం సోదరుడు తెలుగునందు సరళ గ్రాంథికములో ఇంతటి పరిశోధనా గ్రంథము వ్రాయడము మరీ ఆశ్చర్యము వేసింది. వారు రెవెన్యూ శాఖ బదులు విద్యాశాఖలో ఉండి ఉంటే వేలాది విద్యార్థులు లాభపడేవారు. వారి విషయ వివరణ, పరిశోధనా పటిమ, భాషా వైదుష్యము అమోఘము, అద్భుతము, నిరుపమానము. వారి కృషి అభినందనీయము, అనితర సాధ్యము. సంతోషము పట్టలేక వెంటనే పగలు వారికి ఫోన్ చేసి అభినందించాను. సార్! దీనిని ఉర్దూలో గూడా అనువదించాను. ముద్రణకు సిద్ధంగా ఉంది. మీలాంటి అనుభవజ్ఞులైన చరిత్రకారులు దానికి ముందుమాట వ్రాయాలని కోరారు. నిజాం కాలములో నేను ఐదవ తరగతి వరకు ఉర్దూ మీడియంలోనే చదివాను. ఆఱవ తరగతిలో 1949లో తెలుగు మీడియం ప్రవేశపెట్టబడింది. నాకు ఉర్దూ వచ్చును. ధారాళంగా మాట్లాడగలను. కాని వ్రాసే

అలవాటు పోయింది. ఎందుకనగా దాని అవసరం పడలేదు. తరువాత నేను ఇటీవల వ్రాసిన ఎల్లగందల్ చరిత్ర రచనకై అబ్దుల్ ఖుద్దూస్ గారు ఉర్దూలో వ్రాసిన "సైరే ఎల్లందల్" డెబ్బై ఎనభై పేజీల పుస్తకాన్ని మెల్లమెల్లగా చదివాను. రెండు రోజులు పట్టింది. నేను ఉర్దూలో మీకు ముందుమాట వ్రాయలేనని చెప్పాను. నా ఇరువై గ్రంథాలు తెలుగు, ఆంగ్లములందు వ్రాసినవే అని చెప్పగానే, సార్! మీరు తెలుగులోనే వ్రాసి పంపండి, నేను ఉర్దూలోనికి అనువదించి ముద్రించుకుంటానని వారు వినమ్రంగా కోరగానే నేను సరే అని జవాబు పలికాను. దాని ఫలితమే ఈ ముందుమాట. ఒక రెవెన్యూ ఉద్యోగి తన విశ్రాంత జీవితములో ఔరంగజేబుపై తెలుగు, ఉర్దూ భాషలు రెండింటిలోను బృహద్గ్రంథములు వ్రాయడము అత్యంత అరుదైన విషయము.

రచయిత అసలు పేరు ముహమ్మద్ సర్వర్. ఆయన కలం పేరు అబుల్ ఫౌజాన్. ఆ పేరుతోనే వివిధ అంశములపై వారు రచించిన 33 గ్రంథములు సమాజానికి అందించారు. వారు పుట్టింది ఓదెల మండలంలోని మారుమూల గ్రామమైన పొత్కపెల్లి. ప్రస్తుత నివాసము కరీంనగర్‌లోని కాశ్మీరిగడ్డ ప్రాంతము. వారి తెలుగు గ్రంథమునకు తెలంగాణ తెలుగు యూనివర్సిటీ నుండి, ఉర్దూ గ్రంథమునకు అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పట్టాలు పొందే స్థాయిలో వారి రచనలు సాగాయి. ఈ గ్రంథములు యూనివర్సిటీలలోని M.A. విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా సిలబస్‌తో ప్రవేశపెట్టే అవసరముంది. అన్ని విశ్వవిద్యాలయాలలో ఇవి Reference Book గా వాటి గ్రంథాలయములందు స్వీకరింపబడాలి. ఈ రచనతో అబుల్ ఫౌజాన్ గారు జాతీయ స్థాయి చరిత్రకారులైన జదూనాథ్ సర్కార్, ఆచార్య బిపిన్ చంద్ర, ఆచార్య కె.యస్. లాల్ లాంటి వారి సరసన నిలబడగలిగే యోగ్యత సంపాదించారు. తెలుగు మాధ్యమములో వారి విద్యాభ్యాసము జరిగినందున తెలుగులోను, ఉర్దూ మాతృభాష గనుక ఉర్దూలోను మంచి పట్టు సాధించారు. ఒకవేళ వారి ఈ గ్రంథము ఆంగ్ల భాషలో వచ్చి ఉంటే వారికి అంతర్జాతీయ ఖ్యాతి లభించేది. సంపాదన కొరకై గాకుండా చరిత్ర, సాహిత్యములందు మక్కువతో వారు ఒక ఉదాత్తమైన రచయితగా ఎదిగారు.

అబుల్ ఫౌజాన్ గారు ఔరంగజేబుకు మరాఠాలు, రాజపుత్రులు, శిక్కులు, సత్నామీలు, జాటులు, దక్కన్ షియా సుల్తాన్‌లతో గల సంబంధాలను, వారితో జరిపిన యుద్ధములను చక్కగా వివరించారు. వారి పరిపాలన, సంస్కరణలు, అవలంబించిన విధానములు పూసగ్రుచ్చినట్లు వివరించారు. అందుకే నేను మరల వాటిని గురించి ఉటంకించడం చర్విత చర్వణమే అవతుంది గనుక వాటి జోలికి పోలేదు.

ఔరంగజేబు జీవితము ఆనాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో కొంత వరకు ముడిపడి ఉంది. గోలకొండ అబ్దుల్లా కుతుబ్‌షా ఓడిపోయి తన కూతురును ఔరంగజేబు కుమారుడైన ముహమ్మద్‌నకిచ్చి వివాహము చేసి రామగిరి దుర్గమును

మొగలులకు కట్నం క్రింద బహూకరించాడు. రెండుసార్లు దక్కన్ సుబేదార్‌గా నుండిన ఔరంగజేబు రామగిరి దుర్గము సందర్శించాడు. అచటి సుగంధభరితమైన వాతావరణమునకు ముగ్ధుడై ఎంత చక్కటి ప్రదేశమని పొగడగానే ప్రక్కకుండిన ఫార్సీ కవి నసీరుద్దీన్ గారు వెంటనే ఇది రాజులు విశ్రాంతి తీసుకొనే ఆరాంఘర్‌గా ఉంది అన్నాడు. అనాటి నుండి రాంగీర్ దుర్గము ఆరాంఘర్‌గా పిలువబడింది. సుప్రసిద్ధ చరిత్రకారుడు H.K. Sherwani తన రచనలలో రామగిరిని ఆరాంగీర్ పేరుతోనే పేర్కొన్నాడు.

ఔరంగజేబు ఎల్గందల్ కోటను దర్శించిన దాఖలాలున్నాయి. అచటి షాహ్‌బాజ్ వలి బగ్దాది పుణ్య పురుషుని దర్శించుకోవడానికి ఎల్గందల్‌కు వచ్చేవాడు. ఔరంగజేబు సన్నిహితుడు "Lubbat Tawarik" రచించిన “రాయబింద్రబాన్” ఎల్గందల్ కోటలో బింద్రబాన్ బావి కట్టించాడు. ఆ కోటలో ఆలంగీరు మసీదు కూడా ఉంది. కాళేశ్వరము దగ్గరి మసీదుపల్లిలో మంథని సమీపమందున్న సోనిపేట (Sonipet) లో ఔరంగజేబు నమాజ్ చేయుటకై కట్టిన మసీదులున్నాయి. ఆయన కాలములో ఆయన దక్కన్ సుబేదార్‌గా నుండిన రుస్తుం దిల్ ఖాన్ ధర్మపురిలోని చాళుక్యుల కాలపు త్రికూటాలయమును 1693లో మసీదుగా మార్చి అబుల్ హసన్ ఫారస్‌ను మౌజన్‌గా నియమించి వంద (100) బిగాల భూమిని దానముగా ఇచ్చాడు. సుప్రసిద్ధ హజ్రత్ ఇంకెషా వలి దర్గా కేంద్రమైన బిజిగిరి షరీఫ్‌లో ఔరంగజేబు కాలపు మసీదు ఉంది. ఇలా ఔరంగజేబుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో సన్నిహిత సంబంధం ఉండినట్లు విదితమౌతుంది.

మిత్రులు అబుల్ ఫౌజాన్ గారు వ్రాసిన ఔరంగజేబు చరిత్ర ఒక అద్భుత రచనగా మిగిలిపోతుంది. రాబోవు యువ చరిత్రకారులకు వారి రచనలు ఆదర్శప్రాయము, అనుకరణీయము, అనుసరణీయము. చివరగా మరల ఒకసారి ఈ రచన గావించిన అబుల్ ఫౌజాన్ గారికి నా హార్దిక శుభాభినందలు, శుభాకాంక్షలు తెలుపుచున్నాను.

**- డా. జైశెట్టి రమణయ్య**

**Dr. Jaisetty Ramanaiah**

ప్రముఖ చరిత్రకారులు, విద్యావేత్త

సెల్ : 9959031450

జగిత్యాల - 505 327

తేది : 8-5-2021



**డాక్టర్ నలిమెల భాస్కర్**

ఎం.ఎ., ఎంఫిల్, పి.హెచ్‌డి.,
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సాహిత్య అవార్డుల గ్రహీత
పలు భారతీయ భాషల పండితులు, అనువాదకులు
డజన్లకొద్ది గ్రంథాల రచయిత, అనువాదకులు.

# నిలకడమీద నిగ్గు తేలిన నిజాలు!

భారత దేశం మన మాతృభూమి. భారతీయులందరూ మన సహోదరులు. హిందువులు మన బంధువులు. ముస్లింలు ఈ దేశమాత ముద్దు బిడ్డలు. క్రైస్తవులు భరతమాత కన్న పిల్లలు. బౌద్ధమతస్థులు ఈ భూమి పుత్రులు. సిక్కులు మన చుట్టపక్కాలు. జైనులు ఈ దేశ జనులు. ఇంకా ఇంకా ఇతర మతాల వాళ్ళు మనందరికీ హితులు, సన్నిహితులు. ఈ దేశం సప్తవర్ణ సంశోభిత ఇంద్రచాపం వంటిది. ఇది సుందర నందనోద్యానం వంటిది.

అయితే ఈ ఇంద్రచాపాన్ని చిందర వందర చేసిన దృష్టాంతాలు కోకొల్లలు. ఈ నందనవనాన్ని విధ్వంసం చేసిన ఉదాహరణలు గత ఇతిహాసంలో వందలు, వేలు. భారతీయులందరూ కలిసివుంటే పరిపాలన కొనసాగించడం కష్టం అనుకున్న ఆంగ్లేయులే ఈ దృష్టాంతాలకూ, ఉదాహరణలకూ కారకులు. పరస్పర ప్రేమాభిమానాలతో సహజీవనం సాగిస్తున్న భారతీయుల్ని చూసిన బ్రిటిష్ పాలకులకు కన్నుకుట్టింది. భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఇంగ్లీషువాళ్ళకు వ్యతిరేకంగా హిందూ ముస్లింలు భాయీ భాయీ అంటూ లడాయి చేశారు. భుజం భుజం కలిపారు. కదం తొక్కారు. ఈ పోరాటంలో హిందువులతో పాటు వందల వేల ముస్లిం ధార్మిక గురువులు పాల్గొన్నారు. చివరికి అసువులు బాసారు. దీన్ని కేవలం సిపాయిల తిరుగుబాటుగా ఆంగ్లేయులు పేర్కొన్నారు. ఈ ప్రతిఘటనా పోరాటాన్ని చూశాక బెదిరిపోయారు. ఈ రెండు అతి పెద్ద ముఖ్య మతాల్ని విడదీయాలనుకున్నారు. విభజించి పాలించారు. అద్భుతమైన సయోధ్యతో సహజీవనం సాగిస్తున్న ఈ రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టడానికి “చరిత్ర”ను ఎంచుకున్నారు.

ఆంగ్లేయులకన్నా ముందు భారత దేశాన్ని పాలించిన ముస్లిం రాజులు, ముఖ్యంగా ఔరంగజేబ్ వంటివాళ్ళు తమ పాలనలో హిందువుల్ని వేధించారని, హింసించారని,

బలవంతంగా ఇస్లాంలో కలిపారని, మందిరాల్ని పడగొట్టారని, పన్నులు వేసారని ఇలా రకరకాలుగా రాస్తూ బ్రిటిష్ చరిత్రకారులు బయలుదేరారు. ఉదాహరణకు ఔరంగజేబ్‌నే తీసుకుందాం. అతడు ఎలాంటివాడో చెప్పడానికి ఆయన కాలంలో రాసిన సమకాలీన చరిత్ర గ్రంథాలున్నాయి. ఆ రాజుకు తెలియకుండా రాసిన గ్రంథాలున్నాయి. ఔరంగజేబ్ స్వయాన తండ్రికీ, ఇతరులకీ రాసిన లేఖలున్నాయి. అయితే ఇవన్నీ పర్షియన్ భాషలో ఉన్నాయి. వీటి ఆధారంగా మనం ఔరంగజేబ్ వ్యక్తిత్వాన్ని చక్కగా అంచనా వేయవచ్చు. కాని బ్రిటిష్ చరిత్రకారులు, ఐరోపియా చరిత్రకారులు ఈ పర్షియన్ గ్రంథాలను ఆంగ్లంలోకి అనువదించేటప్పుడు వాస్తవాల జోలికి వెళ్ళలేదు. గత చరిత్రలో జరిగిన ముఖ్యంగా ముస్లింల పాలనలో జరిగిన స్ట్రే ఇన్సిడెంట్స్‌ని పట్టుకొని భూతద్దంలో చూపడానికి ప్రయత్నించారు. ఔరంగజేబ్ హిందూ మత ద్వేషి అని, తండ్రి షాజహాన్‌ను జైల్లో పెట్టిన కృతఘ్నుడని, సోదరుడు దారా షికూహ్‌ను హతమార్చాడు. ఇలాంటి సంఘటనల్ని ఉదాహరించారు. అబుల్ ఫౌజాన్ రాసిన ఈ **"ఔరంగజేబ్-చరిత్రకెక్కని చారిత్రక కోణాలు"** అనే గ్రంథం చదివాక మనం ఆశ్చర్యపోతాం. ఔరంగజేబ్ హిందూ మత ద్వేషి కాదు అని అర్థమవుతుంది. అతను నిశ్చయంగా ఇస్లాం ధర్మావలంబికుడు. అతడు మతవాది మాత్రమే కాని మతోన్మాది కాడు. తన పాలనలో మతప్రమేయం లేకుండా జాగ్రత్తపడినవాడు. మతం అతని వ్యక్తిగతం. తండ్రి అయిన షాజహాన్‌ను బంధించకపోతే అది తనకు, తన ఉనికికే ప్రమాదకరంగా పరిణమించేటట్లుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే సోదరుడు దారా షికూహ్‌ను చంపవలసివచ్చింది.

కావాలని, ఉద్దేశపూర్వకంగా ఇలియట్ వంటి చరిత్రకారులు, ఔరంగజేబ్‌ను క్రూరుడిగా, దుర్మార్గుడిగా చూపించారు. వాస్తవాలకు భిన్నంగా ఇట్లాంటి చరిత్రరచన చేయించిన ఆంగ్లేయులు ఆ "చరిత్ర" సబ్జెక్టుని పాఠశాలల్లో విద్యార్థులు చదివే పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. అంతేగాక ప్రశ్నాపత్రంలో ఔరంగజేబ్ ప్రశ్నకు కంపల్సరీ ప్రశ్నగా అడిగేవారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల లేత మనస్సుల్లో ముస్లిం పరిపాలకులందరూ చెడ్డవాళ్ళు అనే తప్పుడు సంకేతాలను జొప్పించారు. అప్పటివరకు అన్నదమ్ముల్లా అన్యోన్యంగా కలిసిమెలిసి సాగుతున్న హిందూముస్లింల మధ్య ఓ పెద్ద అగాధానికి కారకులయ్యారు. క్రీ. శ. 1857 ప్రాంతం నుండి ఆరంభమైన ఈ అగాధం దిన దినం, క్షణ క్షణం ప్రవర్ధమానం అవుతున్నది. ఇటువంటి అగాధాలూ, అఖాతాలూ ఈ దేశ సమగ్రతకు భంగకరాలు. దాదాపు నూటా యాభై సంవత్సరాల నుండి ఒక నిర్దిష్ట ప్రణాళికతో ఈ తప్పుడు చరిత్రలు విద్యార్థుల మెదళ్ళలోకి ఎక్కిస్తున్నారు. నిరాఘాటంగా ఈ దేశంలో పరిపాలన సాగించాలనుకొని పన్నిన తెల్లదొరల పన్నాగం ఇది.

ఇది ఆంగ్లేయులు చేసిన పన్నాగం అనీ, కుట్ర అనీ, ఉద్దేశపూర్వకంగా చరిత్రను వక్రీకరించారని మరి మనం ఎలా చెప్పగలం? ఔరంగజేబ్ సమకాలీన చరిత్ర గ్రంథాలు దాదాపుగా అన్నీ ఇప్పటికీ దొరుకుతున్నాయి. అతడి తర్వాత రాసిన పుస్తకాలు కూడా లభ్యమవుతున్నాయి. ఆ రాజు రాసిన లేఖలు, జారీచేసిన ఫర్మానాలు అందుబాటులో

ఉన్నాయి. ఔరంగజేబ్ నిజమైన వ్యక్తిత్వాన్ని చూపడానికి ప్రయత్నించి సఫలీకృతులైన భారతీయ చరిత్రకారుల రచనలు కూడా దొరుకుతున్నాయి.

ఈ గ్రంథ రచయిత అబుల్ ఫౌజాన్ గారు కూడా అసలు చరిత్రలో ఏం జరిగి ఉంటుంది అన్న తపనతో తీగ లాగారు. ఇంకేం, ... డొంకంతా కదిలింది. దాదాపు తొమ్మిదేళ్ళ నిరంతర పరిశ్రమతో పర్షియన్, ఉర్దూ, హిందీ మరియు ఇంగ్లీషు భాషల్లో ఉన్న గ్రంథాల్ని పరిశోధించారు. అనేక వ్యయప్రయాసలకు ఓర్చారు. సముద్ర మథనం చేశారు. ఔరంగజేబ్ అసలు సిసలు రూపాన్ని చూపించారు. బహుశా భారతీయ భాషల్లోనే ఔరంగజేబ్ వ్యక్తిత్వం గురించి ఇంత సమగ్రంగా రూపుదిద్దుకున్న గ్రంథం ఇదేనేమో! తెలుగులో ఉన్న ఈ గ్రంథం అన్ని భారతీయ భాషల్లో అనువదించబడాలని నా కోరిక, ఆకాంక్ష.

ఔరంగజేబ్ అత్యంత ధైర్యసాహసాలు గలవాడు. అసామాన్య పరాక్రమశాలి. కేవలం తన పదిహేనేళ్ళ ప్రాయంలో మదించిన ఏనుగుని ఒంటరిగా ఎదురించినవాడు. ఎనభై ఏడేళ్ళ వయస్సులో "బాగన్ ఖేడ" అగడ్తల్లో నిలబడి పోరాడినవాడు. పుస్తక పఠనంపై శ్రద్ధగల వ్యక్తి. రాజరికపు ఆడంబరాలు నచ్చేవి కావు. ఫకీరులాగా జీవితం గడిపాడు. లక్ష్యసాధనలో అచంచలమైన పట్టుదల వుండేది. అనన్య సామాన్యమైన ఓర్పు ఉండేది. అతడు మేలిమి బంగారం లాంటి గుణగణాలు కలిగినవాడు. అత్యంత విద్యాధికుడు. మిత వ్యయం చేసేవాడు. రాజనీతిజ్ఞుడు. మహోన్నతమైన నైతిక ప్రవర్తన గల వ్యక్తి. అతని దూరదృష్టి వేనోళ్ళ కొనియాడదగింది. సమయస్ఫూర్తి శ్లాఘనీయం – ఇదీ అతని వ్యక్తిత్వం.

అయితే మరాఠాలను అణచివేయడం ఔరంగజేబ్ చేసిన నేరమని కొందరి ఆరోపణ. మరి షాజహాన్ కూడా వారిని అణచివేశాడు కదా! రాజపుత్రులపై సైన్యాలు పంపడమే ఔరంగజేబ్ చేసిన తప్పు అయితే అక్బర్ కూడా జైపూర్పై సైన్యాలు పంపాడు కదా! రాజ్య విస్తరణ కోసం రాజులందరూ ప్రయత్నించారు. అదే పని ఔరంగజేబూ చేశాడు.

కాశీలో విశ్వనాథుని మందిరాన్ని పడగొట్టించాడని మరో ఆరోపణ. నిస్సందేహంగా పడగొట్టించాడు. కారణం ఆ మందిరంలో ఓ హిందూరాణి శీలాపహరణ జరిగింది. తద్వారా ఆ పవిత్ర స్థలం అపవిత్రం అయిపోయింది. తత్కారణంగానే మందిర విధ్వంసం జరిగింది.

అబుల్ ఫౌజాన్ గారు వీటన్నింటికీ రుజువులు చూపించారు ఈ గ్రంథంలో. ఔరంగజేబ్ పాలనలో 500 మన్సబుదారులు మొదలుకొని 7000 మన్సబు కలిగిన మహోన్నత నాయకులు ఎందరెందరో హిందువులున్నారు. అంతెందుకు? ... అతని సర్వసైన్యాధ్యక్షుడు రాజా జైసింగ్, అతని ఆర్థిక శాఖ మంత్రి రాయె రాయాన్ రఘునాథ్ ఖత్రీలు హిందువులే కదా! ఆనాడు బలవంతపు మత మార్పిళ్ళు లేవు అనడానికి ఆర్నాల్డ్ ఏం చెప్పాడో చూడండి : "ఔరంగజేబ్ కాలం నాటి చారిత్రక గ్రంథాలలో నేను పరిశీలించినంత వరకు బలవంతంగా ముస్లిములుగా మార్చిన సంఘటన ఎక్కడా

కనిపించదు.” – ఒక ప్రఖ్యాత ఆర్య సమాజ ప్రచారకుడు శ్రీ మెహ్‌తా జైనవీ తను వ్రాసిన ఒక పుస్తకంలో ఔరంగజేబ్ హిందువుల్ని హింసించాడు అనే విషయాన్ని ఖండిస్తూ ఇది నిరాధారమైన ఆరోపణగా పేర్కొన్నారు. బొంబాయికి చెందిన జెనన్ చందర్ గారైతే ఔరంగజేబ్ హిందూ మందిరాలకు, పూజారులకు, మహంతులకు భత్యాలు, ఇనాములు, జాగీర్లు కూడా ఇచ్చిన ధర్మదాత అని సాక్ష్యాధారాలతో నిరూపించారు. అక్బర్ తన కాలంలో ఎంతమంది హిందువులకు ఉన్నత హోదాలనిచ్చాడో, అంతకన్నా ఎక్కువ సంఖ్యలో ఔరంగజేబ్ హిందూ నాయకులకు ఉన్నత హోదాలనిచ్చాడని ఎం. అత్‌హర్ అలీ గారు రుజువు చేశారు. జస్వంత్ సింగ్‌ను ఔరంగజేబ్ గుజరాత్, కాబూల్, జమ్రూద్‌లకు గవర్నరుగా నియమించాడు.

ఔరంగజేబ్ మందాకినీ నదీ తీరంపై గోపీ పురంలో “బాలాజి” మందిరాన్ని కట్టించాడు. ఇంకా దాని కోసం ఏకంగా ఎనిమిది గ్రామాలు వాటి రాబడితో సహా దానంగా ఇచ్చాడు. తన జీవితపు 27 సంవత్సరాలు అతడు దక్షిణ భారత దేశంలో గడిపాడు. కాని ఈ సుదీర్ఘ కాలంలో అక్కడ ఒక్క హిందూ మందిరం కూడా ధ్వంసం చేయబడలేదు. అయితే మందిరాలూ, మసీదులు దుర్వినియోగం అవుతున్నాయని తెలిసినప్పుడు ఔరంగజేబ్ వాటిని పడగొట్టించాడు.

ఇక ... ఈ గ్రంథంలో జిజియా పన్ను గురించి ఒక ప్రత్యేకమైన అధ్యాయమే ఉంది. అది విధిగా చదివి తీరవలసిందే!

ఈ పుస్తం చదివాక మనం కొన్ని అభిప్రాయాలను ఏర్పరచుకుంటాం. అవి : ఔరంగజేబ్ నిజానికి ఒక రాజు. ఆ తరువాతనే అతను ఒక ముస్లిమ్. అతడు మొగలు సామ్రాజ్య వారసుడు. తన రాజ్యాన్ని పటిష్ఠపరచుకుంటూ విస్తరించుకునే క్రమంలోనే అతడు గోల్కొండ, బీజాపూర్‌లపై (అవి ముస్లిమ్ రాజ్యాలు అయినప్పటికీ) దండయాత్ర చేశాడు. శివాజీతో కూడా అట్లాగే పోరాడాడు. ఔరంగజేబ్, శివాజీలు వరుసగా ముస్లిమ్ హిందూ రాజులకు ప్రతీకలు (ప్రతినిధులు) కాక, ఆ ఇద్దరూ ముందుగా రాజులు మాత్రమే! రాజుల మధ్య వున్న వైషమ్యమే ఈ ఉభయుల మధ్య కూడా నెలకొని ఉంది. వారిద్దరి మధ్య వున్నవి రాజకీయ విభేదాలే కాని అవి మతపరమైనవి కావు. ఈ విషయాలను ఈ గ్రంథకర్త అబుల్ ఫౌజాన్ మాత్రమే కాక బిషంబర్ నాథ్ పాండే మొదలైన నిష్పాక్షిక చరిత్రకారులు కూడా నిరూపించారు. శివాజీ తన వ్యక్తిగత జీవితంలో ఔరంగజేబ్‌ను అత్యధికంగా గౌరవించేవాడు. వీరిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరుగుతుండేవి. ఔరంగజేబ్ కూడా శివాజీని ఒక మహోన్నతుడైన సైన్యాధిపతిగా గుర్తించాడు.

ఔరంగజేబ్ చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయివున్న ముక్కల్ని జోడించి అఖండ భారతంగా మార్చిన వివేకి. ఈ దేశ చరిత్రలో ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పడమర వరకు మొదటిసారిగా ఒకే పాలనలోకి తెచ్చిన చక్రవర్తి. ప్రాచీన కాలం నుండి ఆంగ్లేయుల ప్రభుత్వం ఏర్పడేంతవరకు దేశంలో ఎన్నడూ ఇంతటి సువిశాలమైన సామ్రాజ్యం స్థాపించబడి వుండలేదు. ఆ సామ్రాజ్యం అశోకుడు, అక్బర్, సముద్రగుప్తుడు,

హర్షవర్ధనుల కాలం నాటి సామ్రాజ్యాలకన్నా విశాలంగా వుండేది. ఇంతటి సువిశాల దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా యాభై ఏళ్ళు పరిపాలించాడు. ఔరంగజేబ్‌ను తీవ్రంగా విమర్శించే జదూనాథ్ సర్కార్ అనే చరిత్రకారుడు సైతం అతన్ని గొప్ప వీరుడని, విద్యాధికుడని, అతని వ్యక్తిగత జీవితం దుస్తులు, ఆహారాదులు అతి సామాన్యంగా వుండేవని, అతనికి తొంభై ఏళ్ళు వచ్చేవరకు కూడా అతనిలో సకల యోగ్యతలు సంపూర్ణంగా వున్నాయని, అతడు ఇరవై నాలుగు గంటల్లో కేవలం మూడు గంటలే నిద్రించేవాడని ప్రశంసించక తప్పలేదు.

ఔరంగజేబ్ తన స్వహస్తాలతో టోపీలు కుట్టి తద్వారా వచ్చిన డబ్బుతో తన ఖనన క్రియలు పూర్తిచేయాలని మరణశాసనంలో రాసుకున్నాడు. తన చేతులతో ఖుర్‌ఆన్ ప్రతులు రాసి, వాటిని అమ్మగా వచ్చిన డబ్బును తన మరణానంతరం ఫకీర్లు మొదలైన వాళ్ళకు దానధర్మాలు చేయమని విన్నవించుకున్నాడు. అదీ అతని నిరుపమాన వ్యక్తిత్వం!

ఈ పుస్తకం అంతా చదివిన తర్వాత మనకు తప్పనిసరిగా కొన్ని అభిప్రాయాలు ఏర్పడతాయి. ఔరంగజేబ్ గురించి ఇప్పటి వరకూ మన సమాజంలో చలామణిలో వున్న నకారాత్మక భావాల్లో చాలామట్టుకు తప్పుడు అభిప్రాయాలు అని తెలిసివస్తుంది. అతడు కూడా ఒక పరిపాలకుడు అని బోధపడుతోంది. అయితే అతని పాలన మతపరమైనది కాదనడానికి ఈ గ్రంథంలో అనేక రుజువులున్నాయి. అతనిలో సైతం కొన్ని బలహీనతలు వుండి వుండవచ్చు. కాని సుగుణాలతో పోల్చితే వీటి సంఖ్య స్వల్పం. తన పాలనకు అడ్డు వచ్చిన వాళ్ళు ఎవరైనా సరే వాళ్ళ రాజ్యాలను అణచివేశాడు. ఇది ప్రాచీన మధ్యయుగ భారత దేశ చరిత్రలో రాజులందరూ చేసిన పనే! మొత్తమ్మీద ఆద్యంతం ఈ గ్రంథం చదివాక ఔరంగజేబ్ దుర్మార్గుడు, ఇస్లాం మతోన్మాది వంటి బహుళ ప్రచారంలో వున్న అభిప్రాయాలు పటాపంచలైపోతాయి. అబుల్ ఫౌజాన్ గారు అనేక రెఫరెన్సులతో చాలా రిపిటేషన్స్‌తో చర్విత చర్వణంలా చెప్పినట్లు అనిపించినా ఎంతో ఆసక్తికరంగా ఔరంగజేబ్ నిలువెత్తు రూపాన్ని మన కళ్ళ ముందు ఉంచారు. బ్రిటిష్ పరిపాలనలో చరిత్రను ఎట్లా వక్రీకరించారో, ఎందుకు వక్రీకరించారో ఆధారాలతో సహా నిజమైన చరిత్రను మన ముందుంచారు. వాస్తవ చరిత్రల అధ్యయనంతో భారతీయుల ఐక్యతను కోరుకుంటున్నారు అబుల్ ఫౌజాన్ గారు. అదే నిజమైన దేశభక్తి. ఆంగ్లేయ, ఐరోపియా చరిత్రకారుల కుట్రల వల్ల భారత దేశంలోని రెండు పెద్ద వర్గాల మధ్య వైమనస్యానికి తెరలేచింది. మరి సామరస్యం విరబూయాలంటే ఏం చేయాలి? వాస్తవాలు తెలుసుకోవాలి. పొరపొచ్చాలు లేని అరమరికలు లేని ఎటువంటి మరకలు లేని స్వచ్ఛమైన అచ్చమైన పరస్పర సహజీవనంతో భారతీయులు అందరూ ఈ దేశంలో అన్యోన్యంగా బ్రతకాలి. కలిసిమెలసి జీవించాలి. ఏ మతమైనా ఆదరించబడాలి. ఏ మతోన్మాదమైనా ఛీదరించబడాలి. "అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయ్" అన్న మహా కవి గురజాడ జాడ గురుతరమైన జాడ కావాలి.

కరీంనగర్ **నలిమెల భాస్కర్**



శ్రీ కె. శ్రీనివాస్
ఎడిటర్
ఆంధ్రజ్యోతి తెలుగు దినపత్రిక,
హైదరాబాద్

# చరిత్ర రచనలో బొమ్మ-బొరుసు

"మా గురువులవారగు మీరు మా బాల్యమును వ్యర్థపుచ్చితిరి కదా? అయ్యో! భూగోళజ్ఞానమా ఏమియును లేదు, పోర్చుగలు, హాలండు, ఇంగ్లండు మొదలగు దేశములు కొన్ని కలవనియు, అవి ఆయా స్థలములందు కలవనియు, నాకు నేర్పితిరి. ఆ దేశములు ద్వీపములా, ద్వీపకల్పములా, సమభూమి యందున్నవా? లేక ఎత్తుస్థలములందున్నవా యన్న సంగతులు నాకు తెలియ వలదా? మీరు నాకు లేనిపోనట్టియు, బుద్ధిని భ్రమింపజేయు నట్టియు లౌకిక వ్యవహారమునకు నిరుపయోగకరమైనట్టియు పరభాషా జ్ఞానము గరపుట యందే కృతకృత్యులమైతిమని తలంపలేదా? మొదల పరకీయ భాష నొకదానిని నేర్చి దాని మూలముగా శాస్త్రములు, ధర్మవివేచనము, న్యాయనీతి మొదలైన యావశ్యకములైన విద్యల నేర్చుట సులభ మనితలంచితిరా? ఈ యావశ్యకములగు విద్యలన్నియు మీరు నాకు నా మాతృభాషలోనే నేర్పియుండకూడదా? మీరు నాకు రాజకీయ, సైనిక వ్యవహారిక విద్యలలో నేవిద్య నేర్పితిరని మిమ్ముల నేను గౌరవింతును?"

(ఔరంగజేబ్ తన గురువునకు వ్రాసిన యుత్తరము కె.వి. లక్ష్మణరావు 1910 ఆంధ్రపత్రిక, సంవత్సరాదిసంచిక)

చిన్నప్పుడు అరబ్బీ భాష నేర్పిన ఒక సంప్రదాయపండితుడు ఔరంగజేబ్ చక్రవర్తి అయిన తరువాత ఉద్యోగార్థం ఆయన దర్శనం కోరాడు. దర్శనం ఇవ్వకుండా తిప్పిపంపుతూ ఔరంగజేబ్ తన గురువుకు ఒక లేఖ రాశాడు తెలుగులో తొలి చరిత్ర కారులలో ఒకరైన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు ఆ లేఖను అనువదించి ఆంధ్రపత్రికలో ప్రచురించారు. "ఔరంగజేబ్ నెడలనెన్ని దుర్గుణములున్నను అతడు గొప్ప విద్వాంసుడని చెప్పక తప్పదు..." అంటూ ఆ లేఖానువాదానికి లక్ష్మణరావు ఒక చిన్న పరిచయం

రాశారు. మంచిచెడుల వివేచనకు ఇంకా చెల్లుబాటు ఉన్న కాలానికి చెందిన లక్ష్మణరావు ఔరంగజేబ్‌లోని ఆధునికతా బీజాలను గుర్తించారు. సంప్రదాయ విద్యకంటె లౌకిక విద్య, పరాయి భాష కంటె మాతృభాష ఆవశ్యకాలని ఔరంగజేబ్ గుర్తించారు. ఈయనేనా మన చరిత్ర చెబుతున్న ఛాందసుడు? అనిపిస్తుంది. చరిత్రను చూసేమన దృష్టిని వడగట్టుకోకపోతే ఎంతగా తప్పుడు అభిప్రాయాలు ఏర్పరచుకుంటాము? చెడ్డవాడిని మంచివాడని, మంచివాడిని చెడ్డవాడని అనుకోవడమే కాదు, చెడ్డవారిలో ఉన్న మంచిని మంచివారిలో ఉన్న చెడ్డను చూడలేని దృష్టి లోపానికి గురిఅవుతాము. సామాన్యుడిని మహనీయుడనుకోవడం ఎంత తప్పో చెడ్డవాడిని అతని చెడ్డతనానికి మించిన చెడ్డవాడని అనుకోవడమూ దోషమే.

చరిత్ర ఒక శాస్త్రంగా మారింది అనంతర కాలంలో కావచ్చును, కానీ చరిత్ర అనాదిగా ఒక మానవ అవసరం. దాన్ని ఆనాడు మనం చరిత్ర అని పిలవకపోవచ్చు. జ్ఞాపకం అనవచ్చు. పురాణం అనవచ్చు. అందరి జ్ఞాపకంలో ఒకే అంశం ఉన్నప్పుడు దానికి లభించే సాధికారతే వేరు. అందరూ అంగీకరించిన కట్టుకథే చరిత్ర అంటాడు నెపోలియన్. అతని పేరుకు పెద్ద విలువ ఇవ్వనక్కరలేదు కానీ, చరిత్ర గురించి రెండు ముఖ్యమైన లక్షణాలు చెప్పాడు అతను. ఒకటి అందరూ అంగీకరించడం. రెండు కట్టుకథ. ఈ రెండు లక్షణాలకూ అపవాదాలు ఉంటాయి. అధికసంఖ్యాకులు ఒక కథనాన్నే చరిత్రగా అంగీకరిస్తున్నప్పటికీ, ఇతర కథనాలు కూడా ఉనికిలో ఉంటాయి. కట్టుకథ అనే మాట కల్పన అనే అర్థంలో సరిఅయినది కాకపోవచ్చును. కొన్ని అభూత కల్పనలు ఉన్నప్పటికీ, వాస్తవాలకు ఇచ్చే అన్వయమే వివిధ కథనాలను వేరువేరు చరిత్రలు చేస్తున్నది.

గడిచి పోయిన వెంటనే ప్రతి క్షణమూ కాలగర్భంలోకి జారిపోతుంది. అదిక మళ్లీ తిరిగి రాదు. ఆ క్షణంలో జరిగిందేమిటో యధాతథంగా, సమస్తంగా, సంపూర్ణంగా, సమగ్రంగా చెప్పుకోవడం సాధ్యమా? అసలు యధాతథత్వం, సమగ్రత, సంపూర్ణత వంటివి సాధ్యాలేనా? మనుషులూ సంఘటనలూ పెద్ద ఊరేగింపుగా సాగిపోవడంగా చరిత్రను ఇ.ఎచ్. కార్ వర్ణిస్తాడు. కాలమూ స్థలమూ నిరంతరంగా మారే ఆ ఊరేగింపులో వాస్తవికత, సంఘటనలకూ మనుషులకూ మధ్య అనేక పార్శ్వాల సంబంధంలోనూ, వివిధ, తరాల, అంతరాలతోనూ పెనవేసుకుని ఉంటుంది. ఎవరి దృష్టినుంచి,ఎవరు చెప్పినది, ఎప్పుడు చెప్పినది- వాస్తవం?

విజేతలు రాసినదే చరిత్రగా చెలామణీ అవుతుందని చెబుతుంటారు. ఒక యుద్ధమో, ఒక తీవ్ర సంఘర్షణ జరిగిన తరువాత – అందులో గెలుపొందినవారు, చరిత్రను తమకు అనుకూలంగా వ్యాఖ్యానిస్తారని అర్థం. ఇందుకు ప్రత్యేకంగా ఉదాహరణలు ఇవ్వనక్కరలేదు. ఎవరి అధికారానికైనా చరిత్ర ఒక భావజాల సాధనం. వర్తమానంలోని శక్తుల, ప్రయోజనాల అమరికకు అనుగుణంగా అది గతాన్ని వ్యాఖ్యానించి, ఉనికిలోని పాలనను అది సహేతుకం చేస్తుంది. ముగిసిపోయిన సంఘర్షణల విషయంలోనే కాదు, కొనసాగు

తున్న ప్రయోజనాల ఘర్షణ విషయంలోనూ ప్రాబల్య శక్తులు గతానికి కొత్త వ్యాఖ్యానాలు జతచేస్తారు. నిరంతరంగా ప్రజల ఆలోచనలు తమ ప్రయోజనాలకు అనుకూలంగా సాగడానికి వీలుగా భావజాల శక్తులు ప్రయత్నం చేస్తూనే ఉంటాయి. భావాల రంగంలో జరిగే పోరాటంలో చరిత్రకు సంబంధించిన చర్చ, స్పర్ధ, వాదం ముఖ్యమైన భాగాలు.

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్‌వారు విజేతలైన మాట నిజమే కానీ, ఆ విజయం వారికి తిరుగులేని నిశ్చింతను, అదుపును ఇవ్వలేకపోయింది. వారు కూడా పరిపాలనాపరమైన మార్పులు చేసుకోవలసి వచ్చింది. కంపెనీ పాలనను ప్రత్యక్షపాలనగా మార్చుకున్నారు. ఇకముందు దేశీయ రాజ్యాలను బ్రిటిష్ రాజ్యంలో కలుపుకోబోమని చెప్పవలసి వచ్చింది. అన్నిటికి మించి, తమ సామ్రాజ్యానికి వ్యతిరేకత అనివార్యమని, ఆ వ్యతిరేకతను తమ కనుసన్నలలోనే ఉంచుకోకపోతే భవిష్యత్తు కష్టతరమని గుర్తించవలసి వచ్చింది. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అంత తీవ్రంగా సాగడానికి సానుకూలంగా పని చేసిన అంశం– హిందూ ముస్లిం ఐక్యత అన్నది బ్రిటిష్వారు గ్రహించ గలిగారు. దాన్ని భగ్నం చేయడం ముమ్ముందు పరిపాలనకు అవసరమన్న గ్రహింపు వారికి కలిగింది. ఈ నేపథ్యంలోనే వలసవాద చరిత్రకారులు అనేక నూతన ఆవిష్కరణలు, అన్వయాలు చేశారు.

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం అనేక నూతన శాస్త్రాలకు తెరలేపింది. వలసవాదమే లేకపోతే, ఆధునిక వైద్యశాస్త్రం, సామాజిక–మానవీయ శాస్త్రాలు అవతరించేవే కావు. వలసవాద లాభాలు బ్రిటిష్ పారిశ్రామిక వికాసానికి దోహదం చేసినట్టే, విద్యా పరిశోధనారంగాలకూ ఇంధనంగా పనిచేశాయి. తమ అధీనంలోని దేశాలలో, ముఖ్యంగా మధ్యప్రాచ్య, ప్రాచ్య దేశాలలో పురాతత్వ పరిశోధనలు మానవనాగరికతల చరిత్రలను ఆవిష్కరించాయి. తమ వలసల ఘనచరిత్రను చూసి మురిసిపోయిన కొత్తతరం ఇంగ్లీషు విద్యావంతులు, చరిత్ర తొలి యుగాల నాటి వైభవాలను అతిశయంతో వర్ణించారు. భారతదేశంలో ఒకనాటి స్వర్ణ యుగాలు ధ్వంసమైపోయి, పరాధీనత ఏర్పడడానికి కారణం తాము కాదని, మధ్యయుగాల నాటి ముస్లిముల దండయాత్రలు, పరిపాలన అని ఆ చరిత్రలు సూచిస్తూ వచ్చాయి. 1857 కు ముందే ప్రతిఘటన కోసం నిర్మితమవుతూ వచ్చిన ప్రాథమిక స్థాయి భారత జాతీయత, బ్రిటిష్ పాలనలో కొత్త భావజాల పునాదులను వెదుక్కొనవలసి వచ్చింది. విశాలమైన భూభాగంలో ప్రత్యక్ష బ్రిటిష్ పాలన, కమ్యూనికేషన్ల–రవాణామార్గాల విస్తరణ, నూతన రెవెన్యూ విధానం, విద్యావకాశాలు, సంఘంలో సంస్కారభావాలు– ఇవన్నీ కలిసి ఆధునిక భారత జాతీయతకు పునాదులు వేశాయి. ఆ జాతీయతకు భావజాల పునాదిగా పనికివచ్చే చరిత్రను పాశ్చాత్య చరిత్రకారులు, పరిశోధకులే సమకూర్చారు. ఉదాత్తమైన అత్యున్నతమైన పురాతన నాగరికతను అనాగరికమైన దండయాత్రలు ధ్వంసం చేసి, భారతదేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తే, ఆ దుస్థితి బ్రిటిష్ వారి పాలనకు దారి తీసిందని, భారతీయ పురావైభవాన్ని గౌరవించే ఆంగ్లేయులు ఆధునిక సంస్కార యుగంలోకి జాతిని నడిపిస్తున్నారని – ఒక సూత్రీకరణ

అప్పుడప్పుడే తలెత్తుతున్న నూతన ప్రాతినిధ్య వర్గాన్ని ఆకట్టుకున్నది. భారతదేశ చరిత్రను వారు – హిందూ మహాయుగము, మహమ్మదీయ మహాయుగము, బ్రిటిష్ మహాయుగము–గా చూడడానికి అదే కారణం. ఈ దృక్పథంలో, బ్రిటిష్ వలస పాలన, భారతదేశంలో సాగించిన ధ్వంసరచనకు తావు లేదు.

నూతన జాతీయభావాలకు చరిత్ర నుంచి సమకూర్చుకున్న దినుసులు ఉపకరించడం కేవలం భారతదేశంలో మాత్రమే జరిగినది కాదు. ఆధునిక జాతి రాజ్యాల అవతరణ వెల్లువగా సాగిన ఐరోపాలో కూడా మనుషుల పునరేకీకరణ భాష, సంస్కృతి మొదలైన ప్రాతిపదికలపైనే కాక, చారిత్రక జ్ఞాపకాల ఆధారంగా కూడా జరిగింది. ఆధునిక జాతి తనలో తాను ఐక్యతను నిర్మించుకోవడానికి ఒక ఉమ్మడి శత్రువును లేదా పరాయి అస్తిత్వాన్ని నిర్వచిస్తుంది కూడా. ఐరోపా జనసంఖ్య, అందులోని వివిధ భాషల తెగల అమరిక మొదలైన అంశాలు అక్కడ జాతిరాజ్యాల అవతరణను సహజం చేయవచ్చును కానీ, భారతదేశంలో అది సహజప్రక్రియ కాదు. ఇక్కడ భాషలు వేలు, భాషా కుటుంబాలు వేలు. కులాలు, మతాలు, తెగలు అన్నీ అసంఖ్యాకాలు. ప్రతి ఒక్క సమూహానికి వేర్వేరు సామాజిక జ్ఞాపకం, సాంస్కృతిక జ్ఞాపకం, ప్రాదేశికమైన ప్రత్యేకతలు కూడా అనేకం. ఇంతటి మిశ్రమసమాజాన్ని ఒక ఏకశిల వంటి జాతిగా తీర్చిదిద్దడం సాధ్యమా? వలస పాలన అనే శత్రువుకు వ్యతిరేకంగా అందరూ ఒక్కటవుతారా? ప్రజలలోనే ఒక శ్రేణిని పరాయిగా నిర్వచించవలసిన అవసరం ఉన్నదా? రాజకీయంగా బ్రిటిష్ పాలనను, సాంస్కృతికంగా మధ్యయుగాలనాటి మొగల్ వారసత్వాన్ని ఎదిరించాలా? మొగలుల ప్రతినిధులుగా దేశీయ ముస్లిములను పరిగణిస్తే, వారికి వ్యతిరేకంగా తక్కినవారంతా ఏకమవుతారా? ఈ ఆలోచనలన్నీ ఎవరో కూర్చుని చేసినవి కాకపోవచ్చును. బ్రిటిష్ వారికి కూడా విభజించి పాలించే తమ ప్రాజెక్టుపై ఇంతటి స్పష్టత ఉండి ఉండకపోవచ్చును. 20వ శతాబ్ది ప్రథమార్థంలోనూ ఆ తరువాత హైందవ మతతత్వశక్తులుగా ప్రస్ఫుటంగా ముద్రపడినవారి రాతలలో, మాటలలో పై ఉద్దేశ్యాలను గమనించడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, పెద్దగా మతతత్వవాదులు కాని సంస్కారులలోను, సామాన్యులలోను కూడా సాంస్కృతిక జాతీయవాదం, దాని చిహ్నాలు సులువుగానే జీర్ణం అయ్యాయి. తాంతియా తోపే, ఝాన్సీలక్ష్మీబాయి, నానా సాహెబ్ వంటి వారి కంటె శివాజీ, రాణాప్రతాప్ వంటి వారే స్ఫూర్తినిచ్చే సంకేతాలయ్యారు.

కొత్తగా వెల్లడి అవుతూ వస్తున్న చరిత్ర ఆధారాలను, విశేషాలను అన్వయించడంలో బ్రిటిష్ వారి చరిత్ర ప్రాజెక్టు ప్రభావంలో ఉన్న పండితులు ఎంతో ప్రతిభ చూపారు. చంద్రగుప్తుడి కంటె, అశోకుడి కంటె, సముద్రగుప్తుడి కంటె, హర్షుడి కంటె పురుషోత్తముడు, పృథ్వీరాజ్ వంటి వారికి చరిత్ర ఎందుకు ప్రాధాన్యం ఇచ్చింది? ఘజనీ, ఘోరీ వంటి బందిపోటు దురాక్రమణదారులను ఎందుకు భారతీయ చరిత్ర అమితంగా పట్టించుకున్నది?

ఈ ప్రశ్నలకు సమాధానం తెలిస్తే, ఔరంగజేబ్ ఎందువల్ల భారతీయ మధ్యయుగాల చరిత్రలో అతిపెద్ద ప్రతినాయకుడయ్యాడో అర్థం అవుతుంది. ఘజనీ ఘోరీల తరువాత

భారతీయ మతతత్వ జాతీయవాదులకు పనికివచ్చిన చిహ్నం బాబర్, వారి ప్రమాణాల ప్రకారమే చూసినప్పటికీ, ఔరంగజేబ్ కంటె బాబర్ చిన్న సంకేతమే. కానీ, రామజన్మభూమి వివాదం రీత్యా బాబర్ బోనులో నిలిచాడు. అంతే కాదు, అతను మొగల్ సామ్రాజ్యపు స్థాపకుడు అన్నది కూడా మరచిపోలేము. అయోధ్య వివాదం ఇంకా సజీవంగానే ఉన్నప్పటికీ, ప్రతినాయకుడిగా బాబర్ పేరు నలిగిపోయి, అరిగిపోయినందువల్ల మరో తీవ్రమైన సంకేతం కావలసి వచ్చింది. అదే ఔరంగజేబ్. న్యూఢిల్లీలో ఔరంగజేబ్ రోడ్ పేరుమార్చడం ఆరంభం మాత్రమే. అతను కేంద్రంగా జరిగే చాలా వివాదాల్ని ముున్ముందు చూడవలసి రావచ్చును.

రాచరిక వ్యవస్థలో పాలకులలో మంచిచెడ్డలను ఎంచడం కష్టమే. వ్యవస్థ పరిధిలో సాపేక్షంగా కొన్ని సుగుణాలను చూడవచ్చు. సామ్రాజ్యవ్యవస్థ ఇంకా స్థిరపడని, గుణ ఆదర్శాలు పూర్తిగా అంతరించని కాలంలో, బౌద్ధం ప్రభావంలో అశోకుడు భిన్నమయిన పాలకుడిగా కనిపిస్తాడు. అతను కూడా తొలిదశలో నిర్దాక్షిణ్యమైన యుద్ధాలు చేశాడు. అతనిలో పశ్చాతాపం కలిగింది. అంతే కాదు, ఆ కాలానికి అసాధ్యం అనిపించే అనేక ఆదర్శాల గురించి అతను మాట్లాడాడు. జాతీయోద్యమంలో సన్నగా అయినా ఒక లౌకికవాద పాయ ఉండడం వల్లనే అశోకుడి చక్రం, మూడు సింహాలు స్వతంత్ర భారత చిహ్నాలుగా స్వీకృతమయ్యాయి. భారతదేశంలోనే కాదు, ప్రపంచంలోనే అతి అరుదైన గొప్ప పాలకుడు, మానవుడు అశోకుడు. అతనితో పోలిక తేలేము కానీ, చరిత్రలో అక్కడక్కడా మానవీయత చూపిన పాలకులు కనిపిస్తారు. కానీ, శాస్త్రాల ప్రకారం, రాజులు చూపించవలసింది మానవీయత కాదు, పరాక్రమాన్ని, నిర్దాక్షిణ్యతను, వర్ణాశ్రమ ధర్మ నిబద్ధతను మాత్రమే.

కుల భేదాలను పాటించేట్టు చూడడం, ఖజానాకు పన్నులు కట్టేట్టు చూడడం, కొత్త కొత్త రాజ్యాలకు విస్తరించడానికి యుద్ధాలు చేస్తూ ఉండడం, లోపలి-బయటి శత్రువుల నుంచి నిరంతరం కాపాడుకోవడం, ప్రజల నుంచి పొందిన ఆదాయాన్ని విలాసాలకు, మాన్యాలకు, కానుకలకు ధారపోయడం- ఇవన్నీ రాజులు చేయవలసిందే. వాటిలో సమర్థత చూపనివారు బలహీనుడి కిందనే లెక్క. ముస్లిమ్ పాలకులయినా, అందుకు భిన్నంగా చేసింది తక్కువ. భారత సమాజంలోని అగ్రవర్గాలతో సఖ్యత ఏర్పరచుకుని మాత్రమే మొగలులు సుదీర్ఘకాలం పాలన చేయగలిగారు. కులవ్యవస్థ మొగలుల కాలంలో బలహీనపడిందనడానికి ఏ ఆధారమూ లేదు. అలాగే, భారతదేశంపై అంతకాలం ఆధిపత్యం కలిగిన ఇస్లామిక్ పాలనలో మతాంతరీకరణలు నామమాత్రంగా మాత్రమే జరగడం కూడా యధాతథస్థితిని వారు దెబ్బతీయలేదనడానికి ఉదాహరణ. ఏ మతస్థులైనా, విస్తరణ తప్ప మరో ఆదర్శం ఉండే అవకాశమే ఆ నాటి పాలకులకు లేదు. భారతదేశం అనే దేశాన్ని రక్షించడం కోసం, పరాయి ఆక్రమణదారులను నిరోధించడం కోసం, స్వధర్మపోషణ కోసం పాలన చేసినవారెవరూ ఉండే అవకాశమే లేదు. 19-20 శతాబ్దులు వచ్చే దాకా భారతజాతి అన్న భావనే అవతరించనప్పుడు,

పురుషోత్తముడిలో అయినా, పృథ్వీరాజ్‌లో అయినా శౌర్యసాహసాలే తప్ప, దేశభక్తిని చూడడం పొరపాటే అవుతుంది. ఛత్రపతి శివాజీ అయినా, మొగల్ సామ్రాజ్య విస్తరణను ఎదుర్కొని, మరాఠా సామ్రాజాన్ని స్థాపించాలనుకున్నాడు తప్ప అందులో అంతకు మించిన ఆధునిక ఆదర్శాన్ని చూడడం అచారిత్రకం అవుతుంది. ఔరంగజేబ్ గోలకొండ, బీజాపూర్ల మీదా దండెత్తాడు, మరాఠాలతోనూ యుద్ధం చేశాడు. మరాఠాలు మొగలులనూ ఎదుర్కొన్నారు, దేశంలోని అనేక హిందూ మతపాలకుల రాజ్యాలపైనా దండయాత్రలు చేశారు. ఔరంగజేబ్ కొలువులోనూ, సేనలోనూ రాజపుత్రులూ, ఇతర హిందువులూ అధికసంఖ్యలో ఉన్నారు. శివాజీ సేనలోనూ ముస్లిముల సంఖ్య తక్కువేమీ కాదు. మొగలులకు వ్యతిరేకంగా శివాజీ – గోలకొండ సుల్తానులు జట్టు కూడా కట్టారు. అక్కడ ఉన్నదంతా రాజతంత్రమే మత తంత్రం కాదు. ఔరంగజేబ్ దుర్మార్గాలలో ఒకటిగా చెప్పే 'జిజియా' పన్నులో హిందువులలో బ్రాహ్మణులకు, సాధువులకు, స్త్రీలకు, వృద్ధులకు, పిల్లలకు మినహాయింపు ఉండేది. మరాఠాలు ముస్లిములపై "జకాత్ పన్ను" వేశారన్నది పెద్దగా ప్రచారంలోకి రాలేదు. శివాజీ పట్టాభిషేకానికి బ్రాహ్మణులు విముఖత చూపారన్నది మతతత్వ జాతీయవాదులు ఎందుకు విస్మరిస్తారో తెలియదు.

హిందూత్వ రాజకీయాలు ప్రాబల్యంలోకి వచ్చిన వర్తమానంలో, చరిత్ర వక్రీకరణ, పాక్షిక అన్వయాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరగవలసింది, ఔరంగజేబ్ వంటి వారు సకలగుణసంపన్నులని నిర్ధారించడం కాదు. చరిత్రను నిష్పాక్షికంగా ఎట్లా చూడాలో చెప్పగలిగే వాదనలు అవసరం. ఔరంగజేబ్ హయాంలోనే భారతదేశంలోని అత్యధిక భాగం ఒక పాలనలోకి వచ్చి ఉండవచ్చు. ఆ అర్థంలో ఆయన "అఖండ భారత నిర్మాత కావచ్చును కూడా. అయితే, చిన్న రాజ్యాలను తుడిచిపెట్టి అఖండ భారతాన్ని తీర్చిదిద్దడం చాణక్యుడు చేసినా మరొకరు చేసినా అదేమంత పెద్ద ఆదర్శం కాదు.

అబుల్ ఫౌజాన్ రాసిన ఈ పుస్తకం **'ఔరంగజేబ్–చరిత్రకెక్కని చారిత్రక కోణాలు'** మనముందున్న అనేక చారిత్రక అవాస్తవాలను పూర్వపక్షం చేస్తుంది. చరిత్రను సవ్యంగా చూడడానికి కావలసిన సామగ్రిని ఇస్తుంది. ఈ రచయిత పాండిత్యం, పరిశ్రమ నాకు ఆశ్చర్యం కలిగించాయి. ఆయన నిబద్ధత, రచనా శైలి అపూర్వం అనిపించాయి. అయినా చరిత్ర విద్యార్థిగా నాకు కొన్ని అసంతృప్తులున్నాయి. ఔరంగజేబ్‌లో ఉన్నాయని ప్రచారంలో ఉన్న అనేక ప్రతికూల గుణాలన్నిటినీ నిరాకరించి, ఆయనను ఉత్తముడిగా చూపడానికి రచయిత ప్రయత్నించడం అనవసరమేమో అనిపించింది. ఏ పాలకుడిలో అయినా ఉండగలిగే, ఉండే అవలక్షణాలు ఔరంగజేబ్‌లో కూడా ఉండవచ్చు. వాటిని కాదనవలసిన పనిలేదు. తాను గడపిన జీవితం గురించి ఔరంగజేబ్ తన చరమాంకంలో అసంతృప్తుడై ఉన్నాడని చెబుతారు. ఆకాశానికీ తనకూ మధ్య ఏ గోపురమూ అక్కరలేదని చెబుతూ నేలబారుగా ఆయన నిర్మింపజేసుకున్న సమాధిని నేను స్వయంగా సందర్శించాను. ఖుల్తాబాద్‌లోని ఔరంగజేబ్ సమాధిని, ఆ పక్కనే ఉన్న ఇద్దరు మహమ్మదీయ సాధువుల

దర్గాలను చూస్తే, ఒక విశాల సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తి జీవితంలోని వైరుధ్యాలు స్ఫురిస్తాయి. జీవిత సాఫల్య సార్ధకతల గురించి తాత్వికంగా ఆలోచించగలగడం ఔరంగజేబ్ వ్యక్తిత్వంలోని ఒక సుగుణం. ఆయన వ్యక్తిగత నిరాడంబరత, సూఫీ తత్వాన్ని ఆరాధించడం – ఇవన్నీ గొప్ప విషయాలే. జీవితంలో అత్యధికభాగం రణరంగంలో గడపడం, యుద్ధ పిపాస కృష్ణదేవరాయలలో ఉన్నా, ఔరంగజేబ్‌లో ఉన్నా ఉన్నతమైన విలువలేమీ కావు.

అనేక గుడిగోపురాలను ధ్వంసం చేసిన పేరున్న ఔరంగజేబ్, అదే కాలంలో అనేక దేవాలయాలను నిర్మించాడు. ఉన్నవాటికి ఇనాములు ఇచ్చాడు. ఆయన చేసిన ధ్వంసరచన రాజకీయమైనదే తప్ప, మత ప్రాతిపదికపై జరిగినది కాదని అనేక మంది సెక్యులర్ చరిత్రకారులు వ్యాఖ్యానించారు. అబుల్ ఫౌజాన్ కూడా ఆ వాదనను సోదాహరణంగా నిరూపించారు. నాడు జరిగిన చర్యలను నాటి పరిస్థితుల మధ్య నుంచి వ్యాఖ్యానించడమే సబబు.

ఔరంగజేబ్ ఆస్థానంలో అనేకమంది రాజపుత్రులు ఉండడం, మన్సబ్ దారులలో అనేమంది హిందువులు ఉండడం అబుల్ ఫౌజాన్ సుదీర్ఘంగా అందించిన వివరాల వల్ల తెలుస్తుంది. అన్ని యుద్ధాలు చేయడం, అంత విశాలమైన దేశాన్ని పాలించడం పాలిత సమాజంతో సఖ్యంగా ఉండకుండా సాధ్యం కాదని పాఠకులకు కూడా బోధపడుతుంది. ఔరంగజేబ్ మత దృష్టిని, షియాలపై, హిందూమతంపై ఆయన వైఖరులను వివరించే ఎన్నో ఆధారాలను, ఉటంకింపులను రచయిత పూసగుచ్చారు. ఔరంగజేబ్‌పై ఉన్న ప్రతి దురభిప్రాయాన్ని ఖండించడానికి అబుల్ ఫౌజాన్ శాయశక్తులా ప్రయత్నించారు. అయితే, ఔరంగజేబ్‌లో కూడా ప్రతి పాలకుడికి ఉండే దుర్లక్షణాలు, ప్రతి సామ్రాజ్యాధిపతిలో ఉండే నియంతృత్వ పోకడలు ఉండే ఉంటాయని పదే పదే పేర్కొంటూ, వాటిని మినహాయించి, అదనంగా ఆయన మీద వచ్చిన అపప్రథలను మాత్రమే ఖండించి ఉంటే ఈ పుస్తకానికి మరింత ఆమోదయోగ్యత వచ్చి ఉండేది. చరిత్ర వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని ఈ మాట అనడం లేదు, ఇంతకాలం ఒకరకమైన ప్రచారానికి లోబడిన పాఠకులకు అబుల్ ఫౌజాన్ పుస్తకాన్ని స్వీకరించడంలో ఉండే పరిమితులను దృష్టిలో పెట్టుకుని అంటున్నాను.

ఈ పుస్తకాన్ని ఆసక్తిగా చదివేవారున్నట్టే, తీవ్రంగా వ్యతిరేకించేవారూ ఉంటారు. ఔరంగజేబ్ గురించి మంచిగా రాసే సాహసమా అని విస్తుపోయేవారు కూడా, ఈయన చెప్పే వివరాలలో, చేసే విశ్లేషణలలో ఏదో వాస్తవం ఉన్నదని గుర్తిస్తారు. అదే ఈ పుస్తకం బలం. ఔరంగజేబ్ మీద చెలామణిలో ఉన్న అభిప్రాయాలు వాస్తవాలపై ఆధారపడినవి కావని, వర్తమాన రాజకీయ అవసరాల కోసం రూపొందినవని కొందరైనా గ్రహిస్తారు. ఒక రచయితకు అంతకు మించి కావలసిన ప్రయోజనం ఏముంటుంది?

హైదరాబాద్ **కె. శ్రీనివాస్**

# ఉపోద్ఘాతం

భారత దేశ చరిత్రలో ఔరంగజేబ్ అంత వివాదాస్పద వ్యక్తిత్వం మరొకరు లేడంటే అతిశయోక్తి కాదేమో. విచిత్రమేమిటంటే, భారతదేశంలో నివసించే రెండు అతి పెద్ద వర్గాల్లో ఒక వర్గం ఇతన్ని అమితంగా అభిమానించి ఒక ఐడియల్ పరిపాలకునిగా భావిస్తుంటే, వేరొక వర్గం అతన్ని అమితంగా దూషిస్తుంది, నిరసిస్తుంది. తిట్టిపోస్తుంది. ఒకే దేశంలో ఉంటున్న ఈ రెండు వర్గాల భావనల్లో ఒకే వ్యక్తి గురించి ఇంతటి భిన్నత్వం ఆశ్చర్యం కలిగించడం లేదూ? దీనికి ఏదో ఒక గట్టి కారణం ఉండితీరాలి. ఔరంగజేబ్ ఎలాంటివాడు, అతనే పరిస్థితుల్లో సింహాసనాన్ని అధిష్టించాడు. అతని గుణగణాలేమిటి, పాలితుల పట్ల అతని వ్యవహారం ఎలా ఉండేది, కుల మతాలకు సంబంధించి, దేశంలోని వివిధ వర్గాలకు సంబంధించి అతని భావనలు, విశ్వాసాలు ఎలా ఉండేవి, సింహాసనాన్ని, రాజ్యాధికారాన్ని అతనే దృష్టితో చూసేవాడు; దేశం, జాతి పట్ల అతని భావనలేమిటి? ఇత్యాది విషయాల్ని ఈ రెండు వర్గాలు రెండు కోణాల్లో అధ్యయనం చేశాయి. ఒక వర్గమేమో పచ్చటి కళ్ళద్దాలతో అతన్ని చూసినప్పుడు అంతా పచ్చదనమే కనిపించింది, వేరొక వర్గం ఎర్రటి కళ్ళద్దాలు తొడిగి చూస్తే అంతా ఎరుపుగానే కనబడసాగింది. వీరిద్దరూ చూసింది, చెప్పేది తప్పుకాదు, తప్పంతా ఆ రంగు అద్దాల్లోనే ఉంది. ఎప్పటివరకైతే ఆ అద్దాలు తొలగించి, సహజ దృష్టితో చూడడం జరుగదో, వస్తువులు, వ్యక్తులు కూడా సహజరూపంలో, స్వాభావిక రూపంలో కనిపించరు.

ఔరంగజేబ్ గురించి తెలుసుకోవడం కాస్త కష్టమైనప్పటికీ అసంభవమేమీ కాదు. అతని కాలం నాటి ప్రామాణికమైన చరిత్ర గ్రంథాలు ఉన్నాయి. ఈ చరిత్రలు రాసిన వారిలో సున్నీలు, షియాలు, హిందువులు, ముస్లింలూ అందరూ అన్ని వర్గాల వారున్నారు. కొన్ని దర్బారు చరిత్రకారులు వ్రాసిన గ్రంథాలయితే మరికొన్ని దర్బారుకు సంబంధం లేకుండా, దూరంగా ఉండి, రహస్యంగా వ్రాసుకున్నవి కూడా ఉన్నాయి. మరికొన్నైతే ఔరంగజేబ్ మరణించిన తరువాత వెలువడిన చరిత్రలున్నాయి. ఈ విధంగా ఔరంగజేబ్ గురించి నిష్పక్షపాతంగా, న్యాయంగా, నిశిత దృష్టితో అధ్యయనం చేసే సర్వ అవకాశాలున్నాయి. ఔరంగజేబ్ అభిమానులు, వ్యతిరేకులు ఇద్దరి వాదనల్ని ప్రక్కకుపెట్టి, అతని సమకాలీన చరిత్ర గ్రంథాల ఆధారంగా నిష్పక్షపాతంగా అతన్ని అధ్యయనం చేయడం ఎంతో అవసరం. అప్పుడే ఔరంగజేబ్ ఎలాంటివాడనే విషయం బయటపడుతుంది.

చరిత్రకారుల న్యాయస్థానంలో గడిచిన ఒక వ్యక్తి స్వయంగా వచ్చి తన పక్షాన్ని వినిపించుకోవడమనేది సర్వసామాన్యంగా జరుగని విషయం. కాని ఔరంగజేబ్‌కు సంబంధించి నంతవరకు అతని సమకాలీన చరిత్ర గ్రంథాల్ని ప్రక్కకు నెట్టినా కూడా, స్వయంగా ఔరంగజేబ్ తన తండ్రికి, సోదర సోదరీమణులకు, ప్రధానమంత్రి, ఇతర మంత్రులకు రాసిన లేఖలు నేటికీ ఉన్నాయి. ఔరంగజేబ్ లేకపోయినప్పటికీ అతని వాదాన్ని అవి వినిపిస్తున్నాయి. అతని

పాపపుణ్యాల్ని నిరూపిస్తున్నాయి. అయినా వాటిపై దృష్టిసారించకుండా, ఇంకా వాటికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం ఒక నిష్పక్షపాతి అయిన చరిత్రకారుడు చేయవలసిన పనేనంటారా? దీన్ని ఒక ఉదాహరణతో మీకు వివరిస్తాము.

షాజహాన్‌కు వ్యతిరేకంగా తిరుగబడడానికి, దారాషికూహ్‌ను ఎదుర్కోవడానికి రాకుమారుడు మురాద్‌ను ఔరంగజేబే ప్రోత్సహించాడని దాదాపు అందరు యూరోపియన్ చరిత్రకారులు పేర్కొన్నారు. అయితే ఇది పచ్చి అబద్ధమని సమకాలీన చరిత్రలే కాకుండా, ఔరంగజేబ్ మరియు మురాద్‌లు, పరస్పరం వ్రాసుకున్న లేఖల ద్వారా లేశమైనంత అనుమానం కూడా లేకుండా తేటతెల్లమైపోతుంది.

సందర్భం వచ్చినప్పుడు ఆ లేఖల్ని మీరు ఈ గ్రంథంలో చదువుతారు. ఒక వ్యక్తిని కావాలని, సాక్ష్యాధారాలకు వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగా అపకీర్తి పాల్జేయాలని కృతనిశ్చయం చేసుకున్నప్పుడు, ఇంకా అప్పటి బ్రిటీష్ ప్రభుత్వమే ఆశీర్వదించి రంగంలోకి దింపినప్పుడు అతను అపకీర్తి పాలు గాకుండా ఎలా ఉండగలుగుతాడు? అలా వాస్తవాలను మరుగుపరిచి అతన్ని అపకీర్తిపాల్జేసి, అతన్ని వికృత రూపంలో ప్రదర్శించిన కారణంగానే జనబాహుళ్యం అతన్ని అదే రూపంలో చూడడానికి అలవాటుపడింది.

అలా ప్రదర్శించడానికి ఒక ప్రబల కారణముంది. ఒక నిర్దిష్టపథకం ఉంది. ఇలా కావాలనే, ఉద్దేశపూర్వకంగానే చేయడం జరిగింది. ఇదో అయాచితంగా జరిగిన పని ఎంత మాత్రం కాదు. దీని పూర్వపరాలు ఇలా ఉన్నాయి.

1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం (దీన్నే బ్రిటీషర్లు సిపాయిల తిరుగుబాటుగా పేర్కొన్నారు) విఫలమై, దాన్ని కఠినంగా అణచివేసిన తరువాత, ఇందులో అత్యధికంగా ముస్లింలే అందులోనూ ధార్మిక గురువులు (ఉలమాలు) వందల, వేల సంఖ్యలో ఆంగ్లేయుల క్రోధానికి గురిఅయి అసువులు బాసారంటే "నిజమా?" అంటూ నేడు మనం నోళ్ళువెళ్ళబెడతాం. కాని ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. ఈ విషయాన్ని మనమిక్కడ మరువరాదు. అయితే ఈ విప్లవం ఈస్ట్ ఇండియా కంపెనీనే గాక బ్రిటీష్ సింహాసనాన్ని కూడా కుదిపివేసింది. అందుకోసమని ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదనే దృష్టితో పరి పరి విధాలుగా ఆలోచనలు మొదలయ్యాయి. ఈ విప్లవంలో హిందూ – ముస్లిం అనే ఈ రెండు వర్గాలు భుజాలకు భుజాలు కలిపి ఐక్యంగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడాయి కనుక ఈ రెండు పెద్ద వర్గాల్ని విడదీయడానికి, విభజించడానికి, ఇంకెప్పుడూ ఈ రెండు వర్గాలు దగ్గరికి రాకుండా, దగ్గరికి రావడమే కాదు, ఒకరంటే వేరొకరికి గాఢమైన ద్వేషం ఏర్పడడానికి రకరకాల ప్రణాళికలు రూపొందించబడ్డాయి. అందులో భారత చరిత్ర ఒకటి. ఈ చరిత్రనే వక్రీకరించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆంగ్లేయులకు పూర్వం భారతీయ విద్యావిధానంలో ముస్లింలకు దీనియాత్ (సంక్షిప్త ధర్మశాస్త్రం) హిందువులకు నీతిశాస్త్రం లేక నైతిక శాస్త్రం కంపల్‌సరి (అనివార్యమైన) సబ్జెక్టుగా బోధించబడేది. (కురువృద్ధుల నడిగి దీన్ని ధృవపరచుకోండి). కాని ఆ సబ్జెక్టును

తీసివేసి దాని స్థానంలో భారత చరిత్రను ప్రవేశపెట్టి దాన్ని అనివార్య సబ్జెక్టుగా నిర్ణయించారు. అంతవరకు పర్షియన్ భాషలో నున్న చరిత్ర గ్రంథాల్ని ఇంగ్లీష్‌లోకి అనువదించడం మొదలయింది. ఇక్కడి నుండే చరిత్ర వక్రీకరణ ప్రారంభమయింది. ఏలియట్, డాసన్, అల్‌ఫిన్‌స్టన్, లేన్‌పోల్ ఇంకా చరిత్రకారుల ఓ సైన్యమే రంగంలోకి దించబడింది. ఆంగ్లేయుల్నే కాకుండా కొందరు భారతీయ చరిత్రకారుల్ని కూడా మచ్చిక చేసుకోవడం జరిగింది. బి.ఎ., ఎం.ఎ. లాంటి ఉన్నత కోర్సుల్లోనే కాకుండా ప్రైమరీ, సెకండరీ లాంటి చిన్న క్లాసులకు కూడా చరిత్ర గ్రంథాల్ని రూపొందించడం జరిగింది. పర్షియన్ నుండి ఆంగ్లంలోకి, ప్రాంతీయ భాషల్లోకి అనువదిస్తున్నప్పుడు ఇరువర్గాల్లో వైషమ్యాల్ని రేకెత్తించే అంశాలను ఎత్తిచూపడం, లేనిచోట్ల అసత్యాల్ని, అవాస్తవాలను జొప్పించడం – ఈవిధంగా ఒక నిర్దిష్ట పథకం ప్రకారం చరిత్ర గ్రంథాల్ని రూపొందించడం జరిగింది. చదువుకుంటున్న పిల్లల లేత మనోమస్తిష్కాల్ని ఒక ప్రత్యేక దిశలో మలచడానికి భారత చరిత్రను కంపల్‌సరి సబ్జెక్టుగా చేశారు. అందులోనూ ఔరంగజేబ్‌పై ఒక ప్రశ్న తప్పకుండా ఉండేది. ఔరంగజేబ్‌పై వచ్చిన ప్రశ్నకు మాత్రం తప్పనిసరిగా అందరూ సమాధానమివ్వాల్సిందేనని కట్టడిచేయబడేది. మిగిలిన ప్రశ్నల్లో మాత్రం ఎంపిక స్వాతంత్ర్యముండేది.[1] **(పాదసూచికలు పుస్తకం చివరలో అధ్యాయాల వారిగా ఇవ్వబడ్డాయి.)**

ఈ విధమైన కుయుక్తి ద్వారా లేత మనసులపై పడే ప్రభావమెలాంటిదో అవలీలగా ఊహించవచ్చు. దీన్ని గమనించిన ఆ కాలపు ఒక డిప్యూటి కమీషనర్, విద్వాంసి, ఇతిహాసికుడు మౌలానా అబ్దుల్ హలీం షరర్ "దిల్‌గుదాజ్" అనే పత్రిక (1926, ఫిబ్రవరి) లో ఈ పరిస్థితిని ఇలా విశ్లేషించాడు. "కలహాలకు, సంక్షోభాలకు అసలు మూలం మన పాఠశాలల నుండి కాలేజీల నుండి ప్రారంభమవుతుంది.... మన ప్రాచీన విద్యావిధానంలో ఆధ్యాత్మికత, నిగర్వము, అణకువ, విధేయత మరియు అన్యోన్యతకు సంబంధించిన పాఠాలు బోధించబడేవి. వాటి ఫలితాలు కూడా (సమాజంలో) స్పష్టంగా కనబడేవి. అయితే ఇలాంటి పుస్తకాల్ని విద్యాశాఖవారు సిలబస్ నుండి తొలగించేశారు. భారతదేశంలో వివిధ ధర్మాలున్నాయని, తూర్పు దేశాల్లో నీతి నడవడికలు ధర్మంలోని ఒక భాగంగానే ఉన్నాయని, అందుకని ప్రభుత్వం ఇలాంటి విద్యను గరపజాలదని దీనికో సాకును చూపారు...." ఆయనే ఇంకా ఇలా పేర్కొన్నారు:

"దీనికోసమనే ప్రభుత్వ సిలబస్‌లో నీతిశాస్త్ర పుస్తకాలకు బదులు చరిత్ర పుస్తకాల్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఇక ఇప్పుడు స్వల్ప కాలంలోనే భారతీయుల్లో విభేదాల్ని సృష్టించడానికి చరిత్రకన్నా మంచి సాధనం వేరొకటి లేదని అనుభవ పూర్వకంగా నిరూపితమయింది. ..... ఎప్పటివరకైతే చరిత్రను ఇదే తరహాలో చదివించడం జరుగుతుందో, భారతదేశంలో ఎలాంటి సంస్కరణను (మంచిని) ఆశించలేము.... రాబోయే కాలం ఇంతకన్నా క్లిష్టంగానూ, ప్రమాదకరంగానూ ఉంటుంది."[2] మౌలానా షరర్ వెల్లడించిన అభిప్రాయాల్నే ఇంకా సుదృఢపరుస్తూ లాలా లజపతిరాయ్ తన ఆటోబయాగ్రఫీలో దీన్ని ఇలా ధృవీకరించారు.

"నేను స్కూల్లో చదువుతున్నప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో భారతీయ చరిత్రపై 'భారతీయ సంఘటనలు' అనే ఒక పుస్తకం చదివించబడేది. ముస్లింలు తమ పరిపాలనా కాలంలో హిందువులపై అత్యధిక హింసా దౌర్జన్యాలు జరిపారని ఈ పుస్తక పఠనం ద్వారా నా మెదడుకు ఎక్కసాగింది. క్రమక్రమంగా ఈ భావన నా మనోమస్తిష్కాల్లో సుదృఢం కాసాగింది. మా కుటుంబ మరియు వంశపరంగా ఇవ్వబడుతూ వచ్చిన తర్ఫీదు కారణంగా ఇస్లాంను గౌరవించాలనే ఏ భావనైతే మా హృదయాల్లో ఉంటుండేదో 'భారతీయ సంఘటనలు' (లేక చరిత్ర) అనే గ్రంథం అధ్యయనం వల్ల అది ద్వేషంగా మారుతూపోయింది." (Autobiographical writing - Edited by V.C. Joshi, Delhi, 1965, page 77)[3]

ఇలా చరిత్రను వక్రీకరించిన ఆంగ్లేయ చరిత్రకారుల్లో హెన్రీ ఏలియట్ మరియు డాసన్ ప్రఖ్యాతిగాంచారు. వారు వ్రాసిన భారత చరిత్రపై ప్రొఫెసర్ ఖలీల్ అహ్మద్ నిజామి తమ అభిప్రాయాన్ని ఇలా వ్యక్తపరిచారు.

"ఏలియట్ భారత చరిత్రను ఎంత కలుషితం చేశాడు. దాని నరనరాల్లోకి ఈ విషాన్ని ఎంత లోతుగా జొప్పించి చరిత్ర దృష్టి కోణాన్ని ఎంతగా పాడు చేశాడంటే, దానికి భిన్నంగా చెప్పబడే ప్రతి మాటను ఆశ్చర్యంగానూ, అనుమానాస్పదంగాను చూడడం మామూలై పోయింది. బ్రిటీష్ పరిపాలనకు పూర్వం హిందూ ముస్లింలలో సుహృద్భావ సంబంధాలు ఉండేవి."[4]

ఈ చరిత్ర వక్రీరణను ఎంత పకడ్బందీగా, ఎంత ప్లానింగ్ ప్రకారం, ఎంత విశ్వాసంతో రూపొందించారంటే, హెన్రీ ఏలియట్ తన గ్రంథం గురించి చేసిన ఛాలెంజీను వింటే, పరిస్థితిని అవలీలగా అర్థం చేసుకోవచ్చు. అతను చేసిన ఛాలెంజీ ఏమిటంటే, "తన పుస్తకమే గనక ప్రచురింపబడితే, భారతదేశంలో మున్ముందు లేవబోయే జాతీయ ఉద్యమాలన్నీ చల్లబడి పోతాయి."[5]

ఈ విధంగా ఒక ప్రణాళికా, పథకం ప్రకారం భారత చరిత్రను రూపొందించడమే కాకుండా, దాన్ని కంపల్‌సరీ సబ్జెక్టుగా మార్చి, ప్రతి పిల్లవాడు తప్పకుండా చదవాల్సిందిగా కట్టడి చేశారు. ఈ విధంగా పసిప్రాయంలో చదివిన ఈ కల్పిత, విషపూరిత పాఠ్యాంశాలు అతని మనోమస్తిష్కాల్లో దిగిపోయి, ఇక జీవితాంతం అవి అతన్ని వెన్నంటి ఉంటాయనేది ఈ ఆంగ్లేయుల ఆలోచన. చూశారా! ఎంతటి దుష్ట మరియు దురాలోచనో! ఈ విధంగా వారు తమ పరిపాలనా కాలంలో, తమ రాజకీయ లబ్ధికోసం, భారత దేశంలో తమ అధికారం శాశ్వతంగా ఉండాలనే దృష్టితో, అంతకు ముందు భారతదేశాన్ని పరిపాలించిన ముస్లిం రాజులు, ప్రత్యేకించి ఔరంగజేబ్, అత్యంత నీచులని పరమ దుర్మార్గులని, వారు భారతదేశంలో బహుళ సంఖ్యలో నివసిస్తున్న హిందువుల్ని తమ పరిపాలనా కాలంలో అణిచి ఉంచారని, వారిని హింసించారని, అవమానపర్చారని, బలవంతంగా వారి కన్యల్ని పరిణయమాడారని ఇలా ఇలా ఎన్నో రకాలుగా చిత్రీకరించారు. వారి ఈ దుష్ట పన్నాగాలకు అంగ్లేయ చరిత్రకారుల్నే కాకుండా మన దేశీయ చరిత్రకారుల్ని కూడా మచ్చిక చేసుకున్నారు.

వారి ఈ పనిలో ప్రఖ్యాత భారతీయ చరిత్రకారుడైన సర్ జదూనాథ్ సర్కార్ కూడా వారికి ఎనలేని సేవల్ని అందించాడు. సుదీర్ఘంగా, వివరంగా ఐదు సంపుటాలలో ఔరంగజేబ్ చరిత్రను రాసి ఆంగ్లేయులతో శభాష్ అనిపించుకున్నాడు. ఆయన జీవిత కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం తరపున ఆయన్ను అత్యధికంగా సత్కరించి, బిరుదుల్ని ప్రసాదించడం జరిగింది. అప్పట్లో చూసేవారికి ప్రభుత్వం ఒక యోగ్యుడైన చరిత్రకారుణ్ని గుర్తించి, సత్కరిస్తుందని పించిందే తప్ప, ఆంగ్లేయుల ప్రగాఢవాంఛను నెరవేర్చినందుకు ఇవ్వబడే పారితోషికం అని ప్రజలు గుర్తించలేకపోయారు.

ఈ సంపుటాలు ఇంకా ఇలాంటివే ఇతర చరిత్ర గ్రంథాలు హిందూ సోదరుల మనోమస్తిష్కాల్లో ఔరంగజేబ్ పట్ల, తద్వారా ముస్లింల పరిపాలన పట్ల ద్వేషాన్ని నింపేశాయి. సామాన్య హిందూ సోదరులు ఔరంగజేబ్‌ను ఈ దృష్టికోణంతోనే చూసే అలవాటుపడ్డారంటే అందులో ఆశ్చర్యపడవలసిన పనిలేదు. కాని ఇలాంటి చరిత్రగ్రంథాల వల్ల తీవ్రమైన దుష్ప్రభావాలు పొడసూప నారంభించాయి. ఆంగ్లేయుల కాలం నుండి హిందూ – ముస్లింలలో ఏర్పడిన వ్యతిరేకత, అసహనం, వైషమ్యాల అగ్నికి ఈ చరిత్ర గ్రంథాలు ఆజ్యం పోస్తూనే ఉన్నాయి. జాతీయ సమైక్యత, ప్రేమైక సంబంధాల ఏర్పాటులో ఇలాంటి గ్రంథాలు తీవ్రమైన అవరోధాల్ని కల్పిస్తున్నాయి.

ఆంగ్లేయులు దేశాన్ని విడిచివెళ్ళిన తరువాతనైనా మనం ఇలాంటి చరిత్ర గ్రంథాల్ని ప్రక్షాళనం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉండేది. కాని ప్రక్షాళనం చేయడం అటుంచి, ఇంకా అందులో విషాన్ని పెంచే, వేర్పాటును సుదృఢపరిచే ప్రయత్నాలు ముమ్మరం కావడం ఆశ్చర్యాన్ని గొలుపుతుంది. దేశంలో కోట్ల సంఖ్యలో ఉంటున్న ఈ రెండు అతిపెద్ద వర్గాల్ని దూరం చేయడం, పరస్పరం శత్రువులుగా మార్చడం ఎవరికి లాభిస్తుందని? పరులు, శత్రువులు కుటిల నీతితో దేశాన్ని, దేశ సమగ్రతను బలహీనపరచడానికి రహస్యంగా, పరోక్షంగా చేయదగిన పనిని మనం సంతోషంగా, బహిరంగంగా చేసుకోవడం ఎంతవరకు వివేకమంటారు? దేశ, జాతి శ్రేయోభిలాషులు దీని గురించి నిర్మల మనస్సుతో ఆలోచించాలి. అప్పటి కాలాన్ని, ఆంగ్లేయుల పరిపాలనను పోనీయండి, దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా హరినాథ్ శాస్త్రి, పి.యన్.ఓక్ ఇంకా ఇలాంటి దేశీయ చరిత్రకారులు కూడా ఈ రెండు వర్గాల్ని విడదీయడానికి, పరస్పరం శత్రువులుగా మార్చడానికి ప్రయత్నిస్తున్న వైనం ప్రభుత్వాలకు కనిపించడం లేదా? లేక ప్రభుత్వాలు చూసీచూడనట్లు ఉదాసీనత వహిస్తున్నాయా? అనేది అర్థం కాని విషయం.

ప్రఖ్యాత రచయిత సర్దార్ ఖుష్వంత్ సింగ్, తను వ్రాసిన ఒక నోట్‌లో ఈ విషయం పైన తన ఆశ్చర్యాన్ని ఇలా వ్యక్తపరిచారు : "ఆంగ్లేయులు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని చరిత్రను వక్రీకరించారంటే అందులో అర్థముంది. కాని ఆ తరువాత వచ్చిన శాస్త్రుల్లాంటివారు, నేటి కాలపు పి.ఎన్.ఓక్ లాంటి వారికి ముస్లింలకు వ్యతిరేకంగా యువతరం మనో మస్తిష్కాల్లో విషాన్ని నింపే ఈ ద్వేషపూరిత రచనలకు పురిగొల్పిన విషయమేదో!"[6] నిజానికి ఆంగ్లేయుల కాలంలో రూపొందించిన ఇలాంటి చరిత్ర గ్రంథాలే హిందూ సోదరుల

మనోమస్తిష్కాల్ని విషపూరితం చేసేశాయి. వారు న్యూనతాభావానికి, ఫలితంగా ప్రతీకారేచ్ఛకు గురిఅయ్యారు. కాని దేశ సుదీర్ఘ ప్రయోజనాల దృష్ట్యా, ఇలాంటి చరిత్ర గ్రంథాల ప్రక్షాళన ఎంతో అవసరం. ఆనాడు వారు నాటిన ఈ విషబీజాలు మహావృక్షాలై, నేడు దేశ సమగ్రతకే ముప్పుగా పరిణమిస్తున్నాయి. నేటి మన కాలేజీల్లో, యూనివర్సిటీల్లో ఇలాంటి విషపూరిత చరిత్ర గ్రంథాలనే చదివిన చరిత్ర అధ్యాపకులు బయటికి వస్తున్నారు. వారు కూడా తమ శిష్యులకు ఇలాంటి బోధనలే బోధిస్తున్నారనటంలో సందేహం లేదు. అయితే దేశ సమగ్రత, దేశ సుదీర్ఘ ప్రయోజనాల దృష్ట్యా ఈ పంధాను మనం మార్చుకోక తప్పదు. అయితే దీనికోసం ఔరంగజేబ్ గురించిన వాస్తవాలు తెలుసుకోవడం, సామాన్యజనానికి చూపడం ఎంతో అవసరము. ఎప్పటివరకైతే ఔరంగజేబ్ గురించిన వాస్తవాలు వారు తెలుసుకోలేరో, అప్పటి వరకు వారి మనో మస్తిష్కాల్లో వక్రీకరించి ఏర్పరచిన ఔరంగజేబ్ రూపం చెదిరిపోదు. దానికోసమే ఈ చిరు ప్రయత్నం. ఇంకొక విషయం ఏమిటంటే నేడు మన చేతుల్లో ఉన్న చరిత్ర గ్రంథాలు నిజమైన చరిత్ర ఎంతమాత్రం కాదని, అది వక్రీకరించిన చరిత్ర అనే విషయం కేవలం తెలుసుకోవడమే కాదు, నిరూపించవలసి కూడా ఉంది. ఈ ఉద్దేశం కోసం మాకు తెలిసిన, మా కంటబడిన ప్రతి గ్రంథాన్ని, అందులోని సారాంశాన్ని అదెవరూ వ్రాసిన, ఎప్పుడు వ్రాసిందైనా సరే, ఎలాంటి సంకోచం లేకుండా స్వీకరించాము. కాకపోతే వారి పేర్లు, రిఫరెన్సులు తప్పకుండా పొందుపరుస్తూ పోయాం. అందుకని ఈ పుస్తకంలో మీకు వివిధ వ్యక్తుల, చరిత్రకారుల, విద్వాంసుల విజ్ఞానుల రచనల్లోని, గ్రంథాల్లోని పేరా గ్రాఫ్‌లు, పేజీలకు పేజీలే కనబడితే ఆశ్చర్యపడనక్కర్లేదు. మా మాటను బలపరిచే, మేము చెప్పే దాన్ని సమర్థించే ప్రతి విషయాన్ని ఎలాంటి మొహమాటం లేకుండా పుష్కలంగా వాడుకున్నాము. చరిత్ర వక్రీకరణను, చరిత్ర ద్వారా విషం విరజిమ్మటాన్ని మామూలు మాటగా, చిన్న విషయంగా భావించరాదు. నూటాయాభై సంవత్సరాలకు పూర్వం జరిగిన ఈ కుట్రకు భారత ఉపఖండం ప్రజలు నేటికీ మూల్యం చెల్లిస్తూనే ఉన్నారు. ఇంకెంత కాలం వరకు చెల్లిస్తారో, ఇంకెంత రక్తపాతాన్ని చూడవలసి ఉంటుందో ఆ దేవునికే తెలియాలి. ఆ కాలంలో వారు నాటిన విషబీజాల వల్ల ఈ రెండు వర్గాలు శాశ్వతంగా దూరమైపోయాయి. దూరం కావడమే కాదు, పరస్పరం ద్వేషంతో నిండిపోయాయి. పచ్చగడ్డివేస్తే భగ్గున మండే పరిస్థితికి ఎదిగాయి. ఈ ద్వేషమే, ఈ శత్రుత్వమే ఈ రెండు వర్గాల్ని ఎంతదూరం వరకు తీసుకుపోయాయంటే, ఒకప్పుడు ఒకరి ధన, మాన ప్రాణాల కోసం ఇంకొకరు తమ ప్రాణాల్ని అర్పించినవారు, ఇప్పుడు ద్వేషంతో కరడుగట్టుకుపోయి, ఏ కొంచెం అవకాశం లభించినా, ఒకరి ధన, మాన, ప్రాణాల్ని ఇంకొకరు బూడిద చేస్తున్నారు. అప్పటినుండే ఏర్పడిన ఈ ద్వేషం, ఈ రెండు వర్గాల్ని శాశ్వతంగా విడదీయడమే కాకుండా పరస్పరం శత్రువులుగా, రెండు జాతులుగా విడదీశాయి. ద్విజాతి సిద్ధాంతానికి ఆ రోజునుండే అంకురార్పణ జరిగింది. ఆనాడు ఏర్పడిన ఈ అగాధం దినదినం పెరుగుతూనే పోతుంది తప్ప దగ్గరికి వచ్చిన సూచనలు అసలే కనబడడం లేదు. అలా ఆనాడు ఏర్పడిన వేర్పాటు వాదం, ద్విజాతి సిద్ధాంతం దినదినం ప్రవర్ధమానం కాసాగింది. చివరికి ఇది దేశ విభజనకు దారితీసింది. విభజన

సమయంలో జరిగిన రక్తపాతం, మారణహోమం మానవ చరిత్రలోనే మరుపురాని ఘట్టం. ఇంతపెద్ద సంఖ్యలో దేశంలోని ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి, తెలియని ప్రాంతానికి, అపరిచిత ప్రాంతానికి- జనం వెళ్ళడం ప్రపంచంలో మరెక్కడా కనిపించదేమో! వీరు ఊరికెనే హాయిగా, షికారు వెళ్ళినట్లు వెళ్ళారనుకుంటున్నారా? లేదు. ఒక రక్తపుటేరును దాటి వెళ్ళారు. కుటుంబాలకు కుంటుబాలే బూడిదయ్యాయి. అసంఖ్యాక మానభంగాలు, వేల సంఖ్యలో హత్యలు, కొట్లాది రూపాయల ఆస్తులు బుగ్గిపాలవడం, మానవత్వం ముఖం చాటేసుకున్న సమయమది. మనిషి, తానొక మనిషిననే ఇంగితజ్ఞానాన్ని మరచిపోయిన సమయమది. ఇది ఎక్కడో ఒకచోట జరిగిందనుకోవడం పొరపాటు. భారత పాకిస్తాన్ రెండు వైపులా జరిగింది. ఈ రెండు వర్గాలూ తీవ్రంగా నాశనమయ్యాయి. మేము పేర్కొన్నదంతా అసత్య మంటారా? కాదు. ముమ్మాటికీ కాదు. ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. దీనికి కారణం ఏమంటారు? అదే లోపలున్న ద్వేషం పెల్లుబుకడం వల్ల. అనుమానం, అపనమ్మకాల పెనుభూతం ఇద్దరినీ చుట్టేసుకున్నందువల్ల. అయితే ఇంతటితో ఈ ద్వేషం, ఈ వైరం చల్లబడినట్లేనా? లేదు. ఈ ద్వేషం, ఈ వైరం, ఈ ప్రతీకారేచ్ఛ నిశ్చింతగా అసలు కూర్చుం డనిస్తేకదా? దేశం మూడు ముక్కలుగా విడిపోయినప్పటికీ కూడా శాంతి సామరస్యాలు, అన్యోన్య సంబంధాలు ఏర్పడ్డాయా? లేదు. ఎవరి మానాన వారు బ్రతుకు దామని నిశ్చింతగా, నిమ్మళంగా కూర్చున్నారా? అదీ లేదు. నేటికి కూడా అవే ఉద్రిక్త పరిస్థితులు. అవే కలహాలు, అవే రక్తపాతాలు. అవే అపనమ్మకాలు. అవే క్రోధావేశాలు. ఇప్పటికి కూడా ఒకరినొకరు బెదిరించుకుంటూ చేస్తున్న హెచ్చరికలు. ఆ కాలంలో సమాజస్థాయిలో, స్థానిక పరిధిలో జరిగిన ఘర్షణలు నేడు దేశాల స్థాయికి చేరుకున్నాయి. యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. భయంకరమైన యుద్ధాయుధాల్ని సమకూర్చున్నారు. తొందరగా స్వల్ప వ్యవధిలోనే నాశనం చేసుకోవచ్చునుకొని అణ్వాయుధాల్ని కూడా సమకూర్చుకున్నారు. చివరికి ఈవిధంగా ఇద్దరూ సర్వనాశనాన్ని కొనితెచ్చుకుంటున్నారు. దీనికి కారణం ఏమిటంటారు? దీని మూలం ఎక్కడుందంటారు? ఈ రుగ్మత ఎక్కడి నుండి ప్రారంభమైందంటారు? అదే అపనమ్మకం, అపార్థాలతో, కల్పిత కథలతో, వక్రీకరించిన చరిత్రతో ఏర్పడిన ఈ ద్వేషం, ఈ పగ, ఈ వైరం చల్లారడం లేదు. ప్రతీకారేచ్ఛ పెరుగుతూనే పోయింది. అప్పుడు ఆ కాలంలో, తమ స్వార్థం కోసం తమ అధికార పటిష్ఠత కోసం బ్రిటీష్‌వారు చరిత్రలో చేసిన మార్పు, వక్రీకరణ నేడెంతటి స్థాయికి పెరిగిందో మీరే చూడండి. బీజం చిన్నదిగానే ఉంటుంది. కాని అది పెరిగి పెద్దదై మహావృక్షంగా మారినప్పుడు దాని విలువ తెలుస్తుంది. చెడు ఎప్పటికీ చెడు ఫలితాలనే ఇస్తుంది. మానవుల అన్యోన్యత, సోదరత్వం దుష్ట షైతాన్‌కు నచ్చదు. పెద్దలు ఒక సామెతతో దీన్నిలా వివరించారు. ఒక ఊర్లో ఇద్దరు మిత్రులు ఇరుగుపొరుగున ఉంటూ ఎంతో అన్యోన్యంగా మెలిగేవారు. వీరిద్దరు ఒకే తల్లిబిడ్డలా అన్నంత ప్రేమ, వాత్సల్యాలతో మెలిగేవారు. కాని షైతాన్‌కు వారి ఈ అన్యోన్యత నచ్చలేదు. వీరిద్దరిని ఎలాగైనా సరే విడగొట్టాలని అతనో కుట్రపన్నాడు. ఒక మిత్రుని వీధి గోడపై కాస్త బెల్లం పూశాడు. అంతే.

అంతకన్నా పెద్ద నేరం అతనేం చేయలేదు. ఆ బెల్లం పూయగానే దాని వాసనకు దానిచుట్టూ ఈగలు చేరసాగాయి. ఈ ఈగల గుంపు చూసి ఆ ఇంట్లో ఉంటున్న బల్లికి నోరూరుంది. అది హాయిగా ఈ ఈగల్ని భోంచేయసాగింది. ఒక మిత్రుని ఇంట్లో పెంచబడుతున్న పిల్లి ఈ బల్లిని షికారు చేయటానికి ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే పిల్లిని ఈవిధంగా ఇంటినుండి బయటికి రావడం చూసిన ఇంకో మిత్రుని పెంపుడు కుక్క, మాటువేసి కూర్చున్నది. ఎప్పుడైతే బల్లిని పట్టుకోవడానికి పిల్లి లంఘించిందో, అదే అదను కోసం ఎదురుచూస్తున్న కుక్క అమాంతంగా పిల్లిపై దూకి దాన్ని కొరికేసింది. ఇంకేముంది? పిల్లి కుక్క విషయమై మిత్రుల్లో మాటకు మాట పెరుగుతూ పెరుగుతూ చివరికి తన్నుకునే వరకు వచ్చింది. పోలీస్ స్టేషన్లు, కేసులు మొదలయ్యాయి. ప్రాణమిత్రులు పోయి ప్రాణ శత్రువులయ్యారు. ప్రారంభం చిన్నదే. కేవలం బెల్లం పూసి వాడు వెళ్ళిపోయాడు. కాని దాని పర్యవసానం ఎంత భయానకంగా బయల్పడిందో చూశారా?

మన భారతీయ చరిత్రలో కూడా అదే జరిగింది. అప్పటి వరకు అన్యోన్యంగా ఉంటున్న ఈ రెండు వర్గాలు, చరిత్ర వక్రీకరణతోనే శత్రువులుగా మారసాగాయి. అలాకాకుండా, నేడు మనం చరిత్రలో చదువుతున్న కల్పితాలే వాస్తవాలై ఉంటే, రాణాప్రతాప్ కోసం పఠాన్లు పోరాడడమేమిటి? అక్బర్, షాజహాన్, ఔరంగజేబ్‌ల కోసం రాజపుత్రులు పోరాడడమేమిటి? శివాజీ సైనిక కమాండర్లు సిద్దిహిలాల్, సిద్ది బిలాల్‌లు ముస్లింలతో పోరాడడమేమిటి? ఔరంగజేబ్ కోసం రాజపుత్రులు, మరాఠా నాయకులు - స్వయంగా శివాజీ దగ్గరి బంధువులు సైతం శివాజీతో పోరాడడమేమిటి? ఇవేమీ కల్లబొల్లి కబుర్లు కావు. వీటికి ప్రామాణికమైన గట్టి చరిత్ర సాక్ష్యాధారాలున్నాయి. నేడు మనం స్కూళ్ళలో, కాలేజీల్లో, యూనివర్సిటీల్లో చదువుకుంటున్న చరిత్ర గ్రంథాలు ఆనాడు ఆంగ్లేయుల కాలంలో వక్రీకరించిన చరిత్ర మాత్రమే. నిజమైన చరిత్ర ఎంతమాత్రం కాదు. ఈ వక్రీకరణ ఎందుకు జరిగింది. ఎలా జరిగిందో పైన వివరిస్తూ వచ్చాము. మున్ముందూ ఇంకా తెలుసుకుంటారు. బ్రిటీష్ ప్రభుత్వం రూపొందించిన సిలబస్ పుస్తకాలే చదువుతూ వచ్చాం తప్ప అసలివి వాస్తవాలేనా అని లోతుకుపోయి పరిశీలించలేకపోయాము. సిలబస్ పుస్తకాలు ఇంగ్లీష్, ఇతర ప్రాంతీయ భాషల్లో ఉండేవి. ఆ కాలం నాటి సమకాలీన చరిత్ర గ్రంథాలు ఆ కాలపు ప్రభుత్వ భాష అయిన పర్షియన్‌లో వ్రాయబడ్డాయి. అయితే పర్షియన్‌ను నిషేధించి, ఆంగ్లంను ప్రభుత్వ భాషగా ప్రవేశపెట్టడం జరిగింది. పర్షియన్ చరిత్ర గ్రంథాల్ని ఆంగ్లంలోకి అనువదిస్తున్నప్పుడు జరిగిన గారడీ ఏమిటో, మోసమేమిటో మనం భారతీయులం తెలుసు కోలేకపోయాం. కాని అలా వక్రీకరించడం వల్ల మనమెంత నష్టపోయామో, ఇప్పటికీ ఎంత నష్టపోతున్నామో గాఢంగా ఆలోచిస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఎన్ని వైషమ్యాలు, ఎన్ని విరోధాలు, ఎంత రక్తపాతం, ఎంత విధ్వంసం- అజ్ఞానం వల్ల, మనం భారతీయులం ఎంత కొట్టుకున్నాము, ఎంత తన్నుకున్నాము, పరస్పరం ఒకరినొకరు ఎంతగా నష్టపరచుకున్నాము. చివరికి దేశాన్ని ముక్కలు ముక్కలుగా విభజించుకున్నాం కూడా. అయినా అంతటితో ఆగిందా?

లేదే! ఆ పరిస్థితి నేటికీ అలాగే కొనసాగుతున్నది. దీనికి కారణం ఏమంటారు? శరీరంలో చెడు రక్తం ఉన్నంత వరకు మీరెన్ని మందులు వాడినా, మీరెన్ని ఇంజక్షన్లు తీసుకున్నా, మీకు ఆరోగ్యం చేకూరడం కల్ల. సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే ముందు శరీరంలోని రక్తం శుభ్రపడాలి. నరనరాల్లో జీర్ణించుకుపోయిన విషమంతా బయటికి వెళ్ళిపోవాలి. అప్పుడేగాని మనం ఆరోగ్యాన్ని ఆశించగలం. అదేవిధంగా మన దేశ చరిత్రలో జొప్పించిన విషాన్ని, బయటికి తీయనంతవరకు, అభూత కల్పనల్ని రూపుమాపనంతవరకు, యదార్థ విషయాల్ని బయటికి రాబట్టనంతవరకు, చరిత్రను దాని మౌలిక ఆధారాలతో అధ్యయనం చేయనంత వరకు, మనలో ఏర్పడి ఉన్న అపార్థాలు, అనుమానాలు దూరం కావు. ఒకరిపట్ల వేరొకరికి పేరుకుపోయిన ద్వేషం, పగ, వైరం సమసిపోదు. నీడను చూచి దెయ్యంగా భావించినట్లు, చరిత్రను వక్రీకరించి అందులో జొప్పించిన అసత్యాల్ని, అభూత కల్పనల్ని విశ్లేషించి చూసినట్ల యితే మన వెఱ్ఱితనంపై మనమే ఆశ్చర్యపడకుండా ఉండలేము. హింస, దౌర్జన్యం, పరాభవం, అణచివేతకు సంబంధించిన విషయాలు- వేటినైతే మనం నూటికి నూరుపాళ్ళు నిజమను కుంటున్నామో- అవే పచ్చి అబద్ధాలని, కేవలం అభూత కల్పనలని తేలిపోయినట్లయితే పగ, వైరం, ద్వేషానికి ఆధారమే ఉండదు. అలా మనసులు తేలికపడినప్పుడు సోదరుల్ని కలువకుండా ప్రపంచంలోని ఏ శక్తీ ఆపజాలదు. పరస్పర అన్యోన్యత కోసం, జాతి సమైక్యత కోసం కృత్రిమ పద్ధతులు అవలంబించే అవసరమే ఉండదు. జాతీయ సమైక్యత అన్నింటికన్నా ముఖ్యం. ఆ సమైక్యత అనేది కృత్రిమంగా, కల్పితంగా, పైపైకి మాత్రమే కనబడేదిగా ఉండ కూడదు. ఈ సమైక్యత స్వాభావికంగాను, హృదయాంతరాళాల్లో నుండి రావాలి. అప్పుడే అది నిజమైన జాతీయ సమైక్యత అనబడుతుంది. జాతీయ సమైక్యత కోసం దేశ ప్రజల హృదయాల్లో పరస్పరం ప్రేమాభిమానాలుండాలి. అనుమానం, అపార్థం, రాగద్వేషాలున్న హృదయాల్లో ప్రేమ, అన్యోన్యత జనించడం అసంభవం. ఈ రాగద్వేషాలకు, శతృత్వాలకు కారణం చరిత్రలో చదువుతూ వస్తున్న వివాదాస్పద అంశాలు, అణచివేతకు గురిఅయ్యామనే న్యూనతా భావనలు. కాని మన పూర్వీకుల చరిత్రలో అలాంటిదేమీ జరుగలేదని, వారు వివిధ ధర్మాలకు చెందినవారై ఉన్నప్పటికీ పరస్పరం సోదరులుగా, అన్యోన్యంగా మెలిగారని, వారిలా ప్రేమ సౌభ్రాతృత్వా లతో, పరస్పరం విశ్వాస నమ్మకాలతో సహజీవనం సాగించడానికి వారి ధర్మాలు అడ్డురాలేదని నేటి మన యువతరానికి స్పష్టం చేయవలసి ఉంది. నూటయాభై సంవత్సరాల నుండి వక్రీకరించిన చరిత్ర మూలంగా వస్తున్న ఈ రాగద్వేషాలు దూరం కానంతవరకు వారి హృదయాలు తేలికపడవు. ఈ అపార్థాన్ని, అపనమ్మకాన్ని, ద్వేషం, శతృత్వాన్ని తొలగించడానికి చేసిన ప్రయత్నమే మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం. సిసలైన జాతీయ సమైక్యత నిర్మల హృదయంతో, అన్యోన్యంగా ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ఇదో బృహత్తరమైన పవిత్ర కార్యం. దీన్ని ప్రభుత్వాలు, గొప్ప గొప్ప సంస్థలు చేపట్టాల్సి ఉంటుంది. నాలాటి సామాన్య మనిషి, అనామకుడు చేయదగిన పనికాదు. అయినాగాని నేడు మనం చరిత్రలో చదువుతూ వస్తున్న వివాదాస్పద అంశాలు వట్టి బూటకమని, అభూతకల్పనలని, నిరాధారమైన నిందలు మాత్రమేనని నాకు తెలిసినప్పుడు, ఇంకా ఈ అంశాలే నేడు మన

సిసలైన జాతీయ సమైక్యతకు గొప్ప అవరోధాలుగా నిలుస్తున్నాయని తెలిసినప్పుడు, వాటిని దూరపరచడానికి చేతనైనది చేయడం అసంబద్ధమైన చర్య కాదనుకుంటాను.

దేశం పట్ల, జాతిపట్ల, సమాజం పట్ల ఏమాత్రం ప్రేమాభిమానాలున్న వ్యక్తి అయినా సరే, ఈ కార్యాన్ని చేపట్టాలి. ఇదో సిసలైన మానవసేవగా భావించాలి. దీన్ని మాధవుడు తప్పకుండా మెచ్చుకుంటాడు. అనవసరంగా, అకారణంగా, అహేతుకంగా మానవరక్తాన్ని చిందించడం మహాపాపం. మానవ రక్తం అమూల్యమైనది. అది ఇలా విచ్చలవిడిగా ప్రవహించకూడదు. ఒక్క మనిషిని కూడా అకారణంగా చంపితే అది సర్వమానవాళిని చంపినట్లని, అదేవిధంగా ఒక మనిషి ప్రాణాన్ని కాపాడినా అది సర్వమానవాళి ప్రాణాల్ని కాపాడినట్లేనని ధార్మిక గ్రంథాలు ఘోషిస్తున్నాయి.

సిసలైన జాతీయ సమైక్యత కోసం చరిత్ర ప్రక్షాళన అనివార్యం. చరిత్రపై అభిరుచి ఉన్నవాళ్ళు, చరిత్ర జ్ఞానం ఉన్నవాళ్ళు, కలంలో బలం ఉన్నవాళ్ళు - ప్రతి ఒక్కరూ ఇందులో పాలుపంచుకోవలసిన అవసరం ఉంది.

ఈ పని కోసం నాలో అంతటి శక్తి సామర్థ్యాలు లేకపోవచ్చు. అంతటి యోగ్యత లేకపోవచ్చు, అంతటి చరిత్రజ్ఞానం లేకపోవచ్చు, భాషపై పట్టులేకపోవచ్చు. సమర్పించే, ప్రదర్శించే కళ తెలియకపోవచ్చు. వివిధ సంఘటనల్ని ఎలా సమన్వయ పరచాలో తెలియక పోవచ్చు. నా రాతలో, పుస్తకంలో పరస్పర భిన్నత్వాలు కనబడవచ్చు. నేను అన్ని రకాలుగా అయోగ్యుణ్ణే కావచ్చు. కాని జాతీయ సమైక్యత కోసం చరిత్ర ప్రక్షాళన ఎంత అవసరమనే అంశాన్ని విద్వాంసుల, విజ్ఞానుల, చరిత్రకారుల దృష్టికి తేగలిగినా కూడా నేను సఫలీకృతుణ్ణి అయినట్లే. నా ఈ రచన వారి హృదయాలను తట్టి మేల్కొలిపి, ఈ పనిలో వారిని కార్యోన్ముఖులు చేయగలిగినా అంతకు మించి నాకింకేం కావాలి? ఈ అంశాన్ని, ఈ విషయాన్ని, ఈ సబ్జెక్టును వారు ఇంకా మంచి పద్ధతితో, ఇంకా మంచి పంథాలో, ఇంకా మనోజ్ఞంగా, హృదయాలకు హత్తుకునే లాగా ప్రదర్శించ గలుగుతారేమో! ఇంతకన్నా మంచి సాక్ష్యాధారాలను, ఇంతకన్నా గట్టి వాదనను ప్రజలకు వినిపించగలుగుతారేమో! అంతటి శక్తిసామర్థ్యాలు, అపార జ్ఞాన సంపద, అసామాన్యమైన అవకాశాలు, సాధనాలు గల విజ్ఞులు, న్యాయశీలురు మన దేశంలో లేకపోలేదు. వారి వరకు నా హృదయాంతరాళాల్లో నుండి వెలువడిన ఈ ఆందోళనా పిలుపు చేరితే తరించిపోతాను. వారిని జాగృతపరచగలిగితే నేను ధన్యుణ్ణైపోతాను. ఇక వారే ఈ బృహత్తర కార్యాన్ని ముందుకు తీసుకెళ్ళగలరు. వారే గనక నిర్మల మనస్సుతో, అకుంఠిత దీక్షతో, ఒక పుణ్యకార్యంగా, జాతిసేవగా దీన్ని గుర్తించారంటే ఇక నా పని అయినట్లే. సిసలైన జాతి సమైక్యత కోసం లేవబోయే ఈ కలం వీరుల సైన్యాన్ని, సమూహాన్ని చూసే రోజు ఎంత సుదినమో!

భారత ఉపఖండంలో ఉంటున్న ప్రజల మధ్య పగ, ద్వేషం, వైరం ఎప్పటి నుండి, ఎక్కడి నుండి ప్రారంభమైందో, దాన్ని అక్కడి నుండే తుడుచుకుంటూ రావల్సి ఉంటుంది. రోగనిర్ధారణ సరిగ్గా జరుగనంతవరకు మీరెన్ని మందులు వాడినా ప్రయోజనముండదు.

ఉపఖండం ప్రజల్లో పగ, ద్వేషం, పరస్పర అసహనం, జాతిమత భేదాలు ఎక్కడి నుండి, ఎప్పటి నుండి మొదలయ్యాయో సూచనప్రాయంగా, సాక్ష్యాధారాలతో చూపించాము. ఆ బీజమే పెరుగుతూ పెరుగుతూ బహుళ సంఖ్యలో నున్న ఈ రెండు వర్గాల్ని దూరం చేసింది. ద్విజాతి సిద్ధాంతానికి ఈ విషమే పునాది వేసింది. ఈ విషయం కారణంగానే దేశం ముక్కలు చెక్కలై పోయింది. నేటికీ ఉపఖండమంతటిలో అదే ద్వేషజ్వాలలు రగులుకుంటున్నాయి. ఎక్కడా శాంతి సామరస్యం లేదు, అన్యోన్యత లేదు. హృదయాలే నిర్మలంగా లేనప్పుడు, శాంతి సామరస్యాలు ఎలా ఏర్పడతాయి? అన్యోన్యత ఎక్కడుంటుంది? అందుకని ఎక్కడి నుండి ఈ విషం ఉపఖండపు శరీరంలో ప్రవేశించిందో, తిరిగి అక్కడి నుండే పనిని ప్రారంభిస్తే, సత్ఫలితాలను ఆశించవచ్చు. పైపై మెరుగులు, గాలికబుర్లు, కృత్రిమ సమైక్యతా నినాదాలు, తాత్కాలిక రాజకీయ పాలసీలు ఎన్నటికీ సత్ఫలితాల నివ్వవు. కల్పిత చరిత్రల ద్వారా హృదయాల్లో ఏర్పడిన ద్వేషాన్ని దూరం చేయనంతవరకు, సిసలైన, స్వచ్ఛమైన, నిష్కల్మషమైన అన్యోన్యతను ఆశింపలేము. ఆ అన్యోన్యత ఏర్పడినప్పుడు సోదరుల్ని పరస్పరం కలువకుండా ఎవరూ ఆపలేరు. దేశంలో అలాంటి వాతావరణం ఏర్పడినప్పుడు దాని ప్రభావాలు కూడా చుట్టుప్రక్కల ప్రాంతాలపై పడకుండా ఉండలేవు. పూసువాసను మీరెంతసేపటి వరకని, ఎంతదూరం వరకని ఆపగలుగుతారు. ఆ సువాసనలు మనదేశ సరిహద్దుల్ని దాటి పొరుగు దేశాలపై పడకుండా ఏ సైనికశక్తి ఆపజాలదు. హృదయాలే తేలిక పడిపోయినప్పుడు, ద్వేషానికి, శతృత్వానికి ఆధారమే లేకపోయినప్పుడు, విడిపోయిన సోదరులు ఎంతసేపట్లో కలసిపోతారు? పరస్పరం కలువదలిచిన సోదరుల్ని ఎవరు ఆపగలుగుతారు? అసూయ ద్వేషాలు, అనుమానాలు, అపార్థాలు, అపనమ్మకాలు దూరమైపోయిన తరువాత నేడు జటిలంగా కనబడుతున్న సమస్యలు చిటికెల్లో దూరమై పోతాయి. అనుమానాలు అపార్థాలు, రాగద్వేషాలు దూరమై, పరస్పరం ప్రేమ సౌభ్రాతృత్వాలు, సన్నిహిత సంబంధాలు ఏర్పడి ఒకరి సుఖదుఃఖాలను వేరొకరు తనవిగా గుర్తించిన రోజు, ఈ సైన్యాలు, ట్యాంకులు, యుద్ధవిమానాలు, భయంకర మారణాయుధాలు విలువలేనివిగా కనబడతాయి. పేద ప్రజల పొట్టలు కొట్టి వందల వేల కోట్లు వెచ్చిస్తున్న ఈ మారణాయుధాల అవసరమే ఉండదు. అమూల్యమైన ఈ అపార సంపదను ప్రజా సంక్షేమానికి వినియోగించిన రోజు, భారత ఉపఖండంలో ఏ ఒక్కడూ పస్తులుండవలసి రాదు, భుక్తికోసం, ఆహారం కోసం పందిపిల్లలతో మానవ పిల్లలు పోరాడే దృశ్యాలే కనిపించవు. భారత ఉపఖండం ప్రజలకు ఆ సుదినం ఎప్పుడు దర్శనమిస్తుందో! నిరుత్సాహపడవలసిన పనిలేదు, ప్రతి పెద్ద పని ప్రారంభంలో అసంభవంగానే, అసాధ్యంగానే కనబడుతుంది. నిర్మల హృదయంతో, అకుంఠిత దీక్షతో, నిరంతరం పనిచేస్తూ పోతే లక్ష్యాన్ని సాధించడం అసంభవమేమీ కాదు. ఆంగ్లేయులు తమ తుచ్ఛమైన రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ప్రణాళికా బద్ధంగా అన్యోన్యంగా, సోదరులుగా, ఆప్తులుగా మెలిగిన ఈ రెండు పెద్ద వర్గాల్ని శాశ్వతంగా దూరం చేయడంలో కృతార్థులయ్యారే! వారికోరిక, లక్ష్యం క్షుద్రమైనప్పటికీ, రక్తపాతాన్ని

సృష్టించేది అయినప్పటికీ వారి నిరంతర కృషి వారికి ఫలితాన్నిచ్చింది. మనం మంచికోసం, కలుపడం కోసం, ప్రేమ సౌభ్రాతృత్వాల కోసం, సోదరత్వాన్ని పెంపొందించడం కోసం, మానవీయ విలువల్ని పెంపొందించడం కోసం, మానవుల్ని పరస్పరం సోదరులుగా మార్చడం కోసం, దైవాభీష్టాన్ని నెరవేర్చడం కోసం ప్రయత్నిస్తున్న వాళ్ళం, ఎందుకు నిరుత్సాహపడాలి? చెడు ఆలోచన అయినా, మంచి ఆలోచన అయినా, కొందరితోనే అది ప్రారంభమవుతుంది. ఆ తరువాత ఈ ఉద్దేశ్యంతో, ఈ లక్ష్యంతో ఏకీభవించేవారు వస్తూనే ఉంటారు. సమూహం పెరుగుతూనే పోతుంది.

ఈ విషయంలో నేను అల్పుణ్ణని, బలహీనుణ్ణని, శక్తి సామర్థ్యాలు లేనివాణ్ణని విచారించడం లేదు. లక్ష్యం ఉన్నతమైనది, నిర్మలమైనదీ, నిష్కల్మషమైనదైతే దాన్ని సమర్థించే వారు తప్పక లభిస్తారు. ఆ విధంగా లక్ష్యాన్ని సమర్థించేవారి, కోరేవారి సంఖ్యాబలం పెరుగుతూ పోతుంది. లక్ష్యాన్ని సమీపిస్తూ పోతాం.

చివరలో విన్నవించేదేమంటే మన లక్ష్యం సక్రమమైనదైతే, భారత ఉపఖండం ప్రజలకు లాభదాయకమైనదైతే, ప్రజల్ని, ప్రభుత్వాల్ని, దేశాల్ని దగ్గరికి తేగలిగినదే అయితే దానికోసం మనం వెనకాడరాదు. అది తప్పకుండా సత్ఫలితాల్ని ఇచ్చితీరుతుంది. ఆ తియ్యటి ఫలాల్ని, ఆ శుభఘడియను మనం చూడగలుగుతామా? లేదా? అనేది అప్రస్తుతం. మనం ఆ ఫలాన్ని ఆస్వాదించకపోయినా మన రాబోయే తరాలైనా తప్పకుండా దానితో లాభపడతాయి. మనం మంచిని ప్రారంభించిన వాళ్ళమవుతాము. మంచి ఎప్పటికీ సత్ఫలితాలనే ఇస్తుంది. మంచి కోసం కాస్త మీరూ నడుంకట్టి నిలబడండి. ఎంతమంది మీ వెంట వస్తారో, చూసి మీరే ఆశ్చర్యపోతారు. మన వారిలో చెడులు, చెడు అలవాట్లు లేవని నేననడం లేదు. కాని ఒక ఆశ్చర్యకరమైన, విచిత్ర విషయం ఏమిటంటే భారత ప్రజలు మంచికి, శ్రేయానికి, పుణ్యానికి తొందరగా ఆకర్షితులవుతారు. మంచివైపు మొగ్గు, మనవారి మనస్తత్వాల్లోనే, నైజంలోనే ఉంది.

**నహీఁ నా ఉమ్మీద్ హూఁ ఇక్బాల్ అప్నీ కిష్తే వీరాఁసే**
**జరా నమ్ హోతో యెహ్ మిట్టీ బడీ జర్‌ఖైజ్ హై సాఖీ!**

(ఓ ఇక్బాల్! నా భూమి పాడుబడిందని, బీడుబడిందని నేను నిరుత్సాహపడడం,
నిరాశచెందడం లేదోయ్!

ఎందుకంటే ఏ కొంచెం దానికి తడి సోకినాసరే, అదెంతో సారవంతమైన నేలసుమా!

**- అబుల్ ఫౌజాన్**

# 1. కాల్పనిక, వక్రీకరించిన భారత చరిత్ర

## 1. చరిత్ర వక్రీకరణకు కారణాలు :

చరిత్ర అంటే గడిచిన కాలాల్లో జరిగిన నిజమైన విషయాలు తెలుసుకొనే ఒక సాధనంగా చరిత్ర విద్యార్థులు భావిస్తుంటారు. ఇది వాస్తవం కూడాను. కాని విచిత్రమేమిటంటే, భారత దేశానికి సంబంధించిన మధ్యయుగ చరిత్ర (ముస్లిం రాజుల పరిపాలనా కాలం)ను వేరేరకంగా రూపొందించడం జరిగింది. ఒక నిర్దిష్ట పథకం ప్రకారం ఆ కాలం నాటి చరిత్రను వక్రీకరించడం జరిగింది. ఆంగ్లేయుల కాలంలో కొన్ని లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి చరిత్ర గ్రంథాల్ని రూపొందించడం జరిగింది. అప్పటి వరకు భారత దేశాన్ని పరిపాలించిన హిందూ, ముస్లిం పరిపాలకులిద్దరిలోనూ మతతత్వ భావనలు లేవు. వారిలో కొంతమంది పరిపాలకులు తమ తమ ధర్మాల పట్ల అభిమానం కలిగి, తమ ధర్మాల్ని తు.చ. తప్పకుండా పాటించి ఉండవచ్చు. అందులో అనుమానం లేదు. కాని అవి వారి వ్యక్తిత్వం వరకే పరిమితమై ఉండేది. తమకిష్టమైన ధర్మాన్ని పరులపై రుద్దడానికి వారెప్పుడూ ప్రయత్నించలేదు. పరిపాలనా వ్యవహారాల్లో వారు సెక్యులర్ పంథానే అవలంబించారు. అందుకే ఆనాటి ముస్లిం రాజుల దర్బారుల్లో హిందూ ఉన్నతాధికారులు, హిందూ రాజుల దర్బారుల్లో ముస్లిం ఉన్నతాధికారులు కోకొల్లలుగా కనబడుతుంటారు. వారు తమ సంబంధిత రాజులకు శ్రేయోభిలాషులుగా, విశ్వసనీయులుగా, అంతరంగికులుగా వ్యవహరించడమే కాకుండా, ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా తమ ప్రభువులకు సేవలందించారు. వారి సంబంధిత రాజులు, వారి మతాన్ని, ధర్మాన్ని, సంస్కృతినే గనక కించపరచి ఉన్నట్లయితే, వీరింతగా త్యాగాలు చేసి, సేవలందించడం సంభవం కాదు. కాని ఎప్పుడైతే ఆంగ్లేయులు భారతదేశంలో అడుగుపెట్టి, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకున్నారో వారికి ఈ హిందూ ముస్లింల సఖ్యత, సత్సంబంధాలు, వారి అన్యోన్యత, ఒకరిపట్ల ఇంకొకరికి గల ప్రేమాభిమానాలు, మత సహనం, సహజీవనం ఆశ్చర్యాన్ని గొలిపాయి. ఒకింత అసూయ కలిగింది. ఈ రెండు పెద్ద వర్గాలు ఈ విధంగా అన్యోన్యంగా, సమైక్యంగా ఉంటే తమ రాజ్యవిస్తరణకు, సుస్థిరతకు ప్రమాదమని గుర్తించి భయానికి లోనయ్యారు. ఏ విధంగానైనాసరే, ఈ రెండు వర్గాల్లో విద్వేషాన్ని రగిల్చి వీరిని పరస్పరం శాశ్వతంగా దూరం చేయాలని, దూరమేకాదు, ఒకరంటే వేరొకరికి గిట్టకుండా, ఒకరంటే వేరొకరు సహించకుండా పరస్పరం శత్రువులుగా మార్చాలనే దుష్టపన్నాగం పన్నారు. దీనికోసం తమ తెలివితేటల్ని ఉపయోగించి, భారత దేశ చరిత్రను ఎన్నుకున్నారు. ఈ పథకం కోసం తమ వారినే కాదు, ఇక్కడి భారతీయ చరిత్రకారుల్ని కూడా మచ్చిక చేసుకున్నారు. బిరుదుల్ని ఇచ్చారు. ప్రభుత్వపరంగా సత్కరించారు.

ఈవిధంగా ఒక నిర్దిష్ట పథకం ప్రకారం తమ పనిని ఆరంభించారు.

భారతదేశ చరిత్ర, సంస్కృతిపై మంచి పట్టు ఉన్న డాక్టర్ బిషంబర్‌నాథ్ పాండే ఈ విషయంలో సుదీర్ఘ పరిశోధనలు జరిపారు. ఈయన ప్రముఖ స్వాతంత్ర్యసమర యోధుడు, గాంధీజీ సహచరుడు, ప్రముఖ చరిత్రకారుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు. మొన్నటి వరకు బిహార్, ఒరిస్సా రాష్ట్రాలకు గవర్నరుగా ఉండి, ఇటీవలనే పరమపదించిన ప్రొఫెసర్ డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే దేశ ప్రజలకు సుపరిచితుడే. భారతదేశ మధ్యయుగం నాటి చరిత్రకు సంబంధించి ఆయన చేసిన పరిశోధనాలు, వెల్లడించిన అభిప్రాయాలు సందర్భోచితంగా ఉండడంతో ఇక్కడ పొందుపరుస్తున్నాము.

"సువిశాలమైన మన ఈ దేశంలో ప్రాచీనకాలం నుండే విభిన్న జాతులకు, సంస్కృతులకు చెందిన ప్రజలు తరతరాలుగా ఉంటూ వస్తున్నారు. కొండలు, సముద్రాల ఆవల ఉంటున్న వివిధ జాతులు ఈ దేశానికి వస్తూనే ఉన్నాయి. అయితే ఇక్కడి ప్రాచీన జాతుల మరియు ఆవలి నుండి వచ్చిన జాతుల మధ్య ప్రారంభంలో కొట్లాటలు, ఘర్షణలు జరిగినప్పటికి చివరికి ఇద్దరూ రాజీపడ్డారు. శతృత్వాల్ని మరచిపోయి సహజీవనం సాగించసాగారు. వివిధ కాలాల్లో వచ్చిన ఈ జాతుల కలయిక వల్ల, మనదేశ సంస్కృతిలో ఒక వినూత్నత ఏర్పడింది. ఒక పూదోటలో విభిన్న రంగుల పూలు కలిసి దాని అందాన్ని ఇనుమడించినట్లు, మన దేశంలో వివిధ సంస్కృతులు వచ్చినప్పటికీ, అవన్నీ కలిసి 'భిన్నత్వంలో ఏకత్వం'గా మారి ఒక కొత్త సంస్కృతి ఏర్పడింది. ఈ విధంగా వివిధ సంస్కృతులు కలిగి ఉన్నప్పటికీ, ప్రజలు ఎంతో అన్యోన్యంగా సహజీవనం సాగించసాగారు.

సముద్ర జలాల్లో ఉవ్వెత్తు తరంగాలు లేస్తాయి. ఆటుపోట్లు జరుగుతాయి, తీవ్రమైన, భయానకమైన గాలులు వీస్తాయి. కంపింపజేసే తుఫానులు లేస్తాయి, అయినప్పటికీ కూడా సముద్ర జలాల్ని విడదీయరానట్లు, విభజించరానట్లే భారతీయ సమాజ ప్రజల్లో భిన్నత్వాలు, వ్యతిరేకతలు, స్పర్థలు, అననుకూలతలు ఎన్ని ఉన్నప్పటికి కూడా, సముద్ర జలాల్లాగే ఈ సమాజం విభజించ, విడదీయరానంత పెనవేసుకుపోయిన సమాజమని, ఇక్కడి ప్రజలంతా కలిసి సహజీవనం సాగించాల్సిన ఆవశ్యకత, అగత్యముందనే సత్యాన్ని, తత్వాన్ని ఇక్కడి ప్రజలు ఆకళింపు చేసుకున్నారు. ఇది వారి భావనలు, ఆలోచనల్లో గల ఐక్యతతో నిరూపితమయింది.

సామాజిక, ఆర్థిక అనుబంధం, క్రమానుసారం భారతీయ చరిత్రలోని ప్రత్యేకత. భారత ప్రజల బహుముఖమైన సంస్కృతికి ఇది ప్రధానాధారంగా ఉంది. భారత దేశంలో అనేక ధర్మాలు, భాషలు, జాతులూ ఉన్నాయి. కాని జీవితానికి సంబంధించి తన మౌలిక భావన, ఆచరణలపై ఇది వందలాది, వేలాది సంవత్సరాల నుండి యథాతథంగా స్థాపితమై ఉంది. ఇది మామూలు మాటకాదు, అసామాన్యమైన విషయం. ఆర్య వలసదారులు ఇక్కడికి వచ్చిన తరువాత, ఇక్కడి ప్రాచీన ప్రజల కలయికతో ఏర్పడిన సామాజిక, ఆర్థిక సంబంధ

బాంధవ్యాలు ఎలాంటి మౌలిక మార్పు లేకుండా పందొమ్మిదవ శతాబ్దం వరకు కొనసాగాయి. దీని చరిత్రలోని ఏకత్వం, దీని ఆదర్శాలు, మానవీయ మర్యాద భారతదేశానికి సజీవ ఆత్మ లాంటిది. పరిస్థితులకు ప్రభావితమై తాత్కాలికంగా బయల్పడే ఏదో ఒక అంశం కన్నా కూడా ఇదెంతో మహత్వపూర్వకమైనది. ఈ ప్రత్యేకత (అనగా ఏకత్వం, ఆదర్శాలు, మానవీయ మర్యాద) మనలోని వివిధ వర్గాల్ని, విశ్వాసాల్ని, ఆచారాల్ని, సంస్థల్ని, ఆర్ట్ మరియు ఫిలాసఫీల భిన్నత్వాన్ని ప్రదర్శిస్తుంది. ఇది మన చారిత్రక అసఫలతల్ని, సఫలతల్ని, మన ప్రయత్నాల్ని మన విజయాల్ని బయల్పరుస్తుంది. సమాజంలో వస్తున్న మార్పుల సమయంలో కూడా ఇది స్థిరంగా ఉండగలిగింది. ఈ అంతర్గత శక్తి కారణంగానే ద్రావిడుల కంటే ముందున్న తెగలు, ఆ తరువాత వచ్చిన ద్రావిడుల్ని, ఆర్యుల్ని ఆ ప్రాచీన సమాజ స్రవంతిలో పూర్ణంగా కలుపుకోగలిగింది. ఈ కలయికయే మహోన్నత తత్వాల్లో, అందమైన పరిశ్రమల్లో, సుందరమైన ఆర్ట్, కళల్లో ప్రదర్శితమయింది. ఈ విధంగా అది మన చరిత్ర ప్రథమ ఘట్టాన్ని నిర్మించగలిగింది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, మహావీర్, గౌతమబుద్ధుడు, చంద్రగుప్తుడు, అశోకుడు, వాల్మీకి మరియు వ్యాసముని మొదలైన వారంతా ఆ కాలపు ఆత్మ యొక్క సుందర స్వరూపానికి ప్రతీకగా నిలిచారు. సారనాథ్, సాంచిలోని ప్రాచీన కట్టడాలు, బాగ్, అజంతాల్లోని సుందర శిల్పకళలు, ఖజ్‌రావ్, భువనేశ్వర్‌ల మందిరాలు, కాళిదాస్ మరియు భవభూతి నాటకాలు ఆ మహోన్నత కాలపు సజీవ జ్ఞాపకాలు.

ఈ కాలం సమాప్తయ్యే సమయానికి భారత సమాజం అరబ్బులు, తుర్కులు, మొగలుల ప్రభావాల్ని చూసింది. ప్రాచీన భారత సంస్కృతికి, ఈ కొత్తగా వచ్చిన వారికి మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. అయితే ఈ రాజకీయ ఘర్షణలు పూర్తిగా సమాప్తం కాకముందే మన సమాజ కొత్త నిర్మాణం ప్రారంభమయింది. ప్రారంభంలో పూర్తి వ్యతిరేకంగా కనబడిన హిందూ ధర్మం మరియు ఇస్లాంలు చివరికి పరస్పరం కలిసిపోయాయి. ఈ రెండు ధర్మాలు కూడా లోతుగా తమ పునాదుల్లోకి పోయి, సంచలనాన్ని సృష్టించాయి. ఈ రెండింటి కలయిక వల్ల భక్తి ఉద్యమం, సూఫీయిజంలతో కూడిన ధర్మం బయల్పడింది. వివిధ ధర్మాలకు, వర్గాలకు చెందిన లక్షలాది భారతీయ ప్రజల హృదయాల్ని తన వైపు లాక్కోగలిగిన ప్రేమ, నైర్మల్యాలతో కూడిన వినూత్న ధర్మం. ఇస్లామీయ సూఫీయిజం, హిందూ భక్తి ఉద్యమాల కెరటాలు చివరికి ఒక మహానదిలో కలిసిపోయాయి. పాడుబడిన ప్రాంతాల్ని సస్యశ్యామలం చేయడమే కాకుండా దేశ పరిస్థితుల్నే మార్చివేసిందిది. శుష్క కఠోరమైన ఇస్లామీయ భక్తితత్వాన్ని, భయంగొలిపే ఆధిక్యతను పరిపూర్ణమైన కోమలతతోను, ఆచార సాంప్రదాయాల సమృద్ధితోను మరియు హిందూ ధర్మంతో వాటి స్వాభావిక ఐక్యతలనే పరవశింపజేసే భావనలతో కలిపేసింది. ఫలితంగా చిరస్మరణీయమైన మహోన్నత కట్టడాలు, అపురూపమైన చిత్రలేఖనం, సంగీతం మరియు కవిత్వాన్ని సృష్టించగలిగింది. ఇంకా ప్రేమనే ఆత్మతో నిండిన ఎలాంటి ధర్మాన్ని ప్రచారం చేసిందంటే, అది భారత దేశ మధ్యయుగం నాటి చరిత్ర యొక్క అమూల్య సంపద మరియు వారసత్వం.

భారత దేశ చరిత్ర సంపూర్ణ అధ్యయనం – గాఢమైన, సువిశాలమైన రెండు రకాల అధ్యయనం – మునుపటికన్నా నేటి కాలపు అతి తీవ్ర అవసరము. చరిత్రను మనం చిన్న చిన్న ముక్కలుగా విభజించవచ్చా అనేది ప్రశ్న. ఇది ప్రాచీన యుగపు చరిత్ర అని, ఇది మధ్యయుగపు చరిత్ర అని, ఇది ఆధునిక యుగపు చరిత్ర అని భాగించవచ్చునా? ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన సుప్రసిద్ధ ప్రొఫెసర్ ఫ్రీమ్యాన్ సిద్ధాంతాన్ని అనుసరించి, వరుసక్రమంగా, ఎడతెగకుండా, ఏకంగా చరిత్ర అధ్యయనం చేయడమనేది మాడ్రన్ సైంటిఫిక్ అధ్యయనపు ప్రధాన సూత్రం. డాక్టర్ బి.యన్. భండార్కర్ కూడా ఈ సిద్ధాంతాన్నే బలపరిచారు. ఆయన అనేదేమిటంటే :

"భారతీయ చరిత్రను హిందూయుగము, ముస్లిం యుగము మరియు బ్రిటీష్ కాలమని మనం వివిధ భాగాలుగా విభజించలేము. ఇంతకు మించిన నిరర్ధకపు విషయం మరొకటి లేదు. దీని అర్థం ఏమిటంటే ముందుగా హిందూ, ముస్లిం లేక క్రైస్తవులయినా కావాలి లేదా ప్రాచీన, మధ్య మరియు ఆధునికమైనా కావాలి. మొదటి విషయం భారతీయ చరిత్రను మతతత్వాల ప్రాదిపదికపై విభజించడమవుతుంది. అందుకని దీన్ని భారతీయ చరిత్ర గ్రంథాల నుండి శాశ్వతంగా తీసివెయ్యాల్సిందే. ఇక రెండవ రకం అనగా ప్రాచీన, మధ్య మరియు ఆధునిక అనే విభజనను కేవలం అధ్యయనంలో సౌలభ్యం కోసం మాత్రమే ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేకించి సాంస్కృతిక అధ్యయనం కోసం. అయితే ఈ సందర్భంలో ఒక విషయం మాత్రం మనో మస్తిష్కాల నుండి దూరం కానివ్వరాదు. అదేమిటంటే కేవలం ఊహించడానికి మాత్రమే, ప్రత్యేకత కోసమే ఈ విభజన చేసుకున్నామని, కార్యాచరణ రూపంలో, ఆచరణాత్మకంగా చరిత్రను ప్రపంచంలో నిరంతరంగా, ఎడతెగకుండా జరిగే సంఘటనల పరంపరగానే భావించాలి. వాస్తవంలో కూడా చరిత్ర యొక్క మౌలిక భావన ఇదే. చరిత్ర అధ్యయనం చేస్తున్న ఏ విద్యార్థిని అడిగినా మనకిదే సమాధానమిస్తాడు."

ఇక ఇప్పుడు భారత దేశంలోని వివిధ వర్గాల్లో పెరిగిపోతున్న అనైక్యత, ఉద్రిక్తత, వేర్పాటు, వికీర్ణానికి అసలు కారణాలేమిటనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది. వీటికి మౌలిక కారణం అపార్థం అనేది నగ్న సత్యం. ఈ అపార్థమనేది ఎన్నో రూపాల్ని సంతరించుకుంటుంది. ఎన్నో రకాలుగా బయల్పడుతుంది. ఈ అపార్థమే భారత దేశ చరిత్రను తనకిష్టమైన రీతిలో విశదీకరిస్తుంది. దీనివల్ల ఇరు పక్షాల్లోనున్న అతివాదులకు, చారిత్రక సంఘటనల్ని, విషయాల్ని తమ కిష్టమైన, తాము కోరే వివిధ సిద్ధాంతాలకు, సూత్రాలకు అనువుగా మలుచుకునే అవకాశం కల్పిస్తుంది. అపనమ్మకమనేది వ్యక్తుల మరియు వారి ఉద్దేశాలకు సంబంధించి మన నిర్ణయాలపై ప్రభావితమవుతుంది. కావాలనో, అయాచితంగానో జరిగిన పొరపాటును పెంచి, పోషించి దాన్ని ఉద్దేశపూర్వకంగా జరిపిన దౌర్జన్యంగా పేర్కొంటుంది. యుద్ధంలో జరిగే చిన్న సంఘటనను, చట్టోల్లంఘనకు ఇవ్వబడే శిక్షను ప్రణాళికాబద్ధంగా చేసిన అణచివేతగా చెప్పుకొస్తుంది. ఈ అనుమానం లేక అపార్థమనే పెనుభూతం మొత్తం జీవిత సూత్రాన్నే మసకబార్చింది. ఆచార వ్యవహారాల్లో, సంస్కృతి సాంప్రదాయాల్లో, మాట్లాడే పద్ధతిలో,

వస్త్రధారణ తీరులో, జీవన పద్ధతిలో, భుక్తికోసం జరిగే ప్రయత్నాల్లో కనబడే సూక్ష్మమైన వ్యత్యాసాన్ని కొండంతలు చేసి సభ్యత సంస్కృతుల, ఆర్థిక, సామాజిక, రాజకీయ మరియు భావుక ఆదర్శాల్లో దాటరాని అగాధాలున్నట్లు చూపించబడుతుంది. వ్యక్తిగత లేక వర్గపరమైన అభిలాషతో జరిగే ప్రతి ఘర్షణను తీవ్రమైన సామాజిక వేర్పాటువాదంగా, మతతత్వ మరియు సాంస్కృతిక అనైక్యతకు చిహ్నంగా పేర్కొనబడడం ఆశ్చర్యకరంగా లేదూ?

దురదృష్టవశాత్తు మన పాఠశాలల్లోను, కాలేజీల్లోను గడిచిన ఎన్నో తరాల నుండి యూరోపియన్ చరిత్రకారులు వ్రాసిన చారిత్రక గ్రంథాలే చదివించబడుతున్నాయి. యూరోపియన్ అధ్యాపకులు ఏదైతే నేర్పారో, వాటి ప్రభావాల నుండి భారతీయులు ఇంకా మేల్కొనలేక పోతున్నారు. వీరు రచించిన ఈ చరిత్ర గ్రంథాల వల్ల మన భారతీయ సమాజం, ప్రజాజీవనం విషపూరితమైపోతున్నది. ఈ గ్రంథాల్లో హిందూ-ముస్లింలు పరస్పరం ఒకరిపైనొకరు చేసిన హింసాత్మక సంఘటనల్ని, ప్రత్యేకంగా వేలెత్తి చూపటం జరుగుతుంది. ఈ గ్రంథాల్లో ఒకరు వేరొకరి ప్రాంతాల్ని ఎలా జయించేవారో, ఏ విధంగా హింసా, దోపిడీ దౌర్జన్యాలు చేసేవారో, ఎలాంటి ధార్మిక పక్షపాతం చూపేవారో వర్ణించబడుతుంది. ఈ చారిత్రక గ్రంథాల్లో ముస్లింలు, ఏ విధంగా హిందువుల సంస్కృతిని, ఆచార వ్యవహారాలను ఛిన్నాభిన్నం చేసేందుకు ప్రయత్నించారు. వారి మందిరాలను ఎలా ధ్వంసం చేశారు, వారి విగ్రహాలను ఎలా నాశనం చేశారు- అనే అంశం విపులీకరించబడుతుంది. అంతేకాక ఇస్లామీయ ధర్మం స్వీకరించాలని, లేకపోతే ఖడ్గం ఉపయోగించబడుతుందనే భయంకర షరతును హిందువులకు ప్రతిపాదించే వారని కూడా రాయబడింది. ఇలాంటి విషయాలు చాలా చిన్న వయస్సులో బోధింపబడతాయి. దీని ప్రభావం వల్ల ఆ లేత మనసులపై విషపూరిత భావాలు గాఢంగా నాటుకుపోతాయి. ఆ తరువాత అవి చెదిరిపోవటం ఉండదు. అందువలనే మన దేశంలోని హిందూ ముస్లింలు ఒకరినొకరు అనుమాన దృష్టితో చూడటానికి అలవాటు పడ్డారంటే అందులో ఆశ్చర్యపడనవసరం లేదు. వారిలో పరస్పరం శాశ్వితమైన అపనమ్మకం ఏర్పడి పోయింది. ముస్లింల ఎనిమిది వందల సంవత్సరాల పరిపాలనా కాలం కేవలం దమననీతితో కూడుకున్నదని హిందువులు నమ్మకుండా ఉండలేకపోతున్నారు. వారికి ముస్లింల పరిపాలనా కాలపు చరిత్ర గర్వించదగినదిగా కనిపించదు. దానిని వారు పక్కకు నెట్టి, తమ ప్రాచీన కాలపు చరిత్ర నుండే సర్వం నేర్చుకొనదలుస్తారు. దాన్నే స్వర్ణయుగంగా భావించి శ్లాఘించటంలో మునిగిపోతారు. అంతేకాక యూరోప్‌కు చెందిన ఒక క్రైస్తవ జాతి ముస్లింల నుండి రాజ్యాధికారాలు లాక్కున్న తరువాత, హిందువులు వీరిని (ముస్లింలను) దురాక్రమణ దారులుగా భావించటానికి అలవాటు పడ్డారు. ఈ ముస్లింలు కూడా భారతీయ చరిత్రలో తమవారు సాధించిన ఘనకార్యాలపై మాత్రమే గర్వించసాగారు. అంతకు ముందున్న చరిత్రను వారు విస్మరించారు. నిజానికి ఆ చరిత్ర ఆధారంగానే వారి సాంస్కృతికపరమైన ఘనకార్యాలు సాధ్యమయ్యాయి. వాస్తవంగా భారత ప్రాచీన చరిత్రను కూడా వారు గౌరవించాలి. హిందూ ముస్లింలను ఇలాంటి భావోద్రేకాలకు గురి చేయటంలో ఆంగ్లేయ

చరిత్రకారులు అత్యధికంగా తోడ్పడ్డారు. Sir H.M. Eliot వ్రాసిన "History of India as told by its own Historians" ప్రఖ్యాతిగాంచింది. దీని మొదటి సంపుటి పీఠికలో ఈ వాక్యాలు కనబడతాయి.

"మనం అధ్యయనం చేయబోయే రాజులు ఎలాంటివారంటే వారు సోమరితనం లోనూ, భోగలాలసత్వంలోనూ నిమగ్నమై ఉండేవారు. వారి పాపాలు కాలిగోలా, క్లోడిస్‌ల పాపాలకు మించిపోయాయి."

"ఇలాంటి రాజుల పరిపాలనా కాలంలో న్యాయవ్యవస్థ అత్యంతంగా చెడిపోయి ఉండేది. ప్రభుత్వ టాక్సులు, శిస్తులు అత్యంత హింసాదౌర్జన్యాలతో వసూలు చేసేవారు. గ్రామాలకు నిప్పంటించేవారు. ప్రజల అవయవాలను కోసేసేవారు. వారిని బానిసలుగా విక్రయించేవారు. ఇలాంటి సంఘటనలు చదివి మీరు ఆశ్చర్యపోనక్కరలేదు. ప్రభుత్వాధి కారులు ప్రజల్ని రక్షించటం అటుంచి, వారే స్వయంగా దొంగలు, దోపిడీదారులుగాను, సంఘవిద్రోహులుగాను వ్యవహరించేవారు. రాష్ట్రాల నుండి సొమ్మును కొల్లగొట్టి, మహలుకు పంపినప్పుడు మహలు సంరక్షకులు దానితో విలాసవంతమైన జీవితం గడిపేవారు. పేదల గోడును వినిపించుకునే నాధుడేలేడు. దౌర్జన్యానికి పూనుకునేవారు, వారి ఇష్టం వచ్చినరీతిలో వ్యవహరించినా వారినడిగేవారు లేరు."

మొదటి సంపుటపు కొన్ని భాగాలు చదివిన తరువాత తెలిసేదేమంటే "హిందువులు, ముస్లింలతో ఘర్షణ పడితే వారు వధింపబడేవారు. ధార్మిక బహిరంగ సభలు జరుపుకోవటం, ధార్మిక స్నానాలు చేయటం నిషేధించబడింది. వారిపట్ల అత్యంత పక్షపాతంతో వ్యవహ రించబడేది. వారి విగ్రహాలు నష్టపరిచి, వారి మందిరాలు ధ్వంసం చేయబడేవి. వారిని బలవంతంగా ముస్లింలుగా మార్చేవారు. వారి కన్యల్ని హింసా దౌర్జన్యాలతో పరిణయ మాడేవారు. వారి ఆస్తులు జప్తు చేసుకొనబడేవి. వారి సర్వ సంహారం జరుగుతుండేది. ఈ రాజులు (ముస్లిం రాజులు) భోగలాలసత్వంలోను, మద్యపానంలోను మునిగి ఉండేవారు. వారి ఈ శీలవర్ణన ఎలాంటి అతిశయోక్తితోనూ చేయబడలేదు" అనే వాక్యాలు కనబడతాయి.

మొదటి సంపుటిలోని పై వాక్యాలు మీరు చదివారు. దీనితోపాటే బ్రిటిష్ ప్రభుత్వ దస్తావేజుల్ని (ఉత్తర ప్రత్యుత్తరాలు) మీరు అధ్యయనం చేస్తే ఆంగ్లేయులు 'విభజించు-పాలించు' అనే సూత్రాన్ని ఎంత పకడ్బందీగా అమలు చేశారో మీకు అర్థమైపోతుంది.

బ్రిటిష్ సెక్రటరీ ఆఫ్ స్టేట్స్ అయిన వోడ్స్ క్రీ.శ. 1862 మార్చి 3వ తేదీన భారతదేశం లోని లార్డ్ అల్గిన్‌కు ఒక లేఖ రాస్తూ ఇలా సూచనలిచ్చాడు. "ఒకరిని ఇంకొకరికి వ్యతిరేకులుగా చేయటం వల్లనే భారతదేశంలో మనమింతవరకు మన అధికారాన్ని కాపాడుకోగలిగాం. ఈ పాలసీని అలాగే కొనసాగనివ్వాలి. అందుకని అక్కడి ప్రజల్లో ఉమ్మడి భావనలు ఉత్పన్నం కాకుండా సాధ్యమైనంతవరకు ప్రయత్నాలు చేస్తూ ఉండాలి."

1862 మే 9న, అదే హోదాలోనున్న వోడ్స్, అదే ఆల్గన్‌కు ఇంకొక లేఖ రాస్తూ ఇలా పేర్కొన్నాడు: "మనకు వ్యతిరేకంగా ఏర్పడే విరోధాన్ని గట్టిపడనివ్వరాదు. అక్కడి ప్రజల్లో ఒకరిపట్ల ఇంకొకరికి శత్రుత్వం ఉన్నట్లయితే, అది మనకు చెప్పుకోదగ్గ శక్తి అని విశ్వసించాలి. ఒకవేళ సర్వ భారతదేశం మనకు వ్యతిరేకంగా ఏకమైపోతే మనమక్కడ ఎలా ఉండగలుగుతాం?"

1886 మార్చి 26న ఇంకొక సెక్రటరీ ఆఫ్ స్టేట్ అయిన జార్జ్ ఫ్రాన్సిస్ హెమిల్టన్ భారతదేశ వైస్రాయ్ అయిన లార్డ్ కర్జన్‌కు ఒక లేఖ రాస్తూ ఈ సలహా ఇచ్చారు : "భారత దేశంలో మన ప్రభుత్వానికి ఇప్పుడిప్పుడే ఏ ప్రమాదమూ లేదని నా భావన. కాని యాభై సంవత్సరాల తరువాత, పాశ్చాత్య తరహాలో కల్లోలం సంస్థాపరమైన శక్తి ఉత్పన్నమయ్యే ప్రమాదం తప్పక ఏర్పడుతుంది. కాని విద్యావంతులయిన భారతీయుల్ని మనం రెండు వర్గాలుగా విభజిస్తాం. ఈ రెండు వర్గాలు తమ భావనలు, ఆలోచనల్లో పరస్పరం అత్యంత వ్యతిరేకులై ఉంటారు. రాబోయే కాలంలో విద్యావ్యాప్తి వల్ల మన ప్రభుత్వంపై తీవ్రమైన, ఎడతెగని దాడులు జరుగుతాయి. కాని మనం భారతీయుల్లో పరస్పరం వ్యతిరేకతను సృష్టి స్తుంటే, దానివల్ల మన ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. అందుకని మనం బోధనా కేంద్రాల (విద్యాలయాల) కోర్సుల్లో ఎటువంటి గ్రంథాలు చదివించాలంటే తద్వారా అక్కడి వివిధ వర్గాల్లో వ్యతిరేకత దృఢం కావాలి."

1887 జనవరి 14న క్రాస్ అనునతను భారత గవర్నర్ జనరల్ అయిన డఫ్రిన్‌ను సంబోధిస్తూ ఇలా వ్రాశాడు: "అక్కడి ప్రజల్లో ధార్మిక వ్యతిరేకత సృష్టించటం మనకు అత్యంత లాభదాయకం. మీరు భారత విద్యావిధానాన్ని, కోర్సును ప్రతిపాదించటానికి ఏర్పరిచిన కమిటీ ద్వారా మనకు మంచి ఫలితాలు చేకూరుతాయని ఆశిస్తున్నాం."

ఈ విధంగా ఒక ప్రత్యేక పాలసీ క్రమం, భారతదేశ చరిత్రకు సంబంధించిన సిలబస్ పుస్తకాలను రూపొందించారు. సంఘటనల్ని వక్రీకరించి అసత్యాలను జొప్పించి భారతదేశ మధ్య యుగం నాటి ముస్లిం పాలకులు, హిందువుల పట్ల అత్యంత హింసా దౌర్జన్యాలు జరిపారని, ముస్లిం ప్రభుత్వ కాలంలో వారు భయంకరమైన నరకయాతనల్ని అనుభవించారని, ఈ రెండు వర్గాల సాంఘిక రాజకీయ, ఆర్థిక జీవన రంగంలో ఎలాంటి ఉమ్మడి విలువలూ లేవని తెలుపటానికి ప్రబల ప్రయత్నాలు జరిగాయి."

ఇకిప్పుడు వీరు మోపిన నిందల్లో వాస్తవం ఎంతవరకు అనే విషయాన్ని పరిశీలిద్దాం. ఈ విషయంలో సమకాలీన చరిత్రకారులు ఏమని పేర్కొన్నారో, పరిశీలించాల్సి ఉంటుంది. ఖాజి గియాసుద్దీన్ ఈ విషయంపై తన చింతను వ్యక్తపరుస్తూ ఇలా వ్రాశాడు.

"మధ్య యుగంలో భారతదేశంలో పరిపాలకులు ముస్లింలై ఉన్నప్పటికి ప్రభుత్వం మాత్రం ఇస్లామీయ ప్రభుత్వం కాదు. పవిత్ర గ్రంథాలైన ఖుర్‌ఆన్, హదీసు మరియు సున్నీ ధర్మశాస్త్ర నాలుగు ఆలోచనా విధానాలు (School of Thoughts) రూపొందించిన చట్టాలను ప్రభుత్వం అనుసరించేది కాదు."

భారతదేశంలో మధ్యయుగంలో ఏర్పడిన ప్రభుత్వాన్ని ధార్మిక ప్రభుత్వం అనడం పొరపాటు. దీనికి కారణం ఏమిటంటే ముస్లింల ధార్మిక గురువుల ఆదేశాలను ఈ ప్రభుత్వం అనుసరించేదికాదు. పదమూడవ శతాబ్దం తరువాత వచ్చిన దాదాపు ప్రతి ముస్లిం పరిపాలకుడు ఈ విషయంలో తన అశక్తతను వ్యక్తపరిచాడు. మరియు ప్రభుత్వాన్ని షరీఅత్ ప్రకారం నడపడం సాధ్యం కాదన్నారు. అల్తమష్, బాల్బన్, అలావుద్దీన్ ఖిల్జి, ముహమ్మద్ బిన్ తుగ్లక్ వీరంతా మొగలులకన్నా ముందొచ్చిన భారత ముస్లిం పరిపాలకులు. వీరు భారత దేశంలో ఇస్లామీయ చట్టాల అనుసరణ యొక్క ఔచిత్యంపై అభ్యంతరాన్ని తెలిపారు.

నిజాముద్దీన్ తన అభిప్రాయాల్ని ఇలా వ్యక్తపరిచాడు.

“బాల్బన్ ధర్మంకన్నా ప్రభుత్వ వ్యవహారాలకే ప్రాధాన్యత నిచ్చేవాడు.” (తబ్ఖాతె అక్బరి, వా-1, పేజి-82)

జియావుద్దీన్ బర్నీ ఇలా అంటాడు: “శిక్ష మరియు ప్రభుత్వ అధికారాలను వినియోగించడంలో అతను దైవభీతికి అతీతుడై వ్యవహరించేవాడు. ఇంకా తానుచేసే పని షరిఅత్‌ను అనుసరించి ఉందా లేదా అని పట్టించుకోకుండానే తనకు తోచింది చేసేవాడు.” (షెరోజ్ షాహి చరిత్ర, పేజి-7)

ఖాజి ముగైసుద్దీన్ మరియు అలావుద్దీన్ ఖిల్జీలో జరిగిన చర్చ ప్రసిద్ధిగాంచింది. ఖాజీని సాగనంపేటప్పుడు అతనిలా అన్నాడు:

“ప్రభుత్వ ప్రయోజనాల దృష్ట్యా సముచితమనిపించిన దాన్నే నేను ఆదేశిస్తాను. ప్రళయం రోజు మహోన్నతుడైన దైవం నా పట్ల ఎలా వ్యవహరిస్తాడో నాకు తెలియదు.” (ఫెరోజ్ షాహి చరిత్ర, పేజి-296)

ఈ విషయంలో ప్రొఫెసర్ హబీబ్ ఇలా అంటారు:

“ఆరేడు శతాబ్దాల వరకు భారత సింహాసనాన్ని అధిష్టించిన అత్యధికమంది ముస్లిం పాలకులు విదేశీ సంతతికి చెందిన వారనేది నిజమే అయినప్పటికీ వారు అధిష్టించిన సింహాసనం ముస్లిం ప్రభుత్వ స్థాపన కోసం కాదు, అందుకే వారందులో (పరిపాలించడంలో) సఫలమయ్యారు. అలాకాకపోయి ఉన్నట్లయితే వారు ఒక్క తరం వరకు కూడా నిలబడగలిగేవారు కాదు.” (మిడీవల్ ఇండియా, క్వార్టర్లీ, పేజి-5)

సర్ అల్ఫ్రడ్, లాయెల్ ఏషియాటిక్ స్టడీస్‌లో ఇలా రాశాడు : “భారతదేశాన్ని తమ ధర్మం ప్రకారం మలిచే భావనకు ముస్లిం పాలకులు ఎంతో దూరంగా ఉన్నారు.”

ఇకిప్పుడు చరిత్రను ఎలా వక్రీకరించడం జరిగిందో తెలిపే దృష్టాంతాలను సమర్పించే అవకాశమివ్వండి.

“1928లో నేను అలహాబాద్‌లో టిప్పుసుల్తాన్‌పై రిసెర్చ్ చేస్తున్నప్పుడు అక్కడి కాలేజి పిల్లలు నా వద్దకు వచ్చి తమ “హిస్టరీ అసోసియేషన్”కు ప్రారంభోత్సవం చేయాల్సిందిగా కోరారు. వారు కాలేజీ నుండి సరాసరి నా వద్దకే రావటం వల్ల వారి వద్ద కాలేజీ సిలబస్

పుస్తకాలున్నాయి. అయాచితంగానే వారివద్ద వున్న ఒక చరిత్ర పుస్తకం తీసుకొని పేజీలు తిరగేయసాగాను. అందులో టిప్పుసుల్తాన్ గురించి ఒక అధ్యాయం ఉంది. దాన్ని చదవటం ప్రారంభించాను. అందులోని కొన్ని వాక్యాలు నాకు అనుమానం కలిగించాయి. అందులో టిప్పు సుల్తాన్ ఇస్లాంను స్వీకరించమని దౌర్జన్యం చేయటం వల్ల మూడువేల మంది బ్రాహ్మణులు ఆత్మహత్య చేసుకున్నారు అని వ్రాసి ఉంది. ఈ గ్రంథాన్ని రూపొందించినవారు కలకత్తా యూనివర్శిటి సంస్కృత శాఖ అధ్యక్షులైన మహా మహోపాధ్యాయ్ డాక్టర్ హరిప్రసాద్ శాస్త్రి. నేను వెంటనే శాస్త్రి గారికి ఒక లేఖ రాస్తూ పై వాంగ్మూలానికి సాక్ష్యం తెలుపగలరని అడిగాను. నేనెన్నో ఉత్తరాలు వ్రాసిన తరువాత అది మైసూర్ గజిటీర్ నుండి గ్రహింపబడిందని సమాధానమిచ్చారు. గజిటీర్ నాకు అలహాబాద్‌లో గాని, ఇంపీరియల్ లైబ్రరీ, కలకత్తాలో గాని లభించలేదు. ఆ కాలంలో సర్ బ్రిజేందర్‌నాథ్ సేల్, మైసూర్ యూనివర్శిటీకి వైస్ ఛాన్సలర్‌గా ఉన్నారు. నేనొక ఉత్తరం ఆయనకు రాస్తూ టిప్పు సుల్తాన్‌కు సంబంధించిన నిజానిజాలు తెలపాల్సిందిగా కోరాను. ఆయన నా లేఖను ఆ కాలంలో మైసూర్ గజిటీర్ కొత్త ఎడిషన్‌ను రూపొందిస్తున్న ప్రొఫెసర్ శ్రీ కాంతయ్యగారి వద్దకు పంపారు. ఆయన నా లేఖకు సమాధానమిస్తూ మైసూర్ గజిటీర్‌లో ఇలాంటి ఏ సంఘటన ప్రచురించబడలేదని, అంతేకాక తాను మైసూర్ చరిత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేశానని, అందుకని మైసూర్‌లో ఇటువంటి సంఘటన ఏదీ జరిగి ఉండలేదని విశ్వసనీయంగా చెప్పగలనని, టిప్పు సుల్తాన్‌కు పూర్ణయ్య పేరుగల ఒక బ్రాహ్మణుడు మంత్రిగా ఉండేవాడని, అతని సైన్యాధిపతి కూడా క్రిష్ణారావు పేరుగల ఒక బ్రాహ్మణుడేనని తెలుపుతూ లేఖ వ్రాశారు. అంతేకాక టిప్పు సుల్తాన్ తన పరిపాలనా కాలంలో ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం చేసే నూటయాభై ఆరు మందిరాల లిస్టును కూడా ఆయన పంపించారు. టిప్పు సుల్తాన్‌కు శృంగేరి మఠాధిపతి అయిన జగద్గురు శంకరాచార్యులవారితో సన్నిహిత మిత్ర సంబంధాలుండేవని, అంతేకాక టిప్పు సుల్తాన్ శంకరాచార్యుల వారికి రాసిన లేఖల్లో నుండి ముప్పై లేఖల నకళ్ళను కూడా తమ లేఖతో జతపరిచి పంపించారు. శ్రీరంగపట్టణంలో ఉండబడే శ్రీరంగనాథస్వామి దేవాలయానికి మైసూర్ పాలకులు తరచుగా వెళ్ళేవారని, టిప్పు సుల్తాన్ కూడా ప్రతిరోజూ ఉదయం భోజనానికి పూర్వం, ఈ మందిరానికి వెళ్ళేవాడని తెలిపారు. ఆ గ్రంథకర్త అయిన డాక్టర్ శాస్త్రి ఈ సంఘటనను బహుశ కర్నల్ మాయిలెస్ వ్రాసిన "History of Mysore" నుండి గ్రహించి ఉండవచ్చని, కర్నల్ మాయిలెస్ దీన్ని తాను విక్టోరియా రాణి వ్యక్తిగత లైబ్రరీలోనున్న పారశీక భాష రాతప్రతి ఆధారంగా రాశానని చెప్పుకున్నాడని తెలిపారు. ఆ తరువాత నేను విక్టోరియా రాణి వ్యక్తిగత లైబ్రరీకి రాయగా అలాంటి రాత ప్రతి ఏదీ తమ వద్ద లేదని సమాధానం వచ్చింది. కర్నల్ మాయిలెస్ రాసిన చరిత్ర గ్రంథంలోని సంఘటనలన్నీ అభూత కల్పకలు ఆధారం లేని అసత్యాలతో కూడుకున్నవి. ఎప్పుడైతే ప్రొఫెసర్ శ్రీ కాంతయ్య గారి వద్దనుండి మైసూర్ గజిటీర్‌లో ఇలాంటి ఏ సంఘటన ప్రచురింపబడలేదని లేఖ వచ్చిందో నేను డాక్టర్ హరిప్రసాద్ శాస్త్రిగారికి ఇంకొక లేఖ రాస్తూ ఏ సంఘటననైతే మీరు

మైసూర్ గజిటీర్ నుండి తీసుకున్నానని రాశారో, ఆ సంఘటన అసలు మైసూర్ గజిటీర్‌లో ఇంతవరకు ప్రచురింపబడలేదు అని తెలుపగా ఆయన గారు ఎన్నో రోజుల తరువాత "ఈ సంఘటన మైసూర్ గజిటీర్‌లో ఉందేమోననుకున్నాను, అది మైసూర్ గజిటీర్‌లో లేకపోతే దీన్ని ఎక్కడి నుండి గ్రహించానో నాకు జ్ఞాపకం లేదు అని అతి సామాన్య సమాధానమిచ్చారు. డాక్టర్ శాస్త్రిగారు రూపొందించిన ఈ చరిత్ర గ్రంథం బెంగాల్, అస్సాం, బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల పాఠశాలల సిలబస్‌లో చేరింది. నేను ఆ కాలపు కలకత్తా యూనివర్శిటీకి వైస్ ఛాన్సలర్‌గా ఉన్న అసుతోష్ ముఖర్జీకి పై సంఘటనలన్నీ వివరిస్తూ, నా పరిశోధనా ఫలితాలను వెల్లడిస్తూ నా ఉత్తర ప్రత్యుత్తరాల నకళ్ళను పంపుతూ, ఒక లేఖ రాశాను. దీంతో ఆయన సిలబస్ నుండి ఈ పుస్తకాన్ని తొలగించేశారు. అయితే 1972లో ఉత్తరప్రదేశ్‌లోని జూనియర్ స్కూళ్ళ కోసం రూపొందించిన పుస్తకంలో తిరిగి ఈ ఆత్మహత్య సంఘటనే పునరావృతం కావటం చూసి, నేను నిర్ఘాంత పోయాను.

1930 జనవరి 23 నాటి 'యంగ్ ఇండియా' పత్రికలోని 31వ పేజీలో టిప్పు సుల్తాన్ గురించి మహాత్మా గాంధీ ఇలా రాశారు. "మైసూరుకు చెందిన ఫతహ్ అలి (టిప్పు సుల్తాన్)ను పాశ్చాత్య చరిత్రకారులు తీవ్రవాదిగాను, తన హిందూ ప్రజలపై దౌర్జన్యం చేసినవానిగాను, హిందువుల్ని బలవంతంగా ముస్లింలుగా మార్చినవానిగాను చిత్రీకరించారు. అయితే వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. హిందూ ప్రజలతో అతని సంబంధాలు అత్యంత ప్రేమపూర్వకమైనవిగా ఉండేవి. మైసూర్ రాష్ట్ర ఆర్కియాలజి డిపార్ట్‌మెంట్ వారి వద్ద క్రీ.శ. 1793లో టిప్పు సుల్తాన్, శృంగేరి మఠాధిపతి అయిన జగద్గురు శంకరాచార్యుల వారికి రాసిన లేఖలున్నాయి. అందులోని ఒక లేఖలో శ్రీ శంకరాచార్యుల వారి లేఖ ముట్టినట్లు తెలుపుతూ తన కోసం, సర్వ ప్రపంచం కోసం శ్రేయం, సమృద్ధి, సాఫల్యం కోసం తపస్సు చేయండని, ఆశీర్వదించండని ఆయనకు టిప్పు సుల్తాన్ విజ్ఞప్తి చేశాడు. ఉత్తరం చివరలో శ్రీ శంకరాచార్యుల వారు వెంటనే తిరిగి మైసూర్‌కు రావాలని, ఎందుకంటే మంచి మనుషుల ఉనికివల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని, సమృద్ధి వస్తుందని ఆయనకు మనవి చేసుకున్నాడు.

ఈ లేఖ భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో రాయదగింది. అదే 'యంగ్ ఇండియా'లో ఆయన ఇంకా ఇలా రాశారు. 'టిప్పు సుల్తాన్ హిందూ మందిరాలకు ప్రత్యేకించి శ్రీ వెంకటరమణ మందిరం, శ్రీనివాస మందిరం, శ్రీరంగనాథస్వామి మందిరాలకు జాగీర్లేకాక, ఇతర వస్తు రూపేణా అత్యంత విలువైన కానుకల్ని ఇచ్చారు. కొన్ని హిందూ మందిరాలైతే అతని రాజప్రసాదాల ప్రాంగణాల్లోనే ఉండేవి. ఇది అతని హృదయ విశాలత్వానికి, పరమత సహనానికి ప్రత్యక్ష నిదర్శనాలు. ఈ అమరవీరుడు - ఏ కోణంతో పరికించినా స్వాతంత్ర్య పరిరక్షణ రాచబాటపై నడిచిన సిసలైన అమరవీరుడు - హిందువుల దేవాలయాల్లో నుండి వెలువడే గుడిగంటల శబ్దాల్ని, తన ఆరాధనలకు ఎలాంటి ఆటంకంగా, ఇబ్బందిగా భావించలేదు. ఇదే అతని పరమత సహనానికి ప్రతీక. స్వాతంత్ర్యం కోసం

పోరాడుతూ ప్రాణాలర్పించాడే తప్ప ఆయుధాలు పడేయటానికి ఇష్టపడలేదు. అనామకులైన వీర సిపాయిల మృతదేహాలను వెదకగా టిప్పు సుల్తాన్ శవం బయటపడింది. కాని మరణించిన తరువాత కూడా అతని హస్తం, స్వాతంత్ర్య సముపార్జనకు మూలమైన ఖడ్గాన్ని వదల్లేదు. "ఒక్కరోజు పులి జీవితం, వందేళ్ళ నక్క జీవితం కన్నా శ్రేష్ఠమైనది" అని అతను నుడివిన చారిత్రాత్మక మాటలు నేడు కూడా గుర్తుంచుకోదగినవి. "సిగ్గు, పరాభవం, అవమానాలతో కూడిన బానిస బ్రతుకు బతికేకంటే ఓ ప్రభూ! శిరస్సులపై రక్తధారలను కురిపిస్తున్న యుద్ధమేఘాల క్రింద మరణించటం ఎంతో మేలు" అనే వాక్యాలు కూడా జ్ఞాపకముంచుకోవలసినవి."

"ఇదేవిధంగా నేను అలహాబాద్ మున్సిపాలిటీకి ఛైర్మన్‌గా ఉన్న రోజుల్లో దాఖిల్-ఖారిజ్ (చేర్పులు-తొలగింపు)లకు సంబంధించిన కేసు ఒకటి నా ముందుకు వచ్చింది. ఇది సోమేశ్వరనాథ్ మహాదేవ్ మందిరానికి సంబంధించిన జాగీరు కేసు. ఈ మందిరపు మహేంతుడు గతించిన తరువాత ఈ జాగీరు తనదంటే తనదని ఇద్దరు వ్యక్తులు ముందుకొచ్చారు. వీరిద్దరిలో ఒక వ్యక్తి తన కుటుంబంలో తరతరాలుగా వస్తున్న ఒక దస్తావేజును సమర్పించాడు. ఇది ఔరంగజేబ్ చక్రవర్తిచే జారీచేయబడిన ఫర్మానా. ఈ ఫర్మానా ద్వారా మందిరానికి ఒక జాగీరును, కొంత నగదును ప్రసాదించినట్లు విదితమవు తున్నది. దీన్ని చూచి నేను దిగ్భ్రాంతి చెందాను. బహుశా ఇది బూటకపు ఫర్మానా అయి ఉంటుందని నాకు అనుమానం వచ్చింది. ఎందుకంటే మనం చదువుతూ, వింటూ వస్తున్న ప్రకారం ఔరంగజేబ్ మందిరాలను ధ్వంసం చేస్తుండే వ్యక్తి. అతనేవిధంగా ఒక మందిరపు దేవత పూజా భోగాల కోసం జాగీరును ప్రసాదిస్తాడు? అతనేవిధంగా ఈ విగ్రహారాధనలో పాలుపంచుకోగలడు? కాని నేను ఒక అంతిమ నిర్ణయానికి వచ్చేముందు, పర్షియన్, అరబీ భాషల్లో ఆ కాలపు పండితుడైన 'సర్ తేజ్‌బహదూర్ సప్రూ' గారి వద్దకు వెళ్ళాను. ఆ ఫర్మానాను ఆయన నిశితంగా పరిశీలించి అది సిసలైన ఫర్మానా అని, బూటకపు ఫర్మానా కాదని తేల్చారు. అంతేకాక, ఆయన తన గుమస్తాను పిలిచి గత పదిహేను సంవత్సరాల నుండి అలహాబాద్ హైకోర్టులో కేసు నడుస్తున్న జంగంబాడి శివమందిరానికి సంబంధించిన ఫైలును తెప్పించారు. (ఆ కాలంలో అలహాబాద్ హైకోర్టుకు ఆయన జడ్జి) జంగంబాడి శివమందిరపు మహేంతుని వద్ద కూడా ఔరంగజేబ్ ద్వారా జారీచేయబడిన వివిధ ఫర్మానాలున్నాయి. వీటివల్ల ఈ మందిరానికి కొంత జాగీరు ఇచ్చినట్లు విదితమవు తున్నది. ఇదంతా చూసి నేను ఆశ్చర్యచకితుణ్ణయ్యాను. ఔరంగజేబ్‌కు సంబంధించిన ఓ కొత్తరూపం నా కళ్ళముందు మెదలసాగింది. డాక్టర్ తేజ్ బహదూర్ సప్రూ సలహా ననుసరించి భారత దేశంలోని ప్రఖ్యాతిగాంచిన వివిధ మందిరాల మహేంతులకు, పూజారులకు, వారి మందిరా లకు ఔరంగజేబ్ ఏమైనా జాగీర్లు ఇచ్చివున్నట్లయితే, అలాంటి ఫర్మానాల నఖలు నాకు పంపవలసిందిగా లేఖలు రాశాను. వివిధ మందిరాల మహేంతులు, పూజారుల నుండి

అనగా మహాకాళేశ్వర మందిరం ఉజ్జయిని, బాలాజీ మందిరం చిత్రకోట్, ఉమానంద్ మందిరం గౌహాటి, షత్రంజే జైనమందిరాలు ఇదేవిధంగా ఉత్తర భారతదేశంలోని ఇతర మందిరాలు, గురుద్వారాల మహంతులు, పూజారులు, గురువుల వద్ద నుండి వారి మందిరాలకు జారీచేసిన ఫర్మానాల కాపీలు రావటం చూసి నా తల తిరిగిపోయినంత పనైంది. ఈ ఫర్మానాలన్నీ క్రీ.శ. 1659 నుండి క్రీ.శ. 1685 మధ్య కాలంలో (అంటే ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో) జారీచేయబడ్డవే.

హిందువులపట్ల ఔరంగజేబ్ ఎంత దయార్ద్ర హృదయంతో వ్యవహరించాడో ఇది దానికి చిన్న నిదర్శనం. దీనివల్ల ఔరంగజేబ్ గురించి చరిత్రకారులు రాసిందల్లా కేవలం బూటకమని, పక్షపాతంతో కూడుకున్నదని అర్థం కావటం లేదా? మేము ఉదాహరణకు మాత్రమే కొన్ని నిదర్శనాలనిచ్చాం. భారతదేశం ఒక సువిశాలమైన దేశం. ఇక్కడ వేలాది మందిరాలున్నాయి. ఒకవేళ ఎవరయినా పూర్తి జిజ్ఞాస, వ్యయ ప్రయాసలకోర్చి పరిశోధన జరిపినట్లయితే ఇంకెన్నో ఫర్మానాలు బయటపడతాయని నేను విశ్వసనీయంగా చెప్పగలను. దీనివల్ల ఔరంగజేబ్ హిందూ ప్రజల పట్ల ఎంత విశాల దృష్టితో దయ కనికరాలతో మెలిగాడో అర్థమైపోతుంది.

ఔరంగజేబ్ తన పరిపాలనా కాలంలో వారణాసిలోని 'విశ్వనాథ మందిరాన్ని' గోల్కొండ లోని జామె మస్జిద్‌ను నిస్సందేహంగా ధ్వంసం చేయించాడు. కాని ఈ మందిరం మరియు మస్జిద్‌ల విధ్వంసానికి వెనక గల కారణాలను తెలుసుకుంటే అసలు విషయం అర్థమైపోతుంది.

వారణాసిలోని విశ్వనాథ మందిరానికి సంబంధించిన సంఘటన ఇలా ఉంది. ఒకసారి ఔరంగజేబ్ సైన్యసమేతంగా బెంగాల్ వెళ్తున్నాడు. అతని సైన్యంలో హిందూరాజులు, వారి సైన్యమూ ఉంది. వారణాసిని సమీపించగానే 'ఇక్కడ ఒక రోజు ప్రయాణాన్ని ఆపివేస్తే తమ రాణులు గంగలో స్నానం చేసి విశ్వనాథుని దర్శించకోరుతున్నారని హిందూరాజులు విన్నవించుకున్నారు. ఔరంగజేబ్ ఈ విన్నపానికి అంగీకరించాడు. అక్కడి నుండి వారణాసి ఐదు మైళ్ళ దూరంలో ఉంది. వెంటనే త్రోవ పొడవునా సైన్యం నియమించబడింది. రాణులు పల్లకీల్లో బయలుదేరారు. గంగలో స్నానం చేసి విశ్వనాథుని దర్శించుకొని, రాణులంతా తిరిగి వచ్చేశారు. కాని కచ్ ప్రాంతానికి చెందిన మహారాణి తిరిగి రాలేదు. అన్నివైపులా ఆమె కోసం గాలించారు. కాని ఆమె జాడ తెలియలేదు. చివరికి ఈ విషయం ఔరంగజేబ్‌కు తెలిపారు. అతను రాణి ఆచూకీ కోసం తన ఉన్నతాధికారుల్ని పంపించాడు. వారు ఆ ప్రాంతాన్నంతా వెదుకుతూ, వెదుకుతూ చివరికి విశ్వనాథ మందిరంలో ప్రవేశించారు. ఆ సమయంలో గణేశుని విగ్రహమొకటి గోడలో అమర్చబడి ఉంది. కాని అది కాస్త కదిలినట్లు కనబడింది. అధికారులకు అనుమానం వచ్చి ఆ విగ్రహాన్ని (బలంగా) అక్కడి నుండి తొలగించారు. ఆ విగ్రహం తొలగించగానే దాని క్రింద వారికి మెట్లు కనిపించాయి. వారా మెట్లను దిగుతూ ఒక నేలమాళిగలో ప్రవేశించారు. అక్కడ రాణిని చూసి వారు నిర్ఘాంత

పోయారు. సామూహిక బలాత్కారం కారణంగా ఆమె అసువులు బాసింది. ఈ నేలమాళిగ సరిగ్గా విశ్వనాథుని విగ్రహం క్రింద ఉంది. హిందూ రాజులు దీన్ని తీవ్రంగా నిరసించారు. తమకు న్యాయం చేయాలని చక్రవర్తిపై ఒత్తిడి చేశారు. సమస్య అత్యంత గంభీరంగా మారింది. ఈ పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేసినందున విగ్రహాన్ని వేరొక చోటికి తరలించడని మందిరాన్ని ధ్వంసం చేయండని మహేంతుని బంధించి శిక్షించండని ఔరంగజేబ్ ఆదేశించాడు.

పై సంఘటనను డాక్టర్ పట్టాభి సీతారామయ్య గారు తన ప్రఖ్యాత గ్రంథం "The Feathers and Stones" లో దస్తావేజుల సాక్ష్యాధారాలతో నిరూపించారు. అంతేకాక పాట్నా మ్యూజియం మాజీ క్యూరేటర్ అయిన డాక్టర్ పి.ఎల్. గుప్తా కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు.

గోల్కొండ ప్రభువు తానీషా పేరుతో ప్రఖ్యాతిగాంచాడు. అతను తన రాజ్యంలో శిస్తులయితే వసూలు చేసేవాడు, కాని కేంద్ర ప్రభుత్వం అయిన ఢిల్లీకి చిల్లగవ్వా పంపించే వాడు కాదు. కొన్ని సంవత్సరాల్లోనే అతనివద్ద కోట్ల ధనం పోగయిపోయింది. తానీషా ఈ ధనాన్నంతా భూమిలో పాతించి దానిపై జామె మస్జిద్‌ను కట్టించాడు. ఈ విషయం ఔరంగజేబ్‌కు తెలియగానే అతను మస్జిద్‌ను ధ్వంసం చేయించి, పాతిపెట్టిన ఆ ధనాన్ని జప్తుచేసి, ప్రజాహిత కార్యాల్లో ఖర్చు పెట్టేశాడు.

పై రెండు సంఘటనలవల్ల తేలేదేమంటే ఔరంగజేబ్ న్యాయ నిర్ణయంలో స్వచ్ఛమైన తీర్పు ఇవ్వటంలో మందిరం మస్జిద్‌ల భేదభావాన్ని పాటించేవాడు కాదు.

శివాజీకి 'షేఖ్ సదర్ ఖాజి' అనేవ్యక్తి ప్రైవేట్ సెక్రటరీగా వ్యవహరించేవాడు. శివాజీకి సంబంధించిన సర్వదస్తావేజుల్ని భద్రపరచటం, అతని ప్రత్యుత్తరాలు రాయటం అతని డ్యూటీ. సిద్ధిహిలాల్, సిద్ధి బిలాల్ అనే ఇద్దరు ముస్లింలు అతని సైనికాధికారులుగా పనిచేశారు. అతని నౌకాదళ కమాండర్లలో ఒకరు ముస్లిమే. శివాజీ ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకి కాదని, అతను ఔరంగజేబ్‌కు రాసిన ఉత్తరాల వల్ల విదితమవుతుంది. నేటికీ అవి పారస్ బెన్స్ లైబ్రరీలో భద్రంగా ఉన్నాయి. చక్రవర్తితో అతను కొన్ని రాయితీలను మాత్రమే కోరాడు. అవేమిటంటే తనకు చౌత్ (ఒక విధమైన పన్ను) వసూలుచేసుకోవటానికి, తన నాణాన్ని జారీ చేసుకోవటానికి హక్కు ఇవ్వాలని కోరాడు. శివాజీ తాత అయితే ఒక ముస్లిం గురువు–షాహ్ షర్ఫుద్దీన్‌కు శిష్యుడు. తన గురువు మీదగల భక్తితోనే, ఆయన పేరుమీద తన పెద్ద కుమారునికి షాహ్‌జీ, చిన్న కుమారునికి 'షర్‌నాజీ'గా పేర్లు పెట్టుకున్నాడు. స్వయంగా శివాజీకి 'కల్సి'లోని ముస్లిం గురువైన 'బాబా యాఖూత్' పట్ల అత్యంత భక్తి తత్పరతలుండేవి.

రాణా ప్రతాప్‌కు, అక్బర్ చక్రవర్తికి మధ్య 'హల్దీఘాట్'లో జరిగిన యుద్ధాన్ని మనమేవిధంగానూ ధార్మిక యుద్ధంగా పేర్కొనలేం. ఈ యుద్ధంలో అక్బర్ చక్రవర్తి తరఫున

నలుబదివేల మంది రాజపుత్రులు, అరువది వేల మంది మొగలు సిపాయిలు పాల్గొన్నారు. వీరందరికి రాజామాన్‌సింగ్ సర్వసేనాని (కమాండర్–ఇన్–చీఫ్)గా వ్యవహరించాడు. ఇదేవిధంగా రాణాప్రతాప్ సైన్యంలో ఎంతోమంది పఠాన్లున్నారు. అతని సైన్యంలోని ఒక భాగానికి 'హకీంఖాన్ సూర్' నాయకత్వం వహిస్తున్నాడు. జాలూర్ రాజ్యాధిపతి అయిన 'తాజ్‌ఖాన్' వేయిమింది అశ్వికులతో, రాణాప్రతాప్ సహాయార్థం పోరాడుతున్నాడు. రాణాప్రతాప్ సైన్యంలో నలుబది వేలమంది రాజపుత్రున్నారు. రాజపుత్రులు రాజపుత్రులకు వ్యతిరేకంగా, పఠాన్లు పఠాన్లకు వ్యతిరేకంగా పోరాడుతున్న యుద్ధాన్ని మనం ఇస్లాం లేక హిందూమత యుద్ధంగా ఎలా పేర్కొనగలం? ఇది కేంద్ర, ప్రాంతీయ శక్తుల మధ్య జరిగిన సంఘర్షణ మాత్రమే. రాణా ప్రతాప్ తన వీరత్వంతో తన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించాడంటే, అతను శ్లాఘించదగినవాడే. కాని ఏవిధంగానూ వీరిద్దరి మధ్య జరిగిన యుద్ధాన్ని మనం మతపరమైన యుద్ధంగా వర్ణించలేము."

"ఇటువంటి విషయాలు మనకు చరిత్రలో చదివించబడవు. కాని ఇక్కడి ప్రజల్లో విద్వేషబీజాలు నాటే విషయాలు చారిత్రక గ్రంథాల్లో రాయటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

"ఔరంగజేబ్ జారీ చేసిన ఫర్మానాల పరిశోధనా సందర్భంలో పాట్నా మ్యూజియంకు క్యూరేటర్‌గా పనిచేసిన డాక్టర్ పి.యల్. గుప్తా, శ్రీ గ్యాన్‌చందర్‌గార్లతో నాకు పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కూడా ఔరంగజేబ్‌పై గణనీయమైన చారిత్రక పరిశోధనలు జరుపుతున్నారని తెలిసి సంతోషం కలిగింది. ఔరంగజేబ్‌పై పక్షపాతులైన కొందరు చరిత్రకారులు బురదజల్లి అతని వికృత రూపాన్ని భారతదేశంలో ముస్లిం పరిపాలనకు ప్రతీకగా చూపించిన దాన్ని సత్యాన్వేషకులైన కొందరు చరిత్ర పరిశోధకులు, తీవ్ర పరిశోధనలు జరిపి వాస్తవాలను వెలుగులోకి తెస్తున్నారని తెలిసి నేనెంతో తృప్తిచెందాను. భారతదేశం సత్యప్రియులకు, సత్యాన్వేషకులకు గొడ్డుపోలేదు."

దురదృష్టవశాత్తు భారతదేశ మధ్యయుగపు మరియు ఆధునిక యుగపు చారిత్రక సంఘటనల్ని అత్యంత కురూపంగా మార్చుడం జరిగింది, అది అబద్ధాల పుట్టగా మార్చ బడింది, ఇంకా ఈ కల్పిత, అసత్య సంఘటనల్నే ఆకాశం నుండి దిగిన సత్యదైవవాణిగా స్వీకరించడం జరిగింది. ఇక ఎవరైతే సత్యాసత్యాలలో, వాస్తవం కల్పితాల్లో, యదార్థం మరియు కథల్లోని వాస్తవాలను వెలికితీయడానికి ప్రయత్నిస్తారో, అలాంటివారిని అపనిందల పాల్జేస్తారు. ఈ విధంగా మతతత్వ భావనలతో అనర్థంగా, అనుచితంగా, అవివేకంగా లాభపడి, చరిత్రను వక్రీకరించే కార్యక్రమం నిరాఘాటంగా కొనసాగుతున్నది.

ఇరుపక్షాల్లోని ఉగ్రవాదులు కేవలం చరిత్రను మాత్రమే వక్రీకరించి ఊరుకుండడం లేదు, ఖుర్ఆన్ మరియు వైదిక విశ్వాసాల్ని కూడా తమకిష్టం వచ్చిన రీతిలో వ్యాఖ్యానిస్తుండడం అత్యంత దురదృష్టకర విషయం. ఇక నీతి నిజాయితీలేని రాజకీయ నాయకులు, ఈ చెడు కార్యం వల్ల వారి జాతి ఎన్ని విపత్కర మరియు భయానక పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందో యోచించకుండానే ఈ విషబీజాలను వెదజల్లుతూ పోతున్నారు.

నేను అత్యంత అణకువ మరియు విధేయతతో మార్గభ్రష్టులైన రాజకీయ నాయకుల్ని మరియు పక్షపాతులైన చరిత్రకారులకు విన్నవించేదేమంటే, పందొమ్మిదవ శతాబ్దంలో బయల్పడిన సంఘసంస్కర్తల సమూహం వైపు దృష్టి సారించండి. హిందువుల్లోని ఈ వర్గానికి రాజారాం మోహన్‌రాయ్, మహాదేవ్ గోవింద్ రానాడే, స్వామి వివేకానంద మరియు రామకృష్ణ పరమహంసలు సారథ్యం వహించారు. వీరంతా కూడా హిందూధర్మం యొక్క స్వాతంత్ర్య భావుకపు వ్యాఖ్యానాలతో యువతరాన్ని ధర్మం యొక్క మానవీయ విలువలతో పరిచయం చేయించారు. వేరొకవైపు మానవత్వాన్నే ప్రధానాంశంగా చేపట్టిన ముస్లిం సంఘసంస్కర్తలకు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ సారథ్యం వహించారు. సయ్యద్ అహ్మద్ ఖాన్ ముస్లింల పునరుజ్జీవనం కోసం మార్గాన్ని సుగమం చేశారు. ఆయనొక ధార్మికత్వం నిండిన ముస్లిం. కాని ఆయన తన వర్గం యొక్క ధార్మిక సాంస్కృతిక పతనంపై చింతాగ్రస్తుడై ఉండేవాడు. ఆయన తన అభ్యుదయ మరియు సెక్యులర్ అప్రోచ్ (భావనల) కోసం స్వయంగా ఇస్లాం నుండే ఆధారాన్ని రాబట్టగలిగారు. భారతదేశంలో ఇస్లాం కోసం ఒక లూథర్ అవసరమున్నాడనే విషయం ఆయనకు తెలుసు. ఆయన ప్రతిపాదించిన సెక్యులరిజం మరియు అభ్యుదయ భావనలకు ప్రవక్త మహనీయులు (స) నుడివిన "(ప్రవక్తనైన) నేను ఒక మానవ మాత్రుణ్ణి తప్ప ఇంకేమి కాను" అనే వచనాన్ని పునాదిగా చేసుకున్నారు."

(ఈ సందర్భంలో ఇంకా వివరాలు తెలుసుకొనగోరేవారు, పార్లమెంట్‌ను ఉద్దేశించి డాక్టర్ పాండే చేసిన పూర్తి ప్రసంగాన్ని చూడగలరు. లేదా "ఇస్లాం, భారతీయ సంస్కృతి" అనే ఉర్దూ గ్రంథాన్ని లేదా "Islam and Indian Culture" నైనా చూడవచ్చు).

## 2. వక్రీకరించిన చరిత్ర

చరిత్ర వక్రీకరణకు సంబంధించిన నిజాలు వెలికితీసిన వారు కేవలం డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే ఒక్కరే కాదు. ప్రభుత్వ వర్గాల్లో కూడా ఇది అత్యంత చర్చనీయాంశం గానే ఉంది. ప్రభుత్వ వర్గాలకు కూడా ఇది కలవరం, తలనొప్పి కలిగించే విషయంగానే ఉంది. నిజానిజాలు తెలుసుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటో తెలుసుకుందాం.

అల్పసంఖ్యాక కమిషన్ జాయింట్ సెక్రటరీ శ్రీ ఎన్.సి. సక్సేనా ఐ.ఎ.ఎస్. గారిని ఉత్తర ప్రదేశ్‌లోని పాఠశాలల సిలబస్ పుస్తకాలను పరిశీలించి రిపోర్టు ఇవ్వాల్సిందిగా నియమించారు. ఆయన సుదీర్ఘ పరిశీలన జరిపిన తరువాత ఇచ్చిన రిపోర్టు సారాంశం ఇలా ఉంది:

"దురదృష్టకర విషయం ఏమిటంటే మన దేశానికి సెక్యులర్ రాజ్యాంగాన్నైతే ప్రతిపాదించుకున్నాం. కాని నేటివరకు కూడా మతకలహాల నుండి బయటపడలేకపోయాం. గడిచిన కొన్ని సంవత్సరాలలో దేశం వివిధ ప్రాంతాల్లో జరిగిన మతకలహాల వల్ల అధిక సంఖ్యాకుల, అల్పసంఖ్యాక వర్గాల్లో ఉద్రిక్తత పెరిగిపోతూనే ఉంది. మన సమాజం సెక్యులరిజం మౌలిక విషయాల్ని ఇంకా స్వీకరించినట్లు కనబడటం లేదు.

ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత విద్యాలయాల్లో బోధింపబడే చరిత్ర పాఠ్యాంశాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాల్లో ఓ ఉమ్మడి సామూహిక భావనను సృజించవచ్చు. వాస్తవమైన చరిత్రను ఉన్నదున్నట్లుగా చదివించాల్సి ఉంది. దీన్ని వక్రీకరించడానికి వీల్లేదు. దాన్ని రూపొందించడంలో పక్షపాతం చూపించకూడదు. కాకపోతే యువతరం భావనలు, ఆలోచనలు ఒక నిర్దిష్టదిశలో మలిగేటట్లు చరిత్రలో ఒక ప్రత్యేక పద్ధతిలోనైనా రూపొందించాలి. ఇలా జరిగితే వివేకవంతులెవరూ దీనికి అభ్యంతరం తెలుపరు. ముందు పేర్కొన్న రీతితో చరిత్రను చదివిస్తే ఇందులో తప్పులేదు. ఒకవేళ సెక్యులర్ భావాలను పెంపొందించటానికి చరిత్ర సంఘటనల్ని రూపొందించటం జరిగినప్పుడు అల్పసంఖ్యాకుల భావనలు గాయపడ కుండా చూడవలసి ఉంటుంది.

దురదృష్టవశాత్తు భారతదేశ చరిత్రకు సంబంధించి రాసిన పుస్తకాలన్నింటిలోనూ మత పక్షపాతం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. పాఠశాలల్లో బోధింపబడే చరిత్ర గ్రంథాలు లేక సిలబస్‌లో చేర్చబడిన హిందీ పుస్తకాలన్నీ కుల, మత పక్షపాతాలతో నిండివున్నాయి. ఒకే వర్గం వారికి సంబంధించిన 'హీరో' ఎన్నుకోబడతాడు. హిందువుల్ని అభిమానించే ముస్లిం పాలకులు మాత్రమే మంచివారని నిరూపించటానికి ప్రయత్నం చేయబడుతుంది.

ఉత్తరప్రదేశ్‌లో ఆరు, ఏడు, ఎనిమిదవ తరగతుల బోధనా గ్రంథాలు పాఠ్యాంశాలుగా ప్రభుత్వం ఈ క్రింది పుస్తకాలను మంజూరు చేసింది.

(1). నవ్‌భారత్, మొదటి రెండవ, మూడవ భాగం.

(2). మన ఇతిహాసం, సాంఘిక శాస్త్రం, మొదటి రెండవ, మూడవ భాగం.

'నవ్‌భారత్' అనే పుస్తకం రెండవ భాగంలో 'రాణి దుర్గావతి, అక్బర్'పై ఒక పాఠ్యాంశం ఉంది. అందులోని కొన్ని భాగాలు ఈ విధంగా ఉన్నాయి:

"రాణి దుర్గావతి దేశ గౌరవంపై మచ్చరానీయలేదు. మొగలు చక్రవర్తి క్రోధదృష్టి ఏదో ఒక రోజు ఈ చిన్న రాజ్యంపై తప్పక పడుతుందని ఆమెకు ముందే తెలుసు. అక్బర్ లోభి మనస్తత్వం మేల్కొన్నది. బలాఢ్యుడైన పరిపాలకుడు దుర్గావతి మోహంలో పడ్డాడు. ఆమె తండ్రికి ఈ విషయం నచ్చలేదు. ఈ పరిపాలకుడు ఆమెను బాహుబలంతో పొందాలను కున్నాడు. భయంకర యుద్ధం జరిగింది. చివరికి విజయలక్ష్మి లాంటి దుర్గావతితో వైదిక ఆచారాల ప్రకారం అతని వివాహం జరిగింది."

దీన్ని చదివిన ఒక లేత మనస్సుపై పడే ప్రభావం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. రాణి దుర్గావతి అధీనంలోనున్న ఆ చిన్న ప్రాంతమే నేటి భారతదేశంగా అతను భావిస్తాడు. అక్బర్‌ను ఒక సాంఘిక ద్రోహిగా, నేరస్థునిగా, విదేశీ పాలకునిగా చిన్న చిన్న ప్రాంతాలపై దాడులు జరిపి, వారిని బాధపెట్టి ఆనందంగా గడిపేవాడని భావిస్తాడు. శాంతిని స్థాపించటానికి ఒక బలీయమైన వాతావరణాన్ని ఏర్పరచటమే ఈ రచయిత ప్రగాఢవాంఛ అయి ఉంటే అతను (వేరొకచోట) యుద్ధాన్ని సహజమైనదని, అనివార్యమైనదని ఎలా నిరూపిస్తాడో చూడండి.

"హర్షవర్ధనునిపై ఒక పాఠ్యాంశం ఉంది. అందులోని ఈ భాగం గమనార్హం. "మన ఇతిహాసం, సాంఘిక శాస్త్ర విభాగం "హర్షవర్ధనుడు బెంగాల్ రాజైన శశాంకునిపై దాడి జరిపాడు. అతని రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకున్నాడు. అతను నేపాల్‌పై కూడా ఆక్రమణ జరిపి దాన్ని జయించుకోగలిగాడు. 'కాంరూప్' రాజు అతని సార్వభౌమత్వాన్ని స్వీకరించాడు. ఆ తరువాత అతను దక్షిణ భారత దేశంపై దండయాత్ర జరిపాడు. హర్షవర్ధనుని సామ్రాజ్యం సింధూ ప్రాంతం నుండి అస్సాం వరకు, హిమాలయాలు మొదలుకొని నర్మదా నది వరకు వ్యాపించి ఉండేది. అతని మరణానంతరం ఉత్తర భారతంలో చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. భారతదేశ ప్రాచీన వైభవం మంటకలిసిపోయింది."

ఒకచోట రాజ్యవిస్తరణ, స్థిరత, దేశ సమగ్రత కోసం చేయబడే యుద్ధాలు సహజమేనని, అనివార్యమని నిరూపించటానికి ప్రయత్నించబడుతుంది. కాని ఈ విధానాన్నే ముస్లిం పాలకులు అవలంబిస్తే వారిని నూటికి నూరు పాళ్ళు ద్వేషించటం ఛీత్కరించటం జరుగుతుంది.

నవభారత్ మొదటి భాగంలో 'హల్దీఘాట్'పై ఒక పద్యం ఉంది. ఈ యుద్ధం రాణాప్రతాప్, అక్బర్ చక్రవర్తి మధ్య జరిగింది. ఈ పద్య సారాంశం ఇది :

"హల్దీ ఘాట్‌లో చిత్తోడ్ వారి వీరత్వానికి సంబంధించి అపూర్వ వివరణ ఈ పద్యంలో ఉంది. కవి ఇలా రాస్తున్నాడు. ఒక వ్యక్తి పళ్ళెంలో పూజా సామగ్రిని తీసుకొని చిత్తోడ్ వైపు పోతున్నాడు. కవి అడుగుతున్నాడు. పళ్ళాన్ని అలంకరించుకొని ఎవరిని పూజించటానికి వెళుతున్నావు? రామనామ పీతాంబరాన్ని శరీరంపై కప్పుకుని నీవెక్కడికి వెళ్తున్నావు. నీ దీపం ఎక్కడ వెలిగిస్తావు. నీ హారం ఎవరికి వేస్తావు. తన స్వతంత్ర్య దుర్గంలో నుండి కోకిల ఇలా పలుకుతోంది. యువకుల సమూహం ఖడ్గాలు బూని బయలుదేరింది. స్వాతంత్ర్యం కోసం పిల్లలు సైతం మరణించటం నేర్చుకున్నారు."

ఇందులో ఒక చరిత్ర సంఘటనను ఎలా చూపించటం జరిగిందంటే హిందూ ధర్మం రక్షణకోసం ఎనలేని వీరత్వం, శూరత్వం ప్రదర్శించిందన్నదే. ఇది అత్యంత గర్హనీయమైనది. ముస్లిం విద్యార్థులు కూడా దీన్ని చదివి ఏమైనా నేర్చుకోగలుగుతారా? ఈ పద్యం ద్వారా కవి, ఎడిటర్ మత పక్షపాతం బయల్పడటమే కాదు, చరిత్రతో ఎలాంటి అవగాహన కూడా లేదనే విషయం తేటతెల్లమవుతుంది. ఇలాంటి పుస్తకాలు చదివించి మన ప్రభుత్వం లేత మనస్సుల్ని విషపూరితం చేసే ఘోర తప్పిదం చేయటం లేదా? వేయి సంవత్సరాల ముస్లింల పాలన హింసా, దౌర్జన్యం, దమననీతితో కూడుకున్నదని చదువుతూ పెరిగిన యువకుల మనో భావాలు ఎలా ఉంటాయో ఊహించండి. వారిలో ప్రతీకార వాంఛ చెలరేగదా...? గడిచిన కాలంలో వారి జీవితాలు నీచత్వానికి, హీనత్వానికి గురిచేయ బడ్డాయని తెలుసుకున్నప్పుడు వారి ప్రతిస్పందన ఎలా ఉంటుందో ఊహించలేమా? ఇలాంటి భావనల్ని

ఇలాంటి ప్రతిస్పందనను ఇలాంటి ప్రతీకార వాంఛను రేకెత్తిస్తున్నదెవరు? మనమే, స్వయంగా మనమే ఈ ద్వేషాగ్నిని రగుల్కొలుపుతున్నాం. మనదేశంలో మతతత్వాన్ని వ్యాపించడానికి వేళ్ళును కోవడానికి అవకాశం కల్పిస్తున్నాం. మనం స్వతంత్రులమైపోయాం. మనదేశం సెక్యులర్ దేశంగా రూపొందింది. అందుకని ఈ రెండు వర్గాలను విడదీసే ప్రయత్నాలు మన జాతి, దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రమాదకరమైనవి.

మన అధ్యాపకులు కూడా ఇలాంటి మతతత్వ భావనలు నిండిన పుస్తకాల ద్వారానే విద్యనార్జించి బయటికి వస్తున్నారు. అందుకని వారిలో కూడా మతతత్వపు భావనలు చోటుచేసుకోవటం సహజమే గదా!

అందుకని మన సిలబస్ పుస్తకాలు ఎలా రూపొందించాలంటే వాటిని చదవటం ద్వారా మన యువకుల్లో సామూహిక, ఉమ్మడి భావనలు ఆలోచనలు జనించగలగాలి." (ముస్లిం ఇండియా, మాసపత్రిక, డిసెంబర్ 1983)

చరిత్రను వక్రీకరించి, తప్పుగా, ఘోరంగా ఏ విధంగానైతే కాలేజీల్లో, యూనివర్సిటీల్లో బోధించబడుతున్నదో దాని పరిణామ స్వరూపంగా భారతదేశంలో మత విద్వేషాలు ఎలా రెచ్చిపోతున్నాయో, దాన్ని ఖండిస్తూ మహాత్మాగాంధీ ఒకసారిలా అన్నారు

"వక్రీకరించిన చరిత్ర మన పాఠశాలల్లో, కాలేజీల్లో బోధనా సిలబస్‌గా ఉన్నంతకాలం మన దేశంలో జాతీయ సమైక్యత, వివిధ వర్గాల మధ్య సామరస్యం అనేది సంభవమే కాదు." (హిందుస్తాన్ టైమ్స్, న్యూఢిల్లీ, 2000 జులై 14).

ఈ కారణంగానే 1962లో ఏర్పాటు చేయబడిన కొటారీ ఎడ్యుకేషన్ కమీషన్ తన రిపోర్టునే ఈ వాక్యాలతో ప్రారంభించింది: "భారతదేశ భవిష్యత్తు దాని క్లాస్ రూంలో రూపు దిద్దుకుంటున్నది." (The Destiny of India is being shaped in her class room) (గుమ్రాహ్‌కున్ తారీఖ్ నవేసి – Distortion of Indian History - Dr. Mukhtar Ahmed Makki Page 70)

కాన్పూర్‌లో జరిగిన మతకలహాల విచారణ కోసం 1932లో నేషనల్ కాంగ్రెస్ తరపున నియమించబడిన విచారణ కమిటీ రిపోర్టులో కూడా ఈ విషయం ప్రస్తావించ బడింది. రిపోర్టు ఉపోద్ఘాతంలో ఇలా పేర్కొన్నారు:

"స్కూలు, కాలేజీల్లో బోధనా సిలబస్‌గా చదివించబడుతున్న చరిత్ర గ్రంథాల్లో ముస్లిం పరిపాలనా కాలం ఎలా సమర్పించబడుతున్నదంటే, తద్వారా హిందూ-ముస్లింలలో స్నేహం, అన్యోన్యత, సోదరభావం ఏర్పడటం అత్యంత కష్టసాధ్యంగానే ఉంటుంది. (National Integration and Teaching for History - A.N. Vidyalankar, Page 3, New Delhi, 1990)

1987లో గోవాలో ఏర్పాటు చేయబడిన Indian History Congress కు ప్రారం భోత్సవం చేస్తూ ఆనాటి గవర్నర్ గోపాల్ సింగ్ ఇలా అన్నారు :

"నేడు మన దేశంలో కనబడుతున్న అసహనం, మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న దాని బాధ్యత అంతా కూడా మన పాఠశాలల్లో, కాలేజీల్లో చదివించబడుతున్న సిలబస్ గ్రంథాల కారణంగానే. చరిత్ర పేరుతో విద్వేషాల్ని రెచ్చగొడుతున్న గ్రంథాలివి. ఇవే నేడు మన అనైక్యత, అపజయం మరియు అగౌరవాలకు కారణభూతాలవుతున్నాయి."

భారత దేశంలో చరిత్రను నిర్మాణం కోసం కాకుండా విచ్ఛిన్నం కోసం, హృదయాలను కలిపేబదులు వాటిని విడదీయడం కోసం, వివిధ వర్గాల మధ్య ప్రేమ సౌభ్రాతృత్వాలు నెలకొల్పడానికి బదులు ద్వేషం, శత్రుత్వ భావనల్ని పెంపొందించడం కోసం వినియోగించడం జరుగుతున్నది.

మైనారిటీలు, ఎస్.సి., ఎస్.టీ.లు, ఇతర వెనుకబడిన తరగతుల వారి కోసం నియమించబడిన గోపాల్ సింగ్, హై పవర్ పేనల్, భారత ప్రభుత్వ గృహ మంత్రిత్వ శాఖకు 1983లో సమర్పించిన తన రిపోర్టులో ఈ విషయాన్ని ఇలా పేర్కొన్నది:

"ఆంగ్లేయుల ద్వారా రూపొందించబడిన ఏకపక్ష చరిత్ర గ్రంథాలు నేటి వరకు మన పాఠశాలల్లోనే కాకుండా యూనివర్సిటీ సిలబస్‌లో కూడా చేరి ఉన్నాయి. ఈ గ్రంథాలు అల్పసంఖ్యాకుల ధర్మం, సంస్కృతులకు వ్యతిరేకంగా విషం చిమ్ముతున్నాయి. ఈ గ్రంథాలు మనల్ని ఐక్యపరచడానికి బదులుగా విభజించే, వేరుచేసే పని చేసి పెడుతున్నాయి. అలాగని ఇది నిజమైన చరిత్ర కూడా కాదు. దానికి బదులు ఇవి మన కోట్లాది పౌరులకు వ్యతిరేకంగా వ్రాయబడిన చరిత్రలు. శతాబ్దాల క్రితం భారత దేశంపై దాడి జరిపి, మనల్ని పాలించినా, అందులో కొందరు పక్షపాతం గలవారయి ఉండొచ్చు, పాలకుల ధర్మానికి వీరు కాకతాళీయంగా చెందినవారై ఉండడమే దీనికి కారణం."

కేంద్రంలో భారతీయ జనతాపార్టీ అధికారంలో ఉన్నప్పుడు నేషనల్ కమీషన్ ఫర్ ఉమెన్ (National Commission for Women) ప్రాచీన భారత దేశంలో స్త్రీల పరిస్థితిని విశ్లేషిస్తూ ఇలా తెలిపింది: "ఆ కాలంలో భారతీయ స్త్రీలు తమ తమ ఇళ్ళలో రాణీలుగా ఉంటుండేవారు. ఎనిమిదవ శతాబ్దంలో భారతదేశంపై ఎడతెగని బాహ్యదాడులు ప్రారంభ మయ్యేంత వరకు స్త్రీల స్థానం అలాగే ఉండేది. ఈ బాహ్య దురాక్రమణదారుల కారణంగా ఇక్కడి స్త్రీల పరిస్థితుల్లో పేర్కొనదగిన మార్పులు వచ్చాయి. అంటే, ముస్లిం ఆక్రమణదారులు రాకముందు భారతీయ స్త్రీలు స్వర్ణయుగంలో ఉంటుండేవారన్నమాట. "వారు జీవితపు అన్ని రంగాల్లో పురుషులకు సరిసమానంగా పాల్గొంటుండేవారు." ఈ విధంగా భారతదేశంలోని ప్రస్తుత సామాజిక, సాంస్కృతిక చెడులకు కూడా ముస్లింలే బాధ్యులుగా నిర్ధారించడం జరిగింది. దీనిపై National Federation for Indian Women తీవ్ర అభ్యం తరాన్ని వ్యక్తం చేస్తూ దీన్ని వాస్తవాల నుండి దృష్టిమళ్లించడం, ఇంకా చరిత్రను వక్రీక రించడంగా పేర్కొంటూ, ఇలాంటి సంఘటనల్ని, పరిస్థితుల్ని వాస్తవాల వెలుగులో చూపిం చాలని, ప్రత్యేకించి ఇందులో చరిత్రను నిర్ధారిస్తూ దీనికి మతం రంగు పులమడానికి

ప్రయత్నించడం జరిగిందని ఆరోపించింది. ప్రాచీన భారత దేశపు సుగుణాలను వర్ణించడం ఒక మంచి విషయమే, అయితే దీనికోసం కొత్త కొత్త కల్పిత కథల్ని అల్లడం అత్యంత హేయమైన పద్ధతి. హిందుస్తాన్ టైమ్స్ కూడా తన సంపాదకీయంలో దీన్ని మనోకల్పిత చరిత్ర (Cooked up History) గా పేర్కొంటూ ఇలా వ్రాసింది :

"మధ్యయుగపు క్రైస్తవ ప్రచారకులు Saving Appearance (బాహ్యంగా కనబడు తున్న) పరిస్థితిని కాపాడడం అనే పేరుతో ఒక గొప్ప లా పాయింట్‌ను సృష్టించారు. దానిని అనుసరించి వాస్తవాల నుండి దృష్టిమరలిస్తూ తర్కం సహాయంతో తమ మాటనుంచేవారు, ఇంకా ప్రజల నుండి దాన్ని ఒప్పించుకునేవారు. సంఘ్‌పరివార్‌కు సంబంధించిన వాళ్ళు కూడా ఇలాంటి మాటనే చెబుతున్నారు. వారు ప్రాచీన భారతదేశంలో ఆచరణలో ఉండే మనుస్మృతి అనే ధార్మిక చట్టాన్ని, దేనిలోనైతే స్త్రీల హీనాతిహీనమైన స్థానాన్ని పేర్కొనడం జరిగిందో, దాన్ని మరిచిపోయారు. ఇదేకాకుండా వర్ణ వ్యవస్థ (జాతి, కుల వ్యవస్థ), సతీసహగ మనం, బాల్య వివాహాలు, ముసుగు (పరదా) లాంటి వాటితో కూడుకుని ఉన్న పురుషాధిక్యంపై ఆధారపడిన వ్యవస్థ. వైదిక కాలం నుండి భారతదేశంలో ఆచరణలో ఉండేది. దీనికి ముస్లిం ఆక్రమణదారులతో ఎలాంటి సంబంధం లేదు." (Editorial (Foregery) - By Fazlur Rahman Faridi, The Radiance, New Delhi, 2000 June, 11-17)

ఈ కోవకు చెందిన చరిత్రకారుల వద్ద మధ్యయుగ కాలంలో ఢిల్లీ సుల్తానులు, మొగలు పరిపాలకులు కట్టించిన పేర్కొనదగిన లేక ప్రఖ్యాతిగాంచిన చారిత్రక కట్టడాలన్నింటినీ ఎవరో ఒక ప్రాచీన హిందూ పరిపాలకుని పేరుతో సంబంధం కలపడం ప్రీతికరమైన చర్య. వీరిని అనుసరించి ఖుతుబ్ మీనార్‌ను సముద్ర గుప్తుడు కట్టించాడు. ఇంకా దాని అసలు పేరు విష్ణు స్తంభం. ఇక ఖుతుబుద్దీన్ అయితే ఇలాంటి మీనార్ల కట్టడం గురించి ఆలోచించి కూడా ఉండలేదు. తాజ్‌మహల్ ఒక శివ మందిరమై ఉండేది. దాని అసలు పేరు తేజోమహల్య లేక తేజో మహలై ఉండేది. దీన్ని 1155లో రాజా పాతమర్‌దేవ్ మంత్రి షాలికేషన్ కట్టించాడు. షాజహాన్ కేవలం దాని పేరు మార్చి "తాజ్ మహలు"గా చేశాడు. గ్రాండ్ ట్రంక్ రోడ్డును షేర్ షా కాకుండా అశోక చక్రవర్తి వేయించాడు. ఇదేవిధంగా ముస్లింలతో సంబంధమున్న ఎఱ్ఱకోట, జామె మస్జిద్ ఇంకా ఇతర ప్రాచీన కట్టడాలన్నీ హిందూ రాజుల ద్వారా నిర్మించబడినవే."

అయితే ఇంకొక వాస్తవం ఏమిటంటే, వి.ఎ. స్మిత్, ఏలియట్, డాసన్, జదూనాథ్ సర్కార్, పి.ఎన్.ఓక్ లాంటి పక్షపాతం, సంకుచితత్వం గల చరిత్రకారుల సరసన కొందరు నిష్పక్షపాతులై సంకుచితాలకు అతీతంగా ఉండే, సత్యవాదులు, న్యాయప్రియులైన చరిత్ర కారులు కూడా ఉన్నారు. వారు ఈ వక్రీకరించిన చరిత్రను రుజుమార్గంపై తీసుకు రావడానికి ప్రయత్నించారు. వారిలో డాక్టర్ తారాచంద్, డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే, ఇర్ఫాన్ హబీబ్,

సుందర్‌లాల్, బిపిన్‌చందర్, రోమిల్లా థాపర్, సతీష్‌చంద్ర, హరిబన్స్ ముఖియ మరియు డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ మొదలుగాగల వారు ప్రముఖంగా పేర్కొన దగినవారు. వీరంతా చరిత్రను దాని వాస్తవిక రూపంలో అధ్యయనం చేసి, మతతత్వపు విషానికి విరుగుడు చేసి, చరిత్రను కొత్త తరహాలో పరిచయంచేశారు. ఇటీవలనే వెలువడిన తన ఒక తీర్పులో స్వయంగా సుప్రీం కోర్టే ఇలాంటి చరిత్ర లేఖనాన్ని పూర్తిగా తప్పు (Totally Misconceived) అని పేర్కొన్నది. ఇంకా దీన్ని మూర్ఖ మెదళ్ళ ఉత్పత్తి అని, బుద్ధిమాంద్యంగా నిర్ధారించింది. (Hindustan Times, Editorial, Cookedup History-New Delhi-2000 July, 24)[1]

## 3. కాల్పనిక చరిత్ర

భారతదేశ చరిత్రకు సంబంధించి పాట్నా యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఓం ప్రకాష్ ప్రసాద్ తమ అభిప్రాయాల్ని ఇలా వ్యక్తపరిచారు :

"భారతదేశ చరిత్రను రూపొందించడంలో కొన్ని పొరపాట్లు జరిగాయి. దానివల్ల రకరకాల వ్యతిరేకతలు, పక్షపాత వైఖరులు కనబడుతుంటాయి. ఉదాహరణకు మౌర్య సామ్రాట్ అశోకుని [2] గురించి కేవలం :

1) అతను సింహాసనం కోసం తన వందమంది సోదరుల్ని హతమార్చాడు.

2) కళింగ యుద్ధంలో అతను లక్షమందిని హతమార్పించాడు.

3) ఈ యుద్ధంలో అతను లక్షన్నరమంది ప్రజల్ని బందీలుగా చేసుకొన్నాడు.

4) అతనొక కరడుగట్టిన మత పిపాసగల పరిపాలకుడు. ఎందుకంటే అతను బౌద్ధ ధర్మప్రచారం మరియు స్థాపన కోసం తన బంధువుల్ని ఆక్రమిత ప్రాంతాలకు పంపించడమే కాకుండా, తన ప్రభుత్వ ఉద్యోగుల్ని కూడా దీని కోసం వినియోగించాడు, ఇంకా దీనికోసం ప్రభుత్వ ఖజానాను దుర్వినియోగం చేశాడు.

5. అతనవలంబించిన ధార్మిక నీతివల్ల బ్రాహ్మణులు అత్యంత బాధలకు గురయ్యారు– అని మాత్రమే వ్రాసి ఊరుకుంటే, అమాయకుడైన పాఠకుడు ఏమనుకుంటాడు? అశోకుడు ఒక చెడ్డ, క్రూరమైన పరిపాలకుడని, ఇంతపెద్ద సంఖ్యలో ప్రజల సర్వసంహారం జరిపిన, శత్రువుల్ని బందీలుగా చేసిన, తన స్వంత ధర్మ ప్రచారం కోసం ప్రభుత్వ ధనాగారాన్ని ఉపయోగించిన రాజు, చక్రవర్తి లేక సుల్తాన్ ఇంకెవరూ లేరనే నిర్ణయానికి రాడా?

కాని చరిత్రలో అశోకుడు చేపట్టిన సత్కార్యాలు, ప్రజాహిత కార్యాలు చరిత్ర సాక్ష్యాధారాలతో తెలుపడం జరిగింది. వాటి ఆధారంగా అశోకుణ్ణి ఒక గొప్ప చక్రవర్తిగా మనం ఒప్పుకోకుండా ఉండలేము.

కాని మహోన్నతమైన రెండు వ్యక్తిత్వాలు అనగా ముహమ్మద్ బిన్ తుగ్లక్ మరియు ఔరంగజేబ్ – ఈ ఇద్దరు పరిపాలకుల మంచి పనుల్ని మరుగుపర్చి, చరిత్ర గ్రంథాల్లో

ఒకరు పిచ్చి పరిపాలకునిగా (ముహమ్మద్ బిన్ తుగ్లక్), ఇంకొకరేమో (ఔరంగజేబ్) కరడుగట్టిన, క్రూరమైన ముస్లిం రూపంలో చూపించబడ్డారు. వాస్తవంలో ఈ ఇద్దరు పరిపాలకుల కాలంలో, అశోకునిలాగా ప్రజల సర్వ సంహారమూ జరుగలేదు, అసంఖ్యాక ప్రజలు బందీలుగా పట్టుబడనూలేదు, తమ స్వంత ధర్మం ప్రచారం కోసం ప్రభుత్వం ధనబలాలు, బంధువుల ప్రయోగమూ జరిగి ఉండలేదు.

పై విషయాల్ని దృష్టిలో ఉంచుకొని, ముహమ్మద్ బిన్ తుగ్లక్ మరియు ఔరంగజేబ్ గురించి వ్రాస్తున్నప్పుడు చరిత్రకారులు ఒక విషయం నుండి దృష్టి మరల్చరాదు. ఏ విధంగానైతే సామ్రాట్ అశోకుని చెడు పనులే కాకుండా సత్కార్యాలు, ప్రజాహిత కార్యాల గురించి ఎలా వ్రాస్తారో, వీరిద్దరూ కూడా మంచి పనుల కోసం తప్పకుండా పేర్కొనబడాలి. ఇతర పరిపాలకుల్లాగే, ఔరంగజేబ్ కూడా ముందుగా ఒక పరిపాలకుడు, ఆ తరువాతనే ఒక ప్రత్యేక ధర్మావలంబకుడు. సఫలమైన పరిపాలన కోసం అతను వివిధ ప్రయోగాలు చేశాడు, వాటి మంచి చెడు ప్రభావాలు హిందూ ముస్లింలు ఇద్దరిపై పడ్డాయి.

ఔరంగజేబ్‌కు అత్యధిక వ్యతిరేక, పక్షపాత వైఖరిని ఆంగ్లేయ కాలపు చరిత్రకారులు అవలంబించారు. ఏలియట్ మరియు డాసన్[3] అనబడే ఇద్దరు ఆంగ్లేయ చరిత్రకారులు తమ గ్రంథాల్లో ముస్లిం పర్యాటకులు మరియు చరిత్రకారులు వ్రాసిన గ్రంథాల్ని ఆంగ్లంలోకి అనువదించారు. హిందూ-ముస్లిం సముదాయాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రత్యేకించి ధార్మికపరంగా వ్యతిరేకతలకు జన్మనిచ్చే విషయాలనే ఆంగ్లంలో అనువదించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. వీరిద్దరి మధ్య భేదభావాలు, వ్యతిరేకతలు పెరగడమే వారి ఉద్దేశమై ఉండింది. ఆంగ్లేయులు తమ బుద్ధిబలంతో ప్రపంచంలోని అత్యధిక ప్రాంతాల్ని కైవసం చేసుకున్నారు. "విభజించి పాలించు" అనే సూత్రాన్నే వారు నమ్ముకున్నారు. ఏలియట్ మరియు డాసన్ రచనలు ఈ పాలసీతో గాఢంగా ప్రభావితమయ్యాయి. ఇతర ముస్లిం పరిపాలకుల గురించి మనమిక్కడ చర్చించుకోకపోయినప్పటికీ, కేవలం ఔరంగజేబ్ గురించి ఆలోచించినప్పుడు, అతన్ని మొగలు వంశ పరిపాలకుల్లో అత్యంత చెడ్డవానిగా చిత్రీకరించడం కోసం, అతని మంచి పనుల్ని పేర్కొనకపోవడమే కాదు, అతని వ్యక్తిత్వంపై మాయని మచ్చలు ఆపాదించడానికి కల్పిత మరియు అసత్య విషయాల్ని ఆధారంగా చేసుకొని, చరిత్రపట్ల తీరని అన్యాయం చేశారు.

ఇక ఔరంగజేబ్‌కు సంబంధించిన రెండవ చారిత్రక గ్రంథం సర్ జాదూనాథ్ సర్కార్[4] వ్రాసింది ఆంగ్లం మరియు హిందీ భాషల్లో లభిస్తుంది. ఇకపోతే ఆంగ్లేయులు, వారి ఆలోచనా విధానాన్ని, వారి సంక్షేమాన్ని నిండు హృదయంతో కాంక్షించే వారికే సామాన్యంగా "సర్" అనే బిరుదును ప్రదానం చేసేవారు. జదూనాథ్ సర్కార్ పుస్తకం చదువుతూ ఉంటే మనకు కొన్ని విచిత్రమైన విషయాలు కనబడుతుంటాయి. ఆయనగారు ఔరంగజేబ్ మొగలు వంశంలోని నీచాతి నీచమైన పరిపాలకునిగా చిత్రీకరించడానికి ఏమాత్రం వెనుకాడలేదు. అయితే విచిత్రమేమిటంటే ఆయన వ్రాసిన గ్రంథాల్లోనే ఔరంగజేబ్‌కు సంబంధించిన అనేక విషయాలున్నాయి. వాటిపై ఆలోచిస్తే, ఔరంగజేబ్ ఈయన చూపించదలిచినట్లు కరడుగట్టిన, క్రూరమైన, పక్షపాతి కాదని అవలీలగా అర్థమైపోతుంది. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడానికి

జదూనాథ్ సర్కార్ పుస్తకంలోనే పేర్కొనబడిన ఔరంగజేబ్ "ఫర్మానాలను" అధ్యయనం చేస్తే సరిపోతుంది.

ఆశీర్వాదిలాల్[5], ఈశ్వరీ ప్రసాద్[6], శ్రీరాంశర్మ[7], ఆర్.సి. మజుందార్[8] వి.ఎ. స్మిత్[9] లాంటి చరిత్రకారులు కూడా "మధ్యయుగం" పై కొన్ని గ్రంథాలు రాశారు. అయితే వీరు కూడా ఔరంగజేబ్ గురించి రాస్తున్నప్పుడు తెలిసో, తెలియకనో "పక్షపాత" వైఖరిని అవలంబించారు. ఫలితంగా చదువరులకు ఔరంగజేబ్ ఒక కరడు గట్టిన ముస్లింగా, క్రూరమైన పరిపాలకునిగానే కనిపిస్తాడు.

కాని 1960 ప్రాంతంలో నిష్పక్షపాతులు, న్యాయప్రియులు అయిన కొందరు చరిత్రకారులు రాసిన వ్రాతలు, గ్రంథాలు మన దృష్టిలోకి వస్తాయి. అందులో ఔరంగజేబ్‌కు సంబంధించి నిష్పక్షపాతంగా, న్యాయంగా అధ్యయనం చేసినట్లు ఆధారాలు కనబడతాయి. అందులో ఇర్ఫాన్ హబీబ్[10], యస్. నూరుల్ హసన్[11], హరిబన్స్ ముఖియ[12], అత్‌హర్ అలీ[13], సతీష్‌చంద్ర[14], మొదలగు వారు ప్రముఖంగా పేర్కొనదగినవారు. ఇర్ఫాన్ హబీబ్ తన గ్రంథం మరియు ఇతర పరిశోధనాత్మక వ్యాసాల ద్వారా కొన్ని ముఖ్య అంశాలను ఎత్తి చూపారు. వాటిద్వారా న్యాయప్రియులైన వారికి ఔరంగజేబ్ పట్ల సానుభూతి కలగడమే కాకుండా, జదూనాథ్ సర్కార్ ఇంకా ఇలాంటి ఇతర చరిత్రకారుల రాతల్లోని బలహీనతలు[15], కూడా కళ్ళకు కట్టినట్లు కనబడసాగాయి.

హరిబన్స్ ముఖియ[16] తన పరిశోధనాత్మక, నిష్పక్షపాత రచనల్లో పేర్కొనే విషయమేమి టంటే, "ఆర్.సి. మజుందార్ ఔరంగజేబ్ ద్వారా ధ్వంసం చేయబడిన మందిరాల ప్రస్తావన అయితే అట్టహాసంగాను, ఉత్సాహంగాను చేస్తూ పోతారు. కాని డాక్టర్ కాళికింకర్ దత్త ద్వారా వ్రాయబడిన "Some Furmanas, Sanads and Parwanas" అనే పుస్తకంలో పేర్కొన్నట్లు అదే ఔరంగజేబ్ ద్వారా మందిరాలకు, బ్రాహ్మణులకు ఇవ్వబడిన దానాల పట్ల పూర్తిగా మౌనం వహిస్తారు. ఎందుకని?" హరిబన్స్ ముఖియ గారి విశ్వాసమేమిటంటే పరిపాలకుల ద్వారా కూల్చివేయబడిన మందిరాల ప్రస్తావన తప్పకుండా చరిత్రలో స్థానం పొందాలి, అయితే కేవలం ముస్లిం పాలకుల ద్వారా కూల్చివేయబడిన మందిరాలను మాత్రమే పేర్కొని ఊరకుండకూడదు, హిందూ మందిరాలను కూల్చివేసిన హిందూ రాజులను గురించి కూడా తప్పకుండా పేర్కొనాలి. ప్రాచీన కాలపు చారిత్రక సంఘటనల్ని వివరిస్తున్నప్పుడు నిష్పక్షపాతుడు, న్యాయప్రియుడైన ఒక జడ్జీలాగా సూటిగా, నిర్మొహమాటంగా వ్యవహరించే చరిత్రకారుడే శ్లాఘించదగిన చరిత్రకారుడనేది ఆయన అభిప్రాయం.

ఒకవైపు సర్ జదూనాథ్ సర్కార్, మరియు ఆంగ్లేయ చరిత్రకారులు ప్రత్యేకించి డాసన్, వి.ఎ. స్మిత్ లాంటి చరిత్రకారులు, చరిత్ర అంటే రాజు, రాణి, మంత్రి, సభాసదులు, నృత్యగానాలు చేసేవాళ్ళు, ఇంకా రాజదర్బారులోని అలంకరణల్ని, రాజప్రాసాదాల్ని మాత్రమే చరిత్రగా భావిస్తుంటారు. కాని వేరొకవైపు ఇర్ఫాన్ హబీబ్, చరిత్ర అంటే సాంకేతిక అభివృద్ధి, వ్యవసాయం, కళలు పరిశ్రమలు, వాణిజ్యం మొదలగు వాటిలో వచ్చే చారిత్రాత్మక మార్పుల్ని చరిత్రకు ప్రత్యేక పునాదులుగా చూపించారు. పై అంశాలనే ఆధారంగా చేసుకొని, ఔరంగజేబ్

కాలంలోని ప్రత్యేకతల్ని, అతనికి పూర్వం అతనికి తరువాత వచ్చిన పరిపాలకుల కాలాలతో పోల్చుతూ, ఔరంగజేబ్ కాలం నాటి ప్రత్యేకతల్ని సాక్ష్యాధారాలతో సహా ఎత్తి చూపిన ఘనత ఇర్ఫాన్ హబీబ్‌కు దక్కుతుంది.

అత్‌హర్ అలీ ఇంకొక కోణంలో పరిశోధించారు. హిందువులకు అత్యంత సన్నిహితుడు, శ్రేయోభిలాషిగా పేర్కొనబడే అక్బర్, హిందువులకు సోకాల్డ్ శత్రువుగా పరిగణింపబడే ఔరంగజేబ్, కాలాల్లోని, హిందూ ప్రభుత్వ ఉన్నతాధికారుల వివరాలను తనకు లభ్యమైన ఆధారాల సహాయంతో సేకరిస్తూ, హిందువులకు మిత్రుడైన అక్బర్ పరిపాలనా కాలంలోకన్నా, ఔరంగజేబే అత్యధిక సంఖ్యలో హిందువులకు ప్రభుత్వ ఉన్నత హోదాలపై నియమించాడని నిరూపించారు.

ఇక మూడవ కోణాన్ని ఎత్తిచూపిన కీర్తి సతీష్ చంద్రకు దక్కుతుంది. ఆయన "జిజ్‌యా" టాక్సుపై ఒక నిష్పక్షమైన, పరిశోధనాత్మకమైన పుస్తకాన్ని వెలువరించారు. తన ఈ పుస్తకంలో ప్రథమంగా ఆయన అత్యంత వివేకంగా, న్యాయంగా, నిష్పక్షపాతంగా ఔరంగజేబ్‌ను అధ్యయనం చేశారు. ఆ తరువాత అతనిలోని బలహీనతల్ని, యోగ్యతల్ని, ప్రత్యేకతల్ని నిష్పక్షపాతంగా, న్యాయంగా, సమతుల్యంగా పాఠకులకు సమర్పించడంలో కృతార్థులయ్యారు.

తమ గ్రంథం "మధ్యకాలీన్ భారత్"లో రొమిల్లా థాపర్[17] అత్యంత స్పష్టంగాను, గట్టి వాదనతోనూ మొగలు సామ్రాజ్య పతనానికి ఔరంగజేబ్ కారకుడు కాదని, ఆ కాలంనాటి సామాజిక మరియు ఆర్థిక పరిస్థితులు మరియు ఔరంగజేబ్ తరువాత వచ్చిన పరిపాలకులే ఈ పతనానికి కారకులని అంగీకరించారు.

బిపిన్ చందర్ తన గ్రంథం (ఆధునిక్ భారత్ - న్యూఢిల్లీ 1976, పేజి 1-13) మొదటి అధ్యాయంలో మొగలు సామ్రాజ్య పతనాన్ని విశ్లేషిస్తూ ప్రపంచంలోని ఏ రాజ్యపు పురోగమనపు లేక పతనపు బాధ్యతను కేవలం ఒకే ఒక వ్యక్తిపై మోపలేమని, చరిత్రను కేవలం రాజు, రాణి కథగా మాత్రమే మనం అంగీకరించినప్పుడు, ఇది సంభవమని తెలిపారు.

ఖుదాబక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీలో ఇచ్చిన ఉపన్యాసాలలో ఔరంగజేబ్‌కు సంబంధించి ఇంతవరకు మరుగుపరిచిన వాస్తవాలను ఇకనైనా వెలుగులోకి తేక తప్పదని శ్రీ బిషంబర్ నాథ్ పాండే (ఒరిస్సా రాష్ట్ర మాజీ గవర్నర్) ఉద్ఘాటించారు.

(ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పీఠిక నుండి)

# 2. ఔరంగజేబ్
# సమకాలీన చారిత్రక ఆధారాలు

నేడు మేము పరిచయం చేయబోతున్న వ్యక్తిత్వాన్ని భారతదేశ చరిత్రలో ఎంతటి వికృతరూపంలో ప్రదర్శించారంటే, అంతకన్నా వికృత రూపంగల వ్యక్తి వేరొకడు లేడంటే అతిశయోక్తి కాదేమో! భారతదేశ చరిత్ర, సాహిత్యంలో అత్యధిక చెడు మనిషి ఎవరని అడిగితే ప్రాథమిక తరగతుల్లో ఉన్న అబ్బాయి కూడా ఔరంగజేబ్ పేరు తప్ప వేరొక పేరు చెప్పలేని పరిస్థితి. అయితే ఔరంగజేబ్ అదృష్టమో, దురదృష్టమో గాని అతని వ్యక్తిత్వాన్ని, అతని నడవడికల్ని, అతని కార్యకలాపాల్ని, అతని పరిపాలనని, అతను చేసిన పాపపుణ్యాల్ని తెలుసుకోవడానికి అతని కాలపు చరిత్ర గ్రంథాలు మనకు సాక్ష్యాధా రాలుగా నిలుస్తాయి.

ఔరంగజేబ్ జీవితపు సమగ్ర చరిత్రను ఆధునిక పంథాలో ఐదు సంపుటాల్లో బెంగాల్‌కు చెందిన ప్రఖ్యాత చరిత్రకారుడు జదూ (యదూ) నాథ్ సర్కార్ వ్రాశారు. కాని ఈ చరిత్రను ఆయన బ్రిటిష్ వారి అభీష్టం మేరకు, వారి "విభజించి-పాలించు" అనే పాలసీ క్రమంలో, వక్రీకరించి వ్రాశారనే అపవాదును కూడా ఎదుర్కొన్నారు. అయితే జదునాథ్ సర్కార్ ఏ గ్రంథాలనైతే ఆధారంగా చేసుకొని ఔరంగజేబ్ చరిత్రను రూపొందించారో, ఆ చారిత్రక గ్రంథాలు ఆ కాలపు ప్రభుత్వ భాష అయిన పర్షియన్‌లో నేటికీ లభిస్తాయి. అందులోని కొన్ని గ్రంథాలను ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్ వారు అనువదించి ప్రచురించారు కూడాను.

షాజహాన్ మరియు ఔరంగజేబ్ కాలం నాటి కొన్ని ముఖ్యమైన పర్షియన్ చరిత్ర గ్రంథాల్ని ఇక్కడ మన తెలుగు పాఠకులకు క్లుప్తంగా పరిచయం చేయడం అసమంజసం కాదనుకుంటాము. ఈ పరిచయం ఔరంగజేబ్ గురించి తెలుసుకోవడానికి ఎంతో దోహద పడుతుంది. అంతేకాకుండా చరిత్ర మౌలిక సూత్రాలను అనుసరించి కూడా ఆ కాలం నాటి ఈ గ్రంథాలు ఎంతో విలువైనవిగా గుర్తించబడతాయి.

### 1. ఇక్బాల్ నామ జహాంగీరి :

దీని రచయిత మొతెమద్ ఖాన్‌గా ప్రఖ్యాతిగాంచిన ముహమ్మద్ షరీఫ్. విశ్వప్రఖ్యాతి గాంచిన తన చరిత్ర గ్రంథం "తుజక్ జహాంగిరి" వ్రాయడానికి జహాంగీర్ తన పట్టాభిషేకపు 17వ ఏట ఇతన్ని నియుక్తుణ్ణి చేశాడు. ఇది మూడు భాగాల్లో ఉంది. మొదటి భాగంలో తైమూర్ మొదలుకొని హుమాయూన్ వరకు, రెండవ భాగంలో అక్బర్, మూడవ భాగంలో జహాంగీర్ కాలపు చారిత్రక సంఘటనలున్నాయి. మొదటి రెండు భాగాలు సామాన్యంగా లభించనివి. మూడవ భాగాన్ని ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్ వారు 1865లో ప్రచురించారు. దీని రెండవ ఎడిషన్ కూడా 1886లో లక్నో నుండి ప్రచురించబడింది.

## 2. పాద్‌షానామ :

దీని రచయిత అబుల్ హసన్ కుమారుడు ముహమ్మద్ అమీన్. ఇతను షాజహాన్ పరిపాలన ప్రారంభమైన ఐదవ ఏట భారతదేశానికి వచ్చి, మున్షీ (సెక్రటరీ)లలో చేరిపోయాడు. పట్టాభిషేకం జరిగిన ఎనిమిదవ ఏట బుందేల్ ఖండ్ వారితో జరిగిన యుద్ధ సంఘటల్ని వ్రాసి షాజహాన్‌కు సమర్పించాడు. అతను వ్రాసే పద్ధతి షాజహాన్‌కు ఎంతో నచ్చింది. కనుక అతన్ని ప్రభుత్వ చరిత్రకారునిగా నియమించడం జరిగింది. ఇతను వ్రాసిన చరిత్రలో షాజహాన్ పరిపాలన ప్రారంభం మొదలుకొని మొదటి ఇరవై సంవత్సరాల సంఘటన లున్నాయి. రెండవ దశకపు చరిత్ర కూడా వ్రాయాలని చక్రవర్తి తనను ఆదేశించినప్పటికీ, ఇది కార్యరూపం దాల్చలేదు.

## 3. బాద్‌షానామ :

దీని రచయిత అబ్దుల్ హమీద్ లాహోరి. ఇది షాజహాన్ పరిపాలనా కాలపు మొదటి ఇరువై సంవత్సరాల (1627-1647) సంఘటనల్ని పరివేష్టించి ఉంది. ఇతను అబుల్ ఫజల్ శిష్యుదని ఇంకొక చరిత్రకారుడైన ముహమ్మద్ సాలెహ్ (అమలె సాలెహ్) పేర్కొన్నాడు. చక్రవర్తి అతన్ని టట్ట (లేక పాట్నా) నుండి పిలిపించి ఈ పనికోసం నియమించాడు. ఈ చరిత్రను రెండు లావుపాటి సంపుటాల్లో మొదటిది 1867లో, రెండవది 1868లో ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్ వారు ప్రచురించారు.

## 4. బాద్‌షానామ :

ముహమ్మద్ వారిస్ అనే వ్యక్తి దీన్ని రూపొందించాడు. ఇతను అబ్దుల్ హమీద్ లాహోరి శిష్యుడు. ఇందులో షాజహాన్ పరిపాలనా కాలానికి సంబంధించి 21వ ఏట నుండి 30వ ఏట వరకు జరిగిన సంఘటనలున్నాయి.

## 5. ఆదాబె ఆలంగీరి :

ఔరంగజేబ్ రాకుమారునిగా ఉన్న కాలంలో వ్రాసిన ఉత్తరాల సమూహమే సామాన్యంగా "ఆదాబె ఆలంగీరి"గా ప్రఖ్యాతి గాంచింది. దీన్ని ముహమ్మద్ సాదిఖ్ అన్‌బాల్వి అనే వ్యక్తి సంకలనం చేశాడు. ఇతను ఔరంగజేబ్ చిన్న కుమారుడు "అక్బర్"కు మున్షి (సెక్రటరీ)గా ఉండేవాడు. ఈ ఉత్తరాల్ని ఔరంగజేబ్ తరఫున, అతని మున్షి (సెక్రటరీ) ఖాబిల్ ఖాన్ వ్రాసినట్లు అతను పేర్కొన్నాడు.

ఉత్తరాలే కాకుండా ఈ గ్రంథంలో ఔరంగజేబ్ సోదరుల మధ్య జరిగిన అంతర్యుద్ధాల చరిత్ర మరియు సాదిఖ్ తాను స్వయంగా వ్రాసినవి, రాకుమారుడు అక్బర్ ద్వారా వ్రాయబడిన ఉత్తరాలను కూడా ఇందులో పొందుపరిచాడు. సోదరుల అంతర్యుద్ధాలకు సంబంధించి ఇందులోని వివరాలన్నీ "అమలె సాలెహ్" మరియు "ఆలంగీర్ నామ" అనే గ్రంథాల నుండి స్వీకరించడమే కాకుండా, అచ్చం వాటి నకలుగా పేర్కొనవచ్చు.

ఈ గ్రంథంలో ఔరంగజేబ్ వివిధ వ్యక్తులకు వ్రాసిన దాదాపు (635) ఉత్తరాలున్నాయి. అందులో సోదరుల అంతర్యుద్ధాలకు పూర్వం షాజహాన్‌కు వ్రాసిన (117) గోల్కొండ పరిపాల కుడు కుతుబుల్ ముల్క్‌కు వ్రాసిన (39) బీజాపూర్ పరిపాలకుడు ఆదిల్‌షాకు వ్రాసింది (1), జ్యేష్ఠసోదరి జహాఁ ఆరాకు వ్రాసినవి (129), బల్ఖ్ పరిపాలకుడు సుబ్‌హాన్ ఖులిఖాన్ (1), అల్లామ సాదుల్లా ఖాన్ (29), షా నవాజ్ ఖాన్ (32), జాఫర్ ఖాన్ (5), నజాబత్ ఖాన్ (7), ఏతెఖాద్ ఖాన్ (13), మీరక్ షేఖ్ (3), ఖాజా అబ్దుల్ వహ్హాబ్ (6), దానిష్‌మంద్ ఖాన్ (2), ఖాసిం ఖాన్ (2), మిర్జా సుల్తాన్ (17), మిర్జా మురాద్ ఖాన్ (2), షాహ్‌బేగ్‌ఖాన్ (13), ముహమ్మద్ బేగ్ (1), బేగం ఆదిల్ షా (4), మీర్ జుమ్లా (55), బుఖార పాలకుడు అజీజ్ ఖాన్ (1), మురాద్ - ఔరంగజేబ్ మధ్య జరిగిన ఒడంబడిక (1), షాయిస్తఖాన్ (45), అలి మురాద్ ఖాన్ (8), మహాబత్ ఖాన్ (11), ఖలీలుల్లా ఖాన్ (2), తఖర్రుబ్ ఖాన్ (4), ఖాజా అబ్దుల్ గప్ఫార్ (10), ఫాజిల్ ఖాన్ (4), అల్లావర్దిఖాన్ (3), మిర్జా నోజర్ (2), ముల్తఫత్ ఖాన్ (25), నసీరి ఖాన్ (22), బీజాపూర్ కొత్త పాలకుడు(4), రాకుమారుడు మురాద్ బక్ష్ (4), రాకుమారుడు షుజా (4).

ఈ ఉత్తరాల అధ్యాయం ముగిసిన తరువాత చరిత్ర మొదలవుతుంది. దాని తరువాత షాజహాన్‌ను పదవీచ్యుతుని చేసిన తదుపరి అతనికి ఔరంగజేబ్ వ్రాసిన ఉత్తరాలున్నాయి. ఈ గ్రంథం ప్రతులు వివిధ లైబ్రరీలలో దొరుకుతాయి. వీటన్నిటిలో అతి ప్రాచీనమైన ప్రతి ఆసఫియా గ్రంథాలయం హైద్రాబాదులో దొరుకుతుంది.

## 6. ఆలంగీర్ నామా :

దీన్ని మున్షి ముహమ్మద్ కాజిం షేరాజి వ్రాశాడు. ఇది సోదరుల అంతర్యుద్ధాలు మొదలుకొని మొదటి పది సంవత్సరాల పరిపాలనను పరివేష్టించి ఉంది. ఇది దర్బారు చరిత్రకారుడు రాసిన చరిత్ర. ఇది వ్రాసిన తరువాత ఔరంగజేబ్‌కు చూపించబడేది. దీన్ని ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్ వారు 1868లో ప్రచురించారు.

## 7. మాసిరె ఆలంగీరి :

దీని రచయిత ముహమ్మద్ ముస్తఅద్ ఖాన్ సాఖి. ఇది ఔరంగజేబ్ పరిపాలనకు సంబంధించిన యాభై సంవత్సరాల కాలాన్ని పరివేష్టించి ఉన్న సంక్షిప్తం, కాని సమగ్ర చరిత్ర గ్రంథం. రచయిత ఔరంగజేబ్ దర్బారులో ఒక ఉన్నతాధికారి. అయితే ఇందులోని మొదటి పది సంవత్సరాల సంఘటనలు, వివరాలు "ఆలంగీర్‌నామా" నుండే గ్రహించ బడ్డాయి. ఇది ఔరంగజేబ్ గతించిన తరువాత వ్రాయబడింది. దీన్ని కూడా ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్ వారు 1871లో అనువదించి ప్రచురించారు. ఆ తరువాత 1932లో ఉస్మానియా యూనివర్సిటి ప్రెస్, హైదరాబాద్ నుండి కూడా ఇది ప్రచురించబడింది.

## 8. జఫర్‌నామ ఆలంగీర్ :

ఆఖిల్ ఖాన్ రాజీ అనే వ్యక్తి దీన్ని రచించాడు. అసలు పేరు మిర్జా అస్కరి. ఆఖిల్ ఖాన్ బిరుదుతో ప్రఖ్యాతి గాంచాడు. ఆలంగీర్ పరిపాలనలో ప్రఖ్యాతి గాంచిన ఒక నాయకుడు. ఔరంగజేబ్ రాకుమారునిగా ఉన్నప్పటి నుండే అతను ఔరంగజేబ్‌తో ఉంటూ వస్తున్నాడు. సోదరుల అంతర్యుద్ధాల వివరాల కోసం ఇదెంతో ఉపకరిస్తుంది. ఈ చరిత్ర గ్రంథాన్ని అతను బీజాపూర్ యుద్ధంతో ప్రారంభించి, మీర్ జుమ్లా మరణంతో సమాప్తం చేశాడు. దీన్నే అనేక పేర్లతో పిలిచారు.

## 9. సోదరుల అంతర్యుద్ధాల చరిత్ర :

రచయిత ముహమ్మద్ సాదిఖ్ అన్ బాల్వి. వాస్తవంలో ఇది "ఆదాబె ఆలంగీరి" లోని ఒక భాగమే. ఇందులో ఔరంగజేబ్ మరియు అతని సోదరుల్లో జరిగిన అంతర్యుద్ధాలు వివరంగా పేర్కొనబడ్డాయి. ఇది ఆలంగీర్‌నామా మరియు "అమలె సాలెహ్" నకలుగా గోచరిస్తుంది. వాటిలోని పేజీలకు పేజీలు యథాతథంగా స్వీకరించబడ్డాయి. అయినాగాని రచయిత మనకు ఉపకరించే అనేక విషయాల్ని ఇందులో పెంచేశాడు.

## 10. మాసిరుల్ ఉమరా :

దీని రచయిత సంసాముద్దీన్ షా నవాజ్ ఖాన్ షషీద్ ఖాని ఔరంగాబాది. ఇందులో అత్యధికమంది తైమూరి (మొగలు) దర్బారు నాయకుల, అధికారుల, మన్సబుదారుల వివరాలున్నాయి. ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్‌వారు దీన్ని మూడు వాల్యూంలలో 1888లో ప్రచురించారు. ఆ తరువాత 1969లో సెంట్రల్ ఉర్దూ బోర్డ్, లాహోర్ వారు ప్రచురించారు.

## 11. ముంతఖబుల్ లుబాబ్ :

దీన్ని ముహమ్మద్ హాషిం ఖాన్ అనే వ్యక్తి రూపొందించాడు. ఈ హాషిం ఖాన్‌నే ఖాఫీఖాన్ అని కూడా అంటారు. ఇతని తండ్రి ఔరంగజేబ్ సైన్యంలో ఉద్యోగి. స్వయంగా ఖాఫీఖాన్ కూడా చివరి సంవత్సరాల్లో ఔరంగజేబ్ అధికారుల్లో చేరిపోయాడు. ఇది బాబర్ మొదలుకొని ముహమ్మద్ షా పరిపాలనలోని పదునాలుగు సంవత్సరాలను పరివేష్టించి ఉంది. ఇది ఔరంగజేబ్ గతించిన పది సంవత్సరాల తరువాత వ్రాయబడింది. అందుకని ఇది స్వతంత్రంగా, విమర్శనాత్మకంగా వ్రాయబడిన చరిత్రగా గుర్తించబడుతుంది. దీన్ని రెండు సంపుటాల్లో ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్ వారు 1869 మరియు 1872 రెండు సార్లు ప్రచురించారు కూడా. ఇది ప్రఖ్యాతి గాంచిన చరిత్ర గ్రంథం. దీన్నే మహ్‌మూద్ అహ్మద్ ఫారూఖి అనువదించగా, ఫరీద్ బుక్ డిపో ప్రైవేట్ లిమిటెడ్, న్యూ ఢిల్లీ వారు తిరిగి 2007లో ప్రచురించారు.

## 12. వాఖియాతె ఆలంగీరి :

దీన్ని ఆఖిల్ ఖాన్ రాజి అనే వ్యక్తి రచించాడు. ఇతను ఔరంగజేబ్ దర్బారులోని నాయకుల్లో ఒకడు. ఈ గ్రంథం ఔరంగజేబ్ జీవిత కాలంలో వ్రాయబడినప్పటికీ, ఆలంగీర్ (ఔరంగజేబ్) కంటబడకుండా గుప్తంగా వ్రాయబడింది. ఈ విషయాన్ని ఆఖిల్ ఖాన్ స్వయంగా పేర్కొన్నాడు. అందుకని అందులోని సంఘటనలు, వివరాలు స్వతంత్రంగాను, విమర్శనాత్మకంగానూ ఉన్నాయి. హిస్టారికల్ ఇనిస్టిట్యూట్, అలీగఢ్ వారు దీన్ని ప్రచురించారు.

## 13. రుఖ్ఆత్ ఆలంగీర్ :

ఇది ఆలంగీర్ (ఔరంగజేబ్) వ్రాసిన లేఖలతో కూడుకున్న గ్రంథం. దీన్ని అతని మున్షి (సెక్రటరీ) ఇనాయతుల్లా ఖాన్ సంకలనం చేశాడు. ఇది సుప్రసిద్ధమైన గ్రంథం. సామాన్యంగా మార్కెట్‌లో లభిస్తుంది. ఇంతవరకు దీని నాలుగు ఆంగ్ల అనువాదాలు వెలువడ్డాయి. ఉర్దూలో కూడా అనువదించబడింది. అయితే దీని వివిధ ప్రతుల్లో భిన్నత్వం కనబడుతుంది. సయ్యిద్ నజీబ్ అష్రఫ్ నద్వి ఎం.ఎ., "ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్" పేరుతో దీన్ని సంకలనం చేశారు. ఇంకా షమ్స్ బరేల్వీగారు దీన్ని ఉర్దూలోకి అనువదించారు. ఇందులో ఔరంగజేబ్ వ్రాసిన లేఖలే కాకుండా, షాజహాన్, జహాఁ ఆరాఁ, దారా షికూహ్, మురాద్, షుజా మొదలగు వారి లేఖలు కూడా ఉన్నాయి. అందుకే ఈ గ్రంథంతో మేము అత్యధికంగా లాభపడ్డాము.

## 14. అహ్‌కామె ఆలంగీరి :

దీన్ని ఔరంగజేబ్ ఛీఫ్ సెక్రటరీ హమీదుద్దీన్ ఖాన్ రాశాడు. ఇందులో ఔరంగజేబ్ జీవితానికి సంబంధించిన, వేరే చరిత్ర గ్రంథాల్లో దాదాపుగా లేని అనేక విషయాలున్నాయి. దీనితోపాటే ఔరంగజేబ్ వివిధ అర్జీలపై వ్రాయించిన ఆదేశాలు కూడా ఇందులో ఉన్నాయి. దీన్ని సర్ జాదూనాథ్ సర్కార్ అనువదించి, ఎడిట్‌చేసి ప్రచురించారు. ఉర్దూలో కూడా లభిస్తుంది. ఖాదర్ హసన్ ఖాన్ (లండన్)గారు అనువదించగా మక్తబ అల్ హసనాత్, న్యూ ఢిల్లీ వారు 2005లో దీన్ని ఉర్దూ మరియు పర్షియన్‌లో ప్రచురించారు.

## 15. అమలె సాలెహ్ :

ముహమ్మద్ సాలెహ్‌కంబు లాహోరి అనే వ్యక్తి దీన్ని రూపొందించాడు. ఇది షాజహాన్ జననం నుండి బంధీఅయి మరణించే వరకు జరిగిన సంఘటనల్ని వివరిస్తుంది. షాజహాన్ 31వ ఏట నుండి మరణం వరకు జరిగిన అతి ముఖ్య సంఘటనల్ని, షాజహాన్ దృష్టి కోణంతో ఇందులో పేర్కొనబడ్డాయి. అందుకని ఈ గ్రంథం కూడా ఎంతో విలువ గలిగింది.

## 16. షాహ్ షుజాయి చరిత్ర :

మీర్ ముహమ్మద్ మాసూమ్ దీని రచయిత. ఇతను ఔరంగజేబ్ రెండవ సోదరుడైన రాకుమారుడు షుజాకు ప్రాచీన సేవకుడు. 1660లో "మాల్డ"లో అతనీ గ్రంథాన్ని రూపొందించాడు. ఇతను షుజా అభిమాని. అంతేకాకుండా అతని బావమరిది ముహమ్మద్ సయీద్, రాకుమారుడు సిపర్ షికూహ్‌కు బక్షీగా పని చేశాడు. ఆ తరువాత అతను ఔరంగజేబ్ కుమారుడు ముహమ్మద్ సుల్తాన్ ఉద్యోగంలో చేరాడు. రాకుమారుడు షుజా దృష్టి కోణాన్ని అర్థం చేసుకోవడానికి ఇదెంతో ఉపకరిస్తుంది.

## 17. ఫయ్యాజుల్ ఖవానీన్ :

ముల్లా ఫయ్యాజ్ అనే వ్యక్తి 1722లో ఈ లేఖల్ని, ఫర్మానాలను సంకలనం (జమ) చేశాడు. ఇందులో భారత, ఇరాన్ పాలకుల ఉత్తరాలు, మురాద్, షుజా, ఔరంగజేబ్ ఇంకా ఇతర తైమూర్ (మొగలు) నాయకుల, రాకుమారుల ఉత్తర ప్రత్యుత్తరాలు పొందుపరచబడ్డాయి. ఔరంగజేబ్‌తో కలిసి దారా షికూహ్‌ను ఎదుర్కోవడానికి సన్నాహాలు చేస్తున్న క్లిష్ట సమయంలో మురాద్ వ్రాసిన ఉత్తరాలు కూడా ఇందులో ఉన్నాయి. దీని సంపూర్ణ ప్రతి నద్వతుల్ ఉలమా, లక్నో సంచాలకులు సఫీఉద్దౌల హిసాముల్ ముల్క్ నవాబ్ అలి హసన్ ఖాన్ వద్ద ఉంది. ఇందులో మూడు భాగాలున్నాయి. 1. పరిపాలకుల లేఖకులు 2. నాయకుల లేఖలు 3. ఇతరములు. మనకు సంబంధించినంత వరకు ఈ క్రిందివారి లేఖలున్నాయి.

షాజహాన్ - 25, ఔరంగజేబ్-11, జహాన్ ఆరా -1, దారా షుకూహ్-8, షుజా-6, మురాద్ బక్ష్-47, ఔరంగజేబ్ మంత్రి జాఫర్ ఖాన్-9. ఇవేకాకుండా ఆదిల్‌షా, ఖుతుబ్ షా, జైసింగ్ మొదలగు వారి లేఖలు కూడా ఉన్నాయి.

ఇంతవరకు మేము పేర్కొంటూ వచ్చిన చరిత్రకారులందరిలో ముస్లింలే ఉన్నారని అనుమానపడబోకండి. ఆ కాలంలో కూడా హిందూ ఇతిహాసికులు, చరిత్రకారులు, వార్తా లేఖకులు బహుళ సంఖ్యలోనే ఉన్నారు. వారిలో నుండి కొందరి పేర్లను వారి చరిత్ర గ్రంథాల్ని సంక్షిప్తంగా పొందుపరుస్తున్నాము.

## 18. ఖులాసతుత్తవారీఖ్ :

పటియాల (పంజాబ్) నివాసి అయిన సుజాన్ రాయ్ భండారి దీన్ని రచించాడు. ఔరంగజేబ్ కాలం నాటి పరిస్థితులు తెలుసుకోవడానికి ఇదెంతో విలువైనదిగా గుర్తించబడుతుంది. ఈ పుస్తకం ఔరంగజేబ్ పట్టాభిషేకం నలుబదవ సంవత్సరంలో వ్రాయడం ప్రారంభించాడు. రచయిత హిజ్రీ శకంతో పాటుగా విక్రమాదిత్య శకాన్ని కూడా పొందుపరుస్తూ పోయాడు. ఇది మూడు భాగాల్లో విభజించబడి ఉంది. మూడవ భాగంలో ఔరంగజేబ్‌కు సంబంధించిన విషయాల్ని తనకు తెలిసిన, తనకు లభించిన ఆధారాలతో వ్రాశాడు. ఔరంగజేబ్‌ను అత్యంత గౌరవంగా పేర్కొంటాడు. ఒక భాగంలో స్థానిక చరిత్ర, హిందూ

రాజుల పట్టికను కూడా ఇచ్చాడు. దీని ప్రారంభ భాగంలో హిందూ ధర్మం గురించి, దాని ఆచారాల గురించి, వివిధ విద్యా కళల గురించి వివరంగా చర్చించాడు. భారతదేశపు భౌగోళికాన్ని కూడా వ్రాశాడు, ఔరంగజేబ్ సోదరుల్లో జరిగిన యుద్ధం గురించి వర్ణించాడు. భండారి తను వ్రాసిందంతా పరిశోధనచేసి, ధృవీకరించుకున్న తరువాతనే వ్రాశానని తెలిపాడు. ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా వ్యాపింపజేసిన నిందలన్నీ ఈ చరిత్ర ద్వారా దూరమవుతాయి. ఔరంగజేబ్‌ను నిరపరాధిగానే కాకుండా ప్రశంసించదగిన వానిగా భండారి పేర్కొంటాడు. ఔరంగజేబ్‌ను భక్తి విశ్వాసాలతో ప్రస్తావిస్తాడు. జరిగిన సంఘటనలన్నింటిలో పరిమిత స్థాయిలో ఔరంగజేబ్ పక్షాన్ని సమర్థిస్తాడు. అందుకేనేమో, ఆంగ్లేయ చరిత్రకారుడైన Henry Eliot కు అతని ఈ పంథా నచ్చలేదు. అతను హిందువు అవడం భరించలేక అతన్ని "సుబ్‌హాన్‌రాయ్"గా పేర్కొని సందేహాన్ని సృష్టించ ప్రయత్నించాడు. పర్షియన్ స్క్రిప్టులో 'సుబ్‌హాన్' మరియు 'సుజాన్'కు సూక్ష్మమైన భేదం మాత్రమే ఉంటుంది. దాన్ని ఆసరాగా చేసుకొని 'సుజాన్'ను కాస్త 'సుబ్‌హాన్'గా మార్చేశాడు. అయితే "మాసిరుల్ ఉమర" రచయిత షా నవాజ్ ఖాన్ తన గ్రంథంలో "ఔరంగజేబ్ కాలంలో ఒక హిందువు వ్రాసింది" అంటూ పేర్కొని ఈ అనుమానాన్ని పటాపంచలు చేశాడు. పురావస్తు శాఖలో పర్యవేక్షకునిగా పనిచేసిన జఫర్ హుసేన్ దీన్ని ఎడిట్ చేసి మురాదాబాద్ నుండి ప్రచురించారు.

## 19. రాయ్‌చందర్ భాన్ బ్రాహ్మణ్ (చహార్ చమన్) :

ఔరంగజేబ్ సమకాలీనులలో ఇతనొకడు. వార్తా విలేఖరులు లేక ఇతిహాసకులు ఇతన్ని షాజహాన్ దర్బారులోని ఒక కవి పుంగవునిగా పేర్కొన్నారు. ఇతను షాజహాన్‌కు ప్రధాన లేఖకునిగా పనిచేశాడు. "బ్రాహ్మణ్" అనే కలం పేరుతో కవిత్వం చెప్పేవాడు. బల్ఖ్, బదఖ్‌షాం యుద్ధాల్లో షాజహాన్ ఇతన్ని ఔరంగజేబ్‌కు తోడుగా పంపాడు. "చహార్ చమన్" అనేది ఇతని చారిత్రక గ్రంథం. ఇతను ఆగ్రాలో ఒక సువిశాలమైన చెరువును నిర్మించాడు. అందమైన ఒక తోటను పెంచాడు. తన కార్యాలయం కోసం ఒక భవనాన్ని నిర్మించాడు. అప్పటి తోట, ఎర్రటి రాళ్ళతో నిర్మించిన ద్వారము, ఆగ్రా మరియు సికిందరాల మధ్య రోడ్డును ఆనుకునే ఉన్నాయి. *(ఆలంగీర్ హిందువోంకీ నజర్ మే -అయ్యూబ్ ఖాన్, పేజి 28 (తారీఖ్ కె సచ్చాయియాం- ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ, పేజి 46)*

## 20. లబుత్తవారీఖ్ :

దీని రచయిత రాయె బింద్రామన్ బహాదూర్ షాహి. ఔరంగజేబ్ కాలం నాటి ప్రముఖ చరిత్రకారుల్లో ఇతనొకడు. దారా షికూహ్‌కు దీవాన్‌గా ఉండిన భరామల్ కుమారుడు. ఔరంగజేబ్ కాలంలో వివిధ హోదాలపై పనిచేస్తూ రాకుమారుడు ముఅజ్జం షా పట్టాభిషిక్తుడైన తరువాత కూడా ఉన్నత హోదాపై ఉన్నాడు. చివరికతని దీవాన్ (ప్రధానమంత్రి)గా నియుక్తుడయ్యాడు. ఔరంగజేబ్ దర్బారు నాయకుల్లో ప్రముఖంగా పేర్కొనబడేవాడు. రాకుమారుడు ముఅజ్జం బహాదుర్ షా సింహాసనాన్ని అధిష్టించిన తరువాత షియా విశ్వాసాల వైపు మొగ్గాడు.

ఆ విధంగా తండ్రి (ఔరంగజేబ్) విశ్వాసాలకు విరుద్ధంగా నడిచాడు. ఇలాంటి వ్యక్తి దర్బారులో, అతని చేతికింద పనిచేసినప్పటికి కూడా, ఔరంగజేబ్ గురించి వ్రాయడంలో సర్వ స్వతంత్రుడై ఉన్నప్పటికీ కూడా అతను తన చరిత్ర "లబుత్తవారీఖ్"లో ఔరంగజేబ్ గురించి ఎలా వ్రాసి ఉంటాడో తెలుసుకోవడానికి ఈ క్రింది కొన్ని వాక్యాలు నమూనాగా చాలనుకుంటాము.

"ఆలంగీర్ న్యాయంగా, జాగరూకతతో పరిపాలించాడు. ఇంకా తన పరిపాలనా కాలంలో అనేక (దుర్) ఆచారాల్ని రూపుమాపాడు."

'లబుత్తవారీఖ్' పేరుగల ఈ చరిత్ర 1695-96లో వ్రాయబడింది. తన కళ్ళతో చూసిన సంఘటనలే ఇందులో వర్ణించబడ్డాయి. పైన ఉదాహరించిన వాక్యాల ద్వారానే, ఇందులో ఔరంగజేబ్‌కు సంబంధించి ఎలా వ్రాసి ఉంటాడో అర్థం చేసుకోవచ్చు. ఈ పుస్తకాన్ని ఆ తరువాత వచ్చిన చరిత్రకారులు ప్రామాణిక ఆధారంగా అంగీకరించారు. దులారామ్ కుమారుడు లాల్‌రామ్ తన గ్రంథం "తొహ్ఫతుల్ హింద్"లో దీన్ని గురించి పేర్కొనబడం జరిగింది. దక్కన్ యుద్ధాల్లో కూడా బింద్రామన్ ఔరంగజేబ్ వెంటనే ఉన్నాడు.

## 21. నుస్ఖయె దిల్‌కుషా :

భీంసేన్ కాయిస్త్ దీని రచయిత. 1649లో బుర్‌హాన్‌పూర్‌లో జన్మించాడు. తండ్రి రఘునందన్ మొగలు దర్బారులో ఒక మన్సబుదారు. అతని ఈ రచనకు సంబంధించిన ప్రతులు యూరప్‌లోని వివిధ గ్రంథాలయాల్లో ఉన్నాయి. ఈ గ్రంథం ఔరంగజేబ్ గతించిన (1707) తరువాత వ్రాయబడింది. ఇందులో దక్కన్‌లో 1658 వరకు జరిగిన యుద్ధాల వివరాలున్నాయి. రచన స్వచ్ఛమైన పర్షియన్‌లో కొనసాగుతుంది. ఔరంగజేబ్‌పై మోపబడిన నిందలన్నీ కూడా దీన్ని చదివితే వాటంతటవే ఖండింపబడతాయి. ఇందులో ఔరంగజేబ్ పట్టాభిషిక్తుడైనప్పటి నుండి కామ్‌బక్ష్ పరమపదించే వరకు జరిగిన విషయాలన్నీ ఉన్నాయి. భీమ్‌సేన్ కొన్ని రోజులు రాజా జస్వంత్ సింగ్ దర్బారులో కూడా ఉన్నాడు. శివాజీకి వ్యతిరేకంగా పోరాడాడు. ఔరంగజేబ్ ప్రఖ్యాత సైనికాధికారి దల్‌పత్‌రాయ్ సైన్యంలో కూడా కొన్ని రోజులున్నాడు. 1698లో ఈ చరిత్ర గ్రంథం వ్రాయనారంభించాడు. ఔరంగజేబ్ తరువాత సింహాసనం కోసం జరిగిన యుద్ధంలో రాకుమారుడు ఆజంషా వైపున్నాడు. అయితే ఆజంషా ఓడిపోయిన తరువాత అతనికున్న ఉన్నత హోదాలన్నీ ఊడిపోయాయి. అతని మరణం గురించిన వివరాలు తెలియలేదు.

## 22. ఫతూహాతె ఆలంగీరి :

దీని రచయిత ఈషర్‌దాస్ (లేక ఈశ్వర్‌దాస్) నాగర్. గుజరాత్‌లోని పటన్ నివాసి. ఇతనో బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. ముప్పది సంవత్సరాల వయస్సు వచ్చేవరకు ఖాజి అబ్దుల్ వహ్హాబ్ కుమారుడైన షేఖుల్ ఇస్లాం వద్ద కొలువున్నాడు. షేఖుల్ ఇస్లాం

మక్కా వెళ్ళిన తరువాత గుజరాత్‌లోని జోద్‌పూర్ పరగణ లేక జిల్లాకు అధికారిగా నియుక్తుడయ్యాడు. ఈ కారణంగా రాథోడ్‌కు చెందిన అత్యధికమంది రాజపుత్ర సర్దారులు అతనికి మిత్రులయ్యారు. వారి గురించి కూడా తన పుస్తకంలో పేర్కొన్నాడు. 1681లో ఔరంగజేబ్ కుమారుడు 'అక్బర్' తండ్రికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, రాజపుత్రుల ఆశ్రయాన్ని పొందాడు, కాని తరువాత ఓడిపోయి ఇరాన్‌కు పారిపోయాడు. వెళ్తూ తన కుమారుడు బులంద్ అక్తర్, కుమార్తె సఫియతున్నిసాను దుర్గాదాస్ రాథోడ్‌కు అప్పగించి వెళ్ళాడు. విద్రోహి అయిన రాకుమారునికి ఆశ్రయమిచ్చిన రాజపుత్రులు చక్రవర్తి ఆగ్రహానికి పాత్రులయ్యారు. అయితే మన ఈ చరిత్రకారుడు మధ్య వర్తిత్వం వహించి, ఆ పిల్లల్ని వారి తాత అయిన చక్రవర్తికి అప్పగించడమే కాకుండా, ఈ పిల్లల్ని పోషించి విద్యాబుద్ధులు గరిపినందుకు సంతోషించిన చక్రవర్తి, దుర్గాదాసు తప్పుల్ని మన్నించడమే కాకుండా ఒక జాగీరును, దర్బారులో మన్సబును కూడా ప్రసాదించాడు. ఈ చరిత్ర 1731లో పూర్తయింది. జదూనాథ్ సర్కారు దీన్ని ఆంగ్లంలో అనువదించాడు. మాల్వా, రాజ్‌పుతానాకు సంబంధించిన విషయాల్లో ఇతని వివరణలు ఎంతో విలువైనవి. ఈ చరిత్రలో 1657 నుండి 1695 వరకు జరిగిన సంఘటనలన్నీ ఉన్నాయి. ఈ చరిత్ర అధ్యయనం వల్ల ఔరంగజేబ్ పట్ల ఏర్పడిన అపార్థాలన్నీ తొలగిపోతాయి. ఈ పుస్తకం దాదాపు అర్థ శతాబ్దపు చరిత్రను పరివేష్టించి ఉంది. ప్రామాణికమైన, సమకాలీన మరియు ప్రభుత్వేతరమైన చారిత్రక ఆధారమిది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్‌కు మాజీ ఛైర్మన్ అయిన ప్రొఫెసర్ సతీష్ చంద్ర ఈ గ్రంథం గురించి ఇలా అన్నారు.

"ఔరంగజేబ్‌కు సంబంధించి ఇదొక ప్రముఖమైన ఆధారము. ఈషర్‌దాస్ ఒక స్వాతంత్ర్య (ప్రభుత్వేతర) గ్రంథకర్త. అతని వ్రాతలు ఎంతో ప్రాముఖ్యాన్ని కలిగివున్నాయి. (తన ఈ గ్రంథంలో) అతనెక్కడా కూడా ఔరంగజేబ్‌ను ఇస్లాం ధ్వజవాహకునిగా గాని, హిందూ ధర్మ వ్యతిరేకిగా గాని పేర్కొనలేదు. ఇదే విధంగా శివాజీకి సంబంధించిన విషయాలు, జస్వంత్ సింగ్ చనిపోయిన తరువాత జరిగిన సంఘటనల్ని కూడా ధార్మిక దృష్టికోణంతో పేర్కొనలేదు. ఇటీవలనే ప్రచురింపబడిన రాజపుత్ర ఆధారాలు, చరిత్రలు కూడా ఇదే దృష్టి కోణాన్ని సూచిస్తున్నాయి. అందుకని ఇలాంటి సమకాలీన ఆధారాన్ని (చరిత్రను) ప్రచురించడం ఎంతో అవసరం. (నసీమ్ అహ్మద్ ఇంగ్లీషులో అనువదించి, సంకలనం చేసిన ఫతూహాతె ఆలంగీరి- పీఠికలో 16-9-1978 First Published in 1978-Idara Adabiyat, Delhi)

ఔరంగజేబ్‌ను ఏ విధంగానైతే అపకీర్తి పాల్జేశారో, ఈ గ్రంథాన్ని చదివితే అవన్నీ బూటకమని, ఆధారరహితమని, కేవలం కల్పితమని తేటతెల్లమైపోతుంది.

## 23. ముంతఖబుత్తవారీఖ్ :

దీని రచయిత మనోహర్‌దాస్ కుమారుడు జగ్‌జీవన్‌దాస్. ఇతను 1694లో ప్రభుత్వ ఉద్యోగంలో చేరాడు. ఆ కాలం నుండే ముఖ్య సంఘటనల్ని వ్రాసుకోవడం ప్రారంభించానని తనే పేర్కొన్నాడు. చివరికి బహదూర్‌షా సింహాసనాన్ని అధిష్ఠించిన తరువాత ఒక సంపూర్ణ భారత చరిత్ర వ్రాయాలనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనకు కార్యరూపం దాల్చిందే ఈ పుస్తకం. బహదూర్‌షా ఆదేశానుసారం, భారతదేశంలోని వివిధ సూబాల పరిస్థితుల్ని వివరించిన చివరి అధ్యాయమే ఈ పుస్తకపు ప్రత్యేకత. అంతే తప్ప సామాన్యంగా చూస్తే, బింద్రాబన్ రాసిన "లబుత్తవారీఖ్" నకలుగానే ఇది కనబడుతుంది.

## 24. ఇన్‌షాయె మాధురామ్

మున్ని మాధూరామ్ అనే వ్యక్తి దీన్ని రచించాడు. ఇతను షాజహాన్ కాలంలోని సాదుల్లా ఖాన్ కుమారుడైన నవాబ్ లుత్‌పుల్లా ఖాన్ వద్ద ప్రారంభంలో ప్రధాన లేఖరిగా ఉన్నాడు. యోగ్యత, సామర్థ్యం కలవాడు. పర్షియనే కాకుండా అరబ్బీ భాషలో కూడా మంచి ప్రావీణ్యం కలవాడు. ఔరంగజేబ్ జీవితం, అతని పరిపాలనా పద్ధతి గురించి తెలుసుకోవడానికి ఇదెంతో ఉపకరిస్తుంది. ఈ లేఖల ద్వారానే, దక్కన్‌లో కొత్తగా గెలువబడిన బీజాపూర్ ప్రాంతంలో, మరాఠాలు, ఇంకితర హిందూ జాతులు అత్యధిక సంఖ్యలో ఉండే ఒక ప్రముఖ కోటకు ఒక రాజపుత్రుడైన మాన్‌సింగ్‌ను కోటాధిపతిగా నియమించినట్లు తెలుస్తుంది. ఇదేవిధంగా రాజా రాంనాథ్ ప్రస్తావన కూడా ఉంది. ఇతన్ని ఔరంగజేబ్ ఏదో కార్యం మీద ఒక రాకుమారుని వెంట ఉత్తర భారతానికి పంపించాడు. అతని ఘనకార్యాలతో ఔరంగజేబ్ సంతృప్తిచెంది ఉండేవాడు. దక్షిణంలో ఒక కోట ముట్టడి సందర్భంలో, ఔరంగజేబ్ ఈ రాంనాథ్‌ను జ్ఞాపకం చేసుకున్నాడు : "ఇప్పుడీ సందర్భంలో రాంనాథ్ ఉంటే ఎంతో బాగుండేది" అని పలికాడు. అందుకని నవాబ్ కోకల్‌తాష్ తరపున మాధూరాం, రాజా రాంనాథ్‌కు ఒక లేఖ వ్రాసి, గౌరవపూర్వకంగా పిలిపించుకున్నాడు. ఈ లేఖ కూడా ఇంషాయె మాధూరామ్‌లో కనబడుతుంది. ఇంకొక విషయం ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో హిందూ ఉన్నతాధికారులు, వారి పరిస్థితులు, వారిపై ఔరంగజేబ్‌కు ఎంత విశ్వాసముండేదో కూడా ఈ గ్రంథం ద్వారా తేటతెల్లమవుతుంది.

## 25. తజ్‌కిరతుల్ ఉమరా :

రఘునాథ్ దాస్ అగర్వాల్ కుమారుడైన కేవల్‌రామ్ దీని రచయిత. అక్బర్ కాలం మొదలుకొని బహదూర్‌షా కాలం వరకు మొగలు దర్బారుకు చెందిన నాయకుల పరిస్థితుల్ని వర్ణించిన గ్రంథమిది. ఇందులో రెండు వందలకు పైగా మన్సబుదారుల ప్రస్తావన ఉంది. హిందూ రాజులు, నాయకులకు సంబంధించినంత వరకు అత్యంత ప్రాముఖ్యమైన గ్రంథం.

## 26. శివాజీ చరిత్ర :

దీని రచయిత ఎవరో తెలియదు. చూడడానికి ఇదొక మరాఠీ గ్రంథపు అనువాదంగా కనబడుతుంది. ఇందులో మరాఠాలు శక్తిపుంజుకున్నప్పటి నుండి సాహూజీ సింహాసనంపై కూర్చుండేవరకు పరిస్థితులు వర్ణించబడ్డాయి. మరాఠాల దృష్టికోణాన్ని తెలుసుకోవడానికి ఇదో మంచి ఆధారం. 1907లో సర్ జదూనాథ్ సర్కార్ దీన్ని కలకత్తా రివ్యూలో అనువదించి ప్రచురించాడు.

## 27. ఇన్‌షాయె రోషన్ కలాం :

మున్షి భూపట్‌రాయ్ దీన్ని సంకలనం చేశాడు. మేవాడ్‌కు ఫౌజ్‌దార్ (సైనికాధికారి) అయిన రఅద్ అందాజ్‌ఖాన్‌కు ఇతను మున్షి (సెక్రటరీ)గా పనిచేశాడు.

## 28. రఖాయెమ్-కరాయెమ్ :

దీన్ని సయ్యద్ అష్రఫ్ ఖాన్ మీర్ ముహమ్మద్ హుసేని అనే వ్యక్తి సంకలనం చేశాడు. ఇందులో అత్యధికంగా రచయిత తండ్రికి ఔరంగజేబ్ రాసిన లేఖలే ఉన్నాయి.

## 29. దస్తూరుల్ అమల్ ఆగహి :

లేఖల ఈ సమూహాన్ని జైపూర్ రాజ్యాధీశుడు రాజా సివాయ్ జైసింగ్ దీవాన్ అయిన రాజా అయామల్ కోరికపై ఇది రూపొందించడం జరిగింది. ఇందులో ఔరంగజేబ్ కుమారులు, అధికారులయే కాకుండా షాజహాన్ పేరుతో ఉన్న కొన్ని లేఖలు కూడా ఉన్నాయి.

## 30. కలిమాతె తయ్యిబాత్ :

దీన్ని ఔరంగజేబ్ మున్షి (సెక్రటరీ) ఇనాయతుల్లా ఖాన్ సంకలనం చేశాడు. దీని వాక్యాలు అత్యంత అసంపూర్ణంగా ఉన్నాయి. లేఖను ఎవరు, ఎవరికి వ్రాశారో కూడా స్పష్టంగా లేదు.

## 31. తజ్‌కిరతుస్సలాతీన్ చుగ్‌తాయి :

దీని రచయిత ముహమ్మద్ హాది కామూర్ ఖాన్. ఇది మొగలు (తైమూర్) వంశ చరిత్ర. రెండు భాగాల్లో విభజించబడి ఉంది. తైమూర్ మొదలుకొని ముహమ్మద్ షా పరిపాలన ఆరవ సంవత్సరం వరకు జరిగిన ముఖ్య సంఘటనల్ని పరివేష్ఠించి ఉంది. ప్రారంభంలో తుర్కుల, మొగలుల సంక్షిప్త ప్రస్తావన కూడా ఉంది.

## 32. ఫర్‌హతున్ నాజిరీన్ :

ముహమ్మద్ అస్లమ్-బిన్-ముహమ్మద్ హాఫీజుల్లా సర్వరీ అనే వ్యక్తి దీన్ని రచించాడు. ఇదో సామాన్య చరిత్ర. దీని చివరలో ఇవ్వబడిన ధార్మికవేత్తల, కవుల వివరాలు పేర్కొనదగిన విషయం. లాహోర్‌కు చెందిన ఓరియంటల్ కాలేజి మాగ్‌జైన్‌లో ఔరంగజేబ్ కాలం నాటి విద్వాంసుల, ధార్మికవేత్తల, కవుల వివరాలు రెండు సంపుటాల్లో వెలువరించడం జరిగింది.

## 33. మిరాతుల్ ఆలం లేక మిరాత్ జహాఁనుమా :

సామాన్యంగా ఇది బఖ్తావర్ ఖాన్ రచనగా భావించబడుతుంది. కాని వాస్తవంగా దీని రచయిత ఎవరో నిర్ధారణ కాలేకపోయింది. ప్రథమంలో దీన్ని ముహమ్మద్ బఖా రచించాడు, ఆ తరువాత ఈ వ్రాతప్రతిని అతని మేనల్లుడు ముహమ్మద్ షఫీ, కనిష్ఠ సోదరుడు ముహమ్మద్ రజా వేర్వేరుగా సంపూర్ణం చేశారు. ఇందులో ఉన్న వివరాలు ఖులాస ఆలంగీర్‌నామా లాగే, దాదాపుగా ఆలంగీర్ నామాను పోలి ఉంటుంది.

## 34. ఔరంగ్‌నామా :

దీని రచయిత గర్‌వేజి. ఇది కావ్యరూపంలో నున్న చరిత్ర. సోదరుల్లో జరిగిన అంతర్యుద్ధాల వివరాలు ఇందులో వర్ణించబడ్డాయి. దీని రచనాశైలి షాహ్ షుజా చరిత్రను పోలినట్లుంటుంది. ఇది ప్రభుత్వ ప్రభావం నుండి దూరముండి రాయబడింది కనుక ఇందులో వివరించబడిన సంఘటనల్ని అనుమానాలకు దాదాపుగా అతీతమనే చెప్పొచ్చు.

## 35. ఆషోబె హింద్ :

దీన్ని బెహిష్తీ అనే వ్యక్తి రచించాడు. ఇది కూడా సోదరుల అంతర్యుద్ధం, ప్రత్యేకించి మురాద్ గురించి అర్థం చేసుకునే ఒక కావ్య చరిత్ర. దీని రచయిత మురాద్ ఉద్యోగి. తన యజమానిని సమర్థిస్తూ అతనీ చరిత్ర వ్రాశాడు. ఇది ప్రచురింపబడింది కూడాను.

## 36. మంషఆతె తాహెర్ వహీద్ :

ఇది తాహెర్ వహీద్ సేకరించిన లేఖల సమూహము. ఖందహార్ దండయాత్ర, సోదరుల అంతర్యుద్ధం, మొగలులకు వ్యతిరేకంగా దక్కన్ షియా రాజ్యాలతో కలసి ఈరాన్ పన్నిన కుట్రలు ఇత్యాది విషయాల వివరాలు తెలుసుకోవడానికి ఇదెంతో ఉపకరిస్తుంది. పర్షియన్ సిలబస్‌లోను, ప్రాథమిక పాఠ్యపుస్తకంగానూ ఇది ప్రసిద్ధి గాంచినప్పటికీ, చరిత్ర దృష్టితో దీనివల్ల తగినంత సహాయం తీసుకోవడం జరుగలేదు.

## 37. బసాతీనుస్ సలాతీన్ :

ఇది బీజాపూర్ ఆదిల్ షాహి వంశానికి సంబంధించిన సంపూర్ణ చరిత్ర. మిర్జా ఇబ్రాహీం జుబేరి అనే వ్యక్తి దీని రచయిత. ఇది 1824లో రాయబడినప్పటికీ, ప్రాచీన చరిత్ర గ్రంథాల ఆధారంగా రూపొందించబడింది. అందుకని ప్రామాణిక గ్రంథంగా గుర్తించబడింది.

## 38. అలి ఆదిల్‌షా ద్వితీయ చరిత్ర :

దీని రచయిత నూరుల్లా బిన్ ఖాజి సయ్యద్ అలి ముహమ్మద్ అల్ హుసేని అల్ ఖాద్రి. ఈ చరిత్ర స్వయంగా ఆ రాజు ఆదేశంపై రాయబడింది.

## 39. మజ్‌మవుల్ ఇష్కార్ :

ఇదో అపూర్వమైన సమూహం. ఇందులో చారిత్రక లేఖలు, ఫర్మానాలు మొదలగునవి పెద్ద సంఖ్యలో సంకలనం చేయబడ్డాయి. లేఖలే కాకుండా అనేక గ్రంథాల పీఠికలు కూడా ఇందులో చేర్చడం జరిగింది. ఈ సమూహం ఖుదాబక్ష్ ఖాన్ గ్రంథాలయం (ప్రస్తుతం ఖుదా బక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీ, పాట్నా) లో ఉంది.

## 40. దక్కన్ చరిత్ర :

దీని రచయిత ఖాఫిఖాన్. ఏషియాటిక్ సొసైటీ, బెంగాల్ వారు దీన్ని ప్రచురించారు కూడాను.

పై గ్రంథాలే కాకుండా 1. తుజుక్ జహాంగీరి 2. ఇక్బాల్ నామ జహాంగీర్ 3. మాస్సర్ జహాంగీరి 4. మజాలిసుస్సలాతీన్ 5. ముఖ్‌లిస్ 6. షాజహాన్ నామ (ముహమ్మద్ సాదిఖ్) 7. షాజహాన్ నామ (మిర్జా జలాల్ తబత్తబాయి) 8. షాజహాన్ నామ (ఫాజిల్‌ఖాన్) 9. జఫర్ నామయె షాజహాని 10. బాద్‌షానామ (అబూ తాలిబ్ కలీం) 11. బాద్‌షానామ (మీర్ ముహమ్మద్ యహ్యా కాషీ) 12. లతాయెఫుల్ అక్బార్ 13. ఫతీహ అబ్రియా 14. ఔరంగ్‌నామ 15. జీనతుత్తవారీఖ్ 16. ఖులాసయె ఆలంగీర్ నామ 17. జుబ్‌దతుల్ మఖామాత్ ఇంకా ఇలాంటివే పర్షియన్ భాషకు చెందిన దాదాపు (60) గ్రంథాలున్నాయి.

ఇవేకాకుండా దక్కన్ చరిత్రను తెలిపే 6 గ్రంథాలు, ఈరాన్ చరిత్రను తెలిపే 2 గ్రంథాలు కూడా ఉన్నాయి.

ఇవి కొన్ని అతి ముఖ్యమైన ప్రత్యేకించి మున్ముందు ఉపకరించే, రెఫరెన్సుల కోసం చూపించబడే గ్రంథాలు. కాకపోతే షాజహాన్, ఔరంగజేబ్ కాలం నాటి ఇంకా అనేక చారిత్రక గ్రంథాలు, దర్బారు పత్రికలు, ఫర్మాన్లు, స్వంత లేఖల్ని పేర్కొంటూపోతే మన పాఠకులు విసుగెత్తి పోతారనే భయంతోనే పై గ్రంథాల వరకు కుదించాము. అన్ని గ్రంథాలు వాటి వివరాలు పేర్కొంటూపోతే ఒక మంచి గ్రంథమే అవుతుంది.

ఇవేకాకుండా షాజహాన్ మరియు ఔరంగజేబ్ కాలాల్లో మన దేశంలో పర్యటించిన కొందరు విదేశీ పర్యాటకులు వ్రాసుకున్న యాత్రా వృత్తాంతాలు కూడా ఉన్నాయి. అందులో ఫ్రెంచి డాక్టర్ అయిన డాక్టర్ బర్నియేర్, టోరీస్, హెమిల్టన్, మనూచి, డాక్టర్ క్రేరి మొదలగు వారు ప్రముఖంగా పేర్కొనదగినవారు. వారు తమ పర్యటన సందర్భంలో తాము విన్న, చూసిన విషయాల్ని రాసుకున్నారు. అవి కూడా మనకు ఎంతో కొంత ఉపకరిస్తాయి.

ఇంతవరకు మేము పేర్కొంటూ వచ్చినవి ఔరంగజేబ్ సమకాలీన చారిత్రక ఆధారాలు. ఆ తరువాత ఆంగ్లేయుల కాలంలో ఔరంగజేబ్‌పై వెలువడిన చరిత్ర గ్రంథాల నుండే చరిత్ర వక్రీకరణ ప్రారంభమయింది. ఏలియట్, డాసన్, అల్‌పిన్‌స్టన్, లేన్‌పోల్ ఇలా ఇలా ఆంగ్లేయ చరిత్రకారుల ఒక సైన్యమే బయలుదేరింది. ఈ చరిత్రకారులు పర్షియన్ చరిత్ర

గ్రంథాల్ని అనువదిస్తున్నప్పుడు ఏరికోరి హిందూ ముస్లింలలో వైషమ్యాల్ని, శతృత్వాన్ని రేకెత్తించే అంశాల్ని ప్రత్యేకంగా ఎత్తి చూపారు. ఆంగ్లేయుల 'విభజించి-పాలించు' అనే సూత్రాన్ని ఈ చరిత్రకారులు బాగా ఉపయోగించారు. అసత్యాల్ని జొప్పించడం, సంఘటనల్ని వక్రీకరించడం వారొక కళగా వినియోగించారు. ఈ విధంగా ఔరంగజేబ్‌ను ఒక క్రూరునిగా చిత్రీకరించారు.

ఇక చివరలో మన ప్రఖ్యాత భారతీయ చరిత్రకారుడు సర్ జదూనాథ్ సర్కార్ గురించి పేర్కొనవలసి ఉంది. "సర్" అనే బిరుదు సామాన్యంగా బ్రిటిష్ వారి పాలసీని, వారి పరిపాలనా, ఆలోచనా విధానాన్ని సమర్థించిన వారికే ఇవ్వడం జరిగింది. సర్కార్ గారు మేమింతకు ముందు పేర్కొన్న గ్రంథాలన్నిటిని గాఢంగా అధ్యయనం చేసే ఉంటారు. అందులో నుండి కొన్నిటిని ఎడిట్‌చేసి ఆంగ్లంలో అనువదించినట్లు ఆయన శిష్యుడు సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, ఎం.ఎ. తన ప్రఖ్యాత గ్రంథం "ముఖద్దమ రుఖ్ఆతె ఆలంగీర్"లో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయన గురువు జదూనాథ్ సర్కార్ (ఆయనే సర్కారును తన గురువని పేర్కొన్నారు) సుదీర్ఘంగా, వివరంగా ఐదు సంపుటాల్లో రచించిన "ఔరంగజేబ్ చరిత్ర" ను కూడా అధ్యయనం చేశానని రాశారు. ఈ ఐదు సంపుటాల ద్వారా సర్కార్, ఔరంగజేబ్ రూపాన్ని ఎంత వికృతంగా మార్చారో, అతనిపై ఎన్ని నిందలు మోపారో ఆయనకు తెలియంది కాదు. ఔరంగజేబ్‌ను నీచాతి నీచమైన పరిపాలకునిగా చిత్రీకరించడానికి అతన్ని రావణునిగా (ఔరంగజేబ్ వాల్యూం 4, పేజి 71) కృతఘ్నుడైన ప్రభువుగా (వా -4, పే.105) దౌర్జన్యకారునిగా (వా-3, పే.136) మోసకారి, అబద్ధాలకోరుగా (వా-2,పే.94) హిందువుల మందిరాల్ని ధ్వంసం చేసినవానిగా, హిందువుల్ని ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించిన వానిగా (వా-3, పే.174,175, 182-185) బలవంతంగా మతం మార్పిడి చేయించిన వానిగా (వా-3, పే.180) పేర్కొన్నారు. "మందిరాలు-ఔరంగజేబ్ ఫర్మానాలు", "ఔరంగజేబ్ దర్బారులోని హిందూ మన్సబుదారులు", "ఔరంగజేబ్ ధార్మికనీతి" అనే శీర్షికల క్రింద వీటికి ప్రామాణికమైన సాక్ష్యాధారాలతో సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించాము. కాని ఈ నిందల గురించి సర్కారును ఆయన శిష్యుడు తన గ్రంథం "ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్"లో ఏ ఒక్కచోటనైనా చర్చించి, విశ్లేషించకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. బహుశ గురువుగా గౌరవించి మౌనం వహించారేమో! ఇస్లామీయ మరియు భారతీయ సంస్కృతుల ప్రకారం గురువును గౌరవించడం అనివార్యమే. కాని అదే గ్రంథం ద్వారా ఔరంగజేబ్‌పై చేసిన ఆరోపణల్ని పోస్టుమార్టంచేసి, ఖండించి, వికృత పరిచిన అతని రూపాన్ని కడిగి, శుభ్రపరిచి, వాస్తవం ఇదంటూ చూపించడం నిజంగా శ్లాఘించదగిన విషయమే. నిస్సందేహంగా ప్రొఫెసర్ సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, ఎం.ఎ., సంకలనం చేసిన ఈ గ్రంథం ఎంతో విలువైనది. కాని ఔరంగజేబ్, షాజహాన్, మురాద్ ఇంకా ఇతరులు పరస్పరం పర్షియన్‌లో వ్రాసుకున్న లేఖల్ని యథాతథంగా నఖలు చేయడం వల్ల ఔరంగజేబ్ కాలం నాటి పర్షియన్‌ను అర్థం చేసుకోలేని వారికి ఎంతో ఇబ్బందిని ఎదుర్కొనవలసివస్తుంది. ఆ విధంగా దాని ప్రామాణికతను పెంచాలనేది ఆయన ఉద్దేశం కావచ్చు. కాని పర్షియన్‌లో ఉన్న ఈ లేఖల్ని తెనుగీకరించడానికి మేమెన్ని బాధలు పడ్డామో, ఎన్ని వ్యయప్రయాసలకు ఓర్చామో

ఆ దేవుడెరుగు. అయినప్పటికీ ఈ గ్రంథం మహోన్నత విలువ దృష్ట్యా మా ఈ రచనకు ఇతర ఆధారాలతో పాటు ఈ గ్రంథాన్ని కూడా ప్రధానాధారాల్లో చేర్చుకున్నాము.

ఈ విధంగా ఔరంగజేబ్ అసలైన స్వరూప స్వభావాల్ని, ఆంగ్లేయులు వక్రీకరించిన చరిత్రల నుండి కాకుండా, ఔరంగజేబ్ సమకాలీన చరిత్రల నుండి ప్రదర్శించడానికి ప్రయత్నించాము. అంతేకాకుండా ఆంగ్లేయులు ఎక్కడెక్కడ ఏ విధంగా చరిత్రను వక్రీకరించారో కూడా సాధ్యమైనంతగా చూపించడానికి ప్రయత్నం చేశాము.

ఇక జధూనాథ్ సర్కారు గారు ఆంగ్లేయుల మెప్పు, వారి ప్రసన్నతకోసం కేవలం ఔరంగజేబ్‌ను మాత్రమే విమర్శించి, నిందించి ఊరకుండలేదు. అంతకన్నా ముందుకెళ్ళి చరిత్రకారునికి తగని పని అంటే స్వయంగా ఇస్లాం ధర్మాన్నే తూలనాడారు, అత్యంత కఠోర పదజాలంతో ఆయన ఇస్లాంను ఇలా నిందించారు :

**"ఇస్లాం ఒక కిరాతకమైన ధర్మం... అది తన అనుయాయుల్ని దోపిడీలను, రక్తపాతాలను బోధిస్తుంది...ఇది ప్రపంచ శాంతికి శత్రువు. ఇంకా దీన్ని అనుసరించి పరమత సహనం ధర్మ నిషేధం ... ఔరంగజేబ్ పరమత ద్వేషి అవడానికి కారణం ఇస్లామే. ఎందుకంటే అతను ఇస్లాం అనబడే చెట్టుకు కాసిన కాయ. ఇంకా చెట్టే చేదైనప్పుడు దాని కాయ కూడా తప్పనిసరిగా చేదుగానే ఉంటుంది."** (History of Aurangazeb, Jadhunath Sarkar, Vol. III, Chapter -34, The Islamic State Church in India- Page-163-172)

సర్కారుగారు ఈ వ్యాఖ్యానాల్ని అనవసరంగా, అసందర్భంగా, హృదయాల్ని నొప్పించే విధంగా చేశారు. కనుక దానికి సముచిత సమాధానాలు ఇవ్వక తప్పడం లేదు.

**"ఇస్లాం ఒక కిరాతకమైన ధర్మం....."** ఇస్లాం కిరాతకమైన ధర్మం ఎంతమాత్రం కాదు. ఇది అవతరించి కేవలం మానవ ధర్మాలపై, వారి విశ్వాసాలపై, నైతిక విలువలపై, రాజకీయాలపై, చట్టాలపై, సభ్యతా సంస్కృతులపై, ఆలోచనా దృక్పథాలపైనే కాదు, సాహిత్యంపై, అభిరుచులపై, జీవన సరళిపై కూడా గాఢమైన ప్రభావం వేసింది. ఈ ప్రభావం కేవలం వ్యక్తిగతమైంది, పరిమితమైందే కాదు. సామూహికమైంది, అపరిమితమైంది. ఇంకా చెప్పాలంటే ఈ ప్రభావం సమగ్రమైంది, సర్వతోముఖమయింది, సర్వవ్యాపితమయింది కూడాను. నేను ఇస్లాం అనుయాయుణ్ణి అయినందుననే ఇలా ఇస్లాంను పొగడడం లేదు. ఇస్లాంను, ఇస్లామీయ సభ్యతను నిష్పక్షపాతంగా అధ్యయనం చేసిన ముస్లిమేతర సోదరులే పై అభిప్రాయాల్ని వ్యక్తపరిచారు. దీని వాస్తవికతను తెలుసుకోవాలనుకుంటే గెస్టావలిబాన్ వ్రాసిన "Arab Culture", రాబర్ట్ బ్రేఫాల్ట్ వ్రాసిన "The Making of Humanity", జార్జ్ సార్టిన్ వ్రాసిన "History of Science"-T.W. Arnold వ్రాసిన "Preachings of Islam",-A.J. టాయిన్‌బి వ్రాసిన Study of History, జె.డి. బెర్నాల్ వ్రాసిన "Science in History", డాక్టర్ తారాచంద్ వ్రాసిన "Influence of Islam on Indian Culture" ఇంకా ఎమ్.ఎన్. రాయ్ వ్రాసిన "Historical Role of Islam" మొదలుగాగల పుస్తకాలు చదివితే ఇస్లాం మానవత్వానికి, మానవ సభ్యతా సంస్కృతుల పురోగమనానికి, ప్రత్యేకించి

పాశ్చాత్య విద్య, కళలు, పరిశ్రమలు, విజ్ఞానాల పురోగమనానికి ఎలా మార్గదర్శకం వహించిం దనేది తెలిసి పోతుంది. ఇక సైన్స్ విజ్ఞానశాస్త్రానికి సంబంధించి ఖుర్‌ఆన్‌లోని మొత్తం ఆరువేల ఆరు వందల పైచిలుకు ఆయతులలో (వాక్యాలలో) దాదాపుగా వేయి ఆయతులు సృష్టి గురించి, విశ్వం గురించి, భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, సముద్రాల గురించి ఆలోచిం చండని, పరిశీలించండని, వాటికోసం తమ బుద్ధిజ్ఞానాల్ని ఉపయోగించమని ప్రేరేపించే, ప్రోత్సహించేవే ఉన్నాయి. ఉదాహరణకు, "The Making of Humanity" అనే తన గ్రంథంలో రాబర్ట్ బ్రీఫాల్ట్ ఇలా రాశాడు. “యూరప్ ప్రగతిలో ఇస్లామీయ సభ్యత ప్రమేయం లేని, ఇంకా దాని (యూరప్) జీవితంపై గొప్ప ప్రభావం వేసి స్పష్టమైన తన జ్ఞాపిక చిహ్నాల్ని విడిచిపెట్టని ఒక్క రంగంగానీ, ఒక్క కోణం గానీ లేదు.” (పేజీ 190). ఇతనే ఇంకొకచోట ఇలా వ్రాశాడు: “కేవలం భౌతిక శాస్త్రాలే (సైన్స్) (ఇదీ అరబ్బుల ఉపకారమే) యూరప్‌లో పునరుజ్జీవనానికి కారణం కాదు. అంతకు మించి ఇస్లామీయ సభ్యత యూరప్ జీవితంపై మహోన్నతమైన, బహుముఖమైన ప్రభావాలు వేసింది. ఇస్లామీయ సభ్యతాసంస్కృతుల మొదటి కిరణాలు యూరప్‌పై పడడం ప్రారంభమైనప్పటి నుండే ఇది మొదలైంది. (పేజీ 202).

యం.ఎన్ రాయ్ ఇలా వ్రాశారు: ఇస్లాం తన అభివృద్ధి చెందే పాత్రను సమాప్తం చేసిన తరువాత, ప్రపంచంలో నాయకత్వపు బాధ్యత విద్యావంతులు, చైతన్యవంతులు అయిన అరబ్బుల నుండి ఇతరులు లాక్కున్న తరువాత భారత దేశంలో అది ప్రవేశించినప్పటికీ, తన ప్రారంభం నుండే అందులో ఉన్న విప్లవాత్మక సిద్ధాంతం, ప్రపంచంలో పురోగమించే గుణం ఇంకనూ దాని పతాకంపై కనబడుతూనే ఉండింది. ..... ఈ కారణంగానే నిమ్న, అణగారిన ప్రజల వర్గం వెంటనే ఇస్లాం స్వీకరణకు సంసిద్ధమయింది. ఈ విధంగా వారికి సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కూడా లభించింది.

ముస్లింలతో విద్యాజ్ఞానాలు పొంది నేడు యూరప్ ఆధునిక సభ్యతకు ప్రతినిధిగా నిలబడగలిగింది. నేటికి కూడా దీనికోసం వారు తాము ముస్లింలకు రుణపడి ఉన్నామని చెప్పుకుంటారు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే భారత దేశం ఈ ఇస్లామీయ వారసత్వం నుండి తగినంత లాభాన్ని పొందలేకపోయింది......మానవ సభ్యతా సంస్కృతుల పురోగమనంలో ఇస్లాం చారిత్రక పాత్రను అర్థం చేసుకున్నప్పుడే ఈ అసహనత్వపు (విద్వేషపు) గోడను పడగొట్ట వీలవుతుంది.” (Historical Role of Islam, Pages 36, 40)

ఈ విధంగా తూర్పు నుండి పశ్చిమం వరకు గల అన్ని జాతుల్ని, మానవ జీవితపు అన్ని రంగాల్ని ఇంతగా ప్రభావితం చేసిన ధర్మాన్ని, “కిరాతక ధర్మమని” కళ్ళులేని కబోదులు, కరడుగట్టిన పక్షపాతులు మాత్రమే అనగలుగుతారు.

**“అది తన అనుయాయుల్ని దోపిడీ, దౌర్జన్యాలను, రక్తపాతాలను బోధిస్తుంది. ఇది ప్రపంచశాంతికి శత్రువు....”**

ఇది రక్తపాతాలను బోధిస్తుందో, శాంతి సామరస్యాల్ని అభిలషిస్తుందో, స్వయంగా ఖుర్‌ఆన్‌నే ఎందుకు అడగకూడదు? ఈ విషయంగా అది ఇలా బోధిస్తుంది : “ఏ ప్రాణాన్నీ

హతమార్చకండి న్యాయంగా తప్ప. దాన్ని హతమార్చడాన్ని అల్లాహ్ నిషేధించాడు" (బనీ ఇస్రాయీల్ – 33). "హత్యకు బదులుగా గాని, లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మనిషిని చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుని ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే ..." (అల్ మాయిద : 32). "అవనిలో కల్లోలాన్ని రేకెత్తించకండి" (అల్ బఖర: 11). ఇంకా "భువిలో కల్లోలాన్ని రేకెత్తించేవారు .... వాస్తవంగా నష్టపడేవారు వీరే..." (అల్ బఖర: 27). "చూడండి, మిమ్మల్ని మస్జిదె హరాంకు పోనియ్యకుండా ఒక వర్గంవారు నిరోధించారని వారిపై ఆగ్రహించి, ఆవేశంతో మీరూ వారిపై అనుచితమైన దౌర్జన్యానికి పాల్పడకండి." (అల్ మాయిద:2). "వారు యుద్ధజ్వాలలు ప్రజ్వలింపజేసినప్పుడల్లా అల్లాహ్ దానిని చల్లారుస్తాడు. వారు భూమిలో సంక్షోభాన్ని వ్యాపింపచెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నారు. కాని అల్లాహ్ సంక్షోభం సృష్టించేవారిని ఎంతమాత్రం ప్రేమించడు" (అల్ మాయిద : 64). "(యుద్ధ మైదానంలో) ఏ వ్యక్తి అయినా శరణుగోరి మీ వద్దకు రాదలిస్తే (అల్లాహ్ గ్రంథాన్ని వినటానికి) అతనికి శరణు ఇవ్వండి, అతడు అల్లాహ్ గ్రంథం వినేవరకు, తరువాత అతనిని అతని భద్రతా స్థలం వరకు చేర్చండి" (అత్ తౌబ : 6). "విశ్వాసులారా! సహనంతో వ్యవహరించండి" (ఆలి ఇమ్రాన్ : 200). "ప్రవక్తా! మంచీ చెడు ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు" (హా మీమ్ అస్ సజ్దా : 34). "ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు, మూర్ఖులతో వాదానికి దిగకు" (అల్ ఆరాఫ్ : 199).

ఇక ప్రవక్త మహనీయ ముహమ్మద్ (స) శాంతిని ఎంతగా కాంక్షించేవారో, శాంతి కోసం ఎంతగా తపనపడేవారో, శాంతి సామరస్యాల కోసం తమ న్యాయపరమైన హక్కుల్ని సైతం వదులుకోవడానికి ఎలా సిద్ధపడేవారో నిరూపించడానికి ఆయన (స) తమ వ్యతిరేకులతో చేసుకున్న "హుదైబియా" ఒప్పందమే ప్రబల నిదర్శనం. ఈ ఒప్పందంలోని షరతులు తమకు, అనగా ముస్లింలకు ఎంత వ్యతిరేకంగా, ఎంత అవమానకరంగా, ఎంత ఇబ్బంది కరంగా ఉన్నా, దీనిపట్ల తన అనుయాయులు ఖిన్నులై ఉన్నా కూడా, కేవలం శాంతి స్థాపిత మవుతుందనే దృష్టితో ఆయన (స) దీన్ని అంగీకరించారు. దీని వివరాలు కావాలనుకునేవారు, ప్రవక్త జీవితంపై వ్రాసిన ఏ గ్రంథం చూసినా సరిపోతుంది. ఎందుకంటే దైవప్రవక్త (స) జీవితంపై వ్రాసిన ప్రతి గ్రంథంలో ఈ "హుదైబియా" ఒప్పందం పేర్కొనబడింది. దాన్ని అధ్యయనం చేస్తే శాంతిపట్ల ఆయన (స)కు ఉన్న నిబద్ధత ఎలాంటిదో తేటతెల్లమైపోతుంది.

ఇంకొక సందర్భం – గత్యంతరం లేని పరిస్థితుల్లో శత్రువును ఎదుర్కోవడానికి పంపబడుతున్న సైనికదళానికి నాయకుడైన హజ్రత్ మఆజ్ బిన్ జబల్ (రజి)కు ఇచ్చిన ఆదేశాలు ఏమిటో ఒకసారి మీరూ తెలుసుకుంటే శాంతికి ఆయన (స) ఇచ్చే ప్రాధాన్యత ఎలాంటిదో అర్థమైపోతుంది. ఆయన (స) ఇలా ఆదేశించారు: "మఆజ్! వారికి (దైవ) సందేశం విన్పించనంత వరకు వారితో యుద్ధం చేయకు. ఒకవేళ వారు దీనికి (సందేశానికి) నిరాకరించినా కూడా,

వారే ప్రారంభించనంత వరకు నీవుమాత్రం యుద్ధం చేయబోకు. వారు యుద్ధం ప్రారంభించినా, నీవుమాత్రం చేయి లేపకు, ఎప్పటివరకైతే వారు మీలోని ఒక వ్యక్తిని చంపేయరో, ఆ తరువాత వారు (చంపిన) ఈ వ్యక్తిని వారికి చూపిస్తూ, 'ఇంతకన్నా మంచి మాటకు (విషయానికి) మీరు అంగీకరించరా?' అని (వారిని) అడుగు. ఓ మఆజ్! ఇంతటి ఓర్పు, సహనాల బోధనలు నీకెందుకివ్వబడుతున్నాయంటే, ఒకవేళ దైవం నీ ద్వారా (కొంతమంది) ప్రజల్ని సన్మార్గం వైపునకు మళ్ళిస్తే, తూర్పు పశ్చిమాల మధ్యగల దేశాలు, వాటి సిరిసంపదలకన్నా అది నీకు మేల్తరమైనది." (అల్ మబ్సూత్ - వ్యాలూం 10, పేజి 35).

**"దీన్ని (అంటే ఇస్లాంను) అనుసరించి పరమత సహనం ధర్మనిషేధం"**

ఇస్లాంపై ఎంత విచిత్రమైన నింద ఇది. పరమత సహనం అనేది ఇస్లాం మూల సూత్రాల్లో ఒకటి. పరమత సహనం గురించి ఇస్లాం ఇచ్చే ఆదేశాలు ఏమిటో ఖుర్ఆన్‌నే అడుగుదాం: "ధర్మం విషయంలో నిర్బంధంగాని, బలాత్కారం గాని లేవు, సత్యవాక్కు, అసత్యవాక్కు నుండి ప్రస్ఫుటం చేయబడింది" (అల్ బఖర: 256)."ఇది సత్యం, మీ ప్రభువు తరఫు నుండి వచ్చింది. ఇష్టమైనవారు దానిని స్వీకరించనూవచ్చు, ఇష్టంకాని వారు దానిని తిరస్కరించనూవచ్చు." (అల్ కహఫ్ : 29). "నీవు కేవలం హితబోధ చేసేవాడవు మాత్రమే. వారిని ఏ విధంగానూ బలవంతం చేసేవాడవు కావు" (అల్ గాషియ : 22). "ఇది ఒక హితబోధ. ఇష్టమైనవారు దీని నుండి గుణపాఠం నేర్చుకోవచ్చు" (అల్ ముదస్సిర్ - 54). "ప్రవక్తా! సత్య సందేశాన్ని స్పష్టంగా అందజేయడం తప్ప నీపై మరొక బాధ్యత లేదు." (అన్ నహ్ల్ : 82). "వారిచేత బలవంతంగా విషయాన్ని ఒప్పించడం నీ పని కాదు" (ఖాఫ్ : 45). "హింస ద్వారా పరధర్మాన్ని అణచడం రక్తపాతం కంటే అత్యంత తీవ్రమైనది" (అల్ బఖర : 217). "ముస్లింలారా! వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరుల్ని దూషించకండి" (అల్ అన్ ఆమ్ : 108). "(కనుక) మీ ధర్మం మీకే, నా ధర్మం నాకే" (కాఫిరూన్ : 6). "ఎవరయితే ధార్మిక విషయంగా మీతో యుద్ధం లేదో, ఎవరైతే మిమ్మల్ని మీ ఇండ్ల నుండి గెంటివేయలేదో, అటువంటి వారితో మీరు మేలుగా, న్యాయంగా మెలగటానికి అల్లాహ్ మిమ్మల్ని వారించటం లేదు. న్యాయప్రియులంటే అల్లాహ్‌కు ఇష్టం." (అల్ ముమ్తహినహ్ : 8). పైవన్నీ పరమత సహనాన్ని బోధించే ఆయత్‌లు కాకుంటే మరేమిటి? ఇంత స్పష్టమైన ఆదేశాలిచ్చిన తరువాత కూడా ఇస్లాంను అనుసరించి పరమత సహనం ధర్మనిషేధితమనడం ఎంత హాస్యాస్పదమైనది. ఎంతటి మోసం, వంచనతో కూడుకున్నదో మీరే ఆలోచించండి!

మానవ ప్రాణాలకు, ప్రపంచంలో శాంతి సామరస్యాల స్థాపనకు, పరమత సహనానికి సంబంధించి ఖుర్ఆన్, ప్రవక్త మహనీయులు (స) ఇచ్చిన కొన్ని ఆదేశాలు, నియమాలివి. సుదీర్ఘమైపోతున్నదని మేము కొన్నింటిని మాత్రమే పేర్కొన్నాము. ఈ ఆదేశాల్ని అధ్యయనం చేయకుండానే, వాటిపై దృష్టి సారించకుండానే బాధ్యతా రాహిత్యంగా, అన్యాయంగా, కేవలం ఆంగ్లేయుల మెప్పు పొందడంకోసం చరిత్రనే కాకుండా, ధర్మాన్ని కూడా వక్రీకరించిన వారి మనస్తత్వాన్ని మేము విశ్లేషించే బదులు పాఠకుల విచక్షణా జ్ఞానానికే వదలిపెడుతున్నాము.

# 3. ఔరంగజేబ్

# జననం, బాల్యం, విద్యాభ్యాసం

ఔరంగజేబ్ తన కాలం మటుకే కాదు, షాజహాన్ పరిపాలనా కాలానికి కూడా హీరోగానే పరిగణింపబడతాడు. అతని పరిపాలనా కాలంలో జరిగిందంతా కూడా అతను రాకుమారునిగా ఉన్నప్పుడు జరిగిన సంఘటనల, అనివార్య ఫలితాలుగానే భావించాలి.

నేటి కాలం వరకు పర్షియన్ మరియు ఉర్దూ భాషల్లో వెలువడిన గ్రంథాలన్నింటిలో కూడా షాజహాన్ కాలపు పరిస్థితుల వర్ణన సందర్భంలో ఔరంగజేబ్ ప్రస్తావన రాకుమారునిగా, సందర్భవశాత్తుగా మాత్రమే వచ్చింది, అందుకని అతని బాల్యానికి సంబంధించిన వివరాలే కాదు, ఇతర అతి ముఖ్య సంఘటనల పూర్వపరాలు కూడా మనకు సంపూర్ణంగా తెలిసిరాలేదు. దక్కన్ గవర్నరుగా తన జ్యేష్ఠ సోదరునితో తలబడడానికి ఒక సైన్యంతో బయలుదేరిన ఔరంగజేబే మనకు ప్రత్యక్షమవుతాడు. అతని రాకుమార దశలో సంభవించిన వ్యక్తిగత, రాజకీయ, ధార్మిక మరియు కౌటుంబిక పరిస్థితుల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయనంతవరకు, ఆ తరువాత అతని యాభై సంవత్సరాల పరిపాలనను సరిగా అర్థం చేసుకోలేము.

**జననం :**

షాజహాన్ మొత్తం సంతానం సంఖ్య పదహారు. అతని ప్రియాతి ప్రియమైన పట్టపురాణి, ఆసిఫ్ ఖాన్ పుత్రిక ముంతాజ్ మహల్ గర్భం నుండి జన్మించిన సంతానం పదునాలుగు మంది. అయితే అందులో ఏడుగురు మాత్రమే బ్రతికారు. ఈ ఏడుగురిలో ఔరంగజేబ్ నెంబరు ఐదు. ఔరంగజేబ్ జీవితమంతా ఇంటినుండి, రాజధాని నుండి ఎలా దూరంగా గడిచిపోయిందో, అతని జనన మరణాలు కూడా సుదూర, పరదేశాల్లోనే జరిగాయి. అతని తాత జహాంగీర్, అహ్మద్‌నగర్ సేనాని మలిక్ అంబర్‌ను ఓడించి, రాజధాని ఆగ్రా వైపు ప్రయాణమయ్యాడు. మాల్వా చివరి సరిహద్దు ప్రాంతమైన "దోహద్" (ఇది బరోడా, ఉజ్జయినీల మధ్య ఉంటుంది)లో 1618, అక్టోబర్ 24న ఔరంగజేబ్ జన్మించాడు. ఆ సమయంలో షాజహాన్ కూడా తన తండ్రి వెంటనే ఉన్నాడు. పుత్రుని జన్మ శుభసూచకంగా ఆ కాలపు ఆచారాన్ని అనుసరించి, షాజహాన్ వేయి బంగారు నవరసులను పళ్ళెంలో పెట్టి, తన తండ్రి మరియు భారతదేశ చక్రవర్తి అయిన జహాంగీర్‌కు సమర్పించాడు. జహాంగీర్ ఈ కానుకను స్వీకరిస్తూ, మనుమనికి "ఔరంగజేబ్" అని నామకరణం చేశాడు. "దోహద్" ప్రాంతం విందులు, వినోదాలకు అనుకూలంగా లేని కారణంగా జహాంగీర్ అక్కడి నుండి బయలుదేరి, ఒక చెరువున్న ప్రాంతంలో మజిలీ చేశాడు. అక్కడ్నే జననానికి సంబంధించిన ప్రాథమిక

ఆచారాలు పూర్తిచేసి, జహాంగీర్ సైన్య సమేతంగా ఉజ్జయిని చేరుకున్నాడు. ఉజ్జయిని చేరుకున్న తరువాత రాకుమారుని జనన ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుపుకోబడ్డాయి.

జననం తరువాత పాలు తాపటం ఆ కాలంలో ప్రాథమిక సమస్యగా భావించబడేది. అందుకని ఔరంగజేబ్‌కు పాలు తాపే బాధ్యతను మీర్ అబుల్ ఉలాయి ఖాని ఖాన్ భార్యకు అప్పగించబడింది. మీర్ అబుల్ ఉలాయికీ ఇద్దరు కుమారులుండేవారు. చిన్నవాడైన మీర్ మలిక్ హుసేన్ ఈ విధంగా ఔరంగజేబ్‌కు దాది సోదరుడయ్యాడు.

ఔరంగజేబ్ తండ్రి అయిన యువరాజు ఖుర్రం (షాజహాన్) తండ్రి వ్యతిరేక కార్య కలాపాల కారణంగా, ఔరంగజేబ్‌కు కూడా ఒకేచోట స్థిరంగా ఉండే అవకాశం లభించలేదు. రాకుమారుడు ఖుర్రంకు ప్రాణప్రదమైన పత్ని ముంతాజ్ మహల్ ఒక్క క్షణం కూడా తన భర్తను విడనాడి ఉండడం సహించలేకపోయేది. కనుక ఈ కుటుంబం దేశ దిమ్మరుల లాగా దక్కన్ నుండి బెంగాల్, బిహార్, అక్కడి నుండి తిరిగి దక్కన్ – ఈ విధంగా తిరుగాడు చుండేది. చివరికి 1626లో తండ్రీ కొడుకు (జహాంగీర్, షాజహాన్)ల మధ్య ఒక తాత్కాలిక ఒప్పందం కుదిరింది. అయితే యువరాజు ఖుర్రం, తండ్రికి వ్యతిరేకంగా విద్రోహానికి తలపడకుండా ఉంటాడని, దానికి గ్యారంటీగా ఖుర్రం తన ఇద్దరు కుమారులను (దారా షికూహ్, ఔరంగజేబ్‌లను) వారి తాతఅయిన జహాంగీర్ చక్రవర్తి వద్ద జమానతుగా ఉంచడానికి అంగీకరించాడు. ఈ విధంగా చిన్నప్పుడే ఔరంగజేబ్ తన తల్లిదండ్రుల ప్రేమ వాత్సల్యాలకు దూరమై తాత అయిన జహాంగీర్ సంరక్షణలోకి లాహోర్‌కు పంపబడ్డాడు. ఈ విధంగా అతనికి బాబర్, అక్బర్‌ల కుటుంబ ఆచారాల్ని ఆకళింపు చేసుకునే అవకాశం లభించింది.

కాని ఈ ఎడబాటు ఎంతో కాలం సాగలేదు. ఒక సంవత్సరంపై కొన్ని నెలలు గడిచిన తరువాతనే 1627 అక్టోబర్‌లో జహాంగీర్ మరణించాడు. ఈ కబురందగానే యువ రాజు ఖుర్రం దక్కన్ నుండి బయలుదేరి, 1628, ఫిబ్రవరి 4వ తేదీన షాజహాన్ పేరుతో పట్టాభిషిక్తుడయ్యాడు. ఇక తల్లిదండ్రులకు తమ సంతానపు ఎడబాటు సహించరానిదయింది. పట్టపురాణి ముంతాజ్ మహల్ తన కుమారుల్ని వెంటనే తీసుకరావల్సిందిగా తన సోదరునికి లాహోర్‌కు కబురు పంపింది. అతను వారిని తీసుకొని ఆగ్రా చేరాడు. తండ్రీ కుమారుల కలయికను ఆ కాలంనాటి చరిత్రకారులు ఎంతో రమణీయంగా వర్ణించారు. మరుసటి రోజు రాకుమారులిద్దరూ తండ్రిని దర్బారులో సందర్శించుకొని కానుకలు సమర్పించినప్పుడు, షాజహాన్ హర్షాతిరేకంతో పరవశించిపోయాడు. ఆ రోజు నుండే రాకుమారులిద్దరికి చెరో 500 రూపాయల రోజువారి భత్యం నిర్ణయమైంది.[1]

## ఔరంగజేబ్ విద్యాభ్యాసం

ఔరంగజేబ్‌లోని విద్యాజ్ఞానాలు, అత్యధిక గ్రంథాల పఠనం, అతని పాండిత్యం, అతనిలోని సాహిత్యాభిరుచికి అతని లేఖలే నిరాకరించలేని సాక్ష్యం. విద్యాభ్యాసాల కోసం నిర్దేశించబడిన ప్రాథమిక గ్రంథాలన్నిటినీ అతను చదివేశాడు. అరబ్బీ, పర్షియన్ భాషల్లో అతను పాండిత్య స్థాయికి చేరుకున్నాడు. హిందుస్తానీగా పిలువబడే భారతీయ భాష, మరియు హిందీపై అతనికి మంచి పట్టు ఉండేది. వంశపరంగా వస్తున్న టర్కిష్ భాషలో కూడా అతనికి మంచి నైపుణ్యం ఉండేది.

అతని గురువుల్లో మౌలానా అబ్దుల్ లతీఫ్ సుల్తాన్‌పూరి, హాషిం గీలాని, షాజహాన్ ప్రధానమంత్రి అల్లామ సఅదుల్లా ఖాన్, ముల్లాసాలెహ్, ముల్లా మొహియుద్దీన్ ఉరఫ్ ముల్లా మోహన్, సయ్యద్ ముహమ్మద్ ఖన్నోజి, షేఖ్ అహ్మద్ ఉరఫ్ ముల్లా జీవన్, దానిష్మంద్ ఖాన్, షేఖ్ అబ్దుల్ ఖవి మొదలగు వారున్నారు. వీరంతా ఆ కాలంలో ప్రఖ్యాతిగాంచిన గురువులు. ప్రతి ఒక్కరు విద్యాజ్ఞానాలకు సంబంధించిన ఏదో ఒక రంగంలో అగ్రగణ్యులు. దీనితో పాటే యుద్ధ కళలు, రాజకీయ నైపుణ్యం, పరిపాలనకు సంబంధించిన వ్యవహారాల్లో కూడా మంచి ప్రావీణ్యాన్ని సంపాదించాడు. తమ తమ కళల్లో ఆరితేరిన మంచి గురువుల ద్వారా విద్యనభ్యసించిన కారణంగానే అతనో నిర్మలహృదయునిగా, క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా, నిరాడంబరునిగా, క్రమం తప్పకుండా నమాజు ఉపవాసాలను పాటించే నిజమైన ముస్లింగా, రాజకీయ తంత్రజ్ఞుడిగా, మొక్కవోని పరాక్రమశాలిగా, అత్యంత ప్రమాదకర, క్లిష్ట సమయాల్లో కూడా సంయమనాన్ని విడవాడని ధైర్యశాలిగా ప్రఖ్యాతిగాంచాడు. క్రమం తప్పక నమాజు సలిపే అతని అలవాటుకు సంబంధించిన రెండు సంఘటనలు బల్ఖ్ బదఖ్షాఁ యుద్ధ సమయంలోను, షుజాతో 'కజ్‌వాహ'లో జరిగిన యుద్ధ సమయంలోను మనం ప్రత్యక్షంగా చూడగలుగుతాము.

అతని పట్టుదల, జ్ఞాపక శక్తికి సంబంధించిన ఒక ఉదాహరణ పాఠకులకు వినిపిస్తాము. వయసు ముదిరిన తరువాత అత్యంత కష్టమవుతుందని దివ్య ఖుర్‌ఆన్‌ను సామాన్యంగా ముస్లింలు చిన్న వయస్సుల్లోనే ఒక కోర్సు ప్రకారం పిల్లలకు కంఠస్థం చేయిస్తారు. అయితే ఔరంగజేబ్ విద్యనభ్యసించే సమయంలో ఒక కోర్సులాగా ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసి ఉండలేదు. దానికి భిన్నంగా వయస్సు బాగా ముదిరిన తన 43వ ఏట, సోదరులతో అంతర్యుద్ధాలు ముగిసి, భారత చక్రవర్తిగా పట్టాభిషిక్తుడైన తరువాత దైవానికి కృతజ్ఞతాభివందనాల రూపంగా దైవగ్రంథాన్ని కంఠస్థం చేశాడు. అతను ఎదుర్కొన్న ఆ క్లిష్ట పరిస్థితుల్లో, కేవలం ఒక్క సంవత్సరంలోగా మొత్తం దివ్యగ్రంథాన్ని కంఠస్థం చేయడం అతని పట్టుదల, జ్ఞాపకశక్తికి తిరుగులేని తార్కాణం.

అతను ఒక్క దివ్య ఖుర్ఆన్‌ను కంఠస్థం చేయడమే కాకుండా, ఖురాన్, హదీస్‌ల వ్యాఖ్యానాలు, ఇస్లామీయ ధర్మశాస్త్ర అవగాహన, అహ్యాఉల్ ఉలూమ్, కీమియాయె సఆదత్ ఇంకా ఇలాంటి ప్రఖ్యాతి గాంచిన లెక్కలేనన్ని ధార్మిక, చారిత్రక, సాహిత్యపరమైన గ్రంథాల్ని అధ్యయనం చేయడమే కాకుండా, సమయోచితంగా వాటి నుండి రెఫరెన్సులు కూడా కోట్ చేసేవాడు. వీటి వివరాలు అతని కాలంలో వ్రాయబడిన చారిత్రక గ్రంథాలు ఆలంగీర్‌నామ, మాసిరె ఆలంగీరి, మిఫ్‌తాహుత్తవారీఖ్, ఫర్‌హతున్నాజిరీన్ మొదలగు గ్రంథాల్లో లభిస్తాయి.[2]

ఔరంగజేబ్ చిన్నప్పటి నుండే అత్యంత ధైర్యశాలి. అతని చిన్నతనంలో మదించిన గజరాజును ఎదుర్కోవడం అతని ధైర్యస్థైర్యాలకు, మొక్కవోని పరాక్రమానికి మచ్చుతునక. ఈ సంఘటనను చరిత్రకారులందరూ పేర్కొన్నారు. దీన్ని హమీదుద్దీన్ ఖాన్ ఇలా వివరించాడు.

"మొగలు చక్రవర్తి షాజహాన్ లాహోర్‌లో ఉంటున్న సమయంలో తరచుగా షాలమార్ బాగ్‌లో గజరాజుల యుద్ధాన్ని తిలకించేవారు. ఒకసారి బెంగాల్‌కు చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి, యుద్ధాల కోసం మచ్చిక చేయబడిన నలభై గజరాజుల్ని చక్రవర్తికి సమర్పించాడు. వాటి నైపుణ్యాన్ని అత్యధికంగా పొగడడం వల్ల వాటి పోరాట పటిమను చూడాలని ప్రభువుల వారు ఆదేశించారు. ఏనుగులు మైదానంలో దించబడ్డాయి. ఆ మైదానంలోనే నలుగురు రాకుమారులు అశ్వాల నధిరోహించి ఉన్నారు. చక్రవర్తి బాల్కనీలో కూర్చుండి వాటి పోరాటాన్ని తిలకిస్తున్నారు. ముందుగా సుధాకర్, సూరత్ సుందర్ అనే పేర్లు గల రెండు గజరాజులు పరస్పరం ఎదుర్కొంటున్నాయి. అంతలోనే సూరత్ సుందర్ పేరుగల గజరాజు తన ప్రత్యర్థిని ఎదుర్కోవడానికి బదులు పరుగెత్తసాగింది. సుధాకర్ పేరుగల గజరాజు కొంత దూరం దాన్ని వెంబడించింది. కాని అది దొరకలేదు. తన ప్రత్యర్థి తన ముందు నుండి పారిపోవడంతో, మదించిన ఆ గజరాజు జన సమూహం వైపునకు పరుగెత్తుకు రాసాగింది. ఎదురుపడిన ఔరంగజేబ్‌పై దాడి జరిపింది. కాని రాకుమారుడు ఔరంగజేబ్ ఎలాంటి ఎదురుబెదురు లేకుండా చేతిలోనున్న బల్లెంతో గజరాజు తలను గాయపరిచాడు. గాయపడిన ఆ గజరాజు ఇనుమడించిన కోపంతో తిరిగి ఔరంగజేబ్‌పై దాడికి పూనుకుంది. ఇంతలోనే కొందరు సేవకులు అక్కడికి పరుగెత్తుకొచ్చారు. ఏనుగును బెదిరించడానికి వారు బాణసంచా పేల్చుతూ ఇంకేమోమో చేశారు. అయినా గాయపడిన ఆ ఏనుగు వెనుకడుగు వేయలేదు. తన పొడవైన దంతాలతో ఔరంగజేబ్ గుఱ్ఱాన్ని పొడుస్తూ ఎత్తిపడేసింది. గుఱ్ఱం బోర్లాపడి పోయింది. చూపరులు శ్వాస తీసుకోవడం కూడా మరిచిపోయారు. కాని ఔరంగజేబ్ ఎలాంటి భయానికి లోనుగాకుండా ఒక్క ఉదుటున లేచి నిల్చున్నాడు. బల్యాన్ని తిరిగి చేతిలోకి తీసుకొని దాడి జరుపుదామన్నంతలోనే రాకుమారుడు షుజా, రాజా జైసింగ్‌లు దూసుకొచ్చారు. కాని అత్యంత కోపంతో ఉన్న ఆ ఏనుగును చూచి వారి గుఱ్ఱాలు బెదిరిపోయాయి. ఇక

ఔరంగజేబ్‌పై దాడి జరుపుదామన్నంతలోనే దాని ప్రత్యర్థి అయిన సూరత్ సుందర్ అనే గజం వెనుకనుండి వచ్చి, సుధాకర్‌ను బలంగా గుద్దింది. ఈ అన్ని పరిణామాలకు బెదిరిపోయిన సుధాకర్ మైదానం విడిచి పరుగెత్తసాగింది. ఇదంతా భయాందోళనలతో తిలకిస్తున్న షాజహాన్ చక్రవర్తి బాల్కనీ నుండి క్రిందికి దిగి రాసాగారు. రాకుమారులు నెమ్మదిగా చక్రవర్తి వైపునకు రాసాగారు. పర్యవేక్షకుడైన ఎతెమాద్ ఖాన్, రాకుమారున్ని సమీపించాడు. ఇతను రాకుమారుని తాత అయిన ఆసిఫ్ ఖాన్‌కు దగ్గరి బంధువు. అందుకని కూడా అతను బాగా ఆందోళనపడ్డాడు. "ఏనుగు ఇక్కడుంటే ఏదో ఒకటి చేసేవాణ్ణి. కాని అదిప్పుడు పారిపోయిందిగా, అందుకని ఆందోళన చెందే అవసరమే లేదు." రాకుమారుడు ఏతెమాద్ ఖాన్‌కు ప్రశాంతంగా సమాధానమిచ్చాడు. ఔరంగజేబ్ మెల్లమెల్లగా తండ్రిని సమీపించాడు. తన సమ్ముఖానికి వచ్చిన తనయున్ని సంబోధిస్తూ చక్రవర్తి ఇలా అన్నారు : "బాబు! దైవకృపవల్ల క్షేమంగా బయటపడ్డావు. దురదృష్టవశాత్తు ఏదైనా జరిగివుంటే ఎంత అవమానం పాలయ్యేవాళ్ళం." రాకుమారుడు వందనాలు సమర్పించి ఇలా అన్నాడు : "ఏదైనా జరిగివుంటే ఇందులో అవమానం పాలయ్యేదేముంది. నా సోదరులు చేసింది మాత్రం సిగ్గుపడాల్సిన పని." తనయుడు క్షేమంగా బయటపడ్డందుకు, చక్రవర్తి లక్ష రూపాయలు పేదసాదలకు దానంగా పంచేశాడు.[3]

ఈ సంఘటనవల్ల ఔరంగజేబ్‌లోని ధైర్యస్థైర్యాలు, అతని తెగింపు, అతనిలోని నిర్భీతి ఒక నిజమైన తైమూరి రాకుమారునిలో ఉండవలసిన లక్షణాల్ని బహిర్గతం చేసింది. అదిగాక షాజహాన్ మృదువుగా తనయుని మందలించిన తీరు, దానికి ఔరంగజేబ్ ఇచ్చిన సమాధానం వల్ల దారా షికూహ్ హృదయంలో ఏర్పడిన ద్వేషం, ఆ తరువాత 24 సంవత్సరాలలో దినదినాభివృద్ధి చెందసాగింది. ఇలా ఏర్పడిన ఈ అసూయ, ద్వేషాలే దారా షికూహ్‌ను ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా రకరకాల కుట్రలు, కుతంత్రాలు లేపడానికి కారణభూతమయింది. చివరికి అతని మరణంతోగాని ఈ ద్వేషాగ్ని చల్లబడలేదు.

ఈ సంఘటన జరిగిన మూడు రోజులకు ఔరంగజేబ్ 15వ జన్మదినం వచ్చినందున, ఆ జన్మదిన వేడుకలు మహా ఉత్సాహంగాను, ఎంతో వైభవోపేతంగానూ జరుపుకోబడ్డాయి.

## 2. దూరదృష్టి - ముందు జాగ్రత్త :

దూరదృష్టి మరియు ముందుజాగ్రత్తకు సంబంధించిన ఒక సంఘటనను హమీదుద్దీన్ ఇలా వివరించాడు: "అక్బరాబాద్ (ఆగ్రా)లో రాకుమారుడు దారా షికూహ్ నివాసం కోసం ఒక కొత్త మహలు నిర్మాణం జరిగింది. గృహప్రవేశ సమయంలో అతను చక్రవర్తితో సహా ముగ్గురు తమ్ముళ్ళను విందుకు ఆహ్వానించాడు. అది వేసవి కాలం. అందుకని చల్లదనం కోసం నదీ తీరాన్ని ఆనుకొని ఒక భూగర్భ గృహం (Cellar) నిర్మించబడింది. దానికి నది వైపు మనిషెత్తు (హల్బి)అద్దాలు అమర్చబడ్డాయి. దాన్ని చక్రవర్తి, రాకుమారులు తిలకిస్తున్నారు. అయితే రాకుమారుడు ఔరంగజేబ్ మాత్రం సెల్లార్ ప్రధాన ద్వారం వద్దే కూర్చుండిపోయాడు.

ఆ ద్వారం గుండానే మిగిలిన జనం రాకపోకలు జరుగుతున్నాయి. ఇది గమనించిన రాకుమారుడు దారా షికూహ్ కంటి సైగతో "అయ్యగారి వాలకాన్ని గమనించండం"టూ చక్రవర్తి దృష్టిని మరల్చాడు. అది గమనించిన ప్రభువులవారు "బాబూ! నీవు పండిత, నిరాడంబర మనస్తత్వం గల వాడవని మాకు తెలుసు. అయినా గాని నీకున్న హుందా గౌరవాన్ని కాపాడుకోవాలిగా! సామాన్య ప్రజలు వస్తూపోతున్న ద్వారం వద్ద కూర్చుండే పనేముంది. అదీగాక నీ కనిష్ఠ సోదరుల వీపు వెనుక ఉంటావా?" అంటూ మృదువుగా మందలించారు.

"ఇక్కడ కూర్చుండే కారణాన్ని నేను తరువాత విన్నవించుకుంటాను" అంటూ ఆయన సమాధానమిచ్చారు.

కొంచెం సేపైన తరువాత మధ్యాహ్నపు నమాజైన జొహర్ నమాజును ప్రజలతో సామూహికంగా నిర్వర్తించడం కోసం ఆయన మస్జిద్‌కు బయలుదేరారు. ఆ తరువాత చక్రవర్తి అనుమతి తీసుకోకుండానే అక్కడ్నుంచే ఆయన తన నివాసానికి వెళ్ళిపోయారు. ఈ విషయం ప్రభువుల వారికి తెలుపగా, ఆయన (కోపగించుకొని) ఇక దర్బారుకు రావద్దని ఆంక్ష విధించారు. కనుక ఆ తరువాత ఏడు మాసాల వరకు దర్బారుకు వెళ్లడంగాని, చక్రవర్తిని దర్శించుకునే అవకాశం కోల్పోయాడు. ఏడు నెలల తరువాత ప్రభువుల వారు బేగం సాహబ (చక్రవర్తి జ్యేష్ఠపుత్రిక జహాఁఆరా బేగం)ను పిలిచి "ఆ రోజు మా అనుమతి తీసుకోకుండా వెళ్ళిపోవడానికి, అనర్హమైన ఆ స్థానంలో కూర్చుండడానికి కారణమేమిటో కనుక్కొని రావాల్సిందిగా పంపించారు.

దానికి కారణాలు తెలుపుతూ ఆయన తన అక్కయ్యకు ఇలా సమాధానమిచ్చారు. "అన్నయ్య దారా షికూహ్ విందుకు ఆహ్వానించిన రోజు నాన్నగారిని, మిగిలిన సోదరులందరిని కేవలం ఒకే ఒక ద్వారం ఉన్న భూగర్భమహలు (సెల్లార్)లో తీసుకెళ్ళారు. వారందరిని ఒంటరిగా వదలి విందు సన్నాహాల కోసం తాను వస్తూపోతూ ఉన్నారు. బహుశ ఆయన అలా కావాలని చేసి ఉండకపోవచ్చు, అది కాకతాళీయంగానే జరిగి ఉండవచ్చు, కాని ఆ ఒక్క ద్వారం మూసేస్తే నాన్నగారితో సహా, మా అందరి పని సమాప్తమైనట్లేకదా! అందుకని వారంతా లోపల ఉన్నంతవరకు ఈ (సంరక్షణ – కాపలా) బాధ్యతను చేపట్టాలని నా మనసు నన్ను ప్రేరేపించింది. అయితే ప్రభువుల వారి వైభవం, ఆయన భయం ఈ బాధ్యతను నెరవేర్చడానికి అనుమతించడం లేదు. అందుకని దైవంతో మన్నింపు కోరుకుంటూ అక్కడ్నుంచి వచ్చేశాను."

తన పుత్రిక ద్వారా ఈ విషయం తెలుసుకున్న చక్రవర్తుల వారు వెంటనే అయ్యగారిని పిలిపించుకున్నారు. అత్యధికంగా ప్రసన్నమవడమేగాక అమూల్యమైన కానుకల్ని కూడా ప్రసాదించారు.[4]

షాజహాన్ తన రాకుమారులతో సహా కాశ్మీరం వెళ్ళాడు. కాశ్మీరులో ఉండగానే ఔరంగజేబ్‌కు 'లోకభవన్' పేరుగల ఒక పరగణ ప్రసాదించబడుతుంది. అప్పటివరకు ఔరంగజేబ్

రోజుకు 500 రూపాయల భత్యం పొందుతున్న చిరుప్రాయుడైన ఒక రాకుమారుడు మాత్రమే. అయితే 1634 డిసెంబర్ 13న అతన్ని పదివేల పదాతిదళం, నాలుగువేల అశ్విక దళం కలిగిన మన్సబుదారుగా నియమించడం జరిగింది. జెండా, నగారా ప్రసాదించ బడ్డాయి. ఆ రోజు నుండి షాజహాన్ ప్రభుత్వంలో అతనో మన్సబుదారుగా గుర్తింపుపొందాడు.[5]

కాలం గడుస్తూ పోతున్నది. అప్పటివరకు ఔరంగజేబ్, షాజహాన్ దర్బారులోని ఒక మన్సబుదారు మాత్రమే. కాని తన సత్ప్రవర్తన, పెద్దలు, దర్బారు నాయకులు, మంత్రుల పట్ల వినయ విధేయతల కారణంగా అతనందరిలో ప్రీతిపాత్రుడు కాసాగాడు. దీనికి భిన్నంగా తల్లిదండ్రుల అతిప్రేమ దారా షికూహ్‌ను గర్విష్ఠిగా మార్చింది. తను చెప్పిందే నిజమని, తన మాటే నెగ్గాలనే మంకుపట్టు కలిగినవాడు. ఈ ఇద్దరి మనస్తత్వాల్లో, వ్యక్తిత్వాల్లో గల భిన్నత్వమే, వారి రాబోయే జీవితాల్లో ప్రధాన పాత్ర పోషించింది.

## 4. సైనిక కమాండరుగా రాకుమారుడు ఔరంగజేబ్ :

బుందేల్ ఖండ్ ప్రాంతం ఎల్లప్పుడు అలజడులకు, విద్రోహాలకు తిరుగుబాట్లకు ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి పాలకులు తరచుగా ప్రభుత్వాల్ని ఇక్కట్లు పెట్టడంలోను, సామాన్య ప్రజల్ని హింసించడంలోనూ అందెవేసిన చేయి. ఈ ప్రాంతం అక్బర్ చక్రవర్తి కాలంలోనే మొగలు సామ్రాజ్య అధీనంలోకి వచ్చేసింది. అక్బర్ చక్రవర్తికి మంత్రి అయిన అబుల్ ఫజ్ల్‌ను, రాకుమారునిగా నున్న జహంగీర్ తన శత్రువుగా భావిస్తుండేవాడు. కనుక అతను దక్కన్ నుండి రాజధానికి తిరిగివస్తున్నప్పుడు, బుందేల సర్దార్ బీర్‌సింగ్ ద్వారా జహంగీర్ అతన్ని చంపించాడు. దీనికి శిక్షగా అక్బర్, అతన్ని తన ప్రాంతంలో ఉండకుండా చేసినప్పటికీ జహాంగీర్ సింహాసనాన్ని అధిష్ఠించిన తరువాత అతని అదృష్టద్వారాలు తెరుచుకున్నాయి. అప్పటి వరకు బుందేల్‌ఖండ్‌ను ఏలుతున్న రాజును పదవీచ్యుతుని చేసి, గద్దె ఈ బీర్‌సింగ్‌కు అప్పగించడం జరిగింది. అధికారం లభించినప్పటికీ కూడా అతను దోపిడీ దౌర్జన్యాల తన పాత అలవాటును వదులుకోలేకపోయాడు. అతని మరణం తరువాత అతని కుమారుడు జఝూర్ సింగ్ గద్దెనెక్కాడు. ఎప్పుడైతే షాజహాన్ సింహాసనాన్ని అధిష్ఠించాడో, ఇతర సామంత రాజులలాగే ఇతనుకూడా దర్బారులో హాజరయ్యాడు. కారణం ఏమిటో తెలియదుగాని లేక అతని సలహాదారులు ఏమని సలహా ఇచ్చారో తెలియదు గాని ఒక రోజు రాత్రి చెప్పకచేయక పారిపోయాడు. షాజహాన్‌కు ఈ కబురందగానే, అతన్ని బంధించడానికి సైన్యాన్ని పంపించాడు. యుద్ధంలో అతను ఓడిపోయాడు. కాని సంధి చేసుకొని విధేయత కనబరిచాడు. కాని ప్రశాంతంగా ఉండడం అతని నైజంలోనే లేదు. తిరిగి విద్రోహానికి తలపడ్డాడు. ఈసారి గోండ్ ప్రాంతంపై దాడి జరిపి దాని రాజధాని అయిన “చోడగడ్డ”ను ఆక్రమించుకొని, రాజు భీం నారాయణ్ (ప్రేమ్ నారాయణ్)ను హతమార్చాడు. ప్రేమ్ కుమారుడు షాజహాన్‌ను

సందర్శించి తన బాదను చెప్పుకున్నాడు. ఇదొక్కటే కాకుండా అతని ఇతర కార్యకలాపాలు కూడా శ్రుతిమిస్తున్నందువల్లను, అతను నర్మదానదిని దాటి వచ్చే ప్రమాదం ఏర్పడినందునను అతన్ని అణచడానికి షాజహాన్ మూడు సైనిక పటాలాల్ని ఏర్పాటు చేశాడు. ఒకదానికి అబ్దుల్లా ఖాన్ బహాదుర్ ఫెరోజ్ జంగ్‌ను, రెండవదానికి సయ్యద్ ఖానెజహాన్, మూడవదానికి ఖానె దౌరాంను సైన్యాధిపతులుగా నియమించడం జరిగింది. అయితే ఈ ముగ్గురు సర్దారులు కూడా సమాన హోదా కలిగినవారు, వారిలో ఏదైనా భేదాభిప్రాయం వస్తే, వారిని కట్టడిచేసే, ఆదేశించే వారెవరనే ప్రశ్న జనించింది. అందుకని షాజహాన్ ఈ మూడు సైన్యాలపై ఔరంగజేబ్‌ను ప్రధాన సైనికాధికారిగా నియమించాడు.

ఔరంగజేబ్ యుద్ధ తంత్రజ్ఞతకు ఇది మొదటి పరీక్ష. ఈ సైన్యం జఝూర్ సింగ్‌ను ఓడించి, దాని గద్దెపై పాత పాలకుడైన దీబి సింగ్‌ను కూర్చుండబెట్టింది. జఝూర్ సింగ్ యుద్ధమైదానం నుండి పారిపోయి, దాహ్ మెరాతి ప్రాంతానికి వెళ్ళాడు. అక్కడ కూడా రక్షణ లేని కారణంగా కుటుంబ సమేతంగా గోండ్ వాళ్ళ ప్రాంతంలో ప్రవేశించాడు. అయితే అతనిప్పుడు రెండు రకాల ప్రమాదాల్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఒకవైపు మొగలు సేనలు వెంబడిస్తూ వస్తున్నాయి. వేరొకవైపు గోండ్ వాళ్ళ ప్రాంతాన్ని నాశనం చేసి, వారి రాజును హతమార్చిన కారణంగా గోండ్లు (నాయకపోల్లు) అతనికి బద్ధ శత్రువులయ్యారు. చివరికి అతను, అతని కుమారుడు పట్టుబడి హతమార్చబడ్డారు. అతని అనుయాయులందరూ బంధీలయ్యారు. ఈ విధంగా ఈ యుద్ధం సమాప్తమైంది. ఈ సందర్భంలోనే చాందా రాజు 'కీబా' కూడా విధేయతను ప్రకటించాడు. (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్ - సయ్యద్ నజీబ్ అష్రఫ్, పేజి 137-141).

# 4. దక్కన్ గవర్నరుగా రాకుమారుడు ఔరంగజేబ్

అక్బర్ చక్రవర్తి మరణించే సమయానికి ఖాన్‌దేశ్, బిరార్ ప్రాంతాలే కాక నిజాంషాహి రాజ్యానికి చెందిన అహ్మద్‌నగర్ మొదలుగాగల ప్రాంతాలు మొగలు రాజ్యంలో కలిసి పోయాయి. జహాంగీర్ సింహాసనాన్ని అధిష్టించిన తరువాత ఈ ప్రాంతాల గురించి అంతగా పట్టించుకోలేదు. దీని ఫలితంగా ఒకవైపు మొగలు ప్రభుత్వాధికారుల్లో అలసత్వం వచ్చేసింది. వేరొకవైపు నిజాంషాహి రాజ్యంలో మలిక్ అంబర్ పేరుగల ఒక నీగ్రో బానిస తన తెలివితేటలు, యోగ్యతల ద్వారా ఈ రాజ్యానికి కొత్త జీవంపోశాడు. ఈ మూడు దక్కన్ రాజ్యాల్ని సుదృఢ పరిచి, మొగలు ప్రాంతాల్ని మొగలులకు అప్పగించకపోవడమే గాక, మొగలు అధికారుల్ని దోచుకుంటూ, కోటల్ని ముట్టడించసాగాడు. ఈ విషయం తెలుసుకున్న జహాంగీర్, రాకుమారుడు ఖుర్రం (షాజహాన్)ను దక్కన్‌కు పంపించాడు. ఖుర్రం, మలిక్ అంబర్‌ను అణచివేయడమే కాకుండా, బీజాపూర్ పరిపాలకునితో సంధి చేసుకొని మిత్ర సంబంధాల్ని ఏర్పాటు చేశాడు. అయితే ఈ ఏర్పాట్లు ఎంతో కాలం వరకు నిలిచి వుండలేకపోయాయి. మలిక్ అంబర్ తిరిగి బలం పుంజుకొని, నర్మద ప్రాంతంలోని మొగలు రాజ్యాన్ని కొల్లగొట్టడం ప్రారంభించాడు. ఈ విషయం జహాంగీర్ చెవినపడగానే, అతనో గొప్ప సైన్యాన్ని సన్నద్ధంచేసి పంపి తాను కూడా దాని వెనుకనే బయలుదేరాడు. అయితే ఖుర్రం మరోసారి వారిని ఓడించి సంధికి రప్పించాడు.[1]

కొంతకాలం ఇలాగే గడిచిపోయింది. ఈ మధ్యలో షాజహాన్ మరియు మహాబత్ ఖాన్‌ల విద్రోహం, తరువాత జహాంగీర్ మరణం, షాజహాన్ పట్టాభిషేకం సందర్భంలో జరిగిన సంఘర్షణలు – ఇవన్నీ దక్కన్ వారికి సువర్ణావకాశాలు కల్పించాయి. వారు ఈ పరిస్థితులతో సంపూర్ణంగా లాభపడ్డారు. ఖానెజహాఁ నుండి (మొగలుల) బాలఘాట్ ప్రాంతాన్నంతా లాగేసుకున్నారు. పరిస్థితులు ఇలా చేయిదాటి పోతుండడంతో షాజహాన్ ఇటు దృష్టిసారించక తప్పలేదు. అంతలోనే ఖానెజహాఁ తిరుగబడడంతో పరిస్థితి మరీ విషమించిపోయింది. అందుకని అనేక సైన్యాలు దక్కన్ వైపునకు పంపబడ్డాయి. ఈ సైనికాధికారులు నిజాం షాహి వారిని అణిచివేయడమే కాకుండా, ఆదిల్ షాహ్‌ను విధేయతకు వివశుణ్ని చేశారు. అయితే బీజాపూర్ వారు తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు. వేరొకవైపు శివాజి తండ్రి సాహూజీ దర్బారులోని ఇతర నాయకులతో కలిసి నిజాంషాహి వంశంలోని ఒక బాలుణ్ని రాజుగా ప్రకటించి తిరుగుబాటు చేశారు. అందుకని షాజహాన్ ఈ వైపు పరిపూర్ణంగా శ్రద్ధ చూపక తప్పలేదు.

మరాఠాలతో సంబంధాల కోసం ఒక ప్రత్యేక అధ్యాయమే కేటాయించినప్పటికీ, సందర్భాన్ని అనుసరించి క్లుప్తంగా పేర్కొనవలసి వచ్చింది. సాహూజీ అత్తవారి వంశం వాళ్ళు షాజహాన్‌కు విధేయతను అవలంబించినవారే. కనుక ఇతను కూడా షాజహాన్‌కు తన

విధేయతను ప్రకటించుకున్నాడు. కాని ఆ తరువాత తిరుగబడి బుర్హాన్‌షాతో కలిసిపోయాడు. జాదూరాయ్, అతని కుటుంబీకుల్ని బుర్హాన్‌షా కుట్రతో తన దర్బారులోనే వధించివేసినప్పుడు ఈ కుటుంబం తిరిగి షాజహాన్‌ను ఆశ్రయించింది. ఇదేవిధంగా స్వయంగా సాహూజీ ప్రారంభంలో మొగలుల విధేయతను అవలంబించాడు. అతన్ని అనుసరిస్తూ అతని ఇతర కుటుంబ సభ్యులు కూడా ఇదే మార్గాన్ని అవలంబించారు. కాని అవకాశం చిక్కగానే నిజాంషాహి వంశంలోని ఒక బాలున్ని గద్దె ఎక్కించి, మొగలులను ఎదుర్కోవడానికి సిద్ధపడ్డాడు.[2]

ఈ పరిస్థితుల్లో షాజహాన్ స్వయంగా దక్కన్‌కు బయలుదేరాడు. రాకుమారుడు ఔరంగజేబ్ తండ్రి వెంటే ఉన్నాడు. 1636, ఫిబ్రవరి 21న తండ్రీ కుమారులు దౌలతాబాద్ చేరుకున్నారు.

ఈ మధ్యలో మునుపటిలాగే విధేయతను అవలంబిస్తే వారి వారి రాజ్యాలు వారికే ఉంటాయని ఆదిల్ షా మరియు ఖుతుబ్‌షాలకు షాజహాన్ ఫర్మాన్లు పంపించాడు.

ఖుతుబుల్ ముల్క్ మొగలు సైన్యాన్ని ఎదుర్కొనే శక్తిలేక వెంటనే తన విధేయతను తెలుపుకున్నాడు. చక్రవర్తి ఒక్కొక్క ఆదేశాన్ని తు.చ. తప్పక పాటిస్తామని వాగ్దానం చేశాడు. బాకీపడి ఉన్న కప్పం నుండి ఐదు లక్షల హూన్లు (ఆ కాలపు కరెన్సీ) కూడా సమర్పించాడు. దీనితో ప్రసన్నుడైన చక్రవర్తి రెండు లక్షల హూన్లను మాఫీ కూడా చేశాడు.[3]

కాని మాఫీ చేయబడిన ఈ రెండు లక్షల హూన్లే ఏ విధంగా ఖుతుబ్‌షా పతనానికి దారితీసాయో మున్ముందు మీరే తెలుసుకుంటారు.

కాని ఆదిల్‌షా కొంతమేరకు మరాఠాల సహాయాన్ని ఆశించి, తన దర్బారులోని నాయకుల ఒక వర్గం ఆవేశపూరిత భావాలతో ప్రభావితమై యుద్ధానికే సన్నద్ధమయ్యాడు. యుద్ధం ప్రారంభమయింది. మొగలు సైన్యాలు విజయభేరిని మోగిస్తూ బీజాపూర్ రాజధాని నగరాన్ని సమీపించసాగాయి. ఈ పరిస్థితులతో చింతాక్రాంతులైన బీజాపూర్ వారు తమ ప్రాంతాల్నే నాశనం చేస్తూ, బీజాపూర్ పరిసరాల్ని బురదమయం చేశారు. దీంతో మొగలు సైన్యాల పురోగమనం కూడా ఆగిపోయింది. తిరిగి సంధి ప్రయత్నాలు మొదలయ్యాయి. చివరికి సంధి షరతులు నిర్ణయమయ్యాయి. విధేయతకు, కప్పానికి సంబంధించిన షరతులే కాకుండా ఆదిల్ షాకు కొన్ని రాయితీలు కూడా ప్రసాదించబడ్డాయి. అయితే ఈ క్రింది మూడు షరతులు పూర్తి చేసినప్పుడే అతనా రాయితీలకు అర్హుడు. ఆ షరతులేమిటంటే :

1. మొగలు సామ్రాజ్యం పట్ల విధేయత.
2. నిజాంషాహి నాయకులు, అధికార్లతో పూర్తి తెగతెంపులు.
3. ఖుతుబుల్ ముల్క్‌తో మైత్రి మరియు సమానస్థాయి సంబంధాల పునరుద్ధరణ.[4]

## దక్కన్ గవర్నరుగా ఔరంగజేబ్ పదవీ బాధ్యతలు :

ఆదిల్‌షా ఆ తరువాత చక్రవర్తిది ఒక చిత్రపటాన్ని కోరాడు. అతని కోరిక మన్నించ బడింది. ఇక ఇప్పుడు దక్కన్‌లో షాజహాన్‌కు చెప్పుకోదగ్గ పనేం లేదు. సాహూజీ భోన్‌స్లా[5]

ఇంకా ఇలాంటి ఇతర నిజాంషాహి తిరుగుబాటు నాయకుల్ని అంతమొందిస్తానని ఆదిల్‌షా వాగ్దానం చేశాడు. అందుకని షాజహాన్ ఉత్తర భారతానికి మరలేముందు బుందేల యుద్ధం తరువాత తన వెంటే ఉంటున్న రాకుమారుడు ఔరంగజేబ్‌ను 1636 ఏప్రిల్ 29న దక్కన్ ప్రాంతాలన్నిటికీ సూబేదార్ (గవర్నరు)గా నియమించాడు. షాజహాన్ తిరుగు ప్రయాణంలో మూడు రోజుల వరకు ఔరంగజేబ్ తండ్రిని సాగనంపడానికి వెన్నంటే ఉన్నాడు.

ప్రారంభంలో షాజహాన్ దక్కన్‌లోని తన పాలిత ప్రాంతాల్ని రెండు భాగాలుగా విభజించి ఉన్నాడు. కాని ప్రస్తుత విజయాల తరువాత వీటిని ఈ క్రింది నాలుగు సూబాలుగా విభజించవలసి వచ్చింది.

1. దౌలతాబాద్, అహ్మద్ నగర్ దాని పరిసర ప్రాంతాలు కలిపి ఒక సూబా.
2. తెలంగాణా మొదలుకొని బాలఘాట్ వరకు గల ప్రాంతం రెండవ సూబా.
3. ఖాన్‌దేశ్ దాని పరిసరాలు మొదలుకొని ప్రఖ్యాతిగాంచిన బుర్‌హాన్‌పూర్ వరకు మూడవ సూబా.
4. బిరార్ మొదలుకొని ఏలచ్‌పూర్ వరకు గల ప్రాంతం నాలుగవ సూబా.

పై నాలుగు సూబాల్లో 64 కోటలుండేవి. అందులో 53 కోటలు కొండలు, గుట్టలపై నిర్మించబడ్డాయి. ఈ సూబాల సామూహిక రాబడి సంవత్సరానికి 140 కోట్ల దామ్‌లు అనగా దాదాపు ఐదు కోట్ల రూపాయలుండేవి. ఔరంగజేబ్ ప్రప్రథమంగా దక్కన్ గవర్నరు పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నప్పుడున్న పరిస్థితులివి. అప్పటికి ఔరంగజేబ్ వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు.

ఇకిప్పుడు ఔరంగజేబ్ ముందున్న ముఖ్య పనేమిటంటే నిజాంషాహి ప్రాంతాల్లోని ఏ కోటలైతే మరాఠా సర్దారు సాహూజి, ఇతర నీగ్రో మరియు రాజపుత్ర నాయకులు ఆక్రమించుకొని ఉన్నారో వాటిని స్వాధీనపరచుకోవడం. షాజహాన్ దక్కన్‌ను విడిచే ముందే ఈ పనికోసం ఇద్దరు అధికారుల్ని నియమించాడు. అందులోని ఒక అధికారి ఖానె దౌరాఁ ఉదయగిరిని నీగ్రో నాయకుడు సయ్యిది మిఫ్తాహ్ (ఇతనే ఆ తరువాత హబష్ ఖాన్ పేరుతో ప్రఖ్యాతిగాంచాడు) నుండి వశపరచుకున్నాడు. రాజపుత్ర అధికారి భోజ్‌రాజ్ నుండి 'ఓసా'ను జయించాడు. ఆ తరువాత అతను గోన్డ్‌వానాలో ప్రవేశించి దేవ్‌గడ్ రాజును కప్పానికి, సామంతానికి వివశుణ్ని చేశాడు. కప్పం ధనంతో విజేయునిగా తిరిగి వచ్చాడు. ఇక రెండవ అధికారి అయిన 'ఖానె జమాఁ' బీజాపూర్ నాయకుడైన 'రుందేల'తో కలిసి 'సాహూజీ'ని వెంబడిస్తూ అతని కోటల్ని జయిస్తూ చివరికి అతన్ని విధేయతకు వివశుణ్ని చేశాడు. అతని యజమాని, సంరక్షకుడైన నిజాంషాహి రాజు బంధీఅయ్యాడు. ఇకిప్పుడు 'సాహూజీ' బీజాపూర్ దర్బారు ఉద్యోగంలో చేరాడు. ఈ విధంగా నిజాంషాహి ప్రాంతమంతా మొగలుల అధీనంలోకి వచ్చేసింది. మొగలుల రాబడిలో కోటి రూపాయల పెరుగుదల వచ్చింది.

పరిస్థితులిలా ఉండగానే వివాహం కోసం ఆగ్రా రావాల్సిందిగా ఔరంగజేబ్‌కు ఆదేశాలందాయి. 1637 ఏప్రిల్ 16న ఔరంగజేబ్ తండ్రిని సందర్శించుకున్నాడు.

మొగలు పాలకులు సామాన్యంగా భారతదేశంలోని పండిత కుటుంబాలతోను, ఈరాన్ రాజ కుటుంబీకులతోను, వివాహ సంబంధాలు ఏర్పరచుకునేవారు. అందుకని ఔరంగజేబ్ కోసం ఇరాన్‌కు చెందిన ఒక మాజీ నాయకుడు మిర్జా రుస్తుం ఖాన్ తనయుడైన నవాబ్ షా నవాజ్ ఖాన్ కుమార్తె "దిల్‌రస్‌బానొ" ఎంపిక చేయబడింది. రుస్తుంఖాన్ 'సఫవీ' రాజవంశంతో సంబంధమున్నవాడు. అప్పటివరకు దారా షికూహ్, షుజాల వివాహాలు జరిగిపోయాయి. వీరిద్దరి వివాహ ఖర్చుల్ని వారి అక్కయ్య జహాఁ ఆరా బేగమే భరించింది. అయితే ఔరంగజేబ్ వివాహ ఖర్చులు మాత్రం స్వయంగా షాజహానే భరించాడు. 1637 మే 14 వరకు ఈ వివాహ తతంగాలన్నీ ముగిసి, "దిల్‌రస్‌బానొ" ప్రథమ అర్ధాంగిగా ఔరంగజేబ్ ఇంట్లో ప్రవేశించింది. దిల్‌రస్‌బానొ మాత్రమే కాకుండా, ఆ తరువాత ఔరంగజేబ్ పత్నులుగా ఉండినవారి వివరాలు ఇలా ఉన్నాయి :

1. నవాబ్ బాయి : అసలు పేరు రహ్మతున్నిసా బేగం, ఈమె కాశ్మీరంలోని రాజూరి ప్రాంతపు రాజు పుత్రిక.

2. ఔరంగాబాదీ మహల్

3. ఉదయపూరి మహల్ : అక్బర్ చక్రవర్తి కాలం నుండే మొగలులలో ఒక ఆచారం వస్తుండేది. రాజవంశంతో వివాహ సంబంధాలు ఏర్పడి, అంతఃపురంలో ప్రవేశించిన స్త్రీ, ఏ నగరం, ప్రాంతానికి చెందినదో ఆమెను అదే నగరం పేరుతో సంబోధించేవారు. ఈ నలుగురు పత్నులుకూడా సంతానం కలిగినవారే. వీరు కాకుండా ఔరంగజేబ్ 'ప్రేయసి'గా ప్రసిద్ధిగాంచిన జైన్‌ఆబాది మహల్ పేర్కొనదగిన వ్యక్తిత్వం.[6] ఆ సందర్భం వచ్చినప్పుడు ఈమె గురించి వివరంగా తెలుపుతాము.

ఇక ఔరంగజేబ్ సంతానం గురించి తెలుసుకుందాం. ఔరంగజేబ్‌కు ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు, మొత్తం పదిమంది సంతానం. మరణానంతరం 'రాబియా అల్ దుర్రాని' గా ప్రఖ్యాతిగాంచిన దిల్‌రస్ బానొకు ఈ క్రిందివారు సంతానం. 1. జైబున్నిసా 2. జీనతున్నిసా 3. జుబ్‌దతున్నిసా 4. ముహమ్మద్ ఆజం 5. ముహమ్మద్ అక్బర్.

నవాబ్ బాయికు ముగ్గురు సంతానం : ముహమ్మద్ సుల్తాన్, ముహమ్మద్ ముఅజ్జం, బద్రున్నిసా.

ఔరంగబాదీ మహల్‌కు ఒకరు : మెహ్రున్నిసా

ఉదయపూరి మహల్‌తో కూడా ఒక్కరే - కామ్ బక్ష్[7]

ఔరంగజేబ్ వివాహ ప్రస్తావన వచ్చింది కనుక ఆ తరువాత అతని అంతఃపురంలో ప్రవేశించిన వారందరి వివరాలను, సంతాన వివరాలను మేమిక్కడే పేర్కొన్నాము. వీరందరూ

ఒకేసారి ప్రవేశించారనుకోవడం పొరపాటు. అతని పత్నుల సంఖ్య ఎన్నడూ నలుగురికి మించలేదు. అతని పత్నుల గురించి, సంతానం గురించి మేము వివరాల్లోకి పోదలచుకో లేదు గనక ఈ అధ్యాయాన్ని ఇక్కడే కొన్ని పంక్తుల్లో ముగించేశాము.

ఇక తిరిగి మనం దక్కన్‌కు వద్దాం. వివాహానంతరం ఔరంగజేబ్ తిరిగి దక్కన్ చేరుకున్నాడు. దక్కన్‌లో ఔరంగజేబ్ పని సమాప్తం కాలేదు. గుజరాత్ మరియు ఖాన్‌దేశ్ మధ్య త్రోవలో 'బక్‌లానా' అనే ప్రాంతం ఉండేది. అందులోని కోటలు దుర్భేధ్యంగా భావించబడేవి. ఈ ప్రాంతాన్ని అలాగే స్వాతంత్ర్యంగా ఉండనిస్తే, మున్ముందు మొగలు సామ్రాజ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశముంది. అందుకే వివాహానంతరం ఔరంగజేబ్ తిరిగి దక్కన్‌కు మరలుతున్నప్పుడు, ఈ కోటల్ని వశపర్చుకోవాల్సిందిగా షాజహాన్ ఆదేశించాడు. అందుకని మరాఠా సర్దారు మాలోజీ[8] మరియు తాహర్ ఖాన్‌లను ఏడువేల సైన్యంతో ఆ ప్రాంతానికి పంపడం జరిగింది. వీరు ఆ ప్రాంతాన్ని వశపర్చుకున్నారు. దాని పాలకుడు షా బహర్‌జీ మొగలు సైన్యంలో చేరిపోయాడు. బహర్‌జీ అల్లుడు సోమ్‌దేవ్ రాం నగర్‌కు రాజు. కాని చెప్పుకోదగ్గ రాబడి దానికి లేనందువల్ల పదివేలు తీసుకొని అతన్నలాగే వదిలేయడం జరిగింది.[9]

ఇకిప్పుడు కేవలం ఒకే ఒక మరాఠా సర్దారు ఖేలోజీ మిగిలిపోయాడు. ప్రారంభంలో ఇతను నిజాం షాహి ఉద్యోగి. ఆ తరువాత షాజహాన్‌ను ఆశ్రయించి పంచ్ హజారి మన్సబు దారుగా నియుక్తుడయ్యాడు. అయితే దౌలతాబాద్ ముట్టడి సమయంలో తన కొత్త ప్రభువుకు ద్రోహంచేసి, తిరిగి నిజాంషాహి పక్షానికి వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆదిల్ షాహి వారి ఉద్యోగంలో చేరాడు. కాని మొగలులతో సంధిచేసుకున్న తరువాత ఆదిల్‌షా కూడా అతన్ని గెంటివేశాడు. ఇకిప్పుడు అతను దోపిడీ, దౌర్జన్యాలు మొదలుపెట్టాడు. అతన్ని అణచడానికి ఔరంగజేబ్, మలిక్ హుసేన్‌ను పంపించాడు. అతను పట్టుబడి వధించబడ్డాడు.[10]

జులై 1636 నుండి మే 1644 అనగా దాదాపు ఎనిమిది సంవత్సరాలు ఔరంగజేబ్ దక్కన్‌కు గవర్నరుగా ఉండి, దక్కన్ ప్రాంతాన్నంతా విద్రోహుల నుండి, దోపిడీదార్ల నుండి, తిరుగుబాటుదారుల నుండి సురక్షితం చేయడమే కాకుండా కొత్తగా 'బక్‌లానా' ప్రాంతాన్ని మొగలు సామ్రాజ్యంలో చేర్చగలిగాడు. సూబా అంతరంగిక వ్యవహారాల్ని చక్కబెట్టడమే కాకుండా, దాన్ని సస్యశ్యామలం చేయడానికి, ప్రజల జీవనస్థాయిని పెంచడానికి కూడా ఎంతో ప్రయత్నించాడు. అందులో చాలా వరకు అతను కృతార్థుడయ్యాడనే చెప్పాలి.

ఈ మధ్య కాలంలో అతని మన్సబు (ఉద్యోగస్థాయి) కూడా పెరుగుతూ పోయింది. అతను పదివేల పదాతి, ఐదువేల అశ్వికదళ మన్సబు నుండి, పదిహేను వేల పదాతి, పదివేల అశ్విక దళ మన్సబుదారుగాను, ఆ తరువాత పదహారువేల అశ్వికదళ - 2 మరియు 3 అస్పాల మన్సబుదారుగాను ప్రమోషన్ పొందుతూ పోయాడు.[11]

ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో అతను నాలుగు సార్లు దక్కన్ నుండి ఉత్తర భారతానికి వచ్చాడు. మొదటిసారి వివాహం కోసం, రెండవ మూడవసారి తన తండ్రి,

చక్రవర్తిని దర్శించుకోవడం కోసం, నాలుగవ సారి తన సోదరి జహాఁ ఆరా ఒళ్ళు కాలిపోయినందున ఆమెను పరామర్శించడం కోసం.

| | చేరిన తేది | తిరిగి బయలుదేరిన తేది |
|---|---|---|
| 1. | 16-4-1637 | 04-09-1637 వివాహం కోసం 4 నెలల 18 రోజులు |
| 2. | 30-12-1639 | 20-02-1640 దర్శనం కోసం 1 నెల 20 రోజులు |
| 3. | 11-03-1642 | 25-03-1642 దర్శనం కోసం 14 రోజులు |
| 4. | 02-05-1644 | సోదరి జహాఁఆరాను పరామర్శించడం కోసం |

ఇక్కడ మనమో విషయాన్ని గమనించాల్సి ఉంది. ప్రతిసారి ఆగ్రాలో ఆగే వ్యవధి మునుపటి కన్నా తగ్గుతూ వచ్చింది. దీనివల్ల తండ్రి, సోదరునితో క్షీణిస్తున్న సంబంధాలను అంచనావేయవచ్చు. దీని ఫలితం చివరిసారిగా వచ్చినప్పుడు స్పష్టంగా బయటపడింది. అనగా ఔరంగజేబ్ తన మన్సబు (గవర్నరు పదవి) నుండి పదవీచ్యుతుడవడమే కాక, చక్రవర్తి దర్శనం నుండికూడా వంచించబడ్డాడు. మే 2, 1644న అతను ఆగ్రా చేరుకొని తండ్రిని దర్శించుకున్నాడు. కాని అక్కడ బహు కష్టంగా మూడు వారాలు (మే 28) గడవక ముందే అతన్ని దక్కన్ గవర్నరు పదవి నుండి తొలగిస్తున్నట్లు షాజహాన్ ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ మధ్యలో ఏం జరిగిందనే దానికి చరిత్రకారులు మనకు సరియైన వివరాలు అందించలేకపోయారు. షాజహాన్ దర్బారు చరిత్రకారుడైన అబ్దుల్ హమీద్ ఈ విషయంలో ఇలా వ్రాశాడు :

1. రాకుమారుడు ఔరంగజేబ్ బహద్దూర్ ద్వారా బయల్పడిన కొన్ని అనుచిత చర్యల కారణంగా ప్రభువుల వారు (షాజహాన్) తీవ్ర అసంతృప్తి చెంది అతనికి శిక్షగా దక్కన్ గవర్నరీ నుండి పదవీచ్యుతుణ్ణి చేయడమే కాకుండా, దర్బారుకు వచ్చి సందర్శించుకోవడాన్ని కూడా నిషేధించారు.[12]

అయితే ఇంకొక సమకాలీన చరిత్రకారుడు, "అమలె సాలెహ్" రచయిత ముహమ్మద్ సాలెహ్ ఇలా పేర్కొన్నాడు :

2. విద్వాంసుడైన రాకుమారుడు ఔరంగజేబ్ భిక్షకుల సాన్నిధ్యాన్ని అనుభవించడానికి ఆధ్యాత్మిక సమృద్ధిని పొందడానికి, వారి సరసన చేరారు. ఈ విధంగా నశ్వరమైన ఈ ప్రాపంచిక ఐశ్వర్యం నుండి తనను తప్పించి ఏకాంతవాసపు పెన్నిధిని, పరిత్యాగపు భాగ్యాన్ని పొందాలని అభిలషించారు. అంటే దీనిద్వారా ఆయనగారి ఉద్దేశ్యమేమిటంటే, తనకు ప్రాప్తంగా లేని ఆధ్యాత్మిక సాంగత్యాన్ని పొందడం ఇంకా దైవ ప్రసన్నత అనబడే భాగ్యాన్ని పొందిన ఉన్నతుల సంపర్కాన్ని పొంది వారితో ప్రత్యేక సంబంధాన్ని కలిగి ఉండడం.

మొదటి చరిత్రకారుడు "ఔరంగజేబ్ ద్వారా బయల్పడిన కొన్ని అనుచిత చర్యల వల్ల షాజహాన్ అసంతృప్తుడయ్యాడని" ఔరంగజేబ్‌పై మోపిన నిందను, రెండవ చరిత్రకారుడు తన వాంగ్మూలము ద్వారా ఇలా కడిగేశాడు.[13]

కాని ఒక విషయం మాత్రం ఇక్కడ అర్థం కావడం లేదు. ఒకరి ధార్మిక ఆచరణతో, ధార్మికాసక్తితో వేరొకరికి వచ్చే నష్టమేమిటి? ఇంకొక విషయమేమిటంటే దర్బారు చరిత్రకారుడు 'అనుచిత చర్యలు' అని మాత్రమే పేర్కొన్నాడు తప్ప, ఆ అనుచిత చర్యలేమిటో వివరించలేదు. ఏది ఏమైనప్పటికీ, దీన్ని దారా షికూహ్ మరియు అతని అంతరంగికుల నిరంతర కుట్రల పర్యవసానంగానే భావించాల్సి ఉంటుంది.

అదెలాగంటే స్వయంగా ఔరంగజేబే తన అక్కయ్యకు వ్రాసిన ఒక లేఖలో ఈ విషయాన్ని ఇలా పేర్కొన్నాడు : దారా షికూహ్ పెడుతున్న మానసిక హింసలకు అవమాన, అవహేళనలకు తాళలేక, తనను తన జ్యేష్ఠ సోదరుడు భరించలేకపోతున్నాడని, తన త్రోవలో నన్నో అడ్డంకిగా భావించే ఇదంతా చేస్తున్నాడని, అందుకే తను అధికారం, రాజ్య వ్యవహారాల నుండి తప్పుకున్నానని (రిజైన్ చేశానని), ఆ తరువాత తాను కోరకపోయినప్పటికీ చక్రవర్తి (షాజహాన్) తనకు గవర్నర్ పదవి అప్పగించారని, రెండవసారి దక్కన్ గవర్నర్ పదవి చేపట్టిన తరువాత వచ్చిన ఆపదలకు సతమతమై తన ప్రియమైన అక్కయ్యకు వ్రాసిన ఒక లేఖలో స్వయంగా ఔరంగజేబే ఈ విషయాన్ని లేఖ నం.27/159 ద్వారా విన్నవించుకున్నాడు. (ముఖద్దమ రుఖయాతె ఆలంగీర్, లేఖ నం.27/159, సయ్యద్ నజీబ్ అష్రఫ్, పేజి-160, 161. అనువాదం-షమ్స్ బరేల్వీ, పేజి 262). దారాకు ఔరంగజేబ్ అంటే అసలే గిట్టదు. అందుకని అతను, అతని అంతరంగికులు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా షాజహాన్‌కు ఎంతగా నూరిపోశారంటే, షాజహాన్ ఔరంగజేబ్ పట్ల పూర్తిగా అసంతృప్తుడైపోయాడు. అందుకే పదవీచ్యుతుడ్ని చేసే అంతటి తీవ్రమైన చర్యను చేపట్టడం జరిగింది. మొత్తానికి ఔరంగజేబ్ గవర్నరు పదవి నుండి తొలగించబడడం ఒక ప్రత్యేక సంకేతాన్నిస్తుంది. కుటుంబంలో ఏర్పడిన కలతలు, కలహాలు, అనైక్యత, ద్వేషం, శత్రుత్వం - ఇవన్నీ కలిసి చివరికి ఏ విధంగానైతే సోదరుల మధ్య అంతర్యుద్ధాలకు దారి తీశాయో, దాని ప్రారంభం మాత్రం ఈ పదవీచ్యుత సంఘటనతో బహిర్గతమైందనే విషయం నిర్వివాదాంశం.

# 5. గుజరాత్ -ముల్తాన్‌ల గవర్నరుగా ఔరంగజేబ్

షాజహాన్ అక్బరాబాద్‌లో ఉంటూ విసుగెత్తి పోయాడు. కనుక పర్యటన కోసం కాశ్మీర్ బయలుదేరాడు. ఔరంగజేబ్ తన పిల్లలతో సహా తండ్రి వెంటే ఉన్నాడు. చక్రవర్తి డిల్లీ చేరుకొని 'పాలం' వెళ్ళాడు. అక్కడ్నే 1645 ఫిబ్రవరి 16న రాకుమారుడు ఔరంగజేబ్‌ను గుజరాత్ సూబేదారుగా నియమిస్తూ చక్రవర్తి ఉత్తర్వులు జారీచేశాడు.[1] ఔరంగజేబ్ పాలం నుండే బయలుదేరి 1645, ఏప్రిల్ 17వ తేదీన గుజరాత్ సూబేదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించాడు.

గుజరాత్ సూబా వివిధ కళలకు, పరిశ్రమలకు, వాణిజ్యానికి ప్రఖ్యాతిగాంచిన ప్రాంతమనేది వాస్తవమైనప్పటికీ, కలహ, యుద్ధప్రియులకు కూడా అక్కడ కొదువ లేకుండేది. అంతేకాకుండా ఈ ప్రాంతం భూతల మరియు సముద్ర దొంగలకు, దోపిడీదార్లకు కేంద్రంగా ఉంటుండేది. వారెంతగా తెగబడ్డారంటే కచ్ మొదలుకొని సింధ్ ప్రాంతం వరకు గల తీరప్రాంతాలన్నిటినీ దోచుకుంటుండేవారు. ఔరంగజేబ్ అక్కడ కేవలం పదిహేడు నెలలు మాత్రమే ఉన్నప్పటికీ, ఈ స్వల్ప వ్యవధిలోనే సూబా అంతటిలో శాంతి భద్రతల్ని నెలకొల్ప గలిగాడు. విద్రోహులు మరియు అల్లరిమూకల సంఖ్యాబలాన్ని అంచనావేస్తే ఔరంగజేబ్ వద్దగల సైనికుల సంఖ్య బహు స్వల్పం. అయినాగాని ప్రభువు మరియు ప్రజల సంక్షేమాన్ని తన స్వంత ప్రయోజనాలకన్నా మిన్నగా భావించాడు. అందుకని తన వ్యక్తిగత ఖర్చుల కోసం కేటాయింపబడే ధనాన్ని వెచ్చించి సైనికుల ఖర్చుల్ని భరిస్తూ వారి సంఖ్యను పెంచగలిగాడు. ఈ విధంగా తన లక్ష్యం అంటే శాంతి భద్రతల పరిరక్షణలో కృతార్థుడయ్యాడు. ఇదెంతటి నిర్మలమైన ఘనకార్యమంటే దీనితో చక్రవర్తి కూడా ప్రభావితం కాకుండ ఉండలేకపోయాడు. ఫలితంగా చక్రవర్తి అతని మన్సబును పెంచేశాడు. ఈ విషయాన్ని దర్బారు చరిత్రకారుడు ఇలా వర్ణించాడు.

"సూబా గుజరాత్ పరిపాలనా వ్యవహారాల్లోనూ, దుండగుల్ని, దౌర్జన్యకారుల్ని అణచడం కోసం రాకుమారుడు ఔరంగజేబ్ స్వల్పంగా నున్న సైనిక బలాన్ని అత్యధికంగా పెంచేశాడు, దానిపై ఎంతో ఖర్చు వచ్చింది. పెంచిన సైనికుల సంఖ్య రెండువేల నుండి పదిహేను వేల వరకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో రెండువేలు, కొన్ని ప్రాంతాల్లో అంతకు ఎక్కువ, మొత్తం వెరసి పదిహేనువేలవరకు చేరుకున్నది."[2]

ఔరంగజేబ్ సాధించే ఇలాంటి విజయాలకే అతని ఈర్ష్యాపరుల, శత్రువుల కళ్ళు మండేవి. అయినప్పటికీ కూడా అతని యోగ్యతల్ని తన పర అనకుండా ప్రతి ఒక్కరూ

అంగీకరించేవారు, ఇంకా ఏదైనా క్లిష్ట సమయం వచ్చినప్పుడు అందరి దృష్టి అతనివైపే నిలిచేది.

1646 సెప్టెంబర్ 04న వెంటనే తనను సందర్శించాల్సిందిగా షాజహాన్ ఔరంగజేబ్‌కు లేఖ పంపాడు. కనుక అతను వెంటనే తండ్రిని సందర్శించుకోవడానికి లాహోర్ చేరుకున్నాడు. రెండవ రోజు అతని మన్సబును పెంచుతూ బల్ఖ్ మరియు బదఖ్షాఁలకు గవర్నరుగా నియమింపబడ్డాడు. కొన్ని రోజులు లాహోర్‌లో గడిపి, 1647 ఫిబ్రవరి 10వ తేదీన పెషావర్‌కు బయలుదేరాడు.

## బల్ఖ్, బదఖ్షాఁ యుద్ధాలు :

అఫ్గానిస్తాన్ ఉత్తర భాగం బల్ఖ్ మరియు బదఖ్షాఁ అనే ప్రాంతాల పేరుతో విభజింపబడి ఉంటుంది. మొగలులు ఈ ప్రాంతాన్ని తమ ప్రాచీన వారసత్వంగా పరిగణించే వారు. అప్పుడు ఆ ప్రాంతం బుఖారా పరిపాలకుని అధీనంలో ఉండేది. దాని అసలు పాలకుడైన ఇమాం ఖులీ ప్రజారంజకుడైన పరిపాలకుడు, కాని అతను తాత్కాలికమూ, నశ్వరమూ అయిన ఈ ప్రపంచ భోగభాగ్యాలకు విసిగి, తన జీవితపు చివరి రోజులు దైవ ధ్యానంలో గడపడానికని, 'మదీనా' వెళ్ళిపోయాడు. అతని స్థానంలో అతని సోదరుడైన నజర్ ముహమ్మద్ రాజ్యాధికారాన్ని చేపట్టాడు. కాని అతని చపలచిత్త స్వభావం కారణంగా అరాచకం బయలుదేరింది. సైన్యం తిరుగుబాటును లేవదీసింది. చివరికి గద్దెను తన కుమారుడు అబ్దుల్ అజీజ్‌కు అప్పగించి, తాను బల్ఖ్‌కు వెళ్ళిపోయాడు. ఈ పరిస్థితులు తనకు అనుకూలంగా తలంచిన షాజహాన్, దాన్ని కైవసం చేసుకోవడానికి సన్నాహాలు ప్రారంభించాడు. మొదట్లో రాకుమారుడు మురాద్‌బక్ష్‌ను, ఇరాన్ నాయకుడైన అలీ మర్దాన్ ఖాన్ తోడుగా పంపించాడు. మురాద్ ఆ ప్రాంతంలో ప్రవేశించి ఎలాంటి అవరోధం లేకుండా త్వరలోనే బల్ఖ్‌ను సమీపించాడు. అతని వెంట యాభైవేల సైన్యముంది. విధేయతను ప్రకటిస్తే అతని ప్రాంతం అతనికే ఉంటుందని షాజహాన్, నజర్ ముహమ్మద్‌కు సందేశం పంపించాడు. కాని నజర్ ముహమ్మద్ ఏమనుకున్నాడో తెలియదుగాని, తన ఖజానా మొదలగు వాటినన్నిటినీ విడిచి పారిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న మురాద్ అతన్ని వెంబడించ డానికి సైన్యాన్ని పంపించాడు. కాని అతను మాత్రం చేజిక్కలేదు.[3]

అననుకూలమైన వాతావరణం, అపరిచితులైన ప్రజలు, ఎలాంటి మనోజ్ఞత లేని ఈ ప్రాంతం నుండి మురాద్ త్వరలోనే విసుగెత్తిపోయాడు. తానక్కడ ఉండలేనని తండ్రికి లేఖ వ్రాసి, అతని అనుమతి కూడా రాకముందే అక్కడి నుండి బయలుదేరాడు. ఈ పరిస్థితుల్ని తెలుసుకున్న షాజహాన్ వెంటనే తన ప్రధాన మంత్రి అయిన అల్లామ సాదుల్లాను పంపించాడు. మార్గమధ్యంలో సాదుల్లా ఖాన్ ఎంతగా నచ్చజెప్పినా, మురాద్ అసలు వినిపించుకోనేలేదు. చివరికి సాదుల్లా అక్కడి పరిస్థితుల్ని చక్కపెట్టి, తగు ఏర్పాట్లుచేసి, సెప్టెంబర్ 4న, చక్రవర్తిని

చేరుకున్నాడు. ఈ మధ్యలో షాజహాన్ తన కుమారులు ఔరంగజేబ్ మరియు షుజాలకు లేఖలు వ్రాసి వెంటనే తనను కలుసుకోవాల్సిందిగా ఆదేశించాడు. ఔరంగజేబ్ జనవరి 20 కల్లా షాజహాన్‌ను కలుసుకున్నాడు. షుజాకు రావడంలో ఆలస్యమైంది. అతను ఆ తరువాత మే, 19న లాహోర్ చేరుకున్నాడు. త్వరగా చేరుకున్న ఔరంగజేబ్‌ను మరుసటి రోజే బల్ఖ్, బదఖ్షాంలకు సూబేదారుగా నియమించాడు. ఈ విధంగా ఔరంగజేబ్ ఫిబ్రవరి 10వ తేదీన అఫ్‌గానిస్తాన్‌కు బయలుదేరాడు.

అయితే ఈ మధ్యలో బల్ఖ్ మరియు బదఖ్షాంల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బదఖ్షాంకు చెందిన తుర్క్‌మాన్ తెగలు, బల్ఖ్‌కు చెందిన ఉజ్‌బెక్ తెగలు, స్వయంగా పరిపాలకుడైన అబ్దుల్ అజీజ్ అతని సోదరులంతా ఏకమై, మొగల్ సేనల్ని చుట్టుముట్టి బీభత్సాన్ని సృష్టించసాగారు.[4] మురాద్ వద్ద యాభైవేల సైన్యముండేది. కాని ఔరంగజేబ్ వద్ద ప్రస్తుతం దానికి సగం కూడా సైన్యం లేదు. బల్ఖ్‌లో నున్న సైన్యం, కీలక ప్రదేశాల్ని సంరక్షిస్తుండడం వల్ల కదల్చరాదు. ఔరంగజేబ్ వారి ప్రాంతంలో అడుగుపెట్టిందే తడువుగా ఉజ్బెక్ తెగలు అతన్ని తీవ్రంగా ప్రతిఘటించసాగాయి. అతను ముందుకు సాగకుండా త్రోవంతా అతన్ని ఎదురించసాగాయి. భీకరపోరాటంలో నజర్ ముహమ్మద్ కుమారుడు ఖత్‌లఖ్ ముహమ్మద్‌ను ఓడించగలిగాడు. రెండవ రోజు అంతకన్నా సంకుల సమరం సాగింది. అందులో కూడా ఔరంగజేబ్ విజేయుడయ్యాడు. ఈ విధంగా అడుగడుగుకు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటూ చివరికి మే, 25న బల్ఖ్‌లో ప్రవేశించగలిగాడు.[5] అయితే చుట్టుపక్కల వ్యాపించి ఉన్న శత్రుమూకల్ని చెదరగొట్టనంత వరకు శాంతి కల్ల అనే దృష్టితో ఔరంగజేబ్ యూల్‌బర్గా, అలీఆబాద్, తైమూరాబాద్‌ను దాటుకుంటూ 'పషాయి' నగరాన్ని సమీపించాడు. అక్కడికి చేరిన తరువాత, తనను ఎదుర్కోలేని శత్రుసైన్యాలు, త్రోవను తప్పించుకొని వెనుక భాగాన చేరుతున్నాయని తెలిసింది. ఇకిప్పుడు ఔరంగజేబ్ రెండు రకాల ప్రమాదాల్లో ఇరుక్కుపోయాడు.[6]

వెంటనే 'పషాయి' నుండి వెనుదిరిగాడు. అప్పటికే ఫైజాబాద్ ప్రాంతంలో అత్యధిక సంఖ్యలో శత్రుసైన్యాలు గుమిగూడాయి. పరిపాలకుడు అబ్దుల్ అజీజ్ స్వయంగా వచ్చి ఈ సైన్యాలకు నాయకత్వం వహిస్తున్నాడు. శత్రువులు తమ సైన్యాన్ని ఏడు భాగాలుగా విభజించారు. ఒకదానికి అబ్దుల్ అజీజ్ ఖాన్, రెండవ దానికి సుబ్‌హాన్ ఖులి, మూడవ దానికి బేగ్ ఓగ్లీ సారధ్యం వహిస్తున్నారు. ఔరంగజేబ్‌కు ఇదెంతో ప్రమాదకర పరిస్థితి. ఏ వైపునుండి సహాయం అందే అవకాశం లేదు. అయినా అతని ధైర్యస్థైర్యాల్లో ఏమాత్రం సడలింపు రాలేదు. అత్యంత వీరోచితంగా పోరాడుతూ, శత్రు సమూహాల్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాడు. శత్రువు వెనుకంజ వేస్తున్నాడు, ఔరంగజేబ్‌కు విజయశ్రీ లభించినట్లే అనిపించసాగింది. అంతలోనే ఒక

విచిత్రమైన సంఘటన జరిగింది. దాంతో యుద్ధం పూర్తిగా ఆగిపోయింది. ఆ సంఘటన ఏమిటో సమకాలీన చరిత్రకారుడైన ముహమ్మద్ సాఖి ముస్తఅద్ ఖాన్ తన చరిత్ర 'మాసిరె ఆలంగీరి'లో ఇలా వర్ణించాడు.

"బల్ఖ్, బదఖ్షాం పరిపాలకుడు అబ్దుల్ అజీజ్ ఖాన్ పెద్ద సంఖ్యలో సైన్యాన్ని సమీకరించుకొని, యుద్ధాన్ని ప్రారంభించాడు. ఇరుపక్షాలు ప్రాణాలకు తెగించి భీకర సమరాన్ని సాగిస్తున్నాయి. అంతలోనే మధ్యాహ్నం చేసే (జొహర్) నమాజ్ వేళయింది. బాహ్య పరిస్థితుల్ని మాత్రమే చూసే ఆయనగారి మిత్రులు, అంతరంగికులు యుద్ధం సమాప్తమయ్యే వరకు వేచి, ఆ తరువాత నమాజు చేసుకోవాలని ఎంత విన్నవించుకున్నా అయ్యగారు వినకుండా నమాజు కోసం వరుసలు తీర్చి, ఫర్జ్ సున్నత్‌లే కాకుండా, నఫిల్ నమాజులు కూడా అత్యంత నిమ్మళంగా, ప్రశాంతంగా నెరవేర్చడాన్ని గమనించిన అబ్దుల్ అజీజ్ ఖాన్ "దైవప్రసన్నత, దైవసహాయం ఈ వ్యక్తి వెంట ఉన్నాయని, అతన్ని గెలువడం అసంభవమని భావించి, యుద్ధాన్ని ఆపేసి, సంధి ప్రయత్నాలు ప్రారంభించాడు." [7]

తన కళ్ళతో ఈ దృశ్యాన్ని తిలకించిన బుఖారా పరిపాలకుడు అబ్దుల్ అజీజ్ ఖాన్ "ఇలాంటి వ్యక్తితో యుద్ధం చేయడం అంటే తమ మృత్యువును కొనితెచ్చుకున్నట్లే అనుకొని ఇక యుద్ధాన్ని ఆపేయండి అంటూ అరిచేశాడు.[8] ఆ తరువాత యుద్ధం ఆగిపోయి, సంధి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సంధిషరతులు తనకు అనుకూలంగా ఉండడంతో ఔరంగజేబ్ వాటిని అంగీకరించి, విజేతగా కాబూల్ బయలుదేరాడు.[9]

యుద్ధాలు, సుదూర ప్రయాణాల కష్టాల్ని ఎదుర్కొంటూ, కాబూల్‌ను దాటి 'అటక్' నదీ తీరాన ఆగి ఉన్నప్పుడు, 1648 మార్చి 16వ తేదీన అతన్ని ముల్తాన్ సూబేదారుగా నియమిస్తున్నట్లు షాజహాన్ చక్రవర్తి ఉత్తర్వులు ముట్టాయి.[10]

## ముల్తాన్ సుబేదారు (గవర్నరు)గా ఔరంగజేబ్ :

బల్ఖ్, బదఖ్షాంల విజేతగా మరలిన ఔరంగజేబ్‌ను ముల్తాన్‌కు సుబేదారుగా నియమించడం జరిగింది. అందుకని అతను తండ్రిని సందర్శించుకోకముందే తనకు కొత్తగా కేటాయించిన సూబాకు బయలుదేరాల్సి వచ్చింది. ఆ తరువాత మొదటి ఖాందహార్ యుద్ధం ముగిసిన తరువాత, లాహోర్‌లో తన తండ్రి, చక్రవర్తిని కలుసుకున్నప్పుడు, సింద్ రాష్ట్రమే కాకుండా, భక్కర్ మరియు సియోస్తాన్ ప్రాంతాలుకూడా అతనికి అప్పగించబడ్డాయి.[11]

ఆనాటి నుండి ఖాందహార్ రెండవ యుద్ధం ముగిసి తిరిగి వచ్చేంతవరకు (1652, జులై 14 వరకు) దాదాపు నాలుగు సంవత్సరాలు ముల్తాన్ సుబేదారుగాను, దాదాపు రెండున్నర సంవత్సరాల వరకు ముల్తాన్, సింద్ రెండు సూబాలకు సుబేదారుగా పనిచేశాడు.

రెండుసార్లు ఖాందహార్ యుద్ధానికి వెళ్ళవలసి రావడం వల్ల, అతనికి తన సూబాలో ఉండే అవకాశం తక్కువగానే లభించింది. అదియునుగాక ఈ యుద్ధాల తయారి మరియు వ్యూహ రచనపైనే అత్యధికంగా అతని దృష్టి కేంద్రీకృతమై ఉండేది. అయినప్పటికీ లభించిన ఈ స్వల్ప వ్యవధిలోనే, తలబిరుసుతనంతో వ్యవహరించే బెలూచీలను, ఇతర దారిదోపిడీగాండ్ల మదమణిచి, వారు తిరిగి తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. ఈ విషయం అతని క్రమశిక్షణకు, పరిపాలనా దక్షతకు అతనిలోని యోగ్యతలకు అద్దం పడుతుంది.

ముల్తాన్ సూబా అక్బర్ చక్రవర్తి కాలంలోనే మొగలు సామ్రాజ్యంలో కలిసిపోయి, అప్పటివరకు కాస్త దారికి వచ్చింది. కాని సింధ్ రాష్ట్రంలోని కొండప్రాంతాలు, మరియు సియూస్తాన్ ప్రాంతం బందిపోట్లకు, దోపిడీగాళ్ళకు, మొండిఘటాలకు కేంద్రంగా ఉంటూ వచ్చింది. ఔరంగజేబ్ వీరందరినీ అణిచివేసి, క్రమశిక్షణకు అలవాటుచేశాడు. సరిహద్దు నాయకుల్ని కూడా విధేయత చూప వివశుల్ని చేసి, సూబా అంతటిలో శాంతి భద్రతల్ని నెలకొల్పడంలో కృతార్థుడయ్యాడు.

ముల్తాన్, సింధ్ సూబాలలో అతనెంతటి చక్కని పరిపాలనను పరిచయం చేశాడో, ఈ సూబాలు సర్వతోముఖంగా అభివృద్ధి చెందడానికి అతనెలా దోహదపడ్డాడో, విద్రోహులు, తిరుగుబాటుదార్లు, తలబిరుసుతనం చూపించే నాయకుల్ని ఎలా లొంగదీశాడో, ఈ వివరాలన్నీ అతని ఉత్తరాల రూపంలో చరిత్రలో భద్రపరచబడి ఉన్నాయి. ప్రస్తుతం ఆ వివరాల్లోకి పోయే అవకాశం మాకు లేదు. మొత్తానికి అంతరంగిక శాంతి భద్రతల్ని పటిష్టం చేసిన తరువాత వాణిజ్య పురోగమనం కోసం సింధ్ రాష్ట్రంలో ఒక కొత్త ఓడ రేవును నిర్మించాడు. అంతేకాకుండా ఒక చిన్న పడవను తయారుచేయించి, వాణిజ్యాభివృద్ధికి నాంది పలికాడు. అయితే అదనుకోసమే ఎదురుచూస్తున్న అతని శత్రువులు దీన్ని ఒక ఆసరాగా చేసుకొని, సింధ్ రాష్ట్రంలో ఔరంగజేబ్ ఓడరేవును ఏర్పాటుచేసి తన స్వంత పడవల్ని నడుపుతూ గొప్ప ధనాన్ని కూడబెడుతున్నాడని షాజహాన్‌కు నూరిపోశారు. తన లేఖల ద్వారా ఔరంగజేబ్ వాస్తవ పరిస్థితిని తండ్రికి విన్నవించుకున్నప్పటికీ పదే పదే అతని చెవుల్లో ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా చాడీలు చేరుతుండడం వల్ల, అతను ఔరంగజేబ్‌ను పూర్తిగా విశ్వసించలేకపోయాడు.

తన భౌగోళిక స్థితి, మరియు ఆర్థిక ప్రాధాన్యతల కారణంగా పశ్చిమంనుండి వచ్చే త్రోవకు ముఖద్వారంపై ఉండడం వల్లనూ, దక్షిణం నుండి కాబూల్‌కు వెళ్ళే మార్గాన్ని ఆపగలిగే ఖాందహార్, భారత-పర్షియన్ పాలకుల మధ్య ఘర్షణకు ప్రధాన కారణంగా ఉండేది. ముల్తాన్‌లో సూబేదారుగా ఉంటున్న సమయంలోనే రెండుసార్లు ఔరంగజేబ్ ఖాందహార్ ముట్టడి కోసం వెళ్ళాల్సి వచ్చింది. అతనెంత పట్టుదలగా ఖాందహార్‌ను ముట్టడిం

చినా కూడా, ముట్టడికి కావలసిన ఫిరంగులు మొదలుగాగల సరంజామా లేకపోవడంతో ఈ ముట్టడి విఫలమైపోయింది.

రెండవసారి ఔరంగజేబ్ మరియు ప్రధానమంత్రి సాదుల్లా ఖాన్‌ల సంయుక్త సారథ్యంలో 50 వేల సైన్యంతో ముట్టడిని నిర్వహించారు. అయితే ఈసారి ఔరంగజేబ్‌కు సమయానుసారంగా వ్యవహరించడానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వబడలేదు. దానికి బదులు ఢిల్లీలో కూర్చున్న చక్రవర్తి ఆదేశానుసారం నడచుకోవడానికి కట్టడి చేయబడ్డాడు. ఆ వివరాలు సుదీర్ఘంగా ఉన్నాయి. మొత్తానికి ఈసారి కూడా ఔరంగజేబ్ మరియు సాదుల్లాఖాన్‌లు విఫలురై వెనుదిరగవలసి వచ్చింది. [12]

దీనికోసం ఔరంగజేబ్ తండ్రితో బాగా చివాట్లు పడ్డాడు. అయోగ్యుడనే అపనిందను ఎదుర్కొన్నాడు. అయితే మరుసటి సంవత్సరం అంతకన్నా అధిక సన్నాహాలు, అత్యధిక ధనం వెచ్చించి, దారాషికూహ్ సారథ్యంలో మూడవసారి దాడి జరిగింది. కాని దారాషికూహ్ ఘోర పరాజయాన్ని చవిచూసి వెనుదిరుగవలసి వచ్చింది.[13]

ఖాందహార్ నుండి కాబూల్ వెనుదిరిగిన తరువాత 1652లో ఔరంగజేబ్‌ను దక్కన్ సుబేదారుగా రెండవసారి నియామకం జరిగింది. ఇంకా ఎలాంటి జాప్యం చేయకుండా వెంటనే దక్కన్‌కు వెళ్ళాల్సిందిగా ఆదేశించడం జరిగింది. చివరికి అతను తన పాత సూబా అయిన ముల్తాన్‌కు వెళ్ళి భార్యాపిల్లల్ని వెంటబెట్టుకు పోవడానికి కూడా అనుమతి లభించ లేదు. వారిని లాహోర్ కొచ్చి తనతో కలువాల్సిందిగా కబురు పంపమని చెప్పడం జరిగింది.[14] అతను ముల్తాన్‌కు వెళ్ళకుండా కట్టడి చేయడంలో దారా షికూహ్ యుక్తి ఏమిటో, దాన్ని సోదరుల సంబంధాల అధ్యాయంలో చర్చిస్తాము. (దారా షికూహ్ ఎల్లప్పుడు తండ్రిని వెన్నంటే ఉండేవాడని, షాజహాన్ ఆగ్రా, ఢిల్లీ, లాహోర్ ఎక్కడికెళ్ళినా తన యువరాజు దారా షికూహ్‌ను తన వెంటే ఉంచుకునేవాడని, ఇంకా దర్బారు వ్యవహారాలన్నీ, సైనిక కార్యకలాపాలతో సహా ప్రతిదీ దారా ఇష్టానుసారం, అతని సలహా మేరకే షాజహాన్ చేస్తుండేవాడనే విషయాన్ని పాఠకులు మరువరాదు).

# 6. రెండవ పర్యాయము
# దక్కన్ గవర్నరుగా ఔరంగజేబ్

దక్కన్ గవర్నరుగా నియుక్తుడైన ఔరంగజేబ్, దాని రాజధాని అయిన ఔరంగాబాద్ వెళుతూ 1653 ఫిబ్రవరి 3న బుర్హాన్‌పూర్ చేరుకున్నాడు. ఇక్కడో విచిత్రమైన ప్రణయ సంఘటన జరిగింది. అది ఔరంగజేబ్ జీవితంలో ఓ మరుపురాని ఘట్టం. అతని జీవితంలో ఇలాంటి సంఘటన ఇదే మొదటిది మరియు చివరిది కూడాను. దీన్ని అహ్‌కామె ఆలంగీరి (హమీదుద్దీన్ ఖాన్) మరియు మాసిరుల్ ఉమరా (షానవాజ్ ఖాన్) లాంటి చరిత్ర గ్రంథాల్లో పొందుపరచడం జరిగింది. ఎంత విజేతఅయినా, ఎంత ఉక్కు శరీరం, వజ్ర సంకల్పం గల మనిషి అయినాసరే మనిషి మనిషే. మనిషిలోని మానసిక భావనలు, అతని ఇచ్ఛాకోరికలు ఎప్పుడు ఏ దిశలో మరలుతాయో అంచనా వేయలేము. ఔరంగజేబ్ జీవితంతో పొంతనలేని, అతని మనస్తత్వానికే విరుద్ధమైన ఒక సంఘటన జరిగింది. దాన్ని వివిధ చరిత్రకారులు వివిధ రకాలుగా వర్ణించారు. అహ్‌కామె ఆలంగీరి రచయిత అయిన హమీదుద్దీన్ ఖాన్ దీన్ని ఇలా వర్ణించాడు:

"ఔరంగజేబ్ దక్కన్ గవర్నరుగా (రెండవసారి) నియామకం అయి, ఔరంగాబాద్ వెళుతూ, మధ్యలో బుర్హాన్‌పూర్ చేరుకున్నాడు. అక్కడి గవర్నరు అయిన సైఫ్ ఖాన్– ఈయనగారి చిన్నమ్మ, ఆసిఫ్ ఖాన్ కుమార్తె అయిన సాలెహ బానొకు భర్త. ప్రభువుల వారు తన చిన్నమ్మ గారిని కలవడానికెళ్ళారు. ఆమె కూడా ప్రభువుల వారికోసం గొప్ప విందును ఏర్పాటు చేసింది. ఇది చిన్నమ్మ ఇల్లు కావడం వల్ల మహలు స్త్రీలు పెద్దగా పరదాను పాటించలేదు. ఈయనగారు కూడా చనువుగా ఇంటిలోపలికి వెళ్ళారు. జైన్‌ఆబాది అసలు పేరు హీరాబాయి. ఆమె ఈయనగారి చిన్నమ్మ దాసీ. ఆమె ఓ చెట్టు కొమ్మను పట్టుకొని, తగ్గుస్వరంలో మధురంగా పాడుతుంది. ఆమెను చూడగానే ప్రభువుల వారి పరిస్థితి మారి పోయింది. వెంటనే భూమిపై కూర్చున్నారు. ఆ తరువాత పరుండిపోయారు. కొంచెం సేపట్లోనే స్పృహ తప్పిపోయారు. ఈ వార్త ఆయన చిన్నమ్మగారికి చేరగానే ఆమె పరుగెత్తు కుంటూ వచ్చారు. అయ్యగారి శిరస్సును ఒడిలో పెట్టుకొని కన్నీరు మున్నీరుగా విలపించ సాగారు. కొంచెంసేపటి తరువాత ఆయన గారికి స్పృహ వచ్చింది. "ఏమి జరిగింది, చెప్పు బాబూ!" అంటూ ఆమె ఎంత బ్రతిమిలాడినా, ఆయనగారు మౌనం దాల్చారు. విందు, ఆతిథ్యాల సంతోషం మట్టిలో కలిసిపోయింది. మహలు అంతటిలో విషాదచ్ఛాయలు అలుము కున్నాయి.

నడిరేయి సమీపంలో ఆయన గారు మాట్లాడే స్థితికి వచ్చారు. "నా వ్యాధిని తెలిపితే, మీరు వైద్యం చేయిస్తారా?" అంటూ ప్రశ్నించారు. అయ్యగారి మాట విని ఆవిడ సంబరపడి పోయారు. "వైద్యం ఏం ఖర్మ! నీకోసం నా ప్రాణాలు కూడా సమర్పిస్తాను". ఇది విన్న ఆయన

కథంతా ఏకరువుపెట్టారు. ఇది వినగానే చిన్నమ్మ నిశ్చేష్టురాలయింది. నోట మాట పెగలలేదు. కాస్సేపు నిరీక్షించిన తరువాత ఆయన ఇలా అన్నారు:

"నా పరిస్థితి తెలుసుకోవడానికి మీరు అనవసరంగా ఇంత కలవరపడ్డారు. నా మాటకు సమాధానం కూడా ఇవ్వలేని మీరు నా సమస్యనెలా పరిష్కరిస్తారు?"

"నీ కోసం నా ప్రాణాలర్పిస్తాను. కాని దుర్నీతిపరుడైన ఈ సైఫ్ ఖాన్ ఎంత కిరాతకుడో నీవెరుగవు. అతను షాజహాన్ చక్రవర్తినిగాని, నిన్ను గాని ఏమాత్రం లక్ష్యపెట్టడు. అతనీ మాట వినగానే ముందు జైన్ఆబాదీని, ఆ తరువాత నన్ను హతమారుస్తాడు. ఆమె గురించి అతనితో మాట్లాడడం, నా ప్రాణాలు నీపై అర్పించుకోవడం తప్ప ఇంకేమీ లాభం లేదు. కాని ఆమె మాత్రం అన్యాయంగా చంపబడుతుంది."

"నిజమే! నేనింకేమైనా ఉపాయం ఆలోచిస్తాను" అంటూ ఊరుకున్నారు.

తెల్లవారగానే తన మహలుకు వచ్చేశారు. భోజనం అసలే చేయలేదు.

దక్కన్‌కు దీవాన్‌గా తన వెంట ఉంటున్న ముర్షిద్ ఖులిఖాన్‌ను పిలిపించారు. అతను ఈయనగారి ప్రత్యేక అంతరంగికుడు. అతనితో జరిగిందంతా చెప్పేశారు. అంతా విన్న ముర్షిద్ ఖులి ఖాన్, "ముందు అతన్ని (సైఫ్ ఖాన్‌ను) సమాప్తం చేసేస్తాను. ఆ తరువాత నన్నెవరు హతమార్చినా ఫరవాలేదు. నా రక్తంతో నా ప్రభువుల వారి మనోవాంఛ అయితే పూర్తి అవుతుంది" అంటూ తన ప్లానును విన్నవించుకున్నాడు. "నిజంగా నీ త్యాగనిరతిపై మాకలాంటి విశ్వాసమే ఉంది. కాని ఈ చిన్నపాటి పనికోసం చిన్నమ్మను విధవగా మార్చడానికి మా మనసొప్పడం లేదు. ఇంకా ధర్మాన్ని, ధార్మికశాస్త్రాన్ని ఎరిగినవాడు, అకారణంగా, ఉద్దేశపూర్వకంగా ఒకరి హత్యకు ప్రయత్నించలేదు. అయితే ఒక పని చెయ్యి. దైవాన్ని నమ్ముకొని సైఫ్ ఖాన్‌తో ఒకసారి మాట్లాడి చూడు."

ముర్షిద్ ఖులిఖాన్ ఎలాంటి అభ్యంతరం తెలుపకుండా వెంటనే వెళ్ళి సైఫ్ ఖాన్‌తో విషయాన్నంతా వెల్లడించాడు.

దానిపై సైఫ్ ఖాన్ "ఆయనగారికి నా వందనాలు చెప్పు. దీనికి జవాబు నేనాయన చిన్నమ్మకిస్తాను" అని చెప్పి, వెంటనే అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు. తన భార్యనుద్దేశిస్తూ, "ఇందులో అభ్యంతరమేముంది? షానవాజ్ ఖాన్ పుత్రిక, ఔరంగజేబ్ పత్నీ నాకవసరం లేదు. అయితే ఆయన వద్దనున్న దాసీ, చిత్రబాయిని పంపిస్తే దానికి బదులు, ప్రత్యామ్నాయం అయిపోతుంది" అని చెబుతూ అప్పటికప్పుడే చిన్నమ్మను ఈయనగారి వద్దకు పంపించాడు. తాను వెళ్ళనని ఆమె ఎంతగానో నిరాకరించింది. కాని అతనామెను బెదిరించి, మరీ పంపించాడు.

ఈ ప్రతిపాదనల్ని విన్న అయ్యగారు అత్యంతగా సంబరపడ్డారు. "ఒక్కరేం ఖర్మ! ఏ పల్లకీలోనైతే వచ్చారో, అందులోనే ఇద్దర్ని ఎక్కించుకొని వెళ్ళండి. నాకేం అభ్యంతరం లేదు."

చిన్నమ్మగారు ఒక సేవకుని ద్వారా ఈ విషయాన్ని సైఫ్ ఖాన్‌కు తెలియపర్చారు. “ఇకిప్పుడు తప్పించుకోవడానికి వేరే మార్గం లేదు” అంటూ జైన్‌ఆబాదీని పల్లకిలో ఎక్కించి వెంటనే పంపించేశాడు. (అహ్‌కామె ఆలంగీరి - హమీదుద్దీన్ ఖాన్ పే.33-36)

మాసిరుల్ ఉమరాలో “ఖానెజమాన్” ప్రస్తావనలో ఈ సంఘటన ఇలా వివరించబడింది. “మీర్ ఖలీల్ (ఖానె జమాఁ అంటే సైఫ్ ఖాన్) ఆజం ఖాన్ జహంగీరి రెండవ కుమారుడు, సైన్యాధ్యక్షుడు, ఆసిఫ్ ఖాన్‌కు అల్లుడు. తన తండ్రితో కలిసి, గొప్ప ఘనకార్యాల్ని, విజయాల్ని సాధించాడు. తన మహోన్నతమైన ఘనకార్యాల కారణంగా ముతఫఖ్ఖర్ ఖాన్, సిపహ్‌దార్ ఖాన్ మరియు ఖానె జమాఁ లాంటి బిరుదులు పొందాడు. దక్కన్‌కు గవర్నరు అయిన షాయిస్త ఖాన్ సిఫారసుపై, దక్కన్ అంతటికీ ఫిరంగుల విభాగానికి దారోగా (అధిపతిగా) నియమించబడ్డాడు. (మాసిరుల్ ఉమరా - వా-1, పేజి. 775). ఔరంగజేబ్ కాలంలో ఖాన్‌దేశ్‌కు గవర్నరుగా నియుక్తుడయ్యాడు. 1684లో పరమపదిం చాడు. (మాసిరుల్ ఉమరా - వా-1, పేజి.778). అన్ని రకాల విద్యల్లో ఆరితేరినవాడు. సొగసైన వ్రాత (Calligraphy) లో ప్రసిద్ధిగాంచాడు. సభ్యుడు, రచనాకారుడు, పండితుడు, వ్యవహారదక్షుడు, సంగీతకళలో ప్రావీణ్యం గలవాడు, పరిపాలనా వ్యవహారాల్లో తలమునకలై ఉన్నప్పటికీ, నృత్యగానాలకు చెవికోసుకునేవాడు, రంభ అప్సరసల్లాంటి నర్తకీలు, మధుర స్వరం గల గాయనీలు అతని దర్బారులో హాజరుండేవారు.

ఔరంగజేబ్ రాకుమార దశలో అతని ప్రియతమ ప్రేయసిగా ఉండి “జైన్‌ఆబాది”గా ప్రఖ్యాతిగాంచిన ఈమె కూడా ఆ కోవకు చెందినదే. ఈమె ఖానె జమాఁకు ఉంపుడు గత్తె అని చెబుతారు.

ఒకరోజు ఔరంగజేబ్ జైన్‌ఆబాద్ (బుర్‌హాన్‌పూర్)లోని “ఆహుఖానా”గా పిలువబడే తోటలో తన పరివారంతో, అంతరంగిక, సన్నిహిత సంబంధాలున్న వారితో కలిసి వాహ్యాళి చేస్తున్నాడు. స్వరగానాల్లో సాటిలేనిది, అందచందాలు, సొగసులో అపురూపమైనది అయిన జైన్‌ఆబాది, రాకుమారుని చిన్నమ్మతో పాటుగా తోటలో ప్రవేశించింది. తోటలో తిరుగాడుతున్నప్పుడు, రాకుమారుడున్నాడని కూడా పట్టించుకోకుండానే, అత్యంత చంచల మరియు కన్యక స్వభావంతో ఎగిరి ఒక మామిడి పండును తెంచేసుకుంది. ఆమెలోని అందచందాలు, చంచలత్వం, మరియు హృదయాల్ని దోచేసుకునే ఆ ఒయ్యారము చూసిన రాకుమారుడు ముగ్ధుడైపోయాడు. కాస్సేపు పరిసరాల్నే మైమరిచిపోయాడు. రాకుమారునిలోని వివేకాలు, ధర్మనిష్ఠలు చేజారిపోయాయి. తన చిన్నమ్మను అత్యంతంగా ప్రాధేయపడి, ఆమెను పొందగలిగాడు. భక్తి, ధర్మనిష్ఠ, రసహీనత, వైరాగ్యం, దైవభక్తి అన్నీ ఉండి కూడా ఆమె ప్రేమ వ్యామోహంలో పడిపోయాడు. స్వయంగా సారాయినింపి గ్లాసుతో ఆమె కందించేవారు.

ఒకరోజు ఆమె కూడా సారా నిండిన గ్లాసును ఆయనకిస్తూ తాగాల్సిందేనని మారాము పెట్టినట్లు చెబుతారు. రాకుమారుడు తన అశక్తతను వెలిబుచ్చుకున్నాడు, ఎంతగానో నచ్చ చెప్పారు, బ్రతిమిలాడారు. అయినా ఆ దౌర్జన్యపరురాలు ఊరుకుంటేనా? తాగాల్సిందే

నంటూ పట్టుపట్టింది. గత్యంతరం లేక మధుపాత్ర పెదవుల వరకు తీసుకెళ్ళి, ఇక త్రాగు తారనగా, ఆమె తటాలున లాగేసుకుంది. "నా పట్ల తమకున్న ప్రేమెలాటిదో, పరీక్షించడమే నా ఉద్దేశ్యంగాని, ఈ చేదు రసాన్ని మీ గొంతులోకి పంపడం నా ఉద్దేశం కాదు" అంటూ తీసి ఆవల పారేసింది. ఈ ప్రేమాయణం ఎంతగా ప్రాకిపోయిందంటే, చివరికి చక్రవర్తి షాజహాన్ చెవులకు కూడా ఈ వార్త సోకింది. దారాషికూహ్‌కు ఈయనంటే మొదటి నుండే ఈర్ష్యాద్వేషాలు. ఈ వార్తను ఆధారంగా చేసుకొని ఇలా చెప్పాడు: "ఈ వంచకుడు, కపటునికి మంచి మర్యాదలతో, పాపభీతితో సంబంధమేమిటి? తన చిన్నమ్మ దాసీదానితో సంబంధం పెట్టుకొని సర్వనాశనమయ్యాడు."

దురదృష్టవశాత్తు ఈమె నిండు యవ్వనంలో కాలధర్మం చెందింది. రాకుమారుని హృదయానికి మాయని గాయం చేసిపోయింది. తన శాశ్వత విరహంలో వదలివెళ్ళిపోయింది. ఔరంగాబాదులో పెద్ద చెరువును ఆనుకునే ఆమె సమాధి ఉంది. ఆమె మరణించిన రోజు దుఃఖావేశాలతో రాకుమారుని పరిస్థితి వర్ణనాతీతం. (మాసిరుల్ ఉమరా - వా-1, పేజి 779, 780, ఖాద్రి)

పై విభిన్న కథనాలను విశ్లేషిస్తే చివరికి తేలేదేమంటే, ఇది తల్లిదండ్రులకు, పెద్దలకి తెలియకుండా జరిగిన ఓ ప్రేమ వివాహంగా పేర్కొనవచ్చు. అయినా పాపం ఆ ప్రియురాలు కొన్ని నెలల్లోనే పరమపదించింది.

బుర్హాన్‌పూర్‌లో ప్రవేశించిన రోజు నుండే అతను రెండవ పర్యాయము దక్కన్ గవర్నరుగా పరిగణింపబడతాడు. సుదూరమైన మరియు కొత్తగా జయింపబడిన దక్కన్ సూబా సర్వ బాధ్యతలు ఔరంగజేబ్‌కు అప్పగించబడ్డాయి. అతను కూడా విధి నిర్వహణలో నిజాయితీపరుడు, చురుకైన యువకుని లాగా పూర్తి ఏకాగ్రతతో తన బాధ్యతల్ని నిర్వహించసాగాడు. ప్రస్తుతం సూబా పరిస్థితులేమిటో పూర్తి అవగాహన చేసుకోవడం అతనికి అత్యంతవసరము. గడిచిన పది సంవత్సరాలలో (1644-1653) తాను దక్కన్ విడిచిపెట్టిన తరువాత, వివిధ సుబేదార్ల పరిపాలనలో దక్కన్ పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందనే విషయం అతనికి తెలుసు. ఈ మధ్యకాలంలో ఖానెదౌరాఁ, రాజజైసింగ్, ఇస్లామ్ ఖాన్, షా నవాజ్ ఖాన్, మురాద్ మరియు షాయిస్తఖాన్‌లను కలుపుకొని మొత్తం ఆరుగురు గవర్నర్లు తమ తమ ఆలోచనా, అభిరుచి, అభీష్టాల మేరకు దీన్ని ఏలారు. అందుకని ఈ సూబా పురోగమనం వైపునకు గాక తిరోగమనం వైపుకు పయనించసాగింది. ఖానెదౌరాఁలోని కాఠిన్యత, ఇస్లాం ఖాన్ అత్యాశ, మిర్జారాజా (జైసింగ్) సంగ్దిగ్ధం, మురాద్ విచ్చలవిడితనం, షాయిస్తఖాన్‌లోని బాధ్యతారాహిత్యం- ఇవన్నీ కలిసి ప్రభుత్వాధికారుల్ని నిర్భయులుగా, స్వప్రయోజనాపరులుగా మార్చివేసాయి. వేరొకవైపు ప్రజలు నిరుపేదలయ్యారు. వ్యవసాయం నాశనమైంది. పరిపాలనా వ్యవస్థ అస్తవ్యస్థమైపోయింది. గడిచిన పది సంవత్సరాల్లో ఈ సూబా అంతరంగికంగా శాంతియుతంగాను, సరిహద్దు రాష్ట్రాల నుండి సురక్షితంగానూ ఉంటూ వచ్చింది. దీని పర్యవసానంగా అది గణనీయమైన అభివృద్ధిని సాధించవలసింది.

కాని మాజీ సుబేదార్ల నిర్లక్ష్యమో లేక ఇంకేదైనా కారణం కావచ్చుగాని, సూబా సస్యశ్యామలం అవడానికి బదులు నిర్జీవంగా, నిర్జనంగా కనబడసాగింది. ప్రభుత్వ చరిత్రకారుని అనుసరించి ఒకప్పుడు మూడుకోట్ల అరువైరెండు లక్షల రాబడి ఇవ్వగలిగిన ఈ సూబాయే 1653 వచ్చేసరికి కేవలం ఒక కోటికి పడిపోయిందంటే దాని పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జాగీర్ల పరిస్థితి అంతకన్నా హీనంగా ఉంది. జాగీర్దార్లు తమ పన్నుల్ని పూర్తి చేసుకోవడానికి రైతుల్ని హింసించడం మొదలుపెట్టారు. దీని ఫలితంగా రైతులు తమ భూముల్ని విడిచి పారిపోసాగారు. ఈ విధంగా పన్నుల రాబడిలో తగ్గుదల వచ్చేసరికి, జాగీర్దార్ల హింసలు ఇంకా పెరిగిపోసాగాయి. ఫలితంగా పల్లెలు నిర్జీవంగా, నిర్జనంగా మారసాగాయి. సాగుబడి అయ్యేభూముల విస్తీర్ణంలో తగ్గుదల రాసాగింది. ఈ వ్యాధి ఎంతగా ముదిరిపోయిందంటే, దాదాపుగా నయం కానిదిగా గుర్తించబడసాగింది. ఔరంగజేబ్ సుబేదారుగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పుడున్న పరిస్థితులివి. ఈ పరిస్థితిని క్షుణ్ణంగాను, వివరంగానూ తండ్రికి తన లేఖల ద్వారా తెలుపుతాడు.[1]

కాని ఔరంగజేబ్ నిరాశపడే మనిషి కాదు, అపజయపు కోరల్లో నుండి విజయాన్ని లాక్కొచ్చే ధైర్యశాలి. అతనిలోని ఈ గుణాన్ని వివిధ సందర్భాల్లో మీరూ గమనించగలుగుతారు. ఇంకొక విషయం ఇక్కడ గమనించదగ్గది – ఔరంగజేబ్ కూడా దీన్ని బాగా అర్థం చేసుకున్నాడు– ఏమిటంటే దక్కన్ లాంటి సుదూర మరియు వెనుకబడిన సూబా ఔరంగజేబ్‌కు కేటాయించబడింది. ఈ విధంగా దారా మరియు షాజహాన్‌ల నుండి ఔరంగజేబ్ దూరంగా ఉంటాడని, అతని విరోధులకు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా షాజహాన్ చెవులు నింపడానికి సంపూర్ణ అవకాశాలు దొరుకుతాయనేది లక్ష్యం. ఈ రెండు లక్ష్యాల్ని వారు సంపూర్ణంగా సాధించగలిగారని ముమ్ముందు మీరూ తెలుసుకోగలుగుతారు.[2] ఈ విషయాన్ని అర్థం చేసుకున్న ఔరంగజేబ్ ఇక్కడి పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు లేఖల ద్వారా తండ్రికి తెలుపుతూనే ఉన్నాడు.

నిర్జీవమై, పాడుబడిన దక్కన్ సూబాను తీర్చిదిద్దటానికి, దాన్ని సస్యశ్యామలం చేయడానికి ఔరంగజేబ్ కొన్ని ప్రణాళికల్ని రూపొందించుకున్నాడు. మొట్టమొదటగా భూమి బందోబస్తు కార్యక్రమాన్ని ప్రారంభించాడు. మొత్తం సూబాను రెండు భాగాలుగా విభజించి ఒకదాన్ని ముర్షిద్ ఖులి ఖాన్‌కు, రెండవదాన్ని ముల్తఫత్ ఖాన్‌కు అప్పగించి వారిని దీవాన్‌లుగా నియమించాడు. భూమి కొలతలు, బందోబస్తు, భూమిశిస్తు నిర్ణయం, భూసారపు అంచనా, నీటి వసతి, రైతుల సంక్షేమము మొదలగు దీవానీ వ్యవహారాలను ఈ శాఖకు కేటాయించడం జరిగింది. ఆ తరువాత మొత్తం సూబా ముర్షిద్ ఖులి ఖాన్‌కే అప్పగించడం జరిగింది. అక్బర్ దర్బారులోని రాజా తోడర్‌మల్, భూమి, రైతులకు సంబంధించి ప్రతిపాదించిన నియమాలన్నీ (దీవానీ సంస్కరణలన్నీ) దక్కన్‌లో అమలుపరిచిన ఘనత ఔరంగజేబ్ మరియు ముర్షిద్ ఖులీ ఖాన్‌లకే దక్కుతుంది. నిర్జీవంగా, నిర్జనంగా మారిన దక్కన్‌ను సస్యశ్యామలంగా మార్చడానికి ముర్షిద్ ఖులి ఖాన్ ఎంత ఏకాగ్రతతో, ఎంత శ్రమతో, ఎంత నిజాయితీతో,

ఎంత పట్టుదలగా ఈ పనిని చేపట్టాడంటే, ఔరంగజేబ్ దానికి ముగ్దుడైపోయాడు. ఎప్పుడు, ఎక్కడ కూడా ముర్షిద్ ఖులి ఖాన్ ప్రస్తావన వచ్చిందంటే చాలు, ఔరంగజేబ్ అతన్ని ప్రశంసించ కుండా, పొగడకుండా ఉండలేకపోయేవాడు. వాస్తవంలో కూడా ఖులి ఖాన్ దక్కన్‌ను దక్షిణ ధృవతారగా మార్చివేశాడు. మొట్టమొదటగా అతను మొత్తం సూబా భూముల్ని కొలిపించాడు. పంట రాబడిని అధ్యయనం చేశాడు. భూమిలో పండగలిగే పంటను ఆధారం చేసుకొని, మూడు రకాల భూమి శిస్తును ప్రతిపాదించాడు. భూమి శిస్తు న్యాయంగా నిర్ణయింపబడడానికి అతనో ప్రత్యేక సూత్రాన్ని ప్రతిపాదించాడు. భూమి సారం, తేమను ఆపగలిగే స్థోమత, నీటి వసతి, పంట దిగుబడి ఇత్యాది విషయాల్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి భూమికి ఒక ధార (లేక బాగానా)ను నిర్ణయించాడు. నేటి వరకు కూడా దక్కన్‌లో అమలులో ఉన్న ఈ ధార లేక 'బాగానా', అతని బందోబస్తు విధానపు లోకప్రియత్వానికి ప్రబల సాక్ష్యం. పేద రైతులకు 'తకావి' రుణాలు మంజూరి చేయించాడు. బీడులుగా ఉన్నచోట నీటి వసతిని కల్పించాడు. బావులు త్రవ్వించాడు.[3]

ఈ విధంగా యోగ్యులు, నిజాయితీపరులైన అధికారుల్ని నియమించి, రైతుల బాగోగుల్ని సమీక్షిస్తూ, వారికి తగిన విధంగా సహాయం చేస్తూనే 1654 నవంబర్ అంటే దాదాపు ఇరవై నెలలలోపే, సూబా రాబడిలో ఇరవైఐదు శాతం పెంపుదల తేగలిగాడు.[4]

ఇంత కష్టపడి పనిచేసి, సూబా రాబడిలో గణనీయమైన పెంపుదల తెచ్చినప్పటికీ, కొడుకు పట్ల షాజహాన్ హృదయంలో ఏర్పడిన అసంతృప్తి దూరం కాకపోవడమే కాకుండా, ఈ అపార్థాల అగాధం ఇంకా పెరుగుతూనే పోయింది. న్యాయం, నిష్పక్షపాతం, బుద్ధివివేకా లను, వాస్తవాలను ప్రక్కకుపెట్టి, షాజహాన్ సతతం ఔరంగజేబ్‌ను మానసికంగా హింసించ సాగాడు.

## షాజహాన్ దారాషికూహ్ - ఔరంగజేబ్‌ల మధ్య స్పర్థలు - కారణాలు :

షాజహాన్‌కు దారా షికూహ్ జ్యేష్ఠకుమారుడు. మొదటి ఇద్దరూ అమ్మాయిలే. అందులో ఒకామె చిన్నప్పుడే చనిపోయింది. అందుకని ఎన్నో విన్నపాలు, ప్రార్థనలు, మొక్కుబడుల తర్వాత దారాషికూహ్ మగ సంతానంగా జన్మించడం వల్ల అతని పట్ల తల్లిదండ్రులకు అమితమైన ప్రేమాభిమానాలుండేవి. దారాను ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, సింహాసనంపై కూర్చుండబెట్టాలనేది షాజహాన్ దృఢ నిశ్చయం.

అన్నదమ్ముల్లో ఔరంగజేబ్ అత్యంత ధైర్యస్థైర్యాలు కలిగి, దూరదృష్టి, అణకువ, వినయ విధేయతల కారణంగాను, క్లిష్టమైన ప్రతి కార్యాన్ని సాధించడం వలనను, ప్రజల్లో, దర్బారు నాయకుల్లో ఔరంగజేబ్ కీర్తి ప్రతిష్ఠలు పెరగసాగాయి. అయాచితంగానే ఇది దారాకు నచ్చలేదు. షాజహాన్ కాలం నాటి ప్రతి యుద్ధంలో, ప్రతి ఘర్షణలో, ప్రతి ఘనకార్యంలో ఔరంగజేబ్ పాత్ర ఉండడంతో సహజంగానే అతను వినుతికెక్కసాగాడు. ఈ విధంగా తను సింహాసనాన్ని అధిష్టించే మార్గంలో ఎవరైనా అడ్డంకి అవుతారనుకుంటే, అది

కేవలం ఔరంగజేబ్ అనే విషయం దారా మనో మస్తిష్కాల్లో నాటుకుపోయింది. అందుకని ఏ విధంగానైనాసరే, ఔరంగజేబ్ మంచి పేరును, కార్యదీక్షతను దెబ్బతీస్తేనే తాను ప్రకాశించ గలడని దారా భావించాడు. ఈ భావన లేక ఈ యోచన ఎప్పుడైతే గట్టిపడిందో, అతను నిరంతరం ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నసాగాడు. అతని ప్రతి కార్యంలో లోపాలెంచసాగాడు. అతన్ని ఏవిధంగా విఫలం చేయాలి, ఏ విధంగా అపకీర్తిపాల్జేయాలి, ఏ విధంగా ప్రజల, నాయకుల, సామంతుల, చక్రవర్తి దృష్టిలో నిష్ప్రయోజకునిగా, విలువలేని వానిగా, పలుకుబడి, సామర్థ్యం లేనివానిగా నిరూపించాలని సతతం యుక్తుల్ని పన్నేవాడు. తాను సింహాసనం అధిష్టించే మార్గంలో ఒక్క ఔరంగజేబే పెద్ద అవరోధమని తండ్రిని కూడా నమ్మించగలిగాడు. షాజహాన్, ఔరంగజేబ్ యోగ్యతల్ని ఎరిగినవాడైనప్పటికీ, సింహాసనంపై దారానే కూర్చుండబెట్టాలనేది మాత్రం అతని ప్రగాఢవాంఛ అయి ఉండేది. అందుకని తను సింహాసనాన్ని అధిష్టించే మార్గంలో ఔరంగజేబొక్కడే అవరోధమని దారా తన తండ్రికి ఎప్పుడైతే నమ్మించగలగాడో, షాజహాన్ కూడా ఔరంగజేబ్‌కు వ్యతిరేకుడై పోయాడు. ఈ విధంగా తండ్రి కొడుకులిద్దరూ ఏకమై, ప్రతి చిన్న విషయంలో ఔరంగజేబ్‌ను మానసికంగా హింసించసాగారు. నిజానికి అప్పటివరకు సింహాసనం గురించి లేక వారసత్వం గురించి ఔరంగజేబ్ ఏదైనా వివాదం లేపినట్లు ఎలాంటి చారిత్రక సాక్ష్యాధారం లేదు. అయినాగాని ఔరంగజేబ్‌ను నిరుత్సాహపరచాలని, అతను ధైర్యస్థయిర్యాలు వదలి, రంగం నుండి నిష్క్రమించాలని సతతం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఖాందహార్ యుద్ధం కూడా ఔరంగజేబ్ గెలువకూడదని, అందులో అతను విఫలమవ్వాలని, తద్వారా అతని పేరుపై మచ్చరావాలని, ఆ తరువాత తాను రంగంలో ప్రవేశించి తన ద్వారా ఖాందహార్ జయింపబడాలని దారా, ఆ సందర్భంలో ఔరంగజేబ్ చేసిన ప్రతి ప్రతిపాదనకు అడ్డుపుల్ల వేస్తూపోయాడు. చివరికి అతను అసమర్థుడనే ముద్రవేసి, అతన్ని వెనుకకు రప్పించుకోవడం జరిగింది. అతనికి శిక్షగా ముల్తాన్ సూబా నుండి తీసేసి దక్కన్ సూబేదారుగా నియమించడం జరిగింది. ఖాందహార్ నుండి మరలిన తరువాత అతని పాత సూబా అయిన ముల్తాన్‌కు పోయే అనుమతి కూడా ఇవ్వబడలేదు. భార్యాపిల్లల్ని లాహోర్‌కు పిలిపించుకొని, తీసుకెళ్ళమని ఆదేశించడం జరిగింది. ఇక ముల్తాన్‌కు బదులు దక్కన్‌లో ఔరంగజేబ్‌కు ఇవ్వబడిన జాగీర్ల నుండి వసూలు కాబడే ధనాన్ని ఎంత అతిశయోక్తిగా, అత్యధికంగా అంచనా వేయబడిందంటే, దానివల్ల ప్రతి సంవత్సరం పదిహేడు లక్షల లోటు ఏర్పడే సమస్య వచ్చిపడింది. దానిపై ఔరంగజేబ్ స్వాభావికంగానే నిరసన తెలిపాడు. ఈ విషయంలో అతను తన తండ్రికి లేఖ రాస్తూ ఇలా విన్నవించుకున్నాడు.

"ప్రభువుల వారి సన్నిధిలో విన్నవించుకునేదేమంటే, దక్కన్‌లోని సూబాల రాబడి మరియు ఖర్చుల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి సంవత్సరం దాదాపు 6 లక్షల 33 వేల రూపాయలు కేవలం ఫిరంగుల నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల జీతాలు ఇంకా నాలుగు

సూబాల అత్యవసర, అనివార్య ఖర్చులకోసం నిర్ణీతమై ఉన్నాయి. ఇక 25 లక్షల 43 వేలు నా జీతం, ఇతర రాజపరివార సభ్యులు (అనగా ఔరంగజేబ్ కుమారులు మొదలగువారు) జీతభత్యాలకు ఖర్చవుతాయి. ఈ విధంగా మొత్తం 31 లక్షల 76 వేల రూపాయలు ఖర్చుల కోసం అవసరమవుతాయి. ఇక రాబడి వివరాలు ఇలా ఉన్నాయి: 1. పరగణ బేరు మరియు ప్రభుత్వ భూముల శిస్తుల ద్వారా - 8 లక్షలు. 2. ఖుతుబుల్ ముల్క్ పేష్కష్ (కప్పం) - ఒక లక్ష రూపాయలు. 3. దేవ్‌గడ్ జమీందారు పేష్కష్ దాదాపు 2 లక్షల నలుబది వేలు - మొత్తం వెరసి పదకొండు లక్షల నలుబది వేలు - ఈ లెక్కన ప్రతి సంవత్సరం 20 లక్షల 36 వేల రూపాయలు నాకు రావాల్సి ఉంటుంది. (అప్పుడుగాని రాబడి, ఖర్చులు సమానమవుతాయి). దక్కన్ కోశాగారం (ధనాగారం)లో వివిధ పద్దుల క్రింద 80 లక్షల 60 వేల రూపాయలు జమ ఉండేవి. అందుకని కొంతకాలం వరకు ఆ ధనం ఈ అధిక ఖర్చుల కోసం పనికి వస్తుండేది. ఎప్పుడైతే నేను దక్కన్ గవర్నరుగా హోదాను అందుకున్నానో, అప్పుడే నేను ఈ వాస్తవాన్ని కనుగొన్నాను. (అంటే ఇక్కడ రాబడి తక్కువ, ఖర్చులు ఎక్కువ అనే విషయం). కాని ప్రభువుల వారికి ఈ వాస్తవాన్ని తెలుపలేదు. ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే, ధనాగారంలో జమ ఉండిన రొక్కం లోటు పద్దుల క్రింద ఖర్చయిపోయింది. ప్రస్తుతం ఆ 80 లక్షల 60 వేల రిజర్వు ధనంలో నుండి దౌలతాబాద్ బాపతు 20 లక్షలు, ఇంకా ఇతర 8 లక్షల 50 వేల రూపాయలు - మొత్తం కలిపి 28 లక్షల 50 వేల రూపాయలు మాత్రమే జమ ఉన్నాయి. ఇక దక్కన్ లాంటి పెద్ద, మరియు సరిహద్దు సూబాలో ఎల్లవేళలా కనీసం ఇంత రిజర్వు ధనం తప్పక ఉండాల్సే ఉంటుంది. ఈ పరిస్థితుల్ని దృష్టిలోపెట్టుకొని, వాస్తవాల్ని వివరంగా ప్రభువుల వారి దృష్టికి తేవడం అవసరమనుకుంటున్నాను.

ఒకవేళ ప్రభువుల వారు అనుమతిస్తే ఖరీఫ్ పంట ప్రారంభం నుండి 20 లక్షల 36 వేల రూపాయలు రాబడి వచ్చే భూముల్ని జాగీర్దార్ల జాగీర్ల నుండి తీసేసి, ప్రభుత్వ భూముల్లో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ విధంగా రాబడి మరియు ఖర్చు సమానమవుతుంది. ఇక్కడో విషయాన్ని తేటతెల్లం చేయడం ముఖ్యమనుకుంటున్నాను. దక్కన్ సూబాల జమాబందీ తగ్గించి, తీసివేసిన తరువాత 144 కోట్ల 90 లక్షల "దామ్"లు అవుతుంది ('దామ్' అనేది రూపాయి కన్నా చాల చిన్న విలువగల ఒక రకమైన నాణెం). ఇంకా శిస్తుల ద్వారా వచ్చే రాబడి 12 లక్షల రూపాయలు.

రెవిన్యూ (ఆర్థిక) శాఖకు చెందిన మాజీ ఉద్యోగులు జమాబందీలో బ్యాలెన్స్ ఉంచడం కోసం ఒక కోటి దామ్‌లను కాలవైపరీత్యాల పద్దు క్రింద ఉంచారు. ఇది మూడు నెలలకు కూడా సరిపోదు. (సంవత్సరం చాల పెద్ద విషయం). ఈ సంవత్సర ఆదాయం నుండి 12 కోట్ల దామ్‌లు నా జాగీరు కోసం, మరియు 3 కోట్ల దామ్‌లు ఇనాముల రొక్కం కోసం ప్రత్యేకితమై ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకవేళ 20 లక్షల 36 వేల రూపాయలు రాబడి వచ్చే జాగీర్లను "ఖాల్సా" (ప్రభుత్వ) జాగీర్లుగా మార్చేస్తే దక్కన్‌లోని అత్యధిక మంది

మన్సబుదారులు, జాగీర్లు లేకుండా ఉండిపోతారు. ఆ తరువాత గత్యంతరం లేని పరిస్థితుల్లో వారిని ప్రభువుల వారి సన్నిధికి (కేంద్రానికి) పంపించాల్సి వస్తుంది. దాని పర్యవసానంగా ఇక్కడి సైన్యాల్లో దాదాపు మూడు లక్షల సిపాయీలు తగ్గిపోతారు. (తగ్గింపు అనే ఈ చెడు ఎలాంటిదో తమకు బాగా తెలుసు) ఈ సూబాకు (అనేక కోణాలు, కారణాల వల్ల బెంగాల్, గుజరాత్ సూబాలతో ఎలాంటి పొంతన లేదు). అందుకని సైన్యానికి చెందిన ఒక గొప్ప సంఖ్య ఎల్లప్పుడూ ఉండాల్సిన అవసరముంటుంది. అందుకని మూడు లక్షల సైనికుల తగ్గింపు ఎంతమాత్రం హర్షించదగిన విషయం కాదు.

నిజమైన గురువులు, యజమానీ! ఇంతకు ముందు కూడా, నాకు దక్కన్ గవర్నరు హోదా ప్రసాదించబడినప్పుడు ప్రభువుల వారు ఇవే అనుగ్రహాలను మంజూరు చేసి ఉన్నారు. ఇంకా ఇక్కడి జాగీరే కాకుండా, ఈ విధేయునికి ఇతర సూబాలలో కొన్ని పరగణాల్ని ప్రసాదించి ఉన్నారు. ఇదేకాకుండా సూబా మాల్వా మరియు బందరు సఆదత్‌ల నుండి (జీతం బాపతు) నగదు రూపాయల్ని కూడా ఇప్పించారు. ఇంకా ఉన్నతశ్రేణికి చెందిన ఇక్కడి మన్సబుదార్లలో నుండి కొందరి జాగీర్లు ఇతర సూబాలలో ఉండేవి. (అంటే జాగీర్లు, రాబడి ఇతర సూబాల్లో ఉండి పని మాత్రం ఈ సూబాలో చేసేవారు). ఈ విధంగా ఖర్చులు తక్కువ, రాబడి అధికంగా ఉండేది. ఈ వాస్తవాలన్నీ తెలుపుకున్న తరువాత ఈ విధేయుడు విన్నవించుకునేదేమంటే, ఈ విషయంలో ప్రభువుల వారి అభీష్టమేదో, ఈ విధేయునికి తెలియపరిస్తే, దానిననుసరించి ఆచరించడానికి అవకాశముంటుంది.

పరిపాలకుని తేజస్సు ప్రళయం వరకు ప్రకాశిస్తుండుగాక!

*(రుఖ్ఆత్ ఆలంగీర్ - లేఖ నెం.12/68. (ముఖద్దమ రుఖఆత్ - నజీబ్ అష్రఫ్ పేజి 205. అనువాదం : షమ్స్ బరేల్వి. పేజి 162, 164)*

ఈ లేఖకు పరిష్కారంగా దక్కన్ ఖర్చుల నిమిత్తం ఔరంగజేబ్‌కు రెండు భాగాలు జాగీరునుండి, ఒక భాగం నగదు రూపంలో మంజూరు చేసే ఆదేశాలు జారీఅయ్యాయి. దక్కన్‌లో అతనికివ్వబడిన జాగీర్లు అత్యంత నిరాశాజనకమైనవి. ఎంత ధనం కోసమైతే ఈ జాగీర్లు ఇవ్వబడ్డాయో, అందులో నుండి నాలుగవ, ఐదవ వంతు కూడా బహుకష్టం మీద వసూలు అయ్యేవి. ఇక నగదు రూపంలో ఇవ్వబడేధనం, ప్రభుత్వ ధనాగారం నుండి తీసుకోవాలి. అయితే ప్రభుత్వ భూముల నుండి వసూలయి, ప్రభుత్వ ధనాగారంలో జమఅయ్యే ధనం బహు తక్కువ. ఒక వంతు నగదుకు సరిపడేంత రొక్కం కూడా జమ కావడం లేదు. ఈ లోటును తీర్చడానికి దక్కన్‌లో ఉంచబడిన రిజర్వ్ ధనాగారం నుండి ధనాన్ని తీసుకోవాల్సి వచ్చేది. ఆ రిజర్వ్ రొక్కం, కనీస పరిమితులకు చేరినప్పుడు, దీన్ని మాల్వా మరియు సూరత్ ధనాగారాల నుండి ఇప్పించడం ప్రారంభమైంది. ఇవన్నీ కూడా దక్కన్‌లో ప్రభుత్వ ఖర్చులకు సంబంధించినవే అనే విషయం మనమిక్కడ మరువరాదు.

దక్కన్ పరిపాలనకు సంబంధించి తానెదుర్కొంటున్న ఆర్థిక సమస్యల్ని పదే పదే చక్రవర్తి దృష్టికి తెచ్చినప్పుడు, తక్కువ ఆదాయం వస్తున్న తన జాగీర్లకు బదులు, ప్రభుత్వ

ఆధీనంలో నున్నవిగాని, నాయకుల జాగీర్లలో నున్నవిగాని, మంచివేవో ఏరుకొమ్మని షాజహాన్ ఆదేశించాడు. కాని తానలా చేస్తే రాజోద్యోగులు, జమీందార్లు, నాయకులు అసంతృప్తులవు తారని నాశనమవుతారని ఔరంగజేబ్ విన్నవించుకున్నాడు. అయినా షాజహాన్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. ఖర్చుల్లో వస్తున్న పదిహేడు లక్షల లోటును అలాగే ఉండనిచ్చాడు. జీతాలు మొదలుగాగల ఖర్చులకు కలవరపడిన ఔరంగజేబ్ కొన్ని మంచి జాగీర్లను ఎంపికచేసి చక్రవర్తి మంజూరి కోసం పంపించాడు. కాని దానితో నష్టపోయిన జాగీర్దార్లు, డిల్లీ చేరుకొని ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా రకరకాలుగా షాజహాన్‌కు నూరిపోయసాగారు. ఈ విధంగా ఔరంగజేబ్‌కు వ్యతిరేకుల ఒక సమూహం దర్బారులో తయారయింది. చివరికి ఈ సమస్య తండ్రీకుమారుల మధ్య ఒక అగాధాన్ని ఏర్పరచసాగింది. జాగీర్ల నుండి వచ్చే ఆదాయం అంచనా వేయడంలో పొరపాటు జరిగినట్లును, ఆ ఆదాయాన్ని అసలుకన్నా నాలుగైదింతలు అధికంగా అంచనావేయడం జరిగిందనే నిజాన్ని, వాస్తవాన్ని షాజహాన్ అసలే అంగీకరించడం లేదు. ఉదాహరణకు ఔరంగజేబ్‌కు దక్కన్‌లో "నజర్‌బార్" అనే పరగణ జాగీరుగా ఇచ్చి దాని రాబడిని రెండు కోట్ల దాంలుగా నిర్ణయించడం జరిగింది. కాని అతని సోదరుడు మురాద్ దక్కన్ గవర్నరుగా ఉన్నప్పుడు ఇదే "నజర్ బార్" పరగణ అతనికి జాగీరుగా ఇవ్వబడింది. ఇంకా దాని రాబడిని కేవలం అరవై లక్షల దాంలుగా నిర్ణయించబడింది. ఔరంగజేబ్ తన లేఖ నెం.3/59 (రుఖ్‌ఆత్ ఆలంగీర్) ద్వారా ఈ విషయం షాజహాన్ దృష్టికి తెచ్చినా ఫలితం శూన్యం.ఆర్థిక ఇబ్బందుల కారణంగా దక్కన్ లాంటి సువిశాల ప్రాంతాన్ని నియంత్రించడం ఔరంగజేబ్‌కు కష్టతరమైపోతున్నది. ఈ సమస్యే చిలికి చిలికి గాలివానగా మారి తండ్రీకొడుకుల మధ్య అపార్థాలను, అనుమానాల్ని, అపనమ్మకాల్ని సృష్టించ సాగింది.

దర్బారులో ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా దారా ఉండనే ఉన్నాడు. దానితో పాటుగా తమ జాగీర్లను కోల్పోయిన నాయకులు కూడా తోడయ్యారు. వీరంతా కలిసి షాజహాన్‌కు ఎంతగా నూరిపోశారంటే, ఔరంగజేబ్ అవినీతిని ఎలా ప్రదర్శించారంటే, ఇక షాజహాన్ ఔరంగజేబ్ ఏ మాటను విశ్వసించడానికి సిద్ధంగా లేడు. వాస్తవాలు తెలిసిన వారు దర్బారులో ఉన్నాకూడా, దారా మరియు అతని పార్టీకి భయపడి ఏ ఒక్కరూ నోరు విప్పడం లేదు.

**ప్రతిపాదనల తిరస్కరణ :**

వ్యతిరేకతకు, విభేదాలకు ఇంకొక కారణం ప్రతిపాదనల తిరస్కరణ. ఔరంగజేబ్ ఒక వ్యక్తి గురించి, ఇతను ఫలానా పోస్టుకు, ఫలానా స్థానానికి యోగ్యుడైనందున నియమిస్తున్నా నని ప్రతిపాదనలు పంపితే, షాజహాన్ ఆ వ్యక్తి దీనికి తగినవాడు కాదని ప్రతిపాదనల్ని తిరస్కరించేవాడు. తన ప్రతిపాదనలు తిరస్కరించబడినప్పుడు, ఒక గవర్నరుకు, సూబేదారుకు, రాకుమారునికి అంతకన్నా అగౌరవకరమైన విషయం ఇంకేముంటుంది. ఔరంగజేబ్ ముల్తఫత్ ఖాన్ కుమారుడైన హోష్‌దార్‌ను "మన సంరక్షణలో పెరిగినవాడు, తుపాకులు, ఫిరంగులు నడపడంలో యోగ్యుడు, అనుభవం ఉన్నవాడని, అందుకని ఫిరంగుల విభాగానికి దారూగా

(అధికారిగా) నియమించాన"ని ప్రతిపాదనలు సమర్పిస్తే (రుఖ్అత్ ఆలంగీరి లేఖ నెం.5/53) షాజహాన్ దాన్ని తిరస్కరించాడు. అతను యోగ్యుడు, అనుభవజ్ఞుడు అయినాగాని, ఆ ప్రతిపాదనల్ని తిరస్కరించడంతో ఔరంగజేబ్ అత్యంతగా బాధపడ్డాడు.

ఇదేవిధంగా "అసీర్" కోట ఔరంగజేబ్‌కు అప్పగించబడుతుంది. అతను ఒక కోట అధిపతిని ఎంపిక చేసుకొని, అతన్నక్కడికి పంపించే సమయంలో అతన్ని అక్కడికి పంపించకూడదని ఆదేశాలు అందుతాయి. దీనివల్ల కూడా ఔరంగజేబ్ మానసిక వ్యధకు గురిఅవుతాడు. ఈ విషయంగా తన బాధను తెలుపుకుంటూ తన సోదరికి ఒక లేఖ వ్రాశాడు. దీన్ని తరువాత పేజీలో చూడవచ్చు.

ఇలాంటి పరిస్థితిలో కూడా ఔరంగజేబ్ ప్రదర్శించిన ఓర్పు, సహనాల్ని, తండ్రిపట్ల అతనికి గల గౌరవాభిమానాల్ని ప్రశంచించకుండా ఉండలేము. ఇలాంటి కోపోద్రేకాలు తెప్పించే సందర్భాల్లో కూడా అతను సభ్యత, మర్యాదల్ని అతిక్రమించలేదు. తండ్రికి ఎదురుతిరుగలేదు. కాని షాజహాన్ అతన్ని అన్ని రకాలుగా హీనపరచడానికి, నిస్సహాయునిగా చేయడానికి కంకణం కట్టుకున్నాడా అనిపిస్తుంది. ఎందుకంటే ఆ తరువాత అతనొక విచిత్రాతి విచిత్రమైన చర్యను గైకొన్నాడు.

## ఔరంగజేబ్ ఉద్యోగుల్ని, డిల్లీ దర్బారుకు పిలిపించుకోవడం :

ఔరంగజేబ్ ఎవరినైతే తన ఉద్యోగంలో చేర్చుకున్నాడో, అందులో నుండి ఒక్కడూ కూడా తిరుగబడలేదు, మోసగించలేదు, స్వామిద్రోహానికి పాల్పడలేదు. అతని రాకుమార దశ అంతటిలో ఇలాంటి ఒక్క సంఘటన కూడా కనిపించదు. అతని వ్యతిరేకులకు ఈ విషయం బాగా తెలుసు. అందుకని ఏ విధంగానైనాసరే, అతని ఉద్యోగుల్లో విద్రోహ బీజాల్ని నాటాలని వారు సతతం ప్రయత్నిస్తూనే ఉన్నారు. కనీసం వారిపై నిందలుమోపి, అతని ఉద్యోగం నుండైనా తొలగించాలని ప్రయత్నించసాగారు. ఔరంగజేబ్ ముల్తాన్‌కు గవర్నరుగా ఉన్న కాలం నుండే ఈ ప్రయత్నాలు ప్రారంభమైనట్లు మనం కనుగొంటాము. షాజహాన్ తన ఒక లేఖలో ఔరంగజేబ్ ఉద్యోగి అయిన, మలిక్ హుసేన్ ప్రజల్ని పీడిస్తున్నాడని వ్రాశాడు. దానికి ఔరంగజేబ్ ఇలా సమాధానమిచ్చాడు.

"మలిక్ హుసైన్ దౌర్జన్యాలు, హింస పీడనల గురించి తమరికి చేరవేయబడిన వార్తలన్నీ బూటకములు, నిరాధారమైనవి. అపనిందలు, కల్పితాలు తప్ప వాస్తవాలు ఎంతమాత్రం కావు. ఒక సంవత్సర కాలం ఈ సూబా నా జాగీరుగా ఉంటూ వస్తున్నది. ఈ వ్యవధిలో మలిక్ హుసైన్ దౌర్జన్యపరులు, తిరుగుబాటుదారులు, దోపిడీగాళ్ళతోనైతే తప్పకుండా తలపడుతూ వచ్చాడు. కాని ప్రజల్లో నుండి ఏ ఒక్కరితో కూడా ఘర్షణపడలేదు. ఏ ఒక్క నిరపరాధిని కూడా బాధించలేదు. అతని ద్వారా బయల్పడిన ఇలాంటి చెడు లేక గర్హించదగిన చర్య నేను వినడం గానీ, చూడడంగానీ జరగలేదు. అలాగే గనక జరిగివుంటే తమరి ఆదేశాల క్రమం అతని స్థానమేదో తెలిపేవాణ్ణి. ఇంకా ముమ్ముందు అతనలాంటి చర్యకు సాహసించి ఉండేవాడు కాదు. (కాని అతను అలాంటి ఏ చర్యకూ పాల్పడలేదు).

బహుశ స్వార్థపరులైన కొందరు సత్యాన్ని తారుమారు చేసి, అబద్ధాలు కల్పించి తమరికి విన్నవించి ఉంటారు. (రుఖ్అత్ ఆలంగీర్-లేఖ నెం.3/8, ముఖద్దమ, పేజి 216, 217, అనువాదం : షమ్స్ బరేల్వి, పేజి-71).

ఈ పన్నాగం సఫలీకృతం కానపుడు, ఇంకొక పద్ధతిని అవలంబించడం జరిగింది. ఔరంగజేబ్ వద్ద ఉద్యోగం చేస్తున్న ప్రాచీన ఉద్యోగుల్ని దక్కన్ నుండి పిలిపించి, అంతకన్నా ఉన్నత ర్యాంకుపై దర్బారులో చేర్చుకోవడం మొదలెట్టారు. దీని పర్యవసానంగా ఔరంగజేబ్ తన అనుభవజ్ఞులైన ఉద్యోగుల నుండి వంచితుడు కావడం అనివార్యమేకదా! చూడండి, ప్రజల్ని పీడిస్తాడని నింద మోపిన ఇదే మలిక్ హుసేన్‌ను దక్కన్ నుండి పిలిపించుకొని అతని మన్సబును పెంచుతూ దర్బారు ఉద్యోగంలో చేర్చుకోవడం జరిగింది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ఔరంగజేబ్ తన ప్రియసోదరి, షాజహాన్ ప్రియపుత్రిక అయిన జహాంఆరాకు ఈ పరిస్థితిని తెలుపుతూ దీనివల్ల తనకు వాటిల్లే నష్టాలు, ప్రమాదాలేమిటో వివరిస్తూ ఇలా లేఖ వ్రాశాడు.

## సోదరికి ఔరంగజేబ్ వ్రాసిన లేఖ :

గౌరవాభివందనాలు సమర్పించుకున్న తరువాత (ప్రియసోదరికి తమ ఈ విధేయుడు, శ్రేయోభిలాషి విన్నవించుకునేదేమనగా ఈ మధ్యనే ప్రభువుల వారు తమ అత్యంత దయ, కనికరాలతో నాకు అత్యంత గౌరవప్రదమైన మన్సబు (గవర్నరీ) ప్రసాదించిన విషయం తమరికి బాగా తెలుసు. ప్రభువులవారి దర్బారు నుండి నన్ను ఏ హోదాపై నియమించినా, నేను సాధ్యమైనంతగా, నా శాయశక్తుల మేరకు, స్థిరచిత్తంతో నిర్వర్తించాను. ఇంకా లేశమంత లోపం రానీయలేదు. నిజమైన గురువు, యజమాని విధేయతను, దాస్యాన్ని నా భాగ్యంగా తలుస్తూ, అన్ని పనుల్లో ప్రభువుల వారి అభీష్టంపైనే దృష్టి ఉంచాను. అయితే ఇప్పుడిప్పుడే నావల్ల ఏ తప్పిదం జరిగిందో తెలియదు గాని, విధేయత, దాస్య స్థితికి అనుకూలంగాని, దగ్గర దూరాల్లో నా న్యూనత మరియు నా పట్ల అపనమ్మకానికి ప్రతీక అనిపించదగ్గ విషయాలు, మాటలు బయల్పడుతున్నాయి.

మొట్టమొదటగా "అసీర్" కోట విషయమే తీసుకుందాం. ఈ కోట ఈ విధేయునికి ప్రసాదించబడింది. అయితే ఇప్పుడు నేను నియమించిన కోటాధిపతి అక్కడికి వెళ్ళలేదనే విషయం అందరికీ తెలిసిపోయింది. అలా చేయడానికి కారణమేమిటో కూడా తెలుపబడలేదు. ఒకవేళ సంబంధం విషయంలో నేను మాట వినలేదని అనుకుంటే అదంతా ప్రాముఖ్యత కలిగిన విషయం కాదే! ఎలాగంటే ఎప్పుడైతే ఈ వ్యవహారం ప్రభువుల వారి సమక్షంలో వచ్చినప్పుడు "ఒకవేళ నీవు కోరినట్లయితే, నీకు సమ్మతమైతే, ఈ సంబంధాన్ని నెలకొల్పు"అని ప్రభువుల వారే స్పష్టంగా చెప్పారు. కొన్ని కారణాల వల్ల ఈ సంబంధానికి నేను సుముఖంగా లేకుంటిని. ఈ వాస్తవాన్నే నేను ప్రభువుల వారికి విన్నవించుకున్నాను. ఆ సమయంలో ఒకవేళ ప్రభువులవారు బలవంతంగా నన్ను ఆదేశించివుంటే (నిజానికి న్యాయదృష్టితో

ఇలాంటి బలవంతం, ఒత్తిడి సామాన్య ఉద్యోగులపై కూడా చేయకూడదు) నేను వివశుణ్ణై పోయేవాణ్ణి. ఇంకా ఈ సంబంధం ఒప్పుకోక తప్పేది కాదు. ఇది కాకుండా, ప్రభువుల వారి అభీష్టానికి భిన్నంగా ఇంకేదైనా తప్పు, పొరపాటు నా వల్ల జరిగి ఉంటే, ప్రభువుల వారి నమ్మకంపై నేను సరితూగలేకపోయానంటే అంతకన్నా దురదృష్టం ఇంకేముంటుంది? ప్రభువుల వారి సేవలో 20 ఏళ్ళు గడిపి, ఆయనగారి విధేయతలో ధనప్రాణాల్ని కూడా లెక్క చేయకుండా సేవించిన తరువాత కూడా (కనీసం) సోదర కుమారునికి సమానంగా కూడా విశ్వసించదగినవానిగా నిరూపితం కాలేకపోయానంటే (అది నా దురదృష్టం) – (అదెలాగంటే నా తప్పేమిటో నాకు తెలియపరచబడలేదు). ఇంకా నా ప్రభువు, యజమాని నా గురించి ఇలా ఆలోచిస్తున్నారు. ఇది కాకుండా వేరేదో నా తప్పిదం అయివుంటే, దయచేసి ఆ తప్పిదాన్ని నాకు తెలుపాల్సింది. దాన్ని తెలుసుకొని, జాగరూకుణ్ణై, సంజాయిషీ ఇచ్చుకునే వాణ్ణి. ఇంకా అలాంటి పొరపాటు ఇక ముందు జరుగకుండా జాగ్రత్తపడేవాణ్ణి.

రెండవ విషయం ఏమిటంటే, ఈ రోజుల్లోనే దాదాభాయి జియో (దారా షికూహ్) ఎవరయితే ఈ విధేయునిపై "ప్రత్యేక దయానుగ్రహాల దృష్టిని" ఉంచుతారో (నా పట్ల ఆయనెంత ప్రసన్నులనే విషయం ప్రభువుల వారికి తెలియంది కాదు). ముల్లా షాఖీ పేరుగల తన సేవకుణ్ణి బీజాపూర్ రాజ్యాధీశుని వద్దకు కొన్ని శుభవార్తలు మరియు అతని విన్నపాల స్వీకరణకు సంబంధించిన సువార్తల్ని ఇచ్చి పంపించారు. తద్వారా అతని ధైర్యం మరియు ఆజ్ఞోల్లంఘనలు పెరిగిపోయాయి. అంతేకాదు, అతన్ని చూసి ఇతరులు కూడా అలాగే చేస్తారు.

దయగల సోదరీ! ఈ అల్లుడు ఎప్పుడు కూడా తనను ప్రభువుల వారి ఆప్తులు మరియు అంతరంగికుల్లో పరిగణించుకోలేదు. దానికి బదులు తనను ఆయనగారి సేవకుల్లోనే లెక్కించుకున్నాడు. ఆయనగారు నన్ను ఏ స్థితిలో ఉంచినా నేను తృప్తిపడ్డాను. అయితే ప్రభువుల వారి సంపద కటాక్షాల వల్ల ఒక దీర్ఘకాలం గౌరవోన్నతుల్లో గడిచిపోయిన కారణం గాను, ఇంకా ఇదే సూబాలో ఒక పర్మనెంట్ సూబెదారుగా ఉంటూ వచ్చాను. ఈసారి కూడా నా ఇచ్ఛాకోరికలు, దరఖాస్తు లేకుండానే ప్రభువులవారు కేవలం తమ దయ, కనికరాలతో ఈ ప్రాంతపు అధికారాన్ని నాకు ప్రసాదించారు. ఇలాంటి పరిస్థితుల్లో శోభించని, తుచ్ఛమైన విషయాలు బయల్పడడం దాస్యులపోషణ, వాత్సల్యానికి వ్యతిరేక విషయం. ఈ విధంగా మన పరువుపోతుంది, ఇంకా గౌరవోన్నతులకు భంగం వాటిల్లుతుంది. తద్వారా స్థిరతలో లోపం చోటుచేసుకుంటుంది. ఈ స్థితిలో ఆశ్చర్యచకితుణ్ణై, అయోమయంలో పడిపోయాను. ఇంకా (పరమోన్నతుడైన పరాత్పరుని తరువాత ప్రభువుల సన్నిధి తప్ప ఇంకే రక్షణ స్థావరాన్ని కనుగొనని నేను) విధేయుణ్ణి అయిన నా పట్ల ఏ నిర్ణయం గైకొనబడిందో తెలుసుకోలేకపోతు న్నాను. ఒకవేళ ఒకరి పక్షపాతం కోసమో లేక ఇంకేదైనా ఔచిత్యం కోసమో నేను అగౌరవకర మైన జీవితం గడపాలని, ఇంకా అనుచిత పద్ధతిలో నాశనం కావాలనేది ప్రభువుల వారి ఉద్దేశమే గనక అయివుంటే, అప్పుడు కూడా విధేయత తప్ప ఇంకే మార్గముంటుంది. "మా

కోసం అల్లాహ్ ఒక్కడు చాలు, ఆయన ఉత్తమోత్తమమైన సహాయకారి, సంరక్షకుడు (అందరి కన్నా మంచి న్యాయశీలుడు)".

కాని ఈ విధంగా జీవించడం లేక మరణించడం రెండునూ కష్టతరమైనవే. నశ్వర, అశాశ్వత విషయాల కోసం బాధను, కష్టాన్ని భరించకూడదు. ఇంకా (ఇలాంటి వాటికోసం) తమకు తాము వేరొకరి చేతికి అప్పగించకూడదు. (ఇతరుల చేతుల్లో కీలుబొమ్మగా మారకూడదు). ప్రభువులవారి ఆదేశాలతో ఇలాంటి గౌరవహీనమైన జీవితం నుండి విముక్తి పొందడం ఇంతకన్నా మేలైన విషయం. ఈ విధంగా రాజ్య ఔచిత్యానికీ భంగం వాటిల్లదు. ఇంకా కొందరి హృదయాలు దీనితో చల్లబడతాయి. (అంటే ఎవరయితే నేను అధికారంలో ఉండడానికి ఇష్టపడరో (అనగా దారా షికూహ్) వారి హృదయం దీనితో చల్లబడుతుంది. ఇంకా రాజ్య ఔచిత్యం కూడా నెరవేరుతుంది. అంటే, చక్రవర్తిత్వం దారా షికూహ్‌కు లభిస్తుంది).

నేటికి ఒక సంవత్సరం క్రితమే నేనీ విషయాన్ని గ్రహించాను. ఇంకా ఇతరుల లక్ష్యంలో నేను ఆటంకంగా ఉన్నానని గ్రహించి, ప్రభుత్వ సేవల నుండి వైదొలిగాను (రిజైన్ చేశాను). కాని ఆ తరువాత రెండవసారి కేవలం ప్రభువుల వారి ప్రసన్నత కోసం (ఏదైతే నా అంతిమ లక్ష్యమో) ఈ మన్సబు (గవర్నరీ) ను అంగీకరించాను. కాని ఆ తరువాత నాపై ఏం జరిగిందో అది నేను మాత్రమే ఎరుగుతాను. ఆ సమయంలోనే ప్రభువులవారు నన్ను క్షమించి వదిలేస్తే ఏకాంత జీవితం గడిపేవాణ్ణి. ఇంకా ఎవరి చింతకు కారణభూతుణ్ణి కాకపోయేవాణ్ణి, ఇలాంటి ఘర్షణకు గురికాకపోయేవాణ్ణి. అయితే ఈ పనికి సంబంధించిన యుక్తి ప్రభువుల వారి ఇష్టంపై ఆధారపడి ఉంది. అందుకని ఈ విధేయుని కోసం ఇప్పుడు లేక భవిష్యత్తులో ఏది సమంజసమో, దాన్ని వివరిస్తే చాలు, ఈ విధంగా నేను ప్రభువుల వారి అభీష్టాన్ని తెలుసుకొని దాని ప్రకారమే నడుచుకుంటాను.

వీటన్నింటికన్నా విచిత్ర విషయమేమిటంటే, మలిక్ హుసైన్‌ను ప్రభువులవారి సన్నిధికి (అంటే ఢిల్లీ దర్బారుకు) పిలిపించుకోవడం జరిగింది. ఇంకా అతనికి మన్సబు ప్రసాదించడం జరిగింది. దానితోపాటే నా ఉద్యోగంలో ఉంటూ అతనితో పని చేస్తున్న వారిని కూడా మన్సబులు ప్రసాదించబడ్డాయి.

మలిక్ హుసైన్ ప్రభువుల వారి ఉద్యోగి అనేది నిర్వివాదాంశం. ఇంకా ఈ విధేయుడు ప్రభువుల వారి సేవకోసమే అతన్ని తర్ఫీదు చేశాడు. ఇంకా అతనితో పాటు ఉన్న సిపాయిలు, ఇంకా ఇతరులు కూడా రాజ్య సేవకోసమే ఉన్నారు. కాని ఒకసారి ఈ ద్వారం తెరుచు కున్నదంటే, నా ఉద్యోగులు ఇతర పనివాళ్ళు ప్రభువుల వారి ఉద్యోగంతో సత్కరించబడు తున్నప్పుడు, ఇంకా తమ స్థాయి, యోగ్యత కన్నా ఉన్నత మన్సబులు దొరుకుతున్నప్పుడు, నా వద్ద ఏ ఒక్క ఉద్యోగి కూడా ఉండడనేది తెలుస్తూనే ఉంది. ఇరవై సంవత్సరాల సుదీర్ఘ కాలంలో నేను ప్రోగుచేసుకున్న సిపాయిలు, యోగ్యులైన మన్సబుదారులు ఈ విధంగా చెల్లాచెదరైపోయినప్పుడు, నా సంబంధిత సేవల్ని నేనెలా నిర్వర్తించగలుగుతాను? ఇంకా ఒకవేళ ఇందులో కూడా ఏదైనా యుక్తి ఉన్నట్లయితే, ప్రభువులవారు ఆదేశాలు జారీచేసి

నట్లయితే యోగ్యులైన ఉద్యోగులందరిని సంతోషంగా ప్రభువుల వారి సన్నిధికి పంపిస్తాను. తద్వారా ఆప్తుల లక్ష్యం నెరవేరుతుంది. ఒకవేళ ప్రభువుల వారు తమ దృష్టి నుండి నన్ను దూరం చేయలేదనుకుంటే, కొన్ని సంవత్సరాలుగా నేను అందించిన సేవల మరియు విధేయతలకు విలువ ఆయనగారి దృష్టిలో ఉన్నాయనుకుంటే, ఇంకా తమ దాసుల జాబితాలో నా పేరు ఉండడానికి ఆయనగారు ఇష్టపడుతుంటే మరి ఇలాంటి విషయాల్ని ఆయనగారు ఎందుకని ప్రతిపాదించారు.

మనః ఖేదానికి గురిఅయి, గాయపడిన నన్ను, తమ సానుభూతి అనుగ్రహాలనబడే లేపనంతో నాకెలాంటి చికిత్స చేయాలంటే నేను స్థిరతతో తగిన విధంగా నాకు అప్పగించబడిన విధుల్ని నిర్వర్తించగలగాలి. సంజాయిషి, అవమానాల నుండి సురక్షితం కాగలగాలి. పరాత్ప రుని సన్నిధిలో దాసుల విధేయత, దాస్యం వృధా కానప్పుడు ప్రభువుల వారి సన్నిధిలో ఎలా వృధా అవుతుంది? సర్వేశ్వరుడు తన దాసులకోసం దేన్నైతే సముచితమని భావించడో, దాన్ని ప్రభువులవారు తమ విధేయుల పట్ల ఎలా అంగీకరిస్తారు (అనగా అవమానం, అవహేళన).

తమలాంటి దయానుగ్రహాలు కలిగిన సోదరి ఈ విషయాలన్నింటినీ ఏకాంతంలో ఉన్నప్పుడు ప్రభువుల వారికి చేరవేస్తారని, దానిపై ప్రభువుల వారు ఏమి సెలవిస్తారో నాకు తెలియపరుస్తారని ఆశిస్తున్నాను. తద్వారా నా విస్మయం తొలగిపోయి, నేను నా తప్పిదాలకు మన్నింపు కోరుకోగలను. సుదీర్ఘ సంభాషణ బాధ కలిగిస్తుంది. అందుకని లేఖను ముగిస్తు న్నాను. తమరి దయానుగ్రహాలు సతతం ఇలాగే ఉండాలని పరాత్పరుణ్ణి వేడుకుంటున్నాను. (రుఖ్ఆత్ ఆలంగీర్- లేఖ నెం.27/159, ముఖద్దమ-....నజీబ్ అష్రఫ్,పేజి 217- 218, అనువాదం: షమ్స్ బరేల్వి, పేజి 261-263).

ఔరంగజేబ్ హృదయాంతరాళాలలో నుండి వెలువడిన ప్రభావపూరితమైన ఈ వాక్యాలు పాషాణ హృదయాల్ని సైతం కరిగించి వేసేటట్లున్నాయి. తానెదుర్కొంటున్న బాధలు, తన దురదృష్టాన్ని నిందించుకోవడం, వ్యతిరేకుల కుటిల నీతి వైపు సున్నితమైన సంజ్ఞ, తన పతనం, వినాశపుగోడు, దైవంపై ఒట్టేసి న్యాయం కోరడం - ఇవన్నీ దేన్ని సూచిస్తున్నాయి. కుటిల, దుర్నీతి పరులైనవారు ఏ విధంగా రాజకీయ చదరంగాన్ని నడుపుతూ, తనను అన్ని విధాలుగా వివశునిగా, నిస్సహాయునిగా, నిర్జీవునిగా చేయడానికెలా ప్రయత్నిస్తున్నారో, మరియు షాజహాన్ నిజాల్ని, వాస్తవాల్ని చూడడానికే సిద్ధంగా లేడని, తన వైపు నుండి అతను పూర్తిగా దృష్టి మరల్చుకున్నాడని విన్నవించుకున్నాడు. ఇదే చివరి పాచిక అనుకుం టున్నారా? లేదు, లేదు. ఈ ద్వేషం, వ్యతిరేకతలు కుటుంబ మరియు రక్త సంబంధాలపై కూడా ప్రభావం చూపుతాయి. సోదరుల్లో ద్వేష బీజాలు నాటడానికి కూడా వెనుకాడలేదు.

**రాకుమారుడు ముహమ్మద్ సుల్తాన్ సంబంధం :**

ఖాందహార్ యుద్ధం నుండి మరలుతూ దక్కన్ వెళుతున్నప్పుడు, సోదరులిద్దరు షుజా, ఔరంగజేబ్‌లు తమ బాంధవ్యాన్ని సుదృఢపరుచుకునేందుకు గాను, షుజా కుమారుడు

జైనుద్దీన్ వివాహం ఔరంగజేబ్ కూతురుతోనూ, ఔరంగజేబ్ కుమారుడు ముహమ్మద్ సుల్తాన్ వివాహం షుజా కుమార్తెతోనూ జరపాలని నిశ్చయం చేసుకుంటారు. సముచిత సమయం రాగానే వివాహాలు జరుపుదామని నిర్ణయం చేసుకొని ఉన్నారు. ఈ సంబంధాలు, నిశ్చితార్థాలు రహస్యంగా జరిగినప్పటికీ షాజహాన్ మొదలగు వారికి ఈ విషయం తెలిసిపోతుంది. ఈ సోదర సంబంధపు వేళ్ళనే త్రెంచివేయాలనే ఉద్దేశంతో, ముహమ్మద్ సుల్తాన్ వివాహం వేరొకచోట జరిపించాలని నిశ్చయించుకున్నారు. దీనికి సంబంధించి షాజహాన్ ఔరంగజేబ్‌కు ఒక లేఖ వ్రాశాడు. దానికి ఔరంగజేబ్ జవాబిస్తూ “ముహమ్మద్ సుల్తాన్ సంబంధం షుజా కుమార్తెతో నిశ్చయమైంది. దాన్ని భంగం చేయడానికి సముచిత కారణం కూడా లేదు. అందుకని ఈ విషయంలో నేను అశక్తుణ్ణి. స్వయంగా చక్రవర్తుల వారు తలచుకుంటే, దాన్ని త్రెంచేయవచ్చు. అవసరం అనుకుంటే ముహమ్మద్ సుల్తాన్‌ను పంపిస్తాను.” అంటూ విన్నవించుకున్నాడు. షాజహాన్‌కు సూటిగా ఇచ్చిన ఈ జవాబు నచ్చలేదు.

ఈ విషయంలో తండ్రికొడుకుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి. ఔరంగజేబ్ ఎన్నో రకాలుగా తన అశక్తతను తెలియపర్చాడు. అయినా షాజహాన్ తన పంతాన్ని వదలలేదు. తను చూసిన వంశం అమ్మాయితోనే అతని వివాహాన్ని జరిపించడం దూరదృష్టితో కూడుకున్నదని, ఇదెంతో ముఖ్యమని తిరిగి వ్రాశాడు.

దానికి ఔరంగజేబ్ ఇలా సమాధానమిచ్చాడు : “ముహమ్మద్ సుల్తాన్ సంబంధమైతే నిశ్చయమైపోయింది. ఈ విషయంలో నేను నిస్సహాయుణ్ణి. ప్రభువుల వారు కోరే అమ్మాయి కుటుంబంతో వివాహ సంబంధాలు అవసరమే అనుకుంటే వేరే కుమారులున్నారు” అంటూ విన్నవించుకున్నాడు. (రుఖ్అత్ ఆలంగీర్ . లేఖ నెం. 3/86, ముఖద్దమ... పేజి.220-221)

షాజహాన్ సదుద్దేశంతోనే ఈ ప్రతిపాదనలు చేసి ఉన్నట్లయితే, ఔరంగజేబ్ సమర్పించిన ఈ ప్రతిపాదనను సంతోషంగా అంగీకరించాల్సింది. కాని ఇక్కడ ఉద్దేశం అది కాదు. సోదరుల మధ్య సంబంధాలు దృఢపడకూడదని, అగాధాలు పెరగాలనేది అసలు ఉద్దేశం. అయితే అతని వ్యతిరేకులకు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా షాజహాన్ చెవులు నింపడానికి ఇదొక అవకాశంగా లభించింది. దీన్ని వారు చక్రవర్తి ఆజ్ఞోల్లంఘనంగా చూపించారు. దీనికి శిక్షగా అంతకుముందు ఔరంగజేబ్‌కు అప్పగించబడిన, దానికి ఔరంగజేబ్ తన కోటాధిపతిని కూడా నియమించిన “అసీర్” కోటను అతని నుండి తిరిగి తీసేసుకోవడం జరిగింది.

## లేఖల వ్యవహారం :

వివాహానికి సంబంధించిన వ్యవహారంతో షాజహాన్ అసంతృప్తుడయ్యాడంటే కొంత వరకు అర్థముంది. కాని అతను చీటికి మాటికి ప్రతి చిన్న విషయానికి ఔరంగజేబ్‌పై విరుచుకపడడం, అతన్ని కించపరచడం, అలవాటుగా చేసుకున్నాడు. ఉదాహరణకు ఔరంగజేబ్ తన తండ్రికి లేఖలన్ని స్వదస్తూరితోనే వ్రాసేవాడు. ఒకసారి బొటనవేలుకు

గాయమై, వ్రాతలో కాస్త తేడా వచ్చింది. ఇంకేముంది? షాజహాన్ ఔరంగజేబ్‌పై విరుచుకు పడ్డాడు. అతనికి గర్వం వచ్చిందని, తండ్రికి కూడా స్వహస్తాలతో లేఖ వ్రాసేంత తీరిక లేకుండా పోయిందని, ఇలా రకరకాలుగా దూషించాడు. ఔరంగజేబ్ నిజపరిస్థితిని విన్నవించు కుంటే వింటేగా! (చూడండి - రుఖ్‌ఆత్ ఆలంగీర్-లేఖ నెం.10/96) (ముఖద్దమ రుఖ్‌ఆత్-స.న.అష్రఫ్-పేజి నెం.222)

## మామిడి పళ్ళ వ్యవహారం :

ఇలాంటి కలహాల్లో మామిడి పళ్ళ వ్యవహారం ఒకటి. బుర్‌హాన్‌పూర్‌కు చెందిన "రాజతోట"లో "బాద్‌షా పసంద్" పేరుగల ఒక ప్రఖ్యాత మామిడి ఉండేది. ఔరంగజేబ్‌ను దక్కన్ గవర్నరుగా నియమిస్తూ పంపేటప్పుడు, "రాజతోట"లోని ఆ ప్రత్యేక మామిడి పళ్లను పంపించాలని షాజహాన్ ఆదేశించాడు. దానికి ఔరంగజేబ్ వాగ్దానం కూడా చేశాడు. మామిడి పళ్ళ సీజన్ వచ్చినప్పుడు ఆ ప్రత్యేక పళ్ళను చక్రవర్తుల వారికి పంపించాల్సిందిగా ఔరంగజేబ్ తన ఉద్యోగులకు ఆదేశాలు పంపించాడు. అదేవిధంగా పళ్ళు చక్రవర్తికి ముట్టాయి. అయితే పరిమాణంలో అవి తక్కువ ఉన్నాయి, అందులో కొన్ని చెడిపోయాయి కూడా. షాజహాన్ దీని విషయంగా అపార్థం చేసుకున్నాడు. ఔరంగజేబ్ దీని విషయంగా శ్రద్ధ తీసుకోలేదని, లేక అతనే ఈ పళ్ళు తిని సంతుష్టుడవుతున్నాడని అనుకున్నాడు. ఈ ఆలోచన రాగానే ఈ విషయంగా ఔరంగజేబ్‌కు ఘాటుగా ఒక లేఖ వ్రాశాడు. ఔరంగజేబ్ దానికి సమాధానం ఇస్తూ, 'బాద్‌షా పసంద్' మామిడి ఈ సంవత్సరం దాదాపు కాయలేదని తెలిపాడు. అతని లేఖ ఇలా ఉంది: ".....దర్బారులోని వకీలు వ్రాసిన అనేక లేఖల ఆధారంగానే (చెట్లపై మామిడికాసి, పళ్ళుకాక ముందే) నేను అనేకచోట్ల పళ్ళ రక్షణకోసం ఉద్యోగుల్ని నియమించి వారికి తాకీదు చేశాను. కాని ఈ సంవత్సరం దక్కన్‌లో మామిడి చాలా తక్కువ కాసింది. (పూత తక్కువ వచ్చింది). ప్రత్యేకించి "బాద్‌షా పసంద్" మామిడి చెట్లయితే మరీ తక్కువ కాసాయి. ఈ విషయం ఈ ప్రాంత వార్తావిలేఖరి ద్వారా ప్రభువుల వారికి తెలిసే ఉంటుందని దృఢంగా విశ్వసిస్తున్నాను. అయినప్పటికీ ప్రభువుల వారి సన్నిధికి పళ్ళు పంపించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపించబడదని విన్నవించుకుంటున్నాను.

బుర్‌హాన్‌పూర్‌లో నివాసముంటున్న ముల్తఫత్ ఖాన్ అల్లుళ్ళు సాబిర్, దారాబ్‌లకు, ప్రభువుల వారి సన్నిధికి ఇక్కడి నుండి పంపబడే పళ్ళు బుర్‌హాన్‌పూర్ నుండి నేరుగా తంతి (తపాలా) చౌకీల నుండి, నిరంతరంగా (ఎలాంటి జాప్యం లేకుండా) మంచి స్థితిలో ప్రభువుల వారి సన్నిధికి చేరాలని తాకీదు చేయడం జరిగింది." (రుఖ్‌ఆత్ ఆలంగీర్ - లేఖ నెం.2/58-ముఖద్దమ .... నజీబ్ అష్రఫ్, పేజి 223, అను-షమ్స్ బరేల్వి, పేజి-148). అయినా షాజహాన్ అనుమాన నివృత్తి కాలేదు. ఇందులో కూడా ఔరంగజేబ్ పోకిరితనముందని భావిస్తాడు. అందుకని ఔరంగజేబ్‌కు వ్యంగ్యంగా ఇలా లేఖ వ్రాస్తాడు:

"బాద్‌షా పసంద్" పళ్ళు మూడు, నాలుగు పర్యాయాలకన్నా ఎక్కువ చేరలేదు. ఇక వచ్చే సంవత్సరం నుండి, క్రమం తప్పకుండా పంపించేందుకు మేము మా మనిషినే

నియమించుకుంటాము.” (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.4/60, ముఖద్దమ ..... పేజి 223, అను-షమ్స్ బరేల్వి, పేజి 151,152).

ఇక్కడ మనమో నిముషం ఆగి ఆలోచించాలి. ఒక మర్యాదగల మనిషికి ఇంతకన్నా అవహేళన ఇంకేమైనా ఉంటుందా? ఔరంగజేబ్ అతి సామాన్యమైన మామిడి పళ్ళలాంటి విషయంలో కూడా దుర్నీతిపరుడా? నమ్మదగిన మనిషికాదా? ఒక మామూలు మనిషి కూడా ఇలాంటి నిందను, అవమానాన్ని భరించగలడా? కాని సూదుల్లాగా వచ్చి హృదయంలో గుచ్చుకుపోతున్న ఇలాంటి నిందల్ని, అవహేళనల్ని, అవమానాల్ని భరిస్తూ కూడా ఔరంగజేబ్ పల్లెత్తు మాట నోటినుండి జారనివ్వలేదు. అసామాన్యమైన ఓర్పు, సహనాలు మూర్తీభవించిన ఈ మనిషి, సూదుల్లాంటి ఆ ఎత్తిపొడుపులకు ఇచ్చిన సమాధానాన్ని గమనించండి :

“మహాప్రభూ! ఈ పనికోసం దర్బారు నుండి ఒక బాధ్యుణ్ణి నియమించడం సముచితంగానే ఉంటుంది. ఈ సంవత్సరం తమరి సన్నిధికి పంపడానికి ఈ పళ్ళు సముచితంగా ఉంటాయో లేవో తెలుసుకోవడానికి “బాదుషా పసంద్” చెట్టు నుండి మూడు కాయలు నాకు చూపించడానికి తేబడ్డాయి. మిగిలిన పళ్ళన్నీ నేరుగా తోట నుండే తమ సన్నిధికి పంపబడ్డాయి. ఈ సంవత్సరం “బాదుషా పసంద్” పళ్ళు తక్కువగా కాసాయని ఎన్నోసార్లు తమకు విన్నవించుకున్నాను. ఆ ప్రత్యేక చెట్టులో కేవలం ఒక కొమ్మ మాత్రమే మిగిలి పోయిందని, దానిలోనే ఇవి కాసాయని, మిలిగిన కొమ్మలు గలి దుమారానికి విరిగి పోయా యని మరోసారి తమరికి విన్నవించుకుంటున్నాను.

ప్రభువుల వారి కోసం ప్రత్యేకించబడిన పళ్ళు ఇక్కడ వాడబడడాన్ని ఈ విధేయుడు ఎలా భరించగలడో ప్రభువుల వారు ఒక్కసారి యోచించాలి. (రుఖ్ఆత్ ఆలంగీర్ - లేఖ నెం.4/60, ముఖద్దమ ,,,,,, నజీబ్ అష్రఫ్, పేజి 223, అను- షమ్స్ బరేల్వి. పే.151-152)

ఎప్పుడైతే పై నిందలకు ఔరంగజేబ్ సముచిత సమాధానమిచ్చాడో, ఇక షాజహాన్ ఊరుకున్నాడా? లేదు. ఇంకా వేరే రకాలైన లోపాల్ని ఎంచసాగాడు. పళ్ళు పండకముందే కోయబడతాయని, బుర్హాన్‌పూర్ నుండి కోసి అవి ఔరంగజేబ్ వద్దకు వస్తాయని, అక్కడి నుండి చక్రవర్తికి చేరేవరకు చెడిపోతాయని, తెచ్చేవాళ్ళుకూడా వాటి పట్ల శ్రద్ధ తీసుకోరని - ఇలా పలు రకాలుగా విమర్శించాడు.

## ఓడ నిర్మాణంపై అభ్యంతరం :

ఇదేవిధంగా ఔరంగజేబ్ మీద షాజహాన్ ఇంకొక నిందమోపాడు. అతను సూరత్ పట్టణంలో ఒక కొత్త ఓడను నిర్మిస్తున్నాడని, దానికోసం ప్రభుత్వ కఱ్ఱను ఉపయోగిస్తున్నాడని విమర్శించాడు. ఆ సమయంలో ఔరంగజేబ్ పెద్ద కుమారుడు ముహమ్మద్ సుల్తాన్ షాజహాన్ వద్దనే ఉన్నాడు. దానికి ఈ విధంగా సమాధానం ఇవ్వాల్సిందిగా ఔరంగజేబ్ తన కుమారుణ్ణి ఆదేశించాడు :

"...... ఈ విషయం దర్బారులో ప్రస్తావనకు వచ్చినప్పుడు నీవు ఈ విధంగా తెలుపాల్సి ఉండింది: "సూరత్ ఓడరేవులో ఔరంగజేబ్ ఏదో ఒక కొత్త ఓడను తయారు చేయమని కోరి ఉండలేదు. మొగల్ ఖాన్ కాలంలో తయారయ్యి, పరిగణ కకరాల జమీందారు చేతికి చిక్కిన ఆ ఓడ, ప్రత్యేక ప్రభుత్వ ఆస్తుల్లో చేర్చబడింది. ఆ తరువాత అది మహనీయుల (ఔరంగజేబ్) వారికి సమర్పించబడింది. ఈ ఓడను ఇంతకు ముందు ఎన్నోసార్లు "సలామత్ రస్" అనే పేరుగల ఓడతో పాటుగా "ఠట్" రేవు నుండి 'సూరత్' రేవుకు తేవడం జరిగినందున దానికి మరమ్మతు చేసే అవసరం ఏర్పడింది. ఇంకా మహనీయుల ఆదేశం ప్రకారం దానికి తగిన రిపేరు జరగాలని అక్కడి అధికారి (ముతసద్ది) కోరాడు. అందుకని దానికి తగిన మర మ్మతు జరుగుతున్నది. ఒకవేళ ప్రభువులవారు (షాజహాన్) దీనికి ఇష్టపడక పోయినట్లయితే దాని మరమ్మతు ఆపేయడం జరుగుతుంది. నిజానికి దాని మరమ్మతులో కొన్ని కర్రలు తప్ప ఇంకేదియు వినియోగించబడలేదు." (రుఖ్అత్ ఆలంగీర్-లేఖ నెం. 6/176,..... ముఖద్దమ .... నజీబ్ అష్రఫ్, పేజి 225, 226).

## ధార్మికత్వపు అవహేళన :

పై నిందలు, అవహేళన, అవమానాలకు మించి, ఔరంగజేబ్‌కు మానసిక వ్యధకు, ఆత్మ సంక్షోభానికి గురిచేసే చర్య అతని ధార్మికతను గురించి అవహేళన చేయడం. అతని ధార్మికతను, ధార్మికాసక్తిని నిండు సభలో అవమానించి, అవహేళన చేసేవారు. ఉదాహరణకు ముహమ్మద్ సుల్తాన్ సంబంధం విషయంలో తన తాతగారిని దర్బారులో దర్శించుకున్నప్పుడు, అతను (ఒక రకమైన) ఎర్రటి పట్టుబట్ట (బాఫ్త) తలపాగాను ధరించి ఉన్నాడు. అది చూసిన చక్రవర్తి, సభికులు, దర్బారు ధార్మికవేత్తలు అతన్ని బాగా అవహేళన చేసి పరిహసించారు. రకరకాల విమర్శనా బాణాల్ని సంధించారు. ఈ వివరాలన్నీ ఔరంగజేబ్ వ్రాసిన ఒక లేఖలో ఉన్నాయి. దానికి అతనేం సమాధానమివ్వాలి? ఎవరో ఒక ధార్మికవేత్తను నిలబెట్టి ఇలాంటి వస్త్రం, ధార్మిక శాస్త్రానుసారం నిషేధితం కాదని నిరూపించడమేకదా! అతనదే చేశాడు.

దాన్ని వదిలేయండి. కాని ఒక వ్యక్తి ధార్మిక భావనల్ని కించపరచడం, పరిహసించడం నేరం కాదంటారా? అది నిస్సందేహంగా నేరమే అయితే, షాజహాన్ అతని సభికులు ఈ నేరానికి పాల్పడ్డారని మనం అంగీకరించక తప్పదు. ముహమ్మద్ సుల్తాన్ ఈ సంఘటనను ముక్తసరిగా ప్రస్తావించాడు. అయితే దానిపై ఔరంగజేబ్ అతనికి రాసిన లేఖ ఇలా ఉంది :

"..... నీ తలపై ఉన్న పట్టుబట్ట తలపాగాను చూసి అది (షరీయతు రీత్యా) ఆమోదిత మేనా? అని ప్రభువుల వారు ప్రశ్నించడం, ఈ సందర్భంలో నీ సమాధానం నీ ఉత్తరం ద్వారాను మరియు ఈ నెల 7వ తేదీ గురువారం రోజున ఈసా బేగ్ వ్రాసిన అర్జీ ద్వారాను వివరంగా తెలిసివచ్చింది. "ఒక విషయానికి ఎన్నో కోణాలున్నప్పుడు దాన్ని కేవలం ఒక పరిహాసంగా తీసుకోవాల్సింది కాదు). ఈ వ్యవహారంలో ప్రభువులవారు దర్బారు ఉలమాల (ధార్మిక పండితుల)తో ఏమడిగారో, ఏ ధార్మిక పండితుడు నిన్ను తగ్గుస్వరంలో సంబోధిం చాడో, ఇంకా ప్రభువుల వారు స్వయంగా తమ పవిత్ర నాలుకతో ఈ వ్యవహారంలో ఏ

మాటలన్నారో వివరంగా నీ అర్జీలో పేర్కోవాల్సి ఉండేది. ప్రభువుల వారి ఈ వాక్యాలు "ఒక సంవత్సరం నుండి ఈ రకమైన దస్తార్ (తలపాగా) బుర్హాన్‌పూర్‌లో (షరీయత్తు రీత్యా) ఆమోదితమయ్యిందని, అనుమతికి సంబంధించిన ఈ ఉల్లేఖనం కూడా ఏడాది క్రితమే బుర్హాన్‌పూర్ చేరిందని, బహుశ కొంతకాలం తరువాత అది నిషేధితమవుతుందేమో" అనడం అసంతృప్తిని, అసహనాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

ఇలాంటి మాటల్ని ప్రాముఖ్యత లేనివిగా తలంచి ఊరకుండిపోయిన నా సుపుత్రునిపై ఆశ్చర్యం వేస్తుంది. ఎప్పుడైతే ప్రభువులవారు ఈ విషయంలో దర్బారు ధార్మిక పండితుల్ని సంప్రదించారో అప్పుడు నీవు, "ఇది ధర్మసమ్మతమైనదేనని, దీని గురించిన అనుమతిని చూపిస్తానని" గట్టిగా నొక్కి చెప్పాల్సింది. ఇలాంటి విషయాల కోసమనే నీకు తోడుగా పంపిన షేఖ్ నిజాంను సంప్రదించి, అనుమతి గురించి లిఖితపూర్వకంగా సమర్పించాల్సింది. ఇప్పుడు కూడా అవకాశం జారిపోలేదనుకుంటే, షేఖ్ నిజాం ఇక్కడ మన దర్బారులో ఆ విషయానికి సంబంధించి అనుమతిని విడమరచి ఎలా చెప్పారో, అదేవిధంగా ధార్మిక గ్రంథాల ఆధారంగా అక్కడ కూడా దాన్ని విడమరచి చెప్పేవారు. ఇంకా నీకు బాగా అవగాహన కలిగించి సమాధానయోగ్యునిగా చేసేవారు (లేక ఆయనే దీనికి సమాధానం ఇచ్చేవారు) - "నీలాంటి వానితో ఇలాంటి పొరపాటు జరుగుతుందని మేము ఊహించికూడా ఉండలేద"ని ప్రభువులవారు అన్నది ఎంత పెద్దమాట." (రుఖ్ఆత్ ఆలంగీర్ లేఖ నెం. 7/177- ముఖద్దమ... నజీబ్ అష్రఫ్ పే. 226-227)

ఔరంగజేబ్ ధార్మిక భావనల్ని ఎలా పరిహసించేవారు, ఎలా అవహేళన చేసేవారు అనేదానికి పై విషయం ఒక సామెత మాత్రమే. వారసత్వం కోసం జరిగిన అంతర్యుద్ధాల్లో ఔరంగజేబ్‌ను ఏవిధంగా హింసించింది, ఏ విధంగా అవహేళన, అగౌరవపరిచింది, అతన్నెంతగా కలవరానికి, సంక్షోభానికి గురిచేయడం జరిగిందో ముమ్ముందు మీరే చదువు తారు.

## బుర్హాన్‌పూర్ కర్మాగారం :

మొగలుల కాలంలో చక్రవర్తులు, రాకుమారులు, దర్బారు నాయకులు తమ దుస్తుల కోసం తమ స్వంత కర్మాగారాల్ని స్థాపించుకునేవారు. ఫలితంగా భారతదేశంలో ఈ నేత కళ పురోగమన దిశలో పయనించసాగింది. బుర్హాన్‌పూర్‌లో కూడా షాజహాన్, జహాం ఆరా, ఔరంగజేబ్ మొదలగువారి కర్మాగారాలుండేవి. షాజహాన్ ఔరంగజేబ్‌పై అసంతృప్తుడైన కారణంగా, అతని ఫ్యాక్టరీని కూడా మంచి స్థితిలో ఉండనివ్వలేదు. అతని ఫ్యాక్టరీలోని మంచి వర్కర్లందరినీ తన ఫ్యాక్టరీ, జహాంఆరా ఫ్యాక్టరీలో బదిలీచేశాడు. ఫలితంగా ఔరంగజేబ్ ఫ్యాక్టరీలో తయారయ్యే బట్ట ఆలస్యంగాను, క్వాలిటీలో కూడా అంత బాగుండకపోయేది. ఒకసారి షాజహాన్ తనకు బుర్హాన్‌పూర్‌లో తయారైన కొన్ని తానులు (బట్టలరేకులు) కావాలని ఆదేశించినప్పుడు, తన ఫ్యాక్టరీలో తయారైవున్న బట్టనంతా పంపుతూ తన ఫ్యాక్టరీ పరిస్థితిని వివరించాడు. దానిపై కూడా షాజహాన్‌కు కోపం వచ్చేసింది.

మొత్తానికి దారా, అతని సన్నిహితుల చాడీల కారణంగా షాజహాన్ ఔరంగజేబ్‌తో పూర్తిగా విముఖుడై, ప్రతి చిన్న విషయానికి అతన్ని దూషించడం, చీత్కరించడం, అవహేళన, అవమానపరచడం తన దైనందిన చర్యగా మార్చుకున్నాడు.

## మీర్ జుమ్లా వ్యవహారం :

మీర్ ముహమ్మద్ సయీద్ మీర్ జుమ్లా, ఉర్దిస్తాన్ (అస్ఫహాన్, ఈరాన్)కు చెందిన తరతరాలుగా వస్తున్న వర్తక కుటుంబానికి చెందినవాడు. అతను ఇరాన్‌కు చెందిన ఇతర వర్తకులతో కలిసి 1620-21లో గోల్కొండ వచ్చాడు. విలువైన వజ్రాలతో, అతనికి అవినాభావ సంబంధముండేది కనుక అతను త్వరలోనే దర్బారులో స్థానం సంపాదించుకున్నాడు. మెల్ల మెల్లగా అతను ఎంత ప్రాబల్యాన్ని సంపాదించుకున్నాడంటే, అబ్దుల్లా ఖుతుబ్ షా అతన్నే తన ప్రధానమంత్రిగా చేసుకున్నాడు. ఆ తరువాత అతను కర్ణాటక ప్రాంతాల్ని జయించదలిచి నప్పుడు, అబ్దుల్లా ఖుతుబ్ షా అతన్నే ఆ సైన్యాలకు సేనాధిపతిగా నియమించాడు. ఈ ఈరాని వర్తకుడు కర్ణాటక ప్రాంతంలో చేరి, వజ్రాలతో నిండిన బంగారు భూమిని ఆక్రమించుకోవడంలో కృతార్థుడయ్యాడు. అతని మృదువర్తనంతో అతని సారథ్యంలో నున్న సైన్యం కూడా అతనంటే పడిచచ్చేది. కర్ణాటకలో విలువైన వజ్రాల రూపంలో లభించిన ధన సంపద, సువిశాలమైన అతని వ్యాపార సంబంధాలు, కర్ణాటకలోని వివిధ గనులలో లభించిన వజ్రాలు, విలువైన రాళ్ళు, అతని కీర్తి ప్రతిష్ఠల్ని ఇనుమడింపజేశాయి. చివరికతను గోల్కొండలో తిరుగులేని నాయకునిగా ఎదిగాడు. దీని ఫలితంగా అసూయపరులు అతనికి వ్యతిరేకంగా అబ్దుల్లా ఖుతుబ్‌షాను బెదిరించసాగారు. మీర్ జుమ్లా ఎంతగా ఎదిగిపోయాడంటే అతని ముందు అబ్దుల్లా ఖుతుబ్ షా విలువ కూడా లేకుండా పోయిందని ఉద్రేకపరిచారు. ఫలితంగా అబ్దుల్లా ఖుతుబ్ షా అతన్ని అణచి ఉంచాలని, అతన్ని బలహీనపర్చాలని, సాధ్యమైతే అతన్ని బంధించాలని ప్రయత్నాలు ప్రారంభించాడు. ఖుతుబ్ షాను ఎదుర్కోలేని మీర్ జుమ్లా ఒకవైపు ఈరాన్ చక్రవర్తి సహాయాన్ని, వేరొకవైపు బీజాపూర్ సహాయాన్ని, మూడవ వైపు మొగలుల సహాయాన్ని అర్థించాడు. ఈరాన్ మరియు బీజాపూర్ వాళ్ళు వెంటనే అతని సహాయానికి హామీ ఇచ్చారు. కాని ఔరంగజేబ్ సర్వస్వతంత్రుడు కాదు, దర్బారు పరిస్థితులేమిటో అతనికి బాగా తెలుసు. అందుకని మీర్ జుమ్లా అభ్యర్థనను షాజహాన్ వద్దకు అనుమతి కోసం పంపించాడు. షాజహాన్ నుండి అనుమతి వచ్చిన తరువాత మీర్ జుమ్లాకు అభయమిస్తూ వార్త పంపించాడు. ఇక వేరొకవైపు గోల్కొండ ఖుతుబ్‌షా తన ప్రధానమంత్రే గనక మొగలులతో కలసిపోతే, తన రహస్యాలన్ని బట్టబయలైపోతాయనే భయంతో, అతన్ని బుజ్జగించడం మొదలెట్టాడు. ఈ విషయం కూడా ఔరంగజేబ్ తండ్రికి తెలిపాడు. స్వయంగా మీర్ జుమ్లా కూడా ఏకంగా మొగలులతో కలవడానికి సిద్ధంగా లేడు. ఈ విధంగా తన రక్షణ ఏర్పాట్లు చేసుకొని, సాధ్యమైనంత కాలం స్వతంత్రంగా ఖుతుబుల్ ముల్క్ ప్రాంతంలోనే ఉండాలని కోరుకున్నాడు. అతనికే భయం లేదని,

అతనికెలాంటి నష్టం జరుగదని ఖుతుబుల్ ముల్క్ హామీ ఇచ్చిన తరువాత అతను కర్ణాటక ప్రాంతం నుండి గోల్కొండకు వచ్చాడు. కాని కొన్ని రోజులున్న తరువాత దర్బారు పరిస్థితులు అనుమానాస్పదంగా ఉండడంతో, తిరిగి కర్ణాటక వెళ్ళిపోయాడు. మీర్ జుమ్లాను ఔరంగజేబ్ సంపూర్ణంగా సంతృప్తి పరచనందునే అతను మొగలుల వద్దకు రాక కర్ణాటకు వెళ్ళాడనుకొనిన షాజహాన్, ఔరంగజేబ్‌ను కోపగించుకున్నాడు. కాని ఔరంగజేబ్ ఎంత ప్రయత్నించినా మీర్ జుమ్లా రావడం లేదు. అసలతను కాలక్షేపం చేయదలిచాడు. అతను ద్వంద్వ నీతిని అవలంబి స్తున్నాడు. మొగలుల భయం చూపించి, ఖుతుబుల్ ముల్క్ నుండి సురక్షితంగా ఉండదలి చాడు. ఈ విషయం కూడా ఔరంగజేబ్ షాజహాన్‌కు తెలిపేసి, ఏం జరుగుతుందో చూద్దామని నిరీక్షిస్తున్నాడు. ఎక్కువ కాలం గడవక ముందే, బీజాపూర్, గోల్కొండ వాళ్ళు మీర్ జుమ్లా తెలివితేటల్ని పసిగట్టి ఎలాగైనాసరే అతన్ని బంధించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఇకిప్పుడు మీర్ జుమ్లాకు వణుకుపుట్టింది. తానిక సురక్షితంగా ఉండాలంటే మొగలులను ఆశ్రయించడం ఒక్కటే మార్గం. అందుకని అతను ఔరంగజేబ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభించాడు. మీర్ జుమ్లా ఇకిప్పుడు నిష్కల్మషంగానే వస్తున్నాడని గుర్తించిన ఔరంగజేబ్ తండ్రికి ఈ విషయం తెలుపుతూ, మీర్ జుమ్లాను దర్బారుకు తీసుకుపోవడానికి ఒక గౌరవ నీయుడైన వ్యక్తిని పంపించమని ఔరంగజేబ్ రాశాడు.

కాని దర్బారు నుండి పంపబడిన ఖాజి ఆరిఫ్ ఇంకా దక్కన్ చేరుకోకముందే, ఖుతుబుల్ ముల్క్ కొన్ని కారణాలతో మీర్ జుమ్లాకు గోల్కొండలో ప్రాతినిధ్యం వహిస్తున్న అతని కుమారుడు ముహమ్మద్ అమీన్‌ను సపరివారంగా బంధించి, అతని ఆస్తినంతా జప్తుచేసుకున్నాడు. ముహమ్మద్ అమీన్ తనను బంధిస్తున్నప్పుడు, తను తన తండ్రి మీర్ జుమ్లా మొగలు ఉద్యోగంలో చేరినట్లున్న కాగితాన్ని చూపించినా, ఖుతుబుల్ ముల్క్ దాన్ని లక్ష్యపెట్టలేదు. ఈ వార్త ఔరంగజేబ్‌కు చేరినప్పుడు, మొగలు గౌరవాన్ని కాపాడడానికి ముహమ్మద్ అమీన్‌ను ఖుతుబుల్ ముల్క్ నుండి విడిపించుకోవడం అనివార్యంగా భావించాడు. దీనికి తగిన పద్ధతి ఏమిటంటే షాజహాన్ ఇలాంటి ఆదేశాలిస్తూ ఖుతుబుల్ ముల్క్‌కు ఒక ఫర్మానా పంపాలి, అతను ఈ ఫర్మానాను శిరసావహించడానికి నిరాకరించినప్పుడు, సైనిక బలంతో తమ ఆదేశాన్ని అంగీకరింపజేయాలి. అందుకని ఈ విషయంగా ఔరంగజేబ్ షాజహాన్‌కు ఒక లేఖ వ్రాశాడు. అందులో పరిస్థితుల్ని వివరిస్తూ తానేం చేయాలో ఆదేశించ మని కోరాడు. దానికి షాజహాన్ సైన్యాన్ని సమీకరించుకొమ్మని, తన ఆదేశపాలన చేయనప్పుడు ఖుతుబుల్ ముల్క్‌పై దాడి జరుపమని ఆదేశించాడు. ఈ సందర్భంలోనే బీజాపూర్, గోల్కొండ ప్రభువులు మొగలు సామ్రాజ్యంతో ఏది మాట్లాడదలచినా దక్కన్ గవర్నరు మధ్యవర్తిత్వంలోనే మాట్లాడాలని ఆదేశించవలసిందిగా కూడా ఔరంగజేబ్ తండ్రిని కోరాడు. కాని ఔరంగజేబ్ విన్నవించుకున్న తరువాత కూడా షాజహాన్ అలాంటి ఆదేశాల్ని ఆ ఇద్దరు పాలకులకు జారీ చేసినట్లు దాఖలాలు లేవు. దానికి భిన్నంగా బీజాపూర్, గోల్కొండ రాయబారులు ఢిల్లీ దర్బారులో ఉండేవారు. వారు దారాను మచ్చికచేసుకొని, నిరంతరం అతని కుట్రల్లో భాగం

పంచుకుంటూ ఏ విధంగానైనా సరే దక్కన్ సూబేదారును కించపరచాలని, అగౌరవపరచాలని, అతని మాటను చెల్లకుండా చేయాలని సతతం ప్రయత్నిస్తూ ఉండేవారు. దక్కన్ సూబేదారు విలువ హీనత, బలహీనత, మరియు అతని నిస్సహాయతలోనే వారికి జీవితముంది. ఈ ఆలోచన రాగానే ఔరంగజేబ్, కర్ణాటక విషయంలో దెబ్బతిన్న వాడు గనక, ఇక్కడ కూడా ఖుతుబుల్ ముల్క్ రాయబారి, దారా వగైరాలతో కలసి షాజహాన్ ఆదేశాన్ని మళ్ళింపచేస్తే కర్ణాటక లాగే ఇప్పుడు కూడా తాను అభాసుపాలు కావలసి వస్తుంది. అందుకని సైన్యాన్ని దాడికి ఆదేశించేముందు ఔరంగజేబ్ మరోసారి షాజహాన్‌తో బీజాపూర్, గోల్కొండవాళ్ళు ఏదైనా మాట్లాడదలచుకుంటే దక్కన్ గవర్నరు ద్వారా మాట్లాడమని ఆదేశించమని కోరినప్పటికీ, షాజహాన్ అలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. ఔరంగజేబ్ పరిస్థితి అత్యంత క్లిష్టంగా, దయనీయంగా ఉంది. దాడి చేయడానికి, యుద్ధం చేయడానికైతే అతను ఆదేశించబడతాడు. కాని దక్కన్ గవర్నరుగా తనతో సంప్రదించకుండానే, తన పరిస్థితి ఏమిటో తెలుసుకోకుండానే, యుద్ధానికి, సంధికి సంబంధించిన తీర్పులు గైకొనబడతాయి. బీజాపూర్, గోల్కొండ వారితో శత్రువులుగా తాను యుద్ధం చేస్తున్నాడు, కాని దర్బారులో నున్న ఆ బీజాపూర్, గోల్కొండ రాయబారులు, దారాను మచ్చికచేసుకుని, షాజహాన్‌తో తమకిష్టమైన ప్రయోజనకరమైన తీర్పులు, అనుమతులు పొందుతున్నారు. ఔరంగజేబ్‌ను కించపరచాలని, అతన్ని అగౌరవ పరచాలని, అతనికెలాంటి విలువలేదని నిరూపించాలని దారా వారికి అన్నివిధాలుగా సహక రిస్తున్నాడు. ఇక్కడ కూడా అదే జరిగింది.

షాజహాన్ ఇచ్చిన ఆదేశాల్ని, హెచ్చరికల్ని సూచిస్తూ ఔరంగజేబ్ ఖుతుబుల్‌ముల్క్‌కు లేఖ వ్రాశాడు. ఆ తరువాత షాజహాన్ ఆదేశానుసారం 1655 డిసెంబర్ 20న ఔరంగజేబ్ తన కుమారుడు ముహమ్మద్ సుల్తాన్‌ను సైన్యంతో హైద్రాబాద్ పంపించాడు. అతను 1656 జనవరి 6న నాందేడ్ చేరుకున్నాడు. కాని ఖుతుబుల్ ముల్క్ ఔరంగజేబ్ లేఖనూ లక్ష్యపెట్ట లేదు. రాకుమారుడు సైన్యసమేతంగా నాందేడ్ చేరుకున్నా అతను పట్టించుకోనేలేదు. దానికి కారణం ఏమై ఉంటుంది? ఔరంగజేబ్ ఆదేశ ఆజ్ఞల్ని పట్టించుకోకుండానే, దారా మొదలగు వారి సిఫారసుతో తన పని వెళ్ళదీసుకోవచ్చనే సంపూర్ణ విశ్వాసం అతనికుంది. అయితే ఔరంగజేబ్ నియమాల్ని కఠినంగా ఆచరించేవాడు, తన విధి ఏమిటో బాగా ఎరిగినవాడు, ఖుతుబుల్ ముల్క్ మీర్ జుమ్లా కుమారుణ్ని అలాగే బందీగా ఉంచి తన ఆదేశాల్నే కాదు, స్వయంగా షాజహాన్ జారీ చేసిన ఆదేశాల్ని కూడా ఉల్లంఘిస్తున్నాడు. దాంతోపాటే బీజాపూర్ వాళ్ళతో సైనిక ఒప్పందానికి ప్రయత్నిస్తున్నాడు. ఇది గమనించిన ఔరంగజేబ్ రాకుమారున్ని ఇక ముందుకు సాగాల్సిందిగా ఆదేశించాడు. ఇంకా షాజహాన్‌కు కూడా ఈ విషయాల్ని వివరంగా తెలిపాడు.

యువకుడైన రాకుమారుడు ఒంటరిగా గోల్కొండ ప్రాంతంలో ప్రవేశించడం ఔరంగ జేబ్‌కు సముచితమనిపించలేదు. అందుకని తాను కూడా ఔరంగాబాద్ నుండి బయలుదేరాడు. తాను బయలుదేరుతున్న విషయాన్ని కూడా షాజహాన్‌కు తెలిపాడు. ఔరంగజేబ్ శీఘ్రంగా

ప్రయాణిస్తున్నాడు, మార్గమధ్యంలో ఉండగానే ఖుతుబుల్ ముల్క్ మీర్ జుమ్లా కుమారున్ని, అతని పరివారం సమేతంగా విడుదల చేసినట్లు తెలిసిందని రాకుమారుడు రాసిన లేఖ ముడుతుంది. ఔరంగజేబ్, ఖుతుబుల్ ముల్క్‌కు జారీచేసిన ఆదేశాల్లో మీర్ జుమ్లా పరివారం, కుమారున్ని విడుదల చేయడమొక్కటే కాకుండా, మీర్ జుమ్లాకు సంబంధించి జప్తు చేసుకున్న ధనసంపదనంతా కూడా వాపసు చేయాలనేది కూడా ఒకటి. కాని ఖుతుబుల్ ముల్క్ ఈ షరతును పూర్తి చేయలేదు. అయితే అతను మొదటి షరతును పూర్తిచేశాడు గనక ఇక రెండవ షరతును కూడా పూర్తి చేస్తాడని ఔరంగజేబ్ భావించాడు. ఈ విషయంలో ఇంకే చర్య గైకొనాలో ఆదేశించుటకు గాను జనవరి 9న షాజహాన్‌కు అతనొక లేఖ వ్రాసి ఉన్నాడు. ఆ లేఖకు జవాబును నిరీక్షిస్తుండగానే "తాము హుసేన్ సాగర్ ప్రాంతాన్ని సమీపించామని, తామెలాంటి సైనిక చర్యను చేపట్టక ముందే, ఖుతుబుల్ ముల్క్ సైన్యం, అశ్విక దళం తమపై దాడులు ప్రారంభించాయని, తాము కేవలం తమ ఆత్మరక్షణ చర్యలతోనే సరిపెట్టు కుంటున్నామని" తెలుపుతూ రాసిన రాకుమారుని లేఖ ముట్టింది. ఇక వెంటనే ఔరంగజేబ్ హైదరాబాద్‌కు బయలుదేరాడు.

## ఖుతుబుల్ ముల్క్ ద్వంద్వ నీతి :

ఆ సమయంలో ఖుతుబుల్ ముల్క్ స్పష్టంకాని ఒక ద్వంద్వ నీతిని అవలంబించాడు. ఒకవైపు అతను మీర్ జుమ్లాకు సంబంధించిన ధనసంపదనంతా తిరిగి ఇచ్చేశాడు, రాకుమారుని వద్దకు తన రాయబారుల్ని పంపుతూ సంధికి, శాంతికి, తప్పుల మన్నింపునకు ప్రాధేయపడుతున్నాడు, వేరొకవైపు అతని సైన్యం సమయం చిక్కినప్పుడెల్లా రాకుమారుని సైన్యంపై దాడి జరుపుతున్నది. ఇలా ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఖుతుబుల్ ముల్క్ పంపిన రాయబారులతో, తన తండ్రి వచ్చేంత వరకు తానేమీ నిర్ణయం తీసుకోలేనని రాకుమారుడు చెప్పేశాడు. కాని హుసేన్ సాగర్ వద్దనే తన సైన్యాన్ని ఆపడంతో రాకుమారుని సైన్యం అసురక్షితమై, ప్రమాదాల్ని ఎదుర్కొనవలసివచ్చింది. ఖుతుబుల్ ముల్క్ సైన్యం జరుపు తున్న దాడులకు, మందుగుండుకు అతని సైన్యం బలికావలసి వస్తుంది. అందుకని తన రక్షణకోసం జనవరి 4న రాకుమారుడు హైద్రాబాద్‌లో ప్రవేశించాడు. అంతకుముందే ఖుతుబుల్ ముల్క్ హైదరాబాద్‌ను విడిచి, గోల్కొండకు చేరుకున్నాడు. సైన్యాన్ని సమీకరించు కొని, కోట రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకొని ఉన్నాడు. కోటలో నుండే అతని సైన్యం బయటికి వస్తూ రాకుమారుని సైన్యంపై దాడులు జరుపుతూ ఉంది. వేరొకవైపు ఖుతుబుల్ ముల్క్ సైనిక సహాయం కోసం ఆదిల్‌షాకు మరో లేఖ వ్రాశాడు. ఆ సైన్యంకోసం నిరీక్షిస్తున్నాడు. కాని అతని సైన్యం మాత్రం, హుసేన్‌సాగర్ వద్ద, హైదరాబాద్‌లో నున్న రాకుమారుని సైన్యంపై ఫిరంగులతో అగ్ని వర్షం కురిపించసాగింది. ఈ విధంగా గోల్కొండ ముట్టడి మరియు దాడికోసం ఖుతుబుల్ ముల్క్, ఔరంగజేబ్‌కు అవకాశం కల్పించాడు.

ఈ పరిస్థితుల్లో ఫిబ్రవరి 6న ఔరంగజేబ్ హైదరాబాద్ చేరుకున్నాడు. కాని ఔరంగజేబ్

ఇలా చేరుకున్నాడో లేదో, గోల్కొండ కోట నుండి బయటికి వచ్చిన ఖుతుబుల్ ముల్క్ సైన్యం, అశ్విక దళం, ఫిరంగులు తుపాకులతో ఔరంగజేబ్ సైన్యంపై విరుచుకు పడింది. గత్యంతరం లేని పరిస్థితిలో, 15 రోజుల సుదీర్ఘ ప్రయాణం చేసి అలిసిపోయిన సైన్యంతోనే ఈ దాడిని ఔరంగజేబ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే దక్కన్ సైన్యం ఎంతో సేపు నిలువలేక పోయింది. పరాజయం పాలై కొందరు అడవి వైపునకు, కొందరు కోటలోపలికి పారి పోయారు. ఈ విజయం తరువాత ఔరంగజేబ్ తన గుడారంలోకి వచ్చేశాడు.

## గోల్కొండ ముట్టడి :

మరుసటి రోజు గోల్కొండ ముట్టడి ప్రారంభమయింది. ఔరంగజేబ్ కేవలం మూడు ప్రక్కల నుండే కోట దిగ్బంధం చేయగలిగాడు. దీనికి కారణం ఏమిటంటే అతని వద్ద తగినంత సైన్యం లేదు. అందుకని నలువైపుల్నుండి దిగ్బంధం చేయలేదు, మిగిలిన నాయకుల సహాయ సైన్యాలు ఇంకా చేరలేదు, కోట ముట్టడి కోసం కావలసిన ఫిరంగులు, ఇతర సరంజామా అతని వద్ద లేదు. ఖుతుబుల్ ముల్క్‌ను సమాప్తం చేయడం, లేక గోల్కొండ పతనపు ఉద్దేశంతో అతను బయలుదేరలేదు. అదీగాక షరతుల్ని అంగీకరించకపోతేనే, సైనిక చర్యను గైకొనాలనేది షాజహాన్ ఆదేశం. అందుకోసమే అతను ఔరంగజేబ్‌ను దీనికోసం ఆదేశిస్తూ, షాయిస్తఖాన్ మొదలుగాగల నాయకుల్ని తమ తమ సైనిక దళాలతో వెంటనే దక్కన్ చేరుకోవాల్సిందిగా ఆదేశించాడు. (బాద్‌షాహ్ నామ-ముహమ్మద్ వారిస్, పేజి 181, ముఖద్దమ .... నజీబ్ అష్రఫ్, పేజి 296)

మొత్తానికి దాదాపు రెండు నెలల (ఫిబ్రవరి 7నుండి మార్చి 30) వరకు ఈ దిగ్బంధం కొనసాగింది. ఈ మధ్యకాలంలో ఖుతుబుల్ ముల్క్ సంధి ప్రయత్నాలు, రాయబారాలు నడుపుతూనే ఉన్నాడు. వేరొకవైపు దర్బారులో నున్న తన రాయబారి ద్వారా దారా ఇంకా ఇతర నాయకులకు విలువైన కానుకల్ని సమర్పించి, షాజహాన్‌తో తన తప్పుల మన్నింపుకోసం సిఫారసు చేయడానికి మచ్చిక చేసుకున్నాడు. వారి ప్రయత్నాలు ఫలించాయి. “దయానుగ్రహాల కారణంగా తప్పుల్ని మన్నిస్తున్నామంటూ” ఖుతుబుల్ ముల్క్ పేర షాజహాన్ రాసిన లేఖ ఔరంగజేబ్ ద్వారా ఖుతుబుల్ ముల్క్‌కు అందజేయమని ఔరంగజేబ్‌కు ముట్టింది. అప్పటి వరకే ముట్టడి కారణంగా, ఔరంగజేబ్ తన అత్యధిక షరతుల్ని అంగీకరింపజేసు కున్నాడు. ఇక సంధి కుదరడం సమీపంలోనే ఉన్న కారణంగా ఔరంగజేబ్ ఆ లేఖను, ఖుతుబుల్ ముల్క్‌కు పంపకుండా తన వద్దనే ఆపుకున్నాడు. మరియు ఈ విషయాన్ని వెంటనే షాజహాన్‌కు తెలియపరిచాడు. షాజహాన్ కూడా ఔరంగజేబ్ ప్రదర్శించిన ఈ దూరదృష్టిని అత్యంతంగా మెచ్చుకున్నాడని దర్బారు చరిత్రకారుడు వ్రాశాడు.[5]

సంధిప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ మధ్యలో ఒకసారి ఖుతుబుల్ ముల్క్ తన వృద్ధ తల్లిని, ఔరంగజేబ్‌ను దర్శించుకోవడం కోసం, సంధి విషయాలు మాట్లాడడం కోసం పంపించాడు. ఆమె సంధి షరతుల్ని ప్రతిపాదిస్తూ, దయానుగ్రహాలు చూపాలని,

తన కుమారుని తప్పిదాలను క్షమించాలని, కనీసం సంధి కుదిరేవరకైనా సైనిక చర్యల్ని ఆపాలని కోరుకున్నది.[6] దానికి ఔరంగజేబ్ అంగీకరించాడు.[7] ఔరంగజేబ్ తన సైన్యానికి సైనిక చర్యల్ని ఆపి ప్రశాంతంగా తమ తమ స్థావరాల్లోనే ఉండాల్సిందిగా ఆదేశించాడు. కాని విచిత్రమేమిటంటే ఇటు సంధి ప్రయత్నాలు నడుస్తున్నప్పటికీ, ఔరంగజేబ్ సైన్యాలు సైనిక కార్యకలాపాలకు స్వస్థిపలికి ప్రశాంతంగా ఉన్నప్పటికీ, ఖుతుబుల్ ముల్క్ సైన్యాలు మాత్రం దాడికి, కవ్వింపు చర్యలకు, పాల్పడుతునే ఉన్నాయి. దానితో మొగలు సైన్యాలకు నష్టం వాటిల్లసాగింది.[8] ఇంతగా కవ్వింపు జరిగినా ఔరంగజేబ్ మాత్రం ప్రశాంతంగానే ఉన్నాడు. అప్పటి వరకు 'ఓస' కోట నుండి పెద్ద ఫిరంగులు కూడా వచ్చేశాయి, ఇతర సూబాల సైన్యాలు కూడా చేరాయి. అయినా ఔరంగజేబ్ క్రోధానికి బదులు ఖుతుబుల్ ముల్క్ పట్ల ఔదార్యాన్నే ప్రదర్శిస్తున్నాడు. కేవలం తాను ఖుతుబుల్ ముల్క్ వృద్ధ తల్లికి చేసిన వాగ్దానం కారణంగాను, ఆమె విన్నపాన్ని గౌరవించేందుకు[9] మాత్రమే అతను నిరీక్షి స్తున్నాడు. వారు తమ వాగ్దానాన్ని పూర్తి చేస్తారని ఎదురుచూస్తున్నాడు.

## షాజహాన్ ఆదేశం :

ఈ సంధి షరతులు, ప్రయత్నాలు నడుస్తుండగానే అకస్మాత్తుగా "ముట్టడిని సమాప్తం చేసి, ఖుతుబుల్‌ముల్క్ ప్రాంతాన్నంతా అతనికి అప్పగించి, ఔరంగజేబ్ వెంటనే తన సూబాకు మరలాలని" ఔరంగజేబ్ పేర షాజహాన్ లేఖ ముట్టింది. ఈ లేఖ రావడానికి పూర్వపరాలు ఏమిటంటే ఖుతుబుల్ ముల్క్ రాయబారి అబ్దుస్సమద్, దారా, అతని అనుయాయుల సమూహాన్ని తమ వైపు తిప్పుకొని ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా షాజహాన్‌ను పురిగొల్పాడు. ఖుతుబుల్ ముల్క్ ప్రతి షరతును అంగీకరించాడని, ఔరంగజేబ్ మాత్రం అతనితో ఇంకా ధనాన్ని గుంజడానికి అక్కడ మకాం వేసి ఉన్నాడని, దాడి ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు లెక్కలేనన్ని వజ్రాలు ఇంకా ఇతర విలువైన వస్తువుల్ని కానుకల రూపంలో స్వీకరించాడని, ఈ విషయం కూడా చక్రవర్తికి తెలుపలేదని – ఈ విధంగా రకరకాలుగా ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా షాజహాన్‌ను నమ్మించడంలో కృతార్థులయ్యారు. ఇంకేముంది, ఏలాంటి విచారణ లేకుండానే, షాజహాన్ ఇలాంటి ఆదేశాల్ని జారీ చేయడమే కాకుండా, ఈ ఆదేశాన్ని బహిరంగంగా సైన్యానికంతటికీ వినిపించమని దూతల్ని ఆదేశించాడు. దీని ఫలితంగా, షాజహాన్ ఆదేశానుసారం ఖుతుబుల్ ముల్క్ కుమార్తెతో రాకుమారుడు సుల్తాన్ వివాహం జరుగక ముందే జనవరి 25న సర్వసైన్యాల్ని బయలుదేరి వెళ్ళాల్సిందిగా ఆదేశించవలసి వచ్చింది. సైన్యాలు వెళ్ళిపోయిన ఐదు రోజుల తరువాత మార్చి 25న మామూలుగా వివాహం జరుపాల్సి వచ్చింది.[10]

అకస్మాత్తుగా ఇలాంటి ఆదేశాలు జారీ కావడం వల్ల, ఔరంగజేబ్ గౌరవప్రతిష్ఠలకు, అతని ఆత్మాభిమానానికి గొప్ప దెబ్బ తగిలింది. అయితే తండ్రి కొడుకుల మధ్య ఏర్పడిన అనుమానం, అపనమ్మకాల సంఘటనల్ని వింటే, పై సంఘటన ఏమంత పెద్ద విషయంగా

కనబడదు. తండ్రి కొడుకు మధ్య ఏర్పడిన ఈ వివాదం, అపనమ్మకం, అపార్థాల కారణంగా షాజహాన్ అసలు ఔరంగజేబంటేనే ఓర్వలేకపోయేవాడు, అతన్ని విశ్వసించడానికి సిద్ధంగా లేడు. అతనికి వ్యతిరేకంగా ఏదిచెప్పినా వెంటనే నమ్మేసి, అతనికి వ్యతిరేకంగా నీచాతినీచమైన చర్యను చేపట్టడానికి కూడా వెనుకాడేవాడు కాదు. ఒక తండ్రికి శోభించని చర్యల్ని, ఔరంగ జేబ్‌కు వ్యతిరేకంగా షాజహాన్ ఎలా చేపట్టే వాడనే కొన్ని సామెతల్ని మీకు చూపించాల్సి ఉంటుంది. వాటి ద్వారా, స్వయంగా షాజహానే సోదరుల మధ్య అంతుర్యుద్ధానికి ఎలా బాటవేశాడో అర్థం చేసుకోవచ్చు.

## తండ్రీకొడుకుల మధ్య విభేదాలు :

గోల్కొండకు వ్యతిరేకంగా సైనిక చర్యను చేపట్టమని షాజహాన్ ఔరంగజేబ్‌కు ఆదేశించి నప్పుడే, ఈ యుద్ధంలో లభించే "వజ్రవైఢూర్యాలు" కేంద్ర ప్రభుత్వం అనగా షాజహాన్‌కు చెందుతాయని, ఇక నగదుగా లభించినవి మాత్రం ఔరంగజేబ్‌కు చెందుతాయని షాజహాన్ వాగ్దానం చేశాడు. ఆ నమ్మకం మీదనే ఔరంగజేబ్ ఇతరుల నుండి అప్పు తీసుకొని, యుద్ధ ఖర్చుల కోసం వినియోగించాడు. కాని యుద్ధం సమాప్తమైన తరువాత "ఔరంగజేబ్ లెక్కలేనన్ని విలువైన కానుకల్ని ఖుతుబుల్ ముల్క్ నుండి వసూలు చేసుకున్నాడని, దాని సమాచారం కూడా తనకు ఇవ్వలేదనే" లాంటి కొన్ని భావనల్ని ఏర్పరుచుకోవడం వల్ల, "నగదు వజ్ర వైఢూర్యాలు ఇంకా ఏది లభించిందో అదంతా కూడా ప్రభుత్వ ధనాగారంలో జమ చేయాల్సిం దిగా" షాజహాన్ ఆదేశించాడు. దీని ఫలితంగా ఔరంగజేబ్ దాదాపు ఇరవై లక్షలు అప్పుల పాలైపోయాడు. ఈ విషయాన్ని ఔరంగజేబ్ అత్యంత బాధగా, షాజహాన్‌కు ప్రధానమంత్రిగా నియుక్తుడైపోయిన మీర్ జుమ్లాకు (ముఅజ్జం ఖాన్) ఒక లేఖ ద్వారా తెలుపుకుంటాడు.[11]

షాజహాన్ అంతటితోనే ఊరుకోలేదు. ఔరంగజేబ్ పడినపాట్లు, యుద్ధరూపంలో అందించిన సేవలకు ప్రతిఫలంగా అతనికి ఒక లేఖ వ్రాస్తూ, "కానుకల రూపంలో నీకు ఏదైతే ముట్టిందో, అదంతా కూడా వెంటనే దర్బారుకు పంపాల్సిందిగా ఆదేశించాడు. ఫలితంగా ఔరంగజేబ్ తనకు, తన కుమారునికి కానుకలుగా ముట్టినవన్నీ చక్రవర్తికి పంపిం చాడు. దీనితో పాటుగా ప్రధానమంత్రి ముఅజ్జం ఖాన్‌కు (మీర్ జుమ్లా బిరుదు) ఈ వివరాలన్నీ తెలుపుతూ అత్యంత వ్యధాభరితంగా వ్రాసిన ఉత్తరాలు అధ్యయనం చేస్తే, కానుకలు దాచు కున్నాడని అతనిపై మోపిన నింద ఎంత నీచమైనదో, ఎంత ఆధార రహితమైనదో, అర్థమై పోతుంది. ఇంకా షాజహాన్ ఎంత వివేకహీనమైన కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడో కూడా అర్థమైపోతుంది.[12] దీనివల్ల ఔరంగజేబ్ ఆత్మాభిమానం ఎంత గాయపడిందో, అతనెంత మానసిక క్షోభకు గురిఅయ్యాడో, నలుగురిలో అతని పరువును ఎలా తీశారో అర్థం చేసుకో వచ్చు. అయినా అతను ఓర్పు సహనాల్ని విడనాడలేదు. విధేయత నుండి వైదొలగలేదు. ఔరంగజేబ్ ప్రధానమంత్రి పేర రాసిన ఉత్తరాల్ని చదివిన ప్రతి మనిషి, ఔరంగజేబ్ పట్ల సానుభూతి చూపకుండా ఉండలేదు. అతని ఓర్పు, సహనాల్ని, అతని విధేయతాభావాన్ని,

తండ్రిపట్ల అతనికి గల అపార గౌరవాభిమానాల్ని నిరాకరించలేరు. స్థలాభావ కారణంగా ఆ ఉత్తరాల్ని పేర్కొనలేకపోతున్నాం. అయితే ఈ చెడు ఇంతటితోనే ఆగిపోలేదు. అది పరిపాలనా వ్యవహారాలపై కూడా తన ప్రభావాన్ని చూపసాగింది. గోల్కొండ, బీజాపూర్ పరిపాలకులే కాకుండా ఇతరులు కూడా ఔరంగజేబ్ పరిస్థితి ఏమిటో, దర్బారులో అతని విలువేమిటో, అతని మాటకు, ప్రతిపాదనలకు దర్బారులో పట్టే గతేమిటో బాగా అర్థం చేసుకున్నారు. అందుకే వారు అతని ఆదేశాల్ని, నిర్లక్ష్యం చేయసాగారు. ఔరంగజేబ్‌కు ఇదెంతో కష్టకాలం. ఈ పరిస్థితిలో షాజహాన్ వేరే ఎవరైనా కుమారుడు ఆ స్థానంలో ఉండివుంటే, అతనీ పరిస్థితిని భరింపజాలకుండేవాడు. ఎప్పుడో తిరుగబడేవాడు. కాని ఔరంగజేబ్ అత్యంత గుండెనిబ్బరం గలవాడు, అసామాన్యమైన ఓర్పు, సహనాలకు ప్రతిరూపం కనుక ఒక విధేయుడైన కుమారుడు, సోదరుని లాగా తన తండ్రి, సోదరుడు తన పట్ల జరుపుతున్న ఈ అనాదర వైఖరిని ఈ దౌర్జన్యాల్ని, ఈ కుట్రల్ని, ఈ అవమానాల్ని, భరిస్తూ కూడా ఒక్కసారంటే ఒక్కసారి కూడా తిరుగబడలేదు, అవిధేయతను చూపలేదు, తన విధుల్ని విస్మరించలేదు. కఠిన పదాలతో కూడిన ఒక్క లేఖకూడా తన తండ్రికిగాని, సోదరునికి గాని వ్రాయలేదు. పరిస్థితులకు అత్యంత కలవరపడిపోయినప్పుడు, సహనాల హద్దులు కట్టలు తెంచుకుంటున్నాయను కున్నప్పుడు, తన మిత్రునికి కేవలం ఇలా తెలుపుకుంటాడు : "కష్టాలు, సంకటాలతో కూడుకున్న ఈ కాళరాత్రి సమాప్తమై, ఉషోదయం ఎప్పుడవుతుందో..."

## బీజాపూర్ యుద్ధం :

1636లో స్వయంగా షాజహాన్ ఆదిల్ ఖాన్‌తో అత్యంత మేలైన షరతులపై సంధి చేసుకున్నాడు. కాని గడిచిన ఈ ఇరవై సంవత్సరాలలో మొగలులకు బీజాపూర్ వాళ్ళతో సత్సంబంధాలు ఉండలేకపోయాయి. ఒకసారి ఆదిల్ ఖాన్ తన ప్రధానమంత్రికి మొగలు చక్రవర్తులిచ్చే "ఖానెఖాన్" బిరుదును ప్రసాదించినప్పుడు, రెండవసారి ఆచారాలకు విరుద్ధంగా బహిరంగ మైదానంలో ఏనుగుల పోరాటాన్ని ఆదిల్‌ఖాన్ నిర్వహించినప్పుడు, ఇది రాజరికపు అధికారాల్లో అనర్హమైన హస్తక్షేపంగా, నేరంగా పరిగణించి షాజహాన్ సంజాయిషి అడిగినప్పుడు, వెంటనే ఆదిల్ ఖాన్ క్షమాపణలు కోరడంతో సరిపోయింది. లేకపోతే 1656లో రగిలిన యుద్ధజ్వాలలు 1636లోనే రగుల్కొనేవి. అయితే ఈ క్షమాపణవల్ల, సంధిశాంతుల వల్ల ఆదిల్ ఖాన్‌కు ఎంతో లాభం చేకూరింది. షాజహాన్ అతనికి 'ఖాన్'కు బదులు 'షా' బిరుదును ప్రసాదించి, సమకాలీనుల్లో, సమస్థాయి పరిపాలకుల్లో అతనికి ఓ ప్రత్యేకత, ఒక విశిష్టతను ప్రసాదించినట్లయింది. వేరొకవైపు మొగలులతో శాంతి సామరస్యాల కారణంగా, అతను తన రాజ్యాన్ని అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు వ్యాపింపజేసుకోగలిగాడు. ఈ విధంగా దక్కన్ రాజ్యాలన్నిటిలో అన్నిటికన్నా సువిశాలమైన రాజ్యాధినేతగా, ప్రభావవంతమైన పరిపాలకునిగా గుర్తింపు పొందాడు.[13] అయినా అతనికి మొగలుల సామంతం, వారి విధేయత మింగుడుపడడం లేదు. వారి అడుగులకు మడుగు

లొత్తడం అతను భరించలేకపోతున్నాడు. వేరొకవైపు మొగలులు కూడా దక్కన్ అంతా తమ సామ్రాజ్యంలో కలవాలని ప్రగాఢ వాంఛ కలిగి ఉండేవారు. అందుకని దక్కన్ రాజ్యాలకు వ్యతిరేకంగా లభించిన ఏ ఒక్క అవకాశాన్ని వారు విడనాడదలచుకోలేదు. ఈ విషయం ఈ దక్కన్ పాలకులకు కూడా తెలుసు. అందుకని వారు ఒక వైపు బాహ్యంలో మొగలులకు విధేయత చూపినా, అంతరంగికంగా పరస్పరం మొగలులకు వ్యతిరేకంగా కుట్రలు కూడ పన్నేవారు. వారి ఈ ద్వంద్వ వైఖరే వారి పతనానికి కారణభూతమయింది. బీజాపూర్‌లో మొగలులకు వ్యతిరేకతలు ఏర్పడడానికి ఎన్నో కారణాలున్నాయి. మొగలులు గోల్కొండపై దాడి జరిపినప్పుడు, ఆదిల్ షా మొగలు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడు. అంతేగాక ఖుతుబుల్ ముల్క్ విన్నపంపై అఫ్జల్ ఖాన్ సారధ్యంలో ఇరువైవేల సైన్యాల్ని రహస్యంగా హైద్రాబాద్ పంపించాడు. ఇది తెలుసుకున్న ఔరంగజేబ్ తాను స్వయంగా హైదరాబాద్ బయలుదేరాడు. ఈ పరిస్థితి ఏర్పడగానే తన మోసం బయటపడుతుందేమోననే భయంతో ఆదిల్ షా గుట్టుగా తన సైన్యాన్ని వెనుకకు పిలిపించుకున్నాడు. బహిరంగంగా అతని వల్ల నష్టమేమీ జరుగలేదు గనక ఔరంగజేబ్ కూడా ఆ సమయంలో మౌనం వహించాడు. ఆదిల్ షా ఇంకొక పాచికను పారాడు. తన ఉద్యోగంలో నున్న సాహూజీ భోన్స్ల కుమారుడు శివాజీకి సహాయ సహకారాలందించి, మొగలు ప్రాంతాల్ని కొల్లగొట్టడానికి పురిగొల్పాడు. ఈ విధంగా మొగలుల దృష్టి తనవైపు నుండి మళ్ళించాలనేది అతని ఆలోచన. కర్ణాటక ప్రాంతంలో మీర్‌జుమ్లాకు చెందిన 80 మైళ్ళ ప్రాంతాన్ని ఖుతుబుల్ ముల్క్ ఒకప్పుడు ఎలా ఆక్రమించుకొన్నాడో, తను కూడా అలాగే ఆక్రమించుకోవాలని తన ఉద్యోగి సాహూజీను పురిగొల్పాడు. ఇది తెలుసుకున్న ఔరంగజేబ్, ఆ ప్రాంతానికి చెందిన తన అధికారిని వెంటనే వెళ్ళి మీర్ జుమ్లా మనిషి అయిన ముహమ్మద్ హాషింకు సహాయం చేయమని పంపించాడు. అతను కర్ణాటక వెళ్ళి సాహూను ఓడించి పారద్రోలాడు.

ఆదిల్ షా మొగలు సరిహద్దులో ఒక కోట నిర్మాణం చేపట్టాడు. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ఔరంగజేబ్, షాజహాన్ అనుమతితో ఈ కోటను పడగొట్టించాడు. గోల్కొండ సంఘర్షణ సమయంలో ఆదిల్ షా బహిరంగంగా సహాయం చేయకపోయినా, శివాజీ మరియు సాహూజీల ద్వారా మొగలు ప్రాంతాల్ని కొల్లగొట్టించి, మొగలుల దృష్టిని గోల్కొండ నుండి మళ్ళించాలని ప్రయత్నం చేశాడు. గోల్కొండ ఖుతుబుల్ ముల్క్, సంధి చేసుకున్న తరువాత కూడా కాలయాపన చేయడానికి కారణం బీజాపూర్ మరియు మరాఠాల సహాయాన్ని ఆశించడం వల్లనే అనే విషయం ఔరంగజేబ్‌కు తెలిసిపోయింది.

ఇంతలోనే 1656 నవంబర్ 4న ఆదిల్ షా చనిపోయాడు. అతనికి మగ సంతానం లేదు. అందుకని ఆదిల్ షా తరువాత సింహాసనంపై ఎవరిని కూర్చుండబెట్టాలనే విషయాన్ని చక్రవర్తితో సంప్రదించకుండానే, అతని అనుమతి తీసుకోకుండానే, బీజాపూర్ దర్బారు నాయకులు, ఆదిల్ షాకు ఒక దూరపు బంధువైన అబ్బాయిని 'అలి ఆదిల్ షా ద్వితీయ'

అనే పేరుతో సింహాసనంపై కూర్చుండబెట్టారు. బీజాపూర్ ప్రభుత్వం ప్రతి విషయంలో మొగలు చక్రవర్తి అనుమతికి లోబడి ఉండేది. చివరికి అధికారులకు బిరుదులు ప్రసాదించడం, కొత్త కోటల నిర్మాణం లాంటి చిన్న విషయాలకు కూడా మొగలుల అనుమతి తీసుకోవాల్సి ఉన్న పరిస్థితిలో, సింహాసనాన్ని అధిష్టించే వారసుని విషయంలో సంప్రదించకపోవడం, మొగలులకు ఆగ్రహం తెప్పించే విషయమే. ఈ విషయం షాజహాన్‌కు తెలిసినప్పుడు, ఇది తన అధికారాలలో జోక్యంగా పరిగణించి, వెంటనే బీజాపూర్‌పై దండెత్తవలసిందిగా ఔరంగ జేబ్‌ను ఆదేశించాడు. 20 సంవత్సరాలకు ముందు నిజాం షాహి రాజ్యం పతనమైనప్పుడు, ఆ రాజ్య భాగాల్ని ఆదిల్ షాకు అప్పగించబడ్డాయి. ఆ భాగాల్ని తిరిగి తీసేసుకోవాలని, బీజాపూర్ రాజ్యాన్ని కూడా గోల్కొండ సమాన స్థాయికి తేవాలనేది షాజహాన్ ఉద్దేశం.

ఔరంగజేబ్‌కు బీజాపూర్‌పై దాడిచేయమని ఆదేశించినప్పుడే, మీర్ జుమ్లా అక్కడికి చేరుకోనంతవరకు, ఔరంగజేబ్ తన రాజధాని నుండి బయలుదేరకూడదని కూడా ఆదేశిం చడం జరిగింది. ఖుతుబుల్ ముల్క్‌తో జరిగిన యుద్ధం సమయంలో ఔరంగజేబ్‌పై అన్యాయంగా అపనిందలుమోపి, ఫలితంగా ఎన్నో రోజుల వరకు తండ్రీ కొడుకుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఆగిపోయిన విషయం తెలిసిందే. అందుకని ఈసారి ఔరంగజేబ్‌ను స్వతంత్రంగా వ్యవహరించడానికి విడిచిపెట్టకూడదని, అతనికి తోడుగా మీర్ జుమ్లాను పంపి, అతని ఒక్కొక్క కదలికను, చర్యను కనిపెట్టాలనే ఉద్దేశం షాజహాన్‌కు ఉన్నట్లు కనబడు తుంది. అందుకే మీర్ జుమ్లా వచ్చేంతవరకు కదలకూడదని ఆదేశించాడు. కాని అంతకుముందే ఔరంగజేబ్ మనసు విరిగిపోయింది. దర్బారులో దారా అనవసర కుట్రలు, షాజహాన్‌తో అకారణంగా అవమానాలకు, ధిక్కారాలకు గురికావడం మరియు దక్కన్ పాలకుల ఆజ్ఞోల్లం ఘనల కారణంగా అతను బాగా నిరుత్సాహపడిపోయాడు. అతనిలోని కార్యదక్షత, ఉత్సాహ ఆసక్తులు, ఆవేశ ఉద్రేకాలన్నీ చల్లబడిపోయాయి. అందుకని అతనీ యుద్ధం గురించి అంతగా ఆసక్తితో లేడు. అయితే విధి నిర్వహణలో మాత్రం అతనెన్నడూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించలేదు. తన తండ్రి, చక్రవర్తి ఆజ్ఞల్ని ఎన్నడూ జవదాటలేదు. ఆదిల్ షాహి ప్రాంతాలపై దాడి ప్రారంభించాలని చక్రవర్తి నుండి ఆదేశాలు ముట్టినప్పుడు దీనికి అతని మనసొప్పడం లేదు. అయితే కనీసం దీనిద్వారానైనా తన తండ్రి సంతృప్తిని పొందగలుగుతా నేమో అనే ఉద్దేశ్యంతో దీనికి సంసిద్ధుడయ్యాడు. అయినా అతని మనసు కీడును శంకిస్తూనే ఉంది. గోల్కొండ చేదు అనుభవాలు పదే పదే అతనికి జ్ఞాపకం వస్తున్నాయి. సంక్లిష్ట సమయంలో, తన పట్ల, తన సైన్యం పట్ల తండ్రి సోదరులు ఎలా ప్రవర్తించనున్నారో తెలియని పరిస్థితి. ఇంతటి ప్రమాదాన్ని శంకిస్తూ కూడా అతను యుద్ధ సన్నాహాలు మొదలుపెట్టాడు. 1656 నవంబర్ 26న షాజహాన్‌కు ఆదిల్ షా మరణ వార్త అందింది. వెంటనే అతను ఎలాంటి సంకోచం లేకుండా దాడి జరుపడానికి ఔరంగజేబ్‌ను ఆదేశిస్తూనే, మీర్ జుమ్లా వచ్చేంతవరకు కదలవద్దని మెలికపెట్టాడు. ఆ తరువాత షాయిస్త ఖాన్‌కు బయలుదేరి, ఔరంగజేబ్ పరోక్షంలో దక్కన్

రాజధానిలో ఉండాల్సిందిగా ఆదేశించాడు. అతనేకాకుండా మహబత్ ఖాన్, నజాబత్ ఖాన్, రాజారాయెసింగ్, నసీరి ఖాన్, మిర్జా సుల్తాన్ మున్నగు అనేకమంది నాయకులకు ఫర్మానాలు జారీచేస్తూ తమ తమ సేనలతో దక్కన్ బయలుదేరాల్సిందిగా ఆదేశాలు జారీచేశాడు.[14] ఈ మధ్యలో స్వయంగా బీజాపూర్ దర్బారు నాయకుల్లో చీలికలు వచ్చి రెండు వర్గాలుగా విడిపోయారు. ఖాన్ ముహమ్మద్ నాయకత్వంలోని ఒక వర్గం, శాంతి సామరస్యాల్ని అవలం బించి, ఎట్టి పరిస్థితుల్లోనైనాసరే, షాజహాన్‌ను మెప్పించుకొని, యుద్ధాన్ని నివారించాలని కోరుకుంటున్నది. తన సైనిక బలాన్ని నమ్ముకున్న రెండవ వర్గం మొగలుల్ని ఎదుర్కోవడానికే ఉత్సాహం చూపసాగింది. ఇంకా మొదటి వర్గం వారిని దేశద్రోహులని, విశ్వాస ఘాతకులని నిందించింది. ఈ రెండు వర్గాల అంతర్విభేదాలు బీజాపూర్ రక్షణ వ్యవస్థను ఇంకా బలహీన పరిచింది. దాంతో ఔరంగజేబ్ పూర్తిగా లాభపడ్డాడు.

మీర్ జుమ్లా డిసెంబర్ మొదటి తేదీన ఢిల్లీ నుండి బయలుదేరి జనవరి 12వ తేదీన ఔరంగాబాద్ చేరుకున్నాడు. ఈ మధ్యకాలంలో ఔరంగజేబ్ ఊరికనే చేతులు ముడుచు కొని కూర్చుండిలేదు. ఒకవైపు సరిహద్దు ప్రాంతాల్ని పటిష్టం చేస్తూనే, వేరొకవైపు ఫిరంగుల సమీకరణ, ఆహార పదార్థాలు, ఇతర అవసర వస్తువుల సేకరణలో నిమగ్న మయ్యాడు. మూడవ వైపు తన క్రింది అధికారులకు లేఖలు వ్రాస్తూ, బీజాపూర్ పరిస్థితులతో విసుగెత్తి, దాని భవిష్యత్తు పట్ల నిరాశచెంది, మొగలు సైన్యంలో చేరదలిచే బీజాపూర్ సైనికుల్ని, సైన్యాధికారుల్ని తమ సైన్యంలో చేర్చుకొమ్మని, వంద సిపాయీలను వెంటబెట్టుకువచ్చే సైనికాధికారికి రెండువేల రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చి, యుద్ధ సామగ్రిని సమకూర్చు కోవడానికి అవకాశం కల్పించాలని ఆదేశించాడు. ఈ సమయంలోనే శివాజీ తన ఒక దూతను పంపుతూ ప్రస్తుతం ఆదిల్ షా అధీనంలో నున్న కోంకణ్ ప్రాంతం తనకిప్పిస్తే, తాను ఈ యుద్ధంలో మొగలు పక్షంలో పోరాడుతానని చెప్పుకున్నాడు. కాని శివాజీ సమర్పిం చింది ఇది మొదటి విన్నపం కాదు. గోల్కొండ యుద్ధం సమాప్తమైన తరువాత కూడా ఇక మొగలు సైన్యాలు తనను చీల్చి చెండాడుతాయని భావించిన శివాజీ, అప్పుడు కూడా ఒక దూతను ఔరంగజేబ్ వద్దకు పంపి, తాత్కాలికంగా మొగలుల దాడి నుండి తప్పించుకో గలిగాడు. ఆ తరువాత మురాద్ దక్కన్ గవర్నరుగా ఉన్న కాలంలో కూడా తన తరఫున, మరియు తన తండ్రి తరఫున శివాజీ ఇలాంటి అర్జీనే సమర్పించుకున్నాడు. దీనికి ప్రత్యుత్తరంగా ఔరంగజేబ్ కొన్ని షరతులు ప్రతిపాదించి పంపించాడు, కాని శివాజీ వాటిని అంగీకరించడానికి సంసిద్ధం కాలేదు. చివరికి ఆదిల్ షా మరణవార్త మరియు మొగలుల దండయాత్ర అతని చెవుల్లో పడింది. ఇకిప్పుడు రెండు శక్తులు కూడా తనను తమవైపు కలుపుకోవడానికి ప్రయత్నం చేస్తాయని అతనికి విశ్వాసం ఏర్పడింది. అయితే బీజాపూర్ వాళ్ళు ఎక్కువకు ఎక్కువ తన తండ్రి ప్రాంతాల్ని తనకు ఇవ్వొచ్చు, కొంకణ్ ప్రాంతాల్నైతే వారు అస్సలు ఇవ్వరు. అందుకే అతను ఔరంగజేబ్ వద్దకు తన రాయబారిని పంపించాడు. ఔరంగజేబ్ అతని నీతిని బాగా

ఎరుగుతాడు, అందుకని అవే పాత షరతుల్ని పునరావృతం చేశాడు. దీని పర్యవసానంగా అతని తండ్రి సాహూ కర్ణాటక ప్రాంతంలో అరాచకాన్ని లేపితే, వేరొకవైపు శివాజీ జనేర్ మరియు అహ్మద్ నగర్ పరిసరాల వరకు విధ్వంసాల్ని సృష్టించసాగాడు.

మీర్‌జుమ్లా జనవరి 12న ఔరంగాబాద్ చేసుకున్నాడు, అతనితో కలిసి జనవరి 18న ఔరంగజేబ్ బీజాపూర్ వైపు బయలుదేరాడు. జనవరి 28కి అతను బీదర్ చేరుకొని మరుసటి రోజునుండే దాని ముట్టడి దిగ్బంధం ప్రారంభించాడు. సయ్యిది మర్‌జాన్ ఆ కోటకు అధిపతి. అతను ఎంతో పకడ్బందీగా కోట రక్షణ చర్యల్ని చేపట్టాడు. కాని అతని దురదృష్టం కొద్ది కోటలో నున్న మందుగుండు గిడ్డంగికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడం వల్ల సయ్యిది తీవ్రంగా గాయపడ్డాడు, వేరొక వైపు మొగలులకు కోటలో ప్రవేశించే అవకావం లభించింది. తనిక బ్రతకడం కష్టమని, కోటను రక్షించడం కూడా అసంభవమని భావించిన సయ్యిది తన కుమారులతో కోట తాళపు చెవుల్ని ఔరంగజేబ్‌కు పంపించాడు. ఆ తరువాత ఔరంగజేబ్ కళ్యాణి వైపునకు బయలుదేరాడు. మధ్యలో బీజాపూర్ సైన్యం ఎదుర్కొన్నా వారిని ఓడించి కళ్యాణి కోటను ముట్టడించాడు. ఇంతలోనే బీజాపూర్ వాళ్ళ సైన్యం నలువైపుల నుండి వచ్చి, కళ్యాణి కోట బయట పెద్ద సైన్యంగా మారిపోయింది. అంతేకాకుండా వారు మొగలు సైన్యంపై దాడులు కూడా ప్రారంభించారు. కోటను జయించడం, ముట్టడించడం కన్నా వీరిని ఓడించి పారద్రోలడమే ముఖ్యమని భావించిన ఔరంగజేబ్ మే 28న తన సైన్యాన్ని తీసుకొని వీరిని ఎదుర్కోవడానికి బయలుదేరాడు. ఒక రోజంతా ఖాన్ ముహమ్మద్ అఫ్జల్ ఖాన్ మొదలగువారి ముప్ఫయివేల సైన్యంతో సంకుల సమరం జరిగింది. చివరికి విజయశ్రీ ఔరంగజేబ్‌నే వరించింది. ఇక ఆ తరువాత బీజాపూర్ వాళ్ళు ఎంతో కాలం వరకు మొగలుల్ని ఎదుర్కొనే ధైర్యం చేయలేకపోయారు. ఆ తరువాత తిరిగి కళ్యాణి కోట ముట్టడిలో నిమగ్నమయ్యాడు. దాదాపు రెండు నెలల తరువాత తిరిగి బీజాపూర్ సైన్యాల సమీకరణ జరుగుతున్నదని తెలియగానే వారిని ఎదుర్కోవడానికి తన జ్యేష్ఠ పుత్రుణ్ని మరియు మీర్ జుమ్లాను పంపించాడు. వారు ఆ సైన్యాన్ని ఓడించి గుల్బర్గా చేరుకునేంత వరకు ఆగలేదు. ఇటు కళ్యాణి కోట దిగ్బంధం కూడా ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనబడసాగాయి. జులై 29న అతను కోటపై దాడి ప్రారంభించాడు. అతని వీరులైన సైనికులు కోట గోడనెక్కి దాన్ని ఆక్రమించుకోగలిగారు. లోపలికి చేరిన తరువాత, కోటలోని వారు, బయట కోట గోడలాగే లోపల కూడా ఒక గోడను నిర్మించుకున్నారని తెలిసింది. ఈ విధంగా కళ్యాణి కోటను జయించడం కష్టం అనిపించసాగింది. అయితే ఔరంగజేబ్ నిరుత్సాహపడే మనిషి కాదే! అతనలాగే కోట గోడల్ని ఆక్రమించుకొని కూర్చున్నాడు. రెండు రోజులు అలాగే గడిచి పోయాయి. దీంతో కోటలోపలి వారి ధైర్యం సన్నగిల్లింది. ఫలితంగా ఆగస్టు మొదటి తేదీన కోటాధిపతి అయిన దిలావర్ ఖాన్ కోట తాళపు చెవుల్ని ఔరంగజేబ్‌కు పంపించాడు. ఔరంగజేబ్ కూడా కోటాధిపతిని గౌరవించి, అతనికి రాజవస్త్రాలు ప్రసాదించి, కోటలోని

సైనికులందరిని తమ తమ సామగ్రితో సురక్షితంగా బీజాపూర్ వెళ్ళే అవకాశం ఇచ్చాడు. కళ్యాణికోట ముట్టడిలోనే సుదీర్ఘ కాలం గడిచింది తప్ప, ఇరుపక్షాల్లో ఎవరికీ కూడా రక్తాన్ని చిందించవలసి రానందుకు ఔరంగజేబ్‌కు సంతోషం కలిగింది. ఇక అక్కడి నుండి బీజాపూర్ వరకు వ్యాపించి ఉన్న ప్రాంతమంతా ఔరంగజేబ్‌ను ఆహ్వానిస్తుంది. త్రోవలో నున్న అడ్డం కులన్నీ తొలగిపోయి, ఇక బీజాపూర్ ముట్టడే మిగిలిపోయింది. ఈ విధంగా పరిస్థితులు అనుకూలిస్తున్న సమయంలో అకస్మాత్తుగా "యుద్ధాన్ని ఆపేయవలసింది"గా షాజహాన్ ఉత్తర్వులు వచ్చాయి. దాంతోపాటే ఇతర సైనికాధికారులకు వెంటనే డిల్లీ మరలాల్సిందిగా ఔరంగజేబ్ ద్వారా కాకుండా డైరెక్టుగా వ్యక్తిగత ఆదేశాలు ముట్టాయి. దీంతో మహాబత్ ఖాన్, ఇంకా దాదాపు అన్ని రాజపుత్ర సైన్యాలు, సైనికాధికారులు కనీసం మాట వరుసకైనా ఔరంగజేబ్‌తో అనుమతి తీసుకోకుండానే డిల్లీ వైపు బయలుదేరి వెళ్ళి పోయాయి. దాంతో ఔరంగజేబ్ గౌరవానికి, ఆత్మాభిమానానికి, అతని మన్సబు యొక్క కీర్తి ప్రతిష్టలకు ఎంతగా నష్టం వాటిల్లిందంటే ఇక దాన్ని సవరించడం దాదాపు అసంభవమే అయిపోయింది. ఈ యుక్తిని ఎంతటి క్లిష్ట మరియు కీలక సమయంలో ఉపయోగించారో మనం గమనించగలిగితే, ఈ పుండే కారి కారి, ఆ తరువాత సోదరుల మధ్య అంతర్యుద్ధాలకు దారితీసి రక్తపు ధారల్నే ప్రవహింపజేసింది.

ఇంతవరకు మనం తెలుసుకుంటూ వచ్చింది ఔరంగజేబ్ పురోగమనం, విజయాలు మరియు సఫలతలే. ఇకిప్పుడు దారా కుట్రలు, షాజహాన్ వివేక రహితమైన ఆదేశాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. వీరిద్దరు తమ నీచమైన చర్యలు, ద్వేషపూరిత కార్యక్రమా లతో ఏ విధంగా ఔరంగజేబ్‌ను తన ధన మాన ప్రాణాల రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవడానికి ఎలా వివశుణ్ణి చేశారో తెలుసుకోవాల్సి ఉంది. ఈ వివాదాలే, ఈ అనైతిక, మరియు వివేకరహితమైన చర్యలే ఆ తరువాత యుద్ధ జ్వాలలు రగిల్చడానికి వాటంతటవే ఎలా దోహదపడ్డాయో తెలుసుకోగలుగుతాం.

దక్కన్ రాజ్యాలు, దక్కన్‌కు గవర్నరు అయిన ఔరంగజేబ్ ద్వారా తమ పనులు సాధించుకోవడానికి బదులు, దారా ఔరంగజేబ్‌కు శత్రువు అని మరియు షాజహాన్ దారా సమర్థకుడని భావించి, సరాసరి దారా ద్వారానే తమ వ్యవహారాల్ని పరిష్కరించుకోసాగాయి. దారా ముఖస్తుతికి ఉబ్బిపోయే, ఆత్మంభరుడైన, చంచల స్వభావం గల ఒక రాకుమారుడు. ఎవరైతే అతన్ని పొగడి ఆకాశానికెత్తేస్తారో, అతని పని జరిగిపోయినట్లే. ఇక దక్కన్ విషయాని కొస్తే, ఔరంగజేబ్ పట్ల ద్వేషం కారణంగా, అతను ఈ రాజ్యాలు కోరింది వెంటనే చేసి పెట్టేవాడు. గోల్కొండ వారు తమ రాయబారి ముల్లా అబ్దుస్సమద్ ద్వారా తమ లక్ష్యాలు సాధించుకునేవారని ఇంతకు ముందే తెలుసుకున్నాము. ఇకిప్పుడు ఖాన్ ముహమ్మద్ కూడా ఒక రాయబారిని దర్బారుకు పంపించాడు. దారా తప్పకుండా ఈ రాయబారిని సమర్థిస్తాడని అతనికి విశ్వాసముంది. ఇలాంటి సమర్థన దారాకు కొత్తదేమీ కాదు, బీజాపూర్ వాళ్ళకూ

కాదు. ఈ విషయం ఔరంగజేబ్‌కు కూడా బాగా తెలుసు. అందుకని రెండేళ్ళ ముందే ఈ విషయం తన సోదరి జహాంఆరాకు ఈ క్రింది లేఖ ద్వారా తెలిపి ఉన్నాడు.

" ....... ఈ రోజుల్లోనే దాదాభాయి జియో, (దారా షికూహ్) ఎవరయితే ఈ విధేయునిపై "ప్రత్యేక దయానుగ్రహాల దృష్టి" ఉంచుతారో (నా పట్ల ఆయనెంత ప్రసన్నులనే విషయం ప్రభువుల వారికి తెలియంది కాదు) ముల్లా షౌఖీ పేరు గల తన సేవకున్ని బీజాపూర్ పరిపాలకుని వద్దకు కొన్ని శుభవార్తలు మరియు అతని విన్నపాల స్వీకరణకు సంబంధించిన వార్తల్ని ఇచ్చి పంపించారు. తద్వారా అతని ధైర్యం, ఆజ్ఞోల్లంఘనలు పెరిగి పోయాయి. అంతేకాదు, అతన్ని చూసి ఇతరులు కూడా అలాగే చేస్తున్నారు." (రుఖ్అత్ ఆలంగీర్ – లేఖ నెం.27/159) (ముఖద్దమ ..... నజీబ్ అష్రఫ్, పేజి 328)

దారా గుట్టుచప్పుడు కాకుండా ఇలాంటి పనులు చేసేవాడని ఈ లేఖ ద్వారా తెలియడమే కాకుండా, ఔరంగజేబ్ పట్ల అతనికి గల ద్వేషం, శతృత్వాలు షాజహాన్‌కు కూడా బాగా తెలుసని అర్థమవుతుంది. ఇట్టి పరిస్థితుల తరువాత కూడా ఎల్లప్పుడు షాజహాన్ దారా చెప్పిన ప్రకారమే నడుచుకోవడం, అతన్నే సమర్థించడం ఎంతవరకు న్యాయం, సమంజసమంటారు.?

రాజాజ్ఞను పాటించడం తప్ప ఈ పరిస్థితుల్లో అతనేం చేయగలుగుతాడు. అందుకని అతను మొట్టమొదట ఆదిల్‌షాకు ఈ విషయం తెలిపాడు. ఆ తరువాత ఖాజి నిజామా మరియు మీర్‌జుమ్లాలను వారి వారి పనులు నెరవేర్చడానికి పంపించాడు. ఆదిల్ షా రాజాజ్ఞల్ని పాటించకపోతే సైనికబలంతోనైనా ఒప్పించే ఉద్దేశంతో మిగిలిన సైన్యాల్ని తీసుకొని అతను కళ్యాణిలోనే మకాం వేసి కూర్చున్నాడు. ఈ సమస్య ఇంక ప్రారంభదశలో ఉండగానే సెప్టెంబర్ 6న షాజహాన్ అకస్మాత్తుగా వ్యాధిగ్రస్తుడయ్యాడు. ఈ వ్యాధి ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే, దేశమంతటిలో షాజహాన్ మరణించాడనే వార్త ప్రాకిపోయింది. ఈ వార్తతోపాటుగానే, సైన్యాధికారులంతా తమ తమ సేనలతో ఉత్తర భారతానికి వెంటనే మరలాలని దారా ఆదేశాలు సైన్యాధిపతుల పేర అందాయి. ఈ పరిస్థితుల్లో సంధి షరతుల్ని అనుసరించమని ఒత్తిడి చేసే అవకాశమే లేకుండాపోయింది. వేరొక వైపు, షాజహాన్ సంధి చేసుకొమ్మని ఆదేశించాడనే వార్త బీజాపూర్ వాళ్ళకు తెలిసిపోగానే, వారింకా పోకిరితనానికి ఎగబడ్డారు. బీజాపూర్ వాళ్ళతో కనీసం రాజాజ్ఞను అనుసరింపజేయడం కూడా ఔరంగజేబ్‌కు గగనమైపోయింది. అందుకని దర్బారు వార్త (అంటే షాజహాన్ వ్యాధివార్త) బీజాపూర్ వారికి తెలియకముందే, వారితో సంధిషరతులు ఒప్పించాలని ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని వారిక వింటేగా! ఔరంగజేబ్, ఆదిల్‌షాకు లేఖలపై లేఖలు వ్రాస్తున్నాడు. కాని వాటికి ఎలాంటి జవాబే లేదు. దాడి చేస్తామని బెదిరించాడు, అది కూడా ప్రభావం చూపలేకపోయింది. వేరొకవైపు దర్బారు వార్తలు అతన్ని కలవరపరుస్తున్నాయి. షాజహాన్ మరణవార్త నిజమైవుంటే, ఇంకా దారానే ఒకవేళ సింహాసనాన్ని అధిష్టించి ఉంటే, తానేం

చేయాలి? వేరొక వైపు తాను బీజాపూర్ వాళ్ళతో తన షరతుల్ని ఒప్పించడంలోనే సమయాన్ని వృధాచేస్తే, ఇక్కడి నుండి ఉత్తర భారతానికి వెళ్ళుతున్న సైన్యాలు, తనకే వ్యతిరేకంగా పని చేస్తాయి, దారా బలశక్తులు పెరిగిపోతాయి. అంతేకాకుండా బీజాపూర్ వారికి ఈ పరిస్థితే గనక తెలిసిపోతే, వారింకా నిర్భయులై, తన మీద దాడి జరిపినా జరుపవచ్చు. అందుకని అతను ఎన్నో షరతుల్ని 'దయానుగ్రహాల' పేరుతో సడలిస్తూ చివరికి 'పరిందా' కోటను కూడా ఆదిల్ షాకే వదిలేస్తూ సంధిచేసుకొని బీదర్‌కు మరలాడు. అయితే బీజాపూర్ వారిపై దీని విపరీత ప్రభావం పడింది. వారికి అవకాశం దొరికినప్పుడల్లా మొగలు సైన్యాలపై దాడులు ప్రారంభించారు. చివరికి వారి ఓ సైనికదళం, ఔరంగజేబ్ లేఖల్ని మీర్ జుమ్లాకు తీసుకపోతున్న బృందంపై దాడి జరిపి వారిని బంధించి ఆ లేఖల్ని స్వాధీనం చేసుకున్నది. దర్బారు అసలు పరిస్థితులు తెలియగానే వారు ఇంకనూ బరితెగించారు. ఈ పరిస్థితుల్లో ఔరంగజేబ్ ఏం చేయగలుగుతాడు? అతను, అతని సైన్యం తమ స్థావరాల నుండి దూరంగా, అత్యంత ప్రమాదంలో ఇరుక్కుపోయాయి. అందుకని ఔరంగజేబ్ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆదిల్ షా అంగీకరించిన షరతుల మీదనే సంధిచేసుకోవలసి వచ్చింది. ఆదిల్ షాతో సంధి జరిగిన తరువాత అక్టోబర్ 9న అతను బీదర్ చేరుకున్నాడు. ఆ కోటకు చేరుకొని అతనక్కడ తొమ్మిది రోజులాగాడు. కోటకు సముచిత మరమ్మత్తులు, సంరక్షణ ఏర్పాట్లు చేసి, అక్టోబర్ 18న అతను ఔరంగబాదుకు బయలుదేరాడు.

దారా కారణంగా, పరాయి దేశంలో ఔరంగజేబ్ ఎంతప్రమాదకర స్థితిని ఎదుర్కోవాల్సి వచ్చిందంటే, అతనూ అతని సైన్యం, మూకుమ్మడిగా విరుచుకుపడే శత్రువుల దాడికి గురిఅయ్యేవారు. ఆ ప్రమాదకర పరిస్థితుల్లో, తాననుకున్నవి కాకపోయినా, గౌరవప్రదమైన షరతులతో సంధి చేసుకొని, తన సైన్యాల్ని సురక్షితంగా బయటికి తీసుకరావడమనేది ఔరంగజేబ్ లాంటి ఆరితేరిన యుద్ధ ప్రవీణునికే చెల్లిపోయింది. ఇక ఆ తరువాత వారసత్వం కోసం సోదరుల అంతర్యుద్ధాల ఘట్టం ప్రారంభమవుతుంది.

# 7. షాజహాన్ కుమారులు వ్యక్తిత్వాలు-గుణగణాలు

షాజహాన్ పత్ని ముమ్‌తాజ్ మహల్ గర్భం నుండి పదునాలుగు మంది సంతానం పుట్టారు. అందులో ఏడుగురు చిరుప్రాయంలోనే గతించారు. మిగిలిన ఏడుగురి వివరాలు ఇలా ఉన్నాయి :

| | | |
|---|---|---|
| 1. జహాన్ ఆరా బేగం - | జననం | 1614 మార్చి, 23 - అజ్మీర్ |
| 2. దారా షికూహ్ - | ” | 1615 మార్చి, 20 - అజ్మీర్ |
| 3. షాహ్ షుజా - | ” | 1616 జూన్, 23 - అజ్మీర్ |
| 4. రోషన్ ఆరా - | ” | 1617 ఆగస్టు, 24 - బుర్‌హాన్‌పూర్ |
| 5. ఔరంగజేబ్ - | ” | 1618 అక్టోబర్, 24 - దోహద్ |
| 6. మురాద్ బక్ష్ - | ” | 1624 ఆగస్టు, 29 - రొహ్‌తాస్ |
| 7. గౌహర్ ఆరా బేగం - | ” | 1631 జూన్, 07 - బుర్‌హాన్‌పూర్ |

(షాజహాన్ చరిత్ర - డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా, పేజి 65)

పై వారిలో ఒక్క గౌహర్ ఆరా బేగం తప్ప మిగిలిన వారందరి ప్రస్తావన చరిత్రల్లో వచ్చింది. ఇందులో జహాఁ ఆరా బేగం అత్యంత విద్యాధికురాలుగాను, తెలివితేటలు, రాజకీయ అవగాహన కలిగిన వ్యక్తిత్వంగాను ప్రఖ్యాతిగాంచింది. అంతేకాకుండా తల్లి గతించిన తరువాత వృద్ధ తండ్రి సేవ మరియు బాగోగులు చూసుకోవడంలో ఆమె పాత్ర గణనీయమైనది. అందరిలోకెల్ల పెద్ద సోదరి అయినందున, తల్లి లేకపోవడం కారణంగాను సోదరులందరూ ఆమెను అత్యంతగా గౌరవించడమే కాకుండా, తమ మనసులోని మాటను, తమ సుఖదుఃఖాల్ని, తమ గోడును కూడా ఈ జ్యేష్ఠ సోదరికే చెప్పుకునేవారు. సోదరుల అంతర్యుద్ధాలతో బాధపడిన వారిలో ఈమె ప్రముఖురాలు. అంతేకాకుండా సోదరుల మధ్య రాజీ కుదుర్చడానికి కూడా ఆమె ఎంతో ప్రయత్నించి విఫలమైంది. అయితే ఔరంగజేబ్ రాజ్యాధికారాన్ని చేపట్టిన తరువాత కూడా ఈ సోదరి గౌరవ మర్యాదల్లో ఎలాంటి లోటు రానివ్వలేదు. ఆమె మరణించేవరకు తండ్రి సేవనే తన జీవిత పరమావధిగా భావిస్తూ, తనదైన శైలిలో తన అధికారాన్ని కాపాడుకోగలిగింది. సోదరుల మధ్య అంతర్యుద్ధాలు సమాప్తమై, ఔరంగజేబ్ తప్ప మిగిలిన సోదరులు సమాప్తమై, ఔరంగజేబ్ పట్టాభిషిక్తుడైన

తరువాత ఈ తండ్రీ కొడుకుల్లో ఏర్పడిన దూరాన్ని ఆమె తన ప్రయత్నాల ద్వారా దూరపరచ గలిగింది. అంతేకాకుండా తండ్రీకొడుకుల హృదయాల్లో ఏర్పడిన వ్యతిరేకతను, శతృత్వాన్ని కడిగివేసి, వీరిద్దరిని సంతృప్తపరచడంలో ఆమె నిర్వహించిన పాత్ర గణనీయమైనది.

## 1. దారా షికూహ్ :

దారా షికూహ్ వ్యక్తిత్వాన్ని గురించి "షాజహాన్ చరిత్ర" రచయిత డాక్టర్ బనారసి ప్రసాద్ సక్సేనా ఇలా వ్రాశారు:

"దారా యువరాజుగా ప్రకటించబడ్డాడు. అలహాబాద్, పంజాబ్, మరియు ముల్తాన్ లాంటి సారవంతమైన, ధనిక సూబాలకు సుబేదార్‌గా నియుక్తుడైవున్నాడు. ఇతనికి "షాబులంద్ ఇక్బాల్" లాంటి మహోన్నతమైన బిరుదు కూడా ప్రసాదించబడింది. సాటిలేని, కనీవినీ ఎరుగని నలుబదివేల అశ్విక దళాల మన్సబు అతనికి ఒసంగబడ్డది. దర్బారులో సింహాసనానికి సమీపంలో ఒక బంగారు కుర్చీపై కూర్చుండే అదృష్టవంతుడు. అధికారులు, మన్సబుదారులు ఎవరైనా సరే, చక్రవర్తి నుండి హోదాలు పొందాలంటే ఇతన్ని ఆశ్రయించక గత్యంతరం లేదు. క్లుప్తంగా చెప్పబోయేదేమంటే ఇతనే భావి చక్రవర్తి అనే విషయాన్ని ప్రతి ఒక్కరి మనో మస్తిష్కాల్లో దించే సర్వ ప్రయత్నాలు జరిగాయి.

ధార్మిక విషయాల్లో దారా స్వతంత్ర భావనలు కలవాడు. అస్తిత్వమంతయూ ఒక్కటేననే తత్వంలో విశ్వాసం కలవాడు. అయినప్పటికీ చంచల స్వభావుడు, గర్విష్టి, చిరచిరలాడే స్వభావం, కార్యదక్షతలేనివాడు. ముఖస్తోత్రాలకు ఇష్టపడేవాడు. ఇతని దర్బారు ఇచ్చకాలాడేవారు, ముఖస్తోత్రాలు చేసేవారితో నిండి ఉండేది. (సుఖ సౌఖ్యాలతో కూడిన) దర్బారు జీవితం, చక్రవర్తి అత్యధిక ప్రేమ వాత్సల్యాలు అతన్ని నిరర్థకునిగా మార్చాయి. దీనితో పాటే నిర్వహణ నైపుణ్యంలో, సమయానుసారం హృదయాల్ని గెల్చుకునే లేక త్రిప్పుకునే కళలో కూడా శూన్యుడే. ఇలాంటి పోషణ మరియు తర్ఫీదు కారణంగా, అతని స్వభావం ఎలా మారిందంటే రాబోయే గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొనే యోగ్యతయే అతనిలో లేకుండా పోయింది." *(షాజహాన్ చరిత్ర-డా. బనారసి ప్రసాద్ సక్సేనా(అను)-పే. 380, 381.)*

## దారా విషయంలో డాక్టర్ ఓం ప్రసాద్ ఇలా అంటున్నారు :

"తన ఉత్తరాధికారిగా దారాను నియమించాలని షాజహాన్ నిశ్చయించుకున్నాడు. ఈ మార్గంలో అతను ఔరంగజేబ్‌ను పెద్ద అవరోధంగా ఎంచేవాడు, అందుకని ఏదో ఒక సమస్యను పరిష్కరించే సాకుతో ఔరంగజేబ్‌ను దర్బారు నుండి దూరంగానే ఉంచాడు. ఇక వేరొకవైపు రకరకాల సమస్యల్ని ఎదుర్కోవడం వల్ల ఔరంగజేబ్ యోగ్యతల్లో శీఘ్రంగా పెరుగుదల రాసాగింది. దారాను తన ఉత్తరాధికారిగా నియమించేందుకు, రాజ్య వ్యవహారాల పట్ల పూర్తి అవగాహన ఏర్పడాలనే దృష్టితో షాజహాన్ ఎన్నో సంవత్సరాల నుండి దారాను తన వద్దనే ఉంచుకుంటూ వచ్చాడు. దారాకు ఎంతటి అధికారాలు లభించి ఉన్నాయంటే అతనొక రాజుకు తక్కువేం కాదు. షాజహాన్‌ను కలువదలిచిన ప్రతి మనిషికి దారా అనుమతి తీసుకోవడం అనివార్యమైపోయింది. తండ్రి చూపిన ఈ అత్యధిక ప్రేమ వాత్సల్యాల కారణంగా

దారా యుద్ధ వ్యవహారాల్లో, ప్రభుత్వ వ్యవహారాల్లో ఎలాంటి అనుభవాన్ని గడించలేకపోయాడు. నిజమైన మనిషెవరో, అతనిలోని యోగ్యత ఏమిటో తెలుసుకోవడం దారాకు అసంభవమై పోయింది. ఇంకా సైన్యాలతో అసలు అతనికి సంబంధాలే లేవు. *(ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాష్ ప్రసాద్, పే.9)*

ఐదు సంపుటాల్లో ఔరంగజేబ్ చరిత్ర రాసిన ప్రఖ్యాత చరిత్రకారుడు జదూనాథ్ సర్కారు "దారా" గురించి ఇలా రాశాడు.

"అతను అనగా దారా సాటిలేని ధనైశ్వర్యాలకు, సంపదలకు యజమాని. దర్బారులో కూడా అతని స్థానం అత్యున్నతమైనది. కాని అతనిలో ఎన్నడూ కూడా పరిమితత్వ స్వభావము, ఆత్మ నిగ్రహం, కార్యాంత ఫలితాలపై దృష్టి నిలుపే గుణం జన్మించలేకపోయింది. ఢిల్లీ సింహాస నాన్ని అధిష్టించబోయే ఈ వారసుని గర్వం మరియు మొండితనాన్ని, ముఖస్తుతులు చేసే అతని అనుచరులు ఇంకనూ పెంపొందింపజేశారు. ఖాందహార్ ముట్టడి సందర్భంలో స్వయంగా అతని వందిమాగధులు వర్ణించిన వివరాల ద్వారా అతనో అయోగ్యుడైన, ప్రగల్భాలు పలికే రాకుమారునిగా నిరూపితమవుతాడు. అతనిలో ఆత్మవంచన, అహంకారముండేది. పరిపాలనా వ్యవహారాల్లో చిలిపిచేష్టలకు పాల్పడేవాడు. వారసత్వం కోసం జరిగిన యుద్ధాల వివరాలు తెలుసుకున్నప్పుడు, అతని వద్ద ఏళ్ళ తరబడి ధనరాసులుండీ, దర్బారులో పలుకుబడి ప్రాబల్యాలున్నప్పటికీ, తనను సమర్థించే విశ్వాసపాత్రులైన కేవలం కొందరు నాయకుల్ని, సైనికాధికారుల్ని మాత్రమే సమీకరించుకో గలిగాడు. మనిషిలోని యోగ్యతను గుర్తించే నైపుణ్యం అతనిలో లేదు. యోగ్యతలు, ఆత్మాభిమానం గల వాళ్ళు, ఇలాంటి అహంకారి, అనుభవరాహి త్యుని నుండి దూరంగానే ఉంటూ వచ్చారు. డబ్బుకు దాసోహం అనేవాళ్ళు, ముఖస్తుతులకు అలవాటుపడ్డ దర్బారీలు, సైనికాధికారులు మాత్రమే అతని పక్షాన నిలిచారు. ఔరంగజేబ్ లాంటి అనుభవజ్ఞుడు, తెలివైన వానికి ఎదురుగా ఒక పరాజితమయ్యే వ్యక్తిని తాము సమర్థిస్తున్నామనే విషయం కూడా వారికి తెలుసు. అతనో వాత్సల్యం గల భర్త, తండ్రి మరియు వినయం గల కుమారుడు అనడంలో సందేహం లేదు కాని క్లిష్ట పరిస్థితుల్లో అతనో పరిపాలకునిగా విఫలుడయ్యాడు. సుదీర్ఘకాలంగా అతనికి సుఖసౌఖ్యాలు లభించాయి, దానివల్ల అతని నిజమైన వ్యక్తిత్వం వికసించలేకపోయింది. తన తెలివితేటలతో అతనో ప్రణాళికను రూపొందించలేడు. తన వీరత్వంతో ఒక కార్యాన్ని సాధించే యోగ్యత అతనిలో లేదు. కష్టపడి, చెమటోడ్చి ఒక కార్యాన్ని నెరవేర్చడానికి అతను అలవాటు పడలేదు. అవసరం వచ్చినప్పుడు ప్రాణాలకు తెగించి, తన వీరత్వంతో అపజయాన్ని, విజయంగా మార్చే యోగ్యత కూడా అతనిలో లేకుండేది. అతను దర్బారులో అత్యంత ప్రీతిపాత్రుడైనప్పటికీ కూడా, సైన్యంలో, సైనికదళాల్లో విఫలమైన మనిషి. ఇచ్చకాలాడే, ముఖస్తుతిచేసే దర్బారు నాయకుల మధ్యనే అతను కాలం గడిపాడు, అందుకని శిరసావహత, విధేయత అనే కళలను తన మిత్రులకు నేర్పలేకపోయాడు. అంతే కాకుండా వారిలో ఏకాభిప్రాయ గుణాన్ని కూడా సృజించలేకపోయాడు. పటిష్ఠమైన సైనిక వ్యవస్థతో, క్రమశిక్షణతో యుద్ధం చేయడం అతని వల్ల కాని పని. యుద్ధ సమయాల్లో,

రణరంగంలో ఒక నాయకుడు లేక కమాండరు తన అచంచల మరియు సమయానుకూల నిర్ణయాల వల్ల పరిస్థితుల్ని తన కనుకూలంగా ఎలా మార్చుకోగలడనే విషయం అనుభవ పూర్వకంగా అతనికి తెలియనే తెలియదు.” (హిస్టరీ ఆఫ్‌ ఔరంగజేబ్‌- యదూనాథ్‌ సర్కార్‌ - వాల్యూం-1, పేజి 171-172)

ఇక దారా షికూహ్‌ గురించి “ముఖద్దమ రుఖ్‌ఆత్‌ ఆలంగీర్‌” రచయిత, చరిత్రకారుడు సయ్యద్‌ నజీబ్‌ అష్రఫ్‌ నద్వి, ఎం.ఎ., అభిప్రాయమేమిటో కూడా తెలుసుకుందాం. ఆయనిలా పేర్కొంటాడు.

“దారా షికూహ్‌ షాజహాన్‌ కుమారుల్లో అందరిలోకెల్ల పెద్దవాడు. షాజహాన్‌కు అత్యంత ప్రియమైనవాడు. తల్లిదండ్రుల ప్రేమ వాత్సల్యాలు, దర్బారీల ముఖస్తుతులు, అతిశయోక్తులు, స్వయంగా షాజహాన్‌ అత్యధిక ప్రేమ- ఇవన్నీ కలిసి అతన్ని అహంకారిగాను, గర్విష్ఠిగాను, మొండివాడుగాను, ప్రశంసలకు ఉబ్బిపోయేవాడుగాను మార్చివేశాయి. రాజ్యమంతటిలో తనను మించిన తెలివితేటలు గలవాడు, వివేకవంతుడు, బహు సంబంధాలు గలవాడు, అధికార దర్పాలు కలవాడు వేరెవ్వరూ లేరని విశ్వసించసాగాడు. కనిష్ట సోదరులు పెరిగి పెద్దవారై, తమ యోగ్యతలు, ఘనకార్యాలు, అణకువ, విధేయత కారణంగా ఇతరుల్ని తమవైపు ఆకర్షించు కోవడం అతనికి నచ్చలేకపోయింది. సోదరులందరిలో ఔరంగజేబే అందరికన్నా పలుకుబడిగలిగి, అందరికన్నా వివేకవంతుడై, దూరదృష్టిగలవాడై, అందరిలోకెల్ల సఫలీకృతుడవడం వల్ల దారా షికూహ్‌కు అనవసరంగానే అతనిపట్ల ఈర్ష్యాద్వేషాలు జనించసాగాయి. ఔరంగజేబ్‌ క్రమ క్రమంగా అభివృద్ధిచెందుతూ, ఇతరుల హృదయాల్లో తన స్థానాన్ని ఏర్పరుచుకోవడం మొదలవ గానే, అతనిపట్ల దారాషికూహ్‌ శత్రుత్వం, కుట్రలు పెరిగిపోసాగాయి. ఈ ఈర్ష్యాద్వేషాలే పరాకాష్టకుచేరి సోదరుల్లో అంతర్యుద్ధాలకు దారితీసింది.

షాజహాన్‌ అతనిపట్ల చూపే పిచ్చిప్రేమ కారణంగా అతనిలో గర్వం, అహంకారాలు జనించడమే కాకుండా, తన మాటను ఎదురించే సాహసమెవ్వరికుంది అనే ధోరణిలో వ్యవహ రించసాగాడు. అతను చెప్పింది జరిగితీరవలసిందే. ఎవరైనా పొరపాటుగా కూడా అతని మాటను వ్యతిరేకిస్తే, అతడెంతటి పెద్దవాడైనాసరే నిండు దర్బారులో అతన్ని అవమానించకుండా విడిచిపెట్టేవాడు కాదు. స్వయంగా ప్రధానమంత్రి అల్లామ సాదుల్లా ఖాన్‌ కూడా ఇలాంటి అవమానాన్ని ఎదుర్కోవలసివచ్చింది. ఈ వ్యవహారం, ఈ ప్రవర్తనా తీరు షాజహాన్‌కు తెలియంది కాదు, అందుకే ఏకాంతంలో అతను దారా షికూహ్‌ను తన ప్రవర్తనను మార్చుకోవలసిందని రకరకాలుగా నచ్చజెప్పేవాడు.

దారాను విమర్శిస్తే షాజహాన్‌కు అసంతృప్తి కలిగేది. అందుకని దారాను విమర్శించి, షాజహాన్‌కు అసంతృప్తి కలిగించడం ఇష్టంలేని దర్బారు నాయకులందరూ మౌనం వహించారు. కాని దారా ప్రవర్తన కారణంగా ఈ దర్బారు నాయకుల్లో ఏ ఒక్కరికీ అతనిపట్ల అభిమానంగాని,

విశ్వాసంగాని లేదు. ఇంకొక విషయం ఏమిటంటే దారా పట్ల ప్రేమాతిశయాలతో షాజహాన్ అతన్ని తన నుండి దూరం కానివ్వలేదు, అతనికివ్వబడిన సూబాలకు అతన్ని వెళ్ళనివ్వలేదు. సతతం దర్బారులోనే ఉంచుకున్నాడు. ఫలితంగా దారా, దర్బారులోని ముఖస్తుతికి అలవాటుపడిన నాయకుల మధ్యనే ఉండిపోయాడు. పరిపాలనా వ్యవహారాలంటే ఏమిటో తెలియదు, సైన్యంతో అసలే సంబంధాలు లేవు. రాజ్యంలోని ముఖ్య నాయకులతో అతనికి సత్సంబంధాలు లేవు. ఖాందహార్ ముట్టడి సందర్భంలో అతని హాస్యాస్పద, తెలివిహీన చర్యలవల్ల మొగలు రాజ్యానికి లక్షలాది రూపాయలు, వేలాది ప్రాణాల్ని బలిచేయాల్సి వచ్చింది. అతనిలో నైతికోన్నత లేదు, మృత్యుముఖంలో కూడా మందహాసానికి పురిగొల్పే ధీరత్వమూ, వీరత్వమూ అతనిలో లేవు. తన అభీష్టానికి వ్యతిరేకంగా ఒక్కమాట కూడా అతనెరుగడు. మానవ స్వభావాల్లోని భిన్నత్వా లేమిటో అతనెరుగడు. బాధలు, కష్టాలు, ఆపదలంటే ఏమిటో అతనికి తెలియవు. అతను సుఖసౌఖ్యాల్లో పుట్టాడు, ఆనందోల్లాసాల్లో పెరిగాడు, అర్థంపర్థంలేని తన భావనల్ని ప్రచారం చేసుకుంటూ హాయిగా, నిశ్చింతగా గడిపాడు.

(ముఖద్దమ రుఖ్అత్ ఆలంగీరి – సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, ఎం.ఎ., పేజి 351 – 355)

డాక్టర్ బర్నియేర్ దారా సమర్థకుడు, దారా కష్టకాలంలో అతని వెంట ఉన్నవాడు. అటువంటి బర్నియేర్ అతనిలోని కొన్ని సుగుణాల్ని వర్ణించిన తరువాత ఇలా వ్రాశాడు:

“.... అయితే అతను అత్యంత గర్విష్ఠి, అహంకారి. తన బుద్ధి వివేకాలతో, యుక్తి ఉపాయాలతో ప్రతి పనిని సాధించగలనని, ప్రతి సమస్యను పరిష్కరించగలనని గర్వపడేవాడు. నాకు సలహా ఇచ్చేంత యోగ్యుడైన మనిషి లేనే లేడు అనే ధోరణిలో వ్యవహరించేవాడు. ఎవరయినా భయపడుతూనే ఏదైనా సలహా ఇచ్చే ధైర్యమే కనక చేసినట్లయితే, వారి పట్ల అత్యంత అవమానంగా ప్రవర్తించేవాడు. ఈ దుర్గుణం కారణంగానే అతన్ని ఆత్మీయంగా అభిమానించేవారు కూడా అతని భయం వల్ల అతని సోదరుల రహస్య, బహిరంగ కార్యకలాపాల గురించి నోరు విప్పలేకపోయారు. అతను బెదరించటంలో, భయపెట్టటంలో ఆరితేరినవాడు. చివరికి దర్బారులోని పెద్దపెద్ద నాయకుల్ని కూడా బెదిరించకుండా, అవమానించకుండా విడిచిపెట్టేవాడు కాదు. (Travels in the Moghal Emprire- Bernier Page-6)

## 2. షాహ్ షుజా :

రాకుమారుడు షాహ్ షుజా బహాదూర్, షాజహాన్‌కు రెండవ కుమారుడు. షాజహాన్ సింహాసనాన్ని అధిష్ఠించగానే అతన్ని రాజ్య కార్యకలాపాల్లో నియుక్తుణ్ణి చేసాడు. మొదట అతన్ని దక్కన్ పోరాటాల్లో పంపించడం జరిగింది. ఆ తరువాత ఖందహార్ పంపించబడ్డాడు. ఆ తరువాత 1639లో అతన్ని బెంగాల్ గవర్నర్‌గా నియమించడం జరిగింది. ఆ తరువాత మూడు సంవత్సరాలకే ఒరిస్సా కూడా అతనికి కేటాయించడం జరిగింది. అతను ఇరువై సంవత్సరాల వరకు బెంగాల్ లాంటి సారవంతమైన సూబాను నిశ్చింతగా హాయిగా

పరిపాలించాడు. కేంద్ర ప్రభుత్వం, రాజధాని నుండి సుదూరంలో ఉన్నందువలన అతనిలో సోమరితనం, విశ్రాంతికోరే మనస్తత్వం చోటుచేసుకున్నాయి. అంతేకాకుండా ఈ విశ్రాంతి, నిశ్చింతలు అతనిలో ఒకింత బాధ్యతా రాహిత్యాన్ని కూడా పెంపొందించాయి. చక్రవర్తి మాత్రం ఇతని పట్ల ప్రేమ సంతృప్తులు కలిగి ఉండేవాడు, అప్పుడప్పుడు ఈ కుమారునికి కానుకలు కూడా పంపిస్తూ ఉండేవాడు. ఈ ఇరువై సంవత్సరాల పరిపాలనలో అతడు రెండు పర్యాయాలు బెంగాల్ నుండి వచ్చాడు. అతని జ్యేష్ఠ సోదరి జహాఁఆరా బేగం కూడా ఇతన్ని అమితంగా అభిమానించేది, అందుకే అతని వివాహ ఖర్చులన్నీ కూడా తానే భరించింది. ఔరంగజేబ్‌తో కూడా ఈ సోదరునికి సత్సంబంధాలుండేవి. వీరిద్దరిలోని సత్సంబంధాలను చెడగొట్టేందుకు దారా షికూహ్ ఎంతో ప్రయత్నించి విఫలుడయ్యాడు. (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీరి. సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, ఎం.ఏ., పేజి 387, 388)

షాజహాన్ చరిత్ర రాసిన డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా, జదూనాథ్ సర్కారు రెఫరెన్సును ఉటంకిస్తూ ఇలా రాశాడు : “అతని (షాజహాన్) రెండవ కుమారుడు బెంగాల్‌కు పరిపాలకుడు. అతను అసామాన్యమైన తెలివితేటలు మంచి నైతికత, నిర్మల స్వభావం కలిగినవాడు. కాని నిరంతర భోగలాలసత్వాలు, బెంగాల్‌లోని సరళమైన పరిపాలనా వ్యవస్థ, మనిషిని బలహీనపరిచే ఈ రాజ్యపు పదిహేడు సంవత్సరాల పరిపాలన అతన్ని బలహీనునిగా, సోమరిగా, బాధ్యతా రాహిత్యునిగా చేశాయి. గట్టి పరిశ్రమ, సహనాన్ని పరీక్షించే ప్రయత్నం, దూరదృష్టి, జాగరూకత లాంటి సుగుణాలతో వంచితుడయ్యాడు. అతని పరిపాలనా వ్యవస్థ అత్యంత బలహీనంగా ఉండేది. అతని సైన్యం పనికిరానిది, పరిపాలనా శాఖలన్నీ సోమరి తనానికి, విశ్రాంతి, సౌఖ్యానికి అలవాటు పడ్డాయి. బెంగాల్‌లోని అంటురోగాలతో కూడిన వాతావరణం అతని ఆరోగ్యాన్ని చెడగొట్టింది. చివరికి 41 సంవత్సరాల్లోనే అతను తనను ముదుసలిగా, బలహీనునిగా భావించుకోసాగాడు, అతని మానసిక శక్తులన్నీ పూర్వం లాగానే యథాస్థితిలో ఉన్నప్పటికీ, వాటిని మేల్కొలపటానికి, కార్యోన్ముఖునిగా చేయడానికి బలమైన విపత్తులు, ఆపదలు అవసరమై ఉండేవి. (కాని అలాంటివి అతని జీవితంలో సంభవించలేదు). ఎప్పుడో, కొన్ని సందర్భాల్లోనే అవి తాత్కాలికంగా వచ్చిపోయాయి. (షాజహాన్ చరిత్ర- డా.బనారసీ ప్రసాద్ సక్సేనా, పేజి 381)

## 3. ఔరంగజేబ్ :

ఔరంగజేబ్ గురించి డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ ఇలా రాశారు: “చిన్నప్పటి నుండే ఔరంగజేబ్ ప్రదర్శించిన ధైర్యస్థైర్యాల కారణంగా ఏ తండ్రికైనా అలాంటి సుపుత్రుని చూసి గర్వించాల్సి ఉండేది. సుఖ సౌఖ్యాలకు, అంధవిశ్వాసాలకు దూరముంటూ, యవ్వనాన్ని గడిపేసినా ఔరంగజేబ్‌ను రాజధాని నుండి దూరంగానే ఉంచడం జరిగింది. అనుభవ రాహిత్యుడు, భోగలాలసుడు, నిర్హేతుకమైన విషయాల్ని విశ్వసించే దారాను పట్టాభిషిక్తుని చేస్తాననే షాజహాన్ కోరిక, రాజకీయ వాతావరణాన్ని ఏ పరిణామాలకు తీసుకువెళ్తుంది? ..... ఔరంగజేబ్ సంవత్సరాల తరబడి శత్రువులను ఎదుర్కొంటూ రాజ్యాన్ని విస్తరిస్తూ, పటిష్ఠపరుస్తూ వచ్చినా

కూడా అతన్ని అనుమానానికి, అవమాన అవహేళనలకు గురిచేయడం జరిగింది..... సింహాసనానికి సంబంధించి ఉత్పన్నమైన సమస్యల్ని పరిష్కరించడం కోసం కుమారులందరినీ కూర్చుండబెట్టి పరిష్కారం కనుగొనేందుకు బదులు, దారా చూపించిన త్రోవపైనే నడవడం షాజహాన్ కోసమే కాదు, ఏ రాజుకైనా ఒక సమస్యను లేవదీసినట్లవుతుంది. ఇదంతా జరిగినప్పటికీ కూడా ఔరంగజేబ్ ఓర్పు వహించడమే మనం కనుగొంటాము. మురాద్, షుజాల కన్నా ముందు ఔరంగజేబ్ తిరుగుబాటును లేవదీయలేదు..... జదూనాథ్ సర్కారును అనుసరించి బీజాపూర్ యుద్ధం సమాప్తమైనప్పటి నుండి సింహాసనాన్ని పొందేవరకు (1657 అక్టోబరు 4 నుండి 1658 జూలై 21 వరకు) ఔరంగజేబ్ కాలమంతా అసామాన్య మైన చింతావ్యాకులతల్లో గడిచిపోయింది. ఆపదలు వరదల్లా వచ్చిపడుతున్నాయి. వాటిని ఆపడమో లేక నివారించడమో ఔరంగజేబ్‌కు సాధ్యపడే విషయం కాదు. అతని భవిష్యత్తు అంధకారమయంగా కనబడసాగింది. ఆ సమయంలో చిన్నా, పెద్ద ఏ ఆపదలనైతే అతను అధిగమించగలిగాడో, అది అతనిలోని సహనాన్ని, వివేకతను, చురుకుదనాన్ని, సైన్య సమీకరణ యోగ్యతను మరియు అతనిలోని నియమ పాలనను ప్రశంసించడానికి మనల్ని వివశుల్ని చేస్తాయి..... షాజహాన్ మరణం కంటే ముందు తిరుగుబాటు చేయరాదని అతను నిర్ణయం చేసుకున్నాడు. కాని వేగంగా సంభవించిన సంఘటనలు అతన్ని వేరేమార్గం అవలంబించడానికి వివశున్ని చేశాయి.... తన యోగ్యత మరియు అనుభవం దృష్ట్యా నలుగురు సోదరుల్లో అతనికే కీర్తి ప్రతిష్ఠలుండేవి. అనేకమంది నాయకులు మరియు ఇతర ఉన్నతాధికారులు ఇతన్నే భావి చక్రవర్తిగా గుర్తించి, తమ సమర్థన ఇవ్వడానికి సంసిద్ధంగా ఉన్నారు ...... ఔరంగజేబ్ అత్యంత ధైర్యసాహసాలు గలవాడు, అసామాన్య పరాక్రమశాలి. ప్రశాంతంగా ఆలోచించి, ఆచితూచి అడుగువేయడం అతని స్వభావం. కేవలం పదిహేను సంవత్సరాల ప్రాయంలో మదంలో ఉండి, చిర్రెత్తిన ఏనుగుల్ని ఒంటరిగా ఎదుర్కోవడం ఒకవైపైతే, వేరొకవైపు ఎనభై ఏడు సంవత్సరాల వృద్ధాప్యంలో "బాగన్‌ఖేడ" ను ముట్టడించే నిమిత్తం తవ్విన అగడ్తల్లో నిలబడి తన సాహసాన్ని, ధైర్యస్థైర్యాలను ప్రదర్శించాడు. సమీపంలోనే ప్రమాదాలు ముంచుకు వస్తున్నాయని తెలిసి కూడా ధైర్యోత్సాహాల్ని ప్రదర్శించడం, ఖజ్వాహ్ మరియు ధర్మావత్ యుద్ధాల్లో మృత్యువును కూడా నిర్లక్ష్యంచేసి ఎదురొడ్డి నిలబడడం అతని జీవితంలోని మరువరాని ఘట్టాలు..... ఇతర రాకుమారులకు భిన్నంగా అతను పుస్తకపఠనంపై శ్రద్ధ కనబరిచేవాడు. అత్యంత సూక్ష్మంగా ఆలోచించడం అతని అలవాటు, గాంభీర్యం అతని స్వభావం. అతనందరితో గౌరవప్రదంగా సత్ప్రవర్తనతో మెలిగేవాడు, ఈ కారణంగా రాకుమార దశనుండే షాజహాన్ దర్బారులోని గొప్ప గొప్ప నాయకులందరూ అతని మిత్రులయ్యారు. తన ఈ అలవాటును రాజ్యాధికారం చేపట్టిన తరువాత ఇంకనూ పెంపొందించుకున్నాడు. రాజరికపు వేషభూషణల్లో ప్రజలు అతన్నో ఫకీరుగా గుర్తించారు. అతి సామాన్యంగా నియమ నిబంధనలతో కూడిన జీవితం గడిపేవాడు, పనికిమాలిన చేష్టలకు అతను బహుదూరంగా ఉండేవాడు. ప్రజలతన్ని 'సజీవ మహాత్ముని'గా పిలిచేవారు." (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి -డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 11, 12, 34)

షాజహాన్ చరిత్ర వ్రాసిన డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా ఔరంగజేబ్ గురించి ఇలా అంటారు.

"షాజహాన్ మూడవ కుమారుడు ఔరంగజేబ్. ఇతను చక్రవర్తి ప్రతినిధిగా దక్కన్‌లో పరిపాలిస్తున్నాడు. సోదరులందరిలో స్వభావము మరియు నడవడికల రీత్యా ఇతను అత్యంత భిన్నమైనవాడు. అతను మేలిమి బంగారం లాంటి గుణగణాలు కలిగినవాడు. పదహారు సంవత్స రాల ప్రాయం నుండే అతను పరిపాలనా కార్యకలాపాలు, రాజ్యపు యుద్ధతంత్రాల్లాంటి కఠినమైన, దుర్భేద్యమైన పనుల్లో జీవితం గడిపాడు. అసామాన్యమైన అతని ధైర్యస్థైర్యాలు, లక్ష్యసాధనలో అచంచలమైన అతని పట్టుదల, అనన్య సామాన్యమైన ఓర్పు, సహనాలు – అతన్ని తోటివారితో, భక్తి విశ్వాసాలు కాకపోయినా, పొగడ్త, ప్రశంసలు మాత్రం అందుకుంటుండేవనడంలో సందేహం లేదు. బల్ఖ్, ఖాందహార్‌లలో, ముల్తాన్ గుజరాత్‌లలో, సింధ్ మరియు దక్కన్ సూబాలలో అతను చేసి చూపించిన ఘనకార్యాలు అతనే ఉక్కు పదార్థంతో రూపొందించబడ్డాడో నిరూపిం చాయి. అతను యుద్ధ మైదానంలో ఎంత చురుకుగా, జాగరూకుడై ఉండేవాడో, ప్రశాంతంగా జరిగే పరిపాలనా వ్యవహారాల్లో కూడా అతనలాగే ప్రవర్తించేవాడు. ప్రేమకన్నా అతని భయమే హృదయాల్లో తొణకిసలాడేది. మనిషిలోని నడవడికల్ని, నైతికల్ని అంచనా వేయడంలో అతను దిట్ట. ఎక్కడ, ఎప్పుడు, ఏ మనిషిని ఉపయోగించాలనే రహస్యాన్ని అతను బాగా ఎరిగినవాడు. ఈ ప్రత్యేకతలే అతన్ని పరాజయపు కోరల నుండి విజయాన్ని లాక్కొచ్చేటంతటి యోగ్యునిగా చేశాయి. (షాజహాన్ చరిత్ర – డా. బనారసీ ప్రసాద్ సక్సేనా (ఉ.అ) – పేజి 381, 382)

ప్రఖ్యాత చరిత్రకారుడు జదూనాథ్ సర్కారు ఇలా రాశాడు :

"మనవరకు చేరిన కొన్ని కథనాలను అనుసరించి షాజహాన్ మరియు అతని మంత్రులు రాకుమారులందరిలో కెల్ల ఔరంగజేబే యోగ్యుడని భావించే వారనేది అర్థమవుతుంది. ఈ భవిష్యవాణులు తరువాత పొడిగించబడ్డాయని భావించి, వాటిని కొట్టిపారేయడం నాకు సాధ్య మయ్యే పనికాదు. వాస్తవంలో కూడా షాజహాన్ నలుగురు కుమారుల్లో తన యోగ్యత మరియు అనుభవాల రీత్యా అతను మంచి పేరు ప్రతిష్ఠలు కలిగి ఉండేవాడు. క్రియాపూర్వకంగా అతను చేసి చూపించిన కార్యాలు స్పష్టమైనవి, బహుముఖమైనవి, పేర్కొనదగినవి. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ – జదూనాథ్ సర్కార్, వాల్యూం- 1, పేజి 211)

సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, ఎం.ఎ. తన ప్రఖ్యాత గ్రంథం "ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీరి"లో ఔరంగజేబ్ గురించి ఇలా రాశారు:

"ఔరంగజేబ్ కాకుండా మిగిలిన సోదరులిద్దరు అనగా మురాద్ మరియు షుజాలు దేశంలో, ప్రజల్లో ప్రాకిపోయేంత ఘనకార్యాలేమీ చేసివుండలేదు. కాని వారిద్దరికి భిన్నంగా ఔరంగజేబ్ యొక్క వీరత్వం, రాజనీతిజ్ఞత, దూరదృష్టి, ధార్మికాచరణ, మహోన్నతమైన నైతికతల కారణంగా అతను పేద ధనిక, సామాన్యులు నాయకులు, పండితులు పామరులు, ధర్మనిష్ఠులు తాగుబోతులు – అందరికీ సుపరిచితుడు, ప్రతి వ్యక్తి అతన్ని ఎరుగుతాడు. మదించిన ఏనుగులతో

పోరాటం మొదలుకొని, సోదరుల్లో జరిగిన అంతర్యుద్ధాల వరకు, ఔరంగజేబ్ పాలుపంచుకోని, ప్రభుత్వానికి సంబంధించి పేర్కొనదగిన ఒక్క కార్యం కూడా లేదు. అది బల్ఖ్ బదఖ్షాంల యుద్ధాలు కానివ్వండి, ఖాందహార్ ముట్టడి కానివ్వండి, దక్కన్ పోరాటాలు కానివ్వండి, లేక సూబాల ఉత్తమ పరిపాలనా వ్యవస్థ కానివ్వండి, ప్రతిదానిలో అతని పాత్ర, ప్రమేయం ఉంది, అందుకని ప్రతి ఇంట్లో అతని చర్చ జరిగేది, ప్రతి వ్యక్తి అతన్ని గుర్తించేవాడు. దీనికి తోడుగా దారా చూపే భక్తి హీనత (నిరీశ్వరత్వము)తో విస్మయం చెందిన ప్రజలు, ఔరంగజేబ్ ధార్మికతతో ప్రభావితులై అతన్ని అభిమానించసాగారు. దారా తన దురుసు స్వభావంతో దర్బారు నాయకుల్ని తన నుండి దూరం చేసుకోకపోయినా, తన శ్రేయోభిలాషులుగా కూడా ఉంచుకోలేకపోయాడు. ఈ అన్ని కారణాల వల్ల ఔరంగజేబ్‌నే, కేవలం ఔరంగజేబ్‌నే దారా తన ప్రథమ శత్రువుగా, ప్రధాన విరోధిగా, పెద్ద అడ్డంకిగా తలంచేవాడు. ఈ కారణంగానే ప్రారంభం నుండే ఔరంగజేబ్‌ను కించపరచడానికి, అవమానపరచడానికి, అపకీర్తిపాలు(defame) జేయడానికి అతన్ని తండ్రి ఆగ్రహానికి గురిచేయడానికి రకరకాలుగా ప్రయత్నాలు చేస్తుండేవాడు, నిరంతరం కుట్రలు పన్నేవాడు, అతన్ని నమాజీ అంటూ, ఫకీరు అంటూ, కపటుడంటూ రకరకాల మానసిక వ్యధలకు గురిచేసేవాడు, అతని ధార్మికత్వాన్ని నిండు దర్బారులో అవహేళన చేయడం జరిగేది. ఔరంగజేబ్ పట్ల ద్వేషం, శత్రుత్వాల్లో అతనెంతగా దిగజారిపోయాడంటే, అల్పులు, నీచులు కూడా అంతగా దిగజారిపోరు.

దారా తమ ముగ్గురిలో ఏ ఒక్కరికి కూడా హాని కలిగించ తలపెట్టినప్పుడు మిగిలిన ఇద్దరు సోదరులు దారాకు వ్యతిరేకంగా బాధితసోదరుని తరఫున అన్ని రకాల చర్యలు చేపట్టాలని షుజా, ఔరంగజేబ్ మరియు మురాద్‌లలో అంతకు ముందే ఒక ఒడంబడిక జరిగిందని తెలుసుకున్నాము. ఎప్పుడైతే షాజహాన్ గతించాడని, దారా అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడనే వార్త అందగానే ముగ్గురు సోదరులు పరస్పరం సలహా సంప్రదింపులు మొదలుపెట్టారు. కాని ఈ ముగ్గురు సోదరులు ఏదో ఒక నిర్ణయానికి, ఒక పరిష్కారానికి రాకముందే మురాద్ మరియు షుజాలు తమ తమ స్వతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అంతే కాకుండా ఆగ్రాచేరి, దారా నుండి రాజ్యాధికారాన్ని లాక్కోవాలని సన్నాహాలు మొదలుపెట్టారు. దీనితో పాటే వీరిద్దరూ ఔరంగజేబ్‌ను తమతో పాటుగా బయలుదేరాల్సిందిగా కూడా కోరారు. కాని ఆ సమయంలో ఔరంగజేబ్ వారిలాగా నిశ్చింతగా, సిద్ధంగా లేడు, అతను బీజాపూర్ యుద్ధంలో ఇరుక్కుని ఉన్నాడు. తండ్రి ఆదేశానుసారమే అతను బీజాపూర్‌ను ముట్టడించి ఉన్న సమయంలోనే కేంద్ర సైన్యాల్ని ముట్టడి నుండి వైదొలగి వెంటనే రావాల్సిందిగా జ్యేష్ఠ సోదరుడు దారా ఆదేశాలు జారీచేసి అతన్ని అత్యంత ప్రమాదకర పరిస్థితిలో పడేశాడు. దాన్నుండి క్షేమంగా బయటపడడమే అతనికి గగనమై పోతున్నది. నిజ పరిస్థితిని తెలుసుకొని బీజాపూర్ వారు ఎదురు దాడికి దిగితే తానూ, తన సైన్యం సర్వ నాశనమైపోతారు. అందుకే సంధి ప్రయత్నాలు చేస్తున్నాడు. అంతేకాకుండా అతను వారిలాగా తొందరపడే మనిషికాడు, పర్యవసానాల్ని, పరిణామాల్ని, వాస్తవాల్ని నిర్లక్ష్యంచేసే మనస్తత్వం కాదతనిది. ప్రస్తుతమతను

యుద్ధ పరిస్థితులతో, సంధిషరతులతో సతమతమవుతున్నాడు. ఏ కాస్త పొరపాటు జరిగినా, రెండేళ్ళపాటుగా అతను సాధించినవన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. వేరొక వైపు తానలాగే జాప్యం చేస్తుంటే జ్యేష్ఠ సోదరుడు బలం పుంజుకొని, తన పీక నొక్కేస్తాడు. ఒకదాన్ని సాధించాలనుకుంటే, వేరొకటి చేజారి పోయేటట్లుంది. ఇది ఔరంగజేబ్‌కు ఎంతో గడ్డుకాలం. అయినా తన దూరదృష్టి, సమయస్ఫూర్తి, వివేక వివేచనాలతో ఔరంగజేబ్ ఈ రెండు లక్ష్యాల్ని సాధించ గలిగాడంటే అది ఔరంగజేబ్‌లాంటి వ్యక్తికే సాధ్యమయింది.

(ముఖద్దమ రుఖ్‌అత్ ఆలంగీరి-సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, పేజి- 368, 400, 401, 414)

ఔరంగజేబ్ గురించి హమీదుద్దీన్ ఖాన్ ఇలా వ్రాశాడు :

“ఐదువేల మన్సబులు కలిగిన అత్యున్నత దర్బారు నాయకులతో దారా షికూహ్ కొందరితో ద్వేష వైఖరిని మరికొందరితో అహంకార వైఖరిని అవలంబించేవారు. వీరంతా పెద్దలు, చక్రవర్తుల వారి అంతరంగికులు, స్నేహితులు. ఉదాహరణకు అలీ మర్దాన్ ఖాన్, సఅదుల్లా ఖాన్ మరియు సయ్యద్ మీరాఁబారహ్ మొదలగువారు. అయితే వీరందరితో అయ్య గారికి (ఔరంగజేబ్‌కు) స్నేహపూర్వక, వినయవిధేయతలతో కూడిన సత్సంబంధాలుండేవి. అలీ మర్దాన్ ఖాన్‌ను ఎల్లప్పుడు “దయగల సత్శీలురు” అని సంబోధించేవారు, ఈయనకు చక్రవర్తుల వారు యారె వఫాదార్ (విశ్వసనీయుడైన మిత్రుడు) అనే బిరుదును ప్రసాదించి ఉన్నారు. ఇక “అసాయె పీరి” (వృద్ధాప్యపు సహాయకర్ర), వజీరె బాతద్‌బీర్ (యుక్తినిండిన మంత్రివర్యుడు) అనే బిరుదులు పొందిన సాదుల్లా ఖాన్ వద్ద ఈయన ఒకప్పుడు పాఠాలు చదివి ఉన్నందున, తనను ఆయన శిష్యునిగా భావించుకునేవారు. అందుకని ఆయన్ను ఎప్పుడు సంబోధించవలసి వచ్చినా “యుక్తి మూర్తీభవించిన మంత్రివర్యులనో” లేక “అల్పుని గురువర్యులనో” సంబోధించేవారు. ఇక చక్రవర్తుల ద్వారా “సయ్యదుస్సాదాత్” గా బిరుదుపొందిన సయ్యద్ మీరాఁ బారహ్‌ను “విశ్వనాయకుల సంతానమంటూ” సంబోధించేవారు. ఈ ముగ్గురిలోని ప్రతి ఒక్క నాయకుడే కాకుండా ఇతర దర్బారు నాయకులు అనగా అఫ్జల్ ఖాన్, ముల్లా అలావుల్ ముల్క్ మొదలగువారు కూడా ఈయన పట్ల ప్రేమాభిమానాల కారణంగా రహస్యంగా, పరోక్షంలో ఈయన్ను సమర్థించేవారు, ఈయన పక్షంలో నిలబడేవారు, ఈ విషయం ప్రభువుల వారికి (చక్రవర్తికి) నచ్చకపోయేది, దీన్ని ఆయన ఓర్వలేకపోయేవారు. దారా షికూహ్ నొసట కనబడుతున్న దౌర్భాగ్యాన్ని, ఔరంగజేబ్ అదృష్టంలో కనబడుతున్న ఔన్నత్యాన్ని చూసిన (ప్రభువులవారు) చెడు వర్తనం నుండి, పరుష వచనాల నుండి దూరమవ్వాలని దారా షికూహ్‌కు హితబోధ చేసేవారు. కాని ఎవరి అదృష్టమనే కంబళి నల్లటి వెంట్రుకలతో నేయబడిందో దాన్ని జంజం (జలం) మరియు స్వర్గపు నీరు కూడా తెల్లబరచదన్నట్లు, ఈ హితబోధ యువ రాజుపై ప్రభావం చూపనప్పుడు, ఔరంగజేబ్ దర్బారు నాయకులతో తన ప్రవర్తనలో మార్పు తేవాలని, ఫలితంగా వారు ఈయన శ్రేయాన్నుండి వైదొలుగుతారని ఆశించారు. అందుకే

ఆయన స్వహస్తాలతో ఔరంగజేబ్‌కు ఒక లేఖ రాస్తూ "బాబూ! చక్రవర్తి, ఆయన కుమారులు ధైర్యస్థయిర్యాలు కలిగి ఉండాలి. రాజఠీవిని ప్రదర్శించాలి, ఉద్యోగులందరితో నీవు సమాన స్థాయిలో, గౌరవప్రదంగా మెలగుతావని, ఫలితంగా నీకు నీవు అల్పునిగా చేసుకుంటున్నావని విన్నాను. ఒకవేళ ఇది పరలోక సాఫల్యం దృష్టితో చేస్తున్నట్లయితే, అన్ని కార్యాలు అదృష్టంతో ముడివడి ఉన్నాయని తెలుసుకో. ఈ అల్ప స్వభావంతో పరాభవం తప్ప ఇంకేమీ చేజిక్కదు" అంటూ సుదీర్ఘంగా మందలించారు.

దీనికి ఆయనిలా సమాధానమిచ్చారు: "ప్రభువులవారు ఈ సేవకుని పట్ల దయ కనికరాలతో దేన్నైతే సూచించారో, దాన్ని ఈ దాసుడు ఆకాశం నుండి అవతరించిన దైవవాణిగా గుర్తిస్తాడు. ప్రభువుల వారు సదా ఆయురారోగ్యాలతో వర్ధిల్లుదురుగాక! గౌరవం, పరాభవం రెండూ దైవం తరఫు నుండే వస్తాయి. గౌరవం, పరాభవం రెండూ సర్వశక్తి సంపన్నుడు, భూమ్యాకాశాల ప్రభువు ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటాయి. ఈ సేవకుడైతే, "ఎవరైతే తన అహాన్ని అణిచివేసుకుంటాడో, అతనికే దైవం గౌరవాన్ని ప్రసాదిస్తాడు" అనే హదీసు (మహాప్రవక్త (స) ప్రవచనం)ను అనుసరిస్తాడు. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) దీన్ని ఉల్లేఖించారు. హృదయాన్ని నొప్పించడం అన్ని లోపాల్లోకెల్లా మహా లోపంగా, అన్ని చెడుల్లోకెల్ల గొప్ప పాపంగా తలుస్తాను. ప్రభువులవారు వ్రాసిందాన్ని నేను వ్యతిరేకించడం లేదు. కాని కొన్ని సందర్భాల్లో మనుషుల్లో నుండో, జిన్నాతుల్లో నుండో కొందరు మనిషి హృదయాల్లో చెడు తలంపులు వేస్తూ ఉంటారు. (వస్‌వాసిల్ ఖన్నాస్ అల్లజీ యువస్‌విసు ఫీ సుదూరున్నాసి మినల్ జిన్నతి వన్నాస్)ను అనుసరించి రాయవలసివచ్చింది. (అహ్‌కామె ఆలంగిరి- హమీదుద్దీన్ ఖాన్, పే. 31-33)

## 4. మురాద్ బక్ష్:

రాకుమారుడు మురాద్ బక్ష్ గురించి నజీబ్ అష్రఫ్ నద్వి ఇలా వ్రాశారు: "ఈ రాకుమారుడు అందరిలోకెల్ల చిన్నవాడు, కాని అందరిలోకెల్ల ధీరుడు, అందరిలోకెల్ల అంధవిశ్వాసం గలవాడు మరియు అందరిలోకెల్ల మంకుపట్టు గలవాడు (అంటే తాను చెప్పిందే నిజమనే మొండిఘటం). నిలకడలేని మనస్తత్వం గలవాడు, తీవ్ర స్వభావి, అత్యంత అమాయకుడు, మనసులోని మాటను దాచుకోలేనివాడు, ఎవరైనా ఏదైనా ఓ విషయం చెబితే వెంటనే నమ్మేసేవాడు, అంతేకాకుండా దాన్ని అనుసరించి ఆచరణకు పూనుకునేవాడు. తన అంతరింగిక సలహాదారు అయిన అలీ నఖీని, స్వయంగా తన చేతుల్తో హతమార్చడం అతనిలోని ఈ విశ్వాస బలహీనతకు పరాకాష్ట. షుజాకన్నా ఇతను ఔరంగజేబ్‌కు సమీపంలో ఉన్నాడు, సన్నిహితుడు. ఒకవైపు ఔరంగజేబ్ సలహాలను కోరేవాడు, అతని ఆదేశాలకు అగత్యపడి ఉన్నానని తెలుపుకునేవాడు, అతని ఆదేశాల్ని పాటించడం తన విధి అంటూ పేర్కొనేవాడు, వేరొకవైపు ఔరంగజేబ్‌కు ఇష్టం లేనివేకాదు, అతను వారించిన పనుల్ని కూడా ఇష్టానుసారంగా చేస్తూ

పోయేవాడు, అలీ నఖీ దారా మనిషేమోననే కేవలం అనుమానం మీదనే అతన్ని హతమార్చేశాడు. తరువాత ఈ నేరం మీదనే ఖిసాస్ (ప్రతిహత్య) కింద తనూ అసువులు బాసాడు. అలీ నఖీని సంహరించిన తరువాత, ఔరంగజేబ్ వారిస్తున్నా వినకుండా సూరత్ నగరాన్ని ఆక్రమించుకోవడానికి ఒక సైన్యాన్ని పంపాడు. ఈ విధంగా ఒక ముఖ్య నగరాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా అక్కడి వజ్రాల వర్తకుల నుండి గొప్ప ధనాన్ని కూడా వసూలుచేసుకోవచ్చనేది అతని అభిప్రాయం. అతను తాగుబోతే కాదు, భోగలాలసుడు కూడాను. సూరత్ నగర ముట్టడి జరుగుతున్నప్పుడే, ఔరంగజేబ్ వారిస్తున్న వినకుండా తను స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్నాడు. మొత్తానికి అతను తనను రాజుగా ప్రకటించుకొని, సైనిక సమీకరణకు సన్నాహాలు మొదలు పెట్టాడు. ఇవన్నీ స్వతంత్రంగా తన ఇష్టానుసారం చేస్తున్నప్పటికీ, తానొంటరిగా ఏమీ చేయలేడనే విషయం అతనికి బాగా తెలుసు. అందుకే ఒంటరిగా దారాను ఎదుర్కోవడానికి వెళ్ళే సాహసం చేయలేకపోయాడు. అయితే దీనితోపాటే ఔరంగజేబ్‌పై ఉత్తరాల వర్షం కురిపించసాగాడు, చివరికి కొన్ని సందర్భాల్లో ఔరంగజేబే గనక తనకు సహకరించకపోతే, తాను ఒంటరిగానే బయలుదేరుతానని కూడా బెదిరించాడు. లోగడ చేసుకున్న ఒప్పందపు షరతులు అస్పష్టంగా ఉన్నాయని, ముగ్గురు సోదరులు కలిసి సంయుక్తంగా పని ప్రారంభించేముందు, స్పష్టమైన షరతులతో కొత్త ఒప్పందం జరుగాలని, సూబాలు విభజింపబడాలని కోరాడు. ఆ సమయంలో షుజా అక్కడ లేడు, కాని షుజా బెంగాల్, ఒరిస్సాలతో పాటుగా బిహార్ సూబాను కూడా ఆశిస్తున్నాడని వారికి తెలుసు. అందుకని అలహాబాద్ మరియు బనారస్ వరకు గల ప్రాంతాన్ని అతనికి విడిచి, మిగిలిన రాజ్యాన్ని ఇరువురు పంచుకున్నారు. దీని ననుసరించి పంజాబ్, అఫ్గానిస్తాన్, కాశ్మీర్ మరియు సింధ్ సూబాలు మురాద్‌కు, మిగిలిన రాజ్యం ఔరంగజేబ్‌కున్నూ, అదేవిధంగా యుద్ధసొత్తులో మూడవ భాగం మురాద్‌కు, రెండు భాగాలు ఔరంగజేబ్‌కు దక్కుతాయనే షరతులు అంగీకరించబడ్డాయి. మురాద్‌ను రాజుగాచేసి, తాను భారతదేశాన్ని విడిచిపెడ్తానని ఔరంగజేబ్ మురాద్‌ను మోసగించాడని పక్షపాతం గల కొందరు చరిత్రకారులు లేపిన అపవాదును ఈ ఒప్పందం ఖండిస్తుంది. దీనికి భిన్నంగా రాజ్యం మరియు యుద్ధ సొత్తు యొక్క పంపిణీల ద్వారా, ఔరంగజేబ్ భారతదేశాన్ని పరిపాలించదలిచాడనే వాస్తవం మనం అంగీకరించకుండా ఉండలేము. మురాద్ తన స్వభావానికి వివశుడై పోయేవాడు. ఏదైనా చేయాలని నిర్ణయానికి రాగానే, ఇక ఆలస్యం అతనికి భరించనలవి కాకుండేది. మురాద్ కపటం లేని మనసు కలిగినవాడు, ప్రతి దాన్ని తన కత్తిబలంతో సాధించవచ్చనే యోచన కలవాడు. అయినప్పటికీ యుద్ధానికి ముందే వివిధ దర్బారు నాయకుల్ని తన వారిగా చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. అతని చంచల స్వభావాన్ని ఎరిగిన వారు గనక వారు కూడా నోటిమాటగా అతన్ని సమర్థిస్తామని మాట ఇచ్చారు. స్వయంగా మహారాజా జస్వంత్ సింగ్‌తో కూడా అతను ఇలాంటి వాగ్దానాన్నే తీసుకున్నాడు. అతను దారా తరఫున

మురాద్‌ను ఆటంకపరచడానికి వచ్చినప్పుడు జస్వంత్ సింగ్ ఆ సాకుతో తనను కలువడానికి వస్తున్నట్లు మురాద్ పొరబడ్డాడు.

జస్వంత్ సింగ్ లాగే అతను ఇతర దర్బారు నాయకులకు అనగా ఖానె జహాఁ, ముఖ్లిస్ ఖాన్, ఇఫ్తెఖార్ ఖాన్, నసీరి ఖాన్ మొదలగువారికి ఉత్తరాలు రాశాడు. ఈ లేఖల్ని అధ్యయనం చేసిన తరువాత, ఇంకా ఆ తరువాత జరిగిన సంఘటనల్ని క్రమానుసారంగా పరిశీలిస్తే, మురాద్ ఔరంగజేబ్ సమక్షంలో చూపించే వినయ విధేయతలు తాత్కాలికమైనవని, అవి గత్యంతరం లేని పరిస్థితుల కారణంగానే అనేది అర్థమవుతోంది. తానొంటరిగా ఏమీ చేయలేడు అందుకని ఔరంగజేబ్‌ను ఆశ్రయించాడు, కాని తగిన సమయం రాగానే ఔరంగజేబ్‌ను కూడా ఓడించి, మొత్తం భారతావనికి రాజు కావాలని అతను తన మనసులో ఆలోచించి పెట్టుకున్నాడు. కాని అలా జరుగలేకపోయింది. అతను ఔరంగజేబ్ కోసం ఏ వల అయితే వేసాడో, అందులో స్వయంగా తనే ఇరుక్కుపోయాడు.”

(ముఖద్దమ రుఖ్‌ఆత్ ఆలంగీర్- సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, పే. 406-409,411, 412)

ఇక “షాజహాన్ చరిత్ర” రాసిన చరిత్రకారుడు డాక్టర్ బనారసీ ప్రసాద్ అభిప్రాయాల్ని తెలుసుకుందాం.

“నాలుగవ కుమారుడు మురాద్. మాల్వా, గుజరాత్‌లో చక్రవర్తి ప్రతినిధిగా పరిపాలిస్తున్నాడు. ఇతను పరస్పర వ్యతిరేక గుణాల సమూహం. అతను వెన్నుచూపని పరాక్రమవంతుడు కాని సుఖసౌఖ్యాలు, భోగపరాయణాలంటే పడిచచ్చేవాడు. అతనిలో సైనిక చురుకుదనం, తెగింపు, దాడి జరిపే యోగ్యతలైతే ఉన్నాయి. కాని ఒక సఫలమైన సైన్యాధిపతిలో ఉండవలసిన లక్షణాలు లేవు, అతను ఉత్సాహవంతుడు, ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఎరుగనివాడు. వ్యవహారాన్ని తన వైపునకు ఎలా తిప్పుకోవాలో తెలియని మనస్తత్వం గలవాడు, కాని దీనితో పాటే మర్యాదస్తుడు. క్లుప్తంగా చెప్పవచ్చేదేమంటే కుయుక్తులు తెలియని యువకుడు, కాని కిరీటం, సింహాసనం పొందాలనే ఉత్సుక కలవాడు. కాని ఉపాయంతో, దీర్ఘాలోచనలు చేసి, ప్రణాళికలు రూపొందించి, ఆచరించే సామర్థ్యం లేనివాడు. (షాజహాన్ చరిత్ర - డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా - పేజి 382)

డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ మురాద్ గురించి వివరంగానైతే పేర్కొనలేదు. కాని కొన్ని విషయాలు మనకు తెలియబరిచారు.

“ఖురాన్‌ను సాక్షిగా చేసి ఔరంగజేబ్ సామ్రాజ్య విభజన ప్రణాళికను రూపొందించాడు. దీనిని అనుసరించి అఫ్ఘనిస్తాన్, పంజాబ్, కాశ్మీర్ మరియు సింధ్ సూబాలు మురాద్‌కు కేటాయించబడతాయని, వాటిపై అతను ఒక స్వతంత్ర రాజుగా పరిపాలిస్తాడని, మొగలు సామ్రాజ్యపు మిగిలిన భాగం ఔరంగజేబ్ అధీనంలో ఉంటుంది. రెండవ షరతు ఏమిటంటే

యుద్ధసొత్తు క్రింద లభించిన ధనవస్తు వాహనాదుల్లో ఒక భాగం మురాద్‌కు, రెండు భాగాలు ఔరంగజేబ్‌కు దక్కుతాయి. మురాద్ తనకున్న సైన్యాన్నంతా తీసుకొని 1658 ఏప్రిల్ 14న మాల్వా సమీపంలో, దీపాల్‌పూర్‌లో ఔరంగజేబ్‌ను కలిశాడు.

సమూగడ్ యుద్ధంలో విజయం తరువాత దుష్టసలహాదారుల సలహాలను అనుసరించి, మురాద్ బహిరంగంగానే ఔరంగజేబ్‌ను వ్యతిరేకించసాగాడు. 233 అశ్వాలు, 20 లక్షల నగదు పంపి ఔరంగజేబ్ మురాద్ అనుమానాల్ని దూరపర్చ ప్రయత్నించాడు. కాని సింహాసనాన్ని అధిష్ఠించడంలో మురాద్, ఔరంగజేబ్‌ను గొప్ప అడ్డంకిగా భావిస్తున్నాడని రహస్యంగా తెలిసివచ్చింది. అందుకని మురాద్‌కు బాగా త్రాగించి, అతని ఆయుధాలన్నీ లాక్కొని, ఔరంగజేబ్ అతన్ని చెరసాలలో పడేశాడు. బలశక్తులన్నీ ఔరంగజేబ్ చేతుల్లోకి వచ్చాయి గనక అతను తలచుకుంటే షాజహాన్ మరియు తిరుగబడిన మురాద్ ఇద్దరినీ చంపించగలిగేవాడు. కాని పైన ఇంతకు ముందే పేర్కొన్నట్లు ఔరంగజేబ్ తొందరపడే మనిషి కాదు. ఎల్లప్పుడు దీర్ఘంగా ఆలోచించి, ఆచితూచి చాల జాగ్రత్తగా ముందడుగు వేసేవాడు. గ్వాలియర్ కోటలో మురాద్ మూడేళ్ళవరకు జీవించి ఉన్నాడు. 1661 డిసెంబర్ 4న ఇద్దరు బానిసలు అతన్ని హతమార్చారు." (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 11, 14)

అనేక చరిత్ర గ్రంథాల రచయిత, షిబ్లి అకాడమి, దారుల్ ముసన్నిఫీన్ వ్యవస్థాపకుడు అల్లామ షిబ్లి నొమాని మురాద్ విషయంలో ఈ విధంగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు: "షాజహాన్ చెర మరియు దారా హత్యకన్నా కూడా, మురాద్ సమస్య అత్యంత చిక్కైనది. షాజహాన్ మరియు దారా షికూహ్, ఔరంగజేబ్‌కు ప్రాణ శత్రువులుగా మారారు. కాని మురాద్ అతని సమర్థకుడు, ఔరంగజేబ్‌కు చేదోడుగా నిలబడినవాడు. జస్వంత్ సింగ్‌తో జరిగిన యుద్ధంలో అతని తెగువ మరియు అసామాన్యమైన వీరత్వం వల్లనే విజయశ్రీ ప్రాప్తమయింది. అతను ప్రారంభం నుండే ఔరంగజేబ్‌ను సమర్థిస్తున్నాడు, శిరసావహిస్తున్నాడు. అతని ఆదేశం అనుజ్ఞల ప్రకారమే ముందడుగు వేస్తున్నాడు. అలాంటి వీరునికి విధేయుడు, స్నేహితుడు అయిన సోదరునికి ఔరంగజేబ్ ద్వారా లభించిన ప్రతిఫలమేమిటి? మొదట బంధింపబడి ఆ తరువాత జీవిత ఖైదు నుండి విముక్తి లభిస్తుంది.

కాని చరిత్రకారులు ఈ విషయాన్ని వివరంగా పేర్కొనకపోవడం వల్లనే ఈ సమస్య ఈ రూపంలో మన ముందుకొచ్చింది. సమకాలీన చరిత్రకారులైన మున్షి కాజిం ఖాన్ షేరాజి మరియు ముస్తఅద్ ఖాన్‌లయితే ఇలాంటి సంఘటనల పూర్వపరాలు అసలే పేర్కొనరు. అందుకని వారిని నిందించి లాభం లేదు. ఖాఫిఖాన్ ఎక్కడెక్కడి నుండో, ప్రత్యేకించి ఆఖిల్ ఖాన్ రాతల నుండి, సమాచారాన్ని సేకరించి, సంఘటనల్ని వివరంగా రాస్తాడు. కాని ఈ సమస్యను అతను కూడా వివరంగా పేర్కొనలేదు. మురాద్ నిర్బంధం విషయంలో ఆఖిల్ ఖాన్ వివరంగా

రాసి ఉన్నప్పటికీ ఖాఫిఖాన్ క్లుప్తంగా పేర్కొని, అసలు విషయం తెలుపకుండానే దాటేస్తాడు. ఎందుకనో? మురాద్ మనస్తత్వం బయటపడుతుందనా? లేక ఔరంగజేబ్‌ను సమర్థించినట్లు అవుతుందనా?

అసలు విషయం ఏమిటంటే మురాద్ మొక్కవోని పరాక్రమం గల ధీరుడు, వీరుడూ అయినప్పటికీ, దీనితోపాటుగానే చెప్పుడు మాటల్ని విచక్షణారహితంగా వెంటనే నమ్మేసే అమాయక మనస్తత్వం గలవాడు. ప్రజలు చెప్పే మాటలకు వెంటనే తలొగ్గేవాడు. అవలీలగా మాటల గారడిలో ఇరుక్కుపోయేవాడు. దారాపై విజయం ప్రాప్తమైన తరువాత, లోకుల పెడమార్గం పట్టించే మాటలతో ప్రభావితమై ఈ యుద్ధాలన్నీ తనే గెలిచాడని, రాజ్యానికి, సింహాసనానికి తానొక్కడే అర్హుడనే అపోహకు లోనయ్యాడు. ఈ అపోహ బలపడగానే అతను ఔరంగజేబ్‌కు దూరం కాసాగాడు, ఔరంగజేబ్‌కు చెందిన పెద్ద పెద్ద నాయకుల్ని గొప్ప గొప్ప జీతాలు, ఇనాముల ఆశ చూపుతూ తన వైపునకు తిప్పుకోసాగాడు. ఈ విధంగా త్వర లోనే అతను ఇరవై వేల సైన్యాన్ని సమీకరించుకోగలిగాడు. ఇటు రోజు రోజుకు ఔరంగజేబ్ సైనిక సంఖ్య తగ్గుముఖం పట్టసాగింది. ఇక గత్యంతరం లేక ఔరంగజేబ్ దీన్ని నివారించే ప్రయత్నం చేయక తప్పలేదు. ఈ విషయాన్నే ఆఖిల్ ఖాన్ ఇలా వివరించాడు. "ఈ మజిలీకి చేరిన తరువాత, మురాద్ ఆగ్రా నుండి బయలు దేరలేదని, ఆయన తమరిని అనుసరించడానికి వెనుకంజవేస్తున్నారని, తమరి సైన్యంలో నున్న ఇబ్రాహీం ఖాన్ లాంటి సైనికాధికారులు, మురాద్ ఉద్యోగంలో చేరిపోతున్నారని కొందరు ఔరంగజేబ్‌కు కబురు అందించారు. మురాద్ దాదాపుగా ఇరవైవేల సైన్యాన్ని సమీకరించుకున్నాడని తెలిపారు. అత్యాశపరులు, పదవీ వ్యామోహం గలవారు, మన్సబు అధికారాల ఆశతో ఆలంగీర్ సైన్యాన్ని వదలి, మురాద్ పతాకం కిందికి వెళుతున్నారు. ఈ విధంగా ఆయన గారి సైనిక బలం చూస్తుండగానే బాగా పెరిగిపోతున్న దని తెలియపరిచారు." *(వాఖియాతె ఆలంగీరి- ఆఖిల్ ఖాన్ - పేజి 65, (ఔరంగజేబ్ ఆలంగీర్ ... షిబ్లి నోమాని, పేజి 93 - 96)*

దీనితోపాటే ప్రియపుత్రుడు దారా షికూహ్ ఇక చక్రవర్తి కావడం అసంభవమని షాజహాన్‌కు నమ్మకం ఏర్పడిన తరువాత ఔరంగజేబ్ మీది కోపంతో ఔరంగజేబ్‌ను ఎలాగైనాసరే, మట్టుపెట్టాలనే ప్లానుతో, సోదరుడు, సోదర కుమారుడు (అంటే ఔరంగజేబ్, ముహమ్మద్ సుల్తాన్) ఇద్దరినీ విందు పేరుతో పిలిపించి మట్టుపెట్టి వస్తే మురాద్ తప్పుల్ని క్షమించడమే కాకుండా అతన్ని భారత చక్రవర్తిగా చేస్తానని షాజహాన్ వాగ్దానం చేస్తూ వ్రాసిన లేఖ (రుఖ్అత్ ఆలంగీర్ - లేఖ నెం.2/195) బహిర్గతమవడంతో పక్కలో బల్లెంగా మారిన మురాద్‌ను బంధించకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడిందనే వాదన కూడా ఈ సందర్భంలో గమనించదగ్గ విషయం.

పై కారణాల వల్లనే మురాద్‌ను నిర్బంధించవలసి వచ్చిందనడంలో అనుమానం లేదు. కడుపు నొప్పి సాకుతో మురాద్‌ను పిలిపించాడని, అతను విశ్రాంతికోసం గదిలోకి వెళ్ళిన తరువాత, ఒక దాసీని పంపి అతని ఆయుధాలు తెప్పించుకున్నాడని, ఆ తరువాత షేఖ్ మీరా మొదలగు వారిని పంపి అతన్ని బంధించాడని ఆఖిల్ ఖాన్ వివరంగా తెలిపాడు. రాజకీయ దృష్టితో ఈ చర్య సముచితమనిపించుకోవచ్చు, కాని ఔరంగజేబ్ మురాద్‌తో బహిరంగంగా పోరాడి, ఇతర సందర్భాల్లో జరిగిన రక్తపాతాల్లాగే, ఇక్కడ కూడా వేల సంఖ్యలో రక్తపాతం జరిగి, మురాద్‌ను యుక్తితో కాకుండా కత్తిబలంతో వశపర్చుకొని ఉంటే, ఔరంగజేబ్ వీరత్వానికి మేము జోహార్లు అర్పించుకునేవాళ్ళం. కాని ఔరంగజేబ్ తాను ఒక్క బొట్టు రక్తం చిందించని ఒక్కసారి కూడా వంచనకు పాల్పడని దైవదూతనని ఎన్నడూ ప్రగల్భాలు పలుకలేదు కదా! (ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్-షిబ్లి నొమాని-పేజి 93-96, (1999 ఎడిషన్)

తన నలుగురు కుమారుల గురించి స్వయంగా షాజహాన్ అభిప్రాయమేమిటో హమీదుద్దీన్ ఖాన్ ఇలా తెలిపాడు :

"ప్రభువులవారు (షాజహాన్) ఇలా అంటుండేవారు. ఒక్కొక్కప్పుడు మాకు ఓ ఆలోచన వస్తుంది. దారా షికూహ్ సత్పురుషులకు శత్రువైపోయాడు, మురాద్‌కు మద్యం నుండే తీరిక దొరకడం లేదు, ఇక ముహమ్మద్ షుజాలో సంతృప్తిగా, హాయిగా గడపడం తప్ప ఇంకే సుగుణమూ లేదు. కాని ఔరంగజేబ్ సంకల్ప వివేకాల దృష్ట్యా, మహోన్నతమైన ఈ రాజ్యభారాన్ని మోయగలుగుతాడు, అయితే అతని స్వభావంలో గొప్ప లోపాలు కూడా ఉన్నాయి, అంటూ ఈ కావ్య పంక్తిని చదివారు :

-అతనెవ్వరికీ మిత్రుడవుతాడో, ఏ వైపునకు మొగ్గుతాడో -

(అహ్‌కామె ఆలంగీరి - హమీదుద్దీన్ ఖాన్ - పేజి 33)

# 8. షాజహాన్ అస్వస్థత కుమారుల అంతర్యుద్ధాలు

పక్షపాతం గల చరిత్రకారులు ఔరంగజేబ్‌పై రకరకాల నేరాలు మోపారు. అతని ప్రతి పనిని నేరంగా చూపించారు. రాజులు, చక్రవర్తులు తమ జీవితాల్లో సర్వ సామాన్యంగా చేసే పనుల్నే ఔరంగజేబ్ కూడా చేశాడు. కాని అవే పనులు అతని వరకు వచ్చేసరికి నేరాలైపోయాయి. రాజ్యాన్ని విస్తరించడం, ఇతర రాజ్యాల్ని ఆక్రమించుకోవడం ఆ కాలంలో రాజనీతి. రాజ్యాన్ని విస్తరింపజేసుకోవడం, ఇతర రాజ్యాల్ని ఆక్రమించుకోవడం నేరమే గనక అయితే రాజు అనబడేవాడు ఎవరీ నేరం చేసి ఉండలేదు. అశోకుడు, అలెగ్జాండర్, నెపోలియన్ – ఇలా ఎందరెందరి పేర్లను వ్రాసుకుంటూ పోదాం? వీరందరూ నేరస్థులు కాకపోయినప్పుడు, ఒక్క ఔరంగజేబ్‌నే దీనికి నేరస్తునిగా ఎంచడం ఎంతవరకు సమంజసం? ఒకవేళ మరాఠాల తిరుగుబాటును అణచడమే నేరమైతే, ఈ నేరానికి మొట్టమొదటగా పాల్పడిన వాడు స్వయంగా షాజహానే. రాజపుత్ర రాజ్యాలపై సైన్యాన్ని పంపడమే గనక నేరమైతే, జైపూర్‌పై సైన్యాల్ని పంపి మొట్టమొదటగా ఈ నేరానికి పాల్పడినవాడు అక్బర్ చక్రవర్తేకదా? ఇక హిందువు లకు ఉన్నత హోదాల నుండి వంచించడమనే నింద పసలేనిది, ఆధారం లేనిది. తన తాత తండ్రులకన్నా ఔరంగజేబే అత్యధిక సంఖ్యలో హిందువులకు ఉన్నత హోదాల నిచ్చాడని నిరూపిస్తూ ఒక పూర్తి అధ్యాయమే పాఠకులకు సమర్పించాము.

సోదరులను చంపడం, తండ్రిని చెరలో బంధించడం అనేది కూడా భారత దేశపు లేక ప్రపంచ చరిత్రలో అరుదైన విషయమేమీ కాదు. అశోకుడు తన వందమంది సోదరుల్ని చంపించలేదా? తన తండ్రిని చంపి అజాతశత్రు మగధ సింహాసనాన్ని ఆక్రమించుకోలేదా? ఈ విషయాలు చరిత్రకారులకు తెలియవా? తెలిసినా కూడా ఔరంగజేబ్ చేసిన ఈ నేరం కొత్తదైనట్లు, సాటిలేనిదైనట్లు, వినూత్నమైనదైనట్లు కొత్త తరహాలో, బిగ్గర స్వరంలో ప్రదర్శించడానికి కారణం ఏమిటి? వీరు నిస్పక్షపాతులైన చరిత్రకారులు ఎంతమాత్రం కారు. ఔరంగజేబ్‌ను అపకీర్తి పాల్జేయాలని, అతని ప్రతి పనిలో పురుగులు తీయాలని, అతని రూపాన్ని అత్యంత వికృతంగా మార్చి, అతని పేరు వినగానే ప్రజలు అసహ్యించుకోవాలని, ఒక పథకాన్ని ముందే నిర్ణయించుకొని, వాస్తవాల్ని మరుగుపరిచి, అసత్యాల్ని జొప్పించి, సమకాలీన చరిత్రల్ని పక్కకు నెట్టి, తమకు తోచింది వ్రాశారు. ఇలా కేవలం పేర్కొనడమే కాదు, ఈ అధ్యాయంలోనే వీరి కల్పిత కథల్ని సాక్ష్యాధారాలతో సహా పాఠకులకు సమర్పిస్తాము.

ఔరంగజేబ్ మనకు బంధువుకాదు, షాజహాన్ అతని మిగిలిన కుమారులు మనకు శత్రువులూ కాదు. నిష్పక్షపాతంగా చరిత్రను ఉన్నదున్నట్లు తెలుసుకోవడం మన విధి బాధ్యత. నిస్పక్షపాతంగా, న్యాయంగా ఈ చరిత్ర సంఘటనల్ని అధ్యయనం చేసిన తరువాత ఎవరు

దోషులని తేలితే వారు దోషులు, ఎవరు నిరపరాధులని తేలితే వారు నిరపరాధులు. ఈ దృష్టి తోనే, సమకాలీన చరిత్ర గ్రంథాల సహాయంతోనే ఈ సంఘటనల్ని పరిశీలించాలి.

ఆలంగీర్ కాలం నాటి సంఘటనల్ని, విషయాల్ని తెలుసుకోవడానికి నేడు ఎన్నో గ్రంథాలు న్నప్పటికీ, చరిత్ర నియమాలను అనుసరించి, ఆలంగీర్ కాలంలో వ్రాయబడిన గ్రంథాలనే మనకు ప్రధాన ఆధారంగా భావించాల్సి ఉంటుంది. వాటిలో కొన్ని ఇవి : 1. ఆలంగీర్ నామ 2. మాసిరె ఆలంగీరి 3. ముంతఖబుల్ లుబాబ్ 4. వాఖిఆతె ఆలంగీరి 5. డాక్టర్ బర్నియేర్ యాత్ర వృత్తాంతం 6. ఫయ్యాజుల్ ఖవానీన్ ఇత్యాదివి.

మొదటి మరియు రెండవ పుస్తకాల్లో ఆలంగీర్ కాలపు సంఘటనలు వివరంగా పేర్కొన బడ్డాయి. అయినా మొదటిది ఔరంగజేబ్ స్వయంగా రాయించినది, రెండవ పుస్తకం మొదటి పుస్తకం సహాయంతో రూపొందించినది కనుక ఆ రెండింటి సహాయం ఇక్కడ తీసుకోబడడం లేదు. ఇతర చరిత్రకారులు కూడా ఆ సంఘటనల్ని అంగీకరిస్తున్నారన్నప్పుడే వాటి రెఫరెన్సులు స్వీకరించాము.

ముస్లింలను షియా, సున్నీలుగా విభజించడం మాకిష్టం లేదు. అయినా చారిత్రక దృష్టితో ఒక విషయాన్ని మాత్రం వివరించకుండా ఉండలేము. అదేమిటంటే ఔరంగజేబ్ సున్నీ వర్గానికి చెందినవాడు, కాని అతని కాలపు చరిత్రకారులందరూ అనగా కాజింషేరాజి, ఆఖిల్ ఖాన్ రాజీ, నేమత్ ఖాన్, ఖాఫి ఖాన్ అందరూ షియాలే. ధార్మిక భిన్నత్వం ఉన్నంత మాత్రాన వారి చరిత్రలు ప్రామాణికమైనవి కావని మా అభిప్రాయం ఎంతమాత్రం కాదు. కాని ఏషియన్ చరిత్రకారులపై ధార్మిక ప్రభావం తప్పకుండా ఉంటుంది. వాస్తవం చెప్పాలంటే యూరోపియన్ చరిత్రకారులు కూడా ధార్మిక ప్రభావాలకు అతీతులేమీ కాదు, కాకపోతే యూరోపియన్ చరిత్రకారులు తమ ధార్మిక పక్షపాతాన్ని ఎంత హేతుబద్ధంగా, మనోజ్ఞంగా ఉపయోగిస్తారో, అలా ఉపయోగించడంలో మన చరిత్రకారులు ఇంకా వెనుకబడి ఉన్నారనే చెప్పాలి.[1]

## షాజహాన్ అనారోగ్యం :

1657 సెప్టెంబర్ 6న షాజహాన్ మూత్రకృచ్ఛపు వ్యాధికి గురిఅయ్యాడు.[2] పరిపాలనా వ్యవహారాలు చూడడానికి కూడా అశక్తుడైపోయాడు. ఆ కాలంలోనే దర్బారు చరిత్రకారుని అనుసరించి, షాజహాన్ కొంతమంది అతి ముఖ్యులైన దర్బారు నాయకుల్ని పిలిచి, తన మరణానంతరం, దారా షికూహ్ తన ఉత్తరాధికారిగా, సింహాసనంపై కూర్చుంటాడని కూడా తెలిపాడు. అయితే తండ్రి అభిమతాన్ని తెలుసుకున్న దారా షికూహ్, తండ్రి వ్యాధిగ్రస్థుడైన వారం రోజులకే, కిరీటం, సింహాసనం తనదైనట్లుగా భావించుకోసాగాడు. తండ్రి అనారోగ్యమే అదనుగా భావించిన దారా షికూహ్ ప్రభుత్వ వ్యవహారాలన్ని తన చేతిలోకి తీసుకొని విచ్చలవిడిగా వ్యవహరించసాగాడు. మొట్టమొదటగా దర్బారులో ఉంటున్న షుజా, మురాద్ మరియు ఔరంగజేబ్ రాయబారుల్ని రప్పించుకొని దర్బారులోని ఏ విషయాన్ని, వార్తను తమ

యజమానులకు పంపించకుండా వారితో వ్రాతపూర్వకంగా వాగ్దానం చేయించుకున్నాడు. దీనితోపాటుగానే ఎవ్వరూ ప్రయాణించకుండా బెంగాల్, గుజరాత్ మరియు దక్కన్ రహదారుల్ని మూయించివేశాడు. ఈ సూబాలను పరిపాలిస్తున్న షుజా, మురాద్ మరియు ఔరంగజేబ్ వరకు ఈ వార్త అనగా తండ్రి అనారోగ్య వార్త చేరకూడదనేది అతని ఉద్దేశం. అయితే ఇది దాచేస్తే దాగే వార్త కాదే! అందుకని అన్ని సూబాలలో ఈ వార్త ప్రాకిపోయింది. దేశమంతటా తిరుగుబాట్లు చెలరేగసాగాయి. మొట్టమొదటగా బెంగాల్ సుబేదారు అయిన షుజా తన స్వతంత్ర్యాన్ని, రాజరికాన్ని ప్రకటించుకున్నాడు. ఆ తరువాత గుజరాత్‌ను పరిపాలిస్తున్న మురాద్ తన స్వతంత్రాన్ని ప్రకటించుకోవడమే కాకుండా, శుక్రవారపు ప్రసంగంలో తన పేరును చేర్పించి, గుజరాత్ అహ్మదాబాద్‌లలో తన స్వంత నాణాల్నిజారీ చేసుకున్నాడు. అయితే అప్పటి వరకు కూడా ఔరంగజేబ్ ఇలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడలేదు. అతనా కాలంలో షాజహాన్ ఆదేశానుసారం బీజాపూర్‌ను ముట్టడించి ఉన్నాడు. బీజాపూర్ వాళ్ళు ఈ సుదీర్ఘ ముట్టడి, నిర్బంధంతో వివశులై ఓటమికి అంగీకరించి, సంధికి ప్రయత్నాలు ప్రారంభించిన తరుణంలోనే, ఔరంగజేబ్ సైన్యంలోనున్న కేంద్రప్రభుత్వానికి సంబంధించిన అధికారులు, సైనికులు వెంటనే ఔరంగజేబ్‌ను విడిచి ఢిల్లీ దర్బారుకు చేరుకోవాల్సిందిగా, షాజహాన్ తరఫున దారా నేరుగా వారికి ఆదేశాల్ని పంపించాడు. కేంద్ర సైన్యాలు సైన్యాధికారులు కనీసం ఔరంగజేబ్ అనుమతి కూడా తీసుకోకుండానే ఢిల్లీకి బయలుదేరాయి. ఔరంగజేబ్‌కు ఇది అత్యంత ప్రమాదకర పరిస్థితి. ముఖ్య సైన్యాలు యుద్ధరంగం నుండి తప్పుకొని ఢిల్లీకి వెళ్ళాయని తెలిసి బీజాపూర్‌వాళ్ళు ఎదురుదాడికి దిగితే ఔరంగజేబ్ అతని సైన్యం ఎంత ప్రమాదకరస్థితికి గురి అయ్యేవో అవలీలగా అర్థం చేసుకోవచ్చు. అందుకని గత్యంతరం లేని పరిస్థితుల్లో బీజాపూర్ వాళ్ళతో కోటి రూపాయలు నజరానాను స్వీకరించి, ఈ యుద్ధాన్ని మధ్యంతరంలోనే సమాప్తం చేయవలసి వచ్చింది. దారా షికూహ్ అంతటితోనే ఊరుకుండలేదు. దర్బారులో ఔరంగజేబ్ తరఫున రాయబారిగా ఉంటున్న 'ఈసా బేగ్' ఇంటినంతా జప్తు చేసుకొని, అతన్ని కారాగారంలో పడేశాడు. దీనితో పాటుగానే జోద్‌పూర్ పరిపాలకుడైన మహారాజా జస్వంత్ సింగ్‌కు ఒక గొప్ప సైన్యమిచ్చి, గుజరాత్ వైపునకు పంపిస్తూ, మురాద్ ఔరంగజేబ్‌లు ఏమాత్రం కదలికలు చూపినా వారిని ఎదుర్కోవలసిందిగా ఆదేశిస్తూ పంపించాడు.

1658 ఫిబ్రవరి నెలలో అనగా షాజహాన్ జబ్బుపడిన ఐదు నెలల తరువాత ఔరంగజేబ్ బీజాపూర్ నుండి బయలుదేరి బుర్హాన్‌పూర్ చేరుకున్నాడు. ఇక్కడ నెల రోజులు ఆగి, రాజధాని వార్తల్ని సేకరించసాగాడు. అంతకు ముందే ఒక ప్రత్యేక స్థలంలో కలుసు కుందామని మురాద్ మరియు ఔరంగజేబ్ మధ్య ఒడంబడిక జరిగింది. అనుకున్న ప్రకారం 1658 ఏప్రిల్ నెలలో సోదరుల్దిరు నర్మదా నదిని దాటి దయాల్‌పూర్‌లో కలుసుకున్నారు. సోదరులిద్దరు నర్మదను దాటారని జస్వంత్ సింగ్‌కు తెలియగానే అతను వీరి నెదుర్కోవడానికి ఉజ్జయిని వైపు బయలు దేరాడు. చివరికి ఉజ్జయినికి సమీపంలో ధర్మాత్‌పూర్‌లో ఈ రెండు సైన్యాలు ఎదురుబడ్డాయి. ఔరంగజేబ్ యుద్ధ పిపాసి కాదు, సాధ్యమైనంతగా యుద్ధాన్ని తప్పించాలనే అతను

ప్రయత్నించేవాడు. అందుకని ధర్మాత్‌పూర్ చేరకముందే, ఔరంగజేబ్ తన వెంట ఉన్న భాకా (హిందీ భాషా) ప్రఖ్యాతకవి 'కబ్‌కలస్' అనే బ్రాహ్మణ పండితుణ్ని మహారాజా జస్వంత్ సింగ్ వద్దకు రాయబారిగా పంపాడు. "మేము మా తండ్రి మరియు ప్రభువుల వారిని సందర్శించుకోవడానికి, పరామర్శించడానికి మాత్రమే వెళుతూ ఉన్నామని, వ్యతిరేకత లేక యుద్ధం తమ లక్ష్యం కాదని, కావలిస్తే మీరు కూడా మా వెంట రావచ్చని, లేదనుకుంటే త్రోవ విడిచి మీ ప్రాంతానికి వెళ్ళవచ్చని, అనవసరంగా మానవ సంహారానికి కారకులు కావద్దు" అంటూ కబురు పంపించాడు. (ముంతఖబుల్ లుబాబ్, వా. 1, భాగం. 3, పేజి 32, రుఖ్‌ఆత్ ఆలంగీర్, లేఖ నెం. 4/119-ఆ, సంకలనం : నజీబ్ అష్రఫ్, పేజి 436, అను: షమ్స్ బరేల్వి, పేజి 223-225) (షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖలు). కాని జస్వంత్ సింగ్ ఎట్టి పరిస్థితుల్లోను ముందుకు సాగనిచ్చేది లేదని మొండికేశాడు. పర్యవసానంగా యుద్ధ జ్వాలలు రగుల్కొన్నాయి. ఈ యుద్ధంలో జస్వంత్ సింగ్ ఓడిపోయి, తన దేశమైన జోద్‌పూర్ వైపునకు పరుగుతీశాడు. ఇక్కడో విషయం ఆసక్తికరంగాను, రాజపుత్రస్త్రీల అభిమానాన్ని వీరత్వాన్ని చాటేదిగాను ఉండడం వల్ల పాఠకులకు తెలుపుతున్నాము. జస్వంత్‌సింగ్ యుద్ధరంగం నుండి పారిపోయి, తన దేశం చేరుకున్నప్పుడు, అతని భార్య, అతన్ని స్వీకరించలేదు. యుద్ధ మైదానంలో వెన్నుచూపినవాడు తన సాంగత్యానికి అనర్హుడంటూ జీవితాంతం అతనితో దాంపత్య సంబంధాలు పెట్టుకోకపోవడం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.[3]

రెండవ రోజు ఔరంగజేబ్ ఉజ్జయిని నగరంలో ప్రవేశించాడు. తన సైనికాధికారులకు ఇనాములు, కానుకలు మరియు బిరుదులతో సత్కరించి వారిని సంతృప్తిపరిచాడు. సోదరుల మధ్య జరిగిన ఒడంబడిక ననుసరించి మురాద్‌కు ఐదువేల బంగారు నవరసులను, కొండల్ని గుర్తుకుతెచ్చే అత్యంత ఎత్తైన నాలుగు గజరాజుల్ని ఇంకా ఇతర కానుకలు మొదలుగాగల వాటితో అతన్ని సంతృప్తిపరిచాడు.

అక్కడ్నే అదే రోజు ఔరంగజేబ్ అక్కయ్య జహాఁఆరా చేత్తో షాజహాన్ రాయించిన లేఖ, షాజహాన్ బక్షీ (సెక్రటరీ) అయిన ముహమ్మద్ ఫారూఖ్ ద్వారా ఔరంగజేబ్‌కు ముట్టింది. అందులో జరిగిన దానికి విచారాన్ని వ్యక్తంచేస్తూ, ఎక్కడి వరకు వచ్చాడో అక్కడే ఆగిపోవాలని, ఈ సమస్యను తానే పరిష్కరిస్తానని చెప్పుకొచ్చాడు. దానికి ఔరంగజేబ్ స్పందిస్తూ, దారా తన పట్ల చేసిన దౌష్ట్యాల్ని ఏకరువు పెడుతూ, తను కూడా కొన్ని ప్రతిపాదనలు చేస్తూ సుదీర్ఘంగా ఒక లేఖ వ్రాశాడు. దాని సారాంశం ఇలా ఉంది :

"...... ఈ మధ్య రాజ్యానికి, ప్రభుత్వానికి సంబంధించిన పరిపాలనా మరియు ఆర్థిక పరమైన సర్వాధికారాలు ప్రభువుల వారి నుండి దూరమై యువరాజు (దారా షికూహ్) చేతుల్లోకి వెళ్ళాయి. ఆయన రాజ్య వ్యవహారాల్లో ఎన్ని అధికారాలు పొందగలిగారంటే దాన్ని వర్ణించడానికి కలానికి శక్తిలేదు. ఇలాంటి అపరిమిత అధికారాలు పొందగానే సోదరుల నిర్మూలనే తన ప్రథమ లక్ష్యంగా ఎంచుకున్నాడు. ఈ విషయంలో ఆయన ప్రయత్నాలు రోజు రోజుకూ

పెరుగుతూనే పోయాయి. ఈ సందర్భంలో విధేయుడైన రాకుమారుడు 'షుజా'పై పిన్న వయస్కుడైన తన కుమారుడు సులేమాన్ షికూహ్‌ను కూర్చుండబెట్టాడు. 32 సంవత్సరాలుగా అతను చేసిన సేవలను గుర్తించకపోవడమే కాకుండా ఆయన్ను అత్యంత హీనపర్చడం, అగౌరవ పర్చడం జరిగింది. తన మనోవాంఛల, కేవలం మనోవాంఛల తృప్తికోసం ఈ విధేయున్ని అవమానపరచడానికి, కించపరచడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఈ విధేయునికి లాభం చేకూరే, ఆదాయం వచ్చే అన్ని మార్గాలను మూసేస్తూ వచ్చాడు. ఇంకా రకరకాలుగా నష్టపరుస్తూ వచ్చాడు. ధర్మానికి జాతికి వ్యతిరేకమైన పనులు, ప్రభువుల సేవకుల్ని, సామాన్య ప్రజానీకాన్ని సర్వనాశనం చేసే పనులు సతతం చేస్తూనే వచ్చాడు." బీజాపూర్ సంఘటనను గుర్తు చేస్తూ ఇంకిలా వ్రాశాడు: "ఒకవేళ దైవ కృప, దైవానుగ్రహాలే లేకపోయినట్లయితే, దారా చేపట్టిన ఈ దూరదృష్టి రాహిత్య చర్యవల్ల ఆ దక్కన్ రాజుల ద్వారానే సామ్రాజ్యమంతా నాశనమై పోయేది. ఈ పనులన్నీ కూడా అతను కేవలం స్వప్రయోజనం కోసమే చేశాడు. ఈ స్వప్రయోజనంలో అతనెంత గుడ్డివాడై పోయాడంటే, సామ్రాజ్యం నాశనమైపోతుందనే ధ్యాస కూడా అతనిలో లేకుండా పోయింది. ఈరాన్ తోరాన్‌ల వరకు వ్యాపించిపోయిన తన ఈ వ్యతిరేకత, శతృత్వంతోనే సరిపెట్టుకో లేదు. ఇంకా ముందుకెళ్ళి, ప్రభువుల వారి విధేయతలోనే జీవితం వెచ్చించిన, ఏ చిన్న ఆదేశాన్ని కూడా జవదాటని, ఆజ్ఞోల్లంఘనాన్ని ఎల్లప్పుడూ మహా పాపంగా తలచిన నాలాటి విశ్వాసపాత్రుని నుండి "బిరార్" సూబాను విడదీసి, ఎప్పుడూ మన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంటూవచ్చిన, ఎవరి ద్రోహమైతే సర్వత్రా తెలిసిపోయిందో, అలాంటి వ్యక్తికి అప్పగించడానికి ప్రయత్నించాడు. అంతేకాకుండా ముఖస్తుతితో మచ్చిక చేసుకొని జస్వంత్ సింగ్‌ను నన్ను అణచడానికి ఒక ప్రచండ సైన్యంతో పంపించాడు. వీటన్నిటి వల్ల ప్రభువుల వారు ఈ విధేయునికి ప్రసాదించిన ఆ చిన్న ప్రాంతాన్ని కూడా లాక్కొని, ఈ విధేయుణ్ని దీనునిగా, నిస్సహాయకునిగా, బిచ్చగానిగా, దేశద్రిమ్మరిగా మార్చాలనేది అతని ఉద్దేశము.

ఇంకొక విషయం ఏమిటంటే ముఖస్తోత్రముచేసి, ఇచ్చకములాడి, ప్రభువుల వారి మనో మస్తిష్కాలపై ఎంతగా ప్రభావితుడయ్యాడంటే ఏలికవారు ఎలాంటి పరిశీలన, పరిశోధన, దర్యాప్తు జరుపకుండానే అతను చెప్పిందే వేదవాక్యమనుకుంటున్నారు. అతని సలహానే ఆచరిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన సర్వాధికారాలు అతనికి అప్పగించారు. ఈ పరిస్థితుల్లో మేము స్వయంగా ప్రభువుల వారిని సందర్శించుకొని, వాస్తవాలేమిటో తెలుపుకొని, చక్రవర్తి దివ్య సన్నిధిలో మా దీనస్థితిని విన్నవించుకొని న్యాయాన్ని అర్థించడం తప్ప వేరే మార్గం కానరాలేదు.

"తమ ఈ సేవకుడు సుదీర్ఘ ప్రయాణం చేసి 'ఉజ్జయిని' చేరుకున్నప్పుడు ఈ విధేయుణ్ని బాధపెట్టడానికి, జ్యేష్ఠ రాకుమారుని అనుజ్ఞ ఆదేశాలతో వచ్చిన జస్వంత్ సింగ్ నా దారికి అడ్డంగా నిలిచాడు. హక్కు మర్యాదల్ని పక్కకు పెడుతూ అత్యంత ధైర్యంగా ఒక్క అడుగు ముందుకు వేయడానికి వీల్లేదంటూ హుకుం జారీచేశాడు. నా ద్వారా పంపబడిన దూతలు కేవలం ప్రభువుల వారిని సందర్శించడమే మా ఉద్దేశమని ఎంతో గౌరవ మర్యాదలతో చెప్పడానికి

ప్రయత్నించినప్పటికీ, ఆ గర్విష్టి ఒక్క మాటను కూడా వినిపించుకోలేదు, ఇంకా తనతో ఉన్న ప్రచండ సైనిక బలాన్ని చూసుకొని యుద్ధానికే సిద్ధమయ్యాడు. ఈ పరిస్థితుల్లో త్రోవలో అడ్డం వచ్చిన ఈ రాయిని ప్రక్కకునెట్టి, అతని గర్వాహంకారాల పర్యవసానం ఏమిటో ఆత్మాభిమానం గల ప్రతివాడు చేసి చూపిస్తాడు.

ప్రభువుల వారి సన్నిధిలో హాజరవడం తప్ప వేరే ఉద్దేశమే గనక ఉండి ఉన్నట్లయితే జస్వంత్ సింగ్ మరియు అతని సైన్యం ఓటమిపాలై రణరంగం నుండి పారిపోతున్నప్పుడు వారిని వెంబడించి సంహరించడం జరిగేది. కనీసం బంధీలుగానైనా పట్టుబడేవారు. కాని మా ఉద్దేశం వారిని త్రోవనుండి తొలగించడం తప్ప వేరేది కాదు.

రాకుమారుడు "దారా షుకూహ్" స్వయంగా 'ధూల్‌పూర్' వస్తున్నారని విన్నాను. ఇంకా ఆయన 'చంబల్‌నది' తీరాలపై ఫిరంగులు, సైనిక దళాలను ఏర్పాటుచేసి, నేను నది దాటడమే అసంభవం చేసేశారు. కాని ఈ అసంభవాన్నే మీ ఈ విధేయుడు సంభవం చేసి చూపించాడు. మేము 'చంబల్‌నది'ని దాటేశాము, ప్రస్తుతం ప్రభువుల వారి పాదాభివందనం చేయ నిశ్చయించుకున్నాము.

ఇకిప్పుడు జ్యేష్ఠ రాకుమారుడు స్వయంగా రణరంగంలోకి దిగుతారని వినవస్తున్నది. ఇది ఆయనగారి పెద్దరికం, మర్యాదలకు విరుద్ధమైన చర్య. అంతేకాదు, యుద్ధాల్లో ఆరితేరిన నాలాటి యోధున్ని ఓడించడం ఆయనగారి వల్ల అయ్యే పని కూడా కాదు. అందుకని ఆయన తన పెద్దరికాన్ని స్వయంగా గౌరవించి కాపాడుకోవాలి. మరియు ఈ సంకల్పాన్ని విరమించుకోవాలి. ఇది అన్ని విధాల సముచితమూ, సమంజసమూ కూడాను. ఇంకా ఆయన గారు తమ ప్రాంతమైన పంజాబ్‌కు వెళ్ళిపోవాలి. కొన్ని రోజులు ఈ భక్తుణ్ని మహా ప్రభువుల్ని (షాజహాన్‌ను) సందర్శించుకునే, సేవించుకునే అవకాశాన్ని కల్పించాలి."[4]

ఈ మధ్యలో షాజహాన్ వైద్యుల సలహాను అనుసరించి ఆగ్రా నుండి ఏప్రిల్ 11న ఢిల్లీ బయలుదేరాడు. ఆగ్రా వాతావరణం షాజహాన్‌కు సరిపడడం లేదు. అందుకని అతను తిరిగి ఆగ్రా రాదలుచుకోలేదు. ఢిల్లీ చేరుకొని ఈ సమస్యను పరిష్కరించాలని అతను కోరుకున్నాడు. కాని దార అతని కోరికను నెరవేరనీయలేదు. షాజహాన్ ప్రస్తుతం దారా చేతుల్లో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో దాదాపు ఒక బంధీగా ఉన్నాడు. అందుకని షాజహాన్ అభీష్టానికి వ్యతిరేకంగా అతన్ని తిరిగి ఆగ్రా తీసుకొచ్చాడు. అంతేకాకుండా ఔరంగజేబ్‌ను ఎదుర్కోవడానికి అరువది వేల అశ్వికబలంతో తానే స్వయంగా బయలుదేరాడు. అతను స్వయంగా యుద్ధరంగంలో దిగడం శ్రేయస్కరం కాదని, తానే స్వయంగా వెళ్ళి ఈ ఉపద్రవాన్ని పరిష్కరిస్తానని షాజహాన్ ఎంత నచ్చజెప్పినా దారా పట్టించుకోలేదు. దారా ఆలోచనలు వేరుగా ఉన్నాయి. తానే యుద్ధరంగానికి వెళ్ళి, సోదరుల్ని ఓడించి రాజ్యాన్ని చేజిక్కించుకోవచ్చని, తండ్రే గనక వెళితే సోదరులతో ప్రతీకారం తీర్చుకునే అవకాశం లభించదని అతను యోచించాడు. అందుకని అతను షాజహాన్‌ను కఠినంగా నిరోధించాడు. తనే మే 18వ తేదీన సైన్యాన్ని తీసుకొని బయలుదేరాడు. ఆ సమయంలో షాజహాన్ పరిస్థితి ఎంత

దయనీయంగా మారిందో, అతని హృదయం ఎంత తల్లడిల్లిపోయిందో, చరిత్రకారులందరూ అత్యంత వివరంగానూ, హృదయాలు ద్రవించి పోయేలాగా వర్ణించారు. తన కుమారులు ఒకరి రక్తాన్ని వేరొకరు చిందించడానికి సన్నద్ధమవు తున్నారు. తాను చక్రవర్తియై ఉన్నప్పటికీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. దారా చేతిలో అతను దాదాపుగా బంధీ అయి ఉన్నాడు. అయినా అతనికి సహకరించడం తప్ప తనకు వేరే గత్యంతరం లేదు. అందుకని తన దగ్గరున్న సంపదనంతా, ఖజానాలన్నీ అతనికి అప్పగించక తప్పలేదు. ఆ సమయంలో షాజహాన్ పరిస్థితిని బర్నియేర్ ఇలా వర్ణించాడు : "దారా అభీష్టాన్ని అతను నివారించే స్థితిలో లేడు. వ్యాధి కారణంగా ఏర్పడిన బాధలు, ఇంకా తగ్గనేలేదు. ఇంకా అతనా సమయంలో పెద్ద కుమారునికి ప్రభువుగా కాకుండా, ఒక సేవకునిలాగయ్యాడు." (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 43).

మే 22న దారా షికూహ్ ధూల్‌పూర్ చేరుకున్నాడు. స్థానిక జమీందార్ల సహాయంతో చంబల్‌నది ముఖ్య తీరాలపై త్రోవలపై ఫిరంగులను అమర్చి, ఎట్టి పరిస్థితుల్లోను ఔరంగజేబ్ నదిని దాటకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. కాని జీవితమంతా దర్బారు నాయకుల ముఖస్తుతులతో గడిపిన దారా షికూహ్‌కు యుద్ధానికి సంబంధించిన ఎత్తులు, పై ఎత్తులు, రణనీతులు ఏం తెలుసు? అతను ఆలోచించి కూడా ఉండని త్రోవగుండా ఈ దక్కన్ విజేత నదిని దాటి వస్తాడని పాపం అతను కలలో కూడా ఊహించి ఉండలేదు. సుశిక్షణలేని, పరస్పరం భిన్న స్వభావం కలిగిన అరవైవేల సైన్యాన్ని తీసుకొని నదీ తీరాలపై నిఘా వుంచి, ఔరంగజేబ్ కోసం నిరీక్షిస్తున్నాడు. కాని అంతలోనే ఔరంగజేబ్, ధూల్‌పూర్‌కు ఆవలే దాదాపు నలభై కోసుల దూరంలో, గుర్తు తెలియని ఒక ప్రదేశం గుండా నదిని దాటాడని, ప్రస్తుతం అతని సైన్యం నిరాటంకంగా ఆగ్రా వైపు వెళుతున్నదని పిడుగులాంటి వార్త చేరింది. ఈ వార్తకు దారా షికూహ్ కలవరపడిపోయాడు. తత్తరపాటులో, ఔరంగజేబ్‌ను ఆగ్రా చేరుకో నివ్వరాదనే తొందరలో అతను తన భారీ ఫిరంగుల్ని సైతం అక్కడ్నే విడిచిపెట్టి సైన్యంతో సహా పరుగులు తీశాడు. ఈ విధంగా ఔరంగజేబ్ కేవలం ఒక్క రణనీతితో తన ప్రత్యర్థి శక్తిసామర్థ్యాల్ని బలహీనపరచగలిగాడు.

ప్రారంభంలో ఔరంగజేబ్, గ్వాలియర్, ధూల్‌పూర్ గుండా ఆగ్రాకు వెళ్ళే రహదారినే ఎన్నుకున్నాడు. కాని అతను గ్వాలియర్ చేరుకున్న పిదప, దారా షికూహ్ చేపట్టిన యుద్ధ సన్నాహాలు, ఏర్పరిచిన అవాంతరాల్ని తెలుసుకొని, నదిని దాటడానికి ఒక సురక్షిత మార్గాన్ని అన్వేషించసాగాడు. స్థానిక జమీందారు ఒకడు వచ్చి, సమీపంలోనే ఒక ప్రదేశముందని, అక్కడి నుండి నదిని దాటడం సాధ్యమేనని, అక్కడెలాంటి రహదారి కూడా లేదని కబురు అందించాడు. ఔరంగజేబ్ వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ముందుగా తన ముందస్తు సైనిక దళాన్ని పంపించాడు. ఆ తరువాత రెండు రోజులకు మే 23వ తేదీన, కష్టప్రయాసలకు ఓర్చి అయినా సరే సైన్య సమేతంగా చంబల్‌నదిని దాటేశాడు. ఇకిప్పుడు దారా సైన్యం అత్యంత ప్రమాదకర స్థితిలో పడిపోయింది. ఔరంగజేబ్ అవలీలగా దానిపై

దాడి జరుపగలడు. వేరొకవైపు తీవ్రంగా ప్రవహిస్తున్న నది అడ్డంగా ఉంది. అందుకని దారా అత్యంత త్వరగా తన సైన్యాన్ని సమీకరించుకొని ఆగ్రా వైపు బయలుదేరి, ఆగ్రా పట్టణానికి ఎనిమిది కోసుల దూరంలో సమూగడ్ అనే ప్రాంతంలో ఆగిపోయాడు. ఔరంగజేబ్ రమజాన్ ఉపవాసాలు, తీవ్రవేడిని భరిస్తూ సమూగడ్ చేరుకున్నాడు. ఔరంగజేబ్ సైన్యసమేతంగా వచ్చాడని తెలియగానే దారా పూర్తి సన్నాహాలతో అతనికి ఎదురొచ్చాడు. ఆ సమయంలోనే, అత్యంత వ్యయప్రయాసలకోర్చి, అసంఘటితంగా ఉండి, ఇంకా విశ్రాంతి కూడా తీసుకోని ఔరంగజేబ్ సైన్యంపై ఒకవేళ దారా దాడి జరిపి ఉంటే, చరిత్ర వేరే రకంగా ఉండేది. కాని ఎందుకో దారా ఒకసారి తన సైనిక శక్తిని ప్రదర్శించి, మౌనం వహించాడు. ఈ విధంగా ఆ పగలంతా, మరియు పూర్తి రాత్రి ఔరంగజేబ్ సైన్యాలు విశ్రాంతి తీసుకొని, కొత్త ఉత్తేజాన్ని పుంజుకున్నాయి. రెండవ రోజు రణనీతిలో తాను ప్రదర్శించిన ఈ అలసత్వానికి, దూరదృష్టి రాహిత్యానికి దారా మూల్యం చెల్లించుకోక తప్పలేదు.

## సమూగడ్ యుద్ధం :

మరుసటి రోజు అనగా మే 29న ఉదయం నుండే యుద్ధ సన్నాహాలు ప్రారంభ మయ్యాయి. సంఖ్యాపరంగాను, ఆయుధ సంపత్తిలోనూ దారా సైన్యాలు, సోదరులిద్దరి సమైక్య సైన్యాల కన్నా ఆధిక్యంలో ఉన్నా కూడా, వాటిలో క్రమ శిక్షణ లేదు, రణనీతిని రూపొందించేవారు లేరు. ప్రతి సైనిక దళం తన నాయకుణ్నే సైన్యాధిపతిగా ఎంచేది. ప్రతి దళం నాయకుడు తనకు తానే సైన్యాధికారిగా, యుద్ధాన్నంతా తానే నడిపిస్తున్న వానిగా భావించసాగాడు. అందుకని దారా సైన్యం సంఖ్యలో ఆధిక్యంలో ఉన్నా, క్రమశిక్షణ, సమ న్వయం లోపించడం వల్ల తమ సంఖ్యాబలంతో పెద్దగా లాభపడలేకపోయింది. వేరొకవైపు ఔరంగజేబ్ ద్వారా సుశిక్షితులైన అతని సైన్యం సైనికాధికారులు, క్రమశిక్షణకు అలవాటు పడినవారు. తాము సమైక్య, సంగ్రహిత సమూహంలోని ఒక భాగమని, మిగిలిన సైన్యంతో తమకు అవినాభావ సంబంధముందనే విషయం వారికి తెలుసు. వారి పని వినడం, శిరసా వహించడం మాత్రమే అనే విషయం వారికి నూరిపోయడం జరిగింది. ఈ క్రమశిక్షణే ఔరంగజేబ్ విజయంలో ప్రధాన పాత్రను పోషించింది.

ప్రఖ్యాత చరిత్రకారుడు జదూనాథ్ సర్కార్ ఈ యుద్ధాన్ని యూరోప్‌లో జరిగిన 'వాటర్‌లూ' యుద్ధంతో పోల్చాడు. ఆ ప్రఖ్యాత యుద్ధంలో జనరల్ వెల్లింగ్టన్ ఏ రణనీతిని అవలంబించాడో, ఈ యుద్ధంలో కూడా ఔరంగజేబ్ అదే రణనీతిని అవలంబించాడు. దారా తన సైన్యపు సంఖ్యాబలాన్ని ఎంతగా నమ్ముకున్నాడంటే, ప్రత్యర్థి తన సైన్యాన్ని నరుకుతూ నరుకుతూ చివరికి తనే సొమ్మసిల్లిపోతాడే తప్ప, సముద్ర తరంగాల్లా ఉవ్వెత్తున లేస్తున్న తన సైన్యాన్ని సమాప్తం చేయలేడని దృఢ విశ్వాసంతో ఉన్నాడు. ఔరంగజేబ్‌కు తనలోని ఈ బలహీనత బాగా తెలుసు. అందుకని అతను దాడి జరుపడానికి బదులు స్వీయరక్షణకే ప్రాధాన్యతనిచ్చాడు. ఈ విధంగా తన బలాన్ని, శక్తిని కాపాడుకోగలిగాడు. ఇక ఎప్పుడైతే దారా తన శక్తినంతా వినియోగించాడని అతనికి తెలిసిపోయిందో, ఒక్కసారిగా తన పూర్తి శక్తి సామర్థ్యాలతో దారాపై

విరుచుకుపడి, కొంచెం ముందే ఖాయమనిపించిన విజయాన్ని, దారా షికూహ్ నుండి లాగేసుకున్నాడు.

రెండు పక్షాలూ భీకరంగా పోరాడుతున్నాయి. ఒకవైపు రాజపుత్ర వీరులు తమ అసామాన్యమైన ధైర్యస్థైర్యాల్ని, చొరవను, తెగింపును ప్రదర్శిస్తూ అతి భీకరంగా పోరాడుతుంటే, వేరొకవైపు ఔరంగజేబ్, మురాద్‌లు కనివినీ ఎరుగని వీరత్వాన్ని ప్రదర్శించసాగారు. రాజపుత్ర రాజులు ఎంత వీరత్వంతో ప్రాణాలకు తెగించి పోరాడారంటే యుద్ధ మైదానం రక్తసిక్తమై పోయింది. రాజపుత్ర రాజులు ఒకసారి మురాద్, ఇంకొకసారి ఔరంగజేబ్ గజరాజుల్ని సమీపించ గలిగారు. మురాద్‌కు లేక్కలేనన్ని గాయాలయ్యాయి. తల నుండి పాదాల వరకు రక్తం ధారలై ప్రవహిస్తున్నది. ఏనుగుపై కట్టిన అతని అంబారి బాణాలతో ఛిద్రమైపోయింది. కాని అతని చేతులు మాత్రం క్షణం తీరిక లేకుండా శత్రు సంహారంలో నిమగ్నమై ఉన్నాయి. అతను తన ఏనుగు కదలకూడదని దాని కాళ్ళకు బేడీలు వేయించాడు. అతని మావటివాడు చంపబడ్డాడు. అయినా అతని ధైర్యస్థైర్యాలు చెక్కుచెదరలేదు. ఒకసారి రాజా రాంసింగ్ రాథోర్ తన దళాన్ని తీసుకొని పోరాడుతూ మురాద్‌ను సమీపించగలిగాడు. తన అశ్వపు ముందరి కాళ్ళను మురాద్ ఏనుగుపై లంఘిస్తూ "నీవు దారా నుండి సింహాసనాన్ని లాక్కోవడానికి బయలుదేరావా?" అంటూ తన బల్లెంతో రాకుమారున్ని పొడవబోయాడు, అయితే అతని గురి తప్పింది, రెండవసారి అతనికి అవకాశం లభించలేదు, అంతకు ముందే మురాద్ అతన్ని సమాప్తం చేసేశాడు. కొంతమంది ఇతర రాజపుత్ర నాయకులు ఔరంగజేబ్ ఏనుగును చుట్టుముట్టారు. రాజా రూప్ సింగ్ పేరుగల ఒక రాథోర్ రాజపుత్ర వీరుడు గుఱ్ఱం దిగి, ఔరంగజేబ్ గజానికి బిగించిన అంబారి త్రాళ్ళను కోసేయ ప్రయత్నిం చాడు. కాని అతనా ప్రయత్నంలో సఫలం కాకముందే ఔరంగజేబ్ ద్వారా అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. రుస్తుం ఖాన్ కూడా ఔరంగజేబ్‌పై భయంకరమైన దాడి జరిపాడు. కాని అతని మరణంతో ఈ దాడి కూడా వీగిపోయింది.

ఇక ఇప్పుడు ఔరంగజేబ్ వంతు వచ్చింది. అతను తన ఫిరంగులు, సైన్యంతో ఒక్కసారిగా విజృంభించాడు. ఉధృతంగా వస్తున్న తుపాకి గుళ్ళకు, బాణాలకు కలవరపడిన దారా, వాటి నుండి తప్పించుకోవడానికి, తన గజరాజాన్ని దిగి, అశ్వాన్ని అధిరోహించాడు. ఇది పోరస్ (పురుషోత్తముడు) చేసిన తప్పిదం లాంటిదే. ఈ తప్పిదమే చేసి అతను అలెగ్జాండర్‌తో ఓడి పోయాడు. దారా చేసిన ఈ వివేకహీనమైన పనే అతన్ని అపజయం పాలుజేసింది. గజరాజంపై నున్న అతని అంబారీ ఖాళీగా ఉండడం చూసిన సైనికులు, అతని పని సమాప్తమైందని భావించారు. ఇంకేముంది, వారంతా తమ ధైర్యాల్ని విడనాడారు. తోచిన దిక్కుకు పరుగెత్తసాగారు. ఇకిప్పుడు దారా ఎంత చేసినా అతని ప్రయత్నాలన్నీ విఫలం కాసాగాయి. ఇక పరాజయం తథ్యమని భావించిన దారా, కొంతమంది అంగరక్షకులతో తానూ యుద్ధరంగం నుండి

పలాయనం చిత్తగించాడు. దారా యుద్ధమైదానం విడిచిపెట్టడమే ఆలస్యం, ఔరంగజేబ్ విజయభేరి మోగించాడు. మైదానంలో సజీవంగా ఉన్న దారా ఒక్క సిపాయియా నిలబడలేదు.

ఈ యుద్ధంలో మురాద్ అసామాన్యమైన ధైర్యస్థైర్యాలను ప్రదర్శించాడు. బాణాల ఉధృతానికి అతని అంబారీ జల్లెడలా ఛిద్రాలమయమైపోయింది. అతని మావటివాడు మరణించాడు. స్వయంగా అతను గాయాలపాలయ్యాడు. తల నుండి కాళ్ళ వరకు రక్తంతో తడిసి ముద్దయిపోయాడు. అయినా అతని వీరత్వంలో బలహీనత రాలేదు. యంత్రంలా అతని చేతులు బాణాలు వదులుతూనే ఉన్నాయి. ఈ యుద్ధంలో మురాద్ ఉపయోగించిన అంబారీని ఎంతో కాలం వరకు కోటలో జ్ఞాపకార్థం జాగ్రత్త పరిచారు.

దారా దాదాపు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో కొంతమంది సైనికులతో ఆగ్రా చేరుకున్నాడు. తన మహలులో ప్రవేశించి లోపల్నుండి గడియ వేసుకున్నాడు. నిశ్శబ్దమైన అతని ఈ రాక అతని ఓటమిని ధృవీకరించినట్లయింది. మహలులో హాహాకారాలు మొదలయ్యాయి. ఇది తెలుసుకున్న షాజహాన్, దారాను తన వద్దకు రమ్మని పిలిపించాడు. కాని దారా తండ్రిని కలుసుకోవడానికి సాహసించలేకపోయాడు. ఒక్కొక్క పని తన తండ్రి అభీష్టానికి వ్యతిరేకంగా చేశాడు. తండ్రి చేసిన హితబోధనల్ని పెడచెవిన పెట్టాడు. గర్వాంధకారాలతో, అహంకారంతో ప్రవర్తించాడు. ఈ అపజయం అతన్ని అవన్నీ నెమరువేసుకునేటట్లు చేసింది. ఆ సమయంలో షాజహాన్ తన చేతనైనంత ఆర్థిక సహాయాన్ని దారాకు అందించాడు. ఇంక ఒక జాము రాత్రి ఉండగానే, దారా తన అంతఃపురాన్ని, కొంతమంది సైనికుల్ని తీసుకొని డిల్లీ బయలుదేరాడు. అక్కడికి చేరుకుని, తిరిగి యుద్ధ సన్నాహాలు చేయొచ్చనేది అతని ఆలోచన.[5]

యుద్ధమైదానంలో దారా సైన్యం పరుగు లంఘించుకోవడం, తన సైనికులు వారిని వెంబడించడం చూస్తున్న ఔరంగజేబ్, ప్రప్రథమంగా యుద్ధ మైదానంలో చేసిన పని దైవానికి కృతజ్ఞతా పూర్వకంగా రెండు రకాతుల నమాజు సలపడం. ఆ తరువాత అంతవరకు అతని గుడారం రాకపోవడం వల్ల దారా గుడారంలోకి వెళ్ళాడు. గాయపడిన మురాద్ కూడా ఆ గుడారంలోనే ఉన్నాడు. గాయాలతో రక్తసిక్తమైపోయిన సోదరున్ని చూసి అతని హృదయం ద్రవించుకుపోయింది. అశ్రునయనాలతో, సోదరుని శిరస్సును తన ఒడిలో పెట్టుకున్నాడు. ఇంతలోనే వైద్యులు గాయాలు కడిగి, కట్లు కట్టనారంభించారు.[6] తన గుడారం నిలబడిన తరువాత ఔరంగజేబ్ అందులోకెళ్ళిపోయాడు.

రెండవరోజు ఆగ్రా బయలుదేరడానికి ముందు తన సైన్యం, సైనికాధికారులపై ఇనాములు, కానుకల వర్షం కురిపించాడు. దారా సైన్యంలో నుండి, కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చి తనకు విధేయత తెలిపి, తన ఉద్యోగంలో చేరదలచిన వారందరినీ తన కొలువులో చేర్చుకున్నాడు. జూన్ మొదటి తేదీన ఇక్కడి నుండి బయలుదేరి ఆగ్రా సమీపంలో 'నూర్‌మహల్' అనే తోటలో విడిది చేశాడు. ఇక్కడ కూడా అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులు, సైనికాధికారులు వచ్చి అతని ఉద్యోగంలో చేరిపోయారు. ఇక్కడి వరకు జరిగిన సంఘటనల్ని ఆపి, కాస్త వెనుకకుపోయి, దారా, ఔరంగజేబ్‌లు చేపట్టిన మంచీచెడు కార్యాల్ని ఒకసారి సమీక్షిద్దాం.

## దారా షికూహ్ అకృత్యాలు :

1. షాజహాన్ అనారోగ్యానికి గురిఅయిన వెంటనే దర్బారులో ఉంటున్న షుజా, మురాద్ మరియు ఔరంగజేబ్ రాయబారుల నుండి, దర్బారుకు సంబంధించిన ఏ ఒక్క సంఘటన కూడా వ్రాసి పంపమని వారితో లిఖితపూర్వక వాగ్దానం తీసుకున్నాడు.
2. ప్రయాణీకుల ద్వారా ఎవరిక ఈ వార్త చేరకూడదనే దృష్టితో బెంగాల్, గుజరాత్ మరియు దక్కన్ రహదారులన్నింటినీ మూయించాడు.
3. ఆలంగీర్ రాయబారి ఇంటిని జప్తు చేసుకొని అతన్ని చెరసాలలో పడవేశాడు.
4. ఆలంగీర్ బీజాపూర్‌ను ముట్టడించి ఉన్న తరుణంలో, అతని వెంట ఉన్న సైనికాధికారుల్ని అతన్ని విడిచి వెంటనే దర్బారుకు చేరుకోవాల్సిందిగా డైరెక్టుగా వారికి ఆదేశాలు పంపించాడు.
5. ఏ ఒక్క రాకుమారుని వైపునుండి కూడా కదలికలు కనబడక ముందే, మురాద్, ఆలంగీర్ మరియు షుజాల వైపు సైన్యాల్ని పంపించాడు.

పై సంఘటనల్ని ఏ ఒక్క చరిత్రకారుడు కూడా నిరాకరించలేడు. అయితే ఈ సంఘటనల్ని ఇంకా సుదృఢపరచడానికి చారిత్రక సాక్ష్యాధారాలతో నిరూపిస్తున్నాము.

1. ముట్టడి జరుగుతున్న సమయంలోనే ఔరంగజేబ్ సైన్యాన్ని, సైన్యాధికారుల్ని రప్పించుకోవడం.

"ఈ విషయంలో ఖాఫిఖాన్ ఇలా వ్రాశాడు : ఔరంగజేబ్ వ్యక్తిత్వంలోని సుగుణాలు దారా షికూహ్‌కు గిట్టేవి కావు. అతని (ఔరంగజేబ్) సాహసోపేతమైన ఘనకార్యాలు, యుక్తి మరియు దూరదృష్టితో కూడిన ప్రణాళికలకు అతను చిర్రెత్తిపోయేవాడు. అందుకని ప్రభువుల వారిని (షాజహాన్‌ను) తర్కించి, వేధించి, బీజాపూర్ ముట్టడిలో ఔరంగజేబ్ వెంటవున్న దర్బారుకు చెందిన పెద్ద పెద్ద నాయకుల్ని, సేనానుల్ని దర్బారుకు (ఢిల్లీకి) రప్పించుకోవడానికి ఒప్పించాడు. నాయకుల్ని పిలిపించుకున్నారనే వార్త అందగానే బీజాపూర్ ముట్టడి అర్థాంతరంగా ఆగి పోయింది." (ముంతఖబుల్ లుబాబ్ : ఖాఫిఖాన్, వా.2, భాగం 3, పే.24)

"ఈ సంఘటన మాసిరె ఆలంగీరిలో ఇలా వచ్చింది : అతను (దారా షికూహ్) సంభవ మైన అన్ని పద్ధతుల ద్వారా ప్రభువుల వారిని (షాజహాన్), అయ్యగారి (ఔరంగజేబ్) పట్ల అనుమానాస్పదంగా మార్చివేసేవాడు. రకరకాల సాకులతో అయ్యగారి (ఔరంగజేబ్) వెంట ఉన్న సైన్యాన్ని తమ వద్దకు రప్పించుకోవడానికి ప్రభువుల వారిని వివశుణ్ణి చేసేశాడు." (మాసిరె ఆలంగీరి – ముహమ్మద్ సాఖీ ముస్తఆద్ ఖాన్, పేజి 2).

ఇంత జరిగినా కూడా ఔరంగజేబ్ ఎలాంటి ప్రతీకార చర్యకు పాల్పడలేదు. ఇంకా మురాద్, షుజాలు తమ తమ సూబాల్లో తమ స్వతంత్రాన్ని ప్రకటించుకున్నప్పటికీ, ఔరంగజేబ్ ఎలాంటి తిరుగుబాటుకు, విద్రోహకర చర్యకు పాల్పడలేదు. అంతేకాదు, "ప్రభువుల వారు",

ఇంకా సజీవంగానే ఉన్నారని, మనం మన స్థానాల నుండి కదలడం సమంజసం కాదని, సూరత్ ముట్టడికోసం నీవు సైన్యాన్ని పంపడం సమర్థించదగిన చర్య కాదని" మురాద్‌కు ఒక లేఖ కూడా వ్రాశాడు. ఈ సందర్భంలోనే మురాద్ ఔరంగజేబ్‌కు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు.

**<u>ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :</u>**

తమ లేఖలో మీరిలా వ్రాశారు: "మనకు ఇంతవరకు ప్రభువుల వారి మరణవార్త అందలేదు. దానికి బదులు ఆయనగారి ఆరోగ్యం పుంజుకుంటున్నదని తెలిసింది. అందుకని మనస్థానం నుండి కదలడం, కొన్ని చర్యలకు పాల్పడడం సమంజసం కాదు. ఒకవేళ నీవు కూడా పూర్తి విచారణ తరువాతనే నీ సైన్యాన్ని సూరత్‌కు పంపించాల్సింది, ఇంకా ఇలాంటి పనిలో తొందరపడకుండా ఉండివుంటే బాగుండేది." మహాశయా! రాయబారి లేఖల్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే, మీరు వ్రాసిన విధంగానే నేను ప్రవర్తించాల్సింది. కాని ఈ కాలంలో ఈ రాయబారుల్ని నమ్మలేకుండా ఉన్నాం. గూఢచారుల సమాచారం ప్రకారం జిల్ హజ్జ మాసం మధ్యలో ప్రభువుల వారు కాలధర్మం చెందారనే విషయం రూఢీ అయింది." (రుఖ్అత్ ఆలంగీర్ – లేఖ నెం.7/243, సం. నజీబ్ అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 357).

2. ఆలంగీర్, మురాద్, షుజాల రాయబారుల్ని నిర్బంధించడం, వార్తల్ని పంపకుండా కట్టడి చేయడం :

**<u>ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :</u>**

(వాస్తవమేమిటంటే) మీ రాయబారి, నా రాయబారి వాస్తవంలో గృహనిర్బంధంలో ఉన్నారు. ఎందుకంటే ఈ నాస్తికుడు (దారా షికూహ్) ఒక సమూహాన్నే వారి పర్యవేక్షణ కోసం నియమించాడు. వారు ప్రయాణించినా, స్థానికంగా ఉన్నా, వీరంతా వీరిద్దరినీ వెంబడిస్తూ ఉండాలని ఆదేశించాడు. ఇంకా సంఘటనల్ని మీర్ సాలెహ్ (రోషన్ ఖలమ్, మున్షి సోదరుడు) ఎలా తెలుపుతాడో, వారలా మనకు వ్రాసి పంపాలని నిర్ణయించాడు. (అంటే మన రాయబారులు తమ ఇష్టపూర్వకంగా, స్వతంత్రంగా ఏమియును వ్రాయలేరు. మీర్ సాలెహ్ వ్రాయించినట్లే వారు వ్రాయాలి. అంతే.) (రుఖ్అత్ ఆలంగీర్, లేఖ నెం.7/243, సం.స.న.అష్రఫ్, పేజి 409-411, అను. షమ్స్ బరేల్వి, పేజి 357)

3. ఆలంగీర్ రాయబారి ఇంటిని జప్తు చేసుకోవడం :

"ప్రభువుల వారి రాయబారి అయిన "ఈసాబేగ్" వస్తు సముదాయాన్ని ఎలాంటి నేరం చేయకుండానే జప్తు చేసుకోవడం జరిగింది. మరియు అతన్ని చెరసాలలో వేయడం జరిగింది." *(మాసిరె ఆలంగీరి –ముస్తఅద్ ఖాన్, పేజి 02).*

పై సంఘటనలు రుజువయిన తరువాత, ప్రారంభం నుండి అంతం వరకు ఏ సంఘట నలైతే జరిగాయో, దానికి బాధ్యుడు, నేరస్తుడు ఔరంగజేబా లేక దారా షికూహ్‌నా? వార్తల్ని ఆపడం, ఆలంగీర్ రాయబారిని నిర్బంధించడం, ఆలంగీర్ జాగీరును జప్తు చేసుకోవడం, *(బిరార్ సూబా ఔరంగజేబ్ జాగీరుగా ఉండేది. దారా దాన్ని జప్తు చేసుకున్నాడు. ఔరంగజేబ్‌కు మురాద్ రాసిన లేఖల్లో ఈ విషయం పదే పదే ప్రస్తావించబడింది. (రుఖ్అత్ ఆలంగీర్, లేఖ నెం. 4/240, 4/119-ఆ, నజీబ్ అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పే. 227, 354.)* యుద్ధం జరుగుతున్న క్లిష్ట, సున్నిత సమయంలో ఔరంగజేబ్ వెంటవున్న సైన్యాన్ని, సైనికాధికారుల్ని అతని వద్ద నుండి పిలిపించుకోవడం, మహారాజా జస్వంత్ సింగ్‌ను ఆలంగీర్‌ను ఎదుర్కోవడానికి నియమించడం ఎలాంటి చర్యలుగా పేర్కొనబడతాయి. ఇది సమంజసము, సముచితము అనడానికి ఏవైనా కారణాలున్నాయా? ఇవన్నీ దారా చేపట్టిన చర్యలని, అందుకని వీటిని షాజహాన్‌తో ముడిపెట్టడం సమంజసం కాదని ఎవరైనా వాదించవచ్చు. అయితే ఔరంగజేబ్ చేపట్టిన చర్యలన్నీ కూడా అంటే దక్కన్ నుండి బయలుదేరడం, దారా షికూహ్ తరఫున నియమింపబడిన రాజా జస్వంత్ సింగ్‌ను ఎదుర్కొని ఓడించడం, ఆగ్రాకు రావడం ఇవన్నీ దారాకు వ్యతిరేకంగా, ఆత్మ సంరక్షణార్థం కోసమే చేపట్టినవి. అయితే చరిత్రకారులు ఔరంగజేబ్ చేపట్టిన ఈ చర్యల్ని, షాజహాన్‌కు వ్యతిరేకంగా చేసినట్లు చూపెడతారు. చరిత్రకారుల ననుసరించి చివరి కాలంలో షాజహాన్ దారా షికూహ్ చేతుల్లో ఎంత వివశుడయ్యాడంటే, దారా తాను తలుచుకున్నదంతా, షాజహాన్ పేరుతో చేసేవాడు. ఖాఫీఖాన్, ఆఖిల్ ఖాన్ అందరూ తెలిపేదే మంటే షాజహాన్ తిరిగి ఆగ్రా రావడానికి సుముఖంగా లేడు. అయితే దారా అతన్ని వివశుణ్ని చేసేశాడు. దారా సైన్యాన్ని తీసుకొని సమూగడ్ వైపునకు పోతున్నప్పుడు షాజహాన్ అతన్ని వారించాడు, తానే వెళ్ళి ఆలంగీర్‌తో ఈ సమస్యను పరిష్కరిస్తానని షాజహాన్ ఎంత మొత్తుకున్నా దారా పట్టించుకోలేదు, అతన్ని వెళ్ళనివ్వలేదు. డాక్టర్ బర్నియేర్ కూడా ఈ విషయాన్ని ఇలా వర్ణించాడు

"ఈ కాలంలో షాజహాన్ పరిస్థితి నిజంగా అత్యంత దయనీయంగా మారింది. వ్యాధివల్ల సంక్రమించిన బాధలు, బలహీనతలే కాకుండా, అతను వాస్తవంగా దారా కబంధ హస్తాల్లో బంధింపబడి ఉన్నాడు." (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 34 & 43).

ఇవన్నీ కాకుండా దారా షికూహ్ ఇంకొక మహా దౌష్ట్యానికి పాల్పడ్డాడు. అతను ప్రాక్టీసు చేసి, అచ్చం షాజహాన్ సంతకాన్ని ఫోర్జరీ చేయడం నేర్చుకున్నాడు. ఔరంగజేబ్‌కు రాసిన ఒక ఉత్తరంలో మురాద్ ఈ విషయాన్ని ఇలా పేర్కొన్నాడు :

"ధర్మభ్రష్టుడైన దారా ప్రభువుల (షాజహాన్)వారి సంతకం చేయడంలో ప్రావీణ్యాన్ని సాధించాడు. ఇంకా ఫర్మానాలలో తనే సంతకాలు చేసేస్తున్నాడు.కావున ఇలాంటిదే ఒక ఫర్మానా

(ఫోర్జరీ సంతకంతో) ఇప్పుడిప్పుడే నాకు ముట్టింది.” (రుఖ్‌ఆత్ ఆలంగీర్‌లోని లేఖ నెం.7/ 243లో దీని ప్రస్తావన ఉంది – ఔరంగజేబ్ పేర మురాద్ లేఖలు).

ఈ సందర్భంలో మురాద్ లేఖలు అత్యంత ప్రామాణికంగా గుర్తించబడతాయి. ఇవేవో ప్రజల్ని బుజ్జగించడానికి, మోసగించడానికి రాసిన లేఖలు కావు. అతనీ విషయాల్ని ఔరంగజేబ్‌కు రాస్తున్నాడు. అప్పటి వరకు ఔరంగజేబ్ మరియు మురాద్‌లు సోదరులు, మిత్రులు, అంతరంగికులు, శ్రేయోభిలాషులు, ఒకరి రహస్యాన్ని వేరొకరు ఎరిగిన వారు.

పై వాస్తవాల దృష్ట్యా, షాజహాన్ సిసలైన ఆదేశాలకే ఔరంగజేబ్ కట్టుబడి ఉండాలిగాని, షాజహాన్ పేరుతో, సంతకంతో వచ్చిన ప్రతి ఆదేశాన్ని అతనెలా శిరసావహిస్తాడు. ఆలంగీర్‌ను ఎదుర్కోవడానికి జస్వంత్ సింగ్‌ను పంపడం దారా కుట్ర, కొంటె చర్య తప్ప, షాజహాన్ దానికి అంగీకరించలేదు.

దారాకు వ్యతిరేకంగా ఔరంగజేబ్ యుద్ధానికి సంసిద్ధమవడం స్వీయరక్షణ కోసం అనివార్యమైనదే. డాక్టర్ బర్నియేర్ దారా అభిమాని, అతన్ని సమర్థించేవాడు, అయినా అన్నదమ్ముల యుద్ధాభిలాషకు సంబంధించి అతనిలా రాశాడు.

“నిజంగానే అతనికి (ఔరంగజేబ్‌కు) తన ఈ ఉద్దేశం నుండి (అంటే సింహాసనం కోసం ప్రయత్నించడమనేది) వైదొలగడం అత్యంత కష్టతరమైన విషయమే! విజయం సాధిస్తే తప్పక సింహాసనాన్ని అధిష్టించవచ్చు. కాని అదేగనక ఓడిపోతే, మరణం తథ్యం. అందుకని కేవలం రెండే రెండు మార్గాలు మిగిలిపోయాయి. మరణం లేదా రాజ్యాధికారం. ఏ విధంగానైతే స్వయంగా షాజహాన్ తన సోదరుల్ని హతమార్చి సింహాసనాన్ని అధిష్టించాడో, అదేవిధంగా తానీ ప్రయత్నంలో విఫలమైతే, గెలిచిన ప్రత్యర్థి ఈర్ష్యాద్వేషాలతో తనను అంతమొందిస్తాడనేది నిరాకరించలేని సత్యం.” (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 25 & 26).

ఈ పరిస్థితిని లేన్‌పోల్ ఇలా వర్ణించాడు :

“సోదరుల్లో ఎవరో ఒకరు సింహాసనాన్ని అధిష్టిస్తే, తనను బంధించడమో లేక హతమార్చడమో జరిగి తీరుతుందనే విషయం ఔరంగజేబ్‌కు బాగా తెలిసే ఉంటుంది. అందుకని అతను తన మనసులో ఒక దృఢ నిర్ణయానికి వచ్చి ఉంటాడు. తనను రక్షించు కోవడమనే బాధ్యతగా, రాజ్యాధికారాన్ని పొందడం కోసం ఈ చదరంగంలో తానూ పాలుపంచు కోక తప్పదు.” (ఔరంగజేబ్ – లేన్‌పోల్, పేజి 31, (ఔరంగజేబ్ పర్.... షిబ్లి, పే.84)

మొత్తానికి ఔరంగజేబ్ జస్వంత్ సింగ్ మరియు దారాతో తలపడ్డాడు, అందులో గెలుపొందాడు. అయితే ఆ తరువాత ఒక అర్జీ రూపంలో షాజహాన్‌కు జరిగిన సంఘటనలన్నీ వివరిస్తూ లేఖ రాశాడు. దానికి స్పందించిన షాజహాన్ అతన్ని ఓదారుస్తూ తన స్వహస్తాలతో

ఒక లేఖ రాసి పంపించాడు. ఇంకా "ఆలంగీర్" పేరు చెక్కబడిన ఒక కృపాణాన్ని అతనికి కానుకగా పంపించాడు.

ఆలంగీర్ విమర్శకుడెవరైనా ఈ సందర్భంగా వాదిస్తూ "సరేనండి! ఆలంగీర్ చేసిందంతా స్వీయరక్షణకోసమని అంగీకరిద్దాం! కాని అతను జస్వంత్ సింగ్‌ను ఓడించి, ఆగ్రాను సమీపించి నప్పుడు, షాజహాన్ అతన్ని పదే పదే పిలిపించాడు, హృదయం ద్రవించి పోయేలా, ప్రేమ వాత్సల్యాలు ఉట్టిపడేలా లేఖలు రాసి పంపాడు. ఇనాముల్ని, కానుకల్ని పంపించాడు. వీటన్నిటికి మించి రాజ్యాన్ని ఎలా పంచిపెట్టదలిచాడంటే, ఇంతకన్నా మంచి పాలు లేక మంచి విషయం ఔరంగజేబ్ ఊహించికూడా ఉండలేదు. అంటే దారా షికూహ్‌కు పంజాబ్, కాబూల్ సూబాలు, మురాద్‌కు గుజరాత్ మరియు షుజాకు బెంగాల్‌ను ఇస్తూ, ఔరంగజేబ్‌కు యువరాజు పదవినిస్తూ, రాజధాని క్రింద వచ్చే రాజ్యమంతా ఇవ్వదలిచాడు. ఇంతటి మంచి అవకాశం, మంచి ప్రతిపాదనలు పంపినా కూడా తండ్రి ఆజ్ఞోల్లంఘనం, తండ్రి పట్ల దురుసుగా ప్రవర్తించడం, చివరికతన్ని కోటలో బంధించడం ఎక్కడి నైతికత? అని విమర్శించే అవకాశం ఎంతైనా ఉంది.

అయితే షాజహాన్ తానేదైతే చెబుతున్నాడో, నిజంగా కూడా అదే చేయదలచాడా? అనేది ఇక్కడ పరిశీలించాల్సిన విషయం. ఔరంగజేబ్, షాజహాన్ ఇద్దరూ మనకు ఆప్తులూ కాదు, శత్రువులు కాదు. కాని ఆధారాలు, పరిస్థితులు, వివిధ చరిత్రకారుల వాంజ్మూలాలు విన్న తరువాతనే, పరిశీలించిన తరువాతనే ఒక నిష్పక్షపాతి అయిన జడ్జి ఎలా తీర్పిస్తాడో, మనమూ అలాగే తీర్పు ఇవ్వాల్సి వస్తుంది.

సమకాలీన చరిత్రకారులందరూ దీన్ని పేర్కొన్నారు. అయితే ఆఖిల్ ఖాన్ దీన్ని వివరంగా పేర్కొన్నాడు. పాషాణ హృదయాలు కూడా ద్రవించిపోయేలా ఔరంగజేబ్ పేరున షాజహాన్ రాసిన లేఖల్ని ఉన్నదున్నట్లు పేర్కొన్నాడు. రాకుమారి జహాఁఆరా బేగం సూచన మేరకు ఔరంగజేబ్‌కు రాసిన లేఖను కూడా నఖలు చేశాడు. ఆలంగీర్, షాజహాన్‌ను సందర్శించుకోకుండా ఆపేవారిని కల్లోలాన్ని లేపేవారు, కలహప్రియులు, దుష్టులు, దుర్మార్గు లంటూ కూడా అతనే నిందించాడు. ఈ సంఘటనలన్నిటినీ, ఈ కథ అంతనూ ఎంత రమ్యంగా, హృదయానికి హత్తుకునేలా వర్ణించాడంటే, అది చదివినవారు, ఔరంగజేబ్‌ను ద్వేషించకుండా, నిరసించకుండా ఉండలేరు. అయితే చివరికి జరిగిందేమిటి? ఔరంగజేబ్ తండ్రిని కలుసు కోవడానికే తుది నిర్ణయం తీసుకొని తన నివాసం నుండి బయలుదేరుతుండగా, అతని అభిమానులు, శ్రేయోభి లాషులు అతన్ని ఆపారు. అప్పుడే జరిగిన సంఘటన ఏమిటో ఈ ఆఖిల్ ఖానే ఇలా రాశాడు:

"తన శ్రేయోభిలాషుల, అభిమానుల సలహాలను విన్న ఔరంగజేబ్ ఎటూ తోచక దీర్ఘాలోచనలో పడిపోయాడు. అంతలోనే నాహర్ దల్ ఖాన్ అనే సేవకుడు అకస్మాత్తుగా ముందుకొచ్చాడు. షాజహాన్ స్వయంగా తన చేత్తో దారా షికూహ్‌కు ఒక లేఖ రాసి అత్యంత

జాగ్రత్తగా ఇతనికిస్తూ, ఎవరికీ దీని వాసన కూడా తగులనీయొద్దని, శరవేగంతో వెళ్ళి ఈ లేఖను దారాకు అప్పగించి అతని జవాబును తీసుక రావల్సిందిగా ఇతనికి అప్పగించాడు. ఆ లేఖ సారాంశం ఏమిటంటే అతను (దారా షికూహ్) నిశ్చింతగా ఉండాలని, ఢిల్లీ విడిచి వెళ్ళ నవసరం లేదని, అక్కడే ఆగిపొమ్మని, ఈ సమస్యను తానిక్కడే సమాప్తం చేస్తానని" ఉంది." *(వాఖిఆత్ ఆలంగీర్– ఆఖిల్ ఖాన్ రాజీ, పేజి 62, 63 (ఔరంగజేబ్ ఆలంగీర్–షిబ్లి, పేజి 86)*

ఈ లేఖ ద్వారా ఆలంగీర్ అభిమానులు, శ్రేయోభిలాషులు వ్యక్తపరచిన సందేహ అనుమానాలు నిజమైనవని నిరూపితమైపోయింది. మాసిరుల్ ఉమరాలో కూడా ఈ సంఘటనను వివరంగా పేర్కొనడం జరిగింది. దాని చివరి వాక్యాలు ఇలా ఉన్నాయి.

"ఔరంగజేబ్ చివరికి తండ్రిని కలుసుకోవడానికే బయలుదేరాడు. అయితే అదృష్టం అతన్ని ఈ చర్య నుండి వారించదలిచింది. కనుక ఖానెజమా, షేఖ్ మీర్‌లు వచ్చి ఇలా పోవడానికి నిర్ణయించుకోవడం జాగ్రత్తతో కూడినది కాదని, వివేకానికి విరుద్ధమని, కోటలోని ఉద్యోగులంతా తమ అధీనంలోకి రాకముందు ఇంకా షాజహాన్ అధికారం పూర్తిగా సమాప్తం కాకముందు, ఎక్కడైతే ప్రమాదం పొంచివుందో అత్యవసరం లేకుండా వెళ్ళడం ఎంత వరకు సబబు? అంటూ అడ్డగించారు. ఔరంగజేబ్ సంశయంలో పడి ఆలోచిస్తుండగానే "నాహెర్‌దల్" అనే సేవకుడు దారా షికూహ్ పేరుతో ప్రభువుల వారు (షాజహాన్) లేఖ రూపంలో జారీచేసిన ఆదేశాల్ని, తనమీదున్న నమ్మకంతో (తానది షాజహానాబాద్ (ఢిల్లీ)లో ఉన్న దారా షికూహ్‌కు అప్పగించి, అతని జవాబును శరవేగంతో తీసుకువచ్చి, అప్పగించాలని) ఇచ్చిన లేఖను అప్పగించాడు. అందులోని సారాంశమేమిటంటే, తన వద్ద సైన్యాన్ని సమీకరించుకొని అతను ఢిల్లీలోనే స్థిరంగా ఉండాలని మేమిక్కడే ఈ సమస్యను సమాప్తం చేస్తామని ఉంది." అందుకని ఔరంగజేబ్ చక్రవర్తి (తండ్రిని) సందర్శించుకునే ఆలోచనను మానుకొని ఢిల్లీ వైపు బయలుదేరాడు." (మాసిరుల్ ఉమరా,– షా నవాజ్ ఖాన్ వా. 2, పేజి. 692, 693) (షాయిస్త ఖాన్ ముఖ్య నాయకుని ప్రస్తావనలో.)

ఒక విదేశీయుడు, ఔరంగజేబ్ అభిమాని కాదు, కాస్త వ్యతిరేకే. ఈ అంతర్యుద్ధాలు జరుగుతున్నప్పుడు అతను భారతదేశంలోనే ఉన్నాడు. అతనిచ్చిన వాంఙ్మూలం వింటే ఇక అనుమానమంటూ మిగులదు.

"ఒక విశ్వసనీయుడైన షండుని (కంచికి – సేవకుని) ద్వారా షాజహాన్ ఔరంగజేబ్‌కు ఒక లేఖ పంపించాడు. అందులో "నిస్సందేహంగా దారా ఇంతవరకు చేసిందంతా కూడా అయుక్తమైనది, అతని అవివేక, అనుచిత చర్యలు నిరసించదగినవి. మొదటి నుండే నీ పట్ల మా హృదయంలో అమిత ప్రేమవాత్సల్యాలున్నాయి, అందుకని నీవు వెంటనే వచ్చి మమ్మల్ని

కలవాలి. ఇంతవరకు ఈ అల్లకల్లోలం, సంక్షోభం కారణంగా అపరిష్కృతంగా ఉన్న కొన్ని ముఖ్యకార్యాలు నీ సలహా సంప్రదింపులతో చక్కబెట్టవచ్చు. (అందుకని నీవు వెంటనే రావాలి). కాని అత్యంత జాగరూకుడైన ఈ రాకుమారుడు (అంటే ఆలంగీర్) సందేహంతో చక్రవర్తిని విశ్వసించలేక, కోటలోపలికి పోయే సాహసం చేయలేకపోయాడు. బేగం సాహబ (అంటే జహాఁఆరా బేగం) నిరంతరం చక్రవర్తిని వెన్నంటే ఉంటుందని, తన తండ్రి (చక్రవర్తి) పై ఎంతగా ప్రభావితమై ఉందంటే, ఆమె కోరిందే జరుగుతుందని, రమ్మని పంపబడిన ఈ సందేశం కేవలం ఒక మోసమని, అంతఃపురంలో కాపలాకోసం నియుక్తులై ఉన్న ఖల్మా ఖనియాల (తాతారి స్త్రీల) నుండి బలిష్టులు, దృఢకాయులు మరియు సశస్త్రులైన కొంతమంది స్త్రీలను ఆమె ఈ పనికోసమే ఎంపిక చేసి ఆయుధాలతో సిద్ధంగా ఉంచిందని, అతను కోటలో ప్రవేశించగానే ఒక్కసారిగా వీరంతా అతనిపై విరుచుకుపడి, అతన్ని సమాప్తం చేయనున్నారనే విషయం అతనికి తెలిసిపోయింది." (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 61 & 65).

"తన కుమారుని కోసం షాజహాన్ ఏ వల అయితే పన్నాడో, అతనే స్వయంగా అందులో ఇరుక్కుపోయాడంటూ "లేన్‌పోన్" చక్కగా విశ్లేషించాడు. *(ఔరంగజేబ్ - లేన్‌పోల్ పేజి 45, ఔరంగజేబ్ పర్ ..... షిబ్లి, పే.87)*

సమూగడ్ యుద్ధం తరువాత, ఔరంగజేబ్‌ను ఎదుర్కొనేంత సైన్యం షాజహాన్ వద్దలేదు. అందుకని అతను శత్రుత్వంతో కాకుండా మిత్రరూపంలో ఔరంగజేబ్‌ను వశపర్చుకోవడానికి కుట్రలు పన్నసాగాడు. ఒకరోజు షాజహాన్ తన ప్రైవేటు సెక్రటరీ అయిన ఫాజిల్ ఖాన్ మరియు ప్రధానమంత్రి అయిన మౌలానా హిదాయతుల్లాకు కొన్ని కానుకల్ని ఇస్తూ ఔరంగజేబ్‌ను కలువడానికి పరితపిస్తున్నానని కబురు ఇస్తూ పంపించాడు. వారిద్దరూ వచ్చి నచ్చజెప్పిన మీదట ఔరంగజేబ్ తండ్రిని సందర్శించుకోవడానికి సంసిద్ధుడయ్యాడు. కాని కొన్ని ప్రత్యేక ఆధారాల ద్వారా- అందులో అతని సోదరి రోషన్ ఆరాబేగం మరియు షాయిస్త ఖాన్ ప్రముఖంగా పేర్కొనబడతారు - అతన్ని కోటలోకి రప్పించి బంధించే లేక చంపించే కుట్ర చేయబడిందని తెలిసింది. మరుసటి రోజు ఫాజిల్ ఖాన్ మరియు ఖలీలుల్లాలు ఔరంగజేబ్ వద్దకు వచ్చారు. ఫాజిల్ ఖాన్ షాజహాన్‌కు నమ్మిన బంటు. అందుకని అతని ద్వారా రహస్యం లాగడం అసంభవం. అందుకని ఔరంగజేబ్ ఖలీలుల్లాను ఏకాంతంలో కలుసుకొని, కోటలోని కుట్ర గురించి తన అనుమానాన్ని వ్యక్తపరిచాడు. ఖలీలుల్లా అతని అనుమానాన్ని ధృవీకరించాడు. అందుకని ఖలీలుల్లాను తన వద్ద ఆపుకొని, ఫాజిల్ ఖాన్‌ను తిరిగి పంపించేశాడు. ఈ విధంగా షాజహాన్ కుట్ర బెడిసికొట్టింది.

ఔరంగజేబ్ తన తప్పుల క్షమాపణ కోసం షాజహాన్‌కు ఎంతో విన్నవించుకున్నాడు. ఎన్నో అర్జీల్ని సమర్పించుకున్నాడు. కాని షాజహాన్ హృదయమంతా దారా ప్రేమతోనే నిండి ఉంది. ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా పురిగొల్పుతూ షుజాకు హిందీ భాషలో ఒక లేఖ రాసి షాజహాన్ రహస్యంగా పంపించాడు. కాని దురదృష్టం కొద్దీ ఆ లేఖ పట్టుబడి ఔరంగజేబ్‌కు చేరింది. ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా షాజహాన్ నిరంతరంగా తన ప్రయత్నాలు చేస్తూనే పోతున్నాడు. తండ్రి చేష్టలతో ఔరంగజేబ్ కూడా ఉదాసీనుడై పోయాడు. ఔరంగజేబ్ పరిస్థితిని ఖాఫీఖాన్ ఇలా వర్ణించాడు :

"ప్రభువులవారు (ఆలంగీర్) క్షమాపణ కోసం, తన తప్పుల మన్నింపుకోసం రెండు సార్లు పితామహుని కలువడానికి ప్రయత్నించారు. కాని తండ్రి దృష్టి (తనపై కాకుండా) ఇతరులపై, ప్రత్యర్థులపైనే ఉందని తెలుసుకొని, దీన్ని దురదృష్టంగా, విధిరాతగా భావించి పితామహున్ని కలిసే ప్రయత్నాన్ని విరమించుకున్నారు." (ముంతఖబుల్ లుబాబ్– ఖాఫీ ఖాన్, వా.2, భా.3, పే.50)

ఈ కాలంలోనే తన ప్రాచీన ఉద్యోగి, విశ్వాసపాత్రుడు కాబూల్‌కు సూబేదార్ అయిన మహాబత్ ఖాన్‌కు షాజహాన్ ఒక లేఖ వ్రాశాడు. ఆ పూర్తి లేఖను ఖాఫీఖాన్ ఇలా పేర్కొన్నాడు.

"కాలగ్రహణం వల్ల మొగలు సామ్రాజ్యానికి ఎంత నష్టం వాటిల్లిందో విశ్వసనీయుడైన మహాబత్ ఖాన్‌కు తెలిసే ఉంటుంది. బాధితుడైన కుమారుడు దారా షికూహ్ ఓటమిపాలై లాహోర్ వైపునకు వచ్చాడు. ఈ గడ్డు కాలంలో విలువహీనమైన ప్రపంచ లాభాలను లెక్కచేయ కుండా మానాభిమానాల్ని దృష్టిలో పెట్టుకునే విశ్వాసపాత్రుడవు నీ వొక్కడివే. మా హృదయంలోని బాధను నీముందుంచుతూ సముచిత చర్య గైకొంటావని ఆశిస్తున్నాము. దారా షికూహ్ త్వరలోనే లాహోర్ చేరుకుంటాడు. లాహోర్‌లో ధనానికి కొదువలేదు. ఇక మనుషులు, అశ్వాలు కాబూల్‌లో పుష్కలంగా ఉన్నాయి. ఎవరి పేరు విన్నంతనే ప్రపంచం గడగడ లాడిపోతుందో, ఆ మహాబత్ ఖాన్ ఈ సమయంలో షాజహాన్ లాగా ఏకాంతవాసియై కూర్చుంటే వేయి రకాల ఆశ్చర్యం గొలిపే విషయం. మహాబత్ ఖాన్ లాంటి వీరుడు ప్రచండ సైన్యాన్ని తీసుకొని బయలుదేరడం సముచితం. వెంటనే లాహోర్ చేరుకొని "దారా షికూహ్ బాబు'ను కలిసి అన్ని విధాలుగా అతనికి సహాయపడాలి. ఇంకా అవిధేయులైన ఆ ఇద్దరిని (ఔరంగజేబ్, మురాద్) చేసుకున్న కర్మలకు ఫలితంగా శిక్షించాలి. మరియు ప్రభువులమైన మమ్ము (అంటే షాజహాన్‌ను) చెర విడిపించాలి."[7]

షాజహాన్ ఆగ్రా కోట నిర్బంధంలో ఉండి కూడా ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా కుట్రలు నడపడంలో నిమగ్నుడై ఉన్నాడనటానికి పై లేఖలే సాక్ష్యం. షాజహాన్ అంతటితోనే ఊరుకోలేదు. ఔరంగజేబ్ ఆగ్రా విడిచి, ఢిల్లీ పంజాబ్ వైపు దారా షికూహ్‌ను వెంబడిస్తూ పోయినప్పుడు,

షాజహాన్ రాకుమారుడు షుజాతో రహస్య మంతనాలు జరిపి, ఔరంగజేబ్ లేని సమయంలో వెంటనే వచ్చి ఆగ్రాను ఆక్రమించుకోవలసిందిగా ప్రేరేపించాడు. ఔరంగజేబ్‌కు ఈ విషయం కూడా తెలిసిపోయింది. రుఖ్ఆత్ ఆలంగీరి లేఖ నెం. 1/124 ద్వారా షాజహాన్‌కు ఈ విషయంగా విన్నవించుకున్నాడు.

అయితే షాజహాన్ కుట్రలు అంతటితోనే ఆగలేదు. అతను మురాద్‌నుకూడా తన వైపు తిప్పుకోవడానికి అతనితో మంతనాలు, లేఖలు ప్రారంభించాడు. తన సోదరున్ని (ఔరంగ జేబ్‌ను) హతమారిస్తే, అతనికి సింహాసనంపై కూర్చుండబెడతానని ఆశ గొలిపాడు. రాజకీయ చాతుర్యం తెలియని, దూరదృష్టి రాహిత్యుడైన మురాద్ అతని వలలో చిక్కుకొని, ఫలితంగా ఔరంగజేబ్ చేతిలో బంధీ అయ్యాడు. షాజహాన్ అంతటితోనే ఊరుకోలేదు. ఔరంగజేబ్ కుమారు డైన ముహమ్మద్ సుల్తాన్‌ను తండ్రికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీయడానికి ప్రోత్సహించాడు. ఈ సందర్భంలో, అతనికి కొన్ని విషయాలు జ్ఞాపకం చేయించాడు. ఔరంగజేబ్, షుజాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం షుజా కుమార్తెతో ముహమ్మద్ సుల్తాన్ వివాహం జరగాలి. అందుకని ఈ వివాహం జరిగిపోతే, ముహమ్మద్ సుల్తాన్, షుజా మరియు షాజహాన్ ముగ్గురు కలసి రాజ్యమేలవచ్చని అతనికి ఆశలు గొలిపాడు. అయితే ముహమ్మద్ సుల్తాన్ తన తండ్రిని బాగా ఎరుగుతాడు. అందుకని నిశ్చితార్థం జరిగిన వివాహమే జరుగాలని తండ్రికి రాయలేక పోయినా, తన వివాహం జరుపించాలని మాత్రం కోరాడు. ఔరంగజేబ్ కూడా అందులోని మర్మం ఏమిటో గ్రహించగలిగాడు. ఈ విధంగా షాజహాన్ కుట్రలు మితిమీరి పోవడంతో కంగారుపడిన ఔరంగజేబ్, షాజహాన్ అంతరంగికుల్ని, రహస్య కార్యకలాపాలకు దోహదపడు తున్న సేవకుల్ని షాజహాన్ వద్ద నుండి తొలగించేశాడు. తన గుట్టు రట్టయిందని, తన రహస్య లేఖల బండారం బయటపడిందని సిగ్గు పడడానికి బదులు షాజహాన్ చిందులు తొక్కసాగాడు. తన ముఖ్య సేవకుల్ని ఎట్టి పరిస్థితిలోనూ తొలగించరాదని ఔరంగజేబ్‌కు ఘాటుగా లేఖ రాశాడు. కాని ఔరంగజేబ్ ఇకముందు ఇలాంటి లేఖలు రాయడానికి, ఇలాంటి కుట్రలు పన్నడానికి షాజహాన్‌కు అవకాశం లేకుండా చేశాడు. ఇక్కడో విషయం గమనార్హం. షాజహాన్ దారాను ఎంత పిచ్చిగా ప్రేమించేవాడంటే, అతనొక్కడు తప్ప షాజహాన్‌కు వేరెవ్వరూ కనిపిం చడమేలేదు. ఇప్పటికి కూడా షాజహాన్ తన ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని, దారా షుజాలను వారి అదృష్టానికి వదలి తాను నిస్పక్షంగా ఉండిపోయి ఉన్నట్లయితే, బహుశ ఔరంగజేబ్ అతన్ని నిర్బంధం నుండి కూడా విముక్తి కలిగించేవాడేమో. ఇంకా షాజహాన్ బ్రతికి ఉన్నంతకాలం అతని పేరు మీదనే పరిపాలన సాగించేవాడేమో! కాని షాజహాన్ దారా ప్రేమలో పిచ్చివాడు, గ్రుడ్డివాడైపోయాడు. దారానే కాకుండా, ఔరంగజేబ్ ఇంకా అతని ఇతర సోదరులు కూడా తన ప్రియపత్ని ముంతాజ్ మహల్ సంతానమేనని, తన కుమారులేననే ధ్యాసకూడా అతనిలో

లేకుండాపోయింది. అతని పితృ ప్రేమకు, దయా కనికరాలకు, వాత్సల్యం మమకారాలకు దారా ఎలా అర్హుడో, మిగిలిన ఈ సంతానం కూడా అంతే అర్హులనే ఆలోచన కూడా అతనికి లేకుండా పోయింది. దారా ప్రేమ అనే పిచ్చి అతని తలకు ఎంతగా ఎక్కి కూర్చుందంటే, దారా కోసం మిగిలిన సంతానం ప్రాణాలు తీసుకోవడానికి కూడా అతను వెనుకాడలేదు.

ఔరంగజేబ్ తండ్రి గౌరవాన్ని కాపాడడానికి ఎంతగా ప్రయత్నించాడో, అతనికి ఎదురుగా రావడానికి, అతన్ని ఢీకొనడానికి ఎంతగా తప్పుకున్నాడో, మొగలు వంశ చరిత్రలోనే దీనికి సాటి లేదు. షాజహాన్ తండ్రికి తిరుగబడి బాహాటంగా యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు, జహాంగీర్ తన తండ్రికి వ్యతిరేకంగా యుద్ధాన్నే ప్రకటించేశాడు. కాని ఔరంగజేబ్ ఒక్క క్షణం కోసమైనా అతని ఈ యుద్ధం తండ్రికి వ్యతిరేకంగా జరుగుతున్నదని ఆలోచించడానికైనా అవకాశం ఇవ్వలేదు. ఈ విషయంగా అతను ఎవరికి ఏదైనా వ్రాయవలసివస్తే, అందులో తన ఈ పోరాటం దారాకు వ్యతిరేకంగా జరుగుతున్నదనే రాశాడు, అతని ఈ యుద్ధం దారాకు విరుద్ధంగా మాత్రమేనని, అతని వ్యతిరేకత దారాతో మాత్రమేనని పదే పదే చెప్పుకున్నాడు, వ్రాసుకున్నాడు. ఏ ఒక్క సందర్భంలో కూడా, ఏ ఒక్క లేఖలో కూడా ఈ యుద్ధం, ఈ సంఘర్షణ, ఈ ప్రయత్నం షాజహాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్నట్లు చూచాయగా కూడా పేర్కొనలేదు.

కాస్త న్యాయంగా, నిష్పక్షపాతంగా ఆలోచించాలి. తన జాగీరును తీసుకొని నూర్‌జహాన్‌కు ఇచ్చాడనే నెపంతో షాజహాన్ ఏళ్ళతరబడి తన తండ్రి, చక్రవర్తి అయిన జహాంగీర్‌కు వ్యతిరేకంగా పోరాడాడే! ఆ జాగీరుకు బదులు ఇంకొక జాగీరు ఇవ్వబడినా, ఇనాములు, కానుకలు, ప్రేమ వాత్సల్యాలు మిక్కుటంగా కురిపిస్తున్నా, షాజహాన్ సంతృప్తి చెందలేదే! అయినా అతను మంచి వాడే, సత్శీలుడే, సత్ప్రవర్తకుడే. కాని ఆలంగీర్ పట్ల ఏం జరిగింది? అతని జాగీరు (బిరార్) లాక్కోబడింది. జీతం ఆపేయబడింది. యుద్ధంలో శత్రువుతో తలపడి, కోట ముట్టడి సమయంలో అతని వద్ద నున్న సైన్యాన్ని రప్పించుకోవడం జరిగింది. డెబ్బది అయిదువేల సైన్యం అతన్ని ఎదుర్కోవడానికి, పోరాడడానికి, బంధించడానికి పంపబడింది, కోటలోకి పిలిపించి అతన్ని హతమార్చే ఏర్పాట్లు జరిగాయి - ఇంతచేసినా అతను తండ్రిని అత్యంతగా గౌరవించాడు, శిరసావహించాడు, అన్ని విధాలుగా అతనికి సుఖసౌఖ్యాలను సమకూర్చాడు, అయినా అతను దోషి, నేరస్తుడు, తండ్రిని బంధించినవాడు, ఇలా రకరకాలుగా నిందల పాలయ్యాడు. దారా పిచ్చిప్రేమలో పడి షాజహాన్ ఎంత దూరం వరకు పోయాడో, ఎంతగా తెగించాడో, పైన వివరిస్తూనే వచ్చాము. షాజహాన్ కుట్రల నుండి, దౌష్ట్యాల నుండి, దౌర్జన్యాల నుండి తనను కాపాడుకునే హక్కు ఔరంగజేబ్‌కు లేదంటారా? అతను యుద్ధాల్లో గెలుపొందాడు, సర్వాధికారాలు అతని చేతిలోకి వచ్చాయి. ఎవరంటే వారికి మరణదండన విధించేటంతటి శక్తిసామర్థ్యాలు

అతనికున్నాయి. షాజహాన్‌ను వధించినా అతన్ని ఆపేవారు, అభ్యంతరం తెలిపేవారు ఎవరూ లేరు. ఇంతటి అసామాన్యమైన అధికారాలుండీ కూడా ఔరంగజేబ్ ఏం చేశాడు? తండ్రి కుట్రల నుండి, దౌష్ట్యాల నుండి, దౌర్జన్యాల నుండి తనను తాను కాపాడుకోడానికి అతన్ని కోటలో నిర్బంధించాడు. నిర్బంధంలో ఉండి కూడా, ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా తన కుమారులకు, సైనికాధికారులకు, సూబేదార్లకు, ఇంకా ఇతర శ్రేయోభిలాషులకు రహస్యంగా లేఖలు వ్రాస్తూ ఔరంగజేబ్‌ను కష్టాల్లో పడేయడానికి ప్రయత్నించినప్పుడు లేఖల రాకపోకలపై, వాటిని తెచ్చే లేక తీసుకపోయే సేవకులపై ఆంక్షలు విధించాడు. ఇవన్నీ వివరించకుండా, కేవలం షాజహాన్ లేఖలపై ఔరంగజేబ్ ఆంక్షలు విధించాడని, కాగితం, కలం లాంటి అతి మామూలు వస్తువుల నుండి కూడా అతన్ని వంచించాడని పేర్కొంటూ, పాఠకుల్ని పెడత్రోవపట్టించి, ఔరంగజేబ్‌ను అపకీర్తి పాల్జేసిన చరిత్రకారులు ఎంత పక్షపాతం గలవారో మీరే ఆలోచించండి.

లేఖలపై ఆంక్షలెందుకు విధించాడో, లేఖలకు సంబంధించి షాజహాన్ ప్రవర్తన ఎలా ఉండేదో, షాజహాన్ లేఖల వల్ల ఎలాంటి ఉపద్రవాలు వాటిల్లాయో, వాటన్నిటినీ వివరిస్తూ ఔరంగజేబ్ ఎంతో వినయవిధేయతలతో షాజహాన్‌కు రాసిన ఈ లేఖ ద్వారా మనకు అర్థమైపోతుంది.

“..... ప్రభువుల వారు తెలివిగలవారు, కాలపు ఎత్తు పల్లాల్లో, తీపి చేదు అనుభవాల్లో సుదీర్ఘకాలం గడిపారు. ఈ కారణంగానే ఇంతవరకు జరిగిన సంఘటనల్ని విధి రాతగా భావించి, కిరీటం, రాజ్యాధికారాన్ని విధి తమ ఈ దాసుని పేర నిర్ణయించిందని ఊరటచెంది, తమ ఈ సేవకుని పరాజయం, అతని శత్రువుల లాభం కోసం ప్రభువుల వారు చేస్తున్న ప్రయత్నాలను మానుకుంటారని విశ్వసించాను. అందుకనే ఈ విధేయుడు ప్రభువులవారి పట్ల ఎంతో మేలుగా, సత్ప్రవర్తనతో మెలిగాడు. వ్యతిరేకులు లేవదీస్తున్న ఈ అల్లకల్లోలాలు సమాప్తమైన తరువాత దేవరవారి ఆమోదాన్ని, సమ్మతి సంతృప్తుల్ని పొంది, అయ్యగారి సేవకోసం సంపూర్ణ హృదయంతో నిమగ్నమవుతాడని ఆశించాడు.

చెలరేగుతున్న ఈ అల్లకల్లోలం, అలజడి సోదరుల వ్యవహారాల్లో జొరబడుతున్నా ఈర్ష్యా ద్వేషాలకు కారణం ప్రభువులవారి ప్రేరణ, ప్రోత్సాహకాలేనని, తమరి ఆదేశ అనుమతులతోనే సోదరులు విఫల ప్రయత్నం చేసి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని కొందరు చెప్పారు. అయితే నేనెప్పుడూ పరుల మాటల్ని విశ్వసించలేదు. తమరి వినయ విధేయతల నుండి వైదొలగడానికి కనీసం ఊహించి కూడా ఉండలేదు. కాని ప్రభువుల వారు నా పట్ల చూపుతున్న అనుచిత, అనాదరణ వైఖరి- ప్రస్తుతం రాకుమారుడు షుజా పేరుతో హిందీలో వ్రాసిన లేఖతో బయల్పడింది, ఈ కారణంగానే అతను నాశనమైన విషయం కూడా ప్రభువుల వారికి తెలియంది

కాదు – ఈ లేఖ చూసిన తరువాత ఏలికవారు ఈ విశ్వాసపాత్రుణ్ణి, విధేయుణ్ని అభిమానించడం లేదని తేలిపోయింది. వ్యవహారం చేయిదాటి పోయిందని తెలిసిన తరువాత కూడా, ఫలితం వేరే రకంగా బయల్పడాలని అయ్యగారు కోరుతున్నట్లు న్నారు. ఈ విధంగా తమ ఈ సేవకుడు ధర్మాన్ని రాజ్యాన్ని సుస్థిరపరచడానికి చేస్తున్న ప్రయత్నాలు చెడిపోవాలని, నాశనమవ్వాలని అభిలషిస్తున్నారు. అంతేకాదు ఇలాంటి ఆలోచనలు, ప్రయాసాల నుండి ప్రభువులవారు వైదొలగడమే కాదు, ఇక ముందు కూడా తమ సన్నిహితులతో ఇదే మార్గాన్ని అవలంబిస్తారని పిస్తుంది. ఈ పరిస్థితుల్లో వివశుణ్ణై, గత్యంతరం లేక కేవలం జాగ్రత్త కోసం, ఆత్మరక్షణ కోసం, వ్యవహారం చెడిపోయిన తరువాత దాన్ని తీర్చి దిద్దడం అసంభవమై పోతుందనే ముందు చూపుతో మాత్రమే ఈ చర్యలు చేపట్టాల్సివచ్చింది. (అంటే, లేఖల రాకపోకలపై ఆంక్షలు విధించటం).

ఈ చర్యలు చేపట్టటానికి నా మనసెంత విలవిల్లాడిపోయిందనే విషయానికి ప్రబలుడైన దైవమే సాక్షి. పదే పదే నిర్లజ్జగా తలెత్తుతున్న ఈ రెండు ఉపద్రవాలు (దారా షికూహ్, షుజా) దేశ సరిహద్దులను దాటి వెళ్ళిపోవడమో లేక పట్టుబడి తమ సోదరుని వద్దకు చేరుకోవడమో, జరుగనంతవరకు తమ ఈ సేవకునికి ప్రశాంతత లభించదు. ఈ ఉపద్రవం సమాప్తమైన తరువాత ఈ జాగ్రత్తల, నిషేధాల అవసరమే ఉండదు. ఆ తరువాత ప్రభువుల వారి అభీష్టం మరియు ఆదేశాలను అనుసరించే వ్యవహారాలు నడుపబడతాయని విన్నవించుకుంటున్నాను. (ముంతఖబుల్ లుబాబ్- ఖాఫి ఖాన్, వా- 2, భా.3, పేజి 107, 108; రుఖ్ఆత్ ఆలంగీర్ లేఖ నెం.4/127, సయ్యద్ నజీబ్ అష్రఫ్, పే.458, 459, అను. షమ్స్ బరేల్వి-239)

మొత్తానికి షాజహాన్ తన ప్రవర్తనను మార్చుకోడని, దారా షికూహ్ సమర్థన నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ వైదొలగడని, ఔరంగజేబ్ మరియు ఇతర కుమారుల్ని హతమార్చి అయినా సరే, దారాకే పట్టం కట్టాలనేది షాజహాన్ తుది నిర్ణయమని, దీనికోసం అతను దేనికైనా తెగించడానికి వెనుకాడడని ధ్రువపడిన తరువాత, ఔరంగజేబ్ షాజహాన్‌ను ఆగ్రా కోటలో నిర్బంధించి, అతని రాకపోకలపై, అనుమానాస్పద వ్యక్తుల, సేవకుల రాకపోకలపై, షాజహాన్ లేఖలపై ఆంక్షలు విధించి, గట్టి నిఘా ఏర్పాటు చేశాడు. ఈ విధంగా ఈ వైపు నుండి నమ్మకం కలిగిన తరువాత దారాను ఎదుర్కోవడానికి బయలుదేరుతాడు.

# 9. అంతర్యుద్ధాల పర్యవసానం ఔరంగజేబ్ పట్టాభిషేకం

1657 సెప్టెంబర్‌లో షాజహాన్ అస్వస్థుడయ్యాడని, అతని అస్వస్థతతో లాభపడిన దారా షికూహ్ ప్రభుత్వాధికారాలన్నీ హస్తగతం చేసుకున్నాడని ఇంతకుముందే తెలుసుకున్నాం. దారాకు మిగిలిన ముగ్గురు సోదరులతో సుహృద్భావ సంబంధాలు లేవు. అలాంటి సంబంధాలు ఏర్పరచుకోవాలని అతనెన్నడూ ప్రయత్నించలేదు కూడాను. ఈ ముగ్గురిలో కూడా ఔరంగజేబంటే అతనికి అసలే గిట్టదు. ఔరంగజేబ్‌లోని దూరదృష్టి, కార్యదక్షత, ధైర్యస్థైర్యాలు, చొరవ, తెగింపు, క్రమశిక్షణ, బాధ్యతా వినమ్రతలతో వ్యవహరించడం – ఈ అన్ని కారణాల వల్ల అతనందరి దృష్టిలో ప్రీతిపాత్రుడయ్యాడు. ఈ విషయం దారాకు రుచించలేదు. అందుకని ఔరంగజేబ్ పట్ల అతను ఇంకా క్రోధావేశాలతో, ద్వేషంతో ప్రవర్తించసాగాడు. తాను యువరాజునని, తండ్రి చక్రవర్తి అయిన షాజహాన్ సంపూర్ణ సహాయ సహకారాలు, మద్దతు తనకు లభించి ఉన్నాయని, తనను సింహాసనాన్ని అధిష్టించ కుండా ఆపే శక్తి సామర్థ్యాలు ఎవరిలో లేవని, తండ్రి తరువాత సింహాసనాన్ని అధిష్టించి, మిగిలిన సోదరుల్ని అణచివేస్తా ననుకున్నాడే తప్ప, వేరే ఆలోచనే అతనికి రాలేదు. అయితే సోదరుని మనస్తత్వాన్ని బాగా అర్థం చేసుకున్న ముగ్గురు సోదరులు రహస్యంగా ఒక ఒడంబడికను చేసుకున్నారు. అందులో దారా ఏ ఒక్క సోదరుని పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తే, మిగిలిన ఇద్దరు సోదరులు అతనికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కూడా నిర్ణయించుకున్నారు. కాని దారా షాజహాన్ అస్వస్థత వార్తను మరుగుపరిచి, సోదరుల రాయబారులు వార్తలు పంపకుండా కట్టడి చేయడంతో, షాజహాన్ అస్వస్థత వార్త కాస్త మరణవార్తగా మారిపోయింది. ఇది విన్నంతనే మురాద్ గుజరాత్‌లో, షుజా బెంగాల్‌లో తమ స్వతంత్రాన్ని ప్రకటించుకున్నారు. మురాద్ కాస్త దగ్గరుండడంతో మురాద్ ఔరంగజేబ్‌ల మధ్య ఈ విషయంగా ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. మురాద్ అసలే తొందరపాటు మనిషి, అందుకని ఔరంగజేబ్ అతన్ని పదే పదే తొందరపాటు చర్యలు చేపట్టవద్దని సలహాలు ఇస్తూపోయాడు. చివరికి ఒప్పందాన్ని అనుసరించి ఔరంగజేబ్ మురాద్ లిద్దరు ఉత్తర భారత దేశానికి ప్రయాణమయ్యారు. ధర్మాత్‌పూర్‌లో జస్వంత్ సింగ్ డెబ్భైఐదు వేల సైన్యంతో వీరిని అడ్డగించాడు. యుద్ధం జరిగింది, అందులో జస్వంత్ సింగ్ ఓడిపోయి, తన రాజ్యమైన జోద్‌పూర్‌కు పారిపోయాడు. ఆ తరువాత మురాద్, ఔరంగజేబ్‌లు ఆగ్రా వైపునకు బయలుదేరారు. ఈ మధ్యలో సంధి ప్రయత్నాలు జరిగినా అవి ఫలించలేదు. చివరికి సమూగడ్‌లో అన్నదమ్ముల మధ్య భీకరమైన మరియు నిర్ణయాత్మకమైన యుద్ధం జరిగి అందులో దారా ఓడిపోయి పారిపోయాడు. ఇంతవరకు కూడా ముగ్గురు సోదరులు అనగా ఔరంగజేబ్, షుజా మరియు మురాద్‌ల మధ్య సత్సంబంధాలుండేవి. షుజా బెంగాల్‌లో స్వాతంత్ర్యం ప్రకటించిన తరువాత అతన్ని అణచడానికి దారా, తన కుమారుడైన

సులేమాన్ షికూహ్ మరియు రాజా జైసింగ్‌లను పంపాడు. అందులో షుజా ఓడిపోయాడు. ఇంతలోనే ఔరంగజేబ్ మురాద్‌లు ఆగ్రాను సమీపిస్తున్నారని తెలుసుకున్న దారా, తన కుమారున్ని షుజాతో ఏదో ఒక సంధి చేసుకొని అర్జంటుగా ఆగ్రా రమ్మని కబురు పంపాడు. తండ్రి ఆదేశానుసారం సులేమాన్ షికూహ్ మరలాడు. కాని అతను ఆగ్రా చేరుకోకముందే సమూగడ్‌లో యుద్ధం జరిగి, అందులో దారా ఓడిపోయి, పారిపోయాడు. ఈ విధంగా షుజాకు కాస్త సమయం దొరుకుతుంది. దారా పారిపోయిన తరువాత ఔరంగజేబ్ ఆగ్రా చేరుకొని తండ్రిని కలుసుకుందా మనుకునేంతలో, తండ్రి పన్నిన పన్నుతున్న ప్రమాదకర కుట్రలు ఔరంగజేబ్‌కు తెలిసి పోయాయి. అందుకని అతను తండ్రిని కలుసుకోకపోవడమే కాక, అతని కుట్రలు, కుతంత్రాలు, దౌష్ట్యాల నుండి తనను కాపాడుకోవడానికి షాజహాన్‌ను ఆగ్రా కోటలో నిర్బం ధించాడు. ఇప్పటికి కూడా ముగ్గురు అన్నదమ్ముల మధ్య సత్సంబంధాలే ఉన్నాయి. దారాను మధ్య నుండి తొలగించిన తరువాత, ముగ్గురు అన్నదమ్ముల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం బెంగాల్, బిహార్ షుజాకు; కాబూల్ పంజాబ్, సింధ్, కాశ్మీర్ మురాద్‌కు; మిగిలిన భారతదేశ భూభాగం ఔరంగజేబ్ వశమై ముగ్గురు అన్నదమ్ములు సహజీవనం గడిపే అవకాశాలున్నాయి. కాని షాజహాన్ కుతంత్రాల వల్ల, సోదరుల్లో ద్వేషం రగల్చడం వల్ల మిత్రులుగానున్న ఈ సోదరులు శత్రువులుగా మారారు. రాజ్యం దారాకు దక్కాలనేది షాజహాన్ ప్రగాఢ వాంఛ. దారాకు దక్కకుండా చేసింది ఔరంగజేబ్. అందుకని ఔరంగజేబ్‌ను ఏ విధంగానైనా సరే కడతేర్చాలనేది షాజహాన్ యోచన. దీనికోసం మురాద్‌ను, షుజాను ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా ప్రేరేపిస్తాడు. ఔరంగజేబ్‌ను మోసంతోనైనా సరే కడతేర్చివస్తే, అతని తప్పుల్ని మన్నించడమే కాకుండా, అతనికి భారత చక్రవర్తి పట్టం కట్టబెడతానని మురాద్‌కు ఆశ గొలిపాడు. ఈ ఆశ, మరేవేవో ఆశలతో మురాద్ ఔరంగజేబ్‌కు శత్రువుగా మారిపోయాడు. ఔరంగజేబ్ ఆగ్రాలో లేని సమయంలో, షాజహాన్ షుజాకు లేఖ రాస్తూ, ఔరంగజేబ్ పంజాబ్ లాంటి సుదూర ప్రాంతాలలో ఉన్నాడని, ఆగ్రాను వశపరచుకోవడానికి ఇదే మంచి అదనని షుజాకు ఆశ గొలిపాడు. ఈ విధంగా మురాద్, షుజాల పతనంలో షాజహాన్‌ది ఎంతో కొంత పాత్ర తప్పక ఉంది.

ఇకిప్పుడు మురాద్, షుజా మరియు దారాల పరిస్థితులు ఎలా మారుతాయి, ఔరంగజేబ్ చేతిలో ఓడిపోయి వారెలా పతనమవుతారో, తెలుసుకుందాం.

## మురాద్ నిర్బంధం :

మురాద్ నిర్బంధానికి సంబంధించిన వివరాలను తెలుసుకోవడానికి మనం సమూగడ్ యుద్ధం తరువాత ఔరంగజేబ్ ఆగ్రా చేరుకున్నప్పటి పరిస్థితుల వైపునకు మరలి పరిశీలిం చాల్సి ఉంటుంది. ఆ కాలంలో మురాద్ గాయాలతో అస్వస్థుడై ఉన్నాడు. అందుకని పనులన్నీ ఔరంగజేబ్ తానొక్కడే చేసుకోవాల్సి వచ్చేది. నాయకుని అజమాయిషి లేని కారణంగా మురాద్ సైన్యం ఆగ్రా నగరంలో దోపిడీ మొదలుపెట్టింది. దీని నివారణ కోసం ఔరంగజేబ్ సైన్యమిచ్చి తన కుమారుణ్ని నియుక్తుణ్ని చేశాడు. గాయాలై, అనారోగ్యంతో ఉన్న కారణంగా మురాద్

సైనికాధికారులు, సన్నిహితులు అతని దగ్గరే ఉంటూ ఉల్లాస ఉత్సాహాలు కలిగించేవారు. తమ అలవాటును అనుసరించి వారు మురాద్‌ను అనేక రకాలుగా పొగడ్తూ ప్రశంసించేవారు. ఈ సందర్భంగానే ధర్మావత్ మరియు సమూగడ్ యుద్ధాలు కేవలం మురాద్ అసామాన్యమైన వీరత్వం మరియు శూరత్వం ద్వారానే గెలువబడ్డాయని, మురాద్ అనారోగ్యంతో లాభపడి, ఔరంగజేబ్ అతని విజయాల నుండి అతన్ని వంచించ ప్రయత్నిస్తున్నాడని నూరిపోశారు. అమాయకుడు, ముందు చూపులేని మురాద్ దీన్ని నమ్మేశాడు. ఈ రెండు యుద్ధాలు కూడా తన వీర శూరత్వాల ద్వారానే గెలువబడ్డాయి కనుక తనే భారత చక్రవర్తి కావడం అతనికి సమంజస మనిపించింది. ఈ భావన రాగానే అతను వేగంగా తన సైనిక బలాన్ని పెంపొందించుకోవడం మొదలుపెట్టాడు. ఔరంగజేబ్ నియమపాలన, క్రమశిక్షణ రుచించని కొందరు సైనికులు, సైనికాధికారులు కూడా మురాద్ సైన్యంలో చేరసాగారు. తన సోదరుడు ఏమనుకుంటాడో అని కూడా ఆలోచించకుండా, మురాద్ ఇలాంటి వారికి ప్రస్తుత హోదాలకన్నా ఉన్నత ర్యాంకులు ఇచ్చి కలుపుకోసాగాడు. మొదట్లో ఈ విషయం ఔరంగజేబ్ దృష్టికి వచ్చినప్పుడు ఇలాంటి నీచ స్వభావులు, లోభులు, కపటులు పోతే పోనీలే అనుకొని చూసీచూడనట్లు ఊరుకున్నాడు. అంతేకాకుండా గాయాలపాలై ఉన్న తన సోదరునితో సంజాయిషీ అడిగి అతన్ని బాధించి నట్లవుతుందని కూడా ఊరుకున్నాడు. సమూగడ్ నుండి వెళ్ళిన దారా డిల్లీ చేరుకొని, సైనిక సన్నాహాలు చేస్తున్నాడని, అతను బలపడక ముందే దాడి జరుపడం సమంజసంగా తలిచిన ఔరంగజేబ్ డిల్లీకి బయలుదేరాడు. మురాద్‌కు గాయాలైనందున అతనిక్కడే ఉండి విశ్రాంతి తీసుకొమ్మని, ఆరోగ్యం కుదుటపడగానే వచ్చి తనను కలుసుకొమ్మని ఔరంగజేబ్ అతనికి సలహా ఇచ్చాడు.[1] అయితే దుష్టులైన అతని మిత్రులు కొందరు “ఔరంగజేబ్ ఈ సాకుతో డిల్లీ వెళుతున్నాడని, అక్కడికి చేరుకోగానే సింహాసనాన్ని అధిష్టించినట్లు ప్రకటిస్తాడ”ని చాడీలు చెప్పారు. ఈ మాట మురాద్ మనసులో దిగిపోయింది. అందుకని ఔరంగజేబ్ బయలుదేరిన రెండవ రోజే అతన్ని వెంబడిస్తూ మురాద్ కూడా బయలుదేరాడు. సమయం చిక్కగానే వెనుక నుండి ఔరంగజేబ్‌పై దాడి జరుపాలనేది అతని ఆలోచన. మురాద్ ప్రవర్తనతో చింతాక్రాంతుడైన ఔరంగజేబ్, తామిద్దరి మధ్య జరిగిన ఒడంబడికపై తానింకా స్థిరంగానే ఉన్నాడని నిరూపించడానికిగాను ఔరంగజేబ్ 250 అశ్వాల్ని, ఇరువై లక్షల నగదును మురాద్‌కు పంపించాడు. అయినా మురాద్ ప్రవర్తనలో మార్పు రాలేదు. అంతేకాకుండా అతను ఔరంగజేబ్ పట్ల అనుచితంగా, అగౌరవంగా ప్రవర్తించసాగాడు. అతని ఆదేశాల్ని పట్టించుకోకపోయేవాడు. తనను భారత చక్రవర్తిగా తలుచుకొని తన అధికారులకు, సైనికాధికారులకు విచ్చలవిడిగా ప్రభుత్వ బిరుదుల్ని ప్రసాదించసాగాడు. తమ యజమానికి మరియు ఔరంగజేబ్‌కు మధ్య విభేదాలు పొడసూపుతున్నాయని గ్రహించిన అతని సైనికులు దోపిడీ చర్యలకు పాల్పడసాగారు.

ఇదేకాకుండా మనమొకవేళ చరిత్రకారుడు ‘మాసూమ్’ వాంజ్మూలాన్నే గనక విశ్వసిస్తే, మురాద్ షాజహాన్ ప్రేరణ మరియు మిత్రుల ముఖస్తుతులు, ప్రశంసలతో ప్రభావితుడై ఇలాంటి

చర్యకు పాల్పడ్డాడని నమ్మడానికి ఆధారాలున్నాయి. మాసూమ్ అనేదేమిటంటే, ఔరంగజేబ్‌ను కోటలోకి పిలిపించి, మోసంతో అతన్ని నష్టం కలిగించడంలో విఫలమైన తరువాత షాజహాన్ మురాద్‌ను తన పావుగా వాడుకోవడానికి నిర్ణయించాడు. ఈ ఉద్దేశంతో అతనికో లేఖ రాశాడు. అందులో ఔరంగజేబ్‌ను ఏదో విధంగా మోసగించి, చంపివేస్తే అతని తప్పుల్ని క్షమించడమే కాకుండా, అతనికి భారత చక్రవర్తి పట్టం కట్టబెడతానని షాజహాన్ ప్రోత్సహించాడు. "భారత దేశపు రాజ్యాధికారమంతా మేము సంతోషంగా నీకు కట్టబెడతాము. ఈ విషయంలో నీవు పూర్తి జాగరూకత మరియు రహస్యాన్ని పాటించాలి. అతి రహస్యమైన ఈ విషయాన్ని నీ అతి దగ్గరివారైనా, లేక దూరంవారైనా (ఎవరైనా సరే) ఎవ్వరికీ తెలియనివ్వకూడదు. కొన్ని రోజులు గడిచిన తరువాత నీ సోదరుణ్ని (ఔరంగజేబ్‌ను), నీ సోదర కుమారుణ్ణి విందు పేరుతో నీ మహలుకు రప్పించుకోవాలి. ఆ తరువాత ఇద్దరినీ సమాప్తం చేసెయ్యాలి. ఆ తరువాత జుమా ప్రసంగంలో దేశమంతటా నీ పేరు ఉచ్చరించ బడాలి. ఎందుకంటే నేను నా సంతోషంతో ఇష్టపూర్వకంగా ఈ మహోన్నత కార్యాన్ని (చక్రవర్తిత్వాన్ని) నీలాంటి విధేయుడు, విశ్వాసపాత్రుడైన కుమారునికి అప్పగించాను. నీవు అత్యంత చాకచక్యంగా బుద్ధివివేకాలతో ఈ కార్యాన్ని నిర్వర్తించాలి. (షుజాయి చరిత్ర-మీర్ ముహమ్మద్ మాసూమ్- షుజా దర్బారు చరిత్రకారుడు, రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.2/195) (రాకుమారుడు మురాద్ బక్ష్ పేర షాజహాన్ లేఖలు-సం.సయ్యద్ న.అష్రఫ్, పే.466, అను. షమ్స్ బరేల్వి పేజి 310). ఈ లేఖ అందిన తరువాత ఏదోవిధంగా ఔరంగజేబ్‌ను విందు పేరుతో ఆహ్వానించి, అతను ఏమరుపాటుగా ఉన్నప్పుడు అతన్ని హతమార్చాలని, మురాద్ ఆలోచిస్తున్నాడు. కాని ఈ ప్రణాళిక కార్యరూపం దాల్చకముందే, ఔరంగజేబ్‌కు తెలిసిపోయి, అతను మురాద్‌ను బంధించేశాడు.

ఈ ఉత్తరం మరియు మాసూమ్ వెల్లడించిన కథనమే కాకుండా మురాద్ ఆగ్రా చేరుకోకముందే, షాజహాన్ మరియు అతని ప్రధాన మంత్రితో రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలు మొదలుపెట్టాడనే విషయాన్ని నిరాకరించలేము. అందులో తన తప్పుల్ని క్షమించమని అతను ప్రాధేయపడ్డాడు. జస్వంత్ సింగ్‌ను ఓడించి జహాఁఆరా లేఖకు ఔరంగజేబ్ ప్రత్యుత్తరమిచ్చి నప్పటినుండే, ఈ రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలు మొదలయ్యాయి. ఔరంగజేబ్‌ను తృప్తిపరచ డానికి, ఔరంగజేబ్‌తో పాటుగా తాను కూడా ఒక లేఖ షాజహాన్‌కు రాసి ఉన్నప్పటికీ, తన తప్పుల్ని మన్నించమంటూ ఇంకొక లేఖ రాసి రహస్యంగా షాజహాన్‌కు పంపించాడు. తప్పుల మన్నింపుకోసం మురాద్ ఔరంగజేబ్ పక్షం నుండి తప్పుకోవాలని షాజహాన్ షరతు విధించాడు. (రుఖ్ఆత్ ఆలంగీర్‌లోని లేఖ నెం.4/224, మరియు లేఖ నెం.5/225 ద్వారా, సోదరుడు దారా షికూహ్ అకృత్యాల కారణంగా తనతో జరిగిన తప్పిదాలను క్షమించమని, తనను కరుణించమని మురాద్ తండ్రిని కోరాడు. అయితే తప్పుల క్షమాపణకు పరిహారంగా

ఏమరుపాటులో ఔరంగజేబ్‌ను, అతని కుమారుణ్ణి సంహరించమని షాజహాన్ రుఖ్‌ఆత్ ఆలంగీర్‌లోని లేఖ నెం. 2/195 ద్వారా మురాద్‌కు షరతు విధించాడు. ఈ విధంగా షాజహాన్, మురాద్‌ను ఔరంగజేబ్‌కు పక్కలో బల్లెంగా మార్చాడు, వేరొకవైపు షుజాను ప్రోత్సహించాడు, మూడవ వైపు దారాను డిల్లీలోనే ఉంటూ సైనిక సన్నాహాలు చేయడానికి ప్రేరేపించాడు. ఈ విధంగా ఔరంగజేబ్ ముగ్గురు శత్రువుల మధ్య ఇరుక్కుపోయాడు. ఈ మూడింటిలో అందరికన్నా సమీపశత్రువు అతని సోదరుడు మురాద్. ఏమరుపాటులో అతనే సమయంలో ఔరంగజేబ్‌పై దాడి జరుపుతాడో తెలియని పరిస్థితి ఏర్పడింది. అందుకని గత్యంతరంలేని పరిస్థితిలో, అనిశ్చిత పరిస్థితితో బయటపడడానికి ఔరంగజేబ్ మురాద్‌ను బంధింపజేశాడు. ఆఖిల్ ఖాన్ కథనం దీనికి కాస్త భిన్నంగా ఉంది. దాన్ని కూడా మీకు వినిపిస్తాము. అసలు విషయం ఏమిటంటే మురాద్ నిర్భయుడు, వీరుడు, శూరుడు అయినప్పటికీ అతనిలోని ఒక బలహీనత ఏమిటంటే అతను ఇతరులు చెప్పినమాటల్ని విశ్లేషించకుండానే అమాయకంగా నమ్మేస్తాడు. దారా షికూహ్‌పై విజయం సాధించినప్పుడు, ఈ విజయం అతని వల్లనే ప్రాప్తమయిందని, జస్వంత్ సింగ్‌తో జరిగిన యుద్ధం కూడా తన ద్వారానే సఫలమయిందని, అందుకని ఎవరి ప్రమేయం లేకుండా, తానొక్కడే మొగలు సింహాసనానికి అర్హుడని పరుల మాటలు నమ్మి విశ్వసించసాగాడు. ఈ ఆలోచన రాగానే గొప్ప గొప్ప జీతాలు, బిరుదులు ఇచ్చి ఔరంగజేబ్ సైన్యంలోని సైనికుల్ని, అధికారుల్ని తన వైపునకు త్రిప్పుకోసాగాడు. చూస్తుండగానే అతని వద్ద ఇరవైవేల సైన్యం సమకూడింది. రోజు రోజుకు ఔరంగజేబ్ సైనిక బలం తగ్గసాగింది. దీనికోసం ఔరంగజేబ్‌కు తగిన ఏర్పాట్లు చేయక తప్పలేదు. ఈ విషయాన్ని ఆఖిల్ ఖాన్ ఇలా పేర్కొన్నాడు :

"ఈ మజిలీకి చేరిన తరువాత మురాద్ బక్ష్ ఆగ్రా నుండి బయలుదేరలేదని, ఆయన మీ వెంట ఉండడానికి వెనుకంజవేస్తున్నాడని, ప్రభువులకు చెందిన ఇబ్రాహీం ఖాన్ లాంటి ఉద్యోగులు, మురాద్ బక్ష్ ఉద్యోగంలో చేరిపోతున్నారని, దాదాపు ఇరవైవేల అశ్వికుల్ని తన సైన్యంలో చేర్చుకున్నారని, దూరదృష్టిలేనివారు, తక్షణ లాభాల్ని కోరేవారు, జీతాలు, మన్సబులు రాయితీలపై మొగ్గుచూపేవారు, ప్రభువుల వారి సైన్యాన్ని విడిచి, మురాద్ బక్ష్‌ను ఆశ్రయిస్తున్నారని, ఈ విధంగా ఆయన సైనిక బలం చూస్తుండగానే పెరిగిపోతున్నద"ని కొందరు సమాచారం అందించారు. (వాఖియాతె ఆలంగీరి - ఆఖిల్ ఖాన్ రాజి -పేజి - 65) (ఔరంగజేబ్ పర్ ..... షిబ్లి, పేజి - 95, 96).

మాసిరె ఆలంగీరిలో ఇలా ఉంది: "రాకుమారుడు మురాద్ బక్ష్ కూడా మిత్రత్వపు హద్దుల్ని అతిక్రమించసాగాడు. మోసానికి, విద్రోహానికి కావలసిన సరంజామాను సిద్ధం చేసుకొని అవకాశం కోసం కాచుకు కూర్చున్నాడు. ప్రభువులవారు మురాద్ దౌష్ట్యాన్ని సమాప్తం చేయ నిశ్చయించుకొని షవ్వాల్ నెల రెండవ తేదీన మధురాలో మురాద్‌ను బంధించి షేఖ్ మీర్‌కు

అప్పగించారు.” (మాసిరె ఆలంగీరి-సాఖీ ముస్తఅద్ ఖాన్, పేజి 06)

మురాద్‌ను బంధించడానికి సంబంధించి యూరోపియన్ చరిత్రకారులు ఏ నిందలైతే మోపారో, ఏ మసాలాలనైతే పూసారో- అనగా ఔరంగజేబ్ మురాద్‌కు బాగా పట్టించాడని, తరువాత ఒక గాయకీని అతని వద్దకు పంపించాడని - అవన్నీ నిరాధారమైనవి. ఔరంగజేబ్ మురాద్‌ను తన వద్దకు పిలిపించాడు. అతను రాగానే బంధించేశాడు. అంతే ! అతన్ని బంధించి నప్పుడే, ఈ నిర్బంధం తాత్కాలికమైందని, ఇకనుండి అతను ఔరంగజేబ్‌కు వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా ఉంటే, అతన్ని విడిచిపెట్టడమే కాకుండా ఒప్పందాన్ని అనుసరించి వాగ్దానాలు చేసిన సూబాలకు అతన్ని యజమానిగా చేయడం జరుగుతుందని తెలిపాడు. ఈ కారణంగానే ఔరంగజేబ్, మురాద్ కుటుంబ సభ్యులేకాకుండా, మురాద్ ప్రేయసి సరస్తి బాయిని కూడా అతనితో పాటుగా ఉండనిచ్చాడు. వీరందరు గ్వాలియర్ కోటలో నిర్బంధంలో ఉంచబడ్డారు. ఔరంగజేబ్ అతనికి ఒక పెద్ద పింఛను కూడా నిర్ణయించాడు. ఇంకా అతనికి పరిమిత స్వాతం త్ర్యాన్ని కూడా ప్రసాదించాడు. అయితే మురాద్ మాత్రం అక్కడి నుండి తప్పించుకొని పారిపోవ డానికే ప్రయత్నాలు చేయసాగాడు. దీనికోసం అతను ప్రథమంగా తన దగ్గరి ఉద్యోగులను కట్టుకున్నాడు. వారిలో ప్రఖ్యాతిగాంచిన చరిత్రకారుడు ఖాఫిఖాన్ తండ్రి కూడా ఉన్నాడు. ఆ తరువాత గ్వాలియర్‌లో నివసిస్తున్న మొగలుల్ని తన వైపునకు చేసుకున్నాడు. గ్వాలియర్ మీదుగా వచ్చిపోయే మొగలు వర్తక బిడారాలకు విందులివ్వడం మొదలుపెట్టాడు. వీరందరూ కలిసి, ఎలాగైనా సరే మురాద్‌ను ఇక్కడి నుండి తప్పించాలని ప్లాను వేసుకొని, కోటకు త్రాటి నిచ్చెన వేశారు. మురాద్ చివరి సారిగా తన ప్రేయసి సరస్తిబాయిని కలువడానికి వెళ్ళాడు. ఆమె ఈ ఎడబాటు వార్తను విని గావుకేకవేసింది. ఇది విన్న కాపలా సైనికులకు అనుమానం వచ్చి, సోదా చేయసాగారు. వారికి త్రాటినిచ్చెన కంటబడింది. ఈ విధంగా మురాద్ తన ప్లానింగ్‌లో విఫలమయ్యాడు.[2] ఔరంగజేబ్ ఒకవేళ కోరి ఉంటే, ఈ సంఘటన జరిగిన వెంటనే మురాద్‌ను కఠినంగా శిక్షించేవాడు. అయితే అతన్ని శిక్షించడం అటుంచి, దీని గురించి సంజాయిషీ కూడా అడగలేదు. ఆ తరువాత మురాద్ దాదాపు నాలుగు సంవత్సరాలు ఆ గ్వాలియర్ కోటలోనే ఉన్నాడు.

ఇక ఇప్పుడు ఔరంగజేబ్ ప్రభుత్వం ఏర్పడి పటిష్టంగా నడువసాగింది. ముస్లింలకు సంబంధించిన కేసులన్నీ, వ్యాజ్యాలన్నీ ఇకనుండి సాధ్యమైనంత వరకు ఇస్లామీయ షరీయత్తును అనుసరించే పరిష్కరింపబడాలని అతను ఆదేశాలు జారీ చేశాడు. హత్యలు, ప్రతిహత్యలు మొదలుగాగల వ్యవహారాలు అన్నింటిలో షరీయత్తు ఆదేశాల్ని పాటించడమే మొదలయింది. గుజరాత్‌లో మురాద్ స్వతంత్రం ప్రకటించుకొని రాజ్యమేలుతున్నప్పుడు తనకు నమ్మిన బంటుగా, మంత్రిగా, సలహాదారుగా పని చేస్తున్న అలీ నఖీని, అకారణంగా, కేవలం అనుమానంతో,

మురాద్ నిర్దయగా చంపేసి ఉన్నాడు. ఇస్లామీయ చట్టాలపై అమలు జరుగు తున్న తీరును గమనించిన 'అలీ నఖి' కనిష్ట పుత్రునికి ఒక ఆలోచన వచ్చింది. హత్య, ప్రతిహత్యకు సంబంధించి ఇస్లామీయ చట్టాలపై అమలు జరుగుతున్నప్పుడు, మురాద్‌తో తన తండ్రి హత్యా ప్రతీకారం ఎందుకు తీసుకోకూడదనే నిర్ణయానికి వచ్చాడు. దీనికోసం తన అన్నయ్యను కూడా కలుపు కోవడానికి ప్రయత్నించాడు. కాని అతను నిరాకరించాడు. చివరికి అతను ఒంటరిగానే చక్రవర్తికి ఈ విషయంగా అర్జీని సమర్పించుకున్నాడు. అలా చేయొద్దని ఔరంగజేబ్ అతనికి ఎంతగానో నచ్చజెప్పాడు. కాని అతను మాత్రం మొండికేశాడు. చివరికి ఈ అర్జీ గ్వాలియర్ ఖాజీ (న్యాయాధీశుని) వద్దకు పంపబడింది. గ్వాలియర్ ఖాజీ కూడా ఈ అబ్బాయిని ఎంతగానో నచ్చజెప్పాడు, రక్తపరిహారం తీసుకొమ్మని సముదా యించాడు. అయితే ఈ మొండిఘటం ప్రతి హత్య (ఖిసాస్) తప్ప దేనికీ అంగీకరించలేదు. ఇకిప్పుడు వేరే మార్గమే లేదు. అందుకని 1661 డిసెంబర్ 4న 'అలీ నఖీ' హత్యానేరం క్రింద ఖిసాస్ (ప్రతిహత్య) రూపంలో మురాద్ చంపేయబడ్డాడు.

ఈ హత్యకేసును ఔరంగజేబ్ ఏ దృష్టితో చూశాడు అనేదానికి స్వయంగా ఖాఫి ఖాన్ వర్ణించిన వివరాలను తెలుసుకుకుంటే విషయం పూర్తిగా అవగతమైపోతుంది. ఖాఫిఖాన్ ఇలా వ్రాశాడు : (...... విచారించదగ్గ విషయమేమిటంటే, ఏదో కారణంగా వధించబడ్డ అలీ నఖీ జ్యేష్ఠపుత్రుడు హత్యపై దావా వ్యాజ్యం వేయడానికి అంగీకరించలేదు. అందుకని ప్రభువులవారు (ఔరంగజేబ్) అతని పట్ల ప్రసన్నులై ఉండేవారు. ఇక రెండవ కుమారుడు ఎవరైతే ప్రతిహత్య (ఖిసాస్)ను కోరాడో ప్రభువులు (చక్రవర్తి) అతని పట్ల క్రోధాగ్రహాలను చూపించేవారు. (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫిఖాన్, వా. 2, భా. 3, పేజి 151) ఇక బాదుషా నామ రచయిత ముహమ్మద్ సాదిఖ్‌ను అనుసరించి, "చక్రవర్తి ఎన్నో రోజుల వరకు ఆ అబ్బాయితో మాట్లాడనే లేదు. ఇంకా అలీ నఖీ ఏ కుమారుడైతే ఈ ప్రతి హత్యా కేసులో పాల్గొనలేదో, అతని పట్ల చక్రవర్తి అత్యంత ప్రసన్నుడై ఉండేవాడు.[3]

యూరోపియన్ చరిత్రకారుల చరిత్ర లేఖనానికి ఒక మచ్చుతునక :

ఔరంగజేబ్ చరిత్రను యూరోపియన్ చరిత్రకారులు ఎంతగానో వక్రీకరించారు, అది వ్రాస్తున్నప్పుడు ఇది చరిత్ర అనే ధ్యాసకూడా వారికి ఉందో లేదో తెలియదు. సమకాలీన చరిత్రల్ని పక్కకుపెట్టి తమకు తోచింది వ్రాయడం చరిత్ర లేఖనం అనిపించుకుంటుందా? వారి మోసపూరిత, మనోకల్పిత కథనాల్ని విశ్లేషించి, వివరించాలంటే ప్రత్యేకంగా ఒక గ్రంథమే అవుతుంది. షాజహాన్, దారా షికూహ్, మురాద్ మొదలగు వారి విషయంలో వారు ప్రదర్శించిన అజ్ఞానం, మోసం, ఒకటుంటే మరొకటి వ్రాసి పాఠకుల్ని పెడమార్గం పట్టించడం – ఇవన్నీ వివరించడానికి ఇది సందర్భమూ కాదు, స్థలమూ లేదు. కాని ఒక్క మురాద్‌కు సంబంధించిన

వ్యవహారాన్ని అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు, మీ ముందు పెడతాం. ఆ ఒక్కదానితోనే మీరు మిగిలిన విషయాల్ని ఊహించి, అర్థం చేసుకోగలుగుతారు. ఈ పాశ్చాత్య చరిత్రకారుల గారడీని తెలుసుకోగలుగుతారు.

షాజహాన్‌కు విరుద్ధంగా తిరుగుబాటు చేయడానికి దారా షికూహ్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి ఔరంగజేబే, మురాద్‌ను పురిగొల్పాడని, రకరకాల మోసపూరిత ఆశలతో అతన్ని దీనికోసం సంసిద్ధం చేశాడని యూరోపియన్ చరిత్రకారులందరూ వ్రాశారు. అయితే సమకాలీన చరిత్ర గ్రంథాలే కాకుండా, స్వయంగా మురాద్ రాసిన లేఖలు కూడా ఉన్నాయి. వాటివల్ల ఔరంగజేబ్ అసలు తన స్థానం నుండి కదలడానికి కూడా సిద్ధంగా లేడని, అతను పదే పదే ఈ చర్యనుండి మురాద్‌ను వారిస్తూ వచ్చాడని స్పష్టంగాను, నిర్ద్వంద్వంగానూ నిరూపిత మవుతుంది. నవంబర్ నెలలో అంటే షాజహాన్ వ్యాధిగ్రస్తుడైన రెండు నెలల తరువాత, పరిస్థితులన్నిటిని వివరిస్తూ, యుద్ధంలో పాల్గొనాల్సిందిగా మురాద్ ఔరంగజేబ్‌కు ఒక లేఖ వ్రాశాడు. దానికి ప్రత్యుత్తరంగా ఔరంగజేబ్ ఇలా వ్రాశాడు :

".....ఇంకా ప్రభువులవారు సజీవంగా ఉన్నారు. అంతేకాకుండా దినదినం ఆరోగ్యం పుంజుకుంటున్న చిహ్నాలు కనబడుతున్నాయి. అందుకని ఈ సమయంలో మన స్థానాల నుండి కదలడం, కొన్ని అవసరమైన పనుల్ని చేపట్టడం సముచితం కాదు. సోదరుడు అనగా మీరు కూడా ఈ (మరణ) వార్తను ధృవీకరించుకోక ముందే, తిరగబడడం, సైనిక చర్యల్ని చేపట్టకుండా ఉండాల్సింది. ఇంకా సూరత్ వైపు సైన్యాన్ని పంపించకుండా, అక్కడి కోటను దిగ్బంధించకుండా ఉండాల్సింది. కాని ఏ పనైతే చేయకుండా ఉండాల్సిందో, అదిప్పుడు చేసేశారు. కనుక తొందరగా ఆ కోటను వశపర్చుకోండి. ఎందుకంటే ఏ సైన్యాలైతే మీరు సమకూర్చుకున్నారో అవి మీ వెంటనే ఉండాలి, చెదిరిపోకూడదు, ఇక ఎప్పుడయితే దాడి జరుపుదామని నిర్ణయమవుతుందో, ఆ తేదీ మీకు తెలుపబడుతుంది...... (రుఖ్అత్ ఆలంగీర్ లేఖ నెం.2/163. ముఖద్దమ... స.న. అష్రఫ్-పేజి నెం. 409, అను. షమ్స్ బరేల్వి, పేజి.నెం. 266, 267)

ఆ తరువాత కూడా మురాద్ అనేక లేఖలు వ్రాస్తూ ఆగ్రా వైపు బయలుదేరడానికి ఔరంగజేబ్‌ను ప్రేరేపించాడు. డిసెంబర్ నెలలో వ్రాసిన ఒక లేఖలో ఇలా పేర్కొంటాడు :

## ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :

"ప్రియ సోదరా! వివేక విశిష్టమైన మరియు ఇతిహాసికమైన రెండు రకాల దృష్టాంతా లతో ప్రభువుల వారి మరణం పట్ల నాకు విశ్వాసం ఏర్పడింది. తమరు ఎలాంటి ఆధారంగాని, సాక్ష్యంగాని లేకుండానే అనవసరంగా సంశయంలో పడి ఉన్నారు. ఒక చిన్న విషయాన్ని పరిశోధించడం కోసం తమరు ముఖ్య పనుల్ని వాయిదా వేశారు. గడిచే ఒక్కొక్క రోజు ప్రత్యర్థి

బలపడటానికి కారణభూతమవుతుంది. అందుకని మనం మన సూబాల నుండి ...... బయలుదేరండి.” (రుఖ్ఆత్ ఆలంగీర్ – లేఖ నెం.9/245, అను. షమ్స్ బరేల్వి–పేజి 360)

ఆ తరువాత ఇంకొక లేఖలో ఇలా రాశాడు :

## ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :

“మహాశయుల వారి మాటలు మరియు వ్రాతలతో తమరు ఇంకను ప్రభువుల (షాజహాన్) వారి మరణం గురించి సంశయంతో ఉన్నారని తెలుస్తున్నది. తమరి ఈ భావనతో నేను ఏకీభవించలేకపోతున్నాను. మీరు ఈ విధంగా సంశయానికి, సందిగ్ధానికి గురి కావడానికి బహుశా తమ ముందు ఎన్నో యుక్తులు ఉండవచ్చు. మొత్తానికి నమ్మకం కుదిరిన తరువాత ఏదైతే చేయాలనిపించిందో అదంతా చేయడం జరిగింది. ఇక ఇప్పుడు తిరోన్ముఖం కావడం (వెనుకడుగు వేయడం) నాకు సంభవం కాదు. ఇక ఇప్పుడు స్థిరత్వం, ముందుకు సాగడం తప్ప ఈ విషయంలో ఇంకేదియును ఆశించడం సంభవమే కాదు......” (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.8/244, అను. షమ్స్ బరేల్వి –పేజి 359)

ఇంకో లేఖలో ఇలా వ్రాశాడు :

## ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :

“...... తమరు బుర్హాన్‌పూర్ నుండి మాల్వా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా బయలుదేరండి. ఇదే తగిన సమయం. తమరు అక్కడి నుండి బయలుదేరే తేది ఈ శ్రేయోభిలాషికి కూడా తెలియపరిస్తే నేను కూడా అదే తేదీన ఇక్కడి నుండి బయలుదేరుతాను. నేనైతే ముందస్తు సామగ్రిని (సైన్యపు అగ్రభాగాన్ని) ఇప్పటికే పంపించివేశాను. ఇక తమరిదే ఆలస్యం. (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నె.17/253, అను. షమ్స్ బరేల్వి–పే.365)

అలా వ్రాసినప్పటికీ కూడా ఆలంగీర్, పదే పదే మురాద్‌ను ఆపుతూ పోతాడు. చక్రవర్తి ఇంకా బ్రతికే ఉన్నారని నచ్చజెబుతాడు. అయితే మురాద్ మాత్రం బయలుదేరడానికి ఉత్సుకను ప్రదర్శిస్తాడు. అందుకే ఒక లేఖలో ఇలా వ్రాశాడు :

## ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :

“(ప్రభువుల వారి అస్తమయం ఒకవేళ అదే గనక నిజమైతే దైవాభీష్టం ముందు ఎవరిది నడుస్తుందని? ఒకవేళ అలా జరగలేదనుకుంటే, ప్రభువులవారు పూర్తిగా నిస్సహా యులై, ఆ నాస్తికుని చేతుల్లో బందీలై ఉన్నారనేది నిజం. అలా జరిగి ఉన్నందువల్లనే జియో షుజా సోదరునికి వ్యతిరేకంగా సైన్యాలు పంపబడ్డాయి. ఆ తరువాత అతను మన నాశనానికి బయలుదేరతాడు. అందుకని ఒకవేళ మనం అక్కడికి చేరుకుంటే ఈ నాస్తికుణ్ణి మన మధ్యలో నుండి ఏరిపారేయవచ్చు. ఇంకా ప్రభువుల వారిని అతని బంధనాల్లో నుండి విడిపించుకోవచ్చు.

మొత్తానికి మనం బయలుదేరడం అనివార్యం. ఒకవేళ మీకు నా ఈ పథకం నచ్చినట్లైతే సోదరుడు జియో షుజాను కూడా ఈ ప్లాన్‌కు అంగీకరింపజేసుకుంటాను. (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.9/245, అను. షమ్స్ బరేల్వి, పే.360)

ఆ తరువాత మురాద్ సూరత్ కోటను జయించుకున్నప్పుడు, జనవరి, 1658లో ఔరంగజేబ్‌కు వ్రాసిన ఒక లేఖలో ఇలా పేర్కొన్నాడు :

## ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :

"దైవానుగ్రహం మరియు కృపవల్ల బలశక్తుల ప్రయోగం ద్వారా ఈ కోట (సూరత్ కోట) జయింపబడి నా అధీనంలోకి వచ్చింది. ప్రస్తుతమయితే ఈ విజయాన్ని భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలకు శుభసూచకంగా, నాందిగా భావించి వీలైనంత తొందరగా అసలు లక్ష్యం వైపుకు దృష్టి సారించాలి. ప్రస్తుతం నేను ఈ వైపు నుండి (అనగా సూరత్ కోట గురించి) నిశ్చింతుణ్ణయిపోయాను. ఇంకా సూరత్ కోటను చేజిక్కించుకోవడంలో నిమగ్నమై ఉన్న సైన్యాలు నా సన్నిధికి చేరుకుంటాయి. ఇక ఇప్పుడు నేను కేవలం మీ అనుమతి, అనుజ్ఞల కోసం ఎదురుచూస్తున్నాను. తమరెలా చెబితే అలా ఆచరించడం జరుగుతుంది......." (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.10/246, అను. షమ్స్ బరేల్వి, పే.361).

ఈ కాలంలోనే ఆలంగీర్‌కు ఇంకొక లేఖ వ్రాశాడు :

"..... ఈ విన్నపాలన్నింటి సారాంశమేమిటంటే, ఎదుర్కోవడం, యుద్ధం చేయడం పైనే నా సర్వ కార్యక్రమాల్ని కేంద్రీకృతం చేశాను. ఎప్పుడు ఎక్కడైనా సరే, బలాబలాలు బేరీజు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. ఈ ఒక్క ఆలోచనే తప్ప ఇంకే విషయం గురించి ఆలోచించడమేలేదు. ఒకవేళ మహాశయుల వారి ఆగమనం (అనుమతి) కోసమే గనక నేను వేచివుండకపోతే, ఇప్పటి వరకు నేనక్కడికి చేరుకుని ఉండేవాణ్ణి. కేవలం అయ్యవారి సంజ్ఞ కోసం ఎదురుచూస్తున్నాను......." (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.7/243, స.న.అష్రఫ్- పేజి 410,411 అను. షమ్స్ బరేల్వి, పే.359).

ఇంకొక లేఖలో ఔరంగజేబ్‌ను కాస్త బెదిరించినట్లుగానే ఇలా వ్రాశాడు :

"నేనీ వార్త వినగానే నా సన్నాహాల్లో నిమగ్నమయ్యాను. దారా షికూహ్ ఏ నాయకుణ్ణి నా వైపుకు పంపాడనే విషయం నాకు తెలిస్తే నేనే ముందుకు వెళ్ళి అతన్ని ఎదుర్కొంటాను. మీరు కూడా ఆ వైపునుండి బయలుదేరితే బాగుంటుంది. అలాకాకపోయినా, (అంటే మీరు రాకపోయినా) నేను ఒంటరిగానైనా అతనితో తలపడతాను. ఇక ఇప్పుడు నేను ఏ విధంగానూ ఈ పనిలో జాప్యం చేయదలచుకోలేదు...." (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.4/240, స.న.అష్రఫ్-పేజి.410, అను.షమ్స్ బరేల్వి, పే.253, 254)

ఈ కోవకు చెందిన ఇంకెన్నో లేఖలున్నాయి. వాటివల్ల ఔరంగజేబ్ పదే పదే ఈ చర్య నుండి (అంటే డిల్లీకి బయలుదేరే చర్యనుండి) ఆపుతున్నట్లును ప్రభువుల వారు జీవించి

ఉన్నంతవరకు మనం మన స్థానాల నుండి కదలకూడదని చెబుతూ వారిస్తున్నట్లును బహిరంగంగా, నిర్ద్వంద్వంగా నిరూపితమవుతున్నది. కాని పదేపదే మురాద్ అనేదేమిటి? ఒకసారి ప్రభువుల వారు పరమపదించారని చెబుతాడు, ఇంకొకసారి ప్రభువుల వారు సజీవంగా ఉన్నా, దారా షికూహ్ వశంలో ఉన్నారని వాదిస్తాడు. మరొకసారి తానైతే ఒక నిర్ణయానికి వచ్చేశాడని, ఇక మీరు సహకరించదలిస్తే, సహకరించండని, లేకపోతే ఈ విధేయుడు ఒంటరిగానైనా బయలుదేరుతాడని బెదిరిస్తాడు.

కాస్త న్యాయంగా మీరే ఆలోచించి చూడండి. పై వివరణ, వివరాల తరువాత కూడా ఆలంగీర్ అనవసరమైన, పేరాశలు చూపి మురాద్‌ను తనను సమర్థించడానికి ప్రేరేపించాడని యూరోపియన్ చరిత్రకారులు (ఖాఫిఖాన్ కూడా) ఆరోపించడం ఎంతవరకు సమంజసం?

యూరోపియన్ చరిత్రకారులు అర్థంపర్థంలేని, ఆధారంలేని ఇంకొక విషయాన్ని పేర్కొంటారు. సామ్రాజ్యం మురాద్‌కే అప్పగిస్తానని, దారాను అణిచివేసిన తరువాత తను హజ్ యాత్రపై మక్కా వెళ్ళిపోతానని ఔరంగజేబ్ మురాద్‌తో ఒప్పందం చేసుకున్నాడని వ్రాశారు. “ఈ కారణంగానే ఔరంగజేబ్ ఎల్లప్పుడూ మురాద్‌ను హజ్రత్ (అయ్యగారు, దొరగారు) అనే పదంతోనే సంబోధించేవాడ”ని బర్నేరు వ్రాశాడు. ఖాఫి ఖాన్ వ్రాతల్నిబట్టి కూడా మురాద్‌కు రాజ్యం ఆశ చూపించినట్లు అర్థమవుతుంది. కాని ఎవరు రాసినా కూడా ఇదొక నిరాధారమైన చరిత్రాత్మకమైన తప్పిదమే. ముగ్గురు సోదరుల్లో ఒక ఒడంబడిక జరిగిందనడంలో సందేహం లేదు. అయితే ఖాఫీఖాన్ గాని లేక యూరోపియన్ చరిత్రకారులు గాని ఆ ఒప్పందంలో ఏముందనే విషయాన్ని పరిశీలించడమో, పరిశోధించడమో చేయలేక పోయారంటే, విషాదకరమైన విషయమే. ఆలంగీర్ మరియు షుజాలకు రాసిన తన లేఖల్లో మురాద్ పదేపదే దీన్ని గుర్తుకు తెచ్చాడు. దీని (అంటే ఒడంబడిక) సారాంశమేమిటంటే దారా షికూహ్, సోదరుల్లో నుండి ఏ ఒక్కరిపై కూడా దాడి జరిపినా, మిగిలిన సోదరులు అతనికి తమ సహాయ సహకారాలు అందించాలి. తనే (అంటే మురాద్) ఒక లేఖలో ఇలా రాశాడు:

## షుజా పేర మురాద్ లేఖ :

“.......మన ఒప్పందంలో అంగీకరించబడిన ఇంకొక షరతు ఏమిటంటే, ప్రత్యర్థి మన ముగ్గురు అన్నదమ్ముల్లో ఏ ఒక్కరిపై దాడి జరిపినా మిగిలిన ఇద్దరు సోదరులు మూడవ సోదరునికి సహాయపడాలి. ఒకవేళ ఇలాంటి పరిస్థితి గనక ఎదురైతే మీరు ఏ రకంగా సహాయపడతారు? ఇంకా ఇంత దూర ప్రాంతం నుండి ఏ విధంగా చేరుకొని సహాయం అందించగలరు? (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.5/225/ఎ, అను.షమ్స్ బరేల్వి-పేజి 345).

అంతేకాకుండా విజయం చేకూరిన తరువాత యుద్ధ లాభంలో నుండి మూడవ వంతు, కాబూల్, పంజాబ్ మరియు కాశ్మీర్ ప్రాంతాలు మురాద్‌కు ఇవ్వబడతాయని కూడా ఆ ఒప్పందంలో పేర్కొనడం జరిగింది.

## ఔరంగజేబ్ పేర మురాద్ లేఖ :

"...... మన ముగ్గురు సోదరుల మధ్య పరస్పర ఒక అంగీకారం కుదిరింది. అదేమిటంటే, మనం సోదరులం ముగ్గురం ఒక విషయంపై ఏకాభిప్రాయులం కానంత వరకు ఏ పనీ చేయరాదు." అందుకని తమ అభిప్రాయాలు మరియు కార్యాచరణ గురించి ఒకరినొకరు తెలుపుకుంటూ ఉండడం సమయపు ఆవశ్యకత మరియు ఒప్పందంలోని షరతు కూడాను." (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.5/241, అను.షమ్స్ బరేల్వి-పేజి 355).

ఆఖిల్ ఖాన్ రాజీ అనే చరిత్రకారుడు కొన్ని పంక్తుల్లోనే ఈ ఒప్పందాన్ని దానిలోని షరతులతో పాటు యుద్ధసొత్తు (లాభం) యొక్క పంపకపు పద్ధతిని, భాగం నిర్ధారణను కూడా పేర్కొన్నాడు. అది ఈ విధంగా ఉంది: "ఈ షరతులపై ఒప్పందం చేసుకోబడింది. ఇంకా యుద్ధసొత్తులో 1/3వ భాగం రాకుమారుడు మురాద్ బక్ష్‌కు చెందుతుంది. మిగిలిన 2/3వ భాగం మా (అంటే ఔరంగజేబ్) ప్రభుత్వ ఖజానాలో జమ చేయబడుతుంది. ప్రభువుల వారి (అంటే షాజహాన్) యావత్ రాజ్యం భారత దేశాన్నంతా వశపరచుకున్న తరువాత పంజాబ్, ముల్తాన్, ఠట్ వరకు కాశ్మీరం, కాబూల్, సూబాలు రాకుమారుడు మురాద్ బక్ష్ రాజ్యంలో చేర్చబడతాయి. ఇంకా ఆయన గారికి (అంటే మురాద్‌కు) తన ఈ రాజ్య పరిధిలో ధ్వజం లేపుకోవడానికి (తన జెండా ఎగురవేయడానికి) ఖుత్బా (శుక్రవారం ప్రసంగం)లో తన పేరు ఉచ్చరించుకోవడానికి ఇంకా తన పేరున నాణేలు జారీ చేసుకోవడానికి అధికారం ఉంటుంది." (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.4/170-ఇ, స.న.అష్రఫ్-పేజి 408, అను. షమ్స్ బరేల్వి, పేజి 275, వాఖిఆతె ఆలంగీరి-ఆఖిల్ ఖాన్ రాజి, పేజి 35 ... ఔరంగజేబ్ ఆలంగీర్ ... షిబ్లి నోమానీ, పేజి 100)

## మురాద్‌బక్ష్ పేర ఔరంగజేబ్ లేఖ :

"...... ఈ కారణంగా ప్రేమ, దయ, కనికరాల దృష్ట్యా, మాజీలో చేసుకున్న ఒడంబడిక ఒప్పందాల దృష్ట్యాను ఇది వ్రాయబడుతున్నది. (ఈ ఒప్పందం వ్రాయబడుతున్నది). ఆయన (మురాద్) గారితో ప్రేమ, ఐకమత్యాల ప్రదర్శన కనబడుతున్నంత వరకు, ఇంకా ఆయన ఎలాంటి చెడు కార్యం తలపెట్టనంత వరకు, మా ప్రేమ వాత్సల్యాలు, ప్రసాదాలు దిన దినాభి వృద్ధి చెందుతూనే ఉంటాయి. ఇంకా మనిద్దరి లాభనష్టాల్ని ఒకటిగా, ఉమ్మడిగా భావిస్తూ సహాయ సహకారాల షరతులు నెరవేరుస్తూ ఉంటాము. ఇంకా ఐకమత్యం, అన్యోన్యతల ఏ కోణాన్ని జారవిడువము. నేడు మేము ఆయన (మురాద్) గారి పరిస్థితి పట్ల ఎంత ప్రసన్నులం, సంతృప్తులమై ఉన్నామో, ఆయనకు ఏదైతే గౌరవోన్నతులు ప్రసాది స్తున్నామో, లక్ష్యం నెరవేరిన తరువాత (అనగా భారత దేశాన్ని వశపరచుకున్న తరువాత), ఇంకా భ్రష్టుడు, నాస్తికుడు ఓడిపోయిన తరువాత ఇంతకన్నా అధికంగా ఆయన గారిపై ప్రసన్నులవుతాము. ఇంకా ఆయన్ను అభివృద్ధిపరచడానికి, ఆయన పరిస్థితి పెంపొందించ డానికి మా శాయశక్తులా కృషిచేస్తాము.

మరియు మేము చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తాము. ఇంకా ఏ విధంగానైతే ఇంతకు ముందే నిర్ణయం జరిగిందో లాహోర్, కాబూల్, ముల్తాన్, భక్కర్ మరియు ఠట్ సూబాలు వాటి అన్ని జిల్లాలతో సహా అమ్మాన్ (అరేబియా) అఖాతం వరకు ఈ ప్రియ సోదరుని కోసం విడువబడ తాయి. (కేటాయింప బడతాయి). ఈ విషయంలో మేము ఎలాంటి సంశయాన్ని ప్రదర్శించము. దుష్టుడైన నాస్తికుణ్ణి సమాప్తం చేసి, దైవ ప్రసాదితమైన ఈ రాజ్య పరిధుల్లో నుండి ఈ ముళ్ళ కంపను, కలహదౌర్జన్యాలకు మూలమైన ఈ ముల్లును బయటికి గెంటేసిన తరువాత (ఈ పనిలో ప్రియ సోదరుని సహాయ సహకారాలు అత్యంతవసరం). ఆయన్ను ఎలాంటి జాప్యం లేకుండా ఆయనగారి సూబాల వైపుకు పంపేయడం జరుగుతుంది. ఆయన్ను సాగనంపడంలో ఎలాంటి జాప్యానికి, ఆలస్యానికి తావివ్వడం జరగదు. మన ఇరుపక్షాల్లో నుండి ఎవరూ కూడా స్వార్థపరుల ఇచ్చకాలకు, చాడీలకు ప్రభావితం కాకూడదు. తమ మనసుల్ని చిన్నబుచ్చుకోకూడదు. ఈ చాడీలు చెప్పేవారు ప్రపంచంలోని అత్యంత చెడ్డవారు, ద్రోహుల ముఠా (అందుకని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి). మేము ఈ ఒప్పందపు సత్యానికి, పటుత్వానికి దైవాన్ని, దైవప్రవక్త (సఅసం)ను సాక్షులుగా నిలుపుతున్నాము. ఇంకా ఈ ఒప్పం దానికి, దస్తావేజుకు ప్రియసోదరుని ఆత్మ నిమ్మళానికి మా యొక్క ముద్ర మరియు హస్తాక్షరాలతో శోభిల్లచేస్తున్నాము .....” (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం. 4/170, సం.స.న. అష్రఫ్, పేజి-408, అను. షమ్స్ బరేల్వి పే. 274, 275)

ఈ కారణంగానే దారా షికూహ్ పరాజయం తరువాత, మురాద్, ఔరంగజేబ్‌తో అసంతృప్తిగా, దూరదూరంగా ఉండడంతో, ఈ ఒప్పందం ప్రకారమే ఔరంగజేబ్ అతనికి ఇరువై లక్షల రూపాయల్ని నగదుగా పంపించాడు. ఇంకా దారా షికూహ్ వివాదం పరిష్క రింపబడగానే కాబూల్, పంజాబ్ మరియు కాశ్మీర్ ప్రాంతాలు కూడా అప్పగించ బడతాయని చెప్పి పంపించాడు.

ఈ విషయంగా ఆఖిల్ ఖాన్ ఇలా వ్రాశాడు :

“..... (ఈ ఒప్పందం ప్రకారమే) ప్రభువుల వారు (అనగా ఔరంగజేబ్) 20 లక్షల రూపాయల నగదు పంపుతూ ఇవి మీ స్వంత ఖర్చులు, మీ సైన్యపు ఖర్చుల నిమిత్తం పంపబడు తున్నాయని ఇంతకు క్రితం చేసుకోబడ్డ ఒప్పందం ప్రకారం యుద్ధ సొత్తు (లాభం) లోని మూడవ భాగం మీకు పంపబడుతున్నదని, మిగిలింది (అనగా మూడింట రెండు భాగాలు) మా సర్కారులో జమ చేయబడుతున్నాయని, ఇక దారా షికూహ్ అనబడే ఈ సంక్షోభం సమాప్తం అయిన తరువాత పంజాబ్, కాబూల్, కశ్మీర్ సూబాలు కూడా మీకు అప్పగించబడి మీరు మీ రాజ్యంలో సింహాసనాన్ని అధిష్టించవచ్చని కబురు పంపించారు....” (వాఖిఆత్ ఆలంగీరి, ఆఖిల్ ఖాన్ రాజీ, పే. 88 ..... ఔరంగజేబ్ పర్”...... షిబ్లి, పే. 100)

ఇంత వివరంగా, స్పష్టంగానున్న సంఘటనలకు భిన్నంగా సామ్రాజ్యానికి మీరే అర్హులని, తమకు రాజ్యాన్ని కట్టబెట్టి నేను ఏకాంతంలోకి వెళ్ళిపోతానని చెప్పి ఔరంగజేబ్ మురాద్‌కు ఆశ గొలిపి యుద్ధానికి ప్రేరేపించాడని డాక్టర్ బర్నేర్ ఇంకా ఇతర యూరోపియన్ చరిత్రకారులు వ్రాయడం ఎంతటి మోసం, వంచన మరియు ఆధారం లేని నింద అంటారు? డాక్టర్ బర్నియేర్ ఈ విషయాన్ని పదే పదే బిగ్గర స్వరంలో ఆలాపించారు. ఆయనేమంటారో వినండి.

"ఔరంగజేబ్ బాహ్యంలో నిరంతరం మురాద్ బక్షను భారత చక్రవర్తి అంటూనే సంబోధించేవాడు, ఇంకా కేవలం అయ్యవారే సింహాసనాన్ని అధిష్టించడానికి యోగ్యులు అని ఖలీలుల్లాహ్‌తో అన్నాడు. (Travel in the Moghal Empire, by Dr. Burnier page 56)

డాక్టర్ గారే ఇంకేమంటున్నారో వినండి. ఆలంగీర్ మురాద్‌కు ఒక లేఖ వ్రాశాడని, అందులో అక్కడిక్కడ కొన్ని వాక్యాలు ఇలా ఉన్నాయని చూపించారు.

"సోదరా! రాజ్య వ్యవహారాల్లాంటి బరువైన పనిని మోయడం నా అంతరంగిక మనస్తత్వానికి, నైజానికి ఎంత విరుద్ధమో నీకు తెలియంది కాదు. .... సామ్రాజ్య హక్కు బాధ్యతల నుండి, కోరిక ఆకాంక్షల నుండి నేనైతే పూర్తిగా వైదొలగుతున్నాను... అంతేకాదు, దారా షికూహ్‌లో పరిపాలకునిలో ఉండవలసిన గుణాలు అసలే లేవు, ఇంకా నాస్తికుడు, ధర్మభ్రష్టుడూ అయిన కారణంగా కిరీట సింహాసనాలకు అతను అసలే అర్హుడు కాదు.... ఈ పరిస్థితుల్లో మహోన్నతమైన ఈ సామ్రాజ్య పరిపాలనకు కేవలం మీరొక్కరే యోగ్యులు .... ఇక నాకు సంబంధించినంతవరకు, దైవానుగ్రహం వల్ల మీరు చక్రవర్తి అయినప్పుడు, తమ రాజ్యపరిధిలో, ప్రశాంతంగా లగ్న మనస్సుతో దైవారాధన చేసుకోవడానికి నాకొక ఏకాంత, ప్రశాంత ప్రదేశంలో ఓ మూల (స్థలం) ప్రసాదిస్తారని మీ నుండి స్థిరమైన, దృఢమైన వాగ్దానం లభిస్తే నాకంతే చాలు .... అందుకని ఒక్క క్షణమైనా వ్యర్థం కానివ్వకండి, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి, వెంటనే సూరత్ కోటను వశపర్చుకోండి." (Travels in the Moghal Empire, by Dr. Burnier page 26, 27)

ఇక మీరే న్యాయం చేయండి. డాక్టర్ బర్నియేర్ గారి ఈ వాంజ్మూలాల్లోని సత్యత ఎంతో మీరే నిర్ణయించండి. ప్రత్యేకించి "మీరు వెంటనే సూరత్‌ను ఆక్రమించుకోండి, ఆలస్యం చేయకండి" అంటూ ఆయనగారు రాసింది ఎంత బూటకమైందో! మురాద్ స్వయంగా రాసిన లేఖల ద్వారానే నెలల తరబడి ఔరంగజేబ్ అతన్ని అనుచిత చర్యల నుండి ఆపుకుంటూ వచ్చాడని స్పష్టంగా, ఎలాంటి అరమరికలు లేకుండా తేటతెల్లమైపోయింది. ప్రత్యేకించి సూరత్ కోటపై ఆక్రమణ అతని అనుచిత చర్య అని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. అయితే విచిత్రమేమిటంటే దీనికి భిన్నంగా మురాద్‌ను ప్రేరేపించి, ముందుకు నడిపించింది ఔరంగజేబే నంటూ డాక్టర్ బర్నియేర్ వ్రాస్తున్నారు. మనం డాక్టర్ బర్నియేర్ మాటను నమ్ముదామా? లేక స్వయంగా మురాద్ చెబుతున్నది విశ్వసిద్దామా? నిర్ణయాధికారం పాఠకులకే విడిచిపెడుతున్నాం.

ఔరంగజేబ్, మురాద్‌కు సారా తాగించి బంధించాడని యూరోపియన్ చరిత్రకారు లందరూ వ్రాశారు, అయితే ఒక్క డాక్టర్ బర్నియేర్ తప్ప, ఇతర సమకాలీన చరిత్రకారులెవరు కూడా ఈ సారా విషయంగా ఒక్క ముక్క కూడా వ్రాయలేదు. విచిత్రమేమిటంటే అల్‌ఫిన్‌స్టన్ "భారత చరిత్ర" అనే తన గ్రంథపు నోటులో ఒకచోట డాక్టర్ బర్నియర్ గురించి ఇలా వ్రాశారు:

"డాక్టర్ బర్నియర్ కూడా అదే కాలానికి చెందినవారు. (సమకాలీనులే). మరియు బాగా వ్రాసేవారు కూడాను. కాని ఆయన ప్రసంగ మరియు రచనా అనుభవాలు పరిమితంగా ఉండి ఉంటాయి. భారతీయుల గురించి అవగాహనకు, ఒక అభిప్రాయానికి రావడానికి ఆయన వద్ద బహు తక్కువ సాధనాలు ఉండి ఉంటాయి. ఇదే కాకుండా ఆయన వాంఙ్మూలాల్లో ఎలాంటి కథనాలు చోటు చేసుకున్నాయంటే, ప్రజలకు అవి కల్పితాలుగా కనబడతాయి." (భారత చరిత్ర – అల్ ఫిన్‌స్టన్, పే. 999 (ఔరంగజేబ్ పర్' ..... షిబ్లి, పే.102)

అల్‌ఫిన్‌స్టన్, డాక్టర్ బర్నియేర్‌కు సంబంధించి అత్యంత పరిశోధనాత్మకమైన తీర్పునిచ్చారు. అయితే విచారించదగ్గ విషయం ఏమిటంటే, ఔరంగజేబ్ సమర్థనలో ఇచ్చిన వాంఙ్మూలాల వరకే డాక్టర్ బర్నియేర్ నమ్మదగిన మనిషి కాదు. అదే ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా అతను చెప్పిన ఒక్కొక్క వాక్యం, ఒక్కొక్క పదం ఆకాశం నుండి అవతరించిన దైవవాణి. ఈ ధోరణి లేక ఈ శైలి, కేవలం అల్‌ఫిన్‌స్టన్ వరకే పరిమితం కాదు, యూరోపియన్ చరిత్రకారులందరూ అతని వ్రాతల్ని దైవగ్రంథంగా పరిగణిస్తారు.

ఈ యూరోపియన్ చరిత్రకారులు ఔరంగజేబ్‌ను అపకీర్తి పాల్జేయడానికి, అతని రూపాన్ని వికృతంగా మార్చడానికి, ప్రజల దృష్టిలో అతన్ని క్రూరునిగా చిత్రీకరించడానికి ఎన్నెన్ని తతంగాలు చేశారో, ఏ విధంగా సంఘటనల్ని మార్చారో, ఏ విధంగా అసత్యాల్ని జొప్పించారో, లేని విషయాలు అతనిపై ఎలా ఆపాదించారో, ఎలాంటి మోసం, వంచనకు పాల్పడ్డారో మీరే చూడండి, మీరే పరిశీలించండి. ఒక వ్యక్తిని అపకీర్తి పాల్జేయడానికి ఇన్ని కుతంత్రాలు, ఇన్ని కుట్రలు, ఇన్ని అసత్యాలు, ఇంత సుసంఘటితంగా ప్రయత్నాలు జరిగిన తరువాత, ఒక్క ఔరంగజేబేమి ఖర్మ, దైవదూతలాంటి పుణ్యపురుషుణ్ని కూడా ఆపాదమస్తకం పాపాలు మూర్తీభవించిన రాక్షసునిగా నిరూపించవచ్చు.

## దారా షికూహ్‌ను వెంబడించడం :

మురాద్‌ను నిర్బంధించిన తరువాత ఔరంగజేబ్ డిల్లీ వస్తున్నాడనే వార్త వినగానే దారా డిల్లీని విడిచి లాహోర్ వెళ్ళిపోయాడు. లాహోర్, పంజాబ్‌లు అతని జాగీర్లు. పంజాబ్ అంతా కూడా యుద్ధాల్లో ఆరితేరిన వారితో నిండివున్న ప్రాంతం. కనుక అక్కడ ఒక బ్రహ్మాండమైన సైన్యాన్ని సమీకరించుకోవచ్చనే ఆలోచనతో దారా లాహోర్ చేరుకున్నాడు. ఔరంగజేబ్‌కు ఈ విషయం తెలిసిపోయినందున, అతను తీరికగా డిల్లీ చేరుకొని, కొన్ని రోజులు అక్కడుండి, దారాను వెంబడించడానికి లాహోర్ బయలుదేరాడు. అయితే దారా ఎంతగా బెదిరిపోయాడంటే,

ఔరంగజేబ్ సైనికుల భయం అతని సైనికాధికారులపై ఎంతగా ప్రభావితమైనదంటే, అసలు సైన్యం చేరకముందే, ముందస్తు సైనికదళం చేరుకోగానే, దారా సైన్యం బెదిరిపోయి, పారిపోయేది. అందులోని కొంత సైన్యం వచ్చి ఔరంగజేబ్ సైన్యంతో కలిసిపోయేది. కొంతసైన్యాన్ని తీసుకొని నిరంతరం దారాను అతను దొరికేంత వరకు వెంబడించాలని ఔరంగజేబ్ తన సైనికాధికారులకు ఆజ్ఞాపించి పంపించాడు. అందుకని కొంత సైన్యం ముందుగా నడుస్తున్నది. ఔరంగజేబ్ మిగిలిన సైన్యాన్నంతా తీసుకొని దాని వెనుక నడుస్తున్నాడు. దారా అక్కడి నుండి ముల్తాన్ చేరుకున్నాడు, ముల్తాన్ నుండి భక్కర్ వచ్చాడు. అయితే రోజు రోజుకు అతని సైనిక బలం తరుగుతూనే పోతున్నది. చివరికి అతని ఓ పెద్ద జనరల్, దావూద్ ఖాన్ కూడా అతన్ని విడనాడాడు. అన్ని వైపుల్నుండి దారా తనను నిస్సహాయునిగా, నిరాశ్రయునిగా భావించసాగాడు. తను పంజాబ్, సింధ్‌ల కోసం ప్రాకులాడుతూ కూర్చుంటే ఒకానొక రోజు ఔరంగజేబ్‌కు పట్టుబడటం ఖాయమని అతనికి కనబడసాగింది. సమూగడ్ యుద్ధంలో ఔరంగజేబ్ విజయవార్త విని, అప్పటి వరకు సులేమాన్ షికూహ్‌తో ఉంటున్న రాజా జైసింగ్, అతన్ని విడిచి, ఔరంగజేబ్ వద్దకు వచ్చి, అతని విధేయతను స్వీకరించాడు. ప్రస్తుతమతను దారాను వెంబడించే పనికోసం నియుక్తుడయ్యాడు. దారా ముల్తాన్ నుండి కచ్ వైపునకు మరలాడు. ఔరంగజేబ్ ముల్తాన్ చేరగానే, అతని ఇంకొక సోదరుడు షుజా గొప్ప సైన్యాన్ని తీసుకొని ఆగ్రా వైపునకు వస్తున్నాడనే కబురు అందింది. దారా పరిస్థితిని గమనించిన ఔరంగజేబ్, ప్రస్తుతం దారాతో పెద్ద ప్రమాదమేమీ లేదని భావించి, అతన్ని వెంబడించే బాధ్యతను తన సైనికాధికారులకు అప్పగించి, సైన్యసమేతంగా వెంటనే ఆగ్రా వైపునకు ప్రయాణమయ్యాడు. ఆగ్రా చేరుకొని రాకుమారుడు షుజాను తాము చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించడానికి మెప్పించ వచ్చునేది ఔరంగజేబ్ ఆలోచన.

అయితే ఇక్కడో ప్రశ్న. షుజా చేపట్టిన ఈ ప్రయత్నం సమంజసమేనా? అతను ఆగ్రా వైపునకు రావడం న్యాయప్రదమేనా? ఔరంగజేబ్ అంతవరకు అతని పట్ల ప్రదర్శించిన ప్రేమ, దయ, కనికరాలకు అతనిచ్చే సమాధానమిదేనా? ఈ ఇద్దరు అన్నదమ్ముల సంబంధాలు, వారి పక్షాన్ని అర్థం చేసుకోవడానికి మనం కాస్త వెనుకకు మళ్ళి, సమూగడ్ విజయం నుండి ప్రారంభించాల్సి ఉంటుంది.

దారాపై విజయం మరియు ఆగ్రాను వశపర్చుకున్న తరువాత ఔరంగజేబ్ షుజా వైపు ఏ సైన్యమూ పంపలేదు. అతని సూబాలను జప్తు చేసుకోలేదు. తను చేసిన వాగ్దానంపై స్థిరంగా నిలబడడమే కాకుండా, తన వైపు నుండి షుజాకు సంపూర్ణ విశ్వాసం కలిగించడానికి అతనికి బిహార్ సూబాను కూడా ఇచ్చేశాడు. షుజా ఈ సూబా కోసం ఎంతో కాలం నుండి షాజహాన్‌కు ప్రాధేయపడుతున్నాడు. అందుకని అతని చిరకాల వాంఛ తీర్చినట్లవుతుందని

ఔరంగజేబ్ ఈ సూబాను అతనికి ఇచ్చేశాడు. షుజాకు మనశ్శాంతి, సంపూర్ణ విశ్వాసం కలుగాలని అతనికి తానొక లేఖ వ్రాసి, షాజహాన్‌తో ఇంకొక లేఖ వ్రాయించాడు. ఈ రెండు లేఖలు ఇలా ఉన్నాయి :

## షుజా పేరున ఔరంగజేబ్ లేఖ :

"..... తమరికి ఎప్పటి నుండో ఈ సూబా (బీహార్) కావాలనే కోరిక ఉంటూ వచ్చింది. ఇంకా ప్రస్తుతం మీరు సూబా బెంగాల్‌తో పాటుగా దీనిపై కూడా అధికారం కలిగి అనుభవిస్తున్నారు. కొంతకాలం వరకు ఇలాగే ఈ సూబాను తమ అధీనంలో ఉంచుకొని ప్రశాంతంగా దీని బాగోగులు చూసుకోండి. ఇంకా తమ పరిస్థితిని పటిష్ఠం చేసుకోండి. విజేతలైన మా సైన్యాలు దారా షికూహ్‌ను వెంబడిస్తూ ఈ ఘనకార్యం నుండి విజయవంతంగా వెనుదిరుగుతాయో, ఇంకా మేము రాజధాని నగరానికి తిరిగి వస్తామో అప్పుడు మీకున్న ఇతర లక్ష్యాల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చడంలో సోదరత్వ ఆచారాన్ని, సోదర బాంధవ్య అగత్యాన్ని అనుసరించి వాటిని పొందడంలో మీకు సహకరిస్తాము. దేశాన్ని, సంపదను ప్రసాదించడంలో మేము ఎలాంటి లోపాన్ని రానివ్వము......" (రుఖ్‌ఆత్ ఆలంగీర్, లేఖ నెం.4/165, సం.స.న.అష్రఫ్, పే.472, అను. షమ్స్ బరేల్వి పేజి 269).

## షుజా పేర షాజహాన్‌తో ఔరంగజేబ్ వ్రాయించిన లేఖ :

"...... నీవు రాబడి తక్కువ, ఖర్చులెక్కువని సతతం అర్జీలు పంపిస్తూ ఉండేవాడివి. అయినా మేము నీ ఈ అర్జీలను సతతం త్రోసిపుచ్చేవారం. ఇది దేనికోసమంటే, ప్రతి పనికి ఒక తగిన సమయం ఉంటుంది. ప్రస్తుతం మేము అత్యంత ప్రేమ, దయ, వాత్సల్యాలతో బెంగాల్, ఒరిస్సా లాంటి సుసంపన్న సూబాలతో పాటు, సూబా బీహార్‌ను కూడా గౌరవించదగ్గ రాకుమారుడు, సుపుత్రుడు సుల్తాన్ ఔరంగజేబ్ సిఫారసు, విన్నపాల మేరకు నీకు జాగీరుగా ప్రసాదిస్తున్నాం. ఇంకా రాబోయే పంట కాలం నుండి నీ వకీలును (రాయబారి, ప్రతినిధిని) ఆ సూబాకు పంపించి దాని పరిపాలనను పర్యవేక్షించుకోవాలి. ఈ సూబాలో వ్యవసాయాభివృద్ధి కోసం, సస్యశ్యామలత కోసం నీ వకీళ్ళు (ప్రతినిధులు) అత్యంతంగా కృషిచేయాలి. ఇక నీవు నీ కేంద్ర స్థానం నుండి బయటికి రాకూడదు. (ఇంకేవైపు కూడా ఆశ పెట్టుకోకూడదు. మమ్మల్ని దర్శించుకోవాలనే ఉత్సుకత అధికమైతే స్వయంగా మేమే కొన్ని రోజుల తరువాత నిన్ను మా సన్నిధికి రప్పించుకుంటాము. నీవు మాత్రం మా అనుమతి మరియు పిలుపు లేకుండా మా సన్నిధికి రావడానికి అస్సలు ప్రయత్నించవద్దు......" (రుఖ్‌ఆత్ ఆలంగీర్, లేఖ నెం.4/165, అనుబంధం -ఇ, సం.స.న. అష్రఫ్, పే.472-473, అను. షమ్స్ బరేల్వి, పే.300)

ఈ లేఖల్ని పంపించి, సోదరునితో చేసుకున్న ఒడంబడికను విశ్వసించి, దారాను వెంబడిస్తూ ఔరంగజేబ్ ఢిల్లీ, ఆ తరువాత పంజాబ్ వైపునకు వెళ్ళిపోయాడు.

## షుజా నమ్మక ద్రోహం :

దారా ఓటమి షుజాకు నోరూరించింది. ఆగ్రా నుండి ఔరంగజేబ్ చాలదూరం వెళ్ళి పోవడం కూడా షుజాకు ధైర్యం కలిగించింది. యుద్ధాల్లో అత్యధిక ప్రతిభను కనబరిచిన మురాద్ బంధింపబడ్డాడు. ఆగ్రా కోట పిన్న వయస్కుడు, అనుభవంలేని ముహమ్మద్ సుల్తాన్ సంరక్షణలో ఉంది. ఈ పరిస్థితులన్నీ కలిసి రావడంతో షుజా ఆశలు చిగురించాయి. అవసరమైతే ఔరంగజేబ్‌ను కూడా ఎదుర్కొనే దీక్షతో షుజా బయలుదేరాడు. వీటన్నిటితోపాటు షాజహాన్ కూడా నిర్బంధంలో ఉండి చేతులు ముడుచుకొని కూర్చుండిలేడు. ఇదే మంచి అదనని, వెంటనే వచ్చి ఆగ్రాను ఆక్రమించుకోవలసిందిగా షుజాకు రహస్యంగా లేఖలు వ్రాశాడు. ఔరంగజేబ్ ఆగ్రాను సమీపించిన తరువాత గాని ఇదంతా తండ్రి చేసిన నిర్వాకమనే విషయం తెలిసిపోయింది. దీనితో పాటుగా దారా కూడా ఈ కుట్రలో తనవంతు పాత్రను పోషించాడు. అలహాబాద్, బనారస్ మరియు రోహ్‌తాస్ కోటల్లో నున్న తన ఉద్యోగులకు, ఈ కోటల్ని షుజాకు అప్పగించాలని, ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా, షుజాకు సాధ్యమైనంతగా సహాయ సహకారాలు అందించాలని రహస్య ఆదేశాలు పంపించాడు. అందుకని వారు ఈ ఆదేశాల పాలన చేస్తూ ఈ కోటలన్నీ షుజాకు అప్పగించారు.

## ఖజ్వా యుద్ధం :

షుజా బయలుదేరి వస్తున్నాడనే వార్త అందగానే, ఔరంగజేబ్ తన కుమారుడైన ముహమ్మద్ సుల్తాన్‌ను ఆగ్రాలో తన వద్దనున్న సైన్యాన్ని తీసుకొని బయలుదేరమని ఆదేశించాడు. దానితోపాటుగా అతను ముందుగా యుద్ధాన్ని ప్రారంభించవద్దని, తను వచ్చేవరకు వేచి ఉండాలని కూడా ఆదేశించాడు. ధర్మాత్‌పూర్‌లో ఔరంగజేబ్ చేతిలో పరాజయం పాలై పారిపోయిన జస్వంత్ సింగ్, రాజా జైసింగ్ మధ్యవర్తిత్వంతో మన్నింపుపొంది, ఔరంగజేబ్ పక్షంలో చేరాడు. ఇప్పుడు అతను కూడా ఈ సైన్యంలో ఉన్నాడు. యుద్ధాన్ని ముందుగా తను ప్రారంభించవద్దని ఔరంగజేబ్ కుమారునికిచ్చిన ఆదేశానికి ఉద్దేశమేమిటంటే, ఇక ముందు వెళ్ళడానికి దారి లేదని స్వయంగా ఔరంగజేబే ఎదుర్కోవడానికి వస్తున్నాడని షుజాకు తెలిసినప్పుడు, అతను మరలిపోతాడని ఔరంగజేబ్ భావించాడు. అయితే తనూ, తన సైన్యం బనారస్ వరకు ఎలాంటి ప్రతిఘటన లేకుండా రావడాన్ని షుజా తన విజయంగా భావించి, పురోగమించసాగాడు. ఈ విషయంలో జదూనాథ్ సర్కార్ ఇలా రాశారు :

"పరిస్థితులిప్పుడు పూర్తిగా మారిపోయాయి. పరిస్థితుల్ని అర్థం చేసుకున్న ఒక వివేకవంతుని లాగా షుజా తన ఈ అనుచిత చర్యనుండి వైదొలగి, తిరిగి వెళ్ళిపోతాడని ఔరంగజేబ్ భావించాడు. ఈ ఆలోచనతోనే అతను తన వేగాన్ని తగ్గించుకున్నాడు. పన్నెండు రోజులు

డిల్లీలో కూడా ఆగాడు. ఆ తరువాత సరూన్ (సర్వన్) వేట స్థలికి వెళ్ళి వార్తల కోసం ఎదురు చూస్తూ, షుజా వెనుదిరిగిపోతే, కుమారుణ్ణి వెనుకకు రప్పించుకుందామని, వేట స్థలి నుండి బయటికి వద్దామని ఆలోచిస్తున్నాడు. కాని షుజా పిచ్చిగా పురోగమిస్తూనే ఉన్నాడు. చివరికి ఖజ్వా చేరుకున్నాడు." (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్- జదూనాథ్ సర్కార్, వా. 2, పే. 297, 298)

మరుసటి రోజే దక్కన్ నుండి మీర్ జుమ్లా తన సైన్యంతో వచ్చి ఔరంగజేబ్‌ను కలిశాడు. ఇక రెండు పక్షాల్లో యుద్ధ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జస్వంత్ సింగ్‌కు కుడి భాగపు సైన్యాల నాయకత్వం ఒసంగబడింది. కాని యుద్ధానికి ఒక రాత్రి ముందే అతను షుజాతో కుట్రపన్నాడు. యుద్ధానికి ముందు రాత్రి ఔరంగజేబ్ సైన్యాల వెనుకనుండి తను దాడి జరుపు తానని, ముందునుండి షుజా విరుచుకుపడాలని, ఈ విధంగా ఇద్దరూ కలిసి ఔరంగజేబ్ సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేయవచ్చని పన్నాగం పన్నారు. తనతో పోరాడి, తన చేతిలో పరాజయాన్ని చవిచూసి పారిపోయిన వ్యక్తిని మన్నించడమే కాకుండా, తన ఉద్యోగంలో చేర్చుకొని, సైన్యంలోని ఒక ముఖ్య భాగానికి నాయకత్వం అప్పగించిన ఔరంగజేబ్‌తో జస్వంత్‌సింగ్ ప్రవర్తించిన తీరిది.

తెల్లారి యుద్ధం జరుగనున్న రాత్రి పథకం ప్రకారం జస్వంత్ సింగ్ ఔరంగజేబ్ సైన్యంపై వెనుక వైపు నుండి దాడి జరిపి పెద్ద కల్లోలాన్ని లేపాడు. అశ్వాలు, ఒంటెలు, ఏనుగులు, గుడారాలు, ఆయుధాలు, విలువైన వస్తువులు ఇంకా నిత్యావసర వస్తువులెన్నో కొల్లగొట్టి తన వెంట తీసుకెళ్ళాడు. అనేకమంది సైనికుల్ని, యుద్ధ పశువుల్ని చంపో, గాయపర్చో, గొప్ప సంక్షోభాన్ని లేపాడు. ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన హమీదుద్దీన్ ఖాన్ ఇలా వివరించాడు:

"తెల్లారి షుజాతో యుద్ధం జరుగనున్నరాత్రి, మూడు జాముల రాత్రి గడిచిన తరువాత, ముందస్తు సైన్యపు నాయకత్వం ఎవరికైతే అప్పగించడం జరిగిందో, ఆ జస్వంత్ సింగ్, తన పద్నాలుగు వేల పదాతి, అశ్విక దళ సైన్యంతో వెళ్ళి షుజాతో కలిసిపోయాడని, పోతూ పోతూ రాజ్య సైన్యాల పశువులపై, సైనికులపై అత్యంత దౌర్జన్యాలు చేశాడని, సైనిక వ్యవస్థనంతా చిందరవందరగా చేశాడని, అనేకమంది ఎటూ తోచక ఆ దుర్మార్గుని వెంట వెళ్ళారనే సమాచారం ప్రభువుల వారికి (ఔరంగజేబ్‌కు) చేరింది. అప్పుడాయన మూడవ జాము రాత్రి చేసే తహజ్జుద్ నమాజు మరియు జపతపాల్లో నిమగ్నమై ఉన్నారు. ఇది విని, "వెళుతుంటే వెళ్ళనీయండి" అంటూ చేత్తో సైగ మాత్రమే చేశారు. ఆయన ఇంకేమీ మాట్లాడలేదు. జపతపాలు ముగించుకున్న తరువాత మీర్ జుమ్లాను పిలిపించి, "ఈ పరిస్థితుల్లో ఇది కూడా దైవానుగ్రహంగానే భావించాలి. ఈ కపటుడు యుద్ధం జరుగుతున్న సమయంలో ఇలాంటి చర్యకు పాల్పడి ఉంటే దాన్ని సంభాళించడం కష్టమైపోయేది" అని చెప్పారు. ఆ తరువాత తన అంబారీని సిద్ధం చేయమని, నగారాను మోగించమని ఆదేశించారు. ఇక స్వయంగా ఆయన ఆ మిగిలిన రాత్రంతా గజరాజుపై నున్న అంబారీలోనే గడిపేశారు. తెల్లారగానే, షుజా సైన్యం ఎడమ వైపు నుండి ఫిరంగులు పేలుస్తూ వస్తున్నట్లు కనబడింది. ఎవరికైతే ఆయువు మూడిందో, వారు చనిపోయారు. ఏ

విధంగానైనాసరే, మా గజరాజాన్ని షుజా ఏనుగు వరకు చేర్పించు అంటూ ప్రభువుల వారు తన మావటివాణ్ని ఆదేశించారు. ఆ సమయంలో ఆయన వెంటే ఉన్న ముర్షిద్ ఖులీ ఖాన్ "ఇలాంటి తెగింపు పాలకుల నియమాలకు విరుద్ధం" అంటూ విన్నవించుకున్నాడు. దానిపై ఆయనిలా అన్నారు : "మేమింకా పాలకులం కాలేదుగా! ఇలాంటి తెగింపు తర్వాతనే ఎవరైనా పాలకులవుతారు. ఇక పాలకులైన తరువాత ఇలాంటి తెగింపులో లోపం వస్తే, రాజ్యాధికారం మిగులదు." (అహ్కామె ఆలంగీర్, హమీదుద్దీన్ ఖాన్, పే.41, 42)

ఈ యుద్ధంలో షుజా ఘోర పరాజయానికి పాలై పాట్నా వైపు పారిపోయాడు. ఈ యుద్ధం ముగిసిన తరువాత కూడా ఔరంగజేబ్, షుజాను భయభ్రాంతులకు గురిచేయదలచు కోలేదు. అందుకనే అతను షుజాను తానే వెంబడించడానికి బదులు, మీర్ జుమ్లా మరియు ముహమ్మద్ సుల్తాన్‌లను పంపించాడు. ఈ సమయంలో కూడా షుజా సంధికి ప్రయత్నిస్తే, బహుశ అతని విన్నపం ఆలకించబడేదేమో! కాని అతనలా చేయకుండా, సైనిక సహాయం లభిస్తుందనే దృష్టితో పాట్నాలో ముందు తన కుమారుని వివాహం జరిపించాడు. ఆ తరువాత మోన్‌గేర్ వెళ్ళి, సైనిక సన్నాహాలు మొదలుపెట్టాడు. కాని అక్కడ కూడా అతనెక్కువ రోజులు నిలువలేకపోయాడు. ఒకచోటి నుండి ఇంకొక చోటికి పరుగెడుతూ చివరికి తన రాజధాని వైపు ప్రయాణమయ్యాడు. ఈ సమయంలో అతనో కుట్రపన్నాడు. అజ్మీర్ వెళ్ళిన ఔరంగజేబ్, అక్కడ జరిగిన యుద్ధంలో ఓడిపోయి దక్కన్ వైపునకు పారిపోయాడని, ఇక మీర్ జుమ్లా కూడా బీర్‌భూం నుండి ఒరిస్సా మీదుగా దక్కన్ వెళ్ళుతున్నాడని ఔరంగజేబ్ సైన్యంలో వదంతిని వ్యాపింపజేశాడు. సామాన్య సైనికులపై ఇదేమంత ప్రభావం చూపలేకపోయింది, కాని రాజపుత్రు ల్లోని ఒక్క నాయకుని సైన్యం తప్ప, మిగిలిన రాజపుత్ర సైన్యం అంతా, ఔరంగజేబ్ సైన్యం నుండి వేరుబడి, ముహమ్మద్ సుల్తాన్ లేక మీర్ జుమ్లాల కనీసం అనుమతి కూడా తీసుకోకుండా, ఆగ్రా వైపు బయలుదేరింది. కొన్ని నెలలలోనే రాజపుత్రులకు సంబంధించి, వారి ద్రోహానికి సంబంధించి ఔరంగజేబ్‌కు ఇది రెండవ చేదు అనుభవం. ఖజ్వా యుద్ధం సమాప్తం కాగానే, షుజాను వెంటాడే పనిని తన కుమారుడు ముహమ్మద్ సుల్తాన్ మరియు మీర్ జుమ్లాలకు అప్పగించి, దారాను ఎదుర్కోవడానికి ఔరంగజేబ్ అజ్మీర్ వైపునకు బయలుదేరి పోయాడు. అందుకని ఈ సైన్యాలకు ముహమ్మద్ సుల్తాన్ మరియు మీర్ జుమ్లాలు సారధ్యం వహిస్తున్నారు. రాజపుత్రులు ఇలా మోసగించడంతో ఒక ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. కాని మీర్ జుమ్లా తన స్వాభావిక యోగ్యత మరియు నైపుణ్యాలతో పరిస్థితిని నియంత్రించుకోగలిగాడు. అయితే అంతకన్నా కూడా ఇంకొక ఘోర సంఘటనను ఎదుర్కోవలసి వచ్చింది.

ఒకరోజు తెల్లారి చూసేసరికి ముహమ్మద్ సుల్తాన్ లేడు, రాత్రి సమయంలో ఒంటరిగా పారిపోయి, షుజాతో కలిసిపోయినట్లు తెలిసింది. ఇది షుజా పారిన చివరి పాచిక. ముహమ్మద్ సుల్తాన్‌ను అతని అనుయాయులు, ముఖస్తుతి చేసేవారు ఈ యుద్ధాలన్నీ కేవలం అతని

వీరత్వం మరియు ధైర్యస్థయిర్యాల కారణంగానే సఫలమయ్యాయని, ఔరంగజేబ్‌కన్నా అతనే రాజ్యమేల ఎక్కువ యోగ్యుడని ప్రేరేపించారు. రెండవ విషయం ఔరంగజేబ్ షుజాతో ఒడంబడిక చేసుకున్నప్పటి నుండి, అతను షుజా కుమార్తెతో వివాహమాడ తహ తహ లాడుతున్నాడు. ఆగ్రా విజయం తరువాతనే, అతను తన వివాహం గురించి తండ్రితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాడు. ఇక ఎప్పుడైతే షుజా తరఫున అతనికి ఆహ్వానం అందిందో, ఇక అతను తనను తాను ఆపుకోలేకపోయాడు.

ముహమ్మద్ సుల్తాన్ ఈ విధంగా పారిపోవడంతో మీర్ జుమ్లా కలవరపడిపోయాడు. అయితే అతను సామాన్యంగా ధైర్యం విడనాడే మనిషి కాదు. తన చింతా, కలవరాన్ని బయట పడనీయకుండా, అసలేమీ జరుగనట్లే, కేవలం ఒక మనిషి తక్కువైనట్లు ప్రవర్తించసాగాడు. ముహమ్మద్ సుల్తాన్ సారధ్యంలోని సైన్యాన్ని కూడా తృప్తిపరచగలిగాడు. ఆ తరువాత యధావిధిగా షుజాతో యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు.

ఇక ఈ పక్షానికి వచ్చిన రాకుమారుడు ముహమ్మద్ సుల్తాన్, ఇరుపక్షాల సైనిక పరిస్థితుల్ని, జయాపజయాల్ని అంచనావేసుకొని, తానొక ఓడిపోయే పక్షానికి వచ్చినట్లు అర్థం చేసుకోగలిగాడు. తన చర్యకు రాకుమారుడు అమితంగా బాధపడసాగాడు. కాని ఏం లాభం? క్షమార్హం కాని తప్పిదం జరిగిపోయింది. అయినా తన తండ్రి దయాళుత్వాన్ని నమ్ముకొని, కొత్తగా వివాహమాడిన తన వధువుకు కూడా చెప్పకుండా, తిరిగి వచ్చేసి మీర్ జుమ్లాను కలిశాడు. అయితే మీర్ జుమ్లా అతన్ని వెంటనే ఔరంగజేబ్ వద్దకు పంపించేశాడు. ఔరంగజేబ్ అతన్ని ఎందుకని ఖైదు చేశాడు? అనేదానికి అనేక కారణాలున్నాయి. అవి సుదీర్ఘంగా ఉండడంతో వాటినిక్కడే కుదిస్తున్నాము.

షుజాకు తన నావికా దళంపై అత్యధిక విశ్వాసముండేది. కాని మీర్ జుమ్లా యోగ్యత, సామర్థ్యం మరియు కార్యదక్షత ముందు ఈ దళం కూడా తుడిచిపెట్టుకపోయింది. చివరికి గత్యంతరం లేని పరిస్థితుల్లో తన భార్యాపిల్లలు, కొంతమంది అంగరక్షకులతో షుజా మఘ్‌జాతి వారి దేశమైన 'అరాకాన్' (బర్మా)కు వెళ్ళిపోయాడు. అక్కడి రాజు ఇతనికి ఆతిథ్యమిచ్చి, ఆదర సత్కారాలు చేశాడు. కాని అక్కడి కొంతమంది స్థానికులతో కలిసి, ఆ రాజు సింహాసనాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడంతో, ఆ రాజు ఇతన్ని బంధించడానికి తన సైన్యాన్ని పంపాడు. అక్కడుంటున్న పోర్చుగీసు వ్యాపారుల ననుసరించి, అప్పుడే అతను తన కుటుంబ సభ్యులతో సహా వధించబడ్డాడు. ఈ విధంగా దురదృష్టవంతుడైన షుజా, తన దుష్కర్మల ఫలితంగా పరదేశంలో దిక్కులేని చావుకు గురి అయ్యాడు.

ఈ విషయం ఔరంగజేబ్‌కు తెలిసినప్పుడు, షుజా కుటుంబం గురించి వాకబు చేయాల్సిందిగా తన అధికారుల్ని ఆదేశించాడు. కాని అప్పుడు కాదు గదా, నేటి వరకు కూడా ఆ

కుటుంబం ఆచూకి తెలిసిరాలేదు. (ముంతఖబుల్ లుబాబ్-ఖాఫిఖాన్-వా. 2, భా-3, పేజి. 112,113, Travels in the Moghal Empire- Dr. Bernier Pages 109-112.

షుజాకు సంబంధించిన పరిస్థితుల వివరణ తరువాత, షుజా పతనంలో ఔరంగజేబ్ పాత్ర ఎంతవరకున్నదనే విషయాన్ని పాఠకులే అంచనా వేసుకోగలుగుతారు.

## అజ్మీర్ యుద్ధం :

ఖజ్వా యుద్ధం సమాప్తమైందో లేదో, దారా గుజరాత్‌లో సైన్యాన్ని సమీకరించుకొని అజ్మీర్ వైపు బయలుదేరుతున్నాడనే సమాచారం అందింది. అందుకని షుజాను వెంబడించే బాధ్యతను తన కుమారుడు ముహమ్మద్ సుల్తాన్ మరియు తన సైనికాధికారి మీర్ జుమ్లాకు అప్పగించి ఔరంగజేబ్ అజ్మీర్ వైపునకు బయలుదేరాడు.

దారా సింధ్ నుండి బయలుదేరి "కచ్" ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడి రాజు తూర్పు దేశాల ఆనవాయితీని అనుసరించి అతన్ని ఘనంగా స్వాగతించడమే కాకుండా, గౌరవ మర్యాదలు, అంతస్తు పెంచుకోవాలనే దృష్టితో, దారా కుమారుడు షేర్ షుకూహ్‌తో తన కుమార్తె వివాహం జరిపించాడు. దానితోపాటే సైనిక సహాయాన్ని కూడా అందించాడు. అక్కడి నుండి బయలుదేరి దారా గుజరాత్ చేరుకున్నప్పుడు, అప్పుడప్పుడే చెర నుండి విముక్తి పొంది, ఔరంగజేబ్ ద్వారా గవర్నరు హోదాపై నియమింపబడిన షా నవాజ్ ఖాన్, ఔరంగజేబ్ పట్ల ద్వేషంతో, దారా విధేయతను స్వీకరించడమే కాకుండా ఆ సూబాకు చెందిన ఆర్థిక, సైనిక పరమైన అన్ని వనరుల్ని దారాకు అప్పగించాడు. ఈ విధంగా దినదినం దారా పరిస్థితి మెరుగుపడసాగింది. గుజరాత్‌లో సైనిక సమీకరణ చేసుకుంటుండగానే, జస్వంత్ సింగ్ ఆహ్వానం అందింది. అందులో దారా అజ్మీరు రావాలని, ఒక్క జస్వంత్ సింగే కాకుండా రాజ్‌పుతానాకు చెందిన రాజపుత్ర రాజులందరి సహాయ సహకారాలు అతనికి లభిస్తాయని ఆ సందేశంలో పేర్కొనడం జరిగింది. ఖజ్వా యుద్ధంలో జస్వంత్ సింగ్, రాజపుత్రుల శీలానికి విరుద్ధమైన ఎలాంటి స్వామి ద్రోహ చర్యకు పాల్పడ్డాడో మనమింతకు ముందే చదువుతూ వచ్చాము. అటువంటి వ్యక్తిని నమ్మాలా? వద్దా? అని దారా వెయ్యిసార్లు యోచించాల్సి ఉండేది. కాని ఆ స్వామిద్రోహచర్య, జస్వంత్ సింగ్ తన సమర్థనలోనే చేశాడని దారా పొరబడ్డాడు. అందుకని దారా అతన్ని విశ్వసించి అజ్మీరు వరకు వచ్చేశాడు. ఔరంగజేబ్ కూడా అజ్మీరును సమీపిస్తున్నాడు. అజ్మీరు చేరిన తరువాత దారాకు ఎక్కడా కూడా జస్వంత్ సింగ్ వచ్చిన సూచనలు కనబడలేదు. దారా కలవరపడి, తన కుమారుణ్ని జస్వంత్ సింగ్ వద్దకు పంపించాడు. అయితే అంతకుముందే రాజా జైసింగ్ నుండి ఒక సందేశం జస్వంత్ సింగ్‌కు ముట్టింది. అందులో జస్వంత్ సింగ్ దారా సమర్థనను విరమించుకుంటే తాను (జైసింగ్) ఔరంగజేబ్‌తో చెప్పి అతని తప్పులన్నిటినీ మన్నింపజేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అంతే! జస్వంత్ సింగ్ మరోసారి మోసానికి

పాల్పడ్డాడు. దారాకు ఎలాంటి సహాయం అందించడానికి నిరాకరించాడు. మిగిలిన రాజపుత్ర రాజులందరూ అతన్నే అనుసరించారు. ఈ విధంగా జస్వంత్ సింగ్ మోసానికి గురిఅయి, దారా ఒక గొప్ప సహాయం నుండి వంచించబడ్డాడు.

1659 మార్చి 11న ఔరంగజేబ్ అజ్మీర్ పొలిమేరల్లో ప్రవేశించాడు. దారాకు ఇక వెనుదిరిగే అవకాశం లేదు. అందుకని తన వెంట ఉన్న సైన్యంతోనే యుద్ధ సన్నాహాలు ప్రారంభించాడు. ఆ రాత్రి నుండే యుద్ధం ప్రారంభమైంది. కాని నిర్ణయాత్మకమైన యుద్ధం మార్చి 13న జరిగింది. దారా పక్షంలోని పెద్ద పెద్ద నాయకులు, సైనికాధికారులందరూ హత మయ్యారు. షానవాజ్ ఖాన్ కూడా వధించబడ్డాడు. దారా పరాజయం పొంది, యుద్ధరంగం నుండి పారిపోయాడు. అతన్ని పట్టి బంధించే బాధ్యతను రాజా జైసింగ్ మరియు బహాదూర్ ఖాన్‌లకు అప్పగించి మార్చి 18న ఔరంగజేబ్ డిల్లీకి మరలాడు.

## దారా పట్టుబడడం - చంపబడడం :

దారా తన కుటుంబ సభ్యుల్ని, కొంతమంది సైనికుల్ని తీసుకొని ముందు అహ్మదాబాద్ వెళ్ళాడు. ఆ తరువాత "కచ్" వైపు వెళ్ళాడు. కాని పరిస్థితులన్నీ తారుమారై పోయాయి. ఏ ఇంటి ద్వారాలు కూడా అతని కోసం తెరుచుకోవడం లేదు. నీరు కూడా దొరకని ఎడారి ప్రాంతాన్ని దాటి, సింధ్ చేరుకొని అక్కడినుండి ఖాందహార్ చేరుకోవాలని దారా నిశ్చయించు కున్నాడు. అతను ఇరాన్ చక్రవర్తితో ఉత్తర ప్రత్యుత్తరాలు మొదలుపెట్టాడు. ఇరాన్ చక్రవర్తి తన ఖాందహార్ అధికారుల్ని దారాకు సహకరించమని ఆదేశించడమే కాకుండా, దారా షికూహ్‌ను స్వాగతించడానికి సిద్ధంగా ఉండవలసిందని తన యువరాజుకు ఆజ్ఞలు జారీ చేశాడు. ఈ ఉత్తరాలన్నీ "మంషఆతె తాహెర్ వహీద్" అనే గ్రంథంలో పేర్కొనబడ్డాయి. ఈ కాలంలోనే తన అంతఃపుర భారాన్ని తగ్గించుకోడానికి, అనేకమంది స్త్రీలను విడిచిపెట్టేశాడు. అతని సైనికులే అతనికి తిరుగబడ్డారు. వారు అతన్ని దోచుకోవడం మొదలుపెట్టారు. బోలన్ కనుమగుండా ఖాందహార్ వెళ్ళే ఉద్దేశంతో అతను సింధూ నదిని దాటి సెయూస్తాన్‌లో ప్రవేశించాడు. త్రోవలో దావర్ జమీందారు అయిన మలిక్ జీవన్ ప్రాంతముంది. దారా అతనికి ఎన్నో రకాలుగా సహాయపడ్డాడు. ఒకసారి అతని ప్రాణాన్ని కూడా కాపాడాడు. అందుకని అతను తప్పక తనకు రుణపడి ఉంటాడని దారా భావించాడు. కాని దారా భావించినట్లు జరుగలేదు. దారా అతని ప్రాంతానికి చేరినప్పుడు బాహ్యంగానైతే అతన్ని ఆదర సత్కారాలతో స్వాగతించాడు. కాని త్వరలోనే అతని మనసులోనున్న చెడు బయటపడింది. అతను ఇనాములు, కానుకలు, బిరుదుల ఆశతో దారాను బంధించేశాడు. ఇక్కడే దారా ప్రియపత్ని నాదిరా బేగం కాలధర్మం చెందింది. ఆమె మరణం దారాకు భరించరానిదై పోయింది. అతని మనసు విరిగిపోయింది. ధైర్యం సడలిపోయింది. ఆమెను లాహోర్‌లో ఖననం చేయడానికి పంపిస్తున్నప్పుడు తన చివరి

విశ్వాసపాత్రుడైన ఉద్యోగిని కూడా, ఆమె శవంతో పాటు పంపిస్తూ, అతన్ని దూరం చేసుకున్నాడు. మలిక్ జీవన్ దారాను బంధించి ఔరంగజేబ్ మనుషులకు కబురు పంపించాడు. రాజా జైసింగ్ మరియు బహదూర్ ఖాన్‌లు వెంటనే 'దావర్'కు బయలుదేరారు. జూన్ 23న దారా, అతని చిన్న కుమారుడు, ఇద్దరు కుమార్తెలు వారికి అప్పగించబడ్డారు. ఆగస్టు 23న వీరంతా ఢిల్లీ చేరుకున్నారు. నజర్ బేగ్ అనే సైనికాధికారిని వారి రక్షణ కోసం నియమించడం జరిగింది.

దారా ఇక్కడ దాదాపు ఐదు రోజుల వరకున్నాడు. ఆగస్టు 29వ తేదీన దారా మరియు అతని కుమారున్ని ఢిల్లీ వీధుల గుండా త్రిప్పుతూ, రాత్రి సమయంలో మహాబత్ ఖాన్ పేరుగల సరాయె (లాడ్జింగ్)లో ఉంచబడ్డారు. మరు రోజు అనగా ఆగస్టు 30న దారా షికూహ్ వధించబడ్డాడు.

ఇంతవరకు దారా కార్యక్రమాలు, అతని అంతం గురించి సంక్షిప్తంగా పేర్కొంటూ రావడం జరిగింది. ఈ విషయంలో అతిశయోక్తులతో కూడిన కొన్ని కథలు, ఆధారం లేని కొన్ని నిందల గురించి కూడా చర్చించడం అసమంజసం కాదనుకుంటాము.

ఔరంగజేబ్, దారాతో పోరాడటం న్యాయమేనా? అనే ప్రశ్న మొదట్లోనే వస్తుంది. ఈ ప్రశ్నకంటే ముందు, ఇంకొక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. రాజ్యాధికారాన్ని చేపట్టకముందే, యువరాజుగా ఉన్నప్పుడే ఔరంగజేబ్ పట్ల దారా ప్రవర్తన ఎలా ఉండేది అనే విషయం పరిశీలించాల్సి ఉంటుంది. దారా జీవితమంతా కూడా ఔరంగజేబ్‌ను వ్యతిరేకిస్తూనే గడిచింది. అతని ఒక్కొక్క ప్రవర్తన ఈ విషయాన్నే ధృవీకరిస్తుంది. అతను అన్ని రకాలుగా ఔరంగజేబ్‌ను అగౌరవపరచడం, ఛీత్కరించడం తన దైనందిన చర్యగా చేసుకున్నాడు. తండ్రికి తన మీదున్న అపార ప్రేమ వాత్సల్యాలతో అక్రమంగా లాభపడి, తండ్రికి సతతం ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా నూరిపోస్తుండేవాడు. చివరికి తండ్రిని ఔరంగజేబంటేనే సహించని స్థితికి తెచ్చాడు. ఔరంగజేబ్ పట్ల సోదరుల్లో ద్వేషాన్ని రగిల్చడానికి ప్రయత్నించాడు. సోదరీమణుల దృష్టిలో అతన్ని అల్పునిగా నిరూపించడానికి సతతం ప్రయత్నించాడు. ప్రతి విషయంలో దక్కన్ రాజ్యాధీశుల దృష్టిలో ఔరంగజేబ్ అల్పుడని, విలువహీనుడని, దర్బారులో అతనికెట్టి స్థానం లేదని నిరూపించడానికి సతతం ప్రయత్నించాడు. ఔరంగజేబ్ సమర్పించిన ప్రతి ప్రతిపాదనకు అడ్డుపుల్ల వేశాడు. అతని అధికారుల్ని అతనికి వ్యతిరేకంగా నిలబెట్టేవాడు. యోగ్యులైన అధికారుల నుండి అతన్ని వంచించడానికి, అతని అధికారుల్ని ఎక్కువ జీతాలిచ్చి, ర్యాంకులు పెంచి అతని నుండి తన వద్దకు రప్పించుకునేవాడు. చివరికి యుద్ధాలు జరుగుతున్న సంక్లిష్ట, కీలక సమయాల్లో ఔరంగజేబ్ వద్ద నుండి సైన్యాల్ని రప్పించుకోవడానికి కూడా వెనుకాడలేదు. ఈ విధంగా ఔరంగజేబ్ పట్ల తన శత్రుత్వాన్ని అతను ఏనాడూ దాచుకోలేదు. అంతేకాదు, సమూగడ్ యుద్ధానికి ముందు, యుద్ధ రంగానికి దారా వెళ్ళకూడదని, తానే వెళ్ళి సోదరుల సమస్యను పరిష్కరిస్తానని షాజహాన్ ఆదేశించడం కాదు, విన్నవించుకున్నా, మొరపెట్టుకున్నా వినకుండా సైన్యాన్ని తీసుకొని

బయలుదేరాడు. ఆ తరువాత కూడా పట్టుబడేంత వరకు తన ఈ ప్రయత్నాల నుండి అతను వైదొలగలేదు.

దారాను సమర్థించే, వ్యతిరేకించే చరిత్రకారులందరి ఏకాభిప్రాయమేమిటంటే అతను మొగలు సింహాసనానికి ఎంతమాత్రం అర్హమైన వ్యక్తి కాదు. దూరదృష్టి రాహిత్యం, గర్వం, పొగరుబోతుతనం, అహంకారం, చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి మనిషిని, చివరికి దర్బారు నాయకుల్ని, ప్రధాన మంత్రిని సైతం దుర్భాషలాడడం – ఇలాంటి గుణగణాలు గల వ్యక్తి ఎట్టి పరిస్థితిలోనూ సువిశాల మొగలు సామ్రాజ్య పగ్గాలు చేపట్టడానికి అర్హుడు కానేరడని చరిత్రకారులందరూ ఏకీభవించారు. సోదరులకు వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభించింది, సైన్యాలు పంపింది కూడా అతనే అనేది కూడా సర్వాంగీకృతమే. సరే, యుద్ధాలు జరిగాయి, చివరికి అతను పట్టుబడి బందీఅయ్యాడు. ఎంత చెడ్డవాడైనా అతను తన సోదరుడు కదా! అతన్ని చంపకుండా, కారాగారంలో పడేసి, ఏదో ఒక మూలకు పడ ఉండనిస్తే సరిపోయేది కదా! అలాచేస్తే సోదరుని హంతకుడనే నింద ఔరంగజేబ్‌పై రాకపోయేది కదా! అని కొందరు వాదించవచ్చు. ఇదికాస్త హేతుబద్ధంగా కూడా అనిపించ వచ్చు. కాని మొగలు వంశంలోనే కాదు, ఏషియన్ రాజ్యాలన్నింటిలో కూడా సింహాసనాన్ని కాంక్షించే లేక హక్కుదారులైన రాజవంశీయులు బంధింపబడి, చెరసాలల్లో ఉండి లేక గృహ నిర్బంధంలో ఉండి కూడా సింహాసనపు కోరిక లేక ఆశనుండి వైదొలగరు. వారితో పాటుగా వారి అభిమానులు, అనుయాయుల ఒక సమూహముంటుంది. ఆశల చివరి పురి పూర్తిగా తెగి పోయేంతవరకు కూడా వారు నిశ్చింతగా కూర్చుండరు. దారాను బంధించి, డిల్లీ వీధుల గుండా తీసుకపోయే టప్పుడు నగర మంతటిలో ఒక కల్లోలం, సంక్షోభం బయలుదేరింది. స్త్రీ పురుషులందరూ హాహాకారాలు చేయసాగారు. ఇంటిపై అంతస్తుల నుండి ప్రభుత్వ మనుషులపై ఇటికెలు, రాళ్ళు రువ్వసాగారు. దారాను బంధించి అప్పగించిన మలిక్ జీవన్‌పై తిట్లు శాపనార్థాల జల్లులూ పడసాగాయి. బాహ్యంగా చూచేవారికి, ఇది దారా లోకప్రియత్వంగా, పాపులారిటీగా కనబడుతుంది. ఈ సన్నివేశం అప్పటి అన్ని చరిత్రగ్రంథాల్లో వివరించబడింది. దీన్నే ప్రజాద రణగా భావించి, అసలు కిరీట సింహాసనాలకు అర్హుడు దారాయే అంటూ తీర్పు ఇచ్చేస్తారు. కాని వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. ఇదంతా ఒక దుష్టుడు, కలహకారి ఆడిన నాటకమని ఆ తరువాత బయటపడింది. ఖాఫీఖాన్ ఈ విషయంగా ఇలా వ్రాశాడు :

"మరుసటి రోజు నగరంలో సంభవించిన ఈ సంక్షోభానికి, ఈ అల్లకల్లోలానికి కారులెవ్వరో, విచారణ చేయవలసిందిగా నగర కమీషనర్‌ను ఆదేశించినప్పుడు, హైబత్ ఖాన్ అనే వ్యక్తి నగరంలో జరిగిన ఈ అల్లర్లకు, కల్లోలానికి బాధ్యుడనే విషయం బయల్పడింది. ధార్మికవేత్తల తీర్పుననుసరించి అతనికి మరణశిక్ష విధించబడింది. (*ముంతఖబతుల్ లుబాబ్ – ఖాఫీఖాన్ – వాల్యూం – 2, భా.3, పేజి 94)*

బహుశ ఈ సన్నివేశాన్ని చూసిన ప్రజలకు కూడా బాధ కలిగి ఉండొచ్చు. కాని ఇది లోకప్రియత్వానికి ప్రతీక కాజాలదు. దారా షికూహ్ వైభవోన్నతులు కలిగిన యువరాజు. వీధుల్లో అతని స్వారీ వెళ్ళేటప్పుడు అత్యంత ఠీవి, దర్పం, మందీ మార్బలంతో, వందిమాగధులతో, మిత్ర శ్రేయోభిలాషుల సమూహంలో మహా వైభవంగా, డబ్బులు వెదజల్లుతూ వెళ్ళేవాడు. అటువంటిది దీనావస్థలో, నిస్సహాయంగా, బేడీలు తగిలించుకొని, ఒక ఖైదీగా పురవీధుల గుండా వెళుతుంటే చూసేవారి కెవరికైనా హృదయం ద్రవించకుండా ఉండజాలదు. కన్నీరు కార్చకుండా ఉండలేరు. అదో హృదయాలను కదిలించివేసే సన్నివేశం. ఆ సమయంలో ఇతను సింహాసనానికి, రాజ్యానికి అర్హుడా? కాదా? అతను చేసిన పనులు మంచివా? చెడ్డవా? ఇదంతా ఎవరు ఆలోచిస్తారని? అలాంటి సన్నివేశాల్లో శత్రువు కోసమైనా కన్నీళ్ళు రాలకుండా ఉండజాలవు. ఇక దారా షికూహ్ అయితే చక్రవర్తి షాజహాన్ అనుంగుపుత్రుడు, యువరాజు. అతని పట్ల అంతమాత్రం సానుభూతి చూపడం అసహజమేమీ కాదు.

దారా షికూహ్ బ్రతికి ఉన్నన్ని రోజులు, చెరసాలలో ఉన్నాసరే, కుట్రలు కుతంత్రాలు కొనసాగేవే. ఈ కుట్రలు, కుతంత్రాలు ఎలా సాగేవో, గడిచిన అధ్యాయాల్లో చదువుతూనే వచ్చారు. ఫలితంగా దేశానికి శాంతిభద్రతలు కరువైపోయేవి. యుద్ధాలూ, రక్తపాతాలూ జరుగుతునే ఉండేవి. అందుకని ఔరంగజేబ్ పితామహుడు షాజహాన్ ఏం చేశాడో, ఔరంగజేబూ అదే చేయకుండా ఉండలేకపోయాడు. ఈ ఆనవాయితీ అతనికి తన తండ్రి, తాతల నుండి వారసత్వంలో లభించింది. అతని తండ్రి షాజహాన్ తన సోదరులు (దావర్‌బక్ష్ మరియు షహ్రియార్‌ను) మరియు సోదర కుమారులు (హోషింగ్ వగైరాలను) ఎలా చంపించాడో, ఔరంగజేబ్ కూడా దారాను అలాగే చంపించాడు. మొగలు వంశంలో ఇదో క్రూరమైన ఆచారంగా ఉంటూ వచ్చింది. హుమాయూన్, కామ్రాన్‌ను అంధునిగా చేసి మక్కా పంపనంతవరకు నిశ్చింతగా రాజ్యమేలలేక పోయాడు. ఈ కామ్రాన్ కుమారుణ్ణే ఉజ్బెక్‌లతో జరిగిన యుద్ధంలో అక్బర్ సంజ్ఞతో చంపివేయడం జరిగింది. జహాంగీర్ తన కుమారుడు “ఖుస్రో”ను తిరుగబడ్డాడనే నేరంపై అంధునిగా చేసేశాడు. అందుకని ఔరంగజేబ్ దారా షికూహ్‌ను చంపించడం మొగలు వంశ ఆచారాల ప్రకారం అనూహ్యమూ కాదు, అనుచితమూ కాదు. ఇది తరతరాలుగా జరుగుతూ వస్తున్న ఆచారమే.

ఇక ధార్మిక గురువుల సభను ఏర్పాటు చేసి, వారి ద్వారా దారా హత్యకు ఔరంగజేబ్ ఆమోదం పొందాడని యూరోపియన్ చరిత్రకారులు రాసింది కేవలం అభూత కల్పన మాత్రమే. దారా విషయంలో ఆలోచించడానికి ప్రభుత్వపరంగా ఒక సమావేశం ఏర్పాటు చేయబడింది. అందులో ప్రభుత్వ ఉన్నతాధికారులూ ఉన్నారు, సైనిక కమాండర్లూ ఉన్నారు, ధార్మికవేత్తలు, పురప్రముఖులు అందరూ ఉన్నారు. దేశ శాంతి భద్రతల దృష్ట్యా, దారాను వధించడమే శ్రేయస్కర

మని వీరిలోని అత్యధికులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వారి అభిప్రాయాల్ని అనుసరించే ఔరంగజేబ్ దారాను వధించడానికి ఆదేశాలు జారీ చేశాడు.

దారా గతించేటప్పుడు క్రైస్తవ విశ్వాసాల్ని అంటిపెట్టుకొని ఉన్నాడని, ఔరంగజేబ్ దారా శవంతో సముచితంగా ప్రవర్తించలేదని యూరోపియన్ చరిత్రకారులు వ్రాసిందంతా ఆధారం లేని అభూత కల్పనలు మాత్రమే. దారా శవాన్ని ఢిల్లీలోని హుమాయూన్ సమాధి వద్ద ఖననం చేయడం జరిగిందని ఖాఫిఖాన్ వ్రాశాడు.

## సులేమాన్ షికూహ్ వ్యవహారం :

ఈ అధ్యాయాన్ని ముగించే ముందు సులేమాన్ షికూహ్ గురించి కూడా కాస్త వివరించడం సమంజసమనుకుంటున్నాము. సమూగడ్ యుద్ధానికి ముందు షుజాను ఎదుర్కోవడానికి వెళ్ళిన సులేమాన్ షికూహ్‌ను షుజాతో సంధిచేసుకొని మరలాల్సిందిగా దారా ఆదేశించాడు. అతను తిరిగి వస్తూ మార్గమధ్యంలో ఉండగానే ఔరంగజేబ్ విజయం మరియు దారా పరాజయపు వార్త అందింది. ఇది విన్నవెంటనే అతని వెంట ఉన్న జైసింగ్ ఇంకా ఇతర సైనికాధికారులు అతన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. అతను అక్కడక్కడ తలదాచుకుంటూ చివరికి గడ్‌వాల్ ప్రాంతంలో శ్రీనగర్ రాజు వద్ద ఆశ్రయం పొందాడు. ఆ రాజు వీరుడైన ఒక రాజపుత్రుని లాగా అతనికి ఆతిథ్యమివ్వడమే కాకుండా, ఔరంగజేబ్ మనుషులకు అతన్ని అప్పగించడానికి నిరాకరించాడు. అంతేకాదు, ఈ రాకుమారునికి తన మంత్రి విషం ఇచ్చి చంపే ప్రయత్నం చేస్తున్నాడని తెలియగానే, కోపోద్రేకాలతో ఆ మంత్రినే వధించేశాడు. కాని ఆ రాజు స్వంత కుమారుడు నైతికాలకన్నా, భౌతిక లాభాలకే ప్రాధాన్యతనిచ్చాడు. అందుకని మోసంతో నిరాశ్రయుడైన ఈ రాకుమారుని బంధించి, ఔరంగజేబ్ సమక్షంలో సమర్పించాడు. భయపడి పోతున్న ఆ రాకుమారున్ని ఔరంగజేబ్ శాంతపరుస్తూ అతను భయపడవలసిన అవసరం లేదని శారీరకంగా అతనికే హాని కలిగించడం జరగదని, ఇతర రాకుమారుల్లాగే అతన్ని కూడా గ్వాలియర్ కోటలో ఉంచడం జరుగుతుందని తెలిపాడు. ఆ తరువాత అతను గ్వాలియర్‌కు పంపబడ్డాడు. అతనక్కడ 1662 వరకు జీవించి ఆ తరువాత కాలధర్మం చెందాడు.

తన ఇతర సోదరుల్లాగా ఔరంగజేబ్ ప్రారంభంలోనే తనను రాజుగా ప్రకటించుకోలేదు. దారా షికూహ్ కబంధ హస్తాల్లో నుండి షాజహాన్‌ను విడిపించి, అతన్నే సింహాసనంపై ఉంచాలని ఔరంగజేబ్ మొదట్లో అభిప్రాయపడ్డాడు. కాని ఆగ్రా చేరిన తరువాత, షాజహాన్‌ను తన ప్రాణశత్రువుగా కనుగొన్న ఔరంగజేబ్, తన పాత అభిప్రాయంపై పునఃఆలోచన ప్రారంభించాడు. అయితే షాజహాన్ పదే పదే తనకు వ్యతిరేకంగా జరుపుతున్న రహస్య మరియు బహిరంగ కార్యకలాపాల్ని చూస్తున్న ఔరంగజేబ్, ఇక షాజహాన్‌ను విశ్వసించలేకపోయాడు. అందుకని ఆగ్రా నుండి డిల్లీ చేరిన తరువాత తనకు అవసరమయ్యే హక్కు అధికారాలు, శక్తి సామర్థ్యాలు

కేవలం ఒక రాకుమారునిగా ఉంటూ పొందడం సంభవం కాదని భావించిన ఔరంగజేబ్ 1658 జులై 21న డిల్లీ లోని షాలమార్ బాగ్‌లో ముక్తసరిగా తన పట్టాభిషేక లాంఛనాలను పూర్తి చేసుకున్నాడు. ఆ తరువాతనే అతను పంజాబ్ వైపునకు బయలుదేరాడు. ప్రారంభంలో అతను ఈపాటి ధైర్యం కూడా చేయలేకపోయాడు, కాని రాకుమారునిగా తాను తలచుకున్న కార్యాలు సాధించడం అసంభవమని భావించి, తన రాజరికాన్ని ప్రకటించుకున్నాడు. పరిస్థితులు చక్కబడిన తరువాత తిరిగి సింహాసనాన్ని షాజహాన్‌కు అప్పగిస్తానని అతను ఆలోచించిపెట్టు కున్నాడు. కాని షాజహాన్ కుతంత్రాలు, దారాపై వీడని ప్రేమ, తనకు వ్యతిరేకంగా షుజాను పురిగొల్పడం ఇవన్నీ చూసిన తరువాత, షాజహాన్ పట్ల పూర్తిగా నిరాశచెంది పూర్తి ఒక్క సంవత్సరం గడిచిన తరువాత 1659 జూన్ 5వ తేదీన పూర్తి లాంఛనాలతో, అత్యంత వైభవో పేతంగా, ఠీవి దర్పాలు, రాజరికపు పటాటోపాలతో డిల్లీలో పట్టాభిషేకం చేసుకొని సింహాసనాన్ని అధిష్టించాడు. ఇంకా "అబుల్ ముజప్ఫర్ మొహియుద్దీన్ ఔరంగజేబ్ ఆలంగీర్ బాదుషా గాజి" అనే పేరు బిరుదులతో కిరీటాన్ని ధరించాడు.

చివరలో మనం తెలుసుకోవలసిందేమిటంటే ఔరంగజేబ్ కూడా ఒక మనిషే. మానవాతీతమైన అనుభవాలు, అనుభూతులు, త్యాగాలు అతని నుండి ఆశించలేము. మనం చూడవలసింది కేవలం ఒక్కటే. మొగలు రాకుమారుల జీవిత చరిత్ర అనే ఆల్బంలో అతని రూపం హుమాయూన్ కన్నా అందంగా లేకపోయినప్పటికీ, అక్బర్ జహాంగీర్ మరియు షాజహాన్‌ల కన్నా వికృతంగా మాత్రం లేదు. (ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్ – అల్లామా షిబ్లి నొమాని. పే.75-103) (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్-సయ్యద్ నజీబ్ అష్రఫ్, పేజి 398-487).

# 10. షాజహాన్ నిర్బంధం ఔరంగజేబ్ ప్రవర్తన

గడిచిన అధ్యాయాల్లో వారసత్వం కోసం సోదరుల మధ్య జరిగిన యుద్ధాల సమయంలో షాజహాన్ ప్రవర్తన ఎలాగుండేది, దారాను పట్టాభిషిక్తుణ్ణి చేయాలని, దారా ప్రేమలో అతనెంతగా పిచ్చివాడైపోయాడో, దీనికోసం అతను ఔరంగజేబ్‌ను మోసంతో హతమార్చడానికి కూడా వెనుకాడలేదని తెలుసుకున్నాం. దారా పక్షం నుండి అతనెట్టి పరిస్థితుల్లోనూ వైదొలగడని, అతన్ని స్వతంత్రంగా ఉండనిస్తే తన ఉనికికే ప్రమాదాన్ని తెచ్చిపెడతాడని గట్టి నమ్మకం ఏర్పడి, సాక్ష్యాధారాలతో ఈ విషయం రుజువైపోయినప్పుడు, ఔరంగజేబ్ ఆగ్రా కోటను ముట్టడించాడు. ఒకటి రెండు రోజుల తరువాత గత్యంతరం లేని పరిస్థితుల్లో 1658 జూన్ 8న షాజహాన్ కోట ద్వారాల్ని తెరిపించాడు. కోటలో నున్న కొద్దిపాటి సైన్యం ఔరంగజేబ్‌కు విధేయత చూపింది. ఈ విధంగా ఆగ్రా కోటలో ఒక్కబొట్టు రక్తం చిందకుండా ఔరంగజేబ్ సైన్యాలు కోటలో ప్రవేశించాయి. ఔరంగజేబ్ కుమారుడు ముహమ్మద్ సుల్తాన్ కోటలోకి వెళ్ళి మొట్ట మొదటగా షాజహాన్‌ను కలుసుకున్నాడు. ఆ తరువాత ముఖ్య స్థావరాల్ని, ప్రభుత్వ కోశాగారాల్ని, ఆయుధాగారాలు మొదలుగాగల వాటిని స్వాధీన పరచుకున్నాడు. "ఈ వారసత్వ యుద్ధాలు సమసిపోయేంత వరకు, ఈ ఉపద్రవం ఒక కొలిక్కి రానంతవరకు దయచేసి కోటనుండి బయటికి రాకూడద"ని షాజహాన్‌కు విన్నవించుకోవడం జరిగింది. కోట నుండి బయటికి రాకుండ మాత్రమే ఆంక్ష విధించడం జరిగింది తప్ప, షాజహాన్ ఇతర కార్యకలాపాల్లో ఎలాంటి జోక్యంగాని, లేక అతని సేవకుల్ని ఉద్యోగం నుండి తొలగించడం గాని జరుగలేదు. కాని ఈ కోట నిర్బంధంలో ఉండి కూడా షాజహాన్ నిశ్చింతగా కూర్చుండలేదు. ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా షుజా, మురాద్‌లను, సూబేదార్లను ఇతర సైనికాధికారులకు లేఖలు వ్రాస్తూ దారాకు సహకారాలు అందించాల్సిందిగా ఆదేశాలు పంపసాగాడు. ఈ లేఖల కారణంగా పరిస్థితి విషమిస్తుందని తెలుసుకున్న ఔరంగజేబ్, అతని లేఖలపై ఆంక్షలు విధించాడు. ఈ లేఖల్ని తెచ్చి, తీసుకుపోతున్న ఉద్యోగుల్ని కఠినంగా హెచ్చరించడం జరిగింది. ఉద్యోగం నుండి తొలగించబడతారని బెదిరించడం జరిగింది. ఈ విధంగా లేఖల రూపంలో వ్యాపిస్తున్న ఈ ఉపద్రవాన్ని అరికట్టడం జరిగింది.

బాహ్యంగా కూడా షాజహాన్‌ను ప్రభువుల వారు, ఏలికవారు, చక్రవర్తులు, పరిపాలకులు, దైవస్వరూపులు, గౌరవనీయులు, పితామహులు లాంటి ఉన్నతమైన పదాలతోనే సంబోధించడం లేక పరిచయం చేయడమే జరిగింది తప్ప, ఒక నిర్బంధితునిగా, ఒక ఖైదీగా, నిస్సహాయునిగా ఎన్నడూ చూడబడలేదు. ఔరంగజేబ్ తండ్రికి రాసిన లేఖల ద్వారా గాని, ఇతరులకు రాసిన లేఖల ద్వారా గాని, ఈ విషయం అవలీలగా అర్థమైపోతుంది. తాను

చేపట్టిన ఈ కార్యక్రమాలన్నీ, ఈ యుద్ధాలన్నీ దారా షికూహ్‌కు వ్యతిరేకంగా మాత్రమేనని, అతన్ని కట్టడి చేయడానికి మాత్రమేనని. అంతేగాని, తన తండ్రికి చక్రవర్తికి వ్యతిరేకంగా చేపట్టిన చర్యలు ఎంతమాత్రం కావని, ఔరంగజేబ్ పదే పదే చెప్పుకొచ్చాడు. ఒక ప్రఖ్యాత సూఫీ గురువు ఖాజా అబ్దుల్ గఫ్ఫార్‌కు లేఖ వ్రాస్తూ ఇంతవరకు జరుగుతూ వచ్చిన సంఘటనల్ని వివరిస్తాడు. అయితే షాజహాన్ ఆదరాభిమానాల్ని, గౌరవోన్నతుల్ని కాపాడడానికి షాజహాన్‌తో పోరాడి తాను ఆగ్రా కోటను వశపరచుకున్నానని వ్రాయకుండా ఏం వ్రాశాడో తెలుసా? "ఏలికవారు ఖలీఫా అంతటి గౌరవనీయులు సులైమాన్ (అలైహిస్సలాం) అంతటి అధికార అంతస్తులు గల ప్రభువులవారు అత్యంత దయ కనికరాలతో ప్రేమ, వాత్సల్యాలతో అక్బరాబాద్ (ఆగ్రా) కోటను నా స్వాధీనంలో ఉండేందుకు ప్రసాదించారు. (ఆదాబె ఆలంగీర్)

ఇదేవిధంగా గోల్కొండ పరిపాలకుడు ఖుత్బుల్ ముల్క్‌కు అక్బరాబాద్ (ఆగ్రా) కోట స్వాధీనంలోకి వచ్చిన వైనాన్ని ఇలా తెలుపుతాడు : "ప్రచండులైన పరిపాలకులు మా ప్రభువులు ఖలీఫా అంతటి గౌరవోన్నతులు సులైమాన్ (అ) అంతటి అంతస్తు, అధికారాలు కలిగినట్టి దైవ నీడ లాంటి నా ఏలికవారు, అత్యంత దయ, కనికరాల కారణంగాను, సేవలకు ప్రతిఫలం గాను అక్బరాబాద్ (ఆగ్రా) కోట సంరక్షణ, పరిపాలన, నియంత్రణ మరియు ప్రభుత్వాధికారాన్ని నడుపుటకుగాను ఈ సేవకునికి ప్రసాదించారు. (ఆదాబె ఆలంగీర్)

బీజాపూర్ పాలకుడు అలీ ఆదిల్ షా మొదలగు వారికి కూడా దాదాపుగా ఇదే తరహాలో లేఖ వ్రాశాడు. (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్-స.న. అష్రఫ్, పే.450, 451).

షాజహాన్ సంపూర్ణ స్వాతంత్ర్యంలో, కేవలం తనకు నష్టం కలిగించనంత వరకు మాత్రమే ఔరంగజేబ్ ఆంక్ష విధించాడు, అంతే, అతని దైనందిన కార్యక్రమంలోగాని, అతని స్వంత వస్తువుల్ని, ధనవస్త్రాల్ని, వజ్రవైఢూర్యాల్ని ముట్టుకోవడంగాని జరుగలేదు. అంతేకాదు షాజహాన్ ఎప్పుడు ఏ వస్తువు కోరినా వెంటనే అతని ముందు హాజరు పరచాలని కూడా ఔరంగజేబ్ తన మనుషులకు ఆదేశాలు జారీ చేశాడు. షాజహాన్ ఇతరులకు ఇవ్వాల్సివున్న వేలాది రూపాయల్ని కూడా తీర్చాల్సిందిగా ఆజ్ఞాపించాడు. షాజహాన్ ఎవరెవరికి ఏ ఏ పింఛనులు, భత్యాలు ఇస్తుండేవాడో అవన్నీ యథాతథంగా ఇవ్వబడాలని ఆదేశించాడు. ఈ కారణంగానే షాజహాన్ కాలంలో అతని ప్రియ పుత్రిక జహాంఆరా బేగం మహలుపై ఏ అధికార దర్పాలు కలిగి ఉండేదో, చివరి వరకు ఆమె అలాగే తన శాసనాన్ని నడిపించుకున్నది. అవే గౌరవమర్యాదలు పొందింది. ఇవేకాకుండా షాజహాన్ తన కాలంలో ఏ ఆచారాల్ని, సాంప్రదాయాల్ని జారీచేశాడో అవన్నీ అలాగే కొనసాగాలని కూడా ఆదేశించాడు.

అందులో ముంతాజ్ మహల్ సంవత్సరీకం కూడా ఒకటి. షాజహాన్ ముఖ్య సేవకుడు (ప్రైవేటు సెక్రటరీ) ఫాజిల్ ఖాన్‌కు ఒక లేఖలో ఇలా రాశాడు.

"...... ఆ తరువాత మహలులో ఉన్న సేవకులందరి జీతాల్ని ఇంతకు క్రితం నిర్ణయమై వున్న పద్ధతిలోనే తీర్చేయాలి. ఆపకూడదు. ఇదేకాకుండా వ్యాపారులకు ఇంతవరకు ముట్టని ఆహార పదార్థాల బాపతు పద్దులోని 81 వేల రూపాయలు కూడా వెంటనే వారికి ముట్టజెప్పాలి. .... ...... మారు మాట్లాడకుండా ఖజానా నుండి జీతభత్యాలు చెల్లించేయాలి. (అలా చేయకపోతే) వారు వెళ్ళి ప్రభువుల వారికి మొరపెట్టుకుంటారు. తద్వారా ప్రభువుల వారి మనసుకు బాధ కలిగించినట్లవుతుంది ......" (ఆదాబె ఆలంగీరి) (ముఖద్దమ రుఖ్ఆత్ సయ్యద్ నజీబ్ అష్రఫ్, పేజి 452)

ఇంకొక లేఖలో ఇలా వ్రాశాడు :

"..... పవిత్ర సమాధి ఖర్చుల గురించిన వివరాలు తెలిసివచ్చాయి. ఆ పద్దులో ఖర్చు అయ్యే మొత్తం రొఖ్ఖాన్ని నిర్ణీతమైనదానిగా భావించాలని చక్రవర్తి తరఫున ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంలో అవసరం అయిన ఏర్పాట్లు చేయాలి. ఒకవేళ రాజ్య ప్రముఖులు, నాయకులు మొదలగువారు సౌకర్యంగా వచ్చే అవకాశముంటే వారు తప్పకుండా ఇందులో పాల్గొనాలని (తెలుపడానికి) అత్యంతగా ప్రయత్నించండి. ...." (ఆదాబె ఆలంగీరి) (ముఖద్దమ రుఖ్ఆత్, సయ్యద్ నజీబ్ అష్రఫ్, పేజి 452)

ఇంతచేసినా "షాజహాన్ చరిత్ర" రచయిత డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా షాజహాన్ పట్ల ఔరంగజేబ్ ప్రవర్తనను పేర్కొంటూ ఇలా నిందించాడు.

"ఔరంగజేబ్ తన తండ్రి పట్ల చూపిన వ్యవహారం నైతిక రీత్యా అత్యంత గర్హనీయమైనది. మొదటి నుండి చివరి వరకు కూడా అతని ప్రవర్తన ఒక గాఢమైన ద్వేషం లేక ప్రతీకారానికి పర్యవసానమే. బంధింపబడి ఉన్న రాజు ప్రమాదాలకు పుట్ట అనడం వాస్తవమే అయినప్పటికీ, షాజహాన్‌కు శోభస్కరము, యోగ్యమూ అయిన అతి చిన్న అవసరాల నుండి ఔరంగజేబ్ అతన్ని వంచించడం సముచితమనిపించుకోదు, సింహాసనాన్ని ఆక్రమించుకున్న తరువాత ఔరంగజేబ్ ఒక తనయుని విధి బాధ్యతల్ని మర్చిపోయాడు. రాజ్య కోశాగారం చట్టపరంగా సమాజం ఆస్తి అనేది మాకూ తెలుసు. అయితే ప్రజల సంక్షేమం కోసం ఔరంగజేబ్ చేసిందేమిటి? జమచేయబడి ఉన్న ధనాన్నంతా వ్యర్థమైన దక్కన్ యుద్ధాల్లో వెచ్చించాడు. అతనికి ధగ ధగలాడే రాజవస్త్రాలపై, వజ్రవైఢూర్యాలపై మోజు ఉండకపోవచ్చు. కాని వాటిని చూసి తృప్తిపొందే తండ్రిని వాటి నుండి ఎందుకు వంచించాడు? కారాగారపు కఠినాలను సాధ్యమైనంతగా తగ్గించడం అతని విధి, బాధ్యత కాదా? ఔరంగజేబ్ ప్రవర్తనలోని ధార్మిక ఔచిత్యం ఏమైవున్నప్పటికీ, మానవ మనస్తత్వాల అధ్యయనంతోనే ప్రత్యేక సంబంధమున్న చరిత్ర మాత్రం అతను తన తండ్రికోసం క్షమార్హం కాని క్రూరుడు (దౌర్జన్యపరుడు) అనే తీర్పునిస్తుంది." (షాజహాన్ చరిత్ర - డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా (అనువాదం) పేజి- 395, 396).

డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా గారు ఈ పుస్తకాన్ని 1932లో తన పి.హెచ్‌డి., డిగ్రీ కోసం సమర్పించారు. షాజహాన్ మరియు ఔరంగజేబ్ సమకాలీన చరిత్ర గ్రంథాలు ఆయన దృష్టికి రాలేదంటే విశ్వసించడానికి మనసొప్పడం లేదు. సరే! ఆంగ్లేయ చరిత్రకారులందరూ దైవవాణిగా భావించే బర్నియేర్ యాత్రావృత్తాంతంపై కూడా ఆయన దృష్టి సారించలేదంటే విచిత్రంగానూ, ఆశ్చర్యంగానూ ఉంది. ఔరంగజేబ్ సమకాలీన చరిత్రల్ని చూడకపోయినా, కనీసం డాక్టర్ బర్నియేర్ యాత్రా వృత్తాంతాన్ని చదివినా, ఆయనగారు బహుశ పై విధంగా వ్రాసి ఉండకపోయేవారేమో!

కోట నిర్బంధంలో ఉన్నప్పుడు షాజహాన్ పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన ఎలా ఉండేదో సమకాలీన చరిత్రల నుండి పైన తెలుపుతూ వచ్చాము.

ఇక డాక్టర్ బర్నియేర్ ఈ విషయంలో ఏమంటున్నారో తెలుసుకుందాం :

"షాజహాన్‌ను ఆగ్రా కోటలో అత్యంత జాగ్రత్తగా నిర్బంధంలో ఉంచినప్పటికీ, ఔరంగజేబ్ అతనితో అత్యంత గౌరవ మర్యాదలతో, ఎంతో ఉపకారంతో, వినయ విధేయత లతో వ్యవహరించేవాడు. అంతకు క్రితం అతను ఉంటుండే రాజప్రసాదాల్లో ఉండడానికి కూడా అతనికి స్వేచ్ఛ ఇవ్వబడింది. అతని ప్రియపుత్రిక అయిన 'బేగం సాహబ' కూడా అతని దగ్గరికి పంపబడింది. అంతఃపుర స్త్రీలందరూ అతనితో ఉన్నారు. వంటవాళ్ళు, నృత్యగానాదులు చేసేవాళ్ళు, నర్తకీలు అందరూ అతనితో ఉన్నారు. అంతేకాకుండా అతను ఏది కోరినా వెంటనే సమర్పించబడేది. ఇక ఎప్పుడైతే ఈ ముదుసలి చక్రవర్తి నృత్యగానాలకు మొహంమొత్తి, వాటిపట్ల విసుగుచెంది, భక్తునిగా, దైవ నిష్ఠాపరాయణునిగా మారాడో, ఖుర్‌ఆన్‌ను అత్యంత మధురంగా పారాయణం చేసే ఖారీలు, ధార్మికవేత్తలు అతని వద్దకు పంపబడుతుండేవారు. ఇక ఎప్పుడైనా వినోద వేడుకల కోసం మనసు కోరినప్పుడు, వాటికోసమే మచ్చిక చేయబడ్డ రాచగుఱ్ఱాలు, షికారుడేగలు, ఇంకా ఇతర పశుపక్షాదుల్ని తెప్పించుకోవడానికి, జింకలు, పొట్టేళ్ళు పోరాడే తమాషా చూడడానికి కూడా అతనికి సంపూర్ణ స్వాతంత్ర్యముండేది.

మొత్తానికి ఈ నిర్బంధ సమయంలో ఔరంగజేబ్ తన తండ్రి పట్ల అత్యంత వినయ విధేయతలు, గౌరవమర్యాదలు మరియు ప్రేమాభిమానాలతో మెలుగుతుండేవాడు. సాధ్యమైనంత వరకు అతన్ని సంతోషపెట్టడానికి, అతన్ని మెప్పించుకోవడానికి, అతని హృదయంలో ఏర్పడిన క్రోధావేశాల్ని కడగటానికే ప్రయత్నించేవాడు. తరచుగా విలువైన కానుకల్ని సమర్పించేవాడు, రాజ్యవ్యవహారాల్లో అతన్ని ఓ గురువుగా, మార్గదర్శకునిగా మన్నిస్తూ తరచుగా అతనితో సలహాలు తీసుకుంటుండేవాడు. షాజహాన్ పేరన అతను వ్రాసిన ఉత్తరాల్లో అసామాన్యమైన వినయ వినమ్రతలు, గౌరవమర్యాదలు స్పష్టంగా కనబడతాయి. ఈ విధంగా క్రమక్రమంగా షాజహాన్ కోపం చల్లారసాగింది. చివరికి ఔరంగజేబ్ పట్ల అతని హృదయంలో నున్న కోపద్వేషాలు

తొలగిపోయాయి. అతను కూడా నిర్మల హృదయంతో రాజ్య వ్యవహారాలకు సంబంధించి ఔరంగజేబ్‌కు సముచితమైన, సమంజసమైన సలహాలివ్వసాగాడు. ఔరంగజేబ్ పట్ల అతనికి సంపూర్ణ నమ్మకం ఏర్పడిన కారణంగానే, అంతవరకు తన రక్షణలో ఉంచుకున్న దారా షికూహ్ కుమార్తెను ఔరంగజేబ్ సంరక్షణలోకి పంపించాడు. అత్యంత అమూల్యమైన వజ్రవైఢూర్యాల్ని, ఒకసారి ఔరంగజేబ్ వాటిని తనకివ్వమని కోరినప్పుడు, "వాటిని దంచిపొడిగానైనా చేస్తానుగాని, నీకు మాత్రం ఇవ్వనని మొండికేసినవాడు, తనే స్వయంగా వాటిని ఔరంగజేబ్‌కు పంపించాడు. అంతేకాదు, తిరుగబడిన తన ఈ తనయుని తప్పులన్నిటినీ క్షమించడమే కాకుండా, అతని శ్రేయోసాఫల్యాల కోసం దీవించాడు కూడా." (Travels in the Moghal Empire, Dr. Burnier, page 166)

(పితామహుడు తన తప్పుల్ని మన్నించాడని తెలిసిన తరువాత సంతోష ఉద్వేగాలతో ఔరంగజేబ్ తన తండ్రికి ఇలా లేఖ వ్రాశాడు)

"భక్తి తత్పరతలతో కూడిన జపములు సమర్పించిన తరువాత విన్నవించుకునేది ఏమనగా నిష్కల్మషుడైన ఈ దాసుని విజ్ఞాపనకు ప్రత్యుత్తరంగా కృపాన్వితమైన రాజశాసనం అత్యంత శుభఘడియల్లో ముట్టింది. తప్పులు, పొరపాట్లు మన్నింపబడ్డాయనే శుభవార్తతో సంతోష ఉల్లాసాలు కలిగాయి. ఇకిప్పుడు తమరి దయా కటాక్షాలను అభ్యర్థిస్తున్నాను. న్యాయం మరియు గౌరవాల రీత్యా ప్రభువుల వారు ప్రతీకారంపై క్షమకు ఆధిక్యత నిచ్చారు. మరియు నాలాటి ఆపాదమస్తకం పాపాలతో నిండిన కృతఘ్నుణ్ణి చింతా విచారములు, దుఃఖబాధల సుడిగుండం నుండి కాపాడారు.

మహాగొప్పవాడైన దేవుని కరుణాకటాక్షాల ఆధారంగా, ఇక నుండి తమ ఈ దాసునితో ఇలాంటి ఏ విషయమూ జరుగదని విశ్వసిస్తున్నాను. సర్వాంతర్యామి అయిన ఆ పరాత్పరుణ్ణి అసత్యానికి సాక్షిగా నిలుపడం ఇస్లాం అనుయాయుల దృష్టిలో దైవతిరస్కారంగాను, మిగిలిన అన్ని ధర్మాల వారి దృష్టిలో నిరసించదగినదిగాను భావించబడుతుంది. ఈ దాసుడు ఎన్నడూ కూడా ప్రభువుల వారి అభీష్టాన్ని వ్యతిరేకించి ఉండలేదు, ఉండదు అనేది ఆ పరాత్పరుడు బాగా ఎరుగుతాడు.

కపటులు తమరిని నమ్మజూపేది పచ్చి అబద్ధం. ఈ దాసుడైతే ప్రభువుల వారి ప్రతినిధిగా ఈ బృహత్తర కార్యాన్ని నిర్వహిస్తున్నాడు. కాని ప్రాతినిధ్యాన్ని (బహిరంగంగా) ప్రకటించడం వల్ల దేశం, జాతి, పరిపాలనా యంత్రాంగం మరియు ప్రజలు సంతుష్టులయ్యే అవకాశం లేదు, అందుకని దేశ, జాతి, పరిస్థితుల అవసరాల దృష్టితో వివశుణ్నై – ఆత్మ వ్యతిరేకిస్తున్నప్పటికీ – కొన్ని రోజుల కోసం ఈ పద్ధతిని అవలంబించక తప్పలేదు.

దైవచిత్తమయితే, రాజ్యంలో సంపూర్ణ శాంతి భద్రతలు నెలకొల్పబడి, అలజడి, ఉప ద్రవాలు సమాప్తమైపోయిన తరువాత ప్రభువుల వారి అభీష్టాన్ని అనుసరించే సర్వ వ్యవహారాలు నడుపబడతాయి.

ప్రభువుల వారి ప్రసన్నత మరియు ఉత్తమ సేవనే తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్న ఈ దాసుడు, నశ్వరమైన ఈ ప్రాపంచిక వ్యవహారాల కోసం, ధనమానప్రాణాలు, సంతానం కన్నా మిన్న అయిన ప్రభువుల వారి సమయం సంతోషంగా, నిశ్చింతగా గడువకుంటే ఎలా సంతుష్ఠుడవ గలుగుతాడు? మరియు మహలులోని సేవకులు తమరి సేవాభాగ్యం నుండి ఎలా భ్రష్టులవ గలుగుతారు?

ఈ మధ్యలో 'షుజా' దుర్బుద్ధితో అలహాబాద్ చేరుకొని అక్కడ అలజడిని లేపడానికి ప్రయాసపడుతున్నాడు, జ్యేష్ఠ రాకుమారుని వైపు నుండి ఇప్పుడిప్పుడే కాస్త తీరిక లభించిన ఈ భక్తుడు కూడా దైవసహాయం మరియు దైవ సమర్థనను విశ్వసించి, ఈ నెల 17వ తేదీన అలహాబాద్ బయలుదేరుతున్నాడు. దైవం, దైవ ప్రవక్త (స) మరియు ప్రభువుల వారి అంతరంగిక ఆశీర్వాదాలతో త్వరలోనే ఈ వివాదంతో విముక్తి పొందగలడనే విశ్వాసముంది. దాని తరువాత ఏ విషయంలోనైనా సరే, దాసుడు తమరి అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడు.

పాలితుల (ప్రజల) సంరక్షణా బాధ్యతల్ని భరించే వ్యక్తికే దైవం ఎల్లప్పుడూ తన అమానతులను అప్పగిస్తాడనే విషయం ప్రభువుల వారికి స్పష్టంగా తెలుసు. తోడేలు గొర్లమంద సంరక్షణకు తగింది కాదనేది బుద్ధిమంతులకు ఎరుకే. అదేవిధంగా సామర్థ్యంలేని వ్యక్తి పరిపాలన లాటి ఘనమైన కార్యపు బాధ్యతల్ని నిర్వహించలేడు. దీనికి కారణం ఏమిటంటే పరిపాలన అనేది ప్రజా సంరక్షణ కోసమేగాని, ఇంద్రియలోలత్వం లేక భోగ పరాయణతల కోసం కాదు. మొత్తానికి ప్రభువుల వారి ముందు సిగ్గు, బిడియాలకు గురిఅయ్యే అవకాశం రాకుండా దైవం ఈ దాసుణ్ణి కాపాడుగాక!

"ప్రభువుల వారు ఈ దాసుని తప్పుల్ని, పొరపాట్లను మన్నించి, రాకుమారుడు "దారా షికూహ్"కు సంబంధించిన వజ్రాలను ప్రసాదించినందుకు నిర్మల హృదయంతో ఏలికవారికి వందనాలు సమర్పిస్తున్నాడు. మరియు ప్రభువుల వారు చూపిన ఈ కరుణాకటాక్షాలకు శతకోటి ధన్యవాదాలర్పిస్తున్నాడు." (ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫీఖాన్, వా-2, భా-3, పేజి 109-111, రుఖ్ఆత్ ఆలంగీర్ లేఖ నెం.3/126, స.న.అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 236-238) (షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖలు).

ఔరంగజేబ్ దక్కన్ నుండి బయలుదేరింది ఎప్పుడో తెలుసా? దారా షికూహ్, షాజహాన్ అస్వస్థత కారణంగా సర్వ అధికారాల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడని తెలిసిన తరువాత, తన సోదరులు షుజా బెంగాల్‌లో, మురాద్ గుజరాత్‌లో తమ తమ స్వాతంత్ర్యాల్ని ప్రకటించుకున్నారని తెలిసిన తరువాత, సోదరుల మధ్య అంతకు ముందే జరిగిన ఒడంబడిక ప్రకారం, డిల్లీకి బయలుదేరమని మురాద్ పదేపదే ఒత్తిడి చేసిన తరువాత ఔరంగజేబ్ బయలుదేరాడు. త్రోవలో తమను అడ్డగించిన జస్వంత్ సింగ్‌ను ఓడించాడు. షాజహాన్ పదే పదే వారిస్తున్నా వినకుండా, తానే స్వయంగా వెళ్ళి సమస్యను పరిష్కరిస్తానని షాజహాన్ ఎంత చెప్పినా వినకుండా, అతన్ని పోకుండా నిరోధించి, తనే సైన్య సమేతంగా సమూగడ్‌కు వచ్చిన దారా ఔరంగజేబ్ చేతిలో ఘోర పరాజయానికి పాలయ్యాడు. ఇంత జరిగినా, తన ఆజ్ఞల్ని బాహాటంగా ఉల్లంఘిస్తున్న

దారా సమర్థన నుండి షాజహాన్ వైదొలగలేదు. తనూ ఒక కుమారుడే అయిన ఔరంగజేబ్ పట్ల షాజహాన్‌కు రవ్వంత ప్రేమాభిమానాలు జనించలేదు. దారా సమర్థనలో అతను పిచ్చివాడై పోయాడు. న్యాయం, ధర్మం, నైతికతల్ని సైతం తుంగలో తొక్కి ఔరంగజేబ్‌ను, ఏ విధంగానైనా సరే అంతం చేయాలని పలు రకాల కుట్రలు పన్నాడు షాజహాన్. ప్రేమను ఒలకబోస్తూ కోట లోకి రప్పించి, మోసంతో అతన్ని చంపించాలని చూశాడు. కాని అతని ప్రయత్నం సఫలం కాకముందే జరిగిన కుట్రేమిటో ఔరంగజేబ్‌కు తెలిసిపోయింది. ఆ తరువాత దారాకు అన్ని రకాలుగా సహాయపడాలని తన సూబేదార్లకు, సైనికాధికారులకు రహస్యంగా లేఖలు పంపించాడు. ఇది కూడా సఫలం కానప్పుడు, అన్యోన్యంగా ఉంటున్న మురాద్ మరియు ఔరంగజేబుల్లో మిత్రభేదం సృష్టించడానికి ఔరంగజేబ్‌ను హతమార్చివస్తే, అతని తప్పుల్ని క్షమించడమే కాకుండా భారత చక్రవర్తి పట్టం కట్టబెడతానని మురాద్‌కు ఆశ గొలిపాడు. ఆ విధంగా మురాద్‌ను ఔరంగజేబ్‌కు శత్రువుగా మార్చి, అతని పతనానికి కారకుడయ్యాడు. దారాను వెంబడిస్తూ ఔరంగజేబ్ పంజాబ్ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు, ఇదే మంచి అదనని, వెంటనే వచ్చి రాజధానిని ఆక్రమించుకోమని షుజాకు లేఖలు వ్రాసి ప్రేరేపించాడు. ఫలితంగా షుజా సైన్యంతో బెంగాల్ నుండి రాజధాని వైపునకు ప్రయాణమయ్యాడు. ఈ వార్తకు కలవరపడిన ఔరంగజేబ్ పంజాబ్ నుండి తిరిగి ఆగ్రాకు మరలుతాడు. చివరికి ఖజ్వాలో యుద్ధం జరిగి ఔరంగజేబ్ చేతిలో షుజా పరాజితుడవుతాడు. గత్యంతరం లేక బర్మా వైపునకు పారిపోయి, అక్కడ అనామక చావు చస్తాడు. షాజహాన్ అంతటితోనే ఊరుకోలేదు. స్వయంగా ఔరంగజేబ్ కుమారుడు ముహమ్మద్ సుల్తాన్‌ను తండ్రికి వ్యతిరేకంగా తిరుగబడి, రాజ్యాన్ని హస్తగతం చేసుకొని షాజహాన్, షుజా, ముహమ్మద్ సుల్తాన్ ముగ్గురు కలిసి రాజ్యమేలుకోవచ్చని ప్రేరేపిస్తాడు. ఈ విధంగా ఔరంగజేబ్‌ను రకరకాలుగా నష్టపరచడానికి, ఓడించడానికి, సమాప్తం చేయడానికి అతను పన్నిన కుట్రలన్నీ వీగిపోయాయి. భారత సింహాసనం కోసం విధి ఔరంగజేబ్‌ను ఎన్నుకున్నది. అందుకే అతనిన్ని అవాంతరాల నుండి, అడ్డంకుల నుండి, ప్రమాదాలనుండి సురక్షితంగా బయటపడగలిగాడు. తండ్రి చేస్తున్న ఈ ఒక్కొక్క కుట్ర ఔరంగజేబ్‌కు తెలిసిపోతూనే ఉంది. షాజహాన్ పని సమాప్తం చేయడానికి ఔరంగజేబ్‌కు ఒక్క కంటిసైగ చాలు. శక్తి సామర్థ్యాలు, అధికారాలు అన్ని అతని చేతుల్లోకి వచ్చేశాయి. అయినా అతను తండ్రిని చంపించలేదు. విషమివ్వలేదు. అతని దురాగతాల నుండి తనను రక్షించుకోవడానికి, అతన్ని కోటలో నిర్బంధంలో ఉంచాడు. అతను లేఖలు రాయకుండా, ఔరంగజేబ్ శత్రువులతో సంబంధాలు పెట్టుకోకుండా తగిన, సముచితమైన ఆంక్షలు విధించాడు. అతని దౌష్ట్యాల నుండి తనను కాపాడుకోవడానికే తప్ప, అతని స్వతంత్రాన్ని హరించడానికి ఎంతమాత్రం కాదు. నిర్బంధంలో ఉంచి కూడా అతని గౌరవమర్యాదల్లో, ఆదర సత్కారాల్లో, హోదాదర్పాల్లో, సుఖసౌఖ్యాల్లో ఎలాంటి లోటును రానివ్వలేదు. తన పట్ల అతనెంత నీచంగా ప్రవర్తించినా, తను మాత్రం అతని దౌష్ట్యాల నుండి తనను తాను కాపాడుకున్నాడే తప్ప, ప్రతీకారంగా అతనికెట్టి హానీ తలపెట్టలేదు. ఈ విషయాన్ని

సమకాలీన చరిత్రకారులే కాకుండా, డాక్టర్ బర్నియేరు లాంటి విదేశీయుడు కూడా ధృవీకరించాడు. తనను కాపాడుకోవడానికి, తనను రక్షించుకోవడానికి ప్రయత్నించని వాడు ఈ ప్రపంచంలో ఎవరుంటారు? ఔరంగజేబ్ కూడా తనూ అదే చేశాడు. షాజహాన్ నిష్పక్షంగా ఉండలేక పోతున్నాడు, న్యాయంగా వ్యవహరించలేకపోతున్నాడు. యోగ్యతా అయోగ్యతల్ని అంచనా వేయలేకపోతున్నాడు. కుమారులందరిని ఒకే దృష్టితో చూడలేకపోతున్నాడు. రాజ్యం, వంశం నాశనమవుతున్నా, దారా పిచ్చి ప్రేమ నుండి బయటపడలేక పోతున్నాడు. అటువంటి పరిస్థితుల్లో ఔరంగజేబ్ చేసినట్లు కాకుండా, వేరెవరైనా సరే ఏ విధంగా ప్రవర్తించేవారు? దారా, షుజాలు చంపబడి, మురాద్ చెరసాలపాలై, ఔరంగజేబ్ అధికారానికి ఇక తిరుగులేదనే పరిస్థితి ఏర్పడే దాక, షాజహాన్ తన ప్రవర్తనను మార్చుకోలేదు. ఇక ఈ ఆశలన్నీ తెగిపోయిన తరువాత, అదృష్టం ఔరంగజేబ్ పక్షాన ఉందని ధృవపడిన తరువాతగాని, షాజహాన్ మౌనం వహించాడు. తన కుతంత్రాలనుండి తప్పుకున్నాడు. వాస్తవాలు ఏమిటో అర్థం చేసుకున్నాడు. దీనితో పాటే ఔరంగజేబ్ రుజువర్తనం, నిష్కల్మషం, తన పట్ల అతనికి గల వినయ విధేయతలు ప్రభావం చూపసాగాయి. షాజహాన్ ప్రవర్తనలో వచ్చిన ఈ మార్పును గమనించిన ఔరంగజేబ్ కూడా, ఆ తరువాత అతని సలహా అడగందీ ఏ పనిచేసేవాడు కాదు. షాజహాన్ కూడా జరిగిన విషాదాలన్నీ మరిచి కుమారునికి సముచిత సలహాల నివ్వసాగాడు. షాజహాన్ ప్రియపుత్రిక, ఔరంగజేబ్ అక్కయ్య జహాఁఆరా బేగం ప్రయత్నం, ప్రయాసలతో షాజహాన్, ఔరంగజేబ్ తప్పులన్నిటినీ క్షమించాడని చరిత్రకారులు వ్రాశారు. “బహ్రె జఖ్ఖార్” రచయితను అనుసరించి, షాజహాన్ సేవకోసం ఔరంగజేబ్‌చే నియమించ బడిన అతని గురువు మౌలానా సయ్యద్ ముహమ్మద్ ఖనోజి, ఈ పనిని సాధించి పెట్టారని రాశారు. వాస్తవం ఏదైనా ఉన్నప్పటికీ, షాజహాన్ చివరి రోజుల్లో తండ్రీకొడుకుల మధ్య అత్యంత సుహృద్భావ సంబంధాలు ఏర్పడ్డాయనేది మాత్రం నిరాకరించలేని వాస్తవం. ఆ తరువాత షాజహాన్ ఎనిమిది సంవత్సరాలు జీవించాడు. చివరికి 1666 జనవరి 22వ తేదీన వ్యాధిగ్రస్తుడై శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయాడు. *(ఈ మధ్య కాలంలో అతని దైనందిన కార్యక్రమాలేమిటో తెలుసుకోవాలనుకుంటే ‘అమలె సాలెహ్’ పేజి 21-25, 43-47, ఆలంగీర్ నామ పేజి 116-123, 932-939 చూస్తే సరిపోతుంది. (ముఖద్దమ రుఖ్ఆత్, నజీబ్ అష్రఫ్, పేజి 464)*

తండ్రి చనిపోయిన వార్తను సోదరి జహాఁ ఆరా బేగం ఔరంగజేబ్‌కు అందజేసింది. ఆ సమయంలో అతను ఢిల్లీలో ఉన్నాడు. ఈ వార్తను విన్నప్పుడు ఔరంగజేబ్ పరిస్థితి ఎలా మారిపోయిందో, అతని దర్బారు చరిత్రకారుడు ఇలా వర్ణించాడు :

“..... ప్రాణాంతకమైన ఈ దుర్వార్త చక్రవర్తిని దుఃఖబాధలు, విచారాలకు గురి చేసింది. అయాచితంగానే కళ్ళనుండి అశ్రువులు రాలసాగాయి. అత్యంత ఓర్పు, సహనాలు, ఠీవి దర్పాలు ఉన్నప్పటికీ ఆపులోలేనంతటి దుఃఖవ్యాకులాలు అంతకు ముందెన్నడూ ఇలాంటి విషాద

సందర్భాల్లో బయల్పడని అత్యంతగా ప్రభావితులైన లక్షణాలు స్పష్టంగా కనబడసాగాయి. కళ్ళ నుండి ధారాపాతంగా ప్రవహిస్తున్న అశ్రువుల్ని చూసి సన్నిహితులు సైతం చలించిపోయారు. ....." (ఆలంగీర్ నామ-మున్షి కాజిమ్ షెరాజీ, పే.935, 936, ముఖద్దమ రుఖ్ఆత్, నజీబ్ అష్రఫ్, పే.461-462) (Travel in the Moghal Empire, Dr. Burnier, page-198)

ఆ తరువాత శోకతప్తురాలైన తన అక్కయ్యను ఓదారుస్తూ ఇలా లేఖ వ్రాశాడు :

## సోదరి జహాఁ ఆరా పేర ఔరంగజేబ్ లేఖ :

"...... దయానుగ్రహాలు మూర్తీభవించిన (అక్కయ్యకు) ఈ విషాద, విచారకర సంఘటనపై పరాత్పరుడు అమితంగా ఓర్పు, సహనాలను, గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక! ఈ దుస్సంఘటన వల్ల నా మనసెంత విలవిల్లాడిపోయిందో, నా దుఃఖం ఎలా కట్టలు త్రెంచుకున్నదో ఎలా వర్ణించేది? హృదయాన్ని ఛిన్నాభిన్నం చేసిన ఈ సహించనలవి గాని బాధను వ్రాయడానికి కలానికి ఆ శక్తి ఎక్కడ? ఈ సందర్భంలో తమరు ఏ బాధను, దుఃఖాన్ని భరించారో ఆలోచిస్తేనే నా హృదయం ద్రవించుకుపోతోంది. ఇంకా కళ్లు అశ్రువులతో నిండిపోతున్నాయి. కాని విధి వ్రాత ముందు, పైనుండి విరిగిపడిన ఆపద (అంటే మరణం) ముందు నిస్సహాయంగా తలవంచక, శిరసావహించక గత్యంతరమేముంది? "కుల్లుమన్ అలైహాఫాన్" (ప్రతిదీ నశించక తప్పదు) ప్రచండుడైన పరాత్పరునికి తప్ప దేనికీ శాశ్వతతలేదు. మొత్తానికి దుఃఖావేదనలతో మూర్తీభవించిన ఈ అల్పుణ్ణి తమకు సమీపంగా భావించు కోండి. (అంటే అతి త్వరలో మిమ్మల్ని చేరుకోబోతున్నాను) ప్రభువులవారి అస్తమయంతో దుఃఖావేదనలకు గురిఅయిన వారిని ప్రత్యేకించి అక్బరాబాదీ బేగం సాహబాకు తమరు తగినవిధంగా ఓదార్చి ఉంటారని విశ్వసిస్తున్నాను. (ఆమెగారు అందరికన్నా అధిక ఓదార్పుకు, సానుభూతికి అర్హురాలు)

దయార్ద్రతగల ప్రియ సోదరీ! దివ్య ఖుర్ఆన్ పారాయణం వల్ల లభించే పుణ్యం, పేదలకు ఇవ్వబడే దానమే ప్రస్తుతం ప్రభువులవారి ఆత్మకు శాంతిని, పుణ్యాన్ని చేకూరుస్తుంది. ఈ విషయంలో మీరు అత్యంతగా ప్రయత్నించండి. వీటన్నిటి పుణ్యాన్ని ప్రభువులవారి ఆత్మకు కానుకగా సమర్పించుకోండి. నేనూ అదే చేస్తున్నాను. దైవం మన్నించి స్వీకరిస్తాడనే నమ్మకముంది...." (రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం.29/161, (ముఖద్దమ రుఖ్ఆత్ .... న.అష్రఫ్, పే.462, అను. షమ్స్ బరేల్వి పేజి 264 (జహాఁ ఆరా బేగం పేర ఔరంగజేబ్ లేఖలు)

అత్యవసర పనుల్ని ఇతరులకు పురామాయించి తేది 4-2-1666 రోజున ఢిల్లీ నుండి బయలుదేరి ఫిబ్రవరి 15న ఆగ్రా చేరుకున్నాడు. మరుసటి రోజు తెల్లారగానే తండ్రి సమాధిని దర్శించుకొని, కన్నీరు మున్నీరుగా విలపించాడు. సమాధి వద్ద ఫాతిహా చదివి తండ్రి ఆత్మశాంతి కోసం ప్రార్థించాడు. పన్నెండు వేల రూపాయలు అతని పేరుమీద పేదలకు, సమాధి సేవకులకు

దానంగా పంచేశాడు. ఆ తరువాత శోకమూర్తి అయిపోయిన తన సోదరి, ఇంకా ఇతర అంతఃపుర స్త్రీలను కలుసుకొని వారిని ఓదార్చాడు.

ఔరంగజేబ్ అత్యధికంగా తన అక్కయ్య గురించే ఆలోచించసాగాడు. తండ్రి చనిపోయిన తరువాత తను నిస్సహాయురాలినై పోయాననే ఆలోచన సోదరికి కలుగనీయ్యోద్దనే ఆలోచనతో, ఔరంగజేబ్ ఆరోజే రాజ్య నాయకులందరిని, దర్బారు ప్రముఖులందరిని పిలిపించి, "ఒక రాజ్యంలో పట్టపురాణి ఎలా గుర్తించబడుతుందో, ఎలా గౌరవించబడుతుందో, ఆమె శాసనం ఎలా చెలామణి అవుతుందో, తన సోదరికి ఆ అధికారాలన్నీ ఉంటాయని" ప్రకటన చేశాడు.

ఆ తరువాత ఔరంగజేబ్ ఆగ్రాలో ఉన్నన్ని రోజులు, సోదరికి సాంత్వన పలకడం, సంతోషపెట్టడానికి ప్రయత్నించడమో, లేక తన తండ్రి సమాధిని సందర్శించుకొని అతని ఆత్మశాంతి కోసం ఫాతిహా, దుఆలతో గడపడమో తప్ప అతను ఇంకే పని చేయలేదు.

ఇదండీ షాజహాన్ పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన! షాజహాన్ పట్ల ఔరంగజేబ్ ప్రవర్తించిన తీరు ప్రశంసించదగినదా? లేక నిరసించదగినదా? అనే విషయాన్ని పాఠకులకే వదిలేస్తున్నాము.

# 11. హిందువుల పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన

అల్ ఫిన్స్టన్, లేన్‌పోల్ మొదలుగాగల యూరోపియన్ చరిత్రకారులతో పాటుగా, జదూనాథ్ సర్కార్ లాంటి మన భారతీయ చరిత్రకారులు కూడా ఔరంగజేబ్‌పై నిరాధారమైన రకరకాల ఆరోపణలు చేశారని, ఈ విధంగా ప్రజల దృష్టిలో అతని రూపాన్ని వికృతపరచడానికి ప్రయత్నించారని ఇంతకు ముందే తెలుపుతూ వచ్చాము. ఔరంగజేబ్ హిందువుల్ని హింసించేవాడని, వారి ధార్మిక విధుల్లో ఆటంకం ఏర్పరిచేవాడని, వారి ధార్మిక సమ్మేళనాల్ని, స్నానాల్ని, పూజా పునస్కారాల్ని నిషేధించాడని, ప్రభుత్వ ఉద్యోగాల నుండి వారిని తొలగించాడనేవి కొన్ని.

అయితే రండి, వీరి ఆరోపణల్లోని వాస్తవం ఎంతో ఒకసారి పరిశీలిద్దాం. ఆ కాలం నాటి చరిత్ర, సమాజాన్ని నిశితంగా అధ్యయనం చేసిన న్యాయప్రియులైన హిందూ చరిత్రకారులు, విద్వాంసులు, విజ్ఞానులు కూడాఉన్నారు. వారు పై నిందల్ని ఖండించడమే కాకుండా, ఔరంగజేబ్ నిష్పక్షపాతం గల పరిపాలకుడని, అతను హిందూ మందిరాలకు, పూజారులకు, మహంతులకు భత్యాలు, ఇనాములు, జాగీర్లు కూడా ఇచ్చిన ధర్మదాత అని సాక్ష్యాధారాలతో నిరూపించారు. వీరిలో బొంబాయికి చెందిన శ్రీ జెనన్ చందర్ గారొకరు.

శ్రీ జెనన్ చందర్‌గారు అతి వ్యయప్రయాసలకోర్చి, సుదీర్ఘ పరిశోధనలు జరిపి ఔరంగజేబ్ తన పరిపాలనా కాలంలో హిందూ మందిరాలకు కేటాయించిన ఆస్తుల, జాగీర్లకు సంబంధించిన వివరాలను తెలిపే ఎన్నో ఫర్మానాలను సేకరించారు. పరిశోధన, చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా వీటిపై దృష్టి సారించడం ఎంతో అవసరం. కాని మన దేశంలోని విద్యాధిక వర్గాలు, పత్రికా సంపాదకులు ఎంత పక్షపాతులు, సంకుచిత స్వభావులు, అసహనం కాలవారైపోయారో కాస్త ఆలోచించండి. మన దేశంలో ప్రచురించబడే వందలాది పత్రికల్లో ఏ ఒక్క పత్రిక కూడా ఆయన రచించిన ఈ ఆంగ్ల వ్యాసాలను ప్రచురించడానికి ముందుకు రాలేదంటే మన పత్రికా సంపాదకుల మనస్తత్వాలను, పక్షపాతాన్ని వారి పాలసీని, వారి లక్ష్యాలను ఊహించవచ్చు. సత్యాన్వేషణ పట్ల వారికి ఉన్న ఆసక్తి ఏపాటిదో అర్థమైపోతుంది. అందుకని ఆయన తన ఈ ఆంగ్ల వ్యాసాల్ని కరాచీ నుండి వెలువడే Journal of Pakistan Historical Society కి పంపించారు. వాటిలో నుండి కొన్ని మాత్రమే మీ ముందుంచుతున్నాం.

“విచారకరమైన విషయం ఏమిటంటే పక్షపాతం గల చరిత్రకారులు ఔరంగజేబ్‌ను పరమతద్వేషిగా వర్ణించటంలో ఎలాంటి సంకోచానికి తావివ్వలేదు. ఇది వారు చరిత్ర దృష్టితో కాక, ఔరంగజేబ్‌ను కావాలని అపకీర్తి పాలుచేయడానికి ఉద్దేశపూర్వకంగా చేశారు. వారి ఈ ఉద్దేశానికి భిన్నంగా, ఔరంగజేబ్ పరమత సహనాన్ని చాటే సాక్ష్యాధారాలు లభించినప్పటికీ వాటి నుండి వీరు దృష్టి మరల్చుకుంటారు. ఇలాంటి సాక్ష్యాధారాలలో ఒకటి డాక్టర్ బర్నియేర్

యాత్రా వృత్తాంతంలో కూడా లభిస్తుంది. అందులో ఔరంగజేబ్ 'మహలు' క్రింద సూర్యగ్రహణ సమయంలో హిందువుల స్నానాల వృత్తాంతం విపులంగా వర్ణించబడింది. డాక్టర్ బర్నియేర్ ఇలా వ్రాశారు :

"1666లో సంభవించిన సూర్యగ్రహణ సమయంలో నది రెండు వైపులా దాదాపు ఒక లేక్ (అనగా మూడు మైళ్ళ) పొడవున నేను విగ్రహారాధకులను (హిందువుల్ని) చూశాను. ..... మొగలు చక్రవర్తి ఒక ముస్లిం అయి ఉన్నప్పటికీ, అతను ఈ ప్రాచీన, మూఢ విశ్వాసాన్ని ఆచరించడానికి అనుమతించాడు. ఈ జెంటైల్స్‌ను (హిందువుల్ని) వారి ధార్మిక ఆచారాల్ని స్వతంత్రంగా నిర్వహించుకోకుండా అడ్డుపడటానికి అతను ఇష్టపడడం లేదా? లేక ధైర్యం చేయడం లేదా? (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 301, 303).

ఈ క్రైస్తవ పర్యాటకుడు యూరప్‌లోని మతోన్మాదాన్ని బాగా ఎరిగినవాడు. కనుకనే ఔరంగజేబ్ పరమత సహనాన్ని చూచి ఆశ్చర్యపోయాడు. ఔరంగజేబ్ చక్రవర్తి వారి ధార్మిక కార్యకలాపాల్లో స్వయంగా పాల్గొనడానికి ఎలా ఇష్టపడ్డాడు? ఈ విగ్రహారాధకుల బహిరంగ పూజాపురస్కారాల్లో భాగం పంచుకోవడానికి అతను ఎలా సాహసించాడు? అనే విషయం గురించి ఈ పర్యాటకుడు సరిగా అవగాహన చేసుకోలేకపోయాడు. అతను ఇంతకన్నా అత్యంతా శ్చర్యకరమైన సన్నివేశాన్ని వర్ణిస్తున్నాడు. "ఎప్పుడైతే కొందరు బ్రాహ్మణులు కానుకలు తీసుకొని చక్రవర్తిని సందర్శించి పైనుదాహరించిన పూజకు కబురందించినప్పుడు చక్రవర్తి వారికి శాలువలు, ఏనుగును ప్రసాదించి సత్కరిస్తాడు. (పే. 303)

అంటే ఇది చక్రవర్తి తరఫున దానం అన్నమాట.

ఇదొక్కటే నిదర్శనం కాదు. ఆ కాలంనాటి పూరీలోని జగన్నాథ మందిరపు రథ యాత్రను గురించి కూడా డా. బర్నియేర్ రాశాడు. (పేజి 304)

పై సాక్ష్యాల ద్వారా ఔరంగజేబ్ కాలంలో హిందువుల పూజాపునస్కారాలకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉండేదని రుజువౌతోంది.

ఔరంగజేబ్ సమకాలీన సాహిత్యం (లిటరేచర్)లో కూడా పరమత సహనానికి సంబంధించిన సాక్ష్యాలు లభిస్తాయి. నేటి కాలంలోలాగా ఆ కాలంలో ఔరంగజేబ్ హిందువులకు సింహ స్వప్నమేమీకాదు. అంటే హిందువులు భయపడవలసిన, ద్వేషించదగిన వ్యక్తి కానేకాడు.

గుజరాత్‌కు చెందిన ఒక జైన మత కవి 'భగవతిదాస్' ఇలా రాస్తున్నాడు :

నర్పతి థాన్ బిరాజియె అవరంగ్, జాకీ ఆజ్ఞా అఖండ్ భయె

రీత్‌భీత్ వ్యాపె నహీం కోయీ, యెహ్ ఉప్‌కార్ నర్పతి కె హుయె.

(మోహన్ లాల్ దుల్బాచంద్ దేశాయి- జైన్ గోజర్ కావ్య - ఖండ్-3, భాగ్-2, పేజి 1279)

అనువాదం : ఔరంగజేబ్ మాకు చక్రవర్తి. అతని ఆజ్ఞ ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా

పాటించబడుతుంది. ఆయన రాజ్యంలో ఎవరికి ఎలాంటి భయమూ లేదు. ఇది ఈ రాజు వలన సమకూడిన ఒక గొప్ప వరం.”

ఇంకొక జైనమత సాహిత్యకారుడు ‘మునిరాం చంద్” ఇలా రాస్తున్నాడు :

మర్దానో యెహ్ మహాబలి ఔరంగ్ షా నరేంద్ర్

తా సురాజ్ మే హర్షన్ సోఁ, రచ్చో శాస్త్ర ఆనంద్.

అనువాదం : ఔరంగజేబ్ రాజు గొప్పవీరుడు. ధైర్యశాలి. అతని రాజ్యంలో అత్యంత ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో నేనీ ఆనంద శాస్త్రాన్ని రచించాను.

ఔరంగజేబ్ కాలం నాటి హిందీ భాష ప్రఖ్యాత కవి సబ్‌బల్ సింగ్ చౌహాన్ మనందరి కంటే ఎక్కువ ఔరంగజేబ్‌ను ఎరుగుతాడు. ఈ చౌహాన్ ఔరంగజేబ్ కాలంలో మహా భారతాన్ని హిందీ భాషలోకి అనువదించాడు. అందులో ఒక చోట ఔరంగజేబ్ గురించి ఇలా వ్రాశాడు. ఔరంగ్ షా ఢిల్లీ సుల్తానా-ప్రబల్ ప్రతాప్ జగత్ సత్ జానా. “ఔరంగజేబ్ ఢిల్లీకి సుల్తాను, అతని కీర్తి ప్రతిష్టలు ప్రపంచమంతటిలో వ్యాపించివున్నాయి.”

ప్రాచీన జైన సాహిత్యం నుండి ఇటీవలనే ఇంకొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి.

సుభాగ్యవిజే అనే వ్యక్తి ఒక జైనమత సాధువు. ఇతను క్రీ.శ.1693లో ప్రాచీన్ తీర్థ్‌మాల అనే గ్రంథాన్ని రచించాడు. అందులో ప్రాచీన కాలం నుండి అతని కాలం వరకు గడిచిన ధార్మిక గురువుల వివరాలున్నాయి. అందులో చరిత్రయావిజే అనే అధ్యాయంలో తన శిష్యుడు లాల్‌విజే గురించి ఇలా రాశాడు :

“పండిట్ బిరుదుగల అతని శిష్యుడు లాల్‌విజే జ్ఞాని, ఆగ్రా వెళ్ళి ఢిల్లీకి చక్రవర్తి అయిన ఔరంగజేబ్‌ను కలిశాడు. ఢిల్లీకి చెందిన సచ్చీలుడైన ఈ ప్రభువు, జైనమత వర్గాల్లోని తోపగుచ్ఛా వర్గం వారికి ఒక పెద్ద పోశాల (మఠం)ను ప్రసాదించాడు. అంతేకాక అతనక్కడ సుఖశాంతులతో నివసించాలని అతని కోసం ఒక ఫర్మానా కూడా జారీ చేశాడు. (ప్రాచీన తీర్థ్‌మాల - పేజి 99)

పై సంఘటన వల్ల ఔరంగజేబ్ ఇస్లామీ ధర్మంలాగే ఇతర ధర్మాల పట్ల కూడా సంపూర్ణ సహనభావం కలిగి ఉండేవాడని ఇతర మతాల ధార్మిక గురువుల్ని కూడా అతను సమంగా గౌరవించేవాడని విదితమవుతుంది. ఇదే విషయాన్ని చాటే ఇంకొక సంఘటన మీ ముందుంచుతున్నాను.

“క్రీ.శ. 1679లో ‘భీంవిజేసూరి’ అనే పేరుగల ఒక జైనమత గురువు (ఆ ప్రాంతానికి అధికారి అయిన) అసద్ ఖాన్ ద్వారా, ఔరంగజేబ్ చక్రవర్తిని అజ్మీర్‌లో సందర్శించాడు. అజ్మీరు, మర్ధా, సుజాట్, జైతరాన, జోద్‌పూర్‌లో ఖాల్సా (ప్రభుత్వ ఆస్తిగా పరిగణించబడి) ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోబడిన జైనమత మఠాలను తిరిగి జైనులకు స్వాధీనపరిచేందుకు గాను అతని (ఔరంగజేబ్) ద్వారా ఫర్మానాను పొందాడు.”

పై సంఘటనకు సంబంధించిన వివరాలు 'పితావళి సామచ్ఛాయ' భీంవిజే నాగర్ నాదార్నం, భీంవిజే రాసాలో లభిస్తాయి.

జైన మతానికి చెందిన ఇంకొక వర్గం రచయిత జగత్‌రాయరాయ్ తన గ్రంథం పద్మానంది పంచ్ విసీకాలో ఇలా రాశారు :

"ఇక్కడ ఔరంగజేబ్ ప్రభువు పాలన ఉంది. అతనెవ్వరికీ భయపడడు. అతని పరిపాలనలో ధార్మికాసక్తి గలవారికి తమకిష్టమైన వాటి అధ్యయనంలో ఎలాంటి భయంలేదు. దీని అర్థం ఏమిటంటే ప్రతి వ్యక్తి ధార్మికపరంగా సర్వస్వతంత్రుడు."

కాలం గడిచిన కొలది వాస్తవాలు బయటికి వస్తున్నాయి. ఇటీవలనే ఔరంగజేబ్ జారీ చేసిన ఒక ఫర్మానా ప్రజల దృష్టికి వచ్చింది. ఇది ఔరంగజేబ్ పట్టాభిషిక్తుడైన 27వ సంవత్సరంలో ఒక జైనముని 'జనచంద్ సూరి' పేరున జారీ చేశారు. ప్రస్తుతం ఈ ఫర్మానా జైనాచార్యులు శృజన్ విజయ్‌సేన్ సూరీ, జైనమఠం, డిల్లీ వద్ద భద్రంగా ఉంది. ఈ ఫర్మానాలో స్పష్టంగా జైన సాధువులు, మునుల పట్ల ఏ విధమైన అవరోధం కల్పించరాదని శాసిస్తూ ఔరంగజేబ్ తన ఆదేశాన్ని జారీచేశాడు.

ఒకవేళ ఔరంగజేబ్ పరమతద్వేషి, హిందువుల వ్యతిరేకి అయివుంటే హిందూ లేక జైన మతానికి చెందిన కవులు, సాహిత్యకారులు ఈ విధంగా అతన్ని పొగిడి ఉండేవారు కాదు. వారు అతని ఆస్థానకవులు కారని తెలిసినప్పుడు ఈ విషయం ఇంకను తేటతెల్లమయి పోతుంది. (The Journal of Pakistan Historical Society, Oct. 1958 and Apr. 1958 By Jenan Chander)

ఆయన ఇంకా ఇలా తెలిపారు :

ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో మాల్వా సుబేదారు, చక్రవర్తి పట్టాభిషేకం 7వ ఏట నుండి 47వ సంవత్సరం వరకు ఉజ్జయినికి చెందిన ఒక బ్రాహ్మణ కుటుంబానికి రోజువారి భత్యం, పింఛను జారీ చేస్తూ ఇచ్చిన (13) ఫర్మానాలు, ఆజ్ఞాపత్రాలూ మా దృష్టికి వచ్చాయి. ఈ బ్రాహ్మణ కుటుంబానికి సంబంధించిన వ్యక్తులు నేటికీ ఉజ్జయినిలోని మహా కాళేశ్వర మందిరానికి ప్రత్యేక పూజారులుగా ఉంటూ వస్తున్నారు. భారతదేశంలోని పన్నెండు ప్రఖ్యాత శివ మందిరాలలో ఇదొకటి. ఎవరి పేరనయితే రోజువారి భత్యం, పింఛను జారీచేయబడిందో ఆ బ్రాహ్మణ కుటుంబంవారే తరతరాలుగా ఈ మందిరానికి పూజారులుగా ఉంటూ వస్తున్నారని విశ్వసించడానికి తగిన ఆధారాలున్నాయి.

ఈ ఫర్మానాలు, ఆజ్ఞాపత్రాలు ఔరంగజేబ్ పట్టాభిషక్తుడైన 7వ సంవత్సరంలో 'మాల్వా'కు సుబేదారు అయిన 'నజాబత్ ఖాన్' ద్వారా జారీ చేయబడినవి. "కోకా" పేరుగల బ్రాహ్మణోత్త మునికి రోజువారి మూడు మురాదిటంకాలు (ఆ కాలపు నాణెం) భత్యం మంజూరు చేశారు. పట్టాభిషేకం 17వ సంవత్సరంలో ఈ 'కోకా' చనిపోగా, ఇదే భత్యం అతని కుమారుడు 'కాంజీ'కి మంజూరు అయింది. పట్టాభిషేకం 19వ సంవత్సరంలో "హబీబుల్లా అల్ హుస్ని"

అనే సుబేదారు దీన్ని పెంచి నాలుగు టంకాలు చేశాడు. కాని అతని తరువాత వచ్చిన అధికారులు దీన్ని ఒప్పుకోక తిరిగి మూడు టంకాలుగానే ఉంచారు. పట్టాభిషేకం 26వ సంవత్సరంలో 'ఖానెజమాన్' అనే సుబేదార్ కాలంలో ఇది తిరిగి నాలుగు టంకాలుగా పెంచారు. చివరికి 'మొగల్ ఖాన్' కాలంలో ఇది శాశ్వతం (పర్మనెంట్) చేశారు. పది ఫర్మానాలలో ఈ రోజు భత్యం గురించి పేర్కొన్నారు. ఆతరువాత జారీచేయబడిన రెండు ఫర్మానాల ద్వారా 'కాంజీ' బ్రాహ్మణునికి సాలుకు పదిన్నర రూపాయలు ఖరీఫ్ పంట సమయంలో దాన రూపంలో లభించేదని తెలుస్తుంది. చివరి ఫర్మానాలో మురార్ (మురహరి), అతని సోదరునికి సాలుకు యాభై దాంలు (అనగా ఒక మురాది టింకా) ప్రభువు అనుచరుల సేవకు ఫలితంగా మొదటి నుండే లభించేది. ఔరంగజేబ్ కాలంలో అది యధావిధిగా కొనసాగింది. దీనికోసం పట్టాభిషేకం 8వ సంవత్సరంలో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఈ ఫర్మానాలన్నీ చూసిన తరువాతనైనా, ఔరంగజేబ్ విమర్శకులు తమ అభిప్రా యాల్ని మార్చుకోవాలి. (The Journal of Pakistan Historical Society, Jan. 1958, By Jenan Chander) (హిందుస్తాన్ కె ముస్లిం హుకుమ్‌రానోఁకి మజ్‌హబి రవాదారి, వా-3, పేజి 156 - 169)

"కడమానిక్ పూర్‌లో బాబా మలూక్ దాస్ వంశం (సంతానం) వారుంటారు. వీరు మహేంతుల కుటుంబానికి చెందినవారు. బాబాను ఒకసారి ఔరంగజేబ్ పిలిపించాడు. ఆయన ఔరంగజేబ్‌ను కలుసుకున్నప్పుడు తాను చెప్పిన కొన్ని హిందీ కవితల్ని ఔరంగజేబ్‌కు వినిపించారు. అది విని ఔరంగజేబ్ అత్యంతగా సంతోషపడ్డాడు. 'సరాధూ' అనే గ్రామాన్ని బాబా మలూక్ దాస్‌కు జాగీరుగా ప్రసాదించాడు. ఔరంగజేబ్ జారీచేసిన ఆ ఫర్మానా బాబా సంతానం వద్ద నేటికీ ఉంది. (కడమానిక్‌పూర్ చరిత్ర పేజి 137,138, తారీక్‌కీ సచ్చాయియాఁ- ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 55)

పాట్నా యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ రాంప్రసాద్ ఖోస్లా "మొగల్ కింగ్‌షిప్ అండ్ నోబిలిటీ" (1934) అనే తన గ్రంథంలో ఇలా రాశారు :

"ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇస్లాం స్వీకరించాలనే షరతు ఔరంగజేబ్ చక్రవర్తి ఎన్నడూ ప్రవేశపెట్టలేదు. చక్రవర్తి ఇస్లాం ధర్మం సంరక్షకుడుగా మాత్రం తప్పక గుర్తించబడేవాడు. కాని ముస్లిమేతర ప్రజలపై ఎలాంటి వత్తిడి లేక దౌర్జన్యం జరిగేది కాదు. బాబర్ మొదలుకొని ఔరంగజేబ్ వరకు గల మొగలుల చరిత్ర, మతపక్షపాతం, వర్గ, జాత్యాహంకారానికి అతీతంగా ఉంది."

"India Devided" అనే తన గ్రంథంలో డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఇలా రాశారు :

పోర్చుగీసు చరిత్రకారుడు ఫార్సీ సూజా ఇలారాశాడు : "హిందూ ముస్లింలు పరస్పరం కలిసిమెలిసి ఉంటారు. ముస్లిం రాజులు హిందువులకు గొప్ప గొప్ప హోదాలనిస్తారు, ఉన్నత

పదవులపై నియుక్తుల్ని చేస్తారు. దీని అర్థం ఏమిటంటే హిందూ ముస్లింలలో ఎలాంటి భేదభావం పాటించబడదు. హిందువులు తాము ధార్మిక విధుల్ని, ఆచారాల్ని నిర్వర్తించుకోవడానికి సర్వస్వతంత్రులై ఉండేవారు. ముస్లింలు హిందువుల ధార్మిక భావనల్ని అత్యంతగా గౌరవిస్తారు."

సర్ అల్‌ఫ్రెడ్, లాయెల్ ఏషియాటిక్ స్టడీస్‌లో ఇలా రాశారు: "భారత దేశాన్ని తమ ధర్మం ప్రకారం మలిచే భావనకు ముస్లిం పాలకులు ఎంతో దూరం ఉన్నారు. దేశ పరిపాలనకు సంబంధించిన ఉన్నత హోదాలు కేవలం ముస్లింలకే పరిమితమవ్వాలని కూడా ముస్లింలు ఎన్నడూ ప్రయత్నించి ఉండలేదు." (అఖిలేష్ జైస్వాల్, పేజి 24).

"హెమిల్టన్" పేరుగల ఒక ఆంగ్ల పర్యాటకుడు ఔరంగజేబ్ కాలంలో భారతదేశాన్ని సందర్శించాడు. అతను తన యాత్రలో చూసిన వివిధ పట్టణాల విశేషాలను వర్ణించాడు. 'ఠట్' పట్టణం గురించి ఇలా రాశాడు: "ప్రభుత్వ ధర్మం ఇస్లాం. కాని సంఖ్యలో పది మంది హిందువులుంటే ఒక ముస్లిం ఉన్నాడు. హిందువుల పట్ల పరిపూర్ణ మతసహనం చూపబడుతుంది. వారు తమ ఉపవాసాలుంటారు. పూజా పునస్కారాలు చేసుకుంటారు. అంతకు క్రితం హిందువుల పరిపాలనా కాలంలో జరుపుకున్నట్లే వారు తమ పండుగలను జరుపుకుంటారు. (Travels in India - Capt. Hemiltan-Vol.1, Page.127,128) 1737 London.

ఈ యాత్రలోనే అతను సూరత్ పట్టణం గురించి ఇలా వర్ణించాడు : "ఈ నగరంలో దాదాపు వంద వివిధ మతాలకు చెందిన ప్రజలుంటారు. అయితే వారి విశ్వాసాల కారణంగా లేక ఆరాధనలో భిన్నత్వం మూలంగా ఎప్పుడూ ఎలాంటి ఘర్షణలు జరుగవు. తన క్లిష్టమైన రీతిలో తన దైవాన్ని ఆరాధించుకొనే సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రతి ఒక్కరికీ ఉంది. ధార్మిక వ్యత్యాసం కారణంగా ఒకరిని బాధించటం ఈ ముస్లింలలో కానరాదు. (Travels in India - Capt. Hemiltan-Vol.1, Page.162).

ఒక ఫ్రెంచ్ డాక్టర్, పర్యాటకుడు డాక్టర్ బర్నియెర్, తను భారతదేశాన్ని సందర్శించినప్పుడు ఇక్కడి వాతావరణాన్ని ఆచార వ్యవహారాల్ని పరమత సహనాన్ని గురించి ఇలా వర్ణించాడు:

"మునుపటికన్నా ఇప్పుడిప్పుడే సతీసహగమనం కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ దేశ పాలకులైన ముస్లింలు, క్రూరమైన ఈ ఆచారాన్ని రూపుమాపాలని సాధ్యమైనంతగా ప్రయత్నిస్తున్నారు. దీన్ని నిషేధించడానికి వారెలాంటి చట్టాన్నైతే రూపొందించలేదు. కారణం ఏమిటంటే ముస్లింల కన్నా సంఖ్యలో అత్యధికంగా ఉన్న హిందువుల ప్రత్యేకతల్లో (ఆచార వ్యవహారాల్లో) జోక్యం చేసుకోవటం వారు సరైందిగా భావించరు, ఇది వారి రాజ్య పరిపాలన విధానంలోని ముఖ్య అంశం, దానికి బదులు వారి ధార్మిక ఆచారాల్ని నెరవేర్చుకోవటంలో సంపూర్ణ స్వేచ్ఛనిస్తారు. అయినప్పటికీ ఈ సతీసహగమనమనే ఆచారాన్ని నిలువరించడానికి మాత్రం రకరకాలుగా ప్రయత్నిస్తుంటారు. ఆ సూబాకు అధికారి అయిన సుబేదార్ అనుమతి లేకుండా

ఏ స్త్రీ సతీసహగమనం చేయజాలదు. ఇక ఆ సుబేదార్ కూడా ఆ స్త్రీ విషయంలో క్షుణ్ణంగా పరిశీలన జరిపి, ఆమె తన నిర్ణయం మార్చుకోవటానికి ఏ కొంచెం అవకాశం కూడా లేదని నిర్ధారణకు వచ్చిన తరువాత మాత్రమే సహగమనానికి అనుమతిస్తాడు. అనుమతించే ముందు ఆ సుబేదార్ ఆ సంబంధిత వితంతువుకు రకరకాలుగా హితబోధ చేస్తాడు. జీవితం పట్ల ఆశను రేపుతాడు. అనేకరకాలుగా అభిశంసిస్తాడు కూడా. ఇన్ని చేసినా ఆమె తన నిర్ణయం మార్చుకోకపోతే కొన్ని సందర్భాల్లో ఆమెకు నచ్చజెప్పాలనే దృష్టితో తన అంతఃపుర స్త్రీల వద్దకు పంపుతాడు. ఇన్ని అడ్డంకులు ఏర్పర్చినప్పటికీ నేటికికూడా సతీసహగమన సంఘటనలు అత్యధికంగానే జరుగుతున్నాయి. ప్రత్యేకించి ముస్లిం సుబేదారులు నియమింపబడని రాజులు, సామంతరాజుల పరిపాలనా ప్రాంతాల్లోనే ఇవి ఇతోధికంగా జరుగుతాయి. (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 306, 307).

"హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు" అనే తన హిందీ పుస్తకంలో అఖ్‌లేశ్ జైస్వాల్ ఇలా వ్రాశారు :

"ఔరంగజేబ్ సైన్యంలోని అతి ముఖ్య భాగం హిందువుల గౌరవానికి ప్రతీక అయిన రాజపుత్రులతో కూడుకున్నదే. మొగలు సైన్యాల ముందస్తు (అగ్రగామి) దళం రాజపుత్రులదే. ఇదే కాకుండా ఔరంగజేబ్ రాజపుత్రుల్ని గవర్నర్లాంటి అత్యున్నత హోదాపై నియమించాడు. అక్బర్ చక్రవర్తి కాలం నుండి ఔరంగజేబ్ పట్టాభిషిక్తుడయ్యేంత వరకు ఒక్క రాజా మాన్‌సింగ్‌ను తప్పిస్తే ఏ ఒక్క హిందువు గవర్నరు హోదాపై నియుక్తుడై ఉండలేదు. అయితే ఔరంగజేబ్ కాలంలో ఇద్దరిద్దరు రాజపుత్రులు (మిర్జా రాజా జైసింగ్, మహారాజా జస్వంత్ సింగ్) గవర్నరు హోదాపై నియమించబడ్డారు. ఇంతకు మించి ధార్మిక సహనత్వానికి సాక్ష్యం ఇంకేముంటుంది? మధ్య యుగానికి చెందిన (ఔరంగజేబ్ సమకాలీన) చరిత్రకారుడు చంద్రభాన్ బ్రాహ్మణ్ ఈ విషయంగా ఇలా వ్రాశాడు : "రాజపుత్రులకు చెందిన అందరు రాణా, రావ్, రాయాన్, రాజాలు ఉదాహరణకు రాథోర్, సిసోదియా, కచ్‌వాహా, హాడా, గౌడ్, చౌహాన్, భాలా, చంద్రావత్, జాద్‌బన్, తరవర్, భగేలా, వపుష్య, బుడ్‌గోజర్, పన్‌వార్, భదూరియా, సోలంకి, బుందేలా, షెఖావత్ - ఇంకా భారతావనిలోని ఇతరులు అనగా ఘుక్కర్, లింగాహ్, ఖోఖర్, బిలోచ్ జాతులు, 7000 నుండి 1000 వరకు, 1000 నుండి 100 వరకు మరియు 100 నుండి అహద్ది వరకు (మన్సబు) హోదాలపై నియుక్తులై ఉన్నారు. ఎడారుల, కొండప్రాంతాల జమీందారులు ఇంకా సామ్రాజ్య పరిధిలోని కర్ణాటక, బెంగాల్, అస్సాం, ఉదయ్‌పూర్, శ్రీనగర్, కుమాయూం, **బాందూ, టిబెట్, కిష్ట్‌వార్** మున్నగు ప్రాంతాల్లోని ప్రజల అన్ని జాతులు, వారి వర్గాలు సామ్రాజ్య దర్బారు గడపను చుంబించే ప్రత్యేక హక్కును పొందగలిగారు." (బ్రాహ్మణ్ రచన అయిన "గుల్‌దస్త" నుండి) (గుల్‌దస్త-సర్ సులైమాన్ కలెక్షన్-అలిగడ్ - 666/44, ff.4a-5a)

పైన పేర్కొన్న చంద్రభాన్ బ్రాహ్మణ్ వాంగ్మూలమే ఔరంగజేబ్ పరమత సహనాన్ని, ధర్మ నిరపేక్షతను చాటే స్పష్టమైన, తిరుగులేని సాక్ష్యం. ఇదేకాకుండా 1665 వరకు ఆగ్రాలోనే

ఉన్న ప్రఖ్యాత పర్యాటకుడు డాక్టర్ బర్నియేర్ తన గ్రంథంలో ఇలా పేర్కొన్నాడు : "గ్రేట్ మొగలు చక్రవర్తి ముస్లిమే అయినప్పటికీ, ఇంకా ఇతను హిందువుల శత్రువు అయినప్పటికీ ఎల్లప్పుడూ అతను హిందూ రాజుల్ని ఒక పెద్ద సంఖ్యలో తన వద్ద ఉంచుకుంటాడు. ఇంకా ఇతర నాయకులతో ఎలా వ్యవహరిస్తాడో వీరితోనూ అలాగే మెలగుతాడు. ఇదేకాకుండా తన సైన్యంలోని ఉన్నత హోదాలపై వారిని నియుక్తుల్ని చేస్తాడు. (Travels in the Moghal Empire - Dr. Bernies - Page : 40)

పై రెండు వాంగ్మూలాల ద్వారా ఔరంగజేబ్ ఎల్లప్పుడు ఒక పెద్ద సంఖ్యలో హిందూ మన్సబుదారుల్ని తన ప్రభుత్వంలో చేర్చుకున్నాడనే విషయం పూర్తిగా తేటతెల్లమైపోతుంది. ఇక హిందూ మన్సబుదారులు కూడా ఔరంగజేబ్‌తో పూర్తిగా సంతుష్టులై ఉండేవారు. ఇక్కడ ఓ పేర్కొనదగిన విషయం ఏమిటంటే పై వాంగ్మూలాలు తమ స్వంత కారణాలతో ఔరంగజేబ్‌ను ప్రశంసించడానికి ఎవరో ముస్లిం వ్రాసిన వాక్యాలు కావు. దీనికి భిన్నంగా ఇద్దరిలో ఒకరు హిందువు. ఇంకా కరడుగట్టిన బ్రాహ్మణుడు. ..... ఇక రెండవవాడు ఔరంగజేబ్ పట్ల ఎలాంటి సానుభూతి లేని ఒక యూరోపియన్ పర్యాటకుడు.

ఔరంగజేబ్ కాలంలో హిందూ – ముస్లింల ఐక్యతకు ప్రబల నిదర్శనం ఇంకొకటుంది. అదేమిటంటే, హిందూ అధికారులకు ముస్లింల సిఫారసుపై మన్సబులు ప్రసాదించబడ్డాయి. అదేవిధంగా హిందూ అధికారుల సిఫారసుపై ముస్లింలకు పదోన్నతులు లభించాయి. అంటే హిందువుల సిఫారసులపై ముస్లింలకు, ముస్లింల సిఫారసు (రెక మండేషన్)పై హిందువులకు పదోన్నతులు కల్పించబడ్డాయి. ఇది హిందూ-ముస్లింల ఐక్యతకు ఒక అపూర్వ నిదర్శనం. బీజాపూర్‌కు చెందిన ఒక ముఖ్య నాయకుడు ముల్లా అహ్మద్ నేథాకు మిర్జా రాజా జైసింగ్ సిఫారసుపై ఆరువేల మన్సబు ఇవ్వబడింది. ఇలాంటి సామెతలతో కూడిన జాబితా ఎంతో సుదీర్ఘంగా ఉంది. కాని ఇక్కడ కేవలం కొందరి పేర్లను మాత్రమే పేర్కొంటున్నాము :

| క్రమ సం. సిఫారసు చేసిన వారి పేరు | సిఫారసుపై మన్సబు పొందినవారి పేరు | మన్సబు | ఆధారం |
|---|---|---|---|
| 1. మిర్జా రాజా జైసింగ్ | ముల్లా అహ్మద్ నేథా (బీజాపూర్ నాయకుడు) | 6,000 పదాతి 6,000 అశ్వికదళం | ఆలంగీర్ నామ పేజి. 919-920 |
| 2. రొహిల్లా ఖాన్ | సర్దార్ సింగ్ హాడా | 500 పదాతి | అఖ్బరాత్-షవ్వాల్-2 |
| 3. రుస్తుం దిల్ ఖాన్ | వెంకట్‌రావు (అలోర్‌కొండ జమీందార్) | 500 పదాతి 200 అశ్విక దళం | అఖ్బారాత్, ముహర్రం-1 ప. షే. 45వ ఏట |
| 4. సయ్యద్ అబ్దుల్లా ఖాన్ (అజ్మీర్ పర్యవేక్షకుడు) | రాజ్ సింగ్ | టోడా ఫౌజుదారు మరియు 200/400 మన్సబుదారు | అఖ్బరాత్, షాబాన్-8 ప. షే. 43వ ఏట |

| | | | |
|---|---|---|---|
| 5. తర్బియత్ ఖాన్ | దోన్‌బరి రావు | 1500 పదాతి<br>1000 అశ్వికదళం | మఆసిర్ అర్కానె<br>తైమూరియ, పే 131ఎ |
| 6. రాకుమారుడు షాహ్ ఆలం | జగత్ సింగ్ ఇంకితరులకు ఉన్నత హోదాలు ఇవ్వబడ్డాయి | - | అఖ్బారాత్, షాబాన్, 8 ప.షే. 24వ ఏట |

(అఖ్‌లేశ్ జైస్వాల్, పేజీలు - 38-40)

అఖ్‌లేశ్ జైస్వాలే తన గ్రంథంలో ఇంకా ఇలా వ్రాశారు :

"జదూనాథ్ సర్కారును అనుసరించి, ఔరంగజేబ్ కాలంలో సంస్కృత భాషలో ఇవ్వబడిన కొన్ని తీర్పులు కూడా లభించాయి. దీనివల్ల ఔరంగజేబ్ కాలంలో బ్రాహ్మణులు తమ స్వంత న్యాయస్థానాలను ఏర్పాటు చేసుకునేవారని, అందులో "మనుశాస్త్రాన్ని" అనుసరించి తీర్పులు ఇవ్వబడ్డాయని కూడా అర్థమై పోతుంది. దీనివల్ల ఔరంగజేబ్ హిందువుల న్యాయ స్థానాలకు సంబంధించిన వ్యవహారాల్లో వ్యక్తిగత చట్టాల్లో జోక్యం చేసుకునేవాడు కాదని కూడా రుజువైపోతుంది. (పేజి 101)

"ఔరంగజేబ్ హృదయ విశాలత్వాన్ని, నిష్పక్షపాతాన్ని, నిర్మల మనస్తత్వాన్ని తెలిపే ఇంకొక దృష్టాంతం ఉంది. తన తీవ్ర వ్యతిరేకి, రాఠోర్ నాయకుడైన "దుర్గాదాస్" చేసిన ఒక మంచి పనికి అతన్ని గౌరవించి, సన్మానించడం. అసలు జరిగిన విషయం ఏమిటంటే రాకుమారుడు 'అక్బర్' తండ్రికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేపి, అందులో విఫలమై ప్రాణ భయంతో పారిపోతున్నప్పుడు తన కుమారుడు బులంద్ అక్తర్ మరియు కుమార్తె సఫియతున్నిసాను మార్వాడ్ రాఠోర్‌ల సంరక్షణలో విడిచివెళ్ళాడు. ఆ తరువాత సఫియతున్నిసా తన తాత వద్దకు వచ్చినప్పుడు ఆమె ఖురాన్ విద్యకోసం ఒక లేడి ట్యూటర్‌ను నియమించగా, తాను దుర్గాదాస్ సంరక్షణలో ఉన్నప్పుడు అతను తన విద్యకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు చేశాడని, అక్కడే తాను ఖురాన్‌ను కంఠస్తం చేశానని సఫియతున్నిసా ఔరంగజేబ్‌కు తెలిపింది. దుర్గాదాస్ చేసిన ఈ మంచి కార్యానికి ఔరంగజేబ్ అత్యంతగా ప్రభావితుడయ్యాడు. అతన్ని గౌరవించి సన్మానించాడు. ఆ తరువాత మూడువేల పదాతి మరియు ఇరవై ఐదు వందల అశ్వికదళ మన్సబుదారు హోదాను ప్రసాదించాడు. ఈ సంఘటన ద్వారా ఔరంగజేబ్ కాలం నాటి ప్రజల మనస్తత్వాలు ఎలా ఉండేవో కూడా తెలుసుకోగలుగుతాము. దుర్గాదాస్ తానొక హిందూ అయినప్పటికీ, రాకుమారుడు అక్బర్ పిల్లలకు ఇస్లామీయ శిక్షణకు తగిన ఏర్పాట్లు చేశాడు." (హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు - అఖ్‌లేష్ జైస్వాల్, పేజి.101).

ఇక్కడో విషయాన్ని మనం మర్చిపోకూడదు. రాకుమారుడు అక్బర్‌కు విద్రోహానికి పురిగొల్పి అతన్ని వెన్నంటి ఉన్న రాజపుత్రుల్లో దుర్గాదాస్ ప్రముఖుడు. ఈ విధంగా అతను తనకు శత్రువైనప్పటికీ అతని మంచిపనిని దృష్టిలో పెట్టుకొని అతన్ని క్షమించడమే కాకుండా మన్సబునిచ్చి సత్కరించడం ఔరంగజేబ్ క్షమాగుణానికి ప్రతీక.

"హిందువులు, వారి పండగల పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన గురించి అఖ్‌లేష్ జైస్వాల్ ఇంకా ఇలా వ్రాశారు: "సమకాలీన చారిత్రక సాక్ష్యాధారాల ద్వారా ఔరంగజేబ్ హిందూ పండగల్లో అత్యంత సంతోషంగా, ఉత్సాహంతో పాల్గొనేవాడని, ఈ సందర్భంలో హిందూ రాజులకు కానుకలు మొదలుగాగలవి ఇచ్చేవాడని విదితమవుతుంది. విజయ దశమి (దసరా) సమయంలో హిందూ రాజులకు రాజ వస్త్రాల్ని ప్రసాదించినట్లు 1662 జనవరి (దర్బారీ) అఖ్బారాత్‌లో (దర్బారు పత్రికల్లో) ప్రస్తావన వచ్చింది. ఆలంగీర్, (వీర్ వినోద్) పేజి 914ను అనుసరించి 1665 అక్టోబర్ 8న విజయ దశమి సందర్భంగా మహారాజా జస్వంత్ సింగ్‌కు రాజ వస్త్రాలు ప్రసాదించినట్లు విదితమవుతుంది. (జైస్వాల్-పేజి-71) దీనిద్వారా హిందూ పండగలపై ఔరంగజేబ్ ఎన్నడూ ఆంక్ష విధించి ఉండలేదని, దానికి భిన్నంగా తాను స్వయంగా వాటిలో పాల్గొనే వాడనేది ప్రస్ఫుటమవుతున్నది." (పేజి 25).

ఔరంగజేబ్ సమకాలీన చరిత్రకారుల్లో లాహోర్‌కు చెందిన చంద్రభాన్ (బ్రాహ్మణ్) ఔరంగజేబ్‌కు మీర్ మున్షి (చీఫ్ సెక్రటరీ)గా పనిచేస్తుండేవాడు. ఇతను ఔరంగజేబ్ దర్బారు ఉన్నతాధికారిగా, సభా నిర్వహణాధికారిగా పనిచేస్తుండేవాడు. "చహార్ చమన్" అనేది అతని ప్రఖ్యాతి గాంచిన గ్రంథం. ఇతనే కాకుండా సుజాన్ రాయ్ అనే ఇంకొక చరిత్రకారుడుండేవాడు. "ఖులాసతుత్తవారీఖ్" అనేది అతని చరిత్ర గ్రంథం. ఇంకొక హిందూ చరిత్రకారుడు ఈశ్వర్ దాస్ నాగర్ ఉండేవాడు. "నుస్ఖయె దిల్‌కుషా" అనేది అతని ప్రఖ్యాతి గాంచిన చరిత్రగ్రంథం. ఈ హిందూ చరిత్రకారులందరూ తమ గ్రంథాలలో ఎక్కడ కూడా ఔరంగజేబ్‌ను మత పక్షపాతిగా, హిందూ ధర్మ వ్యతిరేకిగా, హిందూ వ్యతిరేకిగా పేర్కొనలేదు. (హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు - అఖ్‌లేష్ జైస్వాల్, పేజి 24, 25 & 71)

T.W. Arnold ఇలా వ్రాశారు :

"ఔరంగజేబ్ కాలం నాటి చారిత్రక గ్రంథాలలో నేను పరిశీలించినంత వరకు బలవంతంగా ముస్లింలుగా మార్చిన సంఘటన ఎక్కడా కనిపించదు." (Preaching of Islam - by T.W. Arnold, page 379, London 1935)

చరిత్రకారుడు ఎల్‌ఫిన్‌స్టన్ తన ప్రఖ్యాత గ్రంథం 'భారత చరిత్ర'లో ఇలా రాశాడు:

"ఔరంగజేబ్ ఏ హిందువును కూడా పరమతస్థుడైన కారణంగా చంపటం, ఖైదు చేయడం లేక జరిమానా విధించినట్లు రుజువు కాలేదు. అంతేకాక ఏ వ్యక్తి కూడా తన ధర్మాన్ననుసరించి ఆరాధనలు చేసినందుకు ఆక్షేపించబడనూ లేదు."

ప్రొఫెసర్ శ్రీరాం శర్మ భారత చరిత్రపై ఎన్నో గ్రంథాల్ని రచించారు. దానితో పాటే ఆయన వివిధ ఆంగ్ల పత్రికలకు చారిత్రక వ్యాసాలు వ్రాస్తుండేవారు. ఒక వ్యాసంలో ఆయన ఔరంగజేబ్‌తో సహా మొగలుల రాజరిక వ్యవస్థను విశ్లేషించారు. వ్యాసం సుదీర్ఘమైనందున మొత్తమైతే పేర్కొనలేము. అందులోని కొన్ని అంశాలు పాఠకుల దృష్టికి తేవడం అసమంజసం కాదనుకుంటాము.

"మొగలుల రాజకీయ వ్యవస్థ ఎలాగుండేదంటే దానిపై ఆంక్షలు, ప్రతిబంధకాలు ఏర్పరిచే అధికారం ఎవరికీ లేకుండేది. అయితే వారు (చక్రవర్తులు) ప్రజల లేక రాజకీయ వ్యవహారాల్లో తమకు ఇష్టమొచ్చినట్లు వ్యవహరించేవారని అనుకోవడం శుద్ధ తప్పు. వారు చట్టాల అధినేతలని ఎన్నడూ అంగీకరించబడలేదు. దానికి భిన్నంగా వారు చట్టాలకు లోబడి ఉన్నారనే విషయం ఎన్నో సందర్భాల్లో అంగీకరించక తప్పలేదు. హిందువులకు, ముస్లింలకు వారి వ్యక్తిగత చట్టాలు భిన్నంగా వుండేవి. అందులో సవరణ చేసే, సమాప్తం చేసే లేక మార్పు చేసే ఎలాంటి అధికారం మొగలు పాలకులకు లేకుండేది. అందుకే ముస్లింలకు చెందిన లేక హిందులకు చెందిన వ్యక్తిగత చట్టాల (Personal Laws)లో మార్పు గాని సవరణగాని చేసిన ఎలాంటి సంఘటన కనిపించదు.

యూరోపియన్లు భారత దేశంలో అడుగిడినప్పుడు వారికి ఎలాంటి రాతపూర్వకమైన చట్టం (Written Law or Constitution) కనిపించలేదు. అయితే వాస్తవమేమిటంటే వ్రాతపూర్వకమైన చట్టాలు ఉనికిలో ఉన్నాయి. కాని ఈ చట్టాల రూపకల్పన లేక నిర్మాణంలో మొగలు ప్రభుత్వానిది ఎలాంటి పాత్ర లేదు. ఈ చట్టాలు ఎంత విస్తృతంగా ఉండేవి, వాటిలో ఎన్ని చిక్కులు ఏర్పడ్డాయంటే గత్యంతరంలేక ఔరంగజేబ్‌కు వాటిని గ్రంథరూపంలో సంకలనం చేయాల్సి వచ్చింది. అదే నేడు "ఫతవాయె ఆలంగీర్" పేరుతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. అయితే ఔరంగజేబ్ దీని రూపకల్పనలో ఒక చక్రవర్తిగా, పరిపాలకునిగా కాకుండా ఇస్లామీయ ధర్మశాస్త్రపు ఒక అభ్యాసకునిగా పాలుపంచుకున్నాడు. ఇంకా ఇది అతనిదో వ్యక్తిగత ఘనకార్యం కాదు, దానికి భిన్నంగా ఎంతోమంది ధార్మికవేత్తల, పండితుల తీవ్ర వ్యయప్రయాసల తరువాత ఇది రూపొందింది. ఇంకా ఇందులో ప్రతి సమస్యకు, ప్రతి అభిప్రాయానికి సంబంధించి (గత) ధార్మికవేత్తల, న్యాయాధీశుల అథారిటీని పేర్కొనటం జరిగింది.

ఇదేవిధంగా హిందువుల చట్ట గ్రంథాలు కూడా రూపొందాయి. కమలాకర్, రఘునందన్, మిత్ర మిశ్రా, నర్సింగ్ ఇంకా ఇతర పండితులు, విద్యాధికులు హిందువుల చట్టాల్ని రూపొందించడంలో గణనీయమైన సేవల్ని అందించారు. వీరు పాత చట్టాలను సంకలనం చేయడమే కాకుండా వివాదాస్పద అంశాల్ని చిక్కు సమస్యల్ని విడమర్చి కొత్త చట్టాల్ని కూడా రూపొందించారు. వీటి రూపకల్పనలో మొగలు పాలకులు ఎలాంటి జోక్యం చేసుకోలేదు. అంతేకాకుండా హిందువుల పంచాయితీ కార్యక్రమాలలో వారు ఎన్నడూ తమ చక్రవర్తిత్వపు లేక నియంతృత్వపు ప్రదర్శన చేయలేదు ...

... అయితే మొగలుల ప్రభుత్వం షరీయత్తు పరమైన మత ప్రభుత్వమా? కాదు, ఇది కూడా నిజం కాదు. యూరప్‌కు చెందిన మత ప్రభుత్వంలో రాజ్యం చర్చికి లోబడి ఉండేది. అయితే ఇస్లాంలో ఎలాంటి చర్చిలేదు, ధార్మిక గురువు (పాదరీ, పోప్)ల వ్యవస్థనూ లేదు. అందుకని ముస్లిం రాజుల కాలంలో మత ప్రభుత్వ భావనే జన్మించలేదు. అయితే ముస్లింలు ఖలీఫాను తప్పకుండా అంగీకరించేవారు. కాని వారి ఖలీఫా యూరప్‌కు చెందిన పోప్‌కు

పూర్తిగా భిన్నమైనవాడు. పోప్ తన అభిమతం, అభీష్టాన్ని అనుసరించి ధార్మిక చట్టాల్లో జోక్యం చేసుకోగలిగేవాడు. కాని ఖలీఫాకు ఇలాంటి ఏ హక్కూ లేదు. ఖుర్ఆన్ ఆదేశాల్లో అతను ఎలాంటి మార్పు చేయలేడు. ధర్మశాస్త్రానికి సంబంధించిన కొన్ని పాక్షిక (మౌలికం కాదు) అంశాల్లో సవరణ చేసే హక్కు అతనికుండేది. అయితే దీనికోసం ముస్లిం సమాజపు ఏకాభిప్రాయం షరతుగా ఉండేది ...

... ఔరంగజేబ్ తనను ఇస్లామీయ చట్టాలకు పూర్తిగా అధీనం చేస్తూ ఒక కొత్త అంశాన్ని పరిచయం చేశాడు. చట్టాన్ని అనుసరించి ప్రజల పట్ల చక్రవర్తి ద్వారా జరిగిన అన్యాయాల్ని పరిష్కరించడానికి, నిరోధించడానికి న్యాయవాదుల్ని నియమించాడు ... మొత్తానికి మొగలుల ప్రభుత్వం, ఒక రకమైన పరిమిత నియంతృత్వ ప్రభుత్వం అనేది వాస్తవం. మొగలులు తమ ప్రజల్ని అత్యధికంగా స్వేచ్ఛగా విడిచిపెట్టారనే విషయాన్ని మనం విస్మరించలేము. ఇదే కాలంలో యూరప్ పరిపాలకులు తమ పాలితుల (ప్రజల) పై అన్ని రకాల ఒత్తిడి, బలవంతం చేసేవారు. చివరికి వారి (ప్రజల) ధార్మిక విశ్వాసాలపై కూడా కట్టడి ఉండేది. ఎడ్వర్డ్ –VI కాలంలో ప్రభుత్వ ఒత్తిడి కారణంగా ప్రజలు ప్రొటెస్టెంట్ విశ్వాసాల్ని అంగీకరించ వివశులయ్యారు. కాని ఎప్పుడైతే "మేరి" సింహాసనాన్ని అధిష్టించిందో, ఆమె మొత్తం ఇంగ్లాండ్‌ను రోమన్ క్యాథలిక్కుగా మార్చేసింది. అయితే ఎలిజబెత్ కాలంలో ఇంగ్లాండ్ తిరిగి ప్రొటెస్టెంట్‌గా మారింది. నేటి యూరప్ ప్రభుత్వాల ధార్మిక పాలసీ ఏదైనా ఉన్నప్పటికీ, పదహారవ, పదిహేడవ శతాబ్దాల్లో యూరప్ ప్రజల ధార్మిక విశ్వాసాలు ప్రత్యక్షంగా ప్రభుత్వంతోనే ముడివడి ఉండేవి. ప్రభుత్వ ఆదేశాల క్రమమే వారి విశ్వాసాలు మారుతూ ఉండేవి. ప్రజల్ని ధర్మం, మతం వ్యవహారాల్లో పూర్తి స్వేచ్ఛగా మెలగడానికి విడిచిపెట్టిన సామెత కేవలం ఒక్క మొగలులలోనే కన్పిస్తుంది. వారు ఆక్ట్ ఆఫ్ సుప్రిమెసి లాంటి చట్టాన్నిగాని, థర్టీనైన్ ఆర్టికల్ లాంటి ధార్మిక చట్టాన్నిగాని బలవంతంగా తమ ప్రజలపై రుద్దలేదు. చివరికి ఇస్లాం నుండి తిరగబడడం, బాహ్య ఇస్లామీయ చిహ్నాలను కాపాడడం తప్పిస్తే, ముస్లింలపై కూడా వారు ఎలాంటి అవరోధాలను ఏర్పరచలేదు."
(Islamic Culture - Monthly-Hyderabad Deccan, October, 1939 - Essay written by Prof. Sri Ram Sharma)[1]

ఔరంగజేబ్ తన ప్రజల్ని వారు ఏ మతానికి, కులానికి చెందినవారైనా సరే, వారెంతటి నిమ్నజాతికి చెందినవారైనా సరే, కన్నబిడ్డల్లాగా చూసుకునేవాడు. వారిని ఆపదల్లో, కష్టాల్లో ఆదుకునేవాడు. వారి ధార్మిక, పౌర, సామాజిక హక్కుల్లో ఎవరినీ కూడా చివరికి తన ప్రభుత్వ ఉన్నతాధికారుల్ని సైతం జోక్యం చేసుకోవటానికి అవకాశం ఇచ్చేవాడు కాదు. అతని పరిపాలనా కాలంలో పంజాబ్‌కు చెందిన సూబేదార్ (గవర్నరు), ఒక కుమ్మరి అమ్మాయికి సంబంధించిన సంఘటన పలు పత్రికల్లో నమోదవుతూ వచ్చింది. పంజాబ్ రాష్ట్ర సుబేదారు దృష్టి ఒక కుమ్మరి యువతిపై పడింది. ఆమెను చూడగానే అతని బుద్ధి చెడి పోయింది. అతను ఆ

కుమ్మరిని పిలిపించి తన కోరికను తెలిపాడు. ఇంకా తాను సరిగ్గా నెల రోజుల తరువాత ఈ ప్రాంతానికి వస్తానని, అప్పుడు అమ్మాయిని సిద్ధంగా ఉంచి తనకప్పగిం చాలనే ఆదేశాన్ని జారీచేశాడు. ఆ కుమ్మరి ఎంతో ఆత్మాభిమానం కలవాడు. ఇది విని కలవరపడి పోయాడు. చివరికి అతని భార్య అతన్ని ఓదారుస్తూ ఢిల్లీ పాదుషా సత్ప్రవర్తన కలవాడు, న్యాయశీలి, న్యాయం కోసం వచ్చిన వారిని నిరాశపర్చడు. అందుకని మీరు తప్పకుండా అతని వద్దకు వెళ్ళండి మేం హిందువులం, కుమ్మరివాళ్ళమని, మీ సుబేదారు మా ధర్మాన్ని భ్రష్టుచేసి మా అమ్మాయిని తనింట్లో ఉంచుకోవాలని చూస్తున్నాడని ఇది అత్యంత అన్యాయం, ఘోరమని, తమను ఈ అన్యాయం నుండి రక్షించమని మొరపెట్టండని నచ్చజెప్పి పంపించింది.

భార్య సలహా, ప్రోత్సాహంతో ఆ కుమ్మరి ఢిల్లీకి వెళ్ళి, ఔరంగజేబ్‌ను కలిసి, కన్నీళ్ళతో తన బాధను వెళ్ళబోసుకున్నాడు. ఇది విన్నంతనే కోపంతో ఔరంగజేబ్ కళ్ళు జేవురించాయి. అతను కుమ్మరిని ఓదారుస్తూ 'నీవేమి బెంగబెట్టుకోకు, ఆమె నీ బిడ్డ కాదు, మా బిడ్డ, ఇది నీ పరువు కాదు, మా పరువు. మేం నిశ్చయంగా నీకు న్యాయం చేసి తీరుతాం. ఆ దుష్టుడు ఏ రోజైతే నీ ఇంటికి వస్తానని చెప్పిపోయాడో అంతకంటే ముందే నీ ఇంట్లో మేముంటాం. మీ మానమర్యాదల్ని కాపాడుతామని మరోసారి నీకు వాగ్దానం చేస్తున్నాం. ఇది మా విద్యుక్తధర్మం. అందుకని నీవు నిశ్చింతగా ఉండు" అని చెప్పి అతన్ని సాగనంపాడు. ఆ కుమ్మరి అమితా నందంతో తిరుగుముఖం పట్టాడు.

తను వాగ్దానం చేసిన ప్రకారమే ఔరంగజేబ్ ఆ నిర్ణీత రోజు ఒంటరిగా అతనింటికి వెళ్ళాడు. ఆ దుష్టుడు రాగానే తన స్వహస్తాలతో అతన్ని అంతమొందించాడు. ఈ చారిత్రక సంఘటన ఔరంగజేబ్ న్యాయ ప్రియత్వాన్ని, కర్తవ్య పరాయణతను, తన ప్రజల పట్ల అతనికిగల బాధ్యతా భావాన్ని, ప్రేమాభిమానాలను చాటిచెప్పే మచ్చుతునక. (దావత్, ఢిల్లీ అక్టోబర్ 2, 1967)

ఈ సంఘటనను ఒక సిక్కు విద్వాంసుడు కూడా 'మాల్వా ఇతిహాస్' అనే పుస్తకపు మొదటి భాగం, పేజి 118లో పేర్కొన్నాడు.

"శ్రీ మెహ్‌తా జైనమి గారు వివిధ పత్రికలు ఉదా ॥ "వందేమాతరం" మొదలగు వాటిలో "వైదిక ప్రచారక్" అనే కలం పేరుతో వ్యాసాలు వ్రాస్తుండేవారు. ఆయన ఔరంగజేబ్‌పై ఒక చిరు పుస్తకం "ఔరంగజేబ్ జీవితపు ఉజ్వల కోణం" అనే పేరుతో వ్రాశారు. అందులో ఔరంగజేబ్ హిందువుల్ని హింసించాడు, అణగద్రొక్కాడు అనే విషయాల్ని ఖండిస్తూ ఇది అత్యంత హేయమైన, నిరాధారమైన ఆరోపణగా పేర్కొన్నారు. ఆయన ఇంకిలా వ్రాశారు : "ఔరంగజేబ్ తన కాలంలో ఒక ఆదర్శనీయమైన రాజుగా మెదిలాడు. రాజ్యపరిపాలనా వ్యవహారాల్లో అతను ధార్మిక పక్షపాతానికి అతీతంగా ఉండేవాడు. ఒకవేళ అతని అడుగుజాడల్లో అతని కుమారులు

కూడా నడిచి ఉన్నట్లయితే భారత దేశపు రాజ్యాధికారం మొగలు వంశం నుండి చేజారకుండా ఉండేది.” (తారీఖ్ కీ సచ్చాయియాం - ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 54)[2]

రాబర్ట్ క్లైవ్ జీవిత చరిత్ర (ఆటో బయోగ్రాఫి ఆఫ్ రాబర్ట్ క్లైవ్) అనే తన గ్రంథంలో సర్‌జాన్ మేల్‌కమ్ ఇలా వ్రాశాడని డా. బిషంబర్ నాథ్ పాండే పేర్కొన్నారు :“.... దీవానీ (సివిల్) మరియు మాల్ (రెవిన్యూ) శాఖల పూర్తి నిర్వహణ, వేటి మీదైతే ప్రభుత్వ కార్యకలాపాలు నడవటం ఆధారపడి ఉంటాయో, అలాంటి దేశీయ అంతరంగిక వ్యవహారాలకు సంబంధించిన చిన్న-పెద్ద సర్వ విషయాల నిర్వహణ బాధ్యత- దాదాపుగా సర్వం - ముస్లింల రాకకు పూర్వం ఎవరి (హిందువుల) చేతుల్లో ఉండేవో, ఆ తరువాత కూడా అవి వారి (హిందువుల) వద్దనే ఉంటూ వచ్చాయి. ధనాగారం (ట్రెజరీ)కి సంబంధించిన అన్నిటికన్నా పెద్ద హోదా ఎల్లప్పుడు ఎవరో ఒక హిందువు వద్దనే ఉంటూ వచ్చింది. హోదాను అనుసరించి అతను ఒకోసారి మంత్రిగాను, మరోసారి ఉపమంత్రిగాను ఉండేవాడు....” (మందిర్ బోల్ ఉఠ్ఠే - డా. బి.యన్. పాండే. (హిందీ) పేజి-21)

స్వయంగా ఒక ఆంగ్లేయ పరిపాలకుడే, ముస్లింల పాలనాతీరును, ఆంగ్లేయుల పరిపాలనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యను విన్న తరువాత కూడా మనకు కనువిప్పు కలిగి మన పంథాను మార్చుకోకపోతే ఇక మనల్ని ఎవరూ సంస్కరించలేరు. భారతదేశానికి బ్రిటిష్ గవర్నరు జనరల్‌గా పనిచేసిన ‘లార్డ్ విలియం బెంటింగ్’ ఇలా వ్యాఖ్యానించారు.

“అనేక కోణాలతో ముస్లింల పరిపాలనా తీరు, మన పరిపాలనకన్నా ఎంతో మేలైనది. వారే దేశాన్ని జయించినా, దాన్ని తమ మాతృభూమిగా చేసుకున్నారు. వారక్కడి ప్రజలతో వైవాహిక సంబంధాలను ఏర్పరచుకున్నారు. దేశీయ ప్రజలలో కలిసిపోయారు. దేశ ప్రజలకు వారెన్నో రాయితీలను, గౌరవాలను ప్రసాదించారు. చివరికి విజేత, పరాజితుల భేదభావం సమసిపోయింది. ఈ కోణంతో చూస్తే, మన పాలసీ వారికి భిన్నంగా ఉంది. స్వార్థపూరితమైన, నిర్జీవమైన, నిర్దయతో కూడిన పాలసీ (మనది)” (హిందూ ముస్లిం ఉమ్మడి సంస్కృతి, రచన : డాక్టర్ సయ్యద్ మహ్మూద్ - మదీనా పత్రిక - బిజ్‌నూర్)

శ్రీ కె. ఆర్. మల్కాని గారు దేశ ప్రజలకు సుపరిచితులే. ఈయన సంఘ్‌పరివార్ పత్రిక అయిన “ఆర్గనైజర్”కు ఎడిటర్‌గా పనిచేశారు. ముస్లింల పట్ల సానుభూతి లేని కఠిన వైఖరి అవలంబిస్తారని ఈయన ప్రఖ్యాతిగాంచారు. అలాంటి వ్యక్తి ఔరంగజేబ్‌తో సహా మధ్య యుగం నాటి ముస్లిం పరిపాలకుల వ్యవహార శైలిని ఇలా విశ్లేషించారంటే ఇక దానిపై మేము విశ్లేషణ చేసే అవసరమే కనిపించడం లేదు.

“భారత దేశాన్ని పరిపాలించిన ముస్లిం పాలకుల్లో అత్యధికులు సెంట్రల్ ఆసియా ఎడారి ప్రాంతాల్లో నుండి వచ్చినవారైనప్పటికీ ఇస్లాంను భారత దేశ ప్రభుత్వ ధర్మంగా వారెప్పుడూ ప్రకటించలేదు. వారు భారతదేశంపై కఠిన పరిపాలనా వ్యవస్థను రుద్దినప్పటికీ వీరు ధార్మికపరంగా తీవ్రవాదులు కారు. దానికి భిన్నంగా వారు రాజకీయ పరిపాలకులు మాత్రమే

... ముస్లిం చరిత్రకారులు ముహమ్మద్ తుగ్లక్‌పై హిందూ సమర్థకుడనే నింద మోపుతారు. అతను హిందూ సన్యాసులతో కలుస్తుండేవాడు, సంస్కృతం చదివేవాడు, హోలీ ఉత్సవాల్లో పాల్గొనేవాడు. అతను తన ఖాజివుల్ ఖజాత్ (చీఫ్ జస్టిస్) తల నరకమని ఆదేశించడానికి కారణం కేవలం ఒక్కటే. అతను (ఖాజీ) ముహమ్మద్ తుగ్లక్‌ను కొందరు హిందువుల పట్ల స్పర్థ సృష్టించడానికి ప్రయత్నించడమే. ... మొగలులు గోవధపై నిషేధం విధించారు. ఇంకా వారు గంగా జలాల్ని త్రాగేవారు. వారు తమ ప్రభుత్వాల్లో రాజపుత్రుల్ని భాగస్వాములుగా చేసుకున్నారు. జోదాబాయి తన ధర్మంపై స్థిరంగా ఉండడమే కాకుండా ఆమె స్వయంగా అక్బర్‌నే 'హిందూకరణ్' (హిందూత్వం)లో ముంచేసింది .... అయితే ఔరంగజేబ్ అక్బర్‌లాంటి అపరిమిత సంయోగానికి ఇష్టపడలేదు. ఇంకా అతను అక్బర్ (పరిచయం చేసిన) అపరిమిత స్వాతంత్ర్య ఆచారాల్ని రద్దు పరిచాడు. అయినప్పటికీ అతను రాజపుత్రుల్ని ఎంతగా విశ్వసించేవాడంటే తన అంతఃపుర కాపలా బాధ్యతల్ని హిందువులకే (రాజపుత్రులకే) అప్ప గించాడు. ... శివాజీ తన పూర్తి అధీనంలోకి వచ్చినప్పటికీ, తన ఖైదులో ఉన్నప్పటికీ, ఔరంగజేబ్ శివాజీకి ఎలాంటి హాని తలపెట్టలేదు."

(K.R. Malkani, "The Statesman, Calcutta - Reference - Khaleel Siddiqui - Educating Backward Minority - Calcutta, 1985, Page 123)[3]

ఔరంగజేబ్ రసికుడు కాదు. భోగలాలసత్వాలంటే అసలే గిట్టనివాడు. నాట్యగానాలు, అశ్లీల దృశ్యాలంటే అతను ఏవగించుకునేవాడు. జాతరలు, ఉర్సులు, ఇంకా ఇలాంటివే స్త్రీ పురుషులు విచ్చలవిడిగా కలిసే సమావేశాలు, అమర్యాదకర, అనైతిక చర్యలు, దర్బారుల్లో నృత్యాలు, రాజనర్తకీల నాట్యాలూ చూస్తూ, సారాను సేవిస్తూ, అశ్లీల చేష్టలకు పాల్పడే చర్యలకు ఎంతమాత్రం ఇష్టపడేవాడు కాదు. ఇష్టపడకపోవడం అటుంచి వీటిని మహా పాపకార్యాలుగా భావించేవాడు. ఇలాంటి పనులు ప్రజల నైతికతలపై చెడు ప్రభావం వేస్తాయని అతను గట్టిగా విశ్వసించేవాడు. ప్రజాధనాన్ని భోగలాలసత్వాలకు వినియోగించడం, నాట్యగానాల్లో అమూల్యమైన సమయాన్ని వ్యర్థంగా గడపడం అతను పాపంగా తలంచేవాడు. అందుకే దర్బారు నుండి నర్తకీలను, వాయిద్యగాళ్ళను తొలగించేశాడు. దర్బారులోని జ్యోతిష్కులు, భట్రాజులు ఇంకా ఇలాంటివే పనికిమాలిన అనేక హోదాలను తొలగించాడు. రాజుగారు ప్రతిరోజు బాల్కనీలో కూర్చుంటే ప్రజలు దర్శించుకునేవారు. దీనితో "దర్శనీ వర్గం" అంటూ ఒక ప్రత్యేక వర్గం ఉనికిలోకి వచ్చింది. ఆ వర్గం వారు రాజును దర్శించుకోనిదే పచ్చినీళ్ళు కూడా ముట్టుకునేవారు కాదు. తన కోసం, తన రాజ్యాధికారం కోసం ఈ ఆచారం ప్రయోజన కరమైనదైనప్పటికీ, ఔరంగజేబ్ దానికి ఇష్టపడలేదు. అందుకే దీన్ని కూడా మాన్పించాడు. ముహర్రం మాసంలో పీరీలు లేపబడేవి. 1669లో బుర్హాన్ పూర్‌లో ఈ పీరీల ఊరేగింపు సందర్భంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడి, రక్తపాతం జరిగింది. ఇది తెలుసుకున్న ఔరంగజేబ్ పీరీలను ఊరేగించకూడదని ఆంక్ష విధించాడు.[4]

ఈ సందర్భంలోనే హిందువుల, ధార్మిక ఊరేగింపుల్ని కూడా నిషేధించాడు. దీని పూర్వపరాలను తెలుసుకోకుండానే ఆ తరువాత వచ్చిన సంకుచిత స్వభావులైన చరిత్రకారులు, దీన్ని ధార్మిక నిషేధాజ్ఞగా వర్ణించారు.

ఈ విషయాన్ని నేటి కాలంలో మనం కూడా గమనిస్తున్నాము. ధార్మిక ఉత్సవాలు, ఊరేగింపుల పేరుతో పెద్ద పెద్ద జన సమూహాల్ని సేకరించడం, దాని తరువాత అది కాస్త ఉద్రిక్తతలకు దారితీయడం, వివిధ వర్గాల మధ్య వైషమ్యాన్ని లేపటం, ఫలితంగా ప్రజల ధన మాన ప్రాణాలకు, ఆస్తులకు నష్టం జరుగడం ప్రతి నిత్యం మనం చూస్తూనే ఉన్నాం. సామరస్యాన్ని, శాంతి భద్రతల్ని కోరుకునే సామాన్య ప్రజలు, చట్టాన్ని గౌరవించే పౌరులు ఇలాంటి ఊరేగింపులపై ప్రభుత్వం ఆంక్షలు విధించాలని కోరడం పత్రికల్లో మనం చూస్తూనే ఉన్నాం. ఒక్కొక్కసారి వీటి ఉద్రిక్తతలకు, వినాశానికి కలవరపడిన ప్రభుత్వాలు కూడా వీటిని నిషేధించడమే సమంజసమని భావిస్తున్నాయి. కాని నేటి కాలం ప్రజాస్వామ్యయుగం. ఏ ఒక్కరో ఇలాంటి నిషేధాజ్ఞల్ని జారీచేయ సాహసించ లేకపోతున్నారు. కాని ఔరంగజేబ్ కాలం వేరు. అతను ఏకచ్ఛత్రాధిపత్యం గల చక్రవర్తి. అతని మాటకు తిరుగులేదు. అందుకని ప్రజల సంక్షేమానికి, ధన మాన ప్రాణాలకు ముప్పుగా పరిగణించిన వాటిని వెంటనే నిషేధించాడు.

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, ప్రత్యేక శాఖలో, అనివార్య కారణాల వల్ల హిందువుల్ని ఆ శాఖల్లో తీసుకోరాదని ఔరంగజేబ్ ఆదేశాలు జారీచేశాడు. దాన్నే ఈ యూరోపియన్ చరిత్రకారులు ఔరంగజేబ్ హిందువుల్ని ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించాడని నిందించారు. ఆంగ్లేయ చరిత్రకారులు ఒక నిర్దిష్ట పథకం ప్రకారం భారత చరిత్రను రూపొందించారని, హిందూ ముస్లింలను దూరం చేయడానికి ఏరికోరి ఇలాంటి సంఘటనల్ని వేలెత్తి చూపారని, గోరంతల్ని కొండంతలుగా చేసారని, ఒక ప్రత్యేక, పరిమిత ఆదేశాన్ని కూడా సర్వసామాన్యమైనదిగా చూపించారని, ఇంకా అక్కడ జరుగనివి, లేనివి కూడా తమ వైపు నుండి జొప్పించారని ఇంతకు ముందే మేము పేర్కొంటూ వచ్చాము. హిందువుల్ని అన్ని ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించాడనే నింద కూడా అలాటిదే. అల్‌ఫిన్‌స్టన్ గారు ఇలా వ్రాశారు : "అధికారులందరికి, నియామకాలు చేయగలిగే వారందరికి, మీ పరిధిలో, మీ అధికారాల్లో నున్న అన్ని స్థానాల్లో, హోదాల్లో హిందువుల్ని నియమించకూడదని, ఈ అన్ని హోదాలపై ముస్లింలను మాత్రమే నియమించాలని అతను ఒక సర్కులర్ జారీ చేశాడు."

అయితే సమకాలీన చరిత్రకారుడు ఖాఫి ఖాన్ ఏం వ్రాశాడో చూడండి :

"సూబేదార్లు, తాలుకా క్రింద పనిచేసే సెక్రటరీలు ఇతర అధికారులు, **ప్రభుత్వ పన్నులు, భూమిశిస్తు వసూలు చేసే** (హోదాలపై) హిందువులు నియమించబడరాదు."[5]

అసలు విషయం ఏమిటంటే ఆ కాలంలో కాయిస్త్ వర్గం వారే అత్యధికంగా ఈ హోదాలపై నియమించబడేవారు. వారు లంచాలు లాగడంలో ప్రసిద్ధిగాంచారు. అందుకని ప్రజల్ని వారి లంచగొండితనం నుండి కాపాడడమే ప్రధాన ఉద్దేశమై ఉండేది తప్ప ధార్మిక పక్షపాతానికి దీనితో ఎలాంటి సంబంధం లేదు. అయితే ఈ ఆదేశాలు కూడా ఎక్కువ రోజులు నడవలేకపోయాయి. ఆ తరువాత ఏం జరిగిందో ఖాఫి ఖాన్ ద్వారానే విందాం :

"ఉన్నతాధికారుల పేషీ నుండి హిందువుల్ని తీసివేయాలనే ఆదేశాలు కఠినంగా పాటించ బడనందువల్ల అవి నిర్వీర్యంగానే ఉండిపోయాయి. కేవలం కొన్ని నగరాల్లో కొంతమంది మాత్రమే తీసివేయబడ్డారు. "ఆ తరువాత దీవాని దఫ్తరానికి (అంటే భూమి శిస్తు వసూలు చేసేశాఖకు) సంబంధించి నియమించబడే పేష్కార్లు, బక్షీలు (అంటే అధికారులు, క్లర్కులు) లో ఒక హిందువు, ఒక ముస్లిం నియమించబడాలని నిర్ణయం జరిగింది.[6]

చూశారా! ఈ యూరోపియన్ చరిత్రకారుని గారడి! ఒక ప్రత్యేక సందర్భంలో ఒక ప్రత్యేక శాఖలో ఏర్పడిన రుగ్మతను దూరం చేయడానికి చేపట్టిన చర్యను, అతనెలా సర్వసామాన్య మైనట్లుగా పేర్కొన్నాడు. ఇలాగే చరిత్రనంతా కలుషితం చేసి ఈ రెండు వర్గాల్ని దూరం చేయడంలో వారు కృతార్థులయ్యారు.

పై సంఘటననే పరిశీలించండి. హిందువుల్లోని ఒక ప్రత్యేక వర్గం వారిలో ఏర్పడిన లంచగొండితనం, ప్రభుత్వ ధనాన్ని మింగేయడం లాంటి దుశ్చర్యలపై నిఘా ఉండాలనే దృష్టితోనే ఆ సవరణ జరిగింది తప్ప, ధార్మిక పక్షపాతంతోనే అది జరిగి ఉంటే ఒక ముస్లింను తోడు కలపడం వల్ల ఒరిగిందేమిటి?

డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ కూడా దీన్ని చక్కగా విశ్లేషించారు :

"మాస్సర్ ఆలంగీరిను అనుసరించి, ఔరంగజేబ్ ఆదేశాన్ని జారీ చేస్తూ ఆర్థిక శాఖ (రెవిన్యూ శాఖ)లో హిందువుల నియామకాన్ని ఆపేశాడు. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే (అప్పటి) ఉద్యోగులు అపహరణం, వడ్డీ, లంచగొండితనానికి అలవాటు పడ్డారు.[7]అయితే హిందువుల నియామకాన్ని స్థంభింపజేయడం వలన ప్రభుత్వ పనుల్లో ఆటంకాలు ఏర్పడసాగాయి. అందుకని ఈ ఆదేశాల్లో సవరణ చేస్తూ, ఆర్థిక శాఖ (రెవిన్యూశాఖ)లో హిందూ-ముస్లింల నియామకాన్ని యాభై యాభై శాతంగా నిర్ణయించడం జరిగింది.[8] ఈ ఆదేశాల్ని నిశితంగా పరిశీలిస్తే తెలిసే ఒక విషయం ఏమిటంటే అంతకుముందు ఈ శాఖలో హిందువుల శాతం ఇంతకన్నా అత్యధికంగానే ఉండేది. సామాన్య పరిస్థితుల్లో ఔరంగజేబ్ హిందూ-ముస్లింల భేదభావాన్ని పాటించేవాడు కాదు. యోగ్యతకే ప్రాధాన్యతనిచ్చేవాడు."[9]

(ఔరంగజేబ్ ఏక్ నయా దృష్టి - డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 33)

ఆ విధంగా ఒక ప్రత్యేక శాఖలో, ప్రత్యేక కారణాల వల్ల, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జారీ చేసిన తాత్కాలిక ఆదేశాల్ని (అవి కూడా తిరిగి సవరించబడ్డాయని

తెలుసుకున్నాం) ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా ఒక నిందగా ఎలా ఉపయోగించారో చూడండి. కాకపోతే ఔరంగజేబ్ పరిపాలనలో 500 మన్సబు మొదలుకొని 7000 మన్సబు కలిగిన మహోన్నత హిందూ నాయకుల జాబితానే ఈ పుస్తకంలో సమర్పించి ఉన్నాము. చివరికి అతని సర్వసైన్యాధ్యక్షుడు (రాజా జైసింగ్) అతని ఆర్థిక శాఖ మంత్రి లేక చీఫ్ సెక్రటరీ (రాయెరాయాన్ రఘునాథ్ ఖత్రి) కూడా హిందువులేకదా! ఈ ఆంగ్లేయ చరిత్రకారులకు, "ఔరంగజేబ్ హిందువుల్ని అన్ని రకాల ఉద్యోగాల నుండి వంచించాడని" రాస్తున్నప్పుడు వారి కళ్ళకు ఈ పేర్లన్నీ కనబడలేదంటే నమ్మశక్యమా!! వారంతా సామాన్య ఉద్యోగులేం కారు. ఆ జాబితాలో సివిల్ ఉన్నతాధికారులూ ఉన్నారు, సైన్యాధికారులు ఉన్నారు, కోటాధిపతులు ఉన్నారు, పట్టణాల, నగరాల, జిల్లాల అధికారులూ ఉన్నారు. ఇవన్నీ అత్యంత కీలకమైన హోదాలు. నమ్మకస్తులకే అప్పగించబడే హోదాలు. ఈ హోదాలన్నీ ఔరంగజేబ్ హిందువులకు అప్పగించాడే. అయినా అతను హిందూ వ్యతిరేకిగా ముద్రపడడం అతని దురదృష్టం కాకుంటే మరేమిటి?

ఈ హిందూ ఉద్యోగులకు సంబంధించి డా. బిషంబర్ నాథ్ పాండే ఇలా తెలిపారు:

"..... బెంగాల్‌లో ఔరంగజేబ్ ద్వారా సుబేదారు (గవర్నరు)గా నియమించబడిన ముర్షిద్ ఖులీఖాన్, తన రెవిన్యూ శాఖకు సంబంధించిన మంత్రులందరినీ, ఉన్నతాధికారు లందరినీ కేవలం హిందువులనే నియమించుకున్నాడు. ఇంకా అతను తన ఈ హిందూ అధికారుల సలహాను అనుసరించే పరిపాలన చేసేవాడు....."(మందిర్ బోల్ ఉఠే (హిందీ) పేజి-22)

ఔరంగజేబ్ దక్కన్‌లో గవర్నరుగా ఉన్నప్పుడు తన చేతి క్రింద పనిచేసే అధికారు లందరినీ మంచి క్రమశిక్షణకు అలవాటు చేశాడు. వారిపట్ల న్యాయంగా, సముచితంగా, గౌరవప్రదంగా ప్రవర్తించేవాడు. అతని వద్ద కొలువు ఉండి, విశ్వాసపాత్రంగా పనిచేసిన వారిని, హిందూ-ముస్లింలనే భేదభావం లేకుండా అందరితో ఒకేవిధంగా ప్రవర్తించేవాడు. ముస్లింలకే కాదు, అవసరం ఏర్పడినప్పుడు, హిందువులకు సైతం తన సహాయాన్ని అందించడంలో, వారిని ఆదుకోవడంలో ఎన్నడూ వెనుకంజవేయలేదు. హిందువైనాసరే, న్యాయం అతని పక్షంలో ఉన్నదని తెలిసినప్పుడు అతనికి గట్టి సమర్థన ఇచ్చేవాడు. వారికోసం సిఫారసు చేసేవాడు. అవసరమనిపిస్తే తండ్రితో, చక్రవర్తితో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, గట్టిగా వాదించిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఉదాహరణకు కొన్నింటిని మేమిక్కడ పేర్కొంటున్నాము.

ఏలచ్‌పూర్‌లో దీవానీకి సంబంధించిన హోదాలో ఒక ఖాళీ ఏర్పడినప్పుడు ఔరంగజేబ్ రావు కరణ్ అనే వ్యక్తిని ప్రతిపాదిస్తూ ఇలా వ్రాశాడు :

"...... ఐదువందల పదాతి, ఐదు వందల అశ్విక దళాల మన్సబును ఇంతకుముందు తీసివేయబడిన రావు కరణ్‌ను ఒకవేళ తిరిగి ఆ మన్సబుపైనే నియమించి "ఏలచ్‌పూర్" బాధ్యతలు అతనికి అప్పగించి, అస్ప.సె.అస్ప (స్పెషల్ గ్రేడ్) అశ్వికుల్ని అతనికిచ్చి అతని మన్సబును పెంచితే సమంజసంగా ఉంటుంది. అంతేకాకుండా ఏలచ్‌పూర్‌ను అతని మన్సబులో

వచ్చిన పెరుగుదల జీతం క్రింద నిర్ణయించవచ్చును. ఈ విధంగా అతని నుండి తీసుకోబడిన పరగణ పోసద్ (బిరార్)కు ప్రత్నామ్నాయమైపోతుంది. ఈ పరగణా నుండి వచ్చే రాబడి నుండి రావు కరణ్ జీతం మినహాయించగా మిగిలే డబ్బు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకిస్తే సముచితంగా ఉంటుంది. (రుఖ్ఆత్ ఆలంగీర్ – లేఖ నెం. 7/63, సంక. స.న. అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 156).

కాని దానికి షాజహాన్ ఏమని సమాధానమిచ్చాడో చూడండి :

“ఏలచ్‌పూర్ బాధ్యతల్ని రావు కరణ్ లాంటి రాజపుత్రునికి అప్పగించడం సముచితం కాదు. ప్రస్తుతానికి ఈ బాధ్యతను అసదుల్లా (తండ్రి రషీద్ ఖాన్) కు అప్పగించాలి. ఆ తరువాత ఈ హోదాను పూర్తిగా నిర్వహించగలిగే స్థోమత గల వ్యక్తికి అప్పగించాలి.” (రుఖ్ఆత్ ఆలంగీరి – లేఖ నెం. 8/64, న.అష్రఫ్ పేజి. 242, అను షమ్స్ పేజి 157)

దానిపై ఔరంగజేబ్ తిరిగి షాజహాన్‌ను ఇలా విన్నవించుకున్నాడు :

“మహాప్రభూ! ఈ సందర్భంలో తమరు దేన్నైతే ప్రతిపాదించారో అదెంతో సముచితమైనది. ఒక విషయపు మూలం (ఆంతర్యం) వరకు ప్రభువులవారు ఎలా చేరుకోగలుగుతారో, జ్ఞానం లేని ఈ విధేయుడు ఎప్పుడు చేరాలి? అయితే విన్నవించుకునే విషయం ఏమిటంటే, ఏలచ్‌పూర్‌కు సంబంధించి దాన్ని కేవలం సస్యశ్యామలం, నివాసయోగ్యంగా చేయడం తప్ప. దాన్ని ఒకరి జాగీరులో ఇవ్వడం తప్ప, ఇంకక్కడ చేసేదేమీ లేదు. అదియునుగాక ఈ అల్పుడు రాజపుత్రుల్ని ఓర్వడనే ఒక అపవాదు కూడా నాపై మోపబడింది. అందుకని రావు కరణ్ మన్సబులో తగ్గింపు జరిగిందని, అతని పునఃనియామకం జరగాల్సి ఉందనే విషయాన్ని విని మరియు చూసి ఉన్నాను గనక తమ సన్నిధిలో ఈ ప్రతిపాదనను సమర్పించాను. (అతని పేరును ప్రతిపాదించడానికి ఒక కారణం నాపైనున్న రాజపుత్రుల్ని పట్టించుకోడనే మచ్చను కాస్త తొలగించుకోవచ్చనే ఆలోచన. (రుఖ్ఆత్ ఆలంగీర్–లేఖ నెం. 8/64, స.న.అష్రఫ్–పేజి 242, అను.షమ్స్ బరేల్వి పేజి157).

ఎంతగా చెప్పుకున్నా షాజహాన్ అతని ప్రతిపాదనను స్వీకరించలేదు. రావ్ కరణ్ యోగ్యతను అంగీకరించలేదు. అయితే ఔరంగజేబ్ నిరుత్సాహపడలేదు. జవార్ యుద్ధ సమయంలో చక్రవర్తి అనుమతితో అతన్ని సేనాధిపతిగా నియమించి, జవార్ యుద్ధం గెలిచి, అతన్ని జవార్ విజేతగా చక్రవర్తి ముందు నిలబెట్టాడు. అంతేకాకుండా చక్రవర్తి తరఫున ‘జవార్’ను అతనికి జాగీరుగా ఇప్పించాడు. (రుఖ్ఆత్ ఆలంగీర్– లేఖ నెం. 1/81, 2/82, 3/83,– సంక.స.న. అష్రఫ్ – పేజి 161,162, అను. షమ్స్ బరేల్వి, పేజి 183, 184, 185) (India divided by Dr. Rajendra Prasad, page 34-40).

అంతేకాకుండా బీకనీర్‌లోనున్న అతని జాగీరు విషయంగా అతను ఇబ్బంది పడుతున్నప్పుడు, తననీ కష్టం నుండి గట్టెక్కించడానికి చక్రవర్తుల వారికి సిఫారసు చేయాల్సిందిగా రావ్ కరణ్ విన్నవించుకున్నప్పుడు ఔరంగజేబ్ తన తండ్రి, చక్రవర్తికి ఒక లేఖ ద్వారా ఇలా సిఫారసు చేశాడు :

"ప్రభువుల వారికి పాదాభివందనాలు! రావు కరణ్ రాజ కుటుంబం ద్వారా పోషించబడిన వాడు. అతని జీవన భుక్తి అంతా కూడా అతని సొంతూరులో గల జాగీరుపై ఆధారపడి ఉంది. ఇటీవలి కాలంలోనే సుబుల్ సింగ్ బహాలీకి పవిత్ర దర్బారు నుండి జైసల్మీర్ జాగీరు ప్రసాదించబడింది. బీకనీర్ మరియు జైసల్మీర్ సరిహద్దులు పరస్పరం కలిసిపోయి ఉన్నాయి కనుక సరిహద్దు కారణంగా ఈ రెండు జాగీర్ల మధ్య వివాదం మొదలయింది. ప్రస్తుతం సుబుల్ సింగ్, రావ్ కరణ్‌తో కొట్లాటకు, పోరాటానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ వివాదం కారణంగా రావు కరణ్ జమీందార్ పరిస్థితి అత్యంతగా చెడిపోయింది. పైనుదహరించిన జమీందారును తన హద్దుల్ని అతిక్రమించరాదని, ఇక ముందు ఎలాంటి సరిహద్దు జగడాలకు పాల్పడకూడదని ప్రభువుల వారు ఆదేశాల్ని జారీ చేసినట్లయితే అది రావు కరణ్‌పై అనుగ్రహాలు కురిపించినట్లవు తుంది, ఇంకా ఈ జగడం, ఈ తంటా సమసిపోతుంది ...." (రుఖ్ఆత్ ఆలంగీర్-లేఖ నెం. 7/93, సంక. స.న. అష్రఫ్- అను. షమ్స్ బరేల్వి, పేజి 199) (షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖలు-దక్కన్ గవర్నర్‌గా)

అతని కొలువులోనున్న నర్సింగ్ దాస్ గురించి ఇలా సిఫారసు చేశాడు :

"అసీరు" కోటాధిపతి అయిన నర్సింగ్ దాస్ మన (మొగలు) దర్బారు సంరక్షణలో పెరిగి, పోషించబడినవాడు (ఖానాజాద్). ఇంకా నియమనిబంధనల ప్రకారం రాజ్యసేవలో నిమగ్నమై ఉన్నాడు. అతని స్వస్థలంలోనే జాగీర్లు పొంది ఉన్నాడు. అయితే ప్రస్తుతము ఆ జాగీర్లను (దక్కన్ జాగీర్లతో) మార్చడం జరిగింది. నిజానికి దక్కన్ జాగీర్ల పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలియని విషయమేమీ కాదు. ఉత్తర భారతదేశ ప్రాంతాలలోని, అతని స్వస్థలంలో వంశపరంగా వస్తున్న పరగణ రదాత్ జాగీర్లను దక్కన్ ప్రాంతాలలోని (జాగీర్లతో) మార్చడం జరిగిందని అతని ప్రతినిధి (వకీలు) మహోన్నత దర్బారులో అర్జీ సమర్పించుకున్నాడు. ప్రస్తుతం మార్పు చేసిన జాగీర్ల ద్వారా మునుపటి రాబడి రాదు, అంతేకాకుండా జీతం కూడా సరిపడదని విన్నవించుకున్నాడు. అందుకని తన పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, ఈ విషయంగా తనపై దయ తలచాలని (అంటే మునుపటి జాగీర్లే యధాతథంగా ఉండనివ్వాలని, బదలాయించరాదని) ప్రాధేయపడుతున్నాడు. కనుక అతని విన్నపాన్ని ఆలకించి, అతని కష్టాన్ని దూరం చేసినట్లయితే, లగ్న మనస్సుతో సేవలు అందిస్తాడు. అతని విషయంలో సంభవమైన

అన్ని ప్రయత్నాలు చేస్తారని ఆశిస్తున్నాను.” (ఆదాబె ఆలంగీరి-లేఖ నెం.222, ముఖద్దమ రుఖ్ఆత్ .... స.న. అష్రఫ్, పేజి 242)

ప్రధానమంత్రి జాఫర్ ఖాన్‌కు ఒక లేఖ వ్రాస్తూ తన ఇంకొక అధికారి మహేశ్ దాస్ రాథోర్ గురించి ఇలా సిఫారసు చేశాడు :

“మహేష్ దాస్ రాథోడ్ విషయంగా ప్రభువుల వారి సన్నిధిలో వ్రాసినదంతా తమరికి తెలిసే ఉంటుంది. ప్రభువుల వారి ఆదేశాలకు అనుగుణంగా అతనికి ‘దస్తూరి’ (అనుమతి పత్రం) ఇవ్వడం జరిగింది. దాని ప్రకారం అతను తన సైనిక దళంతో మహోన్నత దర్బారుకు బయలుదేరి దర్శనభాగ్యం పొందాలని ఆదేశించడమైనది. ఇతను సమర్థుడు, మేలైన మనిషి. తాను అందించవలసిన సేవల్లో ఎలాంటి లోపం రానీయడు ... ఇంకా ఇతను (ప్రభువుల వారి) విశ్వాసాన్ని చూరగొంటాడనే నమ్మకముంది. ఈ విషయాలు ప్రభువుల వారి సన్నిధిలోకి చేరవేయడం జరిగింది. ఈ విధంగానే సందర్భం ఏర్పడినప్పుడల్లా అర్జీ సమర్పించుకోవడం జరుగుతుంది.” (ఆదాబె ఆలంగీరి, లేఖ నెం.332, (ముఖద్దమ రుఖ్ఆత్ .... స.న. అష్రఫ్, పేజి 243)

దక్కన్‌లో అతని కొలువులో ఉన్న ఒక హిందూ అధికారి రాజా సంగ్రామ్ మరణిస్తాడు. అతని ఆస్తి, జాగీరుకు సంబంధించి తన ఇష్టానుసారం ప్రవర్తించడు. దానికి బదులు ఇతర హిందూ అధికారులతో సంప్రదిస్తాడు. వారు ఇచ్చిన సలహామేరకు డిల్లీకి ఇలా సిఫారసు లేఖ వ్రాశాడు :

“మహారాజశ్రీ ! (జామూర్, మాంజరూద్ ఫౌజ్‌దారి హోదాపై నియుక్తుడై ఉన్న) జమ్మూక జమీందారు రాణా సంగ్రామ్ మరణించాడు. సారంగధర్ అనబడే అతని మనుమడు యోగ్యుడు మరియు విశ్వసనీయుడు. రాణా సంగ్రామ్ జ్యేష్ఠ పుత్రుడు అంతకుముందే మరణించి ఉన్నాడు. ఈ సారంగ్‌ధర్ అతని కుమారుడే. సారంగధర్ బాబాయి రావ్ కరణ్ ఇంకా ఇక్కడి ఇతర రాజపుత్ర నాయకులు, సారంగధరే తన తాతగారి వారసుడు కావాలనే దానిపై ఏకాభిప్రాయులై ఉన్నారు. ఒకవేళ పవిత్ర దర్బారు నుండి పైనుదహరించిన రాజు గద్దె సారంగధర్‌కు ప్రసాదిస్తే, అతని మరియు అతని ఇతర బాబాయిల మన్సబులు కూడా నిర్ణయిస్తే వీరంతా తమ సంబంధిత సేవల్ని మనఃపూర్వకంగా నిర్వర్తిస్తారు. ఇంకా వారి సైన్యాలు కూడా చెదిరిపోవు.” (రుఖ్ఆత్ ఆలంగీర్ - లేఖ నెం11/67, సంక. స.న.అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 162)

ఇదేవిధంగా రాయ్‌చూర్ జమీందారీ గురించి వివాదం ఏర్పడుతుంది. దాని నిజమైన వారసుడైన హయాత్ సింగ్‌ను అతని వంశంవారు దాన్నుండి వంచించ ప్రయత్నిస్తారు. అతనొచ్చి ఔరంగజేబ్‌ను కలిసి తన గోడును వెళ్ళబోసుకొని సిఫారసు కోసం విన్నవించుకుం టాడు. అతని పక్షాన్ని సమర్థిస్తూ డిల్లీకి ఇలా సిఫారసు లేఖ రాశాడు.

"మహోన్నత దర్బారులో వకీలు ద్వారా సమర్పించబడిన అర్జీ ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, హయాత్ సింగ్ (అజ్‌మేరి సింగ్ ఇతనికి స్వంత బాబాయి) పవిత్ర దర్బారుకు హాజరై తాను ఈ ప్రాంతానికి ప్రాచీన జమీందారు అయినట్లు విన్నవించుకున్నాడు. రాయ్‌చూర్ పరిసర ప్రాంతాలు కేటాయించబడినట్లు, ఇంతవరకు అమలుకాని సంపూర్ణ పట్టా మొదలగు కాగితాలు సమర్పించాడు. ఈ ప్రాంతానికి శాశ్వత జమీందారుగా (తన బాబాయి అయిన) అజ్‌మేరి సింగ్ ఉంటూ వచ్చాడని విన్నవించుకున్నాడు. అతని గౌరవోన్నతుల్లో పెంపుదల కోసమని ఇది ప్రసాదించబడి ఉన్నది. ఈ కారణంగానే అక్కడి జమీందారీ హయాత్ సింగ్‌కు వారసత్వంలో వచ్చింది. ఇంకా అతనితో ఎలాంటి పొరపాటు కూడా జరిగి ఉండలేదు. అందుకని ఒకవేళ అతని మన్సబులో పెంపుదల చేసి, అమలుకాని ఆ పట్టాల్ని (బెనామి పట్టా) అతని జీతం క్రింద నిర్ణయిస్తే, అతనికి అనుకూలంగానూ, సముచితంగానూ ఉంటుంది." (ఆదాబె ఆలంగీరి – లేఖ నెం. 229– ముఖద్దమ రుఖ్ఆత్ .... స.న. అష్రఫ్, పేజి 244)

కొన్ని రోజులు గడిచిన తరువాత ప్రభుత్వాధికారులు అనవసరంగా, కారణం లేకుండానే తన జాగీరు నుండి అతన్ని తీసివేసినప్పుడు, అతను తిరిగి ఔరంగజేబ్‌ను ఆశ్రయిస్తాడు. ఔరంగజేబ్ ఈ అన్యాయం గురించి ప్రధానమంత్రికి లేఖ వ్రాస్తూ ఇలా పేర్కొంటాడు :

"మహాప్రభువుల సన్నిధిలో సేవ, విశ్వాసపాత్రత కారణంగా హయాత్ సింగ్ గుర్తింపు పొందినవాడనే విషయం తమరికి తెలియనిది కాదు. అతనికి ఉండిన పరగణ ప్రభుత్వ ప్రతినిధులు జప్తు చేసుకోకముందు అతనక్కడ సుఖ సమృద్ధివంతమైన జీవితం గడుతుండేవాడు. కాని ఇప్పుడు అసూయపరుల ద్వేషం కారణంగాను, అధికారుల దుర్వర్తన కారణంగాను స్వస్థలాన్ని పోగొట్టుకుని మా సన్నిధిలోకి వచ్చాడు. ఈ జాగీరు అతనికి వారసత్వపరంగా వస్తోంది. కనుక అది అతనికే చెందవలసి ఉంటుంది. లేకపోతే అతను అత్యంతగా బాధపడతాడు. కావున అతని జాగీరు యధాతథంగా అతనికుండేటట్లు సముచిత చర్యలు గైకొంటారని మనవి చేస్తున్నాను." (ఆదాబె ఆలంగీరి – లేఖ నెం. 242, ముఖద్దమ రుఖ్ఆత్ .... స.న. అష్రఫ్, పేజి 244)

ఈ సిఫారసులో ఔరంగజేబ్ కృతార్థుడవుతాడు. హయాత్ సింగ్ కొన్ని రోజులు ఔరంగజేబ్ వద్ద గడిపి, తన జాగీరుకు వెళ్ళిపోదలచినప్పుడు (డిప్యూటి గవర్నరు లేక ప్రాంతీయ ఉన్నతాధికారిగా) ఆ ప్రాంతం ఎవరికైతే ప్రసాదించబడిందో, ఆ అధికారికి, అనగా అలీ మర్దాన్ ఖాన్‌కు ఈ హయాత్ సింగ్ గురించి సిఫారసు చేస్తూ ఇలా లేఖ వ్రాశాడు :

"మీ పట్ల హయాత్ సింగ్ జమీందారుకు గల విశ్వసనీయత మీకు తెలియంది కాదు. పైన పేర్కొన్న పరగణాలు ప్రభుత్వ ప్రతినిధులు స్వాధీనం చేసుకోక ముందు అతనక్కడ సుఖశాంతులతో జీవితం గడిపేవాడు. ఇంతకు ముందు కొందరు ప్రభుత్వ అధికారుల దుర్వర్తనం, ఈర్ష్యాద్వేషాల కారణంగా తన స్వస్థలాన్ని పోగొట్టుకొని ప్రభువుల వారి దర్బారును

ఆశ్రయించాడు. (అతని మొర ఆలకించబడింది). ఇక ఇప్పుడు తిరిగి అదే పాత తరహాలో వారసత్వపరంగా వస్తున్న జమీందారీ వృత్తిని కాపాడుకోవాలని, అక్కడ తన సంబంధిత ప్రాంతాల నిర్వహణ చేపట్టాలని అభిలషిస్తున్నాడు.

మీరు నా విషయంలో శ్రేయోభిలాషులనేది నాకు తెలుసు. ఇంకా పవిత్ర దర్బారుతో సంబంధం, విశ్వాస పాత్రత కలిగినవారిని మీరు నిర్లక్ష్యం చేయరని కూడా తెలుసు. ఇక ఇతని సైన్యం, దాని అవసరాలు, రూపురేఖలు, దాని నిర్వహణ మొదలగు వాటి గురించి వ్రాయడం అనవసరంగా భావిస్తున్నాను. ప్రతి విషయంలో ఏదైతే వ్రాయబడుతుందో, అది నెరవేరుతుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతానికి చెందిన ఉన్నతాధికారులు అన్ని పరిస్థితుల్లో ఇతని పట్ల మేలుగా, సత్ప్రవర్తనతో మెలగాలని, లెక్కపత్రాల (రాబడి ఖర్చుల) విషయంలో అతనికి సహాయకులుగా, శ్రేయోభిలాషులుగా వ్యవహరించాలని వారికి కఠినమైన ఆదేశాలు జారీ చేయబడతాయని ఆశిస్తున్నాను." (ఆదాబె ఆలంగీరి, లేఖ నెం.327, ముఖద్దమ రుఖ్ఆత్ .... స.న. అష్రఫ్, పేజి 245)

## కర్ణాటక రాజు రంగరాయలు వ్యవహారం

ఇంకొక దృష్టాంతాన్ని పరిశీలించండి. కర్ణాటకు చెందిన రాజు శ్రీరంగరాయలు ప్రాంతంపై గోల్కొండ మరియు బీజాపూర్ పాలకులు దండయాత్ర జరిపి, అతని రాజ్యంలోని ఓ పెద్ద ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. వారిని ఎదుర్కొనే శక్తిలేని రంగరాయలు, నిస్సహాయ స్థితిలో శ్రీనివాస్ అనే తన ప్రతినిధిని ఔరంగజేబ్ వద్దకు పంపి, తనపై జరిగిన అన్యాయాన్ని తెలిపి, గోల్కొండ, బీజాపూర్ వారి దౌర్జన్యం నుండి తనను కాపాడాలని, ప్రతిఫలంగా పెద్ద మొత్తంలో నజరానానే గాక, ప్రతి సంవత్సరం కప్పం కూడా చెల్లిస్తానని విన్నవించుకున్నాడు. ఔరంగజేబ్ రంగరాయల్ని ఓదార్చుదానికి, ధైర్యం చెప్పడానికి, అక్కడి పరిస్థితుల్ని అధ్యయనం చేయడానికి తన ప్రతినిధిని పంపుతాడు. వేరొకవైపు షాజహాన్‌కు లేఖ వ్రాస్తూ దక్కన్ పాలకులు, కర్ణాటక ప్రాంతాల్ని కొల్లగొట్టడం, ఆక్రమించుకోవడం మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వారిని హెచ్చరిస్తూ లేఖ వ్రాయాలని విన్నవించుకున్నాడు. మొదట్లో షాజహాన్, ఔరంగజేబ్ ప్రతిపాదనల్ని అంగీకరించి, రంగరాయలుకు సహాయపడడానికే అంగీకరించాడు. కాని ఈ పరిస్థితుల్ని గమనించిన దక్కన్ పాలకులు, పైపైనే దారా షికూహ్ ద్వారా షాజహాన్‌ను మచ్చిక చేసుకున్నారు. ఈ విధంగా ఔరంగజేబ్ తన మాటను నిలబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. దాని వివరాలు ఏమిటో మీరు కూడా ఒకసారి చూడండి :

## షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖ :

"...... కర్నాటకలోని గొప్ప జమీందారైన (మొగలు పాలకులు సామంతరాజుల్ని, చిన్నపాలకుల్ని జాగీర్దారు, జమీందారులనే పేర్కొనేవారు) శ్రీరంగరాయలు (రామరాయల మనుమడు) ఈ ప్రాంతంలో తన ధన సంపదల కారణంగా ప్రఖ్యాతిగాంచి యున్నాడు. కొన్ని

రోజుల క్రితం శ్రీనివాస్ అనే తన బ్రాహ్మణ ఉద్యోగిని ఒక గజరాజుతో సహా నా వద్దకు పంపుతూ "కొన్నిరోజుల నుండి ప్రభువులవారి ప్రసన్నత తమపై ఉందనే ధీమాతో ఆదిల్ ఖాన్ (బీజాపూర్), ఖుత్బుల్ ముల్క్ (గోల్కొండ) లు కర్నాటక ప్రాంతాలపై దాడులు జరిపి గొప్ప పరిమాణంలో వజ్రవైఢూర్యాలు, నగదు ఇంకా పెద్ద సంఖ్యలో గజరాజుల్ని దోచుకొని పోయారని, ఇంకా నా ఈ చిన్న ప్రాంతం నుండి నన్ను గెంటేసి ఆక్రమించుకోవాలని, నన్ను నామరూపా ల్లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారని" విన్నవించుకున్నాడు.

ప్రభువుల ఆశీర్వాద సహకారాలు లేనిది ఈ దక్కన్ పరిపాలకులకు ఇంతటి ధైర్య సాహసాలు లేవనేది లోకమంతటికీ తెలుసు. కనుక శ్రీ రంగరాయలు కోరేదేమంటే ప్రభువులవారు అతని ప్రాంతాన్ని కూడా సామ్రాజ్య భాగంగా గుర్తించి అతన్ని తమ రక్షణలోకి తీసుకోవాలని, ఇంకా ఈ దక్కన్ పాలకుల పూర్వీకులు కర్నాటకకు చెందిన ఏ సరిహద్దులనైతే అంగీకరించారో వాటిని అతిక్రమించకుండా హెచ్చరించాలని, ప్రభువుల వారి ఈ దయ, కరుణాకటాక్షాలకు కృతజ్ఞతాపూర్వకంగా సమర్పించుకోవడానికి 50 లక్షల హూన్లు (నాణెం) 200 ఏనుగులు, అత్యంత విలువైన వజ్ర వైఢూర్యాలు జమ చేసి పెట్టానని విన్నవించు కున్నాడు. ఇంకా ఇక ముందు ప్రతి సంవత్సరం ఇంతకన్నా ఎన్నో రెట్లు అధికంగా ప్రభువుల వారికి పేష్‌కష్ (కప్పం) సమర్పించుకుంటానని విన్నవించుకున్నాడు. ఇంకా చక్రవర్తుల వారు తన ఈ విన్నపాన్ని ఆలకించారనే రాజాజ్ఞ (ఫర్మాన్) ముట్టగానే తనూ, తన కుమారులు, ఇతర బంధుమిత్రులతో సహా తమరి పవిత్ర హస్తాలపై ఇస్లాం స్వీకరించి ఇహపరాల సాఫల్యాన్ని పొందుతానని కూడా విన్నవించుకున్నాడు." – కనుక ప్రభువుల వారు శ్రీరంగరాయలుపై కరుణాకటాక్షాల్ని ప్రసరిస్తూ అతని విన్నపాన్ని స్వీకరిస్తే దీని ద్వారా ఇహం, పరం రెండు రకాల లాభాలు చేకూరుతాయి. – ఏదేమైనప్పటికీ ప్రభువులవారి సలహా, అభిప్రాయాలే సముచితం, సమంజసమై ఉంటాయి. కనుక ఈ విధేయులకు అదే శిరోధార్యం." (రుఖ్ఆత్ ఆలంగీర్ – లేఖ నెం. 4/84, సం.స.న. అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 185, 186)

**చక్రవర్తి షాజహాన్ ప్రత్యుత్తరం :**

"కర్ణాటక పాలకుని అభ్యర్థన మేరకు దక్కన్ పాలకుల పేర వారు (అనగా ఆదిల్ ఖాన్, ఖుతుబుల్ ముల్క్‌లు) కర్ణాటక పాలకునితో ఘర్షణపడరాదని, ఇంకా అతని రాజ్యంలోని ఏ చిన్న ప్రాంతాన్ని కూడా తమ అధీనంలోకి తీసుకోరాదని ఫర్మాన్లు జారీచేయబడ్డాయి. ఈ ఫర్మానాల నకళ్లు నీకు కూడా పంపిస్తున్నాము. కాని నేటికి రెండున్నర సంవత్సరాల క్రితం కూడా రానారావు పేరుగల ఒక వ్యక్తి మా వద్దకు, ప్రధానామాత్యుని వద్దకు వచ్చి తాను కర్ణాటక పాలకుని దూతగా చెప్పుకుంటూ, నీవు లేఖలో పేర్కొన్న (కప్పం పేష్‌కష్ మొదలు గాగల) విషయాలే అప్పుడు కూడా చెప్పుకొచ్చాడు. అయితే అవన్నీ వట్టి బూటకమని అప్పట్లోనే తేలిపోయింది. అందుకని ప్రస్తుతం నీ వద్దకు వచ్చిన దూత అదే మనిషైతే కాదు కదా అనేది

నిర్ధారణ చేసుకోవాలి. అలాకాక ఇప్పుడొచ్చిన మనిషి నిజంగానే రంగరాయలు దూత అయితే, అతను చెప్పే మాటలన్నీ నిజమే. రంగరాయలు అంగీకరించే పంపాడా అనేది నిర్ధారణ చేసుకోవడానికి నమ్మకమున్న నీ సేవకున్ని ఒకన్ని రంగరాయలు వద్దకు పంపి వాస్తవాలు తెలుసుకొని మాకు తెలపాలి. - అప్పుడే దక్కన్ పాలకులకు మరిన్ని ఫర్మానాలు జారీచేయ బడతాయి .... " (రుఖ్అత్ ఆలంగీర్ లేఖ. నెం. 3/85, ముఖద్దమ రుఖ్అత్, స.న. అష్రఫ్, పేజి 270, షమ్స్ పే. 187).

**ఔరంగజేబ్ సమాధానం :**

"..... ప్రభువుల వారు ఏ రానారావు గురించి పేర్కొన్నారో, ఆ వ్యక్తి ఇంతకు ముందు కూడా నా వద్దకు రెండు మూడు సార్లు వచ్చి వెళ్ళాడు. ఏలికవారు గమనించినట్లుగా ఆ మనిషి విశ్వసించదగిన మనిషిగా కనిపించలేదు. అందుకే అతను సమర్పించిన ప్రతిపాదనను దర్బారుకు పంప సాహసించలేకపోయాను .... కాని ప్రస్తుతం వచ్చిన శ్రీనివాస్ అనే బ్రాహ్మణ దూత, శ్రీరంగరాయలు అంతరంగీకుల్లోనివాడు. ఇతను శ్రీరంగరాయల అర్జీతో పాటుగా ఒక గజ రాజాన్ని కానుకగా తీసుకొని, నేనింతకుముందు తెలిపిన ప్రతిపాదనలతో గోల్కొండ గుండా నా వద్దకు వచ్చాడు. ఇంకా ఇంతకు ముందు నేను తమరికి సమర్పించిన విధంగా సర్వ విషయాలు విన్నవించుకున్నాడు. ఇతని మీద నమ్మకం ఏర్పడిన తరువాతనే ఈ విషయాలన్నీ తమరికి విన్నవించడం జరిగింది. అయినప్పటికీ, ఆ రాజ్యం యొక్క స్థితిగతులు సరిగా అంచనా వేయడానికి, శ్రీరంగరాయలు అసలు ఉద్దేశం ఏమిటో, అతని విన్నపాల వాగ్దానాల వాస్తవికత ఏమిటో తెలుసుకోవడానికి తమరి ఆదేశానుసారం అబ్దుల్ మాబూద్ నయినా లేక ఇంకెవరినైనా కర్ణాటకకు పంపిస్తున్నాను. అయితే ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే, కర్ణాటక జాగీర్దారు (పాలకుడు) ఇస్లాం స్వీకరిస్తున్నాడని, ఈ విధంగా చక్రవర్తుల వారి విధేయుల్లో చేరిపోతున్నాడని (ఈ విషయంగా దర్బారులో విన్నవించుకున్నాడని) తెలియగానే ఈ దక్కన్ పాలకులు, తమ పేర చక్రవర్తుల వారి రాజ ఫర్మాన్లు తమకు చేరకముందే, శ్రీరంగరాయల అధీనంలో ఉన్న ఆ కొంచెం ప్రాంతాన్ని కూడా విశ్వప్రయత్నం చేసి ఆక్రమించుకోవాలని ఇంతకు ముందే కర్ణాటక సరిహద్దులపై నున్న తమ సైన్యాలకు పురమాయించారు. నేను పంపించే దూత కర్ణాటక వెళ్ళి అక్కడి పరిస్థితులు తెలుసుకొని, తమరికి తెలిపి తమరు దక్కన్ రాజుల పేరుమీద ఫర్మాన్లు జారీచేసేలోగానే, శ్రీరంగరాయలు పని సమాప్తమయ్యేట్లుంది. అలాగే గనక జరిగిపోతే, దాన్ని సవరించడం కష్టతరమై పోతుంది. అందుకని ఒకవేళ తమరు అనుమతించినట్లయితే, నా నమ్మకస్తుడైన నాయకుడొకణ్ని కర్ణాటకకు పంపిస్తాను. ఈ విధంగా దక్కన్ పాలకులు శ్రీరంగరాయలు జాగీరుపై దాడికి పాల్పడకుండా ఆగిపోతారు. (భయపడిపోతారు). నా దృష్టిలో ఇదెంతో సమంజసమనిపిస్తుంది - అయినా ప్రభువుల వారి అభిప్రాయానికి, నిర్ణయానికే ప్రాధాన్యత ఉంటుంది. (రుఖ్అత్ ఆలంగీర్, లేఖ నెం. 3/85, స.న. అష్రఫ్, పే. 270, 271, అను- షమ్స్ బరేల్వీ పే.187, 188).

## ఔరంగజేబ్ పేర షాజహాన్ లేఖ

"...... కర్ణాటక రాజు వద్దకు నీ విశ్వసనీయుడైన నాయకుణ్ణి పంపించడం సమంజసం కాదు. దానికి బదులు నీవు ఆదిల్ ఖాన్ మరియు ఖుతుబుల్ ముల్క్‌లను బెదిరించి, భయపెట్టి అత్యధిక పరిమాణంలో అత్యంత విలువైన పేష్‌కష్ (నజరానా, కప్పం, ధనం) మా కోసమున్నూ ఇంకా స్వయంగా నీ కోసం కూడా సేకరించాలి." (రుఖ్‌ఆత్ ఆలంగీర్ లేఖ నెం. 3/86, స.న. అష్రఫ్, పే. 270, 271, షమ్స్ పే.188).

## ఔరంగజేబ్ జవాబు :

విధేయుడు ప్రభువులవారి సన్నిధిలో విన్నవించుకునేదేమనగా తమరు ఈ లేఖలో (పైన పేర్కొన్న లేఖలోని విషయాల్ని ప్రస్తావిస్తూ) ఇలా వ్రాశాడు :

"మహాప్రభూ! కర్ణాటక రాజు ఇస్లాం స్వీకరిస్తాననే కోరికతో పాటుగా ఒక గొప్ప పేష్‌కష్ (నజరానా, కప్పం) కూడా సమర్పించుకుంటానని వాగ్దానం చేశాడు. అతను తన ఈ ఆకాంక్షను పదే పదే దృఢంగా పునరావృతం చేశాడు. (కాని అతని విన్నపం ఆలకించబడలేదు). కర్ణాటకలోని అత్యంత విలువైన రాళ్ళు, ఖనిజాల కోసం ప్రఖ్యాతిగాంచిన అత్యధిక ప్రాంతాల్ని ఈ దక్కన్ పాలకులు ప్రస్తుతం తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అక్కడి నుండి దోచుకోబడిన సంపద నుండి ఒక పెద్ద లేక విలువైన పేష్‌కష్ (నజరానా) ను కూడా ప్రభువుల వారికి సమర్పించుకోలేదు. వారు ఇలాంటి పేష్‌కష్‌ను సమర్పించబోరని అనిపిస్తున్నది ఈ కారణంగానే ఇక్కడి పరిస్థితులన్నీ విధేయుడు ఇంతకు ముందే ప్రభువుల వారికి తెలిపి ఉన్నాడు. "ఇక్కడి ప్రభుత్వాధికారుల్లో నుండి ఎవరైనా ఒక నమ్మకస్థుణ్ణి కర్ణాటక రాజ్య పరిస్థితుల్ని కూలంకషంగా తెలుసుకోవడానికి నియమించండ"ని ప్రభువుల వారి ఆదేశం అందిన వెంటనే, దక్కన్‌లోని ఈ పాలకులు ప్రత్యేకించి ఆదిల్ ఖాన్, కర్ణాటక పాలకుడు దర్బారుతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం, నా వద్దకు అతని ప్రత్యేక దూత రావడం తెలుసుకున్న తరువాత తప్పకుండా ఏదో చేస్తాడని కర్ణాటకను నాశనం చేస్తాడని నేను ముందే అనుమానించాను. నేను అనుమానించినట్లే ఆదిల్ ఖాన్ కర్ణాటకకు చెందిన అత్యంత మేల్తరమైన 'ఏలోర్' కోటను, కేవలం కొద్దిరోజుల క్రితమే ఆక్రమించుకొని తన స్వాధీనంలోకి తీసుకున్నాడు. ఇంకా శ్రీరంగరాయలు తమరి పేష్‌కష్ కోసం జమచేసి ఉంచిన గజ రాజుల్ని (ఏనుగుల్ని) కూడా స్వాధీనం చేసుకొని, అతన్ని పూర్తిగా దరిద్రునిగా మార్చాలని చూస్తున్నాడు. ప్రభువులవారు అతనిపై (ఆదిల్ షా పై) చూపిస్తున్న దయానుగ్రహాల ఆధారంగా అతనీ చేష్టలకు పాల్పడుతున్నాడు. విధిగా ఆచరించి తీరాలనే ఫర్మానాలు అతని పేరుపై రానంత వరకు, కేవలం మాటలు, హెచ్చరికలతో అతను దారికి వచ్చేట్లు కనిపించడం లేదు. కనుకనే దర్బారు నుండి ఒక నాయకుణ్ణి కర్ణాటకకు పంపాలని తమరికి నేను ఇంతకు ముందు విన్నవించుకున్నది దీనికోసమే. ఈ విధంగా దర్బారు నుండి కర్ణాటకకు సహాయం అందబోతుందని తెలిసి, ఆదిల్ ఖాన్, ఖుతుబుల్ ముల్క్ బెదిరిపోతారు. లేకపోతే

ప్రస్తుత పరిస్థితుల్లో వారు (అదనపు) పేష్‌కష్ (నజరానా, కప్పం) సమర్పించడానికి ఏ విధంగాను సిద్ధంగా లేరు ....... " (రుఖ్ఆత్ ఆలంగీర్ - లేఖ నెం. 3/86, స.న. అ్రఫ్, పే. 270, 271, షమ్స్, పే.188 - 189)

దక్కన్ గవర్నరు ఔరంగజేబ్ మధ్యవర్తిత్వంతో శ్రీరంగరాయలు దర్బారుతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడని తెలియగానే ఈ దక్కన్ పాలకులు, ప్రత్యేకించి ఆదిల్ ఖాన్ (షా) తన రాయబారి ద్వారా దారా షికూహ్‌ను మచ్చిక చేసుకుంటాడు. ప్రతి విషయంలో ఔరంగజేబ్‌ను కించపరచడమే, అవమానించడమే తన లక్ష్యంగా పెట్టుకున్న దారా షికూహ్, చక్రవర్తి (తండ్రి) పై ప్రభావితమై శ్రీరంగరాయలుకు సహాయమందించ కూడదని, దానికి బదులు దక్కన్ పాలకులకు అవకాశం ఇస్తే వారు శ్రీరంగరాయలును కొల్లగొట్టి, పెద్ద మొత్తంలో తమకు అదనపు కప్పం, పేష్‌కష్, నజరానాలు సమర్పిస్తారని నమ్మిస్తాడు. అనుభవజ్ఞుడు అయినప్పటికీ షాజహాన్ ప్రియపుత్రుని ప్రేమలో పడి, న్యాయం, ధర్మాన్ని తుంగలోతొక్కి, కనీసం తాను చేసిన వాగ్దానాన్ని కూడా నిలబెట్టుకోకుండా, శ్రీరంగరాయల్ని నిస్సహాయకునిగా విడిచిపెడ్తాడు. అయినా షాజహాన్ మంచివాడే, సచ్ఛీలుడే, శ్రీరంగరాయలు హిందువు అయినా కూడా న్యాయం, సత్యం అతని పక్షాన ఉన్నందున అతనికి సహాయపడడానికి శాయశక్తులా కృషిచేసిన ఔరంగజేబ్ హిందూ వ్యతిరేకి, పరమత ద్వేషి అని ముద్రపడడం ఎంత విచిత్రం! ఇక ఇప్పుడు దక్కన్ పాలకులు ఇస్తామన్న నజరానా (లంచం)ను వసూలుచేయమని ఔరంగజేబ్‌పై షాజహాన్ ఒత్తిడి చేస్తాడు. దర్బారులో తమ సహాయార్థం దారా షికూహ్ ఉన్నాడు గనుక దక్కన్ పాలకులు ఔరంగజేబ్‌ను అసలు పట్టించుకోనే పట్టించుకోరు. ఈ విధంగా ఔరంగజేబ్ (చక్రవర్తి నిషేధం కారణంగా) తన వాగ్దానం ప్రకారం శ్రీరంగరాయలుకు ఎలాంటి సహాయం చేయలేడు. ఇక దక్కన్ పాలకులు అదనపు పేష్‌కష్, నజరానాను ఇవ్వడమూ లేదు. తను చేయని నేరానికి ఔరంగజేబ్ తండ్రి నుండి తిట్లను, దూషణల్ని ఎదుర్కొంటున్నాడు. (పేష్‌కష్/నజరానా వసూలు చేయనందుకు).

ఇంకొక సందర్భము. జఝూర్ సింగ్‌తో జరిగిన యుద్ధం సందర్భంలో మొగలు సేనాని ఖానె దౌరాన్ గోండ్ (నాయకపోల్లు)ల ప్రాంతంలోని దేవ్‌గడ్ రాజుతో సాలుకు లక్ష రూపాయల కప్పం చెల్లిస్తానని ఒప్పందం చేయించుకున్నాడని గడిచిన అధ్యాయాల్లో తెలుసు కున్నాము. కాని దేవ్‌గడ్ ప్రస్తుత పాలకుడు కేసరి సింగ్ అయోగ్యుడు, దుబారాకు అలవాటు పడ్డవాడు. అంతేకాక రాజ్య వ్యవహారాలపై గట్టి పట్టు కూడా లేనివాడు. వీటన్నిటి ఫలితంగా ఆ రాజ్యారాబడి ఎంతగా పడిపోయిందంటే, సాలుసరి కప్పం చెల్లించడమే గగనమైపోయింది. ఈ విధంగా ఎన్నో సంవత్సరాల కప్పం అతను బాకీ పడిపోయాడు. అందుకని, 'చాందా' (చంద్రపూర్) రాజు బాకీబడిన కప్పాన్ని మాఫీ చేసినట్లే, తను బాకీ పడిన కప్పాన్ని కూడా మాఫీ చేయాలని చక్రవర్తిని విన్నవించుకోవడం తప్ప అతనికి గత్యంతరం కనబడలేదు. ఈ ఉద్దేశంతో అతను దక్కన్ గవర్నరు అయిన ఔరంగజేబ్‌ను ఆశ్రయించి, తన వాస్తవ పరిస్థితుల్ని విన్నవించుకున్నాడు.

దానిపై ఔరంగజేబ్ తన ప్రతినిధిని పంపి, అతను చెప్పింది వాస్తవమేనని ధృవీకరించుకున్న తరువాత, “హిందూ వ్యతిరేకి” అయిన ఈ రాకుమారుడు అతని గురించి సిఫారసు చేస్తూ చక్రవర్తికి ఇలా లేఖ వ్రాశాడు :

## షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖ :

“మహాప్రభూ! దేవ్‌గడ్ జమీందారు (రాజు) బాపతు గడిచిన సంవత్సరాల బాకీ పడి ఉన్న కప్పం యొక్క వివరాలు ఇతర చిట్టాల (Statements) ద్వారా తమరికి సమర్పించబడినవి. దేవ్‌గడ్ జమీందారు (రాజు) ప్రభుత్వానికి విధేయుడు, విశ్వాసపాత్రుడు. అతను ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు కప్పం రూపంలో దర్బారుకు చెల్లించాల్సి ఉండేది. కాని అతని జమీందారీ ఆదాయం మునుపటికన్నా బాగా తగ్గిపోయింది. ఇంకా అతనిలో పాత బకాయీలు (Arrears) చెల్లించే స్థోమత లేదు. ప్రభువులవారి దయానుగ్రహాల వల్ల చాందా జమీందారు (రాజు) బాకీ పడి ఉన్న బకాయీలన్నీ మాఫీ చేయబడ్డాయి. దేవ్‌గడ్ జమీందారు కూడా ఇలాగే తన బకాయిలు కూడా మాఫీ చేయబడాలని విన్నవించుకుంటున్నాడు. ఫలితంగా అతనిపైనున్న బరువు కాస్త దిగిపోతుంది. ఇక నుండి ప్రతి సంవత్సరం తన నిర్ణీత కప్పాన్ని క్రమం తప్పకుండా ఖజానాలో జమచేస్తానని అతను వేడుకుంటున్నాడు.” (వేడుకోలు మన్నింపుకు ప్రార్థన) (రుఖ్ఆత్ ఆలంగీర్ – లేఖ నెం.4/60, స.న. అష్రఫ్ – పేజి 253, 254) అను. షమ్స్ బరేల్వి – పే.152,153)

కాని “హిందువులకు శ్రేయోభిలాషి”గా పేర్కొనబడే ఈ చక్రవర్తి, ఔరంగజేబ్ చేసిన సిఫారసులు అంగీకరించకుండా తిరిగి ఇలా లేఖ వ్రాశాడు :

## ఔరంగజేబ్ పేర షాజహాన్ లేఖ :

“...... దేవ్‌గడ్ జమీందారు బాకీ పడిన నజరానా (కప్పం)ను మాఫీ చేయడం అనేది అర్థం లేనిమాట. ఈ జమీందారుపైనే ఖానె దౌరాన్ ఖాన్ అప్పట్లో సైనిక దాడి జరిపి నూట డెబ్బై ఏనుగులు, పెద్ద మొత్తంలో నగదును స్వాధీనపరచుకున్నాడు. ప్రస్తుతం కూడా మేము విన్నట్లు అతని వద్ద రెండు వందలకు పైగా ఏనుగులున్నాయి. ఇంకా వాటిలో “జతా శంకరం” పేరుగల ప్రఖ్యాత మగ ఏనుగు కూడా ఉంది. ప్రస్తుతం దక్కన్‌లోని మన్సబుదారులు ఏ యుద్ధంలోనూ నిమగ్నమైలేరు. అందుకని వర్షాకాలం సమాప్తమైన తరువాత నీవొకవేళ ఇష్టపడినట్లయితే, మా మనుమడు ముహమ్మద్ సుల్తాన్ సారథ్యంలో లేక నీకు విశ్వాసమున్న వేరెవరైనా ఉద్యోగి సారథ్యంలో, అతన్ని దండించడానికి తగిన సైన్యం ఇచ్చి పంపించు. ఈ విధంగా పేరుబడ్డ ఆ ఏనుగుతో పాటు ఇతర ఏనుగులు కూడా అతని నుండి రాబట్టుకోవాలి. ఇంకా బకాయి పడ్డ రొక్కం కూడా అతని నుండి వసూలు చేసుకోవాలి.” (రుఖ్ఆత్ ఆలంగీర్ – లేఖ నెం.1/78, సంక. స.న.అష్రఫ్ పే.254, అను. షమ్స్ బరేల్వి, పేజి 177).

అయితే పరిస్థితుల్ని బాగా ఎరిగినవాడు కనుక ఔరంగజేబ్ అంతటితో ఊరుకొనక, పరిస్థితుల్ని ఇంకా వివరంగా పేర్కొంటూ ఇంకొక లేఖ వ్రాశాడు, అందులో ఈ రాజు గురించి ఇలా సిఫారసు చేశాడు :

## షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖ :

"..... దేవ్‌గడ్ జాగీర్దారు సైన్యాలు చెదిరిపోయిన కారణంగా బుర్‌హాన్‌పూర్ నుండి నా వద్దకు వచ్చాడు. ఇంకా ఇక ముందు చెల్లించవలసివున్న కప్పం సకాలంలో ప్రభువుల వారికి ముట్టజెప్పుతానని వాగ్దానం చేశాడు. ఈ విషయంలో ఇంకా ఏనుగుల సంఖ్య విషయంలో విచారణ కోసం నేనో మనిషిని కూడా పంపించాను .... దివంగత ఖానె దౌరాన్ దాడి జరిపింది ఇతనిపై కాదు, ఇతని తండ్రిపై దాడి జరిపి ఉన్నారు. అప్పుడు అతని (తండ్రి) పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉండేది. ఖానె దౌరాన్ అతని వద్ద నుండి తీసుకున్న ఏనుగులు ఎంతో కాలం నుండి అతను జమచేసినవి. అయితే ప్రస్తుతమున్న ఈ జమీందారు వట్టి దుబారాబోతు. ఈ కారణంగానే దరిద్రుడుగా, శక్తిహీనుడుగా మారిపోయాడు. ఇతను తన జాగీరును సక్రమంగా నిర్వహించక పోవడం వల్ల ఈ స్థితికి చేరుకున్నాడు. ఇట్టి పరిస్థితుల్లో బకాయిపడిన కప్పం వలూసు కోసం అతనిపై సైనిక చర్య గైకొంటే, అతని రాజ్యం నాశనం అవడం తప్ప ఇంకేముంటుంది? అందుకని సంవత్సరానికి నిర్ణీత కప్పం వసూలు చేసుకొని, బకాయిల మాఫీ కోసం తమ సన్నిధిలో సిఫారసు చేశాను.

ఇప్పుడు ఈ విషయంలో తమరు ఏదైతే సెలవిచ్చారో దాన్ని ఆచరించడం నా భాగ్యంగా తలుస్తాను. ఒకవేళ ప్రభువులవారు అతని ప్రాంతాన్ని సామ్రాజ్యంలో కలుపు కోవాలని అభిలషిస్తున్నట్లయితే, నిర్దిష్టమైన, స్పష్టమైన ఆదేశాలివ్వండి. తద్వారా ఈ విధేయుడు ముహమ్మద్ సుల్తాన్ (తనయుడు) ను సముచిత సైన్యాలిచ్చి దేవ్‌గడ్‌కు పంపిస్తాను. ఇంకా రెండు మూడు రోజుల్లోనే అతని జాగీరును లాక్కొని, ఆ ప్రాంతం నుండి అతని నామరూపాల్లేకుండా చేసేస్తాను. ప్రభువులవారి ఉద్దేశం ఇది కాదు, దానికి బదులు బకాయిపడ్డ కప్పం వసూలు చేయడం, ఏనుగుల్ని స్వాధీనం చేసుకోవడమే అయినట్లయితే రాజోద్యోగుల నుండి ఎవరి పేరును ప్రతిపాదిస్తే, కప్పం మరియు ఏనుగుల్ని స్వాధీనపరచుకోవడానికి వారిని పంపించడం జరుగు తుంది ....." (రుఖ్ఆత్ ఆలంగీర్ - లేఖ నెం. 1/78, సంక. స.న. అష్రఫ్ పే. 255, 256. అను. షమ్స్ బరేల్వి పే. 178)

పై విధంగా వ్రాయడమే కాకుండా ఏనుగుల సంఖ్యకు సంబంధించిన వాస్తవాలు తెలిసినవాడు గనక ఇంకిలా వ్రాశాడు :

"..... దేవ్‌గడ్ జమీందారు వచ్చి కలిసిన వెంటనే నాకు నమ్మకస్తుడైన ఒక వ్యక్తిని అక్కడి ఏనుగుల గురించి రహస్య విచారణ జరుపడానికి పంపించాను. నా మనిషి దాదాపు మూడు నెలలు అక్కడ గడిపాడు. అన్ని కోణాల నుండి విచారణ చేశాడు. ఆ జమీందారు వద్ద

14 ఏనుగులకన్నా అధికంగా లేవని అతను విన్నవించాడు. ప్రభూ! నేను అప్పటి విచారణపైనే ఆధారపడకుండా, ఇటీవలే మరికొంత మందిని ఏనుగుల విషయంలోనూ, 'జతా శంకరం' ఏనుగు గురించి కూడా విచారించమని పంపించాను. వారు వాస్తవాల్ని తెలుసుకోవడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తున్నారు. కాని 'జతా శంకరం' ఏనుగు గురించి అక్కడ ఎవరికీ ఏమీ తెలియటం లేదట. దేవ్‌గడ్ ప్రాంతంలోని ఒక కొండపై ఈ పేరుగల ఒక కోట మాత్రం ఉందని ప్రజలు చెబుతున్నారు .... ఇంకొక విషయం తమరికి విన్నవించు కునేదేమిటంటే, దేవ్‌గడ్ జమీందార్ వద్ద గల ఏనుగుల విషయంలో తెలిసివున్న వ్యక్తి, 'జతా శంకరం' ఏనుగు గురించి ప్రభువుల ముందు ప్రశంసించిన వ్యక్తిని, ఈ విధేయుని వద్దకు పంపిస్తే, అతను నా సైన్యాలకు మార్గదర్శకం వహించవచ్చు, ఇంకా ఆ ప్రత్యేక ఏనుగు ఎక్కడున్నదో దాని ఆచూకి తెలిపితే సమంజసంగా ఉంటుంది ....” (రుఖ్ఆత్ ఆలంగీర్ – లేఖ నెం. 1/78, సం. స.న. అష్రఫ్ పే.255,256, అను. షమ్స్ బరేల్వి, పేజి 178–179)

కాని షాజహాన్, ఔరంగజేబ్‌ను ఎప్పుడు విశ్వసించాడని, ఇప్పుడు విశ్వసిస్తాడు. అందుకని ఘాటుగా ఒక లేఖ వ్రాశాడు. అందులో నీవు దేవ్‌గడ్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేయ ఇష్టపడకపోతే, మా ప్రభుత్వాధికారుల్ని, మా సైన్యాల్ని ఈ పనికోసం నియమించుమని ఆదేశించాడు. దానిపై కూడా ఔరంగజేబ్ ఇంకొక లేఖ వ్రాస్తూ ఈ రాజ్యాన్ని జయించడమేమంత కష్టమైన పనికాదని, కాని దాన్ని మన అధీనంలో ఉంచుకోవడానికి అయ్యే ఖర్చులు, దాని రాబడి కన్నా అధికమవుతాయంటూ పేర్కొన్నాడు. అయినా షాజహాన్ దాడికే ఆదేశించాడు. ఇక గత్యంతరం లేక ఔరంగజేబ్ తన సైన్యాన్ని హాది దాద్ ఖాన్, మిర్జా ఖాన్ అనే సైనికాధికారుల సారధ్యంలో, 'దేవ్‌గడ్'కు పంపించాడు. దేవ్‌గడ్ రాజు వద్ద అత్యధిక సంఖ్యలో ఏనుగులున్నాయని, ధనరాసులున్నాయని కబురు అందించిన 'చంద్రాపూర్' రాజును కూడా, ఈసైన్యాలకు మార్గదర్శకంకోసం దక్కన్ పంపించాల్సిందిగా చక్రవర్తికి ఔరంగజేబ్ ఒక లేఖ రాశాడు. 1655, అక్టోబర్ 22న ఈ దాడి ప్రారంభమయింది. హాది దాద్‌ఖాన్, మిర్జా ఖాన్ సారధ్యంలో ఔరంగజేబ్ సైన్యాలు, చక్రవర్తి ఆదేశానుక్రమం “చాందా” రాజు ఈ విధంగా నలువైపుల నుండి విరుచుకుపడిన తరువాత పాపం బలహీనుడైన ఆ రాజు ఏమి చేయగలుగుతాడు? నేరుగా మిర్జా ఖాన్ సేనానిని ఆశ్రయించి, అన్ని షరతుల్ని అంగీకరించాడు. ఇంకా తనకున్న ఏనుగులన్నింటినీ అప్పగించాడు. చివరికి తేలిందేమిటంటే దేవ్‌గడ్ రాజు వద్ద ధనరాసులూ లేవు, రెండు వందల గజరాజులూ లేవు. మహాకష్టంగా ఇరవై ఏనుగులు బయల్పడ్డాయి. తను సూచించిన ప్రకారమే ఫలితం బయటపడిందని ఔరంగజేబ్ చంకలు ఎగిరేసే అవకాశం ఇక్కడ ఎంతైనా ఉంది. కాని అతను అదేమి పేర్కొనకుండా కేవలం వాస్తవాల్ని మాత్రమే షాజహాన్‌కు తెలియపరిచాడు.

అయితే ఔరంగజేబ్ ఇంతటితోనే ఊరుకోక, ఇలాంటి పరిస్థితులు తిరిగి పునరావృతం కాకుండా, ఆ రాజు రక్షణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. మొగలు సరిహద్దులకు ఆనుకొని ఉన్న ఆ రాజ్యపు కొన్ని ప్రాంతాల్ని మొగలు సరిహద్దు అధికారికి సూచిస్తూ, ఆ ప్రాంతపు రాబడి నుండి ప్రతి సంవత్సరం కప్పం వసూలు చేసుకోవాల్సిందిగా ఆదేశించాడు. అంతేకాకుండా ఈ ఏర్పాట్ల గురించి చక్రవర్తికి తెలియపరిచాడు కూడా.

ఇవండీ, హిందూ వ్యతిరేకిగా, వారిని హింసించిన వానిగా ఎవరినైతే అపఖ్యాతి పాల్జేశారో, ఆ ఔరంగజేబే హిందువుల శ్రేయాన్ని కోరుతూ వ్రాసిన లేఖలు, చేసిన పనులు.

సమాజ సంస్కరణ దృష్టితోనే హిందువుల్లో వస్తున్న సతీసహగమనపు ఆచారంపై ప్రతిబంధకాలు ఏర్పరిచాడు. వారి ధర్మంలో, వారి ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం అతనికి ఇష్టం లేదు. కాని ఈ సతీసహగమనపు ఆచారాన్ని అతను గర్హించాడు. అయినాగాని హిందూ ధర్మంలో జోక్యం చేసుకున్నట్లవుతుందనే దృష్టితో, దాన్ని పూర్తిగా నిషేధించనైతేలేదు. కాని కొన్ని ఆంక్షలు మాత్రం విధించడం జరిగింది. అవేమిటో డాక్టర్ బర్నేర్ తన యాత్రా వృత్తాంతంలో వివరించాడు. ఆ తరువాత ఆంగ్లేయుల కాలంలో రాజా రాంమోహన్ రాయ్ దీనికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం లేపి, దీన్ని రూపుమాపిన విషయం మనందరికీ తెలిసిందే.

'రహదారి' పేరుతో ఆహార వస్తువులపై వస్తున్న పదిశాతం టాక్సును రాజ్యాధికారం చేపట్టగానే ఎత్తివేశాడు. వ్యాపారమంతా, వారి చేతిలో ఉండడం వల్ల ఇది ముస్లింలకన్నా హిందువులకే ఎక్కువగా లాభించింది. 'అబ్‌వాబ్' పేరుతో వస్తున్న ఇలాంటి ఇతర టాక్సుల్ని కూడా ఎత్తివేశాడు. ఇవైతే హిందూ ముస్లిందిద్దరికీ వర్తించే టాక్సులు. ఇక కొన్ని ప్రత్యేకంగా హిందువులే చెల్లిస్తూ వస్తున్న టాక్సులు – ఉదాహరణకు పవిత్ర స్థలాలలో స్నానాలు ఆచరించే ప్రతి హిందువు ఆరు రూపాయల నాలుగు అణాల సుంకాన్ని చెల్లిస్తూ వచ్చేవాడు. అదేవిధంగా గంగానదిలో విడువదలిచిన ప్రతి శవానికి టాక్సు చెల్లించాల్సి వచ్చేది. ఔరంగజేబ్ ఇలాంటి వాటన్నింటినీ ఎత్తివేశాడు. జిజ్‌యానైతే అట్టహాసంగా పేర్కొన్నారుగాని ఇలా తీసేసినా ఎన్నో టాక్సుల ఊసే ఎత్తకపోవడం ఎంతవరకు న్యాయమో మీరే ఆలోచించండి. గంజాయి సాగుపై నిషేధం, సారాపై నిషేధం, జూదం మరియు వ్యభిచారంపై నిషేధం విధించి చట్టవ్యతిరేక చర్యలుగా ప్రకటించడం అసమంజసమంటారా? వేశ్యలకు ఈ వృత్తిని మానుకొని వివాహాలు చేసుకొమ్మని ఆదేశించడం లాటి చర్యలు సమాజ సంస్కరణదృష్టితో చేపట్టినవి కావంటారా?

## ఔరంగజేబ్ జారీచేసిన కాంచీపురం, తమిళనాడు శిలా శాసనాలు

కాంచీపురం, తమిళనాడులోని ఒక జిల్లాకు కేంద్రం. కాంచీపురం హిందూ సోదరుల ప్రఖ్యాతిగాంచిన నాలుగు మఠాలలో ఇది ప్రధాన మఠం. అక్కడున్నటువంటి చారిత్రక కంచి కామాక్షి మందిరం అన్ని వర్గాల ప్రజల్ని ఆకర్షిస్తుంటుంది. ఆ నగరపు ఆర్థిక, ధార్మిక కార్యకలా

పాలన్నీ దీనితోనే ముడివడి ఉన్నాయి. దక్షిణాదిలో ఇంతకు మించిన ధార్మిక, చారిత్రక స్థలం వేరేది లేదు. సిల్క్ చీరలు, పట్టుపరిశ్రమకు ఈ నగరం క్రీస్తు శకం ప్రథమ, ద్వితీయ శతాబ్దాల నుండే ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. అందుకే ప్రాచీన కాలాల చరిత్ర గ్రంథాలన్నింటిలో దీని ప్రస్తావన వచ్చింది. ఇక్కడ నేయబడిన సిల్క్ చీరలు ముప్ఫై నలభై వేల వరకు కూడా ధర పలుకుతాయి. జగద్గురు శంకరాచార్యుల వారి మఠంఇక్కడే ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం డాక్టర్ విఖారుల్ హసన్ సిద్దీఖి యునిస్కో (UNESCO) ప్రతినిధిగా ఒక ప్రాజెక్ట్‌కు సంబంధించి ఈ పవిత్ర నగరంలోని చరిత్రాత్మక కట్టడాలపై పరిశోధనలు జరిపారు. కాంచీపురంలో లభ్యమైన ఔరంగజేబ్ కాలం నాటి రెండు శిలాశాసనాలపై ఆయన రజా లైబ్రరీ, కాన్పూర్ జనరల్, 14-15 సంచికలో ఒక వ్యాసం వ్రాశారు. ఆయన తెలిపిన విషయాల్ని పాఠకులకు సమర్పిస్తున్నాము.

"నగరంలోని జనసమ్మర్ధం గల ప్రాంతం షేఖుపేటలో ఒక శిలాశాసనంపై పారశీక భాషలో చెక్కబడిన కొన్ని పంక్తులు కనిపించాయి. ప్రజలు అత్యంత భక్తి భావనలతో దీనిపై సింధూరం పూస్తుంటారు. వీపు, నడుము నొప్పులు, మెడపట్టుకోవడం, నరాలు బిగుసుకు పోవడం లాంటి సందర్భాల్లో శరీరాన్ని ఈ శిలాశాసనానికి రుద్దితే స్వస్థత చేకూరుతుందని ప్రజల విశ్వాసం. అలా పూయబడిన సింధూరాన్ని శుభ్రపరచి ఆ పారశీక భాషా పంక్తుల్ని చదవడం ఆ సమయంలో సాధ్యపడలేదు.

ఇటీవలనే నా యువ మిత్రుడు, సన్నిహితుడు ఖాజా గులాముస్సైదైన్ ఆ శిలా శాసనాన్ని శుభ్రపరచి దాని ఫోటోలు తీసి పంపించారు. అందులోని పారశీ భాషలోని పంక్తుల్ని చదివినప్పుడు సమాజ సంక్షేమానికి సంబంధించి ఔరంగజేబ్ టాక్సేషన్ (Taxation) పాలసీ, సమాజంలోని పేదవర్గాల, నిస్సహాయుల భుక్తికి సంబంధించి చేసే ఏర్పాట్లతో అవగాహన ఏర్పడుతుంది.

చక్రవర్తి ఔరంగజేబ్ దక్షిణ భారతంలో మిగిలివున్న ఐదు హిందూ - ముస్లిం రాజ్యాల్ని సమాప్తం చేసి ఈ మొత్తం దక్షిణ భారతాన్ని మొగలు సామ్రాజ్యంలో విలీనం చేశాడు. అందుకని కాబూల్, ఖాందహార్ మొదలుకుని కన్యాకుమారి వరకు మొగలు సామ్రాజ్య హద్దులు ఏర్పడ్డాయి. మొగలు సామ్రాజ్య విస్తీర్ణాన్ని పెంచడంలో మొగలు వంశంలో ఔరంగజేబ్ తనకు తానే సాటి. ఇదేకాకుండా ఇంత సువిశాల సామ్రాజ్యపు పరిపాలనా వ్యవహారాలు నడపడం కోసం అతను అవలంబించిన పాలసీ కూడా వినూత్నమైనది. ఇంకా ఇందులో కూడా తనకు తానే సాటి. మనం అధ్యయనం చేయబోయే ఈ రెండు శిలా శాసనాలు ఈ చారిత్రక వాస్తవానికి అద్దం పడతాయి. 1668లో జంజీ కోటను గెలుచుకున్న తరువాత ఈ దక్షిణ ప్రాంతాలన్నిటినీ హైద్రాబాద్ సూబాలో కలపడం జరిగింది. ధనుర్బాణాకారం (అర్ధవలయాకారం)లో గల ఈ శిలా శాసనంపై పారశీక భాషలో ఈ క్రింది పంక్తుల్లో శాసనం చెక్కబడి ఉంది :

ఈ శిలా శాసనంలోని పది పంక్తుల అనువాదం ఇలా ఉంది :

1. ఢిల్లీ మహోన్నత పరిపాలకుడు
2. సుల్తాన్ ఔరంగజేబ్ ఆలంగీర్ కాలంలో
3. ప్రభుత్వ ప్రతినిధి (గవర్నరు) అయిన
4. నవాబ్ గాజీ దావూద్ ఖాన్ కాలంలో షేఖ్ ఇస్లాం ఒక బజారుకు (వర్తక కేంద్రానికి) పునాది వేశాడు.
5. ఇంకా దానికి ఇస్లాంపుర అని నామకరణం చేశాడు. ఇక్కడి నుండి వచ్చే టాక్సును
6. ప్రభువుల వారి పవిత్ర నుదుటి దిగదుడుపుగా పేదల, ఫకీరుల (సన్యాసుల) లంగర్ (భోజనశాల) నిర్వహణ కోసం కేటాయించటం జరిగింది.
7. ఇంకా యెలపుల తహల్కర్ణీ అతని సంతానం (రాబోయే తరాలతో సహా)
8. ఇక్కడి టాక్సులు వసూలుచేసి పేదలు, నిస్సహాయుల భోజన ఏర్పాట్లలో వినియోగించాలి.
9. ఎవరైనా వ్యక్తి ఇందులో ఆటంకం ఏర్పరిస్తే అతను దైవదూషణకు గురి అవుతాడు.
10. హిజ్రీ శకం 1116 (క్రీ.శ.1704).

ఈ శిలా శాసనం పంక్తుల ద్వారా ఔరంగజేబ్ కాలంలో గవర్నరు అయిన దావూద్ ఖాన్ (పన్నీ) కాలంలో ఈ బజారుకు (వర్తక కేంద్రానికి) పునాది వేశారని తెలుస్తోంది. నవాబ్ దావూద్ ఖాన్ (పన్నీ) ఔరంగజేబ్ కాలంలో ప్రఖ్యాతిగాంచిన వ్యక్తిత్వం.

ఈ శిలాశాసనం ద్వారా ఔరంగజేబ్ ప్రభుత్వ పన్నుల్ని వసూలు చేసే అభివృద్ధి చెందిన కొత్త పాలసీ (New Improved Taxation Policy) ని అవలంబించాడని తెలిసివస్తుంది. తద్వారా ఒక గొప్ప ధనరాశిని ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో వినియోగించటం మొదలయింది. హిందూ సోదరుల పవిత్ర నగరమైన కాంచీపురంలో పేదలు, సన్యాసులు, పేద యాత్రికుల భోజన వసతి కోసం భోజనశాలలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ పేదలు, సన్యాసులు, పేద యాత్రికులు హిందువులే అయి ఉంటారనే కారణంగా వేల్పుల (యలపుల) తహల్కర్ణీ (లేక కులకర్ణీ) ని శాశ్వతంగా, వంశపారంపర్యంగా పర్యవేక్షకునిగా, టాక్సులు వసూలు చేసే ఇన్స్‌పెక్టర్‌గా నియమించి ఈ పేద హిందువుల సహాయాన్ని, ఉచిత భోజన వసతిని సునిశ్చితం చేయటం జరిగింది.

రెండవ శిలా శాసనం ద్వారా పట్టు కర్మాగార యజమానుల క్యాటగిరీని నిర్ణయించి మొదటి క్యాటగిరీవారు ప్రతి నెల రెండు ఫణులు (చోళుల కాలం నాటి వెండి నాణెం) రెండవ క్యాటగిరీ వారు ప్రతి నెల ఒక ఫణం, ఇంకా ప్రతి బుధవారం రోజు ఏర్పడే అంగళ్ళలో కూడా ఇదేవిధంగా ఇవ్వాలని, ఈ రాబడి క్రమం తప్పక ప్రభుత్వ ఖజనాలో జమకావాలని, ఎవరైనా వ్యక్తి ఈ నిర్ణీత టాక్సుకన్నా అధికంగా వసూలు చేసినట్లయితే అతను దైవాగ్రహానికి గురిఅవుతాడని హెచ్చరించటం జరిగింది. హిజ్రీ శకం – 1117 (క్రీ.శ. 1705 – 1706).

(రాంపూర్ రజా లైబ్రరీ జనరల్, సంచిక నెం.14 & 15, 2007).




**కాంచీపురం(తమిళనాడు)లో ఔరంగజేబ్ కాలం నాటి అతి ముఖ్యమైన రెండు చారిత్రక శిలా శాసనాలు**

అతను హిందువుల ధర్మంలో జోక్యం చేసుకోకపోవడమే కాదు, ఇంకా వారి ధార్మికాచారాల్ని నిర్వర్తించుకోవడంలో సౌలభ్యాన్ని ఏర్పాటుచేశాడు. హిందూ ప్రజల వ్యక్తిగత వ్యవహారాల్లో తన ఉన్నతాధికారుల్ని కూడా జోక్యం చేసుకోవడాన్ని సహించలేదు. యోగ్యతల్ని బట్టే ప్రభుత్వ ఉద్యోగాలు ప్రసాదించాడే తప్ప హిందూ ముస్లింలనే భేదభావాన్ని దరిదాపులకు కూడా రానివ్వలేదు.

హిందూ జైన పూజారులకు, పురోహితులకు, మహంతులకు రోజువారి భత్యాలు, పెన్షన్లు, ఇనాములు, జాగీర్లు ప్రసాదించాడు. అతని కాలంలో హిందూప్రజలు, ధార్మిక గురువులు, సాధువులు, మహంతులు ఎంత సంతోషంగా, ఎంత సంతృప్తిగా ఉండేవారో, సమకాలీన సాహిత్యం మరియు ఆ కాలపు కవులు రాసిన కవితలు చూస్తే అవలీలగా అర్థమవుతుంది. ఆ కాలపు హిందువులకు, వారి ధార్మిక గురువులకు, పూజారులకు ఔరంగజేబ్ అంటే భయమూ లేదు, అసంతృప్తీ లేదు, వారు హింసించబడనూ లేదు.

ఔరంగజేబ్ కాలం నాటి కవులు, సాహిత్యకారులు, ఇతిహాసికులే కాదు, సామాన్య హిందూ ప్రజల హృదయాల్లో సైతం ఔరంగజేబ్ పట్ల ఎంత ప్రేమాభిమానాలు, భక్తివిశ్వాసాలుండేవో తెలుసుకోవడానికి ఈ క్రింది సంఘటన చాలనుకుంటాము. నేటి కాలంలో ప్రభుత్వాలు తమ గెజిట్లను జారీ చేస్తున్నట్లే, ఔరంగజేబ్ కాలంలో చక్రవర్తి గతివిధులు, దర్బారు కార్యకలాపాలను తెలుపుతూ రోజువారీ పత్రికలు జారీచేయబడేవి. వాటిని దర్బారీ అక్బారాత్ అని పిలిచేవారు. అవన్నీ పర్షియన్ భాషలో ఉండేవి. ఔరంగజేబ్‌కు సంబంధించి సమాచారాన్ని అందించే ప్రథమ శ్రేణికి చెందిన ఆధారాలుగా ఇవి గుర్తించబడుతాయి. అందులో నుండి కేవలం ఒకే ఒక సంఘటనను పేర్కొంటే అప్పటి హిందూ ప్రజల్లో, వారి హృదయాల్లో ఔరంగజేబ్ స్థానం ఏమిటనేది తెలిసిపోతుంది.

## 1702, మార్చి 23 పత్రిక

ఖాజివుల్ ఖజాత్ అక్రమ్ ఖాన్ ఒక అర్జీని సమర్పిస్తూ ఇలా తెలిపాడు : "ముహమ్మదా బాద్ (ప్రస్తుత బీదర్, నాందెడ్ ప్రాంతం) సూబాలోని "సోన్" గ్రామానికి (తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా గోదావరి నది ఒడ్డున నున్న ఒక గ్రామం) చెందిన ఒక పాటిల్, తనకొకవేళ కుమారుడు జన్మిస్తే అతన్ని రాజుగారికి కానుకగా సమర్పించుకుంటానని మొక్కుబడి చేసుకు న్నాడట. దేవుని కృప, రాజుగారి ఆశీర్వాదంతో అతనికి అబ్బాయి పుట్టాడు. ఇప్పుడా అబ్బాయిని చక్రవర్తికి అప్పగించడానికి తీసుకొచ్చాడు." – "అబ్బాయిని పోషించటానికి అంతఃపురానికి అప్పగించండి" చక్రవర్తి ఆదేశించాడు. – "చక్రవర్తిని దర్శించుకుని స్వయంగా తమ చేతులతో అబ్బాయిని ప్రభువుల వారికి సమర్పించుకుంటామని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు." – ఖాజి అక్రమ్ చక్రవర్తికి విన్నవించుకున్నాడు –"సరే! వారిని ప్రవేశపెట్టండి" చక్రవర్తి ఆదేశించాడు. ఆదేశానుసారం వారిని చక్రవర్తి ముందుకు తేవడం జరిగింది. వారు తమ బాలుణ్ణి చక్రవర్తికి సమర్పించుకున్నారు. చక్రవర్తి ఆ అబ్బాయిని ఖాజా మంజూర్‌కు అందిస్తూ "వీణ్ణి పోషించమని

అంతఃపురంలో అప్పగించి రండి" రాజాజ్ఞఅయింది. "అబ్బాయి వయస్సెంత?" చక్రవర్తి అబ్బాయి తల్లిదండ్రుల్ని అడిగాడు. "రెండేళ్ళ ఐదు మాసాలు" తల్లిదండ్రులు సమాధానమిచ్చారు. "ఈ అబ్బాయి తల్లిదండ్రులు ఇస్లాం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా?" చక్రవర్తి అడిగాడు. దానికి వారు లేదని సమాధానమిచ్చారు." -

ప్రఖ్యాత విశాల్ గడ్ కోట (ప్రస్తుత కొల్హాపూర్ - దక్షిణ మహారాష్ట్ర సమీపంలో) ముట్టడించి ఉన్న తరుణమది. అక్కడి నుండి ఈ అబ్బాయి తల్లిదండ్రులు (అంటే పాటిల్ దంపతులు) నివసించే "సోన్" గ్రామం దాదాపు 700 కి.మీ. ఉంటుంది. చక్రవర్తి పట్ల అమితమైన భక్తి భావనతో రెండున్నర సంవత్సరాలు కూడా నిండని ఒక చిన్నారిని చక్రవర్తికి అప్పగించడానికి వారింతటి సుదూర ప్రయాణం చేసి వచ్చారు. ఇంకా చక్రవర్తి కూడా వారిని నిరాశపరచకుండా అబ్బాయిని స్వీకరించి పోషణ కోసం అంతఃపురానికి పంపిస్తాడు. ఇస్లాం స్వీకరిస్తారా? అని అడిగి చూస్తాడు. దానికి సిద్ధంగా లేమని తెలిపినప్పుడు ఊరకుంటాడు. ఎలాంటి బలవంతంగాని, నిర్బంధం గాని చేయడు. ఇస్లాం వ్యాప్తి కోసం ఔరంగజేబ్ బల ప్రయోగం చేశాడనే నిందను ఖండించడానికి ఇంతకన్నా వేరే సాక్ష్యం ఇంకేం కావాలి? పాటిల్ దంపతులు సామాన్య ప్రజలు. పైపెచ్చు ఔరంగజేబ్ పట్ల భక్తితత్పరతలు గలవారు. వారిని బెదిరించటానికి, ప్రలోభపెట్టడానికి, ఆశలు చూపడానికి ఇక్కడ ఎంతో అవకాశం ఉంది. కాని "లా ఇక్రాహ ఫిద్దీన్" అంటే 'ధర్మావలంబనలో బలవంతం లేదు' అనే ఖుర్ఆన్ ఆదేశాన్ని తు.చ. తప్పక పాటించేవాడు గనక ఔరంగజేబ్ అలాంటి ఏ చర్యకూ పాల్పడలేదు. (ఆలంగీర్ కె దర్బారీ అఖ్బారాత్ - పర్షియన్ నుండి మరాఠీలోకి : సేతూ మాధవరావ్ పగ్డీ- మరాఠీ నుండి ఉర్దూలోకి అనువాదం - సయ్యద్ షా గాజియుద్దీన్, పేజి 268, 269)

అయితే ఆ కాలం గడిచిన వందల సంవత్సరాల తరువాత వచ్చిన ఈ ఆంగ్లేయ మరియు భారతీయ చరిత్రకారులకు అన్నీ హింసలే కనబడ్డాయి. అన్నీ అణచివేతలే కనబడ్డాయి. అప్పటి వారెవరూ అనలేదు గాని, వారి జీవితాలే దుర్భరంగా మారాయని వీరంటున్నారు. కాస్త మీరే ఆలోచించండి. ఔరంగజేబ్ కాలం నాటి చరిత్రకారులు, విద్వాంసులు, పూజారులు, మహేంతులు, కవులు, ప్రజలు అందరూ సమిష్టిగా చెప్పింది నిజమా? లేక ఆ తరువాత వచ్చిన ఈ చరిత్రకారులు చెప్పింది నిజమా? ఈ ప్రశ్నకు జవాబు మీ హృదయాల్నే అడగండి!!

# 12. హిందీ భాష ఔరంగజేబ్ ప్రతిస్పందన

కొంతమంది చరిత్రకారులు ఔరంగజేబ్ హిందూ ధర్మానికి వ్యతిరేకమే కాకుండా హిందీ భాషను కూడా అసహ్యించుకునేవాడని నిందించారు. ఇంకొందరైతే అతను జోకులకు, హాస్యానికి, కవిత్వానికి కూడా వ్యతిరేకి అంటూ పేర్కొన్నారు. అయితే మనం ఔరంగజేబ్ సమకాలీన చరిత్ర గ్రంథాల్ని, ఇతర సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేస్తే, అతనిపై మోపిన ఇతర నిందల్లాగే, పై నిందల్లో కూడా పసలేదని, కేవలం పక్షపాతంతో, నిరాధారంగా అతన్ని దూషించడం జరిగిందనేది తేటతెల్లమైపోతుంది.

ఔరంగజేబ్ అరబ్బి, పర్షియన్ మరియు టర్కిష్ భాషల్లో ప్రావీణ్యం, పాండిత్యం గలవాడనేది నిర్వివాదాంశం. దీనితోపాటే అతనికి హిందీ భాషలో కూడా మంచి ప్రవేశం ఉండేది. అతను తన కుమారులకు, కుమార్తెలకు హిందీ భాష నేర్పడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. ఔరంగజేబ్ కుమార్తె జైబున్నిసా పారశీకంలో కవిత్వం చెప్పేది. దానితో పాటే ఆమె హిందీ భాష కవయిత్రి కూడాను. మాసిరె ఆలంగీరిను ఉటంకిస్తూ డాక్టర్ సయ్యద్ అలి తన ఒక వ్యాసంలో “నైన్ విలాస్” అనే కవితా సంపుటి, జైబున్నిసాకు హిందీ కవిత్వంపై ఎంత పట్టుండేదన డానికి నిదర్శనమంటూ పేర్కొన్నారు. ఈ కవితా సంపుటిని స్వయంగా ఔరంగజేబ్ ఈ క్రింది హిందీ దోహాతో ప్రశంసించాడు.

జైబున్నిసా జహాఁమే దుక్తరె ఆలంగీర్ – నైన్‌విలాస్ విలాస్‌మె ఖాస్‌కరి తహ్రీర్.

ఆ కాలపు సమకాలీన చరిత్ర గ్రంథాలైన ఆలంగీర్‌నామ, ముంతఖబుల్ లుబాబ్ మరియు బర్నియేర్ యాత్రా వృత్తాంతాల్ని నిశితంగా అధ్యయనం చేస్తే హిందీపట్ల ఔరంగజేబ్‌కు గల అభిరుచి తెలిసిపోతుంది. అతను హిందీ భాష సమర్థకుడే కాదు, సంరక్షకుడు కూడాను. తను స్వయంగా వారానికి మూడు రోజులు తన మహలులో సాహిత్య గోష్ఠిని నిర్వహించేవాడు. ఔరంగజేబ్ ఎన్నో ఫర్మానాలను హిందీలో జారీచేశాడని యదునాథ్ సర్కార్ పేర్కొన్నాడు. హిందీ భాష పట్ల ఔరంగజేబ్ అభిరుచిని, అభిమానాన్ని ప్రశంసిస్తూ ఆచార్య చిత్రసేన్ ఇలా పేర్కొన్నారు: “ఔరంగజేబ్ హిందీ భాష గొప్ప ప్రేమికుడు, అతను స్వయంగా హిందీ భాషలో కవితలు చెప్పాడు, హిందీ కవుల్ని ఘనంగా సన్మానించాడు.” ‘వరండ్’ పేరుగల హిందీ భాష కవికి, ఔరంగజేబ్ ప్రతి రోజు పది రూపాయలు ఇస్తుండేవాడు. ఆచార్య చంద్ బలిపాండే ఇలా అంటారు: “ఔరంగజేబ్ హిందీ భాష పోషకుడు, మొగలు రాకుమారులకు హిందీ నేర్పించబడేది. అతనెన్నడూ కూడా హిందీ భాషను వ్యతిరేకించలేదు, అంతేకాకుండా హిందీని సరళం చేయాలని కూడా ఆదేశించలేదు.”

ఔరంగజేబ్ మరియు హిందీ భాష సంబంధాన్ని గురించి వర్ణిస్తూ ప్రఖ్యాత చరిత్రకారుడు, విద్వాంసి అయిన అల్లామ షిబ్లి నొమాని ఇలా అంటారు: “ఔరంగజేబ్ కాలంలో బ్రిజ్ (హిందీ) భాష ఎంతగా అభివృద్ధి చెందిందో, ముస్లింలు హిందీ భాషలోని ఎన్ని గ్రంథాల్ని వివిధ భాషల్లోకి అనువదించి పరిచయం చేశారో, హిందీ భాషలో ఎంత అధిక సంఖ్యలో కవితా సాహిత్యాలు ఉనికిలోకి వచ్చాయో, అంతగా ఏ ఇతర రాజు పరిపాలనా కాలంలో కూడా జరిగి ఉండలేదు.” ఔరంగజేబ్ కాలంలోనే బనారస్‌కు చెందిన ప్రఖ్యాత సంస్కృత కవీశ్వరుడు ముల్లా నిజాముద్దీన్ బెల్‌గ్రామి బాగా ప్రసిద్ధిగాంచాడు. హిందీ మరియు సంస్కృత భాషల్లో చెప్పుకోదగ్గ ప్రావీణ్యం మరియు పాండిత్యం గలవారిని ఔరంగజేబ్ అన్ని విధాలుగా ఆదుకొని, గుర్తించి వారిని పోషించే వాడు. వారికి బహుమానాలు ఇచ్చేవాడు. ఔరంగజేబ్ కొందరి కవిత్వంపై పరవశించిపోయి, ఒక్కొక్క పద్యపాదానికి ఏడువేల రూపాయల వరకు బహుమానం ఇచ్చినట్లు కొందరు చరిత్రకారులు పేర్కొన్నారు.

ఔరంగజేబ్ కాలంనాటి ఒక ప్రఖ్యాత కవి మీర్జా అబ్దుల్ ఖాదర్ బేదిల్ ఈరాని, కవితా సంపుటి “నర్గిస్తాన్” పేరుతో ఉంది. అందులో ఆయనిలా వ్రాశాడు.

అనువాదం : శ్రీరామ చంద్రుని లాటి వేరొక రాజు అయి ఉండలేదు. ఆయన దేవుని పవిత్ర ఉనికికి ప్రతిబింబం. నిరంతరం సుఖమయ, సంతోషకరమైన జీవితాన్ని గడపదలిస్తే, తమకు తామై రామనామ స్మరణలో లీనం చేసుకోండి. ప్రపంచంలో ఆయన పేరు స్పర్శవేది (స్పర్శమణి) లాంటిది. మీరు మీ ఆత్మను స్పర్శమణి అనబడే దుస్తుల్లో దాచుకోండి. నా జీవిత వాయిద్యం నుండి ఎలాంటి సంగీతం వెలువడాలని నేను నా వివేకాన్ని ప్రశ్నించాను. ప్రపంచంలో దాగివున్న ఇతర రహస్యాల్లాగే, గురువు తరఫున రాముని భక్తి, ప్రేమలో “నర్గిస్తాన్” అనే గ్రంథం వ్రాయమంటూ చెప్పబడింది. ప్రపంచంలో నాకు ఎవరితోనూ ఎలాంటి ఆశ లేదు. అందుకని ‘సలాం’ అనడం తప్ప నేనింకేమి అనగలుగుతాను?”

పై ఉదాహరణ ద్వారా కేవలం హిందువుల వరకే కాదు, ముస్లింల హృదయాల్లో సైతం శ్రీరామచంద్రుని పట్ల అపారమైన భక్తి విశ్వాసాలు, ప్రేమాభిమానాలు పెల్లుబుకుతుండేవని నిరూపితమవుతోంది.

హిందూ అవతారాల గురించి ఈ బహిరంగ కీర్తన, ప్రశంసలను విని కూడా ఔరంగజేబ్ ఎలాంటి అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తపరచలేదు. భారత దేశంలో కూడా దైవప్రవక్తలు, దైవ ప్రబోధకులు (అవతారాలు) తప్పక వచ్చి ఉంటారని అతను స్వయంగా విశ్వసించేవాడు.

(1. తారీఖ్ కీ సచ్చాయియాం-ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ, పేజి 58) (2. ఆయిన-ఎ-ఔరంగజేబ్-హకీం జిల్లుర్రహ్మాన్ - పేజి 97)

ఔరంగజేబ్‌కు హిందీ భాషపట్ల గల అభిమానానికి ఇంకొక నిదర్శనముంది. అతను దక్కన్‌లో సుదీర్ఘకాలం ఉన్నప్పుడు, అతని సైనికుల్లోని కొందరి భార్యలు అతనికి హిందీ

కవితా రూపంలో తమ బాధను వెళ్ళబోసుకున్నారు. "డిల్లీ అత్యంత సుందరమైన నగరం. ఇక్కడ బంగారం కురుస్తుంది. కాని ఏం లాభం! మా భర్తల్ని చక్రవర్తి తనతో పాటుగా దక్కన్ తీసుకెళ్ళాడు." దానికి ఔరంగజేబ్ హిందీలోనే ఇలా సమాధానమిచ్చాడు :

బైఠీ రహో ఖరార్‌సే మన్‌మే రాఖోధీర్ - సాహబ్‌సే బిన్నతికరో జో భూరేఁ ఆలంగీర్.

(ఎందుకలా బేలలై పోతారు, ఓపికతో నిరీక్షించండి - ఆలంగీర్ డిల్లీ తిరిగి రావాలని దేవుణ్ని ప్రార్థించండి!) (హిందీ షాయెరీ (కవిత్వం) - ఆజం కరేవీ, పేజి 123, 124).

ఆలంగీర్ మన్సబుదారుల్లో దీవాన్ సయ్యద్ రహ్మతుల్లా బెల్‌గ్రామి, హిందీ భాషలో ప్రామాణికమైన గురువుగా గుర్తించబడేవారు. ఆయన సమకాలీన కవి, చింతామన్, ఆయన్ను ప్రశంసిస్తూ, "ఝూల్నా ఛంద్" పేరుతో దోహాలను వ్రాశాడు. ఆయన హిందీ కవితా సంపుటి పేరు "పూరన్‌రస్" (మాస్సరుల్ కిరామ్ - గులాం అలి ఆజాద్, వా -2, పేజి 364 - 366). చింతామన్ మరియు భూషణ్ కవి కూడా ఔరంగజేబ్ దర్బారును ఆశ్రయించినవారే.

ఔరంగజేబ్ మన్సబుదార్లలో షేఖ్ గులాం ముస్తఫా అనే కవి పుంగవుడుండేవాడు. "ఇన్సాన్" అనేది ఆయన కలం పేరు. ఆయన వైద్యం, జ్యోతిష్యం, ఇంకా సొగసైన రాత (Caligraphy) లో ప్రసిద్ధిగాంచారు. అంతేకాకుండా యుద్ధకళలో కూడా ప్రతిభావంతుడు. ఉన్నత శ్రేణికి చెందిన గురువు. ఆయనకు హిందీ భాషలో అసామాన్యమైన ప్రావీణ్యం ఉండేది. హిందీ భాషకు సంబంధించి బ్రాహ్మణులు కూడా ఆయన వద్దకు సంస్కరణ కోసం వచ్చేవారు. ఆయన హిందీలో అత్యున్నత స్థాయికి చెందిన కవితలు చెప్పేవారు. ఆయన కాలం నాటి గొప్ప గొప్ప కవులు ఆయనముందు వినయంగా తలలు వంచి కూర్చుండేవారు. వారి కవితల్ని, దోహాల్ని ఆయన సంస్కరించేవారు. (మాసిరుల్ కిరాం - గులాం అలి ఆజాద్ బెల్ గ్రామి, వా.2, పేజి 74)

ఆలంగీర్ దర్బారును ఆశ్రయించిన వారిలో "దాతా" అనే కవి పుంగవుడుండేవాడు. అతను హిందీలో బ్రహ్మాండమైన పద్యాలు చెప్పేవాడని గులాం అలి ఆజాద్ బెల్‌గ్రామి "యదెబైజా" అనే తన గ్రంథంలో పేర్కొన్నారు. (యదె బైజా వ్రాతప్రతి, దారుల్ ముసన్నఫీన్ లైబ్రరీ, ఆజంగడ్)

ఔరంగజేబ్ దర్బారులోని ప్రఖ్యాత రాజపుత్ర మన్సబుదార్ రాజా జస్వంత్‌సింగ్ కూడా హిందీ కవిత్వంలో మంచి ప్రావీణ్యం గలవాడు. ప్రవీణులు - అద్భుతాలు మరియు ప్రేమ సౌందర్యంపై "భాషా భూషణ్" అనే పేరుతో అతనొక గ్రంథాన్ని రచించాడు, అదెంతో ప్రఖ్యాతి గాంచింది. (హిస్టరీ ఆఫ్ హిందీ లిటరేచర్, రాం అవధ్ ద్వివేది, పేజి -94). ఆఖిల్‌ఖాన్ రాజి, ఆలంగీర్ దర్బారులోని ప్రఖ్యాతి గాంచిన పర్షియన్ కవి. 1654లో అతను మధుమాలతిని, మనోహర్ మహ్రా వొ మాహ్ (అవద్ గ్రంథాలయ విషయ సూచిక - స్ప్రింగర్, పే.544) మరియు 1658లో పద్మావత్‌ను షమ్మ-వ-పర్‌వానా అనే పేరుతో అనువదించాడు. (డిటో -

పేజి 543). 1658లో ముహమ్మద్ మురాద్ "కామ్‌రూప్ మరియు కామ్‌లతా" కథను, 'దస్తూరుల్ హిమ్మత్' అనే పేరుతో పర్షియన్‌లో అనువదించాడు. (పర్షియన్ వ్రాతప్రతుల సూచిక, బ్రిటిష్ మ్యూజియం - వా-2, పే.697)

1694లో బయాని అనేవాడు మాహియార్ మరియు చంద్రవదన్‌అనే కథను "ఇష్ఖ్‌నామ" అనే పేరుతో పర్షియన్‌లో అనువదించాడు.

ఆలంగీర్ కాలంలోనే హిదాయతుల్లా బిన్ ముహమ్మద్ మొహ్‌సినుల్ ఖురైషి, "ఫర్‌హంగ్ ఔరంగ్ షాహి" పేరుతో ఒక గ్రంథాన్ని రూపొందించాడు. దాన్ని ఆలంగీర్‌కే అంకితం చేశాడు. అందులో భారత దేశపు జంతువులు, మొక్కలు, చెట్లు, గుట్టలు,కొండలు, భూగర్భ ఖనిజాలు, బుగ్గబావులు మొదలగు ఎన్నో విషయాల్ని పేర్కొన్నాడు. (పర్షియన్ వ్రాతప్రతుల సూచిక, బెంగాల్ ఏషియాటిక్ సొసైటి, కలకత్తా, పేజి 654)

ఈ కాలంలోనే మిర్జా ఖాన్ బిన్ ఫఖ్రుద్దీన్ అహ్మద్ అనే వ్యక్తి ఆలంగీర్ రాకుమారుడు ఆజంషా కోసం "తొహ్‌ఫతుల్ హింద్" అనే పేరుతో ఒక గ్రంథాన్ని రచించాడు. ఇందులో హిందువులకు సంబంధించిన వక్తృత్వ కళ, ఛందస్సు, అలంకారములతో పాటుగా ప్రేమ, సాముద్రిక శాస్త్రము, కోకశాస్త్రము (గర్భశాస్త్రము) ఇంకా హిందీ వ్యాకరణాలపై ఉపయోగకరమైన చర్చలున్నాయి. (పుస్తక విషయ సూచిక, ఖుదాబక్ష్ ఓరియంటల్ లైబ్రరీ, పాట్నా, వా-9, పేజి 150)

ప్రఖ్యాత హిందీ కవి, బిహారీ లాల్ (1603-1663) 'సత్‌సయి'ని ఆజంషా ఆదేశంపైనే వ్రాశాడు. అయితే ఇది ప్రత్యేకంగా ఆజంషా కోసమే సంకలనం చేయబడింది. అందుకని ఇది 'ఆజంషాహి సంస్కరణ్' గా నామకరణం చేయబడింది. దేవ్ కవి, తన కృతి అయిన భావ్ విలాస్‌లో 'ఔరంగజేబ్ రాకుమారుడు ఆజంషా పొద్దంతా ఈ కవితా సంపుటిని వింటూ ప్రశంసిస్తూ ఉండేవాడని వ్రాశాడు. 'సత్‌సయి'కి చక్కటి వివరణ కూడా నవాబ్ అన్వర్ ఖాన్ పేరుగల ఒక ముస్లిమే వ్రాశాడు. అనూచంద్రిక అనేది కూడా ఇతని రచనే. (హిస్టరీ ఆఫ్ హిందీ లిటరేచర్, - ఎఫ్.ఇ.కే. పేజి 29, హిందుస్తాన్ పత్రిక, 1936 జులై పేజి 322, 323) రాకుమారుడు ఆజంషా కోరికపై నవాజ్ అనే ఒక ముస్లిం కవి 1680లో 'శకుంతల' అనే పేరుతో ఒక హిందీ నాటకాన్ని రచించాడు. (పంజాబ్‌లో ఉర్దూ, పే.118) ఆలంగీర్ కుమారుడైన ముహమ్మద్ ముఅజ్జం దర్బారులో అబ్దుర్ రహ్మాన్ పేరుగల ఒక హిందీ కవి ఉంటుండేవాడు. అతను అత్యంత కఠిన హిందీ భాషలో 'యక్షంక్' పేరుతో ఒక గ్రంథాన్ని రచించాడు. (హిందీ కవిత్వం - ఆజం కరేవి, పే.81). ఆలంగీర్ కాలంలో సయ్యద్ మీరాఁ భీక్ పేరుగల ఒక గురువు ఉంటుండేవారు. ఆయన హిందీలో మంచి కవిత్వం చెప్పేవారు. ఆయన హిందీ కవిత్వాన్ని నేటి వరకు కూడా ఖవ్వాలీలుగా పాడుకుంటారు. (పంజాబ్‌లో ఉర్దూ, పేజి 118). ఆలంగీర్ పట్టాభిషేకం నలుబదవ సంవత్సరంలో 1697లో ఒక ముస్లిం, పవిత్ర రమజాన్

మాసంలో "యోగ్ విశిష్ఠ"ను అనువదించాడు. (పర్షియన్ వ్రాతప్రతుల సూచిక, బోడ్లైన్ లైబ్రరీ, వా-1, కాలం 87).

ఈ కాలంలోనే స్వయంగా ఆలంగీర్ దర్బారులో ఉండే నాయకులే. భారతీయ సంగీతంపై అనేక గ్రంథాల్ని వ్రాశారు. ఆలంగీర్ నాయకుల్లో ఫఖీరుల్లా సైఫ్ ఖాన్ సంగీతంలో అత్యంత ప్రావీణ్యుడు, అతను భారతీయ సంగీత కళను లోతుగా అధ్యయనం చేసిన వ్యక్తి. ఈ సందర్భం లోనే అతను గ్వాలియర్‌కు చెందిన రాజా మాన్ సింగ్ ద్వారా సంకలనం చేయబడిన "మానిక్ సొహెల్"ను పారశీకంలో అనువదించి, దానికి "రాగ్ దర్పన్" అని నామకరణం చేశాడు. అందులో స్వయంగా తన వైపు నుండి కూడా అనేక సూత్రాల్ని, నియమాల్ని పరిచయం చేశాడు. భారతీయ సంగీతంలో ఏ ఏ రాగాలు, ఏ ఏ స్వరాల కలయికతో ఏర్పడ్డాయో వివరిం చాడు. (రాగ్ దర్పన్ యొక్క ఒక వ్రాత ప్రతి దారుల్ ముసన్నిఫీన్, ఆజంగడ్ లైబ్రరీలో ఉంది). ఆలంగీర్ దర్బారులోని ఇంకొక నాయకుడు సయ్యద్ నిజాముద్దీన్ బెల్‌గ్రామి మధునాయక్ (నిర్యా. 1686)కు కూడా సంగీతం మరియు హిందీ కవిత్వంలో మంచి ప్రవేశం ఉండేది. సంగీత శాస్త్రంలో ఆయన వ్రాసిన రెండు గ్రంథాలు "నాద చంద్రిక" మరియు "మధునాయక్ సింగార్" పేర్కొనబడతాయి. (మాసిరుల్ కిరామ్ - వా-2, పే.356).

ఆలంగీర్ కాలంలోనే సంగీత శాస్త్రంపై 1697-98లో "షమ్సుల్ అస్వాత్" పేరుతో ఒక గ్రంథం ఉనికిలోకి వచ్చింది. అందులో భారతీయ స్వరములు, వాద్య ఉపకరణాల పేర్లు ప్రస్తావించబడ్డాయి. (పర్షియన్ వ్రాతప్రతుల సూచిక, ఇండియా ఆఫీసు లైబ్రరీ, వా-1, పేజి 1122). ఈ కాలంలోనే పారశీకముతో పాటుగా హిందీలో కవిత్వం చెప్పే ఇంకొక కవి, మిర్జా రోషన్ జమీర్ ఉంటుండేవాడు, "పతి" అనేది అతని కలం పేరు. కవిత్వంతో పాటుగా అతనికి సంగీతంలో కూడా అభిరుచి మెండు. అరబ్బి, పారశీకము, హిందీల్లో రకరకాలా గీతాల్ని, విభిన్న స్వరాల్లో పాడుతుండేవాడు. నృత్యం మరియు స్వరాలకు సంబంధించి హిందీలో "పారజాతక్" అనే ప్రఖ్యాతి గాంచిన గ్రంథముంది. ఈ గ్రంథాన్ని అతను పారశీకంలోకి అనువదించాడు. (పారశీక వ్రాతప్రతుల సూచిక, ఇండియా ఆఫీస్, వా-1, పే.1117)

ఆలంగీర్ సభికుల్లో గొప్ప నాయకుడైన షాయిస్తఖాన్, ప్రఖ్యాత సంస్కృత కవి చిత్రభోజ్ పోషకుడు. అత్యధికంగా అతన్ని గౌరవించేవాడు, అతని సంరక్షణ మరియు పోషణలోనే ఈ చిత్రభోజ్ అనే కవి తన గ్రంథం "రాసాకుల్ పద్రమ్" రచించాడు, అందులో ఆవేశాకర్షణలు, అనుభూతులు అనుభవాలు, ఛందస్సు అలంకారాలు మొదలుగాగల వాటిపై చర్చించడం జరిగింది. (ముస్లింల పోషణలో సంస్కృతం-గండేరావు హర్‌కారె, ఇస్లామిక్ కల్చర్, హైద్రాబాద్ 1952, అక్టోబర్)

ఈ కాలంలోనే ఇంకొక పేర్కొనదగిన హిందీ కవి బయల్పడ్డాడు. "ఆలిం" పేరుగల ఈ హిందీ కవి 1685లో జన్మించాడు. అతను షేఖ్ రంగ్రేజన్ ప్రేమలో పడిపోయాడు. ఆమె

కూడా హిందీలో కవిత్వం చెప్పేది. ఇద్దరి ప్రేమైక సంబంధాల వివరాలు "ఆలిం" కృతి అయిన "ఆలం లౌకీ" ద్వారా తెలుస్తాయి. (హిందుస్తానీ పత్రిక, అలహాబాద్, 1937 అక్టోబర్, పే.499) (ముస్లిం హుక్మురానోఁ ...స.స.అబ్దుర్రహ్మాన్,వా.3,పేజి 207– 212).

డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ ఇలా అంటారు :

"భారతీయ సంగీత కళపై, ఔరంగజేబ్ కాలంలో ఎంత ఉన్నత స్థాయిలో, ప్రామాణిక రూపంలో అభివృద్ధి జరిగిందో, అంతకు పూర్వం ఎన్నడూ అలా జరిగి ఉండలేదు. భారతీయ సంగీత కళపై ఆ కాలంలో ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయి. ప్రత్యేకంగా భారతీయ భాషా, వ్యాకరణంపై వ్రాయబడిన "తొహ్‌ఫతుల్ హింద్" అనే నిఘంటువు గురించి పేర్కొనడం అత్యంత ముఖ్యమనుకుంటున్నాము. దీని వ్రాత ప్రతి ఒకటి 'ఖుదాబక్ష్ ఓరియంటర్ పబ్లిక్ లైబ్రరీ', పాట్నాలో కూడా ఉంది. ఈ వ్రాత ప్రతిని ఎంతో కాలం కింద ప్రఖ్యాత విద్వాంసి సర్ విలియమ్ జోన్స్ పరిచయం చేయించారు. కాని ఆ తరువాత విద్వాంసులు ఈ పుస్తకాన్ని మరిచిపోవడానికి, నిర్లక్ష్యం చేయడానికి ప్రయత్నించారు.

"భారతీయ భాషను నేర్వడం, నేర్పించడం పట్ల ఔరంగజేబ్‌కు ఎంతో అభిలాష ఉండేది. ఆ ప్రగాఢ కోరిక ఫలితంగానే అతనీ నిఘంటువును సిద్ధం చేయించాడు. పారశీకము వచ్చినవాడు అవలీలగా హిందీ భాషను నేర్చుకోగలుగాలనే దృష్టితో ఇది తయారు చేయించడం జరిగింది. హిందీ మరియు సంస్కృత భాషల కవిత్వం, దాని వ్యాకరణ నియమాలు, ఛందస్సు అలంకారాలు సర్వసామాన్యం కావాలనే దృష్టితో రూపొందించిన విలువైన గ్రంథమిది." (ఔరంగజేబ్ – ఏక్ నయీ దృష్టి – రచన : డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 24 & 25)

# 13. ఔరంగజేబ్ దర్బారులో హిందూ మన్సబ్‌దారులు-ఉన్నతాధికారులు

ఔరంగజేబ్‌పై మోపబడిన నిందల్లో అతను హిందూ వ్యతిరేకి అని, హిందువుల్ని అణచి ఉంచాడని, వారికి ఉన్నత హోదాలపై నియమించలేదని, అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల నుండి వారిని వంచించాడనేది అతి పెద్ద నింద. అయితే ఇందులో వాస్తవమెంత? కల్పితమెంత? అనేది మనం పరిశీలించాల్సి ఉంది. ఔరంగజేబ్ రాకుమారునిగా ఉన్నప్పుడు, దక్కన్‌లో గవర్నరుగా ఉండి వారసత్వం కోసం జరిగిన యుద్ధాలకు బయలుదేరక ముందు, అతని దర్బారులో అతని సైన్యంలో రాజపుత్రులు తక్కువ సంఖ్యలో కనబడతారు. రాజపుత్రుల ప్రధాన స్థానమైన రాజ్‌పుతాన నుండి దక్కన్ సుదూరంలో ఉండడం వల్లను, కేంద్ర ప్రభుత్వమైన డిల్లీ సైన్యంలోనే వారు అత్యధికంగా ఉండడం వల్లను, ఔరంగజేబ్ సైన్యంలో స్వల్పంగా ఉండేవారు. కాని ఎప్పుడైతే ఉత్తర భారతానికి చేరుకొని సింహాసనాన్ని అధిష్టించాడో, ఈ పరిస్థితి మారిపోయింది. అతను రాజపుత్రుల్ని, ఇతర హిందూ నాయకుల్ని చేరదీయడమే కాకుండా, మొగలు వంశ చరిత్రలోనే అంతకు ముందెన్నడూ లేని అత్యంత ఉన్నత హోదాలపై రాజపుత్ర రాజుల్ని నియమించాడు. సామాన్యంగా అక్బర్ చక్రవర్తిని హిందువుల హితోభిలాషిగా, హిందువుల్ని అభిమానించే వానిగా పేర్కొంటారు. కాని ఒక విషయం వింటే మీరు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోతారు. అక్బర్ తన కాలంలో ఎంతమంది హిందువులకు ఉన్నత హోదాలనిచ్చాడో, అంతకన్నా ఎక్కువ సంఖ్యలో ఔరంగజేబ్ హిందూ నాయకులకు ఉన్నత హోదాలనిచ్చాడని ఎం.అత్‌హర్ అలి గారు నిరూపించారు. The Moghal Nobility under Aurangazeb అనే శీర్షికతో, ఒక థీసెస్‌ను రూపొందించి దానిపై ఆయన పి.హెచ్.డి. పట్టా పుచ్చుకున్నారు. డాక్టర్ సతీష్ చంద్రగారి పర్యవేక్షణలో 1961లో ఆయన సమర్పించిన ఈ థీసెస్‌ను 1966లో మొట్టమొదటిసారి, అలీగడ్ ముస్లిం యూనివర్శిటీ చరిత్ర విభాగం వారు పుస్తక రూపంలో ప్రచురించారు. దీన్నే ఆ తరువాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీవారు 1997లో అదే పేరుతో India Paper Back అనే మకుటంతో ప్రచురించారు. ఆ తరువాత Oxford University వారే 2001, 2006లో రెండుసార్లు పునర్ ముద్రించారు. అందులో నుండి కొన్ని ముఖ్య అంశాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

"రాజపుత్రుల పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన అత్యంత వివాదాస్పదమైనట్లుగా ఆధునిక చరిత్రకారులు పేర్కొన్నారు. ఔరంగజేబ్ ధార్మికాసక్తియే దీనికి కారణమా కాదా అనే అంశాన్ని చర్చించుకుంటూ కూర్చుండేబదులు, అతని మన్సబుదారుల సమూహంలో రాజపుత్రుల

స్థానమేమిటనే విషయాన్ని పరిశీలిద్దాం. షాజహాన్ ధార్మిక నిబంధనల్ని తు.చ. తప్పకుండా పాటించే ముస్లిం. అతను తన ధార్మికాసక్తిని చాటుకునే అనేక పనులు చేశాడు కూడా. అయినప్పటికీ అతని పరిపాలనా కాలంలో, లాహోరి, వారిస్ లాంటి చరిత్రకారులు సమర్పించిన జాబితాల ననుసరించి, రాజపుత్ర మన్సబుదారుల సంఖ్య అత్యధికంగా పెరిగిపోయింది.[1] ఔరంగజేబ్ కూడా ఒక ధార్మికాసక్తిగల ముస్లిం. రాజపుత్రుల పట్ల పక్షపాత వైఖరి అవలంబిస్తాడని షాజహాన్ దర్బారులో అతన్ని విమర్శించడం జరిగింది.[2] అయినా ఈ విషయాలన్నీ వారసత్వ యుద్ధాలకు ముందు జరిగినవి. వారసత్వ యుద్ధానికి ముందు, ఔరంగజేబ్ రాజపుత్రుల్ని తన వైపునకు త్రిప్పుకోవడానికి ఎంతో ప్రయత్నించాడు. ఈ సందర్భంలో అతను మేవాడ్ రాజు అయిన రాణా రాజ్‌సింగ్‌కు జారీ చేసిన "నిషాన్‌లు" (రాజాజ్ఞలు-అనువాళ్ళు) నేటికీ ఉన్నాయి.[3] వాటిలో 1654లో చిత్తోడ్ కోటను పునర్నిర్మించినందుకు శిక్షగా అతని ఏ ప్రాంతాలైతే జప్తుచేసుకోబడ్డాయో అవి తిరిగి అప్పగించబడతాయని రాణాతో వాగ్దానం చేశాడు. ఇంకొక నిషాన్‌లో తన తండ్రితాతల కాలం నుండి వస్తున్న ధార్మిక నీతిని తాను కూడా అలాగే కొనసాగిస్తానని ఎలుగెత్తి ప్రమాణం చేశాడు. ఈ సందర్భంలోనే "ఏ రాజైతే ఇతరుల ధార్మిక విషయాల్లో అసహనం కనబరుస్తాడో, అతను దైవ సమక్షంలో విద్రోహి" అంటూ ప్రకటించాడు.[4]

ఔరంగజేబ్ తన ప్రభుత్వ ప్రారంభకాలం నుండే రాజపుత్రుల పట్ల మొగ్గుచూపాడు. కొన్ని రకాలుగా చూస్తే వారి పరిస్థితి షాజహాన్ కాలం కన్నా ఎంతో మెరుగైపోయింది. షాజహాన్ పరిపాలించిన కాలమంతటిలో ఏడువేల మన్సబుదారీ హోదాను పొందిన రాజపుత్ర అధికారి ఒక్కడంటే ఒక్కడూ కూడా కనిపించడు. ధర్మాత్ మరియు ఖజ్వాహ్ యుద్ధాల్లో రాజా జస్వంత్ సింగ్ తీరని ద్రోహానికి పాల్పడి ఉన్నప్పటికీ కూడా, జస్వంత్ సింగ్ మరియు రాజా జైసింగ్‌లకు ఏడువేల మన్సబుదారు హోదాలు లభించాయి. (మొగలు వంశపాలన మొదలైనప్పటి నుండి ఆనాటి వరకు రాజపుత్రులకు ఇంత పెద్ద హోదా లభించడం అదే ప్రథమం). 1606లో రాజా మాన్‌సింగ్‌ను బెంగాల్ నుండి తప్పించిన తరువాత (1658 చివరలో జస్వంత్ సింగ్‌ను మాల్వా సుబేదారుగా నియమించింది తప్పిస్తే) ఏ రాజపుత్ర నాయకునికి కూడా ఒక సూబా అప్పగించబడలేదు. అయితే ఇకిప్పుడు 1665లో రాజా జైసింగ్‌ను దక్కన్ వైస్రాయ్ (గవర్నరు)గా నియమించడం జరిగింది. ఈ నియామకం రాకుమారుని ముఖ్య సలహాదారుగా కాకుండా, అతని స్వంత వ్యక్తిత్వంపై అతని స్వంత అధికారంపై జరిగింది. ఈ హోదా మొగలు రాజ్యంలో అత్యంత కీలకమైన, మహోన్నత హోదా. దీనిపై సామాన్యంగా ఎవరైనా ఓ రాకుమారుడు మాత్రమే నియమింపబడేవాడు. జస్వంత్ సింగ్‌ను కూడా రెండు పర్యాయాలు గుజరాత్ సుబేదారుగా నియమించడం జరిగింది. (1659-61, 1670-72). ప్రఖ్యాత పర్యాటకుడు డాక్టర్ బర్నియర్ 1656 వరకు ఆగ్రాలోనే ఉన్నాడు గనక (తాను చూసిన విషయాల్ని) ఇలా వ్రాయగలిగాడు. "మొగలు చక్రవర్తి ముస్లిమే అయినప్పటికీ,

Gentiles కు (హిందువులకు) శత్రువైన ఇతను,★ ఎల్లప్పుడూ తన కొలువులో రాజుల ఒక సమూహాన్నే ఉంచుకుంటాడు. తన ఇతర నాయకుల పట్ల గౌరవ మర్యాదలతో ప్రవర్తించినట్లే వీరితోనూ అలాగే ప్రవర్తిస్తాడు, ఇంకా సైనికపరమైన మహోన్నత కార్యాల్లో వారిని నియుక్తుల్ని చేస్తాడు."

ఔరంగజేబ్ కాలంలో మరాఠాలు, రాజపుత్రులు, ఇంకా ఇతర హిందువులు అతని ధార్మిక నీతివల్ల అతనికి సహకరించడానికి వెనుకంజ వేశారని ఒక అపవాదును లేవదీశారు. ఇంకా అతని సైన్యంలో హిందువుల సంఖ్య తగ్గిపోయిందని కూడా చెప్పుకొచ్చారు. కాని అత్‌హర్ అలీ తన గ్రంథంలో చూపిన గణాంకాలు పై అపవాదుల్ని ఖండిస్తాయి. మీరు కూడా పరిశీలించండి.

మొగలుల సైన్యంలో హిందువుల స్థానం, వారు పొందిన మన్సబులు ఈ క్రింది పట్టిక ద్వారా అర్థమవుతోంది.

**వివిధ కాలాల్లో మొగలు మన్సబుదార్లలో హిందూ మన్సబుదార్లు**

| మన్సబుల స్థాయి | అక్బర్ 1595 | | షాజహాన్ 1628-58 | | ఔరంగజేబ్ 1658-78 (20 సం) | | ఔరంగజేబ్ 1679-1707 (30 సం) | |
|---|---|---|---|---|---|---|---|---|
| | మన్సబు దార్లు | | మన్సబు దార్లు | | మన్సబు దార్లు | | మన్సబు దార్లు | |
| | మొత్తం | హిందువులు | మొత్తం | హిందువులు | మొత్తం | హిందువులు | మొత్తం | హిందువులు |
| 5000ఆపైమన్సబుదార్లు | 7 | 1 | 49 | 12 | 51 | 10 | 79 | 26 |
| 3000 నుండి4500 | 10 | 1 | 88 | 22 | 90 | 18 | 133 | 36 |
| 1000 నుండి2700 | 17 | 6 | 300 | 64 | 345 | 77 | 363 | 120 |
| 500 నుండి 900 | 64 | 14 | - | - | - | - | - | - |
| మొత్తం | 98 | 22 | 437 | 98 | 486 | 105 | 575 | 182 |

★ *పాఠకులు ఒక్క నిముషం ఆగి, ఇక్కడ ఈ పాశ్చాత్య కళాకారుని విషం చిమ్మే కళను పరిశీలించ మనవి. మొగలు చక్రవర్తి (ఔరంగజేబ్) దర్బారులోని రాజపుత్ర రాజుల్ని గురించి వర్ణిస్తున్నాడు. అతను వారిని పెద్ద సంఖ్యలోనే ఉంచుకుంటాడని, ఇతరుల్ని గౌరవించినట్లే వారినీ గౌరవిస్తాడని, వారిని సంపూర్ణంగా విశ్వసించి తన కీలకమైన సైనిక కార్యకలాపాల్ని వారికి అప్పగిస్తాడని అంటూనే ఒక అసంబద్ధమైన, అసందర్భమైన 'హిందువుల శత్రువు' అనే విషపూరిత పదాన్ని ఎలా జొప్పించాడో చూడండి. ఇదే పాశ్చాత్యుల గారడి. ఈ రెండు వర్గాల్ని దూరం చేయాలనే తలంపుతో సందర్భం ఉన్నా లేకున్నా, ఇలాంటి విషపూరిత పదాల్ని జోడించి, చరిత్రను వక్రీకరించారు. దీన్ని మనం అర్థం చేసుకోలేక అనవసరమైన, అనుమానాలకు, అపార్థాలకు, వైషమ్యాలకు గురి అయి, భారీ మూల్యాన్ని చెల్లించుకుంటున్నాము - రచయిత.*

**మొత్తం మొగలు మన్సబుదార్లలో, హిందూ మన్సబుదార్ల పరిస్థితిని స్పష్టంగా అర్థం చేసుకోవడానికి వారి శాతాన్ని తీసి చూడవచ్చు.**

| మన్సబుల స్థాయి | అక్బర్ కాలం | షాజహాన్ కాలం | ఔరంగజేబ్ కాలం | |
|---|---|---|---|---|
| | 1595 | 1628–58 | 1658–78 (20 సం.) | 1679–1707 (30 సం.) |
| 5000 ఆపై మన్సబుదార్లు | 14.3% | 24.5% | 19.6% | 32.9% |
| 3000 నుండి 4500 ” | 10.0% | 25.0% | 20.0% | 27.1% |
| 1000 నుండి 2700 ” | 35.3% | 21.3% | 22.3% | 33.1% |
| 500 నుండి 900 ” | 21.8% | – | – | – |
| మొత్తం | 22.5% | 22.4% | 21.6% | 31.6% |

జాతులు, ధర్మాల ననుసరించి ఔరంగజేబ్ కాలం నాటి మన్సబుదారుల వివరములు:

**మొదటి దశ : 1658–1678 (టేబుల్ – ఎ)**

| మన్సబుల స్థాయి | ఇరాని | తూరాని | అఫ్గాని | భారతీయ ముస్లింలు | ఇతర ముస్లింలు | మొత్తం ముస్లింలు | రాజ పుత్రులు | మరాఠాలు | ఇతర హిందువులు | మొత్తం హిందువులు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 5000 ఆపై మన్సబుదార్లు | 23 | 9 | 3 | 4 | 2 | 41 | 6 | 3 | 1 | 10 | 51 |
| 3000 నుండి 4500 | 32 | 16 | 9 | 10 | 5 | 72 | 11 | 6 | 1 | 18 | 90 |
| 1000 నుండి 2700 | 81 | 42 | 31 | 51 | 63 | 268 | 54 | 18 | 5 | 77 | 345 |
| మొత్తం | 136 | 67 | 43 | 65 | 70 | 381 | 71 | 27 | 7 | 105 | 486 |

**రెండవ దశ : 1679–1707 (టేబుల్ – బి)**

| మన్సబుల స్థాయి | ఇరాని | ★ తూరాని | అఫ్గాని | భారతీయ ముస్లింలు | ఇతర ముస్లింలు | మొత్తం ముస్లింలు | రాజ పుత్రులు | మరాఠాలు | ఇతర హిందువులు | మొత్తం హిందువులు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 5000 ఆపై మన్సబుదార్లు | 14 | 6 | 10 | 10 | 13 | 53 | 5 | 16 | 5 | 26 | 79 |
| 3000 నుండి 4500 ” | 40 | 22 | 4 | 18 | 13 | 97 | 15 | 18 | 3 | 36 | 133 |
| 1000 నుండి 2700 ” | 72 | 44 | 20 | 41 | 66 | 243 | 53 | 62 | 5 | 120 | 363 |
| మొత్తం | 126 | 72 | 34 | 69 | 92 | 393 | 73 | 96 | 13 | 182 | 575 |

మొగలుల కాలంలో మొగలు దర్బారును ఆశ్రయించి ఉండే నాయకుల్ని మన్సబుదార్లుగా పిలిచేవారు. ఏ స్థాయికి, ఏ ర్యాంకుకు చెందిన మన్సబుదారో, ఆ స్థాయికి తగ్గ సైనికుల్ని (పదాతి, అశ్విక) తన వద్ద సిద్ధంగా ఉంచుకోవాల్సి ఉండేది. వారి వారి మన్సబులను అనుసరించి వారికి తగ్గట్టుగా జాగీర్లు కేటాయించడమే కాకుండా, నగదు రూపంలో జీతాలు కూడా ఇవ్వబడేవి. పదాతి, అశ్విక దళాల సంఖ్యతో పాటుగా 3 అస్పా, 2 అస్బా అనే స్పెషల్ క్యాడర్ కూడా ప్రసాదించబడేది. అంటే ఇది మన్సబు ర్యాంకే కాకుండా అదనపు ప్రశంసాపూర్వకమైన, గౌరవప్రదమైన చిహ్నంగా గుర్తించబడేది. ఈ 2 అస్పా, 3 అస్పాకు అర్థం ఏమిటంటే, ఉదాహరణకు నాలుగు వేల మన్సబుదారుకు 2 అస్పా, 3 అస్పా క్యాడర్ ఇవ్వబడిందంటే అతని వద్ద 4000 అశ్విక + 1000 అశ్వికులు (అస్పా బాపతు). ఈ 2 అస్పా, 3 అస్పా మన్సబుకు జీతంతో పాటు బాధ్యతలు కూడా పెరిగిపోయేవి. రాబోయే మన్సబుదార్ల జాబితాలో ఈ 3అస్పా, 2 అస్పా అనే ప్రస్తావన వస్తుంది కనుక దీన్ని కొంచెం వివరించాము.

అత్‌హర్ అలీ రూపొందించిన The Moghal Nobility under Aurangazeb అనే గ్రంథాన్ని అనుసరించి ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో (మొదటి దశ 1658-1678, రెండవ దశ 1679-1707) అతని దర్బారులోని హిందూ మన్సబుదారుల జాబితా ఇలా ఉంది :

**5000 ఆపై మన్సబుదార్లు**

| క్రమ సంఖ్య | మన్సబుదారు పేరు (బిరుదుతో సహా) | మన్సబు & అశ్వికుల సంఖ్య |
|---|---|---|
| 1. | (ఉమ్దతుల్ ముల్క్ మిర్జా) రాజా జైసింగ్ | 7000 |
| 2. | మహారాజా జస్వంత్ సింగ్ | 7000 |
| 3. | రాణా రాజ్‌సింగ్ | 6000 |
| 4. | రాయె భాన్ | 6000 |
| 5. | సంభాజీ | 6000 |
| 6. | మాన్‌సింగ్ తండ్రి సంభాజీ | 6000 |
| 7. | కజ్ నాయక్ | 6000 |
| 8. | యాదయ్య నాయక్ | 5000 |
| 9. | జగ్గన్న నాయక్ | 5000 |
| 10. | రాజా రాం సింగ్ | 5000 |
| 11. | బాలూజి దక్నీ | 5000 |

★ ***తొరాని:*** *సెంట్రల్ ఆసియాలోని టర్కిష్ భాష మాట్లాడే మంగోల్, తాతారి, ఉజ్బెక్ మొదలగు జాతులందరికోసం ఈ పదం ఉపయోగించబడేది. వీరు పరిపాలకుల (మొగలుల) జాతికి చెందిన వారుగా పరిగణింపబడేవారు.*

| | | |
|---|---|---|
| 12. | రాణా అమర్ సింగ్ ద్వితీయ | 5000 |
| 13. | రాజా రాయెసింగ్ సిసోదియా | 5000 |
| 14. | రామా జైసింగ్ | 5000 |
| 15. | చంపత్ బుందేల | 5000 |
| 16. | నస్థోజి | 5000 |

**4000 నుండి 3000 అశ్వికులున్న మన్సబుదారులు**

| | | |
|---|---|---|
| 1. | యశ్వంత్ రాయ్ | 4000 |
| 2. | రాయెసింగ్ రాథోడ్ | 4000 |
| 3. | ఇందర్ మాన్ ఢందేరా | 4000 |
| 4. | దామాజీ | 4000 |
| 5. | రాజా నూర్‌పూర్ | 3500 |
| 6. | రాజా అనురోధ్ గౌడ్ | 3500 |
| 7. | రాజా సుజాన్‌సింగ్ బుందేల | 3500 |
| 8. | రావుకరన్ భారతి | 3500 |
| 9. | బర్సోజి - దక్ని | 3000 |
| 10. | కీరత్ సింగ్ | 3000 |
| 11. | గిరిధర్ దాస్ గౌడ్ | 3000 |
| 12. | దాతాజీ దక్ని | 3000 |
| 13. | జగ్‌జీవన్ ఉదాజి రామ్ | 3000 |
| 14. | అంబాజి ఖాండ్‌కాలా | 3000 |
| 15. | బైరందేవ్ సిసోదియా | 3000 |
| 16. | రఘునాథ్ రామన్ | 3000 |
| 17. | రఘునాథ్ సిసోదియా చంద్రావత్ | 3000 |
| 18. | దల్పత్‌రాయ్ బుందేల | 3000 |
| 19. | టాకూజి | 3000 |
| 20. | బాసుదేవ్ జట్‌లాన్ | 3000 |
| 21. | నేతాజి తండ్రి జాన్ రావు | 3000 |
| 22. | ఢోలోజి తండ్రి సంభాజి | 3000 |
| 23. | ఆనంద్ రావు | 3000 |
| 24. | దుర్గా దాస్ రాథోడ్ | 3000 |
| 25. | భాన్ పురోహిత్ | 3000 |
| 26. | ఇందర్ సింగ్ తండ్రి రాణా రాజ్‌సింగ్ | 3000 |

| | | |
|---|---|---|
| 27. | క్రిప్లాజి | 3000 |
| 28. | రాజా ఓదత్ సింగ్ భదూరియా | 3000 |
| 29. | సొహ్‌రాబ్ | 3000 |
| 30. | సోమె నాయక్ | 3000 |
| 31. | పతంగ్ రావు | 3000 |
| 32. | జద్‌రావత్ | 3000 |
| 33. | మాన్‌సింగ్ తండ్రి రూప్‌సింగ్ రాథోడ్ | 3000 |
| 34. | రావు రాయ్ సింగ్ హోరా | 3000 |
| 35. | బదర్‌జీ లేక పాడాజి | 3000 |
| 36. | బాజీ రావు | 3000 |
| 37. | రాజా బిషన్ సింగ్ | 3000 |
| 38. | జదమ్ రాయ్ దక్ని | 3000 |
| 39. | జగత్ రాయ్ దేశ్‌ముఖ్, నుస్రతాబాద్ | 3000 |

**2500 నుండి 2000 అశ్వికులున్న మన్సబుదార్లు**

| | | |
|---|---|---|
| 1. | రాజా దేబీ సింగ్ బుందేల | 2500 |
| 2. | కిషోర్ సింగ్ హోరా ఆఫ్‌కోటా | 2500 |
| 3. | శుభ్‌కరణ్ బుందేల | 2500 |
| 4. | రాజా రాం సింగ్ సిసోదియా | 2500 |
| 5. | మంకూజి దక్ని తండ్రి తన్కాజి | 2500 |
| 6. | మాహన్‌జి తండ్రి మంకూజి | 2500 |
| 7. | సంభాజి బంధారా తండ్రి లాల్‌జీ బంధారా | 2500 |
| 8. | కొొండాజి | 2500 |
| 9. | అనూప్ సింగ్ | 2500 |
| 10. | సుబ్‌కరన్ బుందేలా | 2500 |
| 11. | బాబాజీ భోన్‌స్లా | 2500 |
| 12. | భగవంత్ సింగ్ తండ్రి సతర్ సాల్ హోరా | 2500 |
| 13. | రావు అమర్ సింగ్ చంద్రావత్ | 2500 |
| 14. | సాధూజి తండ్రి నాగూజి | 2500 |
| 15. | భాలిరావు తండ్రి కార్లుజీ బంధారా | 2500 |
| 16. | నారూజీ రాఘవ్ | 2500 |
| 17. | రావ్‌బుధ్ సింగ్ ఆఫ్ బూంది | 2500 |
| 18. | మహద్‌జీ మానె | 2500 |

| | | |
|---|---|---|
| 19. | రఘుజీ | 2500 |
| 20. | దేబీదాస్ ఇఖ్‌లాస్ కేష్ | 2500 |
| 21. | కిషన్ సింగ్ | 2500 |
| 22. | మానాజి భోన్‌స్లా | 2500 |
| 23. | రుస్తుం రావు | 2500 |
| 24. | సబాల్ సింగ్ సిసోదియా | 2500 |
| 25. | ట్రిమ్‌బక్‌జీ భోన్‌స్లా | 2500 |
| 26. | రాజా బిక్రమ్ సింగ్ ఆఫ్ గులేర్ (పంజాబ్) | 2500 |
| 27. | అర్జూజీ తండ్రి సంభాజి | 2000 |
| 28. | జగత్ సింగ్ హారా | 2000 |
| 29. | మాకూజి | 2000 |
| 30. | సుజాన్ సింగ్ తండ్రి అనూప్ సింగ్ | 2000 |
| 31. | అనిరాయ్ బ్రాహ్మణ్ - దివానె - తాన్ | 2000 |
| 32. | రావుజీ | 2000 |
| 33. | దావ్‌జీ | 2000 |
| 34. | జావ్‌జీ | 2000 |
| 35. | మాధుజీ నారాయణ్ | 2000 |
| 36. | లచ్మన్ పాటి | 2000 |
| 37. | రాంచంద్ జమీంద్ థానెదార్ కహ్‌టానన్ | 2000 |
| 38. | మహ్‌మాన్‌జి | 2000 |
| 39. | జైసింగ్ సవాయి | 2000 |
| 40. | రాంసింగ్ తండ్రి రతన్ రాథోడ్ | 2000 |
| 41. | తీమాజి | 2000 |
| 42. | రాం రావు చంద్ తండ్రి దల్పత్ బుందేలా | 2000 |
| 43. | మానాజి (మాయాజి) తండ్రి అంకూజి | 2000 |
| 44. | రావు దీనాజి (దీనాజి) సాల్వి | 2000 |
| 45. | శివ్‌సింగ్ | 2000 |
| 46. | ఇసూజి దక్ని | 2000 |
| 47. | రాజా నార్ సింగ్ గౌడ్ | 2000 |
| 48. | రాజా తోడర్ మల్ | 2000 |
| 49. | జగత్ సింగ్ హారా తండ్రి ముకుంద్ సింగ్ హారా | 2000 |
| 50. | నారూజీ దక్ని | 2000 |
| 51. | పోరన్‌మల్ బుందేల | 2000 |
| 52. | వ్యాస్‌రావు (లేక) బ్యాస్‌రావు | 2000 |

| | | |
|---|---|---|
| 53. | దాదాజి | 2000 |
| 54. | మేద్నీసింగ్ తండ్రి ప్రీతి సింగ్ శ్రీనగర్ | 2000 |
| 55. | తానూజీ | 2000 |
| 56. | ప్రీతి సింగ్ తండ్రి రాజా జస్వంత్ సింగ్ రాథోడ్ | 2000 |

పైన పేర్కొన్న వారు పట్టి సైనికులేం కారు. రెండువేల నుండి ఏడు వేల పదాతి మరియు దాదాపు అంతే సంఖ్యగల అశ్విక దళాలకు మన్సబుదార్లు (యజమానులు). ఇంతమంది హిందూ మన్సబుదార్లను తన ప్రభుత్వంలో తన దర్బారులో చేర్చుకున్నప్పటికీ హిందూ వ్యతిరేకిగా ముద్రపడడం అతని దురదృష్టం కాకుంటే మరేమిటి? చరిత్రకారులన బడేవారు, అతన్ని "హిందువుల్ని అన్ని రకాల ఉద్యోగాల నుండి వంచించినవాడుగా పేర్కొనడం ఎంతవరకు న్యాయం? సమకాలీన చరిత్రల ఆధారంగా అతని చరిత్రను రూపొందించామని చెప్పుకున్నవారికి, అతని సమకాలీన చరిత్ర గ్రంథాల్లో ఈ పేర్లు కనబడలేదా? కనబడినప్పటికీ దాటేసి, అన్ని రకాల ఉద్యోగాల్నుండి వంచించాడని వ్రాయడానికి వారి మనసెలా అంగీకరించిందో? చరిత్ర వక్రీకరణ అంటే ఇదే. ఒక పథకం ప్రకారం ఇలా ఎందుకు వ్రాశారో ముందే వివరించి వచ్చాము. తిరిగి దాన్నే పునరావృతం చేయడం అనవసరం. అయితే పాపం అత్‌హర్ అలీ అతి వ్యయప్రయాసలకోర్చి మొగలు వంశ చరిత్ర అనే మహా సముద్రంలో మునిగి ఆణిముత్యాలను ఏరుకొచ్చారు. అంతులేని అన్వేషణ జరిపి పెద్ద పెద్ద పొట్టూ, తాలు రాసుల్ని తూర్పారా పట్టి, నిజమైన ధాన్యపు గింజల్ని (మనుషుల్ని) సేకరించగలిగారు. ఆయన చూసిన, మనకు చూపించిన ఈ ఆధారాల్ని (సమకాలీన చరిత్ర గ్రంథాల్ని) చూసి, తల తిరిగి పోతుంది. ఏ లక్ష్యం కోసం ఆయన ఇంతగా శ్రమపడ్డారో, కరుణామయుడైన దైవం ఆ లక్ష్యాన్ని (అంటే జాతీయ సమైక్యతను) నెరవేర్చుగాక!

ఔరంగజేబ్ పరిపాలనా కాలాన్ని (50 ఏళ్ళని) ఆయన రెండు దశలుగా విభజించారు. మొదటి దశ 1658 నుండి 1678 వరకు, రెండవ దశ 1679 నుండి 1707 వరకు. ఈ రెండు దశల్లో ఔరంగజేబ్ ప్రభుత్వం / దర్బారులో నియుక్తులైన హిందూ అనుశాసనుల, నాయకుల రెండు జాబితాలను ఆయన సమర్పించారు. ఇందులో మన్సబుదారుల పేర్లు (మన్సబు దారులంటే అనుశాసకులు, నాయకులు, సేనానులు మొదలగు అర్థాలు వస్తాయి) వారి మన్సబుస్థాయి (ర్యాంకు) అంటే ఎంతమంది పదాతి, ఎంతమంది అశ్వికుల సైన్యానికి అధిపతి, అతని జాతి వివరాలు - చివరలో ఈ పేరును ఎక్కడి నుండి సేకరించారో, ఆ చారిత్రక సాక్ష్యాధారాన్ని కూడా, దాని పేజీ నెంబరుతో సహా పేర్కొన్నారు.

మన పాఠకుల సౌలభ్యం కోసం ఏ క్యాటగిరికి చెందిన మన్సబుదారులు ఎంతమంది ఉన్నారు అని ఒక దృష్టిలో తెలుసుకోవడానికే మన్సబుస్థాయిని అనుసరించి వారందరి పేర్లను గడిచిన పేజిలో ఒకచోట చేర్చామే తప్ప, అసలు అత్‌హర్ అలి జాబిత ఇప్పుడు మొదలవుతుంది.

ఈ జాబితాల్ని సమర్పించే సందర్భంలో, ఈ పేర్లు ఏ చరిత్ర గ్రంథాల నుండి సేకరించబడ్డాయో, వాటికి ఆధారాలేమిటో అత్‌హర్ అలి పేర్కొన్నారు. కాని స్థలాభావం వల్ల వాటి పూర్తి పేర్లు వ్రాయడం సంభవం కాక సంక్షిప్త రూపంలో వ్రాశారు. ఈ ఆధారాల పేర్లు మనం ముందే తెలుసుకుంటే వాటి Abbrevation- అంటే వివరణ తెలుసుకోవడం సులభంగా ఉంటుంది. వాటిలో నుండి కొన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము.

1. ఆలంగీర్ నామా ........ = ఆ.నా.
   (ముహమ్మద్ కాజిమ్)
2. మాస్సర్ ఆలంగీరి ........ = మా.ఆ.
3. అర్కాన్ మాస్సర్ తైమూరియ ........ = అ.మా.తై.
4. తారీఖె ముహమ్మది ........ = తా.ము.
5. తజ్‌కిరతుల్ ఉమ్రా ........ = త.ఉ.
6. అఖ్బారాతె దర్బారె ముఅల్లా ........ = అఖ్బా
7. బసాతీనుస్ సలాతీన్ ........ = బ.స.
8. (ఔరంగజేబ్ కాలం నాటి) ఎంపిక చేసిన వివిధ దస్తావేజులు ....... = ఎ.వి.ద.
9. ఫర్‌హతున్ నజ్‌రీన్ ........ = ఫ.న.
10. ఆదాబె ఆలంగీరి ........ = ఆ.ఆ.
11. రుఖ్‌ఆత్ ఆలంగీరి ........ = రు.ఆ.
12. జువాబితె ఆలంగీరి ........ = జు.ఆ.
13. ఆలంగీర్ నామ (హాషిం ఖాన్) ........ = హా.ఖా.
14. తజ్‌కిరతుస్సలాతీన్ చుగ్‌తాయి ........ = కాంవర్
15. ఫతూహాతె ఆలంగీరి ........ = ఈసర్‌దాస్
16. తారీఖె ఔరంగజేబ్ ........ = మామూరి
17. మాసిరుల్ ఉమ్రా ........ = మా.ఉ.
18. మిరాతుల్ ఆలం ........ = మి.ఆ.

## ఔరంగజేబ్ కాలం నాటి 7000 నుండి 1000 వరకు మన్సబు కలిగిన హిందూ మన్సబుదారుల జాబితా

### (1). మొదటి దశ 1658 - 1678 (20 సం.లు)

| క్రమ సంఖ్య | పేరు, బిరుదుతో సహా (బిరుదులు బ్రాకెట్లో చూపబడ్డాయి) | అత్యున్నత ర్యాంకు / స్థాయికి చేరినది | జాతి /కులము | ఎక్కడి నుండి ఈ పేర్లు సేకరించబడ్డాయో, ఆ చారిత్రక ఆధారాలు / అథారిటీ |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1. | (ఉమ్దతుల్ ముల్క్ మిర్జా) రాజా జైసింగ్ కచ్‌వాహా | 7000 పదాతి / 7000 అశ్వికులు (2-3 అస్పా) | రాజపుత్ర | ఆలంగీర్ నామ -పేజి 907, మాసిరుల్ ఉమ్రా వా-3, పేజి 568-577, ఎంపిక చేసిన ఆలంగీర్ దస్తావేజులు - 52 |
| 2. | మహారాజా జస్వంత్ సింగ్ రాథోడ్ | 7000/7000 (5000×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా. పే.331-332 మా.ఉ.3 పేజి 599-604 |
| 3. | రాణా రాజ్ సింగ్ | 6000/6000 (1000×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా.పే.194, మా.ఉ.2, పేజి 206-08 |
| 4. | సాంభాజి | 6000/6000 | మరాఠా | మాస్సర్ ఆలంగీర్ పేజి 142, జామిఅల్ ఇష్షా, పే.76 ఎ |
| 5. | కజ్ నాయక్ | 6000/ | దక్నీ(దక్షిణ భారతీయుడు) | దిల్‌కుషా పేజి 59బి |
| 6. | రాజా రామ్ సింగ్ కచ్‌వాహా | 5000/5000 | రాజపుత్ర | అఖ్బార్ - 19 రబ్బియుస్సాని, ఏ.షే. 12వ సం॥ మా.ఉ.-2, పే. 301-303 |
| 7. | మాలూజి దక్నీ | 5000/5000 | మరాఠా | ఆ.నా- పేజి 427, మా.ఉ.-3, పేజి 520-524 |
| 8. | రాజా రాయ్ సింగ్ సిసోదియ | 5000/5000 (500×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా. 1033, తారీఖె ముహమ్మది -1083 ఎ.హెచ్.మా.ఉ-2, పే.297-301 |
| 9. | చంపత్ బుందేల | 5000/ | రాజపుత్ర | దిల్‌కుషా - పేజి 15 బి |

| | | | |
|---|---|---|---|
| 10. నేతూజి | 5000 / | మరాఠా | ఆ.నా. పేజి 971, మా.ఉ.3 పే.577, మి.ఆ. 205 ఎ. |
| 11. యశ్వంత్ రావు కార్ తలబ్ ఖాన్ | 4000/4000 (1000×2-3 అస్పా) | దక్నీ | ఆ.నా. పేజి 76, మా.ఉ.-2, పేజి 309 |
| 12. రాయె సింగ్ రాథోడ్ | 4000/4000 | రాజపుత్ర | ఆ.నా. పేజి 288, అ.మా.తై. పేజి 124 ఎ, మా.ఉ.-2, పేజి 235 - 236 |
| 13. ఇంద్రమాన్ బందేరా | 4000/3000 (500×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా. పేజి 43, 399, మా.ఉ.-2, పే.265-266 |
| 14. జాదూం రాయ్ దక్ని | 4000/2500 | మరాఠా | ఆ.నా. పేజి 161 |
| 15. రావ్ భావ్ సింగ్ హాడా | 4000/2500 | రాజపుత్ర | ఆ.నా. పేజి267,మా.ఉ.-2, పే.305-307, అ.మా.తై- పేజి 123 బి |
| 16. దామాజి | 4000/1300 | మరాఠా | ఆ.నా. పేజి.47 |
| 17. రాజా రూప్ (నూర్‌పూర్) | 3500/3500 (500×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా. పేజి.198, 625, తా.ము. పేజి.1072, హెచ్. మా.ఉ.-2, పేజి 277-281 |
| 18. రాజా అనురోధ్ గౌర్ | 3500/3000 (2-3 అస్పా) | రాజపుత్ర | మా.ఉ.-2, పేజి 276-277 |
| 19. రాజా సుజాన్‌సింగ్ బుందేల | 3500/3000 (500×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా. 342, 486, 908, అ.మా.తై.-124 బి, మా.ఉ.-2, పేజి 291-295 |
| 20. రావు కరన్ భారతియా | 3500/2000 | రాజపుత్ర | ఆ.నా.855, అ.మా.తై-125 బి, మా.ఉ.-2, పేజి 287-291 |
| 21. పర్సోజి దక్ని | 3000/3000 | మరాఠా | ఆ.నా.140,231,242, మా.ఉ.-3, 520-524 |
| 22. కీరత్ సింగ్ | 3000/2500 | రాజపుత్ర | ఆ.నా.1061, మా.ఉ.3, పే 156-158 |

| | | | |
|---|---|---|---|
| 23. గిరిధర్ దాస్ గౌర్ | 3000/2000 | రాజపుత్ర | ఎ.వి.దస్తా-28, మా.ఉ.2, పేజి 255-56, అ.మా.తై.126 ఎ |
| 24. దాతాజి దక్ని | 3000/2000 | మరాఠా | ఆ.నా.625, మా.ఉ.-1, పే.522 |
| 25. జగ్జీవన్, ఉదాజి రామ్ | 3000/2000 | మరాఠా | మా.ఉ.-1, పేజి 144 |
| 26. అంతాజి ఖండ్కలా | 3000/2000 | మరాఠా | ఎ.వి.దస్తా-13 |
| 27. బైరం దేవ్ సిసోదియా | 3000/1000 | రాజపుత్ర | ఆ.నా.762, ఎ.వి.దస్తా-112, మా.ఉ.-2, పే.452-54 |
| 28. రఘునాథ్ రాయె రాయాన్ | 3000/700 | భారతీయ | ఆ.నా. 763, మా.ఉ.-1, పేజి 272-74 |
| 29. రఘునాథ్ సింగ్ సిసోదియా చంద్రావత్ | 3000/300 | రాజపుత్ర | అఖ్బా-రమజాన్ 10, ప.షే.13వ సం॥ కామ్వార్ - 250 బి |
| 30. రాజా దేబి సింగ్ బుందేల | 2500/2500 | రాజపుత్ర | ఆ.నా.పే.206, 758, ఎ.వి.దస్తా 117, మా.ఉ.2, పే. 295-97 |
| 31. అనూప్ సింగ్ | 2500/2000 | రాజపుత్ర | మా.ఉ.-2, పే.289-91 |
| 31/1.సుభ్కరన్ బుందేలా | 2500/2000 | రాజపుత్ర | ఆ.నా.301,565,1034 ఆ.మా.తై.132బి |
| 32. బాబాజి భోన్స్లా | 2500/1500 | మరాఠా | ఆ.నా. పేజి 54 |
| 33. భగవంత్ సింగ్ తండ్రి సతర్సాల్ హాడా | 2500/1500 | రాజపుత్ర | ఆ.నా.474-75, అ.మా.తై. పేజి 126 బి |
| 34. రావ్ అమర్ సింగ్ చంద్రావత్ | 2500/1500 | రాజపుత్ర | ఆ.నా.పే.856,అఖ్బా 29, రబ్బియుస్సాని ప.షీ. 8వ సం॥ మా.ఉ.-2, పేజి 145-47 |
| 35. మానాజి భోన్స్లా | 2500/1500 | మరాఠా | ఎ.వి.దస్తా.7, ఆ.నా.పే.128, హాతిం ఖాన్ 16ఎ |
| 36. రుస్తం రావు | 2500/1200 | మరాఠా | ఆ.నా. పేజి 47 |
| 37. సుబల్ సింగ్ సిసోదియా | 2500/1000 | రాజపుత్ర | ఎ.వి.దస్తా.108, మా.ఉ.-2, పే.468-69 |

| | | | |
|---|---|---|---|
| 38. తురంబక్‌జీ భోన్‌స్లా | 2500/1000 | మరాతా | ఆ.నా. పేజి 48, దఫ్తర్-ఎ-దీవాని, 19వ జిల్‌హజ్, ప.షే. 6వ సం॥ |
| 39. రాజా బిక్రమ్ సింగ్ గులేర్ (పంజాబ్) | 2500/ | రాజపుత్ర | ఎం.అక్బర్, ది పంజాబ్ అండర్ మొగల్స్ 223 |
| 40. రాజా నర్‌సింగ్ గౌర్ | 2000/2000 | రాజపుత్ర | ఆ.నా.- 268-865 |
| 41. రాజా తోడర్‌మల్ | 2000/2000 | భారతీయుడు | ఆ.నా.874, 885, మా.ఉ.2,286, 287 |
| 42. జగత్ సింగ్ హాడా తండ్రి ముకుంద్ సింగ్ హారా | 2000/1500 (500×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా. 221, 134, దిల్‌కుషా 79 బి, మా.ఉ.-3, 510 |
| 43. నారూజీ దక్నీ | 2000/1600 | మరాతా | అఖ్బా-13వ రమజాన్, ప.షే.13వ సం॥ |
| 44. పూరన్‌మల్ బుందేలా | 2000/1500 | రాజపుత్ర | ఆ.నా. 986 |
| 45. వ్యాస్ రావు లేక బ్యాస్ రావు | 2000/1200 | మరాతా | ఆ.నా. 48 |
| 46. దాదాజి | 2000/1000 | మరాతా | ఆ.నా. 48 |
| 47.మేద్నీ సింగ్ తండ్రి ప్రీతి సింగ్ సింగ్ ఆఫ్ శ్రీనగర్ | 2000/1000 | రాజపుత్ర | ఆ.నా.604, కాంవార్ - 236 బి |
| 48. తానూజి | 2000/1000 | మరాతా | ఆ.నా. 47 |
| 49. ప్రీతి సింగ్ తండ్రి రాజా జస్వంత్ సింగ్ రాథోర్ | 2000/1000 | రాజపుత్ర | ఆ.నా.-917, తా-ము-1077 ఎ.హెచ్. |
| 50. అనిరాయ్ బ్రాహ్మణ్ | 2000/1000 | భారతీయుడు | ఎస్.అహ్మద్, ఉమ్రాయె హునూద్ పేజి 64 |
| 51. గోపాల్ సింగ్ తండ్రి రాజా సరూప్ | 1500/1500 | రాజపుత్ర | ఆ.నా. 1056 |
| 52. పహాడ్ సింగ్ గౌడ్ ఆఫ్ ఇందర్కీ | 1500/1000 (2-3 అస్పా) | రాజపుత్ర | ఈసర్ దాస్ పేజి.94 ఎ |
| 53. బాగూజి దక్నీ | 1500/1500 | మరాతా | అఖ్బా 22 షాబాన్, ప.షే.4వ సం॥ |
| 54. సారంగ్ థర్, జమీందార్ ఆఫ్ జమ్మూక | 1500/1500 | భారతీయుడు | ఆ.నా.286-87 |
| 55. జగత్ సింగ్ | 1500/1400 | రాజపుత్ర | దఫ్తర్ దివాని నెం.2986 |
| 56. కేసరి సింగ్ భూరతియా | 1500/1400 | రాజపుత్ర | ఆ.నా. 1047 |

| | | | |
|---|---|---|---|
| 57. రాంభాజి దక్ని | 1500/1200 | మరాఠా | ఆ.నా. 293 |
| 58. రాయె మకరంద్ | 1500/1200 | భారతీయ | ఆ.నా. 885 |
| 59. భోజ్‌రాజ్ కచ్వాహ్ | 1500/1200 | రాజపుత్ర | సెలెక్టెడ్ వ ఖాయె ఆఫ్ దక్కన్-52, ఆ.నా. 917 |
| 59/1. మిత్ర్‌సేన్ బుందేల | 1500/1200 | రాజపుత్ర | ఆ.నా. 302,1062 అ.మా.తై. 132బి |
| 60. డాకూజి | 1500/1200 | మరాఠా | ఆ.నా. 48 |
| 61. రాజా మాన్‌సింగ్ ఆఫ్ గులేర్ (పంజాబ్) | 1500/1000 | రాజపుత్ర | ఆ.నా. 199, 287 |
| 62. హర్‌జిస్ గౌర్ | 1500/1000 | రాజపుత్ర | ఆ.నా. 270, 982, టి.యు. (ఎస్.వి.) |
| 63. ఛతర్ భోజ్ చౌహాన్ (జమిందార్ ఆఫ్ అజావున్) | 1500/1000 | రాజపుత్ర | ఆ.నా. 270, తా.ము. 1079 ఎ.హెచ్. |
| 64. రాజా అమర్ సింగ్ నారూరి | 1500/1000 | రాజపుత్ర | ఆ.నా.447, 1056, అ.మా.తై. 131 బి, మా.ఉ.-2, 227-28 |
| 65. రాజా కిషన్ సింగ్ తౌనూర్ | 1500/1000 | రాజపుత్ర | ఆ.నా. 304, 428 |
| 66. ఉదయ్ భాన్ రాథోర్ | 1500/1000 | రాజపుత్ర | ఆ.నా. 334 |
| 67. మాన్‌సింగ్ తండ్రి రూప్‌సింగ్ రాథోర్ | 1500/700 | రాజపుత్ర | ఆ.ఆ. 315 బి, ఆ.నా. 158, 447, మా.ఉ.-2, 270 |
| 68. జగ్‌రాం కచ్వాహ్ | 1500/1000 | రాజపుత్ర | ఆ.నా. 1056 |
| 69. రఘుజీ తండ్రి మానాజి భోన్‌స్లా | 1500/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.7 |
| 70. షర్జారావు కావా | 1500/1000 | మరాఠా | ఎ.వి.దస్తా-7 |
| 71. రఘునాథ్ సింగ్ భారతీయ | 1500/900 | రాజపుత్ర | ఆ.నా. 1061-62 |
| 72. రఘునాథ్ సింగ్ మీరట్ | 1500/800 | రాజపుత్ర | అఖ్బార్, 29 రబ్బియుస్సాని, ప.షే.8వ సం॥ ఆ.మా.తై.132 ఎ.,20 జిఖాయెద ప.షే.10వ సం॥ |

| | | | |
|---|---|---|---|
| 73. మహేశ్ దాస్ రాథోర్ | 1500/600 | రాజపుత్ర | ఆ.నా. 163 |
| 74. రఘునాథ్ సింగ్ రాథోర్ తండ్రి సుందర్‌దాస్ రాథోర్ | 1500/600 | రాజపుత్ర | ఆ.నా. 635 |
| 75. కరణ్ కాఛి | 1500/500 | రాజపుత్ర | ఆ.నా. 52 |
| 76. రాజా ప్రీతి చంద్ | 1500/500 | రాజపుత్ర | ఆ.నా. 237 |
| 77. షేర్ సింగ్ రాథోర్ | 1000/1000 (2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా. 441 |
| 78. మహ్రోవల్ జస్వంత్ సింగ్ ఆఫ్ దుంగార్‌పూర్ | 1000/1000 (800×2-3 అస్పా) | రాజపుత్ర | అఖ్బార్ 16 జిల్‌హజ్, ప.షే.38వ సం॥ ఓర్మీ వా-3, భాగం-1, పే.115 |
| 79. ఇందర్ సింగ్ తండ్రి రావు రాయ్ సింగ్ | 1000/1000 (700×2-3 అస్పా) | రాజపుత్ర | ఎ.వి.దస్తా-121, మా.ఉ.-2, పే.236 |
| 80. రాజా మహాసింగ్ బహ్‌దూరియా | 1000/1000 (500×2-3 అస్పా) | రాజపుత్ర | ఆ.నా.1044, మా.ఉ.-2, 229-30 |
| 81. రామ్‌సింగ్ తండ్రి రతన్ రాథోర్ | 1000/1000 | రాజపుత్ర | ఆ.నా. 486 |
| 82. ఛత్రుజీ దక్ని | 1000/1000 | మరాఠా | ఆ.నా.206 |
| 83. మాన్ ధాతా | 1000/1000 | రాజపుత్ర | ఆ.నా. 647-48 |
| 84. రాజా జైసింగ్ | 1000/1000 | రాజపుత్ర | ఆ.నా. 964 |
| 85. రాజా బహ్‌రూజ్ | 1000/1000 | రాజపుత్ర | ఆ.నా.340, తా.ము-1076 ఎ.హెచ్. మా.ఉ.-2, 229 |
| 86. ఇంద్రమన్ బుందేల | 1000/700 | రాజపుత్ర | దఫ్తరె దీవాని-2983, ఎ.వి.దస్తా-112, ఆ.నా-989 |
| 87. కుందాజి దక్ని | 1000/800 | దక్ని దక్షిణ భారతీయుడు | ఆ.నా.1062, మా.ఉ.3, పే.580 |
| 88. సూరజ్ మల్ గౌర్ | 1000/800 | రాజపుత్ర | ఆ.నా.192 |
| 89. మానాజి తండ్రి వనెరథ్‌జీ | 1000/700 | మరాఠా | దఫ్తరె దీవాని, నం.2986 |
| 90. తామాజి జమిందార్‌ఆఫ్‌కచ్ | 1000/700 | రాజపుత్ర | ఆ.నా. 625 |
| 91. భీంసింగ్ ఆఫ్ శ్రీనగర్ | 1000/600 | రాజపుత్ర | ఆ.నా. 960 |

| | | | |
|---|---|---|---|
| 92. గర్భూజీ తండ్రి వాన్కర్ రావు | 1000/600 | మరాఠా | దఫ్తరె దీవాని నెం.2986 |
| 93. సౌన్సింగ్ ఆఫ్ కాలిభెట్ | 1000/500 | రాజపుత్ర | ఆ.నా.55, హాతిం ఖాన్ 16 బి |
| 94. కళ్యాణ్ సింగ్ ఆఫ్ బందూ | 1000/500 | రాజపుత్ర | ఆ.నా.215 |
| 95. భావ్ సింగ్ మురీద్ ఖాన్ | 1000/500 | భారతీయ | ఆ.నా. 981, మా.ఉ.–2, 281 |
| 96. రఘుజీ ఘోపరే | 1000/500 | మరాఠా | ఎ.వి. దస్తా.107 |
| 97. ప్రేమ్ సింగ్ (జమీందార్ శ్రీనగర్) | 1000/500 | రాజపుత్ర | ఆ.నా.872 |
| 98. మనోహర్ దాస్ సిపోదియ | 1000/400 | రాజపుత్ర | ఆ.నా. 140 |
| 99. రాజా షేర్ సింగ్ (జమీందార్ ఆఫ్ ఛాంబా) | 1000/400 | రాజపుత్ర | ఆ.నా.843 |
| 100. బన్వలి దాస్ భారతియా | 1000/400 | రాజపుత్ర | ఆ.నా.1047, అ.మా.తై. 132 ఎ |
| 101. పహ్లా విజయి | 1000/300 | మరాఠా | అఖ్బార్ 13, రమజాన్, ప పే.13వ సం॥ |
| 102. భగవంత్ | 1000/ | రాజపుత్ర | ఎ.వి.దస్తా–104 |
| 103. రాజా జస్వంత్ సింగ్ బుందేలా | 1000/ | రాజపుత్ర | మా.ఆ. 169, మా.ఉ.–2, 293–94 |
| 104. మనిరామ్ | 1000/ | భారతీయ | ఎ.వి.దస్తా–40 |
| 105. రాజా ఛతర్ సింగ్ ఆఫ్ ఛాంబా (పంజాబ్) | 1000/ | రాజపుత్ర | ఎం.అక్బర్–"పంజాబ్ అండర్ మొగల్స్" 226 |
| 106. రావు ముహ్కమ్ సింగ్ తండ్రి అమర్ సింగ్ చంద్రావత్ | ఉన్నత హోదా | రాజపుత్ర | మా.ఉ.–2, 147–148 |

## ఔరంగజేబ్ కాలం నాటి 7000 నుండి 1000 వరకు మన్సబు కలిగిన హిందూ మన్సబుదారుల జాబితా - 2
## (2). రెండవ దశ 1679 - 1707 (30 సం.)

| క్రమ సంఖ్య | పేరు, బిరుదుతో సహా (బిరుదులు బ్రాకెట్లో చూపబడ్డాయి) | అత్యున్నత ర్యాంకు / | స్థాయికి | చేరినది జాతి /కులము ఎక్కడి నుండి ఈ పేర్లు సేకరించబడ్డాయో, ఆ చారిత్రక ఆధారాలు / అథారిటీ |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1. | రాజా సాహూ | 7000 పదాతి/ 7000 అశ్వికులు | మరాఠా | ఎ.వి.దస్తా.215, అ.మా.తై.121 బి, మా.అ.332, రఖాయిమ్ కరాయిమ్- 23బి, కామ్‌వార్-281బి |
| 2. | రాణారాజ్ సింగ్ | 6000/6000 (1000×2-3 అస్పా) | రాజపుత్ర | తా.ము.1092 ఎ.హెచ్., మా.ఉ.-2,206-08, అ.మా.తై.-122 బి |
| 3. | కన్‌హోజి షిర్కే | 6000/5000 | మరాఠా | దఫ్తరె దీవాని నెం.2980, మా.ఆ.220, 495 కాంవార్. 271 ఎ, అ.మా.తై-122ఎ. |
| 4. | సత్‌వాజీ దఫలియా | 6000/5000 | మరాఠా | మా.ఆ.395 |
| 5. | మాన్‌సింగ్ తండ్రి సాంభాజి | 6000/1000 | మరాఠా | కాంవార్ 281 బి, ఎ.వి.దస్తా-216 |
| 6. | రాయె భాన్ | 6000/ | మరాఠా | దిల్‌కుషా 145బి |
| 7. | అచ్‌పట్ నాయర్ | 6000/ | దక్నీ | దిల్‌కుషా - 112 బి |
| 8. | రాజా రాంసింగ్ కచ్‌వాహా | 5000/5000 (2-3 అస్పా) | రాజపుత్ర | వీర్ వినోద్-2, 1296, అ.మా.తై.122బి, తా.ము.1099, ఎ.హెచ్, మా.ఉ.2, 301-303 |
| 9. | రాణా జైసింగ్ | 5000/5000 | రాజపుత్ర | మా.ఆ.212, అ.మా.తై. 122బి, మా.ఉ.-2, 208 |
| 10. | అచ్‌లాజి నింబాల్‌కర్ దక్నీ | 5000/5000 | మరాఠా | అఖ్బార్-26, రజ్జబ్ ప.షే.37వ సం॥ మా.ఆ.271 కాంవార్-271 బి, అ.మా.తై. 122 బి |
| 11. | రాణా అమర్ సింగ్ ద్వితీయ | 5000/5000 | రాజపుత్ర | వీర్ వినోద్-3,745, 749, 751, మా.ఆ.404 |
| 12. | పర్యానాయక్ లేక పిద్యానాయక్ | 5000/5000 | దక్నీ | దిల్‌కుషా -95బి, మా.ఆ. 513, ఖాఫీ ఖాన్-2, 370 |

| | | | |
|---|---|---|---|
| 13. మాలూజి | 5000/5000 | మరాఠా | ఎ.వి.దస్తా–187, 206. |
| 14. జగ్నా నాయక్ | 5000/5000 | దక్ని | ఎ.వి.దస్తా.–205, మామూరి–205 బి. |
| 15. భాకూ బంజారా | 5000/4000 | భారతీయ | మా.ఆ.393, అ.మా.త్రై. 122 బి |
| 16. నాగూజి మానె లేక నాకూజి | 5000/4000 | మరాఠా | అఖ్బార్–8, ముహర్రమ్, ప.షే.44వ సం॥ దిల్ కుషా–122 ఎ. |
| 17. బహ్‌రాజి పాంఢ్రే | 5000/3000 (500×2–3 అస్పా) | మరాఠా | అఖ్బార్–1, జమాదిఉస్సాని–ప.షే.38వ సం॥ |
| 18. సూమె శంకర్ | 5000/3000 పదాతి, అశ్విక | మరాఠా | ఈసర్‌దాస్–165 బి, మామూరి–206ఎ, కాఫీఖాన్–2, 532 |
| 19. పర్శురామ్ | 5000/3000 | మరాఠా | మామూరి–156బి |
| 20. ఖేవ్‌జీ | 5000/2500 | మరాఠా | వఖాయె పత్రాలు జైపూర్, 17 జీఖాయిదా ప.షే. 47వ సం॥ |
| 21. సుజాన్ రావు లేక శివ్‌భాన్ రావు | 5000/2000 | మరాఠా | మా.ఆ.421, కాంవార్–291 ఎ, అ.మా.త్రై. 123 ఎ |
| 22. రాజా భీం సింగ్ | 5000/2000 | రాజపుత్ర | తా.ము.6, ఎ.వి. దస్తా–170, జు.ఆ. 166ఎ, మా.ఆ. 212, 369 |
| 23. రాణాజి జనార్ధన్ | 5000/2000 | మరాఠా | దఫ్తరె దీవాని నెం.2978 |
| 24. జంకూజీ | 5000/1200 | మరాఠా | అఖ్బార్–26, రజ్జబ్ ప.షే.37వ సం॥ |
| 25. నాథూజీ దక్ని | 5000/ | మరాఠా | అ.మా.త్రై. 123 ఎ |
| 26. పామ్ నాయక్ (పిడియా నాయక్ బాబాయి) | 5000/ | భారతీయ | దిల్‌కుషా–95బి, బ.స–750, తా.ము.1099 ఎ.హెచ్. |
| 27. యశ్వంత్ రావు లేక బస్వంత్ రావు | 4000/4000 | మరాఠా | మా.ఆ.219, కాంవార్–271 ఎ, అ.మా.త్రై.123బి |
| 28. మహ్‌దాజీ నాయక్ | 4000/4000 | భారతీయ | ఎ.వి.దస్తా–134 |
| 29. రావు భావ్ సింగ్ హాడా | 4000/2500 | రాజపుత్ర | ఆ.నా.–267, అ.మా.త్రై.123 బి, గల్‌హోట్ రాజ్‌పుతాన కా ఇతిహాస్–74,కాంవార్–272 బి |
| 30. రాజా ఛతర్ సాల్ బుందేల | 4000/ | రాజపుత్ర | కాంవార్–291; దిల్‌కుషా–157బి; 158బి– మా.ఉ.–2, 510–12 |
| 31. బాజి చావన్ డఫ్లే తండ్రి సత్వాజి డఫ్లే | 4000/ | మరాఠా | అఖ్బారాత్–హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్–సర్కార్, వా–5, పేజి 209 |

| | | | |
|---|---|---|---|
| 32. సియాజి | 4000/ | మరాఠా | ఎ.వి.దస్తా-128, శర్మ, ది రిలిజియస్ పాలిసీ ఆఫ్ మొగల్ ఎంపెరర్స్, పేజి 178 |
| 33. అన్‌రోధ్ హాడా (బూందికి చెందిన) | 3500/3000 | రాజపుత్ర | ఈసర్‌దాస్-95ఎ, కాంవార్-273ఎ, అ.మా.తై.127ఎ. |
| 34. అనూప్ సింగ్ తండ్రి రావు కరన్ భూరతియా | 3500/2000 | రాజపుత్ర | కాంవార్-277బి,మా.ఉ.-2, 289-91; అ.మా.తై.124 బి |
| 35. జాకియా దేశ్‌ముఖ్ | 3500/2000 | మరాఠా | మామూరి -200ఎ; మా.ఆ.513; కాంవార్-302 ఎ |
| 36. ఇందర్ సింగ్ తండ్రి రాయె సింగ్ | 3500/2000 (300×2-3 అస్పా) | రాజపుత్ర | దిల్‌కుషా-76ఎ, మా.ఆ.175, మా.ఉ.-2, 236,త.ఉ.(హబీబ్ గంజ్ కలెక్షన్) 206 ఎ |
| 37. రాజా ఊదత్ సింగ్ బుందేల (ఓర్ఛా నివాసి) | 3500/1600 | రాజపుత్ర | అఖ్బారాత్-25,రబ్బియుల్ అవ్వల్. ప.షే.38 సం॥,అ.మా.తై.124బి; మా.ఆ.350; కాంవార్-282 ఎ, 297బి. |
| 38. ఉదయ్ సింగ్ బుందేలా | 3500/1000 | రాజపుత్ర | మా.ఉ.-2, 294, మా.ఆ. 473 |
| 39. తర్బ్సాజీ లేక పర్బ్సాజి | 3500/ | మరాఠా | అ.మా.తై. 125 బి |
| 40. రాజా భారత్ సింగ్ (షాపూర్ నివాసి) | 3500/ | రాజపుత్ర | జె.ఎస్.గహ్‌లోట్-రాజ్‌పుతానా కా ఇతిహాస్-558 |
| 41. టకూజీ | 3000/3000 | మరాఠా | అఖ్బారాత్-10, జీకాయెద-ప.షే.38వ సం॥ |
| 42. దల్‌పత్ రావు బుందేలా | 3000/3000 | రాజపుత్ర | దిల్‌కుషా -157ఎ; తా.ము.23; మా.ఆ.392, మా.ఉ.-2, 317-323 |
| 43. బాసుదేవ్ (చట్లాన్ కారా జమీందారు) | 3000/3000 | భారతీయ | మా.ఆ.495, అ.మా.తై.125 బి |
| 44. నేతాజి తండ్రి జాన్ రావు | 3000/3000 | మరాఠా | ఎ.వి.దస్తా-175 |
| 45. ధోలూజి తండ్రి సంభాజీ | 3000/3000 | మరాఠా | ఎ.వి.దస్తా-176 |
| 46. ఆనందరావు | 3000/3000 | మరాఠా | అఖ్బారాత్-10 జీకాయదద. ప.షే.38వ సం॥ |
| 47. దుర్గాదాస్ రాథోడ్ | 3000/2500 | రాజపుత్ర | మా.ఆ. 395, కాంవార్-286 బి, 299బి, ఈసర్‌దాస్-168 ఎ,బి; అ.మా.తై.125 బి. |

| | | | |
|---|---|---|---|
| 48. భాన్ పురోహిత్ | 3000/2500 | మరాఠా | ఎ.వి.దస్తూ-187(దస్తూ-187లో ఎడిటర్ ద్వారా పేరు తప్పుగా మియాం పర్‌భాత్ గా చదువబడింది) |
| 49. ఇందర్ సింగ్ తండ్రి రాణా రాజ్ సింగ్ | 3000/2000 | రాజపుత్ర | మా.ఆ.-405, 481, కాంవార్-286ఎ, 289ఎ |
| 50. కిష్ణాజీ | 3000/2000 | మరాఠా | ఈసర్‌దాస్-117 ఎ,బి. |
| 51. రాజా ఉదత్‌సింగ్ భదూరియా | 3000/2000 | రాజపుత్ర | కాంవార్ 272 ఎ, 277 బి, ఎస్.అహ్మద్, ఉమ్రాయె హునూద్-పేజి 65; అ.మా.తై. 131 బి |
| 52. సోమె నాయక్ | 3000/2000 | భారతీయ | కాంవార్-299బి, 300 బి |
| 53. పతంగ్ రావు | 3000/2000 | మరాఠా | వఖాయెపేపర్స్ జైపూర్, 13 జిల్‌హజ్ ప.షే.25వ సం॥ రెఫరెన్స్ డాక్టర్ సతీష్ చంద్ర |
| 54. జద్‌రావత్ | 3000/2000 | మరాఠా | దఫ్తరె దీవాని నెం.2980, ప.షే.31వ సం॥ |
| 55. జీవాజీ పండిత్ | 3000/2000 | మరాఠా | ఈసర్‌దాస్, 161-ఎ,బి. |
| 56. మాన్‌సింగ్ తండ్రి రూప్‌సింగ్ రాథోడ్ | 3000/1800 | రాజపుత్ర | అఖ్బారాత్ 4 మరియు 24షాబాన్, ప.షే.24వ సం॥ మా.ఆ.405, మా.ఉ.-2, 270, కాంవార్ 286బి, 289 బి |
| 57. రావు రామ్ సింగ్ హాడా | 3000/1500 (200×2-3 అస్పా) | రాజపుత్ర | అఖ్బారాత్-15 రబ్బియుస్సాని-ప.షే 44వ సం॥, మా.ఆ.505, తా.ము.23, మా.ఉ.-2, 323-324 |
| 58. బదర్‌జీ (పాడాజీ) | 3000/1500 | మరాఠా | మా.ఆ.480, అ.మా.తై.125 బి |
| 59. బాజి రావు | 3000/1000 | మరాఠా | అఖ్బారాత్, ప.షే.38వ సం॥ శర్మ, ది రిలిజియస్ పాలసీ ఆఫ్ మొగల్ ఎంపెరర్స్, పేజి.179 |
| 60. రాజా బిషన్ సింగ్ | 3000/400 | రాజపుత్ర | మా.ఆ. 217, తా.ము.2, మా.ఉ.-2, 303 |
| 61. జాదౌవ్‌రాయ్ దక్ని | 3000/ | మరాఠా | దిల్‌కుషా 79బి; అ.మా.తై. 125 బి |
| 62. జగత్ రాయ్ దేశ్‌ముఖ్ (నుస్రతాబాద్ నివాసి) | 3000/ | మరాఠా | అ.మా.తై. 125 బి |
| 63. రాజా దేబి సింగ్ బుందేల | 2500/2500 (500×2-3-అస్పా) | రాజపుత్ర | మామూరి-154 ఎ; ఎ.వి.దస్తా.117, ఆ.నా.758 6 4 . |
| కిషోర్ సింగ్ హాడా (కోటా నివాసి) | 2500/3000 | రాజపుత్ర | అక్బారాత్-28 జమాదియుస్సాని-ప.షే. 39వ సం॥ దిల్‌కుషా-117బి; మా.ఉ.2, పేజి 323-324. |
| 65. శుభ్‌కరణ్ బుందేలా | 2500/2200 | రాజపుత్ర | అర్కాన్ మాస్సర్ తైమూరి-131 ఎ |

| | | | |
|---|---|---|---|
| 66. రాజా రామ్ సింగ్ సిసోదియా | 2500/2000 | రాజపుత్ర | అ.మా.తై. 123 ఎ |
| 67. మంకూజి దక్ని తండ్రి తన్‌కాజీ | 2500/2000 | మరాఠా | ఎ.వి.దస్తా-179, మా.ఆ. 297 |
| 68. మహాన్‌జి తండ్రి మన్యూజీ | 2500/2000 | మరాఠా | ఎ.వి.దస్తా-134 |
| 69. సంభాజీ బంధార తండ్రి లాల్‌జీ బంధార | 2500/2000 | మరాఠా | ఎ.వి.దస్తా-179 |
| 70. సాధూజీ తండ్రి నాగూజీ | 2500/2000 | మరాఠా | ఎ.వి.దస్తా.179 |
| 71. భాలి రావు తండ్రి కార్లూజి బంధారా | 2500/2000 | మరాఠా | ఎ.వి.దస్తా.179 |
| 72. నారోజి రాఘవ్ | 2500/2000 | మరాఠా | దఫ్తరె దీవాని నెం.2981 |
| 73. రావ్ బుధ్ సింగ్ ఆఫ్ బూంది | 2500/1000 (2-3 అస్పా) | రాజపుత్ర | అఖ్బారాత్-2 రబ్బియుల్ అవ్వల్, ప.షే.43వ సంll అ.మా.తై.126బి; అఖ్బారాత్ రాజాన్.ప.షే.45వ సంll |
| 74. మహద్‌జీ మానె | 2500/1500 | మరాఠా | అఖ్బారాత్-11 రజ్జబ్, ప.షే.39వ సంll |
| 75. రఘుజీ | 2500/1500 | మరాఠా | అఖ్బారాత్-5 జిల్‌హజ్జ, ప.షే.38వ సంll |
| 76. దేబిదాస్ ఇఖ్‌లాస్ కేష్ | 2500/1000 | భారతీయ | మా.ఉ.-1, 350-52 |
| 77. కొండాజీ | 2500/1000 | మరాఠా | అఖ్బారాత్,4 జమాదిల్‌అవ్వల్, ప.షే.43వ సంllమా.ఉ.-3, 580 |
| 78. కిషన్ సింగ్ | 2500/ | రాజపుత్ర | అఖ్బారాత్ 24 రజ్జబ్, ప.షే.24వ సంll |
| 79. రాంచంద్ (కహ్‌టానన్ జమీందార్ మరియు ధానెదార్) | 2000/3000 | మరాఠా | మా.ఆ.423, అ.మా.తై.127 బి |
| 80. రావు రాంచంద్ తండ్రి దల్పత్ బుందేల | 2000/2000 (1000×2-3 అస్పా) | మరాఠా | అఖ్బారాత్, 27 ముహర్రం ప.షే.44వ సంll అ.మా.తై.127 బి |
| 81. మహా మాన్‌జీ | 2000/2000 (500×2-3 అస్పా) | మరాఠా | ఎ.వి.దస్తా.209 |
| 82. మానాజి (మాయాజి) తండ్రి అంకూజి | 2000/2000 | మరాఠా | అఖ్బారాత్, జమాదిల్ అవ్వల్, ప.షే.44వ సంll |
| 83. జైసింగ్ సవాయి | 2000/2000 | రాజపుత్ర | అఖ్బారాత్-9 రమజాన్, ప.షే.44వ సంllమా.ఆ.424, 456, మామూరి-201 బి; మా.ఉ.2, 81-83. |
| 84. రావుదీనాజి (వీనాజి) సాల్వి | 2000/2000 | మరాఠా | దఫ్తరె దీవాని నెం.2980 |
| 85. రామ్ సింగ్ తండ్రి రతన్ రాథోడ్ | 2000/1400 | రాజపుత్ర | మామూరి-163బి; ఆ.నా.486 |
| 86. శివ్ సింగ్ | 2000/1300 | రాజపుత్ర | ఎ.వి.దస్తా. 171 |
| 87. తీమాజీ | 2000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.-209 |

| | | | |
|---|---|---|---|
| | (100×2–3 అస్పా) | | |
| 88. ఇసూజీ దక్ని | 2000/1000 | మరాఠా | కాంవార్–279ఎ; సయ్యద్ అహ్మద్, ఉమ్రాయె హునూద్–373 |
| 89. అర్జుజీ తండ్రి శంభాజీ | 2000/1000 | మరాఠా | మా.ఆ. 258 |
| 90. జగత్ సింగ్ హాడా | 2000/1000 | రాజపుత్ర | మామూరి–164ఎ; దిల్‌కుషా–79బి, మా.ఉ.–3, 510, అ.మా.తై. 128 బి. |
| 91. మాకూజీ | 2000/1000 | మరాఠా | అఖ్బారాత్ – 20, రమజాన్, ప.షే.40వ సం॥ |
| 92. సుజాన్ సింగ్ తండ్రి అనూప్ సింగ్ | 2000/1000 | రాజపుత్ర | ఆజం అల్ హర్బ్–168, అఖ్బారాత్, జీకాఅద – ప.షే.44వ సం॥ |
| 93. అనీరాయ్ బ్రాహ్మణ్ (దివాన్–ఎ–తాన్) | 2000/1000 | భారతీయ | ఎస్.అహ్మద్,ఉమ్రాయె హునూద్–64 |
| 94. రావ్‌జీ | 2000/500 | మరాఠా | అఖ్బారాత్–25, జమాదియుస్సాని, ప.షే.44వ సం॥ |
| 95. దావ్‌జీ | 2000/500 | మరాఠా | అఖ్బారాత్–10 జీఖఅద– ప.షే.38వ సం॥ |
| 96. జావ్‌జీ | 2000/500 | మరాఠా | అఖ్బారాత్–20, రమజాన్. ప.షే.40వ సం॥ |
| 97. మాధూజీ నారాయణ్ | 2000/ | మరాఠా | అఖ్బారాత్, హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వా–5, పేజి 211లో సర్కారు పేర్కొన్నారు. |
| 98. లచ్మన్ పాటి | 2000/ | భారతీయ | ఎ.వి.దస్తా – 208 |
| 99. రాజా దురగ్ సింగ్ | 1500/1200 (2–3 అస్పా) | రాజపుత్ర | ఎ.వి. దస్తా–171 |
| 100. మనోహర్ దాస్ (షోలాపూర్ కోటాధిపతి) | 1500/1200 (500×2–3 అస్పా) | రాజపుత్ర | అఖ్బారాత్–14 జిల్‌హజ్, ప.షే.25వ సం॥ |
| 101. రాజా జస్వంత్ సింగ్ బుందేలా | 1500/1000 (2–3 అస్పా) | రాజపుత్ర | ఎ.వి.దస్తా–150–51, మామూరి–165ఎ, మా.ఆ.273, మా.ఉ.–2, 293,294. |
| 102. పహాడ్ సింగ్ గౌడ్ (ఇందర్కీ జమీందారుడు) | 1500/1000 (2–3 అస్పా) | రాజపుత్ర | ఈసర్ దాస్ 94ఎ |
| 103. గోపాల్ సింగ్ తండ్రి రాజా సరూప్ సింగ్ | 1500/1500 | రాజపుత్ర | అ.మా.తై.131–బి,ఆ.నా.1056 |
| 104. శివ్‌జీ తండ్రి మారూజీ | 1500/1500 | మరాఠా | ఎ.వి.దస్తా–177 |
| 105. నుర్ సింగ్ | 1500/1400 | రాజపుత్ర | అఖ్బారాత్–12 షవ్వాల్, ప.షే.40వ సం॥ |
| 106. బిజయ్ సింగ్ | 1500/1200 | రాజపుత్ర | దిల్‌కుషా–167బి; మా.ఆ.424, |

| | | | |
|---|---|---|---|
| | | | మా.ఉ.-2,-81 |
| 107. ముహ్కం సింగ్ | 1500/1000 | రాజపుత్ర | మా.ఉ.-2, 147 |
| 108. డావుండిరావ్ లేక బోన్‌బీర్‌రావు | 1500/1000 | మరాఠా | మా.ఉ.-1, 498, మా.ఆ.382, అ.మా.తై.131ఎ. |
| 109. కాన్‌రావు (కిషన్‌రావు) తండ్రి కాకుజీ | 1500/1000 | మరాఠా | ఎ.వి.దస్తా-177, అక్బారాత్ - జమాదియుస్సాని, ప.షే.44వ సం॥ |
| 110. రాణాజీ | 1500/1000 | మరాఠా | అఖ్బారాత్-5 జీకఅద, ప.షే.38వ సం॥ |
| 111. బిహారి చంద్ తండ్రి దల్బత్ బుందేలా | 1500/1000 | రాజపుత్ర | అజ్మ్ అల్ హర్బ్-168, ఫర్హత్ ఉల్ నజీరీన్-206బి |
| 112. సాధూజీ తండ్రి శివ్‌జీ నేల్కార్ | 1500/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.-177 |
| 113. శివ్‌సింగ్ తండ్రి నూర్ సింగ్ | 1500/1000 | రాజపుత్ర | కాంవార్-297ఎ; అఖ్బారాత్ 12 షవ్వాల్, ప.షే.40వ సం॥ |
| 114. రావ్ రతన్ సింగ్ | 1500/1000 | రాజపుత్ర | మా.ఉ.-2, 147; త.ఉ. (స.వ) |
| 115. హృదయ్ సా బుందేలా | 1500/1000 | రాజపుత్ర | అఖ్బరాత్-1 జనవరి 1707 ఎ.డి, బి.డి.గుప్తాచారి "సతర్ సాల్ బుందేలా" లో పేజి 63. |
| 116. పరమ్‌దేవ్ తండ్రి కేసరి సింగ్ సిసోదియా | 1500/900 | రాజపుత్ర | ఎ.వి.దస్తా.125 |
| 117. సతర్‌సాల్ రాథోడ్ | 1500/850 | రాజపుత్ర | ఎ.వి.దస్తా-171; ఫర్హతున్నజిరీన్- 206బి, అఖ్బారాత్-రబ్బియుల్ అవ్వల్, ప.షే.45వ సం॥. |
| 118. రఘునాథ్ సింగ్ మీరట్ | 1500/800 | రాజపుత్ర | కాంవార్-266బి; అ.మా.తై.132 |
| 119. నంద్ నాయక్ | 1500/700 | భారతీయ | ఎ.వి.దస్తా.205 |
| 120. టుకూజీ తండ్రి బహర్‌జీ | 1500/700 | మరాఠా | ఎ.వి.దస్తా-176 |
| 121. ఔఖీ ఔహల్ రావు ఫరంకూజి | 1500/700 | మరాఠా | ఎ.వి.దస్తా-183 |
| 122. సరూప్ సింగ్ తండ్రి రాజా ఊదత్ సింగ్ | 1500/500 | రాజపుత్ర | మా.ఆ.386; దిల్‌కుషా-117బి |
| 123. జాలూజీ తండ్రి సరూజీ | 1500/500 | మరాఠా | ఎ.వి.దస్తా.-174 |
| 124. ఆకూజీ తండ్రి మాలూజీ | 1500/500 | రాజపుత్ర | ఎ.వి.దస్తా.-206 |
| 125. పదంసింగ్ బుందేలా | 1500/500 | రాజపుత్ర | అఖ్బారాత్-1 జనవరి 1707 ఎ.డి.-బి.డి.గుప్తా "సతర్ సాల్ బుందేల" లో పేజి 63 |
| 126. భాలిరావు తండ్రి సరూజి | 1200/1200 | మరాఠా | ఎ.వి.దస్తా.-175 |
| 127. జస్వంత్ సింగ్ రావల్ (దోంగర్‌పూర్ నివాసి) | 1000/900 (800×2-3 అస్పా) | రాజపుత్ర | అఖ్బారాత్-16 జిల్‌హజ్ - ప.షే.38వ సం॥ |
| 128. ఖుమన్‌సింద్ (గుమన్ సింగ్) | 1000/900 (800×2-3 అస్పా) | రాజపుత్ర | అఖ్బారాత్-16 జిల్ హజ్ - ప.షే.38వ సం॥ |

| | | | |
|---|---|---|---|
| 129. రాజా సరూప్ సింగ్ తండ్రి అనూప్ సింగ్ | 1000/750 (2-3 అస్పా) | రాజపుత్ర | అఖ్బారాత్-22, జీఖఅద-ప.షే.43వ సం॥ మా.ఉ.-2, 291, కాంవార్-289 |
| 130. రాజా మహాసింగ్ భదూరియా | 1000/1000 (500×2-3 అస్పా) | రాజపుత్ర | మా.ఉ.-2, 229-30, అ.మా.తై. 132 ఎ. |
| 131. కపూర్ సింగ్ హాడా | 1000/1000 (500×2-3 అస్పా) | రాజపుత్ర | ఎ.వి.దస్తా.-171 |
| 132. మాలూజి తండ్రి సారూజీ | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.175 |
| 133. రాజా మాన్ ధాతా | 1000/1000 | రాజపుత్ర | కాంవార్ - 270ఎ; మా.ఆ.-207, యం.అక్బర్ వ్రాసిన "ది పంజాబ్ అండర్ ది మొగల్స్" పేజి 225 |
| 134. రాజా బఖ్త్ బులంద్ | 1000/1000 | భారతీయ | మా.ఆ.-340; అ.మా.తై. 132 ఎ. |
| 135. రావల్ రాం సింగ్ ఆఫ్ డొంగర్‌పూర్ తండ్రి ఖురూన్ సింగ్ | 1000/1000 | రాజపుత్ర | ఓఝాగారి "హిస్టరీ ఆఫ్ రాజ్‌పుతాన" వా3, భా-1, పే.122 |
| 136. బిజయ్ తండ్రి జాన్‌రావు | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.175 |
| 137. శివాజి తండ్రి సారూజీ | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.-175 |
| 138. యాసాజి తండ్రి బహార్‌జీ | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా-175 |
| 139. దాలూజీ తండ్రి బహార్‌జీ | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.-175 |
| 140. అన్‌బాజీ | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.177 |
| 141. నాబాజి తండ్రి లాహూజి | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.178 |
| 142. మానాజి తండ్రి శంభాజి | 1000/1000 | మరాఠా | ఎ.వి.దస్తా.179 |
| 143. కళ్యాణ్ సింగ్ | 1000/1000 | రాజపుత్ర | అఖ్బారాత్-20, జిల్‌హజ్ - ప.షే.38వ సం॥ |
| 144. గోపాల్ సింగ్ తండ్రి మొహ్కుం (వారసత్వంగా వస్తున్న మన్సబు) | 1000/900 | రాజపుత్ర | మా.ఉ.-3, 147 సింగ్ సిసోదియా |
| 145. అన్‌బాజి తండ్రి మాకాజి | 1000/500 (300×2-3 అస్పా) | మరాఠా | ఎ.వి.దస్తా.209 |
| 146. రాంరావు తండ్రి గణ్‌పత్‌రావు | 1000/400 (300×2-3 అస్పా) | మరాఠా | ఎ.వి.దస్తా.204 |
| 147. మానాజి తండ్రి నాగూజీ | 1000/700 | మరాఠా | ఎ.వి.దస్తా.179 |
| 148. ఖండూజీ తండ్రి జావుజీ | 1000/700 | మరాఠా | ఎ.వి.దస్తా-178 |
| 149. దేవ్‌జీ తండ్రి మంకూజీ | 1000/700 | మరాఠా | ఎ.వి.దస్తా-178 |
| 150. మాలూజీ | 1000/700 | మరాఠా | కాంవార్-277బి; ఎ.వి.దస్తా-176 |
| 151. శివ్‌జీ తండ్రి సాంభాజీ | 1000/700 | మరాఠా | ఎ.వి.దస్తా-177 |
| 152. ఇందర్‌మాన్ తండ్రి | 1000/700 | రాజపుత్ర | దఫ్తరె దీవాని నెం.2983 |

| | | | |
|---|---|---|---|
| పహర్ సింగ్ బుందేలా | | | , ఎ.వి.దస్తా-112, ఆ.నా.290, 302, 989 |
| 153. సుల్తాన్ సింగ్ | 1000/700 | రాజపుత్ర | అజ్మీ అల్ హర్బ్-197, అఖ్బారాత్-జమాది యుల్ అవ్వల్. ప.షే.44వ సం॥ |
| 154. రాజా ఉదయ్ సింగ్ తండ్రి మహాసింగ్ భదూరియా | 1000/600 (300×2-3 అస్పా) | రాజపుత్ర | మా.ఉ.-2, 230, ఎ.వి.దస్తా-171 |
| 155. రాజా కళ్యాణ్ సింగ్ (భదావర్ జమీందార్) | 1000/600 | రాజపుత్ర | మా.ఆ.382; కాంవార్-288ఎ |
| 156. బహర్జీ | 1000/500 | మరాఠా | అఖ్బారాత్-20 రమజాన్ - ప.షే.40వ సం॥ |
| 157. రాజా భగవంత్ సింగ్ తండ్రి జస్వంత్ సింగ్ బుందేలా | 1000/500 | రాజపుత్ర | దిల్‌కుషా - 96ఎ; మా.ఉ.-2, 294 |
| 158. బీర్‌భాన్ | 1000/500 | మరాఠా | ఎ.వి.దస్తా-205 |
| 159. రాజా సూరజ్ మల్ తండ్రి రాజా భీమ్ | 1000/500 | రాజపుత్ర | అఖ్బారాత్-15 ముహర్రం-ప.షే.38వ సం॥ |
| 160. బహాదూర్ సింగ్ | 1000/500 | రాజపుత్ర | కాంవార్-289ఎ; మా.ఆ.-405; అ.మా.తై.132ఎ |
| 161. నేతాజీ తండ్రి ఖందూరావు | 1000/450 | మరాఠా | ఎ.వి.దస్తా-210 |
| 162. రాజా మనోహర్ దాస్ | 1000/400 | రాజపుత్ర | మామూరి-188 బి; ఆ.నా.140 |
| 163. బాయాజి | 1000/500 | మరాఠా | ఎ.వి.దస్తా-187; అఖ్బారాత్-జమాదియుల్ అవ్వల్, పట్టాభిషేకం 44వ సం॥ |
| 164. దిల్‌సింగ్ | 1000/400 | రాజపుత్ర | అఖ్బారాత్-రబ్బియుల్ అవ్వల్, ప.షే.45వ సం॥ |
| 165. చేత్ సింగ్ | 1000/500 | రాజపుత్ర | అఖ్బారాత్, షాబాన్, ప.షే.45వ సం॥ |
| 166. రాజా ఉదయ్ సింగ్ ఆఫ్ చాంబా తండ్రి ఛతర్ సింగ్ | 1000/600 | రాజపుత్ర | దస్తూర్-అల్-అమలె-షాజహాని-అధికరణం - 6588. 22ఎ; యం.అక్బర్ "ది పంజాబ్ అండర్ ది మొగల్స్" పే.226 |
| 167. చందూజీ | 1000/1000 | మరాఠా | అఖ్బారాత్-షాబాన్-ప.షే.45వ సం॥ |
| 168. రావు జోఘట్ | 1000/500 | మరాఠా | అఖ్బారాత్ - షాబాన్ - ప.షే.45వ సం॥ |

| | | | |
|---|---|---|---|
| 169. బీర్‌మూజీ | 1000/500 | మరాఠా | అఖ్బారాత్ - షాబాన్ - ప.షే. 45వ సం॥ |
| 170. రావు మాన్ సింగ్ తండ్రి జాదూరి రాయ్ | 1000/900 (300×2-3 అస్పా) | మరాఠా | మా.ఉ.-1,-522, అఖ్బారాత్, జమాదియుల్ అవ్వల్, ప.షే. 44వ సం॥ |
| 171. భావు సింగ్ | 1000/500 | రాజపుత్ర | అఖ్బారాత్-రబ్బియుల్ అవ్వల్, ప.షే. 45వ సం॥ |
| 172. లాంగ్ నాయక్ | 1000/300 | భారతీయ | ఎ.వి.దస్తా-205 |
| 173. పురుషోత్తం సింగ్ | 1000/ | రాజపుత్ర | అ.మా.త్రై.-132 ఎ. |
| 174. వెంకట్ | 1000/ | మరాఠా | సర్కార్, హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ వా-5, పేజి 208 |
| 175. పదం సింగ్ తండ్రి రావు కరణ్ | 1000/ | రాజపుత్ర | దిల్ కుషా - 79 బి |
| 176. నంద్ లాల్ | 1000/ | భారతీయ | ఫర్‌హతుల్ నాజిరీన్ - 207 ఎ |
| 177. జగదేవ్‌రాయ్ తండ్రి దాతాజి | ఉన్నత మన్సబు | మరాఠా | మా.ఉ.-1, 522, దిల్‌కుషా-79బి, ఈసర్‌దాస్-138, సర్కార్, హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వా-5, పేజి 212 |
| 178. దేవ్‌జీ | ఉన్నత మన్సబు | మరాఠా | వఖాయె పేపర్స్ జైపూర్-17, జీఖఅద, ప.షే.47వ సం॥ - రిఫరెన్స్ డాక్టర్ సతీష్ చంద్ర |
| 179. కిషోర్ దాస్ (షోలాపూర్ కోట అధిపతి) | ఉన్నత మన్సబు | రాజపుత్ర | మాస్సర్ ఆలంగీరి - 228 |
| 180. అజిత్ సింగ్ రాథోడ్ | ఉన్నత మన్సబు | రాజపుత్ర | మిరాఆతె అహ్మది - 1, 341; మా.ఉ-3, పేజి 755-60 |
| 181. మదన్ సింగ్ తండ్రి సాంభాజి | ఉన్నత మన్సబు | మరాఠా | ఈసర్‌దాస్ - 154బి, 155ఎ, మా.ఆ.473 |
| 182. ఖేలూజి - (సాంభాజి సైన్యాధిపతి) | ఉన్నత మన్సబు | మరాఠా | ఈసర్‌దాస్ - 155ఎ |
| 183. రామాజి (సాంభాజి సైన్యాధిపతి) | ఉన్నత మన్సబు | మరాఠా | ఈసర్‌దాస్ - 155ఎ |
| 184. జానూజీ (సాంబాజీ సైన్యాధిపతి) | ఉన్నత మన్సబు | మరాఠా | ఈ సర్‌దాస్ - 155 ఎ |
| 185. మల్‌హర్‌రావు | ఉన్నత మన్సబు | మరాఠా | రఖాయెమ్ కరాయెమ్-29ఎ |

(**నోట్:** ఈ జాబితాలో 1000 కన్నా తక్కువ మన్సబు కలిగిన మన్సబుదార్లు చేర్చబడలేదనే విషయాన్ని పాఠకులు గమనించాలి. వారిని కూడా చేర్చుకున్నట్లయితే ఈ సంఖ్య, శాతం ఇంకెంతో పెరిగిపోయే అవకాశం ఉంది.)

## అత్‌హర్‌అలి జాబితా సమాప్తం

| | | | |
|---|---|---|---|
| 1. అచ్‌లాజి (శివాజి అల్లుడు) | 5000/2000 | మరాఠా | మాసిరె ఆలంగీరి, పే.191 ప.షే-29వ సం॥ (సయ్యద్ ఇక్బాల్ అహ్మద్ జోన్‌పూరి) |
| 2. మక్తబ్ రాయ్ (నుస్రతాబాద్ పర్యవేక్షకుడు) | 3000/ | భారతీయుడు | ప.షే-29వ సం॥ (సయ్యద్ ఇక్బాల్ అహ్మద్ జోన్‌పూరి) |
| 3. దోందీరాయ్ | 5000/ | భారతీయుడు | ప.షే.40వ సం॥ (సయ్యద్ ఇక్బాల్ అహ్మద్ జోన్‌పూరి) |

ఔరంగజేబ్ కాలం నాటి హిందూ మన్సబుదారుల సుదీర్ఘ జాబితాలను మీరింతవరకు చదువుతూ వచ్చారు. వారి పేర్లకు ఎదురుగా చూపిన అశ్విక, పదాతి సైనికుల్ని వారే ఎంపిక చేసుకునేవారు. దీనికోసం వారికి జాగీర్లు లభించినా, ఎంపిక మాత్రం వారిదే. ఈ సైనికులకు వారు కేవలం సేనానులు కారు. యజమానులు, ప్రభువులు. యుద్ధ సమయాల్లో మన్సబులో సూచించిన సంఖ్యలో సైన్యాల్ని సమీకరించడం వారి విధి, బాధ్యత. ఈ మన్సబుదారులంతా ఆ కాలపు రాజదర్బారు సభికులు. ఔరంగజేబ్ ప్రభుత్వంలోని ప్రధాన కార్యకర్తలు. చక్రవర్తికి మాత్రమే విధేయత చూపుతూ తమ తమ పరిధుల్లో స్వతంత్రంగా వ్యవహరించే అధికారం వారికుండేది. ఒకవేళ ఔరంగజేబే గనక హిందూ వ్యతిరేకి, హిందూ ధర్మాన్ని, హిందువుల్ని అణచి, హింసించి అగౌరవ, అవమానపరిచేవాడే అయి ఉన్నట్లయితే, పైన పేర్కొన్న ఇంతమంది హిందూ మన్సబుదారులు అతని సైన్యంలో ఎలా ఉండగలిగే వారు? కేవలం ఉండడమే కాదు, అతని కోసం బల్ఖ్, బదక్షాం లాంటి సుదూర ప్రాంతాలకు పోయి పోరాడేవారా? అతనికోసం, అతని రాజ్య సుస్థిరత్వం కోసం తమ ప్రాణాల్ని అర్పించేవారా? అతని కోసం స్వయంగా తమ జాతివారినే ఎదుర్కొనేవారా? ఇది సంభవం కాదు. ఏక కాలంలో ఇవి రెండూ జరగడం అసంభవం. కాల్పనిక చరిత్రకారులు పేర్కొన్నట్లు కాకుండా అతను ధర్మనిరపేక్షతను తు.చ. తప్పకుండా పాటించే సత్శీలవర్తనుడైన ఒక పరిపాలకుడు. కనుకనే ఇంతమంది హిందూ మన్సబుదారులు అతన్ని ఆశ్రయించారు, అతన్ని శిరసావహించారు. అతని ఆజ్ఞల్ని పాలించారు. అతని కోసం తమ ప్రాణాలకు తెగించి పోరాడారు. ఇరానీ, తౌరాని, అఫ్గాని, భారతీయ, సంతతులతో కూడిన లక్షలాది సైన్యాలకు రాజపుత్ర వీరుడైన రాజా జైసింగ్‌ను సర్వసైన్యాధ్యక్షునిగా నియమించడం అతని ధర్మ నిరపేక్షతకు మచ్చుతునక. ఔరంగజేబ్‌కు, అతని హిందూ సేనలకు, సైన్యాధ్యక్షునికి మధ్య సామాజిక, ధార్మికపరంగా ఎలాంటి వైషమ్యాలు, వ్యతిరేకతలు లేవనటానికి ఇదో గట్టి నిదర్శనం. ధార్మిక విషయంలో ఎవరిపై ఎలాంటి ఒత్తిడి జరుగదని, ధార్మికంగా ప్రతి వ్యక్తి స్వతంత్రుడని, ఇంకా ఏ రాజైతే

ఇతరుల ధార్మిక విషయాల్లో అసహనం కనబరుస్తాడో, అతను దైవవిద్రోహిగా గుర్తించబడతాడని ఔరంగజేబ్ ఎలుగెత్తి ప్రకటించడమే కాకుండా జీవితాంతం దానిపై ఆచరించి చూపాడు. అలా కాకపోతే ఇంత పెద్ద సంఖ్యలో అత్యంత ఉన్నత స్థాయికి చెందిన మన్సబుదారులు అతని వెంట ఉండేవారే కాదు. ఇది ఒకటి రెండు సంవత్సరాల కోసం కాదు. యాభై ఏళ్ళు, అర్ధ శతాబ్దపు సుదీర్ఘకాలం. కనుక ఇంతపెద్ద సంఖ్యలో మన్సబుదారుల ఉనికే, ఔరంగజేబ్ ధర్మ నిరపేక్షతను తేటతెల్లం చేస్తుంది.

ఇక రెండవ విషయం. అతను హిందువుల్ని ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించాడని కొందరు కాల్పనిక చరిత్రకారులు కల్పిత కథలు వ్రాశారు. మీరింతవరకు సుదీర్ఘంగా చదువుతూ వచ్చిన మన్సబుదార్లంతా హిందువులు కాక మరెవరు? ఆ కాలంలో ఈ మన్సబు దార్లే రాజ సభికులుగా, దేశ నాయకులుగా, రాజు సలహాదారులుగా గుర్తించ బడేవారు. వీరి కార్యకలాపాలపైనే మొత్తం దేశ, రాజ్య వ్యవహారాలు ఆధారపడి ఉండేవి. రాజా జైసింగ్, జస్వంత్ సింగ్‌లకు ఏడువేల మన్సబులు ప్రదానం చేయబడ్డాయి. ఈ మన్సబు లేక ర్యాంకు మొగలు దర్బారులోనే అత్యున్నతమైన ర్యాంకు. అంతకు ముందెన్నడూ - అక్బర్ కాలంతో సహా - రాజపుత్రులకు గాని లేక ఇతర హిందూ నాయకులకు గాని ఇంతపెద్ద హోదా లభించి ఉండలేదు. ఇంతగా చేరదీసి, ఇంత పెద్ద హోదాలపై కూర్చుండబెట్టి, సర్వసైన్యాధ్యక్షునిగాను, కేవలం రాకుమారులకే పరిమితమై ఉన్న సూబేదార్ (వైస్రాయ్, గవర్నరు) హోదాలను కట్టబెట్టినా కూడా "హిందువుల్ని ప్రభుత్వ ఉద్యోగాలనుండి తొలగించాడు" (సర్కార్, వా-3, పే.ఇ 182) అని చరిత్రను వక్రీకరించడం ఎంతవరకు న్యాయమో ఆలోచించే విషయాన్ని పాఠకుల విచక్షణా జ్ఞానానికి వదలిపెడు తున్నాము.

మన చరిత్రలు, మన దేశీయ ఆధారాలేకాక, విదేశీయుడు, పరజాతివాడు, ఇంకా ఔరంగజేబ్‌ను దురుసుగా విమర్శించే బర్నియేర్ సైతం "ఔరంగజేబ్ తన వెంట హిందూ రాజుల ఒక పెద్ద సమూహాన్నే ఉంచుకుంటాడని, తన ఇతర (ముస్లిం) నాయకుల్లాగే, వీరిని గౌరవించి, ఆదరిస్తాడని, అతి ముఖ్యమైన కీలక సైనిక కార్యకలాపాల కోసం వారిని విశ్వసించి, నియమిస్తాడ"ని పేర్కొన్న తరువాత కూడా ఈ చరిత్రకారులు తమ పంథాను మార్చుకోకపోతే అది వారి స్వయంకృతాపరాధం. మేము మాత్రం, సత్యాసత్యాలను విడదీసి మన పాఠకుల ముందుంచాము. పాఠకులే ఆలోచిస్తారు. వారే న్యాయ నిర్ణేతలు.

కేవలం ఇక ఈ మన్సబుదారుల ర్యాంకులు మాత్రమే పేర్కొని వదిలేస్తే సరిపోదు. అందులోని ప్రముఖులైన కొందరి గురించి అయినా కాస్త వివరించడం అవసరమను కుంటాము.

**1. రాజా జైసింగ్ కచ్‌వాహా:** షాజహాన్ కాలంలో, చిరుప్రాయంలో, చిన్నపాటి ఉద్యోగంతో ఇతను మొగలు సైన్యంలో చేరాడు. తన యోగ్యత, కార్యదక్షత, అసామాన్యమైన ధైర్యస్థైర్యాలు, దూరదృష్టి అన్నిటికి మించి అచంచలమైన స్వామిభక్తితో ఇతను పురోగమిస్తూనే

పోయాడు. ఇరాన్, అఫ్ఘన్ వారితోనే కాక తన రాజపుత్ర వీరులతో మరాఠా, బీజాపూర్, గోల్కొండ లాంటి దక్షిణ ప్రాంతాల్లో కూడా విజయ దుందుభిని మోగించాడు. శివాజీతో జరిగిన యుద్ధాల్లో అతను చూపిన బుద్ధివివేకాలు, శూరత్వం, పట్టుదల మరియు కార్య సఫలతలు, ఔరంగజేబ్ కాలం నాటి చరిత్రలో మరుపురాని ఘట్టం. శివాజీకి చెందిన ఇరవై రెండు కోటల్ని వశపర్చుకోవడమే కాకుండా, శివాజీని సకల గౌరవ మర్యాదలతో, రాజలాంఛనాలతో ఔరంగజేబ్ దర్బారులో ప్రవేశపెట్టడం అతని రాజనీతిజ్ఞతకు తార్కాణం. శివాజీ ఉంటున్న బోరందరా కోటను జైసింగ్ సారధ్యంలో ముట్టడించినప్పుడు అతని సైన్యంలో ముస్లిం సేనానులే కాక రాయెసింగ్ రాథోడ్, కీరత్ సింగ్, మిత్రసేన్, ఇంద్రామన్ బుందేలా, బరన్ భాన్, ఉదయ భాన్ గౌడ్, రాజా నర్సింగ్ గౌడ్, కరణ్ రాథోడ్, జగత్ సింగ్ నర్వార్, రాజ్ సింగ్ గౌడ్, చిత్రభోజ్ చౌహాన్ లాంటి రాజపుత్ర సేనానులు కూడా అత్యంత శూరత్వంతో, పరాక్రమంతో ఈ కోట ముట్టడిలో పాల్గొన్నారు. ఫలితంగా శివాజీ ఆయుధాలు పడేసి, ఆత్మ సమర్పణ చేశాడు. (సర్కార్, హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - వా-4, పేజి 63-69). ఈ యుద్ధాల్లో హిందూ-ముస్లిం అనే భేదభావాలేమీ ఉండేవి కావు. కనుక ఇవే సేనలు, ఇదే సైన్యాధిపతి సారధ్యంలో బీజాపూర్ ముట్టడికి వెళ్ళినప్పుడు, ఈ సేనాని చూపిన చొరవ మరియు బుద్ధివివేకాలు ప్రశంసించదగినవి. అతనిలో గల ఈ సుగుణాలను ప్రఖ్యాత చరిత్రకారుడు జదూనాథ్ సర్కార్ కూడా అంగీకరించకుండా ఉండలేకపోయాడు. అందుకే తన చరిత్రలో అతని గురించి ఇలా వ్రాశాడు :

"జైసింగ్ జీవితంలో పురోగమించే గుణం మొదటి నుండే ఉండేది. తండ్రిలేని ఈ పన్నెండు సంవత్సరాల చిరుప్రాయం గల బాలుడు షాజహాన్ కాలంలో 1617లో ఓ చిన్న ఉద్యోగంపై మొగలు సైన్యంలో చేరాడు. ఆనాటి నుండి సువిశాలమైన మొగలు సామ్రాజ్యపు అన్ని ప్రాంతాల్లో పోరాడాడు. మధ్య ఆసియాలోని బల్ఖ్ మొదలుకొని దక్కన్‌లో బీజాపూర్ వరకు, పశ్చిమంలో ఖాందహార్ మొదలుకొని తూర్పులో మోన్‌గేర్ వరకు జరిగిన దాదాపు ప్రతి యుద్ధంలో పాల్గొన్నాడు. షాజహాన్ ప్రభుత్వపు మొదటి సంవత్సరం కూడా గడవక ముందే ఈ రాజపుత్ర నాయకుడు ప్రతి యుద్ధంలో తనదైన పాత్రను పోషించాడు. పేర్కొనదగిన తన సైనిక కార్యకలాపాల కారణంగా అభివృద్ధి చెందుతూ, ప్రమోషన్లు పొందగలిగాడు. తన సైనిక పరమైన యోగ్యతవల్ల అతనెంతగా గుర్తింపు పొందాడంటే, భారతదేశం ఆవల ప్రాంతాల్లో జరిగే యుద్ధాల్లో కూడా పురోగామి సైన్యానికి నాయకుడిగానో, లేక ముఖ్య సైన్యంలోని ఏదో ఒక భాగానికి సేనానిగానో నియమించడం జరిగేది. ఇక ఆ తరువాత కాలంలో (అనగా ఔరంగజేబ్ పరిపాలనలో) నైతే, అతను సర్వ సైన్యాధిపతిగా నియమించబడ్డాడు. అతని రాజనీతిజ్ఞత, అతని సైనిక శక్తికన్నా మించి ఉండేది. కీలకమైన లేక క్లిష్ట సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఔరంగజేబ్ జైసింగ్‌ను తప్పకుండా సంప్రదించేవాడు. అతనిలో అపరిమితమైన బుద్ధివివేకాలతో పాటే, అతనిలో ఓర్పు సహనాలు కూడా ఉండేవి. ముస్లింల సభ్యతా సంస్కృతుల్ని కూడా బాగా ఆకళింపు చేసుకున్నవాడు. అతను టర్కిష్,

పర్షియన్, ఉర్దూ భాషల్లోనే కాక రాజ్‌పుతానాలోని స్థానిక భాషలపై కూడా మంచి పట్టు కలిగినవాడు. అందుకనే టర్కిష్‌లు, అఫ్గన్లు, రాజపుత్రులు ఇంకా ఇతర భారతీయ జాతులతో మమేకమై ఉన్న మొగలు సైన్యాలకు సాటిలేని మేటి సేనాని అనిపించుకున్నాడు.” (హిష్టరీ ఆఫ్ ఔరంగజేబ్, జ.నా. సర్కార్, వా.4, పే.53, 54) ఇక మాసిరుల్ ఉమర రచయిత షా నవాజ్ ఖాన్, అతని జీవితాన్ని, గుణగణాల్ని ఎంతో సుదీర్ఘంగా వర్ణించాడు. జీవిత ప్రారంభం నుండి మరణించేవరకు పూర్తి గౌరవ మర్యాదలతో కీర్తి ప్రతిష్టలతో జీవించాడని వ్రాశాడు. సుదీర్ఘమైపోతుందని కుదించాము. వా.3, పేజి 473–479)

**2. రాజా ఇంద్రామన్ బందేరా :** పదే పదే ఆజ్ఞోల్లంఘన చేశాడనే నేరంపై షాజహాన్ ఇతన్ని ఖైదు చేసాడు. వారసత్వ యుద్ధం కోసం బయలుదేరే ముందు ఔరంగజేబ్ ఇతన్ని చెర విడిపించి మూడువేల పదాతి, రెండువేల అశ్విక దళాల మన్సబును ప్రసాదించాడు. ధర్మావత్‌లో జరిగిన యుద్ధంలో ఔరంగజేబ్ తరఫున పోరాడి గొప్ప వీరత్వాన్ని ప్రదర్శించాడు. ఫలితంగా అతనికి పతాకం, నగారా ప్రసాదించబడ్డాయి. రాకుమారుడు షుజాకు వ్యతిరేకంగా ఖజ్వాలో జరిగిన యుద్ధంలో కూడా పాల్గొన్నాడు. ఆ తరువాత బెంగాల్ సూబాలో నియమించబడ్డాడు. (మాసిరుల్ ఉమర – వా–2, పే.266)

**3. రాజా అనూప్ సింగ్ భూరతియ :** ఇతను రావు కరన్‌కు తనయుడు, రావు సూరజ్ సింగ్‌కు మనుమడవుతాడు. పట్టాభిషేకం 17వ సంవత్సరంలో బహాదూర్ ఖాన్ కోక మరియు అబ్దుల్ కరీం మియానను అణచడానికి జరిగిన యుద్ధంలో బాగా ఖ్యాతి గాంచాడు. ప.షే.21వ సంవత్సరంలో ఔరంగాబాదుకు సూబేదారుగా నియుక్తుడై సైనికపరంగా శివాజీ ఎత్తుగడలన్నిటినీ వమ్ముచేశాడు. ప.షే. 30వ ఏట నుస్రతాబాద్ సక్కర్ కోటకు అధిపతిగా నియుక్తుడయ్యాడు. ప.షే. 33వ సంవత్సరం ఇమ్తియాజ్ గడ్‌దోనీకి పరిపాలకునిగా నియుక్తుడయ్యాడు. అనూప్ సింగ్ గతించిన తరువాత అతని కుమారుడు వంశపారంపర్యంగా వస్తున్న బేకానీర్ రాజ్యాధీశుడయ్యాడు. అతనికి పదిహేను వందల మన్సబుదారీ లభించింది. (మాసిరుల్ ఉమర – వా–1, పే.293–295 – మాసిరె ఆలంగీరి, పేజి 283, 360)

**4. ఉన్ని రాయ్ :** ఆలంగీర్ కాలం నాటి ఆర్థిక మరియు జీతభత్యాల ప్రధాన కార్యాలయంలో దీవానె ఆలా (ముఖ్యమంత్రి)గా పనిచేశాడు. లెక్కల విషయంలో అతను ఎవరికీ అలుసిచ్చేవాడు కాదు. అందుకే అతనంటే ఔరంగజేబ్‌కు అభిమానం.

**5. ఇందర్ సింగ్ :** ఇతను రాణా రాజ్ సింగ్ కుమారుడు. ప.షే.43వ సంవత్సరంలో రెండువేల పదాతి, వేయి అశ్వికదళాల మన్సబును పొందాడు. అతని సోదరుడైన బహాదూర్ సింగ్ కూడా పదిహేను వందల అశ్వికదళాల మన్సబును పొందాడు. (మాసిరె ఆలంగీరి, పేజి 291)

**6. అచ్‌లాజి :** ఇతను శివాజీకి అల్లుడు. ఔరంగజేబ్ ఇతన్ని ఐదువేల పదాతి రెండువేల అశ్విక దళాల మన్సబుదారుగా నియమించడమే కాకుండా నగారా, పతాకం రత్న ఖచిత కంకణాలు మరియు ఏనుగు నిచ్చి సత్కరించాడు. (మాసిరె ఆలంగీరి-పేజి 191)

**7. రావు బహేవ్ సింగ్ హాడా :** రావు సతర్ సాల్ హాడా రాకుమారుడు దారా షికూహ్‌ను సమర్థించి, సమూగడ్ యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ అసువులు బాసాడు. ఈ రావు బహేవ్ సింగ్ హాడా అతని కుమారుడే. తండ్రి గతించిన తరువాత ఇతను ఔరంగజేబ్‌ను ఆశ్రయించగా, అతనికి మూడువేల పదాతి, రెండు వేల అశ్విక దళాల మన్సబును ప్రసాదించాడు. అతని స్వస్థలమైన బూందీని జాగీరుగా ఇచ్చాడు. రాకుమారుడు షుజాతో కజ్‌వాహ్‌లో జరిగిన యుద్ధంలో ఔరంగజేబ్ ఫిరంగి దళాలకు అధిపతిగా పనిచేశాడు. ప.షే. 3వ సంవత్సరంలో జరిగిన చాక్నా, 9వ సంవత్సరంలో జరిగిన చాందా యుద్ధాల్లో గణనీయమైన సేవలందించాడు. మహారాజా జస్వంత్ సింగ్ మరియు జైసింగ్‌ల సారథ్యంలో శివాజీని ఎదుర్కోవడంలో కూడా పాల్గొన్నాడు. ఇతని సోదరిని రాజా జస్వంత్ సింగ్ పరిణయమాడాడు. ఒకసారి రాజా జస్వంత్ సింగ్ ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా తిరుగబడడానికి ప్రయత్నించి, తన భార్య, ఇతని సోదరి ద్వారా ఇతన్ని తన వైపునకు త్రిప్పుకోవడానికి ఎంతో ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. కాని ఇతను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వామిద్రోహానికి పాల్పడడానికి అంగీకరించలేదు. అతనికి సంతానం లేదు. అందుకని అతని తరువాత అతని సోదరుడు భగవంత్ సింగ్ మనుమడైన అనురోధ్ సింగ్‌ను ఔరంగజేబ్ అతని గద్దెపై కూర్చుండబెట్టాడు. దీన్ని వ్యతిరేకించిన అతని బంధువులు తిరుగబడితే, వారిని అణచివేసి, అనురోధ్ సింగ్ అధికారాన్ని సుస్థిరం చేశాడు. (మాసిరుల్ ఉమర - వా-2, పే.308-311)

**8. బుద్ధాజి :** ఇతను శివాజీకి సోదరుడు. (బాబాయి కుమారుడు) ఔరంగజేబ్ ఇతన్ని బూదపాంచీ గాంవ్ థానేదార్‌గా నియమించాడు. ప.షే.48వ సంవత్సరంలో మూడువేల పదాతి, రెండువేల అశ్విక దళాల మన్సబుదారుగా నియక్తుడయ్యాడు. (మాసిరె ఆలంగీరి పేజి 348)

**9. <u>బైరందేవ్ సిసోదియా:</u>** ఇతను రాణా అమర్‌సింగ్ మనుమడు. షాజహాన్ దర్బారుతో సంబంధాలుండి అభివృద్ధి చెందుతూపోయాడు. షాజహాన్ పట్టాభిషేకం 31వ సంవత్సరంలో మూడు వేల పదాతి, వేయి అశ్విక దళాల మన్సబును పొందగలిగాడు. సమూగడ్ యుద్ధంలో దారా షికూహ్ తరఫున అతను పురోగామి సైన్యానికి నాయకత్వం వహించాడు. కాని ఆ యుద్ధంలో ఓడిపోయిన తరువాత ఔరంగజేబ్‌ను ఆశ్రయించాడు. ఆ తరువాత జరిగిన యుద్ధంలో ఔరంగజేబ్ తరఫున రాకుమారుడు షుజాకు వ్యతిరేకంగా పోరాడాడు. ఆ తరువాత దక్కన్‌లో నియుక్తుడయ్యాడు. రాజా రాంసింగ్ కచ్‌వాహాతో కలిసి, అస్సాం విజయాల్లో పాల్గొన్నాడు. ఆలంగీర్ ప.షే.12 సంవత్సరంలో మధురాకు అధికారిగా నియుక్తుడయ్యాడు. (మాసిరె ఆలంగీర్ పేజి 56)

**10. రాజారామ్ తోడర్‌మల్ :** షాజహాన్ దర్బారులోని ఒక గౌరవనీయుడైన మన్సబుదారు. ఔరంగజేబ్ ఇతన్ని తన కాలంలో 'అటావా'కు ఫౌజ్‌దారుగా (సైనికాధికారి)గా నియమించాడు. (మాసిరుల్ ఉమర, వా.2, పే.290, 291)

**11. మహారాజా జస్వంత్ సింగ్ రాథోడ్ :** షాజహాన్ దర్బారులోని అత్యంత ఉన్నతమైన నాయకుడు. ఆరువేల పదాతి, ఐదువేల అశ్విక దళాల మన్సబుదారు. 2–3 అస్పాల స్పెషల్ గ్రేడ్ పొందిన మన్సబుదారు. రాకుమారుడు దారా షికూహ్‌కు సమర్థకుడు, ఔరంగజేబ్‌కు బద్ధవ్యతిరేకియై ధర్మావత్‌లో ఔరంగజేబ్‌తో పోరాడాడు. కాని ఈ యుద్ధంలో ఘోర పరాజయానికి పాలయ్యాడు. అతను ఓడిపోయి, రహస్యంగా రాజ్‌పుతానలోని తన కోటకు చేరుకున్నప్పుడు అతని రాణి కోట తలుపులు తెరువలేదని, ఓడిపోయి పారిపోయి వచ్చిన రాజపుత్రునికి తన కోటలో స్థానం లేదని నిర్మొహమాటంగా చెప్పిందని, ఆ తరువాత ఔరంగజేబ్ మధ్యలో పడి వీరిద్దరికీ రాజీ కుదిర్చినా, జీవితాంతం ఆమె తన భర్తతో దాంపత్య సంబంధాలు పెట్టుకోలేదని కొందరు చరిత్రకారులు కథలుగా వ్రాశారు.– ధర్మావత్ యుద్ధం తరువాత అతనొచ్చి ఔరంగజేబ్‌ను ఆశ్రయించాడు. ఔరంగజేబ్ అతని తప్పుల్ని మన్నించడమేకాక అతని పాత మన్సబు, హోదా యధాతథంగా తిరిగి ప్రసాదించాడు. కాని రాకుమారుడు షుజాతో ఖజ్వాలో జరిగిన యుద్ధంలో తీవ్రమైన మోసానికి పాల్పడి, అర్ధరాత్రి ఔరంగజేబ్‌కు వెన్నుపోటు పొడిచి, అతని సైన్యాన్ని చిందరవందర చేస్తూ, తన పదునాలుగు వేలమంది సైన్యంతో షుజా పక్షానికి వెళ్ళి, క్షమించరాని స్వామిద్రోహానికి పాల్పడ్డాడు. ఆ తరువాత కూడా దక్కన్‌కు పంపినప్పుడు, శివాజీతో లాలూచి పడ్డాడు. ఇంకా ఇతను ఇలాంటి అనేక అకృత్యాలకు పాల్పడ్డాడు. అయినా ఔరంగజేబ్ అతన్ని క్షమించడమే కాకుండా, వివిధ కాలాల్లో అతన్ని గుజరాత్, కాబూల్, జమ్రూద్‌లకు గవర్నరుగా కూడా నియమించాడు. (మాసిరుల్ ఉమర, వా–3, పేజి 497–501)

**12. రాజా సుజాన్ సింగ్ బుందేలా :** ఇతను రాజా పహాడ్ సింగ్ బుందేలా కుమారుడు. ప్రారంభంలో సమూగఢ్ యుద్ధ సమయంలో దారా షికూహ్ పక్షంలో ఉండి పోరాడాడు. కాని ఆ తరువాత ఆలంగీర్‌ను ఆశ్రయించాడు. అస్సాం, కోచ్ బిహార్, మధురా మరియు బీజాపూర్ యుద్ధాల్లో పాల్గొన్నాడు. ప.షే.22వ సంవత్సరంలో శివాజీతో పోరాడి, 'సివాని' కోటను వశపరచుకోవడంతో ఔరంగజేబ్ దృష్టిని ఆకర్షించగలిగాడు. (మాసిరుల్ ఉమర – వా–2, పే.295)

ఇలా ఒక్కొక్క రాజపుత్ర మన్సబుదారు గురించి వ్రాసుకుంటూపోతే ఒక గ్రంథమే అవుతుంది. ఎంతమంది రాజపుత్ర వీరులు ఔరంగజేబ్ దర్బారులో మన్సబులు పొందారో, గడిచిన పేజీల్లో వివరిస్తూనే వచ్చాము. ఒక్కొక్కరిది ఒక చరిత్రే ఉంది. కనుక వారందరి గురించి మేమిక్కడ పేర్కొనడం సంభవం కాదు. అయితే ఔరంగజేబ్‌ను సమర్థించి, అతని పక్షాన పోరాడిన కొందరు మరాఠా నాయకుల/మన్సబుదారుల వివరాలు పేర్కోవడం అనివార్యమనుకుంటున్నాము.

**13. కాన్ హోజి షిర్కే :** రాజారాం తల్లి వంశానికి చెందినవాడు. ఆరువేల మన్సబుదారు. 'వాగన్‌జీర' యుద్ధంలో (1705) ప్రఖ్యాతిగాంచాడు.

**14. సత్వాజి దఫ్లియ :** ఇతను ఆరువేల మన్సబుదారు, మరాఠాల్లో పేరెన్నికగన్నవాడు. 1117 హిజ్రీ, 1706లో బ్రహ్మపురి సైనిక శిబిరంలో తుదిశ్వాస విడిచాడు. (మాసిరె ఆలంగీరి – పేజి 375)

**15. పిదర్‌జీ :** ఇతను శివాజీకి సోదరుడు (బాబాయి కుమారుడు). రెండున్నర వేల పదాతి, పదిహేను వందల అశ్విక దళ మన్సబుదారు. ఆ తరువాత అతని మన్సబులో ఐదువందల పెంపుదల వచ్చింది. బూదపాంచ్‌గాంవ్‌కు ఇతను 'థానాదార్' గా పనిచేశాడు. (మా.ఆ. పే.348)

**16. రాంచందర్ :** అసలు, పెంపుదలతో కలుపుకొని రెండువేల పదాతి, మూడు వేల అశ్విక దళ మన్సబుదారు. 'ఖథానీ'కు 'థానెదార్'గా పనిచేశాడు. (మా.ఆ. పే.306).

ఔరంగజేబ్ 'దర్బారి అఖ్బారాత్' అధ్యయనం వల్ల మరాఠా నాయకులైన 'మంబాజీ'ను మసూర్‌లో, పీరాజీను 'కాగుల్'పై, ఆవుజీ అథల్‌రావును ఖానాపూర్‌లో 'నాగూజీ మానె'ను మహ్‌సోడ్‌లో, నిజాంరావును, ఖేడ్‌ఖదూస్‌లో 'మంకూజీ'ను 'షక్రాపూర్'లో, బహర్‌జీపాంద్రేను 'కొల్హాపూర్'లో కోట సంరక్షకులుగా (కోటాధిపతులుగా) నియమించడం జరిగింది. (అఖ్బారాత్, పే.32, స.షా. గాజియొద్దీన్)

ఈ వివరాలు దేన్ని బహిర్గతం చేస్తున్నాయి? అప్పుడు జరిగిన యుద్ధాల్లో మత పరమైన, ధార్మికపరమైన అంశమే లేదు. శివాజీ మరియు ఔరంగజేబ్‌ల మధ్య జరిగిన యుద్ధాలు మతపరమైనవి, జాతిపరమైనవి ఎంతమాత్రం కావు. ఎక్కువకు ఎక్కువ దీన్ని ప్రాంతీయ మరియు కేంద్రశక్తుల మధ్య ఘర్షణగా పేర్కొనవచ్చు. ఒకవైపు శివాజీ తన స్వాతంత్రం కోసం, ప్రాంతీయ ప్రాతినిధ్యం కోసం, తన ఉనికికోసం పోరాడివుంటే, శ్లాఘించదగిన విషయమే. అందులో తప్పులేదు. వేరొకవైపు సువిశాలమైన భారత సామ్రాజ్య ఐక్యతను, అఖండతను కాపాడడం కోసం, కిరీటం సింహాసనాల గౌరవాన్ని రక్షించడం కోసం, భారతజాతి అంతటినీ ఒకే పతాకం, ఒకే అధికారం క్రిందికి తెచ్చి, సుస్థిరభారత సమాజ నిర్మాణం కోసం దృఢసంకల్పం గల చక్రవర్తి ఉన్నాడు. ఈ రెండింటిలో కాస్త మధ్యస్థ మార్గం ఏదుండేదని మన ఆలోచించదలచి నట్లయితే ఒక సువిశాల సామ్రాజ్యాధి నేతగా, యుక్తితో, దూరదృష్టితో చక్రవర్తి కాస్త సంయమ నంతో వ్యవహరించాల్సి ఉండేది. అయితే అతనలా ప్రవర్తించాడా? ఈ సమస్యను పరిష్కరించ డానికి అతను చూపిన చొరవేమిటి? మొదలుగాగల వివరాలు "ఔరంగజేబ్–మరాఠాలు" అనే అధ్యాయంలో మీరు చూడగలుగుతారు.

# 14. హిందూ మందిరాలు ఔరంగజేబ్ ఫర్మానాలు

బ్రిటిష్ ప్రభుత్వం మెప్పును పొందదలచిన, పక్షపాతులైన కొందరు చరిత్రకారులు ఔరంగజేబ్‌ను పరమత ద్వేషిగానే కాకుండా హిందూ మందిరాలను ధ్వంసం చేసేవాడని, కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్షలు విధించాడని, ఇలా రకరకాల అపనిందలకు గురిచేశారు. కాని వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. ఔరంగజేబ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు, కుతంత్రాలకు కేంద్రంగా మారిన కొన్ని మందిరాలను అతను ధ్వంసం చేసినప్పటికీ, ఇతర హిందూ మందిరాలను గౌరవాభిమానాలతో చూడడమే కాకుండా అందులో పూజా పునస్కారాలు, భగవదార్చనలు యథావిధిగా, ప్రశాంతంగా జరుగాలని అతను కోరుకుంటుండేవాడు. దీనికోసం అతను పూజారులకు, మందిరాలకు బహుళ సంఖ్యలో దానాలు, జాగీర్లు ఇచ్చి, వాటి కోసం ఫర్మానాలు జారిచేసిన ధర్మదాత. బ్రాహ్మణులకు, పూజారులకు జారీచేసిన రోజువారి భత్యాలు, పింఛనులు, దానాలు, కానుకను మరియు మందిరాలకు జారీచేసిన ఫర్మానాలు వందలాదిగా ఉన్నాయి. డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే రాజ్యసభ నుద్దేశించి చేసిన ప్రసంగంలో ఔరంగజేబ్ మందిరాలకు జారీచేసిన ఫర్మానాలు కేవలం తానొక్కని వద్దనే రెండువందల వరకున్నాయని తెలిపారు. డాక్టర్ కాళి కింకర్ దత్త "Some Furmans, Sanads and Parwanas" అనే పేరుతో రూపొందించిన తన గ్రంథంలో వీటన్నిటిని పొందుపరిచారు. ఆయనే కాకుండా ముంబాయికి చెందిన జెనన్ చందర్ కూడా పరిశీలన జరిపి ఇలాంటి ఫర్మానాలను వెలికి తీశారు. ఆ ఫర్మానాల వివరాలను వాటి అనువాదంతో సహా "Aurangazeb and Hindu Temples" అనే మకుటంతో ఒక సుదీర్ఘ వ్యాసం వ్రాశారు. అది Secular Democracy, Annual Issue, 1970 న్యూఢిల్లీ, పత్రికలో ప్రచురింపబడింది. అందులో ఒక చోట ఆయనిలా రాశారు.

“బనారస్ ఫర్మానా పేరుతో ప్రఖ్యాతి గాంచిన ఫర్మానాను ఆధారంగా చేసుకొని అతను కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్షలు విధించాడని అతన్ని విమర్శలకు గురిచేశారు. జదూనాథ్ సర్కార్ కూడా అదే రాసేశారు. కాని వాస్తవంలో ఈ ఫర్మానాలో అలాటిదేమీ లేదు.”

ఈ ఫర్మానా అనువాదాన్నిస్తూ ఆయనిలా అన్నారు : “1905లో ఈ ఫర్మానాను గోపినాథ్ మనువడు మంగల్ పాండే మెజిస్ట్రేటుకు సమర్పించాడు. ఆ తరువాత 1911లో జనరల్ ఆఫ్ ఏషియాటిక్ సొసైటీ బెంగాల్‌లో ప్రచురింపబడింది. ఈ ఫర్మానా 1659 మార్చి నెలలో బ్రాహ్మణులు ఫిర్యాదుచేస్తూ సమర్పించిన అర్జీపై జారీ చేయబడింది. ఆ మొత్తం ఫర్మానా ఇలా ఉంది :

"ప్రభువుల దయానుగ్రహాలకు, మన్ననలకు రాయితీలకు అర్హుడు అయిన అబుల్ హసన్‌కు తెలియవలసిందేమిటంటే, మా స్వాభావికమైన అపరిమిత దయ, కనికరాలు, అనుగ్రహం ఉపకారాలు, మా నిరంతర శక్తి సామర్థ్యాలు, సత్సంకల్పాలకు ప్రధాన లక్ష్యం ప్రజలందరి మేలు, క్షేమం. చిన్న పెద్ద అన్ని వర్గాల అభ్యుదయం మాత్రమే అనేది తెలుసుకోవాలి. మా పవిత్ర షరీయత్తు మరియు చట్టాన్ని అనుసరించి ప్రాచీన మందిరాలను ఎన్నటికీ నష్టం, ధ్వంసం చేయరాదని మరియు అనుమతి లేకుండా కొత్త మందిరాల నిర్మాణం జరుగరాదని నిర్ణయం జరిగింది. బనారస్ (వారణాసి) మరియు దాని పరిసరాల్లో నివసిస్తున్న, ప్రాచీన మందిరాలకు పురోహితులైన హిందువుల్ని, బ్రాహ్మణుల్ని కొందరు అన్యాయంగా, అనవసరంగా హింసిస్తున్నారని, బాధిస్తున్నారని, వారి ప్రాచీన హక్కైన పురోహిత్వం నుండి తొలగించడానికి ప్రయత్నిస్తున్నారని ఇటీవలనే మాకు తెలిసివచ్చింది. అలా జరిగితే పాపం వీరు చింతావ్యాకులానికి గురిఅయి, కష్టాల్లో పడిపోతారు. అందుకని ఈ రాజాజ్ఞ ముట్టిన వెంటనే ఆ ప్రాంతానికి చెందిన ఏ వ్యక్తి కూడా ఈ బ్రాహ్మణులు మరియు ఇతర హిందువుల్ని ఏ రకమైన చింతకు, బాధకు, అన్యాయానికి గురిచేయకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు జరుగాలని ఇందుమూలంగా నిన్ను (అబుల్ హసన్‌ను) ఆదేశించడం జరుగుతున్నది. ఈ విధంగా ఆ వర్గంవారు తమ తమ స్థానాల్లో ఉంటూ, తమ దైనందిన కార్యక్రమాలు నిర్వర్తించుకుంటూ, ప్రశాంత హృదయంతో దైవ ప్రసాదితమైన మా రాజ్య మనుగడ కోసం ప్రార్థనల్లో నిమగ్నమై ఉంటారు. ఈ ఆదేశాన్ని తక్షణమైన, ఆవశ్యకమైనదిగా గుర్తించవలెను." – 1069 హిజ్రీ జమాదియుస్సాని, 15.

పైన పేర్కొన్న ఈ ఫర్మానానే దృష్టాంతంగా పేర్కొంటూ, ఔరంగజేబ్ కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్షలు విధించాడని అతన్ని అపకీర్తి పాల్జేశారు. ఈ విషయంగా జనన్ చందర్ తన వ్యాసంలో ఇలా వివరించారు.

"కొత్త మందిరాల నిర్మాణాన్ని ఆపడానికి ఇందులో ఎలాంటి ఆదేశం ఇవ్వబడలేదు. దానికి బదులు మొదటి నుండే అమలులో ఉన్న ఒక పద్ధతి లేక ఆచారాన్ని గుర్తు చేయడం, అంటే అనుమతి లేకుండా నిర్మాణం జరుగరాదు మరియు మందిరాలను ధ్వంసం చేయకుండా నిషేధించడం జరిగింది. ఈ ఫర్మానా ద్వారా ఔరంగజేబ్ హిందువులు సుఖంగా, ప్రశాంతంగా ఉండాలని కోరిక కలిగి ఉండేవాడని, దీనికోసం కఠిన ఆదేశాలు జారీ చేశాడని కూడా అర్థమవుతుంది."

ఈ ఫర్మానా ఎవరి వద్ద ఉండేది, అదెలా బయటికి వచ్చింది, దాని పూర్వపరాలేమిటి మున్నగు విషయాల్ని "వఖాయె ఆలంగీరి"లో ఇలా తెలుపడం జరిగింది.

"1911 అక్టోబరు నెలలో ఇంగ్లాండ్‌కు చెందిన ఒక ఓరియంటలిస్ట్ (ప్రాచ్య వ్యవహారాల పండితుడు) కర్నల్ డి.సి. ఫ్లిట్ కాకతాళీయంగానే బనారస్ వెళ్ళాడు. అక్కడ ఆయనకు ఔరంగజేబ్ ద్వారా జారీ చేయబడిన ఒక ఫర్మానా నకలు (కాపీ) దొరికింది. ఇది బనారస్ అధికారి అయిన అబుల్ హసన్ పేరన జారీ చేయబడింది. హిందూ వర్గాల్లో ఔరంగజేబ్ పట్ల సర్వసామాన్యంగా ప్రఖ్యాతి గాంచిన భావనల దృష్ట్యా, దీనిలోని సారాంశంతో పొంతన

కనిపించలేదు. ఇదో బూటకపు ఫర్మానా అనుకోవడానికి ఎంతైనా అవకాశముంది. ఔరంగజేబ్ హిందువుల ప్రాణశత్రువని, వారిపై అతను జిజ్‌యా విధించాడని, వారి విగ్రహాలను విరగ్గొట్టా డని, వారి మందిరాలను ధ్వంసం చేశాడని, ఇతర ప్రాంతాల్లాగే అతను బనారస్‌లో కూడా అనేక హిందూ మందిరాలను ధ్వంసం చేసి, వాటిపై మసీదులు కట్టాడని ఇలా రకరకాల కథలు వాడుకలో ఉన్నాయి. ఈ కథల్ని కర్నల్ ఫ్లిట్ కూడా తప్పకుండా వినే ఉంటాడు. అందుకని ఆ నకలు ఫర్మానా ద్వారా ఔరంగజేబ్ ఇంకో రూపమే కనబడుతుంటే అతను సంధిగ్ధంలో పడిపోయాడు. దీని అసలు దొరకబట్టి చూడనంతవరకు ఇదమిత్థంగా ఒక నిర్ణయానికి రావడం అసంభవమనుకున్నాడు. అందుకని ఆయన పనికట్టుకొని ఈ ఉద్దేశంతోనే మరోసారి బనారస్ వెళ్ళాడు. ఈసారి ఆ నగర కమీషనర్ అయిన ఖాన్ బహాదూర్ షేఖ్ ముహమ్మద్ తయ్యబ్ గారి సహాయ సహకారాలతో ఆయన అసలు ఫర్మానాను కూడా చూడగలిగాడు."[1]

ఈ ఫర్మానా ఎలా బయటికి వచ్చింది, దాని పూర్వపరాలేమిటనే దానిపై ఖాన్ బహాదూర్ ముహమ్మద్ తయ్యబ్ ఇచ్చిన వాంఙ్మూలము చారిత్రాత్మకమైనది, ఎన్నో విషయాల్ని తేటతెల్లం చేస్తుంది. దాని వివరాలు "వఖాయె ఆలంగిరి"లో ఇలా ఉన్నాయి.

"బనారస్‌లోని ఒక వీధి అయిన మంగలగోరిలో గోపీ ఉపాధ్యాయ్ పేరుగల ఒక బ్రాహ్మణోత్తముడుండేవాడు. అతను పదిహేను సంవత్సరాల క్రితం చనిపోయాడు. అతని వారసుల్లో కేవలం ఒక మనువడున్నాడు. అతన్ని మంగల్‌పాండేగా పిలిచేవారు. అతను కూడా మంగళగోరీలోనే నివసిస్తుండేవాడు. తాత చనిపోయిన తరువాత, కుటుంబంలోని ఇతర కాగితాలతో పాటే, ఔరంగజేబ్ చక్రవర్తి ద్వారా జారీచేయబడిన ఈ ఫర్మానా కూడా అతనికి వారసత్వంలో దొరికింది. 1905 ఏప్రిల్ నెలలో బనారస్‌లోని కలెక్టర్ న్యాయస్థానంలో అతనో వ్యాజ్యాన్ని వేశాడు. కలెక్టర్ గారి ఆదేశానుసారం నేను ప్రాథమిక విచారణ కోసం నియమించబడ్డాను. మంగల్‌పాండే నదీతీరంపై కూర్చుండే ఒక బ్రాహ్మణపూజారి. నదిలో స్నానాలు ఆచరించడానికి వచ్చే యాత్రికులకు పూజలు చేయించడం, పూజకోసం అవసర మయ్యే వస్తువుల్ని అతనే యాత్రికులకు కొనిపెట్టేవాడు. గడిచిన రోజుల్లో గుజరాత్‌కు చెందిన కొందరు స్త్రీలు, తమ ప్రాంతీయ ఆచారాన్ని అనుసరించి, తీరంపై కూర్చుండి ఏడ్వడం, శోక రాగాలు తీయడం మొదలుపెట్టారు. దీనివల్ల ఇతర పూజారుల, భక్తుల ఏకాగ్రతలో భంగం ఏర్పడసాగింది. "మీరిలాగే ఏడుస్తూ, పెడబొబ్బలు పెడుతూ ఉంటే ఇతర యాత్రికులెవ్వరూ ఇటురారు, ఆ విధంగా నాకు తీరని నష్టం కలుగుతుందంటూ" మంగలపాండే వారిని ఆపడానికి ప్రయత్నించాడు. దానిపై మంగలపాండే మరియు ఆ స్త్రీల మధ్య వివాదం చెలరేగింది. ఫలితంగా అతను న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసి వచ్చింది. "ఈ తీరప్రాంతపు పురోహిత్వానికి సంబం ధించి నీవద్ద చట్టపరమైన దస్తావేజులు లాంటివి ఏమైనా ఉన్నాయా? ఉంటే సమర్పించు"

అంటూ నేనతన్ని అడిగాను. దానిపై అతను, మరియు అతని సేవకుడు బాబునందన్ అనేక కాగితాల్ని నా ముందుంచారు. ఔరంగజేబ్ చక్రవర్తి ఫర్మానా కూడా అందులో ఉంది. ఈ ఫర్మానా ఇప్పటి వరకు కూడా అతని అధీనంలోనే ఉంది."

ఈ వివరణ తరువాత కర్నల్ ఫ్లిట్ అనుమానాలన్నీ పటాపంచలైపోయాయి. ఫర్మానా వెనుక భాగంలో ఔరంగజేబ్ రాకుమారుడు ముహమ్మద్ సుల్తాన్ సీలును పరిశీలించిన తరువాత, ఈ ఫర్మానా ఔరంగజేబ్ ద్వారానే జారీ చేయబడిందనే నిర్ణయానికి వచ్చారు. దీన్ని చదివిన తరువాత, విమర్శకులు అతన్ని ఏ రూపంలోనైతే ప్రదర్శిస్తున్నారో, వాస్తవంలో అతనలాంటి వాడు కాడని విశ్వసించక గత్యంతరం లేదు. ఇంకా తన హిందూ ప్రజలు సుఖశాంతులతో, ఆహ్లాదంగా సమృద్ధితో జీవితం గడపాలని అతని ప్రగాఢ వాంఛ అయివుండేదని, వారి హక్కులపై ఎవ్వరూ ఏ విధమైన జోక్యం చేసుకోరాదనేది కూడా అతని అభిలాష అయి ఉండేదని అర్థమైపోతుంది."[2]

ఇక్కడో సందేహాన్ని దూరం చేయడం సమంజసమనుకుంటాము. కొత్త మందిరాల నిర్మాణం కోసం ప్రభుత్వ అనుమతి అనే షరతు ఔరంగజేబ్ ప్రవేశపెట్టింది కాదు. ఇది షాజహాన్ కాలంలో ప్రవేశపెట్టబడింది. దీని పూర్వపరాలు ఏమిటంటే, ఒక ప్రాంతంలో అంతకుముందే రెండు ప్రాచీన మందిరాలుండేవి. కొంతమంది ఇంకొక కొత్త మందిరాన్ని నిర్మించతలపెట్టారు. ఫలితంగా అక్కడి హిందువుల్లో రెండు వర్గాలు ఏర్పడి, వివాదం తలెత్తింది. ఈ విషయం చక్రవర్తికి తెలిసినప్పుడు, వివాద పరిష్కారం కోసం ఇకముందు ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకూడదనే దృష్టితో ప్రభుత్వ అనుమతి లేకుండా కొత్తమందిరాల నిర్మాణంపై ఆంక్ష విధించారు. ఈ చట్టమే ఔరంగజేబ్ కాలంలోను అమలులో ఉంది. బనారస్ ఫర్మానాలో ఆ పాత చట్టాన్నే పునరావృతం చేశారు తప్ప కొత్త చట్టాన్ని ప్రతిపాదిం చలేదు.

ఈ కోవకు చెందినది ఇది ఏకైక ఫర్మానా కాదు. వారణాసిలోనే ఇంకొక ఫర్మానా దొరికింది. అందులో ఇలా ఉంది :

**(2)** మహోన్నతమైన, అత్యంత గౌరవనీయమైన మా దర్బారులో మహారాజ ధీరజ్ రాజా రాంసింగ్ ఒక అర్జీని సమర్పిస్తూ వారణాసిలోని గంగానది ఒడ్డున 'మాధూరాం' పేరుగల వాడలో అతని పితామహుడు భగవత్ గోసాయేఁ (అతని ధార్మిక గురువు) నివాసం కోసం ఒక గృహాన్ని నిర్మించాడని, కాని కొందరు ఈ గోసాయేఁని ఇబ్బంది పెడుతున్నారని మనవి చేసుకున్నాడు. కావున మా రాజాజ్ఞ ఏమిటంటే ఈ ఆదేశం అందిన వెంటనే ప్రస్తుతమున్న, ఇకముందు రాబోయే అధికారులందరికీ ఆదేశాలు జారీచేయండి. ఇకముందు ఏ వ్యక్తి కూడా ఈ గోసాయేఁ (సన్యాసి) వ్యవహారంలో ఎలాంటి జోక్యం చేసుకోరాదని అతన్ని ఏ విధంగానూ ఇబ్బంది పెట్టరాదని తత్ఫలితంగా అతను పరిపూర్ణ, లగ్న మనస్సుతో తన ఆరాధనలు చేసుకుంటాడని మా దైవప్రసాదిత రాజ్యం కలకాలం మనగలుగుతుందని

ఇందుమూలంగా ఆదేశించడం జరిగింది. ఈ ఆదేశాన్ని 'తక్షణం అమలు జరపాల్సింది"గా భావించగలరు."

ఇవిగాక కొన్ని వేరే ఫర్మానాలు, ప్రత్యేకించి జంగంబాడి మఠానికి చెందిన మహేంతుని (పూజారి) వద్ద ఉన్నాయి. వాటినిచూస్తే ఔరంగజేబ్ తన ప్రజల హక్కుల్లో (వారు హిందువులు, ముస్లింలు, సిక్కులు, జైనులు ఎవరయినాసరే), ఎవరైనా జోక్యం చేసుకుంటే దాన్ని సహించలేకపోయేవాడని అర్థమవుతుంది. దోషులతో అతను కఠినంగా వ్యవహరించేవాడు. ఈ ఫర్మానా ఒక ఆరోపణకు సంబంధించి ఉంది. దీన్ని జంగం వర్గం వారు వారణాసిలోని ఒక ముస్లిం నజీర్ బేగ్‌కు వ్యతిరేకంగా సమర్పించారు. ఆ సందర్భంగా ఈ క్రింది ఫర్మానా జారీచేయబడింది.

**(3)** పరగణ వారణాసి నివాసస్తులైన అర్జున్‌మల్ ఇంకా ఇతర జంగం వర్గం వారు రాజదర్బారులో హాజరై, వారణాసి నివాసస్థుడైన నజీర్‌బేగ్, వారణాసిలో వారికి చెందిన ఐదు భవంతీలను బలవంతంగా ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. అందుకని అలహాబాద్ సూబాకు చెందిన వారణాసి అధికారులను ఆదేశించునదేమనగా ఒకవేళ వీరు చెప్పేది నిజమైతే (పైన పేర్కొన్న భవంతీలపై) వారి యాజమాన్యపు హక్కులు ధృవపడితే నజీర్‌బేగ్‌ను ఈ భవంతీల్లో ప్రవేశించనీయకూడదు. ఇంకా భవిష్యత్తులో ఈ జంగం వర్గం వారు అర్జీదారు లుగా మా దర్బారులో వచ్చే అవసరం ఏర్పడకూడదు" (ఈ ఫర్మానా క్రీ.శ. 1672లో జారీ చేయబడింది).

ఈ మఠం వారి వద్దనే ఇంకొక ఫర్మానా ఉంది. ఇది 1666 సెప్టెంబర్ నెలలో జారీ చేయబడింది. జంగం వర్గం వారికి ప్రసాదించబడిన భూమిని, తిరిగి వారికే ఇస్తూ జారీ చేయ బడిన ఫర్మానా ఇది.

**(4)** 'పరగణ హవేలి' (అలహాబాద్ సూబా)కు సంబంధించి ప్రస్తుతమున్న ఇకముందు రాబోయే జాగీర్దార్లను, అధికార్లను ఆదేశించునదేమనగా రాజాజ్ఞ ప్రకారం జంగం వర్గం వారికి (178) బీగాల భూక్షేత్రాన్ని వారి పోషణార్థం ఇవ్వబడింది. ఇంతకుముందు కూడా అప్పటి అధికారులు ఈ విషయంలో విచారణ జరిపారు. ప్రస్తుతం కూడా అప్పటి పరగణ అధికారి ధృవీకరణ ముద్ర ఉన్న సాక్ష్యాలను వారు ప్రదర్శించారు. దీనిద్వారా ఈ భూక్షేత్రం వారి కబ్జాలోనే ఉన్నట్లు ధృవపడటమే కాక దీనిపై వారికి గల హక్కు కూడా స్పష్టంగా నిరూపితమవుతుంది. అందుకని రాజాజ్ఞగా ఈ భూక్షేత్రం వారికి రాజప్రసాదం (రాజుగారి దానం)గా ఒసంగబడుతున్నది. ఈ భూక్షేత్రం ఖరీఫ్ పంట ఆరంభంతోనే, యధావిధిగా వారికి అప్పగించాలి. అంతేకాక వారికి ఏ విధమైన ఆటంకం కల్పించకూడదు. ప్రతి పంటనూ ఈ జంగం వర్గం వారు తమ పోషణార్థం ఉపయోగించుకోవాలి ఇంకా వారు నష్టపోకూడదు."

ఈ ఫర్మానా ద్వారా ఔరంగజేబ్ హృదయ విశాలత ప్రస్ఫుటమవుతుంది. అతను ప్రజా రంజకుడని, తన ప్రజల్లో భేదభావాన్ని పాటించేవాడు కాదని, దానమివ్వటంలో కూడా అతను హిందూ ముస్లింల తారతమ్యాన్ని పాటించేవాడు కాదని రుజువవుతోంది. పైనుదాహరించిన

(178) బీగాల భూమి, ఔరంగజేబ్ స్వయంగా జంగం వర్గం వారికి 'కానుక' (దానం)గా ఇచ్చి ఉన్నాడని భావించడానికి అవకాశాలున్నాయి. ఎందుకంటే దీనికి సంబంధించిన వేరొక ఫర్మానాలో దీన్ని 'దానభూమి'గా పేర్కొన్నారు. ఈ ఫర్మానా 1661 ఏప్రిల్ నెలలో జారీ చేయబడింది.

**(5)** (అలహాబాద్ సూబాలోని) పరగణ హవేలి, వారణాసికి సంబంధించిన ప్రస్తుత, రాబోయే అధికారులందరినీ ఆదేశించునదేమనగా రాజాజ్ఞగా వారణాసి (బనారస్)లోని (178) బీగాల భూక్షేత్రాన్ని జంగం వర్గం వారికి వారి జీవనోపాధి కోసం ప్రసాదించబడింది. ఇటీవలనే వారు తిరిగి రాజదర్బారుకు హాజరయ్యారు. వారి హక్కులు నిరూపితమయ్యాయి. ఈ భూక్షేత్రం కూడా వారి అధీనంలోనే ఉన్నట్లు విదితమవుతోంది. కనుక ఈ క్రింది వివరాల ప్రకారం ఈ భూమిని 'దానభూమి'గా పరిగణించాలి. ఈ భూమిని వారు ఉపయోగించుకొని చక్రవర్తి ప్రభుత్వ స్థిరత్వం కోసం ప్రార్థిస్తుంటారు.

ఇంకొక ఫర్మానా 1674లో జారీచేయబడింది. దీనిననుసరించి వారణాసిలోని ఒక హిందూ పండితునికి (అధ్యాపకునికి) ఔరంగజేబ్ ఒక భూక్షేత్రాన్ని ప్రసాదిస్తూ ఇలా ఆదేశించాడు:

**(6)** ఈ శుభ సందర్భంలో వారణాసి పట్టణంలో గంగానది ఒడ్డున బేని మాధవఘాట్ సమీపాన ఉన్న (588) వీరాల (వైశాల్యం) కలిగిన రెండు భూక్షేత్రాలకు సంబంధించిన పవిత్ర ఫర్మానా జారీ చేయబడుతున్నది. ఇందులో ఒక భూక్షేత్రం రాంజీవన్ గోసాయేఁ ఇంటికెదురుగా, కేంద్రీయ మస్జిద్‌కు వెనుకవైపున, ఇంకొకటి దానికి ఆవల ఉంది. ఈ భూక్షేత్రాలు ఖాళీగా ఉన్నాయి. వీటిపై ఎలాంటి కట్టడాలు లేవు. ఇవి ప్రభుత్వానికి సంబంధించినవి. కనుక ఈ భూక్షేత్రాలను మేం రాంజీవన్ గోసాయేఁ, అతని పుత్రునికి కానుకగా ప్రసాదించామని అందులో వారు పవిత్ర బ్రాహ్మణుల కోసం, సన్యాసుల కోసం నివాస గృహాలు నిర్మించుకొని దైవధ్యానంలో నిమగ్నమై దైవప్రసాదితమైన మా రాజ్యం స్థిరంగా ఉండాలని ప్రార్థిస్తారని ఇందుమూలంగా తెలియపరచడమైనది. గౌరవనీయులైన మా రాకుమారులు, కీర్తిప్రతిష్ఠలు గల మా మంత్రులు, మర్యాదస్థులైన మా నాయకులు, ఉన్నతులైన మా అధికారులు, గౌరవించదగిన మా జాగీర్దారులు, ప్రస్తుతమున్న రాబోయే కొత్వాల్లు మా ఈ పవిత్ర ఆదేశాన్ని శాశ్వతంగాను, పరిపూర్ణంగాను అమలు జరుపటానికి శాయశక్తులా కృషిచేయటం వారి విద్యుక్తధర్మంగా భావించాలి. ఈ భూక్షేత్రాలు శాశ్వతంగా పైన పేర్కొన్న వ్యక్తుల అధీనంలోనే ఉండాలి. ఇంకా వారి వారసుల్ని అన్ని రకాల బకాయిల నుండి శిస్తుల నుండి మినహాయించాలి. అంతేకాక ప్రతి సంవత్సరం కొత్త ఆజ్ఞాపత్రాన్ని వారితో కోరరాదు."

**ఉమానంద్ మందిరం, గౌహాటి**

ఔరంగజేబ్ చక్రవర్తి తన ప్రజల ధార్మిక విశ్వాసాల్ని ఆదరించటం తన విద్యుక్త ధర్మంగా భావించేవాడు. ఈ సందర్భంలో గౌహాటిలోని 'ఉమానంద్' మందిరానికి పూజారి అయిన

"సుదామన్" బ్రాహ్మణునికి జారీ చేసిన ఫర్మానా ఒకటుంది. ఇది ఔరంగజేబ్ పట్టాభిషిక్తుడైన 9వ సంవత్సరం, సఫర్ నెల 2వ తేదీన జారీ అయినట్లు రాయబడి ఉంది. అస్సాంకు చెందిన హిందూరాజులు, ఈ మందిరపు భోగనైవేద్యాల కోసమని కొంత భూమిని, అడవుల్లోని రాబడిలో కొంత భాగాన్ని ఈ సుదామన్ పూజారి పేర కేటాయించారు. ఎప్పుడైతే ఈ రాష్ట్రం ఔరంగజేబ్ అధీనంలోకి వచ్చిందో, ఆ మందిరపు పూర్వ పరిస్థితులు తెలుసుకొని, వెంటనే ఔరంగజేబ్ ఒక ఫర్మానాను జారీ చేశాడు.

**(7)** ప్రభుత్వ ముఖ్య వ్యవహారాలను చూస్తున్న ప్రస్తుత, రాబోయే అధికారులకు తెలియ జేయటం ఏమిటంటే గత రాజుల ఫర్మానా ప్రకారం 'సకారా' గ్రామానికి చెందిన (2 1/2 బిస్వాల వైశాల్యం గల) 30 రూపాయల భూమి శిస్తు కలిగివున్న భూమిని, సుదామన్ అనే బ్రాహ్మణ పూజారి, అతని పుత్రునికి (ఉమానంద్ మందిరపు పూజారులు) ప్రసాదింపబడి ఉండెను. ఇటీవలనే ఈ విషయంలో విచారణ జరిపిన తరువాత, గ్రామం నుండి వసూలు కాబడే భూమిశిస్తు నుండి (20) రూపాయలు, మిగిలింది అడవుల నుండి వచ్చే రాబడి నుండి పూరించి మొత్తం ముప్పై రూపాయలు వీరికి ప్రసాదించటానికి నిర్ణయించబడింది. అంతేకాక వీరిని భూమిశిస్తు నుండి కూడా మినహాయించటం జరిగింది. కనుక పై అధికారులందరినీ ఆదేశించునదేమనగా ఈ భూమి, నగదు రొక్కం (రెంటిని అన్ని శిస్తుల నుండి మినహాయించి) పై గ్రహీతలకు శాశ్వతంగాను, జీవితాంతంగాను ప్రసాదించబడింది. తద్వారా వారు ఈ భూమి, నగదు రూపాయల ద్వారా తాము జీవించుటయేగాక, తమ దేవతల పూజా పునస్కా రాలకు, అర్చన నైవేద్యాలకు వినియోగించుకొని తమ ఆరాధనలో నిమగ్నమై మా రాజ్యం కలకాలం మనగలగాలని ప్రార్థిస్తుంటారు. పై ప్రభుత్వాధికారులు ఈ భూమిని లీజుకు ఇవ్వటానికి అనుమతించరాదు. భూమిశిస్తుగాని, లేక ఇతర శిస్తులు గాని వారితో వసూలు చేయరాదు. ఇంకా కొత్త ఆజ్ఞా పత్రం కోసం వారిని బాధించరాదు. అంతేకాక (వీరుగాక వేరే ఎవరైనా) కొత్త ఆజ్ఞాపత్రాన్ని సమర్పిస్తే దాన్ని విశ్వసించి పరిగణనలోకి తీసుకోరాదు. అధికారులందరూ ఈ ఆదేశాన్ని తు.చ. తప్పక పాటించగలరు. (ఈ ఫర్మానా, జర్నల్ ఆఫ్ ది అసాం రీసెర్చ్ సొసైటీ, జనవరి – ఏప్రిల్ 1942 సంచికలో కూడా ప్రచురించబడింది).

**(8) మహాకాళేశ్వర మందిరం, ఉజ్జయిని**

హిందూప్రజలు, వారి ధర్మం పట్ల ఔరంగజేబ్ ఆదర్శనీయమైన పరమత సహనాన్ని ప్రదర్శించాడు. దీనికి సాక్ష్యం ఉజ్జయినిలోని మహాకాళేశ్వర మందిరపు పూజారులు సమర్పిస్తు న్నారు. దేశ ప్రముఖ శివాలయాలలో ఇదొకటి. ఇక్కడ రాత్రింబవళ్ళు ఒక దీపం వెలుగుతూ ఉంటుంది. దీన్ని "నందాదీప"మంటారు. దీన్ని ఎప్పుడూ ఆరిపోనివ్వరు. ప్రాచీన కాలం నుండి ఈ దీపాన్ని వెలిగించటానికి ప్రతిరోజు నాలుగు శేర్ల నెయ్యి స్థానిక పాలకులు సమకూర్చేవారు. ఈ మందిరపు పూజారుల ననుసరించి మొగలుల ప్రభుత్వంలో కూడా ఈ ఆచారం అమలులో

ఉండేది. చివరికి ఔరంగజేబ్ చక్రవర్తి కూడా ఈ సదాచారాన్ని పాటించాడు. దురదృష్టం ఏమిటంటే దీనికి సంబంధించిన "రాజాజ్ఞ పత్రం" వారికి లభ్యం కావటం లేదు. అయితే రాజాజ్ఞకు లోబడి ఔరంగజేబ్ కుమారుడైన 'కామ్ బక్ష్' ద్వారా జారీ చేయబడిన ఒక ఫర్మానా నకలు మాత్రం ఈ పూజారుల వద్ద ఉంది. దీన్ని అతను హిజ్రీ శకం 1061 షవ్వాల్ నెల 5వ తేదీన, తన తండ్రి (ఔరంగజేబ్) పరిపాలనా కాలంలో జారీచేశాడు. మహా కాళేశ్వరం మందిరపు పూజారి అయిన "దేవ్ నారాయణ్" సమర్పించిన అర్జీపై చక్రవర్తి తరఫు నుండి ఇవ్వబడిన రాజాజ్ఞ మేరకు వార్తా విలేఖరి, వక్ఫ్ అధికారి అయిన 'హకీం ముహమ్మద్ మహ్దీ' పాత ప్రభుత్వ రికార్డులను పరిశీలించిన తరువాత అర్జీదారు చెప్పింది వాస్తవమని ధృవీకరించాడు. ఈ ధృవీకరణ ఆధారంగానే చబుత్రా కొత్వాలి తహశీల్దారుకు, పైన పేర్కొన్న మందిరానికి ప్రతిరోజు నాలుగు శేర్ల (అక్బరీ తూకం) నెయ్యి సరఫరా చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ ఫర్మానా నఖలు ఒకటి హి.శ. 1153లో (అంటే అసలు ఫర్మానా జారీ అయిన 93 సంవత్సరాల తరువాత) ముహమ్మద్ సాదుల్లా జారీచేశాడు.

ఈ మందిరపు ప్రస్తుత పూజారి అనేదేమిటంటే అసలు ఫర్మానాకు సుదీర్ఘకాలం గడిచిన తరువాత నఖలు జారీ చేయబడిందంటే దీని అర్థం ఈ మధ్యకాలంలో అసలు ఫర్మానాపై అమలు జరుగుతున్నట్లే కదా! ఈ మధ్యకాలంలో ఔరంగజేబ్ పరిపాలనా కాలం సమాప్తమై పోయినప్పటికీ ఆ ఫర్మానాపై అమలు జరుగుచుండేది కనుకనే దాని నఖలును తీసుకున్నారు. అమలు జరుగని నిర్జీవమైన నిరుపయోగమైన ఫర్మానా నఖలు ఎవరు ఎందుకని తీసుకుంటారు?

ఈ మందిరపు స్ట్రాంగ్‌రూం లేక కార్యాలయపు గదిలో నేటికీ కూడా కొన్ని ప్రభుత్వ దస్తావేజులు, ఇంకా ఔరంగజేబ్ పరిపాలనా కాలపు ఇతర పత్రాలున్నాయని, ఈ మందిరపు గత పూజారి అయిన మహంత్ లక్ష్మీనారాయణ తెలిపారు.

**శత్రంజయ మరియు అబు మందిరాలు**

అహ్మదాబాద్‌లో నాగర్‌సేట్ ద్వారా నిర్మించబడిన చింతామణి మందిరాన్ని కూల్చిన అంశాన్ని సామాన్యంగా చరిత్రకారులు పేర్కొంటూపోతారు. కాని ఇదే ఔరంగజేబ్ ఇదే నాగర్‌సేట్‌కు శత్రంజయ, అబూ మందిరాల నిర్మాణం కోసం ఇచ్చిన జాగీర్ల యదార్థాన్ని మరుగుపరుస్తారు.

దీనికి సంబంధించి జారీచేసిన ఫర్మానా ఇలా ఉంది :

**(9)** ఇంకా దీని అంతం మనోజ్ఞంగా అవుతుంది. పవిత్రమైన మహోన్నతమైన, ఘనమైన ఈ దర్బారు ప్రముఖుల ద్వారా సతిదాస్ అనే వర్తకుడు ఒక అర్జీని సమర్పించాడు. కావున భారత చక్రవర్తి తరఫున హి.శ. 1031 రమజానుల్ ముబారక్ 19వ తేదీన ఈ ఫర్మానా

జారీచేయబడుచున్నది. ఇది హజ్రత్ సులేమాన్ (అలై) ఫర్మానాలాగా శ్రేష్ఠమైనది, అత్యుత్తమ మైనది. ఇంకా హజ్రత్ ముహమ్మద్ (స), హజ్రత్ సులేమాన్ (అలై)కు వారసులు (ఉత్తరాధికారి).

ఈ ఫర్మానాను అనుసరించి శతరంజియా ప్రాంతంలో ఉండే ఫలితాన జిల్లాను (ఇది అహ్మదాబాద్ సూబాలో ఉండి, దీని భూమిశిస్తు రెండు లక్షల దిర్హాంలు) అర్జీదారుకు శాశ్వత కానుక రూపంలో ప్రసాదింపబడుచున్నది. మా దర్బారు నుండి ఈ సందర్భంలో ఒక ఫర్మానా జారీ కావాలని అర్జీదారు ఆశిస్తున్నాడు. కనుక అర్జీదారుకు పైనుదాహరించిన జిల్లా, శాశ్వత ఇనాం రూపంలో ప్రదానం చేయబడుతున్నది.

కావున పైనుదాహరించిన సూబాకు చెందిన ప్రస్తుతమున్న ఇకముందు రాబోయే అధికారులు, గౌరవార్హమైన ఈ ఫర్మానాపై అమలు చేస్తూ, పై వ్యక్తి అతని సంతానం, వారసులు, తరతరాలుగా దీనిపై కబ్జాలో ఉండేటట్లు శతవిధాల ప్రయత్నించాలి. అంతేకాక పై వ్యక్తిని అన్ని రకాల శిస్తుల నుండి, బకాయిల నుండి మినహాయించాలి. ఇంకా ప్రతి సంవత్సరం అతనితో కొత్త ఆజ్ఞాపత్రాన్ని కోరరాదు. ఈ ఫర్మానాను తు.చ. తప్పక పాటించాలని అధికారులను ఆదేశించనైనది."

ఏదో ఒక యుద్ధ సమయంలో 'నాగర్‌సేట్' అనే వ్యక్తి ఔరంగజేబ్ చక్రవర్తికి సహాయ పడ్డాడు. అతని సేవలకు ప్రసన్నుడైన ఔరంగజేబ్ గర్‌నాల్, అబూకు చెందిన కొంత భూమిని, అక్కడి మందిరాలకు కానుకగా నాగర్ సేట్‌కు బహూకరించాడు. ఈ ఫర్మానా క్రీ.శ. 1658లో జారీ చేయబడింది. అదిలా ఉంది :

**(10)** అత్యంత కరుణామయుడు, పరమ దయాళువు అయిన అల్లాహ్ పేరుతో - దివ్య ఖుర్ఆన్ ఆయత్ - విశ్వాసులారా! దైవం మరియు దైవప్రవక్తకు విధేయులు కండి. ఇంకా మీలో అధికారపీఠాన్ని అధిరోహించిన వారికి కూడా.

(సీలు) అబుల్ ముజప్ఫర్ మొహియుద్దీన్ ముహమ్మద్ ఔరంగజేబ్ ఆలంగీర్ పాదుషాగాజీ- కాలంలో ఈ ఫర్మానా జారీ చేయబడింది.

"శ్రావక్ వర్గానికి చెందిన సతిదాస్ వల్దు సాహస్‌భాయి, ఈ ప్రభుత్వం నుండి ప్రత్యేక ఇనాం కోసం విన్నవించుకున్నాడు. ఈ వ్యక్తి మా సైన్యం ప్రయాణిస్తున్న సమయంలో ఆహార ధాన్యాలు సరఫరా చేసి సహాయపడ్డాడు. ఈ సేవలకుగాను అతను ప్రత్యేక కానుకలు ప్రసాదించబడాలని ఆశిస్తున్నాడు. కావున అహ్మదాబాద్ సూబా అధికార పరిధిలోకి వచ్చే 'ఫలితాన' పల్లె ప్రాంతం, 'ఫలితాన'లోని శతరంజియా పేరుతో ప్రఖ్యాతిగాంచిన గుట్ట ప్రాంతం. అందులోని మందిరంతో సహా మేం శ్రావకవర్గానికి చెందిన సతిదాస్ వ్యాపారికి బహూకరిస్తు న్నాము. శతరంజియా గుట్ట నుండి లభించే కర్ర, ఇంధనం మొదలగునవన్నీ శ్రావక్ వర్గం వారి ఆస్తులుగా పరిగణించబడతాయి. వీటిని వారు తమకు అవసరం అనిపించిన దానికోసం వినియోగించుకోవచ్చు. శతరంజియా గుట్ట, దానిపైనున్న మందిరాన్ని పరిరక్షించేవారే ఫలితాన

నుండి వచ్చే రాబడికి అర్హులు. మా ప్రభుత్వం కలకాలం ఉండాలని కాంక్షిస్తూ వారు తమ రీతిలో ఆరాధన చేసుకోవచ్చు. ప్రభుత్వ అధికారులు, జాగీర్దారులు ఇంకా ఇతర అధికారుల విద్యుక్తధర్మం ఏమిటంటే వారు ఈ ఫర్మానాలో ఎలాంటి మార్పులూ చేయరాదు. లేశమంత అవిధేయతా చూపరాదు."

**గర్నార్ మరియు అబూజీ మందిరాలు**

**(11)** "జూనాగడ్ ప్రాంతంలో ఒక కొండ ఉంది. అది గర్నార్ లేక గర్నాల్ అనే పేరుతో ప్రఖ్యాతిగాంచింది. ఇంకా అబూజీలో కూడా ఒక గుట్ట ఉంది. ఇది 'సరూహి' అధికార పరిధిలోకి వస్తుంది. ఈ రెండు కొండ ప్రాంతాల్ని కూడా మేం శ్రావక్ వర్గానికి చెందిన సతిదాస్ వర్తకునికీ, అతను సంపూర్ణంగా సంతృప్తుడవ్వాలని ప్రత్యేకంగా బహూకరిస్తున్నాం. కనుక ఈ ఆస్తుల్లో ఎవరూ జోక్యం చేసుకోకుండా చూడడం మా అధికారుల విధి, బాధ్యత. ఇంకా ఏ రాజు కూడా ఈ సతిదాస్‌కు ఎలాంటి అభ్యంతరాలు తెలుపకుండా ఉండటమేకాదు, అతనికి శక్తివంచన లేకుండా సహాయ సహకారాలందించాలి. ఈ ఆదేశంపై అమలు జరిపించే వారితో ప్రతి సంవత్సరం కొత్త ఆజ్ఞాపత్రాన్ని కోరరాదు. మేం సతిదాస్‌కు బహూకరించిన ఈ గ్రామం, మూడు కొండలపై ఎవరైనా వ్యక్తి దావా (వ్యాజ్యం) వేస్తే అతని ఈ చర్య అత్యంత గర్హనీయమైనదే కాదు, అతను ప్రజల, దైవం తరపున దూషణకు కూడా అర్హుడు. ఇదిగాక ఇంకొక ఆజ్ఞాపత్రం కూడా అతనికి ప్రసాదించబడింది. (ఈ ఫర్మానా క్రీ.శ. 1660 మార్చి 12న జారీ చేయబడింది).

(ఈ ఫర్మానా ముంబాయి యూనివర్శిటీ జర్నల్, వాల్యూం-9, పేజి 54లో కూడా ప్రచురించబడింది.)

**(12)** (మా) పరిపాలిత రాజ్యపరిధుల్లోని ప్రభుత్వానుగ్రహాన్ని కాంక్షిస్తున్న జాగీర్దార్లను సైనికాధికారుల్ని జమీందార్లను తెలియపరుస్తున్నదేమంటే ప్రజారక్షకమైన మా దర్బారులో ప్రభుత్వం, దర్బారులో ప్రవేశార్హత కలిగిన వారిద్వారా, కిషోర్ మరియు విజయ్‌చంద్‌లు ఒక అర్జీని సమర్పించారు. అందులో రాజ్యంలోని అనేకమంది హిందువులు వివిధ పల్లెల్లోను, పట్టణాల్లోను అనేక గృహాలు, నివాసాలు కట్టించి వాటిని దానరూపంలో ఇచ్చేశారని, వీరంతా ఆ ఇళ్ళల్లో నివసిస్తూ ప్రభుత్వ మనుగడ కోసం ప్రార్థిస్తూ ఉంటారని, అయితే కొంతమంది ఈ ఇళ్ళు టాక్స్ రహితమనే కారణం చేత వారిని అడ్డుకుంటున్నారని, ఇకముందు ఇలాంటి అడ్డంకులు సృష్టించకుండా సముచితమైన ఆదేశాలు ఈ న్యాయప్రియమైన దర్బారు నుండి జారీకావాలని వీరు కోరుతున్నారు. పరిపాలిత రాజ్యపరిధిలోని ఇళ్ళన్నీ టాక్సు నుండి మినహాయించబడినవి. వీటిపై టాక్సు వసూలు చేయడం నిషేధం. కనుక సర్వప్రపంచంలో శిరసావహించబడే ఈ ఆదేశం జారీ చేయబడుతున్నది. ఒకవేళ పరిస్థితి ఇదే అయివుంటే ఈ వర్గం వారికి ఎలాంటి ఆటంకం, అవరోధం కల్పించరాదు. వారు ప్రశాంతంగా తమ గృహాలలో ఉంటూ అంతంకాని ఈ రాజ్యం కోసం ప్రార్థిస్తూ ఉంటారు. ఇకముందు ఈ వర్గం వారు

మొరపెట్టుకోవటానికి ఈ మహోన్నత దర్బారులో రావలసిన అగత్యం ఏర్పడకూడదు. ఈ నిషేధిత ఉత్తర్వును అమలుపరచటం మీ విధి, బాధ్యతగా గుర్తించగలరు.

(ఈ ఫర్మానా పట్టాభిషేకం 27వ సంవత్సరం, రబ్బియుస్సాని నెల 19వ తేదీన జారీచేయబడినది).

(పై ఫర్మానాలన్నీ డా॥ బి.ఎన్. పాండే, మౌలానా అతావుర్రహ్మాన్ ఖాస్మి రచించిన 'హిందూ మందిర్ అవుర్ ఔరంగజేబ్ కే ఫరామీన్' అనే గ్రంథం (పబ్లిషర్స్ : మౌలానా ఆజాద్ అకాడమీ, న్యూఢిల్లీ, 2006) నుండి గ్రహించడమైనది).

ఔరంగజేబ్ హిందూ మందిరాలను కూల్చివేసే వాడనేది పచ్చి అబద్ధం. కూల్చి వేయకపోవటం అటుంచి, అనేక మందిరాలకు జాగీర్లు, ఆస్తులు కేటాయించాడు. మాజీ సంస్థానం రాంనగర్, జిల్లా బారాబంకీకి మేనేజర్‌గా పనిచేసిన శ్రీ బాబు నారాయణ్, సుదీర్ఘ పరిశోధనలు జరిపి, ఔరంగజేబ్ మతపక్షపాతి కాదని, అతను అనేకమందిరాలకు దానాలు, జాగీర్లు ఇచ్చాడని పేర్కొంటూ ఒక సుదీర్ఘ వ్యాసం అప్పటి లాహోర్‌కు చెందిన 'సియాసత్' అనే దినపత్రికలో క్రీ.శ. 1924 జులై 18 సంచికలో ప్రచురించారు. అందులోని కొన్ని భాగాలను మీ ముందుంచుతున్నాం :

"సీతాపూర్ జిల్లాలోని 'మిసర్క' మందిరం, హిందువుల ప్రఖ్యాతి గాంచిన మందిరాల్లో ఒకటి. ధార్మిక పూజాపునస్కారాలు, నైవేద్యాల ఖర్చు నిమిత్తం అనేక గ్రామాలను ఆ మందిరానికి దానం చేస్తున్నట్లు ఔరంగజేబ్ చక్రవర్తి జారీచేసిన ఒక ఫర్మానా ఆ మందిరపు మహంతుని వద్ద ఉంది. ఆ గ్రామాలు నేటికీ ఆ మందిరపు అధీనంలోనే ఉన్నాయి.

"మిథ్రా (బహుశా మథుర)లో బలదేవుని మందిరముంది. ఈ మందిరపు ఖర్చుల నిమిత్తం ఔరంగజేబ్ అనేక దానాలు ఇచ్చాడు. అవి నేటికీ ఆ మందిరపు అధీనంలోనే ఉన్నాయి."

ప్రొఫెసర్ ఈశ్వరీప్రసాద్ ఒక ప్రఖ్యాత చరిత్రకారుడు. ఆయన తన గ్రంథం "భారత చరిత్ర"లో ఔరంగజేబ్ మందిరాలకు ఆస్తుల్ని జాగీర్లను దానం చేశాడని తెలుపుతూ ఇలా రాశారు:

"ముల్తాన్‌లోని 'తోత్లమాయి' మందిరానికి సంవత్సరానికి వందరూపాయల జాగీరును ఔరంగజేబ్ ప్రసాదించాడు. డెహ్రాడూన్‌లోని గురుద్వారాకు జాగీరును కేటాయించాడు. అంతకు క్రితం నుండి హిందువులపై విధిస్తూ వచ్చిన 'యాత్రా సుంకాన్ని' ఔరంగజేబ్ రద్దు పరిచాడు.

భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ క్రీ.శ. 1947లో "India Divided" అనే పేరుతో ఒక గ్రంథాన్ని రచించారు. అదెంతో ఖ్యాతిగాంచింది. దాని ప్రారంభ అధ్యాయాల్లో భారత ముస్లిం పాలకుల ధార్మిక, రాజకీయ, విద్యాపరమైన సహనాన్ని చాటే ఎన్నో సంఘటనల్ని

పేర్కొన్నారు. అందులో పైనుదాహరించిన విషయాల్ని ధృవీకరించటమేగాక ఈ క్రింది జాగీర్లు, ఆస్తులను కూడా పేర్కొన్నారు.

"అలహాబాద్‌లో కూడా ఇలాంటి రెండు ఫర్మానాలున్నాయి. అందులో ఒకటి ప్రఖ్యాత మహేశ్వరనాథ్ మందిరానికి చెందిన పూజారుల పేర ఔరంగజేబ్ చక్రవర్తి జారీచేశాడు. బస్తీ గ్రామం, జిల్లా బనారస్‌కు చెందిన జగ్‌జీవన్ కుమారుడు గిరిధర్‌కు, మహేశ్‌పూర్ గ్రామం, పరగణ హవేలికి చెందిన జాదూమిశ్రాకు, పండిత్ భద్రమిశ్రాకు కూడా ఔరంగజేబ్ చక్రవర్తి జాగీర్లను ప్రసాదించాడు. పై వారంతా కూడా వివిధ మందిరాలకు పూజారులే. ముల్తాన్‌లోని 'తోత్లమాయి' మందిరపు పూజారి మిశ్రా చకియాన్ దాస్‌కు కూడా ఔరంగజేబ్ వంద రూపాయల భత్యాన్ని జారీచేశాడు. ఈ మందిరం నేటికీ ఉంది. ఏ ముస్లిం పాలకులు, హిందువులకు చెందిన అనేక మందిరాలను, దేవాలయాలను ధ్వంసం చేశారని, మనకు చూపించటం జరిగిందో ఆ ముస్లిం పాలకులే అతి పెద్ద సంఖ్యలో మందిరాలకు, దేవాలయాలకు కేటాయించిన ఆస్తులు, జాగీర్ల గురించి ఎవరైనా ఒక రీసెర్చ్ స్కాలర్ వివరాలను సేకరిస్తే ఎంతబావుణ్ణు. ఇదెంతోమంచి కార్యం. ("India Divided" by Dr. Rajendra Prasad, 1947, Page : 34-40)

"హిందూ మందిర్ ఔర్ ఔరంగజేబ్ కే ఫరామీన్" లో ఇలా తెల్పబడింది :

"ఎర్రకోట (డిల్లీ)కు ఎదురుగా చాందినీ చౌక్‌కు తూర్పు మూలన ఒక జైన మందిరం ఉంది. ఈ మందిరపు పూజారికి ఔరంగజేబ్ తరఫున క్రమం తప్పక పింఛను లభిస్తుండేది. ఇది చివరి మొగలు పాలకుడైన బహదూర్ షా జఫర్ (క్రీ.శ.1857 ప్రథమ స్వాతంత్ర సమర సేనాని) కాలం వరకూ లభిస్తూనే ఉండేది. ఈ మందిరపు ప్రధాన ద్వారంపై పారశీక భాషలో చెక్కబడిన శిలాఫలకం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా చాలా రోజుల వరకు కనిపించేది. దాన్ని చూసినవారు నేటికీ డిల్లీలో ఉన్నారు." (పేజి 4)

"చంపారన్‌లో 'లోరియా' అనే ప్రఖ్యాతిగాంచిన చారిత్రక స్థలముంది. ఒకప్పుడు ఇది బౌద్ధులకు కేంద్రం. గౌతమబుద్ధుడు కూడా ఇక్కడికి వచ్చారని చెప్తుంటారు. నేటికీ అక్కడ బౌద్ధమత చిహ్నాలు కనబడతాయి. లోరియాలో అశోక చక్రవర్తి నిర్మించిన స్థూపపు దక్షిణం వైపు దాదాపు ఒకటిన్నర అడుగుల ఎత్తుపై 'కలిమా వచనం' చెక్కబడి ఉంది. దానికి సరిగ్గా క్రింది భాగంలో అత్యంత సుందరమైన రాతలో 'మొహియుద్దీన్ ఔరంగజేబ్ ఆలంగీర్ గాజి, హి.శ. 1071' అని చెక్కబడి ఉంది. ఔరంగజేబ్ బహుశ ఈ ప్రయాణ సందర్భంలోనే 'జన్‌పరియా' మఠం, ఆరెరాజ్ మఠం, ఇందర్‌వా మఠాలకు జాగీర్లను ప్రసాదించాడు. నేటికీ ఈ మఠాల పేరుమీద వేల బీగాల భూములున్నాయి. ఈ మఠాల అసలైన పూజారుల వద్ద ఔరంగజేబ్ జారీచేసిన ఫర్మానాలున్నాయి. అందులోని కొన్ని ఫర్మానాల నకళ్లు, చంపారన్‌కు చెందిన ప్రఖ్యాత న్యాయవాది శ్రీ అజీజ్ హాష్మిగారి వద్ద కూడా ఉన్నాయి. ఆయన ఈ మఠాల

తరఫు న్యాయవాదిగా కోర్టులో వాదించేవారు. ఈ మఠాలకు సంబంధించి న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నప్పుడు ఈ ఫర్మానాలు న్యాయస్థానానికి సమర్పించబడ్డాయి.

చారిత్రక ప్రఖ్యాతిగాంచిన 'మోన్‌గేర్ జిల్లా'లో 'ఖాన్‌ఖాహె రహ్మానీ' పేరుతో ఒక ముస్లిం మఠముంది. దీనికి కొంచెం దూరంలో 'సీతాకుండ్' అనే ప్రదేశముంది. అక్కడ వేడి నీళ్ళు వెలువడే నీటిబుగ్గ ఒకటుంది. ఇదొక పర్యాటక ప్రదేశం. దీన్ని చూడటానికి ప్రజలు దూర ప్రాంతాల నుండి వస్తుంటారు. మౌలానా అతావుర్ రహ్మాన్ ఖాస్మిగారు ఓసారి సీతాకుండ్ ప్రదేశానికి వెళ్ళినప్పుడు అక్కడి నిర్మాహకులైన కొందరు పూజారులు, సీతాకుండ్ కోసం ఔరంగజేబ్ చక్రవర్తి దాదాపు 70 బీగాల భూమిని దానం ఇచ్చాడని తమ ప్రధాన పూజారి వద్ద ఔరంగజేబ్ జారీ చేసిన ఫర్మానా ఉన్నట్లు తెలిపారని రాశారు. (పేజి 5)

కాలం గడుస్తున్నకొద్దీ వాస్తవాలు బయటికి వస్తున్నాయి. సత్యాన్ని, యదార్థాన్ని ఎవరూ, ఎంతోసేపు దాచి ఉంచలేరు. ఈ మధ్యనే ఢిల్లీలోని మసీహ్‌గడ్ అనే ప్రాంతంలో ఉండే "జూలినా చర్చి" కోసం ఔరంగజేబ్ ద్వారా జారీ చేయబడిన ఫర్మానా ఉన్నట్లు సమాచారం అందింది. ఈ ఫర్మానా న్యూఢిల్లీలోని "గోల్‌డాక్‌ఖానా" చర్చిలోని గోడకు వేలాడుతున్నది. దీని పూర్వపరాలు ఏమిటంటే ఔరంగజేబ్ వద్ద "జూలియా" అనే పేరుగల ఒక క్రైస్తవ బాలిక పరిచారికగా ఉండేది. ఎప్పుడైతే ఆమె యుక్త వయస్కురాలై ఆమెకు వివాహం చేయ సంకల్పించినప్పుడు పెద్దలు అనుమతి కోసం చక్రవర్తికి ఆ విషయం విన్నవించారు. పరిస్థితులు తెలుసుకొని తృప్తిచెందిన తరువాత ఔరంగజేబ్ వివాహానికి అనుమతినిచ్చాడు. ఆమె వివాహ ఖర్చుల కోసం, ఆమె ధర్మం, విశ్వాస పరిరక్షణ కోసం 'చర్చి' నిర్మాణం, ఇంకా ఆమె భావి ఖర్చుల కోసం ఈ ఫర్మానా జారీచేశారు.

(హిందూ మందిరాలు - ఔరంగజేబ్ ఫర్మానాలు, డా. బిషంబర్ నాథ్ పాండే & అతావుర్రహ్మాన్ ఖాస్మి, పేజి 10)

స్వతంత్ర భారత ప్రథమ రాష్ట్రపతి డా.బాబూ రాజేంద్రప్రసాద్ ఇలా అంటారు : "బనారస్‌లో జంగంబాడి మఠంలో హుమాయూన్ నుండి ముహమ్మద్ షా వరకు జారీచేసిన (25) ఫర్మానాలున్నాయి. అందులో జహాంగీర్, షాజహాన్, ఔరంగజేబ్ మరియు ఇతర పాల కుల ఫర్మానాలున్నాయి. ఔరంగజేబ్ స్వయంగా ఈ మఠంలోకి వెళ్ళినట్లును, రెండువందల డెబ్బది ఎనిమిది బీగాల భూమిని కానుకగా ఇచ్చినట్లును చెబుతారు." (ఖౌమీ ఆవాజ్ దినపత్రిక, 1988 మే 12)

తారీఖ్‌కీ సచ్చాయియాం (చారిత్రక వాస్తవాలు) అనే తన పుస్తకంలో ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ ఇలా పేర్కొన్నారు :

"గుజరాత్‌లోని జైన మతం వారిదగ్గర నున్న ఫర్మానాల్లో ఫర్రుఖ్‌సైర్ ఫర్మానా కూడా ఉంది. జైనుల ఒక సంస్థ ఉంది. అది సేట్ ఆనంద్‌జీ కళ్యాణ్‌జీ పేరుతో పిలువబడుతోంది. అందులో మూడు ఫర్మానాలు నేటికీ సురక్షితంగా ఉన్నాయి. అందులో అక్బర్, జహాంగీర్

మరియు ఔరంగజేబ్ ఫర్మానాలు (1650 సం॥) ఉన్నాయి. షాజహాన్ ఫర్మానాలు శాంతిదాస్ జౌహరి పేరన ఉన్నాయి (1648 సం॥). ఔరంగజేబ్ ఈ శాంతిదాస్‌కే నగర్‌సేట్ బిరుదును ప్రసాదించాడు. ఇంకా గుజరాత్, రాజస్తాన్ మరియు సౌరాష్ట్రలోని జైనమత తీర్థాలకు సంబంధించి ప్రత్యేక అధికారాలు ఇచ్చాడు.” (పేజి 40, 41)

**“ఉమ్దతుత్తవారీఖ్” రచయిత లాల సోహన్‌లాల్ :**

“మహారాజా రంజీత్ సింగ్ ఆస్థాన కవి మరియు వార్తా విలేఖరి అయిన హుకూమత్ రాయ్ కుమారుడు గణ్‌పత్ రాయ్‌గా పిలువబడ్డాడు. ఈ గణ్‌పత్ రాయ్ కుమారుడే సొహన్ లాల్. ఆయన తన తండ్రిగారు రాసుకున్న జ్ఞాపకాలు, డైరీల సహాయంతోనూ, తాను స్వయంగా చూసిన సంఘటనల ఆధారంగాను “ఉమ్దతుత్ తవారీఖ్” అనే పేరుతో పర్షియన్‌లో ఒక చరిత్ర గ్రంథాన్ని రాశారు. ఇది సిక్ఖు వర్గం వారి చరిత్ర. ఇది దాదాపు 1846లో వ్రాసివున్నప్పటికీ, 1884లో ప్రచురించబడింది. అందులో ఔరంగజేబ్ కాలంలో సిక్ఖుల పరిస్థితులు వివరంగా పేర్కొనబడ్డాయి. .... ఔరంగజేబ్ గురించిన ప్రస్తావన మొదటి అధ్యాయం పేజి 2లో ఉంది. ఈ చరిత్ర మొత్తం చదివిన తరువాత కావాలని, ఉద్దేశపూర్వకంగా వాస్తవాల్ని ఎలా మరుగు పర్చారో, గురూ తేగ్ బహదూర్ మరియు గురూ గోవింద్ సింగ్‌కు సంబంధించి ఔరంగజేబ్‌పై రకరకాల నిందలు ఎలా మోపారో, ఆ నిజాలు, వాస్తవాలన్నీ మన ముందుకు వస్తాయి. ఉదాహరణకు ... అందులో గురూ గోవింద్‌సింగ్ పిల్లలు ఎలా బంధింపబడింది, సర్‌హింద్ ఫౌజ్‌దార్ వజీర్ ఖాన్ ద్వారా దీవాన్ చందూ షాహ్‌కు అప్పగించబడింది, చందూషాహ్ మూర్ఖత్వం వల్ల లేక దుర్మార్గం వల్ల వారెలా చంపబడింది వివరంగా పేర్కొన్నాడు. ఆ కాలంలో ఔరంగజేబ్ ఢిల్లీ నుండి వందలాది మైళ్ళ దూరంలో దక్కన్‌లోని ఔరంగాబాద్‌లో ఉన్నాడు. అందుకని దీని బాధ్యత సర్‌హింద్ ఫౌజ్‌దారు మీదనో, చందూషా దీవాన్ మీదనో వస్తుంది తప్ప, ఔరంగజేబ్ మీద కాదు. గురూ తేగ్ బహాదూర్ వాస్తవంలో ఎలా మరణించారనే సంఘటన కూడా వివరంగా పేర్కొనడం జరిగింది. అందులోనే ఇంకొక సంఘటన ఉంది. ఒకసారి గురూ రాంరాయ్ ఔరంగజేబ్‌ను కలవడానికి ఢిల్లీ వెళ్ళారు. ఆయన తన మహిమల్ని చూపించారు. చక్రవర్తి ఆయన్ను ఎంతగానో సత్కరించాడు. ఇంకా డెహ్రాడూన్‌లో పర్వతాల నానుకొని ఉన్న ఒక జాగీరును ఆయనకు కానుకగా సమర్పించాడు. గురూజీ ఈ జాగీరులో స్థిర నివాసమేర్పరు చుకున్నారు. డెహ్రాడూన్‌లో గురూజీ గురుద్వారా నేటికీ ఉంది. అందులో ఔరంగజేబ్ ఫర్మానా కూడా ఉంది.” (పేజి 53 - 54)

‘ముల్తాన్ జిల్లా చరిత్ర’ను మున్షి హకీం చంద్‌జీ, ఎక్‌స్ట్రా అసిస్టెంట్ కమీషనర్, బందోబస్తు వ్రాసింది 1884లో ప్రచురించబడింది. అందులో ఆయనిలా రాశాడు : “ముల్తాన్‌లోని హరం దర్వాజ లోపల ఉన్న తోత్లమాయి మందిరపు పూజారి మిశ్ర కళ్యాణ్ దాస్ పేర ఔరంగజేబ్ వంద రూపాయల పెన్షను నిర్ణయించాడు.” (పేజి 55)

జిల్లా హిసార్‌కు సంబంధించిన ఒక చరిత్ర వ్రాతపతిని గురించి అయ్యూబ్ ఖాన్ తన గ్రంథంలో పేర్కొన్నారు. అందులో ఒక శివాలయం గురించి ప్రస్తావన వచ్చింది. దాని వివరాలిలా ఉన్నాయి.

“హిసార్ జిల్లాలో హాంసీ అనేచోట, కాలువ ప్రక్కన, నగరానికి పశ్చిమం వైపు అక్బర్ కాలంలో కట్టించబడిన ప్రఖ్యాత బాబా జగన్నాథ్ పూరీ సమాధి మరియు శివాలయముంది. ఈ సమాధి మరియు శివాలయానికి అర్చకులైన గోసాయీం బాబా శిష్యులకు ఔరంగజేబ్ ద్వారా మాఫీ భూములు ప్రసాదించబడ్డాయి. ఈ భూములు 1852 వరకు మాఫీ జాగీరుగా ఉంటూవచ్చాయి. 1852లో గవర్నమెంట్ దీన్ని జప్తు చేసుకొని, వాటిపై భూమిశిస్తును విధించింది.” (పేజి 55)[3]

## బాబా మలూక్ దాస్‌కు జాగీరు :

కడమానిక్‌పూర్ అనే గ్రామంలో ఒక కుటుంబం ఉంది. వీరంతా బాబా మలూక్ దాస్ సంతానం. వీరు మహంతుల వర్గానికి చెందినవారు. ఒకసారి ఔరంగజేబ్ బాబా మలూక్ దాస్‌ను పిలిపించినప్పుడు ఆయన తన కవిత్వాన్ని హిందీ భాషలో ఔరంగజేబ్‌కు వినిపించారు. అది విని ఔరంగజేబ్ ఎంతో సంబరపడ్డాడు. ఇంకా “సరాథూ” అనే గ్రామాన్ని బాబా మలూక్‌దాస్‌కు జాగీరుగా ప్రసాదించాడు. ఔరంగజేబ్ ఫర్మానా బాబా సంతానం వద్ద నేటికీ సురక్షితంగా ఉంది. (కడమానిక్‌పూర్ చరిత్ర – పేజి 137, 138) (తారీఖ్ కీ సచ్చాయియాం పేజి 55)

అలహాబాద్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ సుశీల్ శ్రీవాస్తవ్ ఒక కలయిక సందర్భంలో ఇలా తెలిపారు :

“ఇప్పటికీ అలాంటి ఎన్నో ఆధారాలు లభించాయి. వీటి ఆధారంగా ఔరంగజేబ్ ఎన్నో మందిరాల నిర్మాణంలో సహకరించాడని చెప్పవచ్చు. ఇలాంటి మందిరాల్లో ఒక దాన్నైతే స్వయంగా నేనే చూసివచ్చాను. ఇది చిత్రకోట్‌లో ఉంది.” (నయీదునియా వారపత్రిక, 1988 మార్చి 8–14)

ప్రఖ్యాత రచయిత సర్దార్ ఖుష్వంత్ సింగ్ ఇలా వ్రాశారు :

“డజన్ల కొద్దీ హిందూ మందిరాలకు, సిఖ్ఖు గురుద్వారాలకు ఔరంగజేబ్ పెద్ద మొత్తాల్ని, జాగీర్లను ప్రసాదించాడు. అతని ముద్ర మరియు సంతకాలతో వెలువడిన ఫర్మాన్లు నేటికీ ఆర్కియాలజీలలో భద్రంగా ఉన్నాయి. అతను హిందూ మందిరాలను ధ్వంసం చేయించి నట్లే, కొన్ని మస్జిద్‌లను కూడా పడగొట్టించాడు. అవి దుర్వినియోగం అవుతున్నాయని నిరూపిత మయినప్పుడు, మస్జిద్ మందిరాలలో అతను ఎలాంటి భేదభావాన్ని పాటించలేదు. తన ఫర్మానాలలో అతను బ్రాహ్మణుల గురించి, మఠాల గురించి ఎలాంటి గౌరవప్రదమైన పదాలు వాడాడో, అవి చాల తక్కువ మందికి తెలుసు.” (హిందుస్తాన్ టైమ్స్, 1986, నవంబర్ 22)

1987లో 'ఇండియా టుడే' పత్రికలో బాలాజి మందిర్, చిత్రకూట్ అనే పేరు మరియు ఫోటోతో ఒక వ్యాసం వచ్చింది. ఆ తరువాత ఈ వ్యాసాన్నే అనేక హిందీ మరియు మరాఠీ పత్రికలు అనువదించి ప్రచురించాయి. ఆ వ్యాసంలో పేర్కొనబడిందేమిటంటే ఆ మందిరపు పూజారి వద్ద ఔరంగజేబ్ జారీచేసిన ఫర్మానాలున్నాయి. ఆ మందిరం ఔరంగజేబ్ ద్వారానే నిర్మించబడింది. ఈ మందిరం కోసం ఎనిమిది గ్రామాల్ని అతను మాఫీ జాగీరుగా (అంటే వాటికి భూమిశిస్తును మాఫీ చేస్తూ దానంగా ఇచ్చాడు.) ఈ మందిరం దాదాపు 1681-83 ప్రాంతంలో నిర్మించబడింది. ఇండియా టుడే పత్రికా విలేఖరి ఇలా వ్రాశాడు : "ఆ మందిరపు పురోహితుడు నేడు కూడా అనేదేమిటంటే 'మా ఠాకూర్‌జీ బాలాజి మందిరంలో ఉంటాడని, ఈ మందిరాన్ని ఔరంగజేబ్ కట్టించాడని వెళ్ళి అయోధ్యవారికి తెలియజెప్పండి'. ఆ మందిరానికి మహేంతునిగా ఉండిన బాలక్‌దాస్ పేరున మూడు వందల బీగాల భూమి కూడా ఆ ఫర్మానా ద్వారా ఇవ్వబడింది. ఇది తరతరాలుగా వారి ఆస్తిగా ఉంటుంది. మరియు దీనికి భూమి శిస్తు మినహాయింపు ఉంటుంది." (ఇండియా టుడే పత్రిక, 1987, సెప్టెంబర్ 15)

## ఔరంగజేబ్ కట్టించిన చిత్రకూట్ "బాలాజి మందిరం"

(Website name : http://oneindia.in)

http://hindi.oneindia.in/news/2012/11/23/feature - aurangazeb - built-balaji - temple-in-chitrakoot, 224127-html.

"హిందువుల మందిరాలను కూల్చివేయించాడని, కరడుగట్టిన ధార్మిక పక్షపాతి అని ఔరంగజేబ్‌ను అపకీర్తి పాల్జేశారు. కాని నేటికి 328 సంవత్సరాలకు పూర్వం 1683లో శ్రీరామచంద్రుని తపోస్థలమైన చిత్రకూట్‌లో మందాకిని నదీ తీరంపై మూడంస్తుల 'బాలాజి మందిరాన్ని' నిర్మించి ఔరంగజేబ్ తన ధార్మిక సహిష్ణుతను చాటే ఒక ఆదర్శాన్ని నెలకొల్పాడు. అంతేకాదు, హిందూ దేవత పూజా అర్చనల్లో ఎలాంటి బాధ, ఆటంకం ఉండకూడదనే దృష్టితో అతను ఈ మందిరం కోసం భూమిశిస్తును మాఫీ చేస్తూ 330 బీగాల వ్యవసాయ యోగ్యమైన భూమిని కూడా దానంగా ఇచ్చాడు. ధార్మిక సౌహార్ద్రతకు ప్రతీక అయిన ఈ మందిరం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పతనావస్థకు చేరుకున్నది."

చరిత్రకారుడు రాధాకృష్ణ బుందేలీను ఉటంకిస్తూ రాంలాల్ జయన్ పై వెబ్‌సైట్‌లో బాలాజి మందిరం, చిత్రకూట్ గురించి వివరంగా ఒక వ్యాసం వ్రాశారు. దాని అనువాదాన్ని పాఠకులకు అందిస్తున్నాం.

"ఉత్తర ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌లో ప్రసిద్ధ తీర్థస్థలమైన చిత్రకూట్‌లో శ్రీరామ చంద్రుడు తన వనవాసపు 12 సంవత్సరాలు గడిపారు. ఈ కారణంగానే హిందూ సమాజానికి ఈ ప్రదేశం అత్యంత భక్తిశ్రద్ధల కేంద్రంగా మారింది. ప్రతి నెల అమావాస్య రోజు దేశ విదేశాల నుండి వచ్చిన లక్షలాది మంది భక్తులతో ఈ స్థలం కిటకిటలాడుతూ ఉంటుంది. ఇక్కడ

ధార్మిక సద్భావనకు ఆదర్శంగా పేర్కొనదగిన కొన్ని చారిత్రాత్మక మందిరాలు కూడా ఉన్నాయి. అందులో మందాకిని నదీ తీరంపై గోపీపురంలో నిర్మించబడిన బాలాజి మందిరం ఒకటి. హిందువుల మందిరాల్ని కూల్చివేయించేవాడని ఎవరినైతే అపకీర్తి పాల్జేశారో మొగలు వంశ చక్రవర్తి అయిన ఆ ఔరంగజేబే దీన్ని నేటికి 328 సంవత్సరాల క్రితం 1683లో నిర్మించాడు. అతని ద్వారా జారీ చేయబడిన ప్రామాణిక పత్రం (అనగా ఫర్మానా, రాజాజ్ఞ పత్రం) నేటికీ సురక్షితంగా ఉంది."

### మందిరాన్ని నిర్మించి దానం కూడా ఇచ్చాడు

తామ్ర పత్రంపై చెక్కించి ఇవ్వబడిన ఈ ఫర్మానాలో ఇలా ఉంది : "ఈ ఫర్మానా ఆలంగీర్ పాదుషా తన ప.షే. 35వ సంవత్సరం రంజాన్ నెల 19వ తేదీన జారీ చేయించారు. ఈ ఫర్మానాను వ్రాసినవారు (లేఖకుడు) నవాబ్ రఫీఉల్ ఖాదర్ సఆదత్ ఖాన్, వాఖియ నవేస్ (వార్తాలేఖకుడు) ఈ ఫర్మానాను రంజాన్ నెల 25వ తేదీన జమాల్ ముల్క్ నాజిం ఆఫ్తాబ్ ఖాన్, రాజ్య (ప్రభుత్వ) రిజిష్టర్‌లో నమోదు చేసుకున్నారు. దీని యొక్క విశ్వసనీయత, ప్రామాణికతను మాల్ (రెవెన్యూ) ముఖ్య అధికారి అయిన మాతామిద్దౌలా రఫీఉల్ షాహ్ ధ్రువీకరించారు."

పారశీక భాషలో చెక్కించి ఇవ్వబడిన ఈ రాజాజ్ఞ ఫర్మానా పంక్తుల్ని కాళింజర్ నివాసి అయిన బషీర్ ఖాన్ చదివి దాని హిందీ అనువాదాన్ని ఇలా వినిపించారు : "ఈ రాజాజ్ఞలో వ్రాయబడిన విషయం : 'పాదుషాల (ప్రభువుల) వారి రాజాజ్ఞ ఏమిటంటే అలహాబాద్ సూబాకు చెందిన కాళింజర్ పరగణాలోని చిత్రకూట్ పూరీలోని నిర్వాణి మహంత్ బాలక్‌దాస్‌జీకు "ఠాకూర్ బాబా" సన్మానంలో వారి పూజ, ధూపదీప నైవేద్యాల కోసం భూమిశిస్తును మాఫీ చేస్తూ (అనగా భూమిశిస్తు లేకుండా) ఎనిమిది గ్రామాలు అనగా దేవ్‌ఖరి, హినౌత, చిత్రకూట్, రౌదేర, సిరియా, పదరీ, జరవా మరియు దోహరియా (గ్రామాల)ను దానరూపంగా ప్రదానం చేయడం జరిగింది. ఇంకా భూమిశిస్తు లేకుండా, వ్యవసాయ యోగ్యమైన 330 బీగాల భూమిని రాత్ పరగణాలోని జారాఖడ్ గ్రామంలో 150 బీగాలు అమరావతి గ్రామంలో 180 బీగాల భూమిని కూడా (ప్రదానం చేయడం జరిగింది) దీనితో పాటే కోని పరోష్ఠా పరగణా నుండి వసూలు చేయబడుతున్న భూమిశిస్తు నుండి ప్రతిరోజు ఒక రూపాయి చొప్పున దానరూపకంగా ప్రదానం చేయడం జరిగింది."

### ఔరంగజేబ్ ఫర్మానా నేటికీ ఉనికిలో ఉంది!

ఈ ఫర్మానాలో చక్రవర్తి ఔరంగజేబ్ జారీ చేసిన ఈ ఆదేశాలు కూడా ఉన్నాయి : "రాజ్యానికి చెందిన ప్రస్తుతమున్న, భవిష్యత్తులో రాబోయే సామంతులు, సూబేదార్లు ఈ ఫర్మానా ద్వారా దానమివ్వబడిన ఎనిమిది గ్రామాలతో పాటు దానంగా ఇవ్వబడిన సర్వ ఆస్తులు తరతరాలుగా భూమిశిస్తు లేకుండా వారి అధీనంలో ఉండడాన్ని రాజాజ్ఞగా భావించి శిరసావహించాలి,

ఇందులో ఏ రకమైన హస్తక్షేపం చేసుకోరాదు. ఇంకా రాజాజ్ఞను ఉల్లంఘిస్తూ లేక దానికి విరుద్ధంగా ఎలాంటి చర్య గైకొనరాదు." – ఔరంగజేబ్ జారీ చేసిన ఈ ఫర్మానాను 1814లో చిత్రకూట్‌కు అధిపతి (పరిపాలకుడు)గా వచ్చిన పన్నా నరేష్ మహారాజ్ హిందూపత్, ఆ తరువాత వచ్చిన బ్రిటిష్ ప్రభుత్వం వారు కూడా ఆమోదించి యధాతథంగా ఉండనిచ్చారు. మందిరపు పూజారి వద్ద బ్రిటిష్ పరిపాలనా కాలంలో ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) ద్వారా అంగీకరించి, ఆమోదింపబడిన పారశీకం (పర్షియన్) ఫర్మానా యొక్క ఇంగ్లీష్ అనువాదం ప్రతి కూడా ఉంది.

దానరూపంగా ప్రసాదింపబడిన గ్రామాలలో నుండి 'జరవా' గ్రామం యొక్క వ్యవసాయ భూమికోసం కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నానని మందిరపు పూజారి నారాయణ్‌దాస్ చెబుతున్నారు. మిగిలిన గ్రామాల యొక్క భూముల ఆచూకీ సైతం తెలియకుండా చేశారని ఆయన తెలిపారు. మందిరపు భవనంలోని వివిధ భాగాల్ని అనేకమంది ఆక్రమించుకొని నగరపాలిక పరిషద్ (నగర మునిసిపాలిటీ)లో నామమాత్రంగా అద్దె చెల్లిస్తూ అద్దెదారులుగా తమను నమోదు చేయించుకున్నారని, చట్టవ్యతిరేకంగా కబ్జా చేసుకున్నారని, చట్టవ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టి మందిరపు రూపురేఖలు కూడా మార్చివేశారని పూజారి (నారాయణ్‌దాస్) చెప్పుకొచ్చారు.

ఒక హిందూదేవత (దేవుని) కోసం మొగలు పరిపాలకుడైన ఔరంగజేబ్ కట్టించిన దేశమంతటిలో బహుశ మొట్టమొదటి మందిరం ఇదే. మందిరపు గోడలు బీటలు వారు తున్నాయి. మందిరపు పరిసరాల్లో చట్టవ్యతిరేక ఆక్రమణదారుల పశువుల పేడ కుప్పలుగా పేరుకొని పోయింది. పురాతత్వ శాఖ ఈ మందిరం, దాని పరిసరాల్ని తమ అధీనంలోకి తీసుకోవడానికి గాని, దీన్ని సంరక్షించడానికిగాని ఎలాంటి చర్యలు గైకొనడం లేదు. ధార్మిక హృదయ విశాలతకు ప్రతీక అనదగిన ఈ మందిరం పట్ల ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరివల్ల ఈ మందిరం నామరూపాల్లేకుండా సమాప్తమయ్యే సూచనలు కనబడు తున్నాయి. "ఈ మందిరాన్ని పురాతత్వ శాఖకు అప్పగించడానికి అనుమతి కోసం ప్రభుత్వానికి త్వరలోనే ఒక లేఖ వ్రాయనున్నామని, చట్ట వ్యతిరేక ఆక్రమణదారుల నుండి మందిరాన్ని విముక్తి కలిగించ డానికి సముచిత చర్యలు గైకొంటామని" చిత్రకూట్ జిల్లా అధికారి అయిన దిలీప్ కుమార్ గుప్త తెలిపారు." (Published on 23-11-2012 హిందీ నుండి అనువాదం) (ఈ మందిరపు ఫోటో మరియు ఫర్మానా ఇదే అధ్యాయంలో చూడండి.

ఔరంగజేబ్ తన పరిపాలనలోని చివరి భాగం అంటే, దాదాపు 27 సంవత్సరాలు దక్కన్‌లో గడిపాడు. ఆ కాలంలో బ్రహ్మపురి సైనిక శిబిరం ప్రఖ్యాతిగాంచింది. సువిశాలంగా ఎన్నో మైళ్ళ పరిధిలో వ్యాపించివున్న మొగలు సైనిక శిబిరంలో స్వయంగా ఔరంగజేబ్ చక్రవర్తి సపరివారంగా క్యాంప్ వేసి వున్న "బ్రహ్మపురి" సైనిక శిబిరంలో హేమార్ పంథీ శిల్పకళకు సంబంధించి కేవలం రాతితో నిర్మించబడి, ప్రాచీనంగా వస్తున్న "సిద్దేశ్వర" మందిరముంది. ఈ బ్రహ్మపురి క్యాంపులో ఔరంగజేబ్ నాలుగున్నర సంవత్సరాలు గడిపాడు. తన హయాంలో,

సైనిక శిబిరం మధ్యలో, తన కళ్ళముందున్న "సిద్ధేశ్వర" మందిరానికి చక్రవర్తి పూర్తి రక్షణ కల్పించుటయే గాక దాని ఖర్చుల కోసం 50 ఎకరాల భూమిని వక్ఫ్ (దానం) చేశాడు. ఇంకా ఇతర ఖర్చుల కోసం సంవత్సరానికి 486 రూపాయల నగదును కూడా మంజూరి చేశాడు. ఈ విషయం ఆ కాలంనాటి "దర్బారీ అక్బారాత్"లో కూడా పేర్కొనడం జరిగింది. ఆ కాలంలో ఔరంగజేబ్ ద్వారా జారీ చేయబడిన నగదు బహుమానం నేటి వరకు కూడా ప్రభుత్వం తరఫున ఆ మందిరానికి లభిస్తూనే ఉంది. ఆ మందిరపు పూజారులు కూడా దీన్ని అంగీకరిస్తున్నారు. ఈ రెండు ఇనాముల వివరాలు Maharastra State Gazetters, Sholapur Dist. (Revised Edition) 1977, Pages 856, 857, లో ఇలా ఉన్నాయి : (...... Emperor Aurangazeb after the incident quoted earlier made two yearly grants - one of Rs.480/- and the other of Rs.6/- to the Temple. The Temple even to this date gets this amount of Rs.486/- from the Govdrnment. The Temple has an Inam land of about 50 acres. The income from which is utilised towards the worship of the deity) – షోలాపూర్ డిస్ట్రిక్ట్ గజిటర్స్‌లో ప్రతి సంవత్సరం క్రమం తప్పక వస్తున్న పై వివరాల్ని మహారాష్ట్రలో శివసేన – బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత 1997వ ఎడిషన్ నుండి నగదు గ్రాంట్, యాభై ఎకరాల ఇనాము భూమి వివరాల్ని తొలిగించివేయడం గమనార్హం. ఆధారాల్ని, సాక్ష్యాల్ని ఒక పథకం ప్రకారం మరుగుపరుస్తూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు ఇప్పటికీ ముమ్మరంగా సాగుతున్నాయనే దానికి ఇదొక ప్రత్యక్ష నిదర్శనం.

అలహాబాద్ యూనివర్శిటీ, మాజీ చరిత్ర ప్రొఫెసర్ బి.పి. సక్సేనా ఔరంగజేబ్ ద్వారా జారీచేయబడిన ఫర్మానాలపై దృష్టిసారిస్తూ "The Indian Archives" పత్రికలో ఇలా రాశారు : "రాష్ట్ర ఆర్క్యూజ్, అలహాబాద్ (State Archives, Allahabad) లో అక్బర్ మొదలుకొని ఔరంగజేబ్ వరకు, రాజులందరూ జారీచేసిన ఫర్మానాల అత్యంత విలువైన భాండారం ఉంది. వాటిలో హిందూ పండితుల, బ్రాహ్మణుల, పూజారుల మరియు మహంతుల పేర ఆర్థిక సహాయం చేస్తూ జారీచేసిన ఫర్మానాలున్నాయి. మందిరాల పేరుతో జారీచేసిన ఫర్మానాలు కూడా అందులో అత్యధికంగానే ఉన్నాయి. ఔరంగజేబ్ ద్వారా జారీచేసినవే అత్యధికంగా ఉన్నాయి." (The Indian Archieves-Jan. 1967, Dec. 1968) (తారీఖ్‌కీ సచ్చాయియాఁ – ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ, పేజి 70).

ఒరిస్సా మాజీ గవర్నరు డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే ఔరంగజేబ్‌పై అత్యధికంగా పరిశోధించి రాశారు. ఆంగ్లేయ చరిత్రకారుల బూటకాల్ని విశ్లేషించి, ప్రామాణికమైన చరిత్ర సాక్ష్యాధారాలతో వాటిని ఖండించారు. ఆయనిలా రాశారు: "కేవలం ఔరంగజేబ్ ఒక్క పరిపాల కుణ్ణే, అతని సుగుణాల్ని మరుగుపరిచి, చారిత్రక సంఘటనల్ని పరిశీలించకుండానే, విగ్రహాల్ని విరగ్గొట్టేవానిగా, హిందువుల్ని చంపేవానిగా, మందిరాల్ని ధ్వంసం చేసేవానిగా అనవసరంగా అతనికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం జరిగింది .... ఉజ్జయినిలోని మహా కాళేశ్వరం మందిరాన్ని

హిందువులు అత్యంత భక్తి విశ్వాసాలతో గౌరవిస్తారు. ఈ మందిరాల పూజారుల వద్ద వారి పూర్వీకుల పేర, ఔరంగజేబ్ పట్టాభిషేకం ఏడవ సంవత్సరం నుండి నలుబది ఎనిమిదవ సంవత్సరం మధ్య కాలంలో మాల్వా సూబేదారుల ద్వారా (ఔరంగజేబ్‌చే) జారీ చేయబడిన పదమూడు ఫర్మానాలు సురక్షితంగా ఉన్నాయి. ... అందులో ఒకటి ఔరంగజేబ్ ప.షే. ఎనిమిదవ సంవత్సరం మాల్వా సూబేదారు అయిన ముహమ్మద్ సమీ జారీచేశాడు. చిత్రకూట్‌లోని బాలాజి మందిరపు ఫర్మానా ఔరంగజేబ్ పట్టాభిషేకం ముప్పైఐదవ సంవత్సరం రమజాన్ నెల పదకొండవ తేదీన జారీచేయబడింది. ఫర్మానా ద్వారా జారీ చేయబడిన రాజాజ్ఞ పత్రంలో అలహాబాద్ సూబాలోని కాళింజర్ పరగణ పరిధిలోని చిత్రకూట్ పూరి నిర్వాని మహేంత్ బాలక్ దాస్‌జీకు, శ్రీ ఠాకూర్ బాలాజీ మహారాజ్ గౌరవార్థం, వారి పూజా నైవేద్యాల కోసం, భూమిశిస్తు మాఫీ చేయబడిన ఎనిమిది గ్రామాలు అనగా దేవ్‌ఖరి, హినౌత, చిత్రకూట్, రౌదేరా, సిరియా, పదరి, జరవా, దోహరియా అనబడేవి దానరూపంలో ఇవ్వబడినాయి మరియు రాత్ పరగణ జారాఖడ్ గ్రామంలోని నూటాయాభై బీగాల భూమి, అమరావతి గ్రామంలోని 180 బీగాల భూమిని మొత్తం వెరసి మూడు వందల ముప్పై బీగాల భూమిని ప్రసాదించడం జరిగింది ... బనారస్‌లోని తన సూబేదారుకు ఔరంగజేబ్ ఒక లేఖ రాస్తూ, "మన హిందూప్రజల పట్ల దౌర్జన్యం జరుగరాదు, వారితో మేలుగా ప్రవర్తించాలి, ఇంకా వారి ధార్మిక భావనల్ని గౌరవించాలి" అంటూ హెచ్చరించాడు. (డాక్టర్ అబ్దుల్ ముగ్ని రాసిన "ఔరంగజేబ్" పుస్తకపు పీఠికలో డా. బిషంబర్ నాథ్ పాండే వెలిబుచ్చిన అభిప్రాయాలు. పేజి 7, 8) (తారీఖ్ కీ సచ్చాయియాఁ - ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 70-71)

హిందూ మందిరాలు, గురుద్వారాలకు ఔరంగజేబ్ జారీచేసిన ఫర్మానాలపై దృష్టిని సారిస్తూ **డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్** కూడా తమ గ్రంథంలో సంక్షిప్త సమాచారాన్ని పొందుపరిచారు. మన పాఠకుల ఆసక్తి కోసం దాన్నిక్కడ పేర్కొంటున్నాము.

"డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే ను అనుసరించి ఔరంగజేబ్ తన ప్రభుత్వ ధార్మిక నీతిని అనుసరించి హిందూ మందిరాలకు, మఠాలకు పెన్షన్లను (భత్యాలను) నిర్ణయించాడు. అలహాబాద్‌లోని సోమేశ్వరనాథ్ మహాదేవ్ మందిరం, బనారస్‌లోని కాశీ విశ్వనాథ మందిరం, చిత్రకోట్‌లోని బాలాజి మందిరం, గోహాతిలోని ఉమానంద్ మందిరం, శత్రంజియాలోని జైన మందిరం, ఇంకా ఉత్తర భారత దేశంలోని లెక్కకు మించిన మందిరాలకు, గురుద్వారాలకు ఔరంగజేబ్ జాగీర్లను వక్ఫ్ (దానం) చేశాడు." (బి.యన్. పాండే, ఖుదాబక్ష్ మెమోరియల్ ఆన్యువల్ లెక్చర్స్, పాట్నా 1986)

"ఔరంగజేబ్ భూముల్ని, జాగీర్లను వక్ఫ్ (దానం) చేస్తూ 1659 నుండి 1685 మధ్య కాలంలో జారీ చేసిన ఎన్నో ఫర్మానాలు లభించాయి.[4] ఉత్తర భారతంలోని కొన్ని గురుద్వారాల నుండి కూడా అతను భూముల్ని దానంచేస్తూ జారీచేసిన ఫర్మానాలు లభించాయి.[5]

బనారస్ ఫర్మానా[6] పేరుతో ప్రసిద్ధిగాంచిన ఒక ఫర్మానా ద్వారా తెలిసేదేమంటే ఇది

బనారస్‌లోని గోరీ వీధిలో నివసిస్తుండే ఒక బ్రాహ్మణ కుటుంబానికి జారీచేయబడింది. దీని మొత్తం వివరాలు మొదటిసారిగా 1911లో జనరల్ ఆఫ్ ద రాయెల్ ఏషియాటి సొసైటీ ఆఫ్ బెంగాల్‌లో ప్రచురించబడ్డాయి. 1659 మార్చి 10వ తేదీన జారీచేయబడిన ఈ ఫర్మానాను అనుసరించి, ఒక ముస్లిం ఈ మందిరాన్ని పడగొట్టి దాని స్థానంలో పార్కును నిర్మించతలపెట్టాడు. కాని ఔరంగజేబ్ దానిపై ఆంక్ష విధించాడు.

బనారస్‌లోని హిందువులు శాంతిపూర్వకమైన జీవనం గడపాలని ఔరంగజేబ్ ఉత్సాహం కలిగివుండేవాడని కొన్ని ఇతర ఫర్మానాల్ని[7] అధ్యయనం చేస్తే అర్థమవుతుంది. ఒక ప్రత్యేక సందర్భంలో మహారాజ ధీరాజ్ రాజా రాంసింగ్ ఔరంగజేబ్‌కు ఒక అర్జీని సమర్పిస్తూ గంగానది ఒడ్డున భగవత్ గోసాయీఁ పేరు గల ధార్మిక గురువు కోసం అతని తండ్రి కాలంలోనే ఒక గృహం నిర్మించబడిందని, అయితే ప్రస్తుతం కొందరు ముస్లింలు ఈ గోసాయీఁను బెదిరిస్తున్నారని తెలుపుకున్నాడు. దానిపై స్పందించిన ఔరంగజేబ్ సంబంధిత అధికారుల్ని, ఎవరైనాగాని ఆ గోసాయీఁను గనక ఇబ్బందిపెడితే. శిక్షకు గురిఅవుతారని హెచ్చరించాడు. హిందూ ధర్మం మరియు హిందువుల మధ్య శాంతి పూర్వకమైన వాతావరణాన్ని నెలకొల్పడంలో ముస్లింలందరూ సహకరించాలని కూడా అతను ఆదేశించాడు.

1934కు చెందిన హైకోర్టు, అలహాబాద్[8] కేసుకు సంబంధించిన పేపర్స్‌ను అధ్యయనం చేస్తే, కొందరు ముస్లింలు దురాక్రమణ చేసిన దానికి ఔరంగజేబ్ వ్యతిరేకంగా ఉన్నాడనే విషయం విదితమవుతుంది. బనారస్ నివాసులైన జగ్‌మల్ మరియు అర్జున్‌మల్ ఒక అర్జీని సమర్పిస్తూ బనారస్‌కు చెందిన ఒక వ్యక్తి నజీర్‌బేగ్ వారి ఐదు నివాసగృహాలను బలవంతంగా ఆక్రమించుకున్నాడని తెలుపుకున్నారు. దీనికి సంబంధించి 1672లో ఔరంగజేబ్ ఒక ఫర్మానాను జారీచేస్తూ, జగ్‌మల్ మరియు అర్జున్‌మల్ చెప్పేదే గనక వాస్తవమైతే, నజీర్‌బేగ్‌ను ఆ భవంతీలలో అస్సలు ప్రదేశించనీయరాదు అంటూ ఆదేశా లిచ్చాడు.

అస్సాం రాజధాని అయిన గౌహతిలోని ఉమానంద్ మందిరపు పూజారి సుదామ బ్రాహ్మణోత్తమునికి ఔరంగజేబ్ కొంచెం భూమిని, అడవినుండి వచ్చే రాబడిలోని కొంత భాగాన్ని దానంగా ఇచ్చాడు.[9] ఉజ్జయినిలోని ప్రఖ్యాతిగాంచిన మహా కాళేశ్వరం మందిరంలో రాత్రిం బవళ్ళు దీపారాధన కోసం ఔరంగజేబ్‌కు వందల సంవత్సరాల పూర్వం నుండే పెద్ద మొత్తంలో ఒక భూమి ఈ మందిరం కోసం కేటాయించబడి ఉండేది. ఔరంగజేబ్ కాలంలో కొందరు ముస్లిం అధికారులు దానిపై ఆంక్ష విధించారు. దానిపై ఈ మందిరపు పూజారి కాంప్లెంట్ చేస్తూ ఔరంగజేబ్‌కు ఒక అర్జీని సమర్పించాడు. ముహమ్మద్ మహ్దీ పేరు గల ఒక ఉన్నతాధికారితో ఔరంగజేబ్ ఈ విషయంలో విచారణ జరిపించాడు, ఆ తరువాత చబూత్రా కొత్వాలికి చెందిన తహశీలుదారును, ఈ మందిరంలో దీపారాధన కోసం ప్రతినిత్యం నాలుగు శేర్ల నెయ్యి జారీచేయాల్సిందిగా ఆదేశించాడు.

అనేకమంది చరిత్రకారులు పురప్రముఖుని ద్వారా నిర్మింపబడిన చింతామణి మందిరాన్ని[10] ఔరంగజేబ్ ద్వారా ధ్వంసం చేయబడిందని పేర్కొంటారు. కాని ఔరంగజేబ్ ఇదే పురప్రముఖుని ద్వారా నిర్మింపబడిన శత్రవంజ మరియు ఆబూ మందిరాలకు దానం రూపంలో ఎంతో భూమి ఇచ్చాడనే విషయాన్ని తెలుపకుండా దాటేస్తారు. దీని వివరాలు 1933లో జాన్స్ ద్వారా చీఫ్ సెక్రటరీకి సమర్పించబడిన పేపర్‌లో లభిస్తాయి.

శ్రావక వర్గానికి చెందిన, సాహస్‌భాయి కుమారుడు శాంతిదాస్ జౌహరికి అహ్మదాబాద్ సూబాలోని 'పాలితాన' పేరుగల ఒక గ్రామాన్ని ఔరంగజేబ్ దానరూపంలో ఒక ఫర్మాన్ ద్వారా ఇచ్చాడు.[11] పాలితానాలోని కొండప్రాంతం శత్రుంజయ పేరుతో ప్రసిద్ధిగాంచింది. అక్కడో మందిరముంది.

శ్రావక వర్గానికే చెందిన సీతాదాస్ జౌహరి[12]కు 1660లో ఔరంగజేబ్ నిసార్ మరియు ఆబూజీ గుట్టలు (ఎత్తైన ప్రదేశంపై వ్యాపించివున్న భూములు) (వక్ఫ్) దానరూపంలో ఇచ్చాడు. ఈ గుట్టల నుండి ఎలాంటి టాక్సును వసూలు చేయరాదని, శత్రురాజెవరినీ దీన్ని ఆక్రమించనీయరాదని తన అధికారుల్ని ఆదేశించాడు.

"గయ"లోని ఒక మందిరానికి అతను భూమిని దానంగా ఇచ్చాడు. (తారీఖె కశ్మీర్ –ఆజం–పేజి 165)

"గుజరాత్‌లోని సహస్ త్రంగ్ సరోవరములోని మురికి నీటిని తొలగించి పరిశుభ్రమైన నీటితో దాన్ని నింపడానికి అయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వ ఖజానా నుండి భరించాలని ఔరంగజేబ్ ఆదేశాలు జారీ చేశాడు."[13]

"కర్ణాటక విజయం తరువాత తిరుపతిలోని ప్రఖ్యాత దేవాలయం శ్రీ వెంకటేశ్వర మందిరం గురించి అతను (ఔరంగజేబ్) ప్రత్యేక శ్రద్ధ కనబరిచాడు." [14]

*(తాను ఇచ్చిన పై సమాచారానికి సమర్థనలో డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ గారు ప్రొఫెసర్ శ్రీరాం శర్మ గారి "మొగల్ శాసకోంకి ధార్మిక్ నీతి" – పేజి 161 మరియు ప్రాచీన గ్రంథమైన "మిరాతె అహ్మది" (పర్షియన్) వా–1, పేజి 263ను ఉటంకించారు.*

*ఈయనే కాకుండా హైద్రాబాద్ నుండి వెలువడే ఉర్దూ దినపత్రిక "మున్సిఫ్"లో దాని రెగ్యులర్ కాలమిస్ట్ అయిన శ్రీమతి ఉదేశ్ రాణి గారు తేది 03-12-2015 నాటి సంచికలో ఔరంగజేబ్‌పై వ్రాస్తూ, అతను శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానానికి తామ్ర పత్రాలపై ఫర్మానాలు జారీ చేశాడని, ఇంకా తన కూతురును ఈ మందిరానికి ట్రస్టీగా నియమించాడని పేర్కొన్నారు – అబుల్ ఫౌజాన్)*

తన జీవితపు చివరి 27 సంవత్సరాలు అతను దక్షిణ భారత దేశంలో గడిపాడు. కాని ఈ సుదీర్ఘ కాలంలో అక్కడ ఒక్క హిందూ మందిరం కూడా ధ్వంసం చేయబడలేదు.[15]

పై వివరాల వల్ల ఆ కాలంలో కేంద్ర ప్రభుత్వానికి ఏ మందిరాల నుండి సహాయ సహకారాలు లభించాయో, వాటిపట్ల ఔరంగజేబ్ మేలుగా, సానుభూతిగా ప్రవర్తించాడని, ఇక

ఏ మందిరాలను కేంద్రంగా చేసుకొని హిందూరాజులు, కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ తిరుగుబాటును, స్వతంత్రాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించారో, ఔరంగజేబ్ వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చి పడేశాడనేది అర్థమవుతుంది. అతని ఈ ప్రవర్తన కేవలం హిందువులు, ముస్లింల (గోల్కొండలోని షాహి మసీదు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు చేయడానికి స్థావరంగా మారినందున దాన్ని ధ్వంసం చేసేశాడు) వరకే పరిమితం కాదు, తన తండ్రిని, సోదరుణ్ణి చివరికి ప్రమాదాన్ని పసిగట్టినప్పుడు కుమారుణ్ని, కుమార్తెను కూడా విడిచిపెట్టలేదు. అవసరాన్ని అనుసరించి హిందూ ముస్లింలనే భేదభావాన్ని దరిచేరనీయకుండా, అతను తన వారి స్థానాన్ని గట్టి పరచడానికి ప్రయత్నించాడు. హిందువులకు సంబంధించి వారంతా ఔరంగజేబ్‌కు వ్యతిరేకులు కారని మనం చెప్పగలుగుతాము. హిందువులుగాని, ముస్లింలుగాని తన వ్యతిరేకుల పట్ల ఒకేవిధమైన కాఠిన్యత, అదేవిధంగా వారు హిందువులైనా ముస్లింలైనా, తన మిత్రుల పట్ల మేలుగాను, దయ కనికరాలతోను ప్రవర్తించేవాడు.”

(ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి – డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 28–33)

ఈ విధంగా ఔరంగజేబ్ హిందువుల శత్రువు, మందిరాల విధ్వంసకుడు ఎంతమాత్రం కాదని నిరూపితమయిపోయింది. ఏ మందిరాల నుండైతే తనకు సహాయ సహకారాలు లభించాయో, ఏ మందిరాలైతే తమ ధార్మికతను కాపాడుకున్నాయో, ఔరంగజేబ్ ఆ మందిరాల జోలికి పోవడం అటుంచి, వాటికి తన చేతనైన సహాయసహకారాలందించాడు. భూముల్ని, జాగీర్లను ప్రసాదించి వాటి ఉనికిని, అస్తిత్వాన్ని సుదృఢపరచడానికి ప్రయత్నించాడు. ఇక ఏ మందిరాలైతే తనకు తన అధికారానికి వ్యతిరేకంగా కుట్రలు, తిరుగుబాటుకు స్థావరాలుగా మారాయో, వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చిపడేశాడు. మందిరాల్నే కాదు, తనకు, కేంద్రానికి వ్యతిరేకంగా కుట్రకు, తిరుగుబాటుకు దోహదపడుతున్నాయని తెలిసిన మసీదులను సైతం ఎలాంటి సంకోచం లేకుండా ధ్వంసం చేయించాడు. మసీదులుగాని, మందిరాలుగాని తమ ధార్మికతను విడనాడి, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కుట్రలకు, తిరుగుబాటుకు పాల్పడడం వాటి ధార్మికత దృష్ట్యా ఎంతమాత్రం శోభించదు. ఈ విషయాన్ని నేడు మన కాలంలో కూడా చూడవచ్చు. అలా జరిగినప్పుడు, అవి దాని మూల్యాన్ని చెల్లించుకోక తప్పదు.

ఔరంగజేబ్ కాలంలో జరిగినవి కూడా ఇలాంటివే. వాటిని కూడా మనం ఈ దృష్టితో చూస్తే ఔరంగజేబ్‌పై ఏర్పడిన అపార్థాలు, అనుమానాలు, శంకలు దూరమైపోతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అతను మందిరాల విధ్వంసకుడు కాదు, మందిరాల సంరక్షకుడనడానికి అతను మందిరాలకు, పూజారులకు భూములు, జాగీర్లను ప్రసాదిస్తూ జారీచేసిన వందలాది ఫర్మాన్లు – నేటికీ లభ్యంగానున్న ఆ ఫర్మాన్లు నిరాకరించలేని చారిత్రక సాక్ష్యాధారాలుగా నిలిచి ఉన్నాయి.

ఔరంగజేబ్ మందిరాలకు, మఠాలకు, గురుద్వారాలకు, జైనమందిరాలకు, పూజారులకు, అర్చకులకు, మహేంతులకు జారీచేసిన ఈ ఫర్మానాలు మనకు లభ్యమైనవి కొన్నిమాత్రమే. ఇవి డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే, జెనన్‌చందర్, డాక్టర్ పి.యల్.గుప్త, గ్యాన్‌చంద్, డాక్టర్ కె.కె. దత్త లాంటివారు తమ వ్యక్తిగత లభిలాష, జిజ్ఞాస మరియు ఉత్సాహంతో సేకరించిన కొన్ని ఫర్మానాలు మాత్రమే. వారి దృష్టికి వచ్చిన, వారి కంటపబడిన ఫర్మానాలను మాత్రమే వారు సేకరించగలిగారు. అయినా ఇవి వందల సంఖ్యలోనే ఉన్నాయి. అయినా కూడా ఇది వ్యక్తిగత ప్రయాసగానే భావించబడుతుంది. భారతదేశం ఒక సువిశాలమైన దేశం. ఇక్కడ వందల్లో కాదు, వేలాది సంఖ్యలో మందిరాలున్నాయి. బాబూ రాజేంద్ర ప్రసాద్ తన ఆకాంక్షను వెలిబుచ్చినట్లు ఎవరో ఒకరు ఈ పనికి పూనుకుంటేగాని పూర్తి ఫలితాలు బయటపడవు. ఈ పని సమిష్టిగా ప్రభుత్వపరంగా చేపడితే, తగిన శ్రద్ధ, ఉత్సాహం కనబరిస్తే, సువిశాలమైన ఈ భారతావనిలో వేల సంఖ్యలో అలాంటి సనద్‌లు, ఫర్మానాలు, పర్వానాలు బయటపడతాయ నడంలో అతిశయోక్తి లేదు. ఏ మందిరాలకు ఔరంగజేబ్ అలాంటి సనద్‌లు, ఫర్మానాలు జారీ చేశాడో, కనీసం ఆ మందిరాల పూజారులు, మహేంతులు అతని పట్ల కృతజ్ఞతాపూర్వకంగానైనా, అతనిపై చల్లబడిన బురదను కడగడానికైనా, వాటి జిరాక్స్ ప్రతుల్ని ఎక్కడో ఓ చోట జమచేస్తే ఇదెంతో మంచి కార్యం అవుతుంది. కాని అదే ప్రశ్న! దీనికి ఎవరు నడుం బిగించాలి? హోదా, అధికారాలు, ప్రభుత్వ సహాయ సహకారాలు లేనంతవరకు వ్యక్తిగతంగానో, సంఘపరం గానో ఈ పని సాధించడం దుర్లభమే. భారతదేశం లాంటి సువిశాల దేశంలో, ఒక్క వ్యక్తి లేక ఒక సంఘం దేశమంతా తిరిగి సేకరించడం అసాధ్యం.

"హిందూ మందిరాలు – ఔరంగజేబ్ ఫర్మానాలు" అనే పేరుతో డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే మరియు మౌలానా అతావుర్రహ్మాన్ ఖాస్మిగార్లు సంకలనం చేసిన పుస్తకంలో ఒకచోట ఇలా పేర్కొన్నారు :

"పర్షియన్ భాషలో ప్రఖ్యాతి గాంచిన సాహిత్యకారుడు ప్రొఫెసర్ షరీఫ్ హుసేన్ ఖాస్మి, ఈయన ఢిల్లీ యూనివర్శిటీ పర్షియన్ డిపార్టుమెంటుకు శాఖాధిపతి. ఆయన ఓ సంఘటనను ఇలా వివరించారు :

"గడిచిన సంవత్సరం ఎవరో ఒక ఆంగ్ల వనితను (వాస్తవంలో ఆమె ఒక రీసెర్చ్ స్కాలర్) నా పేరు చెప్పి, నా వద్దకు పంపించారు. ఆమె నా వద్దకు వచ్చి ఇలా చెప్పసాగింది : 'భారతదేశంలోని ముస్లిం పాలకుల ద్వారా మందిరాలకు ఇవ్వబడిన జాగీర్లకు సంబంధించిన ఫర్మానాలపై నేను అధ్యయనం చేస్తున్నాను. దీనికి సంబంధించి హర్యానాకు చెందిన మందిరాలు మరియు మఠాల సర్వేను నిర్వహించాను. ప్రాచీన మందిరానికి చెందిన ప్రతి పూజారిని కలుసుకొని, మీ మందిరానికి సంబంధించి ఏదైనా రాజాజ్ఞ (ఫర్మాన్) ఉంటే దయచేసి నాకు

చూపించండంటూ వారిని కోరాను. నన్నో ఆంగ్ల వనితగా భావించి, ప్రతి ప్రాచీన మందిరపు పూజారి, తమ వద్ద నున్న ఫర్మాన్లను తెచ్చి నాకు చూపించేవాడు, నా కెమరాతో నేను వాటి ఫోటోలు తీసుకొని, అసలు కాగితాల్ని వారికే తిరిగి ఇచ్చేసేదాన్ని. వచ్చేటప్పుడు కొద్దోగొప్పో డబ్బు కూడా ఇచ్చేదాన్ని దాంతో వారు ఇంకా సంబరపడిపోయేవారు. నాకు పర్షియన్ రాదు, దయచేసి వాటి సారాంశాన్ని వ్రాసి ఇవ్వండి" అంటూ ప్రాధేయపడింది.

"రెండు మూడు రోజుల్లో వీటి సారాంశాన్ని తయారుచేసి పెడతాను. మీరు మూడు రోజుల తరువాత రండి" అంటూ ఆమెను పంపించాను.

సదరు ప్రొఫెసర్ గారు తమ తీరిక సమయంలో ఆ ఫర్మాన్ల ఫోటోలను పరిశీలించసాగారు. అందులో కొన్ని ఫర్మాన్లు హిందీభాషలో ఉన్నాయి, కొన్ని సంస్కృతంలో ఉన్నాయి. పర్షియన్ భాషకు చెందినవే అత్యధికంగా ఉన్నాయి. ఈ పర్షియన్ ఫర్మాన్ల అనువాదం చేసిన తరువాత ఆయన లెక్కిస్తే కేవలం పర్షియన్ భాషయే మూడు వందలున్నాయి. ముస్లిం పాలకులు దానాలను, జాగీర్లను ఇస్తూ జారీచేసిన కేవలం హర్యానాకు సంబంధించినవి మాత్రమే ఇవి. వాగ్దానానుసారం మూడు రోజుల తరువాత ఆ ఆంగ్ల వనిత వచ్చింది. అనువాదం చేసిపెట్టిన ఆ ఫర్మానాలన్నీ ప్రొఫెసర్ గారు ఆమెకు అప్పగించినప్పుడు, ఆవిడ అత్యంతంగా సంబరపడిపోయింది, ఏదో కొంత పారితోషికంగా ఇవ్వబోతే, ఆయనగారు తమ వంశ మరియు వ్యక్తిగత మర్యాదను ప్రదర్శిస్తూ, "విదేశీయుల నుండి నేనెలాంటి ప్రతిఫలాన్ని స్వీకరించను" అంటూ మృదువుగా నిరాకరించినప్పుడు, ఆమె అమితంగా ప్రభావితమైంది."

హర్యానాలాంటి ఒక్క చిన్న రాష్ట్రంనుండే కేవలం ఒకే ఒక వ్యక్తి ప్రయాసవల్ల మూడు వందల సిసలైన ఫర్మానాలు లభించాయంటే, మొత్తం భారతావనిలో ఎన్ని ఫర్మానాలున్నాయో ఎలా అంచనావేయగలం? భారతదేశంలోని అన్ని మందిరాలు, గురుద్వారాల సర్వే జరిపితే గాని అసలు సంఖ్యను అంచనా వేయలేము. దుస్తరమైన, కఠినమైన ఈ కార్యాన్ని, అందులోనూ మతతత్వం పడగవిప్పి నాట్యమాడుతున్న ఈ తరుణంలో ఎవరీ పనిని చేపట్టగలరు?" (పేజి 5, 6)

చూశారా! ముస్లిం రాజులతోగాని, మందిరాలతో గాని ఎలాంటి సంబంధంలేని ఒక విదేశీ వనిత, స్కాలర్ సుదూర ప్రయాణంచేసి ఎంతో కష్టప్రయాసలకోర్చి, కేవలం తన రీసెర్చ్ కోసం ఎంత కష్టపడిందో అర్థం చేసుకోగలిగితే, మనం భారతీయులం ఎంత నిద్రావస్థలో ఉన్నామో, ఒక సున్నితమైన ముఖ్యమైన సమస్య పరిశోధనలో మనమెంత వెనుకబడి ఉన్నామో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పట్టుదల, జిజ్ఞాస గల జాతులే ప్రపంచంలో అగ్రగాములుగా ఉంటాయనడంలో సందేహమేముంది?


1


2



3



4

1. 2. 3. 4. ఫోటోలు - బాలాజీ మందిరం, చిత్రకోట్-
వివరాలు లోపలి పేజీల్లో వచ్చాయి.





**Siddeswara Temple, Machnur (Bramhapuri)**

"..... The Emperor Aurangazeb after the incident quoted earlier made two yearly grants - one of Rs.480/- and the other of Rs.6/- to the temple. The Temple even to this date gets this amount of Rs.486/- from the Government. The temple has an Inam land of about 50 acres, the income from which is utilises towards the worship of the diety. (Maharastra State Gazetteers - Government of Maharastra. Sholapur District (Revised Edition, 1977 at pages 856, 857). వివరాలు లోపలి పేజీల్లో వచ్చాయి.

# 15. జిజ్‌యా పన్ను వాస్తవికత

'జిజ్‌యా'ను ఇస్లాం వ్యతిరేక చరిత్రకారులు అత్యంత వివాదాస్పద అంశంగా మార్చారు. కనుక దీని పునాదుల్లోకి, వివరాల్లోకి పోయి అధ్యయనం చేయాల్సి ఉంటుంది. జిజ్‌యా అనే పదానికి అర్థం ఏమిటి? దీన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎవరి కోసం వాడతారు. ప్రప్రథమంగా ఇస్లామీయ చరిత్రలో దీన్ని ప్రారంభించిన వారెవరు? కేవలం ముస్లిమేతరులకే ఈ జిజ్‌యా ఎందుకు? ముస్లింలపై ఈ టాక్సు ఎందుకు విధించబడలేదు, ముస్లిమేతరుల్ని కేవలం అవమానించడానికే ఈ టాక్సు విధించబడిందా? ఆర్థికంగా ముస్లిమేతరుల్ని దెబ్బ దీయడానికే ఈ టాక్సు విధించబడిందా? ఇస్లాం స్వీకరించనందువల్ల ముస్లిమేతరులపై విధించిన జరిమానాగా, ముస్లిమేతరుల్ని ఇస్లాం స్వీకరించేందుకు వివశుల్ని చేయడానికి అవలంబించిన ఒక యుక్తిగా – ఇలా రకరకాలుగా జిజ్‌యాను వర్ణించడం జరిగింది. ఈ అధ్యాయంలో పై అన్ని ప్రశ్నలకు మనం సంతృప్తికర సమాధానాలు పొందాల్సి ఉంది. అది కూడా సాక్ష్యాధారాలతో, ఇస్లాం ప్రామాణిక ఆధారాల ద్వారా పొందాల్సి ఉంది. జిజ్‌యాకు సంబంధించిన సర్వ అనుమానాల్ని, అపార్థాల్ని దూరం చేయడానికి, జిజ్‌యాకు సంబంధించి సంపూర్ణ అవగాహన కలిగించడానికి ఈ అధ్యాయం ఉపకరిస్తుంది.

భారతదేశంలో 'జిజ్‌యా'ను అసహ్యకరంగా నిరసించదగినదిగా చూడడం జరిగింది. భారతదేశంలో ముస్లింల పరిపాలనా కాలమంతటిలో కూడా జిజ్‌యా లక్షణాన్ని, ప్రత్యేకతను, దాని వాస్తవికతను తేటతెల్లం చేయడం జరగలేదు. ఇరవయ్యో శతాబ్దంలో ప్రముఖ ఇస్లామీయ పండితుడు అల్లామ షిబ్లి నొమాని, జిజ్‌యాను గురించి ఎలా విడమర్చి తెలిపారో, ఆ విధంగా గడిచిన కాలాల (భారతదేశపు) పండితులు, విద్వాంసులు అలా విడమర్చి తెలిపివుంటే బహుశ ఇది ఇంతగా అసహ్యించుకో దగినదిగా, విమర్శించదగినదిగా కనిపించకపోయేదేమో!

అల్లామ షిబ్లి నొమాని, ఇమాం అబూ యూసుఫ్ రచించిన ప్రఖ్యాత గ్రంథం కితాబుల్ ఖిరాజ్ మరియు ఫుతూహుల్ బుల్దాన్‌ను ఉటంకిస్తూ 'జిజ్‌యా' అనే తన వ్యాసంలో ఇలా పేర్కొన్నారు :

"ఇస్లాం ప్రవక్త (స) ఏ జాతులపైనైతే జిజ్‌యా విధించారో, వారికి రాతపూర్వకంగా ఈ హక్కుల నిచ్చారు :

1. ఎవరైనా శత్రువు వారిపై దాడి జరిపితే, వారిని రక్షించడం జరుగుతుంది.
2. వారిని వారి ధర్మం నుండి తిరుగబడడానికి ప్రోత్సహించడం జరగదు.
3. జిజ్‌యా వారి వద్దకు వెళ్ళి తీసుకోవడం జరుగుతుంది. వారు దీన్ని వసూలు చేసే వారివద్దకు రానవసరం లేదు.
4. వారి ప్రాణాలకు రక్షణ ఉంటుంది.
5. వారి ధనానికి, సంపదకు రక్షణ ఉంటుంది.

6. వారి యాత్రికుల సమూహాలకు, వర్తక బిడారాలకు రక్షణ ఉంటుంది.

7. వారి భూములు సురక్షితంగా ఉంటాయి.

8. వారి అధీనంలో నున్న సర్వ వస్తువులు యధాతథంగా కొనసాగుతాయి.

9. పాదరీలు, సన్యాసులు, చర్చ్ పూజారులు తమ హోదాల నుండి తొలగించబడరు.

10. శిలువల్ని, విగ్రహాల్ని నష్టపరచడం జరగదు.

11. వారితో ఉష్ర్ (పంట నుండి తీసుకోబడే పదవ లేక ఇరవయ్యో భాగం) తీసుకోబడదు.

12. వారి దేశంలో సైన్యం పంపబడదు.

13. మొదటి నుండి వారికున్న ధర్మం, విశ్వాసాల నుండి వారిని మళ్ళించడం జరగదు.

14. మొదటి నుండి వారికున్న ఏ ఒక్క హక్కు కూడా భంగపరచడం జరగదు. ఎవరైతే ప్రస్తుత మిక్కడ హాజరులేరో, వారికి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి.

జిజ్‌యాకు సంబంధించిన పై నియమాలు ప్రవక్త మహనీయుల (స) తరువాత ఆయన ప్రతినిధుల కాలంలో కూడా కొనసాగాయి. మౌలానా షిబ్లిని అనుసరించి ఇస్లాం ప్రతిపాదించిన వ్యవస్థలో ప్రతి ముస్లిం దేశ రక్షణకు, సైనిక సేవకు కట్టడి చేయబడతాడు. కాని ఒక ముస్లిం దేశంలో ఉంటున్న ముస్లిమేతరుల (జిమ్మీల) రక్షణ బాధ్యతను ముస్లిం ప్రజలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ జిమ్మీలను సైనిక సేవలకు కట్టడిచేసే లేక తప్పనిసరిగా నియమించే అధికారం ఇస్లామీయ ప్రభుత్వానికి లేక ఇస్లాంకు లేదు. వారు ఇలాంటి ప్రమాదంతో కూడుకున్న సేవలకు అంగీకరించే అవకాశం కూడా లేదు. అందుకని వారు తమ రక్షణార్థం ఈ ప్రభుత్వానికి ఏదో ఒక రూపంలో ప్రతిఫలాన్ని లేక టాక్సును చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రతిఫలాన్ని లేక టాక్సునే "జిజ్‌యా" అని పిలువడం జరిగింది. ఒకవేళ, ఎప్పుడైనా ఈ జిమ్మీలు సైన్యంలో చేరడానికి, లేక సైనిక సేవలందించడానికి తమ అంగీకారాన్ని తెలిపితే, వారి నుండి జిజ్‌యా తీసుకోబడదు. స్వయంగా ప్రవక్త మహనీయులు (స) 'ఈలా' పాలకునికి, జిజ్‌యాకు సంబంధించి రాయించి ఇచ్చిన ఫర్మానాలో ఈ వాక్యాలున్నాయి : "వారిని రక్షించాలి మరియు శత్రువుల నుండి వారిని కాపాడాలి." (మిఖాలాతె షిబ్లి-వాల్యూం-1, (ధార్మిక) పేజి:192, 194, 231, 232)

ముస్లిమేతరులకే జిజ్‌యా ఎందుకు? ముస్లింలపై జిజ్‌యా ఎందుకు విధించలేదు అనే దానికి కారణం పైన తెలుపబడినప్పటికీ దాన్నే కాస్త వివరంగా, పూర్తి అవగాహన ఏర్ప డాలనే దృష్టితో ఈ క్రింద ఇంకా వివరించడం జరిగింది.

జిజ్‌యా అనేది కేవలం ముస్లిమేతరులతోనే తీసుకోబడేది. ముస్లిమ్‌ల నుండి కాదు. అయితే ఇది వారి(ముస్లిమేతరుల) రక్షణ కోసం, ఇంకా సైనిక సేవలకు బదులుగా. జిమ్మీలు

సైనిక సేవల నుండి మినహాయించబడేవారు. అయితే ముస్లిమ్ పౌరులు(సైనిక సేవలు నెరవేర్చ) వివశులై ఉండేవారు. అందుకని వారితో ఇది (జిజ్‌యా) తీసుకోబడేది కాదు. ఎందుకంటే వారు ధనానికి బదులు ప్రాణాలు అర్పించ వివశులై ఉండేవారు. (అంటే రణరంగానికి వెళ్ళక తప్పేది కాదు). (Compulsory Military Service).

2. ముస్లింలపై ఒక అనివార్యమైన ధార్మిక పన్ను విధించబడుతుంది. దీన్నే "జకాత్" అంటారు. దీని పరిమాణం ప్రతి సంవత్సరం రెండున్నర శాతం. ఇది అవసరాలు తీరిన తరువాత, మిగిలి ఉన్న ధనంపై విధించబడుతుంది. ఎవరైనా ఒక ముస్లిం కోటీశ్వరుడైతే, రెండున్నర శాతం చొప్పున అతను ప్రతి సంవత్సరం రెండు లక్షల యాభైవేలు జకాత్ పద్దు క్రింద చెల్లించవలసి ఉంటుంది. అంతేకాక దేశంపై ఏదైనా విపత్కర పరిస్థితులు వచ్చిపడితే ఇస్లామీయ ప్రభుత్వం, ముస్లింల ఆర్థిక స్థోమతను అనుసరించి ప్రత్యేక పన్నును కూడా వసూలు చేయగలుగుతుంది. కాని ముస్లిమేతర ప్రజలతో జిజ్‌యా తప్ప, ఇతరత్రా ఒక్క పైసా కూడా వసూలు చేయరాదు.

3. ముస్లిమేతర ప్రజలు దేశ రక్షణకు సంబంధించిన బాధ్యత నుండి అనగా సైనిక సేవల నుండి మినహాయించబడతారు. అందుకోసమని సైనిక ఖర్చుల నిమిత్తం, వారి రక్షణ కోసం ఒక చిన్న పన్ను వారి నుండి వసూలు చేయబడుతుంది. దీన్నే 'జిజ్‌యా' అంటారు. అవసరం ఏర్పడినప్పుడు, ముస్లిమేతర ప్రజల్లో నుండి ఎవరైనా సైనిక సేవకు అనగా యుద్ధరంగానికి వెళ్ళటానికి ముందుకు వస్తారో, వారి నుండి జిజ్‌యా వసూలు చేయబడదు.

ఉదాహరణకు, "జర్‌జాన్" వాసులతో చేసుకున్న ఒడంబడికలో ఈ వాక్యాలు ఉన్నాయి: "మిమ్మల్ని రక్షించే బాధ్యత మాపై ఒక షరతుతో ముడివడి ఉంటుంది. అదేమిటంటే, మీ స్థోమతను అనుసరించి వార్షిక జిజ్‌యా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఒకవేళ మేము మీతో (రక్షణ విషయంలో) సహాయమే గనక తీసుకున్నట్లైతే దానికి ప్రతిఫలంగా జిజ్‌యా మాఫీ చేయబడుతుంది. (తిబ్రీ చరిత్ర, వా. 5, పే. 2665, ఇస్లామీయ చరిత్ర, షాహ్ మొయినుద్దీన్ నద్వి, వా. 1, పే. 193).

ఆజర్‌బాయిజాన్ గెలవబడినప్పుడు చేసుకున్న ఒప్పందంలో ఈ వాక్యాలున్నాయి : "ఎవరైనా ఏదో సంవత్సరం సైన్యంలోనే గనక పనిచేసినట్లైతే ఆ సంవత్సరం బాపతు జిజ్‌యా వారి నుండి తీసుకోబడదు. (తిబ్రీ చరిత్ర, వా. 5, పే. 2663, ఇస్లామీయ చరిత్ర, షాహ్ మొయినుద్దీన్ నద్వి, వా. 1, పే. 193)

4. ఇస్లామీయ పరిభాషలో ఒక ఇస్లామీయ ప్రభుత్వంలో, దాని రక్షణలో ఉంటున్న ముస్లిమేతర ప్రజల్ని 'జిమ్మీ'లంటారు. 'జిమ్మీ' అంటే ఏదో అవమానకరమైన పదమేమీకాదు. దీని అర్థం ఏమిటంటే వారి ధన, మాన, ప్రాణాలకు, ధర్మానికి, గౌరవానికి, సన్మానానికి, సుఖ శాంతులకు అన్నింటికీ ఇస్లామీయ ప్రభుత్వం బాధ్యత తీసుకున్న ముస్లిమేతర పౌరులు అన్నమాట.

అంతేకాదు, వ్యవహారికంగా, ఆచరణలో వారిని అన్ని విధాల సంరక్షించే బాధ్యత ఇస్లామీయ ప్రభుత్వంపై ఉంటుంది కాని ఇస్లాం ప్రకారం, వారి నిజమైన సంరక్షకులు దైవం మరియు దైవప్రవక్తయే. దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (స) ఈ జమ్మీల (ముస్లిమేతరుల) గురించి ముస్లింలను ఇలా హెచ్చరించారు.

"జాగ్రత్త! మీలో నుండి ఎవరైనా ఏ ముస్లిమేతర పౌరునిపై (జమ్మీపై) అత్యాచారం జరిపినా, అతని అధికారాల్లో లోపం రానిచ్చినా, లేదా అతని శక్తికి మించి అతనిపై భారం మోపినా లేదా అతని అంగీకారం లేనిదే అతనికి సంబంధించిన ఏదైనా వస్తువును లాక్కున్నా, అలాంటి వ్యక్తికి వ్యతిరేకంగా ప్రళయం రోజు దైవన్యాయస్థానంలో నేను ఆ ముస్లిమేతరుని తరఫున వాదిస్తాను." (అబూదావూద్, కితాబుల్ జిహాద్)

ముస్లిమేతర సోదరులు ఒక్క నిమిషం ఇక్కడ ఆగి మహనీయ ముహమ్మద్ (స) ముస్లింలకు చేసిన ఈ హెచ్చరిక, లేక వార్నింగ్‌పై కాస్త గాఢంగా, గంభీరంగా ఆలోచించాలని మనవి చేస్తున్నాము. సంరక్షణకు సంబంధించిన ఇంతటి గ్యారంటీ నేడు మన భారతీయ ప్రజలకు కూడా లేదే! మత కలహాల పేరుతో ప్రజల ధనమాన ప్రాణాలు ఎలా బుగ్గిపాలవుతున్నాయో పత్రికలు చదివేవారికి తెలియనివి కావు.

దైవప్రవక్త (స) ముస్లిమేతర అల్పసంఖ్యాకుల గురించి ఇలా ఉపదేశించారు: "వారి రక్తం మా రక్తంతో సమానం, ఇంకా వారి సంపద మా సంపదలాగే (సురక్షితంగా ఉంటుంది)" (నసబుర్రాయ-4/369) ఆయన (స) గారు ఇంకిలా అన్నారు: "ఏ వ్యక్తి అయితే (తన) దేశంలోని ఒక ముస్లిమేతర వ్యక్తిని హత మారుస్తాడో, అతను స్వర్గసువాసనతో సైతం వంచించ బడతాడు." (బుఖారి-హదీసు నెం.3166)

ఎవరైనా ముస్లిం, ఒక ముస్లిమేతరుణ్ణి (జిమ్మీని) చంపినట్లయితే హజ్రత్ ఉమర్ అతనితో ఖిసాస్ తీసుకునేవారు. ద్వితీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్ పరిపాలనా కాలంలో బకర్ బిన్ వాయెల్ తెగకు చెందిన ఒక ముస్లిం, 'హిరా' నగరానికి చెందిన ఒక జిమ్మీ (క్రైస్తవ) పౌరుణ్ణి హతమార్చాడు. హజ్రత్ ఉమర్ ఖిసాస్ (ప్రతిహత్య) క్రింద ఆ ముస్లిం హంతకుణ్ణి హతుని వారసులకు అప్పగించారు. వారతన్ని చంపేశారు. (అదారియా ఫీ తఖ్‌రీజుల్ హిదాయ, పేజి 260), 2. అల్ ఫారూఖ్ - షిబ్లినోమాని - వా.2, పేజి 138). ఆయనగారు జిమ్మీల ఆస్తిపాస్తులకు ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు దానికి పరిహారం ఇప్పించేవారు. ఒకసారి సైన్యాలు సిరియా దేశం గుండా వెళుతున్నప్పుడు అక్కడి ఒక క్రైస్తవ పౌరుని పంటకు నష్టం వాటిల్లింది. ఇది తెలిసినప్పుడు హజ్రత్ ఉమర్ ఆ క్రైస్తవ రైతుకు బైతుల్ మాల్ (ముస్లింల కోశాగారం) నుండి పదివేలు పరిహారం ఇప్పించారు. (కితాబుల్ ఖిరాజ్, పేజి 68, 2 ఇస్లామీయ చరిత్ర షా మొయినుద్దీన్ నద్వి వా.1, పేజి 192).

నాలుగవ ఖలీఫా అయిన హజ్రత్ అలీ, ఒక గవర్నరును నియమించి, సాగనంపేటప్పుడు ఈ జిమ్మి (ముస్లిమేతరు)ల గురించి ఇలా ఆదేశించారు : "వారు చలి, ఎండ కాలాల్లో తొడిగే

దుస్తులు, వారి జీవితావసర వస్తువులు, వారి వ్యవసాయ పశువులు, జిజియా కోసం అమ్మరాదు. జిజియా కోసం వారిని కొరడాలతో కొట్టరాదు. వారిని నిలబెట్టి శిక్షించరాదు. జిజియా కోసం వారి ఏ వస్తువులు వేలం వేయకండి. ఎందుకంటే మనం వారి పాలకులుగా నియమించబడ్డాము. అందుకని మనం సరళంగా, మృదుత్వంతో వసూలు చేయాలి. ఒకవేళ నీవు నా ఈ ఆదేశాల్ని ఉల్లంఘించినట్లయితే, దైవం నాకు బదులు నిన్ను పట్టుకుంటాడు. ఇంకా ఒకవేళ నీవు ఈ ఆదేశాల్ని ఉల్లంఘించావని నాకుతెలిస్తే, నిన్ను పదవీచ్యుతుణ్ణి చేస్తాను." (కితాబుల్ ఖిరాజ్-పేజి 9)

హజ్రత్ ఉమర్ పరిపాలనా కాలంలో ఒక యూదు పౌరుడు (జిమ్మీ) భిక్షమడుగుతూ కనిపించాడు. దానికాయన ఎందుకు భిక్షమడుగుతున్నావని ప్రశ్నించారు. "నేను ముసలి వాడైపోయాను. పని చేయలేను. అదీగాక జిజియా ఇవ్వాల్సి ఉంది" అని సమాధానమిచ్చాడు. అప్పుడాయన ఆ వ్యక్తిని తనతో పాటుగా తనింటికి తీసుకొని వచ్చి, తన వద్ద ఉన్నది కొంత ముట్టజెప్పారు. ఇంకా అతని ద్వారా కోశాధికారికి ఇలా లేఖ వ్రాసి పంపించారు. "ఇతను యవ్వనంలో ఉన్నప్పుడు ఇతని (జిజియా) ద్వారా మనం లాభపడ్డాము. ఇప్పుడితను ముసలి వాడైనందున నిరాశ్రయునిగా వదలిపెట్టడం న్యాయం కాదు. ఇలాంటి వారిని గుర్తించి, వారి జిజియాను మాఫీ చేయడమే కాకుండా, బైతుల్ మాల్ నుండి (ముస్లింలలాగే) వారికీ పింఛను జారీ చేయండి." (కితాబుల్ ఖిరాజ్ - ఇమాం అబూ యూసుఫ్, పేజి 72)

5. జిజ్‌యా సాలుసరి పరిమాణం లేదా ఎవరికెంత అనేది ఈ క్రిందివిధంగా ఉంటుంది. అత్యధిక ధనవంతుడు, లక్షాధికారి అయినప్పటికీ అతనిపై విధించబడే అత్యధిక జిజ్‌యా ప్రతి వ్యక్తికి, (12) రూపాయలు; మధ్యవర్గం వారిపై (6) రూపాయలు; వ్యాపారులు, ఉద్యోగస్తులపై (3) రూపాయలు; అవసరానికి మించివున్న ధనాన్ని పరిగణనలోకి తీసుకొని పైనుదాహరించిన పరిమాణంలోనే జిజ్‌యా విధించాలనేది జిజ్‌యా మూల సిద్ధాంతం. ఎవరైనా ఓ ముస్లిమేతర పౌరుని ఆదాయం తగ్గిపోతే, అతనితో మూడు రూపాయలకన్నా తక్కువ జిజ్‌యా వసూలు చేయాలి, అయితే ఆదాయం లేక రాబడి పెరిగిపోతే మాత్రం, జిజ్‌యాను పెంచటానికి వీల్లేదు.

6. జిజ్‌యా విధించబడే వర్గంలో కూడా స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, మతిలేనివారు, అంధులు, అంగవైకల్యం కలవారు, మందిరాలు, మఠాలు, ఆరాధనాలయాల సేవకులు, పూజారులు, సాధువులు, సన్యాసులు, గృహస్త జీవిత కార్యకలాపాల నుండి వైదొలగి గుహల్లో, మఠాల్లో, ఆశ్రమాల్లో నివసిస్తున్నవారు - పై వారందరూ జిజ్‌యా నుండి మినహాయించబడతారు. ఇంకా సైనిక సేవలు అందించిన వారు కూడా జిజ్‌యా నుండి మినహాయింపబడతారు.

7. జిజ్‌యా చెల్లించడానికి అధికారుల వద్దకు వెళ్ళే నియమం లేదు. అధికారులు స్వయంగా వసూలు చేసుకోవటానికి రావలసి ఉంటుంది. జిజ్‌యా వసూళ్ళలో నమ్రతను,

మృదుత్వాన్ని పాటించాలని, కాఠిన్యాన్ని, కర్కశత్వాన్ని పాటించరాదనే నియమం ఆ అధికారుల కుంది. జిజ్యా సందర్భంలో వారి వస్త్రాలను, అత్యవసర వస్తువుల్ని కంచర గాడిదను, ఆవును వేలం వేయరాదనే ఆదేశాలున్నాయి. జిజ్యా కోసం వారిని శిక్షించరాదని, వారిని నిలబెట్టరాదనే ఆంక్షలు కూడా ఉన్నాయి. (కితాబుల్ ఖిరాజ్ – పేజి 9). జిజ్యా చెల్లించేవారిలో నుండి ఎవరైనా పేదవానిగా, దరిద్రునిగా మారిపోతే అతనికి జిజ్యా మాఫీ చేయటమేగాక ముస్లిం ధనాగారం నుండి అతనికి, అతని కుటుంబానికి పింఛను జారీ చేయబడుతుంది. (కితాబుల్ ఖిరాజ్, పేజి 85).

8. పేదవారు, బిచ్చమెత్తుకునే ముస్లిమేతర ప్రజలకు ముస్లింల ధనాగారమైన 'బైతుల్ మాల్'పై అధికారముంటుంది.

జిజ్యాను జుట్టుపన్ను అని, ఇస్లాం స్వీకరించనందుకు చెల్లించవలసిన అపరాధ రుసుము అని, ముస్లిమేతరులను అవమానపరచడానికి విధించిన పన్ను అని – ఇలా రకరకాలుగా దుష్ప్రచారం చేశారు. అయితే ఇస్లామీయ దృక్పథంతో దీని వాస్తవికత ఏమిటి? అనే విషయాన్ని సుప్రసిద్ధ ఇస్లామీయ ధార్మికవేత్తలైన ఇమామ్ అబూ యూసుఫ్ మరియు ఇమామ్ షాఫయిగార్లు ఇలా విశ్లేషించారు :

"ప్రాణ రక్షణకు బదులుగా, ఇస్లామీయ రాజ్య సరిహద్దుల్లో నివసిస్తున్నందుకు ప్రతిగా చెల్లించే పన్నే జిజ్యా అనబడుతుంది." (కితాబుల్ ఖిరాజ్)

జర్జాన్ ఒడంబడికలోని వాక్యాలివి : "వారి ధనమానప్రాణాలు, ధర్మం, ధర్మశాస్త్రాలు అన్నిటికీ రక్షణ ఉంటుంది. వాటిలో నుండి దేనిలో కూడా మార్పు (పరివర్తనం) చేయకూడదు. (తిబ్రీ చరిత్ర, వా. 5, పే. 2262).

ఆజర్‌బాయిజాన్ ఒప్పందంలో ఇలా వచ్చింది: "ధనమానప్రాణాలకు ధర్మం, ధర్మశాస్త్రాలకు రక్షణ ఉంటుంది. (తిబ్రీ చరిత్ర, వా. 5, పే. 2262, ఇస్లామీయ చరిత్ర, షాహ్ మొయినుద్దీన్ నద్వి, వా. 1, పే. 191).

ఒకవేళ 'జిజ్యా' అనేది ముస్లిమేతరుల్ని అవమానపర్చేందుకే ప్రతిపాదించబడివుంటే, మందిరాల పూజారులు, సాధువులు, సన్యాసులు, గుహల్లో, మఠాల్లో, ఆశ్రమాల్లో నివసిస్తున్న వారు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు దీన్నుండి ఎలా మినహాయింపబడేవారు?

ఇస్లామీయ రాజ్యంలో, ముస్లిమేతర ప్రజలకు ధన మాన ప్రాణాలు, ధర్మం, గౌరవం అన్నిటికీ రక్షణ ఉంటుందనే విషయం మేము పైనే పేర్కొన్నాము. ఇక్కడ ఇంకొక విషయంపై మీ దృష్టిని మరల్చదలిచాము. ఎప్పుడు, ఎవరికిష్టమైతే వారు అందులో చేర్పులు-మార్పులు చేసుకోవడానికి ఇస్లామీయ శాసనం లేక చట్టం, మానవుల ద్వారా రూపొందించబడిన చట్టాల్లాంటిది కాదు. ఇది దైవగ్రంథమైన ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆదేశాల ననుసరించి రూపొందించబడింది. అందుకని దైవం మరియు దైవప్రవక్త (స) ఇతర

ఆదేశాలను తృణీకరించడం ఎలాంటి పాపమో, జిజ్‌యాకు సంబంధించి వచ్చిన ఆదేశాలను ధిక్కరించడం కూడా అలాంటి పాపమే, నేరమే అవుతుంది.

ఇస్లాంలో బలవంతపు మత మార్పిడి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతింపబడ లేదనటానికి ఈ జిజ్‌యాయే ప్రబల సాక్ష్యం. ఎందుకంటే ఈ జిజ్‌యా చెల్లించినందున ఆ ముస్లిమేతర పౌరులు తమ సంపూర్ణ ధార్మిక స్వాతంత్ర్యానికి అర్హులయ్యేవారు.

జిజ్‌యాకు సంబంధించి ఇస్లాం ప్రతిపాదించిన కొన్ని మౌలిక సూత్రాలివి, ఇవేకాకుండా ప్రవక్త మహనీయులు (స), ఆ తరువాత ఆయన ప్రత్యక్ష అనుచరులు (ఖలీఫాలు) ఈ జిజ్‌యాను ఎలా అమలుపరిచారు, జిజ్‌యా చెల్లించిన ముస్లిమేతరులకు (జమ్మీలకు) వారిచ్చిన రక్షణలు, రాయితీలు ఏమిటి? అనే విషయాల్ని కూడా పరిశీలిద్దాం.

ప్రవక్త మహనీయుల (స) జీవిత కాలంలో అరబ్బు ద్వీపకల్పమంతా ఆయన గారి అధీనంలోకి వచ్చినప్పుడు, నజరాన్ ప్రాంతానికి చెందిన క్రైస్తవులతో ప్రప్రథమంగా సంబంధాలు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. వారు జిజ్‌యా పన్ను చెల్లించడానికి అంగీకరించినప్పుడు, ఆయన వారికిచ్చిన అభయమేమిటో, రాయితీలేమిటో పరిశీలిద్దాం.

"నజరాన్, ఆ పరిసర ప్రాంతాల ప్రజల ధనమాన ప్రాణాలు, వారి ధర్మం, వారి భూములు, వారి సంపద, వారిలోని హాజరున్నవారికి, లేనివారికి, వారి వర్తక బిడారాలు, వారి (దేవతా) విగ్రహాలు– అన్నీ కూడా దైవం మరియు దైవప్రవక్త (స) సంరక్షణలో ఉంటాయి. ప్రస్తుతమున్న వారి పరిస్థితిలో ఎలాంటి మార్పు చేయబడదు. వారికున్న హక్కుల్లో నుండి ఏ ఒక్క హక్కు భంగపరచడం జరగదు. వారి విగ్రహాలకు నష్టం కలిగించబడదు. ఏ ఒక్క పాదరీగాని, మఠాధిపతి (సన్యాసి) గాని వారి హోదాల నుండి తొలగించబడరు. అజ్ఞాన కాలంలో వారితో జరిగిపోయిన హత్యకు లేక నేరానికి ప్రతీకారం తీసుకోబడదు. వారిని సైనిక సేవలకోసం ఒత్తిడి చేయడం జరగదు. వారి నుండి ఉష్ర్ పన్ను (పంట నుండి తీసుకోబడే పదవ లేక ఇరవయ్యో భాగం) తీసుకోబడదు. ఇస్లామీయ సైన్యాలు వారి భూభాగాన్ని ధ్వంసం చేయవు. ఇంకా వారిపై ఏ విధమైన దౌర్జన్యం జరగదు ... ఎప్పటివరకైతే వారు ముస్లింలకు శ్రేయోభిలాషులుగా ఉంటారో, వారితో చేసుకున్న ఈ ఒప్పందపు షరతుల్ని పాటించటం జరుగుతుంది. దౌర్జన్యంతో ఏ విషయంలో కూడా వారిని వివశుల్ని చేయడం జరగదు." (ఫుతూహుల్ బుల్దాన్ – బ్లాజరీ, పేజి 72, దీనెరహ్మత్–పేజి 237, 238)

ప్రఖ్యాత హేతువాద నాయకుడు, భారతదేశంలో కమ్యూనిజాన్ని పరిచయంచేసి స్థాపించిన కమ్యూనిజం పితామహుడు, ప్రసిద్ధ మానవతావాది అయిన ఎం.ఎన్.రాయ్, ప్రవక్త మహనీయులు (స) క్రైస్తవులపై చూపిన దయాకనికరాలు, సత్ప్రవర్తనను ఇలా వర్ణించారు: "ప్రామాణిక చరిత్రకారులందరూ, వారు ముస్లింలైనా, క్రైస్తవులైనా లేక ఇంకెవరైనా సరే, వారు సమకాలీనులైన లేక ఆధునికులైన ప్రఖ్యాత చరిత్రకారుడు ఎడ్వర్డ్ గిబన్‌తో సహా వీరంతా

నిరూపించిన వాస్తవమేమిటంటే – "తమ క్రైస్తవ ప్రజలతో మహనీయ ముహమ్మద్ ఎంతో మేలుగా ప్రవర్తించారు. సంతోషంగా వారి ధన ప్రాణాలను సంరక్షించారు. వారు వ్యాపారం చేసుకోవడానికి అనుమతించారు, వారి వ్యాపార సామగ్రిని సంరక్షించడం జరిగింది. వారిని తమకిష్టమైన రీతిలో ఆరాధన చేసుకునే స్వాతంత్ర్యాన్నిచ్చారు. పరమత సహనం మరియు ఓర్పు సహనాల ఈ ప్రయోజిత సిద్ధాంతంపై ప్రవక్త గారి ఖలీఫాలే కాకుండా అరబ్బు విజేత లందరూ పూర్తిగా ఆచరించారు.." (The Historical Role of Islam - By M.N. Roy. Page. 18) Published by Critical Quest, Indian Renaissance Institute, New Delhi, 2006)

ప్రవక్త మహనీయులు (స) ఉపదేశించిన పై బోధనలపై ఆయన అనుచరులు కూడా ఆచరించి చూపారు. హజ్రత్ అబూబకర్ కాలంలో హ॥ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ద్వారా, "హీరా" జయించబడినప్పుడు, హీరా వాసులకు ఈ క్రిందివిధంగా గ్యారంటీ ఇవ్వడం జరిగింది. "వారి మఠాలు, చర్చీలు ధ్వంసం చేయబడవు, వారి పండుగల సందర్భంలో శంఖం ఊదుకోవ డానికి, శిలువ ఉత్సవాలు జరుపుకోవడానికి వారినే విధంగానూ ఆటంకపరచడం జరగదు." (కితాబుల్ ఖిరాజ్, పేజి 84). హజ్రత్ ఉమర్ కాలంలో జెరూసలెం జయించబడినప్పుడు, అక్కడి క్రైస్తవులకు ఈ విధంగా ఆశ్వాసం ఇవ్వడం జరిగింది. "వారి ప్రాణాలకు రక్షణ ఇవ్వబడుతుంది, వారి చర్చీల్లో నివాసం ఏర్పరచుకోవడం జరగదు. అవి ధ్వంసం చేయబడవు. వాటికి గాని, వాటి ప్రాంగణాలకుగాని, నష్టం కలిగించడం జరగదు. వారి శిలువల్లో, వారి సంపదలో ఎలాంటి లోపం రానివ్వడం జరగదు. ధార్మిక విషయంలో వారినేవిధంగాను బాధించడం జరగదు. ఇంకా వారిని ఏవిధమైన కష్టనష్టాలకు గురిచేయడం జరగదు. (తిబ్రానీ. వా–5, పేజి 2405). హజ్రత్ ఉమర్ పరిపాలనా కాలంలోనే "జర్జాన్" జయించబడినప్పుడు అక్కడి ప్రజల ధనమాన ప్రాణాలకు, ధర్మానికి, ధార్మిక జీవన విధానానికి సంరక్షణ ఉంటుందని, వీటిలో నుండి ఏ ఒక్క దానిలో కూడా మార్పు చేయడం జరగదని శాంతి సంధిని చేసుకున్నారు. (తిబ్రానీ– వా–5, పేజి 2685). హజ్రత్ అబూ ఉబేదా బిన్ జిరాహ్ సిరియాను జయించినప్పుడు, హజ్రత్ ఉమర్ ఆయనకు ఈ క్రింది ఆదేశాల్ని రాసి పంపించారు. "జిమ్మీలపై (సంధిచేసుకున్న ముస్లిమేతర ప్రజలపై) ఏ విధమైన దౌర్జన్యం జరుపకుండా ముస్లింలను కట్టడి చేయండి. వారికి ఏ విధమైన నష్టం జరగరాదు. అక్రమంగా వారి సొమ్మును తినరాదు, వారితో ఏ షరతులనైతే కుదుర్చుకున్నారో, వారితో ఏ వాగ్దానాలనైతే చేసారో, వాటిని నెరవేర్చండి." (కితాబుల్ ఖిరాజ్ – అబూ యూసుఫ్, పేజి 82, ఈజిప్ట్).

హజ్రత్ ఉమర్ పరిపాలనా కాలంలో సాద్ బిన్ అబి విఖాస్ పేరు ప్రఖ్యాతులు గాంచిన గొప్ప సేనాని. హజ్రత్ ఉమర్ ఆయనకు ఓ సుదీర్ఘ ఫర్మానాను పంపుతూ ఇలా ఆదేశించారు. "సైనిక శిబిరాలను జిమ్మీల నివాసాల నుండి దూరంగా ఏర్పాటు చేసుకోండి. ఎవరి నీతి నిజాయితీలపై, సత్యసంధతలపై మీకు విశ్వాసముందో, ఎవరైతే వారిపట్ల అనుచితంగా ప్రవర్తిం చరని మీకు నమ్మకముందో, అలాంటి వారినే వారి బస్తీల్లోకి వెళ్ళటానికి అనుమతించండి.

వారి ధన మాన ప్రాణాల్ని గౌరవించడం, వారిని రక్షించడం మీ విధి, బాధ్యత. ఈ విషయంగా మీరు పరీక్షింపబడుతున్నారు. వారు చేసుకున్న ఒప్పందాన్ని కాపాడడం ఏ విధంగానైతే వారి విధి బాధ్యతనో, అందులో వారేవిధంగా పరీక్షింపబడు తున్నారో, అదేవిధంగా మీరు కూడా వారితో మేలుగా ప్రవర్తించాలి. ఎవరితోనైతే మీరు సంధిచేసుకున్నారో, వారిపై దౌర్జన్యానికి దిగి శత్రువుపై విజయం సాధించడానికి ప్రయత్నించకూడదు." (అల్ అఖదల్ ఫరీద్ - వాల్యూం - 1, పేజి 26, దీనె రహ్మత్, పేజి 250)

జెరూసలెం జయించబడినప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) జెరూసలెం ప్రజలకు ఇచ్చిన హామీలను, రాయితీల్ని బ్రౌన్ ఇలా పేర్కొన్నాడు :

"జెరూసలెంకు చెందిన ముస్లిమేతర ప్రజలకు వారి ధన మాన ప్రాణాలు, వారి సంతానం, వారి ఆరాధనాలయాలు, వారి శిలువలు ఇంకా వారికి చెందిన ఇతర ప్రతి వస్తువుకు రక్షణ ఉంటుందని హామీ ఇవ్వబడుతుంది. వారి భూముల్లో వారి ధర్మంలో ఎలాంటి జోక్యం చేసుకోబడదు. వారి చర్చీలను కూల్చడం గాని, నష్టపరచడం గాని జరుగదు. వాటికి ఇవ్వబడిన ఆస్తులు వాటి గౌరవం యధాస్థితిలో ఉంటాయి. జెరూసలెం ప్రజలకు తమ ధార్మిక ఆచరణలో అన్ని రకాలుగా స్వాతంత్ర్యం ఉంటుంది. వారిని ఏ విధంగాను బాధించడం, హింసించడం జరుగదు." (The Eclipes of Christianity in Asia - By Lawrence E. Brown, page-39)

రెండవ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్ (రజి) తన పరిపాలనా కాలంలో ముస్లిమేతర ప్రజల హక్కు బాధ్యతల గురించి చాల జాగ్రత్త పడేవారు. ఒక్కొక్కటిగా అనేక దేశాలు జయించబడుతున్నప్పుడు సైన్యాధిపతి అయిన హజ్రత్ అబూ ఉబేదా (రజి), హజ్రత్ ఉమర్ (రజి)కు ఒక లేఖ వ్రాస్తూ, 'జయించబడిన పట్టణాలు, వాటిలోని భూములు, తోటలు, చెట్లు తమకు పంచి ఇవ్వాలని ముస్లింలు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. దానిపై హజ్రత్ ఉమర్ (రజి) దివ్య ఖుర్ఆన్‌లోని సూర "హష్ర్" మరియు సూర "తౌబా" నుండి తన వాదనకు సమర్థనను చూపిస్తూ ఇలా బదులిచ్చారు : "అక్కడి ప్రజల నుండి జిజ్‌యా వసూలు చేసుకున్న తరువాత వారిపై ముస్లింలకు ఇంకెలాంటి హక్కులేదు. జయించబడిన ప్రదేశాల భూముల్ని తమలో పంచుకోవడానికి ముస్లింలకు ఏ విధంగానూ హక్కు లేదు. అక్కడి ప్రజలే తమ భూముల్ని సాగు చేసుకుంటారు. వారే ఈ పనిని సమర్థవంతంగా నెరవేర్చ గలరు. వారు జిజ్‌యా ఇస్తున్నంత వరకు వారిని బానిసలుగా చేసుకోరాదు. వారిపై హింసా దౌర్జన్యాలు జరుగకుండా, వారికేవిధమైన నష్టం జరుగకుండా మరియు వారి ఆస్తుల్ని హరించకుండా ముస్లింలను ఆపండి." (కితాబుల్ ఖిరాజ్ - ఇమాం అబూయూసుఫ్, 4-1, 13-6). అంతేకాకుండా ముస్లిమేతరుల నుండి ముస్లింలు భూములను కొనడం కూడా అవాంఛనీయం అని హజ్రత్ ఉమర్ (రజి) ప్రకటించారు.

మరణశయ్యపై కూడా హజ్రత్ ఉమర్ (రజి) కు ముస్లిమేతర ప్రజల చింత వీడలేదు. "నా తరువాత వచ్చే ఖలీఫాలు ముస్లిమేతరులతో సరళంగా, మృదువుగా మెలగాలని నేను

ఆదేశిస్తున్నాను. వారితో చేసిన వాగ్దానాలు పూర్తి చేయాలి. వారి శత్రువుల నుండి వారిని రక్షించాలి. వారి శక్తికి మించిన భారం వారిపై వేయరాదు.” (కితాబుల్ ఖిరాజ్, ఇమాం అబూ యూసుఫ్, 13-2).

జిజ్‌యా చెల్లించిన తరువాత తమకు ప్రాప్తమయ్యే హక్కు, అధికారాల్ని కూడా అప్పటి ముస్లిమేతరులు బాగా అవగాహన చేసుకొని ఉన్నారు. అందుకని అందులో ఏదైనా లోపం, భంగం ఏర్పడితే దీని విషయంగా విజేతలైనా సరే, ముస్లింలను నిలదీసేవారు, సంజాయిషీ అడిగేవారు. ఈ కోవకు సంబంధించిన ఒక సంఘటనను ఈజిప్ట్‌కు చెందిన ఒక బిషప్పు సయీద్ బిన్ అల్ బతరీఖ్, “ఈజిప్ట్ చరిత్ర” అనే తన గ్రంథంలో ఇలా పేర్కొన్నాడు : “క్రీ.శ. 642లో అలెగ్జాండ్రియాను ముస్లింలు జయించుకున్నారు. ఆచారాన్ని అనుసరించి జిజ్‌యా చెల్లించి ఒప్పందాలు చేసుకోబడ్డాయి. ఆ నగరంలోని ఏసు క్రీస్తు విగ్రహాల్లో నుండి ఒక విగ్రహానికి నష్టం వాటిల్లింది. ఎవరో ఒక ముస్లిం సైనికుడు విడిచిన బాణం కారణంగా ఏసుక్రీస్తు విగ్రహం కన్నుకు నష్టం వాటిల్లింది. దీనిద్వారా క్రైస్తవ ప్రజలకు ఎంతో మనస్తాపం కలిగింది. వారు సైన్యాధిపతి అయిన అమరబ్నిల్ ఆస్ (రజి) వద్దకు పోయి దీనికి ప్రతీకారం, పరిష్కారం కావాలని కోరారు. దానికోసం ఏం చేయాలని సైన్యాధిపతి అడుగగా, “మీ ప్రవక్త విగ్రహాన్ని ఒకటి చేసి తమకివ్వాలని, తాము కూడా దాంతో అదే ప్రతీకారం తీర్చుకుంటామని” తెలిపారు. దానిపై సైన్యాధిపతి ఇలా బదులిచ్చాడు : “అలాంటి విగ్రహం చేయనూలేము, దాని అవసరమూ లేదు. మీ ధార్మిక విగ్రహాలను, చిహ్నాలను కాపాడడం నా విధి, బాధ్యత. నేను అందులో సఫలీకృతుణ్ణి కాలేకపోయాను. అందుకని మాలోని ఎవరి కన్నైనా పొడిచి మీ ప్రతీకారం తీర్చుకోండి” అంటూ తన ఛురకత్తిని తీసి వారి చేతిలో పెడుతూ తన కంటిని చూపించారు. ఈ చర్యకు క్రైస్తవులు చలించిపోయారు. ఇంతటి వీరత్వం, ఔదార్యం, మరియు సహనత గల జాతితో పగ తీర్చుకోవటం అన్యాయం, అసమంజసం అనుకుంటూ అక్కడి నుండి తప్పుకున్నారు. అల్ బతరీఖ్ వ్రాసిన గ్రంథం, ప్రచురించబడింది కూడాను. ఈ రచయిత క్రీ.శ. 668 వరకు అలెగ్జాండ్రియాలో ఉన్నాడు. 1903, జనవరిలో జరిగిన ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ యొక్క అధ్యక్షోపన్యాసంలో మౌలానా షిబ్లీ కూడా ఈ సంఘటనను పేర్కొన్నారు. (మిఖాలాతె షిబ్లీ, పే.73, 74 – ఇస్లామ్‌లో పరమత సహనం-సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్రహ్మాన్, పే.101, 102).

ఇదేరకంగా క్రీ.శ.1008లో ‘నిజ్‌బెన్’కు చెందిన మెట్రోపాలిటన్ ఇలియాస్ ఇలా వ్రాశాడు: “ముస్లింల గురించి మా విశ్వాసం ఏమిటంటే, వారి పట్ల ప్రేమ, ఇతర ధర్మాల వారి పట్ల ప్రేమ, విధేయతల కన్నా మమ్మల్ని అత్యధికంగా ప్రభావితం చేస్తుంది. మేము వారి పాలితులం అయినా, కాకపోయినా వారి ప్రవర్తన ఒకేలాగుంటుంది. దీనికి కారణం ఏమిటంటే, మమ్మల్ని రక్షించడం, మాతో మేలుగా ప్రవర్తించడం వారు తమ ధార్మిక విధిగా భావిస్తారు. తమలో నుండి ఎవరైనా పరమతస్థుల్ని బాధిస్తే ప్రళయం రోజు వారి ప్రవక్త ముహమ్మద్ (స)

ఆ (పరమత) బాధితుని తరఫున తమపై దైవం ముందు అభియోగం మోపుతారని వారి ధార్మిక విశ్వాసం." (Eclips of Christianity Assenani - III, part-II)

ఇది ముమ్మాటికీ నిజం. ఈ జిమ్మీల (ముస్లిమేతరుల) గురించి ప్రవక్త మహనీయులు (సల్లం) ముస్లిములను ఇలా హెచ్చరించారు:

"జాగ్రత్త! మీలో నుండి ఎవరైనా ఏ ముస్లిమేతర పౌరునిపై (జిమ్మీపై) అత్యాచారం జరిపినా, అతని అధికారాల్లో లోపం రానిచ్చినా, లేదా అతని శక్తికి మించి అతనిపై భారం మోపినా లేదా అతని అంగీకారం లేనిదే అతనికి సంబంధించిన ఏదైనా వస్తువును లాక్కున్నా, అలాంటి వ్యక్తికి విరుద్ధంగా ప్రళయం రోజు దైవన్యాయస్థానంలో నేను ఆ ముస్లిమేతరుని తరఫున వాదిస్తాను." (అబూదావూద్, కితాబుల్ జిహాద్)

ఈ కారణంగానే ముస్లిం పరిపాలకులు ఎల్లప్పుడూ ముస్లిమేతర, జిమ్మీల, అల్ప సంఖ్యాక పౌరుల హక్కుల్ని కాపాడుతూ, సంరక్షిస్తూ వచ్చారు. ఈ సత్ప్రవర్తనను చూసే అడ్వర్డ్ గిబ్బన్ ఇలా వ్రాయడానికి వివశుడయ్యాడు : "తూర్పు దేశాలకు చెందిన క్రైస్తవులు ముస్లిం రాజ్యాల్లో ఉండడానికి ఇష్టపడేవారంటే దానికి కారణం కేవలం ఒక్కటే. అక్కడ వారికి సంపూర్ణ ధార్మిక స్వేచ్ఛ ఉండేది. దీనికి భిన్నంగా పాశ్చాత్య క్రైస్తవ పరిపాలకులు వారిని రోమన్ క్యాథలిక్కులుగా మారడానికి వివశుల్ని చేసేవారు, లేదా వారిని జీవితరంగం నుండే సమాప్తం చేసేవారు." (Fall of Roman Empire - Advard Gibbon)

హజ్రత్ అలీ పరిపాలనా కాలంలో ఒక జిమ్మీని ఒక ముస్లిం హతమార్చాడు. హంతకుణ్ని, హతమార్చవలసిందిగా హజ్రత్ అలీ ఆదేశించారు. కాని హతుని సోదరుడు, రక్తపరిహారం తీసుకొని, హంతకుణ్ని క్షమించదలిచినప్పుడు హజ్రత్ అలీ ఇలా అన్నారు : "నువ్వేమి చేయదలచుకున్నావో అది నీ ఇష్టం. ఏ వ్యక్తి (జిమ్మీ) బాధ్యత మాపై ఉందో, అతని రక్తం మా రక్తంతో సమానం. ఇంకా అతని పరిహారం కూడా మా పరిహారంతో సమానమే." (సునన్ బైహఖీ - వా-8, పేజి 34, దీనె రహ్మత్, పేజి 246)

జిజ్‌యాకు సంబంధించిన ఈ వివరణ ద్వారా జిజ్‌యా అంటే ఏమిటి? అది ఎవరిపై, ఎప్పుడు, ఎందుకు విధించబడుతుంది? ఇది చెల్లించిన తరువాత వారు పొందే రాయితీలు, రక్షణలు ఏమిటి? మొదలుగాగల విషయాలు తెలుసుకున్న తరువాత ఈ జిజ్‌యా టాక్సు నిరసించదగినదిగా ఎంతమాత్రం అగుపించదు. దానికి బదులు ఇది మానవ హక్కులను పరిరక్షించేదిగా పేర్కొనబడుతుంది. అత్యంత భారమైనదిగా కాకుండా స్వల్ప మొత్తంలోనే చెల్లించి, ముస్లిమేతరులు తమ ధన మాన ప్రాణాలకే కాదు, ధార్మిక సాంఘిక, సాంస్కృతిక సర్వవిధాల స్వాతంత్ర్యానికి అర్హులవుతారు. వారి ధన మాన ప్రాణాల్ని కాపాడడం, వారి ధర్మం, వారి ఆచార వ్యవహారాల్ని గౌరవించడం ఇస్లామీయ ప్రభుత్వం మరియు ముస్లిం సమాజపు విధి, బాధ్యత అయిపోతుంది. దీని గురించి ప్రవక్త మహనీయులు ముస్లింలను ఎంత తీక్షణంగా హెచ్చరించారో కూడా తెలుసుకున్నాము. అందుకని పేరేది పెట్టుకున్నా,

దానివల్ల చేకూరే ప్రయోజనాల్ని, లాభాల్ని అంచనా వేసుకుంటే ముస్లిమేతర సోదరులకు ఇది భారమైనది, అవమానకరమైనది, ఇస్లాం స్వీకరించడానికి వివశుల్ని చేసేదిగా ఎంతమాత్రం కాదనేది రూఢీ అవుతుంది. పై నిందలన్నీ కూడా కేవలం నిరాధారమైనవని కూడా నిరూపితమవుతుంది. దానికి భిన్నంగా ఇది వారికి శుభోదయంగా, ప్రశాంతతను, సర్వరకాల స్వాతంత్రాల్ని ఒనగూర్చే సాధనంగా పేర్కొనబడుతుంది.

మీరు కూడా కాస్త ఆలోచించండి! ప్రతి ప్రభుత్వం తన పాలనలో నున్న పౌరుల నుండి ఏదో ఒక రూపంలో కొంత పన్నును తప్పకుండా వసూలుచేస్తుంది. ప్రభుత్వ కార్యకలాపాలు నడవడానికి ప్రభుత్వ ఖర్చులు భరించడానికి ఏదో ఒక పేరుతో, ఏదో ఒక రూపంలో పన్నులు వసూలు చేయాల్సే ఉంటుంది. అయితే ఒక ఆదర్శనీయమైన ఇస్లామీయ ప్రభుత్వం దైవాజ్ఞలకు, ప్రవక్త ఆదేశాలకు లోబడే వ్యవహరించాల్సి ఉంటుంది. పన్నుల వసూళ్ళకు సంబంధించి ముస్లిం, ముస్లిమేతర అనే భేదభావం ఎందుకు? ఇద్దరితో ఒకే రకమైన పన్నులు వసూలు చేయరాదా? అనే ప్రశ్న కాస్త హేతుబద్ధంగానే కనిపిస్తున్నది. కాని దీన్ని విశ్లేషిస్తే దాని బలహీనత బయటపడుతుంది. ముస్లింలతో వసూలు చేయబడే పన్ను 'జకాత్'గా పిలువబడుతుంది. అంతేకాకుండా ఇది ధార్మికతతో కూడుకున్నది కూడాను. ఇస్లాం మూల నియమాల్లో ఇది మూడవది. అందుకని ఎవరైతే ఇస్లాంనే స్వీకరించలేదో, వారితో కూడా ముస్లింలలాగే 'జకాత్' వసూలు చేయడం సమంజసం, న్యాయం అనిపించుకుంటుందా? అలా చేసినా కూడా విమర్శించే వారు దాన్ని కూడా విమర్శించకుండా వదిలేవారంటారా? అందుకని ముస్లింల కొరకు వేరు, ముస్లిమేతరుల కొరకు వేరుగా నిర్ణయించిన ఈ టాక్సులు, సమంజసంగాను, న్యాయంగాను, హేతుబద్ధంగానూ ఉన్నాయనడంలో సందేహం లేదు. అంతేకాకుండా ఇస్లామీయ ప్రభుత్వానికి అవసరం ఏర్పడితే, ముస్లింలతో ఇంకా అత్యధికంగా వసూలుచేసే హక్కు, అధికారాలు ఉంటాయి. కాని ముస్లిమేతరులతో ఒక్క 'జిజ్‌యా' తప్ప ఇంకేమీ వసూలుచేయరాదే! అటువంటప్పుడు ఈ ఇద్దరినీ ఒకే గాటికి ఎలా కట్టగలం? అందుకని వేరు వేరు చేయడం, విభజించడమే సముచితమూ, సమంజసమూను. ఇక ముస్లిమేతరులు ఈ ఒక్క "జిజ్‌యా" టాక్సు చెల్లిస్తే, ధన మాన ప్రాణాలకు రక్షణ, ధర్మానికి, ధార్మిక విశ్వాసాలకూ రక్షణ, సాంఘిక, సాంస్కృతిక ప్రత్యేకతలకు, వేషభాషలకు, అభిరుచి అలవాట్లకు రక్షణ – ఇంకా ఈ రక్షణ బాధ్యతల్ని స్వయంగా ఇస్లామీయ ప్రభుత్వమే చేపడుతుంది. కేవలం రాతలవరకే, చూపించడానికే (నేటి కాలంలో లాగా) ఈ రక్షణ బాధ్యతలు పరిమితం కాదు, ఇతర ఇస్లామీయ ఆదేశాల్ని, ఆచరణల్ని ఎలా పాటించాలో, దీన్ని కూడా దైవాదేశంగా, ధార్మిక విధిగా పాటించి తీరాలి. ప్రామాణికమైన ఇస్లామీ ప్రభుత్వాలున్నప్పుడు వీటినెలా పాటించి ముస్లిమేతరుల్ని, జిమ్మీలనే కాదు, శత్రువుల్ని సైతం వారెలా సంభ్రమాశ్చర్యాల్లో పడేశారో చూపించడానికి మా వద్ద ఎన్నో చారిత్రక సాక్ష్యాధారాలున్నాయి. వాటిలో నుండి కేవలం ఒక్కటంటే ఒక్కటే మీకు సమర్పిస్తున్నాం.

జిజ్‌యా విషయంలోనే సిరియాలోని "హమ్స్" నగరానికి సంబంధించిన సంఘటన చరిత్రలో ప్రఖ్యాతిగాంచింది. దీన్ని చరిత్రకారులందరూ పేర్కొన్నారు. దాని పూర్వాపరాలు ఏమిటంటే, ద్వితీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్ (రజి) కాలంలో ముస్లిం సైన్యాలు హమ్స్ నగరాన్ని జయించుకున్న తరువాత ఆచారాన్ని అనుసరించి, వారితో జిజ్‌యా వసూలు చేసుకోవటం జరిగింది. కొద్ది రోజులకే రోమన్ చక్రవర్తి "ఖైసర్" (సీజర్) అసంఖ్యాకమైన సైన్యాలతో దండెత్తి వస్తున్నాడని ముస్లిం సైన్యాధ్యక్షుడైన హజ్రత్ అబూ ఉబేదా బిన్ జిరాహ్ (రజి)కు సమాచారం అందింది. సైన్యాధికారుల సలహా ఇంకా రణనీతిని అనుసరించి హమ్స్ నగరాన్ని ఖాళీ చేసి డెమాస్కస్ నగరంలో అతన్ని ఎదుర్కోవాలని నిర్ణయం జరిగింది. వెంటనే సైన్యాధిపతి తన కోశాధికారి అయిన హబీబ్ బిన్ ముస్లిమా (రజి)ను పిలిచి ఇలా అన్నారు : "క్రైస్తవులు ఇంకా ఇతర ముస్లిమేతరులతో తీసుకోబడే జిజ్‌యా వారిని వారి శత్రువుల నుండి కాపాడడానికి ప్రతిఫలంగా తీసుకోబడుతుంది. కాని ప్రస్తుతం మన పరిస్థితి ఎంత సున్నితంగా, క్లిష్టంగా ఉందంటే మనం వారి రక్షణ బాధ్యతలను నెరవేర్చలేం. అందుకని ఈ సందర్భంలో వారి నుండి ఎంతైతే వసూలు చేశామో, అదంతా వారికి తిరిగి ఇచ్చేయండి. ఇంకా వారికి ఇలా చెప్పండి: "మీతో మాకు ఏదైతే సంబంధం ఉండిందో అది ఇంకనూ ఉంది. కాని ప్రస్తుతం మేము మీ రక్షణ బాధ్యతను నెరవేర్చలేము. అందుకని మీరు ఇచ్చిన జిజ్‌యా, ఏదైతే రక్షణకు ప్రతిఫలంగా ఇవ్వబడిందో, అది తిరిగి మీకు ఇచ్చేయడం జరుగుతున్నది." కావున జిజ్‌యా పద్దు క్రింద వసూలుకాబడిన లక్షలాది రొఖ్ఖం తిరిగి ఇచ్చేయడం జరిగింది. దీనితో ఆ క్రైస్తవ ప్రజలు ఎంతగా ప్రభావితులయ్యారంటే, వారు భోరున విలపించసాగారు. ఇంకా ఇనుమడించిన ఉద్రేకంతో "దైవం మిమ్మల్ని తిరిగి ఇక్కడికి చేర్పించుగాక!" అంటూ నినదించసాగారు. ఇక యూదులైతే అంతకన్నా ఎక్కువగానే ప్రభావితు లయ్యారు. వారిలా అన్నారు : "తౌరాత్ సాక్షిగా! మా బొందిలో ప్రాణాలున్నంత వరకు ఖైసర్ (సీజర్) హమ్స్‌ను వశపరచుకోలేడు." ఇలా అంటూ నగర ద్వారాలు మూసేశారు. ఇంకా రక్షణ చౌకీలను ఏర్పాటు చేసుకున్నారు. సైన్యాధిపతి హజ్రత్ అబూ ఉబేదా (రజి) కేవలం హమ్స్ వాళ్ళతోనే ఇలా ప్రవర్తించి ఉండలేదు. అంతకు క్రితం ఏ జిల్లాలైతే జయించబడ్డాయో, ప్రతిచోటా జిజ్‌యా సొమ్మును తిరిగి వారికి ఇచ్చేయమని వ్రాసి పంపించారు." (1) ఇస్లామీయ చరిత్ర-షా మొయినుద్దీన్ అహ్మద్ నద్వి, వా. 1, పే. 159, (2) అల్ ఫారూఖ్ - షిబ్లి నౌమాని, భా. 1, పేజి 163, 164, (3) ఫతూహుల్ బుల్దాన్-బ్లాజరీ, పే. 137. (4) కితాబుల్ ఖిరాజ్ - ఖాజీ అబూ యూసుఫ్, పే. 181 (5) ఫతూహుష్షామ్ - అజ్‌దీ, పే. 138.

T.W. Arnold కూడా The Preaching of Islam అనే తన గ్రంథంలో ఈ సంఘటనను పేర్కొన్నాడు. హమ్స్ ప్రజల ఆవేదనను ఆర్నాల్డ్ ఇలా వర్ణించాడు : "ముస్లింలారా! మీరు వెళ్ళకండి. మా స్వమతస్థులైన బాజన్‌టైన్ ప్రభువులకన్నా మీ ప్రభుత్వమే మాకు ప్రీతికరమైనది. మీరు వ్యవహారంలో నిజాయితీపరులు. మీరు ఎల్లప్పుడూ న్యాయం, సమానత్వాలనే పాటించారు. మీ ప్రభుత్వం వారికంటే వేయిరెట్లు మేలైనది. వారైతే మా ఆస్తిపాస్తులు, గృహాలు సైతం మాతో లాక్కున్నారు."

ఇంకొక ప్రత్యేకంగా పేర్కొనదగిన విషయం ఏమిటంటే నిజమైన ఇస్లామీయ ప్రభుత్వం న్యాయానికి, మానవ హక్కులకు, సమానత్వానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. న్యాయం, సమానత్వాలకు సంబంధించి స్వయంగా ఖుర్ఆన్ ఇలా ఆదేశిస్తుంది. "ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయం చేయండి అని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు." (దివ్యఖుర్ఆన్ 4:58)

".... అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) ఒక వర్గంతో ఉన్నవైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చేయండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది." (దివ్యఖుర్ఆన్-5:8)

"...నీవు గనక తీర్పు చెబితే ఖచ్చితంగా న్యాయంగా చెప్పు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు." (దివ్యఖుర్ఆన్ - 5:42)

".. విశ్వాసులారా! న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకు, మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు ఎంత హాని కలిగించినా సరే..... మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు." (దివ్యఖుర్ఆన్-4:135)

అందుకని న్యాయాన్ని, సమానత్వాన్ని పాటించేటప్పుడు ముస్లింలు, ముస్లిమేతరులు అనే భేదభావాన్ని చూపించడం మహా పాపంగా తలంచబడేది. "మానవకోటి అంతా దైవ కుటుంబమని, ఎవరైతే భూవాసులపై దయతలచడో, వానిపై ఆకాశంలో ఉన్నవాడు (అంటే దైవం) దయదలచడని, న్యాయం చేసేటప్పుడు తన, పర అని; ముస్లిం ముస్లిమేతర అనే భేదభావాల్ని పాటించకండని, ఎవడైతే దీనుని దీనత్వాన్ని చూసి కూడా పట్టించుకోడో, సమాధిలో అతను వంద అగ్ని కొరడాలతో శిక్షించబడతాడని, ఇంకా ఒక్క గడియ న్యాయం చేయడం, అరవై సంవత్సరాల ఆరాధనకన్నా మిన్న" అని - దైవప్రవక్త (స) నుడివిన పై హదీసులు మరియు దివ్యఖుర్ఆన్ ఆదేశాలు ఇస్లామీయ ప్రభుత్వానికి, పాలకులకు మార్గదర్శకాలు. అందుకని జిజ్‌యాకు సంబంధించి ఇస్లాం ఇచ్చిన ఆదేశాలు పాటించబడేవా? అని అనుమానించవలసిన పని లేదు. జిజ్‌యాకు సంబంధించిన ఆదేశాలు ఎంత ఖచ్చితంగా, కఠినంగా ఆచరించబడేవో పైన మీకు చూపిస్తూనే వచ్చాము. అదియునుగాక, జిమ్మీల విషయంగా ప్రవక్త మహనీయులు ముస్లింల నుద్దేశించి చేసిన హెచ్చరికను మీరు చదివే వచ్చారు కనుక దాని గాంభీర్యతను, ఆవశ్యకతను, ధార్మికతను అర్థం చేసుకునే ఉంటారు. మొత్తానికి జిజ్‌యాకు సంబంధించిన భావన, దానివల్ల చేకూరే హక్కుల గురించి వివరంగానే తెలిపామను కుంటున్నాము.

జిజ్‌యాకు సంబంధించి ఇస్లాం ఇచ్చిన ఆదేశాల్ని భారతదేశంలో కాని, లేక ప్రపంచంలో ఇంకెక్కడైనా గాని ఎవరైనా పాలకుడు పాటించకపోతే అది అతని స్వయం కృతాపరాధం.

దానికతనే సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. కాని ఆ వ్యక్తిగత తప్పిదాల్ని, దైవాజ్ఞోల్లంఘనల్ని ఇస్లాంతో ముడిపెట్టి, ఇస్లాం ఇలా బోధిస్తుందని కోపోద్రేకాల్ని రేపడం ఒక నిష్పక్షపాతి అయిన చరిత్రకారుడు చేయవలసిన పని ఎంతమాత్రం కాదు. అంటే అతనికి చరిత్ర జ్ఞానమే లేదని, కేవలం తన రాతలతో మత విద్వేషాల్ని రెచ్చగొడుతున్నాడే తప్ప ఇంకేమీ కాదని భావించవలసి వస్తుంది.

మన వద్ద జిజ్‌యా అత్యంత అపఖ్యాతి పాలయినందువల్ల, అత్యంత వివాదాస్పద అంశంగా పేర్కొనబడుతుంది. కనుక ఇంతవరకు జిజ్‌యా గురించే సుదీర్ఘంగా వివరిస్తూ రావడం జరిగింది.

ఇక ఇప్పుడు ఔరంగజేబ్ వైపు మరలుదాం. భారతదేశంలో ఔరంగజేబ్ కంటే ముందు దాదాపు నాలుగు వందల సంవత్సరాల నుండి జిజ్‌యా వసూలు చేయబడుతున్నది. ఔరంగజేబ్ అధికారాన్ని చేపట్టగానే ప్రజలకు అత్యంత భారంగా మారిన దాదాపు ఎనభై రకాల వివిధ పన్నుల్ని రద్దు పరిచాడు. తను అధికారం చేపట్టిన ఇరవై రెండు సంవత్సరాల తరువాత, ఆర్థిక లోటు వల్ల ముస్లింలపై జకాత్ మరియు హిందువులపై జిజ్‌యాను విధించాడని చరిత్రకారులు తెలుపుతారు. అయితే తన చివరి రోజుల్లో ఈ జిజ్‌యాను పూర్తిగా ఎత్తివేశాడని, అతని మరణం తరువాత అతని వారసులు ఈ ఆదేశాన్ని అమలుపరుస్తూ జిజ్‌యాను వసూలు చేయడం ఆపేశారని కూడా చరిత్రకారులు పేర్కొన్నారు. సైనిక సేవలతో మినహాయింపు కోరేవారు, తమ రక్షణను కాంక్షించేవారిపై జిజ్‌యా విధించబడేది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, మతిలేనివారు, అంధులు, అంగవైకల్యం కలవారు, మందిరాలు, ఆరాధనా లయాల పూజారులు, అర్చకులు, సాధువులు, సన్యాసులు, గృహస్త జీవిత కార్యకలాపాల నుండి వైదొలగి గుహల్లో, మఠాల్లో, ఆశ్రమాల్లో నివసిస్తున్నవారు, నిరుద్యోగులు, బ్రాహ్మణులు, రాజపుత్రులు (సైనికులైనందువల్ల) ప్రభుత్వ ఉద్యోగులు జిజ్‌యా నుండి మినహాయింపబడే వారని తెలుస్తున్నది. ఈ విధంగా బహుకష్టంగా పదిశాతం ముస్లిమేతర ప్రజలపై జిజ్‌యా విధించడం జరిగేది. ముస్లింలతో వారి అవసరాలకు మించివున్న ధన సంపదపై, ఆస్తులపై సాలుకు నూటికి రెండున్నర శాతం చొప్పున జకాత్ వసూలు చేయబడేది. తన చివరి రోజుల్లో జిజ్‌యాను మాత్రం ఎత్తివేశాడంటే, ఇదొక ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి తాత్కాలికంగా రూపొందించిన వ్యవస్థగా కనబడుతున్నది.

ఔరంగజేబ్ కాలం నాటి జిజ్‌యా వ్యవస్థను, దాని వివరాలను తెలుసుకోవడానికి యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ మాజి చైర్మన్ డాక్టర్ సతీష్ చంద్ర రాసిన "The Jizya and the State in India during the 17th Century" అనే పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

పాట్నా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ తన గ్రంథం “ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి”లో జిజ్‌యాపై కూడా ఒక అధ్యాయాన్ని చేర్చారు. దానివల్ల

ఎన్నో కొత్త విషయాలు మన దృష్టిలోకి వస్తున్నాయి. కనుక పాఠకుల కోసం ఆ అధ్యాయాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము.

"ఔరంగజేబ్ కాలంలో 'జిజ్‌యా' అనే పదానికి బాగా ఖ్యాతి లభించింది. జిజ్‌యాను హిందువులకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా వాడి, ఔరంగజేబ్ అత్యధిక హిందువుల్ని ముస్లింలుగా మార్చాడనే మాటను అత్యధిక మంది విద్వాంసులు నిజమనుకొని నమ్మారు.

ఫక్రుద్దీన్ అహ్మద్ లెక్చర్ [1] సందర్భంలో జిజ్‌యా అనేది హిందువులతో తీసుకోబడే ఒక పన్నని, దీనికి ఇస్లామీయ షరీయత్తు అనుమతిస్తుందని సతీష్ చంద్రగారు తెలిపారు. ఇమాం అబూ హనీఫాను అనుసరించి, ఒక ముస్లిం ప్రభుత్వంలో దాని ఆధిపత్యాన్ని, అధికారాన్ని అంగీకరించిన ముస్లిమేతరుల్ని 'జమ్మీ'లంటారు. జమ్మీకి అర్థం ఏమిటంటే ఈ ముస్లిమేతర ప్రజల ధార్మిక, సామాజిక, ఆర్థిక మరియు రాజకీయపరంగా సంరక్షణ బాధ్యత ఆ ముస్లిం ప్రభుత్వంపై ఉంటుంది. దానికి ప్రతిఫలంగా ప్రభుత్వం, వారి నుండి ఒక పన్నును తీసుకుంటుంది. పై దృష్టి కోణంతోనూ, షరీయత్తును అనుసరించి ఔరంగజేబ్ హిందువుల సంరక్షణా గ్యారంటీని (బాధ్యతను) తీసుకున్నాడు.[2] దానికి బదులుగా ఏ టాక్సు అయితే తీసుకున్నాడో అది 'జిజ్‌యా'గా పిలువబడింది.

ఔరంగజేబ్ కాలంలో ఇస్లాం ప్రచార ప్రసారాల కోసం ధార్మికవేత్తల ఒక సంస్థ ఉంటుండేది. అది ప్రభుత్వంకన్నా కూడా తననే ఉన్నతమైనదిగాను, శ్రేష్ఠమైనదిగాను భావించుకుంటుండేది. సామాన్యంగా ఇలాంటివారే హిందూ ధర్మానికి వ్యతిరేకంగా గొంతెత్తారు. కాని ఈ సంస్థకన్నా కూడా గొప్పదైన ఇంకొక సంస్థ ఉండేది. ఈ సంస్థలో ఒకరికంటే ఒకరు అత్యధిక ప్రతిభావంతులు, పలుకుబడి గలవారు, ఇస్లాం పట్ల సంపూర్ణ అవగాహన గలవారుండేవారు. ఈ సంస్థ ధార్మిక ప్రాతిపదికగా హిందూ–ముస్లింలలో ఎలాంటి భేదభావాన్ని పాటించక, అందరినీ ఒకేదేశ పౌరులుగా గుర్తించేది. ఇలాంటి వారి వల్లనే యోగ్యత ననుసరించి ఔరంగజేబ్ కాలంలో హిందూ–ముస్లింలిద్దరికీ లాభం చేకూరింది మరియు ఈ ఇరువురి మధ్య సుహృద్భావ సంబంధాలు ఏర్పడ్డాయి. నేటి కాలం లాగా, అప్పుడు పెద్ద సంఖ్యలో మతకలహాలు జరుగక పోవడానికి కారణం ఇదే.

ఔరంగజేబ్ కాలంలో జరిగిన యుద్ధాలన్నీ కూడా ఒక జాతికి లేక వర్గానికి వ్యతిరేకంగా జరిగినవి కాకుండా ప్రభుత్వాన్ని సుదృఢపరిచే ఉద్దేశ్యంతో జరిగాయి. ధర్మం లేక ఒక ప్రత్యేక జాతిని దృష్టిలో పెట్టుకొని ఈ పోరాటాలే కనుక జరిగి ఉంటే ఔరంగజేబ్ ముస్లిం రాజ్యాలైన గోల్కొండ బీజాపూర్‌లపై ఎన్నటికీ దాడి జరిపేవాడు కాదు.

ఈ సందర్భంగానే సతీష్ చంద్రగారు తెలిపేదేమంటే గోల్కొండపై దాడి జరిపే విషయంగా ఔరంగజేబ్ సుప్రీం ఖాజీతో ఫత్వా కోరగా అతను ఇస్లాంను అనుసరించి ముస్లింలందరూ ఒక్కటే గనక ఒక ముస్లిం రాజ్యంపై దాడి జరుపరాదని తెలిపాడు. దానిపై ఔరంగజేబ్ దర్బారు ఖాజీని (సుప్రీం ఖాజీని) పదవీచ్యుతుణ్ణి చేసి, అత్యధిక విద్యాజ్ఞానాలు

గలిగిన ఇంకొక ఖాజీని నియమించాడు. అతను శత్రువైన ముస్లిం రాజ్యంపై దాడి జరపడం సమంజసమేనని తెలిపాడు. ఈ సంఘటన కూడా ఔరంగజేబ్ నిస్పక్షపాత వైఖరికి అద్దం పడుతుంది.

"హిందువులపై జిజ్‌యా విధించడం సమంజసం కాదు" అనేకంటే ముందు తన పట్టాభిషేకం జరిగిన ఇరవై రెండు సంవత్సరాల తరువాత 1679లో అతను జిజ్‌యా విధించాడనే విషయంపై మనం దృష్టి సారించడం సముచితంగా ఉంటుంది.[3] ఇంకా తన మరణానికి కొద్ది రోజుల ముందే జిజ్‌యాను సమాప్తం చేయాలని ఆదేశించాడు. ఈ ఆదేశాన్ని అతని మరణం తరువాత పూర్తిగా ఆచరించడం జరిగింది.[4] ముస్లిమేతర ప్రజలకు సామాజిక, ఆర్థిక మరియు ధార్మికపరంగా సంరక్షించడం తన వల్ల సాధ్యం కావడం లేదని గ్రహించిన వెంటనే, ఔరంగజేబ్ జిజ్‌యాను సడలించేశాడు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సైనికులు (రాజపుత్రులు) స్త్రీలు, అంధులు, అంగవైకల్యం గలవారు, పిల్లలు, వృద్ధులు, పేదలు, వరదలు, కరువుకాటకాలు, అంటురోగాలతో ప్రభావితమైన ప్రాంత ప్రజలు జిజ్‌యా నుండి మినహాయింపబడేవారు. క్లుప్తంగా చెప్పబోయేదేమంటే బహుకష్టంగా పది శాతం ధనిక హిందువుల నుండి సరాసరిగా నూటికి రెండున్నర చొప్పున జిజ్‌యా వసూలు చేయబడింది.

జిజ్‌యా విధించడం వల్లనే హిందువులు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా తిరుగబడ్డా రనడం వాస్తవం కాదు. రాజపుత్రులతో సత్సంబంధాలుండాలని ఔరంగజేబ్ సతతం ప్రయతిస్తూనే ఉన్నాడు, కాని అందులో అతను సంపూర్ణంగా సఫలం కాలేకపోయాడు. అయినప్పటికీ కూడా అతను అక్బర్ చక్రవర్తి లాగా భయపడుతూ, సందిగ్ధంగా లేక అనిశ్చిత పద్ధతిని అవలంబించలేదు. అక్బర్‌కు సంబంధించి ఒక విషయం చెప్పడం అనుచితం కాదనుకుంటాము. అదేమిటంటే రాజపుత్రుల తిరుగుబాటును అక్బర్ ప్రారంభంలో అణచివేశాడు. కాని 1561 తరువాత అతను తన యుక్తిని మార్చుకున్నాడు. ఖడ్గబలంతో రాజపుత్రుల్ని పూర్తిగా వశపర్చుకోవడం అతనికి సంభవం అనిపించలేదు.[5] అందుకని అతను వైవాహిక సంబంధాలు, ధార్మిక స్వాతంత్ర్యం, జిజ్‌యా నుండి మినహాయింపు (1564) యాత్రా సుంకాన్ని రద్దు చేయడం (1562) లాంటి పద్ధతులతో ఉత్తర భారతానికి చెందిన శక్తిమంతులైన రాజపుత్రులతో సంబంధాల్ని మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నించాడు.[6]

భారత దేశంలో ముస్లింల పరిపాలనా కాలం నాలుగు వందల సంవత్సరాల వరకుంది. అందులో అత్యధిక సమయాల్లో జిజ్‌యా వసూలు చేయడం జరిగింది. అయినాగాని ప్రాచీనంగా వస్తున్న హిందువుల ధార్మిక విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు మరియు వారి ధార్మిక స్థలాల అస్తిత్వం యథాతథంగా ఉంటూనే వచ్చింది.[7] జిజ్‌యా కారణంగా పెద్ద సంఖ్యలో హిందువుల మతం మార్పిడి జరిగినట్లు మనకెలాంటి సాక్ష్యాధారాలు లభించవు. అలా ఒకవేళ జరిగి ఉన్నట్లయితే 'ఇస్లాం ప్రియులు' దాన్ని కొండంతలు, గోరంతలుగా చేసి వర్ణించకుండా ఉండలేకపోయేవారు.

బలహీనపడుతున్న ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి ఔరంగజేబ్ జిజ్‌యాను ప్రతిపాదించాడని అనేక విద్వాంసులు పేర్కొన్నారు. అయితే ఇక్కడో విషయాన్ని గమనించాల్సి ఉంది. బలహీనపడిన ఆర్థిక పరిస్థితిని ఔరంగజేబ్ గద్దెపై కూర్చుండగానే తెలుసుకోగలిగాడు. కాని జిజ్‌యా పట్టాభిషేకం జరిగిన ఇరవై రెండు సంవత్సరాల తరువాత ప్రతిపాదించాడు.

సింహాసనంపై కూర్చున్న రెండవ సంవత్సరమే, వారసత్వం కోసం జరిగిన యుద్ధం కారణంగా, ఉత్తర భారతంలో ఆహార పదార్థాల పరిస్థితి దుర్భరంగా మారినట్లు ఔరంగజేబ్ తెలుసుకున్నాడు. కరువు కాలంలో లాగా అత్యంత అధికధరలకు ఆహార పదార్థాల అమ్మకాలు జరిగేవి. సామ్రాజ్యమంతటిలో అడుగడుగుకు దిగుమతి సుంకాల విధింపువల్ల ఈ కష్టాలు ఇంకా పెరిగిపోయాయి. నదీతీరాలపై, కొండల మధ్య త్రోవలపై, ఇంకా వివిధ సూబాల సరిహద్దులపై సరుకులోని పదవ భాగం రహదారి[8] అనగా త్రోవల్ని కనిపెడ్తూ ఉండడం, వాటిని సురక్షితంగా ఉంచడానికి ప్రతిఫలం తీసుకోబడేది. ఆగ్రా, ఢిల్లీ, లాహోర్ మరియు బుర్‌హాన్‌పూర్ లాంటి పెద్ద నగరాలలో బయటి నుండి తెచ్చిన ఆహార పదార్థాలపై "పండారి" పేరుతో సుంకం వసూలు చేయబడేది.

ప్రత్యక్షంగా, పరోక్షంగా మొగలు పాలన క్రింద నున్న ప్రాంతాల్లో ఔరంగజేబ్ రహదారి మరియు పండారి అనబడే ఈ సుంకాల్ని ఎత్తివేయించాడు. జమీందారుల్ని, జాగీరుదారుల్ని కూడా అలాగే చేయడానికి ఆదేశించాడు. రాజాజ్ఞలు శిరసావహించబడ్డాయి. ఫలితంగా ఆహార పదార్థాల కొరత ఉన్న ప్రాంతాల్లో అవి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేరసాగాయి. బాగా పెరిగిపోయిన ఆహార పదార్థాల ధరలు పడిపోయాయి. ప్రజలకు అసౌకర్యాన్ని, చికాకును కలిగిస్తున్న ఇతర అనేక టాక్సుల్ని 1673లో ఔరంగజేబ్ ఎత్తివేయించాడు.

తన పరిపాలన ప్రారంభమైన పదమూడవ సంవత్సరం ఔరంగజేబ్ రాజ్యపు రాబడి మరియు ఖర్చుల లెక్కలు తీయించిచూడగా, రాబడికన్నా ఖర్చులే ఎక్కువగా తేలాయి. అందుకని ఖర్చుల్లో కోత విధించడం జరిగింది.[9] దీని ప్రభావం రాజపరివారంపై కూడా పడింది. పట్టాభిషేకం ఇరవై ఒక్కటవ సంవత్సరంలో రాజదర్బారు అలంకరణలో తగ్గింపు చేయడం జరిగింది. ఉద్యోగులకు వెండి సిరాబుడ్ల స్థానంలో పింగాణి బుడ్లు ఇవ్వబడ్డాయి. సర్వసభాప్రాంగణంలో బంగారు రేలింగ్ స్థానంలో నీలివర్ణంగల రాళ్ళ రేలింగ్ చేయబడింది. బంగారం, వెండితో చేయబడిన సుగంధపు పాత్రలు (అత్తరు పాత్రలు), ఇలాంటివే ఇతరత్రా పాత్రలు తొలగించబడ్డాయి. రాజకర్మాగారాల్లో బంగారు వస్త్రాల నిర్మాణం ఆపేయడం జరిగింది.[10] ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని, చరిత్రలు రాస్తున్న ప్రభుత్వ శాఖల్ని మూసేయడం జరిగింది.[11] చిన్న చిన్న సుంకాల్ని రద్దు చేస్తూ అతను ఫర్మానాను జారీచేశాడు.[12] ఈ కారణంగా కేవలం ప్రభుత్వ ప్రత్యక్ష అధీనం(ఖాల్సా)లో నున్న భూముల[13] రాబడిలో ఇరవై ఐదు లక్షల నష్టం చేకూరింది.[14] కాని యూరోపియన్ వ్యాపారులు విదేశాలతో దిగుమతి, ఎగుమతి చేసుకుంటున్న సరుకులపై నాలుగు శాతం సుంకం వసూలు చేయబడేది. ఇంత

అధిక సుంకాన్ని అంతకు ముందు వచ్చిపోయిన మొగలు పాలకులెవ్వరూ విధించి ఉండలేదు.[15] విదేశీ వ్యాపారుల ద్వారా జరుపబడే వ్యాపార వాణిజ్యాల్ని భారతదేశం పట్ల ప్రమాదకరంగా గుర్తించడం ఔరంగజేబ్ దూరదృష్టికి తార్కాణంగా పేర్కొనవచ్చు. ఏ చిన్న సుంకాలనైతే ఎత్తివేస్తూ ఔరంగజేబ్ ఆదేశాలు జారీచేశాడో, జాగీర్దార్లు వాటిని వసూలు చేయడం మానలేదు. అలా చేస్తే వారి రాబడిలో కూడా క్షీణత (తగ్గుదల) వస్తుంది.[16] ఔరంగజేబ్ ఆదేశాల్ని రాజా జస్వంత్ సింగ్ లాంటి కొందరు నాయకులు మాత్రమే పాటించారు. అత్యధిక మంది నాయకులు ఈ సుంకాల్ని మాఫీ చేయడం వల్ల ఏర్పడే నష్టాన్ని భరించాల్సిందిగా ఔరంగజేబ్‌ను డిమాండ్ చేశారు.[17] ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ చట్టాన్ని సాకుగా చూపిస్తూ జిజ్‌యాను బలవంతంగా వసూలు చేయడం జరిగిందనే మాట న్యాయం అనిపించడం లేదు.[18]

ఔరంగజేబ్ కాలంలో వసూలు చేయబడిన జిజ్‌యా మొత్తమెంతో తెలుసుకోవడానికి మనవద్ద ఆధారాలు లేవు. ఢిల్లీ సుల్తానులు కూడా జిజ్‌యా వసూలు చేశారని ఇంతకు ముందే తెలిపాము. మొగలుల కాలంలో బాబర్, హుమాయూన్, అక్బర్ (ప్రారంభకాలం) మరియు ఔరంగజేబ్ కాలాల్లో జిజ్‌యా వసూలు చేయబడింది. జహాంగీర్ మరియు షాజహాన్ కాలాల్లో జిజ్‌యా వసూలు చేయబడలేదు.[19]

ఔరంగజేబ్ కాలంలో వసూలు చేయబడిన జిజ్‌యా సంవత్సరానికెంతో అనే విషయంలో విద్వాంసులు తమ అనుమానాన్ని వ్యక్తం చేశారు. 1681లో జిజ్‌యా ముఖ్యాధికారి మీర్ అబ్దుల్ కరీం గడిచిన సంవత్సరంలో బుర్‌హాన్‌పూర్ నగరం నుండి ఇరువై ఆరు వేలు వసూలు చేసినట్లు మరియు మూడు నెలలకు గాను బుర్‌హాన్‌పూర్ సగం నగరవాసులు లక్షా ఎనిమిదివేలు తీర్చాల్సి ఉండేదని ఖాఫీ ఖాన్ తెలిపాడు.[20] పంటలు నష్టపోయినప్పుడల్లా క్రమం తప్పకుండా జిజ్‌యా నుండి మినహాయింపు ఇవ్వడం జరిగేది.[21] క్రైస్తవ వ్యాపారులతో జిజ్‌యా తీసుకోబడేది కాదు, ఎందుకంటే వారి సంరక్షణా బాధ్యతను ఔరంగజేబ్ స్వీకరించి ఉండలేదు. కాని దానికి బదులుగా వారితో ఒకటిన్నర శాతం పెంచి (అంటే జిజ్‌యా రెండున్నర శాతం కన్నా ఒకటిన్నర శాతం పెంచి నాలుగు శాతం) సుంకం తీసుకోబడేది.[22] సర్ జదూనాథ్ సర్కారును అనుసరించి[23] జిజ్‌యా పరిమాణాన్ని నిర్ణయించడానికి ప్రజల్ని మూడు వర్గాలుగా విభజించడం జరిగింది. మొదటి క్యాటగిరీలో పదివేల దిర్హంలకు మించివున్న ధనిక వర్గాలు వస్తాయి. ఖురేషిని అనుసరించి ఒక దిర్హం విలువ ఐదువందల గ్రేన్ వెండితో సమానము. ఇర్ఫాన్ హబీబ్‌ను అనుసరించి[24] (12) దిర్హంలు ఆ కాలపు మూడు రూపాయల రెండణాలకు సమానమయ్యేది. రెండవ క్యాటగిరీలో పదివేల దిర్హంలకన్నా తక్కువ మరియు రెండువందల దిర్హంలకు పైబడినవారు వచ్చేవారు. రెండువందల దిర్హంల కన్నా తక్కువ ధనమున్న వారు మూడవ క్యాటగిరీ క్రింద వచ్చేవారు. జిజ్‌యా పేరుతో మొదటి క్యాటగిరీ వారు 48, రెండవ క్యాటగిరీ వారు 24 మరియు మూడవ క్యాటగిరీవారు 12 దిర్హంలు ఇవ్వాల్సి వచ్చేది. సర్ జదూనాథ్ సర్కార్ పేర్కొన్న ఈ లెక్కను పరిగణనలోకి తీసుకుంటే పదివేల దిర్హంలపై 48 దిర్హంలు జిజ్‌యా తీసుకుంటే అది అరశాతం కన్నా తక్కువ నిష్పత్తి వస్తుంది. ఇక 200

దిర్హాంలపై 12 దిర్హాంలు లెక్కిస్తే 6 శాతం నిష్పత్తి వస్తుంది. ఇక వీటన్నిటినీ కలిపి సరాసరి నిష్పత్తి తీస్తే రెండున్నర శాతం నిష్పత్తితో జిజ్యా వసూలు చేసినట్లు విదితమవుతుంది. షరీయత్తును అనుసరించి ఇదే సరియైన నిష్పత్తి కూడాను. ఇదే నిష్పత్తి ముస్లింలకు కూడా వర్తించేదని తెలుపడం సమంజసమను కుంటున్నాము. అయితే ఈ రెండింటి పేర్లు మాత్రం వేర్వేరుగా ఉండేవి. ముస్లింలతో తీసుకోబడే పన్నును "జకాత్"గా పిలిస్తే, హిందువుల నుంచి తీసుకునే పన్ను "జిజ్యా"గా పిలువబడింది. ఇక్కడో ఆసక్తికరమైన విషయం తెలుపడం అనివార్యమనుకుంటున్నాము. ఈ జిజ్యా పన్ను ఇంకా జిజ్యా పేరుతో సహా ఇది ఇస్లాం ప్రత్యేకత కాదు, దానికి విరుద్ధంగా భారత దేశం లాగే ఇంకొక ముస్లిమేతర దేశం, ముస్లిమేతర శక్తి చట్టం నుండి దీన్ని (జిజ్యాను) గ్రహించడం జరిగింది. అంటే ఇస్లాంకు పూర్వం ఉన్న ఇరాన్ దేశం నుండి.

ఇంకొక విషయం ఏమిటంటే జిజ్యా అనేది కేవలం ముస్లిం రాజ్య సరిహద్దు లోపల ఉండే ముస్లిమేతరుల నుండే స్వీకరించబడేది. ఇక ఎవరైతే ఇస్లామీయ రాజ్య సరిహద్దులకు ఆవల ఉండేవారో, వారు ఇస్లాం వ్యతిరేకులుగా పరిగణింపబడేవారు. అందుకని వారితో ఏ రకమైన సంబంధాలు పెట్టుకునే ప్రశ్నే జనించదు. జిజ్యా ద్వారా సేకరించబడిన ధనం "ఖజానాయె జిజ్యా" అనే పేరుగల ఒక ప్రత్యేక కోశాగారంలో జమచేయబడి ప్రజా సంక్షేమ కార్యాల్లో వినియోగించబడేది. (విధవల, అనాధల ఆర్థిక సహాయం కూడా అందులో చేరి ఉండేది). ఈ వాస్తవాల దృష్ట్యా, జిజ్యా ద్వారా ఔరంగజేబ్ తన ఆర్థిక సంకటాల్ని తగ్గించు కున్నాడని కొందరు విద్వాంసులు వెలిబుచ్చిన అభిప్రాయాల్ని ఖండించవలసి వస్తుంది.[25]

జిజ్యా రాబడిని పుణ్యకార్యాలు, ప్రజాహితకార్యాల్లో వినియోగించబడేదనే దానికి సంబంధించి, ఇస్లాం ఆదేశాల ప్రకారం శారీరకంగా బలహీనులు, అంగవైకల్యం గల ప్రజలందరి భోజనాది అవసరాలను పూర్తి చేయడం ప్రభుత్వ విధి, బాధ్యత అని తెలుస్తుంది. ప్రత్యేకించి కొద్దోగొప్పో ఇస్లామీయ షరీయత్తు లేక చట్టపు జ్ఞానం కలిగిన వారిని ఆదుకోవడం అనివార్యం. వీరే కాకుండా విధవలు, అనాధలు మొదలగు వారికి భోజనాదులు సమకూర్చడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించబడేది. బాల్బన్ మొదలుకొని అక్బర్ కాలం వరకు ఏదో ఒక రకంగా ఈ వ్యవస్థ కొనసాగింది. ఔరంగజేబ్ కాలంలో పరిస్థితులు గడ్డుగా మారాయి. ఇర్ఫాన్ హబీబ్ ఇలా తెలుపుతున్నారు.[26] "ముస్లిమేతరులపై జిజ్యా లాంటి ప్రభుత్వ పన్ను విధించిన కేవలం రెండు సంవత్సరాల తరువాత, ముస్లింలపై చక్రవర్తి ఆదేశానుసారం ప్రభుత్వ పన్నును విధించడం జరిగింది. ఖురాన్‌లో ఇవ్వబడిన ఎక్కువకు ఎక్కువ మినహాయింపును వదలి, ముస్లింలవద్ద అంతకన్నా ఎక్కువున్న సంపదపై జకాత్ మరియు ఇతర టాక్సులు విధించాలని ఫర్మానా జారీచేయబడింది. ఈ విధంగా తన పట్టాభిషేకం ఇరవై ఐదవ సంవత్సరం ఔరంగజేబ్ ముస్లింలపై జకాత్ పన్నును తిరిగి విధించాడు."

## ఇస్లాం స్వీకరణ

"ప్రొఫెసర్ శ్రీరాం శర్మ తన గ్రంథం "మొగల్ శాసకోఁ కీ ధార్మిక్ నీతి" పేజి 1990-91లో ఔరంగజేబ్ కాలంలో వివిధ కారణాలతో తమ ధర్మాన్ని త్యజించి ఇస్లాంను స్వీకరించిన వారి వివరాలను వివిధ ఆధారాల సహాయంతో సేకరించి సమర్పించారు.

"1667 ఏప్రిల్ నెలలో వడ్డీ తింటున్నారనే ఆరోపణపై నలుగురు హిందూ న్యాయవాదుల్ని (ఖానూన్ గోయోఁ) వారి హోదాల నుండి తొలగించడం జరిగింది. శిక్షకు గురి అవుతామనే భయంతో వారు ఇస్లాంను స్వీకరించారు. చౌకీగడ్ ఇన్‌చార్జ్ (హోదా) పొందవచ్చనే దృష్టితో భూప్‌సింగ్ తన సోదరుడు మురారిదాస్‌ను ఇస్లాం స్వీకరించమని సలహా నిచ్చాడు. కాని పేరాశతో కూడిన తన సోదరుని సలహాను అతను అంగీకరించకుండా హిందువుగానే ఉండి పోయాడు. 1681లో మనోహర్‌పూర్‌కు చెందిన జమీందారుడు దేవీచందర్ రెండు వందల యాభైమంది సైనికుల జాగీరును పొందవచ్చనే ఆశతో ఇస్లాంను స్వీకరించాడు. రాయ్‌గడ్‌కు చెందిన అమీన్ మరియు ఫౌజ్‌దార్ (సైనికాధికారి) అయిన లాజ్‌పత్ తన అప్పును తప్పించుకోవడానికి మరియు 250కి బదులు 400 మన్సబును పొందడానికి 1704 జనవరి 15న ఇస్లాం స్వీకరించాడు. రాజా ఇస్లాం ఖాన్ తన సోదరి వివాహం ఔరంగజేబ్ కుమారునితో జరుపవచ్చనే ఆశతో తన హిందూ ధర్మాన్ని త్యజించి ఇస్లాం స్వీకరించాడు, కాని ఈ వివాహం జరుగలేకపోయింది. జాగీరును పొందవచ్చనే ఆశతో రాంపూర్‌కు చెందిన మన్సబుదారు గోపాల్‌సింగ్ కుమారుడు రతన్‌సింగ్ ఇస్లాం స్వీకరించాడు. పల్‌మెయూకు చెందిన రాజు అనేక రాయితీలను తృణీకరించాడు, కాని ఇస్లాం స్వీకరించలేదు."

ఈ విధంగా ప్రమోషన్లు పొందడానికి, ఆర్థిక ప్రయోజనాల ఆశలతో మాత్రమే కొందరు హిందువులు ఇస్లాంను స్వీకరించారు. ఔరంగజేబ్ కాలంలో ఖడ్గ బలంతో గొప్ప సంఖ్యలో హిందువుల్ని ముస్లింలుగా మార్చారనే సుప్రసిద్ధ కాని నిరాధారమైన ఆరోపణను నిజమని నిరూపించడానికి సంఖ్యలుగాని, సాక్ష్యాధారాలు గాని లేవు."

(ఔరంగజేబ్ - ఏక్ నయీ దృష్టి - డాక్టర్ ఓంప్రకాశ్ ప్రసాద్ - పేజి 54-60)

వాస్తవానికి విరుద్ధంగా ఎంతగా దుష్ప్రచారం చేసినా అది తన వాస్తవికతను అంగీకరింపజేసి తీరుతుంది. పాశ్చాత్యులే ఈ జిజ్‌యాకు వ్యతిరేకంగా రకరకాల దుష్ప్రచారాలు చేశారు. అయితే ఈ పాశ్చాత్య విద్వాంసుల్లోనే, సత్యాన్ని వాస్తవాన్ని నిర్భీతిగా అంగీకరించి, తమ వారే సాగించిన ఈ దుష్ప్రచారాన్ని ఖండించి, వాస్తవాలను ప్రపంచం ముందుంచిన పాశ్చాత్య విద్వాంసులు కూడా ఉన్నారు. వారిలో నుండి కొందరు పాశ్చాత్య విద్వాంసులు జిజ్‌యా గురించి వెల్లడించిన అభిప్రాయాల్ని మన పాఠకుల ముందుంచు తున్నాము.

తన చారిత్రక గ్రంథమైన "బ్రిటిష్ సామ్రాజ్య శాసనం" మొదటి భాగం, అధ్యాయం - 2లో మిస్టర్ హాలమ్ ఇలా రాశారు:

"ఇస్లామీయ ధర్మం ప్రజలకు విశదపర్చడం జరిగింది. అంతేకాని వారిని ఇష్టం లేకపోయినా స్వీకరించాలని బలవంతం చేయలేదు. ఇక ఏ వ్యక్తి అయితే పరిపూర్ణ హృదయంతో దీన్ని స్వీకరించాడో, విజేత జాతికి లభించి ఉన్న హక్కు, అధికారాలే అతనికి కూడా లభించాయి. ప్రపంచ ఆరంభం నుండి, దైవప్రవక్త కాలం వరకు విజేతలైన జాతులు తమ పరాజిత జాతులపై రుద్దుతూ వచ్చిన షరతుల నుండి ఈ ధర్మం వారిని (పరాజిత జాతుల్ని) విముక్తుల్ని చేసింది. ఇస్లామీయ నియమాల ననుసరించి, ఇస్లామీయ రాజ్య అధీనంలోకి, దాని పాలన క్రిందికి వచ్చిన ముస్లిమేతరులందరికీ అన్ని రకాల ధార్మిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించబడ్డాయి. 'లా ఇక్రాహఫిద్దీన్' (ధర్మావలంబనలో ఎలాంటి బలాత్కారం లేదు) అనే బహిరంగ ప్రకటన ప్రమాణాలతో, నిరాకరించలేని తర్కవాదంతో సహా ఈ స్వాతంత్ర్యం వారికి ప్రసాదించబడింది. ఇస్లాంలో ఇతర ధర్మాల వారికి ధార్మిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇవ్వటం, వారితో సహృదయంతో వ్యవహరించటానికి సంబంధించి అవతరించిన ఈ ఆయత్ ఏదో ఒక పిచ్చివాని కూతకాదు, లేక ఏదో ఒక ధార్మికుని నిరాధారమైన ఆలోచన అంతకన్నా కాదు. దానికి భిన్నంగా తాను తలచిన నియమాలను జారీచేసి, ఆచరింపచేసే శక్తిసామర్థ్యాలు కలిగిన ఒక సామ్రాజ్య శాసకుని ద్వారా ప్రతిపాదించబడిన సిద్ధాంతమిది. (దైవం ద్వారా ప్రసాదింపబడిన ఖుర్ఆన్ సిద్ధాంతమిది, అనటం ఉపయుక్తమైన పదం – రచయిత).

ధర్మంలోను, సాంస్కృతిక రాజనీతిజ్ఞతలోను, ధార్మిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తామని అనేకమంది నాయకులు, వర్గాలు ప్రలోభపెట్టారు. కాని వారు వివశులు, అవసరార్థులుగా ఉన్నంతవరకే దాన్ని కార్యాచరణలో పెట్టడానికి తాకీదు చేస్తుండేవారు. అయితే ఇస్లామీయ ప్రవక్త ధార్మిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తానని ప్రలోభ పెట్టడం కాకుండా, దాన్ని ధార్మిక నియమాల్లోనే చేర్చివేశారు.

ముస్లింల రాజ్యం మరియు అధికార పరిధిలోనికి వచ్చిన ప్రతి జాతితో దయ మరియు ప్రేమపూర్వకంగా వ్యవహరించే సిద్ధాంతాన్ని ఉపయోగించడం జరిగింది. ఇంకా ప్రతి జాతితో, దాని స్వంత ధార్మిక ఆచార వ్యవహారాలను నిరాటంకంగా సాగించుకోవటానికి, దాని సంరక్షణ నిమిత్తం నామమాత్రమైన ఒక పన్నును (జిజ్‌యాను) స్వీకరించడం జరిగింది. ఇక ఎప్పుడైతే ఒకసారి ఈ పన్ను నిర్ణయమైపోయేదో, ఆ పిదప ఆ జాతి ధార్మిక విలువల్లో, ధార్మిక ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం ధర్మవిరుద్ధంగా మరియు నిషేధితంగా పరిగణించబడేది."[27]

సుప్రసిద్ధ ఫ్రెంచ్ విద్వాంసుడు, డాక్టర్ గెస్టావ్ లీబాన్ తన ప్రఖ్యాత గ్రంథం "Civilization des Arabes" (Arab Culture) లో ఇలా రాశాడు :

"మనం అరబ్బుల విజయంపై మరియు వారి యొక్క సాఫల్యాలకు కారణాలేమిటని పరిశీలించినప్పుడు ఒక విషయం అంటే ధార్మిక ప్రచారంలో ఖడ్గంతో ఎలాంటి సహాయం

తీసుకోబడలేదనే విషయం స్పష్టమైపోతుంది. దీనికి కారణం ఏమిటంటే, ముస్లింలు ఎల్లప్పుడు కూడా పరాజిత జాతుల్ని వారి ధార్మికాచరణలో స్వతంత్రంగా మెలగనిచ్చేవారు. కొన్ని క్రైస్తవ జాతులు తమ విజేతల ధర్మాన్ని స్వీకరించాయి, చివరికి వారి భాషను సైతం అవలంబించాయి అంటే దానికి కారణం కేవలం ఒక్కటే. వారు తమను ఇంతవరకు పరిపాలిస్తూ వచ్చిన తమ స్వజాతి పాత పాలకులకన్నా ఈ కొత్త పాలకుల్ని అత్యధిక సత్యవంతులుగా గుర్తించటమే. అంతేకాకుండా వారి ధర్మాన్ని తమ ధర్మంకన్నా అధిక సత్యాన్వితమైనదిగా, అత్యంత సరళమైనదిగా గుర్తించారు. ఏ ధర్మం కూడా ఖడ్గబలంతో వ్యాపించజాలదనే విషయం చారిత్రాత్మకంగా నిరూపితమై పోయింది. ఎప్పుడైతే క్రైస్తవులు స్పెయిన్‌ను (తిరిగి) అరబ్బుల నుండి జయించు కున్నారో అప్పుడు ఈ పరాజిత జాతి ప్రాణాలు వదులుకున్నదే తప్ప ధర్మాన్ని మార్చుకోవటానికి అంగీకరించలేదు. (పేజి 69)

"ముస్లిం ఖలీఫాలు రాజ్యవిస్తరణలో ఎప్పుడూ కూడా ధార్మిక ప్రచారం కోసం ఖడ్గాన్ని ఉపయోగించలేదు. వారు బలపూర్వకంగా తమ ధర్మప్రచారం చేసేవారని పదే పదే చెప్పబడిన దానికి భిన్నంగా వారు పరాజిత జాతుల్ని వారి ధర్మాన్ని, సంస్కృతిని, వేషభూషణల్ని అన్ని విధాలుగా గౌరవిస్తామని హామీ ఇచ్చేవారు. ఇంకా ఈ స్వాతంత్ర్యానికి బదులుగా అత్యంత స్వల్పమైన ఒక టాక్సు (జిజ్‌యా)ను వారి నుండి తీసుకునేవారు. వారి పాత పాలకులు వసూలు చేసిన పన్నులతో పోల్చినప్పుడు ఇదెంతో స్వల్పంగా ఉండేది."(పేజి 73)

"(ఇస్లామీయ) సైన్యాధిపతి అమ్రూ బిన్ అల్ ఆస్ ఈజిప్షియన్లతో వ్యవహరించిన తీరు ఇంతకన్నా తక్కువేం కాదు. వారికి సంపూర్ణ స్వాతంత్ర్యం, ఎలాంటి పక్షపాతం లేని పూర్తి న్యాయం, ఆస్తిపాస్తులకు సంబంధించిన పూర్తి హక్కులు ఇవ్వబడతాయని ఆయన వారితో (ఈజిప్షియన్లతో) వాగ్దానం చేశారు. ఇంకా గ్రీకు చక్రవర్తులు వారితో వసూలు చేస్తూ వచ్చిన క్రూరమైన, అపరిమితమైన పన్నులకు బదులు సంవత్సరానికి ఒకసారి వారితో జిజియా తీసుకోబడుతుందని హామీ ఇచ్చారు. దీని పరిమాణం అత్యధిక ధనవంతునిపై పది రూపాయలకు మించి లేకుండేది.... ఆ దేశ ప్రజలు ఈ షరతులకు ఎంతగా సంతృప్తి చెందారు, ఎంతగా సంబరపడిపోయారంటే వెంటనే ఒప్పందాలను అంగీకరించారు. ఇంకా ఈ జిజ్‌యా రొఖ్ఖాన్ని వారు అడ్వాన్సుగానే చెల్లించేశారు. తమ ఈ వాగ్దానాన్ని అక్కడి ఇస్లామీయ అధికారులు ఎంత ఖచ్చితంగా, పకడ్బందీగా అమలు జరిపారంటే, గ్రీకు చక్రవర్తి అధికారుల చేతుల్లో ప్రతినిత్యం హింసా దౌర్జన్యాలు అనుభవిస్తూ వచ్చిన ప్రజలు ఈ సత్ప్రవర్తన, మృదు స్వభావానికి ఎంతగా ప్రభావితులయ్యారంటే మూకుమ్మడిగా, దేశానికి దేశం సంతోషంగా, నిండు మనస్సుతో ఇస్లాంను స్వీకరించడమే గాక, అరబీ భాషను సయితం అవలంబించారు. నేను పదే పదే చెప్పొచ్చేదేమంటే, ఇలా ఏ ఫలితమైతే బయల్పడిందో, అది ఖడ్గ ప్రయోగం ద్వారా ఎన్నటికీ సాధ్యపడదు. అరబ్బులకు పూర్వం ఏ జాతులైతే ఈజిప్టును పరిపాలించాయో అవి ఎన్నడూ ఇలాంటి విజయాన్ని పొందలేకపోయాయి." (పేజి 74) "Civilization des Arabes"- Dr. Guestov Lee Ban - French to Urdu Dr. Syed Ali Belgrami, page 69, 73, 74)

తన విశ్వ ప్రఖ్యాత చరిత్ర అయిన "The Decline and Fall of the Roman Empire" లో ఎడ్వర్డ్ గిబ్బన్ ఇలా వ్రాశాడు :

"అన్ని ధర్మాల్ని ఖడ్గబలంతో రూపుమాపాలనే అత్యంత హానికరమైన ఒక అపవాదును ముస్లింలపై రుద్దటం జరిగింది. కాని అజ్ఞానం మరియు వారి (ముస్లింల) పట్ల అత్యంత దురుద్దేశంతో మోపబడిన ఈ అపవాదు, ఖుర్ఆన్ బోధనల ద్వారా, ముస్లిం విజేతల చరిత్ర ద్వారా మరియు వారు ప్రదర్శించిన బహిరంగ, చట్టపరమైన పరమత సహనం ద్వారా ఇది ఖండించబడింది" (వా.6, చాప్టర్ 58, పేజి 46, 47)

"... అరేబియా ముహమ్మద్ (స) నమ్మే దేవుని పవిత్ర స్థలమైనప్పటికీ ఆయన భూగోళంపై నివసించే జాతుల పట్ల అసూయను ప్రదర్శించకుండా ప్రేమ వాత్సల్యాల్ని ప్రదర్శించారు ... భారత దేశాన్ని జయించిన ముస్లిం విజేతలు భక్తిభావనలు గల, జన సమ్మర్ధంతో కూడిన ఆ దేశంలోని దేవాలయాలను యధాతథంగా ఉండనిచ్చారు. అబ్రహామ్, మోసెస్ మరియు ఏసుక్రీస్తు అనుయాయుల్ని సంపూర్ణ రూపంలో ముహమ్మద్ (స)పై అవతరించిన దైవవాణిని అనుసరించమని సగౌరవంగా ఆహ్వానించటం జరిగింది. కాని వారు దీన్ని అంగీకరించక, దానికి బదులు ఒక ఆధునిక పన్ను (జిజియా) ను చెల్లించటానికి ఇష్టపడినట్లయితే వారి మనస్సు కోరిన ధర్మాన్ని అనుసరించవచ్చని, వారి ధార్మికాచరణలకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంటుందని తెలుపడం జరిగింది." –

సత్యమేదో తెలుసుకోవాలని ఉవ్విళ్లూరే విగ్రహారాధకుల్లోని ఔత్సాహికులకు (ఇస్లామీయ ధర్మంలోని) మానవత్వం, దైవంతో దాని సంబంధం ఎంతో విలువైనవిగా కనిపించాయి. (అగ్ని ఆరాధకుల– పారశీక మత వ్యవస్థాపకుడైన) జొరాస్టర్ వ్యవస్థకన్నా స్వచ్ఛమైన నిర్మలమైన, మోసెస్ చట్టాలకన్నా సరళమైనవిగా ఉన్న (అంటే ఆచరణకు అత్యంత యోగ్యమైన) ముహమ్మద్ ప్రతిపాదించిన చట్టాలు, మూఢనమ్మకాలు పరస్పర విరుద్ధ విషయాలతో ఏడవ శతాబ్దంలో తలవంపులు తెచ్చేవిధంగా మార్చబడి తన నిరాడంబరతను కోల్పోయిన గోస్పెల్ (పరిశుద్ధ గ్రంథం) బోధనలకన్నా ముహమ్మద్ (పరిచయం చేసిన) ధర్మం బుద్ధి వివేకాలకు హేతువాదానికి అతి సమీపంగా ఉంది."

(వాల్యూం–5, చాప్టర్ 51, పేజి 420, 421) (Everyman's Library - 192, (published by Alfred A.NOPF)

ఇక ఇప్పుడు ఒక భారతీయ విద్వాంసి, చరిత్రకారుడు అయిన డాక్టర్ ఈశ్వర్ టోపా, ఎం.ఏ., డి.లిట్., సమీక్షను కూడా పరిశీలించండి.

"ఒక ఇస్లామీయ ప్రభుత్వం, తన ముస్లిమేతర (హిందూ) ప్రజల రాజకీయ, సామాజిక మరియు ధార్మిక హక్కుల్ని పరిరక్షించినందుకు బదులుగా వారితో తీసుకునే టాక్సునే 'జిజ్‌యా' అనేవారు. జిజ్‌యా స్వీకరించిన తరువాత ఏ ఒక్క జిమ్మీ (ఇస్లామీయ రాజ్యంలో, ప్రభుత్వ సంరక్షణలో ఉంటున్న ముస్లిమేతర ప్రజల్ని జిమ్మీలంటారు). ఏ విధంగానూ బాధింపబడకుండా సంరక్షించడం ఒక ఇస్లామీయ ప్రభుత్వ విధి, బాధ్యత. అతను సురక్షితమైన, శాంతిపూర్వక

జీవనం గడపగలగాలి. అతను ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి సంపూర్ణంగా అర్హుడు. అతను తన ధార్మికపరమైన, సామాజికపరమైన ఆచారాల్ని నిర్వర్తించుకోవడంలో స్వతంత్రుడై ఉంటాడు. జిజ్‌యాను వసూలు చేసుకున్న తరువాత జిమ్మీల ధన మాన ప్రాణాల్ని కాపాడుతూ కనిపెట్టి ఉండడం ఇస్లామీయ ప్రభుత్వ కర్తవ్యం. ఇస్లామీ సైన్యం యుద్ధ సమయాల్లో, ఇంకా ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో వారిని అన్ని రకాలుగా సంరక్షించేది. అలా చేయడం వారి ధార్మిక విధిలో చేరి ఉంది. జిమ్మీల సంరక్షణలో ముస్లింలు ధారపోసిన రక్తానికి పరిహారమే, జిమ్మీలతో వసూలు చేసిన ఈ ధనం (జిజ్‌యా). ఏదైనా ఒక ఇస్లామీయ ప్రభుత్వం జిమ్మీలను సంరక్షించే స్థితిలో లేకపోతే, దానికి జిమ్మీలతో జిజ్‌యాను వసూలు చేసే హక్కు కూడా లేదు. ఇస్లామీయ ప్రభుత్వం ఈ జిమ్మీలకు రక్షణ ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఈ జిజ్‌యా సొమ్మును తిరిగి వారికి ఇచ్చేసిన సందర్భాలు ఇస్లామీయ చరిత్రలో అనేకం ఉన్నాయి. జిమ్మీలకు స్వచ్ఛం దంగా, తమ ఇష్టానుసారం సైన్యంలో చేరడానికి పూర్తి హక్కులుండేవి. అయితే జిజ్‌యా చెల్లించిన తరువాత వారు నిర్బంధ సైనిక సేవల్నుండి మినహాయించబడేవారు. కాని వారు తమ ఇష్టంతో సైన్యంలో చేరినప్పుడు ఈ జిజ్‌యా నుండి మినహాయించబడేవారు. జిమ్మీలలో నుండి యుక్త వయస్సుకు వచ్చిన పురుషులు, శారీరకంగా ఆరోగ్యవంతులు, మానసికంగా యోగ్యులు మరియు జిజ్‌యా చెల్లించే స్థోమత కలిగిన వారి నుండే జిజ్‌యా వసూలు చేయబడేది. జిజ్‌యా ఇచ్చిపుచ్చుకోవడంలో పరస్పర అంగీకారాలు కూడా జరిగేవి. ధనిక వర్గాల్నుండి 48 దిర్హంలు, మధ్యస్త తరగతి వాళ్ళ నుండి 24 దిర్హంలు, ఇక పేదవారి నుండి 12 దిర్హంలు జిజ్‌యాగా వసూలు చేయబడేవి. వృద్ధులు, స్త్రీలు, మతి చలించిన వారు, అంగవైకల్యులు మరియు సన్యాసులు ఈ జిజ్‌యా నుండి మినహాయింపబడేవారు. అయితే ధనికులైన అంధులు, అంగవైకల్యులు, సన్యాసుల నుండి మాత్రం జిజ్‌యా తీసుకోబడేది. జిజ్‌యా నగదు మరియు వస్తు రూపేణా రెండింటిలో స్వీకరించబడేది. ముస్లిం తత్వవేత్తలు తమ రాజకీయ అవసరాల నిమిత్తం జిజ్‌యా భావార్థాల్లో చేర్పులు మార్పులు చేస్తుండేవారు. జిజ్‌యా అసలు ఉద్దేశ లక్ష్యాల్ని పక్కకు పెట్టి, ముస్లిమేతర ప్రజలు తమ అదుపులో, కట్టడిలో ఉండాలని, ముస్లిం రాజ్య రాజకీయ ప్రయోజనాల నిమిత్తం దీన్ని ఉపయోగించేవారు. కొందరు తాత్వికవేత్తలు జిజ్‌యాను తప్పుగా ఉపయోగించారని కొందరు పరిశోధకుల అభిప్రాయం. దివ్య ఖురాన్‌లోని ఆయతు 9:29ను కనీవినీ ఎరుగని రీతిలో వ్యాఖ్యానించి, కొందరు వ్యాఖ్యానకర్తలు అసందర్భ ప్రేలాపనలకు పాల్పడ్డారని ఖాసిమ్–అల్–గాజి తీవ్రంగా విమర్శించాడు. వారు ఈ ఆయతులకు హింసాత్మక, పక్షపాతంతో కూడిన భావాన్ని ఆపాదిం చారు. జిమ్మీలను రాజకీయంగా, ఆర్థికంగా, ధార్మికంగా మరియు నైతికపరంగా అణిచివుంచి, వారిని అధమ స్థితిలో ఉంచాలనేది ఈ ఆయతుల భావం ఎంతమాత్రం కాదని ఖాసిం–అల్–గాజి అభిప్రాయం. ఇస్లాంలోని ఏ చట్టం కూడా ఇలాంటి హింసకు అనుమతించలేదు. ఒకవేళ ఎవరైనా అలా హింసించి ఉంటే దాని బాధ్యత ఈ తాత్వికవేత్తలపై వస్తుంది. భారతదేశంలోని మధ్యయుగంలో హిందువులు, ప్రవక్త ప్రతినిధుల (ఖులఫాయె రాషిదీన్) కాలంలో లాగే,

ప్రభుత్వ ఉద్యోగాల్లో, సైన్యంలో చేరగలిగేవారు. ఫెరోజ్ షాకు పూర్వం, బహుశ హిందువులపై జిజ్‌యా కూడా విధించబడలేదు. ఆ కాలం నాటి చరిత్రల్లో జిజ్‌యా అనే పదం బహు అరుదుగా ఉపయోగించబడింది. ఇక ఎక్కడైనా ఇది విధించబడినా కూడా ఇస్లామీయ చట్టాన్ని అనుసరించి దానిపై ఆచరణ జరగలేదు. దీనికి కారణం ఏమిటంటే సిసలైన ఇస్లామీయ రాజ్యం అసలు ఏర్పడనే లేదు." (Politics in Pre-Moghal Times, By Dr. Eashwar Topa, Page 239-241)[28]

ఈ జిజ్‌యాను మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఇలా వివరించారు : "ముస్లింలపై యుద్ధ సేవల్ని ఇస్లాం విధిగా చేసింది. నేటి కాలంలో ఇది నిర్బంధ సైనిక సేవ (Compulsory Military Service) అనబడుతుంది. అందుకని ఇస్లామీయ రాజ్యంలో పౌరులుగా నివసిస్తున్న ముస్లిమేతరులు కూడా దేశ రక్షణ కోసం యుద్ధంలో పాల్గొనడం అనివార్యమై ఉండింది. కాని ఈ విషయంగా ముస్లిమేతరులపై నిర్బంధం చేయడం ఇస్లాం అన్యాయంగా భావిస్తుంది. అందుకని ఈ విషయం (అనగా యుద్ధంలో పాల్గొనడం అనేది) వారి అభీష్టానికి వదలివేయబడింది. (అంటే వారికి ఇష్టమైతే పాల్గొనవచ్చు) లేనిపక్షంలో దీనికి (సైనిక సేవలకు) బదులుగా సంవత్సరానికి కొంత సొమ్మును చెల్లించాలి. అదే జిజ్‌యా అనబడుతుంది. ఇది ముస్లింలు చెల్లించే "జకాత్" పరిమాణానికి సమానంగా ఉండేది." (తర్జుమానుల్ ఖుర్ఆన్-మౌలానా అబుల్ కలాం ఆజాద్, 1992, న్యూ ఢిల్లీ)

ఇక గాంధీజీ అనుయాయుడు, ప్రసిద్ధ చరిత్రకారుడు డాక్టర్ తారాచంద్ ఔరంగజేబ్ కాలంనాటి జిజ్‌యాను ఇలా విశ్లేషించాడు :

"ఔరంగజేబ్ తన పట్టాభిషేకం 13వ సంవత్సరం ప్రభుత్వ రాబడి, ఖర్చుల లెక్క తీయించినప్పుడు రాబడికన్నా ఖర్చులే ఎక్కువగా తేలాయి. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పడసాగింది. అందుకని అతను అక్బర్ కాలం తరువాత నుండి నిల్చిపోయిన జిజ్‌యా టాక్సును చెల్లించాలనే ఆదేశాన్ని జారీ చేశాడు. ...... ఇదో చిన్న రొఖ్ఖం. ముస్లింలకు జకాత్ మరియు సదఖాత్ అనే రెండు టాక్సులు చెల్లించాల్సి ఉండేది. ఇవి జిజ్‌యా రొఖ్ఖంకన్నా అధిక పరిమాణంలో ఉండేవి. వీటి నుండి హిందువులు సురక్షితంగా ఉండేవారు. (అంటే, వారు అవి చెల్లించే అవసరం లేకుండేది.) ఈ విధంగా చూసినప్పుడు ఈ టాక్స్ అంటే జిజ్‌యా అన్యాయపూరితంగా కన్పించదు. ముస్లింలకు రాజ్య ధనాగారంలో తరచుగా తమ రాబడిలోని రెండున్నర శాతం, ఇంకొన్ని సందర్భాల్లోనైతే పన్నెండున్నర శాతం వరకు చెల్లించాల్సి వచ్చేది. కాని ముస్లిమేతరులు సంవత్సరానికి ఐదు దీనారములకన్నా అధికంగా చెల్లించేవారు కాదు. దీనికి బదులు వారు నిర్బంధ సైనిక సేవల నుండి మినహాయింపు పొందేవారు. జిజ్‌యాకు సంబంధించిన ఈ రొఖ్ఖం సామాన్యంగా బ్రాహ్మణులే వసూలుచేసేవారు. ఇంకా ఇది వసూలుచేసేటప్పుడు పేదల గురించి ప్రత్యేక జాగ్రత్త వహించబడేది. (A short History of India-By Dr. Tara Chand, page.122)[29]

జిజ్‌యా అంటే ఏమిటి? దాని స్వరూప స్వభావాలు ఏమిటి? అది చెల్లించిన తరువాత చెల్లించిన వారికి లభించే ప్రయోజనాలు, స్వాతంత్ర్యాలు ఏమిటి? జిజ్‌యాను వసూలు చేసుకున్న తరువాత, వసూలు చేసుకున్న వారిపై వచ్చిపడే బాధ్యతలు ఏమిటి? ఇత్యాది విషయాల్ని మీరు వివిధ గ్రంథాల నుండి, వివిధ సందర్భాల నుండి, వివిధ వ్యక్తులు, వివిధ చరిత్రకారుల ద్వారా క్షుణ్ణంగా తెలుసుకున్నారు. జిజ్‌యాకు సంబంధించి ఇక ఏ అనుమానము, అపార్థమూ మిగిలి పోలేదని కూడా భావిస్తున్నాము. జిజ్‌యా చెల్లించిన తరువాత ముస్లిమేతరుల ధన మాన ప్రాణాలు, వారి ధర్మం, వారి ఆస్తులు, వారి ఆరాధనాలయాలు, వారి ధార్మిక గురువులు, వారి ధార్మిక ఉత్సవాలు, వారి సామాజిక ఆచార వ్యవహారాలు, వారి వ్యక్తిగత చట్టాలు - ఒక్కటననేమి? సర్వం సురక్షితమైపోతాయి. వారి పూర్తి రక్షణ బాధ్యత ఆ ముస్లిం ప్రభుత్వం మరియు ప్రజలపై వచ్చిపడుతుంది. ఈ విధి నిర్వహణలో ఏదైనా లోపం జరిగితే ఆ ముస్లిం పాలకులు మరియు ప్రజలు దానికి దైవం ముందు సంజాయిషీ ఇచ్చుకోక తప్పదు.

సయ్యద్ సబాహుద్దీన్ ఇలా అంటారు : "భారతదేశాన్ని పరిపాలించిన ముస్లిం పాలకుల పరమత సహనానికి ఇంకొక ప్రత్యక్ష నిదర్శనమేమిటంటే వారు మరాఠాలు, రాజపుత్రులు, జాటులు, సిఖ్ఖులతోనైతే యుద్ధాలు చేశారు. కాని వారి ఈ యుద్ధాలు రణరంగం వరకు, కోటల ముట్టడి వరకే పరిమితమై ఉండేవి. ఈ పోరాటాల్లో, యుద్ధాల్లో ఎంత రక్తపాతం జరిగినా కూడా, అది ఆ యుద్ధాల వరకే పరిమితమై ఉండేది. కాని ఈ యుద్ధాల తరువాత హిందూ-ముస్లింలిద్దరూ ఎన్నడూ వీధుల్లో, రోడ్లపై పోరాడుతూ కనిపించలేదు. వారు పరిపాలించిన ఆరు వందల యాభై సంవత్సరాల సుదీర్ఘకాలంలో, నేటిలాగా మతిచలించిపోయే రక్తపాతాలు, అసామాన్యమైన ఆస్తి నష్టాలు జరిగిన దృష్టాంతాలు కనిపించవు. 1947 నుండి 1984 వరకు గడిచిన కేవలం ముప్ఫది ఏడు సంవత్సరాలలోనే జమ్‌షీద్‌పూర్, రూర్కేలా, జబల్‌పూర్, బడోదా, మురాదాబాద్, మీరట్, అస్సాం, ముంబాయి మరియు భీవండీలో జరిగిన విధ్వంసాలు, రక్తపాతాలు ఆ కాలంలో మచ్చుకు కూడా కనిపించవు. స్వయంగా ప్రభుత్వమే చేసిన ఒక ప్రకటనలో 1960 నుండి 1981 వరకు నాలుగు వేల రెండువందల అరవై ఎనిమిది హిందూ-ముస్లిం మత కలహాలు జరిగినట్లు పేర్కొన్నది. ఇక 1982లో జరిగిన వాటి సంఖ్య నాలుగువందల డెబ్బైమూడు. అంటే ఒక సంవత్సరంలో జరిగిన మతకలహాల సంఖ్య సరాసరిగా రోజుకు ఒకటికంటే కూడా పెరిగిపోయింది. దీనికి భిన్నంగా భారతదేశంలోని ముస్లిం పాలకుల సుదీర్ఘకాలంలో, కేవలం ఫర్రుఖ్‌సైర్ కాలంలో అహ్మదాబాద్‌లో హోలీ సందర్భంలో హిందూ-ముస్లింల ఒకే ఒక కోట్లాట జరిగింది. అది కూడా కఠినంగా అణచి వేయబడింది." (సైరుల్ ముతాఖిరీన్, వా-2, పేజి 298) (హిందుస్తాన్ కే ముస్లిం హుక్‌మరానోం కీ మజ్‌హబి రవాదారి - సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్ రహ్మాన్ - వా-3, పేజి 34, 35).

# 16. బీజాపూర్, గోల్కొండ రాజ్యాల పతనం

ఔరంగజేబ్‌పై మోపిన రకరకాల నిందల్లో దక్కన్‌కు చెందిన రెండు (షియా) ముస్లిం రాజ్యాలను సమాప్తం చేయడం కూడా ప్రముఖమైన వాటిలో ఒకటి. ఔరంగజేబ్ సమకాలీన, ఆ తరువాత వచ్చిన షియా చరిత్రకారులు, జదూనాథ్ సర్కార్‌తో సహా – ఇదో నేరమైనట్లు అతనిపై నిందమోపారు. అతను షియా వ్యతిరేకి అవడం కారణంగానే బీజాపూర్, గోల్కొండ లాంటి షియా రాజ్యాల్ని కబళించాడని నిందించడం జరిగింది. అతనిపై షియా వ్యతిరేకి అని ముద్రవేసే ముందు ఈ చరిత్రకారులు అతని కుటుంబ పరిస్థితుల్ని అధ్యయనం చేసి ఉంటే అలా రాయడానికి సాహసించి ఉండకపోయేవారు. ఒకవేళ అధ్యయనం చేసిన తరువాత కూడా అలా రాశారంటే తమ చదువరులను పెడత్రోవ పట్టించడం, లేక ఔరంగజేబ్‌ను ప్రతి విషయంలోనూ చెడ్డవానిగా వర్ణించడమే తమ ప్రధాన ధ్యేయంగా ఏర్పరుచుకొని ఉంటారు.

స్వయాన ఔరంగజేబ్ తల్లి ఒక షియా మతస్తురాలు. ఔరంగజేబ్ తల్లి అయిన ముంతాజ్ మహల్, నూర్ జహాన్‌కు కోడలు (సోదరుని కుమార్తె). నూర్ జహాన్ ఒక షియా మతస్తురాలు. ఆమె సోదరుడు ఆసిఫుద్దౌల ఒక షియా. ముంతాజ్ మహల్ అతని కుమార్తెనే. ఈ ముంతాజ్ మహల్ షాజహాన్‌కు భార్య రూపంలో ప్రియురాలిగా ఉంటూ వచ్చిందనేది జగమెరిగిన సత్యం. ఆమె షాజహాన్ కోసం తన షియా మతాన్ని వదలి, సున్ని అయినట్లు చరిత్రలో ఎక్కడా పేర్కొనబడలేదు. ఈ విధంగా ఔరంగజేబ్ అమ్మమ్మ తరఫు వాళ్ళంతా షియా మతస్తులే. అతని మేనమామ, దర్బారులోని ముఖ్య నాయకుడు, సైన్యంలో ఒక ఉన్నతాధికారి అయిన షాయిస్తఖాన్ షియానే. ఔరంగజేబ్‌కు కుడి భుజం లాంటివాడు, ఎవరి విజయాలు, ఘనకార్యాలతో ఔరంగజేబ్ చరిత్ర నిండి ఉందో, అటువంటి మీర్ జుమ్లా కూడా షియానే. అదీగాక మొగలు సామ్రాజ్యానికి వెన్నెముకలాంటి సయ్యద్ బారహాలు కూడా షియాలే. ఔరంగజేబ్ ముఖ్య సైనికాధికారుల్లోని రూహుల్లా ఖాన్, ఫిరంగులు, మందుగుండు సామగ్రి శాఖాధిపతి సఫ్‌షికన్ ఖాన్ షియాలే. ఇరాన్ సఫ్వి కుటుంబంతో సంబంధమున్న ఔరంగజేబ్ ప్రియపత్ని దిల్‌రస్ బానొ కూడా షియానే. చివరికి ఎవరి చేతుల్లో ఔరంగజేబ్ ప్రాణాలుండేవో, అంటే ఫైనల్‌గా చెకింగ్ చేసి ఔరంగజేబ్‌కు భోజనం సమర్పించే అధికారి నేమత్ ఖాన్ ఆలి కూడా షియానే. అంతేకాదు షియా విశ్వాసాల్ని అతను ఎంతగా గౌరవించేవాడంటే అతని వీలునామాలోని ఒక అంశంతో ఇది సంపూర్ణంగా ధృవీకరించబడుతుంది. అదేమిటంటే, ఖురాన్ ప్రతులు రాసి అమ్ముకోవడం షియా వర్గంలో నిషేధితంగా భావించబడుతుంది. అందుకని ఆ డబ్బుల్ని నా శవ వస్త్రాల కోసం లేక ఇతర ఖర్చుల కోసం వినియోగించరాదు." షియాలపట్ల ఎలాంటి ద్వేషం లేని వాడే ఇలాంటి భావనల్ని కలిగి ఉంటాడనడంలో

సందేహమేముంది. తన కుమారుడు సుల్తాన్ ముహమ్మద్ వివాహం షియా మతస్థుడైన ఖుతుబుల్ ముల్క్ కుమార్తె షాహ్‌జాది బీబీతో స్వయంగా తన పర్యవేక్షణంలో జరిపించాడు. ఇంకొక కుమారుడు ముహమ్మద్ ఆజం వివాహం బీజాపూర్ పరిపాలకుడు సికందర్ ఆదిల్ షా సోదరి షహ్రియార్ బానో ఉరఫ్ బాద్‌షా బీబీతో జరిపించాడు.

ఇన్ని రకాలుగా షియాలతో ముడివడి ఉన్న వ్యక్తిని, షియా వ్యతిరేకత కారణంగానే బీజాపూర్, గోల్కొండ రాజ్యాల్ని సమాప్తం చేశాడని నిందించడం అన్యాయం కాకుంటే మరేమిటి? బీజాపూర్, గోల్కొండల పతనం కేవలం రాజకీయ కారణాల వల్లనే జరిగింది తప్ప షియా వ్యతిరేకత వల్ల కాదు.

'షియా' అంశం నిర్హేతుకమనే విషయం తేలిపోయింది. అయితే దీన్నే మరో కోణంతో పరిశీలిద్దాం. రాజుల్ని, రాజుల కాలాన్ని అదే దృష్టి కోణంతో పరిశీలించాలి తప్ప, నేటి ప్రజా స్వామ్య యుగంతో పోల్చరాదు.

ప్రపంచంలోని అన్ని రాజ్యాల, రాజ్యాధీశుల దండయాత్రలు, సైనిక కార్యకలాపాలు, రాజ్యవిస్తరణ కోసం చేసే ప్రయత్నాలు, వారి కీర్తి ప్రతిష్టల్ని, గౌరవోన్నతుల్ని ఇనుమడింప జేసేవిగా పేర్కొనబడతాయి. కాని అవే పనులు, అవే కార్యాలు, అవే ప్రయత్నాలు ఔరంగజేబ్ వరకు వచ్చేసరికి అవమాన అవహేళనలకు, నిందలు, దూషణలకు, అపకీర్తి అపఖ్యాతులకు కారణభూతమవడం ఔరంగజేబ్ దురదృష్టం కాకుంటే మరేమిటి? రోమన్లు ప్రాచీన ప్రపంచంలోని మూడు ఖండాల అత్యధిక భూభాగాల్ని తమ బలపరాక్రమాలతో ఆక్రమించుకున్నారు. అయితే ఇదే వారి ఔన్నత్యానికి, గౌరవానికి, కీర్తి ప్రతిష్టలకు చిహ్నాలుగా పేర్కొనబడ్డాయి. అలెగ్జాండర్ మాసిడోనియా మొదలుకొని పంజాబ్ వరకు, సభ్య ప్రపంచంలోని అత్యధిక దేశాలను కొల్లగొట్టాడు. కాని దీన్నే అతని గొప్పతనానికి, వీరత్వానికి ప్రతీకగా పేర్కొంటారు. అంతదూర మెందుకు పోవాలి? స్వయంగా మొగలు వంశంలోని అందరికన్నా విశాలహృదయుడు, నిష్పక్ష పాతి, సర్వధర్మాలను సమానంగా గౌరవించి సెక్యులర్ పరిపాలకునిగా పేరుగాంచిన అక్బర్ చక్రవర్తి ఏం చేశాడు? బిహార్, బెంగాల్, మాల్వా, గుజరాత్ మరియు రాజ్‌పుతానాలను జీర్ణం చేసుకొని, నర్మద నదిని దాటి ముస్లిం రాజ్యాలైన ఖాన్‌దేశ్, బిరార్ మరియు అహ్మద్‌నగర్‌లపై దాడి జరిపి వీటన్నిటిని ఆక్రమించుకున్నాడు. పై రాజ్యాలన్నిటిపై దురాక్రమణ జరిపి ఆక్రమించుకున్నందుకు అతన్ని ఏమన్నారు? వ్యతిరేకతతో కూడిన విమర్శకు గురిచేశారా? అతని కార్యకలాపాల ఔచిత్యాన్ని ప్రశ్నించారా? లేదే! దానికి భిన్నంగా అతనికి "అక్బర్ ద గ్రేట్" అనే బిరుదిచ్చారు!!

జహాంగీర్, షాజహాన్‌లు జీవితాంతం నిజాంషాహి, ఆదిల్ షాహి మరియు ఖుతుబ్ షాహి రాజ్యాలతో పోరాడుతూనే గడిపారు. అయినాగాని మన చరిత్రకారులకు అందులో

అనుచితం, అసమంజసమేమీ కనబడదు. కాని ఈ అసంపూర్ణ పనినే మధ్యంతరంలో ఆగిపోయిన కార్యాన్నే పరిస్థితుల్ని చక్కబెట్టడానికి, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఔరంగజేబ్ పరిపూర్ణంచేస్తే, అతను దౌర్జన్యకారునిగా, క్రూరునిగా, రాజతంత్రజ్ఞత లేనివానిగా, ముస్లిం (షియా) వ్యతిరేకిగా, మతపక్షపాతం గలవానిగా పేర్కొనబడతాడు. తన రాబడి, రాజ్యంలో అభివృద్ధిని కోరుకోని, దానికోసం ప్రాకులాడని రాజు ఈ ప్రపంచంలో ఎవడున్నాడని? ప్రారంభం నుండి అంతం వరకు కేవలం తనకున్న నేలతోనే తృప్తిపడిన రాజ్యం ప్రపంచంలో ఎక్కడుంది? నేటి ఈ సభ్య యుగంలో కూడా, ప్రజాస్వామ్యం, సామ్యవాదం లాంటి మనోహరమైన సిద్ధాంతాలు వినిపిస్తున్న ఈ రోజుల్లో కూడా, తమ రాజ్యాన్ని, తమ అధికారాన్ని, తమ పలుకుబడిని, విస్తరింపజేయడానికి ఎన్ని ప్రయత్నాలు, ఎన్ని పన్నాగాలు, కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయే, మనం చూడడం లేదా? వియత్నాం, కాంబోడియా, కొరియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాఖ్, పాలస్తీనా, లిబియా, సిరియా, సోమాలియాలపై జరిగిన, జరుగుతున్న దురాక్రమణలు దేన్ని సూచిస్తున్నాయి? ఈ దేశాలు, వాటి ప్రజలు అమెరికాపై దాడి జరిపాయా? లేదే! అదే రాజ్యం, అధికార విస్తరణ కాంక్ష! – అయితే ఇందులో వచ్చిన మార్పు ఏమిటంటే ప్రాచీన కాలంలో ఈ దురాక్రమణ బాధ్యత కేవలం ఒకే ఒక వ్యక్తిపై వచ్చిపడేది. నేటి కాలంలో మొత్తం జాతి సామూహికంగా ఈ నేరంలో పాలుపంచు కుంటున్నది. అందుకని ఈ నేరస్థాయి అత్యంత కఠినమైనది, ప్రమాదకరమైనది మరియు విధ్వంసకరమైన దనడంలో సందేహం లేదు. అయినాగాని ఈ సభ్య ప్రపంచంపై వేలెత్తి చూపే ధైర్యసాహసాలు ఎవరికున్నాయని?

అక్బర్‌కు ఉత్తర భారతంలోని పోరాటాలతో తీరిక లభించగానే అతను వింధ్యా చలాలకు, నర్మదకు ఆవలనున్న ముస్లిం రాజ్యాల్ని తన రాజ్యంలో కలుపుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడనేది చారిత్రక సత్యం. అందుకే తన కుమారుల్ని పంపించాడు. అందులో ఒకడైతే అక్కడ్నే మరణించాడు. చివరికి తాను స్వయంగా బయలుదేరాడు. ఖాన్‌దేశ్, బిరార్, అహ్మద్ నగర్‌లను ఆక్రమించుకున్నాడు. అప్పుడవి ఇస్లామీయ రాజ్యాలు కావా? అవి ఎప్పుడైనా మొగలు సామ్రాజ్య సరిహద్దులపై దాడికి పాల్పడ్డాయా? వాటిలోని ఏ ఒక్క రాజ్యమైనా, ఏ ఒక్క విద్రోహి లేక తిరుగుబాటుదారుకు ఆశ్రయ మిచ్చాయా? వారిలో ఏ ఒక్కరైనా పారిపోయిన మొగలు నేరస్తునికి ఆశ్రయం కల్పించారా? లేదే! పై వాటిలో ఏదీ జరుగలేదు! మరి వాటి మీద దాడులెందుకు జరిగినట్లు? అదే ప్రతి రాజు కలలుగనే రాజ్య విస్తరణ కాంక్ష. దాని ఆచరణ స్వరూపమే ఈ దాడులు!

జహాంగీర్ కూడా కాంగ్డా మరియు ఉదయపూర్ రాణాతో జరిగిన పోరాటాలు తప్పిస్తే, జీవితాంతం తన సైన్యాన్ని దక్కన్‌లోనే నిమగ్నం చేసి ఉంచాడు. అబ్దుర్రహీం – ఖానె ఖానా, ఆజం ఖాన్, అబుల్ హసన్, ఆసఫ్ ఖాన్, రాకుమారుడు ఖుర్రం – వీరంతా ఆ యుద్ధాల్లో పాల్గొన్న వారేకదా! బీజాపూర్, గోల్కొండ, అహ్మద్ నగర్, దౌలతాబాద్ పరిపాల కులందరూ అప్పుడు కూడా షియా మతస్తులే కదా? సున్నీలు కాదుగదా? షియా భావజాలం నుండి వారు

లెంపలేసుకున్నారా? లేదే! అలా అసలే జరిగి ఉండలేదు. మరి అలా కానప్పుడు ఈ ముస్లిం రాజ్యాలపై దాడులెందుకు జరిగినట్లు? అదే రాజ్య విస్తరణ కాంక్ష!

షాజహాన్ కూడా తన పరిపాలన ప్రారంభకాలం నుండి దక్కన్‌పై ఒక కన్నేసే ఉంచాడు. ఖానె జహాఁ మొదలుకొని, ఔరంగజేబ్ తన సంరక్షణార్థం దక్కన్ నుండి బయలుదేరే వరకు – దక్కన్ ప్రాంతం మాత్రమే యుద్ధాలకు, పోరాటాలకు కేంద్రంగా ఉండింది. అయితే అప్పుడు షాజహాన్ చేస్తున్నది రాజకీయ తప్పిదమా? అతను ఈ ముస్లిం రాజ్యాల్ని సమాప్తం చేసి మరాఠాల శక్తిని పెంపొందిస్తున్నాడా? లేక తన ఆలోచనలో మొత్తం భారతావనిని ఒకే రాజ్యంగా మలిచి, తన రాజ్య కేంద్రిత్వాన్ని గట్టిపరుస్తున్నాడా? ఒకవేళ ఇదే నిజమైనట్లైయితే, కనీసం ఔరంగజేబ్ విమర్శకులు, చరిత్రకారులు తప్పకుండా దీన్ని స్వాగతించాలి. ఎందుకంటే ఔరంగజేబ్ తన తాతతండ్రుల అడుగుజాడల్లో నడిచి వారు అసంపూర్ణంగా వదలివెళ్ళిన ఘనకార్యాన్ని అనగా భారతదేశమంతటిని ఒకే కేంద్రం క్రిందికి తెచ్చి, జాతి దేశ ఐక్యతను సుదృఢపరిచాడు!!

అక్బర్, జహంగీర్, షాజహాన్ కాలాల్లో దక్కన్‌లోని ఇస్లామీయ రాజ్యాలపై విరుచుకుపడి, వాటిని తమ రాజ్యంలో కలుపుకున్నప్పుడు అవి ఇస్లామీయ రాజ్యాలు కావా? వారు షియా మతస్తులు కారా? అయితే ఈ చరిత్రకారుల గారడీ చూడండి, ఔరంగజేబ్ కాలంలో మిగిలి ఉన్న ఈ రెండు రాజ్యాలు, మొగలు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా వ్యవహరించినప్పటికీ, మొగలు విద్రోహులకు, నేరస్థులకు ఆశ్రయం కల్పించినప్పటికీ, ఔరంగజేబ్ పదే పదే హెచ్చరికలు చేసినా ఖాతరు చేయనప్పటికీ, ఇరాన్ చక్రవర్తితో రహస్య మంతనాలు జరిపి, మొగలు సామ్రాజ్యానికే ప్రమాదకారులుగా మారిపోయినప్పటికీ ఔరంగజేబ్ ఉదారంగా ప్రవర్తించవలసింది. ముస్లిం రాజ్యాలని వాటి జోలికి పోకపోవలసింది. అలా ఉండలేకపోయాడు గనక, అతను ముస్లిం రాజ్యాల్ని నాశనం చేసినవానిగా, ఫలితంగా మరాఠాలకు బలం చేకూర్చినవానిగా, సున్నీ మత పక్షపాతి అయి, షియా రాజ్యాల్ని నామరూపాల్లేకుండా నాశనం చేసిన వానిగా చిత్రీకరించబడ్డాడు. ఈ రాజ్యాలు చేసిన కుట్రలు, కుతంత్రాలు ఏమిటో ఈ అధ్యాయంలోనే మీరు తెలుసుకుంటారు.

దక్కన్‌లో మొత్తం ఐదు ముస్లిం రాజ్యాలుండేవి. గోల్కొండ, బీజాపూర్, ఖాన్‌దేష్, బిరార్ మరియు అహ్మద్‌నగర్‌లు. ఈ ఐదు రాజ్యాలు కూడా పరస్పరం ఒకరితో ఒకరు పోరాడుతూ అశాంతి, అరాచకాలకు నిలయమై ఉండేవి. ఈ అంతర్యుద్ధాల కారణంగా మొగలులకు వారి అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే చక్కటి అవకాశం లభించింది. మొట్టమొదటగా అక్బర్ చక్రవర్తి వాటిపై దాడిజరిపి, కొన్ని ప్రాంతాల్ని తన రాజ్యంలో కలుపుకున్నాడు. ఈ రాజ్యాలతో స్నేహ సంబంధాలుంటే చాలని జహాంగీర్, షాజహాన్లు కోరుకున్నారు. కాని అవకాశవాదులైన ఈ పాలకులు గత్యంతరం లేనప్పుడు మొగలు

సామ్రాజ్యానికి విధేయత చూపేవారు. ఆ తరువాత ఏ కొంచెం సమయం అనుకూలించినా, తిరుగబడి శత్రువులుగా మారేవారు. చివరికి వీరి ఈ ద్వంద్వ నీతితో విసిగిపోయిన మొగలులు వారి ప్రాంతాల్ని తమ రాజ్యంలో కలుపుకున్నారు. ఔరంగజేబ్ సింహాసనాన్ని అధిష్టించే సమయానికి గోల్కొండ మరియు బీజాపూర్ అనే రెండు రాజ్యాలు మిగిలి ఉన్నాయి.

## బీజాపూర్ పతనం :

ఈ కాలంలోనే శివాజీ తండ్రి సాహూజీ కూడా రంగంలోకి వస్తాడు. బీజాపూర్ రాజ్యాధీశుడు పూర్ణ (పూనా) మరియు సూప అనే రెండు సూబాలను సాహూకు జాగీరుగా ప్రసాదించాడు. వాటిని శివాజి తన అధీనంలోకి తీసుకొని అందులో అనేక కోటల్ని నిర్మించాడు. ఆదిల్‌షా అనారోగ్యానికి గురిఅయి మరణించాడు. అతని అనారోగ్య కాలంలో శివాజి అతని అనేక ప్రాంతాల్ని ఆక్రమించుకొని వాటిలో నలభై కోటల్ని నిర్మించాడు. ఆదిల్‌షాకు మగ సంతానం లేదు. దర్బారు నాయకులు సికందర్ పేరుగల దూరపు బంధువైన ఓ అబ్బాయిని (సికందర్‌ను) అతని వారసునిగా సింహాసనంపై కూర్చుండబెట్టారు. అతను యుక్త వయస్సుకు వచ్చిన తరువాత శివాజీని ఎదుర్కోవడానికి అఫ్జల్ ఖాన్‌ను పంపించాడు. శివాజీ ఈ అఫ్జల్ ఖాన్‌నే చంపేశాడు. ఈ సికందరే ఔరంగజేబ్‌కు సమకాలీనుడు.

కొన్ని రోజుల తరువాత శివాజీ గతించాడు. అతని కుమారుడు సాంభాజి అతని వారసుడయ్యాడు. తన బలహీనత కారణంగానో లేక మొగలులతో వస్తున్న ప్రాచీన వంశ శతృత్వంతోనో, సికందర్ ఈ సాంభాజీతో మైత్రీ సంబంధాలు ఏర్పరచుకున్నాడు. మొగలులు మరియు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా సికందర్ సతతం సాంభాజీకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేవాడు. ఆలంగీర్ ఈ విషయంగా సికందర్‌ను ఎన్నోసార్లు మందలించాడు. అన్ని విధాలుగా బెదిరించి చూసాడు. దాని పర్యవసానం గురించి హెచ్చరించాడు. అయినా సికందర్ తన ప్రవర్తనను మార్చుకోలేదు. ఈ విషయానికి సంబంధించి ఖాఫీఖాన్ ఇలా వ్రాశాడు :

"బీజాపూర్‌కు చెందిన సికందర్ కుట్రలు కుతంత్రాలు చేస్తూ శత్రువుతో స్నేహ సంబంధాలు ఏర్పాటు చేసుకున్నప్పుడు, ఆలంగీర్ పదే పదే హితోపదేశం చేస్తూ ఫర్మాన్లు పంపించాడు. తరువాత బెదిరింపులు హెచ్చరింపులు కూడా చేశాడు. కాని అవన్నీ నిష్ప్రయోజనమయ్యాయి." [1]

ఇక లాభం లేదనుకొని ఔరంగజేబ్ బీజాపూర్‌ను జయించి, మొగలు సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. కాని సికందర్‌తో అత్యంత గౌరవప్రదంగా వ్యవహరించాడు. సికందర్ ఖాన్‌గా బిరుదిచ్చాడు. ప్రత్యేక రాజవస్త్రాభరణాల్ని, రత్నఖచిత చురకత్తి, ముత్యాల హారాన్ని, పుష్ప కిరీటాన్ని ప్రసాదించాడు. శిరోభూషణం, రాజదండాన్ని కూడా ప్రసాదించాడు. చక్రవర్తి గుడారానికి సమీపంలో అతని గుడారాన్ని వేయించాడు. మొత్తానికి అతను ఓడిపోయి, విధేయత

చూపి, ఔరంగజేబ్‌ను సందర్శించినప్పుడు అతన్ని అన్ని విధాలుగా గౌరవించడం జరిగింది. దీని మొత్తం వివరాలు ముస్తఅద్ ఖాన్ సాఖి రచన అయిన మాసిరె ఆలంగీరిలో (పే.198లో) వివరంగా లభిస్తాయి.

బీజాపూర్ పతనాన్ని జదూనాథ్ సర్కార్ కూడా సుదీర్ఘంగా వివరించారు. కొన్ని కారణాలను ఆయన కూడా ఇలా విశ్లేషించారు :

"బీజాపూర్ రాజ్యాధీశుడు ఆదిల్‌షా ఎన్నో నేరాలకు పాల్పడ్డాడు. 1657లో అతను షాజహాన్‌తో చేసుకొన్న ఒప్పందాన్ని అనుసరించి కోటి రూపాయల కప్పం, 'పరిందా' కోటతో సహా నిజాం షాహికి చెందిన కోన్‌కణ్ ప్రాంతాల్ని తిరిగి అప్పగిస్తానని వాగ్దానం చేశాడు. కాని షాజహాన్ అనారోగ్యంతో అతను వెనుకడుగువేశాడు. షాజహాన్ కుమారుల్లో వారసత్వం కోసం అంతర్యుద్ధాలు ప్రారంభం కాగానే, తన వాగ్దానాన్ని నెరవేర్చడంలో విముఖత చూపాడు. ఔరంగజేబ్ సింహాసనాన్ని అధిష్టించిన తరువాత, అతను తను చెల్లించవలసిన కప్పం నుండి ఎనిమిదన్నర లక్షలు చెల్లించాడు, 1665లో ఏడు లక్షలు మరియు కొన్ని వజ్రాలు కూడా సమర్పించుకున్నాడు, అయినప్పటికీ అతను చెల్లించవలసిన కప్పాన్ని చూసుకుంటే ఇది చాల తక్కువ. ఆదిల్‌షా 'పరింద' కోటను కూడా అప్పగించలేదు, 1660లో ఈ కోట మొగలుల అధీనంలోకి వచ్చినా కూడా, ఇది అక్కడి గవర్నరుకు లంచం ఇచ్చి పొందడం జరిగింది. 1660లో బీజాపూర్ సుల్తాను శివాజీపై దాడి జరిపినప్పుడు, అతను మొగలులతో కూడా సహాయం కోరుతూ కప్పాన్ని ఇంకా పెంచి చెల్లిస్తానని వాగ్దానం చేసి ఉన్నాడు. ఔరంగజేబ్ అతని సహాయార్థం షాయిస్తఖాన్‌ను పంపించి, శివాజీ కోటలపై దాడులు జరిపించాడు. వాటివల్ల బీజాపూర్‌కు ఎంతో సౌలభ్యం ఏర్పడింది. బీజాపూర్ వాళ్ళు శివాజీకి చెందిన పిన్‌హాల, పావన్‌గడ్ ఇంకా ఇతర కోటల్ని కూడా వశపర్చుకున్నారు. అలి ఆదిల్ షా నిర్ణీత కప్పాన్ని చెల్లించలేదు. దానికి బదులుగా, తాను శివాజీకి వ్యతిరేకంగా నిజాం షాహి కోన్‌కణ్‌లో సైన్యాలను పంపి షాయిస్తఖాన్‌కు సహకరించానని, అతను పాత కప్పం నుండి పది లక్షలు మాఫీ చేయిస్తానని వాగ్దానం చేశాడని వాదనకు దిగాడు."

"జైసింగ్ శివాజీ ప్రాంతాలపై దాడి జరిపినప్పుడు, మొగలుల సహాయార్థం బీజాపూర్ సుల్తాన్ ఖాస్ ఖాన్ సారథ్యంలో ఒక సైన్యాన్ని పంపించాడు. అయితే జైసింగ్, మిత్రులమని చెప్పుకునే వీరిని నమ్మలేక పోయాడు. వీరు ద్రోహానికి తలపడతారేమోనని జైసింగ్ నిరంతరం బెంగపడుతూనే ఉన్నాడు. అందుకని యుద్ధంలో అన్యమనస్కంగా పాల్గొంటున్నాడని అతను బీజాపూర్ సైనికాధికారిపై నిందను కూడా మోపాడు. ఆదిల్ ఖాన్ తనతో దొంగ వాగ్దానం చేశాడని కూడా జైసింగ్ అతనిపై నిందమోపాడు. అతను పేరుకు మాత్రమే, చూపించడానికి మాత్రమే శివాజీ ప్రాంతంలో సైన్యాన్ని పంపాడని జైసింగ్ ఆరోపణ. వాస్తవంలో శివాజీని అంతమొందిస్తే అది తనకు నష్టదాయకంగా అతను భావించాడు. శివాజీ ఒక గోడలాగా,

డాలులాగా, అడ్డంకిలాగా తనకు మొగలులకు మధ్య ఉండాలనేది అతని కోరిక. అతను రహస్యంగా మరాఠా నాయకునితో సంధి ఏర్పరచుకున్నాడు. అతనికి డబ్బు, జాగీరు ఇంకా అతని ఇతర అవసరాలను తీర్చుతూ అతనికి అన్ని రకాల సహాయం అందించేవాడు. గోల్కొండ సుల్తాను కూడా ఇదే యుద్ధనీతిని అవలంబిస్తూ, శివాజీకి సహాయం అందించాలని అతన్ని కూడా తనతో కలుపుకున్నాడు. కాని బాహ్యంగా, చూడడానికి అతను చక్రవర్తికి లేఖలు రాస్తూ తన విధేయతను చూపసాగాడు."

ఇంతవరకు రాసిన జదూనాథ్ సర్కార్ ఆ తరువాత ఈ పరిస్థితిపై ఇలా వ్యాఖ్యానించారు : "వాస్తవంగా అక్బర్ కాలం నుండే దక్కన్ కూడా మొగలు సామ్రాజ్య భాగం కావాలనేది మొగలుల కోరిక. ఈ కోరిక నుండి వారెన్నడూ వైదొలగలేదు. బీజాపూర్, గోల్కొండ పాలకులు కూడా ఈ విషయాన్ని మరిచిపోలేదు. అందుకని తమ చుట్టుప్రక్కల మిత్రుల్ని వెదుకుతుండేవారు. 1663 తరువాత వారికి శివాజీ రూపంలో మొగలుల్ని అడ్డుకునే వాడొకడు దొరికాడు. అందుకని శివాజీ అణిచివేయబడాలని వారెన్నటికీ కోరుకో లేదు." (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్-జదూనాథ్ సర్కార్, వాల్యూం-4, పేజి 83-85)

జదూనాథ్ సర్కార్ పై పేరాగ్రాఫ్ వల్ల కొన్ని విషయాలు తేటతెల్లమవుతున్నాయి. అక్బర్, జహాంగీర్, షాజహాన్ ముగ్గురూ కూడా దక్కన్ మొగలు సామ్రాజ్య భాగం కావాలని కోరుకుంటుండేవారు. ఔరంగజేబ్ వారి కోరికనే నెరవేర్చినప్పుడు, ఈ రెండు షియా రాజ్యాలైనందుకే ఔరంగజేబ్ వాటిని సమాప్తం చేశాడని నిందించడం ఎంతవరకు సబబు? అంతేకాదు, ఈ రెండు రాజ్యాలు కూడా మొగలు రాజ్యానికి వ్యతిరేకి అయిన శివాజీ సహాయకులు, సమర్థకులు అయినప్పుడు, ఏ మొగలు రాజ్యాధినేత అయినాసరే, ఔరంగజేబ్ చేసిన పనినే చేసి ఉండేవాడు కదా! ఔరంగజేబ్ బీజాపూర్‌ను వశపర్చుకోవడానికి జైసింగ్‌ను పంపించాడు. అతను ధైర్యస్థయిర్యాలతో అత్యంత వీరోచితంగా పోరాడినా కూడా, ఔరంగజేబ్ అభీష్టాన్ని నెరవేర్చలేక పోయాడు, ఆదిల్ షా తరువాత అతని పద్నాలుగు సంవత్సరాల కుమారుడు సింహాసనాన్ని అధిష్టించినప్పుడు, అతని దర్బారు నాయకుల కీచులాటలతో హోరెత్తిపోయింది. ఆదిల్ షా ద్వితీయ 1672 వరకు రాజ్యమేలాడు. అతను విపరీతంగా మద్యపాన సేవనం వల్ల పక్షవాతం వచ్చి చనిపోయినప్పుడు, అతని నాలుగేళ్ళ కుమారుడు సికందర్‌ను గద్దెపై కూర్చుండబెట్టారు. అతను మంత్రుల చేతుల్లో కీలుబొమ్మగా మారాడు. ప్రారంభంలో ఖాస్ ఖాన్ అతని ఏజంటుగా నియమించబడ్డాడు. అతని కాలంలో నాయకుల కీచులాటతో దర్బారు హోరెత్తి పోయింది. శివాజీ ఈ పరిస్థితులతో బాగా లాభపడ్డాడు. అతను బీజాపూర్‌కు చెందిన ఒక పెద్ద ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వాల్యూం - 4, పేజి 111-113). ఆదిల్ షా సోదరిని ఔరంగజేబ్ రాకుమారుల్లో ఒకరితో వివాహం జరిపి, చక్రవర్తితో సత్సంబంధాల్ని ఏర్పరచుకోవాలని ఖాస్ ఖాన్ యోచించాడు. కాని బహ్లూల్ ఖాన్ అతని మాటను నెగ్గనీయలేదు, ఇంకా తానే సికందర్ ఏజంట్‌గా మారి రాజ్యమేలసాగాడు. (వాల్యూం-4, పేజి 114) ఔరంగజేబ్ బీజాపూర్‌ను వశపరచుకోవడానికి తన సైనిక కమాండరు బహాదూర్ ఖాన్‌ను పంపించాడు,

అతని కింద దిలేర్ ఖాన్ కూడా ఉన్నాడు. అయితే బహాదూర్ ఖాన్ ఔరంగజేబ్ కోరిన విజయాన్ని చేకూర్చి పెట్టలేకపోయాడు, అంతేకాకుండా దిలేర్ ఖాన్ కూడా అతనికి పూర్తిగా సహకారం ఇవ్వలేదు. బహ్‌లూల్ ఖాన్‌తో కలిసి, గోల్కొండపై దాడి జరపాలనేది దిలేర్ ఖాన్ ఆలోచన. ఇక బహ్‌లూల్ ఖాన్, బీజాపూర్‌లో తన స్థానం అన్ని విధాలుగా సురక్షితంగా ఉండాలని కోరుకున్నాడు. ఎప్పుడైతే ఈ విషయంలో అతనికి నమ్మకం ఏర్పడిందో, అతను దిలేర్ ఖాన్‌తో కలిసి, గోల్కొండపై దాడికి ఉపక్రమించాడు. అయితే ఇది సఫలం కాలేకపోయింది. బహ్‌లూల్ ఖాన్ జబ్బుపడి మరణించాడు. అప్పుడు మస్ఊద్ బీజాపూర్ ఏజంట్ అయ్యాడు. (వాల్యూం - 4, పేజి 119-123). తను బీజాపూర్ మంత్రిగా నిలదొక్కుకుంటే, ఔరంగజేబ్ ప్రతి ఆజ్ఞను శిరసావహిస్తానని, శివాజీతో రహస్య, బహిరంగ ఎలాంటి సంబంధాలు పెట్టుకోనని, ఔరంగజేబ్ రాకుమారునితో ఆదిల్ షా సోదరి షహ్రియార్ బానొ అలియాస్ బాద్‌షాబీబి వివాహం జరిపిస్తానని మస్ఊద్ వాగ్దానాలు చేశాడు. (వాల్యూం - 4, పేజి 123). 1668లో అతను ఔరంగజేబ్‌కు పదకొండు లక్షల కప్పం కూడా చెల్లించాడు. అయితే ఆ తరువాత అఫ్గన్ సైనికులకు జీతాలు చెల్లించడానికి అతని వద్ద డబ్బులేక పోయినప్పుడు, ఆ సైనికులు అతనిపై తిరుగబడ్డారు. దీన్ని అణచడానికి అతను శివాజీ సహాయాన్ని కోరాడు. ఈ వాగ్దానోల్లంఘనకు కోపగించుకున్న ఔరంగజేబ్, తన సైనిక కమాండర్ దిలేర్ ఖాన్‌ను బీజాపూర్‌పై దాడి జరుపాల్సిందిగా ఆదేశించాడు. శివాజీ మస్ఊద్ సహాయార్థం ఆరువేల సైన్యాన్ని పంపించాడు. అయితే మస్ఊద్ ఆ సైన్యాన్ని, సైనిక నాయకుల్ని విశ్వసించలేకపోయాడు, ఏ అదనుచూసి వీరు బీజాపూర్ ధనాగారాన్ని కొల్లగొడతారోనని భయపడుతూనే ఉన్నాడు. ఈ అవిశ్వాసం, అపనమ్మకాలు ఎంతగా పెరిగాయంటే, ఈ ఇద్దరు మిత్రుల్లో యుద్ధం చెలరేగింది. మరాఠాలు దౌలత్‌పూర్, ఖుస్రూపూర్, జహ్రాపూర్‌లను దోచుకోవడం మొదలుపెట్టారు. అనేకమంది వ్యాపారుల్ని బంధీలుగా చేసుకున్నారు. అనేక ఉన్నతాధికారుల్ని హతమార్చారు. కాని ఎప్పుడైతే వారి ఒక సైనిక నాయకుడు హతమార్చబడ్డాడో, వారు వెనుదిరిగి వెళ్ళిపోయారు. (వాల్యూం - 4, పేజి 125-126)

ఈ పరిస్థితికి బెదిరిపోయిన మస్ఊద్ మొగలుల సహాయాన్ని అర్థించాడు, బీజాపూర్ రావడానికి మొగలు సైన్యాల్ని ఆహ్వానించాడు. శివాజీ కూడా ఎడెనిమిది వేల సైన్యంతో అక్కడికి చేరుకున్నాడు. (వాల్యూం-4, పే.126)

బీజాపూర్ పక్షంలో దిలేర్ ఖాన్ మరాఠాలను ఢీకొన్నాడు. అతను శివాజీకి చెందిన అనేక కోటల్ని వశపర్చుకున్నాడు. కాని అతను మస్ఊద్ గురించి కూడా అనుమానంగానే ఉన్నాడు. అతని వాక్కర్మలు రెండూనూ మోసంతో కూడుకొని ఉంటాయని, అంతరంగంలో అతను శివాజీతో కలిసి ఉండాలనుకుంటున్నాడని, కాని బాహ్యంగా మొగలుల మిత్రునిలాగా

నటిస్తున్నాడని, అందుకే అతను తన వాగ్దానాల్ని నెరవేర్చలేక పోతున్నాడని మస్ఊద్‌కు రాసి పంపించాడు. (వాల్యూం - 4, పేజి 126). ఈ విధంగా దిలేర్ ఖాన్ చేతులెత్తేసే సరికి, బీజాపూర్ దర్బారు నాయకుల్లో గొప్ప కలకలం బయలుదేరింది. అక్కడ షర్జ ఖాన్ అనే వ్యక్తి గొప్ప సైనిక కమాండరు. మస్ఊద్ అతని ప్రాణశత్రువుగా మారాడు. ఈ వ్యతిరేకతలు, గందర గోళంలోనే షర్జఖాన్, దిలేర్ ఖాన్ సహాయాన్ని కోరాడు. చివరికి స్వయంగా మస్ఊద్ దిలేర్‌ఖాన్ సహాయాన్ని అర్థించాడు. ఈ గందర గోళ పరిస్థితుల్ని గమనించి, బీజాపూర్‌కు చెందిన పదివేల మంది సైనికులు వచ్చి దిలేర్ ఖాన్‌తో కలసిపోయారు. (వాల్యూం-4, పే.128). మస్ఊద్ మొగలుల్ని ఎదుర్కొనే స్థితిలో లేకుండాపోయాడు. అందుకని అతను వారికి శిరసావహించాడు. ఆ తరువాత ఆదిల్ షా సోదరి బాద్‌షా బీబి వివాహం ఔరంగజేబ్ రాకుమారునితో జరిపించబడింది. ఆ విధంగా ఆమె మొగలు అంతఃపురంలో ప్రవేశించింది. (వాల్యూం-4, పే.128). మస్ఊద్ ప్రధానమంత్రి పదవి నుండి తప్పుకొని, తన జాగీరుకు వెళ్ళిపోవాలని, బీజాపూర్ సైన్యం శివాజీని ఎదుర్కోవడానికి పంపించాలని దిలేర్ ఖాన్ కోరాడు. మస్ఊద్ అంతరంగికుడైన వెంకట్‌దారి (వెంకటాద్రి) దిలేర్ ఖాన్ సలహాను మెచ్చుకున్నాడు. అందుకని మస్ఊద్ ఖాన్ కోపగించుకొని అతన్ని బంధించి వేశాడు. (వా-4, పే.129).

ఇకిప్పుడు బీజాపూర్‌పై దాడి జరుపడమే దిలేర్ ఖాన్‌కు మిగిలిన మార్గం. దిలేర్ ఖాన్ బీజాపూర్‌పై దాడి జరిపినప్పుడు, మస్ఊద్ తిరిగి శివాజీ సహాయాన్ని కోరాడు. శివాజీ పదివేల అశ్విక దళంతో, రెండువేల ఎడ్లపై యుద్ధ సామగ్రితో దిలేర్‌ఖాన్‌ను ఎదుర్కోవడానికి బయలుదేరాడు. (వా-4, పే.130). అయితే మస్ఊద్ తిరిగి దిలేర్ ఖాన్‌తో సంధి ప్రయత్నాలు ప్రారంభించాడు. అతను శివాజీని కూడా విశ్వసించలేకపోతున్నాడు. అందుకని అతను శివాజీని కేవలం ఐదు వందల మంది అశ్వికులతో మాత్రమే కోటలోకి రావడానికి అనుమతించాడు. శివాజీ ఈ షరతును అంగీకరించలేదు. అతను ముప్ఫైవేల సైన్యాన్ని జమచేసుకొని, మొగలు ప్రాంతాల్ని దోచుకోసాగాడు. పన్నెండు వేల అశ్వాల్ని, లక్షల కోట్ల ధనాన్ని దోచుకొని తన అధీనం చేసుకున్నాడు (వా-4, పేజి 132). అంతకు ముందు శివాజీ కుమారుడు పారిపోయి వచ్చి దిలేర్ ఖాన్‌ను ఆశ్రయించాడు. కాని ఈ సమయంలో అతను అక్కడి నుండి పారిపోయి బీజాపూర్ చేరుకున్నాడు. దాంతో దిలేర్ ఖాన్‌కు కలవరం పెరిగిపోయింది. అతను బీజాపూర్ ప్రాంతాల్ని ధ్వంసం చేస్తూ, బీజాపూర్ కోటను ముట్టడించాడు. శివాజీ బీజాపూర్‌కు అవసరమైన సరుకుల్ని, ఇతర వస్తువుల్ని పంపి, మస్ఊద్‌ను ఆదుకున్నాడు. దిలేర్ ఖాన్ బీజాపూర్‌ను వశపర్చుకోవడంలో విఫలమయ్యాడు. దాంతో ఔరంగజేబ్ మరియు రాకుమారుడు ముఅజ్జం అసంతృప్తులయ్యారు. దిలేర్ ఖాన్ బీజాపూర్ అత్యధిక ప్రాంతాల్ని నష్టపరచడంలో నిమగ్నమయ్యాడు. బీజాపూర్ ముట్టడిని సమాప్తం చేసి అతను సాగర్ వైపునకు మరలాడు, అక్కడ పామ్ నాయక్ అత్యంత వీరోచితంగా అతన్ని ఎదుర్కొని, అతని ప్రయత్నాల్ని వమ్ముచేశాడు. చివరికి ఔరంగజేబ్ దిలేర్ ఖాన్‌ను వెనుకకు రప్పించుకొని, అతని స్థానంలో ఖానె జహాఁను దక్కన్ గవర్నరుగా నియమించి పంపించాడు. అయితే దిలేర్ ఖాన్ బీజాపూర్‌లో సాధించిన

విజయం ఏమిటంటే అతను బీజాపూర్ వాళ్ళను, ఖుత్బా (శుక్రవారపు నమాజ్ ప్రసంగం)లో ఔరంగజేబ్ పేరును ఉచ్చరించడానికి, అతని పేరుతో నాణాలు ముద్రించడానికి వివశుల్ని చేసేశాడు. (వా-4, పే.139).

దిలేర్ ఖాన్ వెళ్ళిపోగానే, మస్ఊద్ సాగర్ నాయకుడైన పామ్ నాయక్‌కు గొప్ప ఇనాములు ఇస్తూ ఘనంగా సత్కరించాడు. తన బ్రాహ్మణ సలహాదారు అయిన వెంకటాద్రి మురారీని చెరనుండి విడిపించి, సత్కరించి, అతని పాత స్థానంపై నియుక్తుణ్ని చేశాడు. 1680 మార్చిలో శివాజీ మరణించాడు. అతని తరువాత సాంభాజీ మరాఠా రాజ్యాధికారాన్ని చేపట్టాడు. ఔరంగజేబ్‌కు తిరగబడ్డ అతని కుమారుడు అక్బర్‌కు సాంభాజీ ఆశ్రయం కల్పించాడు. ఇంకా బుర్హాన్‌పూర్‌ను ఘోరంగా దోచుకొని నిప్పంటించాడు. ఈ అన్ని కారణాలతో సాంభాజీని ఔరంగజేబ్ తన పరమ శత్రువుగా భావించాడు. (వా-4, పే.259). ప్రస్తుతానికి అతను బీజాపూర్‌ను మరిచిపోయాడు. సాంభాజీ బీజాపూర్‌కు చెందిన కొన్ని ప్రాంతాల్ని కూడా ఆక్రమించుకున్నాడు. ఔరంగజేబ్ షర్జా ఖాన్‌కు స్నేహపూర్వకంగా ఒక లేఖ రాస్తూ, ఖానె జహాఁకు సహాయపడాలని, ఆ విధంగా సాంభాజీ ఆక్రమించుకున్న బీజాపూర్ ప్రాంతాలు కూడా తిరిగి వారికి లభిస్తాయని కోరాడు. బీజాపూర్ రాకుమారి షహ్రియార్‌బానొ వివాహం అప్పటికే రాకుమారుడు ఆజంతో జరిగి ఉంది. కనుక ఆమె కూడా సాంభాజీకి వ్యతిరేకంగా రాజ్య సైన్యాలకు సహాయపడడంలోనే, బీజాపూర్ ప్రయోజనాలున్నాయని షర్జా ఖాన్‌కు అప్పీలు చేసింది. (వా-4, పే.259, 260).

ఔరంగజేబ్ కోరికను గాని, రాకుమారి షహ్రియార్‌బానొ అప్పీలును గాని బీజాపూర్ వాళ్ళు అసలు పట్టించుకోనే లేదు. అవసరం వచ్చినప్పుడు సాంభాజీ తమకు మిత్రునిగా ఉంటాడని మాత్రమే వారు తలంచారు. (వా-4, పే.260).

వీరు అసలే సాంభాజీ పక్షాన్ని విడనాడరని బీజాపూర్ చరిత్రకారుడు బసాతీనుస్సలాతీన్ రచయిత మిర్జా ఇబ్రాహీమ్ జుబేరీ నిర్మొహమాటంగా అంగీకరించాడు. (బ.స.లా. పేజి 528, (హి.అ.ఔ. - జ.నా. సర్కార్, వా.4, పేజి 260)

రూహుల్లా ఖాన్ మరియు రాకుమారుడు ఆజంను బీజాపూర్‌పై దాడి జరుపడానికి ఔరంగజేబ్ పంపించడంలో అసలు ఉద్దేశమేమిటంటే బీజాపూర్ నుండి సాంభాజీకి ఎలాంటి సహాయం అందకూడదు. బీజాపూర్ ప్రభుత్వ పరిస్థితి రోజు రోజుకు దిగజారసాగింది. మస్ఊద్ మనసు విరిగి, తన జాగీరుకు వెళ్ళిపోయాడు. తిరిగి వెళ్ళి కర్నూలులో తానొక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చనే తలంపు మస్ఊద్‌కు వచ్చింది. అతని తరువాత ఆఖా ఖుస్రో ప్రధానమంత్రి అయ్యాడు. కాని తొందరలోనే అతను మృత్యువాతబడ్డాడు. ఇకిప్పుడు ప్రభుత్వ అధికారాలన్నీ షర్జా ఖాన్ చేతుల్లోకి వచ్చాయి. అతను వాగంగీర్‌కు చెందిన పామ్‌నాయక్‌తో సహాయాన్ని కోరాడు. (వా-4, పే.263).

ఔరంగజేబ్ బీజాపూర్ సుల్తానుకు ఒక లేఖ వ్రాశాడు. అందులో "మరాఠాలను ఎదుర్కోవడానికి మొగలు సైన్యాలకు తమ ప్రాంతం గుండా పోవడానికి అనుమతించాలని, వాటికి ఆహారం ఇంకా ఇతర అత్యవసర వస్తువులు సరఫరా చేయాలని, ఐదారు వేల అశ్విక దళంతో తోడ్పడాలని, సాంభాజీకు ఏ రకమైన సహాయం అందించకూడదని, షర్జాఖాన్‌ను తన వద్ద నుండి గెంటివేయాలని" ఆదేశించాడు. (వా-4, పే.263). దీనికి సికందర్ ఆదిల్ షా ఇచ్చిన సమాధానంలో పై విషయాల్లో ఏ ఒక్క దాన్ని ఆమోదించినట్లు తెలుపలేదు. అందువల్ల సికందర్ సాంభాజీకు అన్ని రకాలుగా సహాయపడతాడని చక్రవర్తికి విశ్వాసం కలిగింది. అయినప్పటికీ చక్రవర్తి అతనికి రాజవస్త్రాలు, ఉత్తరాలు పంపుతూను ఉన్నాడు. సికందర్ కూడా మరాఠాలకు వ్యతిరేకంగా రాకుమారుడు ఆజంకు తన సైన్యాన్ని పంపి సహాయం అందిస్తానని బూటకపు వాగ్దానాలు చేశాడు. కాని అతను రహస్యంగా తన మిత్రుల్ని కూడా వెదుక్కోసాగాడు. అతను గోల్కొండ సుల్తానుతో కూడా సహాయం అర్థించాడు. మస్ఊద్ నుండి సలహాలు తీసుకుంటున్నాడు. తన రాజధానిని చింతూ చమ్నా పేరుగల ఒక బ్రాహ్మణునికి అప్పగించాడు. నవాబ్ అబ్దుల్ రవూఫ్ మరియు షర్జా ఖాన్‌లు మొగలుల్ని ఎదుర్కోవడానికి బయలుదేరారు. గోల్కొండ నుండి కూడా సహాయం అందింది. (వా-4, పే.264). సాంభాజీకు దీవాన్ అయిన మేల్‌గిరి పండిట్ సారథ్యంలో ఒక సైన్యం బీజాపూర్ చేరుకున్నప్పుడు, సుల్తాన్ జహ్రాపూర్ గేటు వరకెళ్ళి అతన్ని స్వాగతించాడు. (వా-4, పే.265). ఇక ఇప్పుడు మొగలులకు, బీజాపూర్ వాళ్ళకు మధ్య ఎలాంటి శాంతి సంధులకు అవకాశాలు లేకపోయినప్పుడు, చక్రవర్తి సైన్యాలు 1685 ఏప్రిల్‌లో బీజాపూర్ కోటను ముట్టడించాయి. ఔరంగజేబ్ అహ్మద్ నగర్ నుండి షోలాపూర్ చేరుకున్నాడు. దాన్ని కేంద్రంగా చేసుకొని బీజాపూర్‌ను ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ముట్టడి మధ్యలోనే మస్ఊద్ ఒక సైనిక దళాన్ని పంపి బీజాపూర్‌కు సహాయాన్ని అందించాడు. వేరొకవైపు గోల్కొండ నుండి వచ్చిన సైన్యానికి అంబాజీ పండిత్ సారథ్యం వహిస్తున్నాడు. కొన్ని రోజుల తరువాత సాంభాజీ, హంబీర్ రావు సారథ్యంలో ఇంకొక సైన్యాన్ని పంపించాడు. ఔరంగజేబ్ పక్షాన బహ్రామంద్ ఖాన్, షాహ్ ఆలం, ముహమ్మద్ ఆజం మరియు ఖానె జహాంలు ముట్టడిలో పాల్గొంటున్నారు. అయితే రాజ్యసైన్యాల్లో తీవ్రమైన కరువు ఏర్పడింది. సైనికులంతా ధైర్యాన్ని విడనాడారు. వెనుదిరుగడానికి ఆయత్తమయ్యారు. కాని రాకుమారుడు ఆజం, తన సైనికాధికారుల ఒక మీటింగ్‌ను ఏర్పాటు చేసి అందులో "తన మిత్రులు తలిచింది చేసుకోవచ్చని తాను మాత్రం తన ఇద్దరు కుమారులు మరియు పత్నితో ఈ ప్రమాదకర ప్రాంతాన్ని వదిలేది లేదని, ప్రాణం ఉన్నంత కాలం ఇక్కడ్నే ఉంటానని, తానిక్కడ చనిపోతే, స్వయంగా చక్రవర్తే వస్తారని, తన మృతదేహాన్ని ఖననం చేస్తారని" బహిరంగంగా ప్రకటించాడు. అతని ఈ నిర్ణయాన్ని విన్న సైనిక నాయకులందరూ అతనితోనే ఉండడానికి సంసిద్ధమయ్యారు. ఔరంగజేబ్ కుమారుడు ప్రదర్శించిన ఈ అసామాన్య ధైర్యస్థయిర్యాలకు ముగ్ధుడై, అతని సహాయం కోసం ఒక గొప్ప సైన్యాన్ని పంపించాడు.

గాజియొద్దీన్ ఖాన్ బహాదూర్ ఫెరోజ్ జంగ్, సైన్యాన్ని, ఆహార పదార్థాల్ని తీసుకొని ఇక్కడికి చేరుకోగానే క్షామం దూరమైపోయింది. (వా.4, పేజి 272-273)

బీజాపూర్ ముట్టడి పదిహేను నెలలుగా సుదీర్ఘంగా కొనసాగుతున్నందున స్వయంగా ఔరంగజేబ్ అక్కడికి చేరుకున్నాడు. అతని సైన్యంలో వ్యతిరేకతలు పొడసూప నారంభించాయి. షాహ్ ఆలం గురించి అనుమానాలు వచ్చాయి. కాని ఎప్పుడైతే ఔరంగజేబ్ అక్కడికి చేరుకున్నాడో, పరిస్థితులు మారిపోయాయి. కోటలో దిగ్బంధంలో నున్నవారు ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల కొరత వల్ల గిలగిల కొట్టుకోసాగారు. పెద్ద సంఖ్యలో మరణించసాగారు. కోట ముట్టడిలో ఔరంగజేబ్ అసామాన్యమైన ధైర్యస్థయిర్యాలు, చొరవ, తెగింపు మరియు తన వీరత్వాన్ని ప్రదర్శించాడు.

ముట్టడి, దిగ్బంధంతో దద్దరిల్లిపోయిన కోట లోపలివారు, కోటలోని ధార్మికవేత్తలు, పుర ప్రముఖులు, ఇంకా ఇతర పెద్ద మనుషులతో కూడిన ఒక ప్రతినిధి వర్గాన్ని పంపించారు. వారొచ్చి ఔరంగజేబ్‌ను కలిసి ఇలా విన్నవించుకున్నారు : “తమరు ఒక సిసలైన ముస్లిం. ధార్మిక శాస్త్ర ప్రవీణులు, ఏ విషయంలో కూడా ఖురాన్ మరియు ధార్మికవేత్తలకు వ్యతిరేకంగా నడవరు. అలాంటప్పుడు ముస్లింలతోనే మీరు జరుపుతున్న ఈ యుద్ధాన్ని ఏ విధంగా సమర్థించుకుంటారు?” దానికి ఔరంగజేబ్ ఇలా సమాధానమిచ్చాడు : “మీరు చెప్పేదంతా నిజమే. మీ ప్రాంతాన్ని నేను కోరుకోవడం లేదు. కాని ఆ దుర్నీతిపరుడు సాంభాజీ మీ చంకలో కూర్చుండి ఉన్నాడు. ఇంకా మీరతన్ని సంరక్షిస్తున్నారు. సహాయపడుతున్నారు. అతను ఇక్కడి నుండి డిల్లీ ద్వారం వరకు, ప్రజల్ని పీడిస్తున్నాడు. ప్రజలు పెట్టుకునే మొరలు రాత్రింబవళ్ళు నా చెవుల్లో గింగురుమంటున్నాయి. సాంభాజీని నాకప్పగించండి, ముట్టడిని సమాప్తం చేసి రేపే నేనిక్కడి నుండి వెళ్ళిపోతాను.” ఔరంగజేబ్ సమాధానం విన్న ధార్మికవేత్తలు, పురప్రముఖులు తలలు దించేసుకున్నారు. (బసాతీనుస్సలాతీన్, పేజి 542, హి.ఆ.ఔ., జదూనాథ్ సర్కార్, వా-4, పే.274-276).

బీజాపూర్ నాయకుల్లో అసంతృప్తి చెలరేగసాగింది. వారి సుల్తాను నాయకుల చేతుల్లో కీలుబొమ్మగా మారాడని వారికి అర్థమైపోయింది. అతని ద్వారా బీజాపూర్ పరిస్థితి చక్కబడడం కల్ల. తామెవరికోసమని చివరికంటూ పోరాడాలి. స్వయంగా ఆదిల్ షా (సికిందర్) కూడా తాను కేవలం తన మహలు వరకే పరిమితమయ్యానని, దీనికన్నా ఔరంగజేబ్ పెన్షనుదారుగా మారడం ఉత్తమమనే నిర్ణయానికి వచ్చాడు (వా-4, పే.278)...... సికందర్ సైనిక నాయకుల్లోని నవాబ్ అబ్దుర్ రవూఫ్ మరియు షర్జా ఖాన్‌లు 1686 సెప్టెంబర్ 12న బీజాపూర్‌ను ఔరంగజేబ్‌కు అప్పగించారు. సుల్తాన్ సికందర్ షాను, ఔరంగజేబ్ సన్నిధిలోకి తేబడినప్పటి సన్నివేశాన్ని జదూనాథ్ సర్కార్ ఇలా వర్ణించాడు :

“చారిత్రాత్మకమైన ఈ సమయంలో ఒక గొప్ప గుడారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అది ఔరంగజేబ్ క్యాంపులో సర్వసభగా (దర్బారుగా) మారిపోయింది. అత్యున్నతులు,

గౌరవనీయులు అయిన నాయకులందరూ, చిన్న పెద్ద మన్సబుదార్లందరూ శసస్త్రులై, తమ తమ స్థానాల్లో, దర్బారులో వరుసలు తీరి నిలబడ్డారు. బహ్రామంద్ ఖాన్ ఈ సమావేశానికి చీఫ్ ఆర్గనైజర్‌గా వ్యవహరించాడు. అందరినీ సముచిత స్థానాల్ని కేటాయించాడు. సికందర్ ముఖద్వారంపై వచ్చినప్పుడు సామ్రాజ్య ఆర్థికమంత్రి అయిన రూహుల్లా ఖాన్ ఉన్నతాధికారుల ఒక సమూహంతో అతన్ని స్వాగతించాడు. చక్రవర్తి సమక్షంలో ప్రవేశపెట్టాడు. పరాజితుడైన పాలకుడు విజేత ముందు తలవంచాడు. అసామాన్యమైన అతని సౌందర్య, యవ్వనాలను చూసి ప్రతి ఒక్కరూ ప్రభావితులయ్యారు. ఇంకా అతని దురదృష్టానికి విచారించారు. ఔరంగజేబ్ కూడా ప్రభావితం కాకుండ ఉండలేకపోయాడు. అత్యంత మృదువుగా అతనితో ఇలా అన్నాడు : "దైవకారుణ్యం నీపై వర్షించుగాక! నీవు అత్యంత వివేకంతో ప్రవర్తించి, సరియైన నిర్ణయాన్ని గైకొన్నావు. నా అనుగ్రహాలతో, కానుకలతో నిన్ను ఘనంగా సత్కరిస్తాను". ఆ తరువాత అతన్ని తన కుడివైపున, తన మనుమడు మొయిజుద్దీన్ ప్రక్కన కూర్చుండబెట్టాడు. ప్రత్యేక రాజ వస్త్రాల్ని, రత్న ఖచిత చురకత్తిని, ముత్యాల హారాన్ని ఏడువేల విలువ కలిగిన పుష్ప కిరీటాన్ని ప్రసాదించాడు. పదమూడు వేల విలువ గలిగిన ముత్యాల ఒక మాలను కూడా ప్రసాదించాడు. శిరోభూషణము (చుంచు) తో కూడిన తలపాగా, రాజదండాన్ని కూడా ప్రసాదించాడు. సికందర్ ఖాన్‌గా బిరుదును ప్రదానం చేస్తూ సంవత్సరానికి లక్ష రూపాయల పింఛను కూడా నిర్ణయించాడు. దర్బారులోని రాకుమారులు, నాయకులు దానిపై బిగ్గర స్వరంలో హర్షధ్వానాలు చేస్తూ అభినందనలు తెలిపారు. ఆ తరువాత చక్రవర్తి సన్నిధిలో కానుకల్ని కూడా సమర్పించుకున్నారు. సికందర్ కోసం ప్రత్యేకంగా ఒక సువిశాలమైన గుడారం ఏర్పాటు చేయబడింది. ఇషా నమాజ్ తరువాత, విశ్రాంతి తీసుకోవడానికి అతనికి అనుమతి లభించింది. చక్రవర్తి గుడారానికి సమీపంలోనే, అతని కోసం ప్రత్యేకంగా నెలకొల్పబడిన గుడారంలో, తన కుటుంబ సభ్యులతో సహా ప్రవేశించాడు. బీజాపూర్‌కు చెందిన నాయకులందరినీ, రాజ్య (చక్రవర్తి) ఉద్యోగంలో చేర్చుకోవడం జరిగింది. అబ్దుర్ రవూఫ్ మరియు షర్జా ఖాన్ ఇద్దరికీ ఆరువేల పదాతి, ఆరువేల అశ్విక మన్సబుదారుల హోదా ప్రసాదించబడింది. ఒకరికి దిలేర్ ఖాన్ అని, వేరొకరికి రుస్తుం ఖాన్ అని బిరుదులు కూడా ప్రసాదించబడ్డాయి." (వాల్యూం -4, పే.278, 279) (Fatuhat-e-Alamgir, By Eshwar Das Nager, Trans. by. Tasneem Ahmed, page 173, 174)

పైన పేర్కొన్న పేరాగ్రాఫ్‌లు జదూనాథ్ సర్కారు గ్రంథం నుండే గ్రహించబడ్డాయి. వీటిని పరిశీలించడం ద్వారా ఇది రాజకీయ సంఘర్షణే తప్ప, షియా సున్నీల సమస్య కాదని ప్రతి ఒక్కరూ అవలీలగా అర్థం చేసుకోగలుగుతారు. బీజాపూర్ సుల్తానులు మరాఠాలతో కలిసి ఉండకపోతే, ఔరంగజేబ్ వారిపై దాడి జరిపి ఉండకపోయేవాడు. శివాజీ, అతని వారసులు, బీజాపూర్ వాళ్ళతో కలిసి మొగలులకు వ్యతిరేకులుగా మారసాగారు. శివాజీ మరియు సాంభాజీ,

ఔరంగజేబ్‌కు తీవ్ర వ్యతిరేకులు. అలాంటి వారికి బీజాపూర్ వాళ్ళు తమ సహాయ సహకారాలందించడాన్ని ఔరంగజేబ్ ఎలా ఓర్వగలడు? మరాఠాలకు సహాయం చేయొద్దని ఔరంగజేబ్ నిరంతరం బీజాపూర్ వాళ్ళను హెచ్చరిస్తూనే ఉన్నాడు. స్వయంగా జదూనాథ్ సర్కారే పేర్కొన్నట్లు, మొగలులకు వ్యతిరేకంగా మరాఠాలు మాత్రమే తమకు సహాయపడతారని భావించిన బీజాపూర్ వాళ్ళు, ఎల్లవేళలా మరాఠాలకు సహాయం అందిస్తూనే వచ్చారు. ఔరంగజేబ్ తన శత్రువు యొక్క మిత్రుణ్ని ఎలా భరించగలడు? శత్రువుయొక్క మిత్రునితో ఎలా ప్రవర్తిస్తారో, ఔరంగజేబ్ అలాగే ప్రవర్తించాడు. అంతేకాకుండా బీజాపూర్ చివరి సుల్తాను సత్తువ, చలనం లేనివాడై పోయాడు. దర్బారు నాయకుల అంతఃకలహాల వల్ల ప్రభుత్వం స్థంభించిపోయింది. మొగలుల చేతుల్లో కాకపోయినా, మరాఠాల చేతుల్లోనైనాసరే, ఈ రాజ్యం పతనమయ్యేది ఖాయమనే సూచనలు స్పష్టంగా కనబడసాగాయి. ఇంకొక విషయం ఇక్కడ గమనార్హం. ఔరంగజేబ్ బీజాపూర్ రాకుమారి షహ్రియార్‌బానో అలియాస్ బాద్‌షా బీబీని తన కోడలిగా చేసుకున్నాడు. షియాల పట్ల ఔరంగజేబ్‌కు ద్వేషమే గనక ఉంటే, ఒక షియా అమ్మాయిని అతనెన్నటికీ తన కోడలుగా చేసుకొని ఉండేవాడు కాదు. స్వయంగా ఔరంగజేబ్ భార్య కూడా షియానే అని ఇంతకు ముందే తెలిపి ఉన్నాము. ఇవన్నీ వాస్తవాలయినప్పుడు, కేవలం షియా ద్వేషంతోనే ఔరంగజేబ్ బీజాపూర్ రాజ్యాన్ని కబళించాడనటం హేతుబద్ధమూ కాదు, వాస్తవాల రీత్యా అంగీకరించదగినదీ కాదు. చివరికి సికందర్‌ను, అతని నాయకుల్ని దర్బారులో ఎలాగైతే గౌరవించాడో, అది ఔరంగజేబ్ నిష్పక్షపాతాన్ని, సామరస్యాన్ని, హృదయ విశాలత్వాన్ని చాటుతుంది.

## గోల్కొండ పతనం :

ఆలంగీర్ కాలంలో గోల్కొండను పాలిస్తున్న రాజు పేరు అబుల్ హసన్ షా. ప్రజల్లో అతను 'తానాషా' పేరుతో ప్రఖ్యాతి గాంచాడు. అంతకుముందు గోల్కొండను పాలించిన రాజు ఖుతుబ్ షా. అతనికి మగ సంతానం లేదు. ముగ్గురూ కుమార్తెలే. అతని మూడవ అల్లుడు, దూరపు బంధువూ అయిన అబుల్ హసన్‌ను దర్బారు నాయకులు గద్దెనెక్కించారు. అబుల్ హసన్ చిన్నప్పటి నుండే ఫక్కీరులతో జులాయిగా తిరుగుతుండేవాడు. గద్దెనెక్కిన తరువాత కూడా అతని ప్రవర్తనలో పెద్ద మార్పంటూ ఏమీ రాలేదు. ఔరంగజేబ్ సమకాలీన చరిత్రకారుడు, "మాసిరుల్ ఉమరా" రచయిత అయిన షానవాజ్ ఖాన్, తనూ కూడా షియా అయినందున, గోల్కొండ పతనం గురించి వర్ణిస్తున్నప్పుడు, కంపించిపోతాడు. అలాంటి షా నవాజ్ ఖాన్ కూడా, ఈ అబుల్ హసన్ గురించి ఇలా వ్రాశాడంటే, అతని నడవడికలు, ప్రవర్తన ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

"తెలంగాణా రాజ్యాధీశుడు అయిన అబుల్ హసన్ భోగలాలసత్వాల్లో ఎంతగా తలమునకలై ఉండేవాడంటే, కేవలం ఒక్కసారి, హైద్రాబాద్ నుండి ఒక కోసు దూరంలో ఉన్న గోల్కొండకు పోవడం తప్ప, పదిహేను సంవత్సరాల పరిపాలనా కాలంలో అతను హైదరాబాద్ విడిచి బయటికెళ్ళలేదు. రోజూ చేసే స్వారీ కూడా అతనికి కష్టతరంగానే ఉండేది."[2]

యథారాజా తథా ప్రజా అనే లోకోక్తి ప్రకారం రాజ్యమంతా కూడా ఇతని కారణంగా భోగలాలసత్వాలు, వ్యభిచారం, సారాయి సేవనం మొదలుగాగల రుగ్మతల్లో కూరుకు పోయింది. అప్పటి పరిస్థితిని ఖాఫీఖాన్ ఇలా వర్ణించాడు.

"భాగ్‌మతి కాలంలోనే ఈ నగరం సారాయి కొట్లు, వేశ్య గృహాలతో నిండి ఉండేది. అక్కడి అధినేతలు, అధికారులు కూడా అత్యధికంగా భోగలాలసత్వాల్లో మునిగి ఉండేవారు. అందుకని రకరకాల చెడులు, అశ్లీలాలు అక్కడ బాహాటంగా జరుగసాగాయి. ఇక ఎప్పుడైతే అబుల్ హసన్ రాజ్యాధికారాన్ని చేపట్టాడో అతను పాత పరిపాలకుల్ని మించిపోయాడు. అతని కాలంలో అశ్లీల దుర్మార్గాలు, వ్యభిచారాలు మున్నగు చెడులు మిన్నంటాయి. చివరికి హైదరాబాద్ అశ్లీల, దుర్మార్గాల, వ్యభిచారాల నగరంగా పిలువబడేది." (ముంతఖబుల్ లుబాబ్, వా. 2, భా. 3, పేజి 329, 330)

"హైద్రాబాద్ పరిపాలకుడు అబుల్ హసన్ ఖుతుబుల్ ముల్క్ రాజ్యాన్నంతా మాదన్న, అక్కన్నలకు అప్పగించాడు .....దేశమంతటిలో భోగలాలసత్వాలు, వ్యభిచారం, సారా సేవనం, రంకులాడితనం, దుర్మార్గం దౌష్ట్యాలు వ్యాపించి పోయాయి. ఈ వార్తలన్నీ కూడా ఔరంగజేబ్‌కు చేరాయి."[3]

అబుల్ హసన్‌ను సింహాసనంపై కూర్చుండబెట్టినవాడు సయ్యద్ ముజప్ఫర్ పేరుగల అత్యంత ధైర్యస్థైర్యాలు కలిగిన దర్బారు నాయకుడు. కాని అబుల్ హసన్ అతన్ని పదవీచ్యుతుణ్ణి చేసి, మాదన్న పేరుగల ఒక వ్యక్తిని ప్రధానమంత్రిగా కూర్చుండబెట్టి, రాజ్యానికి సంబంధించిన సర్వాధికారాలు అతనికి కట్టబెట్టాడు. అతని అధికార పరిధులు ఎంతగా ఎదిగిపోయాయంటే, దర్బారులోనే అత్యంత పలుకుబడి, శక్తిసామర్థ్యాలు కలిగిన ఇబ్రాహీం ఖలీలుల్లా ఖాన్ నుండి లక్ష రూపాయలు లంచం తీసుకొని, అతన్ని ముఖ్య నాయకునిగా నియమించాడు. మాదన్న పలుకుబడి, అతని అధికార దర్పాల్ని షా నవాజ్ ఖాన్ ఇలా వర్ణించాడు :

"రాజ్యానికి సంబంధించిన పరిపాలనా మరియు ఆర్థికపరమైన సర్వ వ్యవహారాలు మాదన్న మరియు అక్కన్న పేరుగల దౌర్భాగ్యులైన సోదరులకు అప్పగించడం జరిగింది. ఫలితంగా ప్రాచీనమైన ఈ రాజ్యం కలహాలకు, సంక్షోభాలకు, పతన వినాశాలకు వీరే కారకులయ్యారు."[4]

ఆ సమయంలో శివాజీ, ఆలంగీర్ దర్బారు నుండి తప్పించుకొని వచ్చాడు. అతను తిన్నగా హైదరాబాద్ చేరుకొని అబుల్ హసన్‌ను కలిసి, మనమిద్దరం కలిసి, మొగలు ప్రాంతాలపై విరుచుకు పడుదామంటూ సలహా ఇచ్చాడు. దానికి అబుల్ హసన్, సరేనంటూ సైన్యం మరియు ధనంతో అతనికి సహాయం అందించాడు. ఆలంగీర్ పట్టాభిషిక్తుడైన ఇరవై ఒక్కటవ సంవత్సరంలో, శివాజీ మొగలు రాజ్యంలోని ప్రాంతమైన 'జాల్నా'లో జొరబడి దాన్ని సర్వనాశనం చేసేశాడు. ఈ సంఘటనను షా నవాజ్ ఖాన్ ఇలా వర్ణించాడు :

"శివాజీ హైద్రాబాద్ పరిపాలకునితో కుమ్మక్కై, మీ సహాయంతో మొగలు సైన్యాలతో పోరాడుతానని, తన మొదటి ప్రయత్నాన్ని కోటల్ని వశపర్చుకోవడంలో చూడాలని చెప్పాడు.... మరియు ఈ సంవత్సరమే మొగలు ప్రాంతమైన పరగణ 'జాల్నా'ను నిర్జీవంగా మార్చేశాడు."[5]

శివాజీ గతించిన తరువాత అతని కుమారుడు సాంభాజీ అతని వారసుడయ్యాడు. అబుల్ హసన్, ఆలంగీర్‌కు వ్యతిరేకంగా అతన్ని అన్ని రకాల సహాయ సహకారాలందించాడు. అంతేకాకుండా లక్ష హూన్లు (ఆ కాలపు నాణెం పేరు) అతనికి నగదుగా పంపించాడు. ఈ సందర్భంలో ఖాఫి ఖాన్ ఇలా వ్రాశాడు:

"ఇదియే కాకుండా దేశాన్ని కొల్లగొట్టడానికి, నాశనం చేయడానికి మరియు కోటల్ని వశపర్చుకోవడానికి కూడా ఈ దౌర్భాగ్యునికి, శత్రువుకు అతను సహాయం అందించాడు. ఇంకా లక్ష హూన్లు నగదుగా ఇచ్చి, తనను ఎంతగా అపకీర్తి పాల్జేసుకున్నాడంటే, ప్రతి మనిషి నోటిద్వారా ఈ నిందే బయల్పడసాగింది."[6]

వీటన్నిటికీ కలికితురాయి అన్నట్లు, అబుల్ హసన్ ఇంకొక ఘోర తప్పిదానికి పాల్పడ్డాడు. ఔరంగజేబ్ బీజాపూర్ ముట్టడిలో నిమగ్నమై ఉన్నప్పుడు, అబుల్ హసన్ తనో రాయబారి, నాయకుని పేర ఉత్తరం వ్రాస్తూ, ఒక వైపు నుండి సాంభాజీ అసంఖ్యాక సైన్యాన్ని తీసుకొని వస్తున్నాడని, తానిక్కడి నుండి నలభై వేల ప్రచండ సైన్యాన్ని పంపిస్తున్నానని, ఇక ఈ అయ్యగారు (ఔరంగజేబ్) ఎవరెవరిని ఎదుర్కొంటారో చూద్దామంటూ వ్రాసిన లేఖ పట్టుబడుతుంది. ఈ సంఘటనను, అబుల్ హసన్ లేఖ నఖలుతో పాటు చరిత్రకారులందరూ పేర్కొన్నారు. దీన్ని షా నవాజ్ ఖాన్ ఇలా వివరించాడు.

"ఈ ముట్టడి సుదీర్ఘకాలం తీసుకుంటున్నందున, విజేత అయిన చక్రవర్తి (ఔరంగజేబ్) తన ఇష్టం ప్రకారం ఔరంగాబాదు నుండి అహ్మద్‌నగర్, అక్కడి నుండి షోలాపూర్ చేరుకొని, సైన్యాన్ని సమీకరించాడు. (ఏదో పనిమీద వచ్చి) ఔరంగజేబ్ సైన్యాల వద్ద నున్న తన రాయబారికి అబుల్ హసన్ రాసిన ఉత్తరం, యథాస్థితిలో చక్రవర్తి (ఔరంగజేబ్) కంటపడింది. అందులోని సారాంశం ఇలా ఉంది : "మేమింతవరకు ఆయన పెద్దతనం కారణంగా ఊరుకున్నాం. ఇప్పుడాయన సికందర్‌ను అనాథ, బలహీనుడనుకొని బీజాపూర్‌ను ముట్టడించి అతన్ని కలవరానికి గురిచేశాడు. అందుకని ఇకిప్పుడు అసంఖ్యాకంగా ఉన్న బీజాపూర్ సైన్యమే కాకుండా, ఒక వైపు నుండి రాజా సాంభా తన గొప్ప సైన్యాన్ని తీసుకొని ఈ దీనుని (సికందర్) సహాయం కోసం వస్తాడు, వేరొక వైపు నుండి మేము సింహబలుడు ఖలీలుల్లా ఖాన్ సారథ్యంలో నలభైవేల అశ్విక సైన్యాన్ని యుద్ధం కోసం సిద్ధంగా ఉంచాము, ఇక ఆ తరువాత ఆయన ఏ ఏ వైపున, ఎవరెవరిని ఎదుర్కొంటారో చూద్దాం."

ఆ ఉత్తరాన్ని చదివిన ఔరంగజేబ్ "ఈ కోతుల్ని ఆడించేవాన్ని పోనీలే అని ఇంతవరకు విడిచిపెట్టి ఊరుకున్నాం. ఇకిప్పుడు స్వయంగా కోడే కూతవేసిన తరువాత ఇక మిగిలిందేమిటి?" అంటూ వ్యాఖ్యానించాడు.[7]

వెంటనే చక్రవర్తి ఆదేశానుసారం అతని రాకుమారుడు ముఅజ్జం షా సారధ్యంలో సైన్యం బయలుదేరింది. ఈ క్రింది షరతులు అంగీకరిస్తే, తప్పిదాల మన్నింపు కోసం సిఫారసు చేయబడుతుందని రాకుమారుడు, అబుల్ హసన్‌కు ఒక సంధి ప్రతిపాదన చేశాడు. ఆ షరతులు ఇలా ఉన్నాయి.

1. మాదన్న పదవీచ్యుతుడై బంధింపబడాలి.

2. మొగలు రాజ్యంలోని ప్రాంతాలు, వేటినైతే బలవంతంగా ఆక్రమించుకోవడం జరిగిందో, అనగా సీరమ్, రాంగీర్‌లను తిరిగి అప్పగించాలి.

3. ఇంతవరకు బాకీ పడి ఉన్న కప్పాన్ని చెల్లించాలి.

కాని దర్బారు నాయకుల మొండితనంతో అబుల్ హసన్ ఈ షరతుల్ని తిరస్కరించాడు. ఈ విషయంలో ఖాఫిఖాన్ ఇలా వ్రాశాడు :

"యుద్ధాన్ని సాధ్యమైనంతగా నివారించాలని రాకుమారుడు ముఅజ్జం ప్రయత్నిస్తు న్నాడు. అందుకని అతను ఖలీలుల్లాహ్‌కు సందేశం పంపించాడు. అందులో అబుల్ హసన్ తన తప్పిదాలను, పొరపాట్లను అంగీకరించి మన్నింపు, క్షమాపణ కోరుతూ ఉంటే మాదన్న, అక్కన్నలకు పరిపాలనా వ్యవహారాల నుండి తప్పించి, ఖైదు చేయాలని, చక్రవర్తి అధికారుల సంరక్షణలో ఉండి, బలవంతంగా ఆక్రమించుకోబడిన సీరమ్ మరియు రాంగీర్ పరగణాల నుండి వైదొలగి, చక్రవర్తి మన్సబుదారులకు అప్పగించాలని, అంతేకాకుండా ప్రారంభంలోనూ, ఇప్పుడు కూడా తప్పిదాల్ని చేసిన వారిని మన్నింపు, క్షమాపణలకై ప్రభువుల వారి సన్నిధికి పంపాలని కోరాడు. కాని బుద్ధిహీనులైన దక్కన్ దర్బారు నాయకులు గర్వంతో తిరుగబడి, అస్పష్టమైన సమాధానం ఇచ్చారు. అందుకని వారు ప్రభువు క్రోధం, శిక్ష నుండి తప్పించు కోలేరు."[8]

ఈ సంధి ప్రయత్నాలు బెడిసికొట్టిన తరువాత కూడా రాకుమారుడు ముఅజ్జం, "సీరమ్ మొదలగునవి తిరిగి ఇచ్చేయండి" అంటూ కేవలం ఒకే షరతు విధించినా వారు అంగీక రించలేదు. "సీరమ్ మా బల్లెపు కొసకు కట్టబడి ఉంది"[9] అంటూ సమాధానం వచ్చింది.

పరిస్థితుల్ని గాఢంగా అధ్యయనం చేసి, న్యాయంగా చెప్పాలి. రాజులో పరిపాలనా యోగ్యత లేదు. మాదన్నకు ప్రభుత్వ బాధ్యతలన్నీ అప్పగించి, వేశ్యలతో, నృత్యగానాల్లో, సారా సేవనంలో తలమునకలవుతున్నాడు. ఇదే సంస్కృతి దేశంలో నలువైపులా వ్యాపించి పోతుంది. మొగలు సామ్రాజ్యానికి వ్యతిరేకులైన మరాఠాలకు, మొగలు సామ్రాజ్యాన్ని ఛిన్నా భిన్నం చేయమని ధనం, సైనిక బలంతో సహాయ మందించడం జరుగుతుంది. దానితో బలం పుంజుకున్న మరాఠాలు మొగలు ప్రాంతాల్ని కొల్లగొడుతున్నారు. మాదన్న మరాఠాలకు బహిరంగ సమర్థకుడు. దర్బారులోని అత్యున్నత, గౌరవాభిమానాలు కలిగిన నాయకుణ్ని ముఖ్య నాయకునిగా నియమించడానికి మాదన్న లక్ష రూపాయల లంచం తీసుకున్నాడంటే అతని నీతినియమాల్ని అంచనా వేసుకోవచ్చు. ముఖ్య నాయకుని లాంటి కీలక హోదాపై నియమించే అధికారం

కూడా ఇతరులకు అప్పగించాడంటే, అతని పరిపాలనా తీరును అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఔరంగజేబే కాదు, ఇంకెవరైనా సరే, చక్రవర్తిగా ఉంటే ఏం చేసేవారు? ఔరంగజేబూ అదే చేశాడు. దాడి ప్రారంభమైనప్పుడు ప్రాచీన పద్ధతిని అనుసరించి అబుల్ హసన్ మన్నింపు కోసం, ఔరంగజేబ్ సమక్షంలో అర్జీని సమర్పించుకున్నప్పుడు, దానికి అతనీ క్రిందివిధంగా సమాధానమిచ్చాడు.

"ఈ దూరదృష్టి రాహితుని దుర్మార్గాల్ని కాగితంపై తేవడమే అసంభవమైపోతుంది. అవి వందలకు మించి ఉన్నాయి. మొదటిది పరిపాలనా వ్యవహారాల్ని ఒక పాపిష్టి, దుర్నీతి పరుడు, దౌర్జన్యకారునికి అప్పగించడం, నాయకులు, గౌరవనీయులు, పండితుల్ని దరిద్రులుగా, హీనులుగా మార్చడం, సారాయి సేవనం, వ్యభిచారం, భోగలాలసత్వాలకు ప్రచారం ఇవ్వడం, రాత్రింబవళ్ళు ధనమదాంధకారంతో తుళ్ళుతూ, కులుకుతూ గడపడం, సత్యానికి బదులు అసత్యానికి, న్యాయానికి బదులు దౌర్జన్యానికి, దైవారాధనకు బదులు ఘోర పాపకార్యాలను సమర్థించడం, వ్యతిరేకులకు సహాయ సహకారాలందించడం, ఇంకా తన చర్యను సమర్థించు కోవడం – ఇవన్నీ ఏమిటి? దైవాజ్ఞల్ని శిరసావహించను, ఆయన దయానుగ్రహాల నుండి తనను వంచించుకుంటాననుకోవడమే కదా!

ముస్లిమేతరుల పట్ల మేలుగా ప్రవర్తించాలని, దివ్య ఖురాన్‌లో ఆదేశాలు ఉన్నాయనేది వాస్తవమే. అయినా దైవం మరియు సృష్టితాల (ప్రజల) దృష్టిలో గర్హనీయమైన వారి పట్ల కాదు. ఇంకా పోరాడుతున్న శత్రువుకు సహాయపడటాన్ని నిషేధిస్తూ ఖుర్ఆన్‌లో స్పష్టమైన ఆదేశాలున్నాయి. దీని గురించి గట్టిగా తాకీదు చేయడం జరిగింది. అయితే ఎల్లప్పుడు మేము కేవలం హితోపదేశం చేస్తూనే పోయాం. పరస్పరం సత్సంబంధాలు నెలకొల్పు కోవడానికి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకునే వాటిపై ఆధారపడిన ఫర్మానాలనే జారీ చేశాము. ఇంకా ఎల్లప్పుడు (క్షమించే), చూసీచూడనట్లు పోయే పద్ధతినే కఠినంగా అనుసరించాము. ఇటీవల కాలంలోనే దుర్నీతిపరుడైన సాంభాకు ఒక లక్ష హూన్‌లు పంపించినట్లు మాకు తెలిసింది. అయినా అతని పట్ల మృదువైన, సౌలభ్యమైన (పద్ధతుల్ని ప్రదర్శించిన) వేలాది సామెతలున్నాయి. కానీ ఏ మాటా అతని చెవికెక్కలేదు. ఇలాంటి మృదుత్వాన్ని సౌలభ్యాన్ని సమకూర్చిన తరువాత కూడా గర్వాహంకారాలు, తిని త్రాగే మరియు చెడు వర్తనపు తన మార్గంపై పయనిస్తూనే ఉన్నాడు. ఇంకా ఇహపరాల్లో తప్పించుకుంటానని ఆశించి కూర్చున్నాడు. అహో! ఎంత మిథ్యదైనదీ ఆలోచన, ఎంత అసంభవమైనదీ భావన!" (*ముంతఖబుల్ లుబాబ్ – ఖాఫీఖాన్ : వా–2, భాగం 3, పేజి 297, 298*)

పై వాక్యాల్ని చదవండి, పదే పదే చదవండి. అందులో ఒక్క మాట, ఒక్క పదమన్నా సంఘటనలకు, వాస్తవాలకు విరుద్దంగా ఉందా? అయినప్పటికీ ఈ విచిత్రాన్ని చూడండి. నేమత్ ఖాన్ ఆలీ (వఖాయె నేమత్ ఖాన్) షా నవాజ్ ఖాన్ (మాసిరుల్ ఉమరా) మరియు ఖాఫీ

ఖాన్ (ముంతఖబుల్ లుబాబ్) – ఈ చరిత్రకారుల వద్ద పై సంఘటనలన్నీ, పై వాస్తవాలన్నీ ఉన్నప్పటికీ కూడా హైదరాబాద్ వైపు (దాడి కాదు) కన్నెత్తి చూడడం కూడా పాపమేనట. వారి స్వంత ఆలోచనలననుసరించి హైదరాబాద్‌పై దాడి జరపడానికి స్వయంగా ఔరంగజేబ్ ఆత్మ (Concious) కూడా కంపించిపోయిందట. అందుకే అతను హైదరాబాద్‌కు బయలుదేరే ముందు షేఖుల్ ఇస్లాంను (అత్యున్నత మతాధికారిని) ఫత్వా అడిగాడట. ఇంకా ఆయన ఎట్టి పరిస్థితిలో కూడా అనుమతించకపోవడమే కాదు, తన పదవికి రాజీనామా కూడా చేశారట. వీరు మోపే ఇంకొక నింద ఏమిటంటే, ఔరంగజేబ్, మిర్జా ముహమ్మద్‌ను తన రాయబారిగా హైదరాబాద్ పాలకుడు అబుల్ హసన్ వద్దకు పంపేటప్పుడు అతన్ని ఏకాంతంలోకి తీసుకుపోయి "అబుల్ హసన్‌తో ఎంత కఠినంగా మాట్లాడాలంటే అతను కూడా వివశుడై కఠినంగా ప్రవర్తించాలి, తద్వారా నాకు హైదరాబాద్‌పై దాడి జరిపే సాకు లభిస్తుందని రహస్యంగా చెప్పాడట. వారు మోపే ఇంకొక నింద ఏమిటంటే అతను తన రాయబారిని అబుల్ హసన్‌ను ఒక అత్యంత అమూల్యమైన వజ్రాన్ని కోరమన్నాడని, దానికతను నిరాకరిస్తాడని తద్వారా యుద్ధానికి అవకాశం లభిస్తుందట – వీరి నిందలు ఎంత తుచ్ఛమైనవో పరిశీలించండి.

పై చరిత్రకారుల తెలివిని, వివేకాన్ని గమనించండి. మరాఠాలతో కలిసి బహిరంగ కుట్రలు పన్నటం, డబ్బు జాగీర్లిచ్చి మొగల్ ప్రాంతాన్ని కొల్లగొట్టమని మరాఠాలను ప్రోత్స హించడం, స్వయంగా మొగల్ ప్రాంతాల్ని ఆక్రమించుకోవడం, దేశంపై నైతికత లేని దౌర్జన్య కారులు క్రమ్ముకుపోవడం, దేశమంతటిలో అస్తవ్యస్థత, అరాచకం, సారా, వ్యభిచారం, భోగలాల సత్వాలకు ప్రచారం ఇవ్వడం, దర్బారులోని అత్యున్నత నాయకుల్ని, పండితుల్ని హీనపరచడం – హైదరాబాద్‌పై దాడి జరపడానికి పై కారణాలు సరిపోవా? దానికి బదులు కఠిన పదాలతో మాట్లాడితే, లేక అమూల్యమైన వజ్రం ఇవ్వకపోతే దాడి జరుపుదామని ఆలోచించి పెట్టుకున్నాడనటం ఎంత హాస్యాస్పదమైనది! ఎంత అవివేకమైనది!!

అబ్దుల్ ఖాదర్ బదాయూనీ అనే చరిత్రకారుడు అక్బర్ కాలం నాటి నిజమైన, వాస్తవమైన సంఘటనల్నే పేర్కొన్నప్పటికీ, కొంచెం అక్బర్‌ను విమర్శిస్తూ వ్రాశాడు. అక్బర్ కుమారుడైన జహంగీర్ తన పరిపాలనా కాలంలో ఆ గ్రంథం అస్సలు ప్రచురించబడకూడదని నిషేధాజ్ఞలు జారీచేశాడు. అయితే నేమత్ ఖాన్ ఆలీ, "వఖాయె నేమత్ ఖాన్" అనే తన గ్రంథంలో ప్రారంభం నుండి అంతం వరకు ఔరంగజేబ్‌ను అవహేళన చేస్తూ వ్రాశాడు. కానీ ఔరంగజేబ్ వారసుడు (కుమారుడు) బహద్దుర్ షా తన షియా భావ జాలం కారణంగా నేమత్ ఖాన్‌కు "దానిష్‌మంద్ ఖాన్" అనే బిరుదును ప్రసాదించాడు. ఇంకా అతని గ్రంథం "వఖాయె నేమత్ ఖాన్" ను కోర్సులో చేర్చడం జరిగింది. బహద్దుర్ షా లాంటి వారసుడు, నేమత్ ఖాన్ ఆలీ, ఖాఫీ ఖాన్ మరియు షా నవాజ్ ఖాన్ లాంటి చరిత్రకారులు లభించినప్పుడు పాపం ఔరంగజేబ్‌కు మంచి పేరు లభించే అవకాశాలెక్కడుంటాయి? అయినప్పటికీ ఈ పక్షపాతం గల చరిత్రకారులు

వాస్తవాలను మరుగుపరచలేకపోయారు. స్వయంగా వారే పేర్కొన్న సంఘటనలను అనుసరించి హైదరాబాద్ పతనం ఒక ఇస్లామీయ రాజ్య (షియా రాజ్యం) పతనం కాదని, మరాఠాల ఒక సామంత రాజ్య పతనమని నిరూపితమై పోతుంది.

దక్కన్ రాజ్యాల్ని సమాప్తం చేసి ఔరంగజేబ్ స్వయంగా తన సామ్రాజ్యాన్ని సమాప్తం చేసుకున్నాడని కొందరు మిత్రులు వాదిస్తారు. ఎందుకంటే ఈ దక్కన్ రాజ్యాలు మరాఠాలను అణచి ఉంచాయి. వారి పట్టు సడలిపోగానే మరాఠాలు బలం పుంజుకున్నారు. అయితే ఈ దక్కన్ రాజ్యాలు మరాఠాల సామంత రాజ్యాలుగా మారిపోయాయనే విషయం పాపం వీరికి తెలియదు. ఈ వాస్తవాన్ని క్రింద జదూనాథ్ సర్కార్ వాఙ్మాలాల ద్వారా మీరే గ్రహించ గలుగుతారు. ఒకవేళ ఔరంగజేబ్ ఈ రాజ్యాల్ని జయించక అలాగే విడిచిపెట్టినట్లయితే, అవి తప్పకుండా మరాఠాల చేతుల్లోనైనా పతనమయ్యేవే. (ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్ - అల్లామా షిబ్లి నోమానీ, పేజి 12, 13).

పైన పేర్కొంటూ వచ్చినవి గోల్కొండ పతనానికి సమకాలీన చరిత్రకారులు తెలిపిన కొన్ని కారణాలు. ఔరంగజేబ్‌పై సుదీర్ఘంగా వ్రాసిన మన ఆధునిక చరిత్రకారుడు జధూనాథ్ సర్కార్ ఈ విషయంలో ఏమని పేర్కొన్నారో తెలుసుకోవడం అసమంజసం కాదనుకుంటాము.

జధూనాథ్ సర్కార్ ఇలా వ్రాశారు :

"గోల్కొండ ఆరవ సుల్తాను అయిన అబ్దుల్లా ఖుతుబ్ షా, పన్నెండు సంవత్సరాల చిరు ప్రాయంలో సింహాసనాన్ని అధిష్టించాడు. అతను దాదాపు నలభై ఆరు సంవత్సరాల వరకు రాజ్యాన్ని ఏలినప్పటికీ, అసలు రాజ్యాధికారాన్ని అతని తల్లి "హయాత్ బక్ష్ బేగం" నడుపు తుండేది. ఆమె ఒక సుల్తాన్‌కు కుమార్తె, ఒక సుల్తాన్‌కు భార్య, ఒక సుల్తాన్‌కు తల్లి. ఆమె ఎంతటి చక్కటి పరిపాలన జరిపిందంటే, నలువైపులా శాంతి సామరస్యాలు నెలకొన్నాయి. ఆమె గతించిన తరువాత, అతని పెద్దల్లుడు సయ్యద్ అహ్మద్ నిజాం పరిపాలనా వ్యవహారాల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. (వా-4, పేజి 283). ఇక అబ్దుల్లా ఖుతుబ్‌షా భోగలాలసత్వాల్లో, నృత్యగానాల్లో తన సమయాన్నంతా గడుపుతుండేవాడు. అతనికి మగ సంతానం లేదు. కేవలం ముగ్గురు కుమార్తెలే. మొదటి అమ్మాయి వివాహం సయ్యద్ అహ్మద్‌తో జరిగింది. రెండవ అమ్మాయి వివాహం ఔరంగజేబ్ జ్యేష్ఠపుత్రుడు ముహమ్మద్ సుల్తాన్‌తో జరిగింది. మూడవ అమ్మాయి వివాహం అబుల్ హసన్‌తో జరుపబడింది. అతను షేఖ్ సయ్యద్ రాజు ఖత్తాల్‌కు భక్తుడు. మరియు ఖుతుబ్ షాహి వంశంతో సంబంధమున్నవాడు. 1672లో సుల్తాన్ అబ్దుల్లా ఖుతుబ్ షా గతించినప్పుడు, వారసత్వం కోసం తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. చివరికి అబుల్ హసన్‌కే కిరీటం వరించింది. ప్రథమంలో ఇతనికి ముజఫ్ఫర్ ప్రధాన మంత్రి అయ్యాడు. కాని అబుల్ హసన్ అతనితో అసంతృప్తి చెంది, ప్రధానమంత్రి పదవి నుండి అతన్ని తొలగించాడు. మాదన్నను తన ప్రధానమంత్రిగా చేసుకొని, అతనికి సూర్యప్రకాశ్‌రావు అనే బిరుదును ప్రసాదించాడు. (వాల్యూం - 4, పేజి 285, 286). పదమూడు సంవత్సరాల వరకు అతనీ

హోదాపై ఉన్నాడు. అతని సోదరుడు అక్కన్న సైన్యాధ్యక్షునిగా నియుక్తుడయ్యాడు. అతని సోదర కుమారుడు యంగన్నాను కూడా ఒక సైనికాధికారిగా నియమించడం జరిగింది. మాదన్న, ముహమ్మద్ ఇబ్రాహీం వద్ద నుండి లక్షరూపాయల లంచం తీసుకొని, అతన్ని ముఖ్య నాయకునిగా నియుక్తుణ్ని చేశాడు. (వాల్యూం-4, పేజి 284-286). మాదన్న ప్రధానమంత్రిత్వ కాలంలో, దర్బారు తీవ్ర సంక్షోభాలకు నిలయమై, ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ అంతా కూడా అత్యంతంగా క్షీణించిపోయింది. మాదన్న మరాఠాల సమర్థకుడు. 1677లో అతను శివాజీని హైద్రాబాద్‌కు ఆహ్వానించినప్పుడు, అతన్ని ఘనంగా, రాజరికపు లాంఛనాలతో స్వాగతించడం జరిగింది. గోల్కొండను సంరక్షిస్తే అతనికి లక్ష హూన్ల కప్పం చెల్లిస్తామని తెలుపుకోవడం జరిగింది. (వాల్యూం-4, పేజి 287). శివాజీ మరణించిన తరువాత అతని వారసునితో కూడా ఇలాంటి సన్నిహిత సంబంధాలే కొనసాగించడం జరిగింది. మొగలుల తరఫున గోల్కొండలో ఒక రెసిడెంట్ ఉండేవాడు, అతను అక్కడి ప్రభుత్వంపై ఎంతటి పట్టు కలిగి ఉండేవాడంటే, బీజాపూర్ కంటే ముందే గోల్కొండను సమాప్తం చేసే అవసరం ఔరంగజేబ్‌కు కనిపించలేదు. మాదన్ననే రాజ్యమేలుతున్నాడు. ఇక స్వయంగా అబుల్ హసన్ మహలులో నర్తకీలతో, ఉంపుడుగత్తెల ఒక సైన్యమే ఉంచుకున్నాడు. వీరితో అతను రాత్రింబవళ్ళు భోగలాలసత్వాల్లో సమయం గడిపేసేవాడు. ఔరంగజేబ్ తను రాజ్యాధికారం చేపట్టిన ముప్ఫది సంవత్సరాల వరకు గోల్కొండ జోలికి పోలేదు. (వాల్యూం-4, పేజి 290) అబుల్ హసన్ తరఫు నుండి కూడా క్రమం తప్పకుండా కప్పం చేరుతూ ఉండేది. కాని అబుల్ హసన్ మాత్రం ఔరంగజేబ్‌తో విశ్వసనీయంగా ప్రవర్తించలేదు. అంతేకాక అప్పుడప్పుడు అందులో తిరుగుబాటు ధోరణి వ్యక్తమయ్యేది. అతని వల్ల ఎన్నో నేరాలు జరిగిపోయాయి. (వాల్యూం-4, పేజి 290). సాలుకు రెండు లక్షల హూన్లు కప్పం చెల్లిస్తానని 1656లో జరిగిన ఒప్పందంలో అంగీకరించడం జరిగింది. కాని అదెప్పుడూ పూర్తిగా తీర్చబడనేలేదు. అంతేకాకుండా, ఒక రాజ్యమంత సువిశాల ప్రాంతాన్ని సుల్తాన్ తన జాగీరుగా కేటాయించుకున్నాడు. కోణ్‌కణ్ ప్రాంతంలో మీర్ జుమ్లా గెలిచిన ప్రాంతాల్ని కూడా అతను ఆక్రమించుకొని కూర్చున్నాడు. ఔరంగజేబ్ వారసత్వ యుద్ధాల్లో నిమగ్నమై ఉన్నప్పుడు అతను గండికోట మరియు సిద్ధూత్‌లను ఆక్రమించుకున్నాడు. ఈ ప్రాంతాలు మీర్‌జుమ్లా ఒక ఏజంట్ అధీనంలో ఉండేవి. అయితే ఔరంగజేబ్ తన పట్టాభిషేకం రెండవ సంవత్సరమే ఈ రెండింటిని తిరిగి రాబట్టుకోగలిగాడు. బీజాపూర్ పతనమయ్యే సమయంలో మొగలులు గుల్బర్గాను ఆక్రమించుకుంటే, ఖుతుబ్‌షా సైనికాధికారులు మొగలుల ప్రాంతాలైన మాల్‌ఖడ్ మరియు 'సీరమ్' వగైరాల్ని ఆక్రమించుకున్నారు. 1665-66లో మొగలు రాకుమారుడు ఆజం, దిలేర్‌ఖాన్ మరియు రాజా జైసింగ్ సారధ్యంలో బీజాపూర్‌పై దాడి జరిపినప్పుడు, గోల్కొండ సుల్తాను బాహాటంగా బీజాపూర్ వారికి సహాయం అందించాడు. గోల్కొండవారు చేసిన ఇది చిట్టచివరి నేరం. దీంతో గోల్కొండ పతనం ఖాయమైపోయింది.

గోల్కొండ సుల్తాను శివాజీతో స్నేహసంబంధాలను ఏర్పాటు చేసుకోవడం ఔరంగజేబ్ దృష్టిలో పెద్ద నేరం. అతను అన్ని రకాలుగా శివాజీకి సహాయ సహకారాలు అందించాడు, దానివల్ల శివాజీ మొగలుల నుండి తన కోటల్ని తిరిగి స్వాధీనపరచుకోగలిగాడు. శివాజీ హైద్రాబాద్‌ను సందర్శించినప్పుడు, ఒక చిన్న సామంతరాజు (తన పరిపాలకుణ్ని) ఎలా స్వాగతిస్తాడో, గోల్కొండ సుల్తాను శివాజీని అలా స్వాగతించాడు. అతను శివాజీ అశ్వం మెడలో ముత్యాల హారం వేశాడు. ఇంకా సాలుకు లక్ష హూన్లు చెల్లిస్తానని వాగ్దానం చేశాడు. ఇంకా అతను మాదన్న, అక్కన్నలకు ఎన్ని అపరిమితమైన అధికారాలు ఇచ్చి ఉన్నాడంటే, పరిపాలనా యంత్రాంగం అంతటిపై వీరే కమ్ముకొని పోయారు." (వా-4, పేజి 290-291)

1685లో మొగలులు బీజాపూర్‌పై దాడి జరిపినప్పుడు, అబుల్ హసన్ (రహస్యంగా) పంపిన ఒక ఉత్తరం ఔరంగజేబ్ చేతికి చిక్కింది. అందులో అబుల్ హసన్ ఇలా రాశాడు : "ఇకిప్పుడు బీజాపూర్ సైన్యం మరియు లెక్కలేనంత మంది సాంభాజీ సైనికులు, చక్రవర్తి సైన్యాలతో పోరాడుతున్నప్పుడు, బీజాపూర్ సహాయార్థం, ఖలీలుల్లా ఖాన్ సారధ్యంలో నలుబదివేల సైన్యాన్ని పంపిస్తున్నానని, ఇక ఇప్పుడు ఈ చక్రవర్తుల వారు ఎవరెవరిని ఏ విధంగా అణిచివేస్తారో చూద్దాం." (వాల్యూం-4, పేజి 292)

ఈ ఉత్తరం చదువుకున్న ఔరంగజేబ్‌కు అమితమైన కోపం వచ్చింది. అతను రాకుమారుడు షా ఆలం సారధ్యంలో ఒక పెద్ద సైన్యాన్ని గోల్కొండపై దాడి జరుపడానికి పంపించాడు. గోల్కొండవారు నలుబది నుండి డెబ్బది వేల సైన్యంతో, ఈ సైన్యాన్ని ఎదుర్కొన్నారు. యుద్ధం ఆగి ఆగి జరుగుతున్నది. వర్షాకాలం రావడం వల్ల కొంత అంతరాయం కలిగింది. గోల్కొండ సైన్యాల కమాండర్-ఇన్-ఛీఫ్ మొగలులతో కలిసిపోవడంతో, మొగలులు హైద్రాబాద్‌లో ప్రవేశించడంలో సఫలమయ్యారు. మాదన్న విశ్వసనీయత కూడా అనుమానాస్పదంగా ఉండడంతో సుల్తాను హైద్రాబాద్‌ను విడిచి, గోల్కొండ కోటలోకెళ్లి దాక్కున్నాడు. ఆ తరువాత హైద్రాబాద్ కొల్లగొట్టబడటంతో సర్వనాశనమైపోయింది. 1685 అక్టోబర్ నెలలో మొగలు సైన్యం హైద్రాబాద్‌లో ప్రవేశించింది. (వాల్యూం-4, పేజి 295). రాకుమారుడు షా ఆలంతో, సుల్తాను సంధికి అభ్యర్థించాడు. సంధి విషయంగా రాకుమారుడు షా ఆలం తన తండ్రి ఔరంగజేబ్‌ను సంప్రదించగా అతను ఈ క్రింది షరతుల్ని ప్రతిపాదించాడు : "సుల్తాను కోటి ఇరవై లక్షల బాకీపడిన కప్పం చెల్లించాలి. ఆ తరువాత ప్రతి సంవత్సరం రెండు లక్షల రూపాయల కప్పం చెల్లిస్తుండాలి. మాదన్న, అక్కన్నలను తన వద్ద నుండి తొలగించేయాలి. మాల్‌ఖెడ్ మరియు సీరం ప్రాంతాలను విడిచిపెట్టేయాలి - ఈ షరతులపైనే సుల్తాన్ క్షమింపబడతాడు." ఈ మధ్యలోనే ఔరంగజేబ్ తన కుమారుని విజయంతో సంతృప్తుడై అతనికి ఇనాము రూపంలో విలువైన కానుకల్ని పంపించాడు. అయితే గోల్కొండ ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ ఎంత అస్తవ్యస్తంగా, గందరగోళంగా మారిందంటే, ఈ కానుకల్ని తెచ్చేవారిపై కొంతమంది (గోల్కొండ వారు) దాడి జరిపి, వారు తెచ్చే విలువైన కానుకలన్నిటిని దోచుకున్నారు. ఈ పార్టీ నాయకుడు అబ్దుల్ కరీంను బంధించారు. అయితే ఖుతుబ్‌షా ఈ సంఘటనతో తనకెలాంటి సంబంధం

లేదని తన నిరపరాధాన్ని తెలుపుకున్నాడు. అబ్దుల్ కరీంను విడుదల చేయించి, దోచుకున్న అత్యధిక వస్తువుల్ని తిరిగి ఇచ్చేయడానికి ఎంతో ప్రయత్నం చేశాడు. (వా-4, పే.298)

ఖుతుబ్‌షా మాదన్నను పదవీచ్యుతుణ్ణి చేయడానికి సంసిద్ధం కానప్పుడు, అతని దర్బారు నాయకుల్లో ఆగ్రహావేశాలు బయలుదేరాయి. వారంతా ఇతన్నే గోల్కొండ పతనానికి, ప్రజల రక్తపాతానికి ప్రధాన కారకునిగా పేర్కొన్నారు. (గతించిన) అబ్దుల్లా ఖుతుబ్‌షా విధవలు కూడా మాదన్న పట్ల అత్యంత అనుమాన అసంతృప్తులకు లోనై ఉన్నారు. అతనికి వ్యతిరేకంగా ఎంతటి ద్వేషం ప్రబలిపోయిందంటే, అతను తన సోదరుడు అక్కన్న, సోదర కుమారుడు రుస్తుం రావులతో సహా వధించబడ్డాడు. (గత) రాణులు, వీరి ముగ్గురి తలల్ని రాకుమారుని వద్దకు పంపి, సంధికి విన్నవించుకున్నారు. అయిదు రోజులు గడిచిన తరువాత ఖుతుబ్ షా తన రాయబారిని చక్రవర్తి వద్దకు పంపించాడు, వంద ఏనుగుల్ని కానుకగా సమర్పించుకున్నాడు. ఇక గోల్కొండతో ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని భావించిన ఔరంగజేబ్, రాకుమారుడు షా ఆలంను హైద్రాబాద్ నుండి తన వద్దకు షోలాపూర్ రప్పించుకున్నాడు. తదుపరి బీజాపూర్ వైపు నిమగ్నమయ్యాడు. (జదూనాథ్ సర్కార్ వాల్యూం-4, పేజి 298, 299)

ఇక బీజాపూర్ జయించబడిన తరువాత, ఔరంగజేబ్ చివరిసారిగా గోల్కొండను అణిచివేయాలని నిశ్చయించుకున్నాడు. ఎప్పుడైతే రాజ్యసైన్యాలు హైద్రాబాద్‌ను విడిచి వెళ్ళాయని తెలిసిందో, ఖుతుబ్‌షా గోల్కొండ నుండి హైద్రాబాద్‌కు వచ్చేశాడు. కాని మొగలు సైన్యాలు తిరిగి హైద్రాబాదుకు వస్తున్నాయని తెలియగానే, అతను హైద్రాబాద్ నుండి పారిపోయి, గోల్కొండలో దాక్కున్నాడు. మొగలు సైన్యాలు హైద్రాబాదులో ప్రవేశించాయి. ఇక గోల్కొండ ముట్టడి ప్రారంభమైంది.

ఈ ముట్టడి కొనసాగుతుండగానే, రాకుమారుడు షా ఆలం పట్ల ఔరంగజేబ్ అనుమానానికి గురిఅయ్యాడు, అతను సుల్తానుతో కలిసిపోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అతను (సుల్తానుకు) రాసిన కొన్ని ఉత్తరాలు పట్టుబడగానే, అతను బంధింపబడ్డాడు. ముట్టడి సమయంలో జరిగిన ఘర్షణల్లో ఇరుపక్షాలకు బాగా నష్టం వాటిల్లింది. కరువు కూడా ఏర్పడింది. అంటువ్యాధి కూడా వ్యాపించింది. (జ.నా.సర్కార్ వాల్యూం-4, పేజి 310)

ఔరంగజేబ్ సైన్యంలోని షియా సైనిక సర్దారులు, దక్కన్‌లోని ఈ షియా రాజ్యం సమాప్తం కావడాన్ని కోరుకోలేదని జదూనాథ్ సర్కార్ వ్రాశారు. అందుకే వారు తమ ప్రభువు చేపట్టిన ఈ యుద్ధానికి సంతోషపడడం లేదు. కరువు సమయంలో, వర్షాకాలంలో వారు రహస్యంగా ఈ దిగ్బంధితులకు సహాయం అందించేవారు. దీనితో పాటుగానే “ఔరంగజేబ్ షియా నాయకులు ఔరంగజేబ్ పట్ల అత్యంత విశ్వసనీయతను కనబరచారని, ప్రధాన ఆర్థికాధికారి అయిన రూహుల్లా ఖాన్, ఫిరంగులు మందుగుండు సామగ్రికి ప్రధానాధికారి అయిన సఫ్‌షికన్

ఖాన్ ఇద్దరూ షియాలేనని, వీరిద్దరి వీరత్వం ద్వారానే కోటను వశపరచు కోవడంలో అత్యధిక సహాయం లభించిందని కూడా సర్కార్ గారే పేర్కొన్నారు. (జ.నా.సర్కార్ వాల్యూం-4, పేజి 310-311)

కొందరు సున్నీ ముస్లింలు కూడా, ఈ యుద్ధానికి వ్యతిరేకంగా ఉండేవారని, అనవసరంగా ముస్లింల రక్తం ప్రవహిస్తున్నదని, ఇది పాపమని తలంచేవారని, ఈ కారణంగానే చీఫ్ ఖాజి, షేఖుల్ ఇస్లాం(మతగురువు) తన హోదాకు రాజీనామా సమర్పించాడని, ఆయన ఉత్తరాధికారి అయిన ఖాజి అబ్దుల్లా కూడా ముస్లింల ఈ రక్తపాతాన్ని ఆపాలని ఔరంగజేబ్‌ను కోరాడని, కాని ఆయన మాటను కూడా పట్టించుకోవడం జరుగలేదని జదూనాథ్ సర్కార్ రాశారు. (జ.నా.సర్కార్ వాల్యూం-4, పే.311)

ముట్టడి, దిగ్బంధం సుదీర్ఘమైపోయినప్పుడు అబుల్ హసన్, చక్రవర్తి సన్నిధిలోకి ఒక అర్జీని పంపాడు. అందులో ఇలా పేర్కొన్నాడు : "గోల్కొండను తనకే విడిచిపెట్టినట్లయితే, (క్రమం తప్పక) కప్పం చెల్లిస్తానని చెప్పుకున్నాడు. దానికి బదులు ఇక్కడ వైస్రాయ్‌ను ఉంచి, అతని ద్వారా పరిపాలన సాగిస్తే, దీన్నుండి వచ్చే రాబడి దాని ఖర్చులకే సరిపోతుంది. ఈ ముట్టడి, దిగ్బంధం కారణంగా ఇక్కడి వ్యవసాయం, ప్రజల పరిస్థితి ఎంతగా చెడిపోయిం దంటే, వారు నిలదొక్కుకోవడానికే ఏడెనిమిది సంవత్సరాలు పడతాయని, ఈ మధ్య కాలంలో చక్రవర్తికి ఏమీ లాభించదని, చక్రవర్తి దిగ్బంధం సమాప్తం చేసి వెళ్ళిపోతే, కోటి రూపాయలు యుద్ధ పరిహారంగా చెల్లిస్తానని, ఇక ఆ తరువాత జరిగే ప్రతి దాడికి కోటి రూపాయలు చెల్లిస్తానని, మొగలు సైన్యాలు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితి నివారణ కోసం ఐదారు వేల మణుముల ఆహార పదార్థాల్ని సరఫరా చేస్తానని విన్నవించుకున్నాడు. "వాస్తవంగా అతను విధేయుడై ఉండదలచుకుంటే చేతులు కట్టుకొని, మెడలో త్రాడు వేసుకొని తన సమక్షంలోకి వస్తే, తను అతని పట్ల దయ, కనికరాలతో ప్రవర్తిస్తానని ఔరంగజేబ్ దీనికి సమాధానం పంపించాడు. (జ.నా.సర్కార్, వాల్యూం-4, పే.317)

ముట్టడి సుదీర్ఘమైపోయింది. ఇరుపక్షాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ఆపై జదూనాథ్ సర్కార్ ఇలా రాశారు: "గోల్కొండకు చెందిన అబ్దుల్లా పాని అలియాస్ సర్దార్ ఖాన్ పేరుగల ఒక అఫ్గన్ సైనిక నాయకుడు కోటలోని ఒక కిటికీని మొగలు సైనికాధికారి అయిన రూహుల్లా ఖాన్ కోసం తెరిచేశాడు, అంతే! ఈ ద్రోహంతో మొగలు సైన్యాలు కోటలోకి ప్రవేశించాయి." (జ.నా.సర్కార్ వా-4, పేజి 323)

అబుల్ హసన్‌ను బంధించినవాడు రూహుల్లా ఖాన్ ఒక షియా నాయకుడే! అతన్ని బంధించి చక్రవర్తి ముందు ప్రవేశపెట్టినప్పుడు, దర్బారు చరిత్రకారుణ్ని అనుసరించి, చక్రవర్తి తన స్వాభావికమైన దయ, కనికరాల గుణాల కారణంగా, ఈ నేరస్థుణ్ని శిక్షించకుండా క్షమిం చేశాడు. ఆ తరువాత అతన్ని అతని నివాసానికి చేర్చడానికి ఆదేశించాడు. ఆ రోజు సాయంత్రమే అతను తన రాజమహల్‌కు పంపించబడ్డాడు. ఇది మాసిరె ఆలంగీరిలో తెలిపిన వివరాలు. ఆ తరువాత మాసిరె ఆలంగీరిలో పేర్కొనిన వివరాల్ని జదూనాథ్ సర్కార్ మరుగుపర్చేశారు.

మాసిరె ఆలంగీరిలో ఇలా ఉంది: "అతను తన నేరాల్ని తలుచుకొని అత్యంత భయభీతుడయ్యాడు. కాని రాజక్రోధాగ్రహాలకు బదులు, చక్రవర్తి ప్రదర్శించిన క్షమాగుణాన్ని చూసి అతను కృతజ్ఞుడయ్యాడు." (మాసిరె ఆలంగీరి - పే.211)

మాసిరె ఆలంగీరి రచయిత (ముస్తఅద్ ఖాన్ సాఖి) తన కాలం నాటి హైద్రాబాద్ గురించి ఇలా వర్ణిస్తున్నాడు : "ఈ భూభాగం స్వర్గతుల్యంగా ఉంటుంది. ప్రజలు బహుళ సంఖ్యలో నివసిస్తుంటారు. నగర కట్టడాలు అత్యంత ఎత్తుగా, సుందరంగా ఉన్నాయి. వాతావరణంలోని చల్లదనం, చెలమల ప్రవాహం, నీటిలోని తియ్యదనం, నవనవలాడే మనోహరమైన పచ్చికబయళ్ళు, ఇవన్నీ కలిసి ఇక్కడి పూలు, పచ్చికలు కెంపు, మరకతాల్ని కూడా మరిపిస్తాయి. ఇలాంటి సుందరమైన దేశం, ఆలంగీర్ ప్రభువుల సామ్రాజ్యంలో కలిసిపోయినందుకు దైవానికి కృతజ్ఞతలు. ఈ నగరం దౌష్ట్యాలు, పాపాలు, దురాచారాలు, రంకుతనం, వ్యభిచారాల్లాంటి దుర్గుణాల నుండి బయటపడగలిగింది." (మాసిరె ఆలంగీరి పేజి 212, 213)

అబుల్ హసన్ మధుపానాల్లో, నృత్యగానాల్లో, భోగలాలసత్వాల్లోనే తన కాలాన్నంతా గడుపుతుండేవాడని స్వయంగా జదూనాథ్ సర్కారే పేర్కొన్నప్పుడు, ఈ నగరం దౌష్ట్యాల నుండి, పాపాల నుండి, దుర్గుణాల నుండి విముక్తి పొందిందని మాసిరె ఆలంగీరి రచయిత పేర్కొనడం వాస్తవమే కదా! ఔరంగజేబంటే జదూనాథ్ సర్కారుకు గిట్టదు, అందుకే ఇన్ని దుర్గుణాలున్నాయని తనే పేర్కొన్నా అబుల్ హసన్‌కు ఆయన అభిమాని అయిపోయాడు. అందుకే అతని పట్ల సానుభూతి చూపుతూ అతను దౌలతాబాద్‌లో చెరలో ఉంచబడ్డాడని, అక్కడి కోటలో విరిగిన, శిధిలమైన ఇళ్ళుండేవని, చిన్న చిన్న గదులుండేవని, గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి ఉండేవని, ఇక్కడ్నే దక్కన్‌కు చెందిన అత్యంత భోగలాలసుడైన ఈ పరిపాలకుడు సాలుకు యాభై వేల పింఛనుపై జీవితం వెళ్ళదీశాడని రాశాడు. (జ.నా.సర్కార్ వాల్యూం-4, పేజి 325)

యాభైవేల పింఛను మంజూరి చేసినందుకు ఔరంగజేబ్ సామరస్యాన్ని, సహనాన్ని, హృదయవిశాలత్వాన్ని ప్రశంసించటానికి బదులు, అబుల్ హసన్ గడిపిన చెరజీవితంపై సానుభూతిని వ్యక్తపరిచాడు. అబుల్ హసన్‌ను, ఔరంగజేబ్ వద్దకు తీసుకొని పోతున్నప్పుడు, అబుల్ హసన్ తన భావనల్ని ఎలా వ్యక్తపరిచాడో ముంతఖబుల్ లుబాబ్ రచయిత ఖాఫి ఖాన్ ఇలా వర్ణించాడు:

"సర్వస్తోత్రాలు దైవం కొరకే! నా హృదయంలో ఇంకెలాంటి కోరికలు, పేరాశలూ లేవు. లక్షలాది రూపాయలు ప్రసాదించాను, కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టాను. ఇకిప్పుడు పరిపాలనలో కొన్ని అసభ్యమైన కార్యాలు జరిగిపోయినందువల్ల, దాని పరిణామ స్వరూపంలో దైవం తన చల్లని చూపును నా వైపు నుండి మరల్చుకున్నాడు. అయినప్పటికీ, మిగిలిపోయిన ఈ కొన్ని సంవత్సరాల నా శేష జీవిత పగ్గాన్ని ఔరంగజేబ్ లాంటి ధర్మాత్ముని చేతిలో పెట్టినందుకు,

దైవానికి నేను కృతజ్ఞతలే అర్పించుకుంటున్నాను.” (వా. 2, భా. 3, పే. 326) (జదూనాథ్ సర్కార్, వా. 4, పే. 325, 326)

“అతను ముత్యాల హారాన్ని మెడలో వేసుకొని, అశ్వాన్ని అధిరోహించి, నాయకులతో పాటుగా రాకుమారుడు ముఅజ్జం దగ్గరికి వెళ్ళాడు. సమీపంలోకి రాగానే తన మెడలో నున్న ముత్యాల హారం తీసి, రాకుమారునికి సమర్పించాడు. రాకుమారుడు దాన్ని స్వీకరించి, అతని వీపుపై చేయివేసి నిమురుతూ అతనికి ధైర్యం చెప్పాడు. ఆ తరువాత అతన్ని చక్రవర్తి సన్నిధిలోకి తీసుకవచ్చాడు. చక్రవర్తి కూడా అతన్ని గౌరవించాడు, కొన్ని రోజుల తరువాత దౌలతాబాద్‌కు పంపబడ్డాడు. అతను నిశ్చింతతో జీవితం గడపాలని అతని కోసం ఆహారం, వస్త్రాలు, సుగంధద్రవ్యాలు ఇత్యాదివి అతనికి సమకూర్చబడ్డాయి.” (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫిఖాన్ - వాల్యూం-2, భా. 3, పేజి 327)

బీజాపూర్, గోల్కొండల విజయం తరువాత, అక్బర్, షాజహాన్‌లు కలలుగన్న దాన్ని ఔరంగజేబ్ నిజంచేసి చూపించాడని, ఏ ఒక్కరి భాగస్వామ్యం లేని పూర్తి దక్షిణాదికి అతను యజమాని అయ్యాడని స్వయంగా జదూనాథ్ సర్కారే పేర్కొన్నారు. (జ.నా.సర్కార్, వా-4, పేజి 300). గోల్కొండ కేవలం ఒక షియా రాజ్యం అయినందుకే, దాన్ని సమాప్తం చేయడం జరిగిందనే భావన కలిగేటట్లు, సర్కారు తన పాఠకులపై ప్రభావం వేయ ప్రయత్నించారు. కాని పైన పేర్కొన్న పేరాగ్రాఫ్‌ల వల్ల, దానిపై దాడి జరుపడానికి ఎన్నో రాజకీయ కారణా లున్నాయనేది విదితమయిపోయింది. అబుల్ హసన్ దాన్ని దౌష్ట్యాలకు, నృత్యగానాలకు, వ్యభిచారానికి పాపాలకు కేంద్రంగా మార్చాడు. మాదన్న, అక్కన్నల చేతుల్లో కీలుబొమ్మగా మారాడు, వీరిద్దరూ మరాఠాల గొప్ప సమర్థకులు, గోల్కొండను వారు మరాఠాల సామంత రాజ్యంగా మార్చివేశారు. వారు ఔరంగజేబ్ పట్ల అవిధేయత, తిరుగుబాటు ధోరణిని అవలంబించ డానికి నిరంతరం సంసిద్ధంగా ఉండేవారు. బాహ్యంగా ఔరంగజేబ్‌కు విధేయులుగా కనబడినా, రహస్యంగా, అంతరంగికంగా అతని శత్రువులతో కలిసివుండేవారు. గోల్కొండపై దాడి జరుప డానికి ఈ కారణాలు సరిపోవా? ఇన్ని కారణాలుంచుకొని, కేవలం షియా రాజ్యమనే సాకు చూపించాల్సిన అవసరమేముందని? అతనేగనక షియా వ్యతిరేకి అయివుంటే, తన కుమారుడు ముహమ్మద్ సుల్తాన్‌కు షియా అమ్మాయితో వివాహం జరిపించేవాడే కాదు. (వా. 1, పేజి 132)

గోల్కొండ, బీజాపూర్ మరియు మరాఠాల ప్రాంతాల్ని ఔరంగజేబ్ తన రాజ్యంలో విలీనం చేసుకొని, భారతదేశానికి ఎలాంటి భౌగోళిక ఐక్యతను ప్రసాదించాడంటే, ఇది అతనో మహోన్నత పాలకునిగా గుర్తించబడడానికి తార్కాణం. ఈ విషయంలో భారతదేశంలో అంతకుముందు వచ్చిపోయిన పరిపాలకులందరిపై అతనికి ప్రాధాన్యత నివ్వవలసి వస్తుంది. దీన్ని జదూనాథ్ సర్కార్ కూడా ప్రశంసించారు.

ఎవరెన్ని విధాలుగా నిందించినా, పై వివరాల వల్ల ఔరంగజేబ్ భారతదేశ సమగ్రత, అఖండతల కోసం, దేశాన్ని సమైక్యపరచడం కోసం, మొత్తం భారత జాతిని, దేశాన్ని ఒకే

కేంద్రం, ఒకే పతాకం, ఒకే పరిపాలన క్రిందికి తేవడం కోసం హిందూ-ముస్లిం, షియా-సున్నీ, ఉత్తర-దక్షిణ అనే తారతమ్యం లేకుండా అందరితో ఒకేవిధంగా, ఒకే తరహాలో, ఒకే నీతితో వ్యవహరించి, మొత్తం భారతదేశానికి, చరిత్రలోనే మొదటిసారిగా ఒక అఖండ రూపాన్నిచ్చి, భారతదేశమంతా ఒక్కటే, భారతజాతి అంతా ఒక్కటే అనే భావన నిచ్చిన అత్యంత దూరదృష్టిగల మహోన్నత పరిపాలకుడు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

స్వాతంత్ర్యానంతరం ఆధునిక భారత దేశాన్ని సమైక్యపరచడం కోసం దేశంలోని వివిధ సంస్థానాల్ని భారత దేశంలో విలీనం చేసిన వారిని నేడు అత్యధికంగా ప్రశంసిస్తున్నారు, గౌరవిస్తున్నారు. సరే, చాలా మంచి విషయం. కానీ ఇదే పనిని శతాబ్దాలకు పూర్వమే చేసి పెట్టిన ఔరంగజేబ్‌ను నిందించడం ఎంత వరకు న్యాయమో పాఠకులే ఆలోచించాలి.

## అఫ్గన్లు (పఠాన్లు)తో ఘర్షణ :

గోల్కొండ, బీజాపూర్‌ల విషయంలోనే కాకుండా అఫ్గన్ల విషయంలో కూడా ఔరంగజేబ్‌ను దూషించడం జరిగింది. బీజాపూర్, గోల్కొండ, మరాఠాలు, సిఖ్ఖులు, రాజ పుత్రుల విషయంలో లాగా అఫ్గన్ల విషయంలో చరిత్రకారులు అంతగా గొంతెత్తి నిరసన తెలుపలేదు, కాని ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో సత్నామీల, అఫ్గన్ల తిరుగుబాట్లు కూడా పేర్కొనదగిన విషయాలనడంలో సందేహం లేదు. నిష్పక్షపాత దృష్టితో ఔరంగజేబ్ పరిపాలనా విధానాన్ని సమీక్షిస్తే, కేంద్రానికి వ్యతిరేకంగా ఎవరు తిరుగబడినాసరే, వారు హిందువులా, ముస్లింలా అనే తారతమ్యం లేకుండా ఔరంగజేబ్ వారిని అణిచివేశాడు. కేంద్రానికి, దేశ సమగ్రతకు వ్యతిరేకంగా తిరుగబడిన వారిని అణచివేయడమనే పాలసీ కేవలం ఒక్క ఔరంగజేబ్ వరకే పరిమితం కాదు. నేటి ఆధునిక కాలంలో కూడా అన్ని దేశాలు, అన్ని ప్రభుత్వాలు కేంద్రానికి, దేశ సమగ్రతకు ముప్పుతెచ్చే వారిని ఉపేక్షించి వదలివేయడం లేదు. ఈ సామెతల్ని మనం ప్రపంచం నలువైపులా వివిధ దేశాల్లో కనుగొనవచ్చు. ఇదే పద్ధతిని, ఇదే పాలసీని ఆ కాలంలో ఔరంగజేబ్ కూడా అవలంబిస్తే, అతన్ని క్రూరుడని, వివిధ వర్గాల ప్రజల స్వతంత్రాన్ని హరించిన వాడని రకరకాలుగా నిందించడం జరిగింది. గడిచిన చరిత్రకారులు ఔరంగజేబ్ పట్ల న్యాయంగా వ్యవహరించలేదని, నిష్పక్షపాతంగా సమీక్షించలేదనడానికి ఇదో తార్కాణం. అఫ్గానిస్తాన్ మరియు కాబూల్‌లు వందల సంవత్సరాల నుండి భారత (మొగలు) పాలకుల అధీనంలో ఉంటూ వచ్చాయి. అందుకని అక్కడ తిరుగుబాటు లేపి, కేంద్ర ప్రభుత్వం నుండి విడిపోవడాన్ని శక్తిమంతుడైన ఏ భారత చక్రవర్తి సహించలేడు. ఔరంగజేబ్ లాంటి దూరదృష్టి, పరిపాలనపై గట్టి పట్టు కలిగిన పరిపాలకుడు అఫ్గన్ల ఈ తిరుగుబాటును ఎలా సహించగలడు? అందుకే వారి విద్రోహాన్ని అణచడానికి ఔరంగజేబ్ సామ, భేద, దండోపాయాలన్నింటిని ఉపయోగించి వారిని తన అదుపులోకి తేవడంలో కృతార్థుడయ్యాడు.

అఫ్‌గన్ల విద్రోహాన్ని, దాని పూర్వాపరాలను, దాన్ని ఔరంగజేబ్ అణచివేసిన విధానాన్ని డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ సంక్షిప్తంగానూ, అన్ని కోణాల్ని పరివేష్టించే విధంగాను విశ్లేషించారు గనక ఆయనగారి అభిప్రాయాల్ని పాఠకుల ముందుంచుతున్నాము.

"ఔరంగజేబ్‌కు అఫ్‌గన్లు లేక పఠాన్లతో కూడా ఘర్షణ పడాల్సి వచ్చింది. వీరు పంజాబ్ మరియు కాబూల్ మధ్య కొండప్రాంతాల్లో తమ వీరత్వంతో స్థావరాలు ఏర్పరచుకొని నివసిస్తుం దేవారు. అక్బర్ మరియు షాజహాన్లకు కూడా వీరికి వ్యతిరేకంగా యుద్ధాలు చేయవలసివచ్చింది. భుక్తికి, ఆకలి మంటను చల్లార్చుకోవడానికి వర్తక బిడారాల్ని దోచుకోవడమో లేక మొగలు సైన్యంలో చేరడం తప్ప, వారి జీవనోపాధికి వేరే మార్గం లేదు. వీరు సామాన్యంగా స్వతంత్రంగా ఉండడానికే ఇష్టపడేవారు. అత్యధిక జీతాలు, ఇంకా ఇతర రాయితీలిచ్చి, మొగలులు వీరిని సంతృప్తపరిచి తమ అధీనంలో ఉంచుకునేవారు. అయితే వారిలో ఎప్పుడైనా స్వప్రయోజనా పరుడు, అత్యాశపరుడైన నాయకుడెవ్వరైనా బయటపడినప్పుడు, ఈ సంబంధం తెగిపోయే ప్రమాదముండేది.

అఫ్‌గన్ల విద్రోహానికి సంబంధించిన ఒక విచిత్ర పరిస్థితి ఔరంగజేబ్ కాలంలో ఏర్పడింది. 1667లో భాగూ పేరుగల ఒక అఫ్‌గన్ నాయకుడు, తనను ప్రధాన మంత్రిగాను, ప్రాచీన రాజవంశానికి చెందిన వాణ్ని పరిచయం చేసుకున్న ముహమ్మద్ షాను రాజుగా ప్రకటించి, 'జాట్'ల లాగా తమ స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. భాగూ నాయకుని సైన్యాలు హజార, అటక్ మరియు పెషావర్‌లలో దోపిడీ దౌర్జన్యాలు మొదలుపెట్టాయి. ఇక ఖైబర్ గుండా రాకపోకలు స్తంభించిపోయాయి.

అఫ్‌గన్ల ఈ విద్రోహాన్ని అణచడానికి ఔరంగజేబ్ తన ప్రత్యేక సేనాని అయిన అమీర్ ఖాన్‌ను పంపించాడు. ఇంకా అతని సహాయార్థం రాజపుత్రుల ఒక ప్రత్యేక సైనిక దళాన్ని ఏర్పాటుచేసి పంపించాడు. ఎన్నో భయంకర యుద్ధాల తరువాత అఫ్‌గన్ల ఈ తిరుగుబాటును అణచివేయడం జరిగింది. ఆ ప్రాంతాన్ని కనిపెట్టి ఉండడం కోసమని 1671లో రాజా జస్వంత్ సింగ్‌ను జమ్రూద్ గవర్నరుగా నియమించి పంపించడం జరిగింది.

1672లో అఫ్‌గన్లు తిరిగి విద్రోహాన్ని లేపారు. ఈసారి ఆఫ్రీది తెగకు చెందిన అక్మల్ ఖాన్ అనే నాయకుడు వారికి సారథ్యం వహించాడు. అతను తనను రాజుగా ప్రకటించుకోవడమే కాకుండా, తన స్వంత నాణాల్ని కూడా జారీ చేయించాడు.

అఫ్‌గన్లంతా ఒకే పతాకం, ఒకే సారథ్యం క్రిందికి వచ్చి, సామూహిక కృషితో మొగలుల్ని ఓడించాలనే ఓ నినాదాన్నిచ్చాడు. ఆ నినాదానికి ఆకర్షితులైన అఫ్‌గన్ తెగలన్నీ కలిసి ఖైబర్ కనుమను మూసేశాయి. ఒక ఇరుకైన కనుమను (త్రోవను) శుభ్రపరచడానికి అక్మల్ ఖాన్ అత్యంత లోపలివరకు వెళ్ళిపోయాడు. అక్కడ మొగలు సైన్యాలున్నాయనే విషయం అతనికి తెలియదు. అకస్మాత్తుగా మొగలు సైన్యాల కంటపడ్డాడు. ఎలాగోలాగా తన ప్రాణాలు దక్కించుకొని పారిపోయాడు. దాదాపు పదివేల మంది అఫ్‌గన్లు మృత్యువాతపడ్డారు. అయినా అనేక అఫ్‌గన్ తెగలు విద్రోహుల్లో చేరిపోయాయి.

మొగలు సర్దారు (సేనాని) షుజాఅత్ ఖాన్ కూడా ఖైబర్‌లో తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. జస్వంత్ సింగ్ ద్వారా పంపబడిన రాజపుత్ర వీరుల ప్రతాపం కారణంగా అతను అతి కష్టంగా తన ప్రాణాలు కాపాడుకోగలిగాడు. 1674లో స్వయంగా ఔరంగజేబ్ పెషావర్ వెళ్ళాల్సివచ్చింది. అతనక్కడ దాదాపు ఒకటిన్నర సంవత్సరం ఉండాల్సి వచ్చింది. అఫ్గన్లు కలిసి ఉన్నంతకాలం, వారిని అణచడం అసాధ్యమైపోయింది. చివరికి ఔరంగజేబ్ తన రాజనీతిజ్ఞతను మరియు సమయానుకూలంగా బలాన్ని ఉపయోగించి, అఫ్గన్ల ఐకమత్యాన్ని విరగ్గొట్టడంలో కృతార్థుడయ్యాడు. అప్పుడుగాని శాంతి సంధుల పరిస్థితులు ఏర్పడ్డాయి.

కేంద్రానికి తిరుగబడిన కారణంగా వారిని అణచివేయడం జరిగింది. దీనివల్ల అవసరం ఏర్పడినప్పుడు, కేంద్రానికి తిరుగబడినప్పుడు హిందువులే కాదు ముస్లిములు, ఇతరులు చేసిన విద్రోహాన్ని కూడా అణచివేయడంలో ఔరంగజేబ్ వెనుకాడలేదనే విషయం తేటతెల్లమవుతుంది.

పైన ఉదాహరించిన వాస్తవాల దృష్ట్యా, కేంద్రాన్ని బలహీనపరిచే శక్తి, అది హిందువులదైనా ముస్లింలదైనా సరే, అఫ్గన్లను అణచివేసినట్లే, నిర్దాక్షిణ్యంగా అణచివేయబడేదనే విషయం అవగతమవుతోంది.” **(ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి-రచన : డా.ఓంప్రకాశ్ ప్రసాద్, పేజి 39, 40)**

బీజాపూర్, గోల్కొండ మరియు అఫ్గన్లు – వీరంతా ముస్లిం శక్తులే. అయినా కేంద్రానికి తిరుగబడినప్పుడు, కేంద్రాన్ని బలహీనపరచ ప్రయత్నించినప్పుడు, కేంద్రం నుండి స్వతంత్రాన్ని ప్రకటించదలచినప్పుడు, నిర్దాక్షిణ్యంగా ఔరంగజేబ్ వారిని అణచివేశాడు. అదే రీతిలో మరాఠాల్ని, రాజపుత్రుల్ని, సత్నామీలను, జాట్‌లను, సిక్ఖులను అణచివేయడంలో కూడా అతను వెనుకాడలేదు. కేంద్రప్రభుత్వ సుస్థిరతే అతని ప్రధాన లక్ష్యం. ఈ విషయాన్ని అప్పటి సైన్యాలు, సైనికాధికారులు బాగా గుర్తెరిగినవారు. శివాజీని, మరాఠాలను అణచివేసిన సైన్యాలే, బీజాపూర్‌ను ముట్టడించాయి. తిరుగబడిన కొందరు రాజపుత్రుల్ని, రాజపుత్ర సైన్యాలే అణచివేశాయి. సత్నామీలను, జాట్‌లను, సిక్ఖులను, అఫ్గన్లను ఎదుర్కొన్న సైన్యాల్లో హిందూ-ముస్లిం ఇద్దరూ ఉన్నారు. వారు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా, రాజ్యసైన్యాలుగా మాత్రమే విద్రోహాల్ని ఎదుర్కొన్నాయి తప్ప, హిందూ ముస్లిం అనే దృష్టితో వీటిని చూచి ఉండలేదు. ఈ సైన్యాలు లేక సైనికాధికారులు ఒక్క నిముషమైనా ఆ ధోరణిలో ఆలోచించి ఉంటే, ప్రాణాంతకమైన ఈ యుద్ధాల్లో అసలు పాల్గొనకనే పోయేవారు. వారు ఇదంతా కేంద్రం మరియు ప్రాంతీయ శక్తుల దృష్టితోనే చూశారు తప్ప నేడు మనం చరిత్రల్లో చదువుతున్నట్లు హిందూ-ముస్లిం అనే భేదభావాన్ని పాటించలేదు. తాము పోరాడుతున్నది కేంద్రం పటిష్ఠత కోసమే తప్ప, హిందువుల్ని అణచడానికి లేక ముస్లింలను అణచడానికి అనే ధ్యాసే వారిలో లేదు. సైన్యాల్లో, సైనికాధికారుల్లో ఈ జాతీయ భావన నూరిపోసిన ఘనత ఔరంగజేబ్‌కు ఇవ్వడానికి బదులు, ఆ తరువాత వచ్చిన ఆంగ్లేయ, భారతీయ చరిత్రకారులు అతను షియాలను అణచివేశాడని, మరాఠాలను, రాజపుత్రుల్ని, సిక్ఖుల్ని, జాటుల్ని, అఫ్గన్లను అణచివేశాడని – ఇలా రకరకాలుగా అతనిపై నిందలు మోపడం ఎంతవరకు న్యాయమో పాఠకులే ఆలోచించాలి.

# 17. ఔరంగజేబ్ - మరాఠాలు

ఔరంగజేబ్ – మరాఠాలు అనగానే అనాలోచితంగానే కొన్ని ఊహలు, భావనలు మన మదిలో మెదలడం మొదలవుతాయి. అవెంత నిరాధారమైన అభూతకల్పనలైనాసరే, చిన్నప్పటి నుండి ఆ విషయాలు మన మనోమస్తిష్కాల్లో తిష్టవేసి ఉన్నాయి, ఇంకా వాటిని జనసామాన్యం చేయడానికి ముమ్మరంగా కృషి జరిగింది కనుక ఈ భావనలు అవలీలగా మనల్ని విడిచిపెట్టవు. ఆ ఊహలు లేక భావనలు ఎలా ఉంటాయంటే ఔరంగజేబ్ మరియు శివాజీ బద్ధశత్రువులు. ఔరంగజేబ్ ముస్లిం రాజ్యాన్ని స్థాపించడానికి ముస్లింలందరినీ వెంటబెట్టుకొని వస్తే, శివాజీ హిందువుల్ని కాపాడడానికి, హిందూరాజ్యాన్ని స్థాపించడానికి, హిందువుల్ని ఐక్యపరచి ఔరంగజేబ్‌ను ఎదుర్కొన్నాడు. ఈ విధంగా ఔరంగజేబ్ ముస్లింల హీరోఅయితే, శివాజీ హిందువులకు హీరో అయ్యాడు. ఇలాంటి భావనల్ని ఏర్పరచడంలో ఆంగ్లేయ చరిత్రకారులే కాకుండా మన భారతీయ చరిత్రకారులు కూడా బాగా కృషి చేశారు. కాని చారిత్రక వాస్తవాలు ఈ భావనలకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఔరంగజేబ్ హిందువుల వ్యతిరేకి కాదు, వారి శత్రువు అంతకన్నా కాదు. అందుకే అతని పక్షాన రాజపుత్రులు, బుందేలాలు ఇతర హిందువులు, ఇంకా స్వయంగా ప్రఖ్యాతిగాంచిన మరాఠా నాయకులు, వారి వంశాలకు వంశాలే, అంతెందుకు శివాజీకి దగ్గరి బంధువులు, రక్తసంబంధీకులు సైతం ఔరంగజేబ్‌ను వెన్నంటి ఉన్నారు. హిందువుల్ని అత్యధికంగా అభిమానించి చేరదీసేవానిగా అక్బర్ చక్రవర్తి పేర్కొనబడతాడు. కాని అక్బర్ కాలంలో హిందూ మన్సబు దారులు మొత్తం మన్సబుదారుల్లో 22 శాతం ఉంటే, అదే ఔరంగజేబ్ కాలంలో వీరి శాతం అంటే హిందువుల శాతం పెరిగి 32 శాతానికి చేరుకుంది. ఔరంగజేబ్ దర్బారులో స్వయంగా ఈ మరాఠా మన్సబుదారుల పరిస్థితి, స్థాయి ఏమిటనేది ఈ పట్టిక ద్వారా అవలీలగా అర్థమవుతుంది.

### జాతుల పరంగా ఔరంగజేబ్ దర్బారులోని మన్సబుదారులు

| ఇరాని | తౌరాని | అఫ్గాని | భారతీయ ముస్లింలు | ఇతర ముస్లింలు | రాజ పుత్రులు | మరాఠాలు | ఇతర హిందువులు | మొత్తం మన్సబుదారులు |
|---|---|---|---|---|---|---|---|---|
| 126 | 72 | 34 | 69 | 92 | 73 | 96 | 13 | 575 |
| 21.9% | 12.5% | 5.9% | 12% | 16% | 12.6% | 16.7% | 2.2% | |

ఔరంగజేబ్ దర్బారులోని మన్సబుదారుల్లో జాతుల రీత్యా ఈరానీల తర్వాత మరాఠాలే రెండవ స్థానంపై ఉన్నట్లు స్పష్టమవుతోంది. (The Moghal Nobility ....M. Athar Ali... P.33) ఇంతమంది మరాఠా మన్సబుదారులు అతన్ని వెన్నంటి ఉన్నప్పుడు అతన్ని మొత్తం

మరాఠా జాతి వ్యతిరేకిగా ఎలా పేర్కొనగలం? ఎవరైనా అలా పేర్కొనివుంటే అది అర్థరహితం, నిరాధార ఆరోపణ తప్ప మరేమీ కాదు.

ఇక ఈరానీ, తౌరాని, అఫ్గాని, రాజపుత్రులు, మరాఠాలు, ఇంకా ఇతర హిందూ ముస్లిం భారతీయ జాతులతో మమేకమై ఉన్న మొగల్ సైన్యాలకు సైన్యాధిపతి ఎవరనుకుంటున్నారు? జైపూర్ రాజ్యాధీశుడైన రాజా జైసింగ్. ఔరంగజేబే గనక ధార్మిక పక్షపాతి, హిందువుల వ్యతిరేకి అయివుంటే లక్షల సంఖ్యలో గల తన సైన్యాలకు ఒక రాజపుత్ర వీరుణ్ణి ఎలా సైన్యాధిపతిగా నియమించేవాడు? సైన్యాధిపతిపై, హిందువులపై సంపూర్ణ విశ్వాసమే గనక లేకపోయినట్లైతే ఇంత కీలకమైన హోదాపై ఒక సిసలైన హిందూ రాజపుత్రుణ్ణి ఎలా నియుక్తుణ్ణి చేసేవాడు? ఇంకా సున్నితమైన, అతి ముఖ్యమైన పనుల్ని అతనికి ఎలా అప్పగించేవాడు? అందుకని ఔరంగజేబ్ హిందూ వ్యతిరేకి ఎంతమాత్రం కాదు. ఇక మరాఠా జాతి వ్యతిరేకి అంతకన్నా కాదు. అతను భారతదేశానికి చక్రవర్తి. మొత్తం భారతావనిని సమైక్యపరచడం, సువిశాల భారతంగా రూపొందించడం అతని లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో ఎవరు అడ్డం వచ్చినా, అది శివాజీ కానివ్వండి, గోల్కొండ, బీజాపూర్ రాజులు కానివ్వండి, చివరికి తన కుమారులైనా సరే, వారందరినీ అణచివేయడమే తన కర్తవ్యంగా భావించాడు. 80-90 సంవత్సరాల వృద్ధాప్యంలో కూడా రణరంగాల్లో నిర్భయంగా నిలబడిన ధీశాలి. బాణాలు, తుపాకి గుండ్లు, ఫిరంగి గుండ్లు సమీపంలో వచ్చి పడుతున్నా తొణకని, బెదిరిపోని ధీరుడతను. చివరికి భారతదేశాన్ని ఐక్య పరచడంలో, అంతకు ముందెన్నడూ లేనంత సువిశాల భారతావనిగా మార్చడంలో అతను తన మరణానికి ముందే సఫలీకృతుడయ్యాడు.

ఔరంగజేబ్ పట్ల చరిత్రలో ఎలాంటి అపోహలు, అపార్థాలు ప్రజల్లో ప్రచార మయ్యాయో శివాజీకి సంబంధించి కూడా అలాంటి అపోహలు, అపార్థాలే ప్రాచుర్యం పొందాయి. ఛత్రపతి శివాజీ ముస్లిం వ్యతిరేకి అని, హిందూ పద్ పాదుషా అని, గోబ్రాహ్మణ రక్షకుడని వ్రాయడం జరిగింది. శివాజీయే లేకపోతే అందరికీ సున్తీ (చర్మ సంస్కారం) చేసేవారని కవి భూషణ్ లాంటి వారి కవిత్వపు సారాంశం. "శివాజీ ధర్మం కోసం పోరాడాడు." "శివాజీ సాధించిన ఘనకార్యాల వెనుక ధార్మికోత్సాహం ఉండేది." "శివాజీ చేసిన యుద్ధాలన్నీ ధర్మం కోసమే. ఆయన ధర్మం సంరక్షణార్థం యుద్ధాలు చేశాడు కనుకనే విజయాలు సాధించగలిగాడు." "వాస్తవంగా చెప్పాలంటే ఆయన పరిమేశ్వరుని అవతారం. ఆయన శివుని లేక విష్ణువు అవతారం. పరమేశ్వరుడు ఏ అవతారమెత్తాడో అది ధర్మసంరక్షణార్థమే. ఆయనకు భవాని మాత ప్రసాదించిన ఖడ్గం ధర్మాన్ని రక్షించడం కోసమే. ధర్మమే గనక ఆయన లక్ష్యం అయి ఉండకపోతే, ఆయనెన్నటికీ కృతార్థుడు కాలేకపోయేవాడు."

ఛత్రపతి శివాజీకి సంబంధించి సామాన్య ప్రజల్లో ప్రత్యేకించి మహారాష్ట్ర ప్రజల్లో పై విధమైన పొరపాటు భావనలు వ్యాపించాయి. చారిత్రక వాస్తవాల వెలుగులో పై భావనల్ని

విశ్లేషించవలసిన అవసరం ఉంది. (శివాజీ కౌన్ హోటా?..... గోవింద్ పాన్సరే, అనువాదం, పే.23, 24)

అయితే శివాజీలో ఒక ప్రత్యేకత ఉంది. అతను శూన్యం నుండి తన రాజ్యాన్ని స్థాపించి చూపించాడు. ప్రారంభంలో అతనో మామూలు మన్సబుదారు (జాగీర్దారు) కుమారుడు. కాని అత్యంత తెలివితేటలతో వీర శూరత్వాలతో దాదాపు 35 సంవత్సరాల వరకు ఇటు మొగలుల్ని, అటు బీజాపూర్, గోల్కొండవారిని ముప్పుతిప్పలు పెట్టాడు. తన ఉనికిని చాటిచెప్పుకున్నాడు. చివరికి తనదో రాజ్యాన్ని స్థాపించి పట్టాభిషిక్తుడవడంలో సఫలమయ్యాడు. రాజ్యం వీర భోజ్యం అనే కాలమది. అందుకని శివాజీ తనదో రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నిస్తే అందులో తప్పులేదు -- అయితే ఇక్కడ ఒక విషయాన్ని మాత్రం తేటతెల్లం చేయదలచాం. అతను మొగలులు, బీజాపూర్, గోల్కొండ రాజ్యాలకే వ్యతిరేకం కాని ఇస్లామీయ ధర్మం లేక ముస్లింలకు ఎంతమాత్రం వ్యతిరేకి కాదు. మా ఈ వాదనను బలపరచడానికి తగినన్ని చారిత్రక సాక్ష్యాధారాలున్నాయి. శివాజీకి ముస్లింలతో గల సంబంధాలు, అతని సైన్యంలో ముస్లింల పాత్ర, స్వయంగా శివాజీకి హిందువులు, మరాఠాలతో (ఇంకా స్వయంగా తన వారితో) గల వ్యతిరేకత మొదలుగాగల విషయాలు పాఠకుల దృష్టికి తీసుకురావడం సమంజసం మాత్రమే కాదు, అవసరం కూడా.

బీజాపూర్ రాజ్యంలో మరాఠాలు, ఇతర హిందువులు పెద్ద సంఖ్యలో మన్సబుదారులుగా, జాగీరుదారులుగా, సైన్యాధికారులుగా ఉన్నట్లే శివాజీ తన ప్రాంతాన్ని విస్తరింపజేసుకుంటున్నప్పుడు, ఆ తరువాత ఒక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నప్పుడు అతని వద్ద అత్యధిక సంఖ్యలో ముస్లిం సేనలు, సేనాధిపతులు ఉంటుండేవారు. శివాజీ కేవలం మొగలు సామ్రాజ్యంతోనే ఘర్షణ పడ్డాడనడం అసత్యం. ఆ కాలంలో దక్షణాదిన ఉన్న ఖుతుబ్‌షాహి (గోల్కొండ), ఆదిల్‌షాహి(బీజాపూర్) రాజ్యాలతోనే కాకుండా, వారి సామంత హిందూ రాజులు, మన్సబుదారులతోనూ, స్వయంగా తన జాతివారైన మరాఠా నాయకులతోనూ శివాజీ పోరాడవలసి వచ్చింది. వారప్పుడు అధికారంలో ఉన్నారు. శివాజీ తన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం వీరందరితో పోరాడవలసి వచ్చింది. ఈ యుద్ధాల వివరాలు చరిత్ర గ్రంథాల్లో సురక్షితంగా ఉన్నాయి.

మహారాష్ట్రకు చెందిన ప్రఖ్యాత చరిత్రకారుడు 'రియాసత్కార్ సర్‌దేశాయి' 'రియాసత్' అనే తన గ్రంథంలో ఇలా రాశాడు... "బీజాపూర్‌తో జరిగిన యుద్ధాన్ని హిందూ, ముస్లింల యుద్ధమని పేర్కొనలేము. దీన్ని హిందూ ముస్లింల యుద్ధమని చూపించడం సాధ్యం కాదు. శివాజీకి వచ్చిన కష్టమేమిటంటే గొప్ప గొప్ప మరాఠా నాయకుల కుటుంబాలే బీజాపూర్ సంస్థానంతో సంబంధాలు కలిగి ఉన్నాయి. (ఉన్నత హోదాలపై నియుక్తులై ఉన్నారు) వీరి హృదయాల్లో శివాజీ పట్ల ఎలాంటి గౌరవభావాలు వుండేవి కావు. ఘోర్‌పడే, మోరే, సావంత్, దల్వీ, సోర్వే, నిమ్ బాల్కర్ మొదలగు వంశాలకు చెందిన వందలాది నాయకులు మొదటి నుండే శివాజీకి వ్యతిరేకంగా ఉన్నారు."

చరిత్రకారుడు సర్‌దేశాయి లాగే, మహారాష్ట్రకు చెందిన ప్రాచీన చరిత్ర (దీనిలో శివాజీ కాలపు పరిస్థితులు వివరించబడ్డాయి) 'సభాసద్ బఖర్'లోనూ, చరిత్రకారుడు పారస్‌నీస్ గ్రంథంలోనూ శివాజీని వ్యతిరేకించిన ప్రథమశ్రేణికి చెందిన మరాఠా నాయకుల పేర్లు ఇవ్వబడ్డాయి. ఘాట్కే, ఖండాగ్లే, బాజీ ఘోర్ పడే, బాజి మొహితే, నింబాల్కర్, డబీర్, మోరె, బాదల్, సావంత్, సోర్వే, గోర్‌పడే, పాండరే వంశాలు, కొంకణ్‌కు చెందిన దేశాయిలు, మావలీకి చెందిన దేశ్‌ముఖ్‌లు - వీరందరితో శివాజీకి వైరం పెరిగింది. వీరంతా బీజాపూర్ సంస్థానంలో మన్సబుదారులు. బీజాపూర్ ప్రాంతాల్ని శివాజీ ఆక్రమించు కున్నప్పుడు, వీరి మన్సబులు పోయిన కారణంగా వీరు శివాజీకి వ్యతిరేకులైపోయారు. వెంకూజీ భోన్‌స్లే, మంబాజీ భోన్‌స్లే లాంటి శివాజీ వంశీయులు (కుటుంబీకులు) సైతం అతనికి వ్యతిరేకులైపోయారు. మొగలు గవర్నరు షాయిస్తఖాన్ మరాఠా ప్రాంతాలపై దాడి జరిపినప్పుడు, అతని వెంట ఉత్తర భారతానికి చెందిన బుందేల, రాజపుత్ర లాంటి హిందూ సైన్యాధికారులు, సైన్యాలు ఉండనే ఉన్నాయి. కాని మహారాష్ట్రకే చెందిన సూఖాజి గైక్వాడ్, దినకర్‌రావు కాక్డే, సంభాజి రావు పవార్, సర్జేరావు ఘాట్కే, కమలోజిరావు కాక్డే, జస్వంత్‌రావు కాక్డే, తురంబక్ రావు ఖండాగ్లే, కంకోజిరావు గాడే, అంతాజిరావు ఖండాగ్లే, దత్తాజిరావు ఖండాగ్లే లాంటి మరాఠా నాయకులు, సేనానులు కూడా అతని వెన్నంటి ఉన్నారు. ఈ వాస్తవాల కన్నా విచిత్రమైన విషయమేమిటంటే తురంబక్ రావు భోన్‌స్లే, జీవాజీరావు భోన్‌స్లే, పర్సోజిరావు భోన్‌స్లే మొదలగు భోన్‌స్లే (శివాజీ) వంశీయులు కూడా షాయిస్తఖాన్‌తో ఉన్నారు. వీరంతా శివాజీతో రక్తసంబంధ మున్నవాళ్ళు. సింద్‌ఖేడ్‌కు చెందిన దష్తాజిరావుజాదూ, రుస్తుంరావు జాదూలు కూడా షాయిస్త ఖాన్ సైన్యంలో ఉన్నారు. వీరంతా జీజా బాయి (శివాజీ తల్లి) వంశానికి చెందినవారు. పూనా జాగీరు తనకు లభిస్తుందనే ఆశతో 'లోనీకి' చెందిన క్రిష్ణాజి కాల్‌భైరవ్ షాయిస్తఖాన్‌తో కలిసి పోయాడు. షాయిస్తఖాన్ శతోడుల 'దేశ్ ముఖి'ని జప్తు చేసుకుని, కాల్‌భైరవులకి చ్చాడు. బాలాజి హెూనబ్, 'లాల్ మహల్'కు సమీపంలో ఉంటుండేవాడు. శివాజీకి అత్యంత సమీపంలో, అతని నీడలో ఉంటునప్పటికీ ఈ బాలాజీ హెూనబ్‌కు శివాజీ కన్నా షాయిస్తఖాన్ సాన్నిహిత్యమే రుచించింది.' (శివాజీ కౌన్ హెూటా?-గోవింద్ పాన్‌సరే, అను. పేజీ. 35-37)

బీజాపూర్ దర్బారు నుండి శివాజీని ఎదుర్కోవడానికి పంపబడిన సైన్యాధిపతి అఫ్జల్ ఖాన్‌తో కేవలం ముస్లిం సైన్యాలే లేవు. అత్యధిక సంఖ్యలో హిందూ సైన్యాలతో పాటు పలాజి మోహితె, శంకర్‌జి మోహితె, కళ్యాణ్‌రావు యాదూ, నాయక్‌జీ సరాటే, నాగోజి పాండరే, ప్రతాప్‌రావు మోరే, ఝుంఝురావు ఘాట్కే, కాటే, బాజీఘోర్‌పడే, సంభాజీ రావు భోన్‌స్లే లాంటి మరాఠా సైన్యాధికారులు కూడా ఉన్నారు. అంతేకాదండీ, అఫ్జల్‌ఖాన్ సైన్యాలు లేకుండా శివాజీని ఏకాంతంలో కలవడానికి వెళ్ళినప్పుడు గోపీనాథ్, క్రిష్ణాజీ అనే ఇద్దరు బ్రాహ్మణ అంగరక్షకులు అతని వెంట ఉన్నారు. పులి గోళ్ళనే గుప్త ఆయుధంతో శివాజీ అఫ్జల్‌ఖాన్

పొట్ట చీల్చగానే, అతని బాడీగార్డ్ అయిన క్రిష్ణాజీ తన ఖడ్గంతో శివాజిపై వేటువేశాడు. అది గమనించిన శివాజీ అంగరక్షకుడు యసాజి కనక్ అతన్ని సమాప్తం చేసేశాడు. గోపీనాథ్‌కు కూడా రెండుమూడు గాయాలయ్యాయి గాని అతను ప్రాణాలతో బయటపడ్డాడు. శివాజీ వెంట కూడా సిద్ధి ఇబ్రాహీం అనే ఓ ముస్లిం బాడీగార్డ్ ఉన్నాడు. (తారీఖె హింద్ కా ఇన్‌ఖిలాబి కిర్దార్- శివాజీ) (భారత చరిత్రలోని విప్లవాత్మక పాత్ర శివాజీ- రచన : ప్రొఫెసర్ ఎం.కె.షాజ్లి, పేజి. 150)

సాలేరి యుద్ధం ముగిసిన తరువాత దక్కన్‌లో ఉంటున్న మొగలు అధికారులు శివాజీతో సంప్రదింపుల కోసం ఒక బ్రాహ్మణ పండితున్ని తమ దూతగా పంపించారు. అయితే శివాజీ తన దూతగా, రాయబారిగా తన వ్యక్తిగత కార్యదర్శి ఖాజీ హైదర్‌ను పంపించాడు. మొగలులు తమ దూతగా, రాయబారిగా ఒక బ్రాహ్మణ పండితున్ని ఎంపిక చేస్తే హిందువైన శివాజీ, ఖాజి హైదర్ లాంటి ముస్లింను విశ్వసించి తన రాయబారిగా, న్యాయవాదిగా పంపించాడు. (ఈ ఖాజి హైదర్ గురించి ముమ్ముందు వివరంగా రానున్నది) హిందూ, ముస్లింలలో పరస్పరం వ్యతిరేకత ఉంటే నేడు చరిత్రలో చూపిస్తున్నట్లు ఒకరి కొకరు బద్ధశత్రువులే అయివుంటే, వీరిలో జరిగిన యుద్ధాలు ధార్మికపరమైనవే అయివుంటే, ఇలాంటి కీలక సమయాల్లో, సంధి సంప్రదింపులు వంటి సున్నిత విషయాల్లో తమకన్నా భిన్నమైన ధర్మాల్ని ఆచరించే వ్యక్తుల్ని ఎంపిక చేసి పంపడం ఎలా సంభవమవుతుంది?

ఏ సైన్యాల కారణంగా శివాజీకి అపజయం వరించిందో, ఆయుధాలు పడేసి లొంగిపోవాల్సి వచ్చిందో అత్యంత అసంతృప్తికరమైన షరతులపై సంధి చేసుకో వాల్సి వచ్చిందో ఆ సైన్యాల సర్వసైన్యాధ్యక్షుడు రాజా జైసింగ్ సిసలైన హిందు రాజపుత్రుడు కాగా, రాజాజైసింగ్ శివాజీని ఎదుర్కోవడానికి వెంటబెట్టుకు వచ్చిన సైన్యంలో ఎంతోమంది హిందువులున్నారు, జాట్‌లున్నారు, బుందేలాలున్నారు, రాజపుత్రులున్నారు. స్వయంగా మరాఠాలున్నారు. ఇక ముఖ్య సైనికాధికారుల్లో రాజ్‌రాయెసింగ్ సిసోదియా, సజ్జన్ సింగ్ బుందేలా, హరిభాన్ గౌడ్, షేర్‌సింగ్ రాథోర్, చిత్రభోజ్ చౌహాన్, చిత్ర సేన్, ఇంద్రభాన్ బుందేలా, బాజీచందర్ రావు, గోవిందరావు లాంటి సైనికాధికారులు కూడా ఉన్నారు.

ఏవిధంగానైతే ఎంతోమంది మరాఠా నాయకులు శివాజీని సమర్థించకుండా, వ్యతిరేకంగా నిలబడ్డారో అదేవిధంగా అనేకమంది మరాఠా బ్రాహ్మణులు శివాజీని వ్యతిరేకించారు. కేవలం దక్షిణ వసూలు చేసుకోవడానికి బ్రాహ్మణులు శివాజీకి వ్యతిరేకంగా 'కోటిచంఢి యజ్ఞాన్ని' నిర్వహించారు. శివాజీ జీవిత చరిత్రపై రాసిన "సభాసద్ బఖర్"లో దీనికి సంబంధించిన వివరాలు లభిస్తాయి

కోందానా కోటకు ఉదయ్‌భాన్ మొగలుల తరఫున నియమింపబడిన కోటాధిపతి. అతనొక హిందూ రాజపుత్రుడు. అతను, అతని పన్నెండు వందల మంది రాజపుత్ర సైనికులు కోటను రక్షించడం కోసం హతమయ్యారే తప్ప, శత్రువు ముందు తలవంచలేదు. ఇతనే

కాకుండా ఇంకెంతో మంది రాజపుత్ర, మరాఠా నాయకులు, మొగలు సామ్రాజ్యంలో కోటాధిపతులుగా ఉన్నారు. హిందూ రాజ పుత్రుడైన రాజా జైసింగ్‌ను ఔరంగజేబ్ దక్కన్‌కు గవర్నర్‌గా నియమించాడు. ఔరంగజేబ్‌కు మొదటి అమాత్యుడైన రఘునాథ్ దాస్ ఒక హిందువే. అతను తాను రాజపుత్రుడై ఉన్నప్పటికీ, రాజపుత్రులకు వ్యతిరేకంగా పోరాడాడు.

ఆ కాలంలో జరిగిన యుద్ధాల్లో ముస్లింలకు వ్యతిరేకంగా ముస్లింలు, హిందువు లకు వ్యతిరేకంగా హిందువులు, ఇంకా హిందూ ముస్లింలిద్దరూ కలిసి పోరాడిన సాక్ష్యాధారాలు లభిస్తాయి. ఆ కాలపు యుద్ధాల్ని, పరిస్థితుల్ని గమనిస్తే, ముస్లింలకు వ్యతిరేకంగా కేవలం హిందువులు మాత్రమే పోరాడుతున్నట్లు కనిపించదు. అంటే యుద్ధాలు జాతి, కుల ప్రాతిపదిక మీద, ధర్మం ప్రాతిపదికగా జరిగినట్లు కనిపించవు. ఢిల్లీ ముస్లిం పాలకుడైన ఇబ్రాహీం లోధీని ఓడించినవాడు మొగలు వంశ స్థాపకుడైన బాబరు. హుమాయూన్, షేర్‌షాహ్ ఇద్దరూ ముస్లింలే. అయినా వీరిద్దరి మధ్య యుద్ధం జరిగింది. గోల్కొండ, బీజాపూర్ రెండూ ముస్లిం రాజ్యాలైనప్పటికీ ఔరంగజేబ్ వాటిని సమాప్తం చేసేశాడు. అంటే అప్పుడు ఆకాలంలో ధర్మం ముఖ్యంకాదు, రాజ్యం అధికారమే ముఖ్యం.

ఆ కాలంలో అత్యధిక మంది హిందూ సైనికులు, సైనికాధికారులు ముస్లిం పాలకుల్ని ఆశ్రయించినట్లే, ఎంతోమంది ముస్లిం ఉద్యోగులు, సైనికులు, సైనికాధికారులు శివాజీ వద్దకు చేరారు. పూర్తి విశ్వసనీయతతో శివాజీకి తమ సేవలందించారు. అత్యంత కీలక సమయాల్లో తమ ప్రాణాలకు తెగించి శివాజీని రక్షించారు. శివాజీ కోసం, అతని రాజ్యస్థాపన కోసం తమ స్వధర్మీయులైన గోల్కొండ, బీజాపూర్ వారితో, మొగలులతో మొక్కవోని పరాక్రమంతో పోరాడారు.

'సభాసద్ బఖర్' అనే మరాఠి చారిత్రక గ్రంథంలోని పేజి 112లో శివాజీకి చెందిన నాయకుల్లో 'ఫామాఖాన్' అనే ఒక ముస్లిం నాయకుని పేరు లభిస్తుంది. చరిత్రకారుడు 'రాజ్ వాడే' రాసిన 'మరాఠా చరిత్రకు ఆధారాలు- వాల్యూం- 17, పేజి 17లో 'నూర్ ఖాన్‌బేగ్' అనే పేరు వచ్చింది. శివాజీ సైన్యంలో ఇతను సర్‌నౌబత్ (సైన్యాధిపతి)హోదాపై నియుక్తుడై ఉండేవాడు.

ముస్లిం సైనికుల విషయంలో శివాజీ పాలసీని తెలిపే ఒక సంఘటన ఇలా వుంది. దీన్ని 'రియాసత్కార్ సర్ దేశాయి' తన గ్రంథం 'షక్ కర్తా శివాజీ'లో ఇలా వర్ణించాడు. "1648లో బీజాపూర్ సైన్యానికి చెందిన దాదాపు ఐదు నుండి ఏడు వందల మంది పఠాన్ సైనికులు ఉద్యోగం కోసం శివాజీ వద్దకు వచ్చారు. శివాజీ సహచరుడైన గోమాజీ నాయక్ శివాజీకి ఒక సలహా ఇచ్చాడు. దాన్ని శివాజీ అంగీకరించాడు. మున్ముందు ఈ పాలసీయే కొనసాగింది. గోమాజి నాయక్ ఇలా సలహా ఇచ్చాడు. 'వీరంతా మీ లోక ప్రియత్వాన్ని విని ఇక్కడికి వచ్చారు. ఈ అవకాశాన్ని జారవిడుచుకోకండి. కేవలం హిందు వుల్ని మాత్రమే

ప్రోగు చేసుకొని ఇతరుల్ని పట్టించుకోకుండా రాజ్యమేలుదాం అనుకుంటే ఇది సాధ్యమయ్యే విషయం కాదు. ఎవరైతే రాజ్యమేలదలుచుకున్నాడో అతను ప్రతి జాతి, ప్రతి కులం వారిని వారి వారి ధర్మాలపై ఉండనిస్తూనే తన వద్ద ప్రోగు చేసుకోవాల్సి ఉంటుంది."

శివాజీ జీవిత చరిత్ర రాసిన గ్రాంట్ డఫ్, తన గ్రంథంలోని పేజీ 129లో గోమాజీ నాయక్ శివాజీకిచ్చిన పై సలహాను పేర్కొని ఇలా వ్రాశాడు: 'అప్పటినుంచి శివాజీ తన సైన్యంలో ముస్లింలను కూడా చేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఇంకా శివాజీ రాజ్యస్థాపనలో ఈ పాలసీ ఎంతో లాభదాయకమైనదిగా నిరూపితమయింది.' (History of Marathas, by Grant Duff, P. 129..... శివాజీ కౌన్ హోటా - గోవింద్ పాంసరే, అను. పే. 28, 29)

శివాజీకి ఇస్లాం లేక ముస్లింలను అంతమొందించాలనే ఉద్దేశ్యం గనుక ఉంటే అతనెన్నటికీ తన సైన్యంలో ముస్లింలను చేర్చుకునేవాడు కాదు. అమితంగా విశ్వసించి, ఉన్నత హోదాలపై వారిని నియమించేవాడే కాదు. తన రాజ్యస్థాపనే అతని ఏకైక లక్ష్యం. ఇస్లాం లేక ముస్లిం వ్యతిరేకత ఏనాడూ అతని లక్ష్యం కాదనే విషయం దీనితో రూఢీ అయ్యింది.

1674లో రాయెగడ్ కోటలో అత్యంత వైభవంగా శివాజీ తన పట్టాభిషేకం జరుపుకున్నప్పుడు అందులో పాల్గొనవచ్చిన తన ముస్లిం మిత్రులు, ముస్లిం సైనికులు, సైన్యాధికారులు, ముస్లిం ప్రజల కోసం శివాజీ ఒక మసీదును కూడా నిర్మించాడు. శుక్రవారం, పండుగల సందర్భంలో ఖుత్బా ప్రసంగం చేయడానికి ప్రభుత్వం తరఫున ఒక ఖాజీని కూడా నియమించాడు. నేడు రాయెగడ్‌లో శివాజీ కట్టించిన ఆ మసీదు ఆనవాళ్ళు కూడా కనిపించవు. పీష్వాల కాలంలో అది నామరూపాల్లేకుండా ధ్వంసం చేయబడిందని చెబుతారు.

శివాజీని అమితంగా అభిమానించి, ప్రేమించి ప్రాణాలర్పించడానికి కూడా సిద్ధంగా ఉండేవారిలో హిందువులే కాదు ముస్లింలు కూడా ఉండేవారు. ఆగ్రా నుండి శివాజీని తప్పించడంలో కీలకపాత్ర పోషించిన వారిలో హిరోజి ఫర్ జంద్‌తో పాటుగా మదార్‌షా మెహ్‌తర్ అనే ముస్లిం కూడా ఉన్నాడు. శివాజీ పారిపోయే ప్లాను కేవలం వీరిద్దరికే తెలుసు. వీరిద్దరూ బంధింపబడి, చక్రవర్తిచే మరణదండన విధించబడినప్పుడు 'మీరు సంతోషంగా మా తలలు నరికించండి. మా ప్రభువు కోసం మా ప్రాణాల్ని తృణ ప్రాయంగా సమర్పిస్తున్నాం' అని సమాధానమిచ్చినప్పుడు ఔరంగజేబ్ వారి స్వామిభక్తికి, విశ్వాస పాత్రతకు ముగ్ధుడై పోయాడు. వారి మరణశిక్షను రద్దుపరచడమే కాకుండా వారిని విడుదల చేశాడు. కానుకలతో సత్కరించి పంపించడం గమనార్హం. దీనివల్ల ఆ కాలంలో స్వామిభక్తికి, విశ్వాస పాత్రతకు ఎంత విలువ, ప్రాధాన్యత ఉండేదో, అలాంటి వారు ఎలా గౌరవించబడేవారో ఈ సంఘటనే నిదర్శనం.'(తారీఖె హింద్ కా ఇన్‌ఖిలాబి కిర్దార్, శివాజీ: ప్రొఫెసర్ ఎం.కెషాజ్లి. పేజి. 258)

("మరాఠి - భారత్ ఇతిహాస్ సంశోధక్ మండల్" - పుణె, త్రైమాసిక్ వర్ష్ - 4, భాగ్ - 104, పేజి 127)

శివాజీని ఖైదు నుండి తప్పించడంలో ముస్లింల పాత్రను విశ్లేషిస్తూ డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే ఇలా తెలిపారు: "....శివాజీతోపాటుగా ఆగ్రా వెళ్ళిన ఒక ముస్లిం ఫరాష్ మందారి (మదార్‌షా మెహ్‌తర్) – ఇతని సహాయంగానే శివాజి ఆగ్రా కోట నుండి బయట పడగలిగాడు..." ("మందిర్ బోల్ ఉఠే" – డా.బిషంబర్ నాథ్ పాండే. పేజి.23)

బీజాపూర్ సేనాని 'సిద్ధి జౌహర్' పిన్హాల కోటను ముట్టడించి నలువైపుల్నుండి దాన్ని దిగ్బంధించినప్పుడు శివాజీ జీవితం ప్రమాదంలో పడిపోయింది. శివాజీని ఆ కోట నుండి తప్పించడంలో ప్రఖ్యాత మరాఠా నాయకుడు నేతాజీ పాల్కర్‌తో పాటుగా శివాజీకి విశ్వాస పాత్రుడైన ముస్లిం సైన్యాధికారి సిద్ధిహిలాల్ ప్రాణాలకు తెగించి బీజాపూర్ సైన్యాలతో పోరాడుతున్నాడు. అతనితోపాటుగా అతని కుమారులు కూడా భీకరంగా పోరాడుతున్నారు. అతని కుమారుల్లో ఒకడైన సిద్ధివాహ్‌వాహ్ తీవ్రంగా గాయపడి గుర్రం నుండి పడిపోయాడు. తన కుమారున్ని రక్షించుకోవడానికి బదులు సిద్ధిహిలాల్ శివాజీ రక్షణకే ప్రాధాన్యతనిచ్చాడు. చివరికి అతని కుమారుడు శత్రువులకు పట్టుబడిపోయాడు. ఆ తరువాత చంపబడ్డాడు. అయినా ఇతను మాత్రం శివాజీని అక్కడినుండి తప్పించడంలో కృతార్థు డయ్యాడు. ( శివాజీ కౌన్ హోటా? గోవింద్ పాన్సరే.(అను) పేజి 28. తారీఖే హింద్ కా ఇంఖిలాబి కిర్దార్ – శివాజీ– ప్రొ. ఎం.కె. షాఙ్లి, పే. 144–150). శివాజీని రక్షించడానికి ముస్లిం అయిన సిద్ధిహిలాల్ ముస్లింలతోనే ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాడు. ఈ యుద్ధాలు హిందు ముస్లింలనే ప్రాతిపదిక మీదనే గనుక జరిగి ఉంటే ఇలా జరగడం సంభవమా? అయితే విచిత్ర, విషాదకరమైన విషయం ఏమిటంటే, నేటి మరాఠా చరిత్ర సిలబస్ గ్రంథాలలో నేతాజీ పాల్కర్, బాజీప్రభూ పేర్లయితే కనబడతాయి, కాని సిద్ధిహిలాల్ పేరుగాని, సిద్ధివాహ్‌వాహ్ పేరుగాని కనిపించదు. నేటి మరాఠా యువతరానికి ఈ సిద్ధిహిలాల్ ఎవరో అసలు తెలియనే తెలియదు. చరిత్ర వక్రీకరణ అంటే ఇదేనండీ! ఇది ఒక పథకం ప్రకారం చరిత్రను రూపొందించడం కాకపోతే మరేమిటి? దీన్నే మనం నిజమైన చరిత్ర అనుకుంటున్నాం. దాన్నే మన యువతరాలకు చదివిస్తున్నాం. శివాజీని రక్షించడం కోసం ప్రాణాలకు ఒడ్డిపోరాడిన వారిలో ఇద్దరు హిందువులతోపాటు ఇద్దరు ముస్లింలు కూడా ఉన్నారని తెలిసినప్పుడు, శివాజీని అభిమానించేవారికి సహజంగానే ముస్లింలపై కూడా సదభిప్రాయం ఏర్పడుతుంది. అయితే కొన్ని శక్తులకు ముస్లింలపై ఇలాంటి సదభిప్రాయం ఏర్పడడం ఇష్టంలేదు. అందుకని వారు కావాలనే ఇలాంటి సందర్భాల్లో వచ్చిన ముస్లిం పేర్లను మరుగుపరుస్తుంటారు.

శివాజీ పట్ల ముస్లింల విశ్వసనీయత, స్వయంగా మరాఠాల విశ్వాస ఘాతుకాన్ని బయల్పరిచే ఒక సంఘటన మీకు సమర్పిస్తున్నాం. ఇదో లేఖ. దీన్ని శివాజీ 1665, మే నెలలో ప్రభావలికి సుబేదారు అయిన జీవాజీ నాయక్‌కు రాశాడు. ఈ లేఖ 'రాజ్‌వాడె కలక్షన్'– వాల్యూం–8, పేజి 31లో ఇలా నమోదు చేయబడింది.

'సూబ ప్రభావలీకి సుబేదారు, కార్యకర్త అయిన జీవాజీ నాయక్‌కు శివాజీ తరఫున దండాలు (నమస్కారాలు)- సంవత్సరం 1665

నావికా దళాధిపతులయిన దౌలత్ ఖాన్, దరియా సారంగ్‌లకు రొఖ్ఖం, ఆహార ధాన్యాలు సరఫరా చేయాలని మిమ్మల్ని ఆదేశిస్తూ పీష్వా మొరోపంత్ ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. కాని విస్మయం కలిగించే విషాదకర విషయమేమిటంటే మీరు ఈ ఆదేశాల్ని పాటించలేదని నాకు కబురందింది. నా వద్ద మీలాంటి అయోగ్యులైన వ్యక్తులు కూడా ఉన్నారని నేనసలు ఊహించి కూడా ఉండలేదు. ఏ రొఖ్ఖం, ఆహార ధాన్యాల కోసం మిమ్మల్ని ఆదేశించడం జరిగిందో అవి మీరు సరఫరా చేయకపోతే అవి వేరేచోటి నుండి పొందగలరని మీరు ఊహించి ఉంటారు. నేను పద్మదుర్గాన్ని రిపేరు చేయించి దాన్ని సురక్షితం చేశానని, పాత రాజనగరాన్ని సమాప్తం చేయడానికి దాని కెదురుగా కొత్త రాజ్య నగరాన్ని సిద్ధం చేయించాననే విషయం మీకూ తెలుసు. పద్మ దుర్గానికి సహాయం అత్యంత అవసరం. ఇంధనం ఇంకితర అవసర వస్తువులు వెంటనే సరఫరా కావాల్సి ఉంది. వీటికోసం నౌకలు ఇప్పటికే అక్కడికి చేరుకొని ఉంటాయి. ఇప్పుడైతే సిద్దీ (బీజాపూర్ సేనాని) సైన్యాలు పద్మదుర్గంపై నలువైపుల్నుండి దాడులు జరుపుతూ ఉండొచ్చు. ఇలాంటి (సున్నిత) సమయంలో మీరు సహాయమందించడంలో విఫలమయ్యారు. మీరు చేసిన ఈ పని అత్యంత ప్రమాద సమయంలో నా నావికాదళాన్ని నిర్వీర్యం చేసేస్తుంది. మీరు చేసిన ఈ పని ఫలితం రీత్యా ద్రోహానికి తక్కువేం కాదు. సమయానికి అందించక, సమయం గడిచిపోయిన తరువాత అవసర సామాగ్రిని దౌలత్ ఖాన్, దరియా సారంగ్‌లకు పంపిస్తే లాభమేమిటి? దీనితో వాటిల్లిన నష్టాన్ని పూడ్చుడం సాధ్యమా? సిద్దీ (బీజాపూర్ సేనాని) లంచమిచ్చి మిమ్మల్ని తన బానిసగానైతే చేసుకో లేదు కదా! మీరిలా వ్యవహరించడానికి బహుశ ఇదే కారణమై ఉంటుంది. ఇలాటి ద్రోహులైన ఉద్యోగులతో అత్యంత కఠినంగా ప్రవర్తించాల్సి ఉంటుంది. కేవలం అతనో బ్రాహ్మణుడనే కారణంగా ఇలాంటి ద్రోహపు నేరానికి అలక్ష్యం చేసి ఎవరుండగలుగుతారు? (తారీఖె హింద్ కా ఇన్ఖిలాబీ కిర్దార్ : శివాజీ- ఎం.కె షాజ్లి పేజి.425, 426) (ఛత్రపతి శివాజి మహారాజాన్చి పత్ర్- డాక్టర్ పి.ఎన్. దేశ్ పాండే, పత్ర్ నెం.140, పేజి 167)

ఈ సంఘటనను డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే ఇలా వివరించారు:

"....శివాజీ తన సుబేదారు అయిన జీవాజీ వినాయక్‌ను వారికి (అనగా దౌలత్‌ఖాన్, దరియాఖాన్ సారంగ్ లకు) ఆహార పదార్థాలు, రొఖ్ఖం సరఫరా చేయమని ఆదేశించి ఉన్నాడు. అయితే అతను సమయం మీద వాటిని సరఫరా చేయలేదు. దానిపై శివాజీ అతన్ని పదవీచ్యుతున్ని చేసి ఖైదు శిక్ష విధిస్తూ ఇలా వ్రాశాడు: "నీవో బ్రాహ్మణుడవైనందున ఇలాంటి మోసానికి పాల్పడినప్పటికీ నేను నిన్ను క్షమిస్తానని భావించావా? నీవు బ్రాహ్మణుడవై ఉండీ కూడా ద్రోహిగా తేలావు, ఇంకా సిద్దీ (బీజాపూర్ సేనాని)తో లంచం తీసుకున్నావు. అయితే నా

ముస్లిం నావికా కమాండర్లు ఎంత విశ్వాసపాత్రులుగా తేలారు! వారు తమ ప్రాణాలకు తెగించి ఒక ముస్లిం సుల్తానుకు వ్యతిరేకంగా నా కోసం వీరోచితంగా పోరాడారు....” (మందిర్ బోల్ ఉర్థే –డా.బిషంబర్ నాథ్ పాండే, పేజి 24 హిందీ)

రాజ్యస్థాపన కోసం, రాజుగా గుర్తింపు పొందడానికి కిరీటాన్ని ధరించడం, సింహాస నాన్ని అధిష్టించడం ఆ కాలంలో అనివార్యం. అయితే దీనికోసం ఎన్ని అడ్డంకులు, ఎన్ని అవాంతరాలు! మత పెద్దలు, బ్రాహ్మణ పురోహితులు అతను శూద్రుడని, కిరీట సింహాసనాలకు అనర్హుడని పట్టాభిషేకం నిర్వహించడానికి నిరాకరించారు. చివరికి బనారస్ (కాశీ) నుండి గాగాభట్ అనే బ్రాహ్మణ పండితున్ని పిలిపించుకొని నానాతంటాలు పడి సింహాసనాన్ని అధిష్టిం చాడు. ఆ తరువాత కూడా సుఖసౌఖ్యాలు, రాజభోగాలెక్కడ? యుద్ధాలు, నిరంతరం ఘర్షణలే. అతని జీవితమంతటిలో భారతదేశంలోని ఏ ఒక్క రాజు అతన్ని ఓ రాజుగా గుర్తించి ఆహ్వానించి రాచరిక మర్యాదలతో స్వాగతించిన దాఖలాలు లేవు. అయితే ఈ అవకాశం కూడా ఒక ముస్లిం పరిపాలకునికే దక్కింది. 1677లో శివాజీని ఒక రాజుగా, ఒక పరిపాలకునిగా గుర్తించి అతని అంతస్తు, హోదాకు తగిన విధంగా ఘనంగా సత్కరించి అతిథి మర్యాదలు ఇచ్చినవాడు హైదరాబాద్ ఖుతుబ్‌షాహి పరిపాలకుడు అబుల్ హసన్ తానీషా. శివాజీని సైన్యసమేతంగా ఆహ్వానించడమే కాకుండా అతన్ని తనకు సమానునిగా, సోదరునిగా భావించి తన మహలులో అతనికి స్వాగతం పలికి తన చేత్తో శివాజీకి అత్తరు పూసి ఆలింగనం చేసుకున్న ఒకే ఒక పరిపాలకుడు అబుల్ హసన్ తానీషా. రాజు, రాజకుటుంబీకులే కాకుండా పుర ప్రముఖులు, ప్రజలు కూడా శివాజీని అతని పరివారాన్ని సన్మానించి సత్కరించి ఘనమైన విందు ఏర్పాటు చేశారు. శివాజీని స్వాగతించ డానికి నగరమంతా శోభాయమానంగా అలంక రించారు. అతని స్వాగతం కోసం త్రోవల్లో అనేక గుమ్మటాలు, తోరణాలు కట్టారు. హిందూ ఆచారాల ప్రకారం స్త్రీలు అడు గడుగునా హారతులు పట్టారు. తానీషా, శివాజీలు బాల్కనీ నుండి సైనిక వందనాన్ని స్వీకరించారు. శివాజీ జీవితంలో ఇదో మరుపురాని ఘట్టం.

హైదరాబాద్‌లో నెలరోజులు అతను సుఖ శాంతులతో, భోగభాగ్యాలతో, రాచరిక మర్యాదలతో గడిపాడు. హైదరాబాద్ దర్బారులో, నగరంలో తమ పరిపాలకునికి లభించిన రాచమర్యాదల్ని, అతిథి సత్కారాలను నేటికీ కూడా మరాఠాలు గొప్పగా చెప్పుకుంటారు. దీనికోసం వారు తమ కృతజ్ఞతలు తెలుపుకుంటారు. ఈ పర్యటనకు సంబం ధించిన వివరాలు సభాసద్ బఖర్‌లోనూ, ఫ్రాన్‌కీస్ మార్టిన్ వాంగ్మూలంలోనూ లభిస్తాయి.” (తారీఖె హింద్ కా ఇన్‌ఖిలాబ్ కిర్దార్– శివాజీ: రచన ప్రొఫెసర్ ఎం.కె షాజ్లి, పేజి.350–355)

ఈ పరిస్థితుల్లో ఎక్కడా హిందూ ముస్లిలనే భేదభావం కనిపించదు. ముస్లింలంతా ఏకమై హిందువుల్ని, మరాఠాలను, శివాజీని ఎదుర్కొన్నట్లు కనిపించదు. అదే విధంగా

హిందువులంతా ఏకమై గోల్కొండ బీజాపూర్‌లను గాని, మొగలులను గాని ఎదుర్కొన్నట్లు ఎలాంటి దాఖలాలు లేవు. మొగలు సైన్యాల్లో బుందేలాలు, రాజపుత్రులు, మరాఠాలు ఉన్నారు. బీజాపూర్ సంస్థానాన్ని అంటి పెట్టుకుని ఎంతోమంది మరాఠా నాయకులున్నారు. ఆ రాజ్యంలోని అత్యధిక మంది మన్సబుదారులు మరాఠాలే. గోల్కొండలో అనేకమంది హిందువులు రాజ్యపు ఉన్నత హోదాలపై ఉండడమే కాకుండా స్వయంగా మాదన్న, అక్కన్నలు ప్రధానమంత్రిగా, సైన్యాధిపతిగా వ్యవహరిస్తున్నారు. మాదన్న మధ్యవర్తిత్వంతోనే ఖుతుబ్‌షా, శివాజీల మధ్య కర్ణాటక ప్రాంతాల గురించి సంధి ఏర్పడింది. స్వయంగా శివాజీ సైన్యంలో అత్యధిక మంది ముస్లిం సైనికులు, సైన్యాధికారులూ ఉన్నారు. ఒకరిలో ఒకరు ఇంతగా పెనవేసుకుపోయిన సమయంలో హిందువులంతా ఏకమై ఒక పక్షంగానూ, ముస్లిలంతా ఏకమై వేరొక పక్షంగానూ ఏర్పడడం సాధ్యమయ్యే విషయమేనా? అందుకని అప్పటి యుద్ధాల్ని హిందూ ముస్లింల మధ్య జరిగిన యుద్ధాలుగా వర్ణించడం, చూపించడం శుద్ధ పొరపాటు. అప్పటి యుద్ధాలు రాజులకు రాజులకు మధ్య, రాజ్యాలకు రాజ్యాలకు మధ్య జరిగినవి మాత్రమే. హిందూ ముస్లింలనే ప్రాతిపదికల మీద జరిగినవి ఎంతమాత్రం కావు. ఆ తరువాత కాలంలో కొన్ని దుష్టశక్తులు వాటిని కావాలని అలా మలిచాయి. దాన్నే మనం నిజమైన చరిత్ర అని విశ్వసిస్తున్నాం. దాన్నే మనం చదువుతున్నాం, రాబోయే తరాలకు చదివిస్తున్నాం. ఈ విధంగా హిందూ ముస్లింలనబడే భారతదేశంలోని ఈ రెండు పెద్ద వర్గాల్ని శాశ్వతంగా విడదీసి దూరం చేస్తున్నాం. దేశ సుదీర్ఘ ప్రయోజనాల దృష్ట్యా ఇది సమంజసమంటారా? దీన్ని దేశభక్తి, జాతి సేవ అని అనగలుగుతామా? విజ్ఞులు ప్రశాంత మనస్సుతో దీనిగురించి ఆలోచించాల్సి వుంది.

దాడిచేసే సమయంలో పిల్లల్ని, స్త్రీలను హింసించకూడదని, మసీదుల్ని, దర్గాలను ధ్వంసం చేయరాదని, కంటబడిన దివ్యఖుర్‌ఆన్ ప్రతుల్ని గౌరవించాలని శివాజీ తన సైన్యాలకు ఆదేశించాడు. దీనికి సంబంధించి ఔరంగజేబ్, శివాజీల సమకాలీనుడైన ప్రఖ్యాత మొగలు చరిత్రకారుడు, శివాజీని కాస్త దురుసుగానే విమర్శించే ముహమ్మద్ హాషిం ఖాన్ ఉరఫ్ ఖాఫీఖాన్ తన ప్రఖ్యాత గ్రంథం 'ముంతఖబుల్ లుబాబ్' వా. 2, భా. 3, లోని పేజీ 249లో ఇలా రాశాడు.

'సాంభాజీ తండ్రి శివాజీ కొన్ని సుగుణాలను కూడా కలిగి వుండేవాడు. తన రాజ్యంలోని ప్రజల మానమర్యాదల గురించి మధన పడేవాడు. అతనో తిరుగుబాటుదారు, వర్తక బిడారాల్ని జనపదాల్ని దోచుకుని ప్రజల్ని బాధపెడుతూ ఉండేవాడనడం తప్ప ఇంకే చెడు వర్తకాలు అతని ద్వారా బయల్పడేవి కావు. కనుకనే దోపిడి, దోపకాల సమయంలో ప్రజల కుటుంబాలు, స్త్రీలు, దివ్యఖుర్‌ఆన్ ప్రతులు చేజిక్కినప్పుడు వాటిని సంరక్షించాలని, గౌరవించాలని గట్టిగా ఆదేశించేవాడు. ఇంకా ఎవరైనా ఈ ఆజ్ఞల్ని ఉల్లంఘిస్తే అతన్ని కఠినంగా శిక్షించేవాడు." ప్రఖ్యాత చరిత్రకారుడు ప్రొఫెసర్ శ్రీరాంశర్మ కూడా The Crescent

in India - అనే తన పుస్తకంలోని పేజి. 554, 555లో ఈ ఆదేశాల్ని పేర్కొన్నాడు.

శివాజీ నిజమైన సెక్యులరిజాన్ని పాటించాడు. శివాజీ ఆదేశించినట్లు పేర్కొంటూ 1669 నవంబరు 2న రాసిన ఒక లేఖలో రఘునాధ్ పండిత్ రావు ఇలా రాశాడు... 'శ్రీమంత్ రాజ్‌మహరాజ్ అనగా రాజా శివాజీ 'ఎవరిది ఏ ధర్మమో అతను దాని ప్రకారమే నడుచుకోవచ్చని అందులో ఎవరూ జోక్యం చేసుకోరాదని ఆదేశించారు.' (ఛత్రపతి శివాజీ మహరాజ్ లేఖలు- బి.ఎన్ దేశ్‌పాండే)

శివాజీ కుటుంబానికి అతని ముత్తాతల కాలంనుండే ముస్లింలతో సన్నిహిత సంబంధాలుండేవి. శివాజీ తాత మాలూజీకి, అహ్మద్‌నగర్ సమీపంలో ఖననం కాబడిన ధార్మిక గురువు షాహ్ షరీఫ్‌పై అమితమైన భక్తివిశ్వాసాలుండేవి. గురువుగారి మీద భక్తితోనే ఆయన తన ఒక కుమారునికి షాహ్‌జీ అని, రెండవ కుమారునికి షర్ఫాజీ అని పేర్లు పెట్టుకున్నాడు.

శివాజీకి కూడా ఖేల్సీలోఉండే 'బాబా యాఖూత్' పట్ల అమితమైన భక్తివిశ్వాసా లుండేవి.

ఇదేవిధంగా శివాజీకి ఇంకొక ముస్లిం గురువు మావుని బువా (మొయినుద్దీన్ బాబా) పట్ల అత్యంత భక్తి విశ్వాసాలుండేవి.

బాలాపూర్‌కు చెందిన ధార్మిక గురువు ఇనాయతుల్లాషాహ్‌ను కూడా శివాజీ అమి తంగా అభిమానించి, గౌరవించేవాడు. (తారీఖే హింద్‌కా ఇన్‌ఖిలాబి- పేజి. 427, 428)

ఇదండీ! ఔరంగజేబ్, శివాజీల వాస్తవికత. అప్పటి యుద్ధాల నిజ పరిస్థితి. ఇందులో జాతి, ధర్మాలకు స్థానమేది? ఎవరు ఏ ధర్మానికి వ్యతిరేకంగా లేక ఎవరు ఏ జాతికి వ్యతిరేకంగా పోరాడారని చెప్పుకుంటాం? అలా చెప్పుకోవడానికి ఇక్కడ ఏదైనా ఆస్కారం కనబడుతుందా? ఔరంగజేబే గనక ఇస్లాం ధ్వజవాహకుడై హిందువులకు, హిందూ ధర్మానికి వ్యతిరేకంగా పోరాడినట్లయితే లక్షల సంఖ్యలో గల రాజపుత్రులు, బుందేలాలు స్వయంగా మరాతాలు ఊరకుండేవారా? అదేవిధంగా శివాజీయే గనక ఇస్లాం లేక ముస్లిం జాతికి వ్యతిరేకంగా పోరాడినట్లయితే అతని సైన్యంలో వేల సంఖ్యలో గల ముస్లింలు తమాషా చూస్తూ ఊరకుండేవారా? ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని ఒకసారి గంభీరంగా ఆలోచించుకొని చెప్పండి. అప్పుడు జరిగిన ఈ యుద్ధాలు ధార్మికపరమైనవా? జాతి ధర్మాలకు ఇందులో ప్రమేయం ఉందా? కాని ఇవి జరిగిన 150 సంవత్సరాల తరువాత వచ్చిన ఆంగ్లేయులు వీటిని ధార్మిక యుద్ధాలుగా, హిందూ ముస్లింల యుద్ధాలుగా వర్ణించారు. వారెందుకలా చేశారు? వారి లక్ష్యం ఏమైవుండింది? అనే దానికి "కాల్పనిక, వక్రీకరించిన భారత చరిత్ర" అనే అధ్యాయంలో వివరంగా పేర్కొన్నాము.

ఇక ఇప్పుడు ఆ కాలంలో జరిగిన సంఘటనల్ని, యుద్ధాల్ని వివిధ చరిత్ర గ్రంథాలనుండి ఉన్నదున్నట్లు మీకు సమర్పిస్తున్నాం.

ఔరంగజేబ్ విమర్శకులు అతనిపై మోపే నిందల్లో మరాఠాల వ్యవహారం ముఖ్యమైన వాటిలో ఒకటి. వారనేదేమిటంటే :

1. మరాఠాల సమస్య ఆలంగీర్ (ఔరంగజేబ్) కారణంగానే లేచింది.
2. శివాజి ఆలంగీర్ దర్బారులో హాజరైనప్పుడు, అతనితో సముచితమైన రీతిలో వ్యవహరించలేదు, అందుకనే అతను తిరుగుబాటు ధోరణిని అవలంబించాడు, అతని పట్ల గౌరవప్రదంగా వ్యవహరించి ఉంటే, ఇతర రాజపుత్ర మరియు మరాఠా నాయకుల్లాగే అతనూ ఆలంగీర్ విధేయుల్లో చేరిపోయేవాడు.
3. శివాజీకి అభయమిచ్చి దర్బారుకు (ఢిల్లీకి) రప్పించాడు, కాని తన వాగ్దానానికి విరుద్ధంగా అతన్ని గృహ నిర్బంధం చేశాడు.
4. శివాజీ వారసులతో ఆలంగీర్ మేలుగా ప్రవర్తించలేకపోయాడు.
5. మరాఠాలను ఔరంగజేబ్ అణచలేకపోయాడు, మరాఠాలే మొగలు సామ్రాజ్యాన్ని అతలా కుతలం చేశారు గనక, మొగలు సామ్రాజ్య పతనానికి అసలు కారకుడు కూడా ఔరంగజేబే.

పై విషయాలపై చర్చించడానికి ముందు శివాజీ వంశం మరియు కుటుంబం గురించి తెలుసుకుంటే పై సమస్యల్ని అర్థం చేసుకోవడం సులభంగా ఉంటుంది.

## శివాజి కుటుంబం :

శివాజీ కుటుంబం[1] మహారాణా ఉదయపూర్‌తో సంబంధం కలిగి ఉంది. ఈ కుటుంబంలోని సూర్‌సేన్ పేరుగల వ్యక్తి, కొన్ని కారణాలతో చిత్తోడ్‌ను విడిచి దక్కన్ సూబాలోని పరిందజిల్లా, కర్‌నబ్‌లో నివాసం ఏర్పరుచుకున్నాడు. ఈ కుటుంబంలోని ఒక వ్యక్తి 'మాలూజి' తన వారితో అసంతృప్తి చెంది, దౌలతాబాద్ సమీపంలోని 'ఎల్లోరా'కు వచ్చి స్థిరపడిపోయాడు.

ఆ కాలంలో దౌలతాబాద్ నిజాం షాహి వంశం పరిపాలనలో ఉండేది. దానికి 'లఖీజాదూ' పేరుగల వ్యక్తి దేశ్‌ముఖ్ (తహశీలుదారు)గా ఉంటుండేవాడు. మాలూజి, లఖీజాదూ ఉద్యోగంలో చేరిపోయాడు. మాలూజీకి ఇద్దరు కుమారులు. అహ్మద్ నగర్ సమీపంలో ఖననం కాబడిన ధార్మిక గురువు షాహ్ షరీఫ్‌పై అతనికి అమితమైన భక్తి విశ్వాసాలుండేవి. గురువుపైగల భక్తితోనే, ఆయన పేరుపై తన ఇద్దరు కుమారులకు షాహ్‌జీ మరియు షర్ఫ్‌జీ అని పేర్లు పెట్టుకున్నాడు. ఈ షాహ్‌జీయే, ఆ తరువాత 'సాహూజీ' అనే పేరుతో ప్రఖ్యాతిగాంచాడు. ఈ సాహూజీయే శివాజి తండ్రి. లఖీజాదూకు ఒక పుత్రిక తప్ప ఇంకే సంతానమూ లేదు. సాహూజీ అందంగానూ, సొగసుగానూ ఉండేవాడు, లఖీజాదూ ఇతన్ని తన వారసునిగా చేసుకొని తన కుమార్తెనిచ్చి వివాహం చేయాలని నిశ్చయించు కున్నాడు. అయితే లఖీజాదూ వంశం వారు

మాత్రం దీన్ని ఒప్పుకోక, అతన్ని ఈ చర్య నుండి వారించారు. చివరికి మాలూజి, అనంగ్‌పాల్ అనే పేరుగల ఒక పేరుమోసిన జమీందారు దర్బారులో స్థానం సంపాదించి, అతని ద్వారా ఒత్తిడి చేయించి, లఖీజాదూ కుమార్తెతో షాహ్‌జీ వివాహం జరిపించాడు.

**సాహూజీ (షాహ్‌జీ) :**

సాహూజీ మొట్టమొదటగా నిజాం షాహి రాజుల దర్బారులో స్థానం సంపాదించాడు. 1621లో నిజాం షాహి సైన్యం నర్మదా నదిని దాటి మొగలు ప్రాంతమైన 'మాల్వా'పై దాడిజరిపి దాన్ని ధ్వంసం చేసింది. వారిని గెంటివేయడానికి జహాంగీర్ సైనిక చర్యను చేపట్టి నప్పుడు, నిజాంషాహి సైనిక నాయకుల్లో సాహూజీ మరియు అతని మామ లఖీజాదూ రాయ్ కూడా ఉన్నారు.[2]

పై చర్యకు ప్రతీకారంగా జహాంగీర్, తన కుమారుడు షాజహాన్ నాయకత్వంలో దండయాత్ర జరిపినప్పుడు, జాదూరాయ్ షాజహాన్‌ను ఆశ్రయించాడు. ఫలితంగా జాదూరాయ్‌కు ఐదువేల మన్సబు లభించడమే కాక అతని కుటుంబంలోని వారికి వారి వారి స్థాయిని అనుసరించి తగిన హోదాలు కూడా లభించాయి. అయితే 1631లో మొగలులతో తిరుగబడి అతను తిరిగి నిజాం షాహీని ఆశ్రయించాడు. కాని నిజాంషాహి పాలకుడు జాదూరాయ్‌ను అతని కుటుంబీకులతో సహా చంపించాడు. ఇది చూసిన సాహూజీ, నిజాంషాహ్‌కు తిరుగబడి, షాజహాన్ దర్బారును ఆశ్రయించాడు. షాజహాన్ అతన్ని గౌరవించి, ఐదువేల మన్సబును ప్రదానం చేశాడు. అంతేకాకుండా రాజవస్త్రాలు, మణులుదాపిన ఆయుధాలు, ధ్వజము, నగారా, అలంకరించిన అశ్వము, గజరాజుతో బాటుగా రెండు లక్షల నగదు బహుమానంగా ఒసంగబడ్డాయి. సాహూజీకి (వరుసకు) బావ మరుదులైన బహాదూర్, జగ్‌దేవ్‌లకు కూడా ఐదువేల మరియు నాలుగువేల మన్సబులు లభించాయి.[3] నిజాంషాహీకి చెందిన (మలిక్) అంబర్ జాగీరులోని కొన్ని ప్రాంతాల్ని కూడా షాజహాన్, సాహూజీకు అప్పగించాడు. కాని 1632లో అంబర్ కుమారుడు ఫతహ్‌ఖాన్, నిజాంషాతో తిరుగుబడి షాజహాన్‌ను ఆశ్రయించినప్పుడు, షాజహాన్ సాహూజీకిచ్చిన ప్రాంతాల్ని తీసేసుకొని, తిరిగి ఫతహ్ ఖాన్‌కు అప్పగించాడు. దీంతో అసంతృప్తుడైన సాహూజి మొగలులను విడిచి బీజాపూర్ పరిపాలకుడు ఆదిల్ షాతో కలిసిపోయాడు, ఇంకా ఒక పెద్ద సైన్యాన్ని తీసుకొని దౌలతాబాద్‌పై దండెత్తడానికి బయలుదేరాడు.[4]

సాహూను దండించడానికి షాజహాన్ తన సైన్యాల్ని పంపించాడు. ఈ సంవత్సరమే సాహూ భార్యాపిల్లలు బంధీలయ్యారు. 1633లో సాహూజీ జఫర్‌నగర్‌పై దాడి జరిపాడు. 1635లో మొగలు రాజ్యంలోని ఇతర జిల్లాలపై దాడులు జరిపాడు. అతన్ని అణచివేయడానికి ఆలంగీర్ (ఔరంగజేబ్) నియమించబడ్డాడు.

షాజహాన్ నిజాంషాను బంధించి గ్వాలియర్ కోట చెరసాలలో పడవేశాడు. అతనికి సంతానం లేదు. ఒక అజ్ఞాత వంశీయున్ని నిజాంషా వారసునిగా, నిజాంషాహి గద్దెపై

కూర్చుండబెట్టి, సాహూ రాజ్యమేలసాగాడు. అంతేకాకుండా మొగలు సామ్రాజ్యంలోని కొన్ని జిల్లాల్ని కూడా ఆక్రమించుకున్నాడు.[5] ఈ దురాగతాల్లో బీజాపూర్ రాజ్యాధీశుడు ఆదిల్ షా సాహూకు సంపూర్ణ సహాయ సహకారాలందిస్తున్నాడు. సాహూ సహాయార్థం, ఆదిల్ షా రుందేలా నాయకత్వంలో ఒక సైన్యాన్ని కూడా పంపించాడు.[6]

ఈ సైనిక దాడులతో చిర్రెత్తిన షాజహాన్ దీన్ని పూర్తి శక్తి సామర్థ్యాలతో అణచివేయ డానికి కంకణం కట్టుకున్నాడు. 1636లో నలభై ఎనిమిది వేల సైన్యాన్ని తన ప్రముఖ నాయకుల సారథ్యంలో దక్కన్‌కు పంపించాడు. అందులోని ఇరవై వేల సైన్యానికి ఖానెజమాఁ అనే నాయకుణ్ని సైన్యాధిపతిగా నియమించి, సాహూ స్థావరమైన చమార్‌కొండను ధ్వంసం చేసి, కొంకణ్ జిల్లాల వైపు సాగిపోవాలని ఆదేశించాడు. అదే రీతిలో ఈ సైన్యాలు సాహూకు చెందిన ఇరవై ఐదు కోటల్ని వశపర్చుకుంటూ, సాహూను బీజాపూర్ వరకు పారద్రోలాయి. 1637లో సాహూ నిజాం షాహీ ప్రాంతాల నుండి కూడా పూర్తిగా గెంటివేయబడ్డాడు.[7]

ఆ తరువాత సాహూజీ ఆదిల్ షాహి దర్బారులో ఉద్యోగంలో చేరాడు. ఆదిల్ షా అతనికి పూనా మరియు సూప ప్రాంతాలు జాగీరుగా ఇచ్చాడు.

ఇకిప్పుడు సాహూజీ (షాహ్‌జీ భోన్‌స్లే) కుమారుడు శివాజీ రంగంలోకి వస్తాడు. యవ్వనంలో అడుగిడగానే అతను ధైర్యసాహసాల్ని ప్రదర్శించసాగాడు. తండ్రికి లభించిన ఈ జాగీరును తన అధీనంలోకి తీసుకున్నాడు. పలుచోట్ల కోటలు నిర్మించసాగాడు. క్రమక్రమంగా చెప్పుకోదగ్గ ఓ సైన్యాన్ని సిద్ధం చేసుకున్నాడు. మాసిరుల్ ఉమరా కథనాన్ని అనుసరించి దీని సంఖ్య పదిహేనువేల వరకు చేరుకుంది. ఆ విధంగా తన అధీనంలోని ప్రాంతాల్ని పెంచుకోసాగాడు. ఇంతలోనే ఆదిల్ షా జబ్బుపడ్డాడు. అతని దర్బారు వ్యవస్థలో బీటలు ఏర్పడ్డాయి. శివాజీ చుట్టుప్రక్కల ఉన్న ప్రాంతాల్ని ఆక్రమించసాగాడు. చివరికి దూరప్రాంతాల్ని కూడా తన అధీనంలోకి తీసుకోగలిగాడు. కొన్ని రోజుల్లోనే బీజాపూర్‌కు చెందిన కొంకణ్‌లోని అన్ని ప్రాంతాల్ని కైవసం చేసుకున్నాడు.[8] బలాన్ని కూడబెట్టుకున్న శివాజీ, ఏ పల్లెఅయినా, ఏ నగరమైనా సమృద్ధిగా ఉందని తెలియగానే దానిపై మెరుపుదాడి జరిపి, దాన్నంతా దోచుకొని పారిపోయేవాడు. ఆ నగర అధికారి ఈ విషయంగా ఆదిల్ షాకు కబురు పంపినప్పుడు, దానితో పాటుగానే శివాజీ అర్జీపెట్టుకుంటూ, "ఈ జిల్లా రాబడి ఇంకెంతో పెరిగే అవకాశముంది, దాన్ని నా జాగీరుగా ఇస్తే ప్రస్తుత రాబడికన్నా అధికంగా ఇస్తాను" అని వ్రాసేవాడు. దర్బారులో ఆదిల్ షా అనారోగ్యం వల్ల పరిస్థితి అస్తవ్యస్థంగా మారిపోయింది. అధికారుల, జాగీర్దారుల విన్నపాల్ని పట్టించుకునే నాధుడే లేడు. లంచాలకు మరిగిన దర్బారు ఉద్యోగులు, శివాజీకి జాగీరు పత్రాలను వ్రాయించి పంపించేవారు.[9]

"బీజాపూర్ సుల్తాన్ జబ్బుపడి మంచం పట్టగానే శివాజీకి మంచి అవకాశం లభించింది. అతను బాజీ పాసల్కర్, యసాజి కనక్ మరియు తానాజీ మాలుసరేలను పదాతి దళాల నిచ్చి

"టోర్నా" కోటను స్వాధీనపరుచుకోవడానికి పంపించాడు. ఇక్కడుంటున్న బీజాపూర్ కోటాధిపతి చేతి నుండి కోటను వశపర్చుకున్నాడు. శివాజీకి అక్కడ రెండు లక్షల హూన్లు (ఆ కాలపు నాణెములు) దొరికాయి.[10] అతను పోరందర్, రాజ్‌గడ్, కోన్‌దనా, టోర్నా, టకోనా, లోహాగడ్ మరియు రాజ్‌మచి కోటల్ని కూడా స్వాధీనపరుచుకున్నాడు. అబ్బాజీ సోందియా నాయకత్వంలో మరాఠా అశ్వికులు కళ్యాణ్, భీవండీపై కూడా దాడి జరిపారు. ఇక్కడి నుండి పెద్ద మొత్తంలో ధనాన్ని ఇతర విలువైన వస్తువుల్ని దోచుకొని పోయారు. ఈ దాడిలో కళ్యాణ్, మాహోలి జన పదాలు మరియు థానా జిల్లాలోని ఇతర ప్రాంతాలు కూడా శివాజీ అధీనంలోకి వచ్చాయి.[11]

శివాజీ దాడులకు అడ్డుకట్ట వేయడం కోసం బీజాపూర్ ప్రభుత్వ అధికారి అయిన ముస్తఫా ఖాన్ 1648లో శివాజీ తండ్రి సాహూజీని బంధించి, అతని సర్వస్వాన్ని జప్తు చేసు కున్నాడు. అతనికి బేడీలు వేసి బీజాపూర్ తీసుకువచ్చి, తన కుమారుని కార్యకలాపాలను మాన్పించి అతన్ని బీజాపూర్ రప్పించవలసిందిగా బాగా ఒత్తిడి చేయడం జరిగింది.[12] ఇది తెలుసుకున్న శివాజీ, మొగలు రాకుమారుడైన మురాద్‌ను ఆశ్రయించి సహాయం అడిగాడు. మొగలు ప్రభుత్వ ఉద్యోగంలో చేరిపోతానని కూడా విన్నవించుకున్నాడు. కాని మొగలులు అతనికేం సహాయం చేయలేదు గాని, బీజాపూర్ దర్బారుకే చెందిన ఇద్దరు నాయకులు షర్జాఖాన్ మరియు రుందేలా ఖాన్ (లేక అహ్మద్ ఖాన్)ల జోక్యం మరియు జమానతుపై సాహూజీ (షాహ్‌జీ) విడిపించబడ్డాడు. శివాజీ తన దాడులను ఆపాలనీ, ఇంకా బెంగళూరు, కోందానా, కాందర్పి కోటలు సుల్తాన్‌కు అప్పగించాలనే షరతులపై ఈ విడుదల జరిగింది. అందుకని 1649 నుండి 1655 వరకు శివాజీ మౌనంగా ఉండిపోయాడు.[13]

కాని 1655లో శివాజీ తన కార్యకలాపాల్ని తిరిగి ఎలా ప్రారంభించాడో, జదూనాథ్ సర్కారు ఇలా వివరించాడు :

"పదహారవ శతాబ్దపు ఆరంభంలో బీజాపూర్ సుల్తాన్, మరాఠా వంశానికి చెందిన మోరస్ అనే వ్యక్తికి, జాదలీ అనే ప్రాంతాన్ని జాగీరుగా ఇచ్చి ఉన్నాడు. ఇతను చుట్టుప్రక్కలున్న ప్రాంతాల్ని దోచుకొని గొప్ప ధనాన్ని కూడబెట్టుకోగలిగాడు. కొండ ప్రాంతాలవారు, మావలీలతో కూడిన పన్నెండువేల పదాతి సైన్యాన్ని కూడా సమీకరించుకున్నాడు. ఈ సైన్యం సహాయంతోనే ఈ వంశం వారు కోంకణ్ ప్రాంతాన్నంతా తమ అధీనంలో ఉంచుకోగలిగారు. ఈ వంశపాలకుడు చందర్ రావుగా పిలువబడేవాడు. శివాజీకి ఒక ఆలోచన వచ్చింది. ఈ రాష్ట్రాన్ని ఆక్రమించుకోనంత వరకు దక్షిణం వైపున్న ప్రాంతాల్ని విస్తరించుకోలేడు. ఈ ఆలోచన రాగానే రఘునాథ్ బల్లాల్ గోవర్ధన్ అనే బ్రాహ్మణుని పిలిచి, 'జాదలీ'కి చెందిన చందర్‌రావును కడతేర్చనంతవరకు తన రాష్ట్రం సురక్షితంగా ఉండజాలదని, కేవలం నీవు మాత్రమే ఈ కార్యాన్ని సాధించగలవని, నిన్ను అతని వద్దకు రాయబారిగా, దూతగా పంపిస్తానని చెప్పు కొచ్చాడు. అతనీ కుట్రకు అంగీకరించాడు. అతను నూట ఇరవైఐదు మందిని వెంటబెట్టుకొని బయలుదేరాడు. చందర్‌రావును (మాటల్లో దించి) అతన్ని చురకత్తితో సమాప్తం చేసేశాడు.

చందర్ రావు కుమార్తె వివాహ విషయం మాట్లాడే నెపంతో చందర్‌రావు సోదరుణ్ణి గాయ పరిచాడు. ఈ బ్రాహ్మణుని కార్యం సఫలమైందనే వార్త వినగానే, శివాజీ బయలుదేరాడు. తీర్థానికి వెళుతున్నామని చెబుతూ సైన్యంతో మహాబలేశ్వరం చేరుకున్నాడు. మోరస్ (చందర్‌రావు) వధించబడగానే అతను జాదలీని ముట్టడించాడు. అతని ఇద్దరు కుమారుల్ని ఇతర కుటుంబ సభ్యుల్ని బంధీలుగా చేసి, తన అధీనంలోకి తీసుకున్నాడు.[14]

1656లో బీజాపూర్ రాజ్యాధీశుడు ఆదిల్ షా గతించినప్పుడు, అతనికి మగ సంతానం లేదు. బీజాపూర్ దర్బారు నాయకులు చక్రవర్తి అయిన షాజహాన్ అనుమతి తీసుకోకుండానే, అజ్ఞాత వంశీయుడైన ఒక యువకున్ని అలి ఆదిల్ షా పేరుతో సింహాసనంపై కూర్చుండ బెట్టారు. దీనితో కోపగించిన షాజహాన్, బీజాపూర్‌ను ముట్టడించవలసిందిగా ఔరంగజేబ్‌ను ఆదేశించాడు.[15] ఔరంగజేబ్ ముట్టడికి సన్నాహాలు చేస్తున్న సమయంలో అహ్మద్‌నగర్‌లో మొగలు గవర్నరుగా ఉంటున్న ముల్తఫత్ ఖాన్‌కు శివాజీ ఒక లేఖ వ్రాస్తూ తనకు అనుమతిస్తే మొగలు సైన్యంలో చేరుతానని, మొగలు ప్రభుత్వం తనను తన సంరక్షణంలోకి తీసుకోవాలని, బీజాపూర్ ఏ ప్రాంతాలనైతే తాను స్వాధీనపరుచుకున్నాడో, వాటిపై తన చట్టపరమైన హక్కుగా గుర్తించాలని కూడా కోరాడు. అయితే ఔరంగజేబ్ అస్పష్టమైన సమాధానం ఇచ్చాడు, దానితో శివాజీకి తృప్తి కలుగలేదు. మొగలుల మరియు బీజాపూర్ మధ్య యుద్ధం ప్రారంభమయిన తరువాత, అత్యధిక మొగలు ప్రాంతాల్ని కొల్లగొట్టాలనే షరతుతో బీజాపూర్‌వారు శివాజీకి అత్యధిక ఆశ చూపించారు. 1657లో ఇద్దరు మరాఠా సర్దారులు మూడువేల అశ్విక దళంతో చమార్‌కొండ మరియు రాయెసేన్‌లో ప్రవేశించి, ఈ రెండు నగరాల్ని ఘోరంగా దోచుకున్నారు. వారి ఈ హింసాదౌర్జన్యాలు అహ్మద్ నగర్ పరిసరాల వరకు వ్యాపించి పోయాయి. ఇటు ఈ మరాఠా సర్దారులు దోపిడీ దౌర్జన్యాల్లో నిమగ్నమైవుంటే, అటు శివాజీ ఉత్తరంలో "జనేర్"ను దోచుకుంటున్నాడు. ఒక రాత్రి నిశ్శబ్దంగా ఉచ్చ్రాడు సహాయంతో జనేర్ కోటగోడ పైకెక్కాడు. దాని సంరక్షకుల్ని సంహరించాడు. మూడు లక్షల హూన్ల డబ్బు, రెండు వందల అశ్వాలు, నగలు దోచుకొని వెళ్ళిపోయాడు. (హి.ఆ.ఔ., జ.నా.స., వా-4, పే.25)

జనేర్ కోటాధిపతి శివాజీ దోపిడీని ఆపలేకపోయినందున అతను ఔరంగజేబ్ ఆగ్రహానికి గురిఅయ్యాడు. ఇక ఔరంగజేబ్ స్వయంగా సైన్యాల్ని తీసుకొని బయలుదేరాడు. కాని ఎప్పుడైతే బీజాపూర్ వాళ్ళు మొగలులతో సంధి ఏర్పాటు చేసుకున్నారో, ఇక మొగలులకు వ్యతిరేకంగా పోవడానికి శివాజీ సాహసించలేకపోయాడు. అతను మొదట నాసిరి ఖాన్‌కు లేఖ వ్రాస్తూ తన విధేయతను తెలుపుకున్నాడు. అక్కడి నుండి ఆశాజనకమైన సమాధానం రావడంతో, తన కోరికలను తెలుపుతూ, తన అంతరంగికుడు ఒకణ్ణి నాసిరి ఖాన్ వద్దకు పంపించాడు. ఆ తరువాత తన దూత రఘునాథ్ పంత్‌ను సరాసరి ఔరంగజేబ్ వద్దకే పంపిం చాడు. ఆ

సమయంలో అనగా 1658 జనవరి 25వ తేదీన ఔరంగజేబ్ తండ్రి జబ్బు వార్త విని, ఉత్తర భారతానికి బయలుదేరుతున్నాడు. అప్పుడతను శివాజీకి ఈ క్రింది సమాధానమిచ్చాడు. (పేజీ 27).

"నీ అపరాధాలైతే క్షమార్హం కానివి. అయినా నీవు నీ క్షంతవ్యతను (విచారాన్ని) తెలుపుకుంటున్నావు గనుక నిన్ను క్షమిస్తున్నాను. నీ తండ్రి షాహ్‌జీ జాగీరులో ఉండబడిన గ్రామాలన్నీ నీకివ్వాలని, మొగలు సైన్యాలు నిజాంషాహి ప్రాంతాల్ని కైవసం చేసుకున్న తరువాత, మిగిలిన, నీ అధీనంలోనున్న నిజాం షాహి బాపతు ప్రాంతాల్ని, కోటల్ని నీకు విడిచి పెట్టాలని, నీవు సోనా పండిత్‌ను నీ రాయబారిగా చేసి దర్బారుకు పంపుతావని, నా ఉద్యోగం చేయడానికి, నీ నాయకుని సారథ్యంలో ఐదువందల అశ్విక దళాన్ని కూడా పంపు తావని ప్రతిపాదనలు పంపావు. ముందుగా సోనా పండిత్‌ను పంపమని నిన్ను ఆదేశించడం జరుగుతున్నది. ఆ తరువాత నీ విన్నపాలు అంగీకరించబడతాయి." (హి.ఆ.ఔ. వా-4, పేజి 28, జదూనాథ్ సర్కార్)

"శివాజీ తరఫు నుండి విధేయత ప్రకటింపబడింది వాస్తవమే అయినప్పటికీ ఔరంగజేబ్‌కు మాత్రం అతనిపై విశ్వాసం ఏర్పడలేదు. అందుకని ఈ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం సాధ్యమైన అన్ని పద్ధతులు అవలంబించబడ్డాయి. ఔరంగజేబ్ దక్కన్ విడిచిపోతున్నప్పుడు, శివాజీకి సక్రమమైన క్షమాపత్రమేమి ఒసంగలేదు. అయితే ఔరంగజేబ్ వారసత్వ యుద్ధంలో మునిగిపోవడంతో శివాజీకి మొగలుల భయం లేకుండా పోయింది." (వా-4, పేజి 29)

శివాజీ ఆర్థిక దాడులు రోజు రోజుకూ పెరుగుతూనే పోతున్నాయి. బీజాపూర్ ప్రాంతాలపై అతని విధ్వంసక చర్యలకు బేజారెత్తిపోయిన బీజాపూర్ వాళ్ళు, శివాజీ తండ్రి సాహూజీని, తన కుమారుణ్ణి అదుపు చేయాల్సిందిగా ఒత్తిడి చేశారు. *(హి.ఆ.ఔ.- సర్ జ.నా.సర్కార్, వా-4, పేజి 29)*

శివాజీ చర్యలు పెరగసాగాయి. దాంతోపాటే తన బల శక్తుల్ని పెంపొందించు కోసాగాడు. ఈ మధ్యకాలంలో అతను నలభై కోటలు నిర్మించుకున్నాడు. ద్వీపకల్పాల్లో నావికా బలాన్ని పెంపొందించుకున్నాడు. *(ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్, వా-2, భా.3, పేజి 117,118)* మరాఠాల ఒక గొప్ప సైన్యాన్ని సమీకరించుకున్నాడు. క్రమక్రమంగా బీజాపూర్‌కు చెందిన ఎన్నో జిల్లాల్ని ఆక్రమించుకున్నాడు. ఇక లాభం లేదని భావించిన బీజాపూర్ పాలకుడు అలి ఆదిల్‌షా శివాజీని అణచడానికి తన సేనాని అఫ్జల్ ఖాన్‌ను నియమించాడు. అఫ్జల్ ఖాన్ నలువైపుల నుండి శివాజీని ముట్టడించాడు.

బీజాపూర్ నాయకుడు అఫ్జల్ ఖాన్ హత్యకు సంబంధించి జదూనాథ్ సర్కార్ ఇలా వివరించాడు :

"1659లో శివాజీని అణచడానికి బీజాపూర్ నాయకుడు అఫ్జల్ ఖాన్ ప్రతాప్ గడ్ చేరుకున్నప్పుడు శివాజీతో అతని కలయిక జరిగింది. అప్పుడు ఆలింగనం చేసుకునే సందర్భంలో

శివాజీ చురకత్తితో అఫ్జల్ ఖాన్ పొట్ట చేల్చేశాడు. అఫ్జల్ ఖాన్ 'మోసం, వంచన, హత్య, సహాయం....' అంటూ అరుస్తూనే నేలకొరిగాడు. అతన్ని పల్లకీలో పరుండబెట్టి ఎత్తుకెళుతున్నప్పుడు షంభూజీ కావుజీ, మావటివాళ్ళ కాళ్ళను గాయపరిచాడు. దాంతో వారు పల్లకీని భూమిపై దించేశారు. షంభూజీ కావుజీ అఫ్జల్ ఖాన్ తలను నరికి, విజయోత్సాహంతో ఆ తలను శివాజీకి సమర్పించాడు." *(హి.ఆ.ఔ., సర్ జ.నా.స, వా-4, పేజి 35)*

## ఔరంగజేబ్ సైనిక చర్య :

శివాజీ మొగలు ప్రాంతాలపై కూడా దాడులు ప్రారంభించాడు. ఔరంగజేబ్ సోదరులతో అంతర్యుద్ధాల నుండి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. అయినా 1660లో దర్బారులోని ముఖ్య నాయకుడు అయిన షాయిస్త ఖాన్‌ను ఈ పరిస్థితుల్ని చక్కబెట్టడానికి దక్కన్ గవర్నరుగా చేసి పంపించాడు. 1660లో షాయిస్తఖాన్ 'సియో'లో ప్రవేశించాడు. అప్పుడు శివాజీ 'సోపా'లో ఉన్నాడు. షాయిస్తఖాన్ రాక విని, శివాజీ 'సోపా' నుండి తప్పించుకుపోయాడు. షాయిస్త ఖాన్ 'సోపా'ను ఆక్రమించుకున్నాడు. ఆ తరువాత పూన, సేవాపూర్‌లు కూడా కైవసమయ్యాఇ. 'జాల్నా' ముట్టడించబడింది. ఎన్నో నెలల ముట్టడి తరువాత, కోటలోని వారు ప్రాణ రక్షణ షరతుపై కోటను అప్పగించారు. షాయిస్త ఖాన్ పూనాను కేంద్రంగా చేసుకొని, శివాజీ తన కోసం నిర్మించుకున్న మహలులోనే తన నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. శివాజీని పట్టుకోవడానికి నలువైపులా సైన్యాలు పంపబడ్డాయి. శివాజీ రక్షణ లేకపోవడంతో నలువైపులా పరుగెడుతున్నాడు. అతికష్టంగా అధిరోహించగలిగే కొండలు, గుట్టల చరియల్లో కూడా ఒకటి రెండు వారాల కన్నా అధికంగా నిలువలేకపోతున్నాడు. (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫీ ఖాన్ వా-2, పేజి 163).

శివాజీ తనదైన శైలిలో వ్యవహరిస్తున్నాడు. 1666లో పూనాలో షాయిస్తఖాన్‌పై రే దాడి జరిపాడు.

దీన్ని జదూనాథ్ సర్కార్ ఇలా వర్ణించాడు:

"....... పూనాలో శివాజీ తన బాల్యాన్ని గడిపిన మహలులోనే షాయిస్తఖాన్ నివాసం ఏర్పరుచుకున్నాడు. ఆ మహలు గురించి శివాజీకి బాగా తెలుసు. ఒక రాత్రి ఆ ఇంటికి కన్నం వేసి దాని ద్వారా తన రెండు వందల మందిని ఇంట్లో ప్రవేశింపజేశాడు. రాత్రి అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో వారిపై దాడి జరిపాడు. షాయిస్త ఖాన్ నిదురలో ఉండగా అతనిపై దాడి జరిగింది. ఫలితంగా అతని బోటన వేలు తెగిపోయింది. అతను లేచి సైనికులను ఎదుర్కొంటుంటే, వారు ఎనమండుగురు స్త్రీలను వధించారు. వేరొక వైపు ఇంకొంతమంది సైనికులు లోనికి చొరబడ్డారు. ఈ అలికిడికి షాయిస్తఖాన్ రక్షకులు మేల్కొన్నారు. అంతలోనే శివాజీ తన మనుషులతో పారిపోయాడు. కాని పారిపోతూ కూడా షాయిస్త ఖాన్ ఒక కుమారుణ్ని,

ఒక సైనికాధికారిని, ఇతర నలభైమందిని, భార్యలు, దాసీలలో నుండి ఆరుగురు స్త్రీలను హత మార్చివెళ్ళాడు. ఇద్దరు కుమారులు, ఎనమండుగురు స్త్రీలతో సహా, స్వయంగా షాయిస్త ఖాన్ కూడా గాయపడ్డాడు." (హి.ఆ.ఔ. వా-4, పేజి 43-46) *(ముంతఖబుల్ లుబాబ్, ఖాఫిఖాన్-వా-2, భా. 3, పే.163-165)*

ఔరంగజేబ్‌కు ఈ వార్త తెలియగానే అతను షాయిస్త ఖాన్ పట్ల అత్యంత అసంతృప్తుడై, అతని అజాగ్రత్త వల్లనే ఈ దుస్సంఘటన జరిగిందని భావించి, అతన్ని దక్కన్ నుండి తీసేసి, శిక్షగా అతన్ని బెంగాల్ సూబాకు ట్రాన్స్‌ఫర్ చేసేశాడు. అతని స్థానంలో రాకుమారుడు ముఅజ్జంను నియుక్తుణ్ణి చేశాడు.

ఇకిప్పుడు శివాజీకి ఎదురులేదు. 1664లో శివాజీ మొగలుల అధీనంలో నున్న సూరత్ పట్టణాన్ని ఘోరంగా దోచుకొని దానికి నిప్పంటించాడు. (హి.ఆ.ఔ., జ.నా.స., వా-4, పే.49). అయితే మొగలు సైన్యాలు అక్కడికి వస్తున్నాయని తెలియగానే శివాజీ తన మనుషులతో సహా అక్కడి నుండి తప్పించుకొని పోయాడు. (వా-4, పే.52). ఈ దోపిడీ వార్త ఔరంగజేబ్‌కు తెలిసినప్పుడు అక్కడి వర్తకులతో తీసుకోబడే వాణిజ్య పన్నును ఒక సంవత్సరం పర్యంతం ఎత్తివేశాడు, అక్కడ వ్యాపారం చేస్తున్న ఆంగ్లేయ మరియు పోర్చుగీసు వర్తకులు, తెగించి శివాజీని ఎదుర్కొన్నారని తెలిసినప్పుడు, వారి పరాక్రమానికి బహుమానంగా వారితో తీసుకోబడే దిగుబడి (ఇంపోర్ట్) పన్నును ఒక శాతం తగ్గించాడు. (హి.ఆ.ఔ., జ.నా.స.-, వా-4, పేజి 52).

శివాజీ దాడులు రోజు రోజుకు పెరిగిపోసాగాయి. అందుకని జైపూర్ రాజ్యాధీశుడు, ఔరంగజేబ్‌కు విశ్వాసపాత్రుడు, మొగలు సైన్యాలన్నిటికీ సైన్యాధ్యక్షుడు అయిన రాజా జైసింగ్, ఈ పనికోసం ఎంపిక చేయబడి దక్కన్ పంపబడ్డాడు. "అతనితో ముస్లిం సేనానులే కాకుండా రాయెసింగ్ సిసోదియా, రాజా సుజాన్ సింగ్ బుందేలా, కీరత్ సింగ్, మిత్రసేన్ మరియు ఇంద్రామన్ బుందేలా కూడా ఉన్నారు. అతను పూనా చేరుకొని మహారాజా జస్వంత్ సింగ్ నుండి చార్జ్ తీసుకున్నాడు. అతను శివాజీకి చెందిన తూర్పు ప్రాంతంలో తన స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఇక్కడి నుండి మరాఠాల గుండెలాంటి మధ్య భాగాన్ని దెబ్బదీయడంలో కృతార్థుడైతే, దూరప్రదేశాలు వాతంతటవే అధీనంలోకి వస్తాయి. అంతేకాకుండా అతను ఎంతో దూరదృష్టిని ప్రదర్శిస్తూ, శివాజీకి శత్రువులైన వారందరినీ తన వైపునకు రప్పించు కున్నాడు. అటువైపు ఏ ప్రాంతాలైతే యూరోపియన్ల అధీనంలో ఉన్నాయో, వారందరినీ కలుపుకున్నాడు. తన వెంటనున్న బ్రాహ్మణ రాయబారుల్ని దక్కన్ నాయకుల వద్దకు పంపించాడు. చాదలీకి చెందిన రాజు నుండి, శివాజీ అతని రాజ్యాన్ని లాక్కున్నాడు. కనుక ఆ వంశం వాడైన రాజా బాజిచందర్‌రావు, తన సోదరుడు అంబాజి గోవింద్‌రావు, మాంకోజి మొదలైన వారితో వచ్చి జైసింగ్‌ను కలిసి, మొగలు సైన్యంలో చేరిపోయాడు. శివాజీ మోసంతో అఫ్జల్ ఖాన్‌ను చంపి

ఉన్నందున ప్రతీకారం కోసం అతని కుమారుడు ఫజల్ ఖాన్ కూడా జైసింగ్‌తో కలిసిపోయాడు. కళ్యాణ్ ఉత్తరంలోని చిన్న చిన్న కోలీ రాజులు కూడా జైసింగ్ సారథ్యంలోకి వచ్చారు. ఈ విధంగా అందరినీ కలుపుకున్న రాజా జైసింగ్ చక్రవర్తి ఆదేశ అనుమతులతో ఈ సైన్యాలకు వేరెవ్వరి ప్రమేయంలేని సర్వసైన్యాధ్యక్షుడయ్యాడు. (హి.ఆ.ఔ.-జ.నా.స.- వా-4, పేజి 53-55)

జైసింగ్ అత్యంత వివేకంగానూ, సైనిక నైపుణ్యంతోనూ పోరందరా కోటను ముట్టడించాడు. ఈ ముట్టడిలో దిలేర్ ఖాన్, దావూద్ ఖాన్, పీర్‌దిల్ ఖాన్, ఖబాద్ ఖాన్, తుర్క్ తాజ్ ఖాన్, మక్బూల్ ఆలం, రసూల్ బేగ్ రోజ్ బహానితో పాటుగా రాయెసింగ్ రాఠోర్, కీరత్ సింగ్, మిత్రసేన్, ఇంద్రామన్ బుందేల, హరి భాన్, ఉదయ్ భాన్ గౌడ్, రాజా నర్సింగ్ గౌడ్, కరన్ రాఠోర్, జగత్ సింగ్ నర్‌వార్, సతర్ సింగ్ రాఠోర్, రాజ్‌సింగ్ గౌడ్, రుద్రమల్ మరియు చిత్రభోజ్ చౌహాన్‌లు కూడా అత్యంత పరాక్రమంతో, వీరోచితంగా ఈ ముట్టడిలో పాల్గొన్నారు. (వా-4, పేజి 59-66). శివాజీ ఇక లాభం లేదనుకొని సంధి ప్రయత్నాలు ప్రారంభించాడు. జైసింగ్‌ను కలుస్తానని విన్నవించుకున్నాడు. రాజా జైసింగ్ తన సెక్రటరీ ఉదయ్ రాజ్ మరియు సైనికాధికారి అగర్‌సేన్ కచ్‌వాహాలను పంపించి, శివాజీ తన కోటలన్నీ అప్పగించడానికి సిద్ధంగా ఉంటే కలువడానికి రావచ్చని కబురు పంపాడు. శివాజీ ఈ షరతును అంగీకరించాడు. అతనొచ్చి జైసింగ్‌ను కలిసినప్పుడు, జైసింగ్ అతన్ని తన సమీపంలో కూర్చుండబెట్టుకున్నాడు. రాజపుత్ర వీరులు, ఆయుధాలు చేబూని జైసింగ్ రక్షణ కోసం అతని దగ్గరే నిలబడ్డారు. (వా-4, పేజి 66).

సమావేశం ప్రారంభమై, సమాప్తమైపోయింది. శివాజీ తన ఇరవై మూడు కోటలు అప్పగించడానికి సంసిద్ధుడయ్యాడు. సంవత్సరానికి నాలుగు లక్షల హూన్ల (లేక హవన్ల - ఆ కాలపు నాణెము) రాబడి వచ్చే ప్రాంతాల నుండి కూడా వైదొలగుతానన్నాడు. తాను సార్వభౌమునికి విధేయుడై ఉండి, అతని సేవచేసే నిబంధనతో, రాజ్‌గడ్‌తో పాటుగా ఇతర పన్నెండు కోటలు తన కివ్వాలని కోరాడు. ఇతర రాజులు, నాయకుల లాగా తనను దర్బారుకు పిలిపించ కూడదని, తనకు బదులు తన కుమారుడు తన ప్రతినిధిగా దర్బారుకు హాజరవుతాడని విన్నవించుకున్నాడు. అతనివెంట ఐదువేల అశ్వికదళం ఉంటుందని, దానికి జీతాలు అతనికి ఒసంగబడే జాగీరు ద్వారా పూర్తవుతాయని, అతను అతని సైనికులు చక్రవర్తికి లేక దక్కన్‌లో ఉండే మొగలు గవర్నరు అధీనంలో ఉంటూ విధేయతతో సేవలందిస్తారని చెప్పుకున్నాడు. ఇంకా శివాజీ జైసింగ్‌తో ఇలా ఒప్పందం కుదుర్చుకున్నాడు:

“నేనింతకాలం చేసిన కార్యకలాపాలకు చక్రవర్తి సన్నిధిలోకి వెళ్ళలేను. అందుకని జాగీరు ఒసంగబడుతుందనే విశ్వాసంతో నా కుమారుణ్ని చక్రవర్తి సేవకునిగా, దూతగా పంపిస్తాను. ఇక నాకు సంబంధించినంత వరకు, మన్సబుగాని, మొగలు సైన్యంలో చేర్చుకోవడంగాని అవసరం లేదు. దాన్నుండి నన్ను మినహాయించండి. అయితే దక్కన్‌లో ఏ యుద్ధం జరిగినా, సైనికపరంగా నాకు ఏ బాధ్యత అప్పగించినా, వెంటనే దాన్ని నెరవేరుస్తాను.” (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - జదూనాథ్ సర్కార్, వా-4, పేజి 67)

దీనితో పాటుగానే, కోంకణ్ క్రింది ప్రాంతాలు, తొమ్మిది లక్షల హూన్ల రాబడి ఉన్న బీజాపూర్‌కు చెందిన బాలాఘాట్ పై ప్రాంతాలు కూడా తనకిప్పించాలని శివాజీ విన్నవించు కున్నాడు. మొగలు సైన్యాలు బీజాపూర్‌ను జయించినప్పుడే ఈ ప్రాంతాలు నాకివ్వబడతాయని ఒక ఫర్మాన్ ద్వారా నాకు నమ్మకం కలిగిస్తే, చక్రవర్తుల వారికి పదమూడు లక్షల సాలుసరి కిస్తుల్లో నలభై లక్షల హూన్లు సమర్పించుకుంటాను" అని కూడా చెప్పుకున్నాడు. (వా.4, పేజి 67, 68)

ఈ సంధి షరతుల నిర్ణయం కాగానే శివాజీ సైనికులు పోరందరా కోటను మొగలు సైన్యాలకు అప్పగించారు. కోటలో నుండి ఏడువేల మంది స్త్రీ పురుషులు బయటికి వచ్చేశారు. శివాజీని సాగనంపేటప్పుడు జైసింగ్ శివాజీకి రెండు అశ్వాలను, ఒక గజరాజాన్ని కానుకగా ఇచ్చాడు. శివాజీ ఆచార పూర్వకంగా దావూద్ ఖాన్ వద్ద కూడా హాజరయ్యాడు. అతను జైసింగ్ నుండి రాజవస్త్రాలను కోరితే, జైసింగ్ అవి కూడా ప్రసాదించాడు. ఆ తరువాత శివాజీ రాజ్‌గడ్ వచ్చేశాడు. ఇక్కడికి వచ్చిన తరువాత తన కుమారుడు సాంభాజీని జైసింగ్ వద్దకు పంపించాడు. అతనితో పాటే ఇరవై మూడు కోటల్ని మొగలులకు అప్పగించాడు. (వా–4, పేజి 68, 69)

చక్రవర్తి వద్దకు శివాజీ క్షమాపణ పత్రంతో పాటుగా, సంధి షరతులు కూడా చేరినప్పుడు అతను వీటిని సంతోషంగా స్వీకరించి, తన అనుమతినిచ్చాడు. ఈ విధంగా కేవలం మూడు నెలలలోగానే జైసింగ్ శివాజీని వివశుణ్ని చేసేశాడు. అతనికి ఇదో గొప్ప విజయం. జైసింగ్ బీజాపూర్‌తో యుద్ధం చేసినప్పుడు శివాజీ పూర్తి విధేయతతో తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. బీజాపూర్‌కు వ్యతిరేకంగా తన సైనికదళంతో, మొగలుల పక్షంలో ఉండి పోరాడాడు. (వా–4, పేజి 69)

బీజాపూర్‌పై దాడి జరిపే నిమిత్తం శివాజీకి చెందిన తొమ్మిది వేల సైన్యం నేతాజి పాల్కర్ సారథ్యంలో మొగలు సైన్యంతో కలిసిపోయింది. మొగలు మరాఠా సైన్యాలకు దిలేర్ ఖాన్, శివాజీలు నాయకత్వం వహిస్తున్నారు. బీజాపూర్ సైన్యంలో ప్రఖ్యాత మరాఠా నాయకుడు శివాజీ సోదరుడు వెంకూజీ భోన్‌స్లా, జాధూరావు ఘోర్‌పడే, షర్జేఖాన్, ఖాస్‌ఖాన్ లాంటి ప్రఖ్యాత సేనానులున్నారు. ఈ యుద్ధంలో బీజాపూర్ వారు గెరిల్లా వార్ పద్ధతిని అవలంబించి మొగలు సైన్యాల్ని అత్యంత చికాకుపరిచారు. మొత్తానికి ఈ యుద్ధంలో విజయం ప్రాప్తం కాక మొగలులు సంధి చేసుకోవాల్సివచ్చింది. ఈ అపజయానికి దిలేర్‌ఖాన్, శివాజీని బాధ్యునిగా పేర్కొన్నాడు. నిజానికి ఈ పరాజయానికి కారకుడు శివాజీ కాదు, నేతాజీ పాల్కర్ బాధ్యుడు. అతను యుద్ధం జరుగుతున్న సున్నిత సమయంలో నాలుగు లక్షల హూన్ల ఆశతో బీజాపూర్ వారితో కలిసిపోయాడు. దీనికిగాను శివాజీ అన్ని సర్‌నౌబత్ (సైన్యాధిపతి) హోదా నుండి తొలగించాడని సభాసద్ బఖర్‌లో పేర్కొనబడింది. 91 ఖల్మిబఖర్ (వ్రాతప్రతి బఖర్)లో ఇలా వివరించడం జరిగింది : "నిజానికి ఈ అపజయం నేతాజీ పాల్కర్ బావమరిది కారణంగా చేకూరింది. దానికిగాను శివాజీ అతని ఒక నెల జీతం ఆపేశాడు. దానిపై నేతాజీ పాల్కర్‌కు

కోపం వచ్చింది. అతని ఈ ప్రవర్తనకు గాను రాజా శివాజీ అతన్ని సైన్యాధిపతి హోదా నుండి తొలగించాడు."

శివాజీ నుండి వేరుబడిన నేతాజీ పాల్కర్ బీజాపూర్ వారితో కలిసిపోయాడు. ఆ తరువాత మొగలుల తరఫున ఐదువేల మన్సబు లభించగానే మొగలుల వైపు చేరిపోయాడు. నేతాజీ పాల్కర్ ఈ ప్రవర్తనతో రాజా జైసింగ్ చింతాక్రాంతుడయ్యాడు. బీజాపూర్‌పై దాడి సఫలం కాకపోవడంతో, శివాజీ కూడా బీజాపూర్ వారితో కలిసి పోతాడేమోననే అనుమానంతో శివాజీని ఆగ్రా పిలిపించుకొమ్మని, దక్కన్ సంఘర్షణ సమాప్తమయ్యేంత వరకు శివాజీని ఆగ్రాలోనే ఆపుకొమ్మని జైసింగ్ ఔరంగజేబ్‌కు సలహా ఇచ్చాడు. (ప్రొ. ఎం.కె. షాజ్లి గ్రంథంలో సేతు మాధవరావు పగ్డీ, ఫుట్‌నోట్ పేజి 229). (మహాపురుష్ ఛత్రపతి శివాజీ - సయ్యద్ అమీన్, పేజి 78, 86).

పై పేరాగ్రాఫుల ద్వారా ఔరంగజేబ్ మరియు శివాజీల మధ్య జరిగిన యుద్ధం ధార్మికమైనది, మతపరమైనదని ఆలోచించడానికి కూడా ఆస్కారం లేదు. ఇదో సిసలైన సెక్యులర్ యుద్ధం. శివాజీ, ఔరంగజేబ్‌కు మేనమామ అయిన షాయిస్తఖాన్ ఇంట్లో చొరబడి స్త్రీలను ఏ విధంగా సంహరించాడో, స్వయంగా అతన్ని అతని కుమారుణ్ని ఎలా గాయపర్చాడో సామ్రాజ్య గౌరవాన్ని గాయపర్చాడో, ఇందుకు ప్రతీకారం కోసం ఔరంగజేబ్ శివాజీ మరియు అతని సైన్యాలకు వ్యతిరేకంగా హింసాత్మక చర్యలకు పాల్పడకుండా సహనం వహించాడు. అంతేకాకుండా రాజాజైసింగ్ ఏ షరతులకైతే అంగీకరించి ప్రతిపాదనలు పంపాడో, వాటిని సహృదయంతో అనుమతించాడు. దీని ద్వారా కూడా ఔరంగజేబ్ తన హిందూ మన్సబుదారుల, ప్రత్యేకించి రాజపుత్ర నాయకుల మర్యాదను, వాగ్దానాల్ని ఎంతగా గౌరవించేవాడో, వారిని ఎంతగా విశ్వసించేవాడో విదితమైపోతుంది. ఇది కూడా అతని సహనానికి, పరస్పర విశ్వాసాభిమానా లకు సాక్ష్యంగా నిలుస్తుంది.

"శివాజీని క్షమించి అతని తప్పుల్ని మన్నించమని రాజాజైసింగ్ రాజదర్బారుకు వ్రాసి పంపిన లేఖకు జవాబుగా దర్బారు నుండి ఫర్మానా మరియు రాజవస్త్రాలు వచ్చాయి. ఫర్మానా మరియు రాజవస్త్రాల్ని స్వీకరించే పద్ధతులు శివాజీకి నేర్పబడ్డాయి. (*ఈ విషయాలు ఖాఫి ఖాన్ తన రచన ముంతఖబుల్ లుబాబ్, వా-2, భా.3, పేజి 171లో వివరంగా పేర్కొన్నాడు*).

శివాజీ విధేయత చూపి 23 కోటల్ని అప్పగించాడు. 1666లో అతను అప్పటి రాజధాని అయిన ఆగ్రాకు బయలుదేరాడు. నగరాన్ని సమీపించగానే ఆలంగీర్ అతన్ని స్వాగతించటానికి రాజా జైసింగ్ కుమారుడైన కంవర్ రాంసింగ్ మరియు ముఖ్‌లిస్ ఖాన్‌లను పంపించాడు.

శివాజీ దర్బారులో ప్రవేశించి వందనాలను ఆచరిస్తూ, కానుకను సమర్పించుకున్నాడు. పంచ్‌హజారి (ఐదువేల) మన్సబుదారుల వరుసలో అతనికి స్థానమివ్వాల్సిందిగా ఔరంగజేబ్ ఆదేశించాడు. అయితే శివాజీ అంతకన్నా అధికంగా ఆశించాడు.

యూరోపియన్ చరిత్రకారులు, వారి శిష్యులు ఇక్కడి నుండే చరిత్ర వక్రీకరణను ప్రారంభించారు. ఔరంగజేబ్ దూరదృష్టి రాహిత్యానికి, అతని చెడు వర్తనానికి ఈ సంఘటనను ఒక ముఖ్య ఘట్టంగా ఎత్తుకొని, తమ కిష్టంవచ్చిన విధంగా విశ్లేషించారు. అందుకని దర్బారులో జరిగిన ఈ సంఘటనను పదే పదే, వివిధ చరిత్రకారుల ద్వారా తెలుసుకుందాం. ఆ తరువాత పాశ్చాత్య చరిత్రకారుల, వారి శిష్యుల గారడీని పరిశీలిద్దాం.

ఔరంగజేబ్‌పై ఐదు వాల్యూంలలో అతని చరిత్ర వ్రాసి, ఆంగ్లేయులతో శభాష్ అనిపించుకున్న జదూనాథ్ సర్కార్ ఏమంటున్నారో ముందు తెలుసుకుందాం.

"శివాజీ దర్బారు కెళ్ళడానికి వెనుకాడుతున్నాడు. ఔరంగజేబ్ వద్ద కెళ్ళాలంటే తమకు తామై రావణుని కబంధ హస్తాల్లో ఇరికించుకున్నట్లే అంటూ అతను అతని మిత్రులు భయపడసాగారు. *(హి.ఆ.ఔ. - సర్ జ.నా.స., వా-4, పేజి 71)* అతను అన్ని విధాలుగా సురక్షితంగా తిరిగి వస్తాడని రాజా జైసింగ్ ప్రమాణపూర్వకంగా హామీ ఇచ్చాడు. అతని కుమారుడు కుమార్ రాంసింగ్ కూడా అతనికి రక్షణ కల్పిస్తాననే వాగ్దానం చేశాడు. అతను 1666 మార్చి నెలలో తన కుమారుడు సాంభాజీ, ఏడుగురు అంతరంగిక ఉన్నత నాయకులతో మరియు నాలుగు వేల సైన్యంతో బయలుదేరాడు. అతని ప్రయాణఖర్చుల కోసం ఒక లక్ష రూపాయలు జారీ చేయాల్సిందిగా ఔరంగజేబ్ ఆదేశించాడు. (*హి.ఆ.ఔ. - సర్ జ.నా.స., వా-4, పేజి 71)* గాజిబేగ్ అతని ప్రయాణ సారథిగా నియమించబడ్డాడు. అతను దర్బారులో ప్రవేశించిన రోజు, వజన్ ఖమ్రి (అనాదిగా వస్తున్న ఆచారపు) ఉత్సవం జరుగుతున్నది. అందుకని దర్బారు శోభాయమానంగా అలంకరించబడింది. రాజ దర్బారులో కుమార్ రాంసింగ్, శివాజీని, అతని కుమారుణ్ణి, ఇతర పదిమంది నాయకులతో చక్రవర్తి సన్నిధిలో ప్రవేశపెట్టాడు. శివాజీ సందర్శన కానుకగా పదిహేను వందల నవరసులను సమర్పించుకున్నాడు. ఆరువేల రూపాయలు చక్రవర్తి దిగదుడుపుగా పంచివేశాడు. ఔరంగజేబ్ శివాజీని కరుణాకటాక్షాలతో తిలకిస్తూ, "రండి, శివాజీ రాజా" అంటూ పలకరించాడు. *(హి.ఆ.ఔ. -సర్ జ.నా.స, వా-4, పేజి 72).*

శివాజీ సింహాసనం ముందుకు తీసుకుపోబడ్డాడు. అతను మూడుసార్లు వందన సమర్పణ చేసుకున్నాడు. ఆ తరువాత చక్రవర్తి సంజ్ఞతో, అతని కోసం ప్రత్యేకించబడిన స్థానంలో అతన్ని నిల్చోబెట్టారు. శివాజీ ఈ అవమానాన్ని భరించలేక స్పృహతప్పిపోయాడు. చక్రవర్తి ఏమి జరిగిందని అడగ్గా, "ఈ పులి అడవిలో సంచరించేది. ఇక్కడి వాతావరణపు వేడిని భరించలేక పోయింది. అందుకని అస్వస్థుడయ్యాడు. ఇతను దక్కన్ వాసి. దర్బారు సభ్యతా సంస్కృతులు ఎరుగడు" అంటూ రాంసింగ్ సమాధానమిచ్చాడు. ఇది విని ఔరంగజేబ్ కరుణ, దయ, కనికరాలతో "అతన్ని ప్రక్క గదిలోకి తీసుకెళ్ళండి. గులాబి నీళ్ళను అతనిపై చల్లండి. ఆ తరువాత అతన్ని విడిదికి చేర్చండి. దర్బారు సమాప్తమయ్యే వరకు నిరీక్షించకండి" అంటూ ఆదేశించాడు. (*(హి.ఆ.ఔ. -సర్ జ.నా.స, వా-4, పేజి 72, 73).*

సర్ జదూనాథ్ సర్కార్ పైనుదహరించిన తన వ్యాఖ్యానంలో ఔరంగజేబ్‌ను రావణుడని ఎప్పుడైతే వర్ణించారో, ఇక ఆయన ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా రాయనున్నారని అర్థమైపోయింది. కాని ఈ రావణుడే తనకు లొంగని శత్రువు ప్రయాణ ఖర్చులకు లక్ష రూపాయలు ఇస్తాడు. దర్బారులో ప్రవేశించినప్పుడు కరుణా కటాక్షాలతో "రండి, శివాజీ రాజా" అంటూ సంబోధిస్తాడు. అతను స్పృహతప్పి పడిపోతే గులాబి నీళ్ళు చల్లిస్తాడు, అతనికి విశ్రాంతి నివ్వమని ఆదేశిస్తాడు.

"దర్బారు కార్యకలాపాలు ముగిసిన తరువాత శివాజీకి ఒక గజరాజాన్ని పట్టు పీతాంబరాల్ని (వస్త్రాభరణాల్ని), కొన్ని రత్నాలను ప్రసాదించాలనే ఆలోచన ఔరంగజేబ్‌కు ఉన్నదని, అయితే శివాజీ దర్బారు మర్యాదల్ని ఉల్లంఘించిన కారణంగా అతనా సమయంలో తాత్కాలికంగా తన ఆలోచనలకు స్వస్తి పలికాడ"ని కూడా పేర్కొన్నారు." (హి.ఆ.ఔ., జ.నా.స.-వా-4, పేజి 75)

ఇక ఔరంగజేబ్ దర్బారు చరిత్రకారుడైన ముహమ్మద్ సాఖి ముస్తఅద్ ఖాన్ ఈ వివరాల్ని ఎలా తెలిపాడో పరిశీలిద్దాం.

"చక్రవర్తుల వారి జీవితపు యాభవ సంవత్సరం ప్రారంభమైన తరువాత శివాజీ తన తనయుడు సాంభాజీతో కలిసి ప్రభువులవారి సన్నిధిలో హాజరై గౌరవోన్నతుల్ని పొందాడు. అతను పదిహేను వందల నవరసులను (బంగారు నాణేలు) కానుకగా సమర్పించు కున్నాడు. ఆరువేల రూపాయలు ప్రభువుల వారి దిగదుడుపుగా పంచిపెట్టాడు. శివాజీ కోరికమేరకు రాజా జైసింగ్ ప్రభువుల వారి సన్నిధికి పంపించాడు. ప్రభువుల వారితో అతను పాత తప్పుల్ని మన్నింపజేసుకున్నాడు. శివాజీని తనతో పాటుగా తీసుకెళ్ళమని, తన మహలుకు సమీపంలో అతనికి విడిదిని ఏర్పాటు చేయమని ఏలికవారు రాంసింగ్‌ను ఆదేశించారు. ఇంకా శివాజీ కుమారుడైన సాంభాజీని ప్రతిరోజూ తనతో పాటుగా దర్బారుకు తీసుక రావాల్సిందిగా కూడా ఆదేశించారు." *(మాసిరె ఆలంగీరి - ముహమ్మద్ ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 38, 39)*

ఇక పాశ్చాత్య చరిత్రకారులు ఈ సంఘటనను ఎలా వక్రీకరించి వ్రాశారో, దానికి మసిబూసి ఎలా మారేడుకాయగా మార్చారో చూడండి.

బ్రిటిష్ పాలనా కాలంలో ముంబాయికి గవర్నరుగా పనిచేసిన అల్ ఫిన్‌స్టన్ "భారతచరిత్ర" అనే తన గ్రంథంలో ఇలా వ్రాశాడు.

"ఏవిధంగానైతే అతను మరియు అతని పూర్వీకులు ఇతర రాజులతో ప్రవర్తించారో, అదేవిధంగా శివాజీతో అతని యోగ్యత ననుసరించి అత్యంత మేలుగా, మర్యాదగా ప్రవర్తించి అతనితో లాభపడగలిగే, భయంకరమైన ఒక శత్రువును తన మిత్రునిగా మార్చుకునే చక్కటి అవకాశం ఔరంగజేబ్‌కు లభించింది. కాని ధర్మం, జాతికి సంబంధించి అతని ఆలోచనలు ఎంత సంకుచితంగా, అల్పంగా ఉండేవో, రాజ్య వ్యవహారాల్లో కూడా అలాగే సంకుచితం గానూ, అల్పంగానూ ఉండేవి. అందుకని వెంటనే శివాజీని అవహేళన చేసి, అగౌరవ

పరచకుండా తనకు తానై ఆపుకోనైతే ఆపుకోగలిగాడు కాని అతని స్వభావంలోనే ఉన్నటువంటి సంకుచితత్వం నుండి పూర్తిగా వైదొలగలేకపోయాడు .... క్లుప్తంగా వివరించేదేమంటే శివాజీ ఢిల్లీ పరిసరాల్లో ప్రవేశించినప్పుడు ఒక అల్పస్థాయికి చెందిన నాయకుణ్ని జైసింగ్ కుమారుడు రాంసింగ్‌తో కలిపి అతన్ని స్వాగతించడానికి పంపాడు. అంతేకాకుండా అతను దర్బారులో ప్రవేశించినప్పుడు అతని గురించి పట్టించుకోనేలేదు. *(భారతచరిత్ర - అల్‌ఫిన్‌స్టన్ - (అనువాదం) పేజి 1052, 53, అలీగడ్ ముద్రణ-ఔరంగజేబ్ పర్ .... షిబ్లి, పేజి24, 25)*

లేన్‌పోల్, ఫ్రాయెర్, బర్నియెర్ మొదలుగాగల పాశ్చాత్య చరిత్రకారులందరూ దాదాపుగా ఇలాగే వ్రాశారు. కొందరు చరిత్రకారులు ఈ సంఘటన తరువాత శివాజీని బంధించి అతనిపై కాపలా వేశారని కూడా వ్రాశారు.

ఈ సంఘటనకు సంబంధించి నూటయాభై సంవత్సరాల తరువాత వచ్చిన యూరోపియన్ చరిత్రకారులు మరియు సమకాలీన చరిత్రకారులు ఇద్దరిలో ఎవరి వాంఙ్మూలాల్ని మనం విశ్వసించాలి? లేక వేటికి ఎంత విలువనివ్వాలి?

శివాజీని స్వాగతించడానికి రాంసింగ్ మరియు ముఖ్‌లిస్ ఖాన్లు పంపబడ్డారనే విషయాన్ని చరిత్రకారులందరూ అంగీకరిస్తారు. ఆలంగీర్ నాయకులందరిలో అగ్రగణ్యుడు, సర్వసైన్యాలకు సైన్యాధిపతి అయిన రాజా జైసింగ్ కుమారుడే ఈ రాంసింగ్. షాజహాన్ పట్టాభిషిక్తుడైన 19వ సంవత్సరంలో ఐదువందల అశ్విక దళంతో వచ్చి ఇతను షాజహాన్ ఉద్యోగంలో చేరాడు. అప్పుడతనికి ఒక వేయి మన్సబు మరియు రాజవస్త్రాలు బహుమానంగా లభించాయి. షాజహాన్ పట్టాభిషేకం 27వ సంవత్సరంలో అతను మూడు వేల మన్సబుదారుగా ప్రమోషన్ పొందాడు. ఔరంగజేబ్ కాలంలో అతను ప్రత్యేక విశ్వాసపాత్రునిగా గుర్తించబడ్డాడు. చివరికి సులేమాన్ షికూహ్‌ను బంధించి తేవడానికి రాజా జైసింగ్ స్థానంలో అతని ప్రతినిధిగా ఔరంగజేబ్ ఇతన్నే పంపించాడు. శివాజీ లొంగిపోయి విధేయతను ప్రకటించాడని కబురందిన రోజే ఇతనికి రత్న ఖచిత ఆభరణాలు, ఏనుగు మరియు రాజ వస్త్రాలు ప్రసాదించబడ్డాయి.[16] శివాజి, రాజా జైసింగ్ మధ్యవర్తిత్వంతో అతని జమానతుపై దర్బారుకొచ్చాడు గనక అతన్ని స్వాగతించడానికి తన తండ్రికి జ్యేష్ఠపుత్రుడు, నిజప్రతినిధి అయిన రాంసింగ్‌కన్నా అర్హులైన వారు ఇంకెవరు కాగలుగుతారు? అతనికి తోడుగా ముఖ్లిస్ ఖాన్ ఎందుకు పంపబడ్డాడంటే ఒక హిందువును స్వాగతించడానికి ఇంకొక హిందువు మాత్రమే వెళ్ళాడని, దర్బారుకు చెందిన ఏ ఒక్క ముస్లిం నాయకుడు కూడా వెళ్ళలేదనే అపోహకు ఆస్కారముండకూడదనే దూరదృష్టితో కావచ్చు.

ఇక మన అల్‌ఫిన్‌స్టన్ గారి అతి తెలివిని పరిశీలించండి. స్వాగతించడానికి వెళ్ళిన ప్రధాన నాయకునిగా, రాంసింగ్‌ను కాకుండా ముఖ్‌లిస్ ఖాన్‌ను పేర్కొంటున్నారు. రాంసింగ్ అతని వెంట వెళ్ళాడట. వాస్తవంలో అన్ని చరిత్ర గ్రంథాల్లో రాంసింగ్ పేరునే ప్రథమంగా పేర్కొనడం జరిగింది.

శివాజీకి ప్రసాదించబడింది పంచ్ హజారి (ఐదువేల) మన్సబు. స్వయంగా శివాజీ తానే మన్సబుదారుల వరుసలో ఉన్నానని అడిగినప్పుడు కూడా అతనికి పంచ్‌హజారి (ఐదువేల) మన్సబు అని తెలుపడం జరిగింది. అప్పటి వరకు స్వయంగా రాజా జైసింగ్ మన్సబు కూడా పంచ్ హజారి (ఐదువేల) మన్సబును మించలేదనేది వాస్తవం. ఈ మహోన్నత విజయం తరువాత రాజా జైసింగ్ మన్సబులో రెండువేలు పెరిగి, ఏడువేల మన్సబుకు చేరుకోగలిగాడు.

మాసిరె ఆలంగిరీలో ఇది ఇలా వర్ణించబడింది :

“భారతీయ రాజులలో తలమానికలాంటివాడైన రాజా జైసింగ్ అపూర్వ సేవలకు ప్రతిఫలంగా రాజరికపు దయానుగ్రహాలతో సత్కరించబడ్డాడు. రాజు మన్సబు, గౌరవ మర్యాదల్లో అభివృద్ధి జరిగింది. చక్రవర్తి రాజా జైసింగ్ మన్సబును 7 వేలకు పెంచి, 7 వేల అశ్వికదళాలు, 7 వేల పదాతి దళాల మన్సబుదారుగా, ఇంకా 2, 3 అస్పాల (స్పెషల్ గ్రేడ్) నాయకునిగా నియమించాడు.” (మాసిరె ఆలంగిరి–సాఖి ముస్తఅద్ ఖాన్, పేజి 35, 36)

రాజా జైసింగ్ అనామకుడేం కాదు. జైపూర్ రాజ్యాధీశుడు, ఔరంగజేబ్ దర్బారులోని నాయకులందరిలోకెల్లా ఉన్నతుడు, గౌరవనీయుడు. అన్నిటికీ మించి శివాజీని ఓడించిన విజేత. ఒక పరాజిత వ్యక్తి, విజేత అయిన రాజ్యాధీశునికి సరిసమాన హోదా ఎలా పొందగలడు?

పంచ్ హజారి (ఐదువేల) మన్సబు కేవలం ఒక్క రాజాజైసింగ్ వరకే పరిమితం కాదు. స్వయంగా ప్రధాన మంత్రి అయిన ఫాజిల్‌ఖాన్ మన్సబు కూడా పంచ్ హజారీకి మించలేదు. అంతెందుకు? మహారాణా ఉదయ్‌పూర్‌కు మించిన గౌరవనీయులైన రాజ్యాధీశులు భారత దేశంలోనే లేకుండిరి. కాని ఎప్పుడైతే ఈ వంశం వారు చక్రవర్తి దర్బారుతో సంబంధాలు పెట్టుకున్నారో, అప్పుడు జహాంగీర్ ఈ వంశానికి చెందిన రాణా కరన్‌కు అదే పంచ్‌హజారి (ఐదువేల) మన్సబును ప్రదానం చేశాడు. ఆ తరువాత షాజహాన్ 1629లో రాణా జగత్‌సింగ్‌కు కూడా ఇదే మన్సబునిచ్చాడు. అటు పిమ్మట రాణా రాజ్‌సింగ్‌కు కూడా ఆలంగీర్ దర్బారు నుండి ఇదే మన్సబు ప్రదానం చేయబడింది. మాసిరుల్ ఉమరా రచయిత షానవాజ్ ఖాన్, రాణా కరన్ ప్రస్తావన సందర్భంలో ఈ వివరాలన్నీ పొందుపరి చాడు.[17] శివాజీ, గౌరవోన్నతుల్లో ఉదయ్‌పూర్ మహారాణాలను మించి పోలేదు కదా! అది పోనివ్వండి, స్వయంగా శివాజీ తండ్రి సాహూజీ, షాజహాన్ పట్టాభిషేకం 3వ సంవత్సరంలో షాజహాన్ దర్బారుతో సంబంధం ఏర్పరుచుకున్నప్పుడు అతనికి కూడా షాజహాన్ ఇదే పంచ్‌హజారి మన్సబును ప్రదానం చేశాడు.[18]

మన్సబు గురించి చర్చించడం మానేసి, శివాజీని ఏ విధంగానైతే గౌరవించడం జరిగిందో, దాని నిజ పరిస్థితి ‘ఆలంగీర్‌నామ’లోని ఈ క్రింది పంక్తులతో విశదమవుతుంది.

"అతను దర్బారులోకి వచ్చినప్పుడు ఉన్నతోన్నతంగా అతన్ని స్వాగతించడం జరిగింది. రాజలాంఛనాలతో వందన సమర్పణ జరిగిన తరువాత అతని పితామహుణ్ణి దృష్టిలో ఉంచుకొని దర్బారులోని ప్రత్యేక అనుచరవర్గం, అత్యంత గౌరవోన్నతులు కలిగిన నాయకుల వరుసలో అతనికి స్థానమివ్వబడింది." [19]

పై పంక్తులు ఏ పుస్తకం నుండి గ్రహించబడ్డాయో, అది ప్రత్యేకంగా ఆలంగీర్ ఆదేశానుసారం, దినచర్యగా వ్రాయబడింది. ఇంకా దాని ముడి ప్రతిని ఆలంగీర్‌కు చూపించి, అనుమతి తీసుకోబడేది. ఈ విధంగా విశ్లేషిస్తే ఇవి స్వయంగా ఔరంగజేబ్ నోటి నుండి వెలువడిన మాటలుగా భావించుకోవచ్చు. ఈ వాక్యాల్లో స్పష్టమైన పదాల్లో, దర్బారులో చక్రవర్తికి (రాజ్యానికి) సన్నిహితులు, అత్యంత గౌరవప్రతిష్ఠలు కలిగిన నాయకుల వరుసలో శివాజీకి స్థానమిచ్చినట్లు పేర్కొనడం జరిగింది. ఒకవేళ ఔరంగజేబే గనక శివాజీని కించపరిచి, అవమానపరచదలిస్తే, అతన్ని గౌరవమర్యాదలతో సత్కరించడం జరిగిందని దినచర్య (డైరీ)లో ఎందుకు వ్రాయించేవాడు. దర్బారులో జరిగిందంతా, గంట రెండు గంటల కోసం జరిగే తాత్కాలిక కార్యక్రమం. కాని చరిత్ర అనేది ప్రళయం వరకు చిరస్థాయిగా ఉంటుంది కదా! అందుకని ఆలంగీర్‌కు ఒకవేళ శివాజీని అవమానపరచాలనే తలంపే గనక ఉంటే గడియ, రెండు గడియల కోసం అతన్ని అవమానపరిచి, ప్రళయం వరకు ఉండే చరిత్రలో అతనికి ఆదర సత్కారాలు లభించిన సంఘటనను ఎందుకు వ్రాయనిచ్చేవాడు?

రాజాజైసింగ్ శివాజీకి సంబంధించి చేసిన సిఫారసులేమిటి? అవి ఔరంగజేబ్ తరఫున పూర్తి చేయబడ్డాయా? లేదా? అనేది అసలు ప్రశ్న.

శివాజి దర్బారు నుండి అసంతృప్తితో వెనుదిరిగిన తరువాత ఈ సంఘటనకు సంబంధించి రాజా జైసింగ్‌కు కబురు పంపండని, అతని నుండి ఏ సమాధానం వస్తుందో దాన్ని అనుసరించండని ఔరంగజేబ్ ఆదేశించినట్లు చరిత్రకారులందరూ ఏకీభవించారు.

ఖాఫిఖాన్ ఇలా వ్రాశాడు : ఇక్కడి పరిస్థితి గురించి రాజాజైసింగ్‌కు లిఖిత పూర్వకంగా తెలుపండని, అతని నుండి సమాధానం వచ్చిన తరువాత ఉచితమైన దాన్ని అనుసరించండని ఆదేశించటం జరిగింది. [20] మాసిరె ఆలంగీరిలో ఇలా ఉంది : "సముచితమైందేదో తెలిపేందుకు గాను, ఇక్కడి పరిస్థితుల వివరాలు రాజాజైసింగ్‌కు పంపడం జరిగింది." [21] ఆ తరువాత ఏం జరిగిందో మాసిరె ఆలంగీరిలో ఇలా వర్ణించబడింది :

"ఈ మధ్యలో రాజా జైసింగ్ అర్జీ ముట్టింది. అందులో అతనితో ఒడంబడికలు చేసుకోబడ్డాయని, ఈ ప్రాంతపు యుద్ధాల్లో అతను పాలుపంచుకుంటాడని అందుకని అనేక యుక్తుల రీత్యా శివాజీని మన్నిస్తే ఎంతో బాగుంటుందని తెలుపడం జరిగింది." [22]

ఈ అర్జీ ముట్టిన తరువాత అతనిపై నున్న పర్యవేక్షణ ఎత్తివేయబడింది. అతను స్వతంత్రుడయ్యాడు. మాసిరె ఆలంగీరిలో ఇలా ఉంది: "ఈ అర్జీ ముట్టిన తరువాత కాపలాదారుల్ని శివాజీ నివసిస్తున్న ఇంటినుండి తొలగించమని ప్రభువుల వారు ఫౌలాద్ ఖాన్‌ను ఆదేశించారు. (పేజి 39)

ప్రఖ్యాత భారతీయ చరిత్రకారుడు, ఎన్నో చరిత్రగ్రంథాల రచయిత, ప్రత్యేకించి ప్రవక్త మహనీయుల (స) జీవితం గురించి సుదీర్ఘంగా, అత్యంత సూక్ష్మమైన వివరాలతో కూడిన ఆరు వాల్యూంలలో దైవప్రవక్త జీవిత చరిత్ర (సీరతున్నబి) రాసి, ప్రపంచమంతటిలో ఖ్యాతిగాంచిన విద్వాంసి, అత్యంత విలువైన అసంఖ్యాక చరిత్ర గ్రంథాలను వెలువరించిన దారుల్ ముసన్నిఫీన్, షిబ్లి అకాడమి వ్యవస్థాపకుడు, "అల్లామ షిబ్లి నొమాని" పై విషయానికి సంబంధించి తన పరిశోధనల్ని తన ప్రఖ్యాత గ్రంథం "ఆలంగీర్ పర్ ఏక్ నజర్" లో ఇలా వివరించారు :

"శివాజీకి సంబంధించిన వ్యవహారాలు, ఘర్షణల్ని వివరిస్తూ రాజా జైసింగ్ ఔరంగజేబ్‌కు రాసిన లేఖల వ్రాతప్రతుల చిట్టాను (సమూహాన్ని) బనారస్‌కు చెందిన ఒక ప్రఖ్యాత కాయిస్త్ కుటుంబంలో చూశాను. అందులో ఒక లేఖ ప్రత్యేకంగా ఈ వ్యవహారానికే సంబంధించింది ఉంది. ఈ ఉత్తరం ఏషియన్ ఆచార ఆనవాయితీల ననుసరించి సుదీర్ఘంగా ఉంది. అయితే తాను శివాజీకి ఏడువేల మన్సబు (ఇప్పిస్తానని) వాగ్దానం చేశానని ఆ లేఖ అంతటిలో ఎక్కడా లేదు. లేక ఈ రకమైన ఆకాంక్ష ఉందని కూడా అందులో పేర్కొనబడలేదు. కేవలం అందులో అతనికి ఆదర సత్కారాలు చేయాలని మాత్రమే ఉంది."

(ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్ – షిబ్లి నొమాని, పేజి 30, 1999 ఆజంగడ్)★

అనుకూల, వ్యతిరేక ఎవరైనాసరే, చరిత్రకారులందరూ వ్రాసిన విషయం ఏమిటంటే శివాజి కుమారుడైన సంభాజీకి పంచ్‌హజారి మన్సబుకోసం రాజా జైసింగ్ సిఫారసు చేశాడు. అది ఆమోదించబడింది. అదేవిధంగా శివాజి అల్లుడైన నేతూజీకి పంచ్ హజారి మన్సబు గురించి రాజా జైసింగ్ సిఫారసు చేశాడు, అది కూడా ఆమోదించబడింది.

రాజా జైసింగ్‌ను సలహా అడిగినప్పుడు అతను కేవలం తప్పిదాన్ని మన్నించమని, మాత్రమే కోరాడని నిరూపితమైనప్పుడు – శివాజీకి ఏడువేల మన్సబు లాంటిదేమీ వాగ్దానం చేయబడనూ లేదు, చేసిన వాగ్దానం లేక విషయం ఉల్లంఘించబడనూ లేదు అనేది దానంతటదే తేటతెల్లమైపోయింది.

"ఔరంగజేబ్–కె–హిందువోఁకె సాత్ తాల్లుఖాత్" (హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు) అనే తన పుస్తకంలో ఏడువేల మన్సబు గురించి అఖ్‌లేష్ జైస్వాల్ ఇలా విశ్లేషించారు : "తనను కేవలం ఒక తిరుగబడిన జమీందారుగా కాకుండా, తన పట్ల ఒక రాజుగా ప్రవర్తించాలని, తనకు ఒక ఉన్నత హోదా ప్రసాదించాలని ఇంకా తనను ఒక ముఖ్య

★ ***నోటు :*** *ఈ పుస్తకాన్ని "ఔరంగజేబ్" అనే పేరుతో సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్ రహ్మాన్ ఆంగ్లంలో అనువదించి దారుల్ ముసన్నిఫీన్, షిబ్లి అకాడమీ ద్వారా ప్రచురించారు. ఔరంగజేబ్‌కు సంబంధించి అత్యంత విలువైన గ్రంథం. డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ లాంటి ఆధునిక చరిత్రకారులు కూడా దీని రెఫరెన్సులు తీసుకున్నారు. పై వివరాల సమర్పణలో మేము కూడా ఈ గ్రంథంతో అత్యధికంగా లాభపడ్డాము. – అబుల్ ఫౌజాన్.*

సహాయకునిగా నియమించుకోవాలని శివాజీ ఆకాంక్షించాడు. శివాజీ ఆగ్రా చేరుకున్నప్పుడు, ఔరంగజేబ్ తనకు మహారాజా జైసింగ్ మరియు జస్వంత్ సింగ్‌ల లాగే ఒక ఉన్నత హోదాను ప్రసాదించి గౌరవించాలనే ఆకాంక్ష ఉండింది. కాని అప్పటి ఆ పరిస్థితుల్లో ఇది సంభవమేనా? మిర్జా రాజా జైసింగ్ మరియు జస్వంత్ సింగ్‌లు తరతరాలుగా మొగలు సామ్రాజ్యానికి తమ సేవలందిస్తూ ఏడువేల మన్సబు వరకు చేరుకోగలిగారు. ఇక శివాజీ అయితే ఇంతవరకు మొగలు సామ్రాజ్యానికి ఎలాంటి సేవ చేయనేలేదు. ఇంకా తన విశ్వాసపాత్రతను, సైనిక నైపుణ్యాన్ని నిరూపించుకోనేలేదు. ఇలాంటి పరిస్థితిలో ఔరంగజేబ్ శివాజీకి ఏడువేల మన్సబును ఎలా ప్రసాదించగలడు? అతనైతే శివాజీకి ఐదువేల మన్సబును ప్రసాదించి కూడా అత్యంత సముచితంగానే ప్రవర్తించాడు. ఒక తిరుగబడిన జమీందారుకు మొట్టమొదటిసారి ఏకంగా ఐదువేల మన్సబును ప్రసాదించడం కూడా తక్కువేం కాదు." (పేజి 80)

## నిర్బంధంలో వ్యాపారమా?

ఆగ్రాలో శివాజీని గృహ నిర్బంధంలో ఉంచడం జరిగిందని పైన వివరంగా తెలుసుకుంటూ వచ్చాము. అయితే నిర్బంధంలో ఉన్న వ్యక్తి వ్యాపారం ఎలా చేయగలుగుతాడు? కాని ఈ వ్యాపారం, కొనుగోలు జరిగింది. తేది 31–5–1666 రోజున ఔరంగజేబ్ దర్బారు పత్రికలో వచ్చిన ఈ వార్తను చూడండి : " ... దర్బారులో ఫౌలాద్ ఖాన్ ఇలా తెలిపాడు – తమతో ఏం తప్పు జరిగిందని చక్రవర్తి మా పట్ల ఇంతగా అసంతృప్తులయ్యారని శివాజీ రాజా ఆయన మిత్రులు అడుగుతున్నారు" – ఇది విని చక్రవర్తి ఎలాంటి జవాబివ్వకుండా మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత చక్రవర్తి "ఇమాం వర్ది ఖాన్ నుండి శివాజీ ఎన్ని ఏనుగుల్ని కొనుగోలు చేశాడో గుర్జుదారు గాజీ బేగ్‌ను అడగండ"ని ముహమ్మద్ అమీన్ ఖాన్‌ను ఆదేశించాడు. దానిపై (అక్కడే ఉన్న) ఇమాం వర్ది ఖాన్ "పదిహేను వేల రూపాయల విలువ కలిగిన ఏనుగుల్ని కొన్నారని, ఇంకా దాని పైకం ముట్టలేదని" విన్నవించుకున్నాడు. – ఈ కొనుగోలు లేక వ్యాపారం చక్రవర్తి అనుమతితో జరిగిందనే విషయాన్ని పాఠకులు గమనించాలి. – (పర్షియన్ మరాఠి – అఖ్బారాతె దర్బారె ముఅల్లా – ఇతిహాసిక్ ఫార్సీ సాహిత్య – భాగ్ – 6, రచన : గణేష్ హరి ఖురె – పబ్లిషర్ – భారత్ ఇతిహాస్ సంషోధక్ మండల్, పుణే, సుయి గ్రంథ్‌మాల నెం.106, 1983).

నిజానికి ఔరంగజేబ్ శివాజీని సమాప్తం చేయదలచుకోలేదు. ఒకవేళ శివాజీని చంపడమే అతని ఉద్దేశమైవుంటే, పోరందరా సంధి సమయంలో శివాజీ నిరాయుధుడుగా మొగలు క్యాంపులోకి వచ్చినప్పుడే ఈ పని జరిగిపోయేది. శివాజీ అక్కడ నాలుగు రోజుల వరకు బస చేశాడు కూడా. శివాజీతో ఔరంగజేబ్ ఏ పని తీసుకోదలిచాడో, ఈ క్రింది సంభాషణ ద్వారా తేటతెల్లమైపోతోంది. తనను తన రాజ్యానికి వెళ్ళిపోనివ్వండని రాం సింగ్ ద్వారా శివాజీ పదే పదే చెప్పుకున్నప్పుడు చక్రవర్తి రాంసింగ్‌తో ఇలా అన్నాడు : "శివాజీ రాజాలో గొప్ప ఘనకార్యాలు

సాధించే యోగ్యత ఉంది. అతని ద్వారా రాజ్యాన్ని విస్తరించవచ్చు. అతని రాజ్యం అతని కుమారుని పేరు మీద యధాతథంగా ఉండగలుగుతుంది. అతనిక్కడ ఉండి లక్ష, లక్షంబావు సైన్యంతో లక్షలు, కోట్ల ధనాన్ని సంపాదించడమే కాకుండా దీనితో పాటుగా తన రాజ్యాన్ని కూడా విస్తరింపజేసుకోవచ్చు. అందుకని శివాజీ లాంటి దూరదృష్టి కలవాడు, వీరుడు, ఖడ్గ నైపుణ్యుడు, ఆరితేరిన రాజకీయవేత్త మన దర్బారులో ఉండాలి. మొగలు దర్బారులో అతని ఘనకార్యాల్ని గుర్తించడం జరుగుతుంది." (ఛత్రపతి శివాజీ మహారాజ్, కృష్ణారావు అర్జున్ కిలోస్కర్, పేజి 308).

ఆగ్రా నుండి తప్పించుకునే వ్యవహారంలో శివాజీ ప్రత్యేక సేవకుడు, అంగరక్షకుడు అయిన మదార్ షా మెహతర్ పాత్ర చూపడానికైతే చిన్నదిగానే కన్పిస్తుంది. కాని ఈ సంఘటన వల్ల ఒక ముస్లిం విశ్వాసపాత్రత, ఒక హిందూ ధార్మిక సహనత బయల్పడుతుంది. వేలంటైన్ ఇదే అంటాడు.

"ఆగ్రాలో శివాజీరాజాను గృహ నిర్బంధంలో ఉంచినప్పుడు ఔరంగజేబ్ ద్వారా ఏ సేవకులైతే నియమించబడ్డారో అందులో ఒక ముస్లిం ప్రస్తావన వస్తుంది. అతనే ఈ మధార్ షా మెహతర్. ఇతనే చివరి వరకు శివాజీ రాజాకు సేవలందిస్తూ సంరక్షిస్తూ వచ్చాడు. ఇక్కడ ఓ విషయాన్ని గమనించాలి. ఒక హిందూ పరిపాలకుని ఘర్షణ ఒక ముస్లిం రాజుతో జరుగుతున్నది. అతని కనిపెట్టి ఉండే వారందరూ ముస్లింలే. అయితే ఈ హిందూ పరిపాలకున్ని తప్పించి బయటికి పంపేవాడు కూడా ముస్లిమే. దీనితో నిజానికి శివాజీ ముస్లిం వ్యతిరేకి కాదని, అతను కేవలం రాజకీయపరంగా మొగలు, ఆదిల్ షాహి (రాజ్యాలకు) మాత్రమే వ్యతిరేకి అని నిరూపితమై పోతుంది." (Life of the Great Moghal - Valantine, page 144, 145)

ఇక్కడి వరకైతే సమకాలీన చరిత్రకారుల వాంఙ్మూలాలు, అల్లామ షిబ్లి నౌమాని, అఖ్‌లేష్ జైస్వాల్ గార్ల విశ్లేషణలు చదువుకుంటూ వచ్చాము. అయితే శివాజీ నిర్బంధాన్ని వివిధ చరిత్రకారులు, వివిధ రకాలుగా విశ్లేషించారు.

"శివాజీ పారిపోకుండా కట్టుదిట్టమైన నిఘా, బందోబస్తులో ఉంచాలనుకుంటే, ఔరంగ జేబ్ తన తండ్రి, సోదరునిలాగా శివాజీని ఏదో ఒక భద్రమైన సురక్షితమైన కోటలో నిర్బంధించ కుండా కేవలం ఒక భవంతిలో గృహనిర్బంధంలో ఎందుకుంచుతాడు?

శివాజీని గృహనిర్బంధంలో ఉంచింది అతని రక్షణ కోసమే. దర్బారులోను, దర్బారు బయటను శివాజీకి అత్యధికమంది శత్రువులున్న కారణంగా అతనికి ఎలాంటి హాని జరగకుండా గృహనిర్బంధంలో ఉంచడం జరిగింది." ఈ వాదనను మరాఠా చరిత్రకారుడు "వామన్ సీతా బింద్రే" (V.C. Bendre) తన మరాఠీ గ్రంథం "రాజా శివా ఛత్రపతి" లో గట్టిగా సమర్థించాడు.

"దర్బారులోని ఎంతోమంది నాయకులు బహిరంగంగానే శివాజీ పట్ల వ్యతిరేకత చూపిం చారు. సయ్యద్ ముర్తబా ఖాన్, రాజా జస్వంత్ సింగ్, జాఫర్ ఖాన్, జహాఁ ఆరా బేగం

(చక్రవర్తి సోదరి) ఇంకా ఇతర నాయకులు శివాజీ వ్యతిరేక గ్రూపుగా భావించబడేవారు. ఇదే కాకుండా రాజపుత్రుల్లో కూడా కచ్‌వాహా, రాఠోర్ అనే రెండు గ్రూపులుండేవి. ఈ రెండు గ్రూపుల్లో ప్రాచీన కాలం నుండి అంతర్‌విభేదాలు వస్తుండేవి. శివాజీని కించపరిస్తే కచ్‌వాహా వర్గానికి చెందిన రాజా జైసింగ్, కంవర్ రాంసింగ్‌లను అపకీర్తి పాల్జేయవచ్చుని రాఠోర్ వర్గాల వారి కుట్ర. మంత్రి జాఫర్ ఖాన్ భార్య షాయిస్త ఖాన్‌కు సోదరి. ఈ విధంగా షాయిస్త ఖాన్ పట్ల జరిగిన దౌర్జన్యానికి ప్రతీకారం తీసుకోవచ్చుని ఈ గ్రూపు భావించసాగింది. సూరత్ నగర ఆదాయం తన తండ్రి షాజహాన్ తనకు కేటాయించి ఉన్నందున, శివాజీ సూరత్ నగరాన్ని దోచుకొని కొల్లగొట్టడం వల్ల తన ఆదాయానికి గండి పడిన కారణంగా చక్రవర్తి సోదరి జహాం ఆరా బేగం కూడా శివాజీని తీవ్రంగానే వ్యతిరేకించింది. కర్ణుని చావుకు కారణాలెన్నో అన్నట్లు శివాజీని బంధించి ఉంచడానికి బహుముఖ కారణాలు ఏర్పడ్డాయి. (ఈ వివరాల్ని ప్రొ. ఎమ్. కె. షాజ్‌లీ గారు తన గ్రంథం "తారీఖె హింద్ కా ఇంఖిలాబి కిర్‌దార్-శివాజీ" - (భారత చరిత్రలోని విప్లవాత్మక పాత్ర-శివాజీ) లో వివరంగా పేర్కొన్నారు.

ఇక ఔరంగజేబ్ కాలంలో మన దేశంలో పర్యటించిన ఫ్రెంచ్ డాక్టర్ ఫ్రాన్సియోస్ బర్నియెర్ ఈ సంఘటన గురించి ఇలా వ్రాశాడు :

"ఔరంగజేబ్ పిలుపుపై, రాజా జైసింగ్ అతని రక్షణకు బాధ్యత తీసుకున్న తరువాత శివాజీ ఢిల్లీ దర్బారును సందర్శించాడు. ఆ సమయంలో చక్రవర్తికి బంధువయిన ఒక స్త్రీ (షాయిస్త ఖాన్ పత్ని) దర్బారులో ఉంది. తన కుమారున్ని చంపిన, తన భర్తను గాయపరచిన, సూరత్ నగరాన్ని ఘోరంగా దోచుకున్న దోషిని నిర్బంధించకుండా వదలరాదని ఆమె పట్టుపట్టింది. ఈ కారణంగా తన నివాసాన్ని ముగ్గురు నలుగురు మన్సబుదారులు కనిపెడుతూ ఉన్నారని శివాజీ గమనించాడు. అందుకని అతను రాత్రివేళ అక్కణ్ణుండి తప్పించుకున్నాడు. దీనితో రాజభవనంలో తీవ్ర అసంతృప్తి చెలరేగింది. శివాజీని తప్పించడంలో జైసింగ్ కుమారుడు రాంసింగ్ పాత్ర ఉందని గట్టిగా నమ్మడం వలన, అతన్ని దర్బారుకు రాకుండా ఆపేయడం జరిగింది. ఔరంగజేబ్ కూడా ఈ తండ్రి కుమారులతో తీవ్ర అసంతృప్తి చెందాడు, లేక అలా కనబడ్డాడు. జైసింగ్ కూడా ఈ కారణంగా దక్కన్‌లో తనను కమాండర్ హోదా నుండి తీసేయడమే కాకుండా తన ప్రాంతాలు జప్తు చేసుకోవడం జరుగుతుందేమోనని భయపడ్డాడు. కాని బుర్‌హాన్‌పూర్ చేరుకొనేసరికి పరమపదించాడు. ఎప్పుడైతే జైసింగ్ మరణిం చాడనే విషాద వార్త చేరిందో, ఔరంగజేబ్ అతని కుమారునికి అంటే (రాంసింగ్‌కు) సంతాపాన్ని తెలుపడమే కాకుండా అతని తండ్రి అనుభవిస్తున్న సర్వ జీతభత్యాల్ని కుమారునికి బదలాయిం చాడు. కుమార్ రాంసింగ్‌పై చక్రవర్తి చూపించిన ఈ కరుణాకటాక్షాలతో, చక్రవర్తి అభీష్టం, అభిమతమే గనక లేకపోయినట్లయితే శివాజీ పారిపోలేకపోయేవాడని అనేకమంది గట్టిగానే విశ్వసించారు. అతను దర్బారులో ప్రవేశించినప్పటి పరిస్థితులు చక్రవర్తిని గొప్ప ఇరకాటంలో పడవేశాయి.

అతని (శివాజీ) పట్ల ఆవిడ (షాయిస్త ఖాన్ భార్య) ఆగ్రహావేశాలు అత్యంత తీవ్రంగా ఉన్నాయి. తమ ఆప్తులు, రక్తసంబంధీకుల రక్తంతో చేతులు తడుపుకున్న రాక్షసునిగా వారు అతన్ని (శివాజీని) భావించుకోసాగారు. (Travel in the Moghal Empire- Dr. Franciose Burnier, page 190, 191).

ఈ విధంగా శివాజీని నిర్బంధించడానికి వివిధ చరిత్రకారులు వివిధ కారణాలను వర్ణించారు. వాటిని పాఠకుల దృష్టికి తేవడమే మా ఉద్దేశం. అంతే. అందుకే దీనిపై ఎలాంటి విశ్లేషణ చేయ లేదు.

**దర్బారి అఖ్‌బారాత్ (దర్బారు పత్రికలు)**

**తప్పుల మన్నింపు, దగ్గరికి తీసుకునే ప్రయత్నం**

**ఏప్రిల్ 20, 1667**

జుమ్‌దతుల్ ముల్క్ (ప్రధాన మంత్రి) ఇలా ఆదేశించబడ్డాడు : "శివాజీ వకీలును విడిచిపెట్టండి, నమ్మదగిన మరియు విశ్వసనీయమైన జమానతు ఇచ్చి, తన కుమారుణ్ణి మా దర్బారులో ఉంచినట్లయితే అతని తప్పులన్నీ మన్నించబడతాయని శివాజీకి వ్రాయండి." (ఇక్కడ ఔరంగజేబ్ పాలసీని పరిశీలించాల్సి ఉంది. మే 12, 1666న ఏం జరిగిందో అందరికీ తెలుసు. అదీకాకుండా సిపాయిల కళ్లుకప్పి ఆగ్రా నుండి తప్పించుకొని పారిపోవడం ఎటువంటి చర్యలంటే ఔరంగజేబ్ శివాజిపట్ల అత్యంత కఠినమైన చర్యలు తీసుకునే అవకాశముండింది. కాని ఇవన్నీ జరిగినప్పటికీ శివాజీని క్షమించే సన్నాహాలు జరుగుతున్నాయి. బహుశ ఇది కూడా రాజకీయాల్లోని ఒక భాగమై ఉంటుంది. ఇంకా ఔరంగజేబ్ శివాజీ రాజాతో సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నాడని అనిపిస్తుంది – అనువాదం : స.షా. గాజియొద్దీన్, పేజి 12 రెండవ ముద్రణ, 2011)

ఆలంగీర్ పరిపాలనలో అతని సైన్యాలు శివాజీని ఎంత వివశుణ్ని చేశాయంటే, అతను ఆయుధాలు పడేసి, సర్వసైన్యాధికారి ముందు హాజరు కావాల్సి వచ్చిందని ఇంతకు ముందే తెలుసుకున్నాము. అయినప్పటికీ ఔరంగజేబ్, శివాజీని స్వాగతించడంలోనూ, అతని ఆదర సత్కారాలు చేయడంలోనూ ఎలాంటి లోటు రానివ్వలేదని, అతని స్థాయి మరియు ఔన్నత్యానికి తగ్గట్టుగానే అతన్ని గౌరవించాడని చారిత్రక సాక్ష్యాధారాల ద్వారా నిరూపితమయింది.

ఔరంగజేబ్ మరాఠాలతో పూర్తిగా వివశుడై పోయాడని, చివరికి దక్కన్‌కు చెందిన ఆరు సూబాల్లో "చౌత్" అంటే రాబడిలోని నాలుగవ వంతు (భూమి శిస్తులోని నాలుగవ భాగం) వారికి ఇవ్వడానికి అంగీకరించాడని యూరోపియన్ చరిత్రకారులందరూ వ్రాశారు. అల్ఫిన్‌స్టన్ తన "భారత చరిత్ర"లో ఔరంగజేబ్ ఈ, చౌత్‌కు అంగీకరించాడనే విషయాన్ని పేర్కొనకపోయినప్పటికీ, ఆయనిలా వ్రాశాడు.

"ఔరంగజేబ్ తరచుగా తన అధికారుల్ని మార్చుతూ ఉండడం వల్ల శివాజీకి ఎనలేని లాభం చేకూరింది. శివాజీ రాకుమారుడు ముఅజ్జం సహాయ సహకారాలతో, అతను ఊహించిన దానికన్నా కూడా మేలైన షరతులపై చక్రవర్తితో మైత్రిని ఏర్పరచుకొన్నాడు. పర్యవసానంగా అతని అత్యధిక ప్రాంతం తిరిగి అతనికి లభించింది. బిరార్ సూబాలో అతని కుమారునికి జాగీరు ప్రసాదించబడింది. 'రాజా' అనే అతని బిరుదును అంగీకరించడం జరిగింది. ఇంకా అతని తప్పులన్నీ క్షమించబడ్డాయి."[23]

శివాజి తప్పించుకొని, దక్కన్ చేరుకున్న తరువాత, ప. షేకం 10వ సంవత్సరంలో, రాకుమారుడు ముఅజ్జం షా, రాజా జస్వంత్ సింగ్‌ను తీసుకొని దక్కన్ వచ్చి దక్కన్ గవర్నరుగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత, శివాజీ "తన కుమారుడు సంభాజీని మీ వద్దకు పంపుతానని, సైన్యంలో అతనికి సముచిత హోదా ప్రసాదించగలరని" జస్వంత్ సింగ్‌కు లేఖ వ్రాశాడు.

జస్వంత్ సింగ్, రాకుమారుడు ముఅజ్జం ఈ ప్రతిపాదనల్ని అంగీకరించారు. అనుమతి కోసం చక్రవర్తికి పంపించారు. అక్కణ్ణుండి అనుమతి లభించింది. శివాజీ తన కుమారుడైన సాంభాజీని వేయిమంది అశ్వికులతో రాకుమారుడు ముఅజ్జం షా దగ్గరికి పంపించాడు. అంతకు ముందే ఔరంగజేబ్ దర్బారు నుండి సాంభాజీకు పంచ్‌హజారి మన్సబు ప్రసాదించబడి ఉంది, అదియునుగాక శివాజీ గృహ నిర్బంధంలో ఉన్నప్పుడు కూడా సాంభాజీని దర్బారుకు రాకుండా ఆపడం జరుగలేదు. అతను ప్రతిరోజు దర్బారుకు హాజరై రాజదర్శనం చేసుకునేవాడు. ఈ కారణంగానే రాకుమారుడు ముఅజ్జం అతనికి పంచ్ హజారి (ఐదువేల) మన్సబును ప్రసాదిస్తూ, బిరార్ సూబాలో అతనికి జాగీరును కేటాయించాడు. మాసిరుల్ ఉమరాలో ఇలా ఉంది :

"రాకుమారుడు వచ్చిన తరువాత, "నా కుమారుడు సాంభాజీని పంపిస్తున్నాను, అతనికి మన్సబును ప్రసాదించండి, అతను సైన్యంతో వెళ్ళి తన కప్పగించిన పనిని నెరవేరుస్తాడు" అంటూ శివాజీ జస్వంత్ సింగ్ వద్దకు సందేశం పంపించాడు. ఈ విన్నపం అంగీకరించబడిన తరువాత పైన పేర్కొనబడిన తనయున్ని (సాంభాజీ), ప్రతాప్ రావు సహాయకునిగా, వేయిమంది అశ్విక సైన్యంతో పంపించాడు. రాజదర్బారులో హాజరైన తరువాత ఐదువేల మన్సబు మరియు ఐదువేల అశ్విక దళం, రత్నఖచిత సరంజామాతో అలంకరించబడిన ఏనుగు మరియు సూబ బిరార్‌లో జాగీరు మొదలుగాగల వాటితో సత్కరించబడ్డాడు.[24]

"చౌత్" అనేది దక్కన్‌లో అనాదిగా వస్తున్న ఓ ఆచారం. సామాన్యంగా తహశీలుదార్లు, కలెక్టర్లు వసూలుచేసే ప్రభుత్వ పన్నును దక్కన్‌లో "దేశ్‌ముఖ్"లు వసూలుచేసేవారు. ఈ ఆచారం, లేక పద్ధతి ఇటీవల కాలం వరకు కూడా దక్కన్‌లో అక్కడక్కడ కనబడుతుండేది. ఈ దేశ్‌ముఖ్‌లు ప్రభుత్వ పన్నును వసూలుచేసి అందులోని పదో భాగం లేక కొంచెం ఎక్కువనో తక్కువనో

తాముంచుకొని మిగిలినది ప్రభుత్వానికి చెల్లించేవారు. శివాజీ, అతని వారసుడు సాంభాజీ, రాజారాంలు చనిపోయిన తరువాత, రాజారాం పత్ని తారాబాయి, కొంతకాలం వరకు ఘర్షణను కొనసాగించింది. కాని చివరికి వివశురాలై, నూటికి తొమ్మిది రూపాయల లెక్కన తమకు దేశ్‌ముఖ్ హోదాను (మన్సబును) ప్రసాదించాలని అర్జీ పెట్టు కున్నది. అయితే ఆలంగీర్ దానికి అంగీకరించలేదు.

ఆలంగీర్ మరణం తరువాత 1708లో రాజా సాహూ ప్రతినిధి, బహాదూర్ షా (ఆలంగీర్ తనయుడు) కాలంలో "సర్‌దేశ్‌ముఖి" సనద్‌ను (ఆజ్ఞాపత్రాన్ని) ప్రసాదించవల సిందిగా విన్నవించుకున్నాడు. దానికి బహాదుర్ షా అంగీకరించాడు కూడా. కాని స్వయంగా మరాఠాల్లో ఏర్పడిన అంతర్విభేదాల కారణంగా (అంటే సాహూ చిన్నమ్మ తారా బాయి కారణంగా) ఇది ఆగిపోయింది.[25] చౌత్ అనే పదానికి యూరోపియన్ చరిత్రకారులు ఎలాంటి అర్థాన్ని లేక భావాన్ని ఆపాదించారంటే నేటి మన చదువుకున్న యువకులు ఔరంగజేబ్ మరాఠాలతో వివశుడై కప్పంగా లేక టాక్సుగా దీన్ని ఇవ్వడానికి అంగీకరించాడనే అపోహకు గురి అవుతున్నారు. చూశారా! కేవలం ఒక్క పదం యొక్క భావాన్ని మార్చేయడం వల్ల, చరిత్రను ఏ వైపు నుండి ఏ వైపునకు మళ్ళించవచ్చో అవలీలగా అర్థం చేసుకోవచ్చు. అందుకే ఇలా వివరించాల్సి వచ్చింది.

జదూనాథ్ సర్కార్‌ను అనుసరించి, శివాజీ ఆగ్రా నుండి వచ్చిన తరువాత అతను మొగలులతో వైరం పెట్టుకోదలచుకోలేదు. అందుకని మొగలులు రెచ్చిపోకుండా కొన్నేండ్లు ప్రశాంతంగా జీవితం గడిపాడు. తన ప్రాంతాల్ని చక్కబెట్టుకుంటూ, కోటల మరమ్మతులు చేసుకుంటూనే ఉండిపోయాడు. బీజాపూర్ మరియు జంజీరాలోని సిద్దీల ప్రాంతాల్ని ఆక్రమించుకొని తన బలాన్ని పెంపొందించుకోవాలనే ఆలోచన అతనికుంది. కాని 1667 ఏప్రిల్‌లో ఒక రాజ్యసైనిక దళం తన వైపునకే వస్తుందని కబురందగానే ఒక లేఖ వ్రాస్తూ తన భయాందోళనల్ని వ్యక్తపరిచాడు, తన కుమారుడు నాలుగువందల అశ్వికులతో, మొగలు పతాకం క్రింద పోరాడుతాడంటూ తన విశ్వసనీయతను, విధేయతను ప్రకటించాడు. కాని ఔరంగజేబ్ ఈ లేఖ గురించి పెద్దగా పట్టించుకోలేదు. (వా–4, పేజి 82)

రాజా జైసింగ్ ఇక్కడి నుండి వెళ్ళిపోయిన తరువాత అతని స్థానంలో రాకుమారుడు ముఅజ్జం నియుక్తుడయ్యాడు. అతనికి తోడుగా రాజా జస్వంత్ సింగ్‌ను కూడా పంపడం జరిగింది.

శివాజీ ఈ జస్వంత్ సింగ్‌కు ఒక లేఖ వ్రాస్తూ, "చక్రవర్తులవారు తనను పట్టించుకో లేదని, లేకపోతే ఖాందహార్‌ను తిరిగి వశపరచుకోవడానికి నన్ను నియుక్తుణ్ని చేయమని నేను కోరేవాడినని, తన ప్రాణాలకు భయపడి ఆగ్రా నుండి పారిపోయి వచ్చానని, తన సంరక్షుడైన మిర్జా రాజా గతించారని, ఇకిప్పుడు మీ జోక్యంతో నాకు రక్షణ గనక లభిస్తే, సాంభాజీని రాకుమారుని వద్దకు పంపుతానని, అతనో మన్సబుదారులాగా తన సైన్యాలతో సేవచేస్తాడని, ఇంకా ఎక్కడికి పంపిస్తే అక్కడికి వెళతాడని" తెలుపుకున్నాడు. (వా–4,పేజి82)

రాకుమారుడు, జస్వంత్ సింగ్‌లు ఈ ప్రతిపాదనల్ని మెచ్చుకున్నారు. ఈ ప్రతిపాదనల్ని మంజూరీ కోసం దర్బారుకు పంపగా, అక్కడి నుండి సరేనంటూ ఆమోదం లభించింది. ఈ విధంగా రెండేళ్ళు శాంతియుతంగా గడిచి పోయాయి. చక్రవర్తి శివాజీకి 'రాజా' బిరుదు నివ్వ డానికైతే అంగీకరించాడు గాని, 'చాకన్' కోట తప్ప ఇంకే కోటను ఇవ్వడానికి అంగీకరించలేదు. (వా–4, పేజి 82). అయితే సాంభాజీకి ఐదువేల మన్సబుతో పాటుగా ఒక గజరాజు, రత్నఖచిత ఖడ్గం, బిరార్‌లో జాగీరు కూడా ప్రసాదించబడ్డాయి. మాసిరుల్ ఉమరా, వా–2, పేజి 351)

పై వివరాల వల్ల, శివాజీ ఆగ్రా నుండి వచ్చిన తరువాత, ఔరంగజేబ్ రెచ్చిపోయి, అతనికి వ్యతిరేకంగా తీవ్ర సైనిక చర్యను చేపట్టివున్నా, నిష్పక్షపాతుడైన ఏ చరిత్రకారునికి కూడా అందులో అసమంజసమనిపించేది కాదు. అయినా అతను తన రాజరికపు ఠీవిని కాపాడుకుంటూ, సహనాన్నే ప్రదర్శించాడు. రాజపుత్ర నాయకుడు చేసిన సిఫారసును అంగీకరించి, శివాజీకి, 'రాజా' బిరుదునిస్తూ, సాంభాజీని అన్ని రకాలుగా సత్కరించాడు.

కాని 1670 జనవరిలో శివాజీ తిరిగి మొగలులకు ఎదురు తిరిగాడు. అతననేక కోటల్ని వశపరచుకున్నాడు. అతని విజయాల్లో కోన్‌దానా కోటను వశపరచుకోవడమనేది పేర్కొనదగినది, అందులో పన్నెండు వందల మంది రాజపుత్రులు నిర్దయగా వధించబడ్డారు. (వా–4, పేజి 143). ఆ తరువాత శివాజీ పోరందరాను కైవసం చేసుకున్నాడు. (వా–4, పేజి 143). శివాజీ 'మాహోలి' కోటను ముట్టడించినప్పుడు ఆ కోటాధిపతి, రాజా బీతల్ దాస్ సోదర కుమారుడైన మనోహర్ దాస్ గౌడ్ అత్యంత వీరోచితంగా దాన్ని ఎదుర్కొన్నాడు. సైన్యాలు రాత్రి సమయంలో రహస్యంగా కోటలో ప్రవేశించినప్పుడు, మనోహర్‌దాస్ గౌడ్ వారిని కోటగోడలపై నుండి విసిరిపారేయించి, హతమార్చాడు. (వా–4, పేజి 143). కాని చివరికి శివాజీ మాహోలిని ఆక్రమించుకున్నాడు. శివాజీ పురోగమనాన్ని దావూద్ ఖాన్ ఆపగలి గాడు. కాని రాకుమారుడు ముఅజ్జం మరియు దిలేర్ ఖాన్‌లలో వ్యతిరేకత ఏర్పడి అంతఃకలహం వరకు పెరిగిపోయింది. దీనితో కూడా శివాజీ అత్యధికంగా లాభపడ్డాడు. సూరత్ నగరం రెండవసారి అతిఘోరంగా దోచుకోబడింది. సగభాగం కాలబెట్టి బూడిదగా మార్చడం జరిగింది. (వా–4, పేజి–4, 151). రాకుమారుడు ముఅజ్జం మరియు దిలేర్ ఖాన్‌ల మధ్య ఏర్పడిన వ్యతిరేకత సమాప్తమైనప్పుడు, దావూద్ ఖాన్‌ను పిలిపించి, మరాఠాలకు వ్యతిరేకంగా పంపడం జరిగింది. 1670 అక్టోబర్‌లో ఇతను 'వాణిదందోద్రి'లో మరాఠాల పదివేల సైన్యాన్ని ఢీకొన్నాడు. అతని వద్ద కేవలం రెండువేల సైన్యం మాత్రమే ఉంది. మరాఠాలు పోరాడుతూ, కోన్‌కణ్ ప్రాంతాల వైపునకు వెనుదిరిగారు. దావూద్ ఖాన్ అహ్మద్‌నగర్ వచ్చేశాడు (వా–4, పే.154, 155). మరాఠాలు బిరార్ మరియు బెల్గాంలను దోచుకోసాగారు. 1671లో మహాబత్ ఖాన్ చక్రవర్తి తరపున, మరాఠాలకు వ్యతిరేకంగా సుప్రీమ్ కమాండర్‌గా పంపించబడ్డాడు. ఈ మధ్యలో శివాజీ 'సిల్‌హేర్' కోటను వశపరుచుకున్నాడు. ఇతర కోటలైన మల్‌హేర్ గడ్,

చౌరాగడ్ మరియు తిలోల్‌గడ్ అతని అధీనంలోకి వచ్చేశాయి. (వా-4, పేజి 156, 157). మహాబత్ ఖాన్, దావూద్ ఖాన్‌లు కలిసి 'ఆహిదంత్' కోటను శివాజీ నుండి తిరిగి కైవసం చేసుకున్నారు (వా-4, పేజి 158). అయితే మహాబత్ ఖాన్ పనితీరుతో ఔరంగజేబ్ సంతృప్తి చెందలేదు. అందుకని బహాదూర్ ఖాన్, దిలేర్‌ఖాన్‌లను దక్కన్‌కు పంపించాడు. వారి సహాయం కోసం ఇఖ్‌లాస్ ఖాన్ మియాన, రావు అమర్ సింగ్ చంద్రావత్ కూడా నియుక్తులయ్యారు. (వా-4, పేజి 159). దిలేర్‌ఖాన్ పూనాను ఆక్రమించుకున్నాడు. కాని మల్‌హేర్ శివాజీ అధీనంలోనే ఉంది. ఆ తరువాత మల్‌హేర్‌ను కూడా దిలేర్‌ఖాన్ వశపరచుకోగలిగాడు. పూనా నుండి దిలేర్ ఖాన్, బహాదూర్ ఖాన్‌లు వెళ్ళిపోయారు. దీంతో శివాజీ పలుకుబడి పెరిగిపోయింది. మహాబత్ ఖాన్‌ను ఉత్తర భారతానికి పిలిపించుకున్నప్పుడు, బహాదూర్ ఖాన్‌ను ఈ ప్రాంతానికి కమాండర్- ఇన్-ఛీఫ్‌గా నియమించడం జరిగింది. అంతూర్, బాకాపూర్ ప్రాంతాల్లో అతను మరాఠాలతో తలపడ్డాడు, సబ్‌కరన్ నాయకత్వంలో బుందేలాలు అతని తరఫున వీరోచితంగా పోరాడారు. (వా-4, పే 164). దిలేర్ ఖాన్ కూడా వారిని ఎదుర్కొంటూనే ఉన్నాడు. ఖాన్‌దేశ్ మరియు బిరార్‌లలో మరాఠాల పురోగమనం పూర్తిగా ఆగిపోయింది. శివాజీ సైన్యాల దాడిని ఆపడానికి, బహాదూర్ ఖాన్ అనేక చోట్ల పెద్దపెద్ద గేట్లను నిర్మించాడు. దక్కన్‌కు చెందిన ఒక గొప్ప (మరాఠా) జమీందార్ బాజాజీ నాయక్ నింబాల్కర్, శివాజీ అల్లుడు మహద్‌జీ తండ్రి (శివాజీ వియ్యంకుడు) తన సర్వకుటుంబ సభ్యులతో మొగలుల పక్షానికి చేరిపోయాడు. (వా-4, పేజి 165). 1673 జనవరిలో మరాఠాలు పూనా జిల్లా వైపు పురోగమించారు. కాని బహాదూర్ ఖాన్ వారిని ఓడించాడు. ఇంకా సైనికపరంగా అత్యంత కీలకమైన పుడ్‌గాంవ్‌లో స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ కాలంలో ఔరంగజేబ్ తరఫున అబ్దుల్ అజీజ్ ఖాన్ అనే వ్యక్తి శివనేర్‌కు కోటాధిపతిగా ఉన్నాడు. ప్రారంభంలో అతనో బ్రాహ్మణుడు. తరువాత ఇస్లాం స్వీకరించాడు. ఔరంగజేబ్‌కు అతను అత్యంత విధేయుడే కాదు, విశ్వాసపాత్రుడు కూడాను. శివాజీ అతనికి లంచమిచ్చి తన వైపునకు కలుపుకోజూశాడు. ఒక కొండంత బంగారం ఇస్తానని అతనికి ఆశ చూపాడు. అబ్దుల్ అజీజ్ ఖాన్ అతనితో డబ్బైతే తీసుకున్నాడు, కాని రహస్యంగా మొగలుల గవర్నరైన బహాదూర్ ఖాన్‌కు కబురందించాడు. మరాఠాలు ఏడువేల అశ్విక దళంతో "శివ్‌నేర్" చేరుకోగానే, మొగలు సైన్యాలు వారిని చుట్టుముట్టాయి. ఫలితంగా వారు గొప్ప నష్టాన్ని చవిచూసి, నిరాశతో వెనుదిరిగారు. (వా-4, పేజి 166). ఇంతలోనే 1672 నవంబర్ 24, రెండవ అలి ఆదిల్ షా మరణించగానే, బీజాపూర్‌లో గొప్ప అరాచకం ఏర్పడింది. శివాజీకి చక్కని అవకాశం లభించింది. 1673 మేలో శివాజీ మనుషులు హుబ్లీపై దాడి చేసినప్పుడు బీజాపూర్ సైనిక నేత బహ్‌లూల్ ఖాన్ వారిని ఓడించి కన్నడ నుండి గెంటేశాడు (వా-4, పేజి 167). ఇంతలోనే ఖైబర్ ప్రాంతానికి చెందిన అఫ్గన్లు విద్రోహాన్ని లేపారు. దాన్ని ఎదుర్కోవడానికి స్వయంగా ఔరంగజేబ్ బయలుదేరాడు. ఆ సమయంలో దక్కన్ నుండి

దిలేర్ ఖాన్‌ను పిలిపించుకున్నాడు. ఈ విధంగా బహాదూర్ ఖాన్ శివాజీని ఎదుర్కోవడానికి ఒంటరి వాడైపోయాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ 1674 జూన్ 6న అత్యంత వైభవంగా శివాజీ రాయ్‌గడ్‌లో కిరీటాన్ని ధరించాడు. (వా-4, పేజి 168).

శివాజీ బహదూర్ ఖాన్‌తో సంధి ప్రయత్నాల్ని ప్రారంభించాడు. తన పదిహేడు కోటల్ని మొగలుల కప్పగిస్తానని, ఇంకా తన కుమారుడు సాంభాజీని మొగలు సుబేదార్ అధీనంలో ఉంచి సైనిక సేవలు అందించడానికి పంపిస్తానని చెప్పుకొచ్చాడు. ప్రతిఫలంగా అతనికి ఆరువేల మన్సబును ప్రసాదించాలని, అదేవిధంగా తనకు భీం తీరప్రాంతాల్ని ప్రసాదించాలని విన్నవించుకున్నాడు. అతని సంధి షరతులకు అంగీకరించి దానికనుగుణంగా ఫర్మాన్ పంపించడం ఔరంగజేబ్ అసామాన్యమైన ఓర్పు, సహనాలకు ప్రత్యక్ష నిదర్శనం. అయితే జదూనాథ్ సర్కారునే అనుసరించి, శివాజీ తన అన్ని వాగ్దానాలతో తిరుగబడ్డాడు. ఈ కారణంగా గవర్నరు బహాదూర్ ఖాన్, ఔరంగజేబ్ వద్ద తన విశ్వసనీయతను కోల్పోయి, సిగ్గు పశ్చాత్తాపాలతో తలవంచుకోవలసి వచ్చింది. ఔరంగజేబ్ అసంతృప్తిని దూరం చేయడానికి బహాదూర్ ఖాన్ కళ్యాణ్ వైపునకు పురోగమించాడు. కోన్‌కణ్‌లో శివాజీని చుట్టుముట్టి, తీవ్ర ఆందోళనకు గురిచేశాడు. ఇంకా పుడ్‌గాఁవ్ చేరుకొని, మరాఠా విధ్వంసకారుల్ని "జనార్" వైపునకు పారద్రోలాడు." (వా-4, పేజి 170-171).

1678 ఏప్రిల్‌లో మరాఠాలు తురంబక్, నాసిక్ ఇంకా మొగలు సామ్రాజ్య ఇతర ప్రాంతాల్ని విధ్వంసం చేయనారంభించారు (వా-4, పేజి 177). శివాజీ తన జన్మభూమి అయిన 'శివనేర్'ను ఇంతవరకు కూడా ఆక్రమించుకోలేకపోయాడు. దీన్ని వశపర్చుకునే దృష్టితో ఒక రోజు రాత్రి వందమంది మరాఠా సిపాయిలు, ఉచ్చుత్రాడు, నిచ్చెనల సహాయంతో కోట గోడపైకి ఎక్కగలిగారు. అయితే అక్కడ అబ్దుల్ అజీజ్ ఖాన్ లాంటి యోగ్యుడైన కోటాధిపతి ఉన్నాడు. అతను శివాజీ సైనికులందరిని హతమార్చి, "నేనున్నంతకాలం నీవీ కోటను వశపరచుకోలేవు" అంటూ శివాజీకి సందేశం పంపించాడు. (వా-4, పేజి 177).

"శివాజీకి గోల్కొండ సుల్తానుతో వ్యతిరేకత ఏర్పడింది. గోల్కొండ సుల్తాను, బీజాపూర్‌తో ఒప్పందం చేసుకొని, శివాజీకి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించారు. ఆ కాలంలో మొగలుల తరపున దిలేర్‌ఖాన్ దక్కన్ చేరుకున్నాడు. అతనికి బీజాపూర్ రెసిడెంట్ అయిన సిద్ది మస్‌ఊద్‌తో వ్యతిరేకత వచ్చినప్పుడు, సిద్ది మస్‌ఊద్ శివాజీ వైపునకు మొగ్గుజూపాడు. దీనితో ఖిన్నుడైన దిలేర్ ఖాన్ బీజాపూర్‌ను వశపరచుకోవడానికి ఆయత్తమయ్యాడు." (వా-4, పేజి 177, 178).

1678లో శివాజీ కుమారుడు సాంభాజీ దిలేర్ ఖాన్‌తో కలిసిపోయాడు. అతను ఓ వివాహిత బ్రాహ్మణ స్త్రీని అవమానించిన కారణంగా పిన్‌హాల కోటలో బంధించబడ్డాడు. కాని అతను తన భార్య యెసూబాయి, ఇంకా ఇతర స్నేహితులతో కలిసి చెరనుండి పారిపోయి దిలేర్ ఖాన్‌ను చేరుకున్నాడు. దిలేర్ ఖాన్ సంతోషానికి హద్దుల్లేకుండా పోయాయి. అతను

దక్కన్ అంతటిని గెల్చుకున్నంతగా సంబరపడ్డాడు. సాంభాజీకు ఏడువేల మన్సబు, రాజా అనే బిరుదు, ఒక గజరాజును దర్బారు నుండి ఇప్పించాడు." (వా-4, పేజి 178, 179).

దిలేర్ ఖాన్ బీజాపూర్‌పై దాడి జరుప సన్నాహాలు చేస్తుండగానే, బీజాపూర్ రెసిడెంట్ సిద్ది మస్ఊద్ మరియు శివాజీల మధ్య సంధి కుదిరింది. దాని ననుసరించి శివాజీ ఏడువేల అశ్విక సైన్యాన్ని బీజాపూర్ సంరక్షణకోసం పంపించాడు. అయితే మస్ఊద్ తిరిగి దిలేర్‌ఖాన్‌తో సంధి చేసుకున్నాడు. శివాజీకి వ్యతిరేకంగా బీజాపూర్ నుండి పంపబడిన సైన్యానికి వెంకటాద్రి మురారి సైన్యాధికారిగా ఉన్నాడు. (వా-4, పేజి 179). శివాజీ తన విలువైన వస్తు సముదాయం కోసం, తన ప్రజల రక్షణ స్థావరంగా భూపాల్‌గడ్‌ను కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నాడు. దిలేర్ ఖాన్ దాన్ని ముట్టడించాడు. నిత్యావసర వస్తువుల సరఫరాతో సహా బాజాజీ రావ్ (నింబాల్‌కర్) కూడా ఈ ముట్టడిలో అతనికి తన సహాయాన్ని అందించాడు. 1679 ఏప్రిల్‌లో దిలేర్ ఖాన్ భూపాల్‌గడ్‌ను వశపరచుకోగలిగాడు." (వా-4, పేజి 180, 181).

బీజాపూర్ మరియు మొగలులకు వైరం ఏర్పడినప్పుడు, శివాజీ బీజాపూర్ వాళ్ళతో కలిసిపోయాడు. అతని కుమారుడు సాంభాజీ కూడా దిలేర్ ఖాన్ వద్ద నుండి పారిపోయి పిన్‌హాల చేరుకున్నాడు. బీజాపూర్ సమీపంలో దిలేర్‌ఖాన్ శివాజీతో యుద్ధం చేసి అతన్ని ఓడించాడు. అతని రెండువేల అశ్వాల్ని స్వాధీన పరుచుకున్నాడు. శివాజీ తప్పించుకుని 'పిటాగడ్' చేరుకున్నాడు. (వా-4, పేజి 182-183). శివాజీకి చెందిన ఇద్దరు నాయకులు కూడా సూరత్ ప్రాంతంలో ఘోర పరాజయాన్ని చవిచూసారు. వారు సూరత్ వైపునకు సాగుతున్నప్పుడు 'రన్‌మస్త్ ఖాన్' పేరుగల మొగలు సర్దారు వారిని వెంబడిస్తూ రెండువేల సైనికుల్ని హతమార్చాడు. వారి నాలుగు వందల అశ్వాల్ని వశపరుచుకున్నాడు. (వా-4, పేజి 182, 183).

ఇరవైవేల సైన్యాన్ని తీసుకొని శివాజీ మరియు ఆనంద్‌రావులు పశ్చిమకోన్‌కణ్, పడమటి ఖాన్‌దేశ్‌లను కొల్లగొడుతూ, జాల్నా చేరుకున్నారు. మరాఠాలు జాల్నాను నాలుగు రోజుల వరకు తనివితీరా దోచుకున్నారు. దోచుకున్న లెక్కలేనంత వెండిబంగారాలు, మణి మాణిక్యాలు, వస్త్రాలు, అశ్వాలు, ఏనుగులు, ఒంటెల్ని తీసుకొని తిరిగి వస్తుండగా, 'రన్‌మస్త్ ఖాన్' తిరిగి వారిపై దాడి జరిపాడు. ఈ ఘర్షణలో నాలుగువేల మంది మరాఠా అశ్వికులు అసువులు బాసారు. శివాజీ సైన్యాధ్యక్షుడు హంబీర్ రావు కూడా గాయపడ్డాడు. ఆ తరువాత శివాజీ పిన్‌హాలలో ఉన్న తన కుమారుని వద్దకు చేరుకున్నాడు. ఈ నష్టాలే కాకుండా ఇంకో విషయం శివాజీని తీవ్రంగా బాధిస్తున్నది. అదేమిటంటే ఇటీవలనే సాంభాజీ తండ్రికి వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు కొత్తగా ఏర్పడిన మరాఠా రాజ్యానికి గొప్ప ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. అతని జ్యేష్టపుత్రుని ఈ చర్య శివాజీని భవిష్యత్ గురించి చింతావ్యాకులాల్లో పడేసింది. సాంభాజీ యొక్క ఈ ప్రవర్తన కారణంగా అతన్ని మరాఠా జాతి అంతటికీ ఒకే అధినేతగా ఉంచే సూచనలు కనబడడం లేదు. దీనికి ప్రత్యామ్నాయం ఏమిటంటే, శివాజీ రెండవ కుమారుడైన రాజారాం. కాని అతను పదేళ్ళ బాలుడు. (రాజ్య భారాన్ని మోయలేడు). అంతేకాకుండా రాజ్యానికి ప్రాచీన మంత్రులు ప్రత్యేకించి ప్రధానమంత్రి అయిన మోరో ట్రింబక్

మరియు పశ్చిమ ప్రాంతాలకు గవర్నరుగా ఉన్న అన్నాజీ దత్తాల మధ్య తీవ్రమైన అసూయాద్వేషాలు పొడసూపాయి. (శివాజీ భయపడినట్లే మంత్రివర్గంలో ఏర్పడిన ఈ అంతర్గత విభేదాలే ఆ తరువాత రాజ్యాన్ని రెండుగా చీల్చిపడేశాయి). ఇక మిగిలిన మార్గం రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించి సాంభాజీ, రాజారాంల మధ్య పంచడం - కాని ఇది ఆచరణలోకి రాలేకపోయింది. శివాజీ సాంభాజీకు నచ్చజెప్పడానికి ఎంతో ప్రయత్నించాడు. నాయకులతో, సాంభాజీ శ్రేయోభిలాషులతో చెప్పించాడు. తాను కూడబెట్టిన ఖజానాను వచ్చే రెవిన్యూ రాబడిని, కోటల జాబితాల్ని, అశ్వికుల జీతభత్యాల జాబితాల్ని - సర్వం చూపిస్తూ ఇంతగానున్న ఈ సంపదను ఈ వారసత్వాన్ని కాపాడుకొమ్మని పరి పరి విధాల నచ్చజెప్పాడు. కాని సాంభాజీ మాత్రం ఇవన్నీ ఒక చెవితో విని, వేరొక చెవి నుండి తీసేసినట్లుగానే ప్రవర్తించాడు. అందుకని శివాజీ చివరి రోజుల్లో అత్యంత నిరాశా నిస్పృహలు అతన్ని అలుముకున్నాయని తెలుపుతూ జదూనాథ్ సర్కారు ఇంకా ఇలా వ్రాశారు. "1680 మార్చిలో అతను మరణించాడు. మరణించే సమయంలో ఈ మరాఠా జాతి నిర్మాత వయస్సు ఏభైమూడు సంవత్సరాలు కూడా పూర్తిగా నిండలేదు." (వా-4, పేజి 182 - 185)

శివాజీ తరువాత అతని ఇంకొక కుమారుడైన రాజారాం రాజ్యాధికారాన్ని చేపట్టాడు. కాని అత్యధిక మంది మరాఠా సర్దారులు సాంభాజీనే సమర్థించారు. ఇతని హయాంలో ధరంపూర్, ఖాన్‌దేశ్ ప్రాంతాల్లోని జనపదాలు, బుర్హాన్‌పూర్ నగరాన్ని బాగా దోచుకున్నారు. జదూనాథ్ సర్కార్ ఇంకిలా వ్రాశాడు : "గౌరవమర్యాదలు గల అనేక కుటుంబాలవారు, ఈ దుండగుల చేతుల్లో పడకూడదనే దృష్టితో తమ భార్యల్ని, తమ కుమార్తెల్ని హతమార్చుకున్నారు.'' (వా-4, పేజి 198, 199). మరాఠాలు ఔరంగాబాద్‌ను దోచుకోవడానికి, కొల్లగొట్టడానికి వచ్చినప్పుడు, పురుషులు ఇళ్ళలో దాక్కున్నారు. స్త్రీలు ఏడుస్తూ, ఆర్తనాదాలు చేయసాగారు. నగరంలోని వీధులన్నీ నిర్మానుష్యమైపోయాయి. (వా-4, పేజి 201).

మొగలు ప్రాంతాల్ని కొల్లగొట్టడం, ప్రజల్ని దోచుకోవడాన్ని సాంభాజీ, అతని సైనికులు తమ దైనందిన కార్యక్రమంగా చేసుకున్నారు. అయితే ఔరంగజేబ్ దీన్ని ఒక విసుగెత్తించే, చికాకుపరిచే చర్యకన్నా అధిక విలువ ఇవ్వలేదు. గోల్కొండ, బీజాపూర్‌లు తన అధీనంలోకి వచ్చిన తరువాత సాంభాజీని శాశ్వతంగా సమాప్తం చేయొచ్చని అతను ఆలోచించి పెట్టుకున్నాడు. (వా.4, పేజి 334, 335)

ఔరంగజేబ్‌తో తిరుగబడిన అతని రాకుమారుడు 'అక్బర్' సాంభాజీని ఆశ్రయించాడు. కాని వీరిద్దరూ కూడా ఒకరికొకరు ఏమంత సహాయపడలేకపోయారు.

ఔరంగజేబ్ తన పట్టాభిషేకం 25వ సంవత్సరంలో దక్కన్‌కు బయలుదేరాడు. ఔరంగాబాద్‌లో మకాం వేసి, తన కుమారుడు ముఅజ్జం షాను మరాఠాలను అణచడానికి పంపించాడు. ముఅజ్జం షా కోన్‌కణ్ ప్రాంతాలన్నింటినీ వశపరచుకుంటూ దాని చివరి హద్దు వరకు చేరుకున్నాడు. కాని వాతావరణపు అననుకూలత, తిండి పదార్థాలు, మేత కరువువల్ల

వేలాది మనుషులు, పశువులు మృత్యువాతబడ్డాయి. చివరికి ఔరంగజేబ్ అతన్ని పిలిపించుకున్నాడు. కాని సాంభాజీకు హైద్రాబాద్ మరియు బీజాపూర్‌ల నుండి నిరంతరం సహాయసహకారాలు లభిస్తూనే ఉండడం వల్ల సంపూర్ణ విజయం చేకూరడం లేదు. అందుకని ఔరంగజేబ్ మరాఠాల వైపు నుండి దృష్టి మళ్ళించి, హైద్రాబాద్ వైపునకు బయలుదేరాడు. హైద్రాబాద్‌ను వశపరచుకొని తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

ఈ విజయం తరువాత 1688లో సాంభాజీని అణచడానికి ముఖ్రబ్‌ఖాన్‌ను నియమించాడు. అతనెంత శీఘ్రంగా సంగమేశ్వర్‌లో నున్న సాంభాజీని సమీపించాడంటే, అతని రాక గురించి సాంభాజీ అసలు తెలుసుకోలేకపోయాడు. చివరికి యుద్ధం జరిగింది. అందులో సాంభాజీ ఓడిపోయి సజీవంగా పట్టుబడ్డాడు. ఆ తరువాత సాంభాజీ పని సమాప్తమైపోయింది.

కాని రాయ్‌గడ్ కోట ఇంతవరకు కూడా మరాఠాల అధీనంలోనే ఉంది. ఆ కోటలోనే సాంభాజీ భార్య యసూబాయి, తల్లి, కుమారుడు సాహూ ఇంకా శివాజీ సాంభాజీల ఇతర దగ్గరి బంధువులున్నారు. ఈ రాయ్‌గడ్ కోట ముట్టడి దాదాపు 8 నెలల వరకు జరిగింది. చివరికి ఈ కోటను అప్పగించడానికి దూరదృష్టి గల యసూబాయి, మొగలు సైన్యాధికారి అయిన ఏతెఖాద్ ఖాన్‌తో కొన్ని సంధి షరతులు ప్రతిపాదించింది. అప్పటి సన్నివేశం ఇలా వర్ణించబడింది: "యసూబాయి, బాలుడైన సాహూను ఖాన్ తొడపై కూర్చుండబెట్టి, 'ఇతని తండ్రి, బాబాయి అందరూ ఇతన్ని విడిచి వెళ్ళిపోయారు. ఇక ఇప్పుడు మీరే ఇతనికి సంరక్షకులు." – దానిపై ఏతెఖాద్ ఖాన్ ఖుర్‌ఆన్‌ను చేతిలో పట్టుకొని "ఈ విషయంలో నీవేమి బెంగపడవలసిన అవసరం లేదు. ఈ పిల్లవాని గౌరవ మర్యాదలకు గాని, ప్రాణానికి గాని ఎలాంటి హాని జరగదని వాగ్దానం చేస్తున్నాను." ఈ విధంగా 8 నెలలుగా కొనసాగిన రాయ్‌గడ్ కోట ముట్టడి సమాప్తమై కోట మొగలులకు అప్పగించబడింది. (మరాఠాయంచే స్వాతంత్ర్య సమర్ – శ్రీ యస్.యస్. పౌరాణిక్, కాల్ ప్రకాశన్, పుణే, మహారాష్ట్ర ప్రభుత్వం, 1982, పే. 14, 15) సేనాని ఏతెఖాద్ ఖాన్ చేసిన ఈ వాగ్దానం, ఈ ప్రమాణం కారణంగానే ఔరంగజేబ్ వీరిపట్ల ఎంత సహృదయంతో, ఎంత దయ కనికరాలతో ప్రవర్తించాడంటే, చరిత్రలో దీనికి సాటి వేరొకటి లేదు. కేవలం ఎనిమిది సంవత్సరాల ప్రాయం గల సాహూకు ఏడువేల మన్సబు, రాజా అనే బిరుదునిచ్చి, అతనకో ప్రభుత్వాన్ని ఏర్పరచి, దీవాన్, బక్షీ (మంత్రి, సెక్రటరీ)లను నియమించాడు. అతనిని తన సంరక్షణలోనికి తీసుకొని, ఎల్లప్పుడూ కూడా అతని క్యాంపును తన ప్రక్కనే ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశాడు. అతని తమ్ముళ్ళు మదన్‌సింగ్, ఉధూ సింగ్‌లను కూడా సముచితంగా సత్కరించాడు.

ఈ విషయాన్ని జదూనాథ్ సర్కార్ కూడా అంగీకరించి, ఔరంగజేబ్ చూపిన ఈ దయాకనికరాల్ని ఇలా వర్ణించాడు : "రాయ్‌గడ్ కోట నుండి శివాజీ భార్యలు, కుమార్తెలు, కుమారులు కూడా గోర్‌గాంవ్ లోని రాజుగారి క్యాంపునకు తేబడ్డారు. వారిలో సాహూ కూడా ఉన్నాడు. స్త్రీల కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయబడింది. వారిని అత్యంత గౌరవమర్యాదలతో

చూడడం జరిగింది. సాహూకు ఏడు వేల మన్సబు మరియు 'రాజా' బిరుదు ప్రదానం చేయబడ్డాయి. అతని తమ్ముళ్ళు మదన్ సింగ్ మరియు ఉధూ (మధు) సింగ్‌లను తమ తల్లులు, నానమ్మలతో ఉండనిచ్చారు. వీరి ఖర్చుల కోసం నిధులు సమకూర్చబడ్డాయి. వారికి కొంతమంది అధికారుల్ని కూడా నియమించి ఇవ్వడం జరిగింది.[26]

అప్పటి సన్నివేశాన్ని మాసిరె ఆలంగీరి గ్రంథ రచయిత ఇలా వర్ణించాడు :

"దయానుగ్రహాలు గల చక్రవర్తుల వారు సాంభాజీ తల్లి అనగా శివాజీ భార్య, ఇంకా అతని ఇతర సంబంధీకుల్ని గులాల్ బార్‌కు (చక్రవర్తి అంతఃపుర జనాల విడిదికి) సమీపంలో తగిన విధంగా విడిదిని ఏర్పాటుచేసి ఈ బందీలను అత్యంత గౌరవమర్యాదలతో చూడాలని ఆదేశించారు. జుందతుల్ ముల్క్ (ప్రధానమంత్రి లేక ప్రధాన నాయకుని) విడిదికి సమీపంలో ఈ రాణి బంధు పరిచారకుల నివాసం కోసం కూడా ఒక విడిదిని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అనుగ్రహాల తరువాత ప్రతి ఒక్కరికి వారి అవసరాలను అనుసరించి సంవత్సర పింఛను నిర్ణయించబడింది. వాటి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి :

సాంభాజీ జ్యేష్ఠకుమారుడు 9 సం.ల ప్రాయం గల సాహూకు 7 వేల పదాతి, 7 వేల అశ్విక దళ మన్సబును, "రాజా" అనే బిరుదు, రాజ వస్త్రాలు, వజ్రాలు పొదిగిన కత్తి కటార్లు, అలంకరించిన గజరాజు, నగారా మరియు పతాకాన్ని (జెండాను) ప్రసాదించి, గౌరవనీయులైన రాజుల వర్గంలో చేర్చడం జరిగింది.

అతని తమ్ముళ్ళయిన మదన్ సింగ్, ఉదూ సింగ్‌లకు వారి యోగ్యతలననుసరించి మన్సబులు మరియు కానుకలతో సత్కరించబడ్డారు. ఇంకా వారు తమ తల్లి, అమ్మమ్మలతో ఉండవచ్చని ఆదేశించబడింది.

వీరిలోని ప్రతి ఒక్కరి ప్రాంతాల (అంటే జాగీర్ల) వ్యవహారాలు ఇంకా ఇతర వ్యక్తిగత అవసరాలు తీర్చడానికి తగినంత మంది అధికారుల్ని, సిబ్బందిని నియమించడం జరిగింది. (మాసిరె ఆలంగీరి–ముస్తఅద్ ఖాన్ సాఖి– పేజి 232)

ఖైదు స్థితిలో భోజనం చేయకపోవడం అప్పటి హిందువుల్లో ఆచారంగా ఉండేదట. అందుకని సాహూ కేవలం పళ్ళు, మిఠాయిలతోనే గడుపుకునేవాడు. ఇది తెలుసుకున్న ఔరంగజేబ్ తన సెక్రటరీ హమీదుద్దీన్ ఖాన్‌ను అతని వద్దకు పంపి, "నీవు ఖైదులో కాదు, నీ ఇంట్లోనే ఉన్నావు. కనుక నిరభ్యంతరంగా నీవు భోజనం చేయొచ్చు" అంటూ కబురు పంపించాడు.[27]

సాంభాజీ చనిపోయిన తరువాత అతని సోదరుడు రాజారాం అతని వారసుడయ్యాడు. అనేకసార్లు అతను రాజుగారి సైన్యాన్ని ఘోరంగా ఓడించాడు కూడా. అతని ఇద్దరు సైనికాధికారులు సంతాజీ మరియు ధన్నాజీ పదిపన్నెండు వేల సైనిక మూకల్ని తీసుకొని దేశం నలువైపులా కొల్లగొట్టసాగారు.

అతని సేనానులు సంతాఘోర్‌పడే, ధన్నాజాదవ్‌లు బాగా ప్రఖ్యాతిగాంచారు. ఒక్కొక్కరు పది పన్నెండు వేల అశ్విక దళాల్ని వెంటబెట్టుకొని చక్రవర్తి సైన్యాధికారుల్ని అత్యంత భయభ్రాంతులకు గురిచేశారు. ప్రత్యేకించి సంతాజీ చక్రవర్తి సైన్యంలో పేరుగాంచిన ఎందరో సైన్యాధిపతుల్ని

మట్టిగరిపించాడు. మొత్తానికి రాజారాం కాలంలో అతని ఇద్దరు సైన్యాధికారులు (అంటే సంతాజీ, ధన్నాజీలు) చక్రవర్తి సైనిక శిబిరాన్ని బెంబేలెత్తించారు. వారు "దాడిచేసి అపార నష్టాన్ని కలిగించి పారిపోయే" గెరిల్లా వార్ పద్ధతిని అవలంబించారు. అందులో వారు కొంతవరకు సఫలం కూడా అయ్యారు. చివరికి 1695లో సంతా తనవారి ద్వారానే వధించ బడ్డాడు. తన స్థావరాల్ని విడిచి దేశ దిమ్మరిగా బిరార్ ప్రాంతాల్లో వివిధ పల్లెల్ని, నగరాలని దోచుకుంటూ తిరుగాడుతున్న రాజారాం 1700లో చనిపోయాడు. ఆ తరువాత అతని భార్య రాణి తారాబాయి మరాఠాల నాయకత్వాన్ని చేపట్టింది. ఆమె ధైర్యసాహసాలు గల వనిత. ఎంతో కాలం వరకు ఆమె కూడా ఔరంగజేబ్‌ను నిశ్చింతగా కూర్చుండనివ్వలేదు.

## దర్బారీ అఖ్‌బారాత్ (దర్బారు పత్రికలు)

## తేది 12 మార్చి, 1700

రూహుల్లా ఖాన్ చక్రవర్తి వద్దకు ఒక అర్జీని పంపించాడు. అందులో ఇలా పేర్కొనబడింది : "(దివంగత) రామా (రాజరాం) - శివాజి రెండవ కుమారుడు) సతీమణి తారాబాయి అర్జీని సమర్పిస్తూ ఇలా పేర్కొన్నది : "ఆమె కుమారులకు ఏడు వేల పదాతి, ఏడు వేల అశ్వికదళ మన్సబును ప్రసాదించాలని, దక్కన్ దేశ్‌ముఖి (హోదా) ప్రసాదించాలని, ఇంకా హాజరుండే షరతును సడలించాలని (అలా చేస్తే) ఆమె ఐదువేల అశ్వికులతో దక్కన్ సూబెదార్లతో కలసి చక్రవర్తి అధీనంలో ఉండి సేవలందిస్తానని ఇంకా సతారా, పిన్‌హాల్‌గడ్, చందన్ వందన్, పర్లి, నాన్‌గడ్ మొదలుగాగల) ఏడు కోటలు చక్రవర్తికి అప్పగిస్తానని విన్నవించుకున్నది." - చక్రవర్తి ఈ విన్నపాన్ని అంగీకరించకుండా నిరాకరించాడు, ఇంకిలా అన్నారు : "ముందుగా కోటలు అప్పగించాలి, ఆ తరువాతనే దేశ్‌ముఖి మొదలుగాగల వాటిపై నియామకం జరుగుతుంది." (పర్షియన్ నుండి మరాఠి - సేతు మాధవరావు పగ్డీ - మరాఠి నుండి ఉర్దూ : స.ఫా. గాజియొద్దీన్, పేజి 128)

## ఆగష్టు 19, 1701

దివంగత రామా (రాజారాం) సతీమణి తారాబాయి, ధన్నాజి జాదూ మల్హార్ రావు మొదలుగా గల మరాఠా సర్దారులకు లేఖలు వ్రాసింది. పదిహేను వందలకు పైగా పదాతి సైనికులున్న నాయకులకు "పదాతి సైనికుల్లో నుండి ఐదు వందల మంది సిపాయిల్ని మీ వద్ద ఉంచుకుని మిగిలిన సైన్యాల్ని కోన్‌దానా, రాయగడ్ కోటలకు పంపండ"ని లేఖలు వ్రాసింది.

ఈ నాయకులకు తారాబాయి ఇంకా ఇలా వ్రాసింది : "హజ్రత్ (అయ్యగారు, అంటే ఔరంగజేబ్) మన ప్రాంతమంతటిని ఆక్రమించుకుంటూ పోతున్నారు. మీరందరూ ఒకసారి ఖేల్నా (విశాలగడ్) కోటకు వచ్చేయండి. మనం ఏదో ఒక పాలసీని రూపొందించుకోవాలి." కొందరు మరాఠా నాయకులు ఈ ప్రతిపాదనను అంగీకరించారు. కొందరు నిరాకరించారు. వీరందరిలో ఏకాభిప్రాయం లేదు." (పర్షియన్ నుండి మరాఠి- సే.మా. రావు పగ్డి.)

(శివాజీ రాజా కుమారుడు రాజారాం విధవ తారాబాయి అత్యంత ధైర్యస్థైర్యాలు కలిగిన వనిత. ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా ఆమె మరాఠా శక్తిని కూడగట్టి పటిష్ఠపరచటంలో ఎంతో సఫలమైంది – (దర్బారీ అఖ్బారాత్–మరాఠీ నుండి ఉర్దూ – అను. స.షా. గాజియొద్దీన్, పేజి 228, ద్వితీయ ముద్రణ, 2011)

## దర్బారీ అఖ్‌బారాత్ (దర్బారు పత్రికలు)

## శాంతి, సామరస్యం, ఓర్పు, సహనాల ప్రదర్శన

### ఆగస్టు 29, 1701

చక్రవర్తి మున్అమ్ ఖాన్‌తో ఇలా అన్నారు : "ముహమ్మద్ అమీన్, సత్వాజి డఫ్లియాను సైనిక శిబిరం సమీపానికి తెచ్చాడు. నీవిప్పుడే రాత్రికి రాత్రి వెళ్ళి సత్వాజీకి సాంత్వన పలికి ధైర్యం చెప్పి మా సమక్షానికి తీసుకు రా" – ఆదేశాల ననుసరించి అమలు జరిగింది.

### ఆగష్టు, 30, 1701

సత్వాజీ డఫ్లియాను చక్రవర్తి ముందుకు తీసుకు రావడం జరిగింది. అతని చేతులు కట్టబడి ఉన్నాయి. చక్రవర్తి ఇలా అన్నారు : "అతని చేతి బంధనాలను విప్పేయండి. నేనతని తప్పుల్ని క్షమించేశాను." – సత్వాజీకు రాజ వస్త్రాలు, ఒక చురకత్తి బహుమానంగా ప్రసాదించబడ్డాయి. సత్వాజీ ఆరు వేల అశ్విక, ఆరువేల పదాతి దళాల మన్సబు కలిగి ఉండేవాడు. అది తిరిగి అతనికి ప్రసాదించబడింది. చక్రవర్తి దర్బారులో అతన్ని మన్సబు దారుల వరుసలో నిలబెట్టడం జరిగింది– ఆ తరువాత సత్వాజీ మనువడు తానాజీకు, హసన్‌కు, షేఖ్ బద్దీకు రాజ వస్త్రాలు ప్రసాదించబడ్డాయి. (సత్వాజీ డఫ్లే అంతకు ముందు ఒక మొగలు మన్సబుదారు. ఉద్యోగం విడిచి విద్రోహిగా మారాడు. మార్చి 24, 1701న మొగలు బిడారంపై దాడి జరిపి ఎంతోమంది బిలోచి మొగలు సిపాయిల్ని హతమార్చాడు కూడా. కాని కేవలం కొన్ని నెలల లోపలే అతను క్షమాపణ కోరి ఔరంగజేబ్ వద్దకు వస్తాడు. అతన్ని క్షమించడమే కాకుండా అతని పాత మన్సబు పునఃప్రసాదింపబడుతుంది. ఔరంగజేబ్ కూడా సుదీర్ఘమైన ఈ ముట్టడులు, దాడుల నుండి విసుగెత్తినట్లు అన్పిస్తుంది. సంధి, సామరస్యం ప్రతిపాదనలు సమర్పించబడగానే వెంటనే ఆమోదించేవాడు. మరాఠా నాయకులతో ప్రతీకారం తీర్చుకునే అభిలాష వ్యక్తం చేయడు, శత్రుత్వాన్ని తీవ్రం కానిచ్చేవాడు కాదు. రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహారాల్ని చక్కబెట్టే ప్రయత్నం చేసేవాడు). (అనువాదం : స.షా. గాజియొద్దీన్, పేజి 238)

### నవంబర్, 11, 1701

సత్వాజి డఫ్లే (క్షమాపణ కోరి చక్రవర్తి ఉద్యోగంలో చేరిన మరాఠా నాయకుడు) దైన్య స్థితిని చూసిన చక్రవర్తి అతనికి రెండు వేల రూపాయలు ప్రసాదించాలని ఆదేశించారు .... (అనువాదం: స.షా. గాజియొద్దీన్, పేజి 248)

### 14, జులై, 1703

నేడు చక్రవర్తుల వారు సభా కార్యక్రమాల్ని నిర్వహించారు. చక్రవర్తి ఫరాష్ ఖానా అధికారిని ....

ధన్నాజి జాదూ ఉద్యోగం కోసం చక్రవర్తికి తన అర్జీని సమర్పించుకున్నాడు. ఆ అర్జీ రాకుమారుడు కామ్‌బక్ష్ ద్వారా చక్రవర్తికి సమర్పించబడింది......

(ధన్నాజి జాదూ మరాఠాల్లో పేరెన్నికగన్న నాయకుడు. గొప్ప సైనిక కమాండరు. మొగలులకు వ్యతిరేకంగా అతను గొప్ప ఘనకార్యాలను సాధించాడు. మొగలు సైన్యాధికారుల్ని బెంబేలెత్తించాడు. మరాఠాల చరిత్రలో అతనో హీరోగా పరిగణించబడతాడు. అలాంటి వీరుడు, గొప్ప సైనిక కమాండరు ఉద్యోగం కోసం ఔరంగజేబ్ సన్నిధిలో అర్జీని సమర్పించుకునే వార్త దర్బారు పత్రికలో చూసిన సేతూ మాధవరావు పగ్డీ ఉలిక్కిపడ్డారు. *(ఈ పగ్డీయే పర్షియన్‌లో ఉన్న ఈ దర్బారు పత్రికల్ని మహారాష్ట్ర ప్రభుత్వం తరపున, దాని ఖర్చులపైనే మరాఠీలోకి మూడు (3) వాల్యూంలలో అనువదించారు).* దీన్నెలా విశ్లేషించాలో అర్థంకాక తికమకపడ్డారు. దాన్ని ఆయన ఇలా విశ్లేషించారు: "ఏ విధంగానైనా సరే ఈ యుద్ధాన్ని సమాప్తం చేయడానికి ఏదో ఒక మార్గాన్ని కనుగొనడం మొగలు నాయకులకు అనివార్యమైపోయింది. ఔరంగజేబ్‌కు కూడా ఈ విషయంగా ఆలోచనలు రాసాగాయి. కాని ఆత్మాభిమానం అడ్డుపడుతుంది. అందుకని తంజావూర్ నుండి శివాజీ సోదర కుమారుడు రాయెభాన్‌ను పిలిపించి సాహూతో కలిపించటం జరిగింది. ఇంకా ధన్నాజీ జాదూ ఉద్యోగం కోసం సమర్పించిన అర్జీ బహుశా దీనికి సంబంధించే అయి వుంటుంది" – అయితే పగ్డీగారి ఈ వాదన పొంతన లేకుండా వుంది. ఇది మింగుడు పడడం లేదు. ఇది కేవలం ఒక ఊహ, అంచనా మాత్రమే. ఆయన విశ్లేషణను అంగీకరించటానికి స్పష్టమైన సాక్ష్యాధారం ఏదీ లేదు." (ఉర్దూ అనువాదం : స.షా. గాజియొద్దీన్, పేజి 409)

ఆనాటికి ఆలంగీర్ వయస్సు 82 సంవత్సరాలు. అయినాగాని దృఢ సంకల్పంగల ఈ చక్రవర్తి, తానే స్వయంగా ఈ దాడులను ఎదుర్కొనేందుకు సారథ్యం వహిస్తున్నాడు. చివరికి ఒక్కొక్కటిగా మరాఠాల కోటలన్నిటినీ వశపర్చుకున్నాడు.

దీనికి సంబంధించి అల్‌ఫిన్‌స్టన్ ఇలా వ్రాశాడు :

"ఔరంగజేబ్ తన యుక్తిని ఉపయోగిస్తూ పోయాడు. చివరికి నాలుగైదు సంవత్స రాల్లోనే పెద్ద పెద్ద కోటలన్నీ తన అధీనంలోకి తెచ్చుకోగలిగాడు. కొన్ని సమయాల్లో ఈ కోటల ముట్టడి అత్యంత భయంకరంగా, రక్తసిక్తమై ఉండేది. ఇరుపక్షాలు కూడా వినూత్న పద్ధతుల్ని, తమ తమ యుక్తుల్ని ఉపయోగించాయి. ఈ పద్ధతులు, ఈ యుక్తులు ఎంత నిరంతరంగా, చివరి కంటూ ఉపయోగించబడ్డాయంటే వాటిని వర్ణించడం కష్టమేకాదు, అసంభవం కూడాను. మొత్తానికి క్లుప్తంగా చెప్పొచ్చేదేమంటే, ఈ కోటలన్నీ జయించు కోబడ్డాయి."[28]

మొత్తానికి 1705 వరకు అనగా ఆలంగీర్ మరణానికి రెండు సంవత్సరాల ముందే మరాఠాల మొత్తం కోటలు, సురక్షిత స్థావరాలు అన్నీ ఆలంగీర్ అధీనంలోకి వచ్చేశాయి. క్రిష్ణా నదికి సమీపంలోని దేవాపూర్‌లో ఔరంగజేబ్ విడిదిచేశాడు. చిన్ ఖలీజ్ ఖాన్‌ను పిలిపించి "ఇల్లు వాకిలి విడిచి దేశద్రిమ్మరులుగా ఎక్కడెక్కడో తలదాచుకుంటున్న ప్రజలకు ధైర్యం చెప్పి,

సాంత్వనం పలికి దేశంలో సంపూర్ణ శాంతి భద్రతలు నెలకొల్పబడ్డాయని, కనుక ప్రజలు తమ తమ ఇళ్ళకు వచ్చి ప్రశాంతంగా ఉండవచ్చని దేశమంతటా ప్రకటన చేయడానికి ఏర్పాటు చేయాల్సిందిగా" ఆదేశించాడు.[29]

తారాబాయి కోటలన్నిటినీ పోగొట్టుకుంది. ఔరంగజేబ్ బ్రతికుండగానే శివాజీ మరణించాడు, రాజారాం తనువు చాలించాడు. సంతా వధించబడ్డాడు. ఈ విధంగా సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగబడిన వారందరూ ఒక్కొక్కరుగా నిష్క్రమించారు.

జదూనాథ్ సర్కార్ ఈ పరిస్థితిని ఇలా వర్ణించాడు :

"1689 చివరి వరకు ఔరంగజేబ్, ఉత్తర భారతమే కాకుండా దక్కన్‌కు కూడా ఎవరి పోత్తులేని ఏకైక సర్వశక్తి సంపన్నుడైన ఏలికగా రూపొందాడు. ఆదిల్‌షా, ఖుతుబ్ షా, రాజా సాంభాజీ అందరూ అతనిముందు చిత్తైపోయారు. వారి రాజ్యాలు అతని సామ్రాజ్యంలో కలిసిపోయాయి. *(హి.ఆ.ఔ. - వా-4, పేజి 346)*

ఔరంగజేబ్ తన కాలంలో భారతదేశంలోని అన్ని రాజ్యాల్ని, అన్ని ప్రాంతాల్ని, అందరు విరోధుల్ని వివశుల్ని చేసి, ఒకే దేశం, ఒకేజాతి, ఒకే పతాకం క్రిందికి తెచ్చి, చరిత్రలోనే మొదటిసారిగా భారత దేశాన్ని ఒక సువిశాల భారతావనిగా మార్చాడు. తన జీవిత కాలంలోనే భారతదేశానికి ఒక సమగ్ర రూపాన్నిచ్చాడు. ఆ తరువాత అతను 1707లో చనిపోయాడు. అతని తరువాత అక్కడక్కడ మిగిలి ఉన్న అసంతృప్తుల్ని, అరాచకాల్ని, విరోధాల్ని, అవిధేయతల్ని అణచి, లేక మచ్చిక చేసుకొని దేశాన్ని పటిష్టపరచడం అతని వారసుల బాధ్యత. కేంద్ర ప్రభుత్వాన్ని ఎదుర్కొనేంత శక్తి సామర్థాలుగాని, వనరులు గాని ఇక అప్పుడు ఎవ్వరికీ లేవు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోకపోతే, అది అతని వారసుల అయోగ్యతే అనబడుతుంది తప్ప దాన్ని ఔరంగజేబ్‌కు ఆపాదించడం సమంజసమూ కాదు, హేతుబద్ధమూ కాదు.

ఔరంగజేబ్‌కు తన తర్వాత తగిన, యోగ్యులైన వారసులు లభించలేదు. అతని తరువాత వచ్చిన అతని వారసులు అయోగ్యులే కాకుండా, పిరికిపందలు కూడాను. అందుకని ఔరంగజేబ్ తన జీవితమంతా కష్టపడి ఏర్పరచిన సువిశాల, అఖండ భారతాన్ని వారు కాపాడలేకపోయారు. ఔరంగజేబ్ మరణం తరువాత కేవలం ముప్పది సంవత్సరాల లోపే మొగల్ సామ్రాజ్యం తన వైభవాన్ని కోల్పోయి పతనమైపోయింది. విధి విచిత్రం చూడండి. ఔరంగజేబ్‌కు ఎలాగైతే యోగ్యులైన వారసులు లభించలేకపోయారో, అదేవిధంగా శివాజీకి కూడా యోగ్యులైన వారసులు లభించలేదు. శివాజీ జీవితాంతం కష్టపడి, చెమటోడ్చి సంపాదించి పెట్టిన సంపదను, రాజ్యాన్ని సాంభాజీ కేవలం ఎనిమిది సంవత్సరాల చిరు కాలంలోనే నాశనం చేసేశాడు. చివరికి తనూ సమాప్తమైపోయాడు.

మరాఠా జాతి మొత్తం ఔరంగజేబ్‌కు వ్యతిరేకం కాదు. ఎంతోమంది పేరుగాంచిన మరాఠానాయకులు ఔరంగజేబ్‌ను సమర్థించి, శివాజీని ఎదుర్కోవడంలో అతనికి సహాయపడ్డారు.

జదూనాథ్ సర్కార్ తన చరిత్ర గ్రంథంలో "ఔరంగజేబ్ పక్షాన ఉన్న ప్రముఖ మరాఠా నాయకులు" అనే శీర్షికతో ఒక అధ్యాయాన్నే ఏర్పరిచారు.

జధూనాథ్ సర్కార్ ఇలా అంటారు: "మరాఠాలకు చెందిన అన్ని ప్రముఖ వంశాలు, ఔరంగజేబ్‌ను ఎదురించడంలో తమ జాతితో నిలబడ్డాయనడం నిజమనిపించుకోదు. వారిలో అనేకులు మొగలులను సమర్థించారు. దానికి అనేక కారణాలున్నాయి.

సింధ్‌ఖేడ్‌కు చెందిన జాదూరావ్ వంశం షాజహాన్ పరిపాలనా ప్రారంభకాలంలో మొగలు సైన్యంలో చేరింది. శివాజీ తల్లి ఈ వంశంలోనే జన్మించింది. లఖ్‌జీ జాదూరావ్ హత్యానంతరం ఈ వంశం మొగలులతో సంబంధాలు ఏర్పరుచుకొని, ఎన్నో తరాలుగా మొగలులకు విశ్వాసపాత్రులుగా ఉంటూ వచ్చింది. ఔరంగజేబ్ కాలంలో కూడా ఈ వంశం వారికి అదే గౌరవం, సంపత్తులు లభించాయి. ప్రభుత్వ పత్రాల్లో జాదలీకి చెందిన చందర్ రావు మోరె వంశానికి చెందిన వారి ఏ ఒక్కరి పేరు మనకు కనిపించదు. జైసింగ్ ఉత్తరాల ద్వారా మాత్రం 1665లో చక్రవర్తి (ఔరంగజేబ్) చేపట్టిన సైనిక కార్యకలాపాల్లో మాత్రమే వీరి ప్రస్తావన ఉంది.

కాన్హోజి షిర్కే మరియు అతని కుమారుల్ని సాంభాజీ తీవ్రంగా హింసించినప్పుడు వారు పారిపోయి వచ్చి, మొగలు చక్రవర్తి దర్బారును ఆశ్రయించారు. రాజారాం తల్లి ఈ వంశానికి చెందిన వనితయే. వీరు మొగలు దర్బారును ఆశ్రయించినప్పుడు, చక్రవర్తి (ఔరంగజేబ్) వారికి ఉన్నత హోదాలనిచ్చాడు. షిర్కే వంశానికి చెందిన వ్యక్తులు మరియు 'మహస్వాద్'కు థానేదార్‌గా పనిచేసిన 'నాగూజీమానె' 1694 నుండే మొగలుల పక్షంలో వారికి విశ్వాసపాత్రులుగా ఉండి, సుదీర్ఘమైన మరియు ప్రశంసించదగిన సేవల్ని అందించారు. 1705లో జరిగిన 'వాగన్‌జీరా' యుద్ధంలో 'కాన్హోజీ' చూపిన ధైర్యస్థైర్యాలు, వీరత్వం కారణంగా అతను మొగలు నాయకుల జాబితాలో చేరిపోయాడు. అతనికి ఆరువేల మన్సబు ప్రసాదించబడింది.

చక్రవర్తికి విశ్వాసపాత్రులైన ఇంకో ముగ్గురు ఉద్యోగులున్నారు. అందులో ఒకరు 'ఖానాపూర్' థానేదారు అయిన ఓజీ ఓథల్, రెండవ వ్యక్తి 'ఖటావ్' థానేదార్ అయిన రాంచందర్, ఇతను మొగలుల తరఫున పోరాడుతూ 1700లో పరమపదించాడు. ఇక మూడవ వాడు బహర్‌జీ పాంద్రే, ఇతను జూన్, 1699లో మొగలు సైన్యంలో చేరి, కాశిగాంవ్ థానేదార్‌గా నియుక్తుడయ్యాడు. బహర్‌జీ సోదరుడైన టకూజీ, జులై 1694లో పదిహేను వందల మన్సబుపై నియామకమయ్యాడు.

మొగలు సైన్యంలో చేరిన రెండవ ప్రఖ్యాత మరాఠా సర్దారు సత్వాజి డఫ్లే. ఇతని వంశస్థులు బీజాపూర్‌కు పశ్చిమంలో ఉండే 'అథ్ని' ప్రాంతానికి జమీందారులు. వీరు ఆదిల్ షాహి దర్బారు నాయకుల్లో కూడా పరిగణింపబడేవారు. ఎప్పుడైతే వీరి జమీందారీ సమాప్తమై పోయిందో, వీరు మొగలు సైన్యంలో చేరారు.... ఔరంగజేబ్, 'సత్వా'ను ఐదువేల మన్సబుపై

నియమించి "జత్" జాగీరును ప్రసాదించాడు .... అతనెంతటి ముఖ్యమైన నాయకు డంటే, ఔరంగజేబ్ అతన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేసి విడిచిపెట్టలేదు. దర్బారు పత్రాల్లో తరచుగా అతని ప్రస్తావన వస్తూ ఉంటుంది. ఇతను1706లో ఇస్లాంపురిలో కాలధర్మం చెందాడు.

అతని కుమారుడైన 'బాజీచావన్ డఫ్లే' 1700లో 'సితారా' ముట్టడిలో అత్యంత వీరోచితంగా పోరాడుతూ అసువులు బాసాడు.

అమృత్‌రావు నింబాల్‌కర్, సాంభాజీ పతనం తరువాత మొగలు సైన్యంలో చేరాడు. కాని తిరిగి 'జంజీ'లో అతను రాజారాంతో కలిసిపోయాడు.

అచల్‌జీని పర్షియన్ చరిత్రల్లో శివాజీ అల్లుడుగా పేర్కొనడం జరిగింది. అతను 1686లో ఔరంగజేబ్‌ను ఆశ్రయించాడు. అతనికి ఐదువేల మన్సబు ప్రసాదించబడింది. మొగలు సైన్యంలో 1694 మార్చి వరకు అతని ప్రస్తావన వస్తుంది.

మాధాజి నారాయణ్ శివాజి పినతండ్రి కొడుకు. ఇతను 1694లో తన కుమారుడు మరియు సోదరుని కుమారులతో కలిసి మొగలులతో కలసిపోయాడు. 1695 జనవరి 6న రెండువేల మన్సబును పొందాడు. 1704లో బోధ్‌పంజ్‌గాంవ్‌కు థానేదార్‌గా కూడా ఉన్నాడు.

చివరికి శివాజీకి ఇంకొక సోదర కుమారుడు, తంజూర్ రాజు వ్యాన్‌కోజి కుమారుడైన రాయెభాన్ కూడా మొగలు సైన్యంలో చేరిపోయాడు. మరాఠా నాయకులతో సంధి వ్యవహారాలు నడపడానికి, ఫలితంగా సాహూ విడుదల అవుతాడనే నేపథ్యంలో అతని సేవలు వినియోగించుకోబడ్డాయి. చక్రవర్తి ఔరంగజేబ్ పరిపాలించినంత కాలం, రాయెభాన్ తన సేవల్ని అందిస్తూనే పోయాడు. నుస్రత్‌జంగ్ ఆదేశానుసారం తిరిగి 1706లో అతను మరాఠా నాయకులతో సలహా సంప్రదింపులు ప్రారంభించాడు.

మొగలులకు విశ్వాసపాత్రులైన మరాఠా సర్దారుల్లో కాన్‌హోజీ కూడా ఉన్నాడు. ఇతను ఖండూజీ ఖోప్డే కుమారుడు. 1659లో శివాజీ ఖోప్డేను చంపించి, అతని వంశ పరమైన 'ఒత్‌రోలి' జాగీరును ఆక్రమించుకున్నాడు. రావ్‌జగ్ దేవ్, నారో రాఘవ్ కుమారుడు మానాజి, సతారాకు మాజి సైనిక కమాండరైన సుజాన్‌జీ, అతని కుమారుడు కూడా ఔరంగజేబ్ పక్షాన ఉన్నారు. పీసల్ వంశం వారు కూడా మొగలుల్నే సమర్థించారు.

మావలి ఇంకా మరాఠాల కొండతెగలకు చెందిన పదాతి సైనికులు కూడా ఔరంగజేబ్ సైన్యంలోనే ఉండేవారు. వారు వేల సంఖ్యలోనే ఉండేవారు. వారిని క్రమశిక్షణలో ఉంచడానికి, వారిలో నుండే వారి నాయకుడు నియమింపబడేవాడు, అతన్ని చౌదరీ లేక దారూగా అని పిలిచేవారు." (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ – జదూనాథ్ సర్కార్ – వాల్యూం-5, పేజి 159-163)

సుదీర్ఘమైన పై ప్యారాగ్రాఫ్‌ల వల్ల అర్థమైనదేమంటే శివాజీ దగ్గరి బంధువులు, అనగా అల్లుడు, బాబాయ్‌ల కుమారులు, వారి మనుమలు, ఇంకా ఇతర ప్రముఖ మరాఠా నాయకులు ఔరంగజేబ్‌ను సమర్థించారు. అతని కోసం పోరాడారు. ఔరంగజేబ్ కూడా వారిని సంపూర్ణంగా విశ్వసించి, గౌరవించాడు. ఆదరించాడు. రెండువేల నుండి ఐదువేల మన్సబులు కలిగిన హోదాలనిచ్చాడు. వారిని వివిధ ఉన్నత పదవులపై నియమించాడు. వారికి ధన సంపత్తి, గౌరవం రెండూ లభించాయి. వారు బీజాపూర్, గోల్కొండ లాంటి ముస్లిం రాజ్యాలతోనే కాకుండా, స్వయంగా తమ జాతివారైనా మరాఠాలతో శివాజీతో కూడా పోరాడాడు. ఔరంగజేబ్ రాజ్య సుస్థిరత కోసం వారు వీరోచితంగా పోరాడుతూ తమ ప్రాణాల్ని సైతం త్యాగం చేశారు. ఈ వివరాల వల్ల ఒక విషయం మాత్రం తేటతెల్లమై పోతుంది. అదేమిటంటే ఔరంగజేబ్ మరియు శివాజీల మధ్య జరిగిన యుద్ధాలు జాతిపరమైనవి, ధార్మికమైనవి ఎంతమాత్రం కావు. అలా వ్రాసిన వారు చరిత్రను వక్రీకరించారే తప్ప, నిజమైన చరిత్రను సమర్పించలేక పోయారు. వీరిద్దరి మధ్య జరిగిన యుద్ధాలు ధార్మికమైనవే గనక అయి ఉంటే, పైన వివరిస్తూ వచ్చిన రాజపుత్రులు, మరాఠాలు ఎన్నటికీ ఔరంగజేబ్‌ను సమర్థించి ఉండేవారు కాదు, అతని కోసం తమ ప్రాణాల్ని అర్పించుకునేవారే కాదు. ప్రాణాలకు తెగించి వీరోచితంగా పోరాడుతున్నప్పుడు ఒక్క క్షణం కోసం కూడా వారిలో ధార్మిక వ్యతిరేకత అనే భావనే గనక వచ్చివుంటే, ఇంత తెగింపుగా, ఇంత ఆత్మార్పణతో వారు పోరాడేవారే కాదు.

ఇక చివరిలో ఔరంగజేబ్ మరియు మరాఠాలకు సంబంధించి ఒక అపూర్వ సంఘటనను వివరించకపోతే, ఈ అధ్యాయం అసంపూర్ణంగా ఉంటుందని భావిస్తాను. సాంభాజీ కుమారుడు సాహూ పట్ల ఔరంగజేబ్ ప్రవర్తనను గురించి తెలుసుకుంటే బహుశ మన అపోహలు, అపార్థాలు దూరమైపోతాయేమోనని భావిస్తున్నాను.

రాయెగడ్ కోట అప్పగించబడినప్పుడు సాంబాజీ భార్య యసూబాయితో పాటుగా అతని ఎనిమిదేండ్ల కుమారుడు సాహూ కూడా ఉన్నాడని ఇంతకు ముందే మనం తెలుసుకొని ఉన్నాము. ఆ సాహూను ఔరంగజేబ్ తన స్వీయ పర్యవేక్షణలోకి తీసుకున్నాడు. కొందరు చరిత్రకారులు దీన్ని ఖైదుగా వర్ణిస్తే, మరికొందరు దీన్ని సంరక్షణగా వర్ణించారు. అది సంరక్షణా లేక ఖైదునా అనే విషయంలో మేము వాదించదలచుకోలేదు. అదేదైనా కానివ్వండి. కాని ఆ సాహూ పట్ల అతని ప్రవర్తన ఎలా ఉండేది అనే వివరాలే మీకు తెలుపబోతున్నాను.

సాహూ యుక్త వయస్కుడయ్యే వరకు ఔరంగజేబ్ అతన్ని అన్ని విధాలుగా రక్షించడమే కాకుండా, ఒక రాకుమారునికి ఇవ్వబడే విధంగా తర్ఫీదిచ్చి యోగ్యునిగా మార్చాడు. ఇంకా యుక్త వయస్సు రాగానే మరాఠా జాతిలో పేరుమోసిన నాయకుడు బహదూర్ జాదూ కుమార్తెతో, తానే స్వయంగా పెళ్ళి సంబంధం మాట్లాడాడు. సంబంధం విషయంలో తన మన్సబును పెంచితేనే సాహూకు తన బిడ్డనిస్తానని జాదూ మంకుపట్టు పట్టాడు. ఔరంగజేబ్ ఈ షరతును

కూడా అంగీకరించి అతని మన్సబును సైతం పెంచాడు. పెళ్ళి సమయంలో సాహూతో ఔరంగజేబ్ ప్రవర్తించిన తీరు అత్యంత ఆశ్చర్యాన్ని గొలుపుతుంది. సాహూను ఔరంగజేబ్ తన కుటుంబ సభ్యునిగా, తన పిల్లవానిగా గుర్తించి ఎంతప్రేమ, వాత్సల్యాలతో వ్యవహరించాడంటే, ఆ విషయాలు తెలుసుకుంటే తల తిరిగిపోతుంది. జదూనాధ్ సర్కార్ వ్రాసిన "ఎ షార్ట్ హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్"ను డాక్టర్ కుంటే మరాఠీలో అనువదించారు. 1978లో మహారాష్ట్ర ప్రభుత్వం దీన్ని ప్రచురించింది. అందులో డాక్టర్ కుంటే ఇలా వ్రాశాడు:

"ఔరంగజేబ్ వద్ద ఖైదులో ఉంచబడిన సాంభాజీ రాజా సతీమణి యసుబాయి వైపు కన్నెత్తి చూసే ధైర్యం ఎవరిలో లేదు. అంతేకాదు, బహాదూర్ గడ్‌లో ఖైదు చేయబడిన రాజ పరివారం స్త్రీలలో నుండి ఒక స్త్రీని బహాదూర్‌గడ్ కోటాధిపతి చెడు చూపుతో చూస్తున్నాడని ఔరంగజేబ్‌కు తెలిసినప్పుడు ఆ కోటాధిపతిని పదవీచ్యుతుణ్ణి చేయడమే గాకుండా అతనికి ఖైదు శిక్ష విధించాడు. రాణి యసుబాయి గర్భం నుండి జన్మించిన సాహూను ఔరంగజేబ్ తన ఒక మనువనిగా, తన పిల్లవానిగా సంరక్షించి పెంచాడు. చరిత్రపై దృష్టి గల వారికి ఒక్కోసారి ఒక ఆలోచన వస్తుంది. ఒకవేళ ఔరంగజేబ్ సాహూను ముస్లింగా మార్చి మరాఠాలపై కూర్చుండబెడితే ఎంత ఘోరం జరిగిపోయేది ..." అందులో సాహూ పెళ్ళి విషయాన్ని ప్రస్తావించి, "ఈ సంఘటన యొక్క చిక్కుముడి విప్పడం ఎలాగో, (ఔరంగజేబ్ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడం ఎలాగో) అనువాదకునికి కష్టతరమైపోయింది" అంటూ డాక్టర్ కుంటే ఆశ్చర్యం ప్రకటించాడు. దీనికి కారణం ఏమిటంటే ఈ వివాహానికి సంబంధించి ఔరంగజేబ్ వ్యక్తిగతంగా ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. పెళ్ళి సమయంలో "ఈ పిల్లవానికి తండ్రి లేదు. వీణ్ణి మీరే సంరక్షించి పోషించారు. గనక తండ్రిగా కొన్ని బాధ్యతలు తమరే నిర్వర్తించాల్సి ఉంటుంది" అని యసూబాయి విన్నవించుకోగా, మరాఠా ఆచారాల్ని అనుసరించి సాహూకుకాబోయే వధువును చక్రవర్తి అయివుండీ కూడా ముద్దుగా తన ఒళ్ళో కూర్చుండబెట్టుకొని ఆమెకు మిఠాయి తినిపించాడు. సాహూ పేరుతో ఊరూరా మిఠాయిలు, పెళ్ళి కానుకల్ని పంచిపెట్టిన ఔరంగజేబ్ చక్రవర్తి మానవ మస్తిష్కాలకు అర్థం కాని ఒక అపూర్వ, అనూహ్య వ్యక్తిత్వంగా కనబడతాడు. (ఔరంగజేబాచా ఇతిహాస్- అను.డా.బి.జి. కుంటే, పేజి 15, 16)

నేటికాలంలో ప్రభుత్వాలు తమ గెజిట్‌లను జారాచేస్తున్నట్లే ఆ కాలంలో దర్బారుకు సంబంధించిన సంఘటనలు, వార్తలతో కూడిన పత్రికలు జారీచేసే ఆచారముండేది. అప్పుడు వాటిని (దర్బారీ) "అఖ్బారాత్" అంటూ పిలిచేవారు. ఈ వివాహానికి సంబంధించిన వివరాలన్ని వాటిలో పేర్కొనబడ్డాయి. ఉదాహరణకు :

**5 జూన్ 1704**

సాంభాజీ (రాజా శివాజీ దివంగత కుమారుడు) తనయుడు సాహూ వివాహం బహద్దూర్‌జీ (జాదూ) కుమార్తెతో నిశ్చితమయ్యింది. రాజా సాహూ వివాహ ఖర్చుల సహాయార్థం మహలు లోపలున్న ఖజానా నుండి అతనికి ఐదు వేల రూపాయలు ఇవ్వాలని చక్రవర్తి ఆదేశించారు.

**1704 జూన్ 14వ తేదీ** వివరాలు ఇలా ఉన్నాయి:

"రాజా సాహూ (శివాజీ మనుమడు) వివాహము బహాదుర్‌జీ (జాదూ) కుమార్తెతో నిశ్చయమైంది. ఈ సందర్భంలో రాజా సాహూకు 13వేల రూపాయల ఆభరణాల బహుమతి అందించబడింది. బహాదుర్ జాదూకు కూడా తన కుమార్తె కోసం 13 వందల రూపాయల ఆభరణాలు ఒసంగబడ్డాయి."

**1704, జూన్ 15వ తేది :**

నేడు బాదుషాల వారు న్యాయస్థానం పనుల్ని నిర్వర్తించారు.

గడిచిన రోజు సూర్యాస్తమయం సమయంలో (అనగా జూన్ 14న) సాంభాజీ కుమారుడు సాహూ తన పెళ్ళి నిశ్చయమైన సందర్భంలో ప్రభువుల వారి సన్నిధికి వచ్చాడు. అతను ప్రభువుల వారికి వందనాలను సమర్పించుకున్నాడు. చక్రవర్తి అతనికి వేయి రూపాయల విలువగల, మణి మాణిక్యాలు పొదిగిన తలపాగాను ప్రసాదించారు. దీనితో పాటుగానే పదమూడు వందల విలువ గలిగిన విలువైన రాళ్ళు పొదిగిన నడం పట్టెను, ఇంకా రాజవస్త్రాల్ని రాజా సాహూకు ప్రసాదించారు. ఈ సందర్భంగా ఇంకిలా ఆదేశించారు: "దౌలత్‌ఖానా (అంటే ఔరంగజేబ్, సాహూల విడిది) నుండి బహాదూర్‌జీ విడిది వరకు (అనగా వధువు క్యాంపు వరకు) నౌబత్ (అనగా రాజ్య వాద్యమేళాల)తో వెళ్ళాలి. రాజా సాహూ అధిరోహించడానికి ఎరుపు రంగు అంబారీతో అలంకరించిన గజరాజును కేటాయించాలి. వరుని తరపు పెళ్ళిపార్టీలో 'క్యాంపు కోత్వాల్ (కమీషనర్) సర్‌బరాహ్ ఖాన్, వాద్యమేళాల పర్యవేక్షణాధికారి ముహమ్మద్ అమీన్, ఫతహ్ దౌలత్ ఖాన్, హమీదుద్దీన్ ఖాన్‌లు తమ సైన్యాలతో సహా వెళ్ళాలి. సామానుల ఇంచార్జి అధికారి అయిన ముహమ్మద్ హాది, పరిచర్యల ముఖ్యాధికారి (అంటే కేర్‌టేకర్) సహాయకుడు ముహమ్మద్ సుహేల్‌లు' పాల్గొనాలి. సదరు ఆదేశాల క్రమమే అమలు జరిగింది."
(దర్బారీ అఖ్బారాత్ - అను. స.షా. గాజియొద్దీన్, పే.446, 448)

ఎవరినైతే మరాఠాల వ్యతిరేకిగా, హిందువుల శత్రువుగా అపకీర్తి పాల్జేయడానికి ఎడతెగకుండా, బహుముఖమైన ప్రయత్నాలు జరిగాయో, ఆ ఔరంగజేబ్ ఆలంగీర్ ప్రవర్తన ఇది. తనకు ముప్పుతిప్పలు పెట్టి, తన చేతిలో పరాజితుడై, చివరికి చంపబడిన తన శత్రువు సంతానం పట్ల ఔరంగజేబ్ ఎంత సహృదయంతో, ప్రేమ వాత్సల్యాలతో ప్రవర్తించాడో అతని వివాహానికి తగిన కన్యను చూసిపెట్టడమే కాకుండా, అతనికి కావలసిన సర్వ అవసరాలను తీరుస్తాడు. అతని గౌరవాన్ని పెంచడానికి తన దర్బారు ఉన్నతోద్యోగుల్ని, సైనికాధికారుల్ని సర్వలాంఛనాలతో పెళ్ళి పార్టీలో వరుని తరఫున పాల్గొనాలని ఆదేశిస్తాడు. ఇటువంటి విశాల దృక్పథం కలిగిన ఔరంగజేబ్‌ను మతపక్షపాతిగా, హిందూ వ్యతిరేకిగా, సంకుచిత స్వభావిగా ముద్రవేశారు. ఆంగ్లేయ చరిత్రకారులు, ఆంగ్లేయుల మానసిక దాస్యానికి గురిఅయిన మన చరిత్రకారులు అతని మేలును, సత్ప్రవర్తనను, నిష్పక్షపాతాన్ని, పరమత సహనాన్ని అంగీకరించినా, అంగీకరించకపోయినా, స్వయంగా సాహూ హృదయంపై అతని ప్రేమావాత్సల్యాలు, అతను చేసిన మేలు చెదరని ముద్రవేసాయి. అతను తన సంరక్షకున్ని, తన శ్రేయోభిలాషిని,

తన ఆప్తున్ని మరువలేకపోయాడు. అందుకే అతను పట్టాభిషిక్తుడైన వెంటనే మొట్టమొదటగా ఔరంగజేబ్ సమాధిని దర్శించుకున్నాడు. అతని ఆత్మ శాంతికి, పుణ్యప్రాప్తికి పేదసాదలకు భోజనాలు పెట్టించాడు, దానాలు పంచిపెట్టాడు.[30]

ఈ విషయంగా మరాఠా చరిత్రకారుడొకాయన ఇలా వ్రాశాడు :

"శివాజీ మనుమడైన సాహూను ఔరంగజేబ్ ఆగ్రాలోని తన మహాలులో ఖైదులో ఉంచాడు. కాని అతనికి ధార్మిక శిక్షణ ఇప్పించడానికి పూర్తి శ్రద్ధాసక్తులు కనబరిచాడు. హిందూ పండితుల్ని నియమించి అతనికి ధర్మశాస్త్రాల విద్య గరిపించాడు. సాంభాజీ గతించిన తరువాత శివాజీ రాజ్యానికి సాహూ వారసుడుగా నియమించబడ్డాడు. ఔరంగజేబ్ తన పట్ల చూపిన ప్రేమ వాత్సల్యాలు, దయాకనికరాలతో ప్రభావితుడైన సాహూ, బాధాతప్త హృదయంతో ఔరంగజేబ్ శవపేటికతో 'ఖుల్దాబాద్' వరకెళ్ళాడు. ఇంకా ఔరంగజేబ్ సమాధిపై మట్టివేస్తున్నప్పుడు అతని కళ్ళ నుండి అశ్రువులు రాలసాగాయి." (New History of Maratas - G.S. Sir Desai-Vol.I, page 63, Meerut, 1980) [31]

దీన్ని డా. బిషంబర్ నాథ్ పాండే కూడా ధృవీకరిస్తూ ఇలా వ్రాశారు:

"....ఔరంగజేబ్ తనపై చూపిన ప్రేమ వాత్సల్యాలు, తనపట్ల చేసిన ఉపకారాలను తలచుకొని అతని హృదయం ద్రవించిపోయింది. వ్యధాభరిత హృదయంతో అతను ఔరంగజేబ్ శవపేటికతో ఖుల్దాబాద్ వరకు వెళ్ళాడు. సమాధిపై మట్టి వేస్తున్నప్పుడు అతని కళ్ళు అశ్రువులతో నిండిపోయాయి...." (మందిర్ బోల్ ఉఠ్తే -హిందీ- పేజి 25)

ఔరంగజేబ్, శివాజీకి సంబంధించి మన యువతరం మనోమస్తిష్కాల్లో నూరిపోయబడిన ఒక విషం ఏమంటే ఔరంగజేబ్ మరియు శివాజీల మధ్య జరిగిన ఈ ఘర్షణలు హిందూ-ముస్లింల యుద్ధాలని, శివాజీ-ఔరంగజేబ్‌లు హిందూ-ముస్లిం సముదాయాలకు ప్రాతినిధ్యం వహించేవారనే ఒక పెద్ద కుట్రపూరిత అపోహను దూరం చేయకపోతే ఈ అధ్యాయమే నిరర్థకమైపోతుంది. సుదీర్ఘమైన ఈ అధ్యాయంలో అక్కడక్కడ వచ్చిన పేర్లు, సన్నివేశాలు, సంఘటనలతో మన పాఠకులు ఈ విషయాన్ని కొంతవరకు అవగాహన చేసుకొని ఉంటారు. కాని అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్లు ఈ విషయం పూర్తిగా తేటతెల్లం కావాలి. మేమీ అధ్యాయాన్ని, ఈ పుస్తకాన్ని రూపొందించడంలోని అసలు లక్ష్యమే అది. అంటే అప్పుడు జరిగిన ఈ యుద్ధాలు ధార్మికపరమైనవి ఎంతమాత్రం కావు, మత యుద్ధాలు అంతకన్నా కావు. ఈ అపోహను, ఈ అపార్థాన్ని తొలగించడానికి మేము మా శాయశక్తుల కృషి చేస్తాము. దీనికి సంబంధించిన అన్ని అంశాల్ని, అన్ని సంఘటనల్ని, అన్ని సాక్ష్యాధారాల్ని అన్ని వాంఙ్మాలాల్ని మీ ముందుకు తెచ్చాము. ఇంకా తెస్తాము. అందుకని ఈ అధ్యాయం కాస్త పెరిగిపోతే మమ్మల్ని క్షమించాలి.

ఔరంగజేబ్ ఒక రాజు. అతను హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలను సమైక్యపరచడానికి, లేక ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించడానికి కంకణం కట్టుకోలేదు. అతను మొగలు

సామ్రాజ్యవారసుడు. మొగలు సామ్రాజ్యాన్ని పటిష్ఠపరచడం, దాన్ని విస్తరింపజేయడం మొగలు సామ్రాట్టుగా దీన్ని తన విధి బాధ్యతలుగా భావించాడు. ఈ త్రోవలో ఎవరు అడ్డువచ్చినా, వారు హిందువులుగాని, ముస్లింలుగాని సమాప్తం చేశాడు. తన ఈ లక్ష్యసాధనలో తనకు చేదోడు వాదోడుగా నిలిచినవారు, వారు హిందువులైనాసరే, దగ్గరికి తీశాడు, గౌరవించాడు, అత్యున్నత హోదాలనిచ్చి సత్కరించాడు. వారిని సంపూర్ణంగా విశ్వసించి, సూబేదారులుగాను, సైన్యాధ్యక్షులుగాను నియమించాడు. శివాజీని అతనొక హిందువుగాకాక, తన వ్యతిరేకిగా, విద్రోహిగా, తిరుగుబాటుదారుగా గుర్తించాడు. అతను బలాన్ని పుంచుకోవడాన్ని, రాజ్యాన్ని ఏర్పరచుకోవడాన్ని తనకు, తన రాజ్యానికి ప్రమాదంగా భావించాడు. కేవలం శివాజీ ఒక్కడినే కాదు, శివాజీకి సహాయ సహకారాలందిస్తున్నారని, ఇంకా ఇతర వేరే కారణాలతో ముస్లిం రాజ్యాలైన గోల్కొండ మరియు బీజాపూర్‌లపై కూడా దండెత్తి పోయాడు. చివరికి ఆ రాజ్యాల్ని సమాప్తంచేసిగాని ఊరకుండలేదు. మధ్యమధ్యలో శివాజీ పశ్చాత్తాపాన్ని, విధేయత వాగ్దానాలకు ఔరంగజేబ్ స్పందిస్తూ, దగ్గరికి తీసుకోవడానికి కూడా ప్రయత్నించాడు. కాని తమ రాజకీయ ప్రయోజనాల కోసం దక్కన్ ముస్లిం రాజ్యాలు, శివాజీని ఒక పావుగా వినియోగించుకోవడం, ఆలంగీర్ పీక పట్టుకునేసరికి వారు శివాజీకి సహాయం ఆపి, అతనికి ఎదురుపడడం, అదేవిధంగా శివాజీ కూడా ఒకసారి మొగలుల తరఫునను, ఇంకొకసారి దక్కన్ రాజ్యాల తరఫున మొగ్గడం ఈ త్రిత్వం అంటే - మొగలు, దక్కన్-శివాజీల మధ్య ఏర్పడిన విభేదాలు రాజకీయమైనవే తప్ప, ధార్మికమైనవి ఎంతమాత్రం కావని రుజువు చేస్తున్నాయి. ఒకవేళ ఇవి ధార్మిక పరమైనవే అయివుంటే దక్కన్ ముస్లిం రాజ్యాలు, శివాజీకి ఎందుకు సహకరిస్తాయి? ధార్మికపరమైన కారణాలే అయివుంటే, ఔరంగజేబ్ శివాజీకంటే ముందు గోల్కొండ, బీజాపూర్‌ల పని ఎందుకు పడతాడు? మరాఠాలు, శివాజీ కూడా హిందువులకు ప్రాతినిధ్యమే గనక వహిస్తుంటే, వారికి వ్యతిరేకంగా రాజాజైసింగ్, ఇంకా ఇతర రాజపుత్ర సైన్యాధికారులు, సైనికులు - అంతేకాదు స్వయంగా మరాఠా సర్దారులు శివాజీకి వ్యతిరేకంగా ఔరంగజేబ్‌ను సమర్థిస్తూ రంగంలోకి ఎన్నటికీ దిగేవారు కాదు. మరాఠాలు హిందూ పక్షపాతులు, హిందువుల్ని సుసంఘటిత పరిచే లక్ష్యమే గల వారైతే 'జావలీ'కి చెందిన హిందూ రాజు జస్వంత్ రావు (చందర్‌రావు) మరియు అతని కుమారుల్ని, చంపించి, అతని రాజ్యాన్ని కైవసం చేసుకునేవారే కాదు (న్యూ హిస్టరీ ఆఫ్ మరాఠాస్, జి.ఎస్. దేశాయ్, వా-1, పేజి 111-113, సర్కార్-వా-4, పే.21,22) కోన్‌దానా కోటలో జొరబడి, పన్నెండు వందల మంది రాజపుత్ర సైనికుల్ని ఊచకోత కోసేవారే కాదు, (వా-4, పేజి 143). కనారా, తంజూర్ మరియు కర్ణాటక లాంటి హిందూ ప్రాంతాల్ని దోచుకొని కొల్లగొట్టే వారే కాదు. మరాఠాలు, శివాజీయే గనక హిందూ స్వరాజ్య స్థాపనలో నిమగ్నులై ఉంటే, దక్కన్‌కు చెందిన గొప్ప జమీందారు, మరాఠా సర్దారు బాజామి నాయక్ నింబాల్‌కర్, శివాజీ అల్లుడు మహద్‌జీ తండ్రి (వియ్యంకుడు) తమ కుటుంబ సభ్యులతో సహా వెళ్ళి ఔరంగజేబ్ పక్షంలో చేరేవారే

కాదు (హి.ఆ.ఔ. –జ.నా.స, వా–4, పేజి 165). అహ్మద్‌నగర్, జనార్ మరియు పరిందా పరిసరాల్లోని ఏభై ఒక్క గ్రామాల్ని దోచుకుంటున్నప్పుడు, సూరత్ పట్టణాన్ని దోచుకొని దానికి నిప్పంటించినప్పుడు (వా–4, పేజి 49 & 151). ఈ గ్రామాల్లో పట్టణాల్లో ముస్లింలే కాదు, అత్యధిక సంఖ్యలో హిందువులే ఉంటారనే విషయం మరాఠాలకు తెలియదా? సిల్హార్ (కోట) ముట్టడిలో రాఠీరి అమర్‌సింగ్, అతని ముప్పయి మంది సైనిక అధికారుల్ని బంధించి అతని వేలాది మందిని హతమార్చారు. (వా–4, పే.160) శివాజి ప్రధానమంత్రి అయిన 'మోరో ట్రింబక్" కోలీ రాజైన విక్రం షాహ్ ప్రాంతాన్ని కొల్లగొట్టి పదిహేడు లక్షల రూపాయల్ని దోచుకుపోయాడు. ఇంకా అతని నుండి జౌహర్‌ను లాగేసుకున్నాడు. కోలీకి చెందిన ఇంకొక రాజ్యమైన రాంనగర్‌ను ఆక్రమించుకున్నాడు. (వా–4, పే.161) ఇంకా పిండోలి, తదితర ప్రాంతాల్ని ఆక్రమించుకున్నాడు. 1670 చివరలో శివాజీ బిరారు ప్రాంతంలోని ప్రఖ్యాత వాణిజ్య నగరం "కారింజా"ను దోచుకున్నాడు. అకోలా జిల్లాకు చెందిన ఇదో చిన్న నగరం. ఈ నగరంలో జైనమతానికి చెందిన వారు అత్యధిక సంఖ్యలో ఉండేవారు. ఆ కాలంలో జైన వర్తకులకు ఈ నగరం కేంద్రంగా ఉండేది. కారింజాకు చెందిన జైనులు అత్యంత ధనికులు. ఇక్కడ అత్యధికంగా జైన వర్తకుల్నే దోచుకోవడం జరిగింది. నేటికీ జైనమతం వాళ్ళు అక్కడున్నారు.

కారింజా దోపిడీలో దొరికిన వస్తు సముదాయం అనగా విలువైన వస్త్రాలు, వెండి, బంగారాలు మొదలుగాగలవి నాలుగువేల ఎద్దులు, గాడిదలపై మోపి తీసుకుపోవడం జరిగింది. ఆ కాలంలో దాని విలువ కోటి రూపాయల వరకుండేది. శివాజీ విధించిన షరతు లపై సక్రమంగా నడవడానికి అక్కడి ధనికులందర్ని బంధించి తీసుకువెళ్ళడం కూడా జరిగింది. (తారీఖె హింద్ కా ఇన్‌ఖిలాబి కిర్దార్, శివాజి–(ప్రొఫెసర్ ఎం.కె. షాజ్లి–పే.269) (హి.ఆ.ఔ.–సర్కార్, వా.4,పే.155).(శివ్‌షాహి–యం.యం. దేశ్‌ముఖ్, పేజి 50)

సూరత్ నగర దోపిడీని విదేశీ చరిత్రకారులతో సహా ప్రాచీన, ఆధునిక చరిత్రకారు లందరూ పేర్కొన్నారు. ఆ కాలంలో సూరత్ నగరం దేశ, విదేశీయ వ్యాపారులకు కేంద్రంగా ఉండేది. కేవలం విదేశీ వ్యాపారుల నుండే ప్రభుత్వానికి సంవత్సరానికి దాదాపు (12) లక్షల ఇంపోర్ట్ టాక్సు లభించేది. ఈ దోపిడీలో హిందూ– ముస్లిం అనే తారతమ్యం లేకుండా ఆ నగర ధనికులందరినీ దోచుకోవడం జరిగింది. ఇద్దరు ప్రముఖ హిందూ వర్తకుల్లో ఒకరి వద్ద దాదాపు (30) బ్యారెల్ల బంగారం లభించింది. ఇంకొకడు బహర్‌జీ భూరా. అతనప్పుడు దేశమంతటిలో ప్రఖ్యాతిగాంచిన వర్తకుడు. అతని నివాసం నుండి దాదాపు (28) శేర్ల తూకం గల అత్యంత విలువైన పెద్ద పెద్ద ముత్యాలు లభించాయి. ఇదేకాకుండా దాదాపు (40) శేర్ల తూకం గల వజ్రాలు, రత్నాలు కూడా దోచుకోవడం జరిగింది. అప్పుడు వాటి విలువ కట్టడం కూడా అసాధ్యమై ఉండేది. అవన్నీ దోచుకున్న తరువాత మరాఠాలు ఆ వర్తకుని భవనానికి నిప్పంటించారు. (తారీఖ్–ఎ–హింద్ కా ఇంఖిలాబి కిర్దార్, శివాజి – ప్రొ. ఎం.కె. షాజ్లి, పేజి–192,) (హి.ఆ.ఔ.– సర్కార్, వా.4, పేజి–50) పైవారంతా హిందువులే కదా!

ఇంకా శివాజీ కాలంలోనూ, ఆ తరువాత సాంభాజీ, సాహూజీ కాలాల్లోను జరిపిన దోపిడి దౌర్జన్యాల్ని వివరంగా వర్ణించడానికి మా మనసొప్పడం లేదు. చరిత్రలో జరిగిన అనేక విషాద గాధలను వివరించడం వల్ల ఒరిగేదేమీ లేదు. బార్గీ సైనిక దాడుల్లో జరిగిన అతి హేయమైన సంఘటనలను వివరించడమూ సాధ్యం కాదు. కావాలనుకుంటే జాదునాద్ సర్కార్ వ్రాసిన The Fall of Moghal Empire. Vol.4 ను చదవండి. చరిత్ర ఒక ముడి సరుకు వంటిది. దానితో విద్వేషాల అగ్ని రాజేయనూవచ్చు, సామరస్యపు పరిమళాలను వికసింప జేయనూవచ్చు. చరిత్రలో ఔరంగజేబ్‌కు జరిగినంత అన్యాయం మరెవ్వరికీ జరగలేదు. అతని అంత దురదృష్టవంతుడు చరిత్రలో మరొకడు కానరాడు.

ఇక హిందూ వ్యతిరేకిగా ముద్రపడి పోయిన ఔరంగజేబ్ గురించి విశ్లేషిద్దాం.

అతనేగనక ముస్లిం పక్షపాతి, ఇస్లాం ధ్వజవాహకుడు, ముస్లిం ప్రయోజనాల్ని మాత్రమే కాపాడేవాడు అయివున్నట్లయితే, గోల్కొండ, బీజాపూర్ లాంటి ముస్లిం రాజ్యాల్ని ఎందుకు సమాప్తం చేసేస్తాడు? అతను హిందూ వ్యతిరేకి అయినప్పుడు రాజపుత్ర, మరాఠా నాయకుల్ని ఎందుకు చేరదీసేవాడు? వారినెలా విశ్వసించేవాడు? తన కీలక యుద్ధాల బాధ్యతల్ని వారికెలా అప్పగించేవాడు? ఒక్క ముస్లింల విద్రోహాల్నే కాదు, ఇతర హిందూ, మరాఠా విద్రోహాల్ని అణచడానికి సైతం హిందూ రాజపుత్ర నాయకుల్ని ఎలా పంపించేవాడు? ఇవన్నీ చరిత్రలో దాచేస్తే దాగని వాస్తవాలు. ఔరంగజేబే గనక ముస్లిం పక్షపాతి అయివుంటే, గోల్కొండ, బీజాపూర్ ముస్లిం రాజులు కర్ణాటక హిందూ రాజుపై దండెత్తివెళ్ళినప్పుడు, హిందువయిన కర్ణాటక రాజును ఎందుకని సమర్థిస్తాడు? అతను హిందూ వ్యతిరేకికాదు, శివాజీని మరాఠాల్ని నామరూపాల్లేకుండా చేయడం అతని ఉద్దేశమూ కాదు, మరాఠాలు మొగలు ప్రాంతాల్ని కొల్లగొట్టడం, ఆక్రమించడం చేసినప్పుడు శక్తిమంతుడైన ఒక చక్రవర్తి తన రాజ్యంలో జరుగుతున్న అరాచకాల్ని, అక్రమాల్ని చూస్తూ చూస్తూ ఎలా ఊరకుండగలుగుతాడు? ఈ పరిస్థితిని, ఈ వాస్తవాలను రాజపుత్రరాజులు, సేనానులు, ఇతర మరాఠా సర్దారులు గమనిస్తున్నారు. అందుకే వారు ఔరంగజేబ్‌ను మనఃపూర్వకంగా సమర్థించారు. ఇదొక సెక్యులర్ యుద్ధం. ధర్మాలకు, మతాలకు, జాతులకు దీనితో ఎలాంటి సంబంధం లేదు. అందుకని ఔరంగజేబ్ మరియు శివాజీల మధ్య జరిగిన యుద్ధాల్ని ధార్మికమైనవి, జాతిపరమైనవి అనడం శుద్ధ పొరపాటు, నిర్హేతుకం, అర్థరహితం. అవి కేంద్ర ప్రభుత్వం మరియు ప్రాంతీయ శక్తులకు మధ్య జరిగిన యుద్ధాలు మాత్రమే! అప్పటివాళ్ళు వీటిని అదే దృష్టితో చూశారు. అందుకే శివాజీకి వ్యతిరేకంగా మరాఠాలు, రాజపుత్రులు ఔరంగజేబ్‌ను సమర్థించగా, ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా బీజాపూర్, హైద్రాబాద్ వాళ్ళు శివాజీని సమర్థించారు. వాటిలో ధర్మానికి, ధార్మిక నీతికి ఎలాంటి ప్రమేయం లేదు. ఆంగ్లేయులు భారతదేశాన్ని ఆక్రమించుకున్న తరువాత, ఈ రెండు వర్గాల్ని (అనగా

హిందూ-ముస్లింలను) శాశ్వతంగా దూరం చేసే ఉద్దేశ్యంతో, "విభజించి పాలించు" అనే నీతి క్రమంలో చరిత్ర వక్రీకరణ ప్రారంభించారు. అలా వక్రీకరించిన చరిత్రనే మనం ఆకాశం నుండి అవతరించిన దివ్యవాణిగా భావించి, పరస్పరం అర్ధరహితమైన, ఆధారం లేని విద్వేషాలకు గురయ్యాము. ఈ అధ్యాయంలో అక్కడక్కడ ఆంగ్లేయ చరిత్రకారులు రాసిన చరిత్ర గ్రంథాల నుండి కొన్ని పేరాగ్రాఫ్‌లు కోట్ చేసి చూపించాము. సమకాలీన చరిత్రకారుల మరియు ఈ ఆంగ్లేయ చరిత్రకారుల వాంఙ్మూలాల్లో ఎలా భిన్నత్వం ఉందో, వారొక ప్రత్యేక పాలసీని దృష్టిలో పెట్టుకొని చరిత్రను ఎలా వక్రీకరించారో, కొన్ని పదాల్ని మాత్రమే తారుమారుచేసి, చరిత్రను తమకిష్టమైన దిశలో ఎలా మార్చారో, చూపిస్తూ వచ్చాము. సమకాలీన చరిత్ర గ్రంథాలు అప్పటి ప్రభుత్వ భాషఅయిన పర్షియన్‌లో ఉన్నాయి. బ్రిటిష్ వారు వచ్చి ఒక్క కలం పోటుతో పర్షియన్‌ను తీసేసి, దాని స్థానంలో ఇంగ్లీషును ప్రవేశపెట్టారు. చరిత్ర విద్యార్థులకోసం, తమకిష్టమైన రీతిలో చరిత్ర గ్రంథాల్ని ఇంగ్లీష్‌లో ప్రాంతాయ భాషల్లో రూపొందించి, రాబోతున్న భవిష్యత్ యువతరాల మనోమస్తిష్కాల్ని విషపూరితం చేసేశారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇలాంటి వక్రీకరించిన చరిత్ర గ్రంథాల ప్రక్షాళనం చేయడం మన ప్రభుత్వాల బాధ్యత. కాని వాటిని ప్రక్షాళనం చేయడానికి బదులు ఇంకా దాన్ని వికృత పరచడానికి ప్రయత్నించడం విడ్డూరం, బాధాకరం. అలా చేయడం ద్వారా ప్రజల్లో దూరాలు, అగాధాలు పెరిగిపోయి సమైక్య భారత జాతి నిర్మాణంలో అవరోధాలు ఏర్పడతాయనే విషయం వారికి తెలియదా? ఇలా చేసి వారేమీ సాధించదలచుకున్నారో, ఆ పాలక వర్గాలకే తెలియాలి. మొత్తానికి మరాఠాలు, శివాజీ మరియు ఔరంగజేబ్‌ల మధ్య జరిగిన ఘర్షణలు, యుద్ధాలు ధార్మికమైనవి ఎంతమాత్రం కావని మేము నిరూపిస్తూ వచ్చాము. ఈ మాట కేవలం మేమనడమే కాదు, నిష్పక్షపాతులు, న్యాయప్రియులూ అయిన చరిత్రకారులు - ఉదాహరణకు డా. బిషంబర్ నాథ్ పాండే, బి.డి. బోసు, రొమిల్లా థాపర్, డా.కె.కె. దత్త, డా.సతీష్ చంద్ర, డా. హరిబంస్ ముఖియ, డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, డా. బిపిన్ చందర్ లాంటి అనేకమంది ఆధునిక చరిత్రకారులు కూడా ఇదే అంటున్నారు.

ఉదాహరణకు డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే ఏమంటున్నారో పరిశీలిద్దాం. "డాక్టర్ అబ్దుల్ ముగ్ని" రూపొందించిన 'ఔరంగజేబ్' అనే పుస్తకానికి రాసిన పీఠికలో ఆయనిలా పేర్కొన్నారు.

"శివాజీ ధార్మిక పాలసీకి సంబంధించినంత వరకు, బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో భారత దేశంలో ప్రభుత్వ దస్తావేజులు భద్రపరిచే శాఖ (అదే ప్రస్తుతం నేషనల్ ఆర్క్యాజ్‌గా రూపాంతరం చెందింది) లో సంరక్షకుడుగా పనిచేసిన ఎ.ఎఫ్.ఎం. అబ్దుల్ అలీ గారికి శివాజీ చరిత్రపట్ల బాగా అవగాహన ఉండేది. ప్రాచీన దస్తావేజుల ఆధారంగా ఆయనిలా రాశారు : 'మధ్యరకం విద్యాజ్ఞానాలు కలిగిన సామాన్య ముస్లింలు, శివాజీ ఇస్లాం మరియు ముస్లింల శత్రువని,

భారతదేశంలో అతను హిందూ రాజ్యాన్ని స్థాపించ ప్రయత్నించాడని భావిస్తారు. శివాజీ విషయంలో నేను పరిశీలన జరిపాను. గనక శివాజీకి సంబంధించి సామాన్య ముస్లింలలోనున్న ఈ భావన శుద్ధ పొరపాటు అనే నిర్ణయానికి వచ్చాను. శివాజీలో ధార్మిక పక్షపాతం, లేక ద్వేషం అసలే లేకుండేది. అతని పరిపాలనలో లేక రాజ్యంలో హిందూ ముస్లిందిద్దరికి సమాన హక్కులుండేవి. అతని రాజ్యంలో అన్ని ధర్మాలకు చెందిన ప్రజలు శాంతి, సౌభ్రాతృత్వాలతో ఉండేవారు. ఇంకా ప్రభుత్వం తరఫున హిందూ ముస్లింలలో ఎలాంటి భేదం పాటించబడేది కాదు." (ఆలంగీర్‌నామ, 1968, పేజి 366)

శివాజీ పాలసీకి, ప్రవర్తనకు సంబంధించి ఖాఫి ఖాన్ అతని ప్రామాణికమైన చరిత్ర కారునిగా భావించబడుతాడు. ఖాఫి ఖాన్ తండ్రి శివాజీకి సమకాలీనుడు. శివాజీ గతించిన పదమూడు సంవత్సరాల తరువాత, ఖాఫి ఖాన్ స్వయంగా మొగలు చక్రవర్తి ప్రభుత్వ సిబ్బందిలోని ఒక సభ్యుని రూపంలో సూరత్, అహ్మద్‌నగర్ మరియు మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో పనిచేశాడు. అతను తన ప్రఖ్యాత చరిత్ర గ్రంథం "శివాజీ జీవిత చరిత్ర"లో శివాజీ గురించి ఇలా రాశాడు : "శివాజీ కొత్త కొత్త కోటల్ని నిర్మించాడు. అతని సైన్యంలో ముస్లింలు అత్యధిక సంఖ్యలోనే ఉండేవారు. సిద్ది హిలాల్, సిద్దిబిలాల్ అతని మంచి సైనికాధికారుల్లో పరిగణింప బడేవారు. అతని నావికాదళ కమాండర్లలో అనేకమంది ముస్లింలున్నారు. అతను తన సైనికుల కోసం ఒక నియమాన్ని ఏర్పాటు చేశాడు, దాని ననుసరించి యుద్ధ సందర్భంలో వారెక్కడికి వెళ్ళినా దివ్య ఖురాన్, మసీదులను అవమానించ రాదని ఆదేశించాడు. ఎక్కడైనా దివ్య ఖురాన్ ప్రతి ఏదైనా వారి చేతిలోపడితే, ఆదేశానుసారం వారు దాన్ని శివాజీకి అప్పగించేవారు. ఇంకా శివాజీ అట్టి ప్రతిని అత్యంత గౌరవ మర్యాదలతో తన వద్ద నున్న ఎవరో ఒక ముస్లిం అధికారికి కానుకగా ఇచ్చేసేవాడు."

ఇంకొక ముస్లిం చరిత్రకారుడు బషీరుద్దీన్ అహ్మద్ "బీజాపూర్ చరిత్ర" అనే తన గ్రంథంలో ఖాఫి ఖాన్ వాంజ్మూలాన్ని ధృవీకరించాడు. అతనిలా వ్రాశాడు : "శివాజీ ఒక మంచి మనిషి. ఆయన దివ్య ఖురాన్‌ను అత్యంతగా గౌరవించేవాడు, మసీదులను పవిత్ర మైనవిగా గుర్తించి వాటిని గౌరవించేవారు, స్త్రీలు పిల్లల పట్ల ఆయన ప్రవర్తన శ్లాఘించదగినదిగా ఉండేది. భారతీయ చరిత్రలో శివాజీ ఎప్పటికీ సజీవంగా ఉంటారు. ఎవరైతే శివాజీ జీవిత చరిత్రను అధ్యయనం చేశారో, ఆయనెంతటి స్ఫురద్రూపి, వివేకి, ధీరుడు మరియు కష్టించి పనిచేసే మనిషో తెలుసుకుంటారు. దూరదృష్టి, గ్రహణశక్తి, ఆత్మాభిమానం, బుద్ధిసూక్ష్మత, వివేకము, ధైర్యము, పౌరుషము ఆయనలోని సహజ గుణాలు. అవివేకులైన కొంతమంది ఆయన్ను బందిపోటుగా, దోపిడీదారుగా, మోసకారిగా పేర్కొంటారు. కాని ఆయన జీవితం మనకు ఇంకోరకంగా కనబడుతుంది. దోపిడీ దౌర్జన్యాలు, గృహదహనాలు ఆ కాలంలో సర్వసామాన్యంగా జరుగుతుండేవి. శత్రువును మోసగించటమనేది అప్పుడు సర్వసామాన్యము. నేటి రాజకీయాల్లో వీటిని డిప్లొమెసీ అంటున్నారు. 35 సంవత్సరాల వరకు శివాజీ ఇటు మొగలులతోను, అటు బీజాపూర్ సుల్తానులతోనూ తన శక్తిని మెప్పించుకున్నారు. 1680లో ఆయన పరమపదించారు."

రత్నగిరి జిల్లాలోని బంకోట్ గ్రామంలో ఉండే "బాబా యాఖూత్" పేరుగల ఒక ముస్లిం గురువుకు, శివాజీ అత్యధిక భక్తివిశ్వాసాలు గల శిష్యుడనేది ప్రఖ్యాతి గాంచిన విషయం. ఆయన సైన్యంలోనే కాదు, పరిపాలన విభాగంలో కూడా అనేకమంది ముస్లింలు ఉన్నత హోదాలపై నియుక్తులై ఉండేవారు. మున్షి ఖాజి హైదర్ ఆయనకు ప్రైవేటు సెక్రటరీగా ఉంటుండే వారు. శివాజీకి సంబంధించిన రాజముద్ర, అత్యంత రహస్యమైన (Confidential) దస్తావేజులు, కాగితాలు ఆయన రక్షణలోనే ఉండేవి. శివాజీ గతించిన తరువాత ఈయన డిల్లీ దర్బారులో ముఖ్యఖాజీగా నియుక్తులయ్యారు."

ప్రఖ్యాత విద్వాంసి కాశీనాథ్ తిలంగ్ ఓ వ్యాసంలో ఇలా వ్రాశారు : "మందిరాలను, మఠాలను సంరక్షించినట్లే శివాజీ మసీదులకు, ముస్లిం మఠాలను, (ఖాన్‌ఖాహ్) ముస్లిం ఆధ్యాత్మిక గురువులకు ప్రభుత్వం తరఫున లభించే ఆర్థిక సహాయాన్ని యథాతథంగా కొనసాగించారు. ఈ సందర్భంలో ఆయన ఎందరో డచ్, ఇటాలియన్ మరియు పోర్చుగీసు గ్రంథకర్తల రెఫరెన్సులు ఇచ్చారు. శివాజీ పేరుతో స్వయంగా ఔరంగజేబ్ రాసిన ఐదు లేఖలు నేటికీ ఉన్నాయి. ఈ అన్ని ఉత్తరాల్లో ఔరంగజేబ్ శివాజీని "మతీవుల్ ఇస్లాం" (అంటే ఇస్లాం విధేయుని)గా పేర్కొన్నారు. ఇలాంటి ఎన్నో సాక్ష్యాలున్న తరువాత శివాజీని ముస్లింల వ్యతిరేకిగా ఎలా చెప్పగలుగుతాము? అంతేకాకుండా శివాజీ రాసిన ఉత్తరాల్లో నుండి, ఒక ఉత్తరంలో ఆయన ఔరంగజేబ్‌కు ఇలా రాశాడు : "అల్లాహ్ కేవలం ముస్లింలకే కాదు, సకల లోకాలకు ప్రభువు, ఆయన కారుణ్యం కేవలం ముస్లింలపైనే కాదు, సర్వజగత్తుపై వ్యాపించి ఉంది. తమరి ముత్తాత అక్బర్ చక్రవర్తి హిందూ-ముస్లింలలో ఎలాంటి భేదభావాన్ని పాటించలేదు. అందుకే ఆయన ప్రభుత్వం యాభై ఏళ్ళ వరకు కొనసాగింది. దీనితో ప్రజలెంతో లాభపడ్డారు." (ఔరంగజేబ్ - డా. అబ్దుల్ ముగ్నీ - దీనికి డా. బిషంబర్ నాథ్ పాండే రాసిన పీఠిక నుండి, పే. 12-16 గ్రహీతం).

శివాజి తన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకునే సందర్భంలో మొగలులతో, బీజాపూర్, గోల్కొండ వారితో ఎన్ని యుద్ధాలు చేసినా, అవి హిందూ-ముస్లిం సంబంధాలపై ప్రత్యేకించి శివాజీ మరాఠాలు మరియు ముస్లింల సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని, అంతేకాకుండా స్వయంగా శివాజీ సైన్యంలో అత్యధికమంది ముస్లిం సైనికులు, సమర్థులు, యోగ్యులు అయిన సైన్యాధికారులూ ఉండేవారని, ఈ విధంగా ముస్లింలతో శివాజీకి సన్నిహిత సంబంధాలుండేవని తెలుపుతూ **"అఖ్‌లేష్ జైస్వాల్"** తన గ్రంథంలో ఇలా పేర్కొన్నారు : "పై వివరాల ప్రకారం శివాజీకి ముస్లింలతో ఎంతో సన్నిహిత సంబంధాలుండేవి. ఈ విధంగా కొందరు చరిత్రకారులు శివాజీపై ముస్లిం వ్యతిరేకి అని ఏ నిందలైతే మోపారో, అవన్నీ కూడా అర్థరహితం, నిరాధారమైనవి. ఇక శివాజీ మరియు మొగలుల మధ్య జరిగిన ఘర్షణలు కూడా పూర్తిగా రాజకీయపరమైనవి మాత్రమే. ధర్మాలకు అందులో ఎలాంటి ప్రమేయం లేదు.

శివాజీ తన వ్యక్తిగత జీవితంలో ఔరంగజేబ్‌ను అత్యధికంగా గౌరవించేవాడు. వీరిద్దరిలో పరస్పరం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరుగుతుండేవి. ఒకరిపట్ల ఇంకొకరు శ్రేయాన్ని సంక్షేమాన్ని

కోరుకుంటుండేవారు. ఔరంగజేబ్ మరియు శివాజీల మధ్యగల సత్సంబంధాలకు ఒక చక్కటి నిదర్శనం శివాజీ చనిపోయినప్పుడు ఔరంగజేబ్ పంపిన సంతాప సందేశపు లేఖ రూపంలో బయల్పడుతుంది. ఆ సందేశంలో ఔరంగజేబ్ ఇలా వ్రాశాడు: "శివాజీ ఒక మహోన్నత సైన్యాధిపతి. ఒక క్రొత్త రాజ్య నిర్మాణపు ఆవశ్యకతను బయల్పరిచింది అతనొక్కడే. దానికి భిన్నంగా నేను భారతీయ, ఈరానీ రాష్ట్రాల్ని (రాజ్యాల్ని) సమాప్తం చేయడంలో (ఒకే దేశంగా మార్చడంలో) నిమగ్నమై ఉన్నాను. ఎడతెగకుండా పందొమ్మిద సంవత్సరాల (1660-1679) వరకు శివాజీకి వ్యతిరేకంగా సైనిక దాడులు చేపట్టినప్పటికీ అతని ప్రాంతం విస్తరిస్తూనే పోయింది." (డాక్టర్ ఆర్.సి. మజుందార్).

డాక్టర్ ఆర్.సి. మజుందార్ ద్వారా సమర్పించబడిన పై రెఫరెన్సులో మొగలు చక్రవర్తి ఔరంగజేబ్ ద్వారా పంపబడిన సంతాప సందేశంలో ఒక వైపు శివాజీ ఔన్నత్యం, అతని వీరశూరత్వాలు బయల్పడుతుంటే, వేరొకవైపు ఈ సంతాప సందేశాన్ని పంపిన ఔరంగజేబ్ హృదయ విశాలత, తన శత్రువు పట్ల అతను చూపిన గౌరవాభిమానాలు ప్రస్ఫుటమవు తున్నాయి."

తన వ్యక్తిగత జీవితంలో శివాజీ నిస్సందేహంగా ఒక సహన శీల స్వభావి, ధార్మికుడు, విధిపట్ల నిబద్ధత గలవాడు, దేశ ప్రేమికుడు, స్త్రీలను అతను అత్యధికంగా గౌరవించేవాడు. స్త్రీల పట్ల, వారెవరైనా సరే, అతను చూపే గౌరవం, ఆదరాభిమానాలకు ఒక ప్రత్యక్ష నిదర్శనం ఉంది. ఒకసారి కోన్‌కణ్ ప్రాంతంలోని కల్యాణ్‌కు చెందిన ఒక ముఖ్య నాయకుడు, అధికారి అయిన ముల్లా అహ్మద్ నాయతీ కోడలును శివాజీ సైనికులు బంధించి తీసుకువచ్చి, ఈ అందమైన స్త్రీని శివాజీకి కానుకగా సమర్పించారు. ఆమెను చూడగానే "ఆమెను తెరచాటున ఉంచండ"ని శివాజీ ఆజ్ఞాపించాడు. తరువాత ఆమెను సంబోధిస్తూ, "ఒకవేళ నా తల్లి కూడా నీలాగే అందంగా ఉంటే నేను కూడా అందంగా ఉండేవాణ్ణి" అని పలికాడు. ఆ తరువాత ఆమె వద్ద నుండి లాక్కున్న సర్వ సంపదను, వస్తువుల్ని ఆమెకు ఇచ్చేసి, సకల గౌరవ మర్యాదలతో ఆమె తల్లిదండ్రుల వద్ద చేర్చండ"ని ఆదేశించాడు. స్త్రీల పట్ల శివాజీకి గల భక్తి గౌరవాలు, ఆదరాభిమానాలకు ఇదో మచ్చు తునక. ఈ విధంగా శివాజీ సచ్ఛీలవర్తనం గల వ్యక్తి అనడంలో ఎలాంటి సందేహం లేదు. మహోన్నత యుద్ధవీరుడు, ఆరితేరిన రాజకీయవేత్త, అనుభవశీలుడైన తంత్రజ్ఞుడు, అనుకూల లేక వ్యతిరేక పరిస్థితుల్లో కష్టించి పనిచేసే శ్రమ జీవి. కాని ఔరంగజేబ్‌తో అతన్ని పోల్చడం, ఇంకా ఔరంగజేబ్‌కన్నా అతను మహోన్నతుడనడం యదార్థం అనిపించుకోదు. ఇలా భావించడం కేవలం జాత్యాహంకారం అనబడుతుంది." (హిందువోంకె సాథ్ ఔరంగజేబ్ కె తాల్లుఖాత్- (హిందువులతొ ఔరంగజేబ్ సంబంధాలు-అఖ్‌లేశ్ జైస్వాల్, పేజి-82,83).

చరిత్రను లోతుగా అధ్యయనం చేస్తే కొన్ని విషయాలు చాల విచిత్రంగా కనబడతాయి.

ఉదాహరణకు ఔరంగజేబ్ - శివాజీల మధ్య వ్యతిరేకత ఎందుకు వచ్చింది? ఔరంగజేబ్ తన కాలంలో సామంత రాజ్యాలన్నింటినీ సమాప్తం చేశాడా? చరిత్ర దానికి

కాదనే సమాధానం ఇస్తుంది. అతని కాలంలో రాజా జైసింగ్ ఉన్నాడు, రాజా జస్వంత్ సింగ్ ఉన్నాడు, రాణా రాజ్ సింగ్ అతని సంతానమూ ఉన్నారు. వీరే కాకుండా ఇంకెంతో మంది సామంత రాజులున్నారు. అంతెందుకు శివాజీకి సోదరుడు తంజావూర్ రాజు వెన్క్యాజీ, ఆ తరువాత అతని కుమారుడు రాయె భాన్ ఉన్నారు. వీరందరి రాజ్యాల్ని ఔరంగజేబ్ సమాప్తం చేయలేదు. అయితే వీరంతా తమ సామంతాన్ని, అతని సార్వభౌమత్వాన్ని స్వీకరించారు. కాని శివాజీ అతని సార్వభౌమత్వాన్ని అంగీకరించటానికి ఇష్టపడలేదు. స్వతంత్రంగా ఉండదలిచాడు. ఇంకా మొగలు ప్రాంతాలపై దాడులు జరిపి, దోపిడీ దోపకాలకూ పాల్పడ్డాడు. అక్కడే వీరిద్దరికి వ్యతిరేకత వచ్చింది.

రెండవ విషయం గోల్కొండ, బీజాపూర్ రాజ్యాలు సమాప్తమైన తరువాత తిరిగి ఆ రాజ్యం, లేక వంశం పేరే చరిత్రలో కనిపించదు. అవి మొగలు సామ్రాజ్యంలో పూర్తిగా విలీనమైపోయాయి. కాని మరాఠాల విషయం దీనికి భిన్నం అనిపిస్తుంది. శివాజీ చనిపోయిన తరువాత, సాంబాజీ పట్టుబడి చంపబడిన తరువాత, సాంబాజీ భార్యాపిల్లలు తన అధీనంలోకి వచ్చిన తరువాత కూడా శివాజీ రాజ్యాన్ని ఔరంగజేబ్ అలాగే ఉండనిచ్చాడు. ఇంకా శివాజీ రాజ్యానికి సాహూను (శివాజీ మనుమణ్ణి) వారసునిగా నియమించాడు. (New History of Maratas, G.S. Sir Desai, Vol.1, p.63) – అందుకే సాహూ విడుదల అయిన వెంటనే పట్టాభిషిక్తుడయ్యాడు. అంటే ఔరంగజేబ్ మరాఠాల రాజ్యాన్ని పూర్తిగా నామరూపాల్లేకుండా (గోల్కొండ, బీజాపూర్‌ల లాగా) సమాప్తం చేయదలచుకోలేదా? మరాఠాలు తనకు విధేయులుగా, సామంతులుగా ఉండాలని మాత్రమే కోరుకున్నాడా?

ఇంకొక విషయం ఏమిటంటే గోల్కొండ గాని, బీజాపూర్ గాని అవి వంశానుగతమైన రాజ్యాలు. ఆ రాజ్యాలు సమాప్తమైన తరువాత మరాఠాల్లాగా అవి తిరిగి విజృంభించలేదు. తిరిగి పునరుద్ధరింపబడలేదు. ఆ రాజ్యాల్లోని అత్యధిక మంది ఉన్నతాధికారులు, సైన్యాధికారులు మొగలు రాజ్య ఉద్యోగంలో చేరిపోయారు. అందుకని ఆ రాజ్యాల్ని పునరుద్ధరించేవారు లేకపోయారు. ఇక ఆ రాజ వంశాల్లో తమ రాజ్యాల్ని పునరుద్ధరించు కునేంత శక్తి సామర్థ్యాలు లేవు. అందుకే అవి భారతీయ చరిత్ర నుండి కనుమరుగైపోయాయి.

కాని మరాఠాలకు సంబంధించి పరిస్థితులు వేరుగా కనబడతాయి. శివాజీ, సాంబాజీ చనిపోయిన తరువాత కూడా మరాఠాల్లో తమ జాతి, తమ రాజ్య భావన సజీవంగానే ఉంటూ వచ్చింది. మరాఠాల కోటలన్నింటినీ ఔరంగజేబ్ ఆక్రమించుకున్నప్పటికీ వారిలో జనించిన జాతీయ భావనను మాత్రం ఔరంగజేబ్ సమాప్తం చేయలేకపోయాడు. ఒక జాతిని ఓడించవచ్చు. దాని ప్రాంతాల్ని స్థావరాల్ని లోక్కోవచ్చు. కాని ఆ జాతి హృదయాల్లో ఏర్పడిన జాతీయ భావనల్ని సమాప్తం చేయడం సాధ్యం కాదని దీనితో నిరూపితమయింది. శివాజీ ఏర్పరచింది కూడా ఒక వంశపాలనే అయినప్పటికీ, దాన్ని తమ పాలన, తమ జాతీయ రాజ్యంగా మరాఠాలు భావించారు. శివాజీకి పూర్వం మరాఠాలది ఒక జాతీయ రాజ్యం ఏర్పడినట్లు చరిత్రలో కానరాదు.

మరాఠాల్లో ఒక జాతీయ భావనను ఏర్పరచడంలో శివాజీ కృతకృత్యుడయ్యాడు. అందుకే శివాజీ, సాంబాజీ గతించినప్పటికీ మరాఠాల్లో ఈ జాతీయ భావన ఏర్పడివున్న కారణంగా వారు తమ రాజ్యం కోసం, తమ స్వాతంత్ర్యం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ విధంగా శివాజీని మరాఠా జాతి నిర్మాత అనడం అక్షర సత్యం. శివాజీకి పూర్వం మరాఠా నాయకులు, సైనికులు, సైన్యాధికారులు బీజాపూర్, గోల్కొండ మొగలు రాజ్యాల్లో ఉండి, ఎంత పెద్ద హోదా లభించినప్పటికీ అది ఉద్యోగమే తప్ప స్వతంత్ర రాజ్యం అంటూ ఏర్పడి ఉండలేదు. మరాఠాల ఆ కలను శివాజీ నిజం చేసి చూపించాడు. రెండవ విషయం శివాజీ క్రింది నుండి, ఒక మామూలు జమీందారు స్థాయి నుండి వచ్చినవాడు. ప్రజలతో కలసిమెలసి తిరిగినవాడు. కనుక వంశపారంపర్యంగా రాజుల్లో, రాకుమారుల్లో ప్రజల పట్ల ఉండే చులకన భావన లేక ఆ రాచరిక పోకడలు అతనిలో రాలేదు. ఈ కారణంగా కూడా మరాఠా సామాన్య ప్రజలు అతన్ని అభిమానించారు. తమవానిగా అతన్ని గుర్తించారు. ఇంకా తమకు చేతనైన సహాయాన్ని అందించారు. పెద్దరికం, నాయకత్వం, రాచరిక పోకడలతో ప్రజలపై జరిగే అనేక హింసాదౌర్జ న్యాల్ని శివాజీ ఎదిరించిన, ప్రజల పక్షాన నిలబడిన ఉదాహరణలు అతని జీవితంలో ఎన్నో కనబడతాయి. ఈ విధంగా తన సామాన్య ప్రజల హృదయాల్లో అతను స్థానం ఏర్పరచుకున్నాడు. తత్ఫలితంగా మరాఠాల్లో తమ జాతి, తమ జాతీయ రాజ్యం అనే భావన ఏర్పడ గలిగింది. ఈ స్పృహ, ఈ భావనే ఆ తరువాత మరాఠాలు విజృంభించటంలో కీలక పాత్ర పోషించింది. ఔరంగజేబ్ తరువాత వచ్చిన అతని వారసులు శక్తిమంతమైనవారు కాదు. బలహీనులు. ఇక ఇటు మరాఠాల హృదయాల్లో శివాజీ రగుల్పొలిపిన జాతీయ భావన సజీవంగా ఉంది. ఇంకా అది సమయం కోసం ఎదురుచూస్తున్నది. ఎప్పుడైతే కేంద్రం బలహీనపడిందో, మరాఠాల హృదయాల్లో పెల్లుబుకుతున్న జాతీయ భావన ఒకేసారి బయల్పడింది. వారు తమ స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచుకోవడంలో కృతార్థులవడమే కాకుండా, తమ ప్రాంతం నుండి బయటపడి ఉత్తర భారతాన్ని గడ గడలాడించారు.

**ఔరంగజేబ్ దక్కన్‌లో ఇరుక్కుపోవడానికి కారణాలేంటి?**

ఉత్తర భారతాన్నంత తన సామంతం, తన అధీనంలోకి తెచ్చుకోగలిగిన ఔరంగజేబ్ మరి దక్కన్‌కు వచ్చి ఎందుకని ఇరుక్కుపోయాడు? దక్కన్‌లోని రెండు పెద్ద రాజ్యాలైన బీజాపూర్, గోల్కొండ మొగలులకు లోబడి సామంతులుగా ఉన్నా వారందులో విశ్వసనీయత చూపలేదు. పైకి మొగలులకు, ఔరంగజేబ్‌కు భయపడుతున్నట్లు నటించినా, లోపల మాత్రం మొగలులకు వ్యతిరేకంగా పని చేస్తుండేవారు. ప్రత్యేకించి మరాఠాలు శివాజీకి వారు అసామాన్యమైన సహాయాన్ని అందించేవారు. అది సరే, కాని ఈ రెండురాజ్యాల్ని సమాప్తం చేయడంలో కొన్ని కష్టనష్టాలకు గురిఅయినా తొందరగానే వాటిని సమాప్తం చేయగలిగాడు. కాని మరాఠాల వ్యవహారం మాత్రం అతనికి చివరికంటూ నిశ్చింతగా కూర్చుండనివ్వలేదు. ఔరంగజేబ్ దక్కన్‌లో ప్రదేశించక ముందే శివాజీ పరమపదించాడు. ఆ తరువాత సాంబాజీకి కూడా ఎక్కువ సమయం

లభించలేదు. ఆ తరువాత అతి కష్ట ప్రయాసలకు ఓర్చి అయినాసరే, ఔరంగజేబ్ మరాఠాల కోటలన్నింటిని, స్థావరాలన్నింటినీ వశపర్చుకోగలిగాడు. తమ కోటలు, స్థావరాలు పోగొట్టు కున్నప్పటికి కూడా మరాఠాలు తమ ఓటమిని అంగీకరించలేదు. అతన్ని నిశ్చింతగా కూర్చుండ నివ్వలేదు. చరిత్రను లోతుగా అధ్యయనం చేస్తే దీనికి రెండు ముఖ్య కారణాలు కనబడతాయి. ఒకటి మొగలు దర్బారు నాయకుల్లో, సైన్యాధికారుల్లో అంతర్విభేదాలు అసూయ, ద్వేషాలు బయల్పడడం. రెండవది మరాఠాల గెరిల్లా వార్ పద్ధతి మరియు వారిలో ఉత్పన్నమైన మరాఠా జాతీయ భావన. (హిందూ జాతీయ భావన అనేది తరువాత సృష్టించబడింది. అలాకాకుండా మొదటి నుండే హిందూ జాతీయ భావనేగనక ఉంటే వారు అనేక హిందూ రాజులు, పరిపాలకుల రాజ్యాల్ని బలవంతంగా కబళించేవారు కాదు). మొత్తానికి ఈ మరాఠా జాతీయ భావన మరియు గెరిల్లావార్ పద్ధతి మొగలుల్ని, మొగలు సైన్యాల్ని చికాకు పరచింది. చిర్రెత్తించింది. మొగలు సైన్యంలోని వివిధ జాతులు, అనగా ఈరానీలు, తోరానీలు, అఫ్గన్లు, రాజపుత్రులు, బుందేలా మొదలగు వారు వీరులు, శూరులు అయినప్పటికీ వారు ముఖాముఖి పోరాటం చేసే వారే తప్ప ఈ గెరిల్లా వార్ పద్ధతి వారికి కొత్త. అడవులు, కొండలు, గుట్టల మీది నుండి అకస్మాత్తుగా విరుచుకుపడి, అపార నష్టం కలిగించి, వెంటనే తప్పించుకుపోయే యుద్ధ పద్ధతిని వారింత వరకు ఎరుగరు, మరాఠాలకు తమ బలహీనత ఏమిటో తెలుసు. సామ్రాజ్య అపార సైన్యాలకు ఎదురుపడి పోరాడి ఎట్టి పరిస్థితిలోనూ వారు గెలువలేరు. అందుకని వారు గెరిల్లా వార్ పద్ధతిని అవలంబించారు. నిజానికి ఈ గెరిల్లావార్ పద్ధతిని మొట్టమొదటగా కనుగొని ఉపయోగించినవాడు, మరాఠాల ఒక గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేసినవాడు బీజాపూర్ సంస్థానానికి చెందిన ప్రాచీన సైన్యాధిపతి మలిక్ అంబర్. అతను మొగలులకు వ్యతిరేకంగా ఈ గెరిల్లా పద్ధతిని అవలంబించి మొగలులకు అత్యంత చికాకుపరచి అపార నష్టాన్ని కలిగించాడు. (షాజహాన్ చరిత్ర- డాక్టర్ బనారసీ ప్రసాద్ సక్సేనా, పేజి 76, 77) బీజాపూర్ సంస్థానంలోని అత్యధికమంది మన్సబుదారులు (సైనికాధికారులు), సిపాయీలు మరాఠా జాతికి చెందినవారే ఉండేవారు. అక్కడి నుండే వారు ఈ యుద్ధ పద్ధతిని నేర్చుకున్నారు. మహారాష్ట్రలోని కొండలు, గుట్టలు, చిట్టడవులతో కూడుకొని ఉన్న ప్రాంతం ఈ గెరిల్లా వార్‌కు అత్యంత అనుకూలమైనది. మొగలు సైన్యం భారీ సంఖ్యలో ఉండి, ఏనుగులు, ఒంటెలు, అశ్వాలు, ఎద్దులు, ఫిరంగులతో కూడుకొని ఒక మహా సముద్రంలా ఉండేది. ఈ పరిస్థితిలో ఉన్న సైన్యం, వేగంగా, తీవ్రంగా ప్రయాణించజాలదు. ఇక ఇటు మరాఠాలు తీవ్రగతి కలిగిన అశ్వాలపై, ముక్తసరి సామానుతో పది, పన్నెండు వేల సైనిక దళంతో మెరుపుదాడులు జరిపేవారు. ఒకసారి వెనుక వైపున దాడి జరిపితే మరోసారి ముందు భాగంపై దాడి జరిపేవారు. ఒకసారి ఒక ప్రక్కపై దాడి జరిపితే మరోసారి మరో ప్రక్కపై దాడి జరిపేవారు. మొగలు సైన్యం తేరుకొని వారిని ఎదుర్కొనేంతలోనే ఆ దళం మాయమైపోయేది. మొగలు సైన్యాలు విశ్రమించే సమయాల్లో, లేక రాత్రిళ్ళలో, లేక ప్రయాణంచేసి అలసిపోయిన సమయంలో ఈ మెరుపుదాడులు జరిపేవారు. ఒక్కొక్కసారి

వారికి ఆహార పదార్థాలు సరఫరా చేసే దళంపై దాడిజరిపి దాన్నంతా లూటీ చేసేవారు. వారి ఈ గెరిల్లావార్ పద్ధతికి మహారాష్ట్ర అత్యంత అనుకూలంగా ఉండేది. మొగలు సైన్యాలకు ఆ ప్రాంతమంతా అపరిచితం. కొండలు, గుట్టలు, గుహలు, చిట్టడవుల్లో మరాఠాలు ఎక్కడ దాగి ఉన్నారో వారికి తెలియని పరిస్థితి. అందుకే మొగలు సైన్యాలు సంఖ్యలో అత్యధికంగా ఉన్నా కూడా వారు ఈ గెరిల్లా వార్ పద్ధతి కారణంగా తీవ్ర నష్టాల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. మైదానపు యుద్ధాల్లో రెండు పక్షాలు ముఖాముఖీగా పోరాడి, ఒక పక్షం గెలవడం మరో పక్షం ఓడిపోవడం లాంటి పరిస్థితి ఇక్కడ లేదు. అంతేకాకుండా మరాఠాలు పశువులకు మేత తెచ్చేవారిని బెదిరించేవారు. చంపేసేవారు. ఈ కారణంగా మేత కరువై పశువులు మృత్యువాతపడ సాగాయి. మొత్తానికి తమ ఉనికి కోసం మరాఠాలు తమకు తోచిన పద్ధతిని అవలంబించేవారు. అయితే అసంఖ్యాక సైనిక బలగం, పుష్కలంగా వనరులున్న సామ్రాజ్య శక్తిని ఓడించి వారు తమ స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకునే పరిస్థితిలో కూడా లేరు. ప్రభుత్వ సైన్యాల్ని భారీగా నష్టపరచినా, వారు కూడా నష్టపోతూ తమ మనుషుల్ని కోల్పోవలసి వచ్చేది. ఈ పరిస్థితికి మొగలులు ఎలా విసుగెత్తిపోయారో మరాఠాలు కూడా వివశులయి పోయారు. ఈ పరిస్థితి కారణంగా వారిలో అంతర్ విభేదాలు కూడా పొడసూపాయి. (దర్బారీ అఖ్‌బారాత్, ఆగస్టు 19, 1701-ఇదే అధ్యాయం పేజి 389) కొంతమంది మరాఠా నాయకులు స్వల్పంగా లభించే కొన్ని విజయాలకు సంబరపడి యుద్ధాల్ని కొనసాగించాలని కోరుకున్నారు. అయితే మరాఠాల్లోని ఇంకొక వర్గం క్రమక్రమంగా తమ కోటలు చేజారిపోతున్న వైనాన్ని చూసి యుద్ధాన్ని ఆపి చక్రవర్తి పట్ల విధేయత చూపి గౌరవప్రదమైన షరతులతో సంధి చేసుకోవాలని అభిలషించేది. ఉదాహరణకు ధన్నాజీ జాదవ్ మరాఠాల్లో గొప్ప పేరుగాంచిన సేనాని. అత్యంత ధైర్యస్థయిర్యాలు కలిగిన వీరుడు. అలాంటి వ్యక్తే పరిస్థితులతో విసుగెత్తి చక్రవర్తి ఉద్యోగంలో చేరుతానని అర్జీ పెట్టుకున్నాడు. (దర్బారీ అఖ్‌బారాత్ 14, జులై 1703- ఇదే అధ్యాయంలోని పేజీలు 390, 391). అతను పిరికిపంద కాదు, జాతి ద్రోహి కాడు. ఎంతోమంది మొగలు సేనానుల్ని మట్టిగరిపించిన వీరుడు, శూరుడు. మరాఠాల చరిత్రలో అతనో హీరోగా పరిగణింపబడతాడు. కాని పరిస్థితుల్ని అతను సంపూర్ణంగా అవగాహన చేసుకున్నాడు. అందుకే గౌరవప్రదమైన షరతులపై సంధి చేసుకోవాలని అభిలషించాడు. ఇతనొక్కడే కాదు, మరాఠాలకు కేంద్రబిందువైన రాణి తారాబాయి కూడా పరిస్థితుల్ని అర్థం చేసుకొని ఒక్కొక్క కోటను పోగొట్టుకుంటూ చివరికి వివశురాలై నూటికి తొమ్మిది రూపాయలు చొప్పున తమకు “సర్ దేశ్‌ముఖి” హోదాను ప్రసాదించాలని, తన కుమారులకు 7000 మన్సబ్‌ను ప్రసాదించాలని అర్జీ పెట్టుకున్నది. (దర్బారీ అఖ్‌బారాత్ 12, మార్చి 1700- ఇదే అధ్యాయంలో పేజి 389) ఇక వేరొక వైపు మొగలు నాయకుల్లో, సైనికాధికారుల్లో అసూయ, ద్వేషాలు జనించాయి.(ముంతఖబుల్ .... ఖాఫీ ఖాన్, వా-2, భాగం 3, పేజి 349, 428) గోల్కొండ, బీజాపూర్‌ల పతనం తరువాత అత్యధిక సైనికులు, సైనికాధికారులు, నాయకులు, మొగలు సైన్యాల్లో చేరిపోయారు. వారిలోని

కొందరు తమ వీరత్వం, ఘనకార్యాల ద్వారా అభివృద్ధిచెందుతూ, చక్రవర్తి దృష్టిని ఆకర్షిస్తుంటే మొగలు దర్బారుకు చెందిన పాత నాయకులు, సన్నిహితులు అసూయపడసాగారు. సాంబాజీని ఓడించి, పట్టుకున్న ముఖర్రబ్ ఖాన్ అనే సైన్యాధికారి గోల్కొండ సైన్యం నుండి వచ్చి మొగలు సైన్యంలో చేరినవాడు. మొగలు సామ్రాజ్య దృష్టితో అతను సాధించింది ఓ మహా ఘనకార్యం. అయితే అతన్ని సముచితంగా సన్మానించకుండా పాత నాయకులు అడ్డుపడ్డారు. (ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా-2, భాగం-3, పేజి 349). ఇదొక్కటే కాదు. పర్నాల- పావన్‌గడ్ కోటల ముట్టడి సమయంలో మురాద్ ఖాన్ అనే నాయకుడు తన మనుషులతో కొండ శిఖరానికి చేరుకొని తన స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఇంకా దానిపై రాజ్య పతాకాన్ని రెపరెప లాడించాడు. చక్రవర్తితో సహా ప్రతి ఒక్కరూ దాన్ని సంభ్రమాశ్చర్యాలతో తిలకించారు. తక్షణమే తనకు సముచిత సహాయం అందించాలని చక్రవర్తికి అర్జీ సమర్పించుకున్నాడు. చక్రవర్తి ఆదేశానుక్రమం పంపబడిన రూహుల్లా ఖాన్, హమీదుద్దీన్ ఖాన్‌లు అతనికి సహాయం అందించేబదులు అక్కడి నుండి దిగమని కబురు పంపించారు. అయితే చక్రవర్తికి నిజ పరిస్థితి తెలుపకుండా మురాద్ ఖాన్ అనవసరపు తెగింపు, దుస్సాహసానికి పాల్పడ్డాడని, అతనికి సహాయమందించి అక్కడ స్థావరాన్ని ఏర్పాటు చేయడం అసంభవమని చక్రవర్తిని నమ్మించి అతన్ని అక్కణ్ణుండి దిగమని చక్రవర్తి ద్వారా ఆదేశాలు పంపించారు. అతనెంతటి కీలక స్థానానికి చేరుకొని ఉన్నాడంటే కోటలోని వారు భయపడి అపజయం తథ్యమని అతనికి సంధి షరతులు ప్రతిపాదించి పంపసాగారు. ఇలాంటి సున్నిత సమయంలో అతనికి సహాయమందించక అతని ద్వారా కోట గెలువబడితే సైన్యాధిపతి తర్బియత్ ఖాన్ పరువు పోతుందని అతనికి నచ్చజెప్పి చక్రవర్తి ఆదేశాల్ని చూపిస్తూ అతన్ని క్రిందికి రప్పించారు. నిజ పరిస్థితిని గూఢచారులు, ఇంకితరుల ద్వారా తెలుసుకున్న చక్రవర్తి మరుసటి రోజు మురాద్ ఖాన్‌కు సాంత్వన చెప్పి, ఆ తరువాత హమీదుద్దీన్ ఖాన్ మొదలగాగల వారిని పిలిపించి బాగా చీవాట్లు వేశాడు. (ముంతఖబుల్ .... ఖాఫీ ఖాన్ ... వా-2, భాగం-3, పేజి 428, 429) ఈ అసూయాద్వేషాలు ఎంతగా పెరిగిపోయాయంటే, ఒక నాయకుడు మరాఠాలతో పోరాడటానికి వెళ్ళినప్పుడు అతను సఫలం కాకూడదని, అతని పేరుపై మచ్చ రావాలనే దృష్టితో రహస్య సమాచారాన్ని మరాఠాలకు చేరవేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంతెందుకు? స్వయంగా ఔరంగజేబ్ రాకుమారుడు కామ్‌బక్ష్ ఇటువంటి చర్యలకు పాల్పడి, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి నాయకులచే బంధించబడ్డాడు. (మాసిరె ఆలంగీరి, పేజి 253). ఇలాంటి పరిస్థితిలో ఉన్న మొగలు సైన్యం, మొగలు నాయకులు, నవజాత జాతీయ భావనతో ఉద్రేకపూరితులై ఉన్న మరాఠాలను పూర్తిగా అణచివేస్తారని చక్రవర్తి ఆశించడం అత్యాశే అవుతుంది. అందుకే ఔరంగజేబ్ లాంటి శక్తిమంతమైన చక్రవర్తి తప్పుకోగానే, మరాఠాలు స్వల్పకాలంలోనే తిరిగి తమ బలాన్ని పుంజుకోగలిగారు. ఇంకా తమ స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోగలిగారు.

# శివాజి ముస్లిం వ్యతిరేకా?

ఇది నిజం కాదని నిరూపించటానికి ఎన్నో చారిత్రక సాక్ష్యాధారాలున్నాయి. అతని రాజ్యం మరియు సైనిక వ్యవస్థలో ముస్లింల పాత్ర ఎవరూ కూడా విస్మరించలేనిది. దీన్ని కాస్త విపులీకరించి తెలిపితే అసమంజసం కాదనుకుంటాము. "శివాజి సైన్యం ఐదు ప్రధానాంగాలపై ఆధారపడి ఉండేది. 1. పదాతిదళం 2. అశ్విక దళం 3. ఫిరంగి దళం 4. నావికా దళం 5. కొండలు, గుట్టలపై నుండి మెరుపుదాడి చేయటంలో నేర్పరులైన సైనికులతో కూడిన గెరిల్లా దళం. శివాజీ తన సైనికుల్ని ఎంపిక చేసేటప్పుడు కులం, మతం ప్రాతిపదికగా కాకుండా వీరత్వం, ధైర్యస్థయిర్యాలకు ప్రాధాన్యత ఇచ్చేవాడు. తెగింపు ఉండి, ప్రాణాలర్పించడానికి కూడా వెనుకాడని వారు మాత్రమే ఎంపిక చేయబడేవారు.

**1. పదాతిదళం :** శివాజీ పదాతి దళంలో 35% ముస్లిం సైనికులుండేవారు. మొగలు, బీజాపూర్ గోల్కొండ రాజ్యాల నుండి ఎంతోమంది ముస్లిం సైనికులొచ్చి శివాజీ సైన్యంలో చేరారు. వారు అత్యంత విశ్వాస పాత్రతతో రాజా శివాజీకి తమ సేవలందించారు. ఈ విషయంగా ప్రఖ్యాత మేధావి బాల్ క్రిష్ణ హరిదాస్ ఇలా వ్రాశారు : "శివాజీ రాజా సైన్యంలోని ప్రతి విభాగంలో హిందువులకు సరిసమానంగా ముస్లిం సైనికులు కూడా అత్యున్న తంగా తమ సేవలందించారు." (పుణ్యశ్లోక్ శివాజి మహరాజ్ - సాహిత్యాచార్య బాల్ క్రిష్ణ శాస్త్రి హరిదాస్ పార్ట్- 4, పేజి-205). శివాజీ రాజా నియమించుకున్న ఈ ముస్లిం సైనికుల్లో ఒక్కడు కూడా ద్రోహానికి పాల్పడలేదు. (షక్‌కర్తా శివాజీ - రియా సత్కార్ జి.యస్. సర్‌దేశాయి, పేజి 40, 41).

**2. అశ్విక దళం :** ఛత్రపతి శివాజీ తన అశ్విక దళంలో హిందువులకన్నా ముస్లింలనే అధిక శాతంలో చేర్చుకున్నాడు. మొత్తం లక్షా ఐదువేల అశ్విక దళంలో అరవైవేల మంది ముస్లిం అశ్వికులే ఉండేవారు. (F.T. Part-1 (Factory Recd.) page 307-John Frayer) (శివరాయంచే నిష్టావంత్ ముస్లిం సైనిక్ - ప్రేమ్ హన్‌వతే, పేజి-51) శివాజీ రాజా పదాతి దళంలో హిందువులు అధికంగా ఉండేవారని, అశ్విక దళంలో ముస్లింలు అధికంగా ఉండేవారని ఈ ముస్లిం సైనికులు శివాజీ మహారాజ్‌కు ఎల్లప్పుడూ విశ్వాసపాత్రులుగా ఉంటూ వచ్చారని, ఒక్క ముస్లిం సైనికుడు కూడా ద్రోహానికి పాల్పడలేదని, శివాజి రాజా ముస్లింల విశ్వాసపాత్రతతో సంతృప్తుడై ఉండేవాడని, అందుకే ఆయన ముస్లింలను సంపూర్ణంగా విశ్వసించే వాడని శెజ్‌వాల్కర్ పేర్కొన్నారు. (శ్రీ శివ్ ఛత్రపతి, పేజి 506). స్వరాజ్య అశ్విక దళంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉండేవారు. ఈ అశ్వికులు తమ ధర్మంను (ఆచరించినట్లే) అత్యంత నిర్మలంగా, నిజాయితీతో తమ యజమానికి సేవలందించేవారు (ఛత్రపతి శివాజీ మహా రాజాన్చె చరిత్ర్, వా.సీ.బింద్రే, పేజి 924).

**3. ఫిరంగీ దళం :** ఆ కాలంలో మైదానపు యుద్ధమైనా, కోటల ముట్టడి అయినా, సముద్ర యుద్ధాలైనా ఫిరంగీ దళం కీలక పాత్ర పోషించేది. శివాజీ తన ఫిరంగీ దళాన్ని

పటిష్టంగా రూపొందించుకున్నాడు. ఈ ఫిరంగీ దళానికి అఫ్గన్ జాతికి చెందిన ప్రఖ్యాత నాయకుడు ఇబ్రాహీం ఖాన్ కమాండర్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించేవాడు. ఆ కాలంతో ఫిరంగీల్ని నడపడంలో (పేల్చడంలో) ఇబ్రాహీం ఖాన్ ప్రఖ్యాతిగాంచినవాడు. అతనితో పాటే ఈ దళంలో ఎంతోమంది అఫ్గన్ సైనికులు కూడా ఉండేవారు. శివాజీకి చెందిన ఈ ఫిరంగీ దళంలో ముస్లింలు గొప్ప సంఖ్యలో ఉండేవారు.

(ఛత్రపతి శివాజీ మహారాజ్, క్రిష్ణారావు కిలోస్కర్, పేజి 430, మహాపురుష్ ఛత్రపతి శివాజీ, సయ్యద్ అమీన్, పేజి 174, శివాజీ కౌన్ హోతా? - గోవింద్ పాన్సరే - పేజి 27)

**4. నావికా దళం :** శివాజీ తన నావికా దళాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కాఠియావాడ్, గుజరాత్, కోఙ్కన్ తీర ప్రాంతాల్లో నివసించే వివిధ తెగలు అనగా, ఖార్వా, కోలీ, భావెలా, దాఫీర్, మియానా మున్నగు తెగలు - ఎవరి వృత్తే సముద్రంలో చేపలు పట్టడం, నౌకాయానం, సముద్ర ఘర్షణలై ఉండేదో అలాంటి వారినే ఎంపిక చేశాడు. ఖార్వా తెగలో రాజపుత్రులు, కోలీ (బెస్తవారు), ముస్లింలు కలసి ఉండేవారు. ఇక దాఫీర్, మియానా తెగలైతే దాదాపుగా పూర్తి ముస్లిం తెగలే. ఈ విధంగా ముస్లింలు అత్యధికంగా ఎంపికయ్యారు. వీరే కాకుండా అబిసీనియా (నీగ్రో) జాతికి చెందిన అనేకమంది ముస్లింలు కూడా ఈ నావికాదళంలో చేరిపోయారు. అందువల్ల శివాజీ నావికా దళంలో ముస్లింలు అత్యధిక సంఖ్యలో (మెజారిటీలో)ఉండేవారు. ఇక ఈ నావికా దళానికి చీఫ్ కమాండర్ ఎవరను కుంటున్నారు? దరియా సారంగ్ అనే పేరు గల ఒక ముస్లిం. నావికా దళపు ఇంకొక ప్రధాన అధికారిగా శివాజీ మాయనాక్ భండారీ అనే దళితుణ్ణి నియమించాడు. (శివరాయన్చే.... ప్రేమ్ హన్వతే, పేజి 61) (మూసా ఖాన్ - పేజి 137) ఆంగ్లేయుల ఫ్యాక్టరీ రికార్డును అనుసరించి నౌకల్ని రెండు భాగాలుగా విభజించటం జరిగింది. ఈ రెండు భాగాలు ఇద్దరు వేర్వేరు నావికా దళాధిపతుల పర్యవేక్షణలో పనిచేస్తుండేవి. ఒకదానికి దరియా సారంగ్, రెండవ దానికి మాయనాక్ భండారీ నేతృత్వం వహించేవారు. (ఛత్రపతి శివాజీ మహారాజ్- క్రిష్ణారావ్ కిలోస్కర్, పేజి 223, 230) శివాజీ నావికా దళపు ప్రధానాధికారుల్లో దౌలత్ ఖాన్ పేరు కూడా ప్రఖ్యాతిగాంచింది.

"Each squadren was placed under the Supreme Command of an Admiral Dariya Sarang, a Muslim Officer. Dariya Sarang was not only Muslim Officer in Shivaji's fleet, another prominent Muslim Admiral Doulat Khan by name enter Shivaji's service." *(Administration System of Marathas - By Surendranath Sen - page 95)*

"At least three of his Naval Commanders were Muslims by faith" (Military System of Marathas - By Surendranath Sen - page 18)

"Most of the captains of Shivaji's fleet were Muslims" (History of Indian Administration, Vol.II - B.N. Puri, page 340)

"Shivaji's Chief Admiral Dariya Sarang was a Mohammaden and

fought with Siddi admirals of Moghals." (Rise of Marata Power - Mahadev Govind Ranade - page-31)

ప్రఖ్యాత చరిత్రకారుడు "శివతోస్‌దాస్" తన గ్రంథం "Indian Military - It's History and Development"లో ఇలా వ్రాశాడు: "శివాజీ కాలంలో నావికా దళపు ఉన్నతాధికారులందరూ, సముద్రతీరంలోని కోటాధిపతులందరి కందరూ ముస్లింలే అయి ఉండేవారు" పేజి-55)

శివాజీ రాజ్యం, మరియు సైన్యంలోని కొందరు ముస్లిం ప్రముఖుల్ని ఇక్కడ పేర్కొంటున్నాము.

**1. ఖాజి హైదర్ :** శివాజీ తన దర్బారు వకీలుగా, ప్రైవేటు సెక్రటరీగా ఖాజీ హైదర్‌ను ఎంపిక చేసుకున్నాడు. ఈయన అరబి పర్షియన్ భాషల పండితుడు. ఇతర పరిపాలకులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, శివాజీకి సంబంధించిన రహస్య పత్రాలు, రాజముద్ర ఈయన అధీనంలో ఉండేది. శివాజీ దర్బారులోను, కుటుంబంలోనూ ఈయన్ను అత్యధికంగా గౌరవించడం జరిగేది. ఈయన యోగ్యత, సచ్ఛీలత, సత్యసంధతను గురించి ప్రశంసిస్తూ సంస్కృత కవి పండిత్ జయరాం పిండే తన సంస్కృత పద్య గ్రంథం "పర్నాల్ పరవత్ గృహ వ్యాఖ్యానం"లో ఇలా వ్రాశాడు: "ఖాజి హైదర్ పవిత్ర నడవడికలు, దైవనిష్ఠ కలిగిన ఒక ముస్లిం". ఈయన ఎంత యోగ్యుడంటే శివాజీ చనిపోయిన తరువాత, డిల్లీ దర్బారులో ఈయన ఖాజియుల్ ఖజాత్ (చీఫ్ జస్టిస్)గా నియమించబడ్డారు. (తారీఖ్ హింద్ కా ఇంఖ్విలాబి కిర్దార్ - శివాజీ (భారత చరిత్రలోని విప్లవాత్మక పాత్ర శివాజీ) - ప్రొ. ఎం.కె. షాజ్లి, పేజి 422)

**2. సర్దార్ నూర్ ఖాన్ బేగ్ :** శివాజీ కాలంలో సైన్యాధిపతిని, 'సర్ నౌబత్' అని పిలిచేవారు. శివాజీ తన పదాతి దళానికి మొట్టమొదటి 'సర్ నౌబత్' గా సర్దార్ నూర్ ఖాన్ బేగ్‌ను నియమించాడు. (మరాఠా ఇతిహాసాచి సాధనె- ఇతిహాసాచార్య, వి.కె. రాజ్‌వాడె, పేజి 17).

**3. సర్దార్ సిద్ది హిలాల్ :** అశ్విక దళానికి సైన్యాధిపతి. షాహ్‌జీ కాలం నుండి భోన్‌స్లే కుటుంబంతో కలసి ఉంటూ వచ్చినవాడు. పిన్‌హాల్‌గడ్ కోట ముట్టడి సమయంలో శివాజీని క్షేమంగా బయటికి పంపటానికి తన ఐదుగురు కుమారులతో భీకరంగా పోరాడినవాడు. అతని కుమారుల్లో ఒకడైన సిద్దివాహ్ వాహ్ తీవ్రంగా గాయపడి, గుఱ్ఱం నుండి పడిపోయి, శత్రువులకు పట్టుబడిపోయినా పట్టించుకోకుండా శివాజీని పిన్‌హాల నుండి తప్పించడంలో కృతార్థుడయ్యాడు. (శివకాలీవ్ ప్రసార్ సంగ్రహ్, భాగ్ 2, పత్ర్ నెం.1496, సర్ సేన చింతామన్ కిలోస్కర్)

**4. సర్దార్ సిద్ది వాహ్ వాహ్ :** పిన్‌హాల గడ్ కోట దిగ్బంధం నుండి శివాజీని తప్పించడం కోసం వీరోచితంగా పోరాడుతూ, రక్తసిక్తమై గుఱ్ఱం నుండి పడిపోయాడు. ఆ తరువాత శత్రువులకు (బీజాపూర్ వారికి) పట్టుబడి వధించబడ్డాడు. (మరాఠి ప్రతి ఇతిహాస్, చంద్రశేఖర్ శిఖె, పేజి 30)

**5. సర్దార్ ఇబ్రాహీం ఖాన్ :** శివాజీ రాజా అంగరక్షక దళంలోని ఒక ప్రముఖ

సభ్యుడు. 1659లో అఫ్జల్ ఖాన్‌తో జరిగిన ఘర్షణ సమయంలో శివాజీకి బాడీగార్డ్‌గా శివాజీతో ఉన్నాడు. శివాజీపై ప్రాణాంతకమైన దాడి జరిపిన అఫ్జల్ ఖాన్ బాడీ గార్డులైన శంకర్‌జీ మోహితె, పలాజీ మోహితేను ఒకే వేటులో సమాప్తం చేసినవాడు. మరాఠా సైన్యంలోని హజారీ మన్సబుదారు. ఫోండా కోటను జయించిన విజేత. (మహాపురుష్ ఛత్రపతి శివాజీ – సయ్యద్ అమీన్, పేజి 54). (శివరాయన్చే నిష్టావంత్ ముస్లిం సైనిక్, ప్రేమ్ హన్వతె, పేజి–52, 77)

**6. సర్దార్ షమా ఖాన్ :** శివాజీ అశ్విక సైన్యంలో పేరుగాంచిన వీరుడు. ఖడ్గ నిపుణుడు. ఎన్నో యుద్ధాల్లో శివాజీ వెంట ఉండి విజయాల్ని సాధించడంలో తోడ్పడినవాడు. సభాసద్ బఖర్, శెజ్‌వాల్కర్ గ్రంథం 'శ్రీ శివచరిత్'లో పేరెన్నికగన్న శివాజీ సైనిక నాయకుల్లో ఇతని పేరు చేర్చబడింది. (సభాసద్ బఖర్ – పేజి 112, క్రిష్ణాజి అనంత్ సభాసద్)

**7. సర్దార్ సిద్ది అంబర్ వహాబ్ :** శివాజీ సైన్యంలో హవల్దార్‌గా చేరి అభివృద్ధి చెందుతూ సర్దార్ (నాయకుని) ర్యాంకుకు చేరుకున్నాడు. ఖడ్గ వీరుడు. ఎన్నో యుద్ధాల్లో శివాజీ విజయానికి తోడ్పడ్డాడు. (శివరాయంచె నిష్ణావంత్ ముస్లిం సైనిక్ – ప్రేమ్ హనవతె, పే. 36 – 38)

**8. సర్దార్ హుసేన్ ఖాన్ మియాన :** ప్రారంభంలో ఇతను ఆదిల్ షా రాజ్యంలో నాయకుడు. ఆదిల్ షాహి ఫిరంగి దళానికి కమాండర్. శివాజీతో జరిగిన ఒక యుద్ధంలో ఓడిపోయి పట్టుబడ్డాడు. తరువాత శివాజీ సత్ప్రవర్తనతో ప్రభావితుడై ఆదిల్ షాహి ఉద్యోగాన్ని విరమించుకొని ఇతను, ఇతని సోదరుడు ఖాసిం ఖాన్ శివాజీ సైన్యంలో చేరిపోయారు. హుసేన్ ఖాన్ వీరత్వాన్ని గుర్తించి శివాజీ తన సైన్యంలో ఇతన్నో సర్దారుగా నియమించాడు. (House of Shivaji - Jadhunath Sarkar - Calcutta, 1948, Edi, page 95 - 97)

**9. సర్దార్ రుస్తుమె జమాఁ :** నిజానికి ఇతను బీజాపూర్ దర్బారు నాయకుడు. బీజాపూర్ పూర్వ సైన్యాధిపతి రుందేలా ఖాన్ పుత్రుడు. శివాజీకి మిత్రుడు, శ్రేయోభిలాషి. 1659లో అఫ్జల్ ఖాన్‌తో రానున్న ప్రమాదం గురించి ఇతనే మొట్టమొదటగా రహస్యంగా శివాజీని అప్రమత్తం చేశాడు. ఇంకా పులివ్రేళ్ళనే గుప్త ఆయుధాన్ని శివాజీకి ఇతనే పంపించాడు. ఆ ఆయుధంతోనే శివాజీ, అఫ్జల్ ఖాన్ పొట్టచీల్చి అతన్ని సమాప్తం చేసేశాడు. (శివ చరిత్ర్ ఏక్ అభ్యాస్, సేతూ మాధవరావు పగ్డీ, పేజి 33)

**10. అడ్మిరల్ దరియా సారంగ్ :** శివాజీ నావికా దళానికి మొట్టమొదటి సైన్యాధిపతి. ఆ కాలంలో అడ్మిరల్‌ను "సర్‌ఖేల్" అని పిలిచేవారు. ఎన్నో సముద్ర యుద్ధాల్ని గెలిచిన వీరుడు. గాయపడినా వెనుకడుగు వేయని ధీరుడు. (Administration System of Marathas - Surendranath Sen - Page 18) (Rise of Marata Power - Mahadev Govind Ranade, April 1961, page 31)

**11. క్యాప్టన్ ఇబ్రాహీం ఖాన్ :** శివాజీ నావికాదళంలో ఒక పేరు గాంచిన అధికారి. ఎన్నో సముద్ర యుద్ధాల్ని గెలిచినవాడు. ఖండేరి ద్వీపకల్పంలో ఆంగ్లేయులతో జరిగిన

యుద్ధంలో అసామాన్య వీరత్వాన్ని ప్రదర్శించాడు. వారి ఎన్నో నౌకల్ని ముంచేశాడు. (Indian Military, It's History and Development - Shivathos Das, page 72, 1969 Edi.)

**12. అడ్మిరల్ దౌలత్ ఖాన్ :** శివాజీ నావికా దళంలో ఎందరో పేరుగాంచిన అధికారులున్నప్పటికీ దౌలత్ ఖాన్ మాటే వేరు. అతను సముద్ర పర్యవేక్షణకు బయలుదేరాడంటే శత్రువుల నౌకలన్నీ తోక ముడుచుకొని పరుగెత్తేవి. దౌలత్ ఖాన్ ఎన్నో సముద్ర యుద్ధాలు చేశాడు. ఎన్నోసార్లు గాయపడ్డా, వెనుకంజవేయలేదు. శత్రువుల ఎన్నో నౌకల్ని పట్టుకున్నాడు. ఎన్నటినో కాల్చేశాడు. ఎన్నిటినో ముంచేశాడు. దౌలత్ ఖాన్‌కు తన నావికాదళంపై గట్టి పట్టు ఉండేది. (షక్ కర్తా శివాజీ – రియా సత్కార్ జి.యస్. సర్‌దేశాయి, పేజి 252, పబ్లిషర్స్, ముంబై వైభవ్ – 1935)

**13. క్యాప్టన్ సిద్ది మిస్రీ :** శివాజీకి నమ్మకస్తులైన నావికా దళపు అధికారుల్లో సిద్ధి మిస్రి ప్రముఖుడు. ఇతను చివరికంటూ ఆదిల్ షాహి, మొగలు మరియు ఆంగ్లేయులతో సముద్ర యుద్ధాలు చేస్తూనే గడిపాడు. సిద్ధి మిస్రి జంజీరా కోటాధిపతి అయిన సిద్ధి సంబల్‌కు అల్లుడు. సిద్ధి మిస్రి శివాజీ నావికా దళపు అధికారి అయితే, సిద్ది సంబల్ శివాజీకి వ్యతిరేకి. అందుకని మామ అల్లుళ్ళలో మందుగుండ్లతో ఘోర యుద్ధాలు జరిగాయి. చివరికి సిద్ధి మిస్రి తన నిరంతర దాడులతో మామను వెనుకంజ వేయడానికి వివశుణ్ణి చేశాడు.

(మరాఠా ఇతిహాసాచి సాధనె – పోర్చుగీసు దఫ్తరం, పేజి 108)

**14. అడ్మిరల్ సుల్తాన్ ఖాన్ :** ఇతను శివాజీ నావికా దళంలో ఒక ప్రధానాధికారి. ఖందేరి యుద్ధంలో ఇతను తన అసామాన్యమైన ధైర్యస్థైర్యాల్ని ప్రదర్శించాడు. ఆంగ్లేయుల ఎన్నో నౌకల్ని కాల్చి నాశనం చేశాడు. సుల్తాన్ ఖాన్ ప్రదర్శించిన ఈ తెగింపు, ఈ విశ్వాస పాత్రత కారణంగా 1681లో సాంభాజి రాజా ఇతన్ని తన నావికా దళానికి సైన్యాధిపతి (అడ్మిరల్)గా నియమించాడు. (ఛత్రపతి శివాజీ చరిత్ర్ – కిలోస్కర్, పేజి 224).

**15. వైస్ అడ్మిరల్ దావూద్ ఖాన్ :** పోర్చుగీస్ వారి నుండి మందుగుండు సామగ్రిని సేకరించటానికి ప్రథమంగా నియమించబడిన దావూద్ ఖాన్ నిజానికి ఒక ఆరితేరిన నావికుడు. శివాజీ కాలంలో అతను ఒక మామూలు నావికాదళ సిపాయిగా నియమించబడి నప్పటికీ, అభివృద్ధి చెందుతూ అతను నావికాదళంలో ఒక ఉన్నతాధికారిగా నియమించ బడ్డాడు. శివాజీ కాలంలో క్యాప్టన్ హోదా వరకు చేరగలిగిన దావూద్ ఖాన్, సాంభాజీ రాజా కాలంలో వైస్ అడ్మిరల్ మరియు అడ్మిరల్ హోదాకు చేరుకోగలిగాడు. (శివరాయన్చె నిష్టావంత్ ముస్లిం సైనిక్ – ప్రేమ్ హన్వతె, పేజి 59, 60, 63, 66, 76)

**16. సర్దార్ ఇబ్రాహీం ఖాన్ :** శివాజీ సైన్యంలో ఇబ్రాహీం ఖాన్ పేరు గల వారు ఏకకాలంలో ముగ్గురుండేవారు. ఒకరు పోండా కోటాధిపతి. రెండవ వారు నావికాదళపు

ఉన్నతాధికారి. ఇబ్రాహీం ఖాన్, మూడవ వ్యక్తి శివాజీ ఫిరంగీ దళపు కమాండర్ ఇబ్రాహీం ఖాన్. ఇతను అఫ్గన్ జాతికి చెందిన ఒక పఠాన్. ఇతనితో పాటుగానే అఫ్గన్ జాతికి చెందిన వందలాది పఠాన్లు శివాజీ ఫిరంగి దళంలో ఉండేవారు. ఇలాంటి గురితప్పని ఫిరంగీ నిపుణుడు (Gun Fighter) శివాజీ వద్ద తప్ప మొగలుల వద్దగాని, బీజాపూర్ వారి వద్ద గానీ, ఆంగ్లేయుల వద్ద గాని లేకుండిరి. (ఛత్రపతి శివాజి, మహారాజాన్చె చరిత్ర్ - వా.సీ. బింద్రే, పేజి 924).

**17. మదార్ షా మెహ్తర్ :** మదార్ షా మెహ్తర్ పేరు "మదారి మెహ్తర్"గా శివాజీ చరిత్రలో ప్రఖ్యాతి గాంచింది. ఆగ్రా నుండి శివాజీ పలాయనం సందర్భంలో హిరోజి ఫర్జంద్, మదారి మెహ్తర్ నిర్వహించిన పాత్ర అనుపమానమైంది. మొదట్లో వారిపై కోపగించిన ఔరంగజేబ్ మరణశిక్ష విధించినా, ఆ తరువాత వారి స్వామి భక్తి, త్యాగానికి ప్రభావితుడై మరణశిక్షను రద్దు పరచడమే కాకుండా కానుకలతో సత్కరించి వీరిద్దరిని సాగనంపుతాడు. మదారి మెహ్తర్ సేవ, విశ్వాసపాత్రతతో శివాజీ అత్యంత ప్రభావితుడై ఉండేవాడు. అందుకే నిండు యవ్వనంలో మదారి మెహ్తర్ గతించినప్పుడు శివాజీకి అమితమైన బాధ కలిగింది. అందుకే శివాజీ అతన్ని రాయ్‌గడ్‌లోనే ఖననం చేయించి అతని సమాధి కట్టించాడు. (రాయెగడ్చి జీవన్ కథా - శాంతారాం విష్ణు అవలస్కర్, పేజి 8, 119)

**18. చిత్రకారుడు మీర్ ముహమ్మద్ :** ప్రఖ్యాత ఇటాలియన్ పర్యాటకుడు మరియు చరిత్రకారుడు అయిన "నికొలాయి మనూచి" పుస్తకంపై మరియు చరిత్రకారుడు ఎం.ఎం. దేశ్‌ముఖ్ చరిత్ర గ్రంథం "శివషాహి" ముఖపత్రంపై శివాజీకి సంబంధించిన ఏ చిత్రం కనిపిస్తుందో, అది నేటికి దాదాపు నాలుగు వందల సంవత్సరాలకు పూర్వం ప్రఖ్యాత చిత్రకారుడు మీర్ ముహమ్మద్ రూపొందించాడు. శివాజీని చూస్తూ ఈ చిత్రకారుడు ఆ చిత్రాన్ని వేశాడు. ప్రఖ్యాత చరిత్రకారుడు శ్రీమంత్ కోకాటె అనేదేమిటంటే, ఇది శివాజీకి సంబంధించిన మొట్టమొదటి చిత్రం, ఈ ముస్లిం చిత్రకారుని కారణంగానే నేడు మనం శివాజీ అసలు రూపాన్ని చూడగలుగుతున్నాము. ఈ చిత్రంలో శివాజీ ఆయుధాలు ధరించి రణరంగానికి బయలుదేరే సందర్భంలో గీసినట్లు కనిపిస్తుంది. అందులో శివాజీ ముఖ కవళికలు, దుస్తులు, ముఖం, గడ్డం, తెల్లటి గుర్రం చుట్టూ అంగరక్షక దళం సభ్యులు కనబడతారు. ఈ అంగరక్షకుల్లో (Body Guards) లో హిందువులూ ఉన్నారు, ముస్లింలూ ఉన్నారు. 1665లో నికొలాయి మనూచి పుస్తకం కోసం వెదికి తీయబడిన ఈ చిత్రం ఛత్రపతి శివాజీ అసలు చిత్రంగా గుర్తించబడుతుంది. మరాఠా చరిత్రల్లో దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలున్నాయి. అయితే నేడు నలువైపులా కనిపించే శివాజీ చిత్రపటాలన్నీ ఊహాజనితమైనవి మాత్రమే. (శివ్‌షాహి, ప్రొ.ఎం.ఎం. దేశ్‌ముఖ్, పేజి 8, 10) (ప్రతి ఇతిహాస్ - చంద్రశేఖర్ శిఖ్రె, పే. 32)




ప్రముఖ చిత్రకారుడు మీర్ ముహమ్మద్‌చే వేయబడిన ఛత్రపతి శివాజీ యొక్క ఈ చిత్రం అసలు (ఒరిజినల్) ప్యారిస్ మ్యూజియంలో సురక్షితంగా ఉంది.

శివాజీతో సంబంధమున్న ఒక్కొక్క ముస్లిం వ్యక్తి, ఒక్కొక్క ముస్లిం సైనికాధికారి గురించి ఇలా వ్రాసుకుంటూ పోతే ఈ అధ్యాయమే ఒక గ్రంథమైపోతుంది. అందుకని చరిత్రకారుడు ప్రేమ్ హన్వతె శివాజీ–ముస్లింల సంబంధాలపై చేసిన ఈ సమీక్షతో ఈ శీర్షికను సమాప్తం చేస్తున్నాము.

"తమవారు ఒరల నుండి ఖడ్గాలు లాగి శివాజీ మహారాజ్‌పై విరుచుకు పడ్డప్పుడు ఆ ఖడ్గ ప్రహారాల్ని తమ రొమ్ములపై ఆపినవారు ఈ ముస్లింలే."

"అఫ్జల్ ఖాన్ వధ సందర్భంలో అఫ్జల్ ఖాన్ అంగరక్షకుడు క్రిష్ణాజి భాస్కర్ కులకర్ణి శివాజీపై తన ఖడ్గంతో ప్రాణాంతక వేటువేసి నుదుటిని తీవ్రంగా గాయపర్చినప్పుడు ప్రాణ త్యాగానికి సైతం వెరువని ఇబ్రాహీం ఖాన్ లాంటి ముస్లిం, శివాజీ ప్రాణాలు కాపాడటానికి తన ఛాతీని డాలుగా చేసి ఆయన్ను రక్షించాడు." (శివరాయంచె నిష్టావంత్ ముస్లిం సైనిక్ – ప్రేమ్ హన్వతె, పేజి 54)

("శివాజి ముస్లిం వ్యతిరేకా?" అనే ఈ శీర్షిక రూపకల్పనలో షోలాపూర్‌కు చెందిన శ్రీ మూసా అహ్మద్ ఖాన్ గారి "శివాజీ పరమత సహనం" అనే ఉర్దూ గ్రంథం మరియు ఉమర్ ఖేడ్, మహారాష్ట్రకు చెందిన శ్రీ ప్రేమ్ హన్వతె గారి "శివరాయన్చే నిష్టావంత్ ముస్లిం సైనిక్" అనే మరాఠీ గ్రంథం నుండి అత్యధిక సహాయం తీసుకోవడం జరిగింది – రచయిత).

ఇకిప్పుడు డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, ప్రొఫెసర్ పాట్నా యూనివర్శిటీ, లాంటి ఆధునికి చరిత్రకారుని అభిప్రాయాలు తెలుసుకొని ఈ అధ్యాయాన్ని ముగిద్దాం. ఆయనిలా అంటాడు :

"ఔరంగజేబ్‌ను మనం ఒక ముస్లిం పాలకునిగా కాక, కేవలం రాజుగా, పరిపాలకునిగా భావిస్తే, ప్రతి పరిపాలకునికి తన కిరీటం, సింహాసనం, వాటి ఉనికి, పటిష్ఠత – అన్నిటికన్నా అధికంగా ప్రీతిపాత్రమై ఉంటుందనే విషయాన్ని అంగీకరించక తప్పదు. ఈ రీతిలోనే ఔరంగజేబ్ తన సింహాసనానికి, తన సామ్రాజ్య పటిష్ఠతకే ప్రథమ ప్రాధాన్యత నిచ్చాడు. అతని సూబాలకు సంబంధించిన పాలసీ, దాని నిర్మాణంలో ఇదే లక్ష్యం ప్రధానం గాను, స్పష్టంగాను తొణికిసలాడుతుంది. ఈ లక్ష్యసాధన కోసమే దక్కన్‌లోని అనేక ముస్లిం రాజ్యాల్ని, దాని పరిపాలకుల్ని తనకు వ్యతిరేకులుగా భావిస్తే, వేరొకవైపు హిందువుల్ని తన మిత్రులుగా, విశ్వసనీయులుగా భావించాడు. ఒక శక్తిమంతుడైన రాజపుత్రరాజు, రాజా జైసింగ్‌ను సూబేదార్ లాంటి అత్యున్నత మరియు కీలక హోదాపై నియమించడమే కాకుండా, అతన్ని పూర్తిగా విశ్వసించి మరాఠాలను ఎదుర్కొనే, వారి శక్తిసామర్థ్యాల్ని నిర్వీర్యం చేసే సంపూర్ణ బాధ్యతను అతని కప్పగించాడు. ఇక ముస్లిం, ముస్లిమేతర అనే విషయాన్ని పట్టించుకోకుండా రాజా జైసింగ్ కూడా పూర్తి నిజాయితీ, విశ్వాసాలతో మరాఠాలకు వ్యతిరేకంగా ఔరంగజేబ్‌కు తన సహాయ సహకారాలను అందించాడు.

స్వంత ప్రయోజనాల కోసం గోల్కొండ, బీజాపూర్‌లకు చెందిన ముస్లిం పాలకులు ఔరంగజేబ్‌ను వ్యతిరేకించి, అతని కుటుంబ అంతఃకలహాలతో లాభపడడానికి, కొందరు ముస్లిం

రాజులు, పరిపాలకులు తమ స్వప్రయోజనాల దృష్ట్యా అవసరం ఏర్పడినప్పుడు ఇతర ముస్లిం పరిపాలకులతో కలిసిపోయేవారు.

పై నుదహరించిన పరిస్థితి కేవలం ముస్లింల వరకే పరిమితం కాదు, మరాఠాలు కూడా ఇదే పద్ధతిని అవలంబించేవారు.

మరాఠాలు ఎన్నో హిందూ ప్రాంతాల్ని నాశనం చేశారు. సర్వస్వం కోల్పోయిన అక్కడి ప్రజలు, ఔరంగజేబ్ పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించారు. ఈ విధేయత కేవలం ఔరంగజేబ్ వరకే పరిమితమని కాదు. అంతకు ముందు కూడా ఇలానే అవుతూ వచ్చింది. అంటే ప్రజలు ప్రభుత్వ పన్నుల భారాన్ని మోస్తూ, వివశులైపోయేవారు. విద్య లేకపోవడం, రాకపోకల్లో అసౌకర్యాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రజలు పరిపాలకులందరినీ, వారు ముస్లింలైనా, హిందువులైనా ఒకే విధంగా భావిస్తుండేవారు, ఎందుకంటే వారందరూ కూడా ఒకేవిధంగా ప్రజల శోషణ చేసేవారు.

మరాఠాల సైన్యంలో కేవలం హిందువులే లేరు. దానికి భిన్నంగా సైన్యానికి చెందిన ఉన్నత హోదాలపై అనేకమంది సమర్థులు, యోగ్యులు అయిన ముస్లింలు కూడా ఉన్నారు. ఇంకా వారు పూర్తి నిజాయితీ, విశ్వసనీయతలతో ముస్లిం శక్తులకు వ్యతిరేకంగా మరాఠాలకు తమ సహాయసహకారాల నందించారు.

అందుకని ముస్లింలందరూ ఒకవైపు ఏకమై, వేరొక వైపు హిందువులంతా ఏకమయ్యారు అనేమాట, ఆంగ్లేయుల కాలంలో సృష్టించబడింది. నిరాధారమైన ఈ వాదనను నిజమని అంగీకరింపజేయడానికి వాస్తవాలను మరుగుపరచడం జరిగింది. వాటిని సంతృప్తికర పద్ధతిలో విశ్లేషించడం జరుగలేదు.

ఈ వాస్తవాన్ని తెలుసుకునేందుకు ఔరంగజేబ్ కాలం నాటి పరిస్థితుల్ని, కారణాలను ప్రక్కకుబెట్టి, నేటి మన కాలపు పరిస్థితుల్ని సమీక్షించినా కూడా దీన్ని అవలీలగా చూడగలుగుతాము, అర్థం చేసుకోగలుగుతాము. హిందూ-ముస్లింల ఈ కలయిక ద్వారా వారు సామాజిక, రాజకీయ, ఆర్థిక ఇంకా మాట్లాడితే ధార్మికపరంగా కూడా ఒకేరకంగాను, కలిసిపోయినట్లుగానే కనబడుతున్నారు తప్ప దూరదూరంగా ఉన్నట్లు, వేరుపడినట్లు కనిపించడం లేదు.

ఈ విధంగానే ఔరంగజేబ్ కాలంలో ఒకవేళ ధార్మిక యుద్ధాలు, లేక ధార్మిక అసహనపు వాతావరణమే గనక ఉండి ఉన్నట్లయితే, ఔరంగజేబ్‌తో రాజా జైసింగ్ కనిపిస్తూ ఉండేవాడు కాదు. శివాజీని సమర్థిస్తూ ముస్లింలు, గోల్కొండవారు కనిపిస్తూ ఉండకపోయే వారు. (ఔరంగజేబ్ - ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 48, 49)

# 18. ఔరంగజేబ్ - శిక్కులు

బాబా గురునానక్ గారితో సహా ఒకరి తరువాత ఒకరుగా శిఖ్ఖుల్లో పదిమంది గురువులయ్యారు. ఈ పది గురువుల కాలం దాదాపు రెండువందల సంవత్సరాల్ని పరివేష్టించి ఉంది. ప్రథమ గురువు, శిఖ్ఖు ధర్మం స్థాపకులైన బాబా గురు నానక్ మొగలు సామ్రాజ్య స్థాపకుడైన బాబర్‌కు సమకాలీనులు.

బాబా గురు నానక్ ప్రస్తుతం పాకిస్తాన్‌లో నున్న 'నన్‌కాన' నగరానికి సమీపంలో ఒక క్షత్రియ హిందూ కుటుంబంలో 1469లో జన్మించారు. చిన్నప్పటి నుండే ప్రపంచ వ్యామోహం కన్నా, దైవనామ స్మరణం, దైవధ్యానం వైపే ఆయన అత్యధికంగా మొగ్గు చూపేవారు. ఆయన హిందూ ధర్మం మరియు ఇస్లాం రెండింటినీ గాఢంగా అధ్యయనం చేశారు. దీనికోసం ఆయన భారత దేశంలోని వివిధ తీర్థాలు, ధార్మిక స్థలాలతో పాటుగానే, మక్కా, మదీనా, ఇరాఖ్ దేశాల సుదీర్ఘ ప్రయాణాలు చేశారు. ఆ తరువాత ఆయన 'రావి' నది తీరంలో 'కర్తార్‌పూర్' పేరుతో ఒక బస్తీని నెలకొల్పి, అక్కడ్నే ఉంటూ తనకు నచ్చిన విశ్వాసాల్ని, నియమాల్ని ప్రజలకు బోధించసాగారు.

ఆయన ప్రచారం చేసిన ధార్మిక విశ్వాసాల్లో అక్కడక్కడ హిందూ ధర్మానికి చెందిన కొన్ని భావనలు కనిపించినప్పటికీ, సామూహిక దృష్టితో చూస్తే ఆయన బోధనలు ఇస్లామీయ ధర్మానికి ఎంత సమీపంగా ఉన్నాయంటే, ఆ కాలం నాటి వారు ఆయన్ను ఒక ముస్లిం సూఫీగానే భావించేవారు. ఇస్లాంలోని ప్రథమ మరియు రాజీపడని నియమం అంటే ఏకేశ్వరో పాసను, ఆయన అచ్చం అలాగే బోధిస్తుండేవారు. ఇంకా ఆ ఏకేశ్వర ఆరాధనయే మానవ జీవితపు ప్రథమ మరియు మౌలిక లక్ష్యంగా పేర్కొనేవారు. రెండవ విషయం జననం రీత్యా ఏర్పడిన కులాలు, వర్ణ వ్యవస్థను కాదని, మానవులంతా సమానమని, సత్ప్రవర్తనయే మానవ ఔన్నత్యానికి ప్రమాణమని ఉద్ఘాటించారు. ఇది కూడా ఇస్లాంలోని ముఖ్య సిద్ధాంతాల్లోని ఒక సిద్ధాంతంతో ఏకీభవిస్తుంది. అందుకని ఆ కాలం నాటి ముస్లింలు ఆయన్ను ఒక ధార్మిక పురుషునిగా, మానవతా ప్రేమిగా, పవిత్రమైన జీవితం గడిపే వానిగానే గుర్తించారు. ఇంకా జననం రీత్యా హిందువైనా, విశ్వాసాల రీత్యా ఒక ముస్లిం సూఫీగా కనుగొన్నారు.

బాబర్ మరియు బాబా గురునానక్‌ల కలయిక కేవలం కాకతాళీయంగానే జరిగిందనే విషయం చరిత్ర నెరిగిన వారందరికీ తెలిసేవుంటుంది. కాని ఈ చిన్నపాటి కలయికయే బాబర్‌ను ప్రభావితం చేయకుండా ఉండలేకపోయింది. అందుకని ఇతర ముస్లిం సూఫీలను భక్తిప్రపత్తులతో గౌరవించినట్లే, ఈ మొగలు చక్రవర్తి ఆయన్ను కూడా అత్యంతగా గౌరవించాడు.

బాబర్ మనువడైన అక్బర్ చక్రవర్తి, తన కాలం నాటి మూడవ గురువైన గురు అమర్‌దాస్‌కు ఒక భూమిని కానుకగా ఇచ్చాడు. ఆ భూమిపైనే ఆ కాలంలో 'హరిమందిర్'గా

పిలువబడిన, నేటి స్వర్ణాలయము (గోల్డెన్ టెంపుల్) నిర్మాణం జరిగింది. ఈ కట్టడానికి నలువైపుల్లో అమృత్‌సర్ నగరం ఉనికిలోకి వచ్చింది. గురూజీ కుమార్తె వివాహం మరియు కట్నం కానుకల కోసం అక్బర్ ఎన్నో గ్రామాల్ని ఆ అమ్మాయిపేర జాగీరుగా ఇచ్చాడు. గురు అర్జున్, ఆయన తరువాత వచ్చిన ఐదుగురు గురువులు ఈ అమ్మాయి కుమారులు, మనుమలు, మునిమనుమలే.

గురు అర్జున్ సింగ్ (ఐదవ గురువు) కాలం వరకు మొగలులతోనే కాకుండా ముస్లింలతో కూడా శిక్ఖులకు సన్నిహిత, ఆత్మీయ సంబంధాలుండేవి. 'హరిమందిర్' నిర్మాణం ప్రారంభమైనప్పుడు, దానికి శంఖుస్థాపన కోసం ఆ కాలం నాటి ఒక ప్రఖ్యాత సూఫీ గురువు మియాం మీర్‌ను ఆహ్వానించడం జరిగింది. ఆయన కూడా సంతోషంగా ఈ ఆహ్వానాన్ని స్వీకరించి శంఖుస్థాపన చేశారు. ఆనాటి ఈ రెండు వర్గాల సన్నిహిత సంబంధాలకు ఇదో ప్రత్యక్ష నిదర్శనం.

అయితే దురదృష్టవశాత్తు మొగలులతో మొట్టమొదటి ఘర్షణ కూడా ఈ గురు అర్జున్ సింగ్ కాలంలోనే సంభవించింది. కాని ఈ ఘర్షణకు ధర్మంతో ఎలాంటి సంబంధం లేదు. ఈ ఘర్షణకు మూల కారణమేమిటనే విషయంలో చరిత్రకారులందరూ ఏకాభిప్రాయులై ఉన్నారు.

అసలు జరిగిన విషయమేమిటంటే ఆ కాలంలో లాహోర్ గవర్నరుకు కోశాధికారి మరియు ఆర్థిక సలహాదారు అయిన సేట్ చందూషాహ్ తన కుమార్తెను గురు అర్జున్ కుమారునికిచ్చి వివాహం చేయదలిచాడు. తన ఆర్థిక వనరుల సమృద్ధి మరియు భక్తుల సంఖ్యరీత్యా ఆ కాలం నాటి గురువుల పీఠం, రాజుల సింహాసనాల్ని మరిపించేది. చందూ షాహ్ స్వయంగా గురువు సన్నిధిలోకి ఈ సంబంధాన్ని పంపించాడు. కాని అంతకు ముందే కొన్ని ఇతర సంఘటనలు జరిగి ఉండడం వల్ల, గురూజీ ఈ విన్నపాన్ని తిరస్కరించారు. అయితే సేట్ చందూషాహ్ దీన్ని తన అవమానంగా భావించి, ప్రతీకారం కోసం ఎదురు చూస్తున్నాడు.

అతనికి ఈ అవకాశం త్వరలోనే లభించింది. జహాంగీర్ కుమారుడు ఖుస్రో తన తండ్రికి తిరుగబడి డిల్లీ నుండి లాహోర్ వైపు పారిపోతూ, త్రోవలో గురు అర్జున్‌తో సహాయాన్ని అర్థించాడు. అయితే గురువు అతనికెలాంటి ప్రత్యక్ష సహాయాన్నైతే చేయలేదుగాని, లాంఛన ప్రాయంగా అతన్ని ఆశీర్వదించి ఉండొచ్చు. అయితే ఈ ఇద్దరి కలయికనే, చక్రవర్తికి పితూరీలు చెప్పడానికి చందూషాహ్ చక్కగా వాడుకున్నాడు. జహాంగీర్ కుమారున్ని తరుముతూ లాహోర్ వచ్చినప్పుడు, ఈ చందూషాహ్ గురువుకు వ్యతిరేకంగా చక్రవర్తికి బాగా నూరిపోశాడు. జహాంగీర్ గురువును విద్రోహి అయిన ఖుస్రో సానుభూతిపరునిగా భావించి, పెద్ద జరిమానా శిక్ష విధించాడు. ఈ జరిమానా ఇవ్వడానికి గురువు నిరాకరించినప్పుడు ఆయన్ను లాహోర్ కోటలో నిర్బంధించడం జరిగింది.

ఈ చక్రవర్తే ఒకానొక సందర్భంలో చరిత్ర ప్రఖ్యాతిగాంచిన ముస్లిం ధార్మిక గురువు హజ్రత్ షేఖ్ అహ్మద్ సర్ హిందీ ముజద్దిద్ అల్ఫ్ సానిని కూడా ఖైదులో పడేశాడనే విషయాన్ని మనమిక్కడ గుర్తుంచుకోవాలి.

చెరసాలలో గురు అర్జున్‌ను హింసించటం జరిగింది. దీనితో ఖిన్నుడైన గురువు ఒకరోజు 'రావి' నదిలో స్నానమాచరించ అనుమతి తీసుకున్నారు. మరియు స్నానం చేస్తూ, తనకు తానై రావి తీవ్ర ప్రవాహానికి అంకితం చేసుకున్నారు. గురువు సమకాలీనులు, ఆయన శిష్యులు ఇదంతా ఎందుకు జరిగిందనేది, దీని వెనుక సేట్ చందూ షాహ్ ప్రతీకార వాంఛ మరియు పలుకుబడి, అధికారాలున్నాయనే విషయాన్ని బాగా ఎరిగినవారే. ఈ విషయాన్నే వారు గురువు పదకొండు సంవత్సరాల ప్రాయం గల కుమారుడు గురు హర్‌గోవింద్‌కు కూడా తెలిపారు. ఈ విషయమే గురు హర్‌గోవింద్ మనోమస్తిష్కాల్లో నాటుకుపోయింది. ఈ కారణంగానే తగిన సమయం రాగానే సేట్ చందూ షాహ్‌ను హతమార్చి, తన తండ్రి ప్రతీకారాన్ని తీర్చుకున్నారు.

గురు అర్జున్‌పై వేయబడిన జరిమానా తీర్చనందున, కొన్ని రోజులు గురు హర్‌గోవింద్‌ను కూడా గ్వాలియర్ కోటలో నిర్బంధంలో ఉండాల్సి వచ్చింది. కాని ఆ తరువాత దర్బారు నాయకులు నచ్చజెప్పడంతో, జహంగీర్ ఆయనపై నున్న జరిమానాను మాఫీచేసి, ఆయన్ను చెరవిముక్తుణ్ని చేయడమే కాకుండా, ఆ కాలంలో "మన్సబుదార్ల"కుండే హోదా, గౌరవాల్ని కూడా ఆయనకు ప్రసాదించాడు. ఈ మన్సబుదారీలో స్వంత సైన్యం ఉంచుకునే అధికారం కూడా ఉండేది. అందుకని గురు హర్‌గోవింద్ అశ్వశాలలో ఎనిమిది వందల అశ్వాలు ఉంటుండేవి. మూడు నాలుగు వందల మంది ఆయుధాలు ధరించిన వ్యక్తులు ఆయనకు అంగరక్షకులుగా ఉంటుండేవారు. అశ్వారోహణ, వేట, కత్తి సాము లాంటి సైనిక కార్యకలాపాలలో అభిరుచి మెండుగా ఉన్న ప్రథమ గురువు ఈయనే. ఆయన సుదూర రాజకీయ ఆలోచనలు కలిగి ఉన్నట్లు ఆయన జీవిత చరిత్ర నుండి విదితం కాదు, కాని ఆయన తన స్వంత హక్కుల పరిరక్షణ కోసం ఒక నిర్భయుడైన, పర్యవసానాన్ని పట్టించుకోని మనిషిలాగా, తన వ్యతిరేకిపై వారెవరైనా, చివరికి ప్రభుత్వాధికారి అయినాసరే, వెనుకాడే వారు కాదని మాత్రం అర్థమవుతుంది. ఆయన జీవితాన్ని అధ్యయనం చేసినప్పుడు, ఆయన తండ్రిగారు ఏ దుస్సంఘటనకు ఏ కారణంగా గురిఅయ్యారో, ఆయన బాగా అర్థం చేసుకున్నారని, దీని ఫలితంగానే ముస్లిం–సిక్ఖుల సత్సంబంధాల్లో ఎలాంటి అగాధం ఏర్పడలేదనే విషయం అర్థమవుతుంది. సేట్ చందూషాహ్‌ను లాహోర్ నుండి పట్టి తెప్పించి, అతన్ని హతమార్చడంలో ప్రభుత్వాధికారులైన ఆయన ముస్లిం స్నేహితుల సంపూర్ణ సహాయ సహకారాలందాయి. అంతేకాకుండా ఆయన సైన్యంలో కూడా ముస్లిం పఠాన్లే అత్యధికంగా ఉంటుండేవారు. వేటంటే ఆయనకు ఇష్టమని ఇంతకు ముందే తెలిపాము. ఈ వేట సందర్భంలో కూడా అనేకమంది ముస్లింలు ఆయనకు స్నేహితులుగా ఉండేవారు.

ఇక్కడో విషయాన్ని పాఠకుల దృష్టికి తేదలిచాం. జహంగీర్ కేవలం వినికిడి, చెప్పుడు మాటలను నమ్మి, గురు అర్జున్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు గైకొన్నాడు. అయితే వేరొక సందర్భంలో ఔరంగజేబ్ కాలంలో ఇలాంటి సంఘటన జరిగి, తగిన సాక్ష్యాధారాలున్నప్పటికీ కూడా, ఔరంగజేబ్ ప్రవర్తన దీనికి భిన్నంగా ఉంది. దారా షికూహ్ తరచుగా సూఫీలను దర్శించుకుంటుండేవాడు, ఆ తరహాలోనే అతను ఆ కాలపు గురువు అయిన హరిరాయ్ (ఏడవ గురువు)ను కూడా దర్శించుకునేవాడు. ఈ సంబంధాల కారణంగా వారసత్వం కోసం అన్నదమ్ముల్లో జరిగిన యుద్ధాల్లో గురు హరిరాయ్ స్పష్టంగా, బాహాటంగా దారా షికూహ్‌ను సమర్థించి, సహాయపడ్డాడు. జదునాథ్ సర్కార్, కనిన్గ్‌హం లాంటి చరిత్రకారుల ననుసరించి, దారా షికూహ్ డిల్లీ నుండి లాహోర్‌కు పారిపోతున్నప్పుడు, ఔరంగజేబ్ సైన్యాలు అతన్ని వెంబడిస్తున్నాయి. ఆ సమయంలో గురు హరిరాయ్ సైనికులు, ఔరంగజేబ్ సైన్యాల దారికి అడ్డం తిరిగి ముందుకుసాగకుండా కాలయాపన చేశాయి. ఈ విషయంగా గురు హరిరాయ్ పట్ల ఔరంగజేబ్ ఆగ్రహానికి, అసంతృప్తికి గురిఅయి తీవ్రమైన చర్య తీసుకునే అవకాశాన్ని మనం కాదనలేం. అయితే దీనికి భిన్నంగా ఔరంగజేబ్ గురు హరిరాయ్‌ను దర్బారుకు పిలిపించాడు. ఆయన జ్యేష్ఠ పుత్రుడు రామ్‌రాయ్ నాయకత్వంలో వచ్చిన ఆయన ప్రతినిధి బృందంతో మాట్లాడి, "గతం గతః" అనే ధోరణిలో వ్యవహరించి, ఇక నుండి స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడానికి తన సంసిద్ధతను వ్యక్తపరిచాడు. ఇతర మిత్రరాజుల ప్రతినిధులకు, రాయబారులకు ఇవ్వబడే గౌరవమర్యాదలే, గురు ప్రతినిధి అయిన రామ్‌రాయ్‌కు ఇవ్వబడ్డాయి. కొంతకాలం గడిచిన తరువాత, డెహ్రాడూన్‌లో శిఖ్ఖు గురుద్వారా నిర్మాణం కోసం ఈ రామ్‌రాయ్‌కు సముచిత భూమి ప్రదానం చేయడం జరిగింది. డెహ్రాడూన్‌లోని ఈ గురుద్వారా నేటికీ ఉంది. 1661లో గురు హరిరాయ్ పరమపదించి నప్పుడు ఆయన వీలునామా ప్రకారం రామ్‌రాయ్ కనిష్ఠసోదరుడు గురు హరికిషన్ (ఎనిమిదవ గురువు) గురువు పీఠాన్ని అధిష్టించినప్పుడు, తను జ్యేష్ఠపుత్రుడినై ఉన్నందున, దర్బారులో తనకు లభించి ఉన్న ఉన్నతస్థానం కారణంగా, ఈ విషయంలో చక్రవర్తిని జోక్యం చేసుకోవాల్సిందిగా విన్నవించుకున్నప్పుడు, ఔరంగజేబ్ దీనికి అంగీకరించలేదు.

కొన్ని రోజుల తరువాత గురు తేగ్ బహదూర్ తొమ్మిదవ గురువుగా ఎన్నుకోబడి నప్పుడు, రామ్‌రాయ్ తిరిగి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఔరంగజేబ్ తనకున్న అపార శక్తిసామర్థ్యాలతో తనను శిఖ్ఖుల ధర్మపీఠంపై అధిరోహింపజేయాలని కోరినప్పుడు కూడా ఔరంగజేబ్ దీన్ని పట్టించుకోలేదు. ఈ సంఘటనల వల్ల ఔరంగజేబ్‌కు శిఖ్ఖు ధర్మం పట్ల ఎలాంటి అసూయా లేదని, శిఖ్ఖుల ధార్మిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని అతను సమంజసంగా భావించలేదనే విషయం నిరూపితమవుతుంది.

అయితే విషాదకరమైన విషయం ఏమిటంటే శిఖ్ఖుల చరిత్రలోని అనేక ప్రఖ్యాత సంఘటనలు ఈ రాజు కాలంలోనే సంభవించాయి. ఆంగ్లేయుల కాలంలో సెలబస్‌లో ఒక ప్రత్యేక దృష్టి కోణంతో వ్రాయించిన, ప్రచారం చేసిన సంఘటనల ముసుగుల్ని తొలగించి, లోతుగా అధ్యయనంచేస్తే మనకు తెలిసే విషయాలు వేరేరకంగా ఉన్నాయి.

మొదటి సంఘటన డిల్లీలోని ఒక ఖాజీ (న్యాయాధీశుని) న్యాయస్థానంలో సంభవించింది. గురు తేగ్ బహదూర్ మరియు ఒక ముస్లిం ధార్మిక గురువు హాఫిజ్ ఆదంకు సంబంధించిన సంఘటన చరిత్ర గ్రంథాల్లో వచ్చింది. ఈ కేసులో తిరుగుబాటు కార్యకలాపాలకు శిక్షగా ఖాజీ గురుతేగ్ బహదూర్‌కు మరణ శిక్ష విధించాడు, ఇక హాఫిజ్ ఆదంకు, మరణించే ముందు ఒకసారి పవిత్ర హజ్ యాత్ర చేయాలనే విన్నపంపై, అతని మరణ శిక్షను దేశబహిష్కరణ శిక్షగా మార్చడం జరిగింది. ఈ కేసులో (శిఖ్ఖు గురువు, ముస్లిం ధార్మిక గురువు ఇద్దరి సహాయ సహకారాల్ని సూచిస్తున్నది) ఖాజీ తీర్పు తప్పైనదని, లేక శిక్షలో కాఠిన్యత లేక అసమంజసత ఉందని అంగీకరించినా కూడా, ఇది ఒక వ్యక్తికి (ఖాజీకి) సంబంధించిన వ్యవహారం. ఔరంగజేబ్ ఇష్టానికిగాని, అతని పాలసీకి గాని ఇందులో ప్రమేయం లేదు. దీనిని నిరాకరించనలవిగాని చారిత్రక సాక్ష్యాధారాలున్నాయి. (దీన్ని ప్రఖ్యాత రచయిత ఖుష్వంత్ సింగ్ కూడా అంగీకరించారు). అదేమిటంటే ఈ సంఘటనలన్నీ జరిగినప్పుడు అసలు ఔరంగజేబ్ డిల్లీలో లేనేలేడు, ఇదంతా కూడా అతని పరోక్షంలో, అతనికి తెలియకుండానే జరిగిపోయాయి. అందుకని దీనికి ఔరంగజేబ్‌ను బాధ్యునిగా చేయడం సమంజసమూ కాదు, హేతుబద్ధమూ కాదు.

ఇక గురు గోవింద్ సింగ్ మరియు సూఫీ సయ్యద్ బద్ధూషాహ్‌కు సంబంధించిన సంఘటన. తన తండ్రి అనగా గురు తేగ్ బహదూర్ పట్ల జరిగిన సంఘటనతో స్వాభావికంగా అత్యంత ప్రభావితం కావలసింది గురుగోవింద్ సింగ్‌యే. కాని అప్పటికి కూడా గురుతేగ్ బహదూర్ మరణం లేక మరణ దండన ముస్లిం సిఖ్ఖుల్లో పరస్పర ధార్మిక వ్యతిరేకతను లేపలేదనే దానికి ప్రబల సాక్ష్యం ఉంది. అదేమిటంటే గురు గోవింద్ సింగ్ తను ఇరవై సంవత్సరాల ప్రాయానికి చేరి, నిజ జీవితంలో అడుగిడుదామనుకున్నప్పుడు, తన జీవిత కార్యక్రమాన్ని రూపొందించుకోవడం కోసం ఒక ముస్లిం సూఫీ ధార్మిక గురువైన సయ్యద్ బద్ధూషాహ్‌తో సలహా సహకారాలు తీసుకుంటాడు. అయితే ఈ సూఫీ గురువు కూడా కేవలం సలహా ఇచ్చి ఊరుకోలేదు. ఈ గురువు కోసం అతను తన ప్రాణాలకు తెగించి, తన కుమారుణ్ని పోగొట్టుకొని కూడా, గురు గోవింద్‌కు సహాయం చేయడంలో వెనుకాడలేదు.

దీనికి సంబంధించిన వివరాలు భాయి గ్యాన్‌సింగ్ గ్యాని, తన రచన "గురుఖాల్సా చరిత్ర"[1] అనే ఉర్దూ పుస్తకంలో పేర్కొన్నారు. దాని వివరాలు ఇలా ఉన్నాయి :

యువకుడైన గురువు తన విద్యాభ్యాసపు పది పన్నెండు సంవత్సరాలు పోంటా రాష్ట్రంలో ఉండే "నోహన్"లో గడిపాడు. ఆయన ఇరవై సంవత్సరాల ప్రాయానికి చేరుకున్న ప్పుడు, ఆయనేం చేశారో భాయిగ్యాన్ సింగ్ గ్యాని ఇలా వ్రాశారు :

"ఆ రోజుల్లోనే 'సాధూర' గ్రామానికి చెందిన ఫకీర్ సయ్యద్ బద్ధూ షా ఈయన్ను (గురువు గారిని) కలువడానికి వచ్చాడు, దైవజ్ఞానం, సిసలైన ప్రేమ లాంటి ధార్మిక విషయాలపై పరస్పరం బాగా చర్చించుకున్నారు .... ప్రభుత్వ క్రోధానికి గురిఅయి, ప్రభుత్వ భయంతో ఏ

ఒక్క రాజపుత్ర రాజు కూడా చేరదీయడానికి భయపడుతున్న "వామ్‌లా"కు చెందిన కాలెఖాన్, నజాబత్ ఖాన్‌ల నాయకత్వంలో, దిక్కుతోచక తిరుగాడుతున్న ఐదు వందల మంది అశ్వికుల్ని, సయ్యద్ బద్ధూ షా సిఫారసుపై ఆయన తన వద్ద ఉద్యోగంలో పెట్టుకున్నారు .... "

వీరిద్దరూ ఈ సైనిక దళంతో ఏ పని తీసుకోదలిచారో, ఆ పుస్తకంలోనైతే భాయి గ్యాన్ సింగ్ గ్యాని వివరించలేదు. కాని ఆ తరువాత జరిగిన సంఘటనల్ని దృష్టిలో పెట్టుకుంటే, బహుశ వీరిద్దరు (సయ్యద్ బద్ధూషాహ్, గురు గోవింద్ సింగ్) కొండప్రాంతాలైన శివాలక్ - సట్లెజ్ మరియు జీలం నదుల మధ్య ప్రాంతం - (ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్) ప్రజల్ని సిఖ్ఖు ధర్మం ఆధారంగా ఏకేశ్వరోపాసన వైపునకు తెచ్చే ప్రణాళికను రూపొందించుకొని ఉంటారు. శాంతిపూర్వకంగా జరుగబోయే ఈ కార్యక్రమంలో, ఆ ప్రాంతపు రాజులు బలశక్తులతో ఏదైనా అవరోధాన్ని కల్పిస్తే, సైనిక శక్తిని సైనిక శక్తితోనే ఎదుర్కోవాలని నిశ్చయించుకున్నట్లు కనబడుతుంది.

గురుగోవింద్ సింగ్ దాదాపుగా తన జీవితాన్నంతా ఇదే ప్రాంతంలో గడిపేశారు. సువిశాలమైన ఈ ప్రాంతం, మొగలు సామ్రాజ్యానికి సామంతులైన వివిధ హిందూ రాజుల అధీనంలో ఉండేది. గురువు యొక్క ఈ ప్రణాళికను పసిగట్టిన హిందూ రాజులు, బలవంతంగా గురువును 'పోంటా' నుండి గెంటివేయ సంకల్పించుకున్నారు. గురువు సైన్యంలో చేరిపోయిన ఐదువందల అశ్వికుల్ని లంచాలిచ్చి తమ వైపునకు తిప్పుకున్నారు. ఈ ప్రమాదకర పరిస్థితుల వార్త సయ్యద్ బద్ధూ షాహ్‌కు అందినప్పుడు అతను రెండువేల మంది సశస్త్రులైన తన శిష్యులతో వెంటనే 'పోంటా' చేరుకున్నాడు. భాయి గ్యాన్‌సింగ్ గ్యాని ఇలా వ్రాశారు :

"అతను (సయ్యద్ బద్ధూ షాహ్) వెంటనే తన రెండువేల అశ్విక మరియు పదాతిదళాన్ని తీసుకొని గురువు సహాయార్థం వచ్చేశాడు. అతను రాగానే యుద్ధజ్వాలలు రగుల్కొన్నాయి .... చివరికి కొండ ప్రాంతపు రాజుల సైన్యాలు ధైర్యాన్ని విడనాడాయి. పోరాడటానికి సాహసించలేకపోయాయి. అందుకని పలాయనం చిత్తగించాయి. గురువు సైన్యాలు ఎన్నో మైళ్ళవరకు వారిని వెంటాడి అనేకుల్ని సంహరించాయి లేదా గాయపర్చాయి. వారి వస్తువాహనాదుల్ని ఆక్రమించుకున్నాయి. ఈ వైపు (అనగా గురువు పక్షంలో) కూడా భాయి సింఘియా, జీత్‌మల్ లాంటి వీరులు మరియు సయ్యద్ బద్ధూ షాహ్ కుమారుడు కూడా చనిపోయిన వారిలో ఉన్నారు. కాని తమకు విజయం లభించడం వల్ల ఈ లోటును అంతగా పట్టించుకోవడం జరుగలేదు .... "

1668వ సంవత్సరం 'పోంటా'కు సమీపంలో 'భంగాని' అనే ప్రాంతంలో జరిగిన యుద్ధమిది.

(ఈ సంఘటనను డా. బిషంబర్ నాథ్ పాండే కూడా తన పుస్తకం 'మందిర్ బోల్ ఉఠ్తే (హిందీ) పేజి 29పై పేర్కొన్నారు.)

ఆ తరువాత అంతకన్నా విచిత్రమైన సంఘటన జరిగింది. గురు తన కేంద్రాన్ని 'పోంటా' నుండి "ఆనంద్‌పూర్"కు మార్చారు. గురువుగారి తండ్రి భూమిని కొని స్థాపించిన ఈ "ఆనంద్‌పూర్" కూడా ఈ కొండప్రాంతపు రాజులలో ఒకడైన బిలాస్‌పూర్‌కు చెందిన రాజా భీంసింగ్ రాజ్యంలోనే ఉండేది. దీనిపై మొదట ఆ రాజు తన అభ్యంతరాన్ని వ్యక్తపరిచాడు. కాని ఆ తరువాత ఓ కొత్త పాచికను పారుతూ, మొగలు ప్రభుత్వం తరపున కప్పం వసూలు చేయడానికి వస్తున్న మొగలు అధికారిని, గురువుగారు తామందరి నాయకునిగా ఎదురించి ఆపగలిగితే, తామంతా ఆయనకు విధేయత తెలుపుతామని చెప్పాడు. దానికి గురువు అంగీకరించారు. అయితే ఈ రాజులు ద్వంద్వ వైఖరిని అవలింబించారు. ఒకవైపు గురూతో ఉంటూనే మొగలు సేనాని హుసేన్ ఖాన్‌తో పోరాడుతున్నారు, వేరొకవైపు హుసేన్ ఖాన్‌తో మంతనాలు జరిపి, కొన్ని రాయితీలను పొందగలిగారు, ఇక ఈ ఘర్షణ నిందంతా గురువుగారిపై మోపారు. గురువు వీరి ప్రవర్తనకు మనస్తాపం చెంది, ఆనంద్‌పూర్ పోయి కూర్చున్నారు. జరిగిన ఈ సంఘటన వివరాలన్నీ ఔరంగజేబ్‌కు తెలుపబడ్డాయి. అయితే ఈ సందర్భంలో అతనిచ్చిన ఆదేశాలు జ్ఞాపకముంచుకోదగినవి. అతనేమని ఆదేశించాడంటే; "బేరసారాల ప్రసక్తే లేదు. రాజులతో పూర్తి కప్పాన్ని వసూలుచేయడమే కాకుండా జరిమానా కూడా వసూలుచేయాలి. కాని గురూతో ఎలాంటి సంజాయిషీ అడగనవసరం లేదు". దీని ప్రకారమే వ్యవహరించడం జరిగింది.

గురూకు ఈ విధంగా దాదాపు పది పన్నెండు సంవత్సరాలు కొండప్రాంతపు రాజుల బెడదలేకుండా శాంతిపూర్వకమైన సమయం లభించింది. ఈ మధ్యకాలంలోనే ఆయన పేర్కొనదగిన ఘనకార్యాల్ని సాధించగలిగాడు. ఈ కాలంలోనే ఆయన సిఖ్ఖుల్ని ఒక ప్రత్యేక గుర్తింపు గలిగిన జాతిగా మార్చారు. వారి రూపురేఖల్ని, వేషభాషల్ని, ఆచార వ్యవహారాల్ని, తిని త్రాగే అలవాట్లు, దైనందిన జీవితం – ఒక్కటేమిటి శిఖ్ఖు జాతినే ఒక విభిన్నమైన, వినూత్నమైన, ఒక ప్రత్యేక జాతిగా రూపొందించారు. ఒక ధార్మికాదేశంగా వారిని ఆయుధాలు ధరించ కట్టడిచేశారు, ఇంకా ఒక కొత్త జాతిగా పంజాబ్ మరియు భారతచరిత్రలో పరిచయం చేశారు.

ఔరంగజేబ్ మరోసారి డిల్లీకి దూరంగా నున్న దక్కన్‌లో సుదీర్ఘ సైనిక కార్యకలాపాల్లో నిమగ్నమయ్యాడు. ఈ కొండప్రాంతపు రాజులు, సుదీర్ఘ మౌనం తరువాత, ఔరంగజేబ్ డిల్లీలో లేకపోవడంతో ఈ అవకాశాన్ని వినియోగించదలుచుకున్నారు. ఒకవైపు వారు ఆనంద్ పూర్‌పై దాడి జరుపుతూనే, వేరొక వైపు డిల్లీ నుండి సహాయాన్ని అర్థించారు. ఎప్పుడైనా విద్రోహం లేక కల్లోలం ఏర్పడితే, దాన్నణచడానికి దర్బారుకు చెందిన సామంతరాజుల రూపంలో వారేదైనా సహాయం కోరితే, సహాయం అందిస్తామనే వాగ్దానాన్ని వారు ముందే డిల్లీలో ఉంటున్న ఏదైనా ఉన్నతాధికారి నుండి తీసుకున్నట్లుంది. దీని ననుసరించి వారు సహాయం అర్థించినపుడు మొగలు సైనికదళాలు వారి సహాయం కోసం పంపబడ్డాయి.

కొండప్రాంతపు రాజుల ఈ పాచికలు సరిగ్గా పారాయి. మొగలు దళాల చేరికతో ఆ రాజుల బలం ఇతోధికంగా పెరిగిపోయింది. ఈ యుద్ధంలో గురూ గోవింద్ అనేక కష్టనష్టాల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆయన సర్వస్వం దోచుకోబడింది. ఆయన వెంట బహు స్వల్ప సంఖ్యలో సైనికులు మిగిలిపోయారు. ఆయన ప్రాణాలకే ముప్పు వాటిల్లింది. నలువైపులా శత్రుసైన్యాలు మోహరించి ఉన్నాయి. ఈ ముట్టడి నుండి బయటపడే మార్గమే కనిపించడం లేదు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆయనకు స్నేహితులు, అభిమానులు అయిన ఇద్దరు ముస్లింలు ఆయన్ను కాపాడడం కోసం ప్రాణాలకు సైతం తెగించారు. వీరిద్దరి పేర్లు (గనిఖాన్ మరియు నబిఖాన్) సిఖ్ఖుల చరిత్రలో సురక్షితమై పోయాయి. వీరిద్దరూ రాత్రి సమయంలో, గురూను ఒక పల్లకీలో కూర్చుండబెట్టి, ఆయన్ను తమ ధార్మిక గురువు (పీర్) గా చెబుతూ, కోటకు కాపలా కాస్తున్న సైనికుల్లో నుండి ఆయన్ను సురక్షితంగా బయటికి తేగలిగారు. అక్కడి నుండి గురుగోవింద్ తన ఇంకొక ముస్లిం మిత్రుని గ్రామం వైపునకు బయలుదేరారు. కనిన్గ్‌హంను అనుసరించి అతను బహ్‌లూల్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పీర్ ముహమ్మద్. అతని వద్ద తలదాచుకున్న గురూ, తిరిగి కొంతవరకు తన అనుయాయుల్ని సమీకరించుకొని, ఇంకాస్త సురక్షితమైన ప్రాంతానికి వెళ్ళిపోయారు.

ఇక్కడ తన పట్ల జరిగిన విషయాలన్నిటినీ వివరిస్తూ గురూగారు పర్షియన్ భాషలో ఒక కవితా రూపంలో పద్యం వ్రాసి, తన అంతరంగికుడైన (భాయి దయాసింగ్) అనే దూతతో దక్కన్‌లో ఉంటున్న ఔరంగజేబ్ వద్దకు పంపించారు. అయితే ఇక్కడ జరిగిన ఒక విచిత్రమేమిటంటే ఆయన తరువాత వచ్చిన శిష్యులు ఈ కవితను లేక పద్యాన్ని దాని అసలు మూలమైన పర్షియన్‌లో కాకుండా, గుర్‌ముఖి లిపిలో భద్రపరిచారు. ఆ తరువాత ఎంతో కాలానికి తిరిగి దాన్ని పర్షియన్‌లో అనువదించి పర్షియన్ లిపిలో భద్రపరిచారు. ఫలితంగా దాని పద్యపాదాలు, శబ్దాలు ఎంతో తారుమారయ్యాయి. అయినాగాని ప్రస్తుతం లభించే రూపంలో కూడా ఈ పద్యాన్ని అధ్యయనం చేస్తే, ఆ కాలపు ఆలోచనా సరళిని అర్థం చేసుకోవచ్చు. ఈ పద్యంలో చక్రవర్తి సైన్యాలు, తనకు వ్యతిరేకంగా కొండప్రాంతపు దౌర్జన్యపరులైన రాజుల సహాయార్థం రావడంపై తమ విస్మయాన్ని వ్యక్తపరిచారు. ఇంకా మొగలు సైనిక నాయకులు ఖుర్‌ఆన్‌ను సాక్షిగా పెడుతూ తమను రక్షిస్తామని వాగ్దానం చేశారని, కాని ఈ వాగ్దానాన్ని విశ్వసించి తను (ఆనంద్‌పూర్) కోట నుండి బయటికి రాగానే దాడికి పాల్పడ్డారని నిందించడం జరిగింది. ఇంకా రాజుగారి సెక్రటరీలు, మంత్రులు అసత్య వాదులని, వారిని విశ్వసించలేమని తెలుపడం జరిగింది .... ఇది తెలుసుకున్న ఔరంగజేబ్ గురుగోవింద్‌ను కలిసి, ఆయన గాయాలకు ఉపశమనం కలిగించి, మామూలు సంబంధాలు నెలకొల్ప నిశ్చయించుకున్నాడు. కాని అంతలోనే 1707లో అతను పరమపదించాడు.

గురూ గోవింద్ జీవితపు చివరి సంవత్సరాలు ఔరంగజేబ్ వారసుడు బహదూర్ షా సహచర్యంలో గడిచిపోయాయి. సమకాలీన చరిత్రకారుడు ఖాఫి ఖాన్‌ను అనుసరించి బహదూర్ షా గురూను ఒకసారి రత్నఖచిత తలపాగా, అరవై వేల రూపాయలు నగదు ఇచ్చి సత్కరించాడు. ఆ తరువాత గురూ గోవింద్ తన రెండు మూడు వందల బల్లెపు సైనికులతో దాదాపుగా అన్ని వేళల్లో బహదూర్ షాతోనే ప్రయాణించారని పేర్కొన్నాడు.

ఇదీ శిఖ్ఖులకు సంబంధించిన సంక్షిప్త చరిత్ర, అందులో ఔరంగజేబ్ పాత్ర, ఇందులో హిందూ - ముస్లింలంటూ, లేక శిఖ్ఖు–ముస్లింలంటూ ప్రత్యేకంగా జరిగిన సంఘటనలేమీ లేవు. చివరి గురువైన గురు గోవింద్ కాలంలో ప్రభుత్వాధికారుల చెడు వర్తనంతో, లేక బాధ్యతా రాహిత్యంతో ఆయన బాధలు అనుభవించి ఉండొచ్చు. అయితే ఈ ప్రభుత్వాధికారుల దౌష్ట్యాలతో హిందూ–ముస్లిం అనే తారతమ్యం లేకుండా ప్రజలందరూ బాధపడుతూ వచ్చారు, వస్తున్నారు కూడా. దాన్ని అదే సందర్భంలో తీసుకోవాలి.

శిఖ్ఖుల చరిత్ర ఒకే చూపులో దృష్టిలోకి రావాలని కుదించి, సంక్షిప్తం చేసి పై వివరాల్ని సమర్పించడం జరిగింది. పై వివరాలు ప్రముఖ చరిత్రకారుడు సాది సంగర్‌వరీ రాసిన "మొహియుద్దీన్ ఔరంగజేబ్ ఆలంగీర్" అనే పేరుగల పుస్తకం నుండి సేకరించడం జరిగింది. ఆయన వ్యక్తపరిచిన అభిప్రాయాలతో నూటికి నూరుపాళ్ళు మనం ఏకీభవించ నవసరంలేదు. అయితే శిఖ్ఖులు–ఔరంగజేబ్‌కు సంబంధించి ఒక కొత్త దృష్టి కోణాన్ని తెలుసుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఇక్కడ పొందుపరచడం జరిగింది.

శిఖ్ఖుల చరిత్ర గురించి తెలుసుకోవడం కోసం కనిన్గ్‌హం ద్వారా రాయబడి, కమలాకర్ తివారీ ద్వారా ఎడిట్ చేయబడి, రమేష్ తివారి సురేష్ తివారీల ద్వారా అనువదించబడి, ఇతిహాస్ ప్రకాష్ సంస్థాన్, వారణాసి ద్వారా ప్రచురించబడిన "సిఖోంకా ఇతిహాస్" అనే గ్రంథం కూడా ఉపకరిస్తుంది.

ఔరంగజేబ్ జీవిత చరిత్రను సుదీర్ఘమైన ఐదు సంపుటాల్లో వెలువరించిన ప్రఖ్యాత భారత చరిత్రకారుడు జదూనాథ్ సర్కార్ "ఔరంగజేబ్–శిఖ్ఖుల"కు సంబంధించి తన చరిత్రలో వెలిబుచ్చిన అభిప్రాయాల్ని తెలుసుకోవడం అసమంజసం కాదనుకుంటాము.

తన చరిత్ర గ్రంథంలో ఆయనిలా వ్రాశారు :

"పవిత్ర జీవితం, పవిత్ర మరణం, అణకువ, ఆరాధనా, త్యాగం మరియు ఇంద్రియ నిగ్రహాలతో స్వర్గ సామ్రాజ్యాన్ని పొందవచ్చనేది గురూ నానక్ పంథా, పద్ధతి. అయితే శిఖ్ఖులు ప్రత్యేకించి గురు గోవింద్ ఈ పద్ధతిని విడనాడారు. వారు రాజుల లాంటి జీవితానికి అలవాటు పడ్డారు. వారి దర్బారులో కవులూ ఉంటుండేవారు. వారు తమ కోసం, తమ కుటుంబం కోసం అత్యధికంగా బంగారు ఆభరణాలను చేయించుకున్నారు. వారి అంగరక్షకుల అంబుల పొదిలోని బాణాలకు బంగారం అతికించబడి ఉంటుండేది. వారూ మొగలుల లాగే తమ

కోసం ఓ పెద్ద యుద్ధ నగారాను చేయించుకున్నారు. వారి సైనికులు బిలాస్‌పూర్ కొండ ప్రాంతం రాజు ప్రజల్ని దోచుకుంటూ, వారిని అగౌరవపరిచేవారు. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - జ.నా.స.- వాల్యూం-3, పేజి 210)

"తమ శిష్యులకు పుణ్యార్జన, సన్మార్గపు విద్యను గరిపి, వారిని పాపాల నుండి, చెడు మార్గం నుండి మళ్ళించి, దైవంతో సంబంధం ఏర్పరచడం వరకే ఒక గురు స్థానమని గురు నానక్ సూచించారు. కాని క్రమక్రమంగా గురూ అంధానుకరణ ప్రారంభమయింది. గురూ పట్ల భక్తి విశ్వాసాలు అతిశయోక్తి హద్దుల్ని ముట్టుకోసాగాయి. ఆ తరువాత శిఖ్ఖులు తమను దైవంచే ఎంపిక చేయబడిన ప్రత్యేక వ్యక్తులుగా భావించుకోసాగారు. హిందూ-ముస్లింల దృష్టి నుండి సత్యం దూరమైపోయిందని, వీరిద్దరూ మార్గం తప్పారని, వారు తమ అపోహల్ని, అపశకునాల్ని దూరం చేసుకుంటే శిఖ్ఖులు అవుతారని, ఇద్దరు శిఖ్ఖులు చేరారంటే అది ఇద్దరు పుణ్యపురుషుల కలయిక అని, ఇక ఎక్కడయితే ఐదుగురు గుమిగూడుతారో, అక్కడ దేవుడుం టాడనేది భాయి గురుదాస్ బోధనలు. (హి.ఆ.ఔ. - య.నా.స. వా-3, పేజి 208, 209).

"షాజహాన్ కాలంలో ఒక వేట జంతువును పురస్కరించుకొని, అమృత్‌సర్ సమీపంలో మొగలులకు, శిఖ్ఖులకు మధ్య ఒక ఘర్షణ జరిగింది. అందులో శిఖ్ఖులు, అనేకమంది ప్రభుత్వ సైనికుల్ని హతమార్చారు. వీరికి వ్యతిరేకంగా షాజహాన్ ఒక సైన్యాన్నే పంపించాడు. కాని 1628లో "సంగారాన" ప్రాంతంలో ఈ సైన్యానికి అపజయం వరించింది. దీంతో శిఖ్ఖుల మనోబలాలు బాగా పెరిగిపోయాయి. ఇక తమను ఎదురించేవారే లేరంటూ వారు బాహాటంగా చెప్పుకోసాగారు. ఆ కాలంలో వారికి గురు గోవింద్ గురూగా ఉంటుండేవారు. కాని రాజ్య సైన్యాలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని, ఆయన ఇల్లు మొదలుగాగల వాటిని జప్తు చేసుకోవడం జరిగింది. ఇక ఆయన స్వయంగా కాశ్మీర్ కొండల్లో ఉండే కీరత్‌పూర్ అనే చోట తలదాచుకోవలసి వచ్చింది." (హి.ఆ.ఔ.- య.నా.స. వా-3, పేజి 205, 206)

"1645 లో గురు హర్‌గోవింద్ గతించారు. ఆయన తన పదునాలుగు సంవత్సరాల ప్రాయం గల మనువడు హర్‌రాయ్‌ను తన ఉత్తరాధికారిగా ప్రకటించారు. కాని అతనికన్నా పెద్ద మనుమడైన ధీరూమల్ మొగలుల సమర్థన పొంది, తనను నిజ గురుగా ప్రకటించు కున్నాడు. గురూ గ్రంథ్ సాహబ్ అసలు ప్రతిని తన స్వాధీనంలోకి తీసుకున్నాడు.

దారా షికూహ్ సమూగడ్ యుద్ధంలో అపజయాన్ని చవిచూసి, పంజాబ్‌లో తలదాచు కోవడానికి తిరుగాడుతున్నప్పుడు, హర్‌రాయ్ అతన్ని ఆశీర్వదించి సమర్థించాడు. అయితే అతన్ని ఔరంగజేబ్ తన దర్బారుకు పిలిపించాడు. కాని అతను తన జ్యేష్ఠ కుమారుడు రామ్‌రాయ్‌ను తన ప్రతినిధిగా పంపించాడు. రామ్‌రాయ్ దర్బారుకు చేరి మొగలుల సమర్థకు నిగా మారిపోయాడు. ఆ తరువాత హర్‌రాయ్ అతన్ని తన వారసత్వం నుండి వంచించాడు. 1661లో హర్‌రాయ్ మరణించాడు. అతని రెండవ కుమారుడు హర్‌కిషన్ అతని ఉత్తరాధికారిగా,

గురూగా అయ్యాడు. కాని రామ్‌రాయ్ దీన్ని అంగీకరించలేదు. వారసత్వ వివాదం తలెత్తింది. ఔరంగజేబ్ హర్‌కిషన్‌ను డిల్లీ పిలువనంపాడు. కాని అతను డిల్లీ చేరుకోకముందే మశూచి వాతబడి 1664లో చనిపోయాడు. ఆ తరువాత గురూ హర్‌గోవింద్ కనిష్ఠపుత్రుడు తేగ్ బహదూర్ శిఖ్ఖుల గురువయ్యాడు. ఆయన మొగలు సైన్యంలో చేరిపోయారు. 1668లో మిర్జా రాజా జైసింగ్ కుమారుడు రాజారాం సింగ్ రాజ్య సైన్యాలను తీసుకొని, అస్సాంలో యుద్ధంకోసం బయలుదేరినప్పుడు, గురూ తేగ్ బహదూర్ తన అనుచర సముదాయంతో అతని వెంట ఉన్నారు. అక్కడి నుండి తిరిగి వచ్చిన తరువాత, ఆనంద్‌పూర్‌లో తనింట్లో ఉండసాగారు.” (హి.ఆ.ఔ.-జ.నా.స.వా-3, పే.206, 207)

గురుతేగ్ బహదూర్ తరువాత ఆయన కుమారుడు గోవింద్ రాయ్ గురువయ్యాడు.

“అతను యుద్ధ కార్యకలాపాల్ని ప్రారంభించినప్పుడు, గడ్వాల్‌లో జమ్మూ నుండి శ్రీనగర్ వరకు వ్యాపించి ఉన్న హిందూ రాజులతో కూడా పోరాడసాగాడు. వారంతా ఇతని హింసాత్మక చర్యలకు వివశులై పోయారు. అతను మొగలు ప్రాంతాల్ని కూడా ధ్వంసం చేయ నారంభించాడు. సర్ హింద్ ప్రాంతం నుండి ఒక పెద్ద సైన్యాన్ని అతన్ని ఎదుర్కోవడానికి పంపడం జరిగింది. కొండ ప్రాంతంలోని హిందూరాజులు కూడా ఈ సైన్యంతో కలిసి పోయారు. గురు గోవింద్ కేంద్రమూ, స్థావరమూ అయిన ఆనంద్‌పూర్ కోట ముట్టడించ బడింది. సుదీర్ఘ ముట్టడి తరువాత గురు గోవింద్ ఈ కోటను వదలి పారిపోవాల్సివచ్చింది. ఎంతో దూరం వరకు మొగలులు అతన్ని వెంబడించారు. ఈ విధంగా జరిగిన ఘర్షణల్లో గురు నలుగురు కుమారులు గతించారు. గురు గోవింద్ పారిపోయి దక్షిణ భారతం చేరుకున్నాడు. చివరికి 1707లో ఔరంగజేబ్ గతించాడని వార్త అందిన తరువాత గాని ఉత్తర భారతానికి వచ్చాడు. ఆ తరువాత అతను ఔరంగజేబ్ కుమారుడు బహదూర్ షాను కలిసి, అతను సింహాసనాన్ని అధిష్టించడంలో అతనికి సహాయపడ్డాడు. బహదూర్ షా - 1, అతన్ని దక్కన్ మరియు రాజ్‌పుతానలో జరిగిన యుద్ధాల్లో తన వెంట ఉండటానికి అంగీక రింపజేశాడు. పదాతి మరియు అశ్వికులతో అతను నాందేడ్ చేరుకున్నాడు. అతనిక్కడ ఒక సంవత్సరం వరకున్నాడు. 1708లో ఒక అఫ్గన్ అతన్ని కత్తితో పొడిచి చంపేశాడు. (హి.ఆ.ఔ. - య.నా.స. వా-3, పేజి 210-211)

జదూనాథ్ సర్కార్ వెలిబుచ్చిన పై అభిప్రాయాల ద్వారా ఒక విషయం మాత్రం విదిత మవుతుంది. శిఖ్ఖులకు వ్యతిరేకంగా ఔరంగజేబ్ ధార్మిక అసహనత్వానికి, ధార్మిక హింసకు పాల్పడలేదు, దానికి భిన్నంగా వారిని రాజకీయంగా, సైనికపరంగా మాత్రమే అణిచివేశాడు.

ఇక చివరిలో డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, ప్రొఫెసర్ పాట్నా యూనివర్శిటి, “శిఖ్ఖులు మరియు ఔరంగజేబ్” అనే శీర్షికతో రాసిన వ్యాసం సందర్భోచితంగానూ, అభూత కల్పనలతో కూడిన అసత్యాన్ని తేటతెల్లం చేయడంలోనూ దోహదపడుతుందనే దృష్టితో ఇక్కడ పొందు పరుస్తున్నాము.

## శిఖ్ఖుల తిరుగుబాటు :

శిఖ్ఖుల విద్రోహం ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా జరిగిన విద్రోహాల్లో చివరిది. శిఖ్ఖు గురువులు, పరిపాలకుల లాగే తమ జీవన విధానాన్ని మార్చుకోవడమే కాకుండా, తమకంటూ ఒక సైన్యాన్ని కూడా ఉంచుకోసాగారు. తమను వీరు "నిజమైన రాజు" (సచ్చా పాద్‌షా) అంటుండేవారు.[2] 1675 వరకు కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం గాని, ప్రమాదంగాని పడలేదు గనక ఔరంగజేబ్ శిఖ్ఖు గురువులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్య గైకొనలేదు.

ఏడవ గురువైన హర్‌రాయ్[3] ప్రథమ పుత్రుడు రామ్‌రాయ్ ఒక దాసీ గర్భం నుండి జన్మించాడు. హర్‌రాయ్ ధర్మపత్ని గర్భం నుండి జన్మించిన రెండవ కుమారుడు హరికిషన్. హర్‌రాయ్ తన ప్రథమ పుత్రుడైన రామ్‌రాయ్‌ను తన వారసునిగా ప్రకటించడంతో, పంజాబ్ అంతరంగిక వ్యవహారాల్లో తీవ్ర ఉద్రిక్తత వ్యాపించింది. ఈ వివాదాన్ని పరిష్కరించే బాధ్యతను ఔరంగజేబ్‌కు అప్పగించడం జరిగింది. కాని శిఖ్ఖుల ఈ అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి అతను ఇష్టపడలేదు, అందుకని శిఖ్ఖులు తమ ఈ అంతరంగిక వ్యవహారాన్ని తామే పరిష్కరించుకోవాలని అతను కోరాడు.[4]

చివరికి హర్‌రాయ్ ధర్మపత్ని ద్వారా జన్మించిన పుత్రుడు హర్‌కిషన్ ఎనిమిదవ గురూగా ప్రకటించబడ్డాడు. కాని కొన్ని రోజులకే అతను మశూచి వ్యాధి వాతబడి మరణించిన కారణంగా, గురు తేగ్ బహదూర్‌ను తొమ్మిదవ గురూగా అంగీకరించడం జరిగింది. అస్సాంకు విరుద్ధంగా జరిగిన యుద్ధంలో, గురు తేగ్ బహదూర్ మొగలు సైన్యంలో ఉండి పోరాడాడు. అయితే ఆ తరువాత తన శిష్యుల మరియు సైనికుల ఖర్చులు భరించడానికి ఆయన బెదిరించి, బలవంతంగా [5] ధనాన్ని సేకరించడం మొదలుపెట్టాడు. ఆదం హాఫిజ్ అనే పేరుగల ఒక ముస్లిం సూఫీతో ఆయనకు గాఢమైన మిత్ర సంబంధాలుండేవి. ధనికులైన హిందువులతో తేగ్ బహాదూర్, ధనిక ముస్లింలతో ఆదం హాఫిజ్ కోరినంత ధనాన్ని వసూలు చేసుకునేవారు.[6] వీరిద్దరి దౌర్జన్యకర చర్యలకు విసుగెత్తిన ఔరంగజేబ్ సైనికులు వారిని బంధిం చారు. నిజానికి స్వంత భోగలాలసత్వాల కోసం ఆదం హాఫిజ్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడు. కనుక ఔరంగజేబ్ అతనికి దేశ బహిష్కరణ శిక్ష విధించాడు. కేంద్రానికి విరుద్ధంగా తన సైనిక శక్తిని సుదృఢ పరచుకోవడానికి తేగ్ బహదూర్ అల్లకల్లోల వాతావరణాన్ని, అలజడిని సృష్టించాడు. కనుక 1675లో ఔరంగజేబ్ ఆదేశానుసారం అతనికి మరణదండన విధించబడింది. కాని గురుతేగ్ బహదూర్‌కు మరణశిక్ష విధించబడిందనే విషయంలో మన వద్ద గట్టి ఆధారాలేమీ లేవు.[7]

ఒక ఆంగ్లేయ అధికారి మైకెలిఫ్ తన గ్రంథం "శిఖ్ఖుల చరిత్ర" లో గురు తేగ్ బహదూర్‌కు ఔరంగజేబ్ మరణశిక్ష విధించాడని మొట్టమొదటిసారిగా వ్రాశాడు. మైకెలిఫ్ కంటే ముందు దీనికి సంబంధించిన ఎలాంటి ప్రస్తావన గాని లేక సాక్ష్యంగాని లభించదు. ఇంతకన్నా కూడా అతి ముఖ్యమైన ఇంకొక విషయం ఏమిటంటే మైకెలిఫ్ తరువాత ప్రచురింపబడిన ఇంకొక పుస్తకంలో మైకెలిఫ్ వెలిబుచ్చిన అభిప్రాయం అంటే "గురు తేగ్ బహదూర్‌కు ఔరంగజేబ్ మరణశిక్ష విధించాడు" అనే అంశానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. అయితే మైకెలిఫ్

ద్వారా రాయబడిన గ్రంథానికి ముందు ఈ విషయానికి సంబంధించిన ఇంకొక అంశం మన దృష్టికి వస్తుంది.[8]

1893లో భాయి మునిసింగ్ ద్వారా ప్రచురింపబడిన పుస్తకం "భగత్ రత్నావళి"లో ఒక సిఖ్ శిష్యుడే స్వయంగా ఆయన అనుమతితో ఆయన తలను నరికేశాడని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. కనిన్గ్హం[9] వ్రాసిందేమంటే ఆయన ఔరంగజేబ్‌కు తన మహాత్మ్యాన్ని చూపించడానికిగాను, తాను ఎలాంటి మంత్రాన్ని వ్రాస్తాడంటే, దాన్ని రాసుకొని మెడలో వేలాడదీసుకుంటే, ఎంత ఘాటుగా కత్తివేటు పడ్డాకూడా, మెడపై దాని ఎలాంటి ప్రభావం పడదని చెప్పాడు. ఈ మంత్రాన్ని రాసుకొని ఆయనే స్వయంగా తన మెడలో వేసుకున్నాడు. ఇంకా తన ఓ శిష్యున్ని తన మెడపై వేటు వేయమని సంజ్ఞచేశాడు. ఘాటైన కత్తివేటు మెడపై పడగానే ఆయన శిరస్సు మొండెం నుండి వేరై ఓ ప్రక్కకు పడిపోయింది. గురూజి సన్నిధిలో సతతం ఉంటూ వచ్చే భాగ్యం లభించిన వ్యక్తులే ఈ సంఘటనను ఉల్లేఖించారు. అయితే 1912లో ఈ గ్రంథం అనగా "భగత్ రత్నావళి" రెండవసారి ముద్రించబడినప్పుడు విచిత్రంగా ఈ సంఘటనను తీసివేయడం జరిగింది. ఎందుకంటే పునర్ముద్రణకు పూర్వమే మైకలిఫ్ కథనం ఉనికిలోకి వచ్చేసింది.

ఈ విధంగానే గ్యానిసింగ్ వ్రాసిన పంథ్ ప్రకాశ్ మొదటి ఎడిషన్ 1879లోనూ, రెండవ ఎడిషన్ 1883లోనూ ప్రచురింపబడింది. ఈ రెండు ఎడిషన్లలో కూడా గురు తేగ్ బహదూర్‌ను ఔరంగజేబ్ చంపించాడనే ఎలాంటి ప్రస్తావన లేదు. పంథ్ ప్రకాశ్ మూడవ ఎడిషన్, మైకలిఫ్ పుస్తకం వెలువడిన తరువాత వచ్చింది. ఈ మూడవ ఎడిషన్‌లో గురు తేగ్ బహదూర్‌ను ఇస్లాం స్వీకరించమని కోరడం జరిగిందని, ఆయన దీన్ని తిరస్కరించడంతో డిల్లీలోని చాందినీ చౌక్‌లో ఆయన్ను హతమార్చడం జరిగిందనే వాక్యాల్ని పెంచడం జరిగింది. ఇంకొక అతి ముఖ్యమైన అంశం ఏమిటంటే కనిన్గ్హం తన పుస్తకంలో ఇలాంటి సంఘటనను పేర్కొనలేదు.

"సిఖాఁదేరాజ్" పేరుగల పుస్తకం 1862 మరియు 1892 లో రెండుసార్లు ముద్రించబడి బయటికొచ్చింది. ఇందులో కూడా "భగత్ రత్నావళి" లాగే, గురు తేగ్ బహదూర్‌కు ఔరంగజేబ్ మరణదండన విధించాడనే ప్రస్తావనే లేదు. అయితే ఇదే పుస్తకపు గురు ముఖి ఎడిషన్‌లో, వాస్తవానికి విరుద్ధంగా ఔరంగజేబ్ పేరును, ఈ సంఘటనను చేర్చడం జరిగింది.

గురు తేగ్ బహదూర్ మరణం తరువాత సిఖ్ఖు ఉద్యమం ఒక సైనిక రూపాన్ని సంతరించుకున్నది. ఈ ఉద్యమానికి సిఖ్ఖుల పదవ మరియు అంతిమ గురువైన గురు గోవింద్ సింగ్ మహత్వపూర్వకమైన సహాయ సహకారాలందాయి. మొదటి ఘట్టంలో హిందూ రాజులు తమ అంతరంగిక వివాదాల్లో గురు గోవింద్ సింగ్ సహాయంతో లాభపడదలిచారు. కాని గురూజీ

త్వరలోనే తన పరిస్థితిని పటిష్ఠపరచుకొని, హిందూ రాజులకు వ్యతిరేకంగా మారాడు. అనేక హిందూ రాజులు కలిసి 1704లో మూకుమ్మడిగా గురూజీపై దాడి జరిపారు. అయితే అందులో గురూజీ విజయం సాధించాడు. అప్పుడు హిందూ రాజులు, గురు గోవింద్ సింగ్‌కు వ్యతిరేకంగా తమకు సహాయపడమని మొగలులకు విన్నవించుకున్నారు. గురు గోవింద్ సింగ్‌ను అణచడం తమ ప్రయోజనాల దృష్ట్యా, మొగలులు అవసరమని భావించారు. లాహోర్ సూబేదార్‌ను, సర్‌హింద్ ఫౌజ్‌దారు వజీర్ ఖాన్‌ను, గురు గోవింద్ సింగ్‌కు వ్యతిరేకంగా కొండప్రాంతపు రాజులకు సహాయమందించమని ఔరంగజేబ్ ఆదేశించాడు. ఫలితంగా సిఖ్ఖులు తొలగించబడ్డారు.

ఔరంగజేబ్‌ను క్రూరునిగా, శిఖ్ఖు విరోధిగా చూపించడానికి చారిత్రక సాక్ష్యాధారాల్ని తుంగలో తొక్కి, 1827లో ముద్రించబడిన ఒక పుస్తకంలో ఔరంగజేబ్ గురు గోవింద్ సింగ్ ఇద్దరు పిల్లల్ని హతమార్చాడని పేర్కొనడం జరిగింది. భాయి బీర్‌సింగ్ పటియాల్వి తన గ్రంథం "సంఘ్ సాగర్"లో గురు గోవింద్ సింగ్ పిల్లలిద్దరినీ గోడలో సజీవంగా పేర్చి చంపించారనే ప్రస్తావనను మొట్టమొదటిసారిగా పేర్కొన్నారు. దీన్నే ఆ తరువాత బ్రౌన్ [10] కనన్గ్‌హం[11] లు ఇంకా మసాలాలు కలుపుతూ చూపించారు. 1887 నుండి గురూజీ పిల్లల పేరుతో జాతర (మేళా) కూడా జరుగ నారంభించింది.

గురు గోవింద్ సింగ్ ముఖ్య ప్రణాళికలతో, కేంద్ర వ్యతిరేక ఉద్యమాలతో ఔరంగజేబ్ జాగరూకుడై పోయాడనడంలో సందేహం లేదు. ఇంకా కేంద్రంతో తిరుగబడే ఇతర శక్తుల్ని అణచివేసినట్లే, అతను శిఖ్ఖుల్ని కూడా అణచివేశాడు, కాని గురు గోవింద్ సింగ్ పిల్లలిద్దరినీ చంపించాడనే వాదనకు మనవద్ద గట్టి సాక్ష్యాధారం ఏమి లేదు. [12] ఎవరి ఇద్దరు కుమారుల్ని గురూజీ వధించి ఉన్నాడో, ఆ పఠాన్ ద్వారానే గురు గోవింద్‌సింగ్ సంహరింపబడ్డాడు. గురూజీతో కలసి పరిస్థితుల్ని సామాన్య స్థితికి తేవడానికి ఔరంగజేబ్ ఆలోచిస్తూనే ఉన్నాడు. కాని ఇంతకు ముందే అనగా 1707లో అతను మరణించాడు. [13]

హిందూ-ముస్లింలలో అగాధాన్ని లేక ఉద్రిక్తతను నూటికి నూరు పాళ్ళు సత్యమని చూపించడం రాజకీయ ప్రయోజనాల రీత్యా సమంజసమనిపిస్తుందేమో గాని, చారిత్రక రీత్యా ఎంతమాత్రం కాదు, తమ స్వంత ప్రయోజనాల కోసం హిందువులు హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలకు సహకరించిన సామెతలు మనకు కోకొల్లలుగా లభిస్తాయి.[14] అదేవిధంగా అవసరం ఏర్పడినప్పుడు ముస్లింలకు వ్యతిరేకంగా ముస్లింలు, హిందువుల్ని సమర్థించిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఉదాహరణకు గురు గోవింద్ సింగ్ తల్లి మరియు ఆయన పిల్లలు గంగారాం అనే పేరుగల బ్రాహ్మణుని వద్ద తలదాచుకున్నప్పుడు, ఈ గంగారామే గురూజీ తల్లి సుందరిని,

ఆయన పిల్లల్ని 'సర్‌హింద్' అధికారికి అప్పగించాడు. ఇంకా ప్రాణాల్ని పణంగా పెట్టి గురు గోవింద్ సింగ్‌ను మృత్యుముఖం నుండి తప్పించిన నబిఖాన్ మరియు గని ఖాన్ ఇద్దరినీ గురు గోవింద్ సింగ్ "కుమారుల కంటే ప్రియులు" అని పేర్కొన్నాడు.

పృథ్వీచంద్ అనే వ్యక్తి గురు అర్జున్ సింగ్‌కు నిజమైన సోదరుడు. అయితే తన సోదరుని ప్రాణాలు తీసుకునేంత వరకు అతను నిశ్చింతగా కూర్చుండలేకపోయాడు. నిజానికి ఇతని కారణంగానే గురు అర్జున్ సింగ్ బంధించబడ్డాడు.

ఎవరి చేతుల మీదుగా అమృత్‌సర్‌లోని గురుద్వారా (గోల్డెన్ టెంపుల్) శంఖుస్థాపన చేయబడిందో, ఆయన మియాఁ మీర్ పేరు గల ఒక ముస్లిమే.

చందూ షాహ్ అనే వ్యక్తి ఒక హిందువే కదా! అతనే గురు అర్జున్ సింగ్‌ను నానా రకాలుగా హింసించి, చంపించాడు. ఆ విధంగా ఆయన సోదరుడు పృథ్వీచంద్ హృదయాగ్నిని చల్లబరిచాడు. బాబా ఫరీద్ ఒక ముస్లిం ధార్మిక గురువు. ఆయన కవితల్ని గురూ అర్జున్ సింగ్ గురూ గ్రంథ్ సాహెబ్‌లో కలిపేశాడే! బహదూర్ షా ఒక ముస్లిమే అయినప్పటికీ అతనిచే ఇవ్వబడిన ఖడ్గము 'జుల్ఫీఖార్' నేటి వరకూ ఆనంద్‌పూర్ సాహబ్‌లో సురక్షితంగా ఉంది. ధీరూమల్ అనే వ్యక్తి గురూ తేగ్ బహదూర్‌కు సోదర కుమారుడే అయినప్పటికీ, సతతం మొగలు దర్బారులో ఆయనకు వ్యతిరేకంగా చాడీలు చెబుతుండేవాడు. అందుకని ఔరంగజేబ్ కాలంలో మరాఠాల, శిఖ్ఖుల, జాటుల తిరుగుబాట్లయితే జరిగాయి గాని, మతపరమైన కలహాలు మాత్రం జరుగలేదని మనం ఘంటాపథంగా చెప్పుకోవచ్చు.[15]

(ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి – డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 40 – 44)

# 19. ఔరంగజేబ్ - రాజపుత్రులు

రాజపుత్రుల చరిత్ర మొగలు వంశ చరిత్రతో ఎంతగా పెనవేసుకు పోయిందంటే ఈ రెండింటిని విడదీయడం అత్యంత కష్టతరమైన విషయం. అక్బర్ చక్రవర్తి కాలంలో మొగలులతో ప్రారంభమైన రాజపుత్రుల సంబంధ బాంధవ్యాలు ఔరంగజేబ్ కాలం వరకే కాదు, ఆ తరువాత అతని వారసుల వరకు కూడా కొనసాగాయి. యూరోపియన్ చరిత్ర కారులు, ఇంకా మన దేశ చరిత్రకారుడు అయిన జదూనాథ్ సర్కార్, ఔరంగజేబ్‌పై ఇతర విషయాల్లో బురద జల్లినట్లే రాజపుత్రుల విషయంలో కూడా ఔరంగజేబ్‌ను ఆడిపోసుకోకుండా ఉండలేకపోయారు. ఔరంగజేబ్‌ను ప్రతి విషయంలోనూ కించపరచాలని వారొక ప్రణాళికను ముందే సిద్ధం చేసుకొని, ఈ చరిత్ర రాయడం ప్రారంభించారని, మొదటి అధ్యాయాల్లోనే, డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే, బాబు రాజేంద్రప్రసాద్, ప్రొఫెసర్ సతీశ్ చంద్ర, డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ లాంటి వారి వాంఙ్మూలాల ద్వారా నిరూపిస్తూ వచ్చాము. అయినా ఔరంగజేబ్ మరియు రాజపుత్రుల సంబంధాలు ఒక ముఖ్య అంశం గనక ఈ విషయంలో కూడా పాఠకులకు వివరంగా తెలుపదలుచుకున్నాము.

ముందుగా లేన్‌పోల్, అల్ఫిన్స్‌టన్ లాంటి పాశ్చాత్య చరిత్రకారుల అసత్య ఆరోపణల్ని, మనోకల్పిత కథల్ని, ఆధారంలేని అపవాదాల్ని పోస్టుమార్టం చేసిన తరువాత, మన దేశీయ చరిత్రకారుడైన 'సర్ జదూనాథ్ సర్కార్' రాతల్లోని కుహన నీతిని, పరస్పరం విరుద్ధమైన వాంఙ్మూలాల వాస్తవికతను పాఠకుల ముందు బట్టబయలు చేస్తాము.

పాశ్చాత్య చరిత్రకారులు అనేదేమిటంటే మొగలు సామ్రాజ్యస్థాపన, మరియు పటిష్ఠతలో కుడిభుజంగా నిలిచిన రాజపుత్ర నాయకుల్ని ఔరంగజేబ్ తన ప్రవర్తన ద్వారా అసంతృప్తి పరిచాడు.

ఔరంగజేబ్ అపరాధాన్ని లేన్‌పోల్ ఇలా వర్ణించాడు.

"ఔరంగజేబ్ ప్రభుత్వ ప్రారంభంలో మొగలు సామ్రాజ్యానికి కుడిభుజంగా నిలిచిన రాజపుత్ర జాతే, ఎంతగా దూరమై పోయిందంటే, ఇక తిరిగి కలిసే ఆస్కారం లేకుండా పోయింది. అక్బర్ సింహాసనంపై, ఈ మహాగొప్ప ధార్మికుడు ఆసీనుడై ఉన్నంతకాలం, అతని సహాయ సంరక్షణల కోసం ఒక్క రాజపుత్రుడు కూడా వేలు కదపడానికి సైతం సంసిద్ధం కాలేకపోయాడు."

ఈ నేరాన్నే లేన్‌పోల్ ఇంకా ఇలా వివరించాడు :

"ఔరంగజేబ్‌కు అత్యంత సన్నిహితుడు కాని అత్యంత శక్తిసామర్థ్యాలు కలిగిన రాజపుత్రుడు రాజాజైసింగ్ 1668లో పరమపదించాడు. రెండవ ప్రఖ్యాతి గాంచిన రాజపుత్ర సేనాని రాజా జస్వంత్‌సింగ్ కాబూల్‌కు గవర్నరుగా ఉన్నప్పటికీ అతని చివరిరోజులు సమీపించాయి. చివరికి ప్రతి సిసలైన ముస్లింకు ప్రధాన లక్ష్యమై ఉండవలసిన విషయం, అనగా హిందువుల్ని అణిచివేసే యుక్తిని ప్రారంభించడానికి ఔరంగజేబ్ స్వతంత్రుడైపోయాడు. అప్పటి

వరకు హిందువులు ఏ రకంగానూ బాధింపబడలేదు, మరియు ధార్మికంగా కూడా ఎలాంటి ఆటంకాలు ఏర్పరచడం జరుగలేదు. కాని ఔరంగజేబ్ ఉవ్విళ్ళూరుతున్న ఇస్లాం ఉత్సాహాన్ని, దాన్ని ఎలాంటి నష్టం లేకుండా అవిశ్వాసులపై ప్రదర్శించడానికి తన మనసులోనే పెంపొం దించుకుంటున్నా డనడంలో ఏమాత్రం సందేహం లేదు. చివరికి 1669లో ఇది గుప్పుమంది.

ఔరంగజేబ్ ఇంకొక దూరదృష్టి రాహిత్యచర్యను జస్వంత్ సింగ్ వ్యవహారంలో చేపట్టాడు. జస్వంత్ సింగ్ ఇద్దరు పిల్లల్ని విద్యాభ్యాసాల కోసం డిల్లీకి పంపించాల్సిందిగా కోరాడు, నిస్సందేహంగా ఆ ఇద్దరు పిల్లలు అతని పర్యవేక్షణలో ముస్లింలుగా మార్చుకోబడే వారు. రాజ పుత్రులు ఈ ఆదేశాన్ని పెడచెవినపెట్టారు. ఇంకా ఔరంగజేబ్ ప్రాచీన ఇస్లామీయ టాక్సు అయిన జిజ్‌యాను, తిరిగి ఒక హిందూ రాజుపై విధించాడని తెలియగానే వారి కోపానికి అంతులేకుండా పోయింది.”

పాశ్చాత్య చరిత్రకారుల నిందారోపణలు వాంఙ్మూలాలు, ఎంత నిరాధారమైనవి, ఎంత అర్థరహితమైనవి, ఎంత తేలికైనవంటే వాటికి సమాధానాలివ్వడం ఏమంత కష్టతరమైన విషయం కాదు. ఈ పాశ్చాత్య చరిత్రకారుల గారడీ చూడండి. ముందో నిందను మోపుతారు, అదే నిరాధారమైనదంటే, దాన్నే సాక్ష్యంగా, ఆధారంగా చూపిస్తారు. దాన్నంటుకునే ఒకదాని తరువాత ఇంకొక అసత్యాన్ని జొప్పిస్తూ పోతారు. తామన్నదే వేదవాక్కని, అసలు సమకాలీన చరిత్రగ్రంథాల్ని, అందులోనూ పర్షియన్‌లో ఉన్నవాటిని ఎవరు చూడబోతారులే అంటూ పొరబడి, మోసగించారు. అసలు గ్రంథాల్ని చూసి, వారి మోసాల్ని ఎండగట్టే కాలం వచ్చేనాటికి చూద్దాంలే అన్నట్లు తమకు తోచిన విధంగా, చరిత్రను వక్రీకరిస్తూ వ్రాశారు. వారు రాసిందే ఆకాశం నుండి అవతరించిన దివ్యవాణిగా, గుడ్డిగా నమ్ముతూ మనం పరస్పరం ద్వేషానికి గురిఅవుతూ వచ్చాము.

పై ఒక్క వాంఙ్మూలంలోని వాస్తవాలే మీ ముందుకు వస్తే ఈ చరిత్రకారుల నీతి నిజాయితీ ఏ పాటిదో మీకే అర్థమైపోతుంది.

అయితే పై వాంఙ్మూలంలో ధార్మిక మరియు రాజకీయ రెండు అంశాలను ఒకదానిలో ఒకటి జొప్పించారు. ఒకటి జస్వంత్ సింగ్ వ్యవహారం రాజకీయమైనదైతే, జిజ్‌యా వ్యవహారం ధార్మికపరమైనది. అందుకని ఈ రెండింటిని విడదీసి విశ్లేషించుకుందాం. మొదటి అంశం రాజకీయమైనది.

రాజపుత్రుల బలశక్తుల కేంద్రాలు ఆ కాలంలో మూడుండేవి. జైపూర్, జోద్‌పూర్ మరియు ఉదయ్‌పూర్. అంటే మూడు సామంతరాజ్యాలు. వీటిలో జైపూర్ మరియు జోద్‌పూర్ సంపూర్ణంగా శిరసావహించాయి. అయితే ఉదయ్‌పూర్‌కు సంబంధించినంత వరకు పరిస్థితి వేరు. అక్బర్ చక్రవర్తి కాలం నుండి షాజహాన్ వరకు వీరి పరిస్థితి ఏమిటంటే దండయాత్ర జరిగినప్పుడు తలలు వంచి, విధేయతను ప్రకటించేవారు. సామ్రాజ్య సైన్యాలు వెళ్ళిపోగానే తిరిగి అదే తలబిరుసుతనం ప్రదర్శించేవారు. షాజహాన్ జబ్బుపడి, తన జ్యేష్ఠపుత్రుడైన దారా

షికూహ్‌ను తన యువరాజుగా ప్రకటించి, సర్వాధికారాల్ని అతనికి అప్పగించే సమయంలో జైపూర్ మరియు జోద్‌పూర్‌లకు రాజా జైసింగ్ మరియు రాజా జస్వంత్ సింగ్‌లు పరిపాలకులుగా ఉన్నారు. ఔరంగజేబ్ దక్కన్ నుండి, ఉత్తర భారతానికి బయలుదేరినప్పుడు, దారా షికూహ్ తరపున రాజా జస్వంత్ సింగ్ ఒక ప్రచండ సైన్యాన్ని తీసుకొని ఉజ్జయిని ప్రాంతంలో ఔరంగజేబ్ దారికి అడ్డంగా నిలిచాడు. ఔరంగజేబ్ తన దూతలను పంపి, తాను కేవలం తన తండ్రి సందర్శనార్థం వెళ్ళుతున్నానని, తనను అడ్డగించవద్దని ఎంతగా విన్నవించుకున్నా జస్వంత్ సింగ్ వినిపించుకోలేదు. మొండిగా వ్యవహరించాడు. ఫలితంగా భయంకర యుద్ధం జరిగింది. అందులో జస్వంత్ సింగ్ ఓడిపోయి, పలాయనం చిత్తగించాడు. ఇక ఎప్పుడైతే ఔరంగజేబ్ రాజ్యాధికారాన్ని చేబట్టాడో, దాని ప్రారంభంలోనే జస్వంత్ సింగ్ క్షమాపణ కోసం విన్నవించు కోసాగాడు, ఔరంగజేబ్ పెద్ద మనస్సుతో అతన్ని మన్నించడమే కాకుండా తన సైన్యంలో చేర్చుకున్నాడు. తన సోదరుడు షుజాతో యుద్ధం అనివార్యమైనప్పుడు ఈ జస్వంత్ సింగ్‌ను సంపూర్ణంగా విశ్వసించి తన సైన్యంలోని ఒక గొప్ప భాగానికి అతన్ని సైన్యాధికారిగా కూడా నియమించాడు. అయితే జస్వంత్ సింగ్ ముందే షుజాతో కలిసి కుట్రపన్నాడు. దాని ఫలితంగా రెండు సైన్యాలు ఎదురుపడి యుద్ధానికి సన్నద్ధమవుతున్న తరుణంలో రాత్రి సమయంలో తన సైన్యాన్నంతటినీ తీసుకొని వెళ్ళి షుజాతో కలిసిపోయాడు. పోతూ పోతూ ఔరంగజేబ్ శిబిరంలోని ఆయుధాలు, నిత్యావసర వస్తువులు, గుడారాలు, అశ్వాలు మొదలగు సమస్త వస్తువుల్ని దోచుకుంటూ, ఛిన్నాభిన్నంచేస్తూ దాదాపుగా సగం సైన్యాన్ని వెంటబెట్టుకువెళ్ళాడు. ఇదెంతటి విపత్కర సమయమంటే ఔరంగజేబ్ లాంటి అసామాన్యమైన మనో మస్తిష్కాలు గల వ్యక్తి మాత్రమే ఈ సంక్లిష్టాన్ని ఎదుర్కోగలిగాడు. ఇంతటి విపత్తుకు ఇంకొకరైతే పిచ్చెక్కిపోయేవారు, కాని ఔరంగజేబ్ తొణకలేదు, బెదరలేదు, బెంబేలెత్తి పలాయనం చిత్తగించలేదు. ఉషోదయం కాగానే ఆ మిగిలి ఉన్న సైన్యాలతోనే శత్రు సైన్యాలపై విరుచుకుపడ్డాడు. సాయంత్రంలోపే విజయశ్రీ అతన్ని వరించింది. ఇకిప్పుడు జస్వంత్‌సింగ్ దిక్కులేని వాడయ్యాడు. ఔరంగజేబ్ శరణు వేడడం తప్ప వేరే గత్యంతరం లేదు. తన తప్పుకు మన్నింపు, క్షమాపణలు కోరుకుం టున్నాడే తప్ప ఔరంగజేబ్ ముందుకు రావడానికి సిగ్గుతో ముఖం చాలడం లేదు. ఈసారి కూడా అతను రాకపోయినా అతని పరోక్షంలో ఔరంగజేబ్ అతని విశ్వాస ఘాతుకాన్ని క్షమిం చడమే కాకుండా, అతని మన్సబును, జాగీరును తిరిగి యధాతథంగా అతనికి ప్రసాదిస్తూ, అహ్మదాబాద్‌కు సుబేదారుగా నియమించి పంపించాడు. ఆ తరువాత కూడా అనేక ఘర్షణల్లో, యుద్ధాల్లో అతనికి కీలక పాత్రనిచ్చాడు. చివరికి అతన్ని సంపూర్ణంగా విశ్వసించి, శివాజీని ఎదుర్కోవడానికి దక్కన్ పంపించాడు. [1] అయితే ఈ విశ్వాస ఘాతకుడు అక్కడ కూడా తన స్వభావాన్ని మార్చుకోలేకపోయాడు. అతని గురించి అల్ ఫిన్‌స్టన్ ఇలా వ్రాశాడు :

"రాజా జస్వంత్ సింగ్ రాకుమారుడు ముఅజ్జం స్వభావంపై పట్టు సాధించాడు. ఇంకా చక్రవర్తి కన్నా హిందువుల పట్ల అధిక శ్రేయోభిలాషి. ఇదేకాకుండా అతను లోభి, అత్యాశపరుదని, డబ్బు ఇచ్చి కొద్దోగొప్పో తమ మాటను అతనితో మెప్పించుకోవచ్చని కూడా ప్రజలు సంపూర్ణంగా విశ్వసించేవారు. మొత్తానికి ఈ అన్ని సాధనాలతో శివాజీ అతన్ని తన మిత్రునిగా మార్చుకున్నాడు." [2]

ఇంతటితోనే జస్వంత్ సింగ్ ఊరకుండలేదు. తనతో పాటుగా ఈ సైన్యంలోని ఇంకో సైనికాధికారి, బూందీ సంస్థానం రాజు మరియు ఆరువేల మన్సబుదారు అయిన రావ్‌బహావ్ సింగ్ హాడాను కూడా తన ఈ కుట్రలో కలుపుకోదలిచాడు. అయితే బహావ్ సింగ్ ఈ స్వామిద్రోహానికి నిరాకరించినప్పుడు, బహావ్‌సింగ్ సోదరి అయిన తన భార్యను అక్కడికి రప్పించుకొని ఆమె ద్వారా తన కుట్రను సఫలీకృతం చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని విశ్వాసపాత్రుడైన బహావ్‌సింగ్ అప్పటికి కూడా, చుట్టరికం కన్నా స్వామిభక్తికే ఆధిక్యత నిచ్చాడు. రావ్ బహావ్ సింగ్ ప్రస్తావనలో మాసిరుల్ ఉమరాలో ఇలా రాయబడి ఉంది :

"మహారాజా (జస్వంత్ సింగ్) పత్ని, రావ్ బహావ్‌సింగ్‌కు సోదరి. అందుకని మహారాజా ఆమెను స్వస్థలం నుండి రప్పించి, ఆమెద్వారా రావ్ బహావ్‌సింగ్‌ను మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని రావ్ బహావ్‌సింగ్ స్వామి భక్తికే, విశ్వాసపాత్రతకే ప్రాధాన్యత ఇచ్చాడు తప్ప, అతనితో కలిసిపోలేదు. (వా. 2, పే. 309)

చివరిలో రాజా జస్వంత్ సింగ్ కాబూల్ సంఘర్షణ కోసం నియుక్తుడయ్యాడు. మరియు ఔరంగజేబ్ పట్టాభిషేకం 22వ సంవత్సరంలో పరమపదించాడు. జస్వంత్ సింగ్ మరణించే సమయంలో అతనికి సంతానం లేదు. కాని అతని ఇద్దరు రాణులు గర్భవతులై ఉన్నారని అతని ఉద్యోగులు దర్బారుకు కబురందించారు. చివరకు లాహోర్‌లో దర్బారును సందర్శించి, ఇద్దరు రాణులకు చెరో మగ బిడ్డ పుట్టాడని వార్త అందించారు. దీనితో పాటుగానే ఈ పిల్లలకు మన్సబు, రాజ్యం మరియు బిరుదును ప్రసాదించాలని కోరారు. దానిపై ఆ ఇద్దరు పిల్లల్ని దర్బారుకు పంపమని, వారు యుక్త వయస్సుకు రాగానే వారికి మన్సబు, బిరుదు ప్రసాదింపబడు తుందని ఆలంగీర్ ఆదేశాలు జారీచేశాడు. మాస్సర్ ఆలంగీరిలో ఇలా ఉంది :

"రాజు ఇద్దరు పిల్లల్ని ఆస్థానానికి పంపించమని, వారు యుక్త వయస్సుకు రాగానే వారికి మన్సబు మరియు రాజ్యం ప్రదానం చేయబడుతుందని ఆలంగీర్ ఆదేశించాడు."[3]

దర్బారుకు చెందిన గొప్ప నాయకులెవరైనా తమ చిన్న పిల్లల్ని విడిచి మరణిస్తే, వారిని దర్బారుకు రప్పించి, రాకుమారులలాగే రాజు స్వయంగా తన పర్యవేక్షణలో వారిని సాకి, తర్ఫీదివ్వడం మొగలు దర్బారు ఆచారం. ఈ నియమాన్ని లేక ఆచారాన్ని అనుసరించే ఔరంగజేబ్, జస్వంత్ సింగ్ పిల్లల్ని దర్బారుకు పంపమని ఆదేశించాడు. కాని జస్వంత్ సింగ్ ఎల్లప్పుడూ ఎలాంటి పోకిరి చర్యలకు పాల్పడుతూ ఉండేవాడో మనం తెలుసుకుంటూనే వచ్చాం.

అతని ఉద్యోగులు కూడా దీనితో ప్రభావితం కాకుండా ఉండలేకపోయారు. అందుకని వారు రాజాజ్ఞ ఇంకా చేరకముందే తలబిరుసుతనంతో రాజధాని డిల్లీకి బయలుదేరారు. కటక్ నదిపై నావికా దళాధిపతి వారిని ఆపి, రాజాజ్ఞను, రహదారి అనుమతిని చూపించమని కోరాడు. దానిపై ఘర్షణకు దిగి, అతన్ని, ఇంకా ఎంతో మంది సైనికుల్ని వధించి బలవంతంగా నదిని దాటి వచ్చేశారు. వారి తలబిరుసుతనం మరియు విద్రోహక చర్యను చూసిన ఔరంగజేబ్, వారిని రాజధాని నగరం ఆవలే ఉండాలని ఆదేశించాడు, అంతేకాకుండా నగర్ కమీషనర్ (కోత్వాల్)ను వారిని నిర్బంధంలో ఉంచి వారిపై దృష్టి పెట్టాల్సిందిగా కూడా ఆజ్ఞాపించాడు. కొన్ని రోజులు గడిచిన పిదప అందులో నుండి కొంతమంది రాజపుత్రులు తమ ప్రాంతానికి వెళ్ళిపోతామని అనుమతి కోరారు. అందుకు ఔరంగజేబ్ అనుమతించాడు. అయితే ఈ మోసకారులు జస్వంత్ సింగ్ పిల్లల్ని రహస్యంగా తమ వెంట తీసుకుపోతూ, ఇద్దరు నకిలి పిల్లల్ని అక్కడ విడిచివెళ్ళారు. ఇదో ముఖ్యమైన సంఘటన, దీని ఆధారంగానే ముమ్ముందు చర్చ జరుగుతుంది కనుక దీని యదార్థమేమిటో ఇంకా నిరూపితమవడానికి సమకాలీన చరిత్రకారుడు ఖాఫి ఖాన్ వాంఙ్మూలాన్ని పరిశీలిద్దాం :

"ఆ తరువాత తెలిసిందేమిటంటే, రాజు గతించిన పిదప మూర్ఖులైన అతని అను యాయులు అతని చివరి వయస్సులో అతను విడిచివెళ్ళిన అజీత్ సింగ్ మరియు దోల్తహమన్ పేరు గల ఇద్దరు పసిపిల్లల్ని తీసుకొని సుబేదార్ అనుమతి లేకుండా ప్రభువులవారి ఆజ్ఞకు ఎదురు చూడకుండానే రాణితో సహా చక్రవర్తిని సందర్శించుకోవడానికి బయలుదేరారు. వీరు కటక్ నదిని సమీపించినప్పుడు వీరి వద్ద ప్రయాణ అనుమతి లేని కారణంగా నావికా దళాధిపతి వారిని ఆపేశాడు. దానిపై వారు యుద్ధానికి సిద్ధపడ్డారు. అనేకమందిని చంపి బలవంతంగా నదిని దాటేశారు. ఈ విధంగా వారు రాజధాని నగరం సమీపించినప్పుడు జస్వంత్ సింగ్ మునుపటి చర్యలతోనే విసిగి బేజారెత్తివున్న ప్రభువుల వారు ఈ సమయంలో రాజపుత్రుల ఈ అవిధేయ మరియు విద్రోహకర చర్య కారణంగా వారు నగరం వెలుపలే ఆగిపోవాలని (చక్రవర్తి) ఆదేశించారు. మరియు మన్సబుదారుల ఒక సైన్యాన్ని తీసుకొని రాజు సంబంధీకుల స్థావరం చుట్టుప్రక్కల గుడారాల చుట్టూ ఫిరంగుల్ని ఏర్పాటు చేసి వారిని గృహ నిర్బంధంలో ఉంచాలని కొత్వాల్ (నగర కమీషనర్)ను ఆదేశించటం జరిగింది.

కొన్ని రోజులు గడిచిన తరువాత వారిలో నుండి కొందరు తమ స్వస్థలానికి పోతామని విన్నవించుకున్నారు. దానికి చక్రవర్తి అనుమతించాడు. అయితే ఈ రాజపుత్రులు జస్వంత్ సింగ్ పిల్లల స్థానంలో అదే వయసులోనున్న ఇద్దరు పిల్లల్ని సంపాదించి దాసీలకు రాణుల వేషం వేసి, అసలు పిల్లల్ని తీసుకొని రాత్రికి రాత్రే పలాయనం చిత్తగించారు. అనుమానం రాకుండా రాణులకు మగవేషం వేయించారు. తెల్లారగానే అసలు విషయం తెలిసి పెద్ద ఘర్షణ చెలరేగింది. ఇక్కడున్నవారు అసలు సంతానమా? లేక రహస్యంగా తీసుకెళ్ళిన పిల్లలు అసలు

వారా? అనే విషయంలో అందరూ మీమాంసలోనే ఉండిపోయారు. ..... చాలా రోజుల తరువాత చిత్తోడ్ రాణా తన కుమార్తె సంబంధాన్ని అజీత్ సింగ్‌తో నిశ్చయం చేసిన తరువాత గాని రాజు గారి అనుమానం దూరం కాలేదు." (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫిఖాన్ వా.2, భా.3, పేజి 238-240)

జస్వంత్ సింగ్ అధికారులు ఈ పిల్లల్ని తీసుకొని జోద్‌పూర్ వెళ్ళారు, ఆ తరువాత ఉదయ్‌పూర్ మహారాణా వీరిని తన సంరక్షణలోకి తీసుకున్నాడు. దానిపై తిరుగుబాటుదారుల సమర్ధన నుండి వైదొలగి, జస్వంత్ సింగ్ పిల్లల్ని పంపించాల్సిందిగా హెచ్చరిస్తూ ఉదయ్‌పూర్ రాజుకు ఔరంగజేబ్ ఒక ఫర్మానాను జారీచేశాడు. కాని ఉదయ్‌పూర్ రాజు దీన్ని తృణీకరించాడు. అందుకని అతనివైపు సైన్యాలు పంపబడ్డాయి. చివరికి ఉదయ్‌పూర్ విధేయతను ప్రకటిస్తూ, ఇకముందు జస్వంత్‌సింగ్ పిల్లల విషయంలో జోక్యం చేసుకోనని వాగ్దానం చేశాడు. కాని త్వరలోనే తన వాగ్దానాన్ని ఉల్లంఘిస్తూ తిరుగబడ్డాడు. అతన్ని అణచడానికి ఔరంగజేబ్ నలువైపుల నుండి సైన్యాల్ని రప్పించి, తన కనిష్టపుత్రుడు అక్బర్ సారధ్యంలో ఉదయ్‌పూర్‌కు పంపించాడు. అయితే తామంతా అతన్నే సమర్థిస్తామని, అందరూ ఏకగ్రీవంగా అతన్నే చక్రవర్తిగా అంగీకరిస్తామని, అందుకని కిరీటం, సింహాసం కైవసం చేసుకొమ్మని రాకుమారున్ని ఊరించి తమ వైపునకు తిప్పుకున్నారు. అవిధేయుడు, చపలచిత్తుడూ అయిన ఈ రాకుమారుడు అతని మాటల్ని విశ్వసించి, తన తండ్రికి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించాడు. కాని ఔరంగజేబ్ ఉక్కు అవయవాలు కలిగిన వ్యక్తి. భయమంటే ఎరుగని ధీరుడు. 70 వేల సైన్యాలను తీసుకొని రాకుమారుడు తనకు ఎదురువచ్చినా, ఔరంగజేబ్ తొణకలేదు బెణకలేదు. అతని సారధ్యంలో అప్పుడు కేవలం వేయిమంది అశ్వికులు మాత్రమే ఉన్నారు. ఆ వేయిమందితోనే ఆ బృహత్తర సైన్యంపై విరుచుకుపడడానికి సిద్ధపడ్డాడు. చివరికి రాకుమారుడు అక్బరే ప్రాణాలు దక్కించుకొని పలాయనం చిత్తగించాడు.

విషయం క్షుణ్ణంగా అర్థం కావాలని జరిగిన ముఖ్య సంఘటనల్ని ఒకేచోట సంక్షిప్తంగా వివరించడం జరిగింది. ఇకిప్పుడు పై సంఘటనల నుండి ఈ క్రింది అంశాలు పరిశీలించాల్సి ఉంది:

1. రాజపుత్ర సంస్థానాలతో ఔరంగజేబ్ అనుచితంగా ప్రవర్తించడం వల్లనే వారు తిరుగబడడానికి వివశులయ్యారా?
2. ఔరంగజేబ్ తిరుగబడిన ఈ రాజపుత్రుల్ని లోబరుచుకోగలిగాడా?
3. ఈ సంఘటన తరువాత రాజపుత్రులు శాశ్వతంగా ఔరంగజేబ్ నుండి దూరమైపోయారా?

యూరోపియన్ చరిత్రకారులు వాదించేదేమంటే ఔరంగజేబ్ స్వయంగా తానే రాజపుత్రుల్ని రెచ్చగొట్టాడు, విద్రోహానికి, తిరుగబడడానికి వారిని వివశుల్ని చేశాడు, ఇంకా వారిని సంపూర్ణంగా లోబరుచుకోలేక పోయాడు. అంతేకాకుండా రాజపుత్రులు శాశ్వతంగా మొగలు సామ్రాజ్య విధేయత నుండి వైదొలగిపోయారు. రాజపుత్రుల మూడు ప్రధాన కేంద్రా

లుండేవని పైన తెలుపుతూనే వచ్చాము. అందులో నుండి జైపూర్ ఎల్లప్పుడూ మొగలు సామ్రాజ్యానికి విధేయతగానే ఉంటూ వచ్చింది. అల్ ఫిన్స్‌టన్ కూడా దీన్ని అంగీకరిస్తాడు. ఈ విషయంలో అతనిలా రాశాడు :

"తమ వర్గంలోని ఒక రాజు కుటుంబంపై ఇలాంటి వత్తిడి మరియు దౌర్జన్యాన్ని దానిపై జిజ్‌యా లాంటి అన్యాయాన్ని చూసిన రాజపుత్ర రాజులు అందరూ పరస్పరం ఏకమయ్యారు. చక్రవర్తి కుటుంబంతో ఎన్నో తరాల నుండి వస్తున్న సంబంధ బాంధవ్యాల కారణంగాను, ఉన్నత గౌరవనీయ హోదాల మూలంగా పటిష్ఠమైన సత్సంబంధాల కారణంగా జైపూర్ రాజ్యాధీశుడు రాజా రాంసింగ్, వీరితో కలువకుండా దూరంగానే ఉండిపోయాడు."[4]

ఇక ఇప్పుడు జోద్‌పూర్, ఉదయ్‌పూర్‌లు మాత్రమే మిగిలిపోయాయి. జోద్‌పూర్ సంస్థానాధీశుడు రాజా జస్వంత్ సింగ్. ఔరంగజేబ్ పట్ల ఈ జస్వంత్ సింగ్ ప్రవర్తన ఎలా ఉండేది? మొట్టమొదటగా ఇతనే ధర్మావత్‌లో ఔరంగజేబ్‌ను ఎదుర్కొన్నాడు. ఓడిపోయి పలాయనం చిత్తగిస్తే, అతన్ని క్షమించడమే కాకుండా తన సైన్యంలో చేర్చుకొని ఉన్నత సైనికాధికారిగా నియమించాడు. కాని షుజాతో జరిగిన యుద్ధంలో ఇతను విశ్వాస ఘాతుకంగా ప్రవర్తించి, రాత్రి సమయంలో దొంగచాటుగా శత్రువుతో కలిసిపోయాడు. ఫలితంగా ఔరంగజేబ్ సైన్యం అతలాకుతలమై పోయింది. ఔరంగజేబ్ తిరిగి అతన్ని క్షమించాడు. జాగీరును, మన్సబును ప్రసాదిస్తూ అతన్ని దక్కన్‌లో నియుక్తుణ్ణి చేశాడు. కాని అతనక్కడ శివాజీతో కుట్రపన్నాడు. ఇకిప్పుడు అతను చనిపోయాడు, దానిపై అతని నెల రోజులు మాత్రమే ప్రాయం గల పసికందుని సంస్థానానికి పరిపాలకునిగా నియమించాలని రాజ పుత్రులు కోరుతారు. దానిపై ఔరంగజేబ్ ఆ బాలుణ్ణి దర్బారుకు పంపమని, అతను యుక్తవయస్సుకు రాగానే అతనికి సర్వం లభిస్తుందని తెలుపుతాడు. రాజపుత్రులు రాజాజ్ఞ ముట్టే వరకు కూడా నిరీక్షించకుండా బయలుదేరి త్రోవలో అటక్‌నదిపై రాజోద్యోగుల్ని, ఇతర సైనికుల్ని చంపుతూ, కొడుతూ ఢిల్లీ చేరుకుంటారు. అప్పుడు ఆలంగీర్ వారిని దిగ్బంధిస్తాడు. పై అన్ని సంఘటనల్లో ఔరంగజేబ్ తరపున జరిగిన అన్యాయం ఏమిటి?

"తమ వర్గంలోని ఒక రాచ కుటుంబంపై ఇలాంటి దౌర్జన్యం జరగడం చూచి" అంటూ లేన్‌పోల్ రాశారు. జరిగిన ఆ దౌర్జన్యం ఏమిటో? జస్వంత్ సింగ్ తోటి రాజపుత్రులు చేపట్టిన చర్యను ఔరంగజేబ్ కళ్ళుమూసి శిరసావహించాల్సిందా? పిన్న వయస్సులైన పిల్లల్ని దర్బారుకు రప్పించడం అన్యాయపూరితమా? రాజనుమతి లేకుండా రాజపుత్రులు ఢిల్లీకి బయలుదేరడం రాజాజ్ఞను ఉల్లంఘించడం కాదా? వీరిని నౌకా దళాధిపతి అడ్డగించడం అతని విధి కాదా? నౌకాదళాధిపతిని, ఇతర రాజోద్యోగుల్ని ఎదుర్కోవడం, వారిని సంహ రించడం విద్రోహకర చర్యకాదా? ఇలాంటి చర్యలకు పాల్పడిన తరువాత కూడా వారిని దిగ్బంధం చేయడం నీతి నిజాయితీకి, న్యాయానికి విరుద్ధమైన చర్యనా??

రాజపుత్రులు రెచ్చిపోవడానికి, రాజాజ్ఞను ఉల్లంఘించడానికి కారణం ఔరంగజేబ్ జస్వంత్ సింగ్ పిల్లల్ని ముస్లింలుగా మార్చుకునే వాడని అల్‌పిన్‌స్టన్ వాదిస్తాడు. కాని శివాజీ మనుమడైన సాహూజీని బంధించినప్పుడు అతని వయస్సు కేవలం ఏడు సంవత్సరాలే. ఔరంగజేబ్ ఈ పిల్లవాన్ని తన స్వీయ సంరక్షణలో ఉంచాడు. తన శిబిరానికి సమీపంలోనే అతని శిబిరాన్ని ఏర్పాటు చేయించేవాడు, అతనికి ఏడువేల మన్సబు, బిరుదు, నగారా మరియు పతాకాన్ని ప్రసాదించాడు. అతనిపట్ల ఈ సత్ప్రవర్తనను ఔరంగజేబ్ చివరికంటూ కొనసాగించాడు. ఇదంతా చేసి కూడా అతన్ని ఎందుకని ముస్లింగా మార్చుకోలేదు. జస్వంత్ సింగ్ పిల్లలకన్నా కూడా, శివాజీ మనువడు అధిక ఒత్తిడికి, దౌర్జన్యానికి అర్హుడే. ఈ విషయంగా మరాఠా చరిత్రకారుడు డాక్టర్ బి.జి. కుంటే ఇలా వ్రాశాడు: "..... యసూబాయికి జన్మించిన సాహూను (శివాజి మనుమనికి) ఔరంగజేబ్ తన ఒక మనువనిగా పెంచిపోషిం చాడు. చరిత్రపై దృష్టిగల వారికి ఒక్కోసారి ఈ ఆలోచన వస్తుంది. ఒకవేళ సాహూను ముస్లింగా మార్చి మరాఠాలపై కూర్చుండబెట్టి ఉంటే ఎంత ఘోరం జరిగిపోయేది...." (ఔరంగజేబాచా ఇతిహాస్- డా.బి.జి.కుంటే, పే.15, మహారాష్ట్ర రాజ్య సాహిత్య సంస్కృతి,1978)

రాజపుత్రులకు జిజ్‌యా విధించారనే వార్త తెలిసినందున, వారి కోపానికి అంతులేకుండా పోయిందని లేన్‌పోల్ ఇంకొక కారణాన్ని తెలుపుతాడు. జిజ్‌యాకు సంబంధించి మేము ఒక ప్రత్యేక అధ్యాయాన్నే ఏర్పరిచాము. గనక ధార్మికపరమైన ఈ చర్చ ఆ శీర్షిక క్రిందనే సమంజసంగా ఉంటుంది.

ఇంకొక పరిశీలించదగిన విషయం ఔరంగజేబ్ ఈ రాజపుత్రుల్ని పూర్తిగా లోబరుచు కున్నాడా? లేదా? అనేది. దీని గురించి లేన్‌పోల్ ఇలా రాశాడు :

"రాజపుత్రులనే పాముకు కొంచెం గాయమైతే అయింది, కాని అది పూర్తిగా చావలేదు. యుద్ధాల పరంపర కొనసాగుతూనే ఉంది. రాజపుత్రుల్లో అందరిలోకెల్లా అత్యధికంగా నష్ట పోయిన ఉదయ్‌పూర్ రాణా, ఔరంగజేబ్‌తో ఒక గౌరవప్రదమైన సంధిని ఏర్పాటు చేసుకున్నాడు. దీనికి కారణం ఏమిటంటే ఔరంగజేబ్ ఈ యుద్ధాలతో విసిగిపోయాడు. ఈ సంధి పత్రంలో జిజ్‌యా పదం కూడా రాలేదు. కాని రాకుమారుడు అక్బర్‌తో కలిసిపోయిన నేరానికి గాను రాణాకు తన దేశంలోని ఒక చిన్న ప్రాంతాన్ని వదులుకోవాల్సి వచ్చింది. కాని కొన్ని రోజుల్లోనే ఉదయ్‌పూర్ రాణా సంధి షరతుల్ని తుంగలో తొక్కేశాడు."

పైన కొన్ని పంక్తుల్లోనే అసత్యమనే ఎంత మలినాన్ని జొప్పించాడో ఈ చరిత్రకారుడు, ఇంకిలా అంటాడు :

"స్వయంగా ఔరంగజేబ్‌కే ఇలాంటి యుద్ధాన్ని సమాప్తం చేయాలనే కోరిక పుట్టింది .... కనుక తన యుక్తి మరియు చాతుర్యంతో ఉదయ్‌పూర్ రాణాను సంధికై విన్నవించుకోవడానికి సంసిద్ధున్ని చేశాడు. అందుకని ఎప్పుడైతే అతని తరఫున సంధికోసం విన్నపం వచ్చిందో, వెంటనే దాన్ని ఆలకించాడు. జిజ్‌యాను విస్మరించడం జరిగింది. జిజ్‌యా పద్దు కింద దేశంలోని

ఏ చిన్న ప్రాంతాన్ని తీసుకోవడం జరిగిందో దాన్ని అక్బర్‌కు సహకరించిన నేరానికి జరిమానాగా పరిగణనలోకి తీసుకోవడం జరిగింది."[5]

ఇదెంత మాత్రం వాస్తవం కాదు. అసలు విషయం ఏమిటంటే జోద్‌పూర్, ఉదయ్‌పూర్ రెండు సంస్థానాల్ని ఔరంగజేబ్ సైన్యాలు పూర్తిగా ధ్వంసం చేసిపారేశాయి. ఉదయ్‌పూర్ మహారాణా తన స్వస్థలం నుండి పారిపోయి ఆఖరి సరిహద్దుకు చేరుకున్నాడు. చివరికి వివశుడై మందల్‌పూర్, మద్‌నూర్ పరగణాల్ని జిజ్‌యా క్రింద ఇస్తానని అంగీకరించి, రాకుమారుడు ముహమ్మద్ ఆజం ద్వారా సిఫారసు చేయించాడు. ఔరంగజేబ్ స్వాభావికమైన తన ఉదారతను ప్రదర్శిస్తూ అతని విన్నపాన్ని అంగీకరించాడు, పట్టాభిషేకం 24వ సంవత్స రంలో రాణా దర్బారులో హాజరైనప్పుడు రాజవస్త్రాల్ని, బిరుదును, ఐదువేల మన్సబును ప్రసాదిం చాడు. దీన్ని మాసిరె ఆలంగీరిలో ఇలా వివరించడం జరిగింది :

"ఉదయ్‌పూర్ రాణా దేశాన్ని, స్వస్థలాన్ని పోగొట్టుకొని దీనస్థితికి చేరుకున్నాడు. .... చివరికి కోలుకోలేని ఈ పరాజయంతో అలిసిసొమ్మసిల్లిపోయాడు. శరణువేడడం, తప్పిదాల మన్నింపుకోరడం తప్ప ఇంకేమార్గం కనిపించనప్పుడు, ప్రసాదించే గుణం కలిగిన రాకుమారుడు అనగా ముహమ్మద్ ఆజంను ఆశ్రయించాడు. ఇంకా జిజ్‌యా రొక్కానికి బదులుగా మాన్‌దల్‌పూర్, మద్‌నూర్ పరగణాలను సమర్పించుకుంటానని విన్నవించుకు న్నాడు. అతను రాకుమారుని ఉద్యోగంలో చేరిపోయాడు. రాకుమారుడు అతని పరిస్థితికి దయతలచి, చక్రవర్తి సన్నిధిలోకి ఒక అర్జీని సమర్పించాడు. ప్రభువు తప్పిదాన్ని మన్నించాడు."[6]

మాసిరుల్ ఉమరాలో ఇలా ఉంది :

"ఉదయ్‌పూర్‌ను రాణా (సంరక్షణ లేకుండా) విడిచి పారిపోయినప్పుడు హుసేన్ అలీఖాన్‌కు ఒక సైన్యమిచ్చి అతన్ని వెంబడించడం కోసం పంపించడం జరిగింది. ఆ తరువాత సుల్తాన్ ముహమ్మద్ ఆజం షా మరియు సుల్తాన్ బేదార్ బక్ష్ నియుక్తులయ్యారు. రాణా రాజ్యాన్ని రాజ్య సైన్యాలు పూర్తిగా వశపరచుకొని ధ్వంసం చేసిన తరువాత అతను తన స్వస్థలాన్ని వీడి దేశదిమ్మరిగా తిరుగసాగాడు. ఆలంగీరి పట్టాభిషేకం 24వ సంవత్సరంలో అతను రాకుమారుడు (ముహమ్మద్ ఆజం షా)ను కలిసి, తన కోసం సిఫారసు చేయాల్సిందిగా విన్నవించుకున్నాడు. మాన్‌దల్‌పూర్, మద్‌నూర్ పరగణాలు జిజ్‌యా కింద రాజు గారికి అప్పగించడం జరిగింది."[7]

కాస్త పరిశీలించండి. ఈ సమకాలీన ప్రామాణిక గ్రంథాలలో రాణా వివశుడై స్వయంగా క్షమాపణ కోరుకున్నాడని వివరించడం జరిగింది. కాని అల్ ఫిన్‌స్టన్ ఆలంగీర్ వివశుడై స్వయంగా సంధి ప్రయత్నాలు ప్రారంభించాడని చెబుతున్నారు. మీరే ఆలోచించండి. ఆనాటి సమకాలీన చరిత్ర గ్రంథాలను నమ్ముదామా? లేక నూట యాభై సంవత్సరాల తరువాత వచ్చిన ఈ కుహనా చరిత్రకారుల వాంఙ్మూలాలను విశ్వసిద్దామా? ఈ యూరోపియన్ చరిత్ర కారులు ఎంత మోసగాళ్ళో, ఎంత అసత్యవాదులో, ఎంతగా నీతి నిజాయితీలకు తిలోదకాలిచ్చిన

వాళ్ళో మన పాఠకుల దృష్టికి తేవడం అనివార్యమైనందున దాన్ని విశ్లేషించకుండా ఉండలేకపోయాము.

తిరిగి మన అసలు శీర్షికకు వద్దాం. ఇక చివరలో మిగిలిన ఒకే ఒక అంశం అంటే రాజపుత్రులు శాశ్వతంగా మొగలులతో వేరైపోయి, లేన్‌పోల్ చెప్పినట్లుగా, ఆలంగీర్ సమర్థనలో వేలు కూడా కదల్చలేదనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది.

పైన పేర్కొంటూ వచ్చిన సంఘటనలన్నీ ఆలంగీర్ పట్టాభిషేకం 24వ సంవత్సరం వరకు సమాప్తమైపోయాయి. ఉదయ్‌పూర్ మహారాణా జగత్ సింగ్ ఇదే సంవత్సరం మరణించాడు. ఆలంగీర్ అతని కుమారుడైన జైసింగ్‌కు శోకవస్త్రాలు, బిరుదు మొదలగునవన్నీ ప్రసాదించాడు. (మాసిరుల్ ఉమరా, వా.2, పే.209) ప.షే. 25వ సంవత్సరం ఆలంగీర్ దక్కన్‌కు బయలుదేరాడు. ఆ తరువాత దాదాపు చివరి వరకు ఆ చుట్టు ప్రక్కల్లోనే మరాఠాలతో పోరాడుతూ గడిపేశాడు. ఈ యుద్ధాల్లో ఇతర ముస్లిం జాతులు పాల్గొన్నట్లే, రాజపుత్రులు కూడా కోకొల్లలుగా కనిపిస్తారు. ఈ కాలపు చరిత్రల్లో సైన్యాల ప్రస్తావన వచ్చిన చోటల్లా రాజపుత్రుల ప్రస్తావన ప్రత్యేకంగాను, తప్పకుండాను కనబడుతుంది.

ఉదాహరణకు 1704లో మరాఠాలను ముట్టడించిన ఒక సందర్భంలో ఖాఫి ఖాన్ ఇలా రాశాడు :

" ..... ఇంకా చక్రవర్తి సైన్యంలోని ప్రతి సైనికాధికారి, సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడారు. ప్రత్యేకించి హమీదుద్దీన్ ఖాన్, ఖలీజ్ ఖాన్, బహద్దూర్ ఖాన్, దావూద్ ఖాన్, జంషేద్ ఖాన్ ఇంకా రాజపుత్ర నాయకులు ఎంతో వీరోచితంగా పోరాడారు. నాలుగైదు రోజుల వరకు సంకుల సమరం కొనసాగింది. ఈ యుద్ధంలో జంషేద్ ఖాన్ విశ్వాసపాత్రులైన రాజపుత్రుల సమూహంతో పాటుగా రావ్ దళ్‌పత్ ఇంకా కొంత మంది రాజ పరివారం వీరులతో సహా అసువులు బాసారు." (ముంతఖబుల్ లుబాబ్, వా.2, భా.3, పే.465)

ఈ చరిత్రకారుడే ప.షే. 46వ సంవత్సరపు సంఘటన ఇలా పేర్కొన్నాడు.

"పట్టాభిషేకం 46వ సంవత్సరం, జిల్‌హిజ్జా నెల ప్రారంభంలో (ఖేల్‌నా కోట ముట్టడిలో) ఇంకా యవ్వనదశకు (యుక్త వయస్సు) కూడా చేరుకోని రాజా జైసింగ్ (ఉదయ్‌పూర్) రాకుమారుడు తన సైనిక దళాన్ని వెంటబెట్టుకొని కోటను ముట్టడించి తీవ్రంగా పోరాడసాగాడు. పై నుండి తుపాకి గుళ్ళు, రాళ్ళ వర్షం కురుస్తున్నా వెనుకంజవేయలేదు. ఆ స్థితిలో రాకుమారుని అనేకమంది సైనికులు అసువులుబాశారు. చివరికి కోటలోని ఒక భాగమైన "రేవనీ" వీరి అధీనంలోకి వచ్చేసింది. విజయానికి ప్రారంభ చిహ్నంగా నాయకులు, ఆప్తులు శుభాకాంక్షలు తెలుపుతూ వందనాలు సమర్పించారు. రాజా (జైసింగ్) పదిహేను వందల అశ్విక దళానికి మన్సబుదారుగా ఉన్నాడు. చక్రవర్తులవారు ఈ ఘనకార్యంపై 500 అశ్వికుల్ని పెంచుతూ అతని మన్సబును పెంచారు. ఇంకా రత్న ఖచిత తలపాగాను ప్రసాదించారు." (ముంతఖబుల్ లుబాబ్– ఖాఫిఖాన్, వా.2, భా–3, పే.436)

ఔరంగజేబ్ సమర్థనలో ఒక్క రాజపుత్రుడు కూడా వేలు కదపలేదని యూరోపియన్ చరిత్రకారులు బొంకుతారు. కాని వాస్తవం ఏమిటంటే రాజపుత్ర సైనికులే కాదు, పెద్ద పెద్ద సైనికాధికారులు, రాజా, మహారాజాలు చివరి వరకు ఆలంగీర్ సైనిక కార్యకలాపాల్లో పాల్గొంటూనే ఉన్నారు, ఇంకా మరాఠాలను అణచడంలో వారు ముస్లిం అధికారుల, కమాండర్ల భుజానికి భుజం కలిపి నిలబడ్డారు. రాజపుత్రుల శక్తి సామర్థ్యాలకు, బలశక్తులకు జైపూర్, జోద్‌పూర్ మరియు ఉదయ్‌పూర్ కేంద్రాలుగా ఉండేవని ఇంతకు ముందే తెలుపుతూ వచ్చాము. ఉదయ్‌పూర్‌కు చెందిన ఇద్దరు రాకుమారులు ఔరంగజేబ్ సైన్యంలో ఉన్నత హోదా లపై, చివరి వరకు వెన్నంటి ఉన్నారు. పట్టాభిషేకం 43వ సంవత్సరంలో రాజా మాన్సింగ్ కుమారుడు రూప్‌సింగ్‌కు 500ల ర్యాంక్ పెంచుతూ మూడువేల మన్సబును ప్రసాదించడం జరిగింది. (మాస్సర్ ఆలంగీరి, పే.291) అదే సంవత్సరంలో ఇందర్‌సింగ్‌కు రెండు వేల మన్సబు, మరియు బహదూర్ సింగ్‌కు పదిహేనువందల మన్సబులు ప్రదానం చేయడం జరిగింది. (మాస్సర్ ఆలంగీరి, పే.291) వీరిద్దరూ కూడా మహారాణా రాజ్‌సింగ్ కుమారులు. ప.షే. 25వ సంవత్సరంలో రాజ్‌సింగ్ చనిపోయినప్పుడు, ఆలంగీర్ అతని కుమారుడైన రాణా జైసింగ్‌కు శోకవస్త్రాలు ప్రదానం చేశాడు. జోద్‌పూర్ రాజ్యాధీశుడైన జస్వంత్ సింగ్‌కు ఇందర్ సింగ్ బంధువు. జస్వంత్‌సింగ్ పరమపదించిన తరువాత ఆలంగీర్ ఇందర్ సింగ్‌కు "రాజా" బిరుదునిచ్చి, దక్కన్ ఘర్షణల్లో నియుక్తుణ్ణి చేశాడు. అతను కూడా అత్యంత విశ్వస నీయంగా తన కప్పగించబడిన బాధ్యతల్ని నెరవేర్చాడు. అందుకని ప.షే. 48వ సంవత్సరంలో అతనికి మూడువేల మన్సబును ప్రసాదించడం జరిగింది.(మాసిరుల్ ఉమరా, వా.2, పే.238, అమర్‌సింగ్ ప్రస్తావనలో).

మూడు వేల మన్సబు పొందివున్న మాన్‌సింగ్ రాథోర్, ప.షే. 35వ సంవత్సరంలో జుల్ఫిఖార్ ఖాన్‌తో కలిసి, ప్రఖ్యాత 'జంజీ' యుద్ధంలో పాల్గొన్నాడు. (మాసిరుల్ ఉమరా, వా.2, పే.270, రూప్‌సింగ్ ప్రస్తావనలో). కొందాన కోటకు అధిపతి అయిన ఉదయ్‌భాన్ ఔరంగజేబ్ ద్వారా నియమించబడిన కోటాధిపతి. అతను, అతని 1200 మంది రాజపుత్రుల వీరులు కోటను రక్షించటం కోసం ప్రాణాలు ధారపోశారే తప్ప శత్రువు ముందు తలవంచ లేదు. అదేవిధంగా మాహోలి కోటాధిపతి అయిన మనోహర్ దాస్ అత్యంత వీరోచితంగా పోరాడి మరాఠాలను పారద్రోలాడు. (హి.ఆ.ఔ.-జ.నా.స. వా.4, పే.142, 143)

వీరే కాకుండా ఔరంగజేబ్ దర్బారీ అక్బారాత్ (దర్బార్ పత్రికలు) అధ్యయనం వల్ల తేలేదేమంటే, పోరందరా కోటకు భానుచంద్, లోహగడ్ కోటకు అటల్ సింగ్, సుధాగడ్ కోటకు సేనాపత్, రాయ్‌గడ్ కోటకు శివ్‌సింగ్, సతారా కోటకు సత్తర్‌సాల్ రాఠోల్‌లు కోటాధిపతులుగా నియమితులై ఉన్నారు. (ఔరంగజేబ్ దర్బారీ అఖ్బారాత్-సయ్యద్ షా గాజియొద్దీన్, పే.31) ఇక జైపూర్ పాలకుల విధేయతను యూరోపియన్ చరిత్రకారులు కూడా అంగీకరించారు.

ఆలంగీర్‌తో దక్కన్ యుద్ధాల్లో పాల్గొని అత్యంత వీరోచితంగా, విశ్వాసపాత్రంగా మరాఠాలకు వ్యతిరేకంగా పోరాడిన అనేకమంది రాజపుత్ర నాయకుల, పాలకుల వివరాలు మాసిరుల్ ఉమరాలో కూడా వివరంగా పేర్కొనడం జరిగింది.

కాస్త పరిశీలించండి, మీరే ఆలోచించండి, జైపూర్, జోద్‌పూర్, ఉదయ్‌పూర్ పాలకులు, నాయకులు, రాకుమారులు దక్కన్‌లో ఔరంగజేబ్ వెంట ఉండి, మరాఠాలతో యుద్ధాలు సలుపుతున్నారనే సంఘటనలు నిరూపితమైనప్పుడు, ముస్లిం సైన్యాలతో పాటే రాజపుత్ర సైన్యాలు కూడా ఘర్షణల్లో పాల్గొంటున్నాయని తెలిసిపోయినప్పుడు, రాజపుత్ర సేనానులకు మూడువేల, నాలుగువేల మన్సబులు ప్రదానం చేయబడుతున్నప్పుడు, వారు అత్యంత కీలకమైన కోటాధిపతుల హోదాలపై నియమించబడుతున్నప్పుడు, పిన్న వయస్కుడై ఉండి కూడా ఉదయ్‌పూర్ రాజు తెగించి పోరాడుతున్నప్పుడు, ఔరంగజేబ్ రాజపుత్రుల్ని ఎంతగా అసంతృప్తి పరిచాడంటే, ఇక వారెన్నడూ మొగలు పతాకం కిందికి రాలేకపోయారని యూరోపియన్ చరిత్రకారులు చెప్పేది గడ్డిపోచంతైనా విలువగలదంటారా? (ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్ - షిబ్లి నొమాని, పేజి-46-57)

ఇక ఇప్పుడు ఈ యూరోపియన్ చరిత్రకారుల నిజవారసుడు, జాతీయ ప్రయోజనాల కన్నా బ్రిటిష్ పాలకుల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత నిచ్చిన మన దేశీయ చరిత్రకారుడు "సర్ జదూనాథ్ సర్కార్" ఆవిష్కరణల్ని, చరిత్ర వక్రీకరణను పరిశీద్దాం. జదూనాథ్ సర్కార్ "హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్" పేరుతో ఐదు వాల్యూంలలో రూపొందించిన ఈ చరిత్రలో ఔరంగజేబ్ రాజపుత్రుల హృదయాల్ని నొప్పించాడని, వారిని హింసించాడని వారి ధార్మిక భావనల్ని, విశ్వాసాల్ని గాయపర్చాడని అందుకని వారు అతని నుండి దూరమైపోయారనే భావన కలిగేటట్లు ఈ సంపుటాల్ని రూపొందించాడు. అక్బర్ చక్రవర్తి కాలం నుండే రాజపుత్ర నాయకులు, ఇరానీ, తోరాని, అఫ్‌గాని ఇంకా ఇతర ముస్లిం జాతుల నాయకులు, సేనానులకు సరిసమానంగా నిలబడుతూ సామ్రాజ్య మనుగడకు ఒక అనివార్య అంశంగా మారిపోయారు. ఔరంగజేబ్ లాంటి వివేకవంతుడు, దూరదృష్టి కలవాడు, ఆచితూచి అడుగువేసే పరిపాలకుడు తన రాజ్యాధికారం కోసం, వారినేవిధంగానూ విస్మరించలేడు. ఒకవేళ అతను వారిని విస్మరించి, నిర్లక్ష్యం చేసి, వారినే గనక నొప్పించి ఉంటే, యాభైఏళ్ళ సుదీర్ఘ పరిపాలన సంభవమే కాదు. స్వయంగా జదూనాథ్ సర్కారే ఇలా వ్రాశాడు :

"ఔరంగజేబ్ చరిత్ర అంటే స్వయంగా అరవై ఏళ్ళ సుదీర్ఘ భారతదేశ చరిత్రయే. అతని ప్రభుత్వం (1658 నుండి 1707) పదిహేడవ శతాబ్దపు చివరి అర్థ భాగాన్ని పరివేష్టించి ఉంది. ఈ కాలం మన దేశ ముఖ్యమైన చారిత్రక సంఘటనల్ని తనయందు ఇముడ్చుకొని ఉంది. అతని కాలంలో మొగలు సామ్రాజ్యం తన వైశాల్యపు చివరి అంచుకు చేరుకోగలిగింది. భారతదేశ చరిత్ర ప్రారంభమైనప్పటి నుండి బ్రిటీష్ కాలం వరకు ఇంతగొప్ప సంయుక్త సామ్రాజ్యం భారతదేశంలో ఏర్పడి ఉండలేదు. గజినీ నుండి చిటగాంగ్ వరకు, కాశ్మీరం

మొదలుకొని కర్ణాటక వరకు, సుదూర ప్రాంతాలైన లద్దాఖ్ మరియు మలబార్‌లలో కూడా ఒకే శాసనం నడిచేది .... ఔరంగజేబ్ కాలం నాటి భారత సామ్రాజ్యం అశోకుడు, సముద్రగుప్తుడు మరియు హర్షవర్ధనుని సామ్రాజ్యంకన్నా విశాలంగా ఉండేది. తన స్వంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే ధైర్యం ఏ ఒక్క రాష్ట్ర పాలకుని (సుబేదార్) లోనూ లేకుండేది. లేక అక్కడి రాబడిని (పన్నును) ఆపుకోవడమో, లేక కేంద్రప్రభుత్వ ఆజ్ఞల్ని ఉల్లంఘించ సాహసం ఎవరిలోనూ లేదు. అక్కడక్కడ కొన్ని విద్రోహాలు చెలరేగి ఉండవచ్చు, కాని ఈ ఢిల్లీ చక్రవర్తిని ఎదురించి, ఏ ఒక్క సుబేదారు కూడా కిరీటాన్ని ధరించ సాహసించలేక పోయాడు.” (ఉపోద్ఘాతం : హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - వా-1, పేజి XI)

భారతదేశం అంతాకూడా ఔరంగజేబ్ ఒక్క సైగతో లేస్తూ, కూర్చుంటూ ఉండేదనే విషయం పై వాంజ్మూలం ద్వారా నిరూపితమవుతుంది. కాని హిందువులు, ప్రత్యేకించి రాజపుత్ర నాయకులు అతనిపట్ల అసంతృప్తి చెంది, అతనికి దూరమైపోయి ఉంటే ఇదెలా సంభవమయ్యేది? కేవలం రాజపుత్రులే కాదు, మరాఠాల హృదయాల్లో సైతం మొగలు శాసకుల పట్ల గౌరవభావం, ప్రేమాభిమానాలుండేవి. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం ఉంది. మొగలు సామ్రాజ్యం ఛిన్నాభిన్నమై, ఢిల్లీ మొగలు పాలకులు పూర్తిగా నిర్జీవులై పేరుకు మాత్రమే చక్రవర్తులుగా నున్న సమయంలో సైతం, రాజపుత్రులు, మరాఠాలు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనైతే తమ రాజ్యాల్ని ఏర్పాటు చేసుకున్నారు. కాని ఢిల్లీకి చెందిన మొగలు కిరీటాన్ని, సింహాసనాన్ని పడగొట్టే లేక కైవసం చేసుకునే అవకాశం, శక్తి సామర్థ్యాలుండీ కూడా దానికి వారు ఇష్టపడలేదనే చారిత్రాత్మక సత్యాన్ని ఎవరు నిరాకరించగలరు? ఇదెంతవరకు కొనసాగిందంటే చివరకు వారు కూడా బ్రిటిష్‌లాంటి విదేశీ శక్తికి బానిసలైపోయారు.

యూరోపియన్ చరిత్రకారుల లాగే మన చరిత్రకారుడు కూడా అదే పల్లవిలో “ఔరంగజేబ్ కాలంలో హిందువుల జీవితం దుర్భరంగా మారిందని, వారిని అన్ని విధాలుగా హీనపరచడం జరిగిందని, వారిని ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించడం జరిగిందని, వారు సామాజిక వేర్పాటుతో జీవితాల్ని గడపాల్సి వచ్చిందని రకరకాలుగా అతన్ని నిందించాడు. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వాల్యూం-5, పేజి 371). అయితే మొగలుల సమకాలీన చరిత్ర గ్రంథాల ఆధారంగా, హిందూ మరియు రాజపుత్ర మన్సబుదారుల వివరాల్ని “ఔరంగజేబ్ కాలంలో హిందూ ఉన్నతాధికారులు” అనే అధ్యాయంలో చర్చించుకున్నాము గనక తిరిగి దాన్నే పునరావృతం చేయనవసరం లేదు.

వారసత్వం కోసం సోదరుల్లో జరిగిన అంతర్యుద్ధాలు సమాప్తమై ఔరంగజేబ్ సంపూర్ణంగా రాజ్యాధికారాన్ని చేపట్టిన తరువాత, అతను హిందూ మరియు రాజపుత్ర నాయకులతో తన పనుల్ని వెళ్ళదీసుకుంటూనే ఉన్నాడు. మీర్ జుమ్లా చనిపోయిన తరువాత అస్సాంను వశపర్చుకోవడానికి 1667లో రాజా రాం సింగ్ సారథ్యంలో పంపబడిన సైన్యాల్లో, ఇతర హిందూ ముస్లిం జాతులతో పాటే రాజపుత్ర సైనికులు కూడా ఉన్నారు. రాజా రాంసింగ్ ఏడు

సంవత్సరాల వరకు అస్సామీలతో ఘర్షణలు జరుపుతూనే ఉన్నాడు. (వా-3, పేజి 122,123). 1660లో మాల్వాలో ఖేల్సా సమీపంలో ఘటాఖేరీకి చెందిన కొండతెగ రాజు చక్రసేన్ తిరుగబడినప్పుడు, అతన్ని అణచడానికి భగవంత్ సింగ్ హాడా కూడా వెళ్ళాడు (వా-3, పేజి 14). 1669 అక్టోబర్‌లో అజ్మీర్‌కు సమీపంలో 'మీనా' తెగవాళ్ళు విద్రోహం లేపినప్పుడు, రాంసింగ్ గౌర్ దాన్ని సమాప్తం చేసి వచ్చాడు (వా-3, పేజి 15). బేకానీర్‌కు చెందిన రాజు రావుకరన్ భూరతియా కొన్నిరోజులు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటును లేపాడు, 1660లో అతని తిరుగుబాటు అణచివేయబడిన తరువాత అతను దర్బారుతో సంబంధం ఏర్పరచుకున్నాడు. అతనికి మూడువేల మన్సబునిస్తూ దక్కన్ యుద్ధాల్లో నియుక్తున్ని చేయడం జరిగింది. (వా-3, పేజి 18 &19).

ఔరంగజేబ్ పట్టాభిషేకం జరిగి రాజ్యాధికారం చేపట్టిన తరువాత, ఆర్థికశాఖ (రెవిన్యూ శాఖ)కు సంబంధించిన సర్వ రాజ్య వ్యవహారాలు రాయెరాయాన్ రఘునాథ్ చేతుల్లో ఉండేవి. అతను అత్యంత నిజాయితీపరుడు. దానితోపాటే రైతుల శ్రేయోభిలాషి. ఔరంగజేబ్ అతనికి 'రాజా' బిరుదునిస్తూ అతని అంతస్తును పెంచేశాడు. (వా-3, పేజి 41).

1667లో యూసుఫ్‌జైకి వ్యతిరేకంగా (అఫ్గనిస్తాన్)కు సైన్యాలు పంపబడినప్పుడు, అందులో రాజపుత్ర సైన్యాలు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నాయి. (వా-3, పేజి 147-152) 1673లో ఖుష్‌హాల్ ఖాన్ ఖటక్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో రాజా జస్వంత్ సింగ్ కూడా పాల్గొన్నాడు. (వా-3, పేజి.149-154).

1673లో జరిగిన సత్‌నామీల విద్రోహాన్ని జదూనాథ్ సర్కార్ అదొక ధార్మిక యుద్ధమైనట్లుగా వర్ణించాడు. కాని ఈ విద్రోహాన్ని అణచడంలో హిందూ నాయకులు, సేనానులు కూడా పాల్గొన్నారు. జదూనాథ్ సర్కార్ కేవలం ఒక్క బిషన్ సింగ్ కచ్‌వాహా పేరును మాత్రమే పేర్కొని మౌనం వహించాడు, కాని అతనితో పాటుగా అతని సైన్యంలో చెప్పుకోదగ్గ సంఖ్యలో రాజపుత్ర వీరులు కూడా ఉంటారుగా! సత్‌నామీలకు వ్యతిరేకంగా బిషన్ సింగ్ ఎంతో వీరోచితంగా పోరాడాడని, యుద్ధంలో అతని ఏనుగు ఏడు సందర్భాల్లో గాయపడిందని కూడా జదూనాథ్ సర్కార్ అంగీకరించాడు (వా-3, పేజి199). ఇదో ధార్మికయుద్ధం, లేక ధార్మికాందోళన అయినప్పుడు హిందూ మరియు ఇతర రాజపుత్ర నాయకులెలా పాల్గొంటారు? గత్యంతరం లేక పాల్గొన్నారనుకున్నా, అన్య మనస్కంగా నున్న మనిషి అంత వీరోచితంగా పోరాడలేడు.

జస్వంత్ సింగ్ గతించిన తరువాత, మర్‌వార్ రాజపుత్రులతో ఔరంగజేబ్‌కు జరిగిన యుద్ధాన్ని జదూనాథ్ సర్కార్ అది సర్వ రాజపుత్రుల జాతీయ పోరాటం అయినట్లు సుదీర్ఘంగా వర్ణించాడు. కాని హాడా మరియు రాథోర్ తెగల రాజపుత్ర నాయకులు చక్రవర్తి సైన్యంలో ఉండి పోరాడారని కూడా అంగీకరించారు (వా-3, పేజి 228). ఈ యుద్ధాల్లో నష్టపోయిన మందిరాల ప్రస్తావన పదే పదే చేస్తూ, ఔరంగజేబ్ ధార్మిక నీతికి, మందిరాల విధ్వంసానికి విసిగిపోయిన రాజపుత్రులు ఇదొక ధార్మిక యుద్ధంగా భావించి పోరాడినట్లు జదూనాథ్ సర్కార్

నమ్మింపజూశారు. కాని అదే గనక ధార్మిక యుద్ధాలై ఉంటే హాడా, మరియు రాథోర్ లాంటి సుప్రసిద్ధ రాజపుత్ర తెగల నాయకులు ఔరంగజేబ్ సమర్థనలో ఎలా పోరాడేవారు? ఈ యుద్ధం ప్రారంభమైన నాటి నుండే మర్‌వార్ రాజపుత్రులు తమ దూతలను పంపుతూ, రాకుమారుడు అక్బర్‌ను అతని తండ్రికి వ్యతిరేకం చేయడానికి ప్రబల ప్రయత్నాలు చేయసాగారు. దీన్ని జదూనాథ్ సర్కార్ 'విద్రోహకర కుట్ర'గా వర్ణిస్తారు. కాని ఈ కుట్రను తేలిక పరచడానికి ఆయన రాసేదేమంటే రాజపుత్రులు అక్బర్‌ను అతని తండ్రి పక్షపాత ధార్మిక వైఖరి వల్ల మొగలు సామ్రాజ్య పటిష్ఠతకే ప్రమాదం వాటిల్లిందని చెబుతూ, అతను సింహాసనాన్ని ఆక్రమించుకొని, తమ పూర్వీకుల సాంప్రదాయంపై నడిచి, తమ వారసత్వాన్ని కాపాడుకోవచ్చని, ఆ విధంగా అతను సింహాసనాన్ని అధిష్టిస్తే, వారంతా అతన్ని జాతీయ పాలకునిగా గుర్తిస్తారని సిసోదియా మరియు రాథోర్ రాజపుత్రులంతా అతని వెంట ఉంటారని అతన్ని మచ్చిక చేసుకున్నారు (వా-3, పేజి 236). అయితే ఇక్కడో విషయాన్ని గమనించాల్సి ఉంది. అప్పటికి ఔరంగజేబ్ పరిపాలించడం మొదలై కేవలం 23 సంవత్సరాలే గడిచాయి. పరిపాలనా కాలం పూర్తిగా గడిచి అది సమాప్తమయ్యే దశకు చేరుకున్నాక సామూహికంగా చూసిన తరువాతగాని అతని పరిపాలనా పద్ధతి ఎలాంటిదో అంచనావేసే అవకాశముంటుంది. రాకుమారుడు అక్బర్‌ను, అతని పూర్వీకుల లాగా జాతీయ పాలకునిగా రాజపుత్రులు అంగీకరిస్తారనే వాక్యం జదూనాథ్ సర్కార్ కలంతో ఏమరుపాటులో జారిపడంది. అంటే దీని అర్థం బాబర్ మొదలుకొని షాజహాన్ వరకు మొగలు పాలకులందరినీ రాజపుత్రులు జాతీయ పాలకులుగా గుర్తించారన్నట్లే కదా! కాని స్వయంగా జదూనాథ్ సర్కారే మొగలు పాలనను దారి దోపిడీ (Brigandage)గా వర్ణించాడు. (వాల్యూం-1, పేజి 140). మహారాణా రాజ్ సింగ్ మరియు దుర్గాదాస్‌లె కలిసి రాకుమారుడు అక్బర్‌ను తండ్రికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు సంసిద్ధున్ని చేసినప్పుడు దాన్ని జదూనాథ్ సర్కార్ రాజపుత్రుల డిప్లొమెసి విజయంగా పేర్కొంటాడు. కాని జదూనాథ్ సర్కార్ పేర్కొన్నట్లే ఔరంగజేబ్ కూడా మిత్రుడైన బేకానీర్ రాజు శ్యాంసింగ్ చొరవతో మర్‌వార్ యుద్ధం సమాప్తమైందని ఆయనే పేర్కొంటాడు (వా-3, పేజి 246). ఈ ఒప్పందాన్ని అనుసరించి అప్పటికి రెండేళ్ళప్రాయం గల అజీత్ సింగ్‌ను యుక్త వయస్సుకు రాగానే మర్‌వార్ పరిపాలకునిగా గుర్తించడం జరుగుతుందని, అతని తాతతండ్రుల లాగే అతనికి కూడా మన్సబు ఇవ్వబడుతుందని, అతను చక్రవర్తికి విధేయుడై ఉంటాడని, ఈ మధ్య కాలంలో సంస్థానమంతటిలో రాజోద్యోగులు పరిపాలనా వ్యవహారాల్ని పర్యవేక్షిస్తుంటారని అంగీకరించడం జరిగింది. (వా-5, పేజి. 205,206)

ఈ ఒప్పందం జరిగిన తరువాత కూడా రాజపుత్రులు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా అలజడులు సృష్టిస్తూనే ఉన్నారు. దీన్ని జదూనాథ్ సర్కార్ రాజపుత్రుల దేశప్రేమ అని, స్వాతంత్ర సమరమంటూ పేర్కొంటాడు. ఆయనిలా రాశాడు : "రాథోర్ దేశభక్తులు వారిపై రుద్దబడిన ఈ విదేశీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూనే ఉన్నారు (వా-5, పేజి 206). కాని అపారమైన రాజ్యవనరుల కారణంగా అది వారిని అణిచి ఉంచగలిగిందని కూడా రాశాడు

(వా-5, పే.206). ఈ ఘర్షణలు 1681 నుండి 1707 మధ్య కాలంలో నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. రాథోర్ రాజపుత్రులు ఏ ప్రాంతాన్నైనా ఆక్రమించుకుంటే, వెంటనే రాజ్యసైన్యాలు వచ్చి వారిని పారద్రోలేవి. రాథోర్‌లు కొండల్లో పోయి దాక్కునేవారు, ఇంకా పస్తులుండేవారు. (వా-5, పే.207). వారు బాహాటంగా యుద్ధం చేసే స్థితిలో లేరని, వారలాచేస్తే పూర్తి ఒక తరం వరకు లేవనంతగా చితికిపోయేవారని, అందుకని వారు గొరిల్లా యుద్ధం చేస్తూ పోయారని రాశాడు. (వా-5, పేజి 207). అజీత్ సింగ్‌ను గుప్తంగా ఉంచి రాథోర్‌లు అతన్ని సంరక్షించేవారు. (వా.5, పేజి 206). దుర్గాదాస్ రాథోర్ నాయకత్వంలో ఈ ఘర్షణలు కొనసాగేవి. అతను దోపిడీ దౌర్జన్యాలు చేసి ధనాన్ని కూడబెట్టేవాడు, పోరాడుతూ (దోచుకుంటూ) రహదారుల్ని అసురక్షితం చేసేవాడు (వా-5, పేజి 206, 207). ఈ మధ్యలో మర్‌వార్ (చక్రవర్తి తరఫున నియమించబడిన) గవర్నరు షుజాఅత్ ఖాన్ అత్యంత తెలివితో అనేకమంది రాజపుత్రుల్ని తనవారిగా చేసుకున్నాడు. అక్కడి ఠాకూర్‌లకు పట్టాలిప్పించాడు, మన్సబు, జాగీర్లు ఇప్పిస్తానని వాగ్దానాలు చేశాడు. దాని ఫలితంగా ఈ రాజపుత్రులు చక్రవర్తి పక్షంలో ఉండి పోరాడడానికి కూడా సిద్ధపడ్డారు. ఉదయ్‌పూర్ సంస్థానమంతా కూడా చక్రవర్తికి విధేయత చూపించింది. అందుకని గుజరాత్ నుండి వెళ్ళే వర్తక సామగ్రి మర్‌వార్‌కు బదులు, ఉదయ్‌పూర్ మీదుగా వెళ్ళసాగింది. (వా-5, పేజి 213). 1698లో దుర్గాదాస్ ఓటమిని అంగీకరించి దర్బారులో హాజరైనప్పటి సన్నివేశాన్ని జదూనాథ్ సర్కార్ ఇలా వర్ణించాడు :

"ఇస్లాంపురి క్యాంపులో ఏర్పరిచిన దర్బారులో హాజరవడానికి దుర్గాదాస్ వచ్చినప్పుడు, అతను ఓ ఖైదీలాగా నిరాయుధుడై హాజరవ్వాలని రాజాజ్ఞ అయింది. దీనికి అతను ఎలాంటి ప్రతిఘటన చేయలేదు, నిరసన తెలుపలేదు. తన ఖడ్గాన్ని తీసి పక్కకు పెట్టేశాడు. ఈ విషయం చక్రవర్తికి తెలిసినప్పుడు, అతను ఆయుధాలు ధరించి రావచ్చని రాజాజ్ఞ అయింది. అతను చక్రవర్తి గుడారంలో ప్రవేశించినప్పుడు, రాజ్యకోశాధికారి రూహుల్లా ఖాన్ ముందుకు వెళ్ళి, అతని చేతుల్ని రుమాలుతో కట్టేశాడు. ఆ తరువాత చక్రవర్తి ముందుకు ప్రవేశపెట్టాడు. ఇదో థియోరాటికల్ ఆచారం. మొగలుల కాలంలో ఒక అపరాధి క్షమింపబడడానికి ఇదేరకంగా సమర్పించబడేవాడు మరియు రాచమర్యాదలు పాటించబడేవి. చక్రవర్తి దయ కనికరాలతో సంతృప్తుడై దుర్గాదాస్ చేతులకు కట్టిన బంధనాలను విప్ప ఆజ్ఞాపించాడు. అతన్ని మూడువేల మన్సబుపై నియుక్తున్నిచేశాడు, వజ్రాలు పొదిగిన ఛురకత్తిని బహూకరించాడు. బంగారు కడియాల్ని, మేలిముత్యాల హారాన్ని ప్రసాదించాడు. రాజ్య ధనాగారం నుండి లక్ష రూపాయలు నగదుగా కూడా అనుగ్రహించాడు. (వా-5, పేజి 218).

1700లో అజీత్ సింగ్ నుండి చక్రవర్తికి ఒక లేఖ అందింది. అందులో తను నాలుగువేల సైన్యంతో రాజ్యదర్బారులో హాజరుకాగలనని, దీని ఖర్చుల కోసం నగదు రూపాయలు, జాగీరును ప్రసాదించాలని విన్నవించుకున్నాడు. చక్రవర్తి ఈ లేఖ చూసిన తరువాత, అజ్మీర్ రాజ్యధనాగారం

నుండి అతనికి నగదు రొక్కం ఇవ్వాలని ఆదేశాలు జారీచేశాడు, ఇంకా అతను దర్బారుకు హాజరైనప్పుడు జాగీరు కూడా ప్రసాదించబడుతుందని వాగ్దానంచేశాడు (వా-5, పేజి 218).

మర్వార్ యుద్ధాన్ని ఇంతవరకు జాతి విమోచనా పోరాటంగా వర్ణిస్తూ వచ్చిన జదూనాథ్ సర్కార్, అజీత్ సింగ్ మరియు దుర్గాదాస్ చేపట్టిన ఈ యుద్ధాన్ని తిరుగుబాటుగా పేర్కొంటూ ఇలా రాశాడు : "దుర్గాదాస్‌తో సంధీశాంతి ఏర్పడిన తరువాత, అతను మర్వార్ నుండి దూరముండాలనే దృష్టితో, అతన్ని పటన్ (గుజరాత్) సైన్యాధికారి (ఫౌజ్‌దార్)గా నియమించి పంపించడం జరిగింది. కాని 1702లో అతను తిరిగి తిరుగుబాటును లేవదీశాడు. అజీత్ సింగ్ కూడా దర్బారులో హాజరవకుండా కుంటిసాకులు చూపసాగాడు. చక్రవర్తి దుర్గాదాస్ ప్రవర్తనతో చిర్రెత్తిపోయాడు, అతను వెంటనే దర్బారులో హాజరు కావాలని, లేని పక్షంలో అతను వధించబడతాడని ఆదేశాలు జారీచేశాడు. అజీత్‌సింగ్‌ను ఈ దుర్గాదాస్ పెడత్రోవపట్టిస్తున్నాడని చక్రవర్తికి అనుమానం వచ్చింది. దుర్గాదాస్ మొగలు దర్బారులో హాజరవడానికి సంసిద్ధుడయ్యాడు, కాని మొగలుల పట్ల అతను అనుమానానికి గురిఅయ్యాడు. అందుకని మర్వార్ పారిపోయాడు, అక్కడి నుండి పటన్ చేరుకున్నాడు. తిరిగి మర్వార్ ప్రాంతానికి వచ్చేశాడు. ఈ బహిరంగ తిరుగుబాటులో అజీత్‌సింగ్ అతనికి తోడు గట్టాడు. అయితే ఇద్దరిలో అనతి కాలంలోనే పరస్పరం వ్యతిరేకత ఏర్పడింది. (వా.5,పే.219-221) జదూనాథ్ సర్కార్ ఈ నిందనంతటినీ అజీత్‌సింగ్‌పై రుద్దేసి అతని మనస్తత్వాన్ని గురించి ఇలా రాశాడు:

"అతను గర్విష్టి, స్వతహాగా చెడ్డవాడు, అతనిలో ఆలోచించే, యోచించే యోగ్యత లేదు. ముందే ఏర్పరుచుకున్న ఓ పథకం ప్రకారం ఆచరించే యోగ్యత లేనివాడు. ఇంకా ఉద్యుక్తుడై ఏ పనిచేసేవాడు కాదు, అతనెవ్వరి సలహాల్ని పాటించేవాడు కాదు, తొందరగా మండిపడే స్వభావం కలవాడు, దుర్గాదాస్ పలుకుబడి మరియు అసాధారణమైన ప్రభావాలతో కూడా ఈర్ష్యపడేవాడు. అతని వ్యక్తిత్వంలోని ఈ లోపాల కారణంగా అతని ఇంట్లోని ఒక ప్రాచీన విశ్వాసపాత్రుడు, శ్రేయోభిలాషి, పసితనంలో అతన్ని తన సంరక్షణలో ఉంచిపెంచిన నిస్వార్థపరునితో అతను (అజీత్‌సింగ్) ఎలా ప్రవర్తించాడంటే, అతని మనసు విరిగి మొగలుల ఉద్యోగంలో చేరిపోయాడు. ఇంకా ఉదయ్‌పూర్ ప్రాంతానికి వెళ్ళి తలదాచుకున్నాడు. (వా-5,పే.221)

"అజీత్ సింగ్‌ను మచ్చిక చేసుకోవడానికి ఔరంగజేబ్ అతనికి మీర్థా జాగీరును ఇచ్చాడు. నాగూర్‌కు చెందిన ఇంద్రాసింగ్ కుమారుడు ముహ్కుం సింగ్ అజీత్‌సింగ్ కోసం నిరంతరంగా పోరాడుతూనే ఉన్నాడు. ఇంకా వ్యక్తిగత త్యాగాలెన్నో చేశాడు. అతను మీర్థా జాగీరును తనకోసం ఆశిస్తుండేవాడు, కాని అజీత్ సింగ్ అతని భావనల్ని పక్కకుపెట్టి, అతని జాగీరును స్వీకరించినప్పుడు, 1705లో మొహ్కుం సింగ్ ఔరంగజేబ్‌తో కలిసి పోయాడు, మరియు అతని పక్షాన రాఠోర్‌లతో పోరాడాడు. 1705లో దుర్గాదాస్ కూడా ఔరంగజేబ్‌కు

విధేయత చూపినప్పుడు, అతని పాత మన్సబు మరియు గుజరాత్‌లో అతని హోదా తిరిగి ఇవ్వడం జరిగింది (వాల్యూం-5, పేజి 221,222).

జదూనాథ్ సర్కార్ పైన వ్రాసిందంతా పరిశీలిస్తే, రాజపుత్రులు ఔరంగజేబ్ చివరి కాలం వరకు అతన్ని వెన్నంటే ఉన్నారని అతనికోసం, తమ స్వజాతి రాజపుత్రులతో కూడా పోరాడారని, మర్వార్ యుద్ధంలో ఔరంగజేబ్ సైన్యంలో రాజపుత్రులు కూడా ఉన్నారని స్పష్టమైపోతున్నది. దుర్గాదాస్ రెండుసార్లు అతని ముందు తలవంచి తన విధేయత తెలుపు కున్నాడు. ఇక అజీత్ సింగ్ అయితే ఆ తరువాత వివాహాది సంబంధాలతో, రాజదర్బారుతో తన గట్టి సంబంధాలను ఏర్పరచుకున్నాడు. ఇలాంటి సంఘటనల్ని, యుద్ధాల్ని జాతి విమోచనా పోరాటంగా జదూనాథ్ సర్కారు పేర్కొనడంలో అర్థం ఏముంది? రాజపుత్రులు లేపిన విద్రోహాల్ని రాజపుత్ర సైన్యాలే అణిచివేసినప్పుడు, రాజపుత్రులకు వ్యతిరేకంగా రాజపుత్రులే పోరాడినప్పుడు, జాతి విమోచనం, స్వాతంత్ర్యం కోసం పోరాటం అనే మాటలకు ఆస్కారమేముంటుంది?

ఔరంగజేబ్ సమర్థనలో రాజపుత్రులు, శివాజీ మరియు మరాఠాలతో కూడా పోరాడారు. రాజాజైసింగ్ ఎంతటి వివేకం, తెగింపు, వీరత్వం మరియు సాఫల్యంతో శివాజీకి వ్యతిరేకంగా యుద్ధం జరిపాడో అది ఔరంగజేబ్ కాలం నాటి చరిత్రలోని ఒక మరుపురాని ఘట్టం. శివాజీకి చెందిన ఇరవై మూడు కోటల్ని ఔరంగజేబ్ అధీనంలోకి తెచ్చాడు. ఇంకా శివాజీని సగౌరవంగా ఔరంగజేబ్ దర్బారులో హాజరు పరిచాడు. (వా-4, పేజి69).

జోద్‌పూర్‌కు చెందిన ఇంకొక ప్రఖ్యాత రాజపుత్రరాజు మహారాజా జస్వంత్ సింగ్ పదే పదే మోసం, ద్రోహం చేసినా కూడా ఔరంగజేబ్ ప్రతిసారి అతన్ని క్షమిస్తూ చివరికంటూ తన వెంట ఉంచుకున్నాడు. అతని గురించి జదూనాథ్ సర్కార్ ఇలా వ్రాశాడు :

"జైసింగ్ తరువాత శివాజీని ఎదుర్కోవడానికి రాకుమారుడు ముఅజ్జంతో పాటుగా రాజా జస్వంత్ సింగ్ కూడా పంపబడ్డాడు. అతను ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా ధర్మావత్‌లో పోరాడాడు, కజ్‌వాహా యుద్ధంలో ఔరంగజేబ్‌ను మోసగించాడు, దేవ్‌రాయ యుద్ధంలో తిరిగి దారా షికూహ్‌తో కలిసిపోయాడు. ఈ చేదు అనుభవాలన్నిటిని ఔరంగజేబ్ తరచుగా జ్ఞాపకం చేసుకుంటుండేవాడు (వా-3, పే.216). సంధీ, శాంతికోసం శివాజీ సమర్పించిన అర్జీని, రాజా జస్వంత్ సింగ్ సిఫారసు మీదనే ఔరంగజేబ్ అంగీకరించాడు.

పహాడ్ సింగ్ గౌడ్ మాల్వాలోని షాహ్ ఆబాద్ దందేరాకు (మొగలుల) సైన్యాధికారి. అతను 'లోందీ'కి చెందిన రాజా అనిరోధ్ సింగ్‌తో తలపడ్డాడు. అతని క్యాంపును దోచుకొని గొప్ప ధనాన్ని కూడబెట్టాడు. ఆ తరువాత అతను ఔరంగజేబ్‌కు కూడా ఎదురు తిరిగి, మాల్వా గ్రామాల్ని దోచుకోసాగాడు. రాయెమలోక్ చంద్, ఉదయ్‌పూర్ వెళ్ళి అతన్ని అణిచివేశాడు. ఈ యుద్ధంలోనే పహాడ్ సింగ్ వధించబడ్డాడు. మలోక్ చంద్ అందించిన సేవలకు గాను

అతనికి 'రాయెరాయాన్' అనే బిరుదును ప్రసాదించడం జరిగింది. దీనితో పాటుగా అతని మన్సబులో కూడా పెంపుదల వచ్చింది. రాయె రాయాన్ అనేది హిందూ నాయకులకిచ్చే మహా గొప్ప బిరుదు. పహాడ్ సింగ్ తరువాత అతని కుమారులు గ్వాలియర్‌లో దోపిడీ దౌర్జన్యాలను కొనసాగించారు. వ్యాపార సరకుల రాకపోకల్ని ఆపేశారు. మలోక్ చంద్ ఈ విద్రోహ కార్యకలాపాల్ని కూడా సమాప్తం చేయగలిగాడు, కాని ఆ తరువాత వెంటనే అతను చనిపోయాడు, అతని కుమారుడు ఔరంగజేబ్ వద్దకు వచ్చినప్పుడు, అతని తండ్రి అందించిన సేవల దృష్ట్యా, అతనికో మంచి స్థానంపై నియమించడం జరిగింది. పహాడ్ సింగ్ కుమారుడు దేవీసింగ్, మనుమడు గోపాల్ సింగ్ తమ అరాచకాలను కొనసాగిస్తూనే ఉన్నారు. కాని 1692లో ఈ విద్రోహులు ఆయుధాలు పడేశారు. గోపాల్ సింగ్ తన బంధువులతో సహా ఆగ్రా గవర్నరు అయిన షాయిస్త ఖాన్‌ను సందర్శించి, ఎనభై ఐదు వేల నజరానాను సమర్పించుకొని, తన విధేయతను తెలుపుకున్నాడు, కనుక అతనికి మన్సబును ప్రదానం చేస్తూ, సైనిక సేవల కోసం కాబూల్ పంపించబడ్డాడు. పహాడ్ సింగ్ ఇంకొక కుమారుడు 1695లో రెండు వందల యాభై మంది గౌడ్ కులస్థుల్ని సైన్యంలో చేర్పించడానికి తీసుకొచ్చాడు. పహాడ్ సింగ్ కుమారుడు దేవీసింగ్ 1699లో ఔరంగజేబ్ తరఫున దక్కన్‌లో మహేందర్ గడ్ కోటాధిపతిగా నియమించబడ్డాడు. (వాల్యూం-5, పేజి 232-235).

పై సంఘటనలన్నీ యదూనాథ్ సర్కార్ వాల్యూంల నుండే సంగ్రహించడం జరిగింది. దీనివల్ల రాజపుత్రులు, ఇతర హిందూ నాయకులు చివరికంటూ ఔరంగజేబ్‌ను అంటిపెట్టుకునే ఉన్నారనే విషయం విదితమవుతుంది. అక్కడక్కడ అరాచకాలు, విద్రోహాలు చెలరేగినా, అవి ఔరంగజేబ్ ధార్మికనీతి లేక హిందువుల్ని నొప్పించినందువల్ల జరిగినవి ఎంతమాత్రం కావు. ఇలాంటి అరాచకాలు, విద్రోహాలు, ప్రతిజాతి, ప్రతి దేశం, ప్రతి కాలంలోనూ జరుగుతూనే ఉంటాయి. అందులో హిందూ ముస్లింలనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎందుకంటే ఈ అరాచకాల్ని, విద్రోహాల్ని, తిరుగుబాట్లను ఔరంగజేబ్ తన హిందూ మరియు రాజపుత్ర మన్సబుదార్ల ద్వారానే సమాప్తం చేస్తుండేవాడు. ఇంకా అఫ్ఘాన్లు, ఆఫ్రిదీలు, యూసుఫ్‌జైలు లేక దక్కన్ ముస్లిం పాలకుల్ని అణిచవేసినట్లే, వీటినీ అణిచివేస్తుండేవాడు.

ఈ వాస్తవాలను క్షుణ్ణంగా తెలుసుకున్న తరువాత కూడా ఔరంగజేబ్ ధార్మిక హింస కారణంగా రాజపుత్రులు అతనికి దూరమయ్యారని జదూనాథ్ సర్కార్ తన పాఠకులను పెడద్రోవపట్టించడం ఎంతవరకు సబబో పాఠకులే నిర్ణయించాలి.

సిసోదియా, రాఠోర్, కచ్‌వాహా మరియు హాడా రాజపుత్రులు జాగీర్ల కోసం మొగలు పతాకం కింద పోరాడారని, ఔరంగజేబ్ మందిరాలను ధ్వంసం చేసినా వారి అభిమానం మేల్కొలేదట (వా-1, పేజి 15). ఇంకా మేవాడ్, మర్‌వార్ రాజపుత్రులు అతనితో అసంతృప్తులవడం వల్ల ఈ ప్రాంతాల నుండి లభ్యమయ్యే మంచి యోధులు మొగలు సైన్యానికి కరువై

పోయారు, కాని బుందేలా, కచ్‌వాహా మరియు హాడా వంశాలకు చెందిన రాజపుత్ర సైనికులు క్రమం తప్పకుండా మొగలు సైన్యాలతో ఉంటూ వచ్చారు (వా–3, పే.248). అంతేకాకుండా ఈ రాజపుత్రవీరులు, దక్కన్ యుద్ధాల్లో చివరి వరకు ఔరంగజేబ్‌ను విడిచిపెట్టలేదని కూడా రాశాడు. ఈ విషయంలో ఆయనిలా రాశాడు: "రాజ్యసైన్యాలకు చెందిన ఒక పూర్తి తరం దక్కన్‌లోనే గడిపేసింది. వారు పట్టణాలనుగాని, ఇటుక, రాళ్ళ గృహాలను గాని చూడలేదు. సైనిక గుడారాల్లోనే వారి జీవితాలు గడిచిపోయాయి. వారు ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి తరులుతూ ఉండేవారు. వారి రాబోయే తరం సామ్రాజ్యానికి సేవలందించే యోగ్యత కోల్పోతుందని, వారి జీవితమంతా దక్కన్‌లోనే గడిచి పోతున్నదని, వారు తమ ఇళ్ళకు వెళ్ళలేకపోయారని, తమ పిల్లల్ని సంస్కరించలేక పోయారని ఈ రాజపుత్ర సైనికులు తమ నిరసనను తెలుపుకునేవారు. (వా–5, పేజి 345).

ఆయనగారి ఏమరుపాటును చూడండి. రాజపుత్రుల నిరుద్యోగాన్ని వర్ణిస్తూ ఆయనిలా వ్రాశాడు: "ఔరంగజేబ్ కాలంలో ఉత్తర భారతంలో శాంతి ఏర్పడింది. అప్పుడు ఈ రాజపుత్రులు నిరుద్యోగులై, తమలో తామే పోరాడుకోవడమో లేక దొంగతనం దోపిడీలకు ఎగబడడమో లేక జాగీరు కోసం మతం మార్చుకోవడమో చేయసాగారు. ఆయన ఇంకిలా వ్రాశారు :

"హిందువుల్లోని మొత్తం క్షత్రియ జాతి కులవృత్తి యుద్ధం, సైనిక కార్యకలాపాలే, ఎప్పుడైతే మొగలులు ఉత్తర భారతంలో శాంతిని స్థాపించారో, ఇక భుక్తికోసం పశ్చిమ సరిహద్దులు దాటి ఆవలికి పోవడమో లేక దక్కన్‌లో ఇంకా సామ్రాజ్య అధీనంలోకి రాని ప్రాంతాలకు వెళ్ళడమో తప్ప వేరే మార్గం లేకపోయింది. మొగలు పతాకం క్రింద రాజపుత్రులు మధ్య ఆసియా, మరియు ఖాందహార్ వరకు వెళ్ళి యుద్ధాలు చేశారు. కాని ఔరంగజేబ్ కాలంలో వారి సైనిక కార్యకలాపాలు వారి సరిహద్దుల లోపల్నే పరిమితమై పోయాయి. కాబూల్ సామ్రాజ్యంలోనే చేరి ఉంది. దక్కన్‌లోని మిగిలిన ప్రాంతాలన్నిటిని ఔరంగజేబ్ తన సామ్రాజ్యంలో విలీనం చేసుకున్నాడు. ఇవి రాజపుత్రుల నిరుద్యోగానికి రెండు ప్రధాన కారణాలయ్యాయి. దక్కన్‌లో పరాజితమైన రాజ్యాల ఉద్యోగులు యజమాని, స్వామిలేని వారయ్యారు. వారికి భుక్తిని, ఉద్యోగాన్ని సమకూర్చడం అనివార్యమైంది. రెండవది ఔరంగజేబ్ ఇంకను దండయాత్రలు జరుపడానికి, విజయాలు సాధించడానికి చెప్పుకోదగ్గ ప్రాంతాలే మిగుల లేకపోయాయి. ఈ పరిస్థితుల కారణంగా రాజపుత్ర కుటుంబాల్లోని సామర్థ్యం గల వ్యక్తులు తమ బంధువుల్లోనే, తమ ఇళ్ళల్లోనే పోరాడుకోసాగారు, లేదా బందిపోట్లుగా మారడానికి సంసిద్ధులయ్యారు. లేదా ఔరంగజేబ్‌తో జాగీరు పొందవచ్చని తమ ధర్మాన్ని విడనాడసాగారు."

ఆయన ఇంకిలా రాశాడు :

"ఉత్తర భారతంలోని హిందువుల సైనిక శక్తి దక్కన్ యుద్ధాల్లో అత్యధికంగా నష్ట పోయింది. కాని దీనివల్ల ఔరంగజేబ్‌కు ఏమీ లాభం చేకూరలేదు. రాజపుత్రులు తమ వీరత్వంలో ప్రఖ్యాతిగాంచిన వారైనప్పటికీ, కోటల ముట్టడి, మరియు పర్వత యుద్ధాల్లో వారు పనికిరాని

వారుగా నిరూపితమయ్యారు. అందుకే దక్కన్‌లో అవసర నిమిత్తం లేక సహాయార్థం ఉంచబడిన వీరి సైనిక పటాలాలు అంతగా విశ్వసించదగినవిగా లేకపోయాయి. (వా-5, పేజి 348,349).

ఔరంగజేబ్ హిందువుల్ని, రాజపుత్రుల్ని ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించాడని, వారి మతమార్పిడి చేసేవాడని జదూనాథ్ సర్కార్ ఏ నిందలైతే మోపారో, స్వయంగా ఆయన రాసిన పై వాంజ్మూలం ద్వారా ఇవి అసత్యపు ఆరోపణలని నిరూపితమైపోయాయి.

"ఔరంగజేబ్ యాభైఏళ్ళు సుదీర్ఘంగా పరిపాలించాడు, భారతదేశంలోని దాదాపుగా అన్ని ప్రాంతాలు అతని అధీనంలోకి వచ్చేశాయి. ఈ సుదీర్ఘ కాలంలో, సువిశాలమైన అతని సామ్రాజ్యంలో అక్కడక్కడ రాజకీయ సంక్షోభాలు తలెత్తాయి, వివిధ ప్రాంతాల్లో విద్రోహాలు చెలరేగాయి, తలబిరుసుతనం గల వాళ్ళు కొందరు తిరుగుబాటుకు కూడా పాల్పడ్డారంటే అందులో ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ప్రతి దేశ ప్రభుత్వంలోనూ ఇలాంటివి ఏవో కొన్ని సంక్షోభాలు, అలజడులు తలెత్తుతుంటూనే ఉంటాయి. వాటిని అణచడంలో ఔరంగజేబ్ విఫలుడైతే, నిస్సందేహంగా అతను చెడుపాలకునిగా, బలహీన ప్రభువుగా భావించబడేవాడు. కాని జదూనాథ్ సర్కార్‌ను అనుసరించే, అతని కేంద్ర ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ ఎంత పటిష్టంగా ఎంత పకడ్బందీగా ఉండేదంటే, అతని కాలంలోనే కాదు, అతను గతించిన ముప్పైఐదు సంవత్సరాల తరువాత వరకు కూడా అందులో ఎలాంటి లోపంగాని బలహీనతగాని, లేక మార్పుగాని రాలేకపోయింది." (ఫాల్ ఆఫ్ మొగల్ ఎంపైర్, వా-2, పేజి 2) అందుకే జదూనాథ్ సర్కార్ కూడా గత్యంతరం లేక "అతను తన తెలివితేటల ద్వారాను, శీలం ద్వారాను తన ఘనకార్యాల కారణంగాను ఆసియా ఖండానికి చెందిన మహోన్నత పరిపాలకుల్లో పరిగణింపబడతాడ"ని రాయకుండా ఉండలేకపోయారు. (వా-5, పేజి 1).

బుందేల, రాజపుత్ర మరియు మరాఠాల నాయకులకు సంబంధించి జదూనాథ్ సర్కార్ ఏ వివరాలనైతే వెల్లడించారో వాటి వెలుగులో, ఈ నాయకుల ముందు కేవలం తమ స్వంత ప్రయోజనాలు మాత్రమే ఉండేవని ఏ చరిత్రకారుడైనా సరే, ఘంటాపథంగా చెప్పగలగుతాడు. వారు తమ గద్దెకోసం, తమ స్వప్రయోజనాల కోసం ఔరంగజేబ్‌తోనే కాదు, తమ స్వవర్గం వారితో కూడా తలబడ్డారు. జాగీరు కోసం తనయుడు తండ్రికే ఎదురు తిరిగాడు. (వా-5, పే. 237).

సోదరుడు, సోదరునికే తిరుగబడ్డాడు, అల్లుడు మామను వదిలేశాడు (వా-5, పే. 211). అంతేకాదు వారు రాజదర్బారు నుండి మన్సబులు, బిరుదులు, గౌరవాలు, జాగీర్లు పొందే ఆశతో తమ స్వమతస్తులకు, స్వంత వర్గంవారికి, రక్త సంబంధం గల బంధువుల్ని సైతం వ్యతిరేకించి రాజ్యసేనల్లో చేరిపోయారు. అవసరం, అవకాశం వచ్చినప్పుడు పెద్ద పెద్ద లంచాలు

తీసుకొని కీలకమైన కోటల్ని, సైనిక స్థావరాలను రాజ్యసైన్యాలకు అప్పగించారు (వా-5, పే.114-115-116,136,146).

ఔరంగజేబ్ తన అపూర్వమైన తెలివితేటలతో, విధి నిర్వహణ కోసం వారి బలహీనతలతో పూర్తిగా లాభపడ్డాడు. ఒకసారి మన్సబుల నిచ్చాడు, ఇంకొకసారి బిరుదుల్ని ప్రసాదించాడు. మరొకసారి జాగీర్లనిచ్చాడు. వారికి రాజా, రావ్, రాయ్ ఇంకా రాయ్‌రాయాన్ లాంటి బిరుదుల్ని ఇచ్చి ఉన్నత హోదాలపై నియమించాడు. అయినా ఒక్కొక్కసారి వారి ఆశలు తీరకపోయినప్పుడు వారు తిరుగుబాటుకు, అరాచకానికి పాల్పడేవారు, వారిని అణచడానికి రాజ్యసైన్యాలు బయలు దేరేవి. ఎదురుబడి రక్తపాతాలు, యుద్ధాలు జరిగేవి. కాని ఈ యుద్ధాల తరువాత శాంతి, సంధులు కూడా ఏర్పడేవి. వ్యతిరేకంగా పోరాడిన ఈ బుందేలాలే, ఈ రాజపుత్రులే, ఈ మరాఠా నాయకులే తిరిగి రాజ్య సైన్యాల్లో చేరి, మొగలు పతాకం క్రింద రాజ్య పరిరక్షణకోసం తెగించి పోరాడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఔరంగజేబ్ తన పరిపాలనా కాలమంతటిలో కేవలం మందిరాలనే ధ్వంసం చేస్తూ, రావణుడై రాజ్యమేలుతూ ఉంటే, అతని సింహాసనాన్ని, రాజ్యాన్ని సంరక్షిస్తూ వచ్చిన ఈ హనుమంతులు అతని సింహాసనాన్ని, రాజ్యాన్ని ఏనాడో కాల్చి భస్మం చేశేసేవారు. అతను గతించి శతాబ్దాలు గడిచిన తరువాత, జదూనాథ్ సర్కార్ అతన్ని మహాచెడ్డవానిగా నిరూపించడానికి విఫల ప్రయత్నం చేసినప్పటికీ, "మొగలు పాలకుల్లో అక్బర్ తరువాత అతనే అత్యంత శక్తిమంతుడైన పరిపాలకుడు" అంటూ రాయకుండా ఉండలేక పోయారంటే ఇదే సంపూర్ణ వాస్తవం గనుక.

స్వయంగా జదూనాథ్ సర్కారే అతను జారీచేసిన ఒక ఫర్మానాను ఉటంకిస్తూ ఇలా రాశారు : "మధ్యస్థ మార్గాన్ని అతిక్రమిస్తే ఇహపరాల్లో నష్టాన్ని ఎదుర్కోవటం తప్ప ఇంకేమీ లాభం కాదని అతను ఆదేశించాడని, ఇంకా ఖుర్‌ఆన్‌ను అనుసరించి న్యాయం, సమానత్వం పరిపాలనా వ్యవహారాల్లో అనివార్యమనేది అతని (దైనందిన) పద్ధతి. చిన్నలపై, పెద్దలపై దయా కనికరాలు, ప్రేమ వాత్సల్యాలు కనబరచాలనేది దైవాదేశం (అని అతను విశ్వసించాడు). (మొగల్ అడ్మినిస్ట్రేషన్ - జదూనాథ్ సర్కార్, పేజి 197-213).

పరమత సహనంతో, మత సామరస్యంతో పై విషయాలను ఆచరించి ఉండకపోతే, మధ్యస్థ మార్గాన్నే గనక అతిక్రమించి ఉంటే, న్యాయం, సమానత్వాలనే గనక పాటించి ఉండకపోతే, చిన్న పెద్దలందరిపై దయాకనికరాలు, ప్రేమ వాత్సల్యాలతో వ్యవహరించి

ఉండకపోతే, అతను యాభై ఏళ్ళు సుదీర్ఘంగా పరిపాలించి ఉండకపోయేవాడు, మధ్యంతరంలో ఎక్కడో, ఎప్పుడో సమాప్తమైపోయేవాడు.

రాజపుత్రుల మొగలుల సంబంధాలెలా ఉండేవో, ఒకరిపై ఒకరికి ఎంతగా విశ్వాస నమ్మకాలుండేవో ఒకరి మాన ప్రాణాలు కాపాడడానికి వేరొకరు ఎలా తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి సంసిద్ధులై ఉండేవారో తెలిపే ఒక సంఘటనను మీకు సమర్పిస్తున్నాము : "1682 డిసెంబర్ చివరలో రాకుమారుడు ఆజం షా, మరాఠాల ఒక తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వచ్చింది. జరిగిన విషయం ఏమిటంటే, అతను ఉంటున్న అహ్మద్ నగర్‌ను వీడి, ఆదిల్ షాహి ప్రాంతాలపై దాడి జరపాలని అతనికి ఆదేశాలందాయి. తదనుగుణంగా అతను బయదులేరి సాంభాజి ప్రాంతంలో ప్రవేశించాడు. ధరూర్ అనే ప్రాంతంలో సైనిక శిబిరం ఏర్పాటుచేసి, వెంటనున్న తన భార్య జహాఁ జేబ్ బానొను (ఈమె సామాన్యంగా జానిబేగంగా పిలువబడేది) అక్కడ వదలి, రాజపుత్రుల ఒక సైనిక దళాన్ని ఆమెకు రక్షణగా ఉంచి, సైన్యసమేతంగా శత్రు ప్రాంతంలో ఇంకనూ లోపలికి చొచ్చుకుపోయాడు. ఆజంను ఆపడానికి పంపబడిన మరాఠాల సైన్యం అకస్మాత్తుగా అక్కడ ప్రత్యక్షమైంది. ఇక యుద్ధం తప్పదని తెలిసినప్పుడు దారా షికూహ్ కూతురు, ఔరంగజేబ్‌కు కోడలైన ఈ వీరవనిత, తెరలు చుట్టబడిన అంబారీపై ఎక్కి ఏనుగును తన క్యాంపు నుండి రెండు మైళ్ళు శత్రుసైన్యం వైపుకు నడిపింది. రాజపుత్ర సైనిక దళానికి కమాండరైన అనురోద్ సింగ్, ఇంకా ఇతర అధికారులు, స్వయంగా ఆమె సేవకులు, సైనిక శిబిరం విడిచి వెళ్ళవద్దని ఎంతగా విన్నవించుకున్నా ఆమె వినిపించుకోలేదు. దీనికి బదులు "పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, మాటలు కట్టిపెట్టి పనికి (ఎదుర్కోవడానికి) బయలుదేరండ"ని పురమాయించింది.

అనురోద్ సింగ్‌ను తన ఏనుగు వద్దకు పిలిపించి, తనదైన శైలిలో ఇలా చెప్పింది : "చుగ్‌తాయి (మొగలుల) మానమర్యాదలు, రాజపుత్రుల మానమర్యాదలు ఒకటే, సమానమేననేది గుర్తుంచుకో బిడ్డా!" అని చెబుతూ, తన స్వంత చేతుల మీదుగా వారికి కొన్ని బల్యాల్ని అందిస్తూ ఇంకా ఇలా అన్నది : "ఒకవేళ ఈ చిన్న సైనిక దళంతో దైవం మనకు విజయం ప్రసాదిస్తే మంచిదే, అలా కానప్పుడు నా గురించి మీరు ఆలోచించనవసరం లేదు, నేను నా పని ముగించుకొని కూర్చుండిపోతాను (అంటే సజీవంగా పట్టుబడకుండా ఆత్మహత్య చేసుకుంటాను)" – ఆ తరువాత తీవ్రమైన సమరం మొదలయింది. అనురోద్ పక్షంలో తొమ్మిది వందల మంది రాజపుత్ర సైనికులు మరణించారు. ఇంకా మరాఠాల వైపు కూడా అత్యధిక మందే అసువులు

బాసారు. గాయపడినప్పటికీ చివరికి అనురోద్‌కు విజయం వరించింది. యుద్ధం జరుగుతున్నంతసేపు, జాని బేగం వారిని ప్రోత్సహిస్తూనే ఉండింది.

యుద్ధం సమాప్తమైన తరువాత, గాయపడిన అనురోద్ సింగ్‌ను తన వద్దకు పిలిపించుకొని, అతనికి సాంత్వన పలికి, రూ.40,000/- విలువ కలిగిన ముత్యాల హారాన్ని స్వయంగా తన చేతులతో అనురోద్ సింగ్ మెడలో తొడిగింది. ఆ తరువాత విజయ నగారా మ్రోగించింది. ఇంకా తన క్యాంపుకు మరలింది.

తన కార్యం ముగించుకొని వచ్చిన రాకుమారుడు ఆజం, తన భార్య చూపించిన వీరత్వానికి ముగ్దుడైపోయాడు, ఇంకా రాజపుత్రుల తెగువ, ఆత్మార్పణకు చలించిపోయాడు. (అఖ్బారాత్) (History of Aurangazeb - By J.N. Sarkar, Vol.Iv, P.215, 216).

ఔరంగజేబ్ హిందువుల్ని, రాజపుత్రుల్ని తన మత పక్షపాతం కారణంగా దూరం చేసుకున్నాడని, వారిని రాజ్య ఉన్నత హోదాల నుండి వంచించాడని బహుళంగా, పదే పదే చేయబడే విషప్రచారానికి ఒక ప్రఖ్యాత ఆధునిక చరిత్రకారుడు ఇచ్చిన సమాధానాన్ని చదివిన తరువాతనైనా మనం నిరాధారమైన, అభూతకల్పనలైన మన భావనల్ని మార్చుకోగలమా?

యూనివర్శిటి గ్రాంట్స్ కమీషన్‌కు మాజీ ఛైర్మన్, ఔరంగజేబ్, మొగలు వంశంపైనే కాదు, మొత్తం భారతదేశ చరిత్రపై సంపూర్ణ అవగాహన ఉన్న ప్రఖ్యాత ఆధునిక చరిత్రకారుడు ప్రొఫెసర్ సతీశ్ చంద్ర, 1988 ఏప్రిల్ నెలలో లక్నోలో ఇచ్చిన ఒక లెక్చర్ సందర్భంలో ఇలా వెల్లడించారు.

“ఔరంగజేబ్ రాజపుత్రులతో కయ్యాన్ని కొనితెచ్చుకున్నాడని, హిందువుల్ని ఉన్నత హోదాల నుండి వంచించాడని కొందరి అభిప్రాయం. కాని ఆధునిక పరిశోధనలు దీన్ని తప్పుగా నిరూపిస్తున్నాయి. ఔరంగజేబ్ కాలంలో హిందూ మన్సబుదారుల సంఖ్య, ఇతర జాతుల మన్సబుదారుల సంఖ్యకన్నా తగ్గకుండా ఇంకా పెరిగిపోయింది. అక్బర్ కాలంలో హిందూ మన్సబుదారుల సంఖ్య 16 శాతం ఉండేది. షాజహాన్ కాలంలో అది 24 శాతం ఉంది. కాని ఔరంగజేబ్ కాలంలో అది 34 శాతానికి పెరిగిపోయింది. ఇది ఎలాంటి వాస్తవ మంటే నేటి కాలంలో కొద్దిమందికి మాత్రమే ఈ విషయం తెలుసు లేక తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. ..... అక్కడక్కడ కొన్ని సూబాల్లో, పరగణాల్లో అక్కడి ఖాజీలు పాతమందిరాలను పడగొట్టడానికి లేక వాటి మరమ్మతులో అవరోధాలు కల్పించడానికి ప్రయత్నించారు. అటువంటి సందర్భాల్లో

ఇలాంటి చర్యల నుండి దూరముండాలని ఔరంగజేబ్ వారిని తీవ్రంగా హెచ్చరిం చాడు. బనారస్ మరియు బృందావన్ మొదలుగాగల (ప్రాంతాల) బ్రాహ్మణుల పేర జారీచేసిన ఫర్మానాలు నేటికీ సురక్షితంగా ఉన్నాయి. వాటిలో, మందిరాల మరమ్మతులో అవరోధాలు కల్పించరాదని తీవ్రంగా హెచ్చరిస్తూ అక్కడి (స్థానిక) అధికారుల్ని ఆదేశించడం జరిగింది." (ఖౌమి ఆవాజ్ దినపత్రిక, 1988, ఏప్రిల్ 17).[8]

మొగలు వంశం, మొగలు సామ్రాజ్యంతో రాజపుత్రులకు ఎంత గాఢమైన, మానసిక, రక్త సంబంధాలుండేవో, వారి ఈ సంబంధాలు ఎంతగా పెనవేసుకు పోయాయో, ఒకరి సుఖదుఃఖాల పట్ల వేరొకరు ఎంతగా ప్రభావితులయ్యేవారో తెలిపే ఒక సంఘటనను మీకు సమర్పించకుండా ఉండలేక పోతున్నాము.

"(ఢిల్లీలోని) ఎఱ్ఱకోటను ఆంగ్లేయులు కైవసం చేసుకున్న తరువాత ఎన్నో రోజులకు జైపూర్‌కు చెందిన మహారాజు ఢిల్లీలోని ఈ కోటను చూడడానికని వెళ్ళారు. మొగలు సింహాసనం ఉండు చోటుకు వెళ్ళినప్పుడు, ఆ సింహాసనం ఉంచేచోటు ఖాళీగా ఉండడం చూసిన మహారాజు చలించిపోయారు. దుఃఖావేశాలను ఆపుకోలేక "మహాబలీ మరోసారి మేలుకో!" అంటూ ఆయన అరిచేశారు. రాజపుత్రులు మొగలు పాలకుల్ని 'మహాబలీ' అంటూ సంబోధించేవారు.[9]

# 20. ఔరంగజేబ్ - రాజనీతి

ప్రతి చిన్న పెద్ద మనిషితో మర్యాదగా, సాదరంగా, గౌరవపూర్వకంగా సమానమను కొని మాట్లాడటం ఔరంగజేబ్‌కు పుట్టుకతో అబ్బిన గుణం. తన నౌకర్లతో, సేవకులతో కూడా ఔరంగజేబ్ మృదువుగా, గౌరవంగా మాట్లాడడం రాజవంశీయులకు, నచ్చలేదు. రాజ వంశీయులు, రాకుమారులు ఠీవిగా, దర్పంగా ఉండాలని, సేవకుల్ని, ఉద్యోగుల్ని చిన్న చూపు చూడాలని, వారితో కలుపుగోలుగా ఉండకూడదని భూమిపై నున్న ఈ ప్రభువులు, రాజులు తమకంటూ నియమాల్ని ఏర్పరచుకున్నారు. దాన్ని పాటించాలంటూ రాజవంశీయుల్ని, రాకుమారుల్ని కట్టడిచేసేవారు. కాని చిన్నప్పటి నుండే ఇస్లామీయ బోధనలతో ప్రభావితమైన ఔరంగజేబ్ దీన్ని పాటించేవాడు కాదు. ఇంకా తన పెద్దలతో, గురువులతో, రాజసభికులు, మంత్రులతో ఎంతో ఆదరంగా, గౌరవపూర్వకంగా, విధేయతతో ప్రవర్తించేవాడు. ఈ కారణంగా నౌకర్లు సేవకులే కాకుండా, సభాసదులు, మంత్రులు కూడా ఔరంగజేబంటే ఎంతో అభిమానం కనబరిచేవారు. దీనికి మండిపడ్డ షాజహాన్ పెద్ద రాకుమారుడు యువరాజు, దారా షికూహ్, తండ్రికి ఈ విషయంలో చాడీలు చెబుతాడు. ప్రపంచాన్ని చూసిన అనుభవమున్న చక్రవర్తి షాజహాన్, పెద్ద కుమారునిలోని ఈ బలహీనతను, ఔరంగజేబ్‌లోని ఈ సుగుణాన్ని తెలుసుకున్న వాడైనప్పటికీ, దారా మీద అత్యధిక ప్రేమ కారణంగా, దారాను మందలించడానికి బదులు, ఔరంగజేబ్‌నే తన ప్రవర్తన మార్చుకోవాలని తన స్వహస్తాలతో ఒక లేఖ వ్రాశాడు. అందులో "బాబూ! సుల్తాన్ మరియు అతని సంతానం సాహసం, గొప్పబుద్ధి, ఉన్నత స్వభావం కలిగి ఉండాలి. నీవు ప్రతి చిన్న సేవకునితో ఎంతో మర్యాదగా ప్రవర్తిస్తావని, ఫలితంగా వారి ముందు నీవు అల్పుడవై పోతున్నావని విన్నాను. దీన్ని పరలోక సాఫల్యం కోసమే చేస్తున్నట్లయితే, జరుగవలసినవన్నీ విధిరాతతో ముడివడి ఉన్నాయనే విషయం మరువరాదు. ఈ అల్ప స్వభా వంతో పరాభవం, అవమానం తప్ప ఇంకేమీ దొరకదు" అంటూ సుదీర్ఘంగా మందలించాడు. దానికి ఔరంగజేబ్ ఇచ్చిన సమాధానం గమనార్హం. "ప్రభువుల వారు ఈ సేవకుని కోసం ఏదైతే ప్రతిపాదించారో, అది నా కోసం దివి నుండి అవతరించిన దైవవాణితో సమానం. ప్రభువుల వారు చల్లగా ఉండాలి. గౌరవం లభించేది దైవం తరఫునే, పరాభవం కూడా దైవం తరఫునే ప్రాప్తమవుతుంది. గౌరవ పరాభవాలు, భూమ్యాకాశాలకు ప్రభువైన ఆ సర్వేశ్వరుని చేతుల్లోనే ఉన్నాయి. "ఎవరైతే తన అహంకారాన్ని చంపుకుంటాడో, దైవం అతనికి గౌరవాన్ని ప్రసాదిస్తాడనే" ప్రవక్త మహనీయుల (స) ప్రవచనాన్ని ఈ సేవకుడు అనుసరిస్తున్నాడు. ఒకరి మనసును గాయపరచడం (నొప్పించడం) అన్ని చెడులకన్నా మహా చెడుగా, పాపాలన్నిటిలో మహా పాపంగా తలుస్తాను.[1]

ఔరంగజేబ్ సమాధానాన్ని మరోసారి చదవండి. చిన్న పెద్ద, కులమత తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరిని గౌరవించాలని, తనలోని అహంకారాన్ని, గర్వాన్ని అణిచివేయాలనే విషయం ఔరంగజేబ్ నరనరాల్లో జీర్ణించుకుపోయిందని, అది అతని విశ్వాసాల్లో ఒక భాగంగా మారిపోయిందనే విషయం స్పష్టంగా అర్థం కావడం లేదా? ఈ విషయంలో తండ్రికి, చక్రవర్తికి కూడా తగిన సమాధానం ఇవ్వడానికి కూడా ధైర్యం చేశాడంటే, ఈ విషయంలో అతని పట్టుదల, dedication ప్రశ్నించరానిది. ఈ పాలసీనే, ఈ స్వభావాన్నే అతను జీవితాంతం అంటిపెట్టుకొని ఉన్నాడు. ఇది అతని రాజనీతిజ్ఞతలోని విడదీయరాని అంశం. అందుకనే చిన్న సేవకుని మొదలుకొని, పెద్ద పెద్ద మన్సబుదారులు, మంత్రుల వరకు కూడా ఒకసారి ఔరంగజేబ్ వద్దకు వచ్చారంటే, ఒక్కసారి అతన్ని ఆశ్రయించారంటే, ఇక మరెన్నడూ అతన్ని విడిచివెళ్ళలేదు.

రెండవది అతనిలోని క్షమించే గుణం. అతన్ని ఢీకొని అతనితో తెగించి పోరాడిన జస్వంత్ సింగ్‌తో సహా అనేకమంది నాయకులు, మన్సబుదారులు ప్రారంభంలో అతనికి వ్యతిరేకులే. అతన్ని ఎదుర్కొని పోరాడినవారే. కాని ఎప్పుడైతే వారు పరాజయం పాలయ్యారో, తమ తప్పును తెలుసుకొని, సిగ్గుపడి, ఔరంగజేబ్ వద్దకు వచ్చి క్షమాపణ కోరారో, ఔరంగజేబ్ నిండు హృదయంతో వారిని క్షమించడమే కాకుండా, మునుపటి మన్సబులు కూడా వారికి ప్రధానం చేస్తూ, వారిని గౌరవించాడు. వారిని విశ్వసించాడు, సైనిక బాధ్యతల్ని వారికి అప్ప గించాడు. ఈ విధంగా వారి హృదయాలు తేలికపడడమే కాకుండా, ఔరంగజేబ్ పట్ల వారి హృదయాల్లో ఎనలేని గౌరవం ఏర్పడింది. అందుకే వారు ఇనుమడించిన ఉత్సాహంతో ఔరంగజేబ్‌కు తమ సేవల్ని అందించారు. ఔరంగజేబ్‌కు చివరికంటూ తమ సేవలందించిన బహావ్‌సింగ్ హాడా, భైరందేవ్ సిసోదియా, రాజా రాయె సింగ్ రాథోర్, రాజా రాంసింగ్ కచ్‌వాహా, రాజా సుజాన్ సింగ్ బుందేలా, రావ్ కరణ్ భూరతియా, మలూజీ భోన్‌స్లా, రాజా మహాసింగ్ భద్‌వర్య, మాన్‌సింగ్ రాథోర్, రాయె రాయాన్ రఘునాథ్ ఖత్రి, మహారాజా జస్వంత్ సింగ్‌తో సహా ఇంకెంతో మంది మన్సబుదారులు ఔరంగజేబ్‌కు ఎదురుపడి పోరాడిన వారేకదా[2] వీరంతా కూడా ఔరంగజేబ్ చేతిలో పరాజయాన్ని చవిచూసిన వారేకదా! ఇక మహారాజా జస్వంత్ సింగ్ మోసానికి, వంచనకు, స్వామిద్రోహానికి పాల్పడిన సంఘటనలు వేరొక అధ్యాయంలో పుష్కలంగా వచ్చాయి. అయితే వీరందరిని క్షమించడమే కాకుండా, తన దర్బారులో వారి వారి పాత మన్సబులపైనే నియమించుకున్నాడు. ఫలితంగా వీరంతా అతనికి మిత్రులు, శ్రేయోభిలాషులే కాకుండా, ప్రాణాలర్పించే నమ్మిన బంటువులుగా మారిపోయారు. అతనిలోని ఈ క్షమాగుణం రాజకీయంగా అతనికెంతో లాభం కలిగించింది.

ఔరంగజేబ్‌లో ఇంకొక గుణముండేది. అతను మనిషిని అతని కులం, మతం, వంశం, అంతస్తుతో కాకుండా అతనిలోని యోగ్యతలతో గుర్తించేవాడు. అతని కార్యదక్షతను పరిశీలించేవాడు. అప్పగించిన పనుల్ని నెరవేర్చడంలో వారు చూపే నిజాయితీని, ధైర్య

స్థైర్యాల్ని, పట్టుదలను, తెగింపును ప్రాతిపదికగా ఎంచి, వారికి తగిన ప్రతిఫలాలు, ప్రమోషన్లు, మన్సబులు ఇచ్చేవాడు. దీనివల్ల ఇతరులకు కూడా ప్రేరణ కలిగేది. అప్పగించిన పనిని సకాలంలో, పరిపూర్ణంగా నెరవేర్చినవాన్ని, పరాయివాడైనాసరే, ప్రశంసించి అందలమెక్కించేవాడు. తమకు అప్పగించిన పనుల్లో నిర్లక్ష్యత, అజాగ్రత్త వహించేవారిని, వారెంత పెద్దవారైనా, తనకు దగ్గరి వారైనాసరే, నిర్మొహమాటంగా వారి గ్రేడులను, మన్సబులను తగ్గించేవాడు. రాజా జైసింగ్ చూపిన కార్యదక్షతవల్ల అతని మన్సబును పెంచడమేకాక, చివరికి సర్వసేనానిగా, సూబేదారుగా నియమించాడు. అదే ఔరంగజేబ్ దర్బారులో అందరి కంటే గొప్పహోదా కలిగి అమీరుల్ ఉమ్రా (ప్రభుముఖ్యుడు, నాయక శిఖామణి, నాయకుల్లో అగ్రగణ్యుడు)గా పిలువబడే తన మేన మామ షాయిస్తఖాన్ అజాగ్రత్త వల్ల, శివాజి రేదాడికి పాల్పడినట్లు తెలియడంతో అతన్ని పదవీచ్యుతుణ్ని చేశాడు – ఇవి ఔరంగజేబ్ నిష్పక్షపాతానికి, యోగ్యతకు మాత్రమే విలువనిచ్చే అతని మనస్తత్వాన్ని బహిర్గతం చేస్తుంది.

అతనిలోని ఇంకొక సుగుణం ఏమిటంటే అతనెంత పెద్ద నేరస్థుడుగాని, తనకు తీరని ద్రోహం చేసిన వ్యక్తి అయినప్పటికీ, నేరుగా చక్రవర్తి వద్దకు వచ్చి తన తప్పుల్ని ఒప్పుకొని, విధేయత చూపి, దానికే కట్టుబడి ఉంటే, అలాంటి వారిని క్షమించడానికి అతను వెనుకడుగు వేసేవాడు కాదు. జస్వంత్ సింగ్ బంధువు దుర్గాదాస్ రాఠోర్, రాకుమారుడు అక్బర్‌ను తండ్రికి వ్యతిరేకంగా పురిగొల్పాడు. అవివేకి అయిన ఈ రాకుమారుడు, తన తండ్రికే వ్యతిరేకంగా తిరుగుబాటును లేవదీశాడు. అయితే అతని తిరుగుబాటు అణచివేయ బడింది. కాని దుర్గాదాస్ ఘోరమైన నేరానికి పాల్పడ్డాడు. కాని ఎప్పుడైతే ఔరంగజేబ్‌ను ఆశ్రయించి, తన తప్పుల్ని ఒప్పుకోవడమే కాకుండా ఇకముందు చక్రవర్తి విధేయతకు కట్టుబడి ఉంటానని వాగ్దానం చేసిన మీదట, ఔరంగజేబ్ అతని తప్పుల్ని మన్నించడమే కాకుండా, తన ప్రభుత్వంలో చేర్చుకున్నాడు. మూడువేల పదాతి, రెండువేల అయిదువందల అశ్వికదళాల మన్సబును ప్రదానం చేశాడు.[3]

ధార్మికపరంగా ఔరంగజేబ్ పాలసీలపై ఎంత దుమ్మెత్తిపోసినా, అవన్నీ వక్రీకరించిన, కల్పిత కథనాలే తప్ప ఔరంగజేబ్ కాలంలో వాటి ఉనికే లేదు. అతను ధార్మికాసక్తి కలిగి, ధర్మాన్ని క్రమం తప్పక పాటించాడనడం వాస్తవమే. అయినప్పటికీ, ఒక ధర్మాన్ని ఆచరించే వాడు వేరొకరి ధర్మాన్ని కించపరచడమో, దాన్ని నాశనం చేయడమే అతని కర్తవ్యమని ఎందుకు భావించాలి? ఎవరీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు? ఏ ధర్మం ఈ విధంగా ప్రబోధి స్తుంది? ఇస్లాంకు సంబంధించినంత వరకు, ఇతర ధర్మాలతో, వాటి అనుయాయులతో ఎలా ప్రవర్తించాలనే దాని సూత్రాలు ఔరంగజేబ్ ధార్మిక నీతిలో వివరంగా చర్చించాము. కనుక తిరిగి దాన్నే పునరావృతం చేయడం అనవసరం. అయినా ధార్మిక విషయంలో ఇస్లాం ప్రతిపాదించే కేవలం రెండు సూత్రాలను పేర్కొంటాము. (1). ధర్మం విషయంలో నిర్బంధం కాని, బలాత్కారం కాని లేవు....(అల్ బఖర : 256). "మీ ధర్మం మీకు, నా ధర్మం నాకు ....

(అల్ కాఫిరూన్ : 6) – ఈ రెండు సాక్ష్యాధారాలు ఖుర్ఆన్ అథారిటీ నుండి పేర్కొనబడ్డాయి. ఔరంగజేబ్ ఖుర్ఆన్‌ను, ఇస్లామీయ షరీయత్తును కఠినంగా ఆచరించే వాడని చరిత్రకారులందరి ఏకాభిప్రాయం. అటువంటప్పుడు అతి ముఖ్యమైన ఈ ఖుర్ఆన్ సూత్రాలను అతనెలా తృణీకరించగలడు? తృణీకరించక పోవడమే కాదు, వాటిని తు.చ. తప్పకుండా పాటించాడు కూడా. మొదటి సూత్రాన్ని ప్రమాణపూర్వకంగా, లిఖితంగా ఒక "నిషాన్"లో పేర్కొంటూ రాజకీయాల్లో తన ధార్మిక పాలసీ ఏమిటో బహిరంగంగా ప్రకటించాడు.[4]

ఇక రెండవ సూత్రాన్ని తాను తు.చ. తప్పకుండా పాటించే వాడినని ఔరంగజేబ్ క్రియాపూర్వకంగా నిరూపించాడు.[5]

ఇక ఇతర ధర్మాల వారి ధార్మిక విశ్వాసాల్ని, ధార్మికాసక్తిని గౌరవించడమే కాకుండా, వారి ధార్మిక విధుల్ని నెరవేర్చుకోవడంలో తన చేతనైన సహాయం కూడా చేసేవాడు. దక్షిణ భారత దండయాత్ర సందర్భంలో, కొన్ని రోజులు హైద్రాబాద్‌లో ఆగాడని, అప్పుడు ఒక శివభక్తుని శివలింగం దొంగిలించబడడం, ఆ మూర్తి అతనికి ఇరువై నాలుగు గంటల్లో ముట్టి తీరాలని అతను జారీచేసిన కఠినాదేశాల్ని ఇంకొక అధ్యాయంలో పేర్కొంటూ వచ్చాం.[6]

మొత్తానికి ధార్మికపరంగా తన హిందూ నాయకుల్ని, సేనానుల్ని, ప్రజల్ని సంతృప్తి పరచాలనేది అతని రాజకీయాల్లోని ఒక అనివార్య భాగము. ఔరంగజేబ్ అత్యంత వివేకి, దూరదృష్టి గలవాడని చరిత్రకారులందరూ వ్రాశారు. వందలాది హిందూరాజులు, మన్సబుదారులు, సేనానుల్ని, కోట్లాది మంది ప్రజల్ని ధార్మికపరంగా హింసిస్తూ తను రాజ్యమేలజాలననే విషయం ఔరంగజేబ్‌కు తెలియంది కాదు. ఇది మేమనడం కాదు, నిష్పక్ష పాతులైన చరిత్రకారులూ ఇదే అంటున్నారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్‌కు మాజి ఛైర్మన్ అయిన ప్రొఫెసర్ సతీష్ చంద్ర కూడా "మధ్య కాలీన్ భారత్" (భాగం–2, పే.100–112)లో ఇదే విషయాన్ని ఇలా పేర్కొన్నారు :

"ఇక్కడి ప్రజల్లోని అతి పెద్ద సంఖ్య హిందువులదని, తమ ధర్మం మరియు విశ్వాసాల పట్ల వారు పట్టుదల గలవారని, కరవాలం ద్వారా వారి మనోమస్తిష్కాలపై ఇస్లాం ప్రభావం వేయడం సాధ్యం కాదనే వాస్తవాన్ని అతను మరువలేదు. ఒకవేళ అనేకమంది హిందువుల్ని అతను ముస్లింలుగా మార్చాడని ఊహించుకున్నా, అలా మార్చడం వల్ల అతనికి కలిగే ప్రయోజనమేమిటి? వారిని విశ్వసించనూ లేదు, వేరొకవైపు హిందువుల వ్యతిరేకత కూడా ఏర్పడేవి. హిందూ ప్రజలు, శక్తిమంతులైన హిందూ రాజులు, జమీందార్లు వ్యతిరేకంగా మారే ఏ నియమాల్ని అనుసరించినా సరే, తాను విఫలమవ్వడం ఖాయం. ఈ విషయాన్ని ఔరంగజేబ్ బాగా గుర్తెరిగినవాడు."[7]

కనుక పరమత సహనాన్ని తన రాజకీయాల్లోని ప్రధానాంశాల్లో ఒకటిగా ఎన్నుకొని, అనుసరించాడు. ఇది అతని రాజకీయ నీతిజ్ఞతకు, పరిపక్వతకు తార్కాణం.

ఔరంగజేబ్‌లోని ఇంకొక సుగుణం ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం. వారు రాజులు గాని, వ్యాపారులుగాని, ప్రజలు గాని వారిని ఆపదలో ఆదుకొని వారి హృదయాల్ని గెలుచు కోవడం, నిష్పక్షమైన న్యాయానికి కట్టుబడి, తన పర, హిందూ-ముస్లిం అనే భేదభావం లేకుండా, న్యాయం ఎవరి పక్షంలో ఉందో వారికి బాసటగా నిలువడం. ఇంద్రమన్[8], దేవ్‌గడ్[9] మరియు కర్ణాకట[10] హిందూ రాజుల విషయంలో అతను కనబరిచిన చొరవ, వారు అన్యాయానికి గురి అయ్యారని తెలిసినప్పుడు న్యాయం కోసం తండ్రిని కూడా ఎదురించడం, అతని న్యాయ ప్రియత్వాన్ని చాటుతుంది.

శివాజీ మరియు మరాఠాలు సూరత్ పట్టణాన్ని దోచుకొని దానికి నిప్పంటించి మొత్తం నగరాన్ని కాలబెట్టారని ఔరంగజేబ్‌కు కబురిందినప్పుడు, అక్కడి వ్యాపారుల పట్ల సానుభూతి చూపుతూ, వారు ప్రభుత్వానికి చెల్లిస్తున్న వాణిజ్య పన్నును ఒక సంవత్సరం కోసం ఎత్తి వేయించాడు. ఆ పట్టణంలో నివసిస్తున్న డచ్ మరియు ఆంగ్లేయ వ్యాపారులు ఎదురుబడి ధైర్యంగా మరాఠాలను ఎదురించారని తెలిసినప్పుడు, వారి వీరత్వానికి ప్రతిఫలంగా వారు చెల్లిస్తున్న కస్టం డ్యూటీలో ఒక శాతం పన్నును తగ్గించేశాడు. (సర్కార్, హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వా-4, పేజి 52).

పరిపాలకునికి ముందుగా తనపై, తన యోగ్యతలపై విశ్వాసముండాలి. తను చేపట్టిన పనిని తప్పకుండా సాధించగలననే దృఢ విశ్వాసముండి, ధీరంగా నిలబడినప్పుడే, అతని అనుచరుల్లో, అనుయాయుల్లో కూడా ఆత్మ విశ్వాసం పెరిగిపోతుంది. ఈ దృష్టి కోణంతో చూసినప్పుడు ఔరంగజేబ్‌లో పరిపూర్ణ ఆత్మవిశ్వాసాన్ని కనుగొంటాము. అతనెన్నడూ కూడా యుద్ధరంగం నుండి పారిపోలేదు. అంతేకాకుండా యుద్ధవ్యూహాల్ని అత్యంత చాకచక్యంగా రూపొందించేవాడు. వారసత్వ యుద్ధాల ప్రారంభానికి ముందు, ఔరంగజేబ్ మరియు మురాద్‌లను కట్టడి చేయడానికి దారా షికూహ్, రాజా జస్వంత్ సింగ్ నాయకత్వంలో ఒక గొప్ప సైన్యాన్ని పంపాడు. ఔరంగజేబ్ వద్ద అంత సైన్యం లేదు. అయితే ఔరంగజేబ్ తన యుద్ధ వ్యూహాన్ని ఎంత చక్కగా రూపొందించాడంటే, అతను దక్కన్ నుండి ఎప్పుడు బయలు దేరాడు, నర్మదా నదిని ఎప్పుడు దాటాడు, ఇప్పుడతను ఎక్కడున్నాడు అనే విషయాలు కూడా జస్వంత్ సింగ్ తెలుసుకోలేనంత రహస్యంగా ఉంచాడు.

యుద్ధానికి ముందు, యుద్ధాన్ని, రక్తపాతాన్ని తప్పించడానికి తన రాయబారి బ్రిజ్ (హిందీ) భాష పండితుడు కబిరాయెను జస్వంత్ సింగ్ వద్దకు పంపి, శాంతికోసం ఎంతో ప్రయత్నించాడు. కాని అవన్నీ విఫలమై, యుద్ధ జ్వాలలు చెలరేగినప్పుడు, తన కొంతమంది సైన్యంతోనే ఎంత చాకచక్యంగా, వీరోచితంగా పోరాడాటంటే, బహుళ సంఖ్యలో నున్న జస్వంత్ సింగ్ సేనలకు పరాజయం తప్పలేదు. స్వయంగా జస్వంత్ సింగ్ ప్రాణాలు దక్కించుకోవడానికి, అంగరక్షకుల సహాయంతో యుద్ధరంగం నుండి పారిపోయాడు.

అదేవిధంగా సమూగడ్‌లో జరిగిన అన్నదమ్ముల యుద్ధంలో కూడా, సముద్ర తరంగాల్లా ఉవ్వెత్తున లేస్తున్న తన అసంఖ్యాక సైన్యాల ముందు ఔరంగజేబ్ అతని సైన్యం గడ్డిపోచలా కొట్టుకుపోతారని, విజయం తనకు తథ్యమని భావించిన దారా ఆశలు అడియాసలే అయ్యాయి. ఔరంగజేబ్ యుద్ధనీతి, అతని సైన్యాల సమీకరణ, సైనికుల్లోని డిసిప్లిన్, సైన్యాల సంఖ్య పరిమితంగా ఉన్నా వాటి వినియోగంలో అతను చూపిన చాకచక్యం, అన్నిటికీ మించి అతని వీరత్వం, స్థిరత్వం ముందు అతని సోదరుని సంఖ్యాబలం అతనికి ఎలాంటి లాభాన్ని చేకూర్చలేక పోయింది. చివరికి దారా ప్రాణాలు కాపాడుకోవడానికి యుద్ధరంగం నుండి పలాయనం చిత్తగించాల్సి వచ్చింది. ప్రఖ్యాత చరిత్రకారుడు, జదూనాథ్ సర్కార్ కూడా ఔరంగజేబ్ వీరత్వానికి, అతని యుద్ధ నైపుణ్యానికి జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయాడు. దీన్ని యూరోప్‌లో జరిగిన నిర్ణయాత్మక యుద్ధమైన వాటర్ లూతో పోల్చాడు.

చివరలో ఇంకో సోదరుడైన షుజాతో 'ఖజ్వా'లో జరిగిన యుద్ధంలో, జస్వంత్ సింగ్ వెన్నుపోటు పొడిచి, అశ్వాల్ని, ఆయుధాల్ని, గుడారాల్ని ఇంకా ఇతర అత్యవసరమైన వస్తు సామగ్రిని కొల్లగొట్టి, ఔరంగజేబ్ సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తూ రాత్రి సమయంలో తన పదునాలుగు వేల సైన్యాలతో షుజాతో కలిసిపోయినప్పుడు ఏర్పడిన సంక్లిష్ట, ప్రమాదకర పరిస్థితుల్లో కూడా అతను తన స్థిమితాన్ని కోల్పోలేదు. నిరుత్సాహపడలేదు. ధైర్యస్థైర్యాల్ని విడనాడలేదు. అత్యంత ప్రశాంతంగా మూడవ జాము తహజ్జుద్ నమాజు, దైనందిన ఇతర జపతపాలు ముగించుకున్న తరువాతనే తన స్థానం నుండి లేచాడు.[11] తెల్లారగానే యుద్ధం ప్రారంభమయింది. ఇక తాడో పేడో తేల్చుకోవడమే అంటూ తెగింపుతో షుజా సైన్యాల వరుసల్ని చీల్చుతూ, తన ఏనుగును నేరుగా షుజా ఏనుగుపై లంఘించాడు. ఔరంగజేబ్ వీరత్వాన్ని ఎదుర్కోలేని షుజా, యుద్ధ మైదానం విడిచి పారిపోక తప్పలేదు. ఈ విధంగా తన పర, మిత్రులు శత్రువులు ఇద్దరి నుండి శభాష్ అనిపించుకున్నాడు. ఇది అతని సేనానులపై, సైనికులపై చెదరని ముద్ర వేసింది. అంతవరకు ఏ రాకుమారున్ని సమర్థించాలోనని సందిగ్ధంగా ఉన్నవారికి, ఎవరిని సమర్థించాలో ఎవరు భావి భారత చక్రవర్తో స్పష్టంగా అర్థమైపోయింది. రాజంటే ఇలాంటి గుణాలు కలిగిన వాడై మాత్రమే ఉండాలనే విషయం అందరి మనోమస్తిష్కాల్లో దిగిపోయింది. అందుకే ఈ యుద్ధం తరువాత నలువైపుల్నుండి మన్సబుదారులు, జమీందారులు వచ్చి అతన్ని ఆశ్రయించ సాగారు. అతను కూడా వారి పాత తప్పిదాల్ని, తనకు వ్యతిరేకంగా పోరాడిన విషయాల్ని మరిచి, మన్నించి, వారందరినీ తన వారుగా చేర్చుకోసాగాడు. త్వరలోనే కాబోయే మొగలు సామ్రాజ్యాధీశు డెవరనే విషయం, ప్రకటించకుండానే ప్రజలకు, సైన్యాలకు తెలిసిపోయింది.

శత్రువుకు శత్రువు తన మిత్రుడనే సామెత ననుసరించి, శివాజీ, సాంభాజీల ద్వారా, గోల్కొండ, బీజాపూర్ పాలకుల ద్వారా భంగపడి, హింసించబడి తనను ఆశ్రయించిన నాయకుల్ని ఆదరించి, గౌరవించి ఉన్నత మన్సబులను ప్రసాదించడం అతని దూరదృష్టిని, రాజకీయ నైపుణ్యాన్ని సూచిస్తుంది. ఆ మేలును, ఉపకారాన్ని గుర్తుంచుకొని ఔరంగజేబ్ కష్టకాలంలో

కీలక సమయాల్లో వీరు గణనీయమైన సేవల్ని అందించారు. ఉదాహరణకు మీర్‌జుమ్లా మరియు మరాఠా నాయకుడు కాన్హోజీ. ఈ కాన్హోజీ, ఖండూజీ ఖోప్డే కుమారుడే. ఖోప్డేను 1659లో శివాజి చంపించి అతని వంశపారంపర్యంగా వస్తున్న 'ఉత్‌రోలీ' జాగీరును ఆక్రమించు కున్నాడు.[12] అదే విధంగా గోల్కొండ, బీజాపూర్ పాలకులు తనకు హాని తలపెట్ట కృతనిశ్చయం చేసుకున్నారని తెలిసినప్పుడు, మీర్‌జుమ్లా ఔరంగజేబ్‌ను ఆశ్రయించి, అతని సిఫారసు ద్వారా దర్బారులో ప్రవేశించాడు.[13] చివరికి షాజహాన్‌కు ప్రధాన మంత్రి లాంటి కీలక పదవి వరకు చేరుకోగలిగాడు. అయితే ఔరంగజేబ్ తమ పట్ల చూపిన సానుభూతిని, సహాయాన్ని వీరు మరువలేకపోయారు. అందుకని వారు ఔరంగజేబ్‌కు తమ చేతనైన సహాయాన్ని అందించారు.

సోదరులతో అంతర్యుద్ధాలు, మరియు తండ్రి పన్నిన కుట్రల నుండి తప్పించుకుంటూ అజేయంగా నిలబడడం అతని రాజకీయ నైపుణ్యానికి పరాకాష్ఠ. షాజహాన్ జబ్బుపడడం, అతని జబ్బువార్తను సోదరుల వరకు చేరనీయకుండా దారా షికూహ్ చేసిన కట్టడి, దర్బారులో నున్న సోదరుల రాయబారుల్ని నిర్బంధించడం, ఈ అన్ని కారణాల వల్ల షాజహాన్ చని పోయాడనే వదంతులు దేశం నలుమూలలా ప్రాకి పోవడం, దీనితో జ్యేష్ఠ సోదరుని దుస్సం కల్పానికి బేజారెత్తిన తమ్ముళ్ళు తమ తమ సూబాలలో తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవడం వరుసక్రమంగా చకచకా జరిగిపోయాయి. బెంగాల్‌లో షుజా, గుజరాత్‌లో మురాద్‌లు తమ స్వాతంత్ర్యాన్ని, తమను రాజులుగా ప్రకటించుకున్నప్పటికీ, ఔరంగజేబ్ మాత్రం తొందర పడి అలాంటి పనేమి చేయలేదని చరిత్రకారులంతా అంగీకరిస్తారు. ఇది అతని దూరదృష్టిని, పరిస్థితుల్ని నిదానంగా ప్రశాంతంగా, నిశితంగా అంచనా వేసే అతని మనస్తత్వాన్ని చాటుతుంది. అంతేకాకుండా తొందరపడవద్దని అతను తన సోదరునికి ఇచ్చిన సలహా అతని శాంతి కాముకతను, పరిస్థితుల్ని చేయిదాటి పోనీయరాదనే అతని మనస్తత్వాన్ని చాటుతుంది. ఇక యుద్ధం తప్పదని, సోదరున్ని ఎదుర్కోకపోతే తమ అంతం తథ్యమని అతనికి తెలిసిపోయినప్పుడు, శక్తిమంతుడు, సువిశాల సామ్రాజ్య అసంఖ్యాక సైనిక బలగాలను తన గుప్పిట్లో పెట్టుకున్న దారాను తాము ఒక్కొక్కరుగా ఎదుర్కోవడం కష్టమని భావించి, సోదరునితో కొన్ని సముచిత, గౌరవప్రదమైన షరతులతో సంధిచేసుకొని, సోదరునితో కలిసిపోతాడు. ఇప్పుడు కూడా తాను కదలకపోతే, జ్యేష్ట సోదరుడు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని, తమల్నందరినీ కడతేర్చుడం ఖాయమనే విషయం అతనికి తెలియంది కాదు. అతని తాత అక్బర్, అతని తండ్రి షాజహాన్‌లు కూడా అధికారాన్ని చేజిక్కించుకున్న తరువాత, తమ సోదరుల్ని ఇతర వారసుల్ని చంపించిన విషయం అతనికి బాగా తెలుసు. గద్దెనెక్కినవాడు మిగిలిన వారసుల్ని చంపేయడం మొగలు వంశంలో పారంపర్యంగా వస్తున్న ఆనవాయితే. అందుకని సింహాసనం దక్కినా, దక్కకపోయినా ప్రాణాలు కాపాడుకోవడానికైనా కదలిక, యుద్ధాలు తప్పవు. అతనీ యుద్ధం చేయడం అనివార్యం. ఈ పరిస్థితిని ఆ కాలపు ఫ్రెంచ్ పర్యాటకుడు డాక్టర్ బర్నియేర్ ఇలా వర్ణించాడు :

"నిజంగానే అతనికి (ఔరంగజేబ్‌కు) తన ఈ ఉద్దేశం నుండి (అంటే సింహాసనం కోసం ప్రయత్నించడమనేది) వైదొలగడం అత్యంత కష్టతరమైన విషయమే. విజయం సాధిస్తే సింహాసనాన్ని అధిష్టించవచ్చు. కాని ఈ ప్రయత్నంలో ఓడిపోతే, మృత్యువు తథ్యం. అందుకని కేవలం రెండే రెండు మార్గాలు మిగిలిపోయాయి. మృత్యువు లేదా రాజ్యాధికారం. ఏ విధంగానైతే స్వయంగా షాజహాన్ తన సోదరుల్ని కడతేర్చి, సింహాసనాన్ని అధిష్టించాడో, అదేవిధంగా తానీ ప్రయత్నంలో విఫలమైతే, గెలిచిన వాడు ఈర్ష్యాద్వేషాలతో తప్పకుండా తమను హతమారుస్తాడనేది నిరాకరించలేని సత్యం."[14]

ఈ పరిస్థితిని లేన్‌పోల్ ఇలా వర్ణించాడు :

"సోదరుల్లో ఎవరో ఒకరు సింహాసనాన్ని అధిష్టించిన పక్షంలో, తాను ఖైదు చేయబడడమో, వధించబడడమో ఖాయమనే విషయం ఔరంగజేబ్‌కు తెలిసే ఉంటుంది. అందుకని అతనో నిర్ణయానికి వచ్చి ఉంటాడు. తన స్వీయ రక్షణ కోసమైనా రాజ్యాధికారం కోసం జరిగే పందెంలో తానో పాటపాడడం అతని విధి, కర్తవ్యమై ఉండింది. [15]

సమీకాలీన చరిత్రకారుడైన ఆఖిల్‌ఖాన్ ఇలా వ్రాశాడు :

"అయ్యగారు (ఔరంగజేబ్) మిగిలిన రాకుమారులు ఈ వాస్తవాన్ని పసిగట్టారు. మందీ మార్బలం, ధనం, అధికారబలంతో పరిపూర్ణుడై, అత్యంత శక్తిమంతుడైన తమ శత్రువుతో వీరు భీతిల్లకుండా ఉండలేకపోయారు. తమ గౌరవ మర్యాదల్ని, తమ ప్రాణాల్ని రక్షించుకోవడంలో వారు నిమగ్నులైపోయారు. అందుకని ముగ్గురు అన్నదమ్ములలో, మొదట్లో షుజా, ఔరంగజేబ్‌ల మధ్య ఒప్పందం కుదిరింది, ఆ తరువాత మురాద్ కూడా అందులో చేరిపోయాడు. దారాను పదవీచ్యుతుణ్ణి చేయ నిశ్చయించుకున్నారు. అలాకాని పక్షంలో జ్యేష్ఠ సోదరుడు తమ రక్తాన్ని చిందించనిదే విడిచిపెట్టడు, ప్రభువుల వారి (షాజహాన్) సువిశాలమైన నీడ తమపై, సర్వ ప్రపంచ వాసులపై పరివేష్టించి ఉన్నప్పటికీ, మనం అతని దౌర్జన్యం నుండి, అపాయాల నుండి నిశ్చింతగా ఉండలేమనే నిర్ణయానికి వచ్చారు."[16]

ఇలా గత్యంతరం లేని పరిస్థితుల్లో ఔరంగజేబ్ దక్కన్ నుండి బయలుదేరుతాడు. ఒక్కొక్క అడుగు ఆచితూచి వేస్తాడు. అయితే అదృష్టం అతన్ని వరిస్తుంది. కొన్ని సందర్భాల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పటికీ, ప్రతి యుద్ధంలో అతను అజేయుడుగా నిలుస్తాడు. యుద్ధమైదానంలో అతన్ని గెలువడం అసాధ్యమని తేలిపోయినప్పుడు, అతనికి వ్యతిరేకంగా స్వయాన తండ్రే కుట్రలు పన్నడం మొదలెడతాడు. దారా ప్రేమలో పిచ్చివాడైపోయిన షాజహాన్, ఔరంగజేబ్ కూడా తన కుమారుడే ననే విషయాన్ని మరిచిపోయి, అతనిపై కపట ప్రేమను ప్రదర్శిస్తూ, హృదయం ద్రవించి పోయేలా లేఖలు వ్రాసి, ఔరంగజేబ్‌ను రప్పించి, ఏమరుపాటులో అతన్ని హతమార్చడానికి కుట్రలు పన్నుతాడు.[17] కాని ఔరంగజేబ్ అదృష్టం కొద్దీ అసలు విషయం బయటపడుతుంది. అతను దారా షికూహ్‌కు, కాబూల్ సూబేదార్ మహాబత్ ఖాన్‌కు, షుజాకు రహస్యంగా వ్రాసిన లేఖలు పట్టుబడతాయి.[18] సోదరుడైన

ఔరంగజేబ్‌ను కడతేరిస్తే, తనకు రాజ్యాధికారాన్ని కట్టబెడతానని, షాజహాన్ మురాద్‌కు ఆశ గొలిపాడు.[19] అంతేకాకుండా తన తండ్రి ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటును లేవదీసి, పినతండ్రి షుజాతో కలసి రాజ్యాన్ని ఏలుకోమని ఔరంగజేబ్ రాకుమారుడు ముహమ్మద్ సుల్తాన్‌ను పురిగొల్పాడు. షాజహాన్ ఈ విధంగా నలువైపుల నుండి ఔరంగజేబ్‌కు ప్రమాదాల్ని సృష్టించ సాగాడు. కాని అతని కుట్రలు, కుతంత్రాలన్నీ బెడిసికొట్టాయి. ఈ కుట్రలన్నీ ఔరంగజేబ్‌కు తెలిసిపోయాయి. ఈ పరిస్థితిని లేన్‌పోల్ చక్కగా వర్ణించాడు. "తన కుమారుణ్ని ఇరికించడానికి షాజహాన్ ఏ వలైతే వేశాడో, చివరికి తనే అందులో ఇరుక్కుపోయాడు."[20] తన ప్రాణాల్ని రక్షించుకోవడానికి ప్రయత్నించని వ్యక్తి ఈ ప్రపంచంలో ఎవరుంటారని? తండ్రి చేష్టలకు ఉగ్రుడై, అతన్ని అంతమొందించ సర్వాధికారాలు మందీమార్బలం, ఉన్నప్పటికీ ఔరంగజేబ్ అలా చేయలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తండ్రిని ఆగ్రా కోటలో గృహ నిర్బంధం చేశాడు. అతని స్వాతంత్ర్యం, అతని కుతంత్రాలు తనకు ప్రాణాంతకంగా మారినప్పుడు ఇంతకన్నా కనీస చర్య ఇంకేముంటుంది? తండ్రిని ఖైదు చేశాడని ఔరంగజేబ్‌ను నిందించేవారు, కేవలం ఒకే పక్షాన్ని చూపిస్తారు తప్ప దాని వెనుక గల కారణాలను తెలుపరు. ఇదీ ఒక రకమైన వంచనే అనబడుతుంది. అతని దౌష్ట్యాన్నుండి తనను కాపాడుకోవడానికే ఈ చర్య గైకొన్నాడు తప్ప అతని రాచమర్యాదల్లో ఏమాత్రం లోటు రానివ్వలేదు.[21] ఈ విధంగా తండ్రి కుతంత్రాలకు, శత్రుత్వానికి అడ్డుకట్ట వేయడానికి గత్యంతరం లేని అనివార్య పరిస్థితుల్లో తండ్రిని గృహ నిర్బంధంలో ఉంచిన, అతని గౌరవ మర్యాదల్ని పరిపూర్ణంగా పాటించిన విధేయు డైన కుమారుడు. అతను ఈ సందర్భంలో తండ్రికి వ్రాసిన లేఖలతో ఈ విషయం స్పష్టమై పోతుంది. మరియు అతనిలో గల ఉన్నత నైతిక ప్రమాణాలను రుజువు చేస్తుంది.

ఇక అనుపమానమైన వీరుడు, ధర్మావత్ సమూగడ్ యుద్ధాల్లో వీరోచితంగా పోరాడి, తనకు ఎనలేని సహాయమందించిన సోదరుడు మురాద్, అమాయకుడు, మూర్ఖుడు, తొందర పాటు మనిషి, విచక్షణా జ్ఞానం లేకుండా పరులు చెప్పిన మాటల్ని వెంటనే విశ్వసించే గుణమున్న తమ్ముడు, తండ్రి రాజ్యాన్ని కట్టబెడతానని ఇచ్చిన ప్రేరణతో ప్రభావితుడై, ఏమరుపాటులో తన ప్రాణాల్ని హరించి వేస్తాడేమోనని భయపడిన ఔరంగజేబ్ అత్యంత చాకచక్యంగా, అతన్ని బంధించివేస్తాడు. ఒక్క కనుసైగతో అతన్ని శాశ్వతంగా సమాప్తంచేసి, పీడ విరగడ చేసుకునే అధికారం, అవకాశం ఉన్నాకూడా, సోదరప్రేమ వల్ల అలా చేయకుండా, గ్వాలియర్ కోటలో బంధిస్తాడు. ఇది కూడా ఆత్మరక్షణార్థమే అనేది విదితమవుతూనే ఉంది. దీని వివరాలు సంబంధిత అధ్యాయాల్లో వస్తాయి. మొత్తానికి తండ్రికి, సోదరునికి ఎలాంటి ప్రాణహాని కలిగించకుండా, కాని వారి దౌష్ట్యాల్నుండి తానుమాత్రం అత్యంత చాకచక్యంగా తప్పించుకోవడం ఔరంగజేబ్‌లోని అసామాన్యమైన రాజకీయ విజ్ఞతకు తార్కాణం. అప్పటి ఆ పరిస్థితుల్లో అంతకన్నా ఉచితమైన, సురక్షితమైన ఆత్మ సంరక్షణా చర్య ఇంకెవరైనా ఏమి సూచించగలుగుతారు?

శివాజీని పదే పదే క్షమించి వదలిపెట్టడం, అతను పదే పదే వాగ్దానోల్లంఘన చేయడం, శివాజీకి కాకుండా, ఔరంగజేబ్‌కే లాభించింది. శివాజీకి దగ్గరివాళ్ళు, అతని అనుయాయులు, ఇతర రాజపుత్ర నాయకులు ఈ పరిస్థితిని చూసి, శివాజీ పట్ల ఉన్న ఆ కాస్త అభిమానాన్ని కూడా కోల్పోయారు. చివరికి వారందరూ కూడా ఔరంగజేబ్ పాలసీనే సమర్థించ వివశు లయ్యారు. "ఔరంగజేబ్-మరియు-మరాఠా" అనే అధ్యాయంలో దీని గురించి వివరంగా తెలుస్తుంది.

ఔరంగజేబ్ రాజకీయ దృక్పథంలోని ఇంకొక ముఖ్య గుణమేమిటంటే దేశ సమగ్రత, అఖండతలపై ఏమాత్రం రాజీపడకపోవడం. ఈ గుణం అతనిలో రాకుమారునిగా, దక్కన్ గవర్నరుగా ఉన్నప్పటి నుండే కానవస్తుంది. దేవ్‌గడ్, కర్నాటక రాజుల విషయంలో వారికి అన్యాయం జరిగినప్పుడు, న్యాయం కోసం ఎలా ఎదురొడ్డి నిలబడ్డాడో, అదేవిధంగా తలబిరుసు తనం చూపిన, జవార్, గోల్కొండ, బీజాపూర్ లాంటి రాజ్యాల మదమణిచే వరకు ఊరకుండలేదు. ఆ కాలంలో కిరీటం, సింహాసనం అనిపించుకున్నా, నేటి భాషలో అది దేశమే. దేశప్రయోజనమే. ఆ దేశ ప్రయోజనాల కోసం, దేశ సమగ్రత, ఐక్యతల కోసం, చివరి వరకు పోరాడుతూనే ఉన్నాడు. శివాజీ మరియు మరాఠాల విజృంభణను మరియు వారు లేపిన అరాచకాన్ని, దేశ సమగ్రతకు, అఖండతకు ముప్పుగా భావించే వారిని అణచడానికి తీవ్రంగా కృషిచేశాడు. వారు చేసిన అరాచకాలేమిటో సర్ జదూనాథ్ సర్కార్ వ్రాసిన "హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్" వా-5, మరియు "ఫాల్ ఆఫ్ ది మొగల్ ఎంపైర్" - వా.4 మొదలైన గ్రంథాల్లో చూడవచ్చు.

మరాఠాలనే కాదు, దేశం పట్ల, సింహాసనం పట్ల తలబిరుసుతనం, విద్రోహవైఖరిని అవలంబించిన తన స్వంత కుమారుడు అక్బర్‌ను కూడా విడిచిపెట్టలేదు. దేశం విడిచి, తలదాచుకునేందుకు ఇరాన్ పారిపోయేంత వరకు, పంజాబ్, గుజరాత్, దక్కన్‌లలో అతన్ని తరుముతూనే పోయాడు. దేశ సమగ్రతకు అంతగా ప్రాధాన్యత నిచ్చాడు.

దేశం పట్ల, దేశ సమగ్రత, అఖండతల పట్ల ఔరంగజేబ్‌కు గల చిత్తశుద్ధి ఎలాంటిదో **డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్** ఇలా పేర్కొన్నారు :

"అత్యధిక మొగలు పాలకుల్ని మనం సింహాసనం పరిసరాల్లోనే తచ్చాడుతూ కనుగొం టాము. అదే ఔరంగజేబ్ రాజ్య(దేశ) సమగ్రత, అఖండతల కోసం అనారోగ్యంలో సైతం పరుగెడుతూ కనబడతాడు.[22] దక్కన్‌లో చెలరేగిన విద్రోహాలను అణచడంలో సఫలం కాలేక పోయినా, అతను స్వాతంత్ర్యాన్నివ్వ సుముఖంగా లేడు. అతను కోరి ఉన్నట్లయితే, దక్కన్ విద్రోహుల్ని కప్పం చెల్లించడానికి రాజీపరిచి, వారిని ఇతర రాజులలాగే స్వతంత్రంగా ఉండనిచ్చే అవకాశముంది. కాని అతను ఎల్లప్పుడూ దక్కన్‌ను సంపూర్ణ (అఖండ) భారత దేశంలోని ఒక అవిభాజ్య భాగంగానే తలంచాడు. నిస్సందేహంగా ఈ ధోరణి, అతని ఉన్నత లక్ష్యానికి, ఆలోచనా సరళికి ప్రతీక. అంతకుముందు గడిచిన అనేక మంది హిందూ రాజులు సంపూర్ణ భారతావనిని ఒకేదేశంగా, సర్వహిందువుల్ని తమ ఆప్తులుగా సోదరులుగా భావించడానికి ప్రయత్నించక

పోవడం మనం కనుగొంటాము. దీనికి బదులు వారు తమ చిన్న చిన్న రాజ్యాల ప్రయోజనాల్ని కాపాడుకుంటూ, ప్రజల శోషణ వరకే పరిమితమై ఉన్నారు." (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 19).

ఔరంగజేబ్ రాజనీతిని, దేశ సమగ్రత అఖండతల కోసం అతను దక్కన్ రాజ్యాలపై జరిపిన దండయాత్రల్ని కేవలం భారత నేపథ్యంలో చూస్తే సరిపోదు. దీనికోసం ఆ కాలపు రాజకీయ పరిస్థితుల్ని అంచనా వేయడానికి, భారతదేశం ఆవల, ప్రత్యేకంగా ఇరాన్ రాజకీయాలను అధ్యయనం చేయడం ఎంతో అవసరం.

అప్పటి వరకు దక్కన్‌లో మిగిలి ఉన్న ఈ రెండు ముస్లిం రాజ్యాలు అనగా గోల్కొండ, బీజాపూర్‌లకు ఈరాన్‌తో ఎంతో కాలం నుండి సన్నిహిత సంబంధాలుంటూ వచ్చాయి. ఇంకా ధార్మిక సారూప్యత (షియా) కారణంగా కూడా ఈరాన్ ఎల్లప్పుడూ, ఈ దేశాల వ్యవహా రాల్లో కుతూహలం కనబరుస్తూ ఉండేది. దీనికి నేపథ్యం ఏమిటంటే టర్కీని పాలిస్తున్న సున్నీ తుర్క్‌లకు, ఈరాన్ ప్రభువులైన షియాలకు సుదీర్ఘ కాలం నుండి యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. మొగలులు కూడా సున్నీలే. ఇదే కాకుండా వారు టర్కీ ఖలీఫాకు అభిమానులు కూడాను. తుర్క్ సున్నీలు, మొగలు సున్నీలు భావసారూప్యతతో ఖలీఫా ఆదేశంపై ఎన్నడైనా కలిసిపోతే రెండు విసురురాళ్ళ మధ్య ధాన్యం ఎలా నలిగిపోతుందో, తాము అలా నలిగిపోక తప్పదని ఈరాన్ భయపడుతూ, జాగ్రత్తవహిస్తూ వచ్చేది. ఈ నేపథ్యంలోనే దక్కన్‌లోని ఈ రెండు షియా రాజ్యాలు, సతతం మొగలులతో ఘర్షణ పడుతూ, వారిని ఈరాన్ వైపు దృష్టి మరల్చకుండా ఉంచాలనేది దాని తపన. అంతేకాకుండా ఏ విధంగానైనాసరే, భారతదేశం నుండి మొగలు సామ్రాజ్యాన్ని సమాప్తం చేసి, బెంగాల్ మొదలుకొని బగ్దాద్ వరకు ఒక సువిశాల షియా సామ్రాజ్యాన్ని స్థాపించాలనేది దాని లక్ష్యం. ఈ లక్ష్య సాధన కోసం ఈరాన్ రాజ్యాధీశుడు సందర్భానుసారంగా యుక్తులు పన్నేవాడు. "మంషఆతె తాహెర్ వహీద్" అనే పుస్తకంలో దీనికి సాక్ష్యాలు కోకొల్లలుగా లభిస్తాయి. వారసత్వం కోసం అన్న దమ్ముల్లో అంతర్యుద్ధాలు ప్రారంభమై, దేశం నలువైపుల అనిశ్చిత, అరాచక పరిస్థితులు ఏర్పడి నప్పుడు, ఈరాన్ రాజ్యాధీశుడు బీజాపూర్ మరియు గోల్కొండ పాలకులకు లేఖలు వ్రాస్తూ ఇదెంతో మంచి అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకొని తమ రాజ్యం మరియు తమ పూర్వీకుల వైభవాన్ని తిరిగి పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నించండని ప్రేరేపిస్తాడు.[23]

వేరొకవైపు అన్నదమ్ములు పరస్పరం పోరాడుకొని, మొగలు సామ్రాజ్యం బలహీనత మరియు పతనానికి కారకులవ్వాలనే దృష్టితో తన పావుల్ని కదిలించసాగాడు. ఒకవైపు దారా షికూహ్‌కు వెన్నుతడుతూ అతని తమ్ముళ్ళు అన్యాయంగా అతన్ని రాజ్యాధికారం నుండి

వంచించారని, అందుకని హుమాయూన్‌లా అతను కూడా ఈరాన్ వచ్చి, ఈరాన్ సేనల సహాయంతో తిరిగి భారతదేశాన్ని జయించుకొమ్మని లేఖ వ్రాశాడు. ఇంకొక లేఖ మురాద్ పేరున వ్రాస్తూ, "నీవు రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే ప్రయత్నంలో నిమగ్నమై ఉండు. సరిహద్దుల్లోను, ఖాందహార్‌లోనూ ఉన్న మా సైన్యాలకు నీ సహాయం కోసం సిద్ధంగా ఉండాలని ఆదేశాలు పంపించాను" అంటూ ఆశ గొలిపాడు. మూడవ లేఖలో ఔరంగజేబ్‌ను సంబోధిస్తూ అతన్ని భారత పాలకునిగా గుర్తిస్తున్నామని, మిగిలిన వారందరూ విద్రోహులని, వారిని కఠినంగా అణిచివేయాలని సలహా ఇస్తాడు. ప్రాచీన పర్షియన్ భాష చదివినవారు, పర్షియన్ సిలబస్ పుస్తకాల్లో ఈ లేఖల్ని చూసే ఉంటారు. ఇలాంటి లేఖలు పుస్తక రూపంలో కూడా ప్రచురింపబడ్డాయి. స్థలాభావం వల్ల వాటిని మేమిక్కడ పేర్కొనలేకపోతున్నాము. అయితే ఆసక్తి కలిగించే విషయం ఏమిటంటే ఈరాన్ రాజ్యాధీశుని ఈ ప్రయత్నాలన్నీ బెడిసికొట్టి, అన్ని అవరోధాల్ని అధిగమించి ఔరంగజేబ్ భారతచక్రవర్తిగా ఎప్పుడైతే ధృవపడ్డాడో, అప్పుడతన్ని, "తండ్రిని బంధించిన ఘన కుమారుడు " అంటూ ఒక లేఖద్వారా దెప్పి పొడిచాడంటే, అతని మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చు.[24]

ఈ వివరణ తరువాత ఔరంగజేబ్ "షియా వ్యతిరేకి"గా ఎందుకు పేర్కొనబడ్డాడో, ఈ అపనింద ఏ పక్షం నుండి లేచిందో, అతని సమకాలీన మరియు ఆ తరువాత వచ్చిన షియా చరిత్రకారులు జరిగిన సంఘటనలకు ఒక ప్రత్యేక రంగును పులిమి ఎందుకు ప్రదర్శించారో మన పాఠకులకు అర్థమైపోయిందనుకుంటున్నాము. అంతేకాకుండా ఈ రెండు దక్షిణ రాజ్యాలు చేపట్టిన అంతరంగిక మరియు విదేశీ కుట్రలకు విసిగి, దేశ సమైక్యత మరియు సమగ్రతలకు వాటిద్వారా వాటిల్లుతున్న ప్రమాదాల్ని గుర్తించి, గత్యంతరం లేని పరిస్థితుల్లో వాటి ఉనికినే ఔరంగజేబ్ సమాప్తం చేసేశాడు.

# 21. ఔరంగజేబ్ - ధార్మిక నీతి

ఔరంగజేబ్‌ను ధార్మికపరంగాను, అతని ధార్మిక నీతి కారణంగాను అత్యధికంగా విమర్శించారు. అతన్ని హిందూ వ్యతిరేకి అన్నారు. హిందువుల్ని హింసించి ఆనందపడే వాడన్నారు. రోజొక మణుము జంధ్యాల్ని తెంపనిదే భోజనం చేసేవాడు కాదని నిందమోపారు. కాస్త ఆలోచించండి. ఒక జందెం బరువెంతుంటుంది? పది గురిగింజలు లెక్కపెట్టుకున్నా మణుము బరువులో 30720 జందాలు అంటే రోజుకు 30720 మంది జందాలు తెంపాడన్న మాట! ఈ విధంగా లెక్కవేసుకుంటే సంవత్సరానికి 1,10,59,200 మంది జంధ్యాలు తెంపాడు. అంటే ఔరంగజేబ్ పరిపాలించిన 50 సంవత్సరాల కాలంలో 55 కోట్లమంది హిందువుల జంధ్యాలు తెంపి, ముస్లింలుగా మార్చి వెళ్ళిపోయాడన్నమాట. భారతదేశం స్వాతంత్ర్యం పొందే నాటికి దాని జనాభా 40 కోట్లు దాటలేదే! చూడండి. ఎంతటి తుచ్ఛమైన అపవాదిది. వీరు వ్రాసింది చరిత్రనా లేక మనోకల్పిత కథనాలా? ఇలాంటి కథల్నే మనకు చరిత్ర అంటూ చదివించడం జరుగుతున్నది. అయితే ఔరంగజేబ్ ప్రదర్శించిన ధార్మిక నీతి గురించి తెలుసుకో వడానికి కాస్త లోతుగా పోయి పరిశీలిద్దాం. దీనికోసం అతను రాకుమారునిగా ఉన్నప్పటి నుండే ప్రారంభిద్దాం.

ఔరంగజేబ్ సోదరులు తమ పలుకుబడిని తమ అధికారాన్ని నిలుపుకోవడం కోసం, భవిష్యత్తులో సింహాసనం పొందడంలో ప్రయోజనకారి అవుతుందనే దృష్టితో వివిధ వర్గాల్ని తమ వైపు త్రిప్పుకోవడానికి తమదైన పద్ధతిలో ప్రయత్నాలు మొదలుపెట్టారు. దారా షికూహ్ అత్యధికంగా రాజపుత్రుల్నే నమ్ముకున్నాడు. అతని విశ్వాసాలు, నడవడికల్లో వచ్చిన మార్పు ఈ రాజపుత్రుల్ని తన వైపు తిప్పుకోవడానికే. వేదాంతంలోని ఏకేశ్వర వాదాన్ని, సూఫీయిజం లోని వివాదాస్పద అంశాల్ని పరస్పరం కలగాపులగం చేసింది దీనికోసమే. ఈ విధంగా రాజపుత్ర, ఇతర హిందూ నాయకుల్ని తమ వైపునకు ఆకర్షించుకునే ప్రయత్నం చేశాడు. ఇక దర్బారులోని 'షియా' నాయకుల్ని తన సమర్థకులుగా చేసుకోవడానికి రాకుమారుడు 'షుజా' షియా విశ్వాసాల్ని బాహాటంగానే అనుసరించసాగాడు. ఇక అనుభవరాహిత్యుడైనాగాని, తన ఖడ్గవీరత్వంపై అచంచల విశ్వాసం గల రాకుమారుడు మురాద్ ఇలాంటి ప్రయత్నాలకైతే పాల్పడలేదుగాని దర్బారులోని నాయకుల్ని మాత్రం తన వైపు త్రిప్పుకోవడానికి తంత్రాల్ని మొదలుపెట్టాడు. దీనికి భిన్నంగా ఔరంగజేబ్ అలాంటి ప్రయత్నాలేమీ చేయలేదు. రాజపుత్రుల్ని తన వైపు త్రిప్పుకోవడానికి తన విశ్వాసాల్లో ఎలాంటి మార్పులు చేసుకోలేదు, ధార్మికంగా వారిని ఊరిం చడానికి ప్రయత్నించనూలేదు. దర్బారులోని షియా నాయకుల సమర్థన కోసం వారిని అనుసరిం చనూలేదు, రహస్య మంతనాలూ జరుపలేదు. దానికి భిన్నంగా తనతో ఉంటున్న సర్వ అధికారులతో, కులమతాల కతీతంగా మృదువుగా, ప్రేమతో వ్యవహరించేవాడు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరినీ గౌరవించేవాడు. వీరందరినీ తనవారిగా భావించేవాడు. వారికి

తన సహాయం అవసరమైనప్పుడు నిర్మల హృదయంతో వారిని ఆదుకునేవాడు. అతను షియా, సున్నీ, హిందూ ముస్లిం అనే తారతమ్యం లేకుండా అందరినీ ఒకే దృష్టితో చూసేవాడు. అతను వ్రాసిన లేఖల్ని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమైపోతుంది. అతను వ్రాసిన లేఖల ద్వారా, ముస్లింలకన్నా హిందువులకే అధికంగా సిఫారసు చేసినట్లు విదితమవుతుంది. కాని అతని దురదృష్టం మరియు అతని సోదరుడు దారా షికూహ్ చేసిన బహుళ ప్రచారం కారణంగా అతను రాజపుత్ర వ్యతిరేకిగా ముద్రపడ్డాడు. ఇలాంటి విష ప్రచారం ద్వారా దారా షికూహ్ ఉద్దేశం ఏమిటో మనకు తెలియనిది కాదు. రాజపుత్రులు సామాన్యంగా ఆగ్రా, ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ సైన్యాల్లోనే అత్యధిక సంఖ్యలో ఉంటుండేవారు. అదియును గాక రాజపుత్రుల ప్రధాన క్షేత్రమైన రాజ్‌పుతాన (రాజస్తాన్) మరియు ఉత్తర భారతం నుండి దక్కన్ సుదూర ప్రాంతమైనందువల్ల కూడా, ఔరంగజేబ్ దక్కన్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అతని సైన్యంలో రాజపుత్రుల సంఖ్య బహుస్వల్పం. అయితే ఇతర హిందూ రాజులు, నాయకులు అతన్ని అమితంగా అభిమానించేవారు. అతను కూడా అవకాశం వచ్చినప్పుడు వారిని ఆదుకోవడానికి ఏమాత్రం వెనుకాడేవాడు కాదు. అసలు విషయం ఏమిటంటే అతను న్యాయప్రియుడు. ఎవరి పక్షంలో న్యాయముంటుందో, హిందూ–ముస్లిం అనే తారతమ్యం లేకుండా, వారికి తప్పకుండా సహాయపడేవాడు. వారికోసం సిఫారసుచేసేవాడు, అవసరమనిపించినప్పుడు తండ్రి, చక్రవర్తితో కూడా గట్టిగా వాదించేవాడు. ఇలా హిందువులకు సిఫారసు చేసిన, వారిని సమర్థించిన సంఘటనలెన్నో ఉన్నాయి. వాటిని మీరు వేరొక అధ్యాయంలో తెలుసుకో గలరు. ఉదాహరణకు ఇక్కడ కేవలం – ఒక సంఘటనను మాత్రం పేర్కొంటు న్నాము. దక్కన్ సూబాలో పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి ఏలచ్‌పూర్‌లో దీవానీకి సంబంధించిన ఒక హోదాలో ఖాళీ ఏర్పడింది. దానికోసం ఔరంగజేబ్, రామ్‌కరణ్ అనే ఓ రాజపుత్ర అధికారి పేరును ప్రతిపాదించాడు. కాని షాజహాన్ అతను అయోగ్యుడని తిరస్కరించాడు. ఔరంగజేబ్ తిరిగి అతన్నే గట్టిగా ప్రతిపాదించాడు. అయినప్పటికీ కూడా షాజహాన్ ఒప్పుకోలేదు. అయితే ఔరంగజేబ్ నిరుత్సాహపడలేదు. అతను అయోగ్యుడని తండ్రి ముద్రవేసినందున, అతని యోగ్యతను నిరూపించడానికి అతనికి అవకాశం కల్పించాడు. అతని మన్సబును పెంచి, ఉన్నతాధికారిగా నియమించాడు. అంతేకాకుండా "జవార్" యుద్ధ సమయంలో చక్రవర్తి అనుమతితో అతన్ని సేనాధిపతిగా నియమించి, "జవార్" విజేతగా షాజహాన్ ముందు ప్రదర్శిం చాడు. ఇంకా 'జవార్'ను అతనికి జాగీరుగా ఇప్పించాడు.[1] ఈ విధంగా ఒక వ్యక్తిని నిర్మల హృదయంతో, నిండు మనస్సుతో ప్రేమించి, అభిమానించినప్పుడు, ఆ ఎదుటి వ్యక్తి కూడా తన యజమాని పట్ల సంపూర్ణ విధేయత చూపి, అతని శ్రేయాన్ని కాంక్షించడం సహజమే కదా! అందుకనే ఔరంగజేబ్ రాకుమారునిగా ఉన్నప్పుడు అతని సైన్యంలో రాజపుత్రులు, ఇతర హిందూ అధికారులు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ కూడా ఏ ఒక్కరూ వెనకడుగు వేయ లేదు. స్వామిద్రోహానికి పాల్పడలేదు.

ఔరంగజేబ్‌పై హిందువుల్ని బలవంతంగా ముస్లింలుగా మార్చేవాడనే మహా చెడ్డ అపవాదును అతని వ్యతిరేకులు అతనిపై ఆపాదించారు. దీన్ని సామాన్య ప్రజలే కాదు, విద్యాధికులైన హిందూ సోదరులు కూడా నూటికి నూరుపాళ్ళు సత్యమైనట్లు విశ్వసించారు. వీరి అమాయకత్వంపై, అజ్ఞానంపై నవ్వొస్తుంది. ఈ విషయంలో అనగా మతం మార్పిడి విషయంలో, అతనెంత సూటిదైన, నిష్పక్షపాత వైఖరిని అవలంబించాడంటే, అంతకన్నా న్యాయ మైన, సమంజసమైన పద్ధతి గురించి మనం ఆలోచించనైనాలేము. నేటి ప్రజా స్వామ్యయుగంలో సైతం సరిగా పాటింపబడని ధర్మ నిరపేక్షతను అతను విశ్వసించడమే కాదు, పాటించి అనుసరించి మరీ చూపించాడు. ధర్మం రాజకీయాలతో కలిసిపోవడం కాదు, పూర్తిగా పెనవేసుకపోయిన కాలమది. ఇంకా మాట్లాడితే ధర్మానికి రాజకీయాలు లోబడి ఉన్నకాలమది. ఆ కాలంలో కూడా స్వచ్ఛమైన ఇస్లామీయ బోధనల్ని ఆకళింపు చేసుకున్నవాడు, కనక ఔరంగజేబ్ అవలంబించిన ధార్మిక నీతిని, నేటి సిసలైన జాతీయవాదులు కూడా తప్పుబట్టలేరు. అతనీ ధర్మ నిరపేక్షతను ఒక పాలసీగా కేవలం తనవరకే పరిమితం చేసుకోలేదు. దీనికోసం ఎవరినైనా, చివరికి తన తండ్రి, చక్రవర్తిని కూడా నిలదీయ సాహసించిన వ్యక్తి అతను.

ధర్మావలంబన లేక ధార్మిక పరివర్తనం కోసం అతనికో నిర్దిష్టమైన పాలసీ ఉండేది. దాని ననుసరించి ఒక వ్యక్తిని వివశుణ్ణి చేసి, అతని నిస్సహాయతతో అక్రమంగా లాభపడి అతని ధర్మాన్ని మార్చడానికి లేక ఒక వ్యక్తి తన హోదా అంతస్తును అక్రమంగా వినియోగించి, ఎదుటి వ్యక్తిని ప్రభావితం చేసి అతని ధర్మాన్ని మార్చటానికి ప్రయత్నించడం అతను తప్పుగా, అనుచితంగా, అన్యాయంగా భావించేవాడు. ధర్మాన్ని అవలంబించడంలో ప్రతి వ్యక్తికి సంపూర్ణ స్వాతంత్రం ఉండాలనేది అతని విశ్వాసం. అంతేకాదు, ఎవరైనా ఓ వ్యక్తి శిక్షను తప్పించుకోవడానికని ఇస్లాంను స్వీకరించడం లేక ప్రాపంచిక ప్రయోజనాల్ని పొందటానికి ధర్మాన్ని మార్చుకోవడం కూడా అతనికి ఇష్టముండేది కాదు. కాని ఎవరయితే మనఃపూర్వకంగా ఎలాంటి ఒత్తిడి, బలాత్కారం లేకుండా, ఇష్టపూర్వకంగా ఇస్లాం స్వీకరించేవాడో, అతనికి తన సంపూర్ణ సహాయ సహకారాలు అందించేవాడు. ఇస్లాం స్వీకరించినందువల్ల అతని మార్గంలో వచ్చే అడ్డంకుల్ని, అవరోధాల్ని తొలగించడంలో తోడ్పడేవాడు.

శాంతి సామరస్యాల్ని కాపాడడానికి, సహజీవనం సాగించడానికి అతి ముఖ్యమైన ఒక విషయంపై అతను ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవాడు. అదేమిటంటే ఏ వ్యక్తి అయినా సరే, ఎదుటి వ్యక్తి ధార్మిక విశ్వాసాల్ని, అతను గౌరవించి అభిమానించే ధార్మిక పురుషుల్ని అవహేళన చేయడం లేక కించపరచడాన్ని అతను సహించేవాడు కాదు. దీన్ని అతడు మతసామ రస్యానికి గొడ్డలిపెట్టుగా భావించేవాడు. మతకలహాలకు, ఘర్షణలకు దీన్ని మూలంగా భావించేవాడు. అందుకని ఇలాంటి నేరస్తులకు ఇవ్వబడే శిక్షల్ని అతను సమర్ధించే వాడు. అవహేళన, అవమానా లతో ప్రారంభమయ్యే ఈ మహమ్మారిని ప్రారంభంలోనే తుంచి వేయాలనేది అతని పాలసీ. పైన పేర్కొన్న విషయాలకు అతని లేఖల రూపంలో సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయి. ఇంకొక

విషయం ఏమిటంటే అతని ఈ పాలసీ, ఇంతవరకు జరిగిన సంఘటనలన్నీ కూడా అతని రాకుమార దశలో ఉన్నప్పుడు జరిగినవేనని, ఆ తరువాత పట్టాభిషిక్తుడై, రాజ్యాధికారాన్ని చేపట్టిన తరువాత తాను విశ్వసించిన, పైన పేర్కొంటూ వచ్చిన పాలసీలపై సంపూర్ణంగానూ, స్వాతంత్రంగాను అతను ఆచరించి చూపాడనేది మరచిపోరాదు.

"బలవంతంగా ధర్మపరివర్తన చేయించడం కాదు, ధర్మపరివర్తనలో బలాత్కారం కూడదు" అనే ఔరంగజేబ్ పాలసీని నిరూపించే ఒక విచిత్ర సంఘటనను మీకు వివరిస్తాము. బంధేరకు చెందిన ఒక రాజు ఇంద్రామన్‌ను పదే పదే ఆజ్ఞోల్లంఘన చేశాడనే నేరంపై షాజహాన్ అతన్ని "అసీర్" చెరసాలలో బంధించాడు. ఔరంగజేబ్ దక్కన్‌కు గవర్నరుగా నియుక్తుడై వచ్చిన తరువాత, తనను బంధవిముక్తిని చేయడానికి చక్రవర్తి షాజహాన్‌కు సిఫారసు చేయాల్సిందిగా ఇంద్రామన్ విన్నవించుకున్నాడు. దానికి అంగీకరించి ఔరంగజేబ్ చక్రవర్తికి ఒక సిఫారసు లేఖ వ్రాశాడు. అందులో ఇలా విన్నవించుకున్నాడు :

"మహాప్రభూ! బంధేరా జమీందారు 'ఇంద్రామన్' ఎంతో కాలంనుండి అసీర్ కోటలో బంధింపబడివున్నాడు. కొన్నిరోజుల క్రితం అతను తన ఓ బంధువు ద్వారా నాకో విన్నపాన్ని చేశాడు. ఒకవేళ "ప్రభువుల (షాజహాన్) వారి దిగదిడుపుగా తనకు ఈ ఖైదు నుండి విడిపిస్తే 50 వేల రూపాయలు నజరానాగా దర్బారులో సమర్పించుకుంటానని ఇంకా ఎలాంటి మన్సబుగాని, జాగీరుగాని లేకుండానే ఒక సంవత్సరం వరకు కేవలం 50 మంది అశ్వికులు, 100 మంది పదాతి దళంతో దక్కన్ సూబాలో సేవల్ని అందిస్తానని ఆ తరువాత మహోన్నత దర్బారు నుండి తనకు ప్రసాదించబడే మన్సబును అనుసరించి సైనికుల్ని నియమించుకుంటానని, అన్ని వేళలా రాజ్య సేవలకోసం సంసిద్ధుడై ఉంటానని, తన స్వస్థలానికి వెళ్ళే ఎలాంటి ఆలోచన కూడా తనకు లేదని తెలుపుకున్నాడు. అసీర్ కోటాధిపతి అయిన నర్సింగ్ దాస్ అతనికి జమానతుగా ఉండి పేష్కష్ (నజరానా) డబ్బుకు బాధ్యత తీసుకుంటాడు. ఎంతో కాలం నుండి ఇంద్రామన్ ఖైదులో మ్రగ్గుతున్నాడు. ఇంకా తన కర్మలకు శిక్ష అనుభవిస్తున్నాడు. ఇక ఇప్పుడైతే అత్యంత దైన్యస్థితికి చేరుకున్నాడు. ఒకవేళ తమరు అతని పాపాన్ని క్షమించి అతని తప్పుల్ని మన్నించినట్లైతే ప్రభువులవారి దయానుగ్రహాలకు రుణపడి ఉంటాడు ...... అయినప్పటికీ ప్రభువుల వారి చిత్తమేదై ఉంటుందో అది పూర్తిగా సముచితము, సమంజసమయ్యే ఉంటుంది." (రుఖ్‌యాత్ ఆలంగీర్ - లేఖ నం.21/77, సం. స.న. అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 176, (షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖలు)

రాజపుత్రుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తాడని ఔరంగజేబ్‌ను దెప్పిపొడిచే షాజహాన్, ఈ సిఫారసుపై ఔరంగజేబ్‌కు ఇచ్చిన సమాధానమేమిటంటే ఇంద్రామన్ ఏవైతే షరతులు ప్రతిపాదించాడో, ఆ షరతులు కేవలం ఒకే ఒక రూపంలో అంగీకరించబడతాయి. అదేమిటంటే అతను తన వంశపారంపర్యంగా వస్తున్న ధర్మాన్ని విడనాడి ఇస్లాం ధర్మాన్ని స్వీకరించాలి. హిందువుల వ్యతిరేకి, హిందువుల్ని హింసించేవాడు, హిందువుల మతం మార్పిడి చేయించేవాడని ముద్రపడిన ఔరంగజేబ్, తండ్రి లేఖలోని ఈ షరతును తెలుసుకొని ఇచ్చిన ప్రత్యుత్తరం

గమనార్హం. అందులో అతను ఈ షరతు ఆచరణకు సాధ్యపడదని, ఇది యుక్తికి, దూరదృష్టి రాహిత్యానికి ప్రతీక అని, ఇంకా స్వయంగా ఇస్లామీయ బోధనలకే విరుద్ధమని, అందుకని ఇంద్రామన్‌ను విడిచిపెట్టదలిస్తే, అతను అంగీకరించిన షరతుల మీదనే అతన్ని విడుదల చేయాలని గట్టిగా సిఫారసు చేశాడు. షాజహాన్ ప్రధానమంత్రి సాదుల్లా ఖాన్‌కు ఒక లేఖ వ్రాశాడు. అతని లేఖ సారాంశమిది :

"...... కాని పాపం అతను గత 20 ఏళ్ళ నుండి ప్రతీకారం అనే అగ్నిలో మాడిపోతున్నాడు. అత్యంత దైన్య స్థితికి చేరుకున్నాడు. బ్రాహ్మణులు, ఇతర సహచరుల భరోసాపైనే అతను 50 వేల రూపాయల పేష్‌కష్ (నజరానా-కప్పం) కు అంగీకరించాడు. కాని ఇస్లాం స్వీకరించిన తరువాత తన బందుమిత్రులు పరివారం నుండే దూరమైపోతాడే! అటువంటప్పుడు పేష్‌కష్ సొమ్మును ఎలా చెల్లించగలుగుతాడు? దీనితో పాటుగానే అతను ప్రతి సందర్భంలో ప్రభువులవారికి విధేయులు, విశ్వాసపాత్రులు అయిన వారిలో నుండి ఎవరినో ఒకరిని తన జమానతుదారుగా చూపించాడు. ఇంకా అతని స్వస్థలం (స్వంతజాగీరు) ఎంతో కాలం క్రిందనే అతని స్వాధీనం నుండి తీసేసుకొని ప్రభుత్వాధికారులకు స్వాధీనపర చటం జరిగింది. అందుకని ఒకవేళ అతని విడుదల ఇస్లాం స్వీకరించాలనే షరతుతో ముడిపెట్ట బడకుండా ఉంటే, అతను పేష్‌కష్ రొఖ్ఖం జమ చేసేవాడు. అలా కానప్పుడు (అంటే, ఇస్లాం స్వీకరించనిదే విడుదల కాదు అనుకుంటే) మిగిలిన జీవితమంతా అతను చెరసాలలోనే గడిపేస్తాడు. తమరు ఈ అంశాలన్నింటినీ సముచిత రీతిలో ప్రభువుల సన్నిధికి పంపిస్తారని భావిస్తున్నాను. ప్రభువులవారు ఏమని ఆదేశిస్తారో మాకు తెలిపితే, దాని ప్రకారం నడుచుకోవడం జరుగుతుంది." (ఆదాబె ఆలంగీర్ - సాదిఖ్ అన్‌బాల్వి, లేఖ నెం.231, ముఖద్దమ రుఖ్‌ఆత్.... పేజి.248, 249)

(నోటు : ఈ లేఖ నేటికి కూడా ఖుదా బక్ష్ ఓరియంటల్ లైబ్రరీ, పాట్నాలో వ్రాతప్రతి రూపంలో భద్రంగా ఉందని డా. ఓం ప్రకాశ్ ప్రసాద్ గారు "ఔరంగజేబ్ ఏక్ నయాదృష్టి" పేజి 75, 76)లో పేర్కొన్నారు. ఇండియా డివైడెడ్ - డా. రాజేంద్రప్రసాద్, పేజి 37, ఢిల్లీ, 1986.

ఈ విషయం ఇంతటితోనే ముగియలేదు. షాజహాన్ తన పంతాన్ని వదల్లేదు. పాపం ఇంద్రామన్ రాజు ఆ "అసీర్" కోటలోనే మురిగిపోతున్నాడు. సోదరుల మధ్య అంతర్యు ద్ధాలు మొదలవుతాయనగా ఔరంగజేబ్ దక్కన్‌ను విడిచి ఉత్తర భారతానికి బయలుదేరేముందు ఈ రాజును చెర విడిపించి, ఒక ఉన్నత హోదాపై నియమించి వెళ్ళాడు.[2]

వారసత్వం కోసం జరిగిన యుద్ధాల సమయంలో ఔరంగజేబ్ యోగ్యతపై విశ్వాసమున్న ప్పటికీ, ధార్మిక విషయంలో అతనెలా వ్యవహరించనున్నాడో తెలుసుకోగోరిన రాజపుత్రులకు రాతపూర్వకంగా అతనో "నిషాన్" (రాజాజ్ఞ పత్రం) జారీచేసి వారిని సంతృప్తపరిచాడు. అప్పుడే రాజా జైసింగ్ లాంటి ఎందరో రాజపుత్రులు అతని పక్షానికి వచ్చి, చివరి శ్వాస వరకు విశ్వస నీయంగా అతనికి సేవలందించారు. ఔరంగజేబ్ కూడా ధార్మిక విషయంగా తన ప్రమాణాన్ని

సంపూర్ణంగా నిలబెట్టుకున్నాడు. ఆ నిషాన్ (రాజాజ్ఞ పత్రం)లో ప్రమాణపూర్వకంగా అతనిలా వాగ్దానం చేశాడు : "తన పూర్వీకుల నుండి వస్తున్న మత సామరస్యాన్ని తాను కూడా కొనసాగి స్తానని హామీ ఇవ్వడమే కాకుండా, ఏ రాజైతే పరుల ధార్మిక విషయాల్లో అసహనం కనబరుస్తాడో, అతను దైవధిక్కరణకు పాల్పడినవాడుగా, దైవవిద్రోహిగా పరిగణింపబడతాడని ఎలుగెత్తి ప్రకటించాడు. మేవాడ్‌కు చెందిన రాణా రాజ్ సింగ్‌కు జారీచేసిన ఈ నిషాన్ నేటికీ సురక్షితంగా ఉంది.[3]

1960లో అలీగడ్‌లో జరిగిన ఆలిండియా హిస్టరీ కాంగ్రెస్ సదస్సులో "వారసత్వం కోసం 1658–59లో జరిగిన యుద్ధంలో ధార్మిక సమస్య" అనే మకుటంతో తానొక వ్యాసాన్ని సమర్పించానని, ఆ వ్యాసంలో ఈ 'నిషాన్' అనువాదాన్ని కూడా సమర్పించానని, ఇదే వ్యాసం తిరిగి మెడివల్ ఇండియా క్వార్టర్లీ, వా.5, పే.80–87లో కూడా ప్రచురించబడిందని అత్‌హర్ అలీ పేర్కొన్నారు. (*Moghal Nobility under Aurangazeb, page-22)*

అసలు విషయం ఏమిటంటే ఔరంగజేబ్ ధార్మిక ఆసక్తి గలవాడని, ఇస్లామీయ షరీయత్తు (ధర్మశాస్త్రం)ను తు.చ.తప్పకుండా అనుసరించేవాడని జదూనాథ్ సర్కార్‌తో సహా చరిత్రకారులందరి ఏకాభిప్రాయం. ఇస్లామీయ షరీయత్తు తెలిసినవాడు, కఠినంగా ఆచరించేవాడు కనుకనే పై విధమైన హామీ ఇచ్చాడు, మరియు ధార్మిక సహనానికి గ్యారంటీ ఇవ్వగలిగాడు. పరుల ధర్మంలో జోక్యం చేసుకోరాదనే గ్యారంటీ, స్వయంగా దైవం ఇచ్చిన గ్యారంటీ. ధర్మావలంబన గురించి, ధర్మప్రచారం గురించి, పరమతాల వారితో సహజీవనం గురించి మరియు పరుల ధర్మంలో జోక్యం చేసుకోరాదనే విషయం గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో వచ్చిన ఆదేశాలను ఒకసారి పరిశీలిస్తే, మనకు ఔరంగజేబ్ పక్షం, అతని మనస్తత్వం అవలీలగా అర్థమవుతుంది. ఈ విషయానికి సంబంధించి ఖురాన్‌లో వచ్చిన కొన్ని ఆదేశాల్ని ఇక్కడ పేర్కొంటే విషయం తేటతెల్లమైపోతుంది.

1. ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము. (అల్ అంబియా : 107)

2. ..... ముహమ్మద్! మేము నిన్ను మానవజాతికి సందేశహరునిగా చేసి పంపాము. (అన్ నిసా : 79)

3. ముస్లిములారా! వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి. (అల్ అన్ ఆమ్ : 108)

4. ధర్మం విషయంలో నిర్బంధంకాని, బలాత్కారం కానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కు నుండి ప్రస్ఫుటం చేయబడింది. (అల్ బఖర : 256)

5. ఇది సత్యం, మీ ప్రభువు తరఫు నుండి వచ్చింది. ఇష్టమైనవారు దానిని స్వీకరించనూ వచ్చు, ఇష్టం కాని వారు దానిని తిరస్కరించనూవచ్చు.(అల్‌కహఫ్: 29)
6. వారిచేత బలవంతంగా విషయాన్ని ఒప్పించడం నీ పని కాదు. (ఖాఫ్ : 45)
7. (ఓ ప్రజలారా!) మీరు తిరస్కరిస్తే, మా ప్రవక్తపై కేవలం సందేశం చేరవేసే బాధ్యత మాత్రమే ఉందని తెలుసుకోండి. (అత్ తగాబూన్ – 12)
8. నీవు కేవలం హితబోధ చేసేవాడవు మాత్రమే. వారిని ఏ విధంగానూ బలవంతం చేసేవాడవు కావు. (అల్ గాషియ : 22)
9. ప్రవక్తా! మేము నిన్ను వారిపై కాపలాదారుగా నియమించి పంపలేదు కదా! కేవలం మాటను అందజేసే బాధ్యత మాత్రమే నీపైన ఉంది. (అష్ షోరా : 48)
10. మేము అతనికి (అంటే మానవునికి) (ఖుర్‌ఆన్ ద్వారా) మార్గం చూపాము. ఇక అతను కృతజ్ఞతనైనా తెలుపవచ్చు లేక సత్య తిరస్కారీ కావచ్చు. (అద్ దహ్ర్ – 3)
11. ఇది ఒక హితబోధ, ఇష్టమైన వారు దీన్నుండి గుణపాఠం నేర్చుకోవచ్చు. (అల్ ముద్దస్సిర్ : 54)
12. ప్రవక్తా! సత్య సందేశాన్ని స్పష్టంగా అందజేయడం తప్ప నీపై మరొక బాధ్యత లేదు. (అన్ నహ్ల్ : 82)
13. ఒకవేళ వారు తిరస్కరిస్తే నీపై కేవలం (సందేశం) చేరవేసే బాధ్యత మాత్రమే ఉంది. (ఆలి ఇమ్రాన్ : 20)
14. రుజుమార్గాన్ని అవలంబించే వాని రుజువర్తనం స్వయంగా వానికే ప్రయోజనకరం. మార్గం తప్పినవాడు తన మార్గభ్రష్టత్వం యొక్క దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. (బనీ ఇస్రాయీల్ : 15)
15. స్పష్టంగా సందేశాన్ని అందజేయడం తప్ప దైవప్రవక్తపై మరొక బాధ్యత ఏదీ లేదు. (అల్ అన్ కబూత్ – 18)
16. నీ పని కేవలం సందేశాన్ని అందజేయడమే. లెక్క తీసుకోవడంమటుకు మా పని. (అర్రాద్ : 40)
17. .... ఆపై లెక్క చూడవలసిన బాధ్యత మా మీదనే ఉంది. (అల్ గాషియ : 26)
18. (కనుక) మీ ధర్మం మీకే, నా ధర్మం నాకే. (కాఫిరూన్ : 6)
19. **ఎవరయితే ధార్మిక విషయంలో మీతో యుద్ధం చేయలేదు. ఎవరైతే మిమ్మల్ని మీ ఇండ్ల నుండి గెంటివేయలేదు, అటువంటి వారితో మీరు మేలుగా, న్యాయంగా మెలగటానికి అల్లాహ్ మిమ్మల్ని వారించటం లేదు. న్యాయప్రియులంటే అల్లాహ్‌కు ఇష్టం. (అల్ ముమ్‌తహినహ్ : 8)**
20. ప్రవక్తా! మేము నిన్ను ప్రజలకు సంరక్షకుడుగా నియమించి పంపలేదు. (బనీ ఇస్రాయీల్:54)
21. నీవు వారికి కాపలాదారువు కావు. (అష్ షూర : 6)

22. మేము నిన్ను కావలివానిగా చేసి పంపలేదు. (అన్ నిసా : 80)
23. ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా చేసి శుభవార్తను ఇచ్చేవానిగా, హెచ్చరిక చేసేవానిగా చేసి, అల్లాహ్ అనుమతితో ఆయన వైపునకు పిలుపు ఇచ్చేవానిగా చేసి, ప్రకాశించే దీపంగా చేసి పంపాము. (అల్ అహ్‌జాబ్ : 45, 46)
24. ప్రవక్తా!) మేము నిన్ను సర్వ మానవులకు శుభవార్త ఇచ్చేవానిగా, హెచ్చరిక చేసేవాడుగా నియమించి పంపాము. (సబా - 28)
25. ప్రవక్తా! ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో, చక్కని హితబోధతో, ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు. (అన్ నహ్లా : 125)
26. ప్రవక్తా! సహనంతో పనిచేస్తూ పో. నీకు ఈ సహన భాగ్యం అల్లాహ్ అనుగ్రహం వల్లనే కలిగింది. వారి చేష్టలకు వగవకు. వారి పన్నాగాలకు మనస్సులో ఖేదపడకు. భయభక్తులతో పని చేస్తూ ఉదాత్త వైఖరిని కలిగి ఉండేవారితో అల్లాహ్ ఉంటాడు. (అన్ నహ్లా : 128)

ధర్మ పరిచయం ప్రచారం గురించి, ధర్మావలంబన గురించి, ఇతరుల ధర్మంపట్ల వ్యవహరించవలసిన తీరు గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో వివిధ చోట్లలో వచ్చిన ఆదేశాలను మన పాఠకుల ముందుంచాము. వీటన్నిటిని మరోసారి పరీక్షగా చదవండి. బలవంతంగా మతం మార్పిడులు చేయమని, నిర్బంధం చేసి ఒకరిని తమ ధర్మంలో కలుపుకొమ్మని ఇందులో ఎక్కడైనా రవ్వంతైనా అవకాశముందా? ధర్మావలంబన విషయంలో బలవంతం లేదని, ఎవరైనా దీన్ని స్వీకరించదలిస్తే అతని ఇష్టపూర్వకంగానే స్వీకరించాలని, ప్రజలకు ఈ ధర్మాన్ని చేరవేసే వరకే మీ బాధ్యత ఉందని, అంతకన్నా ముందుకు పోయే అధికారం మీకు లేదని స్వయంగా దైవమే ఆదేశించడం మీరు గమనించడం లేదా? ఇస్లామీయ షరీయత్తు క్షుణ్ణంగా తెలిసినవాడు గనకనే ఔరంగజేబ్ ఎవరయితే ఇతరుల ధార్మిక విషయాల్లో జోక్యం చేసుకుంటాడో, అసహనం కనబరుస్తాడో అతను దైవధిక్కరణకు పాల్పడిన వాడుగా, దైవ విద్రోహిగా పరిగణింపబడతాడని పేర్కొన్నాడు. దైవాదేశాలను ధిక్కరించిన వాడు దైవద్రోహిగా గాక మరేమవుతాడు? అందుకని ఔరంగజేబ్ అలాంటి 'నిషాన్' (రాజాజ్ఞ)ను జారీ చేసాడంటే అది పూర్తిగా షరీయత్తు ప్రకారమే, దివ్య ఖురాన్‌ను అనుసరించే ఉంది. అందుకని ఇందులో ఆశ్చర్యపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. అంతేకాక అది రాజపుత్రుల్ని, ఇతర హిందువుల్ని మభ్యపెట్టడానికి, మోసగించడానికి, తాత్కాలికమైనది ఎంతమాత్రం కాదు. దాని వెనుక ఖుర్‌ఆన్ అధారిటీ ఉంది, దైవం గ్యారంటీ ఉంది. అందుకని ఇది ఔరంగజేబ్ శాశ్వత ధార్మిక నీతి అని, రాకుమారుని దశ మొదలుకొని, చక్రవర్తిగా పట్టాభిషేకం, ఆ తరువాత మరణం వరకు ఇదే నీతిని అనుసరించాడని అంగీకరించక తప్పదు. అతని జీవితంలో అక్కడక్కడ కనబడే చిన్న చిన్న సంఘటనలు దీన్నే ధృవీకరిస్తాయి.

డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ తన పుస్తకంలో హైద్రాబాదుకు సంబంధించిన ఒక సంఘటనను ఇలా వివరించారు :

“హైద్రాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంలో లభించే ఒక రికార్డును పరిశీలిస్తే దక్షిణ భారతంలో చెలరేగిన విద్రోహాన్ని అణచడానికి వచ్చినప్పుడు ఔరంగజేబ్ కొన్ని రోజులు హైద్రాబాద్‌లో గడిపాడు. అతనిక్కడ ఆగి ఉన్న సమయంలోనే సమీపంలోని ఒక గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలోని శివలింగ విగ్రహం దొంగిలించబడింది. ఈ బ్రాహ్మణ కుటుంబం ఇంటి చుట్టుప్రక్కల ఉంటున్న కొన్ని ముస్లిం కుటుంబాలపై అనుమానం వచ్చింది. శివలింగాన్ని దర్శించుకోనిదే ఆ బ్రాహ్మణోత్తముడు ఏదీ తినేవాడు, త్రాగేవాడు కాదు. ఫలితంగా కొద్ది రోజుల్లోనే అతను ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. అతని భార్య కలవరపడి, ఈ విషయం ఔరంగజేబ్‌కు విన్నవించుకోగానే, అతను స్థానిక అధికారుల్ని పిలిపించి, ఇరవైనాలుగు గంటలలోగా ఆ విగ్రహం ఆ కుటుంబానికి ముట్టితీరాలని లేని పక్షంలో గ్రామం లోని వారందరూ కఠిన శిక్షకు గురికాక తప్పదని హెచ్చరించి పంపించాడు. చివరికి ఆ శివ లింగం (విగ్రహం) ఆ బ్రాహ్మణ కుటుంబానికి లభించిందని ఆ రికార్డు ద్వారా అవగత మవుతుంది.”[4]

“దక్షిణ భారత దేశంలోని బ్రహ్మపురిలో నియుక్తుడై ఉన్న ఒక అధికారి మీర్ హసన్, ఔరంగజేబ్ బ్రహ్మపురి వస్తున్నాడని తెలుసుకొని అతనికో లేఖ వ్రాశాడు. అందులో “ఇస్లాంపురి కోట బలహీనంగా ఉంది. మీరు త్వరలోనే ఈ కోటకు చేరుకుంటున్నట్లు తెలిసింది. అర్జంటుగా కోట మరమ్మత్తు జరుగాల్సి ఉంది. ఈ విషయంలో తమరి ఆదేశమేమటని” విన్నవించుకున్నాడు. దానిపై ఔరంగజేబ్ ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు. “ఇస్లాంపురి అనే పదం వ్రాసి నీవు ఉచితంగా ప్రవర్తించలేదు. దాని పాత పేరు బ్రహ్మపురి. నీవు ఆ పేరునే ఉపయోగించాల్సింది. శరీరమనే కోట అంతకన్నా బలహీనమైనది. దాని గురించి కూడా ఏమైనా ఆలోచించావా?”[5]

1659లో నాణేలపై కలిమా సద్వచనాన్ని చెక్కించడాన్ని మాన్పించాడు.[6] నాణాల్ని హిందూ, ముస్లింలిద్దరూ వాడుతున్నప్పుడు, వాటి రూపకల్పన కూడా సర్వసామాన్యంగానే ఉండాలనేది అతని అభిలాష.[7]

ఔరంగజేబ్ తన పరిపాలనా కాలంలో కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్ష విధించాడని అతనిపై ఇంకో నిందను మోపుతారు. “బనారస్ ఫర్మానా” పేరుతో ప్రఖ్యాతిగాంచిన ఫర్మానాను ఆధారంగా చూపుతూ, దాని పూర్వపరాలను పరిశీలించకుండానే అతను కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్ష విధించాడని చెప్పుకొస్తారు. కాని ఇదెంత మాత్రం నిజం కాదు. ఈ చట్టం (అనగా కొత్త మందిరాల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి) షాజహాన్ చక్రవర్తి కాలంలో ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన పూర్వపరాలు ఏమిటంటే ఒక ప్రాంతంలో అంతకు ముందే రెండు ప్రాచీన మందిరాలుండేవి. కొంతమంది ఇంకొక కొత్త మందిరాన్ని నిర్మించతల పెట్టారు. ఫలితంగా అక్కడి హిందువుల్లో రెండు వర్గాలు ఏర్పడి వివాదం తలెత్తింది. ఈ విషయం చక్రవర్తికి తెలిసినప్పుడు వివాద పరిష్కారం కోసం, ఇకముందు ఇలాంటి పరిస్థితి

ఉత్పన్నం కాకూడదనే దృష్టితో ప్రభుత్వ అనుమతి లేకుండా కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్ష విధించారు. ఈ చట్టమే ఔరంగజేబ్ కాలంలోనూ అమలులో ఉంది. బనారస్ ఫర్మానాలో ఆ పాత చట్టాన్నే పునరావృతం చేయడం జరిగింది తప్ప కొత్త చట్టాన్ని ప్రతిపాదించడం జరుగలేదు. అలాకాదు, ఔరంగజేబ్ కొత్త మందిరాల నిర్మాణంపై సంపూర్ణంగా ఆంక్షలు విధించాడనుకుంటే, అతని కాలంలో కొత్త మందిరాల నిర్మాణమే జరిగి ఉండకపోయేది. కాని వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి.

"ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో బెంగాల్‌కు చెందిన విశాల్‌పూర్ నగరంలో 1681లో రెండు మందిరాలు నిర్మించబడ్డాయి. మూడవ మందిరపు నిర్మాణం 1690లో జరిగింది."[8]

(జగాద్రీకి సమీపంలోని) బోడియా గ్రామ నివాసి అయిన సుభారామ్‌జీ పేరు గల ఒక బ్రాహ్మణోత్తముడు, ఔరంగజేబ్ కాలంలోనే ఒక మహోన్నత మందిరాన్ని నిర్మించాడు. 'భగత్‌మాల్' అనే పేరుతో రాసిన తన పుస్తకంలో రాయె తులసీరామ్ ఈ మందిరం గురించి ప్రస్తావించాడు. 1916లో ఈ పుస్తకపు పదవ ఎడిషన్‌ను నవల్ కిషోర్ ప్రెస్, లక్నో వారు ప్రచురించారు. (తారీఖ్ కీ సచ్చాయియాఁ - పేజి 56)

"హిందుస్తాన్- గుజిష్త, హాల్" (భారత్ అప్పుడు, ఇప్పుడు) అనే పేరుతో రాయె బహదూర్ లాలబేజ్ నాథ్ 1904లో ఒక పుస్తకాన్ని వ్రాశారు. అందులో పేజి 115-116పై ఇలా పేర్కొన్నారు.

"ముస్లిం పరిపాలకులకు సంబంధించి, వారి కాలంలో కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్ష విధించబడిందని ఆరోపించారు. కాని ఇది పూర్తిగా నిరాధారమైన ఆరోపణ. ... ఆ కాలంలో నిర్మించబడిన అనేక మందిరాలు నేటికీ ఉన్నాయి ... గుజరాత్‌లో ఆనాటి ప్రాచీన మందిరాలు అనేకం ఉన్నాయి. అందులో ఔరంగజేబ్ కాలంలో నిర్మించబడిన మందిరాల సంఖ్యే అత్యధికంగా ఉంది."[9]

"మహారాష్ట్రలో అహ్మద్ నగర్ జిల్లాలోని సిరిగొండ తాలూకాలో ఒక కోట ఉంది. దాన్ని బహద్దూర్ గడ్ కోట అని పిలుస్తారు. (దాని పాత పేరు పెడ్‌గాఁవ్) మొగలు సామ్రాజ్య ప్రఖ్యాత సైన్యాధిపతి అయిన బహద్దూర్ ఖాన్ పేరుమీద ఈ కోటకు బహద్దూర్ గడ్ అని నామకరణం చేయటం జరిగింది. ఈ కోటను ఔరంగజేబ్ భీమా నది సమీపంలో స్వయంగా తన హయాంలో కట్టించాడు. కోట కడుతున్నప్పుడు అక్కడ 10 మందిరాలు కూడా ఉండేవి. ఈ మందిరాలు "హేమార్ పంథీ" నిర్మాణ కళకు సంబంధించినవి. అంటే వాటి నిర్మాణంలో సున్నం, గచ్చు, సిమెంట్-ఇలాంటి జోడించే, అతికించే నిర్మాణ సామగ్రి ఏదీ ఉపయోగించబడదు. కేవలం పూర్తిగా రాతితోనే అవి నిర్మించబడతాయి. ఈ కోట నిర్మాణ సమయంలో ఆ మందిరాలు కోట గోడలకు మధ్యగా వస్తుండడాన్ని గమనించిన ఔరంగజేబ్ కోటను విస్తరించి వైశాల్యాన్ని పెంచి ఆ మందిరాల్ని కోటలోపలికి తెచ్చుకున్నాడే తప్ప ఆ మందిరాల్ని కూల్చడానికి, తీసివేయడానికి అతను ఇష్టపడలేదు. ఇంతకీ అవేమంత ప్రఖ్యాతిగాంచిన మందిరాలు కూడా కావు. ఇంత దూరదృష్టితో, ధార్మిక సహనంతో వ్యవహరించినప్పటికీ అతను మందిరాల

విధ్వంసకుడని పిలువబడడం ఎంతవరకు న్యాయమో మీరే ఆలోచించండి. బహద్దూర్ గడ్ కోటలోని ఈ పది మందిరాలు నేటికీ సురక్షితంగా ఉన్నాయి. చూడదలచుకున్న వారు నేటికీ వాటిని అక్కడ చూడవచ్చు. షోలాపూర్‌కు చెందిన ప్రఖ్యాత న్యాయవాది, బహుగ్రంథాల రచయిత సయ్యద్ షా గాజియొద్దీన్, అడ్వకేట్ గారు వీటిని అనేకసార్లు సందర్శించడమే కాకుండా వాటి ఫోటోలు కూడా ఆయన వద్ద భద్రంగా ఉన్నాయి."

ఔరంగజేబ్ ధార్మిక నీతి ఎలాగుండేదనే విషయంలో డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ ఇలా రాశారు :

బనారస్‌లోని కాశీ విశ్వనాథ మందిరాన్ని ఔరంగజేబ్ కూల్చి దానిపై మస్జిద్ నిర్మించాడని ఔరంగజేబ్‌ను ఆరోపించడం జరిగింది. కాని ఔరంగజేబ్ ద్వారా ఈ మందిరం కూల్చివేయబడినట్లు నిరూపించడానికి ఒక్క సమకాలీన సాక్ష్యం కూడా నేటి వరకు లభించలేదు. ఇక్కడ ఇంకొక విషయాన్ని కూడా గమనించాల్సి ఉంది. మొగలు పాలకులకు భూమి దొరక లేదా? భూమికి కరువు వచ్చిందా? మందిరాల్ని ధ్వంసం చేసే, దానిపై మసీదు నిర్మాణం చేయడానికి ఏం అగత్యం వచ్చిందని? స్వాతంత్ర్యానికి ముందు భారత దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో బీడుపడిన, నిరుపయోగంగా ఎంతో భూమి ఉన్నట్లు మనకు తెలుస్తుంది. అదెవ్వరి ఆక్రమణ లేక ఖబ్జాలో లేదు. ఎవరు ముందు అక్కడ శాశ్వత నివాసం ఏర్పరచుకుంటే, అది అతని ఆస్తిగా పరిగణింపబడేది. ఇక ఔరంగజేబైతే దేశానికే చక్రవర్తి, దేశమంతా అతనిదే. అందుకని అతనెక్కడ కోరుకుంటే అక్కడ మసీదు నిర్మించగలిగేవాడు. ఔరంగజేబ్‌కు కొత్త కొత్త మసీదులు కట్టించాలనే ఉత్సాహం ఉండకపోయేదనే వాస్తవాన్ని మనం గుర్తుంచుకోవాల్సి ఉంది. అతని పరిపాలనా కాలంలో అత్యధికంగా మసీదుల మరమ్మత్తులు, రిపేర్లు మాత్రమే జరిగాయి.

దాదాపుగా భారత దేశమంతా కూడా ఔరంగజేబ్ అధీనంలోకి వచ్చేసింది. అయినప్పటికీ హిందూ ధర్మం తన ప్రత్యేకతను కొనసాగించుకుంటూనే ఉంది. హిందూ ధర్మాన్ని గాయపరిచి, దాన్ని విశ్వసించే వారిలో క్రోధావేశాలను రేకెత్తించడం సముచితం కాదనే విషయం ఔరంగజేబ్‌కు నిశ్చయంగా తెలిసే ఉంటుంది. కేవలం ఈ కారణంగానే అతని కాలంలో అత్యధిక మందిరాల ధార్మిక పవిత్రత యధావిధిగా కొనసాగింది." (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి – డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 28, 29)

'సితార' కోటపై దాడి జరిపిన వారిలో నుండి 13 మంది పట్టుబడ్డారు. అందులో హిందూ–ముస్లింలు ఇద్దరూ ఉన్నారు. దర్బారుకు చెందిన ఖాజి అక్రమ్‌ను ఈ నేరస్థులకు శిక్ష గురించి సంప్రదించగా అతను హిందువుల్ని ముస్లింలుగా మార్చడానికి, ముస్లింలకు మూడేళ్ళ కారాగార శిక్ష విధించాల్సిందిగా తీర్పునిచ్చాడు. ఔరంగజేబ్ ఈ తీర్పును ఒప్పుకోలేదు. ఇది తప్పైన తీర్పుగా కొట్టివేశాడు. ఆ తరువాత ఖాజీను, ఇతర ధార్మికవేత్తల్ని ధార్మిక శాస్త్రం ప్రకారంగా సరియైన తీర్పు ఇవ్వాల్సిందిగా ఆదేశించాడు. ఈ కొత్త న్యాయాధీశులు హిందూ–ముస్లింలిద్దరికీ మరణశిక్షను విధించారు. ఔరంగజేబ్ ఈ తీర్పుకే తన ఆమోదాన్ని

తెలిపాడు. ఔరంగజేబ్ ఎల్లప్పుడూ కూడా ఒకే రకమైన నేరానికి శిక్ష విధించేటప్పుడు హిందూ–ముస్లింలలో వ్యత్యాసం ఉండకూడదనే దానికి ప్రాధాన్యత నిచ్చేవాడు." (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి – డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 25, 26)

స్వతంత్ర భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ తన గ్రంథం (ఇండియా *డివైడెడ్ – ఢిల్లీ, 1986 పేజి 35, 36)*లో ఇలా రాశారు :

"మున్షి సుజాన్ రాయ్, ఔరంగజేబ్ సమకాలీన చరిత్రకారుడు. అతను తన చరిత్ర గ్రంథం "ఖులాసతుత్తవారీఖ్"లో ఇలా రాశాడు : 'కాలానూర్‌కు సమీపంలో 'దీపాలివాల్' పేరు గల ఒక గ్రామం ఉంది. అక్కడ షాహ్ షంషుద్దీన్ దర్యాయి పేరు గల ఒక ధార్మిక గురువు సమాధి ఉంది. హిందూ–ముస్లింలిద్దరికీ కూడా ఆయన పట్ల అత్యంత భక్తి విశ్వాసా లుండేవి. ఆయన జీవిత కాలం నుండే దీపాలి పేరుగల ఒక హిందువుకు ఆయన పట్ల ఎంత భక్తితత్పరత లుండేవంటే, ఆయన మరణించిన తరువాత, హిందూ– ముస్లింలిద్దరూ కలిసి అతన్నే ఆయన సమాధికి ముఖ్య నిర్వహణాధికారిగా నియమించారు. కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత, కొందరు ముస్లింలు ధర్మాన్ని ఆసరాగా చేసుకొని, పెద్ద కల్లోలాన్ని లేవదీసి, ఆ హిందువును ఆయన సమాధి నిర్వహణ బాధ్యతల నుండి తొలగించదలిచారు. కాని ఔరంగజేబ్ ప్రభుత్వం వారి ఈ ప్రయత్నాన్ని సఫలం కానివ్వలేదు. ఇకిప్పుడు ఈ గ్రంథం (ఖులాసతుత్ తవారీఖ్) రాయబడుతున్నప్పుడు, ఔరంగజేబ్ పరిపాలన మొదలయి మూడవ సంవత్సరం నడుస్తున్నది. ఆ సమాధి యొక్క నిర్వహణ బాధ్యతలు మునుపటిలాగే హిందువుల చేతుల్లోనే ఉన్నాయి." (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి – డా. ఓం. ప్రకాశ్ ప్రసాద్, పేజి 74, 75)

ప్రొఫెసర్ శ్రీరాం శర్మ ఎన్నో చరిత్ర గ్రంథాల రచయిత. హైద్రాబాద్ నుండి వెలువడే "Islamic Culture" అనే మాసపత్రికలోని ఒక వ్యాసంలో ఆయనిలా రాశారు : "మొగలు పాలకులు తమ ప్రజల్ని అత్యధిక స్థాయి వరకు స్వతంత్రంగా ఉండేందుకు విడిచిపెట్టారనే వాస్తవాన్ని మనమెన్నటికీ విస్మరించలేము.... మతం మరియు ధర్మం విషయంలో తమ ప్రజల్ని పూర్తి స్వతంత్రంతో మెలిగేందుకు విడిచిపెట్టిన సామెత కేవలం మొగలులలోనే కనిపిస్తుంది." (Islamic Culture, Hyderabad, 1939, October)[10]

ప్రొఫెసర్ రాం ప్రసాద్ ఖోస్ల (పాట్నా యూనివర్సిటి) 1934లో వెలువడిన తన గ్రంథం "Moghal Kingship and Nobility" లో ఈ విషయాన్ని ఇలా పేర్కొన్నారు : "మొగలు ప్రభుత్వం తన వైభవోపేతాలతో ఆ కాలం కోసం ఎంతో సముచితంగా ఉండేది. తన ఈ శ్రేష్ఠతల వల్లనే ఈ మహోన్నత ప్రభుత్వం సుదీర్ఘ కాలం వరకు మనగలిగింది ... మొగలు పాలకులు న్యాయం ధర్మాలను ఒక పవిత్ర కర్తవ్యంగా భావించేవారు. ఒక సామాన్య మనిషికి కూడా రాజుగారిని దర్శించుకొని న్యాయం పొందే హక్కుండేది. ఇలా తమ హక్కును ఉపయోగించుకునే సందర్భాలు తక్కువగా వస్తుండేవనుకోండి .... మొగలుల కాలంలో ధార్మిక యుద్ధాల దృష్టాంతమే దొరకదు .... సంకుచితత్వం, మత విభేదాలనబడే వేదనలకు మొగలు ప్రభుత్వం దాదాపుగా అతీతమనే చెప్పొచ్చు."[11]

ఔరంగజేబ్ ప్రవర్తన వల్ల హిందువులు అసంతృప్తి చెంది తిరుగబడ్డారని, ఫలితంగా మొగలు సామ్రాజ్యం పతనమైందని కొన్ని వర్గాలు అపార్థాన్ని లేవదీశాయి. దీని విషయంగా

స్వతంత్ర సమర యోధుడు, గాంధీజీ, నెహ్రూజీ సహచరుడు, ప్రఖ్యాత చరిత్రకారుడు డాక్టర్ తారాచంద్ ఇలా పేర్కొన్నారు :

"ఔరంగజేబ్ ధార్మికనీతి అతను విఫలమవడానికి కారణమైందని కొన్ని వర్గాలు భావిస్తాయి. కాని ఇది పూర్తిగా నిరాధారమైన భావన. హిందువులు చేసిన తిరుగుబాట్లు విఫలమయ్యాయి. వారిలో ధార్మిక లేక రాజకీయ లక్ష్యమంటూ లేదు. ఔరంగజేబ్ హిందువుల సహాయంతోనే వాటిని అణిచివేశాడు. మరాఠాలకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధం మొగలు సామ్రాజ్యానికి ఒక భారంగా పరిగణించబడిందనడంలో సందేహం లేదు. కాని వారి ఈ తిరుగుబాటు జాతీయపరమైనదీ కాదు, ధార్మికమైనదీ కాదు. కేవలం ఒక వర్గం లేక తెగ తిరుగుబాటు లాంటిది. ఇతర తెగలు లేపిన తిరుగుబాట్లకన్నా భిన్నమైందేమీ కాదు. రాజ పుత్రులు, బుందేలాలు మరియు స్వయంగా శివాజీ బంధువులు ఔరంగజేబ్ తరఫున శివాజీకి మరియు అతని వారసులకు వ్యతిరేకంగా పోరాడారు. ఇంక మరాఠాలు హిందువులపై కూడా దాడులు జరిపారు. మరియు వారి సైన్యంలో ముస్లింలు కూడా ఉండేవారు."[12]

T.W. Arnold తన ప్రఖ్యాత గ్రంథం The Preaching of Islam లో ఔరంగజేబ్ పరమత సహనం, నిష్పక్షపాతానికి సంబంధించిన ఒక సంఘటనను పేర్కొన్నారు.

"ఔరంగజేబ్ జారీ చేసిన ఆదేశాలు, ఫర్మానాల్లో నుండి ఇంతవరకు ప్రచురింపబడని, ఒక రాత ప్రతిలో ధార్మిక స్వాతంత్రానికి సంబంధించిన ఒక సమగ్ర సూత్రం లభించింది. ఇది ఎలాంటిదంటే పరమతాలకు చెందిన ప్రజలపట్ల, ప్రతి పాలకుడు దీన్ని తప్పక ఆచరిం చాలి. ఈ నియమం పేర్కొనబడిన సందర్భం ఏమిటంటే - ఒక వ్యక్తి ఔరంగజేబ్‌కు ఒక అర్జీని సమర్పిస్తూ ప్రభుత్వ జీతభత్యాలను పంచే హోదాలపై ఉన్నవారు ముస్లింలు కారని, పరమతస్థులైన పారశీకులని, అందుకని వారిని వెంటనే తొలగించాలని కోరాడు. తన వాదనను సమర్థించుకోవటానికని అతను దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ను ఉటం కించాడు. "విశ్వసించిన ప్రజలారా! నాకునూ, మీకునూ శత్రువులయిన వారిని మిత్రులుగా చేసుకోకండి." ఔరంగజేబ్ ఈ అర్జీని అందులోని ఆక్షేపణను చదువుకొని అదే అర్జీపై ఇలా రాశాడు... ".... ఈ ఆయత్ (వాక్యం) ఇలాంటి సందర్భం కోసం అవతరించింది కాదు...." అంతేకాదు తన వాదనను బలపరిచేందుకు దివ్య ఖుర్‌ఆన్‌లో నుండే ఇంకొక ఆయత్ "మీ ధర్మం మీకు, నా ధర్మం నాకు..." అనే దాన్ని సూచించాడు. ఇంకా అతనిలా రాశాడు. "ఏ ఆయత్‌నైతే అర్జీదారు తన ఆక్షేపణ కోసం ఉదాహరించాడో (అదే అర్థంలో) కనుక దాన్ని రాజ్యపరిపాలనా విధానంగా మార్చుకుంటే ఈ దేశంలోనున్న సర్వరాజుల్ని వారి ప్రజల్ని గెంటెయ్యాలిగా. కాని (వాస్తవం) అలా కాదు. ప్రభుత్వ ఉద్యోగాలు వ్యక్తుల యోగ్యతను బట్టే లభిస్తాయి తప్ప వేరొక రకంగా కాదు." (The Preaching of Islam, BY T.W. Arnold, page 28, London 1935) (అహ్‌కామె ఆలంగిరి హమీదుద్దీన్ ఖాన్, పేజి 89)

# 22. ఆరాధనాలయాలు - కూల్చివేత

మందిరాలు, మస్జిద్‌లు, మఠాలు ఇతర ఆరాధనాలయాలు ఎందుకు కూల్చివేయ బడతాయి? వీటికి అనేక కారణాలు ఉంటాయి. ఉదాహరణకు :

1. ధార్మిక పవిత్ర స్థలాలు ప్రార్థన కోసం, ఆరాధనకోసం ఇతర ధార్మిక కార్యకలాపాలకు కాకుండా, ధార్మికేతర పనుల కోసం, అలజడి, అరాచకం, తిరుగుబాటు లేక ప్రభుత్వ మరియు ప్రజావ్యతిరేక కార్యక్రమాల కోసం వినియోగించబడినప్పుడు, వాటి పవిత్రత మంటలో కలిసి అవి నష్టానికి గురిఅవుతాయి.

2. సమాజంలోని విభిన్న వర్గాల్లో శాంతి, సామరస్యాలు, సహజీవనం, పరస్పర గౌరవాభిమానాలు కరువై, ఒకరిపై వేరొకరికి ఈర్ష్యాద్వేషాలు ఏర్పడినప్పుడు, వ్యతిరేక వర్గపు ధార్మిక భావనల్ని గాయపరచడానికి కూడా ఆరాధనాలయాలకు నష్టం కలిగించడం జరుగుతుంది.

3. యుద్ధాలు జరుగుతున్నప్పుడు అయాచితంగానో, ప్రమాదవశాత్తుగానో, ఆరాధనాలయాలకు నష్టం వాటిల్లే అవకాశాలు ఎంతైనా ఉంటాయి.

భారతీయ సమాజం మరియు చరిత్రలో పరమత సహనం, శాంతి సామరస్యాలు, సహజీవనం లాంటి మహోన్నత ఆదర్శాలు, సామెతలు కోకొల్లలుగా ఉన్నప్పటికీ కూడా, ఇక్కడ మందిరాలు, మసీదులు ఇతర ఆరాధనాలయాల కూల్చివేత జరిగిందనేది చారిత్రక వాస్తవం. అయితే ఇది కేవలం హిందూ-ముస్లింల వరకే పరిమితమనుకోవడం శుద్ధ పొరపాటు. ఇది చరిత్రను వక్రీకరించడం, ఈ రెండు వర్గాల మధ్య పరస్పరం విద్వేషాన్ని లేపటానికి ప్రయత్నించడం తప్ప ఇంకేమీ కాదు. ఇది కొన్ని వర్గాలు, కొందరు చరిత్రకారులు కావాలని సృష్టించిన దృష్టికోణం. దీని వెనుక అదే 'విభజించి పాలించు' అనే ఆంగ్లేయుల మనస్తత్వం పనిచేస్తున్నది. చరిత్రను త్రవ్వితే, ప్రాచీన చారిత్రక గ్రంథాల్ని అధ్యయనం చేస్తే, మసీదు-మందిరాల కంటే ముందు కూడా వివిధ వర్గ ప్రజలకు చెందిన ఆరాధనాలయాలు కూల్చి వేయబడ్డాయనేది మనకు తెలిసివస్తుంది. ఉదాహరణకు డాక్టర్ ఓం ప్రకాష్ ప్రసాద్ ఇలా పేర్కొన్నారు.

"మందిరాలను దోచుకునే పని ముస్లింలకన్నా హిందూ పరిపాలకుల కాలంలోనే అత్యధికంగా జరిగింది. ముస్లిం పరిపాలకుల కాలంలో మందిరాలను దోచుకోవడానికి బాహాటంగా ఒక శాఖనే ఏర్పాటు చేసినట్లు ఎలాంటి రుజువు లేదు. కాని పన్నెండవ శతాబ్దంలో కాశ్మీరుకు చెందిన "హర్ష్" పేరుగల రాజు "మందిరాల దోపకం" పేరుతో ప్రత్యేకంగా ఒక శాఖనే ఏర్పాటు చేశాడు. మందిరాలను దోచుకోవడమే ఆ శాఖ పని.[1] మందిరాల దోపకం వల్ల లభించే ధనసంపదలో సగభాగం దోపిడీదారులైన ఆ సైనికులకు పంచేసి, మిగిలిన

సగభాగాన్ని ఆ రాజు స్వయంగా తానుంచుకునేవాడు. ఆర్థిక సమస్యల్ని అధిగమించడానికి మందిరాల సర్వసంపదను దోచుకునే అలవాటు క్రమక్రమంగా గట్టిపడసాగింది. భక్తుల ద్వారా సమర్పించబడిన కానుకలు, ధనాన్నే కాకుండా ధాతువులతో చేయబడిన దేవతా విగ్రహాల్ని మందిరాల నుండి బయటికి తీయడానికి ఉదయరాజ్‌ను "దేవోత్పాట్ నాయక్"గా నియమించాడు.[2] దేవతల విగ్రహాల్ని దోచుకోవడానికి ముందు, ఉదయ్‌రాజ్, నగ్న భిక్షువుల ద్వారా వాటిపై మలినాన్ని, మూత్రాన్ని చల్లించేవాడు. ఈ విగ్రహాల కాళ్ళకు తాళ్ళుకట్టి వాటిని రోడ్డుపై లాగించడం జరిగేది.[3] రాజ్యమంతటిలో దేవతా విగ్రహాల్ని విరగ్గొట్టని ఒక్క మందిరమైనా ఏ ఒక్క పల్లెలో, ఏ ఒక్క గ్రామంలో లేక ఏ ఒక్క నగరంలోనైనా మిగులలేకపోయింది. శ్రీరణ్‌స్వామి మరియు శ్రీమార్తాండదేవుని విగ్రహాలు మాత్రం మిగిలిపోయాయని కల్‌హన్ ప్రస్తావించాడు.[4] అదేవిధంగా బుద్ధ భగవానుని రెండు ప్రతిమలు కూడా రక్షింపబడ్డాయి. దేవతా మందిరాల పూజార్చనల కోసం కేటాయించబడిన గ్రామాల్ని సైతం "హర్ష్" తన అధీనంలోకి తీసుకున్నాడు.[5] పర్‌మార్ శాసకుడు సుభట్ వర్మన్ (1193-1230) గుజరాత్‌పై దాడి జరిపి డభోయి మరియు ఖంబాత్‌లోని అనేక జైన మందిరాలను దోచుకున్నాడు.[6] వేలాది కుటుంబాలను దోచుకొని ధనాన్ని ప్రోగుచేయటంకన్నా ఏదో ఒక మందిరాన్ని దోచుకొని ధనాన్ని కూడబెట్టడం అనేక దృష్టి కోణాలతో పరిపాలకులకు మేలనిపించింది. మందిరాల్లో కూడబెట్టిన లెక్కలేనంత ధనం అవినీతికి అసలు కారణంగా ఉండేది. (పే.20,21)

అతను (ఔరంగజేబ్) మధుర మరియు బనారస్ మందిరాల్నే కూల్చి వేయించడం కాదు, గోల్కొండలోని మసీదును కూడా కూల్చివేయించాడు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు, గతి విధులకు ఈ ప్రదేశాలు కేంద్రంగా మారడమే దీనికి కారణం. బనారస్‌లోని కాశీ విశ్వనాథ మందిరాన్ని పడగొట్టించి, దానిపై మసీదు నిర్మించాడనే అతనిపై మోపబడిన అపవాదును నిరూపించడానికి గట్టి సాక్ష్యాధారం ఏదీ లేదు. (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - పేజి 20, 21)

"తన పరిపాలనా కాలపు ప్రారంభకాలంలోనే ఇస్లామీయ ధర్మశాస్త్ర ఆదేశానుసారం అతను హిందువుల, యూదుల, క్రైస్తవుల మందిరాలను, చర్చీలను గౌరవించాడు. ఏ ప్రాచీన మందిరాన్ని కూడా పడగొట్టడం లేక ధ్వంసం చేయడం జరుగరాదని అతనో శాసనాన్ని తీశాడు, కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్ష విధించినప్పటికీ, పాత, ప్రాచీన మందిరాల మరమ్మత్తు మరియు పునర్నిర్మాణానికి అనుమతించడమే కాకుండా, దీనికోసం వాటికి ఆర్థిక సహాయాన్ని కూడా సమకూర్చాడు.[7] (ఔరంగ... ఏక్...ఓంప్రకాశ్ ప్రసాద్,పేజి 27)

"మందిరాలకు సంబంధించి ఔరంగజేబ్ యొక్క ఈ నియమం కొత్తదేమీ కాదు, షాజహాన్ పరిపాలనా కాలంలో అతను గుజరాత్‌లో సూబేదారుగా ఉన్నప్పుడు మందిరాలనైతే కాదుగాని, అందులోని విగ్రహాల్ని తీసేయమని, వాటిని మూసేయమని ఆదేశించివున్నాడు. దీనికి కారణం ఏమిటంటే ఈ మందిరాలలో కేంద్రానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేపేవారు నిరంతరం గుమిగూడేవారు. ఇక ఎప్పుడైతే అతను రాజ్యాధికారాన్ని చేబట్టాడో, తన తండ్రి

కాలంలో ఏ మందిరాలనైతే మూసేయమని ఆదేశించడం జరిగిందో, అవి తిరిగి తెరువబడ్డాయని, అందులో విగ్రహాలు ప్రతిష్టించబడ్డాయని తెలుసుకున్నప్పుడు, రాజాజ్ఞల ఉల్లంఘన పట్ల కోపోద్రేకుడవడం సహజమే. అందుకని 1665లో ఆ మందిరాలను కూల్చివేయడానికి ఫర్మానాను జారీచేశాడు. సోమనాథ్‌లోని ప్రఖ్యాత మందిరాన్ని కూల్చి వేయడానికి, తన పరిపాలనా కాలపు ప్రారంభంలో, ముస్లిం ధార్మిక గురువుల్ని సంతృప్తి పరచడానికి, పరిపాలనను విజయవంతంగా నడపడానికి ఆదేశించాడు. (పే.27)

ఈ విధంగా సింహాసనపు పటిష్ఠత కోసం, అది మందిరంగాని, మసీదుగాని కేంద్రానికి తిరుగబడిన వారు కనబడిన చోటల్లా, లేక అక్రమంగా, దొంగతనంగా గొప్ప ధనరాసుల్ని ప్రోగు చేశారని తెలుసుకున్నప్పుడు, వాటిని కూల్చివేయడంలో ఇస్లాం గాని లేక ఏ ఇతర ధర్మంగాని అతనికి అడ్డు రాలేదని నిరూపితమవుతుంది. ధార్మిక స్థలాల పవిత్రతను, శాంతిపూర్వక వాతావరణాన్ని పరిరక్షించడానికి, ఔరంగజేబ్ కేవలం మందిరాలపైనే కాదు, మసీదులపై కూడా గట్టి నిఘాను వేసి ఉంచాడు. (పేజి 27, 28)

బనారస్‌లోని కాశీ విశ్వనాథ మందిరాన్ని పడగొట్టాడనే నింద ఔరంగజేబ్‌పై మోపబడింది. కాని అది ఇతని ద్వారా కూల్చబడిందని నిరూపించడానికి నేటివరకు కూడా ఒక్కటంటే ఒక్కటి సమకాలీన సాక్ష్యం లభించలేదు. హిందూరాజులు, పరిపాలకుల ద్వారా ఎన్నో మందిరాలు కూల్చబడ్డాయని ఇంతకు ముందే తెలుపుతూ వచ్చాం. కాని వాటిని పెద్దగా విమర్శించడం జరుగలేదు. కేవలం బనారస్ మరియు మధురలోనే అతని ద్వారా మందిరాలు కూల్చబడ్డాయనే ప్రశ్న ఎందుకు మన ముందు కొచ్చింది? అసలు దీనికి కారణం ఏమిటి? భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో పెద్ద పెద్ద మందిరాలు లేవా? దక్షిణ భారత దేశమైతే గొప్ప గొప్ప, ప్రసిద్ధిగాంచిన మందిరాలకు నేటికీ విశ్వవిఖ్యాతి గాంచింది. ఆలోచించదగిన ఇంకొక విషయమేమిటంటే ఔరంగజేబ్ ఇస్లామీయ షరీయత్తును తు.చ. తప్పకుండా పాటించేవాడని, ప్రతి పనిని ఇస్లామీయ షరీయత్తు వెలుగులోనే నెరవేర్చేవాడని ప్రతీతి. అటువంటప్పుడు ఇస్లామీయ షరీయత్తు (ధర్మశాస్త్రం) మందిరాన్ని కూల్చి, దాని స్థానంలో మసీదును నిర్మించడానికి అనుమతిస్తుందా? అనేది కూడా ప్రశ్నే! ఒకరి భూమిని లేక ధార్మిక స్థలాన్ని లాక్కొని లేక బలవంతంగా ఆక్రమించుకొని మసీదును నిర్మించడాన్ని ఇస్లామీయ షరీయత్తు అనుచితమైన, ఇస్లాం వ్యతిరేక చర్యగా పేర్కొంటుందే! ..(పేజి 28).

"బనారస్‌లోని కాశీవిశ్వనాథ మందిరపు కూల్చివేత విషయంలో డాక్టర్ పట్టాభి సీతారామయ్య [8] అత్యంత కీలకమైన సాక్ష్యాల్ని అందించారు. దీన్ని డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే కూడా తన వ్యాసంలో రెఫరెన్సుగా పేర్కొన్నారు.[9] ఆయనిలా రాశారు : "కచ్ ప్రాంతానికి చెందిన ఎనమండుగురు రాణులు కాశీ విశ్వనాధుని దర్శించుకోవడానికి వెళ్ళారు. వారిలో నుండి ఒక అందమైన రాణిని పూజారులు అపహరించారు. కచ్ ప్రాంతానికి చెందిన రాజు ఈ విషయాన్ని ఔరంగజేబ్‌కు తెలిపాడు. ఇది హిందువుల అంతరంగిక వ్యవహారమని, అందుకని

తానిందులో జోక్యం చేసుకోవడం సమంజసం కాదని మొదట్లో ఔరంగజేబ్ తప్పిం చుకోవడానికి ప్రయత్నించాడు. కాని కచ్ ప్రాంతానికి చెందిన రాజు అత్యంత దీనంగా వేడుకున్న తరువాత, ఔరంగజేబ్ సరేనంటూ, అసలు జరిగిందేమిటో విచారించడానికి కొందరు హిందూ సైనికుల్ని పంపించాడు. మహేంతుని మనుషులు ఈ హిందూ సైనికుల్ని తన్ని కొట్టి, బెదిరించి వెళ్ళగొట్టారు. తన సైనికుల పట్ల ఇలా ప్రవర్తించినందుకు ఔరంగజేబ్‌కు అసంతృప్తి, చిరాకు కలిగింది. అందుకని కొందరు ఉన్నత, యోగ్యులైన సైనికాధికారుల్ని జరిగిన అసలు విషయం ఏమిటో తెలుసుకురమ్మని రెండవసారి పంపించాడు. ఆ మందిరపు పూజారులు ఈసారి కూడా వారిని తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఈ మొగలు సైనికాధికారులు భయపడకుండా వారినెదుర్కొన్నారు. మందిరం లోపల పూజారులకు, ఈ సైనికులకు మధ్య జరిగిన పోరాటంలో మందిరానికి నష్టం వాటిల్లింది. పోరాట సమయంలో ఇలా జరుగడం అసంభవమేమీ కాదు, చివరికి సైనికులు మందిరంలో ప్రవేశించగలిగారు, మరియు రాణిని గాలించసాగారు. గాలింపు సందర్భంలో ప్రత్యేక దేవత (పెద్ద దేవత) వెనుకభాగంలో ఒక సొరంగం అగుపించింది. దానిలో నుండి భరించరానటువంటి అత్యంత దుర్గంధమైన వాసన వస్తున్నది. రెండు రోజుల వరకు మందులు చల్లుతూ దుర్వాసనను తగ్గించగలిగారు. ఈ రెండు రోజులు క్రమం తప్పకుండా సైనికులు కాపలా కాసారు. మూడవ రోజు సైనికులు ఆ సొరంగంలో ప్రవేశించి చెడిపోయిన, మురిగిపోయిన ఎన్నో స్త్రీ శవాల్ని బయటికి తీశారు. అందులో కచ్ ప్రాంతానికి చెందిన రాణి శవం కూడా లభించింది. అది నగ్నంగా ఉంది. సామూహిక మానభంగం కారణంగా ఆమె అసువులు బాసింది. పెద్ద పూజారి బంధింపబడి, కఠినంగా శిక్షించబడ్డాడు.”

(ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 29, 30)

“హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు” అనే తన హిందీ పుస్తకంలో అఖ్‌లేష్ జైస్వాల్ ఇలా వ్రాశారు : “మధురలోని కేశవరాయ్ మందిరపు కూల్చివేతకు సంబంధించినంత వరకు, ఇది కూల్చివేయబడింది వాస్తవమే. అయితే కాశీలోని విశ్వనాథ మందిరంలాగే దీని కూల్చివేత వెనుక కూడా ధార్మిక కారణం కాకుండా వేరే కారణం ఉంది. ఈ మందిరం ఆ కాలంలో జాట్ విద్రోహకారులకు కేంద్రంగా మారింది. వారిక్కడ తమ ఆయుధాల్ని దాచుకునేవారు. వారిక్కడే తమ రహస్య సమావేశాలు జరుపుకునేవారు. ఇక్కడి నుండే తమ విద్రోహ కార్యకలాపాల్ని సమీక్షించేవారు. మొగలు సామ్రాజ్య రాజధాని నగరానికి సమీపంలో ఇలాంటి విద్రోహకర కార్యకలాపాలకు అది కేంద్రంగా మారడం ఔరంగజేబ్‌కు ఆందోళన కలిగించింది. కోపం కూడా వచ్చింది. ఔరంగజేబ్ పదే పదే హెచ్చరించినప్పటికీ జాటులు ఆ మందిరం నుండి తమ విద్రోహక కలాపాలు మానుకోలేదు. అప్పుడు గత్యంతరం లేని పరిస్థితిలో ఔరంగజేబ్ సైనిక చర్యకు ఆదేశించాడు. అయితే దానితో పాటే దేవతా విగ్రహానికి గాని, పూజారికిగాని ఎలాంటి హాని జరగకుండా చూడాలని కూడా ఆజ్ఞాపించాడు. దానికనుగుణంగా దేవతా

విగ్రహాన్ని అక్కడి నుండి సగౌరవంగా తరలించి ఆ తరువాత నాథ్ ద్వార్ (గుజరాత్) లో ప్రతిష్ఠించడం జరిగింది. ఆ తరువాత అది కూల్చివేయబడింది.

పైన పేర్కొన్న సంఘటనను నిశిత దృష్టితో పరిశీలించినట్లయితే, ఈ సంఘటనకు ఔరంగజేబ్ ఎంతమాత్రం బాధ్యుడు కాడనేది విదితమైపోతుంది. ఇక్కడ ఔరంగజేబ్ ఏ చర్యనైతే చేపట్టాడో, ఇంకే పరిపాలకుడైనాసరే, అదే చర్యను చేపట్టేవాడు. ఒకవేళ ఔరంగజేబ్ గనక మతపక్షపాతి అయి ఉంటే, విగ్రహాన్నీ (దేవతామూర్తిని) ధ్వంసం చేయించేవాడు, ఇంకా పూజారి కూడా చంపబడేవాడు. కాని అలా జరిగి ఉండలేదు. వాస్తవానికి దీని కారణం కూడా రాజకీయ పరమైనదే, ధార్మికతకు ఇందులో ప్రమేయం లేదు. ఆ తరువాత కూడా పరిస్థితులు మెరుగు పడనప్పుడు, రాజపుత్ర నాయకుడైన బిషన్ సింగ్‌ను మధుర ఫౌజుదారుగా నియమించి జాటుల్ని అణచివేసే బాధ్యత అప్పగించబడింది. బిషన్ సింగ్ తన వీరత్వం, (సైనిక) నైపుణ్యంతో జాటుల తిరుగుబాటును సమాప్తం చేయడంలో కృతార్థుడయ్యాడు. ఒకవేళ ఔరంగజేబ్ ఆ మందిరాన్ని ధార్మిక పక్షపాతంతోనే గనక కూల్చివేయించి ఉంటే, ఈ హిందూ రాజు (బిషన్ సింగ్) కాస్తంతైనా వ్యతిరేకత తెలిపి ఉండకపోయేవాడా! నిజం చెప్పాలంటే మాజి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ద్వారా గోల్డెన్ టెంపుల్‌లో గైకొన్న సైనిక చర్య, మధురలోని కేశవరాయ్ సంఘటనను విశదీకరించినట్లయింది. 1984లో అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌లో ఏ పరిస్థితులైతే ఉత్పన్న మయ్యాయో, దాదాపు అదే పరిస్థితులు మధురలోని కేశవరాయ్ మందిరంలో కూడా ఏర్పడ్డాయి. ఒకవేళ దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేపట్టిన సైనిక చర్య సముచితం, సమంజసం అయినప్పుడు ఔరంగజేబ్ ద్వారా మధురలోని కేశవరాయ్ మందిరంలో సైన్యాన్ని పంపడం కూడా సముచితం, సమంజసంగానే భావించబడుతుంది. ఔరంగజేబ్ ఒకవైపు మందిరాల్ని కూల్చివేయించాడంటే, వేరొక వైపు రాజకీయ ఉద్యమాలకు (ధార్మికేతర కార్యకలాపాలకు) కేంద్రంగా మారిన మస్జిద్‌లను సైతం నేలమట్టం గావించాడు. గోల్కొండలోని జామె మస్జిద్ దీనికి ఒక చక్కటి నిదర్శనం .....

మధురలోని కేశవరాయ్ మందిరం వీర్‌సింగ్ బుందేలా కట్టించాడు. ఈ వీర్‌సింగ్ బుందేలా ఎవరనుకుంటున్నారా? రాకుమారుడు సలీం (జహాంగీర్) సంజ్ఞతో దక్కన్ నుండి వస్తున్న అక్బర్ చక్రవర్తికి ప్రియాతిప్రియమైన నౌరతన్‌లోని ఒకడైన అబుల్ ఫజ్ల్‌ను చంపి, ప్రభుత్వ ధనాగారాన్ని దోచుకున్న వ్యక్తి ఇతను. ఆ తరువాత తన ఈ చర్యకు తన ఆత్మనే దూషిస్తున్నందున ప్రాయశ్చిత్తం కోసం తను దోచుకున్న ఈ ధనంతోనే వీర్‌సింగ్ మధురలోని ఈ మందిరాన్ని నిర్మించాడు. ఈ విధంగా విశ్లేషిస్తే మొగలు ఖజానాతోనే ఈ మందిరం నిర్మించబడింది. అయినా కూడా ఈ మందిరం కూల్చివేతకు ఇది అసలు కారణం కాదు. మందిరం కూల్చివేయడానికి కారణం, ఈ మందిరం జాటు విద్రోహకారులకు కేంద్రస్థావ రంగా మారడమే. ఇది కాకుండా ఇంకే కారణమూ లేదు.

పైన పేర్కొన్న సామెతల ద్వారా ఔరంగజేబ్‌పైన కొందరు చరిత్రకారులు మోపిన మతపక్షపాతి, హిందూవ్యతిరేకి, దేవతా విగ్రహాల విధ్వంసకుడు మొదలుగాగల నిందలు కేవలం

కల్పితాలని, పెడమార్గం పట్టించటానికి చేసినవనేది తేటతెల్లమైపోయింది. మందిరాలు కూల్చివేయబడడానికి వేరే కారణాలుండేవి. యుద్ధాలు, ఘర్షణలు జరిగినప్పుడు కొన్ని కూలి పోయాయి. లేక విద్రోహకారుల స్థావరాలుగా మారినందున కూల్చివేయబడ్డాయి. ఇదేకాకుండా దీనికి ఇంకో ముఖ్య కారణం కూడా ఉండేది. ప్రభుత్వ అనుమతి లేకుండా మందిరం లేక మస్జిద్‌లు నిర్మించడం, పరిపాలనా, శాసనాపరంగా చట్ట వ్యతిరేక చర్యగా భావించబడేది. అసలిదే ముఖ్య కారణంగా కన్పిస్తుంది. ఇది కాకుండా ఇంకే కారణం లేకుండింది. ఇస్లాం (బోధనలు, నియమాలను) అనుసరించి వివాదాస్పద స్థలంలో చేసిన నమాజు కూడా దైవం స్వీకరించడు. పరిస్థితులు, నియమాలు ఇలా ఉన్నప్పుడు సంపూర్ణ సున్నీముస్లిం అయిన ఔరంగజేబ్ ధర్మానికి వ్యతిరేకంగా ఎలా వ్యవహరించగలడు? స్వయంగా హజ్రత్ ముహమ్మద్ (స) గారు మదీనా నగరంలో కలహప్రియులు, దౌర్జన్యకారులకు కేంద్రంగా మారిన మస్జిద్ జిరార్‌ను తమ హయాంలో, తమ ఆదేశాలతో పడగొట్టించారు." (పేజి 32 - 35)

ప్రముఖ చరిత్రకారుడు అల్లామ షిబ్లి నౌమాని ఆరాధనాలయాలకు సంబంధించి ఇలా వివరించారు :

"ఒక విషయం గురించి మనం అధ్యయనం చేస్తున్నప్పుడు, దాని వాస్తవాలు తెలుసు కోవడానికి దాని పూర్వపరాల్ని కూడా పరిశీలించాల్సి ఉంటుంది. ప్రజలు సర్వసామాన్యంగా ఒక పొరపాటు చేస్తుంటారు. వారు నేటి మన సమాజాన్ని, సంస్కృతిని దృష్టిలో ఉంచుకొని, గడిచిన కాలాల్ని పరిశీలిస్తుంటారు. నేటి కాలంలో ధర్మం మరియు రాజకీయాలు పూర్తిగా వేర్వేరు అయిపోయాయి. ప్రభుత్వ ధర్మమైన క్రైస్తవాన్ని, నడిరోడ్డుపై నిలబడి విమర్శించడానికి, ఇతరుల్ని తమ ధర్మం వైపునకు ఆహ్వానించడానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అనుమతి నిస్తుంది. అయితే ఇదే ప్రభుత్వం, ప్రభుత్వ పరిపాలనా తీరు, పరిపాలనా వ్యవస్థపై అభ్యంతరాన్ని తెలుపుతూ, ప్రజల్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పురిగొల్పడానికి ఏ ఒక్క మనిషికీ అనుమతి నివ్వదు. నేడు ముస్లింల మసీదులు కానివ్వండి, హిందువుల శివాలయాలు (మందిరాలు) కానివ్వండి, రాజకీయపరంగా, ఎలాంటి శక్తి సామర్థ్యాలు కలిగిలేవు. కాని గడిచిన కాలాల్లో ఇవే విద్రోహాలకు, తిరుగుబాట్లకు కేంద్రస్థానాలుగా ఉంటుండేవి. ఈ కారణంగానే హిందూ-ముస్లింలిద్దరూ, తమకు విజయం లభించిన తరువాత ఈ ఆరాధనాలయాలకు నష్టం కలిగించే వారు. హిందూ రాజులు తమకు విజయం, అధికారం లభించిన చోట్లలో మసీదులను ధ్వంసం చేసి, సర్వనాశనం చేసిన సంఘటనలతో చరిత్ర పుటలు నిండి ఉన్నాయి.

1569లో అలి ఆదిల్ షా దక్నీ, నిజాం షా బహ్రీ దురాగతాలను భరించలేక, విజయ నగరం రాజైన రామరాజును సహాయం కోసం అర్థించాడు. అయితే రామరాజు, అతని దేశంలో ప్రవేశించగానే, స్వయంగా అలీ ఆదిల్ షా దేశంలో నున్న మస్జిద్‌లన్నిటికీ నిప్పంటించాడు. 'ఫరిష్తచరిత్ర'లో ఇలా ఉంది :

"1569లో అలీ ఆదిల్ షా తన సహాయార్థం రామరాజును పిలిపించుకొని అతని వెంట అహ్మద్ నగర్ వైపునకు బయలుదేరాడు ... పరిందా నుండి ఖబీర్ వరకు, అహ్మద్

నగర్ నుండి దౌలతాబాద్ వరకు (నలువైపులా) వినాశం తాండవమాడ సాగింది. విజయనగరానికి చెందిన హిందూ సైనికులు, మనసారా ముస్లింలపై దౌర్జన్యాలు జరిపారు. ఈ నగరానికి చెందిన ప్రజల సంతోషాల్ని మట్టిలో కలిపేశారు, చివరికి వీరు మసీదుల్ని, ఖురాన్ (ప్రతుల్ని) సైతం అగ్నికి ఆహుతిచేశారు.[10]

ఇదే చరిత్రకారుడు ఈ సంఘటనను, వేరొక సందర్భంలో ఇంకా వివరంగా రాశాడు. రామరాజును తన సహాయార్థం ఆహ్వానించే ముందు, హిందూ సైన్యాలు మసీదులు మొదలుగా గల వాటిని అగౌరవ పరచరనే షరతుపైనే అలి ఆదిల్ షా అతన్ని పిలువనంపాడు. అయితే వారు దీనికి భిన్నంగా ప్రవర్తించారు. ఆ చరిత్రకారుని తన వాక్యాలు ఇలా ఉన్నాయి:

“మొదటిసారిగా హుసేన్ నిజాం షా దురాగతాలకు కలవరపడిపోయిన అలి ఆదిల్ షా, రామరాజు సహాయాన్ని అర్థించాడు. అలీ ఆదిల్ షా మరియు రామరాజులలో ఒక ఒప్పందం జరిగింది. దాని ననుసరించి విజయనగరానికి చెందిన హిందువులు తమ ప్రాచీన శతృత్వం కారణంగా, ముస్లింలకు ఏ విధమైన కీడు కలిగించరని, ప్రజల ధన మాన ప్రాణాల జోలికి పోరని, ముస్లింల గౌరవమర్యాదలకు భంగం కలిగించరని అంగీకరించడం జరిగింది. కాని హిందువులు ఈ వాగ్దానాన్ని ఉల్లంఘించి అహ్మద్‌నగర్‌కు చెందిన ముస్లింలపై అన్ని రకాల దౌర్జన్యాలు జరిపారు. వధించారు, ధన సంపదల్ని దోచుకున్నారు, పైన పేర్కొన్నట్లు మసీదులను అగౌరవపరిచారు. ఇదంతా విన్న అలి ఆదిల్ షా అత్యంతగా బాధపడ్డాడు. కాని నోరు విప్పలేదు, ఆ సమయంలో మౌనం దాల్చడమే సముచితమైన చర్య.”[11]

ఇలాంటివే ఇంకెన్నో సంఘటనలున్నాయి. వాటి వివరాల్లోకి పోనవసరం లేదు. ఔరంగజేబ్ కాలంలో కూడా ఇలాంటి దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ఆలంగీర్ వాటిని ఆపడానికి ప్రయత్నించినప్పుడు, ఒక విద్రోహం లాంటిది బయలుదేరింది. 1678లో హిందువులు తమ ధార్మిక బోధనల్ని ముస్లింలకు గరుపుతున్నారని తెలిసినప్పుడు, దాన్ని ఆపడానికి అతను ఆదేశించాడు. ఇది జరిగిన నెలరోజులకే మథుర పరిసర ప్రాంతాల్లో విద్రోహం చెలరేగింది. దాన్ని అణచడానికి అబ్దుల్ నబి ఖాన్‌ను మథురా సైనికాధికారిగా నియమించి పంపినప్పుడు, వారతన్ని చంపేశారు.[12] ఆ కాలంలోనే బనారస్‌లోని కాశి విశ్వనాథమందిరం మరియు అబుల్ ఫజల్‌ను దోచుకొని, అతన్ని చంపి అతని ధనంతో నర్సింగ్‌దేవ్ మథురలో నిర్మించిన ఆలయం కూడా కూల్చివేయబడింది. ఉదయపూర్‌లోని మందిరాలకు కూడా ఆ కాలంలోనే నష్టం వాటిల్లింది.

మందిరాల కూల్చివేతకు వెనుకగల కారణాలేమిటో తెలుపడానికి వ్యతిరేకులైన(షియా) ఇరాన్ చరిత్రకారులకు ఏం పట్టిందని? కాని క్రింద పేర్కొన్న సంఘటనలు నేడుకూడా స్పష్టంగానే ఉన్నాయి. వాటినే కాస్త హేతుబద్ధంగా జోడించి చూస్తే అసలు విషయాలు బయటపడతాయి.

1678లో బుందేలాకు చెందిన రాజపుత్రులు విద్రోహానికి తలపడ్డారు. (*మాస్సర్ ఆలంగీరి – ముస్తఅద్ ఖాన్– పేజి 118-120)* వారిపై సైనిక చర్య గైకొనబడింది. అందులో అక్కడి మందిరాలకు నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరమే నలువైపులా విద్రోహాలు చెలరేగాయి. జోద్‌పూర్

మరియు ఉదయపూర్ రాజ్యాలు ఈ విద్రోహాలకు కేంద్రాలుగా పనిచేశాయి. అందుకని ఆలంగీర్ వాటిపై సైనిక చర్యను గైకొన్నాడు. ఈ సైనిక చర్యలో అక్కడి కొన్ని మందిరాలు నష్టానికి గురిఅయ్యాయి.

ఎక్కడైతే తీవ్రమైన తిరుగుబాట్లు లేచాయో, ఎక్కడైతే సైనిక చర్య గైకొనబడిందో అక్కడి మందిరాలు మాత్రమే నష్టపోయాయి.

ఆలంగీర్ 25 సంవత్సరాలు దక్కన్‌లో గడిపాడు, కాని అక్కడ ఒక్క మందిరానికి కూడా ఏ కాస్త నష్టం కూడా వాటిల్లినట్లు చరిత్ర గ్రంథాల్లో ఒక్క పదం కూడా రాయబడలేదు.

ఎల్లోరాలోని ప్రఖ్యాత మందిరంలో వందలాది చిత్రాలు మరియు విగ్రహాలున్నాయి. ఆలంగీర్ దీనికి సమీపంలోనే ఎల్లోరాకు రెండు మైళ్ళదూరంలో ఖననమయ్యాడు. ఆలంగీర్ కంటే ముందు గడిచిన ఎందరో ధార్మిక గురువుల సమాధులు ఇక్కడున్నాయి. అయినాగాని ఈ చిత్రాలు, ఈ విగ్రహాలు నేటికీ అలాగే ఉన్నాయి. ఔరంగజేబ్ దర్బారుకు చెందిన అధికారి, మాస్సర్ ఆలంగీరి రచయిత ....ఎల్లోరాను అత్యంతగా ప్రశంసిస్తూ ప్రస్తావించాడు.( మాస్సర్ *ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ - పేజి 167)*

యూరోపియన్ చరిత్రకారులు దీన్నెలా పేర్కొంటారంటే, మందిరాలు పడగొట్టబడ్డాయి గనుక తిరుగుబాట్లు చెలరేగాయి. కాని వాస్తవం అలా కాదు, తిరుగుబాటు చెలరేగిన చోట సైనిక చర్య గైకొనబడింది. ఈ సైనిక చర్యల కారణంగా మందిరాలకు నష్టం వాటిల్లింది..

నేటి కాలంలో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. మహ్‌దీ సూడాని సమాధిని కూల్చివేయడం దీనికి చక్కటి నిదర్శనం. ఆలంగీర్ కాలంలోనూ అలాగే జరిగేది.

పట్టాభిషేకం 5వ సంవత్సరం తరువాత భారత దేశంలో సర్వత్రా శాంతి నెలకొల్పబడిన తరువాత ఔరంగజేబ్ దక్కన్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో మందిరాల కూల్చివేతకు సంబంధించిన ఒక్క సంఘటన కూడా చరిత్ర గ్రంథాల్లో లభించదు. దక్కన్‌లో ముస్లిం రాజ్యాలైన బీజాపూర్ మరియు గోల్కొండను ఎదుర్కోవాల్సి ఉండేది. కాని అక్కడ ఒక్క మందిరానికి కూడా నష్టం వాటిల్ల లేదు. మందిరాల కూల్చివేతకు ధార్మిక పక్షపాతమే ప్రధాన కారణమై ఉంటే ఇదో చక్కని అవకాశం. (ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్- షిబ్లి నొమాని, పేజి 70-74

ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ తన గ్రంథంలో ఇలా రాశారు:

“మొన్నీమధ్యనే లీడర్‌గా పిలువబడే ఒక పెద్ద మనిషి ముస్లిం రాజులు విగ్రహాలను విరగ్గొట్టారని, మందిరాలను పడగొట్టారని పేర్కొన్నారు. అలా చెప్పడంలో ఆయన మనోమస్తిష్కాల్లో ఏ విషయమైతే పేరుకుపోయి ఉందో, అదే బయటికి వచ్చింది. ఇందులో పాపం

ఆయన తప్పేమీ లేదు. ఆయన చదువుకొని వచ్చిన చరిత్రల్లో ఏ విషయాన్నైతే జొప్పించడం జరిగిందో, అయాచితంగా అదే ఆయన నోటి నుండి వెలువడింది. మన చరిత్ర గ్రంథాలన్నిటిలో ఒక నిర్దిష్ట లక్ష్యంతో పథకం ప్రకారం ఇలాంటి విషాన్ని నింపడం జరిగింది. ఆ విషంతో వేలాది, లక్షలాది మనోమస్తిష్కాలు కలుషితం అయ్యాయి. నేడు మన దేశంలో కనబడుతున్న అసహనం, పక్షపాతం, మత కలహాలు, సంఘర్షణల నేపథ్యంలో ఈ మనస్తత్వమే పనిచేస్తున్నది. నేడు మన దేశంలో కనబడుతున్న ఆందోళనలకు, ఉద్రిక్తతలకు చరిత్రలో నింపిన ఈ విషమే ప్రధాన పాత్ర పోషిస్తున్నది. జాతి సమైక్యతకు, జాతిని పటిష్టపరిచి ఏక తాటిపై నడపడానికి చరిత్రలోని ఈ విషమే గొప్ప అడ్డంకిగా మారింది. ఈ విషం మన దేశప్రజల మనోమస్తిష్కాల్లో ఎంత లోతుగా దిగిపోయిందో అంచనావేయడమే కష్టతరమైన కార్యంగా కనబడుతున్నది.

1987 సెప్టెంబర్ 24 పత్రికల్లో ఒక వార్త వచ్చింది. రాజస్తాన్‌లోని సక్కర్ జిల్లాలోని ఒక గ్రామంలో సతీసహగమనం జరిగిన చోట ఒక మందిరపు నిర్మాణం జరుగుతున్నది. ఈ మందిరపు నిర్మాణాన్ని ఆపివేయాలని కొందరు ప్రభుత్వానికి డిమాండు చేశారు.

1987 సెప్టెంబరు 23న వివిధ పత్రికలు ఒక వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. కాల్‌కాజీ (ఢిల్లీ) ప్రాంతంలో ఒక మందిరాన్ని కార్పొరేషన్ సిబ్బంది పడగొట్టారు, దానిపై కార్పొరేషన్ సభలో గందరగోళం జరిగింది. ఆ సమయంలోనే సతీసహగమనం జరిగిన స్థానంలో నిర్మింపబడుతున్న మందిరాన్ని ప్రభుత్వం ఆపేసినట్లు పత్రికల్లో వార్త వచ్చింది.

పై సంఘటనలపై కాస్త ప్రశాంతంగా ఆలోచించండి, మందిరాన్ని పడగొట్టిన వారి అనగా ప్రభుత్వ ప్రతినిధులు, అధికారుల ధార్మిక భావనలు, మందిరాన్ని నిర్మింపతలపెట్టిన వారి ధార్మిక భావనలకు భిన్నంగా ఉండి ఉన్నట్లయితే, పై సంఘటనల్ని ఒక ప్రత్యేక రంగులో పులిమి ఎంత అవలీలగా ధార్మిక భావనల్ని రెచ్చగొట్టి, ధార్మిక విద్వేషాన్ని లేపవచ్చో ఆలోచించండి. అయితే నిర్మించదలచినవారు, పడగొట్టిన వారు ఇద్దరూ ఒకే ధర్మానికి చెందినవారు గనక అలా వేరుపరచడానికి, విభజించడానికి, విద్వేషాన్ని రేపటానికి ప్రస్తుతం అవకాశం లేదు.

ఉదాహరణకు అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయానికి సంబంధించి జరిగిన సైనిక చర్యలో ధార్మిక పక్షపాతానికి, లేక ధార్మిక ద్వేషానికి ఎలాంటి అవకాశం లేదు. అందుకే ఏ ఒక్క పక్షం నుండి కూడా ఇలాంటి ఆరోపణ జరిగి ఉండలేదు. కాని ఇదే ఒక శతాబ్దం గడిచిన తరువాత భవిష్య చరిత్రకారుడు ఈ సంఘటనకే మతరంగు పులిమి, ఒక ప్రత్యేక కోణంలో ప్రదర్శించి, పరస్పరం ద్వేషాన్ని రగుల్చడానికి ఎంతటి విచిత్రమైన, పదునైన మరియు ఫలదాయకమైన ఆయుధంగా వాడుకోవచ్చో ఆలోచించండి. భారతచరిత్రకు సంబంధించి ఆంగ్లేయ చరిత్రకారులు

ఇలాంటి పంథానే అవలంబించారు. దీన్నే ఆయుధంగా చేసుకొని అమోఘంగా ఉపయోగించుకున్నారు.

ఔరంగజేబ్ తన యాభై ఏళ్ళ సుదీర్ఘ పరిపాలనా కాలంలో ధార్మిక వ్యత్యాసం కారణంగా కేవలం మందిరాలను పడగొడుతూనే ఉండి ఉన్నట్లయితే, నేడు భారత దేశంలో మందిరమంటూ ఒక్కటీ కనబడకపోయేది. ఔరంగజేబ్ మందిరాలకు జాగీర్లనిస్తున్నాడు, కొత్త మందిరాలను నిర్మిస్తున్నాడు, బ్రాహ్మణ పూజారుల ఖర్చుల కోసం పెన్షన్లు జారీచేస్తున్నాడు. తన రాజ్యం సుదీర్ఘంగా మనగలగాలని ప్రార్థించడానికి వారిని అభ్యర్థిస్తున్నాడు. ఇవన్నీ వట్టి మాటలు కావు. వీటిని సమర్థించడానికి నిరాకరించలేని ప్రమాణికమైన చరిత్ర సాక్ష్యాధారా లున్నాయి. (ఈ పుస్తకంలోని వేరే అధ్యాయంలో వాటిని మీరు చూడగలుగుతారు.)

వేరొకవైపు మందిరాల కూల్చివేతకు సంబంధించి ఆంగ్లేయ చరిత్రకారులు చరిత్ర గ్రంథాల్లో నింపేసిన కథనాలున్నాయి. ఈ రెండింటిలో ఏదైనా పొంతన ఉందా? మందిరాన్ని అభిమానించేవాడే, దాన్ని గౌరవించేవాడే, దాని బాగోగుల గురించి ఆలోచిస్తాడు, దానికోసం జాగీర్లను, దానాలను ప్రసాదిస్తాడు. అలాంటి వ్యక్తే మందిరాల్ని ధ్వంసం చేశాడంటే నమ్మ గలమా? ఈ మాట గొంతులోకి దిగుతుందా? ఒకవేళ అలా ఎక్కడైనా జరిగివుంటే దానికి కారణం ధార్మిక పక్షపాతం ఎంతమాత్రం కాదు, రాజకీయపరమైనదో, లేక ఇంకేదైనా కారణం ఉండి ఉంటుందనడంలో సందేహం లేదు. ఔరంగజేబ్ కాలంలో కూల్చివేయబడిన ఆరాధనా లయాలలో మందిరాలే కాదు, గోల్కొండలాంటి మసీదులు కూడా ఉన్నాయనే విషయాన్ని మరిచిపోరాదు. (తారీఖ్‌కీ సచ్చాయియాఁ (చారిత్రక వాస్తవాలు) -ఖుర్షీద్ ముస్తఫా రజ్వి పేజి 11-13)

## పండిట్ సుందర్ లాల్ పరిశోధన :

మీ ఈ రచయిత (ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ)కు పలు పర్యాయాలు ప్రఖ్యాత జాతీయ నాయకుడు, స్వాతంత్ర సమయ యోధుడు, రచయిత కీ.శే. పండిట్ సుందర్ లాల్ సన్నిధిలో హాజరయ్యే భాగ్యం లభించింది. ఆయన గారు ఎన్నో సందర్భాల్లో తమ ఉపన్యాసాల్లో ఇంకా స్వయంగా నాతో మాట్లాడే సందర్భంలో కూడా ఇలా అన్నారు : "పంజాబ్‌కు చెందిన ప్రాచీన మందిరాలు మరియు గురుద్వారాల్లో పరిశోధనలు జరిపే అవకాశం నాకు లభించింది. అప్పుడు నేనక్కడ ఈ ఆరాధనాలయాలకు ఇనాములు ఇచ్చిన రాజ శాసనాల భాండాగారాన్ని కనుగొన్నాను. వాటిలో అత్యధికం ఔరంగజేబ్ ద్వారా జారీ చేసినవే ఉన్నాయి." (తారీఖ్ కీ సచ్చాయియాఁ - ఖుర్షీద్ ముస్తఫా రజ్వి - పేజి 23, 24)

మసీదులలాగే ఇతర ధర్మాల ఆరాధనాలయాలు కూడా గౌరవించదగినవని ఇస్లాం ఆదేశించింది. భారతదేశ చరిత్రను అధ్యయనం చేసినట్లయితే, వేయి సంవత్సరాలుగా సహ జీవనం గడిపిన హిందూ-ముస్లింల కాలంలో ధార్మిక పక్షపాతం కారణంగా పరిపాలకులు

ఆరాధనాలయాల్ని నష్టం కలిగించలేదు. హిందూ ముస్లింలకు చెందిన పరిపాలకులిద్దరూ అలా చేసి ఉండలేదు .... విజయనగరం రాజు రామరాజు, అక్కడి స్థానిక ముస్లిం పాలకుణ్ని ఓడించినప్పుడు, అతని సైనికులు మసీదులను ధ్వంసం చేసేశారు. కాని ఇదే రామరాజు ఎప్పుడైతే తన సైన్యంలో ముస్లింలను చేర్చుకున్నాడో, వారికోసం స్వయంగా తానే ఒక బ్రహ్మాండమైన మసీదును నిర్మించి ఇచ్చాడు. తన దర్బారులో ఉన్నతస్థానంపై, ఖురాన్‌ను ఉంచి దానికి దండనామాలు చేశాడు. ఇంకా సలాంను తనకు విధిగా చేసుకున్నాడు. భరత్‌పూర్‌కు చెందిన రాజు, కపూర్‌తలకు చెందిన సిఖ్ఖు రాజులు సుందరమైన మసీదులను నిర్మించారు. వేరొకవైపు ఇదే భరత్‌పూర్‌లో మసీదులను అగౌరవపరిచనప్పుడు కల్లోలాలు చెలరేగాయి. మురాదాబాద్‌లోని 'పీర్‌గైబ్' వాడలో ఏ మస్జిద్ మరియు బావివద్ద 1995లో మతకలహాలు చెలరేగాయో, ఆ మసీదును ఒక హిందూ కట్టించాడు. (ఖౌమి ఆవాజ్ దినపత్రిక, 1995 మార్చి 15 లేఖలు) (తారీఖ్ కీ సచ్చాయియాఁ, పేజి 22)

## ధార్మిక వ్యత్యాసం కారణంగా ...

"రోమన్ క్యాథలిక్కు విశ్వాసాలు గలవారు, ప్రొటెస్టెంట్ క్రైస్తవుల ఎన్ని చర్చీలను ధ్వంసం చేయలేదు? జైనులు, బ్రాహ్మణులు, బౌద్ధులు పరస్పరం ఒకరి మందిరాలను, విగ్రహాలను వేరొకరు ఎలా నాశనం చేసుకున్నారో తెలిపే విషయాలతో చరిత్ర పుటలు నిండి ఉన్నాయి. ఇవన్నీ ధార్మిక వ్యతిరేకతల కారణంగా జరిగిన సంఘటనలే. కాశ్మీర్ మాజీ గవర్నరు జగ్‌మోహన్, తన గ్రంథంలో కాశ్మీర్ ప్రాచీన చరిత్రను వివరిస్తూ ఇలా తెలిపారు : "అశోక చక్రవర్తి గతించి అతని కుమారుడు సింహాసనాన్ని అధిష్ఠించినప్పుడు ఉత్తర భారతంలో హిందూయిజం బాగా శక్తిని పుంజుకున్నది. దాని ప్రభావంగానే బౌద్ధ విహారాలను పడగొట్టడం జరిగింది. శ్రీనగర్‌లో రెండు కొత్త మందిరాల నిర్మాణం జరిగింది. ఆ తరువాత "నానా" పేరుగల ఒక రాజు బౌద్ధుల వేలాది విహారాలను కాలబెట్టించాడు. బౌద్ధుల భూములు లాక్కొని బ్రాహ్మణులకివ్వడం జరిగింది."[13]

శంకరాచార్యుల ద్వారా విరగ్గొట్టబడిన విగ్రహాలు నేటికీ ఉన్నాయి. మరియు చరిత్ర పుటలు దీనికి సాక్ష్యంగా ఉన్నాయి. పండిట్ లేఖ్‌రాం ఆర్య ముసాఫిర్, తన గ్రంథం "కుల్లియాత్ ఆర్య ముసాఫిర్", పేజి 84–85లో శంకరాచార్యుల వారి ఇలాంటి అన్ని కార్యాలను వివరించారు. స్వామి దయానంద్ సరస్వతి తన గ్రంథమైన "సత్యార్థప్రకాశ్"లోని పదకొండవ అధ్యాయంలో శంకరాచార్యుల గురించి ఇలా వివరించారు :

"జైనులకు చెందిన, ఇప్పుడు బయటపడుతున్న విగ్రహాలన్నీ శంకరాచార్యుల కాలంలో విరగ్గొట్టబడినవే. ఇక విరగ్గొట్టబడక బయల్పడుతున్న విగ్రహాలు జైనులు భూమిలో పాతిపెట్టినవే." ఇప్పటికినీ అక్కడక్కడ భూమి నుండి జైన విగ్రహాలు బయటపడుతూనే ఉన్నాయి. (సత్యార్థ ప్రకాశ్, పండిట్ గోపదేవ్, అను. పేజి 249, అంబరామార్య సత్యార్థ ప్రకాశ్ ట్రస్ట్, సికింద్రాబాద్, 1999 తృతీయ ముద్రణ)

పై ఇద్దరు పండితుల వాంఙ్మాలాల ద్వారా శంకరాచార్యుల వారు ఎంత పెద్ద స్థాయిలో విగ్రహాల ధ్వంసానికి పాల్పడ్డారో నిరూపితమవుతుంది. విగ్రహాల్ని విరగ్గొట్టడంలోను, విగ్రహాల్ని పూజించే వారిని దేశ బహిష్కరణ చేయడంలోనూ ఈ భారతీయ రాజుల సామూహిక సహాయ సహకారాలు వారికి సంపూర్ణంగా ప్రాప్తమై ఉండేవి. కేవలం భూమిలో పాతిపెట్టబడిన విగ్రహాలే మిగిలిపోయాయి. మూర్తిపూజ (లేక విగ్రహారాధన)కు సంబంధించి ఈ పండితులు వెల్లడించిన అభిప్రాయాల్ని మేము ఉద్దేశ్యపూర్వకంగానే రాయడం లేదు. కాని విగ్రహాల్ని విరగ్గొట్టిన, మందిరాలను పడగొట్టిన సంఘటనలు లెక్కకు మించి ఉన్నాయి. ఇంకా స్వయంగా హిందువుల ద్వారానే జరిగాయి.

రాంనగర్ సంస్థానం, జిల్లా బారాబంకీకి మాజీ మేనేజర్ అయిన బాబు రాం నారాయణ్ ఇలా వ్రాశారు :

“ఎక్కడైనా ఒక విరగ్గొట్టబడిన విగ్రహం బయల్పడితే, అది ఔరంగజేబ్ ద్వారా విరగ్గొట్ట బడిందనడం సర్వసామాన్యమైపోయింది. కాని వాస్తవం ఇది కాదు. స్వామి శంకరాచార్యుల కాలంలో బౌద్ధ మరియు జైన ధర్మాలకు వ్యతిరేకంగా ఘర్షణలు జరిగేవి. ఆ కాలంనాటి బౌద్ధ మరియు జైన మతాలకు చెందిన వేలాది విరగ్గొట్టబడిన విగ్రహాలు నేటి కాలంలో అజ్ఞానం చేత హిందూ మందిరాలలో స్థాపితమై ఉండడం నా కళ్ళతో స్వయంగా నేను చూశాను.” [14]

లాల లజపత్ రాయ్, ‘భారతచరిత్ర’ అనే తన గ్రంథపు మొదటి భాగంలో ఇలా రాశారు :

“మహేందర్ వర్మాన్ వంశానికి చెందిన రాజు ప్రారంభంలో జైన మతావలంబికుడు, ఆ తరువాత శైవ మతాన్ని అవలంబించాడు. దక్షిణ అర్కాట్‌లో ఉన్నటువంటి జైనుల ప్రఖ్యాత మఠం పాటలీపుత్రను ధ్వంసం చేయించాడు.”

(తారీఖ్‌కీ సచ్చాయియాఁ, ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 21–23)

**చరిత్రలో ఆరాధనాలయాలను పడగొట్టిన సంఘటనలు :**

చరిత్ర పుటల్ని అధ్యయనం చేస్తే, మసీదులను, మఠాలను, మందిరాలను కూల్చివేసిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఎవరెవరిపై నిందమోపుదాం? ఎవరెవరు ఎవరెవరితో ప్రతీకారం తీర్చుకుంటారు? .... క్లుప్తంగా చెప్పవచ్చేదేమంటే, ఖుతుబుద్దీన్ అయిబక్ మొదలుకొని ఔరంగజేబ్ వరకు మరియు ఆ తరువాత కూడా మందిరాలకు భూముల్ని, జాగీర్లను ప్రసాదించిన రాజుల జాబిత సుదీర్ఘంగా ఉంది. అయితే హిందూ–ముస్లిం పరిపాలకులిద్దరూ కూడా ఆరాధనాలయాలను కూల్చి వేశారనేది కూడా నిరాకరించలేని సత్యం. యుద్ధ జ్వాలలు రగుల్కొన్నప్పుడు ఇదంతా జరిగింది, ప్రతి ధర్మం వారూ చేశారు.

మిస్టర్ భువనేశ్వరీ ప్రతాప్ ఒక వ్యాసంలో ఇలా రాశారు : "చివరి మౌర్య రాజుల కాలంలో బౌద్ధుల సర్వసంహారం మరియు వారి మందిరాలను పడగొట్టిన సంఘటనలు చరిత్రలో లెక్కకు మిక్కుటంగా ఉన్నాయి. గుప్త వంశపు చివరి రాజులు బౌద్ధుల్ని సంహరించారు, వారి మఠాలను పడగొట్టారు. నలందలోని విద్యా పీఠాన్ని, దాని గ్రంథాలయంతో సహా నిప్పంటించడం జరిగింది. బౌద్ధుల నామరూపాల్లేకుండా చేయడం జరిగింది. లెక్కలేనన్నిహిందూ మందిరాలు, బౌద్ధుల మఠాల్ని, మందిరాల్ని పడగొట్టి, నిర్మించడం జరిగింది. ఉదాహరణకు గయ (బిహార్ రాష్ట్రం)లోని మందిరం, బౌద్ధ మందిరాన్ని పడగొట్టి, నిర్మించడం జరిగింది." (Radiance, 1991, July 28)

ఔరంగజేబ్ కాలంలో 'సత్నామీలు' నర్నోలును దోచుకొని అక్కడి అన్ని మసీదుల్ని పడగొట్టారని జదూనాథ్ సర్కార్ పేర్కొన్నారు. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వా-3, పేజి 198). ఈ కాలంలోనే గుజరాత్‌లో కుమార్ భీమ్‌సింగ్ వంద మసీదులను ధ్వంసం చేయించాడు. (ఔరంగజేబ్-జహీరుద్దీన్ ఫారూఖి, పేజి 134). శివాజీ భీవండి మరియు షోలాపూర్‌లో మసీదులను నష్టపరిచాడు (జహీరుద్దీన్ ఫారూఖి).

ప్రఖ్యాత చరిత్రకారుడు ఖాఫిఖాన్‌ను అనుసరించి బహాదూర్ షా - 1 తరువాత జోద్‌పూర్ రాజు అయిన జస్వంత్ సింగ్ కుమారుడు అజీత్‌సింగ్ జోద్‌పూర్‌లో అనేక మసీదులను పడగొట్టించి, ఆ స్థలంలో మందిరాలను కట్టించాడు. (ముంతఖబుల్ లుబాబ్, వా-2, భా.4, పేజి 55)

1947లో ప్రభుత్వం బర్నీ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటి తన రిపోర్టులో కేవలం ఢిల్లీలోనే, చెడగొట్టో, పడగొట్టో ఆక్రమించుకున్న 176 మసీదులున్నట్లు తెలిపింది. 1979లో బెంగాల్ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ప్రకటన వెలువడింది. దాని ననుసరించి ఒక్క కలకత్తాలోనే 59 మసీదులు ఇతరుల ఆక్రమణలో ఉన్నాయి. డిల్లీ నుండి పాకిస్తాన్ సరిహద్దు వరకు చెడగొట్టి లేక పడగొట్టి ఆక్రమించుకున్న మసీదుల సంఖ్య తొమ్మిది వేల వరకుంది. (తారీఖ్ కీ సచ్చాయియాఀ-ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 26, 27).

మందిరాలను పడగొట్టిన సంఘటనలైతే చరిత్రల్లో మనకు తరచుగా చూపించబడతాయి. కాని మందిరాలకు, మఠాలకు, గురుద్వారాలకు ఔరంగజేబ్ ద్వారా ఇవ్వబడిన భూములు, ఇనాములు, జాగీర్ల వివరాలు అస్సలే తెలుపబడవు. జాగీర్లను ప్రసాదిస్తూ జారీచేసిన ఫర్మానాలు చరిత్రల్లో నుండి చెరిపేయడం జరిగింది. నేడు వాటిని ఎత్తి చూపితే 'నిజమా!' అంటూ విస్మయాన్ని కనబరిచే పరిస్థితిని సృష్టించడం జరిగింది. ఈ ఘనకార్యాన్ని ఆంగ్లేయులు ఒక ప్రత్యేక లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని, పథకం ప్రకారం సాధించగలిగారు. ఇటీవలనే ఈ కోవకే చెందిన రెండు వార్తలు పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. కాస్త లోతుగా ఆలోచించి చూడండి! ఇలాంటి సంఘటనలే గతంలో కూడా జరిగాయి, అయితే వాటినే ఆంగ్లేయులు ఉద్దేశపూర్వకంగా ఒక ప్రత్యేక రంగును పులిమి, హిందూ-ముస్లింల మధ్య వైషమ్యాల్ని సృష్టించడానికి వాడుకోవడం

ఎంత శోచనీయం, ఈవిధంగా గడిచిన ముస్లిం పాలకుల్ని హిందూసోదరుల దృష్టిలో నీచులుగా ప్రదర్శించి, తమ రాజకీయ పబ్బం గడుపుకున్నారు. వాటినే మనం నిజమనుకొని పరస్పరం కొట్టుకొని చస్తున్నాము. కేవలం రెండు వార్తల్ని పరిశీలించండి :

“1995 అక్టోబర్ 25 నాటి పత్రికల్లో ఒక వార్త వచ్చింది. బాగ్‌పత్ స్థానిక పోలీసు వర్గాల ననుసరించి ప్రభుత్వ భూములపై మూర్తుల (విగ్రహాల్ని) ప్రతిష్టించిన వారికి వ్యతిరేకంగా చర్య గైకొనబడుతుంది. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విజయ్ సింగ్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లకు ఒక ఆదేశాన్ని జారీచేస్తూ, “జూన్ ఒకటవ తేదీ తరువాత ప్రభుత్వ భూములపై విగ్రహాలను ప్రతిష్టించిన వారి జాబితాను సమర్పించాలని ... దీనివల్ల శాంతిభద్రతల పరిస్థితి చెడిపోయిందని, అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితిలో కూడా (దేవతా) విగ్రహాల్ని (మూర్తుల్ని) లేక బొమ్మల్ని (Statues) స్థాపితం చేయరాదనేది ప్రభుత్వం మరియు అడ్మినిస్ట్రేషన్ యొక్క స్పష్టమైన పాలసీ” అంటూ తెలిపారు. (ఖౌమి ఆవాజ్ దినపత్రిక, 1995 అక్టోబర్ 28, పేజి 5).

రెండవ వార్త ఇలా ఉంది :

“1995, అక్టోబర్ 31న (హిందుస్తాన్ టైమ్స్‌తో సహా) దాదాపు అన్ని దినపత్రికల్లో ఒక వార్త ప్రచురింపబడింది. “ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ సుభాష్ శర్మ, చంద్ర స్వామికి చెందిన ఆశ్రమాన్ని పడగొట్టడానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కట్టడం ఖుతుబ్ ఇన్‌స్టిట్యూషనల్ (18/19) పరిధిలో ఉంది. నిర్మూలించే ఆదేశాలైతే జారీ అయ్యాయని, ఢిల్లీ పోలీసు వారు బలగాల్ని సమకూర్చిన తరువాతనే కూలగొట్టే కార్యక్రమం ప్రారంభమవుతుందని ముఖ్యమంత్రి మదన్‌లాల్ ఖురానా తెలిపారు. (ఖౌమి ఆవాజ్, 1995 అక్టోబర్ 31). (తారీఖ్ కీ సచ్చాయియాఁ (చారిత్రక వాస్తవాలు) – రచన : ఖుర్షీద్ ముస్తఫా రజ్వి – పేజి 41, 42)

పై వార్తల్ని పరిశీలించినట్లయితే కొన్ని విషయాలు మనకు కొట్టవచ్చినట్లు కనబడతాయి. ఏ విషయాలకైతే మనం ఔరంగజేబ్‌ను, ఇతర ముస్లిం పాలకుల్ని నిందిస్తామో, కిరాతకులని వర్ణిస్తామో, మందిరాలను ధ్వంసం చేసినవానిగా, కొత్త మందిరాల నిర్మాణంపై ఆంక్షలు విధించిన వానిగా పేర్కొంటామో, అవన్నీ నేడు కూడా జరుగుతున్నాయని పై వార్తలు ధృవీకరిస్తున్నాయి. కాని నిర్మించ తలపెట్టినవారు, ఆంక్షలు విధించినవారు, అక్రమంగా నిర్మించినవారు, వాటిని పడగొట్టినవారు, ఇద్దరూ ఒకే ధార్మిక విశ్వాసాలు కలిగివున్నవారు గనక ఈ చర్యలు ధార్మిక పక్షపాతంతో కూడుకున్నవని ఏ ఒక్క వైపు నుండి కూడా నిరసన వెలువడడం జరుగలేదు. ఔరంగజేబ్ కాలంలో కూడా అక్రమంగా నిర్మించినవేవో, సక్రమంగా నిర్మించినవేవో, ఎందుకోసమని ఏ పరిస్థితుల్లో ఆంక్షలు విధించారో, ఎందుకోసమని పడగొట్టారో, అప్పటి వారికి బాగా తెలుసు కనుక వారీ విషయంలో ధార్మికపరంగా స్పందించలేదు. ఈ కారణంగానే ఔరంగజేబ్ కాలం నాటి ఏ ఒక్క ఇతిహాసికుడు, చరిత్రకారుడు కూడా, వారు హిందువులైనా ముస్లింలైనాసరే, దీన్ని ఆ పంథాలో పేర్కొనలేదు. ఔరంగజేబ్‌తో సన్నిహిత సంబంధాలు లేనివారు, అతని ఉద్యోగానికి, ఆస్థానానికి దూరంగా ఉన్నవారు, అతను మరణించిన తరువాత అతని చరిత్రల్ని

వ్రాసినవారు – ఇలా విభిన్న పరిస్థితుల్లో నుండి వచ్చిన ఏ ఒక్క చరిత్రకారుడు కూడా ఔరంగ జేబ్‌ను మందిరాలను ధ్వంసం చేసేవానిగా, హిందువుల్ని హింసించేవానిగా, బలవంతంగా మతం మార్పిడి చేయించినవాడిగా పేర్కొనలేదంటే, అతనిపై మోపిన ఈ నిందలన్నీ నిరాధార మైనవని, కల్పితమైనవని, దుర్బుద్ధితో ఒక ప్రత్యేక లక్ష్యసాధన కోసం, ఆ తరువాత చరిత్రల్లో జొప్పించబడినవేనని నిరూపితం కావడం లేదా? హిందూ ముస్లింలలో ఆ కాలం వరకున్న అన్యోన్యతను చెడగొట్టి, వీరిద్దరినీ శాశ్వతంగా దూరం చేయాలనే ఉద్దేశంతో వారు పన్నిన కుట్రలో నూటికి నూరు శాతం ఆంగ్లేయులు సఫలీకృతులు కాలేదా? ఆనాడు వారు ఏర్పరచిన అగాధం రోజు రోజుకు పెరిగిపోతూనే ఉంది తప్ప వీరిద్దరు దగ్గరికి వచ్చే సూచనలు కనబడు తున్నాయా? అదెలా సాధ్యం? ద్వేషం, శత్రుత్వాల కారణాలను సజీవంగా ఉంచి వీరిద్దరు దగ్గరికి వస్తారని ఆశించడం హాస్యాస్పదమైన విషయం. చరిత్రలో ద్వేషాల్ని రేకెత్తించే సమాచారం వున్నంత వరకు ఈ రెండు వర్గాల్లో అన్యోన్నత ఏర్పడుతుందని ఆశించనేలేము. అంతేకాకుండా వారిలో సోదరత్వ సంబంధాలూ ఏర్పడవు. పునాదిలోనే వక్రత ఉన్నప్పుడు నిజమైన, సిసలైన జాతీయ సమైక్యతను ఎలా ఆశించగలం? నిజమైన జాతీయ సమైక్యత కావాలనుకుంటే చరిత్ర ప్రక్షాళన అనివార్యం.

ఆంగ్లేయ చరిత్రకారులే కాకుండా, ఆంగ్లేయుల అభీష్టం మేరకు ఔరంగజేబ్‌ను అత్యంత దురుసుగా విమర్శించిన మన భారతీయ చరిత్రకారుడు జదూనాథ్ సర్కార్ అభిప్రాయాల్ని, దానిపై షిబ్లి అకాడమీ మాజి డైరెక్టర్ సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్ రహ్మాన్ పరిశోధనల్ని కూడా పరిశీలిద్దాం.

మందిరాలు, మఠాల కోసం ఔరంగజేబ్ పెద్ద సంఖ్యలో జారీచేసిన ఫర్మానాలు, శాసనాలు, సనద్‌లను పరిశీలించిన తరువాత, ఔరంగజేబ్ మందిరాల విధ్వంసకుడనే అపవాదు పటాపంచలవడమే గాక, అతను నిరంతరం మందిరాలకు ఆర్థిక సహాయం అందిస్తుండేవాడని, ఆ విధంగా హిందూ పూజారుల్ని తన సామ్రాజ్యం కలకాలం మనగలగాలని ప్రార్థించ అభ్యర్థించేవాడని నిరూపితమవుతుంది. దానాల్ని, జాగీర్లను, భూముల్ని ప్రసాదిస్తూ జారీచేసిన దస్తావేజులు దేశం నలువైపులా గొప్ప సంఖ్యలో వ్యాపించి ఉన్నాయి. వాటన్నిటిని జమచేసి, ప్రచురించగలిగితే అతను మందిరాల విధ్వంసకుడని, హిందూవ్యతిరేకి అని అతనిపై మోపబడిన నిందలు ఎంత నిరాధారమైనవో తెలియడమే కాకుండా, ఈ నిందలన్నీ తరువాత మోపబడినవని, మనో కల్పితమని, ఉద్దేశ్యపూర్వకంగా చేసినవని రుజువై పోతుంది. అతని కాలంలో కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లిందనడంలో సందేహం లేదు, ఉదాహరణకు యదూనాథ్ సర్కార్ ఇలా వ్రాశాడు:

“మహారాజా జస్వంత్ సింగ్ గతించిన తరువాత, మర్‌వార్‌లోని ప్రతి కుటుంబ నాయకుడు గర్వాహంకారాలతో తన నాయకత్వ కోరికను తీర్చుకోవడానికి అరాచకాన్ని,

విద్రోహాన్ని సృష్టించడానికి ప్రయత్నించాడు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే, అవరోధం కల్పించే వీరు, మొగలుల బలం మరియు ప్రభుత్వ శక్తి సామర్థ్యాల కారణంగా నిరంతరం అణిచివేయబడుతూనే ఉన్నారు. అయితే ఇప్పుడందులో ఒక కొత్త అంశాన్ని, విద్రోహాన్ని లేపి, మొగలుల సామ్రాజ్య పాలసీని విఫలం చేయడానికి బయలుదేరారు. ఈ కొత్త అంశం లేక ఫ్యాక్టర్ జస్వంత్ సింగ్ కుమారుడు అజీత్ సింగ్." (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - వా-3, పేజి 218).

ఈ అరాచకాన్ని, తిరుగుబాటును రూపుమాపడానికి ఔరంగజేబ్‌కు సైనిక చర్య గైకొనాల్సి వచ్చింది. ఈ ఘర్షణలో కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లింది. సైనిక చర్య గైకొన్నప్పుడు, యుద్ధాలు జరుగుతున్నప్పుడు అలా జరగడం అసహజమేమీ కాదు. కాని ఈ సైనిక చర్య రాజపుత్రుల జాతి నిర్మూలన కోసం జరుగలేదు. అరాచకాన్ని, తిరుగుబాటును లేపుతున్న వారికి వ్యతిరేకంగా మాత్రమే జరిగింది. ఇక ఎప్పుడైతే పరిస్థితులు అదుపులోకి వచ్చాయో, జస్వంత్ సింగ్ సోదర కుమారుడు ఇందర్ సింగ్ రాథోర్‌ను గద్దెపై కూర్చుండబెట్టి "రాజా" బిరుదును ప్రసాదించడం జరిగింది. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వా-3, పేజి 218). ఈ అరాచకాన్ని యదూనాథ్ సర్కార్ తిరుగుబాటుగానూ, అరాచకాన్ని లేపిన వారిని తిరుగుబాటుదార్లుగానే పేర్కొన్నారు. (వా-2, పేజి 337 - 351). రాజపుతానాలో చేపట్టబడిన ఈ సైనిక చర్యలో రాథోర్ మరియు హాడా వంశాలకు చెందిన రాజపుత్రులు, ఔరంగజేబ్ పక్షంలో అతని సైన్యంలో ఉన్నారని కూడా సర్కార్ అంగీకరించారు. (వా-3, పేజి 228). ఈ విద్రోహాన్ని పొడిగించడంలో భీంసింగ్ ప్రధాన సూత్రధారి. కాని సంధి ఏర్పడిన తరువాత ఔరంగజేబ్ మహారాణాకు రాజవస్త్రాల్ని పంపించాడు. ఇక భీంసింగ్ దర్బారులో హాజరైనప్పుడు, అతను అతని కుమారునితో పాటుగా, ఔరంగజేబ్ సైన్యంలో చేర్చుకోబడ్డాడు. (వా-3, పేజి 246)

మధురలో కూడా సైనిక చర్య సందర్భంలోనే కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లింది. ఆగ్రా, మధుర మరియు ఓద్‌కు చెందిన రైతులు శిస్తులు చెల్లించడంలో ఎప్పుడూ సాఫీగా మెదిలేవారు కారని, ప్రతిసారి ఒత్తిడి మరియు బలప్రయోగం చేయాల్సి వచ్చేదని యదూనాథ్ సర్కారే పేర్కొన్నారు.(వా-3, పేజి 193). వారి ఈ అరాచకాన్ని కూడా యదూనాథ్ సర్కార్ తిరుగుబాటుగానే వర్ణించారు. (వా-3, పేజి 194). దాన్ని అణిచే సందర్భంలో కొన్ని మందిరాలు కూల్చివేయబడ్డాయి. విద్రోహాలు, తిరుగుబాట్లు జరిగిన చోట్లలోనే, సైనిక చర్యలు చేపట్టిన సందర్భాల్లోనే మందిరాల నష్టం జరిగిందని అంగీకరిస్తే, ధార్మిక పక్షపాతానికి, ద్వేషానికి ఆస్కారమే ఉండదు. కాని తిరుగుబాట్లను మరుగుపరచి, మందిరాలను కూల్చి వేయడం వల్లనే తిరుగుబాట్లు చెలరేగాయనడం, చరిత్రను పెడత్రోవ పట్టించడం తప్ప ఇంకేమీ కాదు....

ఆరాధనాలయాల కూల్చివేతల సంఘటనల్ని చరిత్రలో విశేషంగా, ప్రత్యేకంగా పేర్కొని ధార్మిక వ్యతిరేకతలు లేపడం సమంజసం కాదు. ఇకిప్పుడు హిందువులు ఎన్ని మసీదులను

ధ్వంసం చేశారని చూపిస్తున్న ముస్లిం చరిత్రకారులు కూడా బయల్పడుతున్నారు. జహీరుద్దీన్ ఫారూఖీ గారి గ్రంథం “ఔరంగజేబ్ అండ్ హిజ్ టైమ్స్”లో మసీదుల కూల్చివేతలకు సంబంధించిన అనేక దృష్టాంతాలు లభిస్తాయి. (పేజి 114). కాని ఇకిప్పుడు ఇలాంటి వాదప్రతివాదాలు ఆపేయాల్సి ఉంటుంది. ఎందుకంటే స్వయంగా హిందువుల చరిత్ర ఈ విషయంలో తక్కువగా లేదు. వారు జైనుల, బౌద్ధుల ఎన్ని మఠాలను, మందిరాలను కూల్చి వేశారో, స్వయంగా వారిలోనే ఒక వర్గంవారు, వేరొక వర్గం వారి ఎన్ని మందిరాలను సమాప్తం చేశారో, 1947 తరువాత ఎన్ని మసీదులు కూల్చి వేయ బడ్డాయో వివరిస్తూ పోతే ఒక ఉద్గ్రంథమే అవుతుంది. కాని దానివల్ల కేవలం ద్వేషాన్ని పెంచుకోవడం తప్ప లాభించేదేమిటి? అయితే విచిత్రమేమిటంటే ఈ మందిరాల కూల్చివేతల్ని కేవలం ద్వేషం పెంచడానికే పేర్కొనడం జరుగుతున్నది ..... (ముస్లిం హుక్మరానోఁ కీ ..... పేజి 31-34).

‘జదూనాథ్ సర్కార్, ఔరంగజేబ్ చరిత్ర వ్రాసేటప్పుడు, అతని ప్రతి కార్యం ద్వారా అతన్ని సహనం లేని వాడుగా చూపించారు. అయితే జదూనాథ్ సర్కార్ తన చరిత్రలో అడుగడుగుకు ముస్లింలకు మరియు ఇస్లాంనకు వ్యతిరేకంగా, కొన్ని సందర్భాల్లో ఇస్లామ్‌కు వ్యతిరేకంగా ఇస్లామ్ వ్యతిరేకులు రాసిన రాతల్ని, ఖురాన్ ఆదేశాలైనట్లు, ఖురాన్ ఇలా ఆదేశిస్తున్నట్లు పేర్కొనడం సహనత్వం, నిష్పక్షపాతం అనిపించుకుంటుందా? ఖురాన్, హదీస్‌ను మరియు ఇస్లాం రాజకీయ దృష్టికోణాన్ని తెలుసుకోవడానికి దాని ప్రామాణిక ఆధారాలను అధ్యయనం చేయకుండా వాటిని పక్కకుపెట్టి, ఎవరో పాశ్చాత్యులు రాసిన గ్రంథాల్ని ఇస్లాం ప్రామాణిక గ్రంథాలైనట్లు పేర్కొనడం, వాటి నుండి రిఫరెన్సులు తీసుకొని, ఇస్లాం ఇలా ఆదేశిస్తుందనడం న్యాయపు ఏ కోవకు చెందిందో ఆయనకే తెలియాలి. ఇలా చేసి ఆయన పరమత సహనం గలవాడుగా, నిష్పక్షపాతి అయిన చరిత్రకారునిగా పేర్కొనబడతాడా? ఔరంగ జేబ్ సింహాసనాన్ని అధిష్టించి నిజంగానే హిందువుల మనసుల్ని నొప్పించాడని భావిస్తే, జదూనాథ్ సర్కార్ కూడా తన టేబిల్‌పైనే కూర్చుండి ముస్లింల మనసుల్ని గాయపరచ ప్రయత్నించా రనకుండా ఉండలేము..... ఆయన రాసిన ఈ చరిత్రలో మొదటి నుండి చివరి వరకు అడుగడు గునా ఎత్తిపొడుపు, తిరస్కారము, అవమానము మరియు ద్వేషాగ్నితో నిండి ఉంది. ఇలాంటి శైలి భారతదేశాన్ని ఒక సమైక్యజాతిగా మార్చడానికి ఎట్టి పరిస్థితిలోను దోహదకారి కాజాలదు.”

ఔరంగజేబ్ కాలంలో కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లింది. అందులో సందేహం లేదు. కాని వాటి వెనుక రాజకీయ మరియు సైనికపరమైన కారణాలున్నాయనేది కూడా నిరాకరించలేని సత్యం. జదూనాథ్ సర్కార్ ఇంకా ఇలాంటి చరిత్రకారులు నేడెంతగా స్పంది స్తున్నారో ఎంతగా దీన్ని ఉద్రేకపూరిత సమస్యగా మారుస్తున్నారో, ఎవరి కాలంలోనైతే ఈ సంఘటనలు జరిగాయో వారంతగా స్పందించలేదని, ఉద్రేకాలకు గురికాలేదన్నది గమనార్హం. ఉదాహరణకు, ‘ఊర్ఛా’లో బీర్‌సింగ్ దేవ్ నిర్మించిన మందిరాన్ని కూల్చివేసి, ఔరంగజేబ్ అక్కడ

మసీదును కట్టించాడు, బీర్‌సింగ్ దేవ్ అబుల్ ఫజల్‌ను చంపి, అతని వద్దనున్న ధనంతో కట్టించిన మందిరమే ఇది. బహుశ ఈ కారణంగానే కావచ్చు, ఆ కాలంనాటి హిందువులు దాన్ని ఆక్షేపించలేదు. అక్కడి పరిపాలకుడు రాజా దేవీ సింగ్ అందులో జోక్యం చేసుకోలేదు. దీన్ని యదూనాథ్ సర్కార్ కూడా అంగీకరించారు. కాని వేరే తరహాలో (వా-1, పేజి 15). మొగలుల పురోగమన సమయంలో హిందువులు మసీదులను పడగొట్టారు. జహంగీర్, షాజహాన్ కాలాల్లోనైతే గుజరాత్‌లో మసీదులను పడగొట్టి వాటిపై మందిరాలను నిర్మించారు. దీని వివరాలు కావాలనుకుంటే అబ్దుల్ హమీద్ లాహోరి రచించిన చరిత్ర "బాద్‌షానామ" వాల్యూం-2, పేజి 57లో చూడవచ్చు. ఔరంగజేబ్ కాలంలో సత్నామీలు నర్నోల్‌ను దోచుకొని అక్కడి మసీదులన్నిటిని కూల్చివేసారని స్వయంగా యదూనాథ్ సర్కారే రాశారు. (వా-3, పేజి 198)

శిఖ్ఖులు తమ పురోగమన కాలంలో ఎన్ని మసీదులను ధ్వంసం చేశారో తెలుపుతూ పోతే, పరస్పర అసహనాలు ఏర్పడతాయి. వారి కాలంలో మసీదులను అగౌరవపరచడం సర్వసామాన్యమైపోయింది. వాటిలో వారు అశ్వాలను కట్టేసేవారు. లాహోరులోని 'బాద్‌షాహి మసీదు' గదుల్ని వారు అశ్వశాలలుగా మార్చేశారు, వుజూ నీటి కొలనును అశ్వాల పేడవేసే స్థలంగా మార్చేశారు. (వివరాల కోసం సయ్యద్ అబుల్ హసన్ అలి నద్వి రాసిన 'సీరత్ సయ్యద్ అహ్మద్ షహీద్, 1929 ఎడిషన్ పేజి 129). కన్‌హయ్యలాల్ తన గ్రంథం "లాహోర్ చరిత్ర" (పేజి 143-146)లో ఇలా రాశారు : "మొగలు చక్రవర్తుల పరిపాలన ఉన్నప్పుడు ఈ మసీదు (అనగా బాద్‌షాహి మస్జిద్) విలువైన గాజు లాంతర్లతో, తివాచీలతో అలంకరించబడి ఉండేది. వాటి విలువ లక్షల్లో ఉండేది. కాని ఎప్పుడైతే కాలచక్రం తిరిగి సిఖ్ఖులు అధికారంలోకి వచ్చారో, ఈ మసీదు సైనికుల మరియు ఫిరంగీ పేల్చే ప్రవీణుల స్థావరంగా మారింది. మసీదులోని విశాలమైన హాళ్ళు, మందుగుండు కర్మాగారాలయ్యాయి. దాని ఆవరణలో అమర్చిన అత్యంత విలువైన రాళ్ళు, ఊడబీకి తీసుకెళ్ళారు. మస్తిగేటుకు సమీపంలోనుండే మసీదును తుపాకి మందు కొట్టుగా మార్చేశారు. అందుకే ఇది "బారూద్ ఖాన మసీదు" పేరుతో ఖ్యాతి గాంచింది. కన్‌హయ్యలాల్‌ను అనుసరించి సిఖ్ఖుల కాలంలో మసీదులను కూల్చివేయడం ఒక సామాన్య విషయమైపోయింది. వేలాది మసీదుల్ని సమాప్తం చేసి, వాటి స్థానంలో నివాసగృహాలు నిర్మించుకున్నారు. (లాహోర్ చరిత్ర - పేజి 135).

ఢిల్లీలోని స్వర్ణ మసీదును ధ్వంసం చేయాలని సిఖ్ఖులు కోరుకున్నారు. కాని అలా చేయలేకపోయినప్పుడు అక్కడ 'ఆది గ్రంథ్ సాహబ్' నుంచారు. మొత్తం మసీదులో ఆవుపేడ పూయించారు. మహారాజా రంజీత్ సింగ్‌తో ఫకీర్ అజీజుద్దీన్‌కు పరిచయముండేది. ఆయన విన్నపంపై మసీదునైతే తిరిగి అప్పగించారు, కాని దాని క్రింద దానికి సంబంధించిన దుకాణాల్ని గురుద్వారా ఆస్తిగా ఇచ్చేయడం జరిగింది. మసీదులో 'అజాన్' పిలుపు ఇచ్చే అనుమతి లేకుండేది. సిఖ్ఖుల పరిపాలనలో మసీదుల్లో ఎక్కడా కూడా 'అజాన్' పిలుపు ఇచ్చే అనుమతి లేకుండేది. (లాహోర్ చరిత్ర, కన్‌హయ్యలాల్, పేజి 150-151).

1947 తరువాత భారతదేశంలో ఎన్ని మసీదులను అగౌరవపరచడం జరిగిందో, కూల్చివేయడం జరిగిందో, అదో వ్యధాభరితమైన చరిత్ర. 1976లో ప్రభుత్వం 'బర్నీకమిటి' పేరుతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అది ఇచ్చిన రిపోర్టును అనుసరించి కేవలం ఒక్క ఢిల్లీలోనే దాదాపు (176) మసీదులతో ముస్లింలను వంచించడం జరిగింది. వాటిని ఎలా, ఎలా ఏవిధంగా మార్చడం జరిగిందో దాని వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలో పహాడ్ గంజ్ అంగడిలో ఎఱ్ఱటిరాళ్ళతో నిర్మించిన నాలుగు అంతస్తుల ఒక సువిశాలమైన మసీదు ఉండేది. దానిలోని ఒక పెద్ద భాగంలో "కామ్‌రాజ్ లాజ్" పేరుతో ఒక హోటల్‌ను తెరిచారు. ఢిల్లీలోని జామ మసీదు ఉత్తరంలో దరీబా ప్రాంతంలో "నవాబ్ సాహబ్ మసీదు" పేరుతో ప్రఖ్యాతి గాంచిన మసీదు ఉండేది. దీన్ని 1723లో నవాబ్ షర్ఫుద్దౌల నిర్మించాడు. దీని ఆవరణలో ముస్లిమేతరులు తమ కార్యాలయాల్ని, నివాస స్థలాల్ని ఏర్పాటు చేసుకున్నారు. తుర్క్‌మాన్ గేటు ప్రాంతంలో 'చందఘోసి' పేరుగల మసీదు ఉంది. దాన్ని ఒక ముస్లిమేతరుడు ఆక్రమించుకొని ఉన్నాడు. టౌన్‌హాల్ సమీపంలో 'కోచనట్వాల్' లోని ఒక మసీదును నివాసస్థలంగా మార్చుకోవడం జరిగింది. టైమ్స్ ఆఫ్ ఇండియా భవనం ముందు బహాదూర్ షా జఫర్ రోడ్డుపై ఉన్నటువంటి మసీదు శిలాఫలకాన్ని తీసేసి, దానిపై ప్లాస్టర్ చేయడం జరిగింది. పంజాబ్‌లోని లెక్కలేనన్ని మసీదుల్ని గురుద్వారాలుగానైనా మార్చుకోవడం జరిగింది, లేదా అందులో పాఠశాలలు నడుపుతున్నారు.

భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎన్ని మసీదులను ఈ విధంగా అగౌరవపరచడం జరిగిందో ఆ దేవునికే తెలియాలి. మన జదూనాథ్ సర్కార్ మరియు ఇంకా ఇలాంటి చరిత్రకారులలాగే, ఎవరైనా ఒక ముస్లిం చరిత్రకారుడు హిందువులు, సిఖ్ఖులు మసీదులను కూల్చివేస్తూ తమ ధార్మిక విధిని నెరవేర్చుకున్నారంటూ వ్రాస్తే, అది సమంజసమనిపించుకుంటుందా? (హిందుస్తాన్ కే ముస్లిం హుక్మురానోం కీ మజ్‌హబీ రవాదారి– సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్రహ్మాన్, వా.3. పేజి 139–144)

ఔరంగజేబ్ విగ్రహాల (దేవతామూర్తుల), మందిరాల విధ్వంసకుడు కాదు అనేదానికి అతను దక్కన్‌లో గడిపిన ఇరవై ఐదు సంవత్సరాల సుదీర్ఘకాలమే సాక్ష్యం. అతను మరణించి ఖననం చేయబడిన ప్రాంతానికి అతి సమీపంలోనే అజంతా, ఎల్లోరాకు చెందిన ప్రఖ్యాత మందిరాలున్నాయి. అయితే ఆ మందిరాలు, అక్కడి శిలా విగ్రహాలు, శిల్పకళా ఖండాలు నేటికీ చెక్కుచెదరకుండా అలాగే సురక్షితంగా ఉన్నాయి. ఆలంగీర్ దర్బారు చరిత్రకారుడు వీటిని కన్నులకింపు కలిగించే విహారస్థలంగా పేర్కొని ప్రశంసించాడు. (మాస్సర్ ఆలంగీరి – పేజి 167)

మందిరాల, మసీదుల కూల్చివేత లాంటి సున్నితమైన సమస్యపై తీక్షణంగా చర్చించి ఇక్కడి ప్రజల భావనా సమైక్యతకు విఘాతం కలిగించకూడదు. ఇది దేశాన్ని ప్రేమించే, దేశ శ్రేయస్సును కాంక్షించే చరిత్రకారుల పవిత్రమైన విధి, బాధ్యత. ఇందులో పోటీపడే, వాదప్రతి

వాదాలకు దిగే పరిస్థితే గనక ఏర్పడితే అది దేశానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. ఎందుకంటే ఈ విషయంలో భారత చరిత్ర అత్యంత కురూపంగా ఉంది. ఇక ప్రాచీన భారతచరిత్ర అయితే అసహనాలతో, పక్షపాతాలతో, హింసలతో నిండి ఉంది. ఉదాహరణకు అశోక చక్రవర్తి కాలంలో బౌద్ధ మతానికి మనదేశంలో గొప్ప ఆదరణ, పురోగమనం లభించింది. కాని అశోకుని చివరి వారసుణ్ణి చంపి, షుంగ్ వంశ పాలనకు పునాదివేసిన పుష్యమిత్రుడు, హిందూధర్మాన్ని పునరుద్ధరింపజేసే ప్రయత్నాల్లో భాగంగా, బౌద్ధుల మఠాలన్నిటిని కాల్చి నేలమట్టం చేసేశాడు. మగధ నుండి జలంధర్ వరకు కనిపించిన ప్రతి బౌద్ధ భిక్షువును నిస్సంకోచంగా హతమార్పించాడు. ఇక ఎప్పుడైతే కుషానుల పరిపాలన మొదలయిందో, కనిష్కుని ద్వారా బౌద్ధమతం తిరిగి పునరుద్ధరింపబడింది. కాని కుషానుల తరువాత గుప్త వంశ పరిపాలన మొదలయిన తరువాత బ్రాహ్మణిజం తిరిగి పునరుద్ధరింపబడ సాగింది. ఈ వంశానికే చెందిన ఒక రాజు 'రాజాసాంగ్' బెంగాల్‌ను పాలిస్తుండేవాడు. బౌద్ధమతమంటే అతనికి అత్యంత అసహ్యం. దాన్ని నామరూపాల్లేకుండా ఊడబెరకాలని నిరంతరం యోచిస్తూ ఉండేవాడు. బౌద్ధ గయలోని పవిత్ర 'బోధివృక్షాన్ని' పెకిలించి కాల్పించాడు. ఈ వృక్షం కిందనే బుద్ధుడు తీవ్ర తపస్సులు సలిపాడు. పాటలీపుత్రలో గౌతమబుద్ధుని పాద చిహ్నాలున్న రాయిని, ఈ సాంగ్ రాజే, ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేయించాడు. అతను బౌద్ధ విహారాలన్నింటిని సర్వనాశనం చేయించాడు. బౌద్ధ భిక్షువుల్ని తన రాజ్యపరిధిలో నిలువనీడలేకుండా చేశాడు." (వివరాల కోసం వి.ఎ.స్మిత్ రచించిన "ప్రాచీన భారత చరిత్ర"ను చూడండి).

"మౌర్య సామ్రాజ్య బ్రాహ్మణ సైన్యాధిపతి పుష్యమిత్ర శృంగ్, మౌర్యసామ్రాజ్య చివరి పాలకుడైన "బృహద్రత్"ను హతమార్చి, శృంగ్ వంశ పరిపాలనను స్థాపించాడు. బ్రాహ్మణధర్మం ఔన్నత్యం, పురోగమనాల కోసం అతను అనేక బౌద్ధ విహారాలను నాశనం చేసి, అందులోని అనేక మంది బౌద్ధభిక్షువులను హతమార్చాడు. అంతేకాకుండా ఎవరయితే తనకు ఒక శ్రమణ్ (బౌద్ధభిక్షువు) తలను నరికి తెచ్చి సమర్పిస్తాడో, వానికి వంద దీనారములు బహుమానంగా ఇవ్వబడతాయని ఆదేశాలు జారీచేశాడు." (దివ్యావదాన్, 25వ, 29వ అవధానం – సచ్చితానంద త్రిపాఠీ–శృంగ్ కాలీన్ భారత్–విశ్వవిద్యాలయ్ ప్రకాశన్, వారణాసి, 1967, పేజి 13) (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి – ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 18)

"బౌద్ధ ధర్మాన్ని హిందూరాజులు, బ్రాహ్మణులు ఎంతగా వ్యతిరేకించారు, దాని అనుయాయులపై ఎన్ని హింసా దౌర్జన్యాలకు పాల్పడ్డారంటే, ఎక్కడి నుండైతే ఈ ధర్మం ప్రారంభమయిందో, చివరకది అక్కడే అపరిచితంగా మారిపోయిందనేది చారిత్రక వాస్తవం. ఈ వాస్తవాల దృష్ట్యా, ముస్లిం పాలకుల ద్వారా మందిరాల విధ్వంసం గురించి వివరాలు తెలుపుతున్నప్పుడు ద్వేషోద్రేకాల్ని లేపే రచనలు చేసే జదూనాథ్ సర్కార్ ఇంకా ఇలాంటి చరిత్రకారులు, దీనివల్ల తాము దేశానికేమైనా సేవచేస్తున్నామా? దేశం పట్ల, దేశప్రజల పట్ల తాము విశ్వాసపాత్రులుగా, విధేయులుగానే ఉన్నామా? అనే విషయాన్ని ప్రశాంత హృదయంతో

ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మేము రాసిన పై పంక్తుల్లో కాస్త కాఠిన్యత, పరుషత్వం వచ్చిందంటే, ఔరంగజేబ్‌ను అటుంచి, స్వయంగా ఇస్లాంపై అనవసరమైన, అర్థరహితమైన, అహేతుకమైన తమ రచనలతో దాడులు జరిపిన జదూనాథ్ సర్కార్ ఇంకా ఆ కోవకు చెందిన కొందరు చరిత్రకారుల రచనలే దీనికి బాధ్యత వహిస్తాయి." (హిందుస్తాన్ కే ముస్లిం హుక్ మరానోఁ కీ మజ్‌హబి రవాదారి - సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్ రహ్మాన్ (భారత ముస్లిం పాలకుల పరమత సహనం) వా-3, పేజి 8, 9, 141-144)

వివిధ చరిత్రకారుల ద్వారా మందిరాల, మసీదుల, బౌద్ధవిహారాల కూల్చివేతకు సంబంధించిన సుదీర్ఘ వాంఙ్మూలాలు మీరు చదువుతూ వచ్చారు. ఈ విధంగా ప్రాచీన కాలం నుండే మన దేశంలో ఆరాధనాలయాల కూల్చివేతలు జరుగుతూ వచ్చాయనేది నిరాకరించలేని చారిత్రక సత్యం. అయితే ఆ తరువాత కాలంలో వచ్చిన చరిత్రల్లో, ప్రస్తుతం మనం చదువుతున్న చరిత్రల్లో ముస్లిం పాలకులే తమ పరిపాలనా కాలంలో హిందువుల మందిరాలను కూల్చివేశారని ముద్రపడిపోయింది. ప్రాథమిక తరగతుల్లో చదువుకునే విద్యార్థి సైతం, మందిరాల కూల్చివేత అనగానే ముస్లింల వైపు వేలెత్తి చూపుతాడు. ఆ విధంగా చరిత్రలు మలచబడ్డాయి, ఆ విధంగా వారి మనోమస్తిష్కాల్ని విషపూరితం చేయడం జరిగింది. దీనికో ప్రత్యేక కారణం ఉంది. ఇదో నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ప్రణాళిక. ఆంగ్లేయుల కాలంలో కావాలనే, ఉద్దేశపూర్వకంగానే దీనికి ముమ్మరమైన ప్రచారం జరిగింది. చారిత్రక గ్రంథాలు ఈ దృష్టికోణంతోనే రాయబడ్డాయి. ఇకిప్పుడు పిల్లలు పెద్దలు, పండితులు పామరులు, చదువుకున్నవారు అజ్ఞానులు, పల్లెవాసులుగాని నగరవాసులుగాని - చివరికి హిందూ ముస్లింలిద్దరూ కూడా ఇదే సత్యమైనట్లు, ఆకాశం నుండి అవతరించిన సాక్షాత్తు దైవవాణి అయినట్లు మారుమాట్లాడకుండా నమ్మేస్తున్నారు. ఎందుకంటే వారు విన్నది అదే, చదివిందదే. మనదేశంలో ప్రాచీన కాలం నుండి నేటి వరకు ఎన్ని బౌద్ధ విహారాలు, మఠాలు, మందిరాలు, మసీదులు కూల్చివేయబడ్డాయో మీరు పైన చదువుతూ వచ్చారు. అవేవో అనామకులు తెలిపిన విషయాలు కావు. ప్రామాణికమైన చరిత్ర గ్రంథాల్లో పదే పదే పునరావృతమైన వాస్తవిక విషయాలు. కాని వాటి గురించి ఎంతమందికి తెలుసు? పిల్లలు, విద్యార్థులను అటుంచండి. పెద్ద మనుషులనబడేవారు, పేరుగాంచిన రాజకీయ నాయకులు సైతం యథేచ్ఛగా, నిర్భయంగా, నిరాకరించలేని వాస్తవాలయినట్లుగా ప్రతిచోట, ప్రతి సభలో, ప్రతి సమావేశంలో ధారాళంగా ఒక రెఫరెన్సు అయినట్లుగా వాడుతున్నారు. ఇదెంతగా ప్రచారం పొందిందంటే, దీనికి వ్యతిరేకంగా ఏదైనా చెబితే చెప్పిన వానివైపు విచిత్రంగా, విస్మయంగా చూస్తారంటే వారి అమాయకత్వంపై నవ్వొస్తుంది. "ఔరంగజేబ్ హిందూ మందిరాలను కూల్చివేశాడు." ఇదొక్కటే వారికి తెలుసు. ఈ ఒక్క వాక్యమే వారి మనో మస్తిష్కాల్లో దిగబడిపోయింది. దానికి విరుద్ధంగా ఏది వినదలచుకోరు, దాని పూర్వపరాల గురించి అసలే విచారించనవసరం లేదు. భారతదేశ చరిత్రలో కేవలం ఒక్క ఔరంగజేబే హిందూ మందిరాలను కూల్చివేయించాడు. అంతే. అంతకు మించి వారికేం తెలియదు. తెలుసుకోదలచుకోలేదు కూడా. మందిరాల, ఆరాధనాలయాల విధ్వంసం, నష్టం, పడగొట్టడం గురించి ఎక్కడ, ఎప్పుడు

ఏ ప్రస్తావన వచ్చినా వెంటనే ఔరంగజేబ్‌ను కోట్ చేసేస్తారు. అంతే. మందిరాలను పడగొట్టిన పాపాత్ముడు అతనొక్కడే. అతనికంటే ముందుగాని, ఆ తరువాతగాని ఎవరు కూడా ఈ చర్యకు పాల్పడలేదు. సూర్యునితో చంద్రున్ని, రాత్రితో పగలును, దుఃఖంతో సంతోషాన్ని, ఎలా అనివార్యంగా కలుపుతామో, మందిరాల కూల్చివేత అనగానే ఔరంగజేబ్ పేరును జోడించడమే. ఆలస్యమేలేదు, ఆలోచనే లేదు, ఇదో పర్యాయపదంగా మారిపోయింది, ఇదో జాతీయం (Phrase) గా మారిపోయింది. మేము చెప్పేదానిపై విశ్వాసం రాకపోతే, ఏ సభలోనో, సమావేశంలోనో, అసెంబ్లీలోనో, పార్లమెంట్‌లోనో ఏ ప్రసంగీకుడైనా, ఏ రాజకీయ నాయకుడైనా సరే, మందిరాల కూల్చివేత గురించిన ప్రస్తావన రాగానే ఔరంగజేబ్ పేరును ఉచ్చరిస్తాడా లేదా? మీరే పరిశీలించి చూడండి. అంటే అతన్ని అంతగా అపకీర్తి పాల్జేశారన్నమాట. ఎందుకో మరి? అతనొక్కడే మందిరాలను కూల్చాడా? అతని కాలంలో మాత్రమే మందిరాలు, ఆరాధనా లయాలు, మఠాలు, విహారాలు కూల్చబడ్డాయా? చరిత్రమాత్రం అలా చెప్పడం లేదు. ఆరాధనా లయాల్ని కూల్చివేసిన వారెందరో ఉన్నారు. కాని వారి పేర్లు ఎవరికీ తెలియవు. ఎందుకని? మందిరాల విధ్వంసపు ప్రస్తావన వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ ఔరంగజేబ్ పేరునే ప్రస్తావిస్తారు ఎందుకని? అలా ముమ్మరంగా, బహుముఖంగా ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేయబడింది. ఎలెక్షన్లలో ప్రతివారు ఓటు, ఓటు, ఓటు అని ఎలా హోరెత్తిస్తారో, అలాగే ఔరంగజేబ్ - మందిరాల విధ్వంసం అని హోరెత్తించి, పిల్లలు పెద్దలు, స్త్రీలు పురుషులు, పండితులు పామరులు అందరి చెవుల్లో దూరిపోయేలా, ఈ పదం పదే పదే మార్మోగి పోయేలా ప్రచారం చేయడం జరిగింది. అందుకని ప్రతి ఒక్కరికి ఈ పదం ఎంతగా సుపరిచితం అయిపోయిందంటే, మీరు కేవలం ఔరంగజేబ్ అని ఊరుకుంటే చాలు, ఎదుటివారే మందిరాల విధ్వంసకు డనేస్తాడు. ఇంతగా విష ప్రచారానికి గురిఅయిన వ్యక్తి రూపాన్ని శుభ్రపరిచి, వాస్తవం అలా కాదు అని అతని వాస్తవ రూపాన్ని చూపించడంలో మేము కృతార్థులమవ గలుగుతామా?

కేవలం మందిరాలను కూల్చివేస్తూనే అతను జీవితమంతా గడిపాడా? తన రాజ్యాన్ని, రాజరికపు అధికారాల్ని కేవలం మందిరాల కూల్చివేతలకే వినియోగించాడా? మందిరాలను కూల్చివేయడం తప్ప అతనింకే పనిచేయలేదా? కేవలం మందిరాలనే పడగొడుతూ పోతుంటే, బహుళ సంఖ్యంలో, మెజారిటీలో ఉన్న హిందూ ప్రజలు, నాయకులు, రాజులు, అతని హిందూ సైన్యాధికారులు, సైనికులు ఊరికనే చూస్తూ ఉండిపోయేవారా? వీరందరిని అసంతృప్తపరిచి, వారి క్రోధాగ్నిని ఆహ్వానించి అతను యాభై ఏళ్ళు సుదీర్ఘంగా పరిపాలించ గలిగేవాడా? ఈ ప్రశ్నల గురించి ఆలోచించనవసరమే లేదా? అసలు ఆలోచించదలిచారా? అని. ఆంగ్లేయ ప్రభువులు మనకు చెప్పారు, రాసి ఇచ్చారు, అంతే. దాన్నే మనం వల్లిస్తున్నాం తప్ప అసలు చరిత్ర ఏమిటి? అనే ధ్యాస ఉంటేకదా! ఔరంగజేబ్ కాలంలో కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లిందనేది వాస్తవమని పైన మనం తెలుసుకుంటూనే వచ్చాము. దాని పూర్వపరాలేమిటి? దానికి కారణాలేమిటి? అనే విషయాలు కూడా తెలుసుకుంటూ వచ్చాము. అప్పుడు, అక్కడ ఆ పరిస్థితులే అలా ఏర్పడ్డాయి గనక కూల్చివేతలు జరిగాయని, ఈ విషయం ఆ కాలం

వారికి బాగా తెలుసు కనుకనే వారు దీనిపై స్పందించలేదని కూడా తెలుసుకున్నాము. ఈ మందిరాల కూల్చివేతలు ఒక్క ఔరంగజేబ్‌ కాలంలోనే కాదని, అంతకు ముందు ఆ తరువాత కూడా ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరిగాయని కూడా తెలుసుకున్నాము. వీటన్నిటిలో నుండి కేవలం ఔరంగజేబ్‌ కాలంలో జరిగిన కూల్చివేతల్నే ఎత్తి చూపడంలోని మర్మం ఏమిటి? ఔరంగజేబ్‌ అనగానే మందిరాలు కూల్చివేసేవానిగా దుష్ప్రచారం చేయడంలో గల ఉద్దేశమేమిటి? ఇది ఎప్పటి నుండి ప్రారంభమైంది? దీని వెనుక ఎవరి హస్తముంది? ఏ ఉద్దేశంతో వారు దీన్ని ప్రారంభించారు? ఈ ప్రశ్నలన్నిటికీ హేతుబద్ధమైన, సంతృప్తికలిగించే సమాధానాలున్నాయి. కాని దానికోసం నిష్పక్షమైన, న్యాయమైన, వాస్తవాలను అంగీకరించే దృష్టికోణముండాలి. ముందే మన మనోమస్తిష్కాల్లో నింపేసిన విషప్రచార ప్రభావాల్ని దూరపరచుకోవాలి. అప్పుడు నిర్మలమైన మనస్సుతో అధ్యయనం చేస్తే ప్రతిదీ ఉన్నదున్నట్లు మనకు కనబడుతుంది.

ప్రారంభంలో మేము పేర్కొన్నట్లు 1857 ప్రథమ స్వాతంత్ర సమర సమయంలో ఈ హిందూ ముస్లింలు కలసికట్టుగా, ఐకమత్యంతో పోరాడడం వల్ల, స్వాతంత్ర్యాన్నైతే సాధించు కోలేకపోయారు కాని, ఆంగ్లేయుల్ని మాత్రం భయభ్రాంతులకు గురిచేయగలిగారు. ఈస్ట్‌ ఇండియా కంపెనీ అయితే తుడిచిపెట్టుకునే పోయింది, ఇక సూర్యుడు అస్తమించని బ్రిటీష్‌ సామ్రాజ్యాన్ని, బ్రిటిష్‌ సింహాసనాన్ని కూడా మనవారు కదిలించివేశారు. దానివల్ల తీవ్రంగా ప్రభావితులైన బ్రిటిషర్లు (రిపిటేషన్‌ అవుతున్నందుకు క్షమించాలి) ఈ హిందూ ముస్లింలనే రెండు వర్గాల్ని శాశ్వతంగా విడదీయడానికి, పరస్పరం శత్రువులుగా మార్చడానికి బహురకాల పన్నాగాలు పన్నారు. అందులో భారత చరిత్ర- ప్రత్యేకించి ముస్లింల కాలపు చరిత్రను ప్రధానంగా ఎన్నుకొని దాని వక్రీకరణకు పూనుకున్నారు. ఔరంగజేబ్‌ను ముస్లింల ప్రతినిధిగాను, అతని పరిపాలనను ముస్లింల పాలనకు ప్రతీకగానూ చూపించి, ఔరంగజేబ్‌పై రకరకాల నిందల్ని మోపారు. గోరంతల్ని కొండంతలు చేసి, ఇంకా లేని అపవాదుల్ని జొప్పించి, అతన్ని పాపాల పుట్టగా నిలబెట్టారు. ఆనాటి నుండి మన హిందూ సోదరులు ఔరంగజేబ్‌ను అదే దృష్టితో చూడ అలవాటు పడ్డారు.

ఔరంగజేబ్‌ కాలంలో కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లినప్పటికీ, వాస్తవంగా అతను మందిరాల విధ్వంసకుడు కాదు, మందిరాల, పూజారుల, హిందువుల వ్యతిరేకి అంతకన్నా కాదు, అతను మందిరాల వ్యతిరేకి, మందిరాల విధ్వంసకుడే అయి ఉన్నట్లయితే, వందలాది మందిరాలకు, వాటి పూజారులకు భత్యాలు, పింఛనులు, ఇనాములు, జాగీర్లు, వక్ఫ్‌లు ఇచ్చివుండేవాడే కాదు. మందిరాలపై ద్వేషం ఉన్నవాడు అలాంటి సత్కర్మలు ఎన్నటికీ చేయడు. మందిరాలకు, పూజారులకు అతను జారీచేసిన ఫర్మానాలు, సనద్‌లు, పర్‌వానాలు కోకొల్లలుగా లభించాయంటే, అతనెంత విశాలదృష్టి గలవాడో తేటతెల్లమైపోయింది. వీటి వివరాలు తెలుసుకోదలిచిన వారు డాక్టర్‌ కాళికింకర్‌ దత్త రాసిన "Some Furmans, Sanads and Parwanas" ను చదివితే సంభ్రమాశ్చర్యాలకు గురిఅవుతారు. ఔరంగజేబ్‌ ఓ రాజు. పరిపాలకుడు, చక్రవర్తి అతన్ని ఎదురించిన వారిని, తిరుగబడినవారిని, విద్రోహాన్ని లేపిన

వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు. అతనొక్కడనే కాదు, ప్రతి రాజు, ప్రతి పరిపాలకుడూ అలాగే చేశాడు, ఇప్పుడు కూడా చేస్తున్నారు. తిరుగుబాటు సమయంలో, యుద్ధ సందర్భంలో కొన్ని మందిరాలకు నష్టం కూడా వాటిల్లింది. అయితే ఇది మత పక్షపాతంలో జరిగినది కాదు, కాని ఆంగ్లేయులు, ఆంగ్లేయ చరిత్రకారులు, ఆంగ్లేయుల్ని సంతృప్తపరచ దలచిన మన దేశీయ చరిత్రకారులు ఇలాంటి కూల్చివేతలు మత పక్షపాతంతో చేసినవే అంటూ బిగ్గర స్వరంతో ప్రచారం ప్రారంభించి మనల్ని నమ్మించడంలో సఫలీకృతులయ్యారు. కాని ఇదెంతమాత్రం వాస్తవం కాదు. ఔరంగజేబ్ మందిరాల ద్వేషి, మందిరాల విధ్వంసకుడే అయితే అవసరమైన చోట తానే స్వయంగా ప్రభుత్వ ఖర్చులతో మందిరాల్ని ఎలా కట్టించి ఇస్తాడు? వందల సంఖ్యలో మందిరాలకు, పూజారులకు ఇనాములు, జాగీర్లు, వక్ఫ్‌లు ఎలా మంజూరిచేస్తాడు? ఇవి రెండు పరస్పరం విరుద్ధమైన విషయాలు. మందిరాలను గౌరవించేవాడే, వాటిని అభిమానించేవాడే, వాటిని సంరక్షించదలచిన వాడే వాటికి జాగీర్లను, గ్రామాలను, ఇనాములనిచ్చి వాటి పటిష్ఠతను సుదృఢపరుస్తాడు. వివిధ మందిరాలకు, పూజారులకు ఔరంగజేబ్ జారీచేసిన ఇనాముల వివరాలు, మాకు లభ్యమైనంతవరకు, సేకరించి ఒక ప్రత్యేక అధ్యాయంగా పాఠకులకు సమర్పించాము.

అయితే ఇక్కడో సందేహం వచ్చే అవకాశముంది. ఔరంగజేబ్ మందిరాల విధ్వంసకుడు కాదు, మందిరాలకు జాగీర్లను, ఇనాములను జారీచేసిన విశాల హృదయుడు అని ఒక వైపు అంటూనే వేరొకవైపు అతని కాలంలో కొన్ని మందిరాలు కూల్చివేయబడ్డాయని అంటున్నారు. ఈ రెండింటిలో నిజమేది? అనే అనుమానం రావచ్చు. అయితే ఈ రెండు విషయాలు కూడా వాస్తవం, నిజం. ఔరంగజేబ్ హిందూవ్యతిరేకి కాదు, మత పక్షపాతం గలవాడు కాదు, తాను తన పూర్వీకుల్లాగే మతసామరస్యాన్ని కాపాడతానని, ఇంకా ఏ రాజైతే పరుల ధర్మంలో జోక్యం చేసుకుంటాడో అతను దైవద్రోహిగా పరిగణింపబడతాడని ఎలుగెత్తి చాటడమే కాక, లిఖిత పూర్వకంగా రాజపుత్రులకు ఒక నిషాన్ (రాజాజ్ఞ పత్రం) జారీచేశాడని లోపల ఎక్కడనో పేర్కొంటూ వచ్చాము. అంతేకాకుండా జీవితాంతం దానిపై ఆచరిస్తూ వచ్చాడు కూడా. అందుకే, అతని ఈ ప్రవర్తనను చూస్తున్న రాజపుత్రులు, ఇతర హిందూ నాయకులు, రాజులు చివరికంటూ అతన్ని వెన్నంటి ఉన్నారు. అతని కాలంలో కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లినప్పుడు ఈ రాజపుత్రులు, ఇతర హిందూ రాజులు చూస్తున్నారు, స్వయంగా వారు ఈ సైన్యంలో ఉన్నారు. అవి ఏ పరిస్థితుల్లో నష్టానికి గురిఅయ్యాయో వారు తమ కళ్ళారా చూశారు. అందుకని వారెలాంటి అభ్యంతరాన్ని వ్యక్తం చేయలేదు. అసంతృప్తి చెంది ఔరంగజేబ్‌కు తిరుగబడలేదు. ఈ నష్టం ధార్మికపరమైన కారణాలతో జరగలేదనేది వారికి బాగా తెలుసు. ఇంకా వారు నొచ్చుకున్నాగాని, కోపగించుకున్నాగాని, ఔరంగజేబ్‌పై కాదు. ధార్మిక స్థలాన్ని విద్రోహ కార్యకలాపాల కోసం, తిరుగుబాటు కేంద్రంగా మార్చుకున్న వారిపై వారు కోపగించుకున్నారు. ఆ పరిస్థితుల్లో దానికి నష్టం తప్పదు.

దీన్ని ఇంకా బాగా అర్థం చేసుకోవాలనుకుంటే నేడు మన కళ్ళముందు జరుగుతున్న సంఘటనల్ని పరిశీలిస్తే విషయం తేటతెల్లమైపోతుంది. కేవలం కొన్ని సంవత్సరాల క్రితం

సిఖ్ఖు తీవ్రవాదులు అమృత్‌సర్‌లోని స్వర్ణాలయాన్ని తమ స్థావరంగా మార్చుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక, విద్రోహకర కార్యకలాపాలకు పాల్పడినవారు, తీవ్రవాదులు పెద్ద సంఖ్యలో మారణాయుధాలను, మందుగుండు సామగ్రిని ఆలయంలో కూడబెట్టుకున్నారు. ఈ విధంగా వారు స్వర్ణాలయాన్ని తమ బంధీగా చేసుకున్నారు. ఎంత ప్రయత్నించినా, ఎన్ని సంధి ప్రయత్నాలు చేసినా సఫలం కానప్పుడు వారినణచడానికి భారత ప్రభుత్వం సైనిక చర్యను గైకొనవలసి వచ్చింది. ఈ ఘర్షణలో పెద్ద సంఖ్యలో తీవ్రవాదులే కాకుండా, సైనికదళ సభ్యుల్లో నుండి కూడా అనేకమంది అసువులు బాసారు. ఘోరంగా పోరాటం జరిగింది. అందులో అకాలితక్త్ ఘోరంగా నష్టపోయింది. దాని శిధిలాలను శుభ్రపరచడానికే ఎన్నో రోజులు పట్టాయి. ఇంకా వందలాది మంది రాత్రింబవళ్ళు పునర్నిర్మాణం పనుల్లో నిమగ్నమయ్యారు.

ఈ ఘోరాన్ని మనం మన కళ్ళతో చూశాము. ఏ పరిస్థితుల్లో ప్రభుత్వం సైనిక చర్యకు దిగాల్సి వచ్చిందో మనందరం చూశాముగనక ఎవరమూ నోరెత్తలేక పోయాము. ఇది సిఖ్ఖు ధర్మానికి వ్యతిరేకచర్య అని, మత పక్షపాతంతో కూడుకున్నదని, స్వర్ణాలయాన్ని ధ్వంసం చేయడానికే ఈ సైనిక చర్య గైకొనబడిందని ఏ ఒక్కవైపు నుండి కూడా వినిపించలేదే! దీనికి కారణం ఏమంటారు? పరిస్థితుల్ని మనం మన కళ్ళతో తిలకిస్తున్నాము. ఇందులో సైనిక దళాల లేక ప్రభుత్వం తప్పు ఏమీ లేదని, ఒక పవిత్ర స్థలాన్ని ప్రభుత్వ వ్యతిరేక, విద్రోహకర కార్యకలాపాలకు కేంద్రంగా, స్థావరంగా మార్చుకున్నవారిదే తప్పని, ధార్మిక స్థలంపై సైనిక చర్యకు ప్రభుత్వాన్ని వివశగా చేసినవారిదే తప్పని అందరూ అంగీకరించారు.

ఇంకొక సందర్భాన్ని తీసుకుందాం. కాశ్మీర్‌లోని ప్రఖ్యాతిగాంచిన హజ్రత్ బల్ దర్గాను తీవ్రవాదులు ఆక్రమించుకున్నారు. అమాయకులైన యాత్రికుల్ని, ప్రజల్ని బందీలుగా చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర ఎన్నో వర్గాల నుండి విజ్ఞప్తులు వచ్చినా వారు స్పందించ లేదు, తమ మంకును మానలేదు, బయటికి రాలేదు. చివరికి గత్యంతరం లేని పరిస్థితుల్లో భారతప్రభుత్వం సైనిక చర్యకు పూనుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం గత్యంతరం లేని అనివార్య పరిస్థితుల్లో ఈ సైనిక చర్యను గైకొనవలసివచ్చిందే తప్ప ధార్మిక పక్షపాతానికి దీనితో ఎలాంటి సంబంధం లేదని అందరికీ తెలుసుగనక ఆ విధంగా ఏ ఒక్కరూ ప్రభుత్వాన్ని విమర్శించలేదు.

కాశ్మీర్‌లోనే "చరారె షరీఫ్" అనే పవిత్ర స్థలంలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. అక్కడ కూడా ప్రభుత్వం సైనిక చర్య గైకొనడం తప్ప వేరే మార్గం లేకపోయింది. అయితే ఇక్కడ కూడా ధార్మిక పక్షపాతంతో సైనికులు లేక ప్రభుత్వం దాని విధ్వంసానికి పాల్పడలేదనేది మనందరికీ తెలుసు. అందుకని ధార్మిక విషయంగా ఏ ఒక్కరూ అలా వ్రాయనూ లేదు, చెప్పనూ లేదు.

ఔరంగజేబ్ కాలంలో కూడా అచ్చంగా ఇలాగే జరిగింది. విద్రోహులు, తిరుగుబాటు దార్లు ఆ ధార్మిక స్థలాల్ని తమ స్థావరాలుగా, కేంద్రాలుగా మార్చుకున్నారు. వారిపై సైనిక

చర్యను గైకొనడం తప్ప గత్యంతరం లేకపోయింది. ఆ కాలం నాటి రాజపుత్రులు, హిందువులు ఈ పరిస్థితిని గమనిస్తున్నారు. అందుకని ఏ ఒక్కరూ ఔరంగజేబ్‌ను దోషిగా పేర్కొనలేదు, దూషించలేదు. ఆ కాలం నాటి చరిత్రకారులు కూడా ఈ ముట్టడిని ధార్మికపరమైనదిగా పేర్కో లేదంటే, నేడు మనం మన కళ్ళతో చూస్తున్నట్లే, వారూ పరిస్థితుల్ని చూస్తున్నారు. అందుకని ధార్మిక పక్షపాతంగా పేర్కొనలేకపోయారు.

ఇది గడిచిన 150 సంవత్సరాల తరువాత వచ్చిన ఆంగ్లేయులు కావాలని, దుష్టబుద్ధితో, ఉద్దేశపూర్వకంగా ఇలాంటి సంఘటనలన్నిటినీ ఏరికోరి, హిందూ ముస్లింల పోరాటాలుగా, మతపక్షపాతంతో కూడుకున్నవిగా, ఈ విధ్వంసాలు మతద్వేషంతో చేసినవిగా నమ్మించసాగారు. వారి కుట్రను, దుర్బుద్ధిని, దురుద్దేశాల్ని తెలుసుకోలేని మనం భారతీయులం వాటిని నూటికి నూరుపాళ్ళు నిజమైనట్లు నమ్మి, సోదరులుగా ఉంటున్న మనం శత్రువులుగా, పగవారుగా మారిపోయాం. ఇలా ఏర్పడిన ఈ ద్వేషం, ఈ పగ, ఈ శతృత్వం దినదినం ప్రవర్ధమానమౌతుందే తప్ప, తగ్గిన లేక తగ్గుతున్న సూచనలు కనబడడం లేదు.

ఒక ఉదాహరణతో దీన్ని విశ్వేషించడానికి ప్రయత్నిద్దాం. ఒక శతాబ్దం లేక శతాబ్దన్నర తరువాత ఎవరైనా ఒక సిఖ్ఖు చరిత్రకారుడు, లేక ఒక ముస్లిం చరిత్రకారుడు వచ్చి శ్రీమతి ఇందిరా గాంధీ గారి హయాంలో, కాంగ్రెస్ పరిపాలనలో హిందువులంతా ఏకమై, అకారణంగా, అనవసరంగా మత పక్షపాతంతో అమృత్‌సర్‌లోని పవిత్ర స్వర్ణాలయాన్ని, కాశ్మీర్‌లోని హజ్రత్ బల్ దర్గాను, సైనిక బలంతో ధ్వంసం చేశారని రాస్తే ఇది సమంజసంగా ఉంటుందంటారా? అలా రాయడం న్యాయమేనంటారా? ఇది సమంజసం కాదు, న్యాయం కాదు అన్నప్పుడు ఔరంగజేబ్ కాలం నాటి మందిరాల కూల్చివేత సంఘటనల్ని నూటయాభై సంవత్సరాల తరువాత వచ్చిన ఆంగ్లేయ చరిత్రకారులు లేక జదూనాథ్ సర్కార్ లాంటి మన భారతీయ చరిత్రకారులు అలా వక్రీకరించి రాయడం ఎంతవరకు సమంజసం? ఎంతవరకు న్యాయం? ఇంకా వారేదో రాసి పోయారనుకోండి, కాని నేడు మనం వాటిని నూటికి నూరు శాతం నిజమైనట్లు, తిరుగులేని, నిరాకరించలేని సత్యమైనట్లు నమ్మడం ఎంత ఘోరమంటారు? నమ్మడమే కాదండీ, చరిత్రల్లో, కథల్లో, కథానికల్లో, సినిమాల్లో, నాటకాల్లో, సభల్లో, సమావేశాల్లో, అసెంబ్లీ పార్లమెంటుల్లో, విద్యాలయాలు, కాలేజీలు, యూనివర్శిటీల్లో - ప్రతిచోట దీన్ని విచ్చలవిడిగా పునరావృతం చేస్తున్నాం. రిఫరెన్సుగా ఇస్తున్నాం. తార్కాణంగా పేర్కొంటున్నాము. ఒకరినొకరు ద్వేషించుకోవ డానికి, కించపరచుకోవడానికి, అవహేళన చేసుకోవడానికి దాన్నే దృష్టాంతంగా చూపిస్తున్నాము. ఎదుటి వ్యతిరేకిని ఔరంగజేబ్‌తో పోల్చితేనే మన కడుపుమంట చల్లబడుతుందన్నట్లు, తిట్టడంలో, వ్యాఖ్యానించడంలో ఇక శిఖరాన్నందుకున్నట్లు ఫీలవుతున్నాము. ఇదెక్కడి విడ్డూరమండి? ఇది వివేకవంతుల న్యాయ, సత్యప్రియుల లక్షణమే అంటారా? అది తప్పో ఒప్పో తిరిగి చూసుకో వలసిన అవసరమే లేదంటారా? ఆంగ్లేయులు చెప్పిపోయిన పాఠాన్ని, బ్రిటిష్‌వారు వ్రాసి

ఇచ్చిపోయిన చరిత్రల్ని పునరావృతం చేసుకుంటూ, పునఃముద్రించుకుంటూ ఉండడం వరకే మనం నేర్చుకున్నాము. అంతకుమించి ఆ గురువుగారు మనకు నేర్పలేదుగా! పరిశీలన, పరిశోధన చేయడం మనకు సాధ్యమా? ప్రాచీన గ్రంధాలేవో, వారేం చేశారో పరిశీలించి ఎడిట్ చేసేంత ఓపిక మనకుందంటారా? ఈ యోగ్యతలు మన జాతిలో లేవని అంగీకరించడానికి మనసొప్పడం లేదు. ఎవరి సహాయ సహకారాలు లేకుండా అణుశక్తిని పరిశోధించి స్వాధీనం చేసుకున్న మనం, అగ్రరాజ్యాల గుత్తాధిపత్యం కింద ఉండి మనల్ని దగ్గరికి కూడా రానీయకపోతే స్వశక్తితో, స్వంత యోగ్యతలతో క్రయోజనిక్ లాంటి అత్యంత అధునాతనమైన ఇంజన్లను తయారు చేసుకున్న మనం, అగ్రరాజ్యాల వరకే పరిమితమైపోయిన ఖండాంతర క్షిపణుల్ని తయారు చేసుకోగలిగిన మనం, చంద్రయాన్ లాంటి అత్యంత సున్నితమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రణాళికల్ని రూపొందించుకున్న మనం – జాతిపరంగా అత్యంత కీలకమైన ఈ చారిత్రక అంశాన్ని పరిశోధించి వాస్తవాలేమిటో తెలుసుకోలేనంత అయోగ్యులమంటే మనసొప్పుకోవడం లేదు. అలాకాకపోతే, ఈ వాస్తవాల్ని బయటికి తీయడానికి, వాటిని అంగీకరించడానికి మనం సిద్ధంగా లేము. ఆంగ్లేయుల కాలం నుండి ఎలా వస్తున్నాయో, ఇకముందు కూడా చరిత్ర గ్రంథాలు అలాగే రావాలని, అవసరమైతే ఇంకొన్ని మసాలాలు అందులో కలిపి ఈ రెండు వర్గాల్ని ఇంకా దూరం చేయాలనే కోరిక ఉన్నట్లు ద్యోతకమవుతోంది. దాని ఫలితంగా ఈ రెండు పెద్ద వర్గాలు ద్వేషంతో నిండి మారణ కాండలు జరుపుకుంటే బహుశ మన కళ్ళు, హృదయాలు చల్లబతాయేమో! దీనివల్ల కొన్ని వర్గాలకు తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు చేకూరితే చేకూరవచ్చుగాని, దేశ సుదీర్ఘ ప్రయోజ నాల దృష్ట్యా, జాతి సమైక్యత దృష్ట్యా, ఈ అనాలోచిత క్రీడ అత్యంత ప్రమాదకరమైనది. జాతి సమైక్యత, అఖండత, పటిష్ఠతల దృష్టితో – దేశ రాజకీయ నాయకులు, పరిపాలకులు పట్టించు కోకపోయినా – కనీసం విజ్ఞానులు, విద్వాంసులు, దేశ జాతి ప్రేమికులు, శ్రేయోభిలాషులు ప్రత్యేకించి చరిత్రకారులు, చరిత్ర అధ్యాపకులైనా దీనిపై గాఢంగా ఆలోచించాల్సి ఉంది. ఎందుకంటే ఈ ద్వేషాలు, ఉద్రేకాలు, శతృత్వాలు పెరిగిపోతూనే ఉన్నాయి తప్ప తగ్గడం లేదు. ఒకే దేశంలో ఉంటున్న ఈ రెండు పెద్ద వర్గాల్ని ఇంకా దూరం చేయడం, ఇంకా శత్రువులుగా మారండని పురిగొల్పడం ఏ పరిణామాలకు దారితీస్తుందో విజ్ఞులు, మనసున్నవారు తప్పకుండా ఆలోచించాలి. దేశమంతా గుజరాత్‌లుగా మారడం మంచి దంటారా? అదే దేశానికి గర్వకారణమంటారా? దానితోనే దేశం, జాతి గట్టిపడుతుందంటారా? విజ్ఞులు, దూరాలోచన గలవారు దీనిపై తప్పకుండా స్పందిస్తారని ఆశిస్తున్నాము.

# 23. పరిపాలనా వ్యవహారాలు - సంస్కరణలు

ఔరంగజేబ్ గురించి ఇంత సుదీర్ఘంగా తెలుసుకుంటూ వచ్చిన తరువాత తేలిం దేమిటి? ఔరంగజేబ్ అతని వ్యతిరేకులు పేర్కొన్నంత చెడ్డవాడేం కాదు! ఇంతేనా? అతను చెడువ్యక్తి కాదు అనడంతోనే సరిపోతుందా? అతనిపై ఏర్పరిచిన మచ్చలు తొలగిపోవడమే అతనికో పెద్ద వరమా? ప్రశంసకాదు, దూషణల నుండి బయటపడడమే అతని అదృష్టంగా భావిద్దామా? ఔరంగజేబ్‌పై బురదజల్లిన అతని వ్యతిరేకులైన చరిత్రకారుల్ని ఒక విషయంలో ప్రశంసించకుండా ఉండలేము. ఔరంగజేబ్‌లోని లోపాలను, అతని చెడుల్ని, చేయని పాపాల్ని అతనికి అంటగట్టడంలో ఈ చరిత్రకారులు ఎంత ఉత్సాహం చూపారో, అతని సుగుణాల్ని, అతనిలోని మంచితనాన్ని, మానవత్వాన్ని ప్రశంసించడంలో కూడా వారు వెనుకంజవేయలేదు. కాకపోతే అతని లోపాల్ని, పాపాల్ని ఎంత బిగ్గర స్వరంలో వినిపించారంటే, అందులో అతని సుగుణాలు, మానవత్వం మరుగున పడిపోయాయి. అయితే ఇంతవరకు చదువుతూ వచ్చిన తరువాత, అతనిపై చల్లిన బురద కడగబడి, వాస్తవం బయటపడిన తరువాత, అతనిలోని సుగుణాల్ని, ప్రభుత్వం, పరిపాలనలో అతను ప్రవేశపెట్టిన సంస్కరణల్ని తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం.

**విజయాలు, సంస్కరణలు :**

మొగలుల పూర్వీకుడైన “తైమూర్” తన వారసుల్లో చూడదలిచిన ప్రప్రథమ యోగ్యత రాజ్యవిస్తరణ మరియు విజయాలే. ఈ ప్రాథమిక పరీక్షలో ఔరంగజేబ్ పరిపూర్ణంగా ఉత్తీర్ణుడయ్యాడనే చెప్పాలి. అతను అస్సాం మరియు టిబెట్‌లను తన రాజ్యపరిధిలోకి తేగలిగాడు. (ముంతఖబుల్ లుబాబ్- వా-2, భాగం 3, పేజి 173, 174) అక్బర్ కాలం నుండి షాజహాన్ వరకు కలలుగన్న దక్షిణ భారతమంతా మొగలు సామ్రాజ్యంలో చేరిపోయింది. క్లుప్తంగా చెప్పబోయేదేమంటే ఔరంగజేబ్ కాలంలో మొగలు సామ్రాజ్యం ఎంత సువిశాలమైపోయిందంటే, అంతకు పూర్వపు మొగలు చక్రవర్తుల కాలంలోగాని, లేక ఆ తరువాత నేటి వరకుగాని, అంత సువిశాల సామ్రాజ్యం భారత ఉపఖండంలో ఏర్పడి ఉండలేదు. అయితే విజయాల పరంపర ఒక్కటే ఘనతకాదు, అలా అనుకుంటే చంగీజ్‌ఖాన్, అలెగ్జాండర్ అంతకన్నా సువిశాలమైన భూభాగాల్ని జయించగలిగారు. అసలు చూడవలసిన విషయం పరిపాలనాపరమైన పటిష్ఠత, ప్రజల సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల యోగక్షేమాలకు సంబంధించిన సంస్కరణలు ఇత్యాది విషయాల్ని పరిశీలించాల్సి ఉంటుంది.

## 1. పన్నుల భారాన్ని తగ్గించడం :

ప్రజల్ని ఆర్థికపరంగా సంరక్షించడం, జాతి సమైక్యత మరియు అభివృద్ధి కోసం అనివార్యమైన అంశంగా గుర్తించబడుతుంది. ధనికులు, పేదల మధ్య ఉండే అగాధాన్ని పూడ్చడం లేక తగ్గించడం కూడా జాతి సమైక్యత కోసం అత్యవసరమైన విషయమే. ఈ ప్రాతి పదికనే నేటి ప్రజా ప్రభుత్వాలు కూడా దీనికోసం ప్రయత్నిస్తున్నాయి. పట్టాభిషిక్తుడైన తరువాత ఎలాంటి ఆర్థిక సమస్యలు ఔరంగజేబ్ ముందున్నాయంటే అతను కాక ఏ రాజైనా సరే వాటిని పరిష్కరిచడానికి ముందుగా ప్రజలపై వివిధ టాక్సుల భారం మోపక తప్పేది కాదు. కాని ఔరంగజేబ్ ప్రభుత్వ ఖజానాకన్నా ప్రజల యోగ క్షేమాలకే ప్రాధాన్యతనిచ్చాడు. ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొనేందుకు ప్రజల్ని పిండేబదులు రాజదర్బారు, రాజ పరివారపు ఖర్చుల్లో కోత విధించాడు. భోగవిలాసాల్లో, డాంబికం కోసం అనవసరంగా ఖర్చుచేయడానికి అతను ఇష్టపడలేదు. ఈ భోగవిలాసాలకు అతను కడు దూరంగా ఉండేవాడు. తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవ డానికి ప్రజలపై టాక్సులు వేయడానికి బదులు అనేక టాక్సుల్ని (పన్నుల్ని) ఎత్తివేశాడు. ఔరంగజేబ్‌కు ముందు వచ్చిపోయిన పాలకుల కాలంలో ప్రజలపై భూమిశిస్తే కాకుండా రకరకాల పన్నులు వేయబడేవి. అవన్నీ కలిపితే భూమిశిస్తుకు మించిపోయేవి. వాటి వివరాల్ని సమకాలీన చరిత్రకారులు ఇలా పేర్కొన్నారు : “ఉదాహరణకు చుంగీ, పాందరీ, సర్‌షుమారి, బర్ షుమారి, బద్‌గది, చరాయి, బంజారా, తూగానా, నజరానా, షుకురానా, ఉర్సు, జాతర, దినుసులు, ధాన్యాల కొనుగోలుపై వసూలుచేయబడే టాక్సులు - ఈ విధంగా దాదాపు 80 రకాల టాక్సులు (పన్నులు) ప్రజలపై మోపబడేవి. వీటిద్వారా కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమఅయ్యేవి. ఆలంగీర్ అధికారంలోకి రాగానే ఒక్క కలం పోటుతో ఈ టాక్సులన్నింటినీ ఎత్తివేయించాడు. ఈ టాక్సుల మాఫీ అమలు జరపడానికి వివిధ సూబాలకు గుర్జుదార్లు, అధికారులు పంపబడ్డారు ...... ” (1. ముంతఖబుల్ లుబాబ్- ఖాఫిఖాన్-వా. 2, భా. 3, పేజి 95 (2) మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి-పేజి 387)

## 2. భూమిశిస్తు మరియు భూమి బందోబస్తు చట్టము :

అక్బర్ చక్రవర్తి కాలంలో భూమిశిస్తు మొదలగు వాటికి సంబంధించి ఏ చట్టమైతే అమలులోకి తేబడిందో, అప్పటినుండి అదే కొనసాగుతూ వచ్చింది. దానిలో ఎలాంటి మార్పులు గాని, సవరణగాని జరుగలేదు. ఔరంగజేబ్ తన కాలంలో ఆ చట్టంలోని లొసుగుల్ని తొలగించి సముచిత సవరణలుచేసి, ఒక క్రొత్త చట్టాన్ని రూపొందించాడు. ఇది, దాని ఆంగ్లాను వాదంతో సహా ఏషియాటిక్ సొసైటి కలకత్తా వారి జనరల్‌లో ప్రచురింపబడింది కూడాను. కాని అది సుదీర్ఘమైనందున ఇక్కడ పొందుపరచలేకపోతున్నాము. కాని ఈ సవరణ వల్ల ప్రభుత్వ ఆదాయంలో ఎంత పెరుగుదల వచ్చిందంటే, అక్బర్ చక్రవర్తి మొదలుకొని అప్పటి వరకు

ఎన్నడూ ఇంత పెరుగుదల కనిపించలేదు. అక్బర్ మొదలుకొని ఔరంగజేబ్ వరకు వివిధ కాలాల్లో వచ్చిన పెరుగుదల ఈ విధంగా ఉంది [1]

| అక్బర్ | షాజహాన్ | ఔరంగజేబ్ |
|---|---|---|
| కోటితొంబది | రెండు కోట్ల ఇరవైఏడు | నాలుగు కోట్ల పౌండ్లు |
| లక్షల పౌండ్లు | లక్షల యాభైవేల పౌండ్లు | అనగా 60 కోట్ల రూపాయలు |

ఔరంగజేబ్ కాలంలో అతని రాజ్య పరిధిలో పెరిగిన ప్రాంతాలు గోల్కొండ, బీజాపూర్, అస్సాం, చిటగాంగ్ మరియు టిబెట్‌లు మాత్రమే. ఈ అన్ని ప్రాంతాల భూమిశిస్తు పదికోట్లకు మించిలేకుండేది. మిగిలిన పెరుగుదలను భూమిబందోబస్తు విధానంలో చేసిన సంస్కరణలు మరియు ప్రజల్లో వచ్చిన సమృద్ధే ముఖ్య కారణంగా పేర్కొనవచ్చు.

## 3. ఆస్తుల్ని జప్తు చేసుకునే ఆచారాన్ని మాన్పించడం :

ఆలంగీర్ కాలం వరకు ఒక చట్టం లేక ఆచారం అమలులో ఉండేది. ప్రభుత్వాధికారి లేక మన్సబుదారు లేక నాయకుడెవరైనా చనిపోతే, అతని మొత్తం ఆస్తిని ప్రభుత్వపరంగా జప్తు చేసుకొని ప్రభుత్వ ఖజానాలో జమ చేసుకోబడేది. నేటి కాలంలో ఇదో క్రూరచర్యగా అగుపించినా, ఆ కాలంలో అలా భావించబడకపోయేది. దానికి భిన్నంగా అందులో అనేక యుక్తులు గుప్తమై ఉండేవి. అయినాగాని ఈ ఆచారం అనేక చెడులకు, నిర్దయకు ప్రతీకగా నిలిచింది. ఆలంగీర్ ఈ ఆచారాన్ని లేక చట్టాన్నే తొలగించాడు. మాస్సర్ ఆలంగీరిలో ఇలా ఉంది :

"ఆలంగీర్‌కు ముందు (దర్బారు) నాయకులలో ఎవరైనా చనిపోతే, అతను ప్రభుత్వానికి ఎలాంటి బాకీ లేకపోయినాసరే, అతని వారసుల వద్ద నుండి మొత్తం ఆస్తి అత్యంత జాగ్రత్తగా జప్తు చేసుకోబడేది. ఈ చర్యవల్ల మృతుని మరణం వల్ల సంతాపానికి, దుఃఖానికి గురిఅయిన అతని వారసులు ఎంతగానో విచారానికి, వ్యాకులానికి, కష్టాలకు గురిఅయ్యేవారు. ప్రభువుల వారు ఈ నియమాన్ని తొలగించి, దేశ ప్రజలకు ఎంతో మేలును, మనశ్శాంతిని చేకూర్చారు."[2]

## 4. వార్తా విలేఖరి / సమాచార లేఖకుడు :

దేశం, దేశప్రజల స్థితిగతుల్ని తెలుసుకోవడానికి వార్తా లేఖనం మరియు సమాచార లేఖనం లాంటి శాఖను విస్తృతపరిచాడు. ఈ శాఖను సరిగ్గా నియంత్రించకపోతే, ఇంతకన్నా ప్రమాదకరమైందీ వేరొకటి ఉండదు. ప్రత్యేకించి వార్తావిలేఖరి లేక సమాచార లేఖకుడు స్వార్థపరుడు, లంచగొండి గనక అయివుంటే, దేశాన్ని నాశనం చేయడానికి ఇంతకు మించింది వేరొకటి ఉండబోదు. ఔరంగజేబ్ ఈ ప్రమాదాన్ని ఎరిగినవాడే గనక దీన్ని గట్టి నియంత్రణలో ఉంచగలిగాడు. ఒక లేఖలో ఈ విషయంగా తనే స్వయంగా ఇలా వ్రాశాడు :

"ఏదైనా ప్రాంతంలోని వార్తావిలేఖరి స్వప్రయోజనాల కోసం పాటుపడటం తమ ఇంటివారికి సహకరించడం, ఇంకా ధనాన్ని కూడబెడుతుండటం ... ఇలాంటివి కనుగొన్నప్పుడు

విశ్వాసపాత్రులైన వారు తమ అధికారికి (ఈ విషయంగా) వ్రాయాలి. ఇంకా ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పనుల గురించి సంపూర్ణంగా విచారణ చేయాలి, ఇంకా మా సన్నిధిలోకి పంపాలి. (ఫయ్యాజుల్ ఖవానీన్...ఔరంగజేబ్ పర్ ....షిబ్లి, పేజి 108.)

తన మనుమడైన మొయిజుద్దీన్‌కు, ఒక వార్తావిలేఖరి విషయంలో ఇలా వ్రాశాడు :

"ఒకవేళ వార్తావిలేఖరి పదవి (ఆ పదవికి అర్హతలేని వేరొక వ్యక్తికి అప్పగించబడిందని తెలిస్తే ఇక ఇప్పుడు అతను వార్తావిలేఖరిగా ఉండకూడదు."

వార్తా లేఖనం, సమాచార లేఖనం కారణంగా భారతదేశం లాంటి సువిశాల దేశంలోని మారుమూలన జరిగే సంఘటనలు కూడా ఔరంగజేబ్ దృష్టికి వచ్చేవి. ప్రజల నిజ పరిస్థితి ఏమిటి? వారి సాధకబాధకాలేమిటి? ఏ విషయంలో వారు బాధపడుతున్నారు? ఏ విషయంలో వారు సుఖశాంతులు అనుభవిస్తున్నారు? ఇత్యాది విషయాలు ఔరంగజేబ్‌కు ఎంతగా తెలిసివుండేవో, ఆ కాలం నాటి ఏ ఇతర ప్రభుత్వాలు దీనికి సాటిరావంటే దీనికి కారణం అదే వార్తా / సమాచార లేఖన వ్యవస్థ. అతను వ్రాసిన లేఖల్ని చదివితే, ఒక్కొక్క గవర్నరు, రాకుమారుడు, ప్రభుత్వాధికారి వల్ల జరిగిన ఒక్కొక్క తప్పిదాన్ని పట్టుకుంటూ వార్తాలేఖకుని రెఫరెన్స్ ఇచ్చేవాడు. వేలమైళ్ళ దూరంలో ఒక బాటసారికి లేక ఒక వర్తకునికి వాటిల్లిన నష్టం వెంటనే అతనికి తెలిసిపోయేది. ఫలితంగా సంబంధిత అధికారిని, గవర్నరును నిలదీసేవాడు, సంజాయిషీ అడిగేవాడు. బల్ఖ్, బదఖ్షాం (అఫ్గానిస్తాన్ సుదూర ప్రాంతాలు) ఎక్కడ? ఢిల్లీ ఎక్కడ? అక్కడో చిన్న సంఘటన జరిగినా ఢిల్లీలో ఉండే చక్రవర్తికి తెలిసిపోయే దంటే, అతనీ వ్యవస్థను ఎంత పటిష్ఠంగా ఉంచుకున్నాడో అవలీలగా ఊహించుకోవచ్చు.

"ఆలంగీర్ పాదుషాల వారి సమాచార సేకరణ వ్యవస్థ ఎంత పకడ్బందీగా, ఎంత అద్భుతంగా ఉండేదంటే సైన్యంలోని ప్రతి చిన్న, పెద్ద సంఘటన ఇట్టే ఆయనగారికి వెంటనే తెలిసిపోయేది. రాకుమారులకు, నాయకులకు సంబంధించిన అనేక విషయాలు ఆయనకు తెలిసిపోతుండేవి. కాని పాదుషాల వారు తమకు తెలియనట్లే వ్యవహరించేవారు. ఆయనగారి స్వభావంలో క్షమ, ఓర్పు, సహనాలు మిక్కుటంగా ఉండటమే దీనికి కారణం. కావున నాయ కులు (సేనానులు) రాకుమారులు అత్యధిక దూర ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాల్లోగాని, లేక స్వయంగా చక్రవర్తి వెంట సైనిక సంఘర్షణలోగాని అత్యధిక కోటలు కోటాధిపతులకు పెద్ద పెద్ద రొఖ్ఖాలిచ్చి స్వాధీనపరచుకునేవారు. అయితే ఒక విషయం ఇక్కడ వివరించడం అవసరమనుకుంటున్నాం. ఇలాంటి రహస్య వ్యవహారాలు ఎప్పుడు నడుపబడేవంటే, రాజ్య దళాలు తీవ్రమైన, కఠినమైన ముట్టడి జరిపి కోటలోని వారిని అత్యంతగా వివశుల్ని, నిస్సహా యుల్ని చేసి ఇక లాభం లేదు, గత్యంతరం లేదు అనే పరిస్థితి ఏర్పడినప్పుడే ఇలాంటి సంఘటనలు జరిగేవి. అలాంటి పరిస్థితుల్లో కోటాధిపతులు డబ్బులు తీసుకుని కోట తాళాలు అప్పగించేవారు. (బహుశా రక్తపాతాన్ని తగ్గించడమే దీని లక్ష్యమై ఉండేదేమో-రచయిత). ఇలాంటి వ్యవహారాలు రహస్యంగా, అత్యంత జాగ్రత్తగా (ఎవరికీ తెలియకుండా) జరిగిపోయేవి. అయితే రాజుగారి

సమాచార సేకరణ (లేక గూఢచార) వ్యవస్థ ఎంత పటిష్ఠంగా ఉండేదంటే, ఏ నాయకుడు ఎంత సొమ్ము ఇచ్చారనే దాని వివరాలతో సహా సకాలంలో ఇవన్నీ ఆయనగారికి తెలిసిపోయేది. కాని చక్రవర్తుల వారు మాత్రం చూసీచూడనట్లు, తమకు తెలియదన్నట్లు వ్యవహరించేవారు. ఇంకా ఏ నాయకుడు ఎంత సొమ్మును వెచ్చించాడో అంత సొమ్మును ఏదో ఒక నెపంతో, ఏదో ఒక రూపంలో అతనికి చేరేటట్లు ఏర్పాటు చేసేవారు. (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్, వా.2, భా.3, పేజి 439, 440)

## 5. ప్రభుత్వ అన్ని వ్యవహారాలపై గట్టిపట్టు :

ఔరంగజేబ్ పరిపాలనలోని విచిత్రమైన విషయం ప్రతి చిన్న , పెద్ద వ్యవహారంపై అతనికి గట్టి పట్టు ఉండేది. ఒకవైపు మనోమస్తిష్కాల్ని సైతం స్థంభింపచేసే గొప్ప గొప్ప వ్యవహారాల్లో తలమునకలై ఉంటూనే, ప్రతి చిన్న విషయం గురించి అవగాహన కలిగి ఉండేవాడు. ఆ చిన్న విషయాల్ని కూడా అంతే ఏకాగ్రతతో, దీక్షతో చూసేవాడు. ఔరంగజేబ్ విమర్శకుల్లో అల్ఫిన్స్టన్ అత్యంత దురుసైన విమర్శకుడుగా వినుతికెక్కాడు. అయితే అతను కూడా ఇలా వ్రాయకుండా ఉండలేకపోయాడు :

"అతను తానే స్వయంగా, ఒంటరిగా ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోని ప్రతి చిన్న అంశాన్ని పూర్తి ఏకాగ్రతతో పరిశీలించేవాడు, సైనిక సమీకరణ వ్యూహాల్ని ఆలోచించేవాడు. సైనిక చర్యల సందర్భంలో సముచిత ఆదేశాలు జారీచేసేవాడు, కోటల ముట్టడి సందర్భంలో సైనికాధికారులు కోటల ఉనికిని, పటాల్ని పంపుతూ ముట్టడికి సముచిత ప్రదేశాల నిర్ధారణ కోసం అతనికి పంపించేవారు, అతను రాసిన ఉత్తరాల్లో పఠాన్ల దేశంలోని సమాంతర ప్రదేశాల్లో రోడ్ల నిర్మాణం, ముల్తాన్ మరియు ఆగ్రా విద్రోహుల్ని అణచే వ్యూహాలు, ఖందహార్‌ను తిరిగి రాబట్టుకునే తంత్రాలు ఇత్యాది ఎన్నో విషయాలున్నాయి. ఇదే సమయంలో దక్కన్‌లో ముందుకు సాగుతున్న ఓ చిన్న సైనిక పటాలం కానివ్వండి, లేక దానికి కావలసిన అవసరాల వ్యవహారం కానివ్వండి, సముచిత ఆదేశాలు స్వయంగా తన చేత్తో రాసి, జారీచేయని సందర్భాలు చాలా తక్కువ. ఒక జిల్లాలో భూమిశిస్తు వసూలుచేసే చిన్న అధికారి నియామకంగాని, లేక ఏదైనా శాఖలో ఒక గుమాస్తా ఎంపికగాని తన అంతస్తుకు తగని విషయమంటూ నిర్లక్ష్యం చేసేవాడు కాదు. ఇంకా ప్రభుత్వాధికారుల పనితనాన్ని గూఢచారుల ద్వారా, వచ్చిపోయే వారి ద్వారా తెలుసుకుంటూ, విశ్వసనీయమైన తన సమాచారం ఆధారంగా వారిని హెచ్చరిస్తూ, జాగరూకులై, అప్రమత్తంగా ఉండేటట్లు వ్యవహరించేవాడు. చిన్న చిన్న విషయాలపై కూడా అంతగా శ్రద్ధ చూపడం అనేది అత్యంత జాగరూకత మరియు మానసిక మెలకువకు తార్కాణం. పనితనంలో నిజమైన పెరుగుదల కోసం, చిన్న చిన్న అంశాలపై శ్రద్ధను కేంద్రీకరించడం అంతమంచి విషయమేమీ కాదు, కాని చిన్న చిన్న అంశాలపై శ్రద్ధను కనబరిచినట్లే, రాజ్యానికి సంబంధించిన మహోన్నత కార్యాలపై సమస్యలపై, కూడా అదే శ్రద్ధ, అదే నిపుణత, అదే చురుకుదనాన్ని ప్రదర్శించడం ఔరంగజేబ్ వ్యక్తిత్వంలోని ప్రత్యేకత. దీనివల్ల తన పనిపట్ల

అతనిలో గల ఉద్యుక్తత, ఉత్సాహం, పట్టుదల – ఎల్లప్పటికీ అత్యంత ఆశ్చర్యకరమైన, వింతైన విషయంగా భావించబడుతుంది." – (*భారత చరిత్ర – రచన : అల్‌ఫిన్‌స్టన్ – పేజి 1119, 1120 .... (ఔరంగజేబ్ పర్ .... షిబ్లి, పేజి 110)*

## 6. సారా సేవనం, నృత్యగానాల్ని నిషేధించడం, దర్బారు భట్రాజుల్ని తీసివేయడం

"మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించుటకు గాను, సారా కొట్లన్నింటినీ మూసివేయడానికి ఆదేశించాడు. దర్బారులో ఉండే నృత్య వాయిద్యగాళ్ళను ఆ వృత్తి మానుకునేటట్లు ప్రమాణం చేయించాడు. ఇంకా భుక్తికోసం వారికి మన్సబులను కేటాయించాడు. ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాడు.

రాజుల దర్బారులో కవులు, వందిమాగధులు ఉండటం అనాదిగా వస్తున్న ఆచారం. వారు రాజుగారిని తమ ప్రశంసలు, పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేసేవారు. ఉన్నవి లేనివి కల్పించి రాజును పొగడ్తలతో ముంచెయ్యడమే కాకుండా అతన్ని దైవాంశసంభూతునిగా నిరూపించడమే వారి విధి, బాధ్యత, కర్తవ్యం. ఔరంగజేబ్ వీరందరినీ తీసేసి వేరే పనుల్లో నిమగ్నం చేశాడు. (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్, వా.2, భా.3, పేజి 195, 196.

## 7. లంచాల నివారణ :

అధికారులు, ఉద్యోగులు అత్యధికంగా లంచాలు తింటారని మన ప్రాచ్య ప్రభుత్వాలు అపకీర్తి పాలయ్యాయి. రాజులకు కానుకలు, నజరానాలు సమర్పించే ఆచారం ఈ లంచాలు తినడానికి, లంచాలు పెరిగిపోవడానికి ఒక ప్రధాన కారణంగా మారింది. దర్బారుకు లేక ఆస్థానానికి సంబంధించిన మంత్రులు, నాయకులు, సైనికాధికారులు, ఉద్యోగులు రాజుగారి పట్టాభిషేకం లేక ఇతర సందర్భాల్లో, ఉత్సవాల్లో రాజుగారికి అత్యంత విలువైన కానుకల్ని సమర్పించుకునేవారు. ఈ కానుకలు ఎంత విలువైనవిగా ఉండేవంటే వారి సంవత్సర జీతమంతా కూడా దాదాపుగా దీనికోసమే హరించుకుపోయేది. వారు తమ ఈ నష్టాన్ని పూడ్చు కోవడానికి ప్రజల నుండి లంచాలు వసూలు చేసుకునేవారు. జహంగీర్ తన స్వీయ చరిత్ర అయిన 'తుజుకె జహాంగీరి'లో ఈ కానుకల్ని, నజరానాల్ని అత్యంత ఉల్లాస ఉత్సాహంతో పేర్కొంటాడు. ఒక్కొక్క కానుకను వివరంగా పేర్కొంటాడు. కొన్ని సందర్భాల్లో ఈ నజరానాల, కానుకల సంఖ్య కోటికి మించిపోయింది. దీనికి బదులుగా రాజుగారు కూడా లెక్కలేనన్ని ఇనాములు, బక్షిష్‌లు ఇచ్చేవాడు. అయినా దాని విలువ ఈ నజరానాలకు, కానుకలకు సమానం కాకపోతుండేది. అదీగాక ఈ కానుకలు నగదు రూపంలో కాకుండా విలువైన వస్తు రూపేణా సమర్పించుకోబడేవి. అందుకని కోరినంత డబ్బు వెచ్చించి వాటిని కొనాల్సి వచ్చేది. మొత్తానికి ఇదో చెడు ఆచారంగా మారింది. దీనివల్ల అనేక దౌష్ట్యాలు చోటుచేసుకునేవి. ఆలంగీర్ 1677లో రాజుగారికి కానుకలు సమర్పించుకునే ఈ ఆచారాన్ని నిలిపివేశాడు. మాస్సర్ ఆలంగీరిలో ఇలా ఉంది :

"(నౌరోజ్) ఉత్సవం నిలిపివేయబడుతుందని, ముఖ్య నాయకుని కానుకను తిరిగి ఇచ్చేయమని, అదేవిధంగా మిగిలిన నాయకులు కూడా కానుకలు / నజరానాలు సమర్పించకూడదని బక్షిఉల్ ముల్క్ సఫీ ఖాన్‌ను ఆదేశించడం జరిగింది." *(మాస్సర్ ఆలంగీరి – ముస్తఅద్ కాన్ సాఖి – పేజి 111)*

## 8. రాజుగారి దర్శనం పద్ధతిని నిషేధించడం :

దర్శనం పద్ధతి అనగా కొందరు పెందలకడనే రాజుగారిని దర్శించుకోవడానికి వచ్చేవారు. వారు రాజుగారిని దర్శించుకోనిదే, ఏమీ తిని, త్రాగేవారు కాదు. ఔరంగజేబ్ ఈ పద్ధతిని 1669లో కఠినంగా నిషేధించాడు.[3] కాని ఎవరైనా తమ విన్నపాన్ని విన్నవించ దలచుకుంటే, అర్జీని త్రాడుకు కట్టి పైకి పంపించడానికి అనుమతించాడు.[4]

## 9. రాజును ఆరాధించే / పూజించే పద్ధతిని నిషేధించడం :

మొగలు పాలకులు వ్యక్తిగత పరిపాలనకు మంచి నిదర్శనంగా నిలిచినప్పటికీ రాజుగారి ఆరాధనే పరిపాలనా వ్యవస్థకు ప్రతీకగా ఉండేది. రాజు మానవాతీతమైన ఉనికి కలిగినవాడు, అతను దైవనీడ కాదు, దైవానికి ప్రతీక. అక్బర్ చక్రవర్తిని దర్శించుకోవడం ఒక ఆరాధన లాంటిది. ప్రతి రోజు ఉదయమే ఒక గొప్ప సమూహము ఈ ఆరాధనను పాటించేది. దర్బారులో రాజును సాష్టాంగపడి వినమ్రతను తెలుపుకునేవారు. షాజహాన్ ఈ సాష్టాంగ ప్రణామాన్ని మాన్పించి, శిరస్సును భూమికి తాకే ప్రణామాన్ని పరిచయం చేశాడు. అయితే ఇది కూడా దాదాపుగా సాష్టాంగ ప్రణామాన్ని మరిపించేది. ఔరంగజేబ్ దీన్ని కూడా నిషేధించి నమస్కారానికి సామాన్య ప్రతినమస్కారం చేయాలని ఆదేశించాడు. (మాసిరె ఆలంగీరి, పేజి 65) రాజుగారి ఆహార పానీయాలు, దుస్తులు, షికార్లు, ప్రయాణాలపై లక్షలు, కోట్లు ఖర్చయ్యేవి. ప్రపంచంలోని రాజాధి రాజుది ఇది జన్మ హక్కుగా గుర్తించబడేది. రాజుగారితో ఎవరైనాసరే, ఆరాధనా, దాస్యత పద్ధతిలో కాకుండా సూటిగా మాట్లాడడం, విన్నవించుకోవడం చేయలేకపోయేవాడు. క్లుప్తంగా చెప్పవచ్చేదేమంటే, ఆకాశంలో నిజమైన దైవం ఉంటే ఉండొచ్చుగాని, ఈ నేలపై, ఈ భూమిపై మాత్రం రాజే దేవుడై ఉండేవాడు. ఈ కారణంగానే మొగలుల పూర్వీకుడు తైమూర్ "ఆకాశంలో ఒకే దైవం ఉన్నట్లు, భూమిపై కూడా ఒకే పరిపాలకుడుండాలి" అంటుండేవాడట. కాని ఈ పద్ధతి ఇస్లామీయ బోధనలకు పూర్తిగా విరుద్ధం. ఇస్లాం సర్వమానవ సమానత్వాన్ని ప్రతిపాదించింది. దీని ననుసరించి రాజు పాలితులు, ధనికుడు పేదవాడు, ఉన్నతుడు నిమ్నుడు- అందరూ సమానులే. మానవ సంతతి రీత్యా అందరూ సమానస్థాయి కలవారే.

తైమూర్ మొదలుకొని షాజహాన్ వరకు దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతూ వచ్చిన ఈ పద్ధతిని ఔరంగజేబ్ పూర్తిగా నామరూపాల్లేకుండా సమాప్తమైతే చేయలేకపోయాడు, కాని రాజుగారికి దైవత్వాన్ని ఆపాదించే ప్రక్రియల్ని ఆపడానికి శాయశక్తులా కృషిచేశాడు.

## 10. రాజ వైభవాల్ని రూపుమాపటం :

దర్బారులో రాజవైభవాల్ని ప్రదర్శించడానికి బాగా ఆడంబరాలు జరిగేవి. ఈ ఆడంబరం కోసం ఎంతో డబ్బు దుబారా చేయబడేది. ఔరంగజేబ్ వాటన్నిటినీ మాన్పించాడు. రాజదర్పం, ఠీవి ఉట్టిపడాలని రాజోద్యోగులకు / మున్షీలకు / సెక్రటరీలకు వ్రాయడానికి వెండి సిరాబుడ్లు సరఫరా చేయబడేవి. వాటిని మాన్పించి, ఔరంగజేబ్ వాటి స్థానంలో పింగాణి సిరాబుడ్లు సరఫరా చేయించాడు. ఇనాముల కోసం డబ్బును వెండి పళ్ళాల్లో తెచ్చేవారు. దానికి బదులు కెడాల్లో తేవడానికి ఆజ్ఞాపించాడు. విలువైన ధవళ రాజవస్త్రాలు ప్రసాదించడం ఆపేయడం జరిగింది. వెండి, బంగారాలతో చేసిన దీపాలు, అగరు కుంపటి, ధూపార్తుల్ని నిషేధించి సామాన్య (పింగాణిలాంటి) వాటిని వాడాలని ఆదేశించాడు. బంగారం, వెండి తీగలతో నేయబడే రాజ వస్త్రాల కార్ఖానాలను మూయించాడు. దానికి బదులు పట్టు, శిల్కు వస్త్రాల్ని వాడాలని ఆదేశించారు. రాజమహలులో వెండి, బంగారాలతో నేయబడిన (తలుపులకు వేలాడే కర్టెన్) తెరలకు బదులు ఇతర కర్టెన్‌లు వాడాలని ఆదేశించాడు.[5]

## 11. రాజుగారి జేబు ఖర్చు (స్వంత ఖర్చు)లో తగ్గింపు :

గడిచిన పాలకుల కాలంలో రాజుగారి స్వంత ఖర్చుల కోసం కోట్లరూపాయల రాబడి గలిగిన ప్రాంతాలు ప్రత్యేకించబడేవి. తద్వారా రాజుగారి ఖర్చులు పూర్తయ్యేవి. ఆలంగీర్ మాత్రం తన స్వంత ఖర్చుల కోసం, తన కష్టార్జితాన్నే వినియోగించుకునేవాడు. తీరిక సమయాల్లో టోపీలు కుట్టి, ఖురాన్ ప్రతులు వ్రాసి దాని రాబడితో తన ఖర్చులు వెళ్ళ దీసుకునేవాడు. ప్రభుత్వ ధనాగారాన్ని ప్రజల అమానతుగా భావించేవాడు. అందులో నుండి చిల్లిగవ్వ ముట్టుకునేవాడు కాదు.

## 12. న్యాయం, సమానత్వం :

ఆలంగీర్ పరిపాలనా కాలంలో అన్నిటికి మించి ప్రముఖంగా పేర్కొనదగిన విషయం న్యాయం మరియు సమానత్వం. న్యాయ నిర్ణయంలో, స్వచ్ఛమైన తీర్పు ఇవ్వడంలో తన పర, పేద ధనిక, మిత్రులు శత్రువులు, రాకుమారులు సామాన్యులు - ఎవరైనా సరే అంద రినీ న్యాయ వ్యవహారంలో ఒకే వరుసలో నిలబెట్టేవాడు. న్యాయ విషయంలో రాకుమారుల్ని కూడా సామాన్యులతో సమానంగా చూస్తానని ఆలంగీర్ తాను స్వయంగా రాసిన ఒక లేఖలో పేర్కొ న్నాడు. ఇది తనను తాను పొగడుకోవడం కోసం కాదు, పరులు సైతం ఈ విషయాన్ని అంగీక రించారు. తన పుస్తకంలో లేన్‌పోల్ ఇలా వ్రాశాడు :

"ఓవంగ్టన్ చెప్పేదానికి స్వతహాగా ఎలాంటి ప్రామాణికత లేకపోయినప్పటికీ, ఎవరి వాంఙ్మూలాల ఆధారంగా అతనీ అభిప్రాయానికి వచ్చాడో, వారికి ఔరంగజేబ్ పట్ల రవ్వంత కూడా అభిమానం లేదు, అంటే ఈ అభిప్రాయాన్ని వ్యక్తపరచినవారు ముంబాయి మరియు సూరత్‌కు చెందిన వ్యాపారులు. (వారి వాంఙ్మూలాల ఆధారంగా) అతననే దేమిటంటే మొగలు చక్రవర్తి న్యాయానికి మహా సముద్రం లాంటివాడు. స్వచ్ఛమైన, సిసలైన న్యాయంతో కూడిన

తీర్పునిస్తాడు. దీనికి కారణం ఏమిటంటే చక్రవర్తి సన్నిధిలో సిఫారసుకు గాని, నాయకుల జోక్యానికిగాని, హోదాల ఉన్నతత్వానికిగాని ఎలాంటి స్థానం లేదు. దీనికి భిన్నంగా పెద్ద పెద్ద దర్బారు నాయకుల వాదాన్ని అతను ఎంత ఉత్సాహంతో, ఉద్యుక్తతతో వింటాడో, అతి సామాన్య మనిషి మాటను కూడా అతను అదేవిధంగా ఆలకిస్తాడు. 1695లో దక్కన్‌లో ఔరంగజేబ్‌ను చూసిన డాక్టర్ క్రేరీ కూడా అతని ఇవే గుణగణాలను వర్ణించాడు.[6]

ఒక సందర్భంలో లేన్‌పోల్ ఇలా వ్రాశాడు :

"ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా పర్యాటకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, లేక అతని నడవడిక పట్ల వారి అసంతృప్తి, కేవలం అతను రాకుమారునిగా ఉన్న కాలం వరకే. ఇక ఎప్పుడైతే అతను చక్రవర్తి అయి పరిపాలించడం ప్రారంభించాడో, పర్యాటకులు అతన్ని ప్రశంసించడం, పొగడడం తప్ప ఇంకేమీ రాయలేదు. సుదీర్ఘమైన అతని యాభై ఏళ్ళ పరిపాలనా కాలంలో ఒక్కటంటే ఒక్క క్రూర సంఘటన కూడా అతని ద్వారా జరిగినట్లు ఎక్కడా నిరూపితం కాలేదు. చివరికి, అతని ధార్మికత్వపు అంశమైన హిందువుల్ని బాధించడం (అంటే జిజ్‌యాను ప్రతిపాదించడం) తప్ప, ఏ ఒక్కరినీ సంహరించడంగాని, శారీరకంగా హింసించడం గాని జరుగలేదని అందరూ అంగీకరిస్తారు."[7]

వైభవోపేతాలు, రాజభోగాలు, సుఖసౌఖ్యాలకు బదులు ప్రజల సేవా సంక్షేమం, వారి అభ్యున్నతే ఔరంగజేబ్ తన జీవిత లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు. అత్యంత వృద్ధాప్యం వచ్చేంతవరకు కూడా అతను దర్బారులో నిలబడి ప్రజల అర్జీలను స్వీకరించేవాడు.

అన్నివేళల విధి నిర్వహణ కోసం ఉద్యుక్తుడై ఉండేవాడు. రోజుకు రెండు మూడుసార్లు దర్బారు పెట్టనిదే ఒక్కరోజు గడవలేదు. ఎంత చిన్న స్థాయికి చెందిన మనిషైనా సరే, తాను స్వయంగా అతని విన్నపాన్ని ఆలకించనంత వరకు అతనికి తృప్తి కలిగేది కాదు.[8]

డాక్టర్ క్రేరి డెబ్భైఎనిమిది సంవత్సరాల వృద్ధాప్యంలో ఔరంగజేబ్‌ను చూశాడు. అతనిలా వ్రాశాడు:

"అతను మరకలేని తెల్లటి, పలుచటి నూలు వస్త్రాల్లో, వృద్ధాప్యంలో పట్టుకునే కర్ర ఆధారంగా నాయకుల సమూహంలో నిలబడి ఉన్నాడు. అతని తలపాగాలో ఒక పెద్ద మరకతము (వజ్రము) ముక్క కట్టబడిఉంది. న్యాయం కోరేవారి అర్జీలను తాను స్వయంగా స్వీకరించి కళ్ళద్దాలు లేకుండానే వాటిని చదివి స్వహస్తాలతో వాటిపై రాసి, సంతకాలు చేస్తూ పోతున్నాడు. ప్రసన్నమైన అతని ముఖ కవళికలతో తన ఈ నిమగ్నత వల్ల అతను సంతృప్తుడవుతున్నాడనే విషయం ప్రస్ఫుటంగా కనబడుతున్నది."[9]

## 13. విద్యాభివృద్ధికి కృషి :

విద్యను అభివృద్ధి పరచడంలోను, విద్యాలయాలు, పాఠశాలల్ని ఏర్పాటు చేయడంలోను ఔరంగజేబ్ కాలంలో ఎంత కృషి జరిగిందో, ఏ కాలంలోనూ అంతగా జరిగి ఉండలేదు. ప్రతి పట్టణంలోను, చిన్న పల్లెల్లో సైతం అధ్యాపకులకు, పండితులకు, విజ్ఞానులకు పెన్షన్లు, దినసరి

భత్యాలు జారీ చేయబడ్డాయి. ఫలితంగా వారు తమ భుక్తిపట్ల నిశ్చింతులై ఏకాగ్రతతో విద్యా బోధనలో నిమగ్నమయ్యేవారు. దీనితో పాటుగానే అన్ని చోట్ల విద్యార్థులకు భత్యాలు ఒసంగబడేవి. మాసిరె ఆలంగీరిలో ఇలా ఉంది : "దేశంలోని ప్రతి పట్టణంలో, ప్రతి గ్రామంలో అధ్యాపకుల కోసం భత్యాలు నిర్ణయించబడ్డాయి. పండితులకు, విజ్ఞానులకు దినసరి భత్యాలు, జాగీర్లు కేటాయించబడ్డాయి. విద్యార్థుల ఖర్చుల కోసం, భుక్తి కోసం తగిన ఏర్పాట్లు జరిగాయి."[10]

"హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు" అనే తన హిందీ పుస్తకంలో అఖ్‌లేష్ జైస్వాల్ ఇలా వ్రాశారు : "1906 ఏప్రిల్ 14న లఖ్నోలోని టౌన్ హాల్‌లో వివిధ రాజుల ద్వారా జారీ చేయబడిన ఫర్మాన్ల ప్రదర్శన జరిగింది. వాటిలో సగానికి పైగా ఔరంగజేబ్ ద్వారా జారీచేయ బడినవే ఉన్నాయి. ఇక ఈ ఫర్మాన్లు ఎవరిపేరనైతే జారీ చేయబడ్డాయో వారు ప్రఖ్యాతిగాంచిన వారూ కాదు, రికమండేషను, సిఫారసు చేయగలిగిన స్థాయి కలిగినవారూ కాదు. వారు సామాన్యులు, ఇంకా రాజదర్బారు నుండి వేల కోసుల దూరంలో నివసిస్తుండేవారు. అయిన ప్పటికీ వారి విన్నపాలు రాజదర్బారుకు చేరుతుండేవి, ఇంకా వారికి సంపూర్ణ సహాయం అందించబడేది. ఇలాంటి వారిలో సగానికి పైగా హిందువులే ఉన్నారు – దీనికి కారణం ఏమిటంటే, ఆ కాలంలో ప్రతిచోట చౌకీలు (కేంద్రాలు) ఏర్పడి ఉండేవి. అక్కడ వార్తా విలేఖరులు ఉంటుండేవారు. వీరు వార్తల్ని, సమాచారాన్ని, సిఫారసులను, విన్నపాలను రాజదర్బారు వరకు చేరవేసేవారు. అక్కడి నుండి జాగీర్లు, పెన్షన్లు, ఇనాం రూపంలో భూములు మొదలగునవి ప్రసాదించబడేవి" (పేజి 24).

ఒకసారి బనారస్‌లో "నద్వతుల్ ఉలమా" విశ్వవిద్యాలయం తరఫున విద్యావిషయిక ప్రదర్శన (ఎడ్యుకేషనల్ ఎగ్జిబిషన్) ఏర్పాటు చేయబడింది. అందులో మొగలు చక్రవర్తుల ద్వారా జారీచేయబడిన ఫర్మాన్ల ప్రదర్శన జరిగింది. వాటిలో మూడింట రెండువంతుల ఫర్మాన్లు ఔరంగజేబ్ జారీ చేసినవే. వీటిలో అత్యధికం ఎవరో ఒక పండితునికో, అధ్యాపకునికో, విజ్ఞానికో భుక్తికోసం, ఆర్థిక సహాయం కోసం జాగీర్ల రూపంలో, పింఛన్ల రూపంలో జారీచేసినవే. (ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్–అల్లామా షిబ్లి నొమాని, పేజి 117)

## 14. చెడు ఆచారాల్ని రూపుమాపడం

అనాథలు, దిక్కులేని పేద పిల్లల్ని పట్టుకొని ఖాజసరా (హిజరా–నపుంసకులు)గా మార్చి వారి జీవితాల్ని బుగ్గిపాలుచేసే దౌర్జన్యకారుల ముఠాను వెదికి పట్టుకొని బేడీలు వేసి రాజుగారి దర్బారుకు పంపాలని ఇంకా ఇక ముందు ఏ ఒక్కరూ కూడా ఈ దుష్టచర్యకు పాల్పడకుండా గట్టి నిఘా ఉంచాలని అలహాబాద్, అవధ్ సూబేదారులకు రాజఫర్మానా జారీ చేయబడింది.[11]

## 15. ప్రజోపయోగ కార్యాలు :

ప్రజల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని దేశమంతటిలో వసతి గృహాలు (Guest Houses), వర్తక బిడారాలు ఆగే సత్రాలు, ధర్మశాలలు నిర్మించబడ్డాయి. కరువులు ఏర్పడి

నప్పుడు పేదలకు ఉచితంగా సరఫరాచేసే ఉద్దేశంతో అత్యధిక జిల్లాల్లో ధాన్యపు గిడ్డంగుల్ని ఏర్పాటు చేయడం జరిగింది. (మాసిరె ఆలంగీరి-ముస్తఅద్ ఖాన్ సాఖి, పేజి 386)

## 16. ప్రభుత్వ వసూళ్ళలో దయ, కనికరాలు

ప్రజలతో డైరెక్ట్‌గా సంబంధాలుండే అనగా భూమిశిస్తు ఇంకితర పన్నులు వసూలుచేయడానికి సత్యసంధులు, నీతి నిజాయితీపరులు, దయ, కనికరాలు గల అధికారుల్ని ఔరంగజేబ్ నియమించేవాడు. ఇంకా ప్రజలకు సంబంధించి, మాఫీకి సంబంధించి వారి సిఫారసులను కూడా తప్పకుండా ఆమోదించేవాడు. అటువంటి అధికారుల్లో నుండి కేవలం ఒక అధికారి సంఘటనల్ని ఇక్కడ పేర్కొంటున్నాం. అమానత్ ఖాన్ అనే అధికారి ఆర్థిక శాఖ (ప్రత్యేకించి రెవెన్యూ శాఖ) అంతటికీ ముఖ్యాధికారి. అయినప్పటికీ అతి సామాన్య, నిరాడంబర జీవితం గడిపేవాడు. ఇంట్లో ఒక సేవకుడు కూడా ఉండేవాడు కాదు. ప్రజల, రైతుల పట్ల దయార్ద్ర హృదయం కలవాడు. ప్రభుత్వ రాబడిలో కొంత తగ్గుదల వచ్చినా ఫరవాలేదు గాని, ప్రజలు, రైతులు బాధపడకూడదనే దృష్టికోణం కలవాడు. అతను దక్కన్ లాంటి సువిశాల సూబాకు ఆర్థిక వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమించబడ్డాడు. అత్యంత నిస్వార్థపరుడు. ఇంతపెద్ద హోదా లభించివున్నప్పటికీ దాన్ని తృణప్రాయంగా భావించేవాడు. అందుకని రిజైనింగ్ పత్రం సతతం జేబులో పెట్టుకొని తిరిగేవాడు. ప్రజలు, రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా శిస్తు చెల్లించలేకపోతున్నారని, పదే పదే వెళ్ళినా శిస్తు వసూలు కావడం లేదని, ఈ విధంగా బకాయీలు పెరిగిపోతున్నాయని రాజోద్యోగులు రిపోర్టులు ఇచ్చినప్పుడు అతను వారిని కసురుకోక పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకొని ఈ విషయాన్ని నమ్రతగా చక్రవర్తికి విన్నవించి వారి బకాయీలను మాఫీ చేయించేవాడు. అదేవిధంగా కొందరు జమీందారులు దివాళాదీసి వారు పేష్‌కష్ (నజరానా, కప్పం, పన్ను) చెల్లించలేక పోయినప్పుడు చక్రవర్తితో ఇది కూడా మాఫీ చేయించేవాడు. .... ఒకసారి చక్రవర్తి దర్బారులో నీతి, నిజాయితీ సత్యసంధత గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ఔరంగజేబ్ అమానత్ ఖాన్‌ను బాగా ప్రశంసించాడు. దానిపై అక్కడే ఉన్న అమానత్ ఖాన్ చేతులు కట్టుకొని ఇలా విన్నవించు కున్నాడు: "నన్ను మించిన అవినీతిపరుడు ఇంకెవరూ ఉండరేమో! ప్రభువులవారి ఉప్పు తింటూ చక్రవర్తుల వారికి రావలసిన లక్షలాది రూపాయల పన్నును ప్రతి సంవత్సరం మాఫీ చేస్తూ పోతున్నాను. ఇంకా క్షమామూర్తులైన చక్రవర్తి వారి మన్నింపును వేడుకుంటున్నాను." దానిపై ఔరంగజేబ్ ఇలా బదులిచ్చాడు : "బెంగపడకు. మేము నిన్ను మన్నించేశాము. నీవు మాకోసం ఇహపరాల ఖజానాలు నింపుతున్నావని మాకు తెలుసులే!" (ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్-వా.2, భా.3, పేజి 337) (మాసిరుల్ ఉమరా-షా నవాజ్ ఖాన్-వా.1, పేజి 260-261, అమానత్ ఖాన్ మీరక్ మొయినుద్దీన్ అహ్మద్ ప్రస్తావనలో)

ఇది చదివారుగా! ఇక ఎవరి చరిత్ర గ్రంథాల్ని ఆధారంగా చేసుకొని నేడు మనం మన చరిత్ర గ్రంథాల్ని రూపొందించుకుంటున్నామో ఆ H.M. Eliot, Dawson లు తమ చరిత్ర గ్రంథం "History of India as told by its own Historians-London, 1887, 2nd Edition, Kitab

Mahal, Alhabad, 1964 లోని మొదటి సంపుటిలో ఏం వ్రాశారో ఒకసారి మీరూ చూడండి. (ఇది భారత దేశపు మధ్య యుగపు ప్రత్యేకించి మొగలు పీరియడ్‌కు సంబంధించి వ్రాసిన వివరాలనేది మరచిపోరాదు.)

"మనం అధ్యయనం చేయబోయే రాజులు ఎలాంటి వారంటే, వారు సోమరితనం లోను, భోగలాలసత్వంలోను నిమగ్నమై ఉండేవారు. వారి పాపాలు కాలిగోలా, క్లోడిస్ పాపాలకూ మించిపోయాయి.

ఇలాంటి రాజుల పరిపాలనా కాలంలో న్యాయవ్యవస్థ అత్యంతంగా చెడిపోయి ఉండేది. ప్రభుత్వ టాక్సులు, శిస్తులు అత్యంత హింసాదౌర్జన్యాలతో వసూలు చేసేవారు. గ్రామాలకు నిప్పంటించేవారు. ప్రజల అవయవాలను కోసేసేవారు. వారిని బానిసలుగా విక్రయిం చేవారు. ఇలాంటి సంఘటనలు చదివి మీరు ఆశ్చర్యపోనక్కరలేదు. ప్రభుత్వాధి కారులు ప్రజల్ని రక్షించటం అటుంచి, వారే స్వయంగా దొంగలు, దోపిడీదారులుగాను, సంఘవిద్రోహులుగాను వ్యవహరించేవారు. రాష్ట్రాల నుండి సొమ్మును కొల్లగొట్టి, మహలుకు పంపినప్పుడు మహలు సంరక్షకులు దానితో విలాసవంతమైన జీవితం గడిపేవారు. పేదల గోడును వినిపించుకునే నాధుడేలేడు. దౌర్జన్యానికి పూనుకునేవారు, వారి ఇష్టం వచ్చినరీతిలో వ్యవహరించినా వారినడిగే వారు లేరు."

భూమిశిస్తు వసూలుకు సంబంధించి అవలంబించే పద్ధతిని ఇద్దరు సమకాలీన చరిత్ర కారుల ద్వారా మీరు తెలుసుకున్నారు. ఇంకా రైతులు, కర్షకుల పట్ల ఎలా వ్యవహరించాలనే దానికి సంబంధించి ఔరంగజేబ్ తన సివిల్ ఉన్నతాధికారి "రాసిక్ దాస్ కరోడి" పేరన జారీ చేసిన ఫర్మానాను కూడా ఈ అధ్యాయంలోనే చూస్తారు. ఇది గడిచిన 150 సంవత్సరాల తరువాత వచ్చిన బ్రిటీష్ చరిత్రకారులు దాన్ని ఎలా మలిచారో కూడా మీకు చూపించాము. ఇంతటి తీవ్రమైన వక్రీకరణ జరిగిన తరువాత కూడా దాన్ని చరిత్ర అనగలుగుతామా? చరిత్ర వక్రీకరణకు సంబంధించి మీకు కేవలం ఒక చిన్న ఉదాహరణ మాత్రమే చూపించాం. ఈ విధంగానే చరిత్రనంతటినీ కలుషితం చేసి గుర్రాన్ని గాడిదగా కాదు, కుక్కగా మార్చేశారు.

## 17. అపురూపమైన ఆదర్శనీయ చర్య :

మొగలు వంశం, భారత దేశంలోనే కాదు, ప్రపంచమంతటిలో కూడా అతి కష్టంగా కనిపించే ఔరంగజేబ్ చేపట్టిన ఒక అపురూప, ఆదర్శనీయమైన చర్యను పేర్కొనకుండా ఉండలేక పోతున్నాము. సామాన్యంగా పౌరులకు, రాజోద్యోగులకు, రాచకుటుంబీకులకు వ్యతిరేకంగా వ్యాజ్యాలు వేసిన సందర్భాలు లభిస్తాయి. కాని స్వయంగా రాజుగారికి, చక్రవర్తికి వ్యతిరేకంగా ఎవరికైనా ఏదైనా ఆక్షేపణ, అభ్యంతరం ఉండి న్యాయం కోసం నిలదీసే అవకాశం, హక్కును సామాన్య ప్రజలకివ్వడం రాజుల, పరిపాలకుల చరిత్రలో బహు అరుదు. కాని 1671లో ఔరంగజేబ్ తన రాజ్యంలో ఒక ఫర్మానాను జారీచేశాడు. దాని ననుసరించి అన్ని జిల్లాల్లో ప్రభుత్వ న్యాయవాదులు నియమించబడ్డారు. రాజుగారికి వ్యతిరేకంగా ఎవరికి ఏదైనా ఆక్షేపణ ఉంటే లేక ఏదైనా హక్కు రావాల్సి ఉంటే, వారు తమ వ్యాజ్యాన్ని సమర్పించుకోవచ్చుని,

ప్రభుత్వ న్యాయవాది దానికి సంజాయిషీ ఇచ్చుకుంటాడని, వాది పేర్కొన్నది నిజమని తేలితే, ప్రభుత్వ న్యాయవాది ద్వారా ప్రభుత్వంనుండి తన హక్కును వసూలు చేసుకోవచ్చని దేశమంతటిలో ప్రకటించబడింది. ఈ విషయంలో ఖాఫి ఖాన్ ఇలా వ్రాశాడు :

"ఈ సంవత్సరమే ఆలంగీర్ పాదుషాల వారు న్యాయప్రియత్వం కోసం ఇంకా తన న్యాయం, సమానత్వాల్ని వ్యాపింపజేయడం కోసం రాజధాని నగరమే కాకుండా ఇంకితర నగరాలు, వాటి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఏవ్యక్తికి అయినాసరే, రాజుగారిపై న్యాయంగా ఏదైనా హక్కు కలిగివుంటే, లేదా రాజు, ప్రభుత్వం నుండి ఏదైనా రావలసివుంటే అతను ప్రభుత్వ న్యాయవాది ద్వారా తన హక్కును కోరవచ్చని అలాంటి హక్కు నిరూపితమైన తర్వాత దాన్ని పొందవచ్చని ఆదేశాలు జారీచేయించారు. ఇంకా రాజుగారి తరఫున ప్రజలకు సమాధానమివ్వడానికి నియమింపబడిన న్యాయవాది వరకు చేరడం సామాన్య ప్రజలకు సాధ్యం కాని పక్షంలో ప్రతి నగరంలోనూ దాని పరిసరప్రాంతాల్లోనూ ఒక న్యాయవాదిని నియమించాలని కూడా ఆదేశించారు."[12]

రాజుగారికి వ్యతిరేకంగా కూడా వ్యాజ్యం వేయవచ్చనే ఫర్మానా జారీ అయిన తరువాత సూరత్ పట్టణానికి చెందిన దివంగత హాజీ జాహెద్ కుమారుడు ముహమ్మద్ మొహ్‌సిన్ చక్రవర్తికి వ్యతిరేకంగా, ఆయన సోదరుడు మురాద్‌బక్ష్ తీసుకున్న ఐదు లక్షల అప్పును, మురాద్ పదవీచ్యుతుడు, దివంగతుడైన కారణంగా చక్రవర్తే తీర్చాలంటూ వ్యాజ్యం వేశాడు.

ఈ విషయంలో ఖాఫిఖాన్ ఇలా వ్రాశాడు :

".... ఈ ఆదేశాలు అనగా రాజుగారికి వ్యతిరేకంగా కూడా వ్యాజ్యం చేయవచ్చనే ఆదేశం జారీఅయిన కొద్ది రోజులకే, సూరత్‌కు చెందిన ఇద్దరు వాణిజ్యవేత్తలు హాజీ జాహెద్ కుమారుడు ముహమ్మద్ మొహ్‌సిన్ మరియు బహర్‌జీ భూరా కుమారుడు, సూరత్‌ను గెలుచుకున్న కాలంలో మురాద్ బక్ష్ తరఫున ఖాజా షహ్‌బాజ్ తమ వర్తకుల వద్ద నుండి ఐదు లక్షల రూపాయల విలువ గల దీనారములు (బంగారు నాణాలు) అప్పుగా తీసుకున్నాడని ప్రస్తుతం మురాద్ బక్ష్‌కు వారసుడుగా ఉన్న చక్రవర్తులవారే దీన్ని చెల్లించాలని వ్యాజ్యం వేశారు. విచారణ తరువాత వారి ఈ వాదన నిజమని తేలింది. ప్రభుత్వ ఖజానా నుండి ఇవి తీర్చాల్సిందిగా ఆదేశించడం జరిగింది.[13]

## 18. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

## దర్బారీ అఖ్‌బారాత్ (దర్బారు పత్రికలు)

## అక్టోబర్ 25, 1699

నేడు చక్రవర్తి నిమ్‌బోని గ్రామం సమీపంలో విడిది చేయటానికి చేరుకున్నారు. "రాకుమారుడు ఇక్కడి నుండి ఎంత దూరంలో ఉన్నాడు" చక్రవర్తి హిదాయత్ కైష్‌ను అడిగాడు – "35 కోసుల దూరంలో ఉన్నారు. రోజుకు 5 మైళ్ళ మజిలీ చేసినా వారం రోజుల్లో ఆయన చక్రవర్తిని చేరుకోగలరు" అతను సమాధానం ఇచ్చాడు.

నింబోని పరగణ ప్రజలు “(సైన్యాలు సాగుతుండగా) తమ పంటకు నష్టం వాటిల్లిందని ఆక్షేపణ తెలిపారు” - దానిపై వారికి 500 రూపాయలు (నష్టపరిహారం) చెల్లించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

(సైనిక శిబిరంలోని వ్యక్తుల, సైన్యాల కదలికల కారణంగా వాటిల్లిన నష్టాన్ని ప్రజలు తెలుపుకోగానే, వెంటనే నష్టపరిహారానికి ఆదేశాలు - బహుశ ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వంలో కూడా ఇది సాధ్యమవుతుందో కాదో - స.షా. గాజియొద్దీన్, పేజి 101)

**పంటకు నష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు**

**నవంబరు, 17, 1701**

నేడు పాదుషాల వారు తమ విడిది నుండి బయలుదేరి దాదాపు ఒకటి ముప్పావు కోసుల ప్రయాణం చేసి, ‘బనీలా’ పేరు గల గ్రామానికి చేరుకున్నారు. రైతుల పైరు, పంట నష్టం జరుగకూడదనే ఉద్దేశ్యంతో ముందు జాగ్రత్తగా పర్యవేక్షణ కొరకు ఈ క్రింది అధికారులు నియమించబడ్డారు.

1. సైన్యం కుడి భాగం వైపు ముహమ్మద్‌కు బదులు ఇనాయతుల్లా కుమారుడు జియా ఉల్లాహ్ మరియు ముహమ్మద్ షాహ్.

2. ఎడమ వైపు షేఖ్ హిదాయత్ కైష్ మరియు గులాం ముహమ్మద్.

(సైన్యాల రాకపోకలు, కదలికల సందర్భంగా రైతుల పంటను నష్టాల నుండి కాపాడడానికి ఎల్లప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టబడేవి - స.షా. గాజియొద్దీన్, పేజి 250)

## 19. ప్రభుత్వాధికారుల పట్ల ఔరంగజేబ్ సానుభూతి - సాటిలేని ఆనవాయితి

హైద్రాబాద్ నగరంలో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసే అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో ఆర్కియాలజీ శాఖ కూడా తన స్టాల్‌ను ఏర్పాటు చేసేది. ఈ శాఖలోనే మొగలుల కాలానికి, దక్కన్‌కు సంబంధించిన పరిపాలనాపరమైన దాదాపు (20) ఇరవై లక్షల దస్తావేజులు సురక్షితంగా ఉన్నాయి. ఒకసారి మొగలుల కాలానికి సంబంధించి రెండు దస్తావేజుల్ని చూసి, సామాన్య ప్రజలే కాకుండా ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్య చకితులయ్యారు. ఇంకా ఔరంగజేబ్ గురించి ఇంతవరకు ఉన్న తమ అభిప్రాయాల్ని మార్చుకోవడానికి వివశులయ్యారు.

ఒక ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించి సమర్పించబడిన ఒక ఫర్మానా ప్రక్క అంచుపై ఔరంగజేబ్ తన స్వహస్తంతో ఇలా వ్రాశాడు: “పరిపాలనా దృష్టి కోణంతో మాల్వా నుండి గుజరాతుకు బదిలీ చేయబడింది. కాని వ్యక్తిగత కారణాలతో సంబంధిత సూబేదారు బదిలీ చేయబడిన స్థానానికి పోవడంలో ఇబ్బంది పడుతుంటే ఆయన ఆ విషయం తెలిపిన తరువాత పోకుండా ఊరుకోవచ్చు.” - ప్రస్తుత పరిపాలనా నియమం ప్రకారం బదిలీ అయిన అధికారి ముందుగా తను ట్రాన్స్‌ఫర్ అయిన కొత్త స్థలానికి వెళ్ళి జాఇన్ కావాలి. ఆ తరువాతనే తన బాధను,

అభ్యంతరాలను తెలుపుకోవాలి. కాని ఔరంగజేబ్ ప్రభుత్వ ఆదేశాలపై అధికారి వ్యక్తిగత కారణాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వాధికారుల పట్ల సానుభూతికి సంబంధించిన ఒక సాటిలేని ఆనవాయితీని నెలకొల్పాడు.

(Administration of Deccan during Aurangazeb Region - Dr. Dawood Ashraf P.hd. thesis - Eassay written by Syed Shakeel Ahmad Anwar, A Retd. Hyd. Archieves Officer, Hyderabad, Maa'rif Monthly, Azamgadh, December 2012)

## 20. వ్యవసాయం, రైతు సంక్షేమం :

వ్యవసాయోత్పత్తుల్లో పెంపుదలను, రైతు సంక్షేమాన్ని ఔరంగజేబ్ తన ప్రథమ కర్తవ్యంగా భావించాడు. దీనికి సంబంధించి అతను జారీచేసిన ఫర్మానాల్ని అధ్యయనం చేస్తే ఈ విషయం తేటతెల్లమైపోతుంది. రైతులు, వ్యవసాయంతో సంబంధమున్న అధికారుల్ని ఉద్దేశించి ఒక శాసనంలో అతనిలా ఆదేశించాడు :

"(రైతుల పట్ల) ప్రేమ వాత్సల్యం, దయ కనికరాల్ని ప్రదర్శించండి. వ్యవసాయో త్పత్తుల్ని పెంచడానికి ఇవే సాధనాలు. ప్రేమ వాత్సల్యమంటే భూమికి ఏ శిస్తు అయితే నిర్ణయించ బడిందో, దానికన్నా ఒక్క చిల్లి గవ్వ కూడా అధికంగా వసూలు చేయరాదు. ప్రతి ప్రాంతపు అధికారి, ఆ ప్రాంతంలో ఉంటున్న రైతుల హక్కుల పర్యవేక్షకుడుగా, సంరక్షకుడుగా వ్యవహ రించాలి."

"ప్రతి సంవత్సరపు ప్రారంభంలో మీ ప్రాంతపు రైతులకు సంబంధించిన అన్ని విషయాల్ని సేకరించి సమర్పించాలి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నవారెవరో, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారెవరో మీకు తెలుసుండాలి. వారికి ఏదైనా సహాయం అవసరమై ఉన్నట్లయితే, మీ చల్లని చూపుల్ని, వాత్సల్యాన్ని కాంక్షిస్తున్నట్లయితే వారి గురించి పట్టించుకోండి. వారికి తగిన సహాయం చేయండి. ఇకముందు కూడా ఆదుకుంటామని వారికి వాగ్దానం చెయ్యండి. సరిపడ వర్షాలు, ఇంకా ఇతర సౌకర్యాలు లభించినప్పటికీ, ఎవరైతే వ్యవసాయంలో శ్రద్ధ చూపడం లేదని, పొలాల్ని బీడుగా ఉంచుతున్నారని తెలిసినప్పుడు, వారి నిర్లక్ష్యం పట్ల వారిని బెదిరించండి. ఏ విధంగానైనా సరే వారిని వారి పనుల్లో నిమగ్నం చేయండి. ఎవరైనా కష్టపడి పనిచేసే రైతులు, పని కూడా చేయదలిచారు కాని వారి వద్ద వ్యవసాయానికి పెట్టుబడి లేకపోతే ప్రభుత్వ ఖజాన నుండి వారికి రుణాలివ్వండి. ఈ విధంగానే దేశంలో ఉత్పత్తి పెరుగుతుంది, దేశంలో సమృద్ధి వస్తుంది.

ఎక్కడైనా భూమి నిరుపయోగంగా పడి ఉంది, దానికెవరూ యజమాని లేరు, అలాంటి చోట మీ అభీష్టాన్ని అనుసరించి ఉత్తమంగా వ్యవసాయం చేయగలిగే వారికి ఆ భూమిని కేటాయించండి, ఇక భూమి శిస్తు కూడా షరీయత్తు ఆదేశాలకు లోబడి, వారు సంతోషంగా,

అవలీలగా తీర్చే విధంగానే నిర్ణయించండి. ఏ ప్రాంతాల్లోనైతే భూమిశిస్తు నగదు రూపంలో నిర్ణయమైందో, అక్కడి రైతులు దీన్ని ధాన్యరూపంలో చెల్లిస్తామంటే, తప్పకుండా వారికి ఈ సౌకర్యాన్ని కల్పించండి."

ఔరంగజేబ్ రైతుల యోగక్షేమాల గురించి ఎంతగా ఆలోచించేవాడంటే, వ్యవసాయ భూమిలోని ఏ భాగమైనా సముచిత కారణాల వల్ల సాగుచేయబడకపోతే, ఆ సంవత్సరం దానికి భూమిశిస్తు విధించరాదని, కేవలం సాగు చేయబడిన భూమికే, పంటకే శిస్తు వసూలు చేయాలని, అది కూడా పంట పక్వానికి వచ్చి రైతు చేతిలో పడ్డ తరువాతనే వసూలుచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాడు.

ఎవరైనా ఓ వ్యక్తి తన భూమి ప్రజా సంక్షేమం కోసమో, లేక యాత్రా గృహానికో లేదా ఒక మఠానికి, ఆరాధనాలయానికో కేటాయించినట్లయితే, అట్టి భూమిని శిస్తునుండి మినహాయించాలని, తత్ఫలితంగా ప్రజా సంక్షేమ కార్యక్రమానికి అంతరాయం ఉండకూడదని కూడా ఆదేశించాడు.

రైతుల, కర్షకుల ప్రయోజనాలకు, వ్యవసాయ అభివృద్ధికి అతనెంత ప్రాముఖ్యత నిచ్చేవాడో, 'రాసిక్ దాస్ కరోడి' పేరుగల (సివిల్) ఉన్నతాధికారి పేరున జారీచేసిన ఈ ఫర్మానాను అధ్యయనం చేస్తే అవలీలగా అర్థమైపోతుంది. అందులో అతనిలా ఆదేశించాడు

**శాసనపు ప్రారంభంలో ఈ వాక్యాలు గమనార్హం :**

**"వ్యవసాయంలో అభివృద్ధి జరుగాలని, దేశంలో వ్యవసాయోత్పత్తులు పెరగాలని, రైతులు స్థితిమంతులుగా మారాలనేది ప్రభువుల వారి ప్రగాఢ వాంఛ, కోరిక అనే విషయాన్ని నీవు గుర్తుంచుకోవాలి."**

"నీ చేతిక్రింద పనిచేస్తున్న దీవాన్లు, కార్యదర్శులు, గ్రామరక్షకుల ద్వారా నీ ప్రాంతానికి చెందిన అన్ని భూముల వివరాలు నీవు తెలుసుకోవాలి. బీడుగా నున్న భూమి విస్తీర్ణం ఎంత? అనేది నీకు తెలుసుండాలి. ఈ భూములు ఎవరికైతే ఇస్తావో, వారితో గట్టి వాగ్దానం చెయ్యి, మంచి భవిష్యత్తుకు ఆశ గొలుపు. దానిని పూర్తి చెయ్యి. పాడుబడిన, ఉపయోగంలో లేని బావుల్ని నీ ఖర్చుతో పునరుద్ధరించు, ఇంకా అవసరమున్న చోట కొత్త బావుల్ని త్రవ్వించు, ప్రజలు, రైతులు వీటితో లాభపడే విధంగా కార్యక్రమాల్ని రూపొందించు. రైతులు తమ స్వంత ఖర్చుల్ని పూర్తి చేసుకోవడమే కాకుండా, అవలీలగా ప్రభుత్వ శిస్తును కూడా చెల్లించేంత పంట పండాలి. దానికి తగిన ఏర్పాట్లు చెయ్యి. ప్రజల సమృద్ధి, సంక్షేమాలే అసలు లక్ష్యమనే విషయాన్ని మర్చిపోకు.

ప్రతి పూరు, ప్రతి పరగణాలోని సాగు చేయబడుతున్న, సాగుచేయబడని, ప్రజలు నివాసమేర్పరుచుకున్న, నిర్జనంగా ఉన్న అన్ని భూముల వివరాలు సమకూర్చుకోవాలి. భూమి యొక్క పంటనిచ్చే శక్తిని పరిశీలించాలి, రైతుల పేర్లు కూడా వ్రాసుకోవాలి. సంవత్సరాల తరబడి బీడుగా, నిర్జనంగా, నిరుపయోగంగా పడివున్న గ్రామాలు లేక భూముల వివరాలు కూడా సేకరించాలి, వాటిని జనవాసానికి యోగ్యంగా మార్చటానికి, సాగుచేయడానికి సముచిత ప్రతిపాదనలు కూడా పంపాలి.

**ఈ ఫర్మానాలో ప్రముఖంగా పేర్కొనదగిన ఇంకొక విషయం ఏమిటంటే :**

"ఏ ప్రభుత్వ ఉద్యోగి, జమీందారును లేక చౌదరీని ఏకాంతంలో కలువకూడదు, ఏకాంతంలో ఒంటరిగా వారితో మాట్లాడకూడదు. అందరినీ బహిరంగ సమావేశంలో పిలిపించాలి. వారితో మర్యాదగా, పరిమితంగా మాట్లాడాలి, మధ్యవర్తిత్వం (మాధ్యమం) లేకుండా, ఎవరినీ మధ్యలో ఉంచక ప్రత్యక్షంగా, సూటిగా ప్రజలతో పరిచయమై వారితో సంబంధాలు పెంచుకోవాలి. ఎవరి మధ్యవర్తిత్వం, సిఫారసు లేకుండా తిన్నగా నీ వద్దకు వచ్చి తమ స్థితిగతుల్ని నీకు విన్నవించుకునే అవకాశాన్ని పేదలకు కల్పించాలి. దీనివల్ల తమ గోడు వెళ్లబోసుకొని, తమ కష్టాల నివారణ కోసం నీ సహాయాన్ని అర్థించే దీనులు, నిస్సహాయులు నీ వరకు చేరడానికి ఎవరో సిఫారసుదారును వెతుక్కోవలసిన అగత్యముండదు."

(నీ క్రింద పనిచేస్తున్న) గ్రామరక్షకులు, కార్యదర్శులు, పరిశీలకుల్ని ప్రతి సంవత్సరం ప్రారంభంలో ఊరూరు తిరిగి ఒక్కొక్క రైతు, కర్షకుని పరిస్థితిని తెలుసుకోవాలని, సాగుచేయ బడుతున్న, సాగు చేయబడని భూముల్ని పరిశీలించాలని వారిని ఆదేశించాలి. ఈ అధికారులు రైతుల్ని సాగుబడి పెంచేవిధంగా ప్రోత్సహించాలి, వారికి అండగా నిలబడాలి, వారి ధైర్యాల్ని పెంపొందించాలి. ఏ పంట పొలాలు మంచి పంట నివ్వడం లేదో, ఆ భూముల ఉత్పత్తి శక్తిని పెంచే మార్గాలు అవలంబించాలి. ఒక ప్రాంతంలోని రైతులు నిరాశపడి భూముల్ని వదలివెళ్ళి పోయి ఉంటే, వారిని తిరిగి రప్పించాలి, వారికి కావలసిందేమిటో సమకూర్చిపెట్టాలి, వారికి అండగా ఉన్నామంటూ ధైర్యం చెప్పాలి.

బంజరు భూములు, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూముల్ని, వ్యవసాయ యోగ్యంగా మార్చటానికి ప్రయత్నాలు చేయాలి. నీ అధికారులు ఊరూరా తిరిగి, ఒక్కొక్క చేను పంట సామర్థ్యం ఏమిటో తెలుసుకొని, ఇటు ప్రభుత్వానికి నష్టం కలుగకుండాను, అటు ప్రజలు కూడా సమృద్ధిగా, సంతృప్తితో ఉండేవిధంగాను భూమి శిస్తు నిర్ణయించాలని వారికి ఆదేశాలివ్వాలి.

నీవు కూడా అప్పుడప్పుడు ఊరూరు తిరుగుతూ ఉండాలి, ఒక్కొక్క చేనును పరిశీలించాలి. ఒక్కొక్క రైతును కలుసుకోవాలి. వారి బాధలేమిటో, సమస్య లేమిటో తెలుసు కోవాలి. వారి నిజస్థితి ఏమిటో పరిశీలించాలి. వారి పట్ల అన్యాయం, దౌర్జన్యమైతే జరుగలేదు కదా, వారి పంటను, వారి శక్తికి మించి భూమిశిస్తు నిర్ణయించబడలేదు కదా అనే విషయాన్ని నిర్ధారణ చేసుకోవాలి.

ధర్మం న్యాయం, ప్రజల సంక్షేమ సమృద్ధులే మా ప్రథమ లక్ష్యమనే విషయాన్ని గుర్తుంచు కోవాలి. ఎవరైనా దుర్మార్గులు, దౌర్జన్యపరులు ఈ రైతుల భూముల్ని అన్యాయంగా ఆక్రమించుకొని ఉంటే, ఆ భూముల్నుండి వారిని గెంటివేసి అసలుదారుకు, యజమానికి వాటిని అప్పగించాలి.

దురదృష్టవశాత్తు ఈ భూములపై ఏదైనా ఆకాశ లేక భూ ఆపద వచ్చిపడి, పంటలు నాశనమైపోతే, ప్రతి చేనును స్వయంగా పరిశీలించి, దాని పంట నష్టం విలువను సరిగ్గా

అంచనావేసి, దాని వివరాలు వ్రాతపూర్వకంగా భద్రపరిచి పంపాలని, కార్యదర్శుల (అమీన్‌ల)కు ఆదేశించాలి.

ప్రజలకు అన్యాయం జరిగే అవకాశమున్న, కార్యదర్శులు, గ్రామ ప్రముఖులు, ఇతర ఉన్నతాధికారులు ఇచ్చిన వాంఙ్మూలాల్ని ఎంతమాత్రం స్వీకరించకూడదు.

షరీయత్తు ఆదేశాల్ని అతిక్రమించి ఏ కార్యదర్శికూడా అధిక శిస్తు వసూలు చేయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం కూడా నీకు అనివార్యమనే విషయాన్ని మరిచిపోకూడదు. నిషేధిత, మాఫీచేయబడిన, శిస్తుల్ని వసూలు చేయలేదని ప్రతి కార్యదర్శి, ఉన్నతాధికారి ద్వారా నిర్ధారణ చేసుకొని, వారి వాంఙ్మూలాల్ని తీసుకోవాలి. ఎప్పుడైనా, ఎవరైనా ఓ అధికారి నిషేధిత లేక షరీయత్తేతర శిస్తు వసూలు చేశాడని నీ దృష్టిలోకి వస్తే వెంటనే ఎలాంటి జాప్యం చేయకుండా ప్రభువుల వారి దృష్టికి తేవాలి, ఈ విధంగా బాధ్యతా రాహిత్యుడైన ఆ అధికారిని కఠినంగా, గుణంగరిపే విధంగా, శిక్షించే అవకాశముంటుంది.

నిజాయితీగా, సక్రమంగా శీఘ్రంగా తమ విధులు నిర్వర్తించే, మంచి అధికారుల పనితనాన్ని, వారి పేర్లను మాకు తెలుపాలి, ఈ విధంగా వారిని సత్కరించే అవకాశముం టుంది. విధిని ఉల్లంఘించే, విధి నిర్వహణలో అలసత్వం చూపేవారి పేర్లు కూడా తెలియ పరిస్తే సముచితంగా శిక్షించే అవకాశముంటుంది.”

రైతులు, కర్షకులు ఇంకా మిగిలిన ప్రజల సంక్షేమ సౌభాగ్యాల కోసం ఈ ఆదర్శరాజు జారీచేసిన ఇలాంటి ఇతర ఫర్మానాలు మిరాతె అహ్మది, ముంతఖబుల్ లుబాబ్, మాసిరె ఆలంగీరి లాంటి సమకాలీన చరిత్ర గ్రంథాలలో కోకొల్లలుగా ఉన్నాయి. వ్యాసం సుదీర్ఘమై పోతున్నదనే దృష్టితో వాటన్నిటినీ మేమిక్కడ పేర్కొనలేకపోతున్నాము.

ఔరంగజేబ్ ప్రజల సంక్షేమం కోసం, వారి సౌభాగ్య సమృద్ధులకోసం అనేక మంచి కార్యాలు చేశాడని, దీనికోసం ఒక పటిష్ఠమైన వ్యవస్థనే రూపొందించాడని జదూనాథ్ సర్కారుతో సహా, చరిత్రకారులందరూ అంగీకరించారు.[14]

దేశంలోని రైతుల పట్ల ఔరంగజేబ్ ఎలా ప్రవర్తించేవాడో, వారి నుండి భూమి శిస్తు ఎలా వసూలు చేయబడేదో “మొగల్ అడ్మినిస్ట్రేషన్, అధ్యాయం-11” మరియు “స్టడీస్ ఇన్ మొగల్ ఇండియా,” పేజి 168-197లో జదూనాథ్ సర్కార్ ఇలా వివరించారు :

“పరిపాలనా వ్యవహారాల్లో అతను న్యాయం సమానత్వాల్ని, ఉపకారాల్ని, అనివార్యంగా తలంచేవాడు. ఇస్లామీయ షరీయత్తును అనుసరించే, ప్రవక్త ప్రవచనాలకు లోబడే భూమిశిస్తు వసూలు చేయాలని అతను కోరుతుండేవాడు. ప్రతి సంవత్సరం కొత్త శిస్తును వసూలు చేయరాదని అతను ఆదేశించేవాడు. భూమిశిస్తు విషయంలో ఆజ్ఞోల్లంఘన, మధ్యస్థ మార్గాన్ని విడనాడి, అతిగా ప్రవర్తించడాన్ని ఇహపరాల నష్టంగా భావించేవాడు. రైతుల పట్ల మృదువుగా, మేలుగా దయ కనికరాలతో, ఉదారంగా ప్రవర్తించాలని, తద్వారా వారు సంతృప్తులు, సంతుష్టులై, పంట దిగుబడిని పెంచడానికి ప్రయత్నిస్తారని నిరంతరం అతను ఆకాంక్షిస్తూ, ఆదేశించేవాడు.”

జైపూర్ సంస్థానంలో బయల్పడిన ఔరంగజేబ్ కాలం నాటి దర్బారు వార్తాపత్రికల ఫైలు ఆధారంగా ప్రొఫెసర్ శ్రీరాం శర్మ "పరిపాలనా వ్యవహారాల్లో ఔరంగజేబ్ పాత్ర" అనే మకుటంతో సుదీర్ఘమైన ఒక వ్యాసాన్ని రూపొందించారు. అది హైదరాబాద్ నుండి అప్పట్లో వెలువడే "ఇస్లామిక్ కల్చర్" అనే పత్రికలో ప్రచురించబడింది. మొత్తం వ్యాసాన్నైతే ఇక్కడ పొందుపరచలేము. కాని నమూనాకు కొన్ని విషయాలు పాఠకుల ముందుంచు తున్నాము.

"ఐదువేల పుటలపై వ్యాపించి ఉన్న ఈ పత్రికల ద్వారా ఔరంగజేబ్ కాలంనాటి అనుమానానికి, శంకకు ఏమాత్రం ఆస్కారం లేనటువంటి ఎన్నో విషయాలు బయల్పడ తాయి."

ఈ పత్రికల అధ్యయనం వల్ల ఔరంగజేబ్ తన దైనందిన కార్యక్రమాల్లో ఎలాంటి అలసత్వానికి, నిర్లక్ష్యానికి చోటిచ్చేవాడు కాదనే విషయం తేటతెల్లమైపోతుంది. అతని పరిపాలనా కాలం నాటి ముప్ఫై ఎనిమిదవ సంవత్సరపు పదినెలల పత్రికల అధ్యయనం ద్వారా, ఈ మొత్తం పది నెలల కాలంలో కేవలం పదకొండు రోజులు మాత్రమే తీరికగా గడిచాయనేది విదితమవుతోంది. ఏ కారణం వల్లనైనా అతను దీవానె ఆమ్ (సర్వసభ లేక దర్బారు)లో రాలేకపోయినా కూడా, అంతఃపురంలోనో, లేక ఇంకేదైనా అంతరంగిక ప్రదేశం లోనో తన దైనందిన విధుల్ని నెరవేర్చేవాడు.

దక్కన్‌లో అతను పని చేసే పద్ధతులు నాలుగు రకాలుగా ఉండేవి. సామాన్యంగా అతను దీవానె ఆమ్ (సర్వసభ లేక సామాన్యదర్బారు) లేక దీవానె ఖాస్ (ప్రత్యేక సభ) లోనో రాజ్య వ్యవహారాల్ని చూచేవాడు................

దీవానె ఆమ్ అయినా దీవానె ఖాస్ అయినా, అదో ప్రజాస్వామిక అసెంబ్లీ ఏం కాదు. దీనిలో పాల్గొనడానికి కొన్ని ప్రత్యేక నియమ నిబంధనలు, ఆచారాలుండేవి. చక్రవర్తి మరియు దర్బారు నాయకులు కలిసి పరిపాలనా వ్యవహారాలు చూసేవారు. దర్బారు లేక రాజధాని నుండి దూరంగా ఉంటున్న నాయకులు, మన్సబుదారులు, ఇతర ఉన్నతోద్యోగులు, చక్రవర్తిని దర్శించుకొని తమకు సంబంధించిన ఆదేశాల్ని స్వీకరించేవారు ..... ప్రధాన వార్తా విలేఖరి కింద అనేకమంది వార్తావిలేఖరులు, తపాల ఉన్నతాధికారి క్రింద పనిచేసే అనేకమంది వార్తాహరులు దర్బారును అంటిపెట్టుకొని ఉంటుండేవారు..... గూఢచారులు, వార్తావిలేఖరులు ఎవరి మధ్యస్థం లేకుండా సూటిగా రాజుగారిని కలుసుకొని, తమ కార్యకలాపాల్ని విన్నవించు కునేవారు .... మన్సబుదారులందరి నియామకం, వారి ప్రమోషన్, లేక రివర్షన్ లేక పదవీ విరమణ, వారికి ఇనాములు, పారితోషికాలు, జాగీర్ల, శాఖల కేటాయింపు ఇత్యాది అన్ని వ్యవహారాలు రాజుగారి ఆమోదము మరియు అంగీకారములకు లోబడి ఉండడమే కాక, అందులో వారికి సముచిత ఆదేశాలు కూడా ఉండేవి. ఈ వ్యవహా రంలో చిన్న పెద్ద అంటూ తారతమ్మం ఏదీ లేదు.... ఏదైనా ఒక ప్రత్యేక కార్యసాధన కోసం ఒక నాయకుడు ఎంపిక చేయబడితే (మరాఠాలకు వ్యతిరేకంగా జైసింగ్‌ను పంపినటు వంటి సందర్భాల్లో) కార్యసాధనలో ఆటంకాలు ఏర్పడకూడదనే దృష్టితో, అలాంటి నాయకులకు అసామాన్యమైన అధికారాలు కూడా ఇవ్వబడేవి. .... రెవిన్యూ శాఖ మాత్రం ఒక ప్రత్యేకత కలిగి ఉండేది .... వార్తావిలేఖరులు సమర్పించిన రిపోర్టులపై కూడా తరచుగా ఆదేశాలు జారీ చేయబడేవి.... నలభైమంది సైనికులపై ఉండే అధికారిని సైతం తానే ఎంపిక చేసేవాడు. అంటే ఎంత చిన్న పని అయినాసరే, అతని

ఆదేశ అంగీకారాలు లేనిది జరిగేది కాదు. దర్బారు పత్రికల అధ్యయనం వల్ల తెలిసే ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే అదెంత చిన్న విషయంగాని, అతని దృష్టిలోకి వస్తే, దాన్ని మరిచి పోయి నిర్లక్ష్యం చేసేవాడు కాదు. వెంటనే ఆ విషయంలో స్పందించేవాడు. దీనివల్ల కేంద్రం పని బాగా పెరిగిపోయింది. అయితే దీనిద్వారా అతని అసామాన్యమైన పనితనం మరియు ఏకాగ్రత వ్యక్తమవుతుంది. .... ఆదాబె ఆలంగీరిలోని లేఖలద్వారా, అతని పనిలో, పరిపాలనలో ఎంత పకడ్బందీ, ఎంత కేంద్రీయత ఉండేదో నిరూపితమవుతుంది. అతను అజ్మీర్‌లో కూర్చుండి, మేవాడ్‌లో నిమగ్నమైవున్న సేనలకు సవివరమైన ఆదేశాలు, అంటే ఎలా ముందుకు సాగాలో, ఎలా వ్యవహరించాలో లాంటి సూచనలిచ్చేవాడు.... ఫ్యాక్టరీలు, రాజభవనాలు, రోడ్లు, గుడారాలు, ఉద్యానవనాలు, క్రీడలు ఇంకా ఇలాంటివే ఇతర కార్యక్రమాల్లో ఉత్పన్నమయ్యే సమస్యలన్నిటికీ తన అభిరుచిని అనుసరించి పరిష్కారాలు సూచించేవాడు.... చీఫ్ జస్టిస్, విచారణాధికారి, ధార్మిక ఉన్నతాధికారి (ముఫ్తి) మొదలగు వారి కార్యాచరణలో అతనెలాంటి జోక్యం చేసుకునేవాడు కాదనే విషయం ఈ పత్రికల ద్వారా తెలుస్తుంది.... వీరంతా తమ తమ పరిధుల్లో స్వతంత్రంగా వ్యవహరించేవారు. వీరి కార్యకలాపాలలో దీవాని అధికారులు (సివిల్ అధికారులు) జోక్యం చేసుకుంటున్నట్లు వారెన్నడూ ఆరోపించలేదు..... ఖిల్వత్ ఖానాగా పిలువబడే ప్రత్యేక సమావేశమందిరంలో రాజుగారు పిలువనంపిన వ్యక్తే ప్రదేశించడానికి అర్హుడు. పిలిపించబడిన నాయకులు, ప్రభువు ప్రతిపాదించిన ఏదో ఒక విషయాన్ని వ్యతిరేకించినప్పుడు, బలవంతంగా వారితో ఒప్పించుకునేవాడు కాదు, దానికి బదులు సాక్ష్యాధారాలతో, హేతుబద్ధంగా వారిని మెప్పించడానికి ప్రయత్నించేవాడు....

పై వివరాల వల్ల ఔరంగజేబ్ ప్రభుత్వంలో ఎంత పటిష్ఠత, ఎంత కేంద్రీయత ఉండేదో అర్థమైపోతుంది. జిల్లాల్లో ఉండే ఉన్నతాధికారులపై సంబంధిత సుబేదార్లకు అధికారాలుంటే ఉండొచ్చుగాని, సైనికాధికారి మాత్రం తనకు సంబంధించిన వ్యవహారాల్ని సూటిగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయానికి వ్రాసి, అక్కడి నుంచే ఆదేశాలు పొందేవాడు. ఒక యుద్ధానికి లేక ఘర్షణకు సారథ్యం వహించే సైనిక నాయకుడు, లేక ఇతర చిన్న సైనికాధికారులు కూడా సూటిగా రాజుగారికే తమ కార్యాచరణ రిపోర్టును సమర్పించి, అక్కడి నుండే సముచిత ఆదేశాలు పొందేవారు.....తాను న్యాయానికి ప్రతిరూపమని ఔరంగజేబ్ ఎన్నడూ గర్వపడలేదు గాని అతను తన ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలపై వ్యాజ్యాలపై కూడా విచారణ చేపట్టాడు. ఇంకా ఎవరిపట్లనైనా దౌర్జన్యం జరిగి ఉన్నట్లయితే, వారికి న్యాయాన్ని చేకూర్చేవాడు." (ఇస్లామిక్ కల్చర్ – మాసపత్రిక, హైదరాబాద్ దక్కన్, అక్టోబర్ 1940, రచన : ప్రొఫెసర్ శ్రీరాం శర్మ).[15]

# 24. ముక్కల్ని జోడించి సువిశాల భారతంగా మార్చిందెవరు?

ఔరంగజేబ్ గురించి ఇంతవరకు సుదీర్ఘంగా చదువుతూ వచ్చాము. రాకుమార దశలో అతని ప్రవర్తన ఎలా ఉండేది, సోదరుల్లో జరిగిన అంతర్యుద్ధాలకు కారణాలేమిటి, ఈ సందర్భంలో షాజహాన్ ప్రవర్తన ఎలా ఉండేది, చివరికి ఈ అంతర్యుద్ధాల ఫలితం ఎలా తేలింది, ఏ విధంగా ఔరంగజేబ్ సింహాసనాన్ని అధిష్టించాడు – మొదలుగాగల విషయా లన్నీ తెలుసుకుంటూ వచ్చాము. అంతేకాదు అతనిపై మోపిన నిందల్ని, నేరాల్ని, విశ్లేషించి వాటిలోని వాస్తవికత ఎంతో, కల్పిత కథలు ఎంతవరకో కూడా మనం తెలుసు కుంటూ వచ్చాం. ఈ నిందలు ఎంత నిరాధారమైనవో, ఏ లక్ష్యంతో అవన్నీ అతనిపై ఆపాదించడం జరిగిందో సాక్ష్యాధారాలతో సహా మనం తెలుసుకున్నాం. అతనిపై బురదజల్లి, వికృతంగా మార్చిన అతని రూపాన్ని కడిగిన తరువాత అతని వాస్తవ రూపం ఏమిటో, అతని గుణగణాలు శీలం ఎలాంటివో మీరు బాగా అర్థం చేసుకొని ఉంటారు. ఇలాంటి సౌశీల్యవంతుడు, న్యాయశీలి, ధర్మపరాయణుడు, అసామాన్యమైన ధైర్యసాహసాలు కలిగినవీరుడు, దైవభయం తప్ప వేరెవ్వరి భయమెరుగని ధైర్యశాలి, నృత్యగానాల్ని, భోగలాలసత్వాల్ని మహాపాపంగా తలచి, అత్యధిక సమయాన్ని పరిపాలన, ప్రజల యోగక్షేమాల్ని పరిరక్షించడంలోనే గడిపిన ధర్మరాజు – ఇలాంటి వ్యక్తిని ఎంతటి నిందలకు పాల్జేశారో, ఎందుకిలా చేశారో మీరు వివరంగాను, సాక్ష్యోపేతంగాను, సమకాలీన చరిత్ర సాక్ష్యాధారలతోను తెలుసుకుంటూ వచ్చారు.

అయితే అతను భారతదేశానికి, భారత జాతికి చేసిన ఇంకొక మహోన్నత సేవను మనం తెలుసుకోవాల్సి ఉంది. ఇదెలాంటి సేవ అంటే చరిత్ర తెలిసినప్పటి నుండి ఔరంగజేబ్ కాలం వరకు వచ్చిపోయిన వందలాది రాజులు, చక్రవర్తులు దీనిగురించి అసలు ఆలోచించనే లేకపోయారు. కొందరికి ఈ ఆలోచన వచ్చినా కూడా దాన్ని ఆచరణలో పెట్టి చూపించలేక పోయారు. ప్రాచీనాతి ప్రాచీన సభ్యతగల దేశాల్లో భారతదేశం ఒక్కటి. క్రీస్తుకు పూర్వమే మనం దేశంలో సభ్యతా సంస్కృతులు పరిఢవిల్లాయి. ఎన్నో రాజ్యాలు, రాజ వంశాలు వచ్చి పోయాయి. కాని వారందరు తమ ప్రజలు, తమ ప్రాంతం, తమ రాజ్యం వరకే పరిమితమై పోయారు. కాని భారతదేశమంతా ఒకటే, భారత జాతి అంతా ఒకటే అనే ధ్యాసే వారికి వచ్చినట్లు కనిపించదు. వారిలో కొందరికి ఈ ఆలోచన వచ్చినా కూడా, దాన్ని కార్యరూపంలో ప్రదర్శించలేకపోయారు. కొందరు రాజుల కాలంలో, రాజ్యాల్లో స్వర్ణయుగాలు కూడా వచ్చి పోయాయి. కాని అవన్నీ వారి వారి రాజ్యాల వరకే, వారి వారి ప్రాంతాల వరకే పరిమితమై ఉండిపోయాయి. హూనులు, కుషాణులు, గుప్తులు, మౌర్యులు ఇలా ఎన్నో వంశాలు, వారి పాలకులు వచ్చి భారతప్రాంతాల్ని పరిపాలించి వెళ్ళిపోయారు. కాని ఎవ్వరికి కూడా భారతజాతి అంతా ఒక్కటే అని, భారతదేశమంతా ఒక్కటేననే ఆలోచనగాని, లేక వీరందరిని ఐక్యపరచాలని,

భారతదేశ వివిధ ప్రాంతాల్ని సమైక్యపరచి, ఒక అఖండ భారతంగా మార్చాలనే ఆలోచనగాని, ప్రయత్నాలుగాని కనిపించవు. క్రీస్తుకు పూర్వం అశోక చక్రవర్తి మాత్రం భారతదేశాన్నంత ఒకే పాలన క్రిందికి తెచ్చి సమైక్య భారతంగా మార్చే ప్రయత్నం చేశాడు. కొంతవరకు అతనందులో సఫలీకృతుడు కూడా అయ్యాడు. అయితే అప్పుడు కూడా దక్షిణ భారతమంతా అతని పాలన క్రిందికి రాలేకపోయింది. ఆ తరువాత వందల సంవత్సరాలు గడిచిన పిదప అక్బర్ చక్రవర్తి ఇలాంటి ప్రయత్నాన్ని చేపట్టాడు. కాని అతను కూడా అహ్మద్ నగర్ వరకు గల ప్రాంతాల్ని మాత్రమే తన రాజ్యపరిధిలోకి తేగలిగాడు. మిగిలిన దక్షిణ భారతమంతా అతని రాజ్యం నుండి వేరుగా, స్వతంత్రంగానే ఉంటూ వచ్చింది.

భారతదేశ చరిత్రలో ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పశ్చిమం వరకు మొత్తం భారత దేశ వివిధ ప్రాంతాల్ని మొట్టమొదటి సారిగా ఒకే పాలనలోకి తెచ్చి భారత దేశాన్ని ఒక అఖండ, సువిశాల భారతంగా మార్చిన, ఆ భావన నిచ్చిన ఘనత కేవలం ఔరంగజేబ్‌కే దక్కుతుంది. దీనికోసం భారత జాతి అంతా కూడా అతనికి రుణపడివుంది. ఈ లక్ష్యసాధన కోసం అతను జీవితాంతం శ్రమించాడు. ఈ లక్ష్యసాధనలో అతను అకుంఠిత దీక్షతో నిలబడ్డాడు. భారతదేశాన్నంతా అఖండ భారతంగా మార్చే లక్ష్యసాధనలో, ప్రయత్నంలో ఎవరు అడ్డం వచ్చినా వారు హిందువులుగాని (మరాఠా, సిఖ్ఖులు, రాజపుత్రులు) లేక ముస్లింలుగాని (బీజాపూర్, గోల్కొండ, అఫ్గన్‌లు) అతను లక్ష్యపెట్టలేదు. వారిని విడిచిపెట్టలేదు. చివరకు ఈ లక్ష్యసాధనలో అవరోధం కలిగిస్తున్నాడని అనుమానం వచ్చినప్పుడు తన స్వంత రాకుమారుణ్ని (గోల్కొండ ముట్టడి సందర్భంలో, అనుమానాస్పద స్థితిలో షా ఆలంను బంధించడం) కూడా బంధించి వేయడానికి అతను ఏమాత్రం వెనుకాడలేదు. తన రాజ్యం, రాష్ట్రాల సమగ్రత, అఖండతల కోసం అతను అనారోగ్యంలో కూడ పరుగిడుతూనే ఉన్నాడు. 87 సంవత్సరాల వృద్ధాప్యంలో శవాలు గుట్టలుగా పడుతున్న 'వాగన్‌ఖేడ' లాంటి భయంకర యుద్ధ మైదానాల్లో కూడా ఈ లక్ష్యసాధన కోసమే నిర్భీతిగా నిలబడిన కార్యదీక్షాపరుడు. రాజపుత్రులు, మరాఠాలు, బీజాపూర్, గోల్కొండ లాంటి శక్తుల నుండి ఏదో కొంత కప్పం తీసుకొని, స్వతంత్ర, సామంత రాజ్యాలుగా ఉండనిచ్చి, హాయిగా జీవించే అవకాశాలున్నా కూడా అతను భారతదేశాన్నంతటినీ ఒకే దేశంగా, ఒకే జాతిగా భావించి, దాని సమగ్రత, అఖండతలకు విఘాతం కలిగించే శక్తులను అణచకుండా విడిచిపెట్టలేదు. దీనికోసం అతన్ని హిందూవ్యతిరేకి, షియా వ్యతిరేకి లాంటి రకరకాల నిందలకు గురిచేసినప్పటికీ, అతని లక్ష్యం అఖండ భారతం, సమైక్యభారత జాతి. ఈ విషయం మేమే కాదు, నిష్పక్షపాతులైన చరిత్రకారులు కూడా ఇదే చెప్పారు.

"మత పక్షపాతాన్ని, ద్వేషాన్ని విడనాడి ఔరంగజేబ్ నడవడికల్ని, కార్యాచరణను అధ్యయనం చేస్తే, అతను మరాఠాలు, రాజపుత్రుల్ని అణచడానికి చేసిన ప్రయత్నాలన్నీ, ధార్మిక పక్షపాతంతో, ధార్మికంగా హింసించే ఉద్దేశంతో కాకుండా, ఒక పరిపాలకుడు, ఒక రాజు తన

రాజ్యంలో శాంతి భద్రతలకోసం, దేశ సమైక్యత, సమగ్రతల కోసం అరాచకాల్ని, విద్రోహాల్ని, తిరుగుబాట్లను ఎలా అణచివేయాలో అతనూ అలాగే చేశాడని అంగీకరించక తప్పదు. అతను కిరీట, సింహాసనాల పరిరక్షణ కోసం, దేశంలో సమైక్యత, సమగ్రతల్ని ఏర్పాటు చేసే నిమిత్తం రాజపుత్రుల్ని, మరాఠాలను, బుందేలాలను, సత్నామీలను, అఫ్గన్‌లను, బీజాపూర్ గోల్కొండలను అందరినీ అణచివేశాడు. ఇదేమీ అనూహ్య విషయం కాదు, గడిచిన కాలాల్లో మన సెక్యులర్ ప్రభుత్వానికి హైద్రాబాద్, కాశ్మీర్, గోవా, బంగ్లాదేశ్ మరియు పంజాబ్‌లలో ముస్లింలకు, క్రైస్తవులకు, సిఖ్ఖులకు వ్యతిరేకంగా ఎలాంటి సైనిక చర్యల్ని గైకొనవలసివచ్చిందో మనకు తెలియని విషయం కాదు, ఈ యుద్ధాలు, ఈ రక్తపాతం మత పక్షపాతంతో, ద్వేషంతో చేసినవి కావే! ఔరంగజేబ్ కాలంలో జరిగినవి కూడా వీటికి భిన్నమేమీ కాదు. ఇవన్నీ న్యాయమూ, సముచితమూ, సమంజసమనిపించి నప్పుడు, అవి కూడా అలాగే భావించబడాలి. కె.యం. పానీకర్ కూడా "ఔరంగజేబ్ చేసిన యుద్ధాలన్నీ కూడా భారతదేశాన్ని సమైక్యపరచడానికి, సంయుక్త పరచడానికి చేసినవి మాత్రమే" అంటూ అత్యంత హృదయ విశాలత్వంతో దీన్ని అంగీకరించారు. (ఎ సర్వే ఆఫ్ ఇండియా పేజి 159). ప్రొఫెసర్ జదూనాథ్ సర్కార్ తన ప్రఖ్యాత గ్రంథం "ఔరంగజేబ్" పీఠికను ఇలా ప్రారంభించారు.

"ఔరంగజేబ్ చరిత్ర అంటే ఆచరణాత్మకంగా యాభై సంవత్సరాల భారతదేశ చరిత్రే. అతని ప్రభుత్వం (1658-1707) పదిహేడవ శతాబ్దపు చివరి అర్ధ భాగాన్ని పరివేష్టించి ఉంది. మన దేశానికి సంబంధించి చారిత్రక రీత్యా అతి ముఖ్య కాలం. ఈ పరిపాలకుని శుభకాలంలోనే మొగలు సామ్రాజ్యం తన శిఖరాన్నందుకున్నది. చరిత్ర ప్రారంభం మొదలు కొని, బ్రిటిష్ రాజ్య స్థాపన కాలం వరకు, ఇంతటి సువిశాలమైన సామ్రాజ్యం భారతదేశంలో వేరొకటి ఏర్పడి ఉండలేదు. గజనీ మొదలుకొని చిటగాంగ్ వరకు, కాశ్మీర్ మొదలుకొని కర్ణాటక వరకు దేశమంతా కూడా ఒకే పరిపాలకుని అధీనంలోకి వచ్చింది. లద్దాఖ్ మొదలుకొని మలబార్ లాంటి సుదూర ప్రాంతాల్లో సైతం ఈ రాజు పేరే ఉచ్చరించబడేది. ఇస్లాం చివరి మరియు అన్నిటికన్నా గొప్ప అభివృద్ధి ఆ కాలంలోనే జరిగింది. ఈ విధంగా ఏర్పడిన ప్రభుత్వం ఒకే రాజకీయ సమైక్యంగా ఉండేది. దాని వివిధ ప్రాంతాలు, సామంత రాజుల అధీనంలో లేవు. దానికి భిన్నంగా దేశమంతా కూడా ఎలాంటి మధ్యస్థం లేకుండా సూటిగా ఒకే రాజు పరిపాలన క్రిందకి వచ్చింది. ఈ విధంగా ఔరంగజేబ్ కాలం నాటి భారత సామ్రాజ్యం, అశోకుడు, సముద్రగుప్తుడు, లేక హర్షవర్ధనుని కాలం నాటి రాజ్యాలకన్నా కూడా సువిశాలమైనది. అప్పటి వరకు ఏ రాష్ట్రానికి చెందిన గవర్నరు కూడా విద్రోహానికి, తిరుగుబాటుకు సాహసించలేక పోయాడు. అక్కడక్కడ విద్రోహాలు బయల్పడినా కూడా, ఏ ఒక్క రాష్ట్రంలో కూడా డిల్లీ చక్రవర్తి ఆదేశాల్ని ధిక్కరించ సాహసించే ఒక్క వ్యక్తి కూడా జన్మించి ఉండలేదు." (ఔరంగజేబ్-జదునాథ్ సర్కార్, వా-1, పీఠికలో) మొట్టమొదటిసారిగా భారతదేశ భౌగోళిక మరియు రాజకీయ సమైక్య తను ఏర్పరిచే భావన, ఔరంగజేబ్ ఇచ్చిందే. (భారతజాతికి) అతను చేసింది ఇదో మహోన్నత ఉపకారం. ఈ భావనను కార్యరూపంలో ప్రత్యక్షంగా ప్రదర్శించడానికి అతను

చేపట్టిన కార్యక్రమాలను ధార్మిక పక్షపాతంతోగాని, ధార్మిక హింసతోగాని ఎలాంటి ప్రమేయమూ లేదు. సంబంధమూ లేదు. ఇవన్నీ కేవలం రాజకీయపరమైనవి మాత్రమే. (దేశసమగ్రత, సమైక్యతలకోసం) అతను చేపట్టిన కార్యక్రమాలన్నీ కూడా రాజకీయపరమైనవి, సైనికపరమైనవి మరియు జాతిపరమైనవే తప్ప, అతను ధార్మిక పక్షపాతానికి, ద్వేషానికి లోనై చేసినవి ఎంతమాత్రం కావు." (హిందుస్తాన్ కే ..... సబాహుద్దీన్ అబ్దుర్రహ్మాన్, వా-3, పేజి 30, 31).

ఈ విషయాన్ని జదూనాథ్ సర్కార్ ఇలా పేర్కొన్నారు :

"మొగలులు భారత దేశానికేమిచ్చారు, వారి సామ్రాజ్య సరిహద్దులు సువిశాలమై పోయినప్పుడు, మనదేశ అత్యధిక ప్రాంతాలు అందులో చేరిపోయాయి. ఇదెంత విశాలమై పోయిందంటే అశోక చక్రవర్తి మరియు సముద్రగుప్తుని రాజ్యాల కన్నా కూడా విశాలమైపోయింది. హిందువుల సామ్రాజ్య కాలంలో అనేక సూబాలు స్వతంత్రంగా ఉండేవి. అవి అత్యంత బలహీన పద్ధతిలో ఒకదానితో ఒకటి సంబంధాలు కలిగి ఉండేవి. అవన్నీ ఒకే విధంగా లేవు. వాటిలో సారూప్యత లేదు, రాజకీయ ఐక్యత లేదు, జాతీయ భావన కూడా లేదు. ప్రతి సూబా జీవన సరళి వేర్వేరుగా ఉండేది. ఒక కేంద్ర శక్తి ఏజంట్ అజమాయిషి ఉన్నా కూడా వాటిలో ప్రాచీన తరహా పరిపాలనే కొనసాగుతుండేది. దీనికి భిన్నంగా రెండువందల సంవత్సరాల మొగలు పరిపాలనా అనగా అక్బర్ పట్టాభిషేకం మొదలుకొని ముహమ్మద్ షా కాలం వరకు (1556-1749) ఉత్తర భారతం మరియు దక్కన్‌లోని అత్యధిక ప్రాంతంలో ప్రభుత్వ భాష, పరిపాలనా వ్యవస్థ, కరెన్సీ (నాణెములు), అందరి సంయుక్త భాషలో అత్యంత సారూప్యత, ఐక్యత కనబడసాగింది. ఏ ప్రాంతాలైతే మొగలులకు లోబడి లేవో, అక్కడి హిందూ రాజులు కూడా వారి పరిపాలనా పద్ధతుల్ని సంస్కరణల్ని, దర్బారు మర్యాదల్ని, నాణేల వ్యవస్థను దాదాపుగా అనుసరించారు.

మొగలుల కాలంలో ముప్ఫది రెండు సూబాలుండేవి. అయితే అన్నిటిలో ఒకే రకమైన వ్యవస్థ నడిచేది. వారి రాజ బిరుదుల్లో, ప్రభుత్వ పద్ధతుల్లో కూడా ఏకత్వం కనబడుతుండేది. ప్రభుత్వానికి సంబంధించి అన్ని పత్రాల్లో, ఫర్మానాల్లో, రహదారి అనుమతి పత్రాల్లో, రశీదుల్లో అన్నిటిలో పర్షియన్ భాష ఉపయోగించబడేది. వాడుకలో ఉన్న నాణేలు ప్రతిచోట ఒకే రకమైనవి, ఒకే విలువగలిగినవై ఉండేవి. ప్రభుత్వాధికారులు, సైనికులు ఒక సూబా నుండి వేరొక సూబాకు బదిలీ అవుతుండేవారు. ఒక సూబా నుండి వేరొక సూబాకు వెళ్ళిన మనిషికి ఇంటిలాగే సౌకర్యం లభించేది. వ్యాపారులు, యాత్రికులు ఒక సూబా నుండి వేరొక సూబాకు, ఒక నగరం నుండి వేరొక నగరానికి సర్వ సౌకర్యాలతో ప్రయాణించేవారు. సువిశాలమైన ఈ దేశాన్ని ఒకే రూపంలో, ఒకే రకంగా కనుగొనేవారు. ఇలాంటి రాజకీయ సమీకరణ వల్ల నేషనాలిటి అంటే జాతీయత అయితే ఏర్పడలేదు. ఎందుకంటే ఆ కాలంలో ప్రజలకు పౌర

హక్కులులేవు. (రాజకీయ హక్కులు లేవు). అంతేకాకుండా ప్రభుత్వాన్ని నడిపించడంలో కూడా వారికి ఎలాంటి భాగస్వామ్యం లేకుండేది. వారు సిటిజన్‌లు (పౌరహక్కులు కలిగినవారు) కాకపోయినప్పటికీ ఒకే సామ్రాజ్యంలో నివసిస్తున్న సమాన పాలితులు (ప్రజలు) అనే విషయాన్ని కాదనలేము? (మొగల్ అడ్మినిస్ట్రేషన్, అధ్యాయం - 13, పేజి 238, 239)[1]

## జాతీయవాదం :

ఔరంగజేబ్ జాతీయవాదాన్ని, దేశసమగ్రత అఖండత కోసం అతను పడినపాట్లు, చివరికి చరిత్రలోనే మొదటిసారిగా మొత్తం భారత ఉపఖండాన్ని ఒకే దేశంగా, ఒకే జాతిగా ఐక్యపరచడంలో అతను సఫలీకృతుడవడం ఇత్యాది విషయాల్ని డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, ప్రొఫెసర్ పాట్నా యూనివర్శిటీ, ఒక వినూత్న రీతిలో, సంభ్రమాశ్చర్యాల్ని కలిగించే విధంగా, ఎంతో ఆసక్తిదాయకంగా విశ్లేషించారు. సందర్భోచితంగా ఉండడంతో మన పాఠకుల కోసం ఇక్కడ పొందుపరుస్తున్నాము.

"సర్వ భారతావనిని ఒకే దేశంగా గుర్తిస్తూ, జాతి ధర్మాలకు ఎలాంటి ప్రాధాన్యత నివ్వకుండా కేవలం సామాజిక, ఆర్థిక, రాజకీయ మరియు సాంస్కృతిక కోణాలకే ప్రాధాన్యత నివ్వాలని చరిత్రకారులు ఎప్పటి నుండో ప్రయత్నిస్తున్నారు. ఇంకొక విషయం ఏమిటంటే ప్రజల్లో ఐకమత్యాన్ని నెలకొల్పడంలోనూ, దాన్ని ఛిన్నాభిన్నం చేయడంలోనూ చరిత్ర లేఖనానికి ప్రత్యేక స్థానముందని స్పష్టంగా అర్థమవుతున్నది.

బూటకపు చరిత్ర లేఖనం కారణంగానే నేటి వరకు కూడా మన విద్యా సంస్థలు మత, జాత్యాహంకారుల కబంధ హస్తాల్లో నుండి బయట పడలేకపోయాయి. స్కూళ్లు, కాలేజీలకయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది. కాని పిల్లల్ని విద్య పేరుతో పరస్పర అసహ్యత, అసహనాలకు, వైషమ్యాలకు గురిచేయడం జరుగుతున్నది. ధర్మ నిర్పేక్షతకు రెండు పక్షాల నుండీ చాలెంజీ చేయడం జరుగుతున్నది. ఒకవైపు హిందూత్వ వాదులు అన్ని ప్రత్యేకతల్ని సమాప్తంచేసి, ఏకీకరణం (భారతీకరణ్) (అంటే ఒకే సంస్కృతిని) అవలంబించాలని ఒత్తిడి చేస్తుంటే, వేరొకవైపు సిక్ఖులు మరియు ముస్లింలు ధార్మిక విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తూ ధర్మం రాజకీయం నుండి వేరు కాదనే భావనపై మొండికేసి కూర్చున్నారు. ధర్మ నిరపేక్షతతో కూడిన రాజనీతికి నిస్సందేహంగా ఇది విరుద్ధమే.

అన్ని సాక్ష్యాల్ని పక్కకు పెడుతూ, నేటికి కూడా కొందరు విద్వాంసులు మన దేశపు మధ్య కాల చరిత్రను హిందూ-ముస్లింల మధ్య అసహనానికి, వైషమ్యానికి శత్రుత్వానికి ప్రతీకగా ప్రదర్శిస్తున్నారు. సామాజికంగా మరియు సంస్కృతిపరంగా రెండు వర్గాల మధ్య ఆ కాలంలో మంచి సుహృద్భావ సంబంధాలుండేవి. నేడు మన వద్ద సంగీతం, లలితకళలు, చిత్ర లేఖనం, వాస్తుకళ మరియు సాహిత్యాల రూపంలో విలువైన ఏ సంపద అయితే ఉందో, అది ఈ రెండు

వర్గాలు శతాబ్దుల తరబడి ఉమ్మడి శ్రమతో సాధించిన విజయాలు. ఐదారు శతాబ్దాల కాలంలో సాధించిన ఈ వారసత్వంలో ఏ వర్గం వారి భాగమెంత? ఎవరందులో ఎంతగా దోహదపడ్డారో అన్వేషించడం, విశ్లేషించడం నేడు కూడా అసంభవమైన విషయమే.

పై విషయాల్ని దృష్టియందుంచుకొని, జాతీయ శాసకులుగా పిలువబడే కొందరు రాజుల గురించి విచారించవలసిన ఆవశ్యకత ఉంది. జాతీయ పాలకులుగా గుర్తింపు పొంది ప్రఖ్యాతిగాంచిన వారిలో మౌర్యసామ్రాట్ అశోకుడు, ఆ తరువాత మొగలు చక్రవర్తి అక్బర్ ప్రముఖులు.

సుదూరాల్లో వ్యాపించి ఉన్న అశోకుని స్థూపాలు, దానిపై చెక్కబడిన లేఖనాలు అతని లోకప్రియత్వానికి నిరాకరించలేని సాక్ష్యాలు. వాయవ్య ప్రాంతాలైన మాన్‌సెహ్రా, షహ్‌బాజ్‌గడి, లాంధన్ ఇంకా దూరం వరకు, పశ్చిమంలో ఖాందహార్ వరకు ఇవి కనబడతాయి. అతను ఖాందహార్, కంబోజ్ మరియు యవనులను తన సరిహద్దులపై చూపించాడు. సామ్రాజ్య పశ్చిమ సరిహద్దులపై సిరియాకు చెందిన అంతియోకస్ ద్వితీయ రాజ్యముండేది. పైనుదాహరించిన మూడు ప్రాంతాల ప్రజల్ని, ఖచ్చితంగా సరిహద్దు అంచుపై ఉన్నారని స్పష్టంగా చెప్పలేము. ఈ ప్రజలు సామ్రాజ్య పరిధి లోపలున్నారా లేక సరిహద్దుపై ఉన్నారా అనేది నిశ్చయంగా తెలియదు. అభిలేఖనాల ద్వారా వీరు సామ్రాజ్య పరిధిలోపల్నే ఉండేవారని తెలుస్తుంది. ఇక దక్షిణ సరిహద్దులపై చోళులు, పాండ్యులు, సత్యపుత్రులు, కేరల్ పుత్రుల రాజ్యాలుండేవి. అక్కడ అశోకుని స్థూపాలుగాని, అభిలేఖనాలు గాని కనబడవు. దీనివల్ల పై నుదాహరించిన రాజ్యాలు మౌర్యుల అధీనంలో కాక సర్వసత్తాక, స్వాతంత్ర రాజ్యాలుగా ఉండేవనే విషయం స్పష్టమైపోతోంది. *(అశోక్ తథా మౌర్య సామ్రాజ్ కా పతన్–రోమిల్లా థాపర్, పేజి 131, 1977 ఢిల్లీ)*

జాతీయ సమైక్యత, దేశసమగ్రతకు చిహ్నంగా పేర్కొనబడే, ప్రజారంజకుడైన పరిపాలకుడు అశోక్ చక్రవర్తి కాలం నాటి అతని రాజ్యం మరియు రాజ్య విస్తరణపై దృష్టి సారించినప్పుడు, దక్షిణ భారతదేశంలోని మూడవ వంతు భాగము ఏనాడు కూడా అశోకుని అఖండ భారతదేశంలోని ఒక భాగం కాలేకపోయింది.

అశోకుని తరువాత భారతీయ చరిత్రలో అక్బర్‌ను రెండవ సుప్రసిద్ధ జాతీయ పాలకునిగా గుర్తించడం జరుగుతుంది. మొగలు వంశంలో అక్బర్ అత్యంత ప్రఖ్యాతి గాంచిన రాజనే విషయంలో భేదాభిప్రాయం లేదు. అక్బర్ చక్రవర్తి, ఒక సువిశాల భారత సామ్రాజ్యాన్ని స్థాపించడంలో కృతార్థుడయ్యాడు. అయితే అశోకుని లాగానే, దక్షిణ భారత సూబాలు అతని అధీనంలోకి రాలేకపోయాయి. అతను తన సైనిక కార్యకలాపాల ద్వారా, సైనిక వ్యూహాల ద్వారా, విజయ ప్రణాళికల ననుసరించి కూడా కేవలం అహ్మద్‌నగర్ రాజ్యం వరకున్న ప్రాంతాల్ని మాత్రమే తన సామ్రాజ్య పరిధిలోకి, ఏకీకృత రాజకీయ సంఘటిలోకి తేగలిగాడు అంటే రాజకీయంగా ఒకే శాసనం క్రిందికి తేగలిగాడు. అయితే వాస్తవ పరిస్థితి ఏమిటంటే బీజాపూర్,

గోల్కొండ మరియు అహ్మద్ నగర్ రాజ్యాలు ఉద్రిక్తతను మరియు యుద్ధాల్ని కొనసాగిస్తూ, అక్బర్ చక్రవర్తికి తలనొప్పిగానే ఉంటూ వచ్చాయి. అంటే దీని అర్థం అతనక్కడ తన అధికారాన్ని, ప్రభుత్వాన్ని స్థాపించలేకపోయాడు.

అశోకుడు మరియు అక్బర్‌కు సంబంధించి పై విశ్లేషణతో మనం ఏకీభవిస్తాం, అయినప్పటికీ వారిని మహోన్నత మరియు అఖిల భారత పాలకులుగా గుర్తిస్తూనే ఔరంగజేబ్ విషయంలో మాత్రం అన్యాయం చేస్తాం.

పైన పేర్కొన్న పాలకులతో ఔరంగజేబ్‌ను పోల్చకుండా ఉన్నా కూడా, ఔరంగజేబ్ జీవితం, అతని వ్యక్తిత్వం, అతని కార్యకలాపాలతో కూడిన అరవై సంవత్సరాల సుదీర్ఘకాలం, స్వయంగా భారత చరిత్రగానే పరిగణింపబడుతుంది. 1658 నుండి 1707 వరకు అనగా యాభై సంవత్సరాలు అతను రాజ్యమేలాడు. అతని కాలంలో మొగలు సామ్రాజ్యం తన వైశాల్యపు చివరి అంచుకు చేరుకుంది. ప్రాచీన కాలం నుండి ఆంగ్లేయుల ప్రభుత్వం స్థాపించబడేంత వరకు, భారతదేశంలో ఎన్నడూ ఇంతటి సువిశాలమైన సామ్రాజ్యం ఏర్పడి ఉండలేదు. గజినీ మొదలుకొని చిటగాంగ్ వరకు, కాశ్మీరం మొదలుకొని కర్నాటక వరకు సువిశాల భారతదేశం ఒకే పాలకుడు ఔరంగజేబ్ పాలన క్రింద ఉండేది. ఈ రాజ్యంలోని వివిధ ప్రాంతాల పరిపాలనా వ్యవహారాలు, ఏర్పాట్లు, వివిధ చిన్న చిన్న పరిపాలకుల (నవాబులు, రాజులు) ద్వారా కాకుండా నేరుగా చక్రవర్తి ద్వారా నియమింపబడిన అధికారుల ద్వారా జరుపబడేవి. ఈ ప్రత్యేకత కారణంగానే, ఔరంగజేబ్ కాలం నాటి భారత సామ్రాజ్యం, అశోకుడు, సముద్రగుప్తుడు, లేక హర్షవర్ధనుని కాలం నాటి సామ్రాజ్యలకన్నా విశాలంగానూ, పరిపూర్ణంగానూ ఉండేది.

ఔరంగజేబ్ కాలం నాటి ఈ సువిశాల సామ్రాజ్యం అతని యోగ్యత మరియు అత్యధిక ప్రజల సమర్థన ఫలితంగానే ఏర్పడగలిగింది. ఇక్కడ నివసిస్తున్న సర్వ జాతులకు, సముదాయాలకు సమాన హక్కు అధికారాలు, సాధనాలు మరియు సౌలభ్యాలు లభించినప్పుడే ఇంతటి విశాల సామ్రాజ్య నిర్మాణం సంభవమవుతుంది. పరస్పరం భిన్నాభిప్రాయాలున్నప్పటికీ కూడా ముఖ్యమైన కొన్ని ప్రత్యేక విషయాల్లో మాత్రం ఎన్నడూ వ్యతిరేకత ఏర్పడలేదు. దీని ఫలితంగానే హిందూ–ముస్లింలిద్దరూ భుజాలకు భుజాలు కలిపి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడగలిగారు. ఈ ఐకమత్యమే ఒక ఆయుధంలా పనిచేస్తూ, ఆంగ్లేయుల ప్రణాళికలన్నిటినీ వమ్ము చేయగలిగింది. ఈ ఐకమత్యపు పునాది మొదటిసారి అశోకుని కాలంలో, రెండవసారి అక్బర్ కాలంలో గట్టిపడితే, ఔరంగజేబ్ కాలం నాటి భారత దేశంలో చివరిసారిగా, సంపూర్ణ రూపంలో ప్రత్యక్షమయింది.

ఔరంగజేబ్ కాలంలో భారత దేశంలో కనిపించే శక్తులన్నీ కూడా (బీజాపూర్, గోల్కొండ, మరాఠా, రాజపుత్ర, అఫ్ఘాన్ మరియు సిక్ఖులు) ప్రాంతీయ (స్థానిక) శక్తులే. వీటన్నిటిలో ఏదీ కూడా ప్రాంతీయతను దాటి జాతీయ శక్తిగా మారే యోగ్యత, సమర్థతలు కలిగి లేవు.

మొత్తం భారత జాతిని ఐక్యత అనే దారంలో దూర్చడానికి ప్రయత్నించి, చివరికి సఫలమైన ముస్లిం వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలా లేక హిందూ-ముస్లిం లిద్దరూ ఉండి ఈ జాతి సమైక్యతను ఛిన్నాభిన్నం చేయడంలోనే తమ సమయాన్ని వెచ్చించిన వారికి ప్రాధాన్యత నివ్వాలా అనే విషయం నేటికీ చరిత్రకారుల మధ్య ఒక ముడివిప్పరాని చిక్కు సమస్యగానే ఉంది. ఇంకోరకంగా చెప్పాలంటే చరిత్రకారులు దేశాన్నంతటినీ ఉత్తరం నుండి దక్షిణం వరకు తూర్పునుండి పశ్చిమం వరకు ఒకే బంధంలో బంధించగోరిన శక్తిని సమర్థించాలా (కాని నా దుర్భాగ్యమో లేక మన దుర్భాగ్యమో గాని అది ఓ ముస్లిం శక్తి) లేక కేవలం తమ స్వంత ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యత నిస్తూ కేంద్ర అధికారపు వేళ్ళను కదిలించడానికి, దాన్ని ఊడబెరకడానికి సతతం ప్రయత్నించిన ప్రాంతీయ శక్తులను సమర్థించాలా? (ఈ ప్రాంతీయ శక్తుల్లో హిందూ-ముస్లింలిద్దరూ ఉన్నారు. కాని ఆ తరువాత వచ్చిన సంకుచిత చరిత్రకారులకు కేవలం హిందూశక్తుల పేర్లే జ్ఞాపకముండిపోయాయి). అలా జరగడమే మంచిదైందని హృదయం సమర్థిస్తున్నది. ఒకవేళ మరాఠాలు పదే పదే తమ దొబ్బులతో కేంద్రంలో పటిష్ఠంగా ఉన్న ఔరంగజేబ్ ప్రభుత్వాన్ని బలహీనపరచకపోతే, ముస్లింల పటిష్ఠమైన ఈ ప్రభుత్వం ఎంత కాలం వరకు ఎంత దూరం వరకు కొనసాగేదో అంచనా వేయడం కష్టం. మధ్యలో ఆంగ్లేయుల ప్రభుత్వం వచ్చిపోయినా ఫరవాలేదు. కాని ముస్లిం ప్రభుత్వం నుండి మాత్రం శాశ్వతంగా విముక్తి లభించింది. కాని బుద్ధివివేకాలు మాత్రం అలా జరిగివుండేది కాదంటున్నాయి. ఒకవేళ కేంద్రమే గనక బలహీనపడక పోతే, విదేశీ శక్తులకు మన వైపు ప్రలోభదృష్టితో చూచే ధైర్యమే ఉండకపోయేది. ఇక దేశాన్ని వశపర్చుకునే ప్రసక్తి ఎక్కడ? ఒకవేళ అలా జరిగి ఉండకపోతే (అనగా కేంద్రం బలహీనపడి విదేశీయులకు హస్తగతం కాకపోతే) టిప్పు సుల్తాన్, సిరాజుద్దౌల, బహాదూర్ షా జఫర్, వీర్ కంవర్ సింగ్, రాణి ఝాన్సీ, తాంతియాతోపే మరియు హజ్రత్ మహల్ లాంటివారు విదేశీ శక్తుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకోవడం తప్ప మాతృభూమి కోసం ఏమీ చేయలేక పోవడానికి బదులుగా దేశ సమైక్యత, సమగ్రతలనబడే సుందర సౌధాన్ని నిర్మించడంలో కృతార్థులయ్యేవారు. ఇంకా అలా జరిగి ఉండకపోతే బహుశ మనదేశం ఎన్నటికీ మూడు ముక్కలుగా విభజించబడక పోయేదేమో! (ఔరంగజేబ్- ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 49-53)

ఔరంగజేబ్ తన నిరంతర శ్రమ, దూరదృష్టితో స్థాపించిపోయిన సువిశాల భారత సామ్రాజ్యం, భారత చరిత్రలో తనకు తానే సాటి. ఇంతటి సువిశాల సామ్రాజ్యం అంతకు ముందుగాని, ఆ తరువాత నేటి వరకు గాని ఏర్పడి ఉండలేదు. అఫ్గానిస్తాన్ నుండి టిబెట్ వరకు, కాశ్మీరం నుండి కావేరీ వరకు సువిశాల భారత సామ్రాజ్యంలో రాజ్యానికి లేక కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ ఒక్కరూ తిరుగబడ సాహసించలేక పోయేవారు. అంతకు ముందు తిరుగబడి విద్రోహం లేపిన మరాఠాలు, రాజపుత్రులు, సిక్ఖులు, అఫ్గన్లు, గోల్కొండ, బీజాపూర్‌లు, కఠినంగా అణచివేయబడ్డారు.

ఔరంగజేబ్ స్థాపించిన సామ్రాజ్యం, దాని పటిష్ఠతపై జదూనాథ్ సర్కార్ ఇలా వ్యాఖ్యానించారు :

"1662లో నెల పదిహేను రోజులు అతను అస్వస్థుడయ్యాడు. రాజ్యమంతటిలో చింతా వ్యాకులతలు వ్యాపించిపోయాయి. కాని ఈ వ్యవధిలో రాజ్యమంతటిలో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ప్రశాంతంగా ఉండిందో, దానివల్ల అతని నడవడికలు, ప్రవర్తన, అతను స్థాపించిన ప్రభుత్వ పటిష్ఠత ఎలాంటిదో అర్థమైపోయింది. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వా-3, పేజి 8,9)

"ఔరంగజేబ్ కాలంలో ఏర్పడినంత సువిశాల సామ్రాజ్యం, భారతచరిత్రలోనే ఏర్పడి ఉండలేదు. గజినీ నుండి చిటగాంగ్ వరకు, కాశ్మీరం నుండి కర్నాటక వరకు మొత్తం భారత ఉపఖండం ఒకే ఏలిక కిందికి వచ్చేసింది. లద్దాఖ్, మలబార్‌లలో సైతం అతని పేరు ఉచ్చరించబడేది. ఏ సూబాకు చెందిన గవర్నరు అయినాసరే, పన్నుల్ని ఆపలేదు, అతని ఆజ్ఞల్ని ఉల్లంఘించలేదు. అక్కడక్కడ కొన్ని తిరుగుబాట్లు పొడసూపినా గాని, ఒక స్వతంత్ర రాజ్యం, ప్రభుత్వం ఏర్పాటుచేసే ధైర్యం ఏ ఒక్కరిలో లేకపోయింది." (వా-1, పీఠిక, పేజి XI)

"అమితాశ్చర్యకరమైన అతని యోగ్యత, ఉన్నతమైన నైతిక శక్తి, విధుల నిర్వర్తనలో గల చురుకుదనం - ఇవన్నీ కలిసి అతని రాజ్యం, పరిపాలనలో ఎలాంటి ఐక్యతను, పటిష్ఠాన్ని రూపొందించాయంటే, అతని తరువాత కూడా ఢిల్లీ పరిపాలనా వ్యవస్థ ఐక్యంగా, దృఢంగా ఉండగలిగింది. మరియు అతని తరువాత ముప్పది సంవత్సరాల వరకు ఇందులో ఎలాంటి బలహీనత, మార్పు జొరబడలేకపోయింది. సరిహద్దు సూబాల్లో ఏదీ జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం యధావిధిగా కొనసాగింది." (ఫాల్ ఆఫ్ ది మొగల్ ఎంపైర్ - జదూనాథ్ సర్కార్, వా-1, పేజి2)

"అతను పట్టాభిషిక్తుడైన రెండు సంవత్సరాల్లోనే వారి (ఈ కొత్త) ప్రభువు రాజ్యంలో (దేశంలో) హింస, అరాచకాన్ని భరించే వాడు కాదని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారికి గుణపాఠం నేర్పాడు." (హి.ఆఫ్.ఔ. - యధూనాథ్ సర్కార్, వా-3, పేజి 13)

జదూనాథ్ సర్కార్ ఔరంగజేబ్‌ను సూపర్‌మాన్ (వా-5, పేజి 262) గాను, ఐడియల్ క్యారక్టర్ (వా-5, పేజి 366) గాను పేర్కొన్నారు.

పదిహేడవ శతాబ్దంలో ఔరంగజేబ్ ద్వారా స్థాపించబడిన భారత సామ్రాజ్యం అత్యంత శక్తిసామర్థ్యాలు కలిగిన రాజ్యం. ప్రపంచంలోని ఏ ఒక్క శక్తికి దాని వైపు కన్నెత్తే ధైర్యం లేదు.

"హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు" అనే తన హిందీ పుస్తకంలో "అఖ్‌లేష్ జైస్వాల్" ఇలా వ్రాశారు : "ఔరంగజేబ్ వాస్తవమైన క్యారెక్టర్‌ను (నడవడికల్ని) మనం తెలుసుకోదలిస్తే, ఆంగ్లేయులు మన మనోమస్తిష్కాల్లో, నరనరాల్లో నింపేసిన విషపూరిత మతతత్వ మరియు వ్యతిరేక భావనల నుండి బయటికి రావల్సి ఉంటుంది. ఆ తరువాత ఔరంగజేబ్‌ను చూస్తే

అతని రూపం మనకు వేరే రకంగా కనబడుతుంది. ఒక విశాల హృదయుడు, సెక్యులర్ భావాలు గల, పరాక్రమ శాలి అయిన ఒక పరిపాలకునిగాను, భారతదేశాన్ని ఒక "అఖండ భారత" రూపమివ్వడానికి ప్రయత్నించిన రాజుగా కనబడతాడు. ఈ రెండింటిలో (అనగా అఖండ భారతంగా, అగ్రరాజ్యంగా మార్చడంలో) అతను దాదాపు సంపూర్ణంగా సఫలీకృతుడయ్యాడు. అతనొక సువిశాల, పటిష్ఠమైన సామ్రాజ్య నిర్మాణానికి కృషి చేశాడు.

అతను దాదాపు ఇరవై సంవత్సరాలు దక్షిణ భారతంలో గడిపాడు. కాని ఈ సుదీర్ఘ కాలంలో మొత్తం ఉత్తర భారతంలో ఏ ఒక్కచోట కూడా అశాంతి, అరాచకాలు తలెత్తలేదంటే ప్రభుత్వంపై అతనెంత గట్టి పట్టుగలవాడో అర్థమైపోతుంది. ఇంకా ఆ కాలంలో ప్రయాణ సౌకర్యాలు, ప్రచార ప్రసార మాధ్యమాలు బహు పరిమితంగా ఉన్నాయి. హిందూ ముస్లిం ఐక్యత శిఖరాన్ని అందుకోగలిగే ఒక సెక్యులర్ భారతదేశ నిర్మాణం కోసం అతను కృషిచేశాడు. అతని మరణంతో ఈ ప్రయత్నాలన్నీ వీగిపోయాయి. కాని అతని సంకల్పాన్ని, అతని ఘనకార్యాలను ఈ విఫలతతో ముడి పెట్టలేం. దీనితో అతనికి సంబంధం లేదు." (పే.102)

ప్రపంచంలోని అనేక రాజ్యాలు భారత మొగలు సామ్రాజ్యాన్ని గౌరవ పూర్వకంగా చూసేవి. దానితో సంబంధాల నేర్పరుచుకోవడం తమకు గౌరవప్రదంగా భావించేవి. 1661 నుండి 1667 మధ్య కాలంలో మక్కా పాలకుడు, ఇరాన్, బల్ఖ్, బుఖార, కాష్గర్, ఖైవా మరియు షహర్నే పరిపాలకులు మొగలు దర్బారులో తమ ప్రతినిధి బృందాల్ని పంపించాయి. బస్రా, హిజిర్‌మౌత్ మరియు యమన్ లాంటి టర్కిష్ సూబాల ప్రతినిధులు కూడా ఢిల్లీ దర్బారును సందర్శించుకున్నారు. బర్బర్ పరిపాలకుడు, ఇథియోపియా రాజు రాయబారులు కూడా హాజరయ్యారు. 1690లో కాన్‌స్టాంటి నోపుల్ ప్రతినిధులు కూడా భారతదేశాన్ని సందర్శించి ఔరంగజేబ్‌ను కలుసుకున్నారు. పట్టాభిషేకం 12వ సంవత్సరంలో చైనా రాజు, రాయబారి సయ్యద్ అబ్దుల్ వహాబ్, ఔరంగజేబ్‌ను దర్శించుకున్నాడు. (మాస్సర్ ఆలంగీరి, ముస్తఅద్ ఖాన్, పే.22, 24, 36, 56).

ఔరంగజేబ్ స్థాపించిన ఆ సామ్రాజ్యం ఎంత సువిశాలమైందో, ఒక్కసారి ఆలోచించి చూడండి. నేడది ఆఫ్గానిస్తాన్, పాకిస్తాన్, ఇండియా, బంగ్లాదేశ్, టిబెట్ ఇన్ని వివిధ రాజ్యాలుగా ఏర్పడింది. ఈ వివిధ దేశాలు పరిపాలనా వ్యవహారాల్లో ఎన్ని చిక్కుల్ని ఎదుర్కొంటు న్నాయో, ఎన్ని అరాచకాల్ని, విద్రోహాల్ని, తిరుగుబాట్లను ఎదుర్కొని సతమతమవుతున్నాయో, పత్రికల ద్వారా మనం తెలుసుకుంటూనే ఉన్నాం! ఆ కాలంలో తంతి తపాల సౌకర్యాలు లేవు, రైళ్ళు, విమానాలూ లేవు. రాకపోకల కోసం అత్యధికంగా అశ్వాల మీదనే ఆధారపడిన కాలమది. ఇంత సువిశాల దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా, ఒకటి రెండు కాదు, యాభై ఏళ్ళు సుదీర్ఘంగా పరిపాలించగలిగాడంటే, ఈ అన్ని ప్రాంతాల ప్రజల సంపూర్ణ సహాయ సహకారాలు లేనిదే సాధ్యమవుతుందా? ఈ అధునాతన యుగంలో, ఫోన్లే కాదు, వైర్‌లెస్ మరియు శాటిలైట్

సౌకర్యాలు, అత్యంత అభివృద్ధి చెందిన సున్నితమైన సాంకేతిక పరిజ్ఞానం కనీవినీ ఎరుగని సైంటిఫిక్ సౌకర్యాలు ఉండీ కూడా అమెరికా దాని నాటో మిత్ర కూటమి దేశాలు, హింసా దౌర్జన్యాలకు ఎగబడికూడా, ఒక్క అఫ్‌గానిస్తాన్‌పై పట్టు సాధించలేక పోతున్నాయే, అలాంటిది ఔరంగజేబ్ ఢిల్లీలో కూర్చుండి ఈ అన్ని ప్రాంతాల్ని ఎలా నియంత్రించగలిగాడో కాస్త ఊహించి చూడండి. దీనికోసం అసామాన్యమైన శక్తి సామర్థ్యాలొక్కటే సరిపోవు. ప్రజల హృదయాల్లో స్థానమేర్పరుచుకో గలగాలి. కులం, మతం, జాతి, ప్రాంతాల కతీతంగా ప్రజలందరినీ ఒకే దృష్టితో, కన్నబిడ్డల్లా చూసుకున్నప్పుడే, ఇంతటి సువిశాల సామ్రాజ్యాన్ని ఏలడం, సంరక్షించడం సాధ్యమవుతుంది. ఆ కాలంలో ప్రజాస్వామ్యం లేదు, ప్రజలకు ఓటు హక్కు లేదు. ప్రజల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే పరిపాలకులు రాజ్యాధికారాన్ని చేపట్టేవారు. ఔరంగజేబ్ కూడా అలాగే రాజ్యాధికారాన్ని చేబట్టాడు. కాని ఇంతటి సువిశాల సామ్రాజ్యంలో ఎంతటి చక్కని, న్యాయప్రదమైన మరియు అందరికీ ఆమోద యోగ్యమైన పరిపాలనను అందించాడో, అతని కాలం నాటి హిందీ, గోజర్ మరియు జైన కవులు రాసిన కవితలే ప్రత్యక్ష నిదర్శనాలు.

సింహాసనానికి, రాజ్యానికి తిరుగబడిన వారిని అణచివేయడం తప్ప, దేశంలోని హిందూ, ముస్లిం, సిఖ్ఖు, క్రైస్తవ, జైన, బౌద్ధ అన్ని సముదాయాల ప్రజలకు పూర్తి ఆత్మాభిమానాలతో, గౌరవప్రదంగా తమ తమ ధర్మాలను, ఆచార వ్యవహారాల్ని అనుసరిస్తూ సుఖశాంతులతో, సహజీవనం గడపడానికి ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరిచాడు. ఏ వర్గం కూడా ఏ ఇతర వర్గంపై హింసా, దౌర్జన్యాలకు, ఆధిక్యానికి పాల్పడకుండా నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించినప్పుడే, తన స్వంత సుఖసౌఖ్యాలకన్నా, ప్రజల సుఖ సౌఖ్యాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చినప్పుడే, తను, తన సంతానం, తన ఖజానా సమృద్ధికాదు, ప్రజల సమృద్ధే ప్రజల శ్రేయోసాఫల్యాలే జీవన లక్ష్యంగా ఏర్పరుచుకున్న పరిపాలకుడే అలాంటి పరిపాలనను అందించగలుగుతాడు.

ఔరంగజేబ్ అలాంటి పరిపాలనను అందించగలిగాడని చరిత్ర సాక్ష్యాధారాలతో, సమకాలీన సాహిత్యాధారాలతో నిరూపిస్తూ వచ్చాము. భారతదేశాన్ని ఐక్య పరచడం, అఖండ భారతంగా మార్చడం అతని జీవన లక్ష్యం. ఆ లక్ష్యసాధనలో ఎవరడ్డం వచ్చినా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుకడుగువేయకుండా, ఆ లక్ష్యాన్ని సాధించి మరీ చూపించాడు. అది అతని కిరీట సింహాసనాల కోసమని, రాజ్యవిస్తరణ కాంక్షతో అని ఎవరైనా అనవచ్చు. అవును, ఆ కాలంలో కిరీట, సింహాసనాలే రాజ్యం. వాటి సుస్థిరతే రాజ్య సుస్థిరత. ఈ కిరీట సింహాసనాలు, రాజ్యం శాశ్వతంగా తనను అంటిపెట్టుకొని ఉంటాయని అతనెప్పుడూ అనలేదే! దానికి బదులు, ఈ కిరీట సింహాసనాలు, ఈ రాజ్యాలు నశ్వరమైనవని, ప్రజల సేవయే ఇహపరాల్లో సాఫల్యాన్ని చేకూర్చే సాధనాలని అతనెన్నో సందర్భాల్లో పేర్కొన్నాడు. అతను

తండ్రికి రాసిన లేఖల్లో, రాజ్యవిస్తరణ ముఖ్యం కాదని, ప్రజల సంక్షేమమే ప్రథమమని పేర్కొన్నాడు. ఇంకా ఈ రాజ్యం, రాజరికం అన్నీ కూడా దైవ ప్రసాదితాలని, ప్రజల సేవకోసమే ఇవి ఒక వ్యక్తికి ప్రసాదించబడతాయని విశ్వసించడమే కాదు, బహిరంగంగా ప్రకటించాడు కూడా.

తన రాజ్యంలోని మధ్యస్థాయి ప్రజలు తీసుకునే భోజనం కన్నా, తక్కువ స్థాయి ఆహారంతో సరిపెట్టుకున్న త్యాగశీలి. అందుకే ప్రజలు అతన్ని గౌరవించడమే కాదు, అభిమానించారు, ప్రేమించారు కూడా.

అతనే వర్గం వారిని హింసించలేదు, ఎవరిని అవహేళన చేయలేదు, ఎవరి ధర్మాన్ని, ధార్మిక ఆచార వ్యవహారాల్ని కించపరచనూ లేదు, జోక్యం చేసుకోనూ లేదు. అతను ప్రజలతో కోరింది ఒక్కటే. మీ మీ ఇష్టానుసారం, మీ మీ ధార్మిక ఆచార వ్యవహారాలతో, మీమీ నమ్మక విశ్వాసాల ప్రకారం సుఖశాంతులతో బ్రతకండి, ఇతరులను కూడా అలాగే బ్రతుక నివ్వండి. వేరొకరి వ్యవహారాల్లో జోక్యం చేసుకోకండి. ఇదే సరియైన పాలసీ. ఇదే సరియైన, సక్రమమైన రాజకీయ విధానం. దీన్ని ఎవ్వరు, ఎక్కడ, ఎప్పుడు ఆచరించినా అది సత్ఫలితాలనే ఇస్తుంది. సహజీవనానికి సంబంధించి ఇంతకన్నా మంచి చిట్కా, మానవ చరిత్రలో కనుగొనబడలేదు. జీవితాంతం తాను నమ్మిన ఈ పాలసీని కఠినంగా ఆచరిస్తూ వచ్చాడు కనుక ప్రజలు అతనితో సంతృప్తులై ఉన్నారు.

వివిధ ధర్మాలకు, విశ్వాసాలకు, ఆచార వ్యవహారాలకు, తరతరాలుగా ఆలవాలంగా ఉంటూ వచ్చిన భారత ఉపఖండం రాబోయే పరిపాలకులకు ఔరంగజేబ్ చెప్పి, నేర్పి, ఆచరించి చూపించిపోయిన ఈ రాజకీయ నీతి భారత చరిత్రలో స్వర్ణాక్షరాలతో వ్రాయదగింది.

# 25. ఔరంగజేబ్ వ్యక్తిత్వం గుణగణాలు

ఔరంగజేబ్‌పై మోపబడిన నిందలన్నీ కడుగబడి, అతడు ఎలాంటివాడనే విషయం మన ముందుకొచ్చింది. అయితే కేవలం అతను తండ్రి పట్ల విశ్వాసఘాతకుడు కాదు, అనివార్య కారణాల చేత ఒక్క దారాను తప్ప అతను వేరెవరినీ చంపలేదు, అతను హిందూ వ్యతిరేకి కాదు, మందిరాల విధ్వంసకుడు కాదు అని మాత్రమే తెలుసుకొని ఊరుకుందామా? ఔరంగజేబ్ వ్యక్తిత్వం ఇంతేనా? అతను దోషి, అపరాధి, హంతకుడు, హింసకుడు కాదు అంటేనే సరిపోతుందా? కాదు, కాదు. ఎన్నటికీ కాదు. అవైతే కేవలం పక్షపాతంతో, ఉద్దేశపూర్వకంగా, అతని రూపాన్ని వికృతంగా మార్చడానికి వేసిన నిందలు మాత్రమే. అతనిపై మోపిన నిందల్ని కడిగేసి ఊరుకుంటే సరిపోదు. అసలు అతని వ్యక్తిత్వం ఎలాంటిది? అతని గుణగణాలు ఏమిటి? అతను ఎటువంటి శీలాన్ని కలిగినవాడు ఇత్యాది విషయాలు తెలుసుకోకపోతే మన అధ్యయనం అసంపూర్ణంగానే ఉంటుంది. ఎందుకంటే అతని వ్యక్తిత్వం, గుణగణాలు, శీలం సాటిలేనివి. భారతదేశ చరిత్రలో అలాంటి వ్యక్తిత్వాన్ని, గుణగణాలను, శీలాన్ని కలిగిన పరిపాలకులు మనకు కనబడరు. అందుకని ఈ కోణంతో అధ్యయనం చేయడం అనివార్యం. అతని వ్యక్తిత్వాన్ని, గుణగణాల్ని, నీతిని, శీలాన్ని అధ్యయనం చేస్తేనే గాని, ఇతర పాలకులతో అతన్ని పోల్చడానికి అవకాశముంటుంది. అప్పుడే భారతదేశ చరిత్రలో అతని స్థానమేమిటనే విషయం తెలుస్తుంది.

ఔరంగజేబ్ తెలివితేటలు, జ్ఞాపక శక్తి, నిరంతర శ్రమ, నీతి నిజాయితీ, యోగ్యతలకు సంబంధించి చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయాలు లేవు. వీరంతా ఈ విషయంలో ఏకాభిప్రాయులై ఉన్నారు. అతన్ని సమర్థించే, విమర్శించే చరిత్రకారులెవరైనా సరే, ఔరంగజేబ్‌లోని ఈ సుగుణాలను బహిరంగంగా అంగీకరిస్తారు. ఔరంగజేబ్ లాంటి పరిపాలకుడు మొగలు వంశంలోనే కాదు, భారత చరిత్రలోనే కనిపించడు. స్వీయ గుణ గణాలు, వ్యక్తిత్వం మరియు శీలం విషయంలో అశోకుడు, అక్బర్ ఎవరూ కూడా అతనికి సరితూగరు. భారతదేశపు ఇతర పాలకులకు, ఔరంగజేబ్‌కు పోల్చినప్పుడు, ఏవైతే భిన్నాభిప్రాయాలు లేక వ్యతిరేకతలు కనబడతాయో, అది ప్రభుత్వ పాలసీ, దాని ప్రభావ పరిణామాలకు సంబంధించి నంతమటుకే. కాని ఔరంగజేబ్ వ్యక్తిగత శీలం, గుణగణాలకు సంబంధించినంత వరకు వేలెత్తిచూపే అవకాశమే లేదు. అతని వ్యక్తిత్వం మరియు నడవడికల పరిపూర్ణత నిరాకరించలేనిది. వాటికి పుష్కలంగా చారిత్రక సాక్ష్యాధారాలున్నాయి. అందుకనే ఔరంగజేబ్‌పై కలం లేపిన ప్రతి చరిత్రకారుడు – వారు భారతీయులైనా, పాశ్చాత్యులైనా, సమర్థకులైనా, విమర్శకులైనా– ప్రతి ఒక్కరూ అతనిలోని ఈ సుగుణాలను పేర్కొనకుండా ఉండలేకపోయారు.

ఉదాహరణకు ఔరంగజేబ్‌ను అతను తన కళ్ళతో చూశాడు గనక అతని రాజరికం, ధార్మికత, వినయ వినమ్రతలు, అణకువ, నిరాడంబరతల్ని మాసిరె ఆలంగీరి రచయిత ఇలా వర్ణించాడు :

"దైవాన్ని సాక్ష్యంగా నిలిపి ఈ విషయం తెలుపుతున్నాను. ధార్మికత మూర్తీభవించి, రాజ వేషభూషణాల్లో ఉన్న ఈ సన్యాసి (బ్రహ్మజ్ఞాని), ఇంకా ఎవరి రాచరికంపై సన్యాసత్వం కూడా గర్వపడుతుందో, ఈ కాలంలో ఇలాంటి రాజు వేరొకడు లేడు. ఒక శిష్యున్ని సంస్కరించి (ధార్మికంగా) ఉన్నతోన్నత స్థాయికి చేర్చడంలో ఆయనంతటి స్థాయికి చేరగలిగే ధార్మిక గురువు లేక బ్రహ్మజ్ఞాని ఇంకొకరెవరూ లేరు. ఆకాశాన్ని చుంబించేంతటి సర్వాధికారాలు లభించి ఉన్నప్పటికీ అణకువ, వినమ్రతలే చక్రవర్తులవారి స్వభావం. సిరిసంపదలు, ధనైశ్వర్యాలు అన్నీ ఉండి కూడా వినయ వినమ్రత, నిశ్చింత, నిరాడంబరత, ఆత్మ సంతృప్తులే ప్రభువుల వారిని ఈ స్థాయి, స్థానానికి చేర్చడానికి ఏకైక కారణం." (మాసిరె ఆలంగీరి, ముస్తఅద్ ఖాన్ సాఖి- పేజి 234)

ఔరంగజేబ్ జీవితంలోని ఒక విచిత్రమైన, అనూహ్యమైన, సామాన్య ప్రజలకు తెలియని, నైతికంగా అతన్ని మహోన్నత స్థానంపై కూర్చుండబెట్టే ఒక సంఘటనతో ఈ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాము.

"అది 1661 సంవత్సరపు ఒక వర్షాకాలం రాత్రి. కుండపోతగా వర్షం కురుస్తోంది. ఉరుములు, మెరుపులతో ప్రజలు దద్దరిల్లిపోతున్నారు. కటిక చీకటి. పెనుగాలులు వీయడంతో చెట్లు విరిగిపోతాయన్నంతగా వంగి పోతున్నాయి. ఎముకలు కొరికే చలి, కుండపోతగా పడుతున్న వర్షంతో పాటుగా ఉధృతంగా వీస్తున్న గాలికి భయపడిన ప్రజలు ఇంటి ద్వారాలు మూసుకొని, బిక్కు బిక్కు మంటూ కూర్చున్నారు. అలాంటి వాతావరణంలో ఒక నడి వయస్కుడైన మనిషి కంబళి కప్పుకొని, చిన్న సందులో నుండి ప్రధాన రోడ్డుపై వచ్చాడు. అక్కడి నుండి కొంచెం దూరం నడిచి ఇంకో సందులో ప్రవేశించాడు. రోడ్లపై జన సంచారం అసలే లేదు. అతను పిచ్చివానిలా కనబడడం లేదు. చూస్తే మర్యాదస్తునిలాగే కనబడుతున్నాడు. వణికిస్తున్న ఈ చలిలో నిర్మానుష్యంగా నున్న రోడ్లపై అతనెందుకు సంచరిస్తున్నాడో! బహుశ బాటసారియై ఉంటాడు. ఆగంతకుడు అక్కడి నుండి బయలుదేరి, రోడ్ల కూడలి వద్ద ప్రభుత్వ లాంతరు వెలుగులో, తొణకు బెణుకు లేకుండా వర్షంలో నడుస్తూ దీర్ఘాలోచనలో ఉన్నాడు.

"నేనెంతగా మొత్తుకున్నా మీరు వినిపించుకోకపోతిరి. చూడండి. ఇప్పుడీ వర్షంలో ఇల్లెలా కారుతుందో! అసలీ రాత్రి గడిపేదెలా? ఎవరైనా కూలీ దొరికితే బాగుండేది" సేట్ ఉత్తంచంద్ భార్య భర్తపై విసుక్కుంటున్నది.

"అవును, పనుల్లో పడి నేనీ విషయమే మరిచిపోయాను. అయినా ఇంత కుండపోతగా వర్షం పడుతుందని నేనేమైనా ఊహించానా ఏమిటి? అయినా ఇప్పుడేం చేద్దాం! ఇంతవర్షంలో, వణుకు పుట్టిస్తున్న ఈ చలిలో కూలివాడెవడు దొరుకుతాడబ్బా!" ఉత్తంచంద్ చింతావిచారాలు

మిళితమైన స్వరంతో భార్యకు సమాధానమిస్తూనే అయాచితంగా తలుపు రెక్కలు తెరిచాడు. మసక వెలుతురులో, వర్షంలో తడుస్తూ ఒక ఆకారం కనిపించింది. సేట్ ఉత్తం చంద్‌కు ఆశ చిగురించింది.

"బాబూ! కూలి వస్తావా?" సేటు కాస్త తటపటాయిస్తూనే అడిగాడు.

"తప్పకుండా!" ఆగంతకుడు దీనికోసమే ఎదురుచూస్తున్నట్లు వెంటనే సమాధాన మిచ్చాడు. అంతేకాకుండా దగ్గరికి వచ్చి పనేంటని అడిగాడు.

"చూడు బాబూ! మా కప్పు కారుతుంది. దానిపై మట్టిపోసి రిపేరు చేయాలి" తలుపులు పూర్తిగా తెరుస్తూ ఆగంతకునికి లోపలికి పిలుస్తూ సేటు పనేందో చెప్పాడు. ఆగంతకుడు సరేనంటూ తట్ట, పార తీసుకొని మిద్దెక్కాడు. ఆ వర్షం, వణుకు పుట్టిస్తున్న చలిలో తట్టతో మట్టితెస్తూ, పారతో కుదిస్తూ రెండు మూడు గంటలు నిర్విరామంగా పనిచేస్తూ, మొత్తానికి కప్పునుండి కారే నీటిని ఆపగలిగాడు. ఇంతటి వర్షం, చలిలో అతను పడుతున్న పాట్లను, చేస్తున్న శ్రమను చూసి భార్యాభర్తలు ముగ్ధులైపోయారు.

"నా పనైపోయిందండి! ఇక నాకు సెలవియ్యండి!" చలికి గజ గజ వణుకుతూనే ఆగంతకుడన్నాడు.

"మీకెంతో రుణపడి ఉన్నాం బాబూ! ఈ వర్షం, ఇంతటి చలిలో మీరు పడిన శ్రమను మేము మరువలేము" సేట్ ఉత్తంచంద్ జేబులో చేయివేసి పావలా నాణాన్ని బయటికి తీశాడు.

"చూడండి బాబూ! మీరెవరో నాకు తెలియదు. ప్రస్తుతం నా వద్ద ఈ పావలా మాత్రమే ఉంది. రేపు ఉదయం నా దుకాణానికి వచ్చి కోరినంత కూలి తీసుకోండి!" ఉత్తంచంద్ సిగ్గు పడుతూ సమాధానమిచ్చాడు.

"ఆ పావలనే ఇచ్చేయండి! రేపు నేను రాలేను" తడిసి ముద్దయి పోయిన ఆగంతకుడు తొందరపెట్టాడు. ఆ ఇంటి యజమాని అతన్ని రేపు దుకాణానికి రమ్మని ఎంతగానో బ్రతిమి లాడాడు. కాని ఆ ఆగంతకుడు మాత్రం వినిపించుకోలేదు. ఇప్పుడెంతుందో అదే ఇవ్వండని మొండికేశాడు. చివరికి సేటు ఆ పావలానే అతనికి ఇస్తూ, రేపు తన దుకాణానికి రావల్సిందిగా మరోసారి అడిగాడు.

కాని ఆగంతకుడు ఆ పావలానే తీసుకొని నమస్కరించి వెళ్ళిపోయాడు.

ఒక సుదీర్ఘకాలం దక్కన్‌లో గడిపిన తరువాత 1670లో ఔరంగజేబ్ చక్రవర్తి రాజధాని అయిన ఢిల్లీ చేరుకున్నాడు. రాజధాని నగరం శోభాయమానంగ అలంకరించబడింది. చక్రవర్తి రాకతో ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. ఇవన్నీ ముగిసి ప్రభుత్వ కార్యక్రమాలు మొద లయ్యాయి. ఒకరోజు ప్రభుత్వ దర్బారులో అవసరమైన కాగితాలను పరిశీలించి సంతకాలు చేస్తున్నప్పుడు, ఆర్థికమంత్రి వినయంగా ఇలా విన్నవించాడు. "మహాప్రభూ! హజ్రత్ ముల్లా గారు పెద్ద ధనికులయ్యారు. తమరు అనుమతిస్తే టాక్సును ప్రతిపాదించాల్సి ఉంది."

"ముల్లాసాబా! ఏ ముల్లాసాబు?" ఔరంగజేబ్ అడిగాడు అనాలోచితంగా.

"అదే మహాప్రభువుల వారి గురువర్యులు ముల్లా అహ్మద్ జీవన్‌గారు" ఆర్థిక మంత్రి మరింత వినయంగా విన్నవించాడు.

"మా గురువుల వారా?" కలాన్ని ప్రక్కకు పెడుతూ చక్రవర్తి అడిగాడు. "ఫకీరులకు, సాధువులకు, ధనైశ్వర్యాలతో సంబంధమేమిటి? వెండి బంగారాలైతే నిజమైన దైవభక్తులకు పాములు, తేళ్ళుగా కనబడతాయే!" చక్రవర్తి నమ్మకం కలుగక ఆర్థిక మంత్రి వైపు చూశాడు.

మంత్రి భయపడిపోయాడు. "మహాప్రభూ! నిజం పలుకుతున్నాను. నన్ను విశ్వసించక పోతే, ప్రధానమంత్రుల వారి నడగండి!" వినమ్రతతో చెప్పాడు.

"లేదు, లేదు! ఎవరినీ అడగనవసరం లేదు! మేము స్వయంగా గురువర్యుల్నే అడిగి తెలుసుకుంటాము." సంతకం పెడుతూ చక్రవర్తి దృఢస్వరంతో అన్నాడు.

మరుసటి రోజు చక్రవర్తిని సందర్శించుకోవలసిందిగా ముల్లా అహ్మద్ జీవన్‌కు రాజలేఖ పంపించడం జరిగింది. ఎంత గురువైనా చక్రవర్తి ఆజ్ఞ ఆజ్ఞే. అందుకని ఆయన మూడు రోజుల్లోగానే ఢిల్లీ చేరుకొని, దర్బారుకు హాజరయ్యారు. అదే మామూలు చౌకబట్ట దుస్తులు, అదే అతి సామాన్య నడవడిక, అదే అణకువ, అదే వినయ వినమ్రతలు ఉట్టిపడే ధోరణి. ముఖం మీద అదే విద్యావిజ్ఞానాల కళ. ధనికుల్లో ఉండవలసిన ఏ ఒక్క లక్షణం ఆయనలో కనబడకపోయేసరికి, ఔరంగజేబ్ కలవరపడిపోయాడు. నెమలి సింహాసనం నుండి దిగి, ముందుకెళ్ళి, అత్యంత వినయ విధేయతలతో ఆయన్ను తోడ్కొని వచ్చి, సింహాసనం ప్రక్కన కూర్చుండబెట్టుకున్నాడు. "చెప్పు నాయనా! ఏ అవసరం వచ్చిందని ఈ ఫకీరును పిలిపించుకున్నావు" గురువుగారే అడిగారు. "అబ్బే ఏంలేదు! కష్టపెట్టినందుకు మన్నించాలి. తమర్ని దర్శించుకోవాలని మనసు కోరింది అంతే!" అసలు విషయం బయటపెట్టడానికి ఔరంగజేబ్‌కు ధైర్యం చాలడం లేదు.

"ఎలాంటి సంకోచం లేకుండా అడుగుబాబూ! మొహమాటపడ నవసరం లేదు" గురువుగారే ప్రోత్సహించారు.

"గురువర్యా! మరేమో .... మీతో .... " ఔరంగజేబ్ నసిగాడు.

"శిష్యా! సందేహించకు. నీవేమి అడగదలచుకున్నావో నిస్సంకోచంగా అడుగు" గురువే తిరిగి ధైర్యం చెప్పారు.

"నేను మీ ధనైశ్వర్యాల గురించి తెలుసుకోదలిచాను!" ఔరంగజేబ్ తెగించి చెప్పేశాడు. ఆ మాటకు గురువుగారు ఎలాంటి జంకూగొంకూ లేకుండా నిర్లక్ష్యంగా శిష్యుని వైపు చూశారు. ఆ తరువాత స్పష్టంగా ఇలా పలికారు. "ఆరోజు నీవు పావలా కానుకగా నాకు సమర్పించుకున్నావే! దాని ప్రభావమే బిడ్డా! ఇదంతాను!"

"పావలానా! నేను మీకిచ్చానా??" ఔరంగజేబ్ ఆలోచనలో పడిపోయాడు.

"అవును. నేటికి దాదాపు పది సంవత్సరాల క్రితం నీవు దక్కన్ వెళ్ళటానికి ముందు

నేనోసారి డిల్లీకి వచ్చి నిన్ను కలిశాను. నేను తిరిగి వెళుతున్నప్పుడే నీవు నాకు పావలాను కానుకగా సమర్పించుకున్నావు. ఆ పావలా మహాత్యం ఏమిటోగాని, దానితో నేను పత్తివిత్తులు కొని చల్లించాను. ఆ పత్తి ఎంతగా పండిందంటే, నేను ఆశ్చర్యపోయాను. ఈ విధంగా కొన్ని సంవత్సరాల్లోనే నేను లక్షాధికారినై పోయాను. సరే, ఇంతకు నీవు ఆ పావలాను ఎక్కడ్నుంచి తెచ్చిచ్చావు? దాని కథాకమామీషు ఏమైనా ఉందా?" అంటూ గురువు గారు తన కుతూహలాన్ని వ్యక్తపరిచారు.

గురువు గారి కుతూహలం మరియు ఆదేశంపై 1661 సంవత్సరపు బహీ ఖాతాల్ని, రాబడి ఖర్చు పద్దుల పుస్తకాలతో సహా సేట్ ఉత్తంచంద్‌ను ప్రవేశ పెట్టవలసిందిగా చక్రవర్తి ఆదేశించాడు. చక్రవర్తి కబురందిన సేట్ ఉత్తంచంద్ భయపడిపోయాడు. అసలు విషయం తెలియక, తనతో ఏం తప్పు జరిగిపోయిందో, చక్రవర్తి తననెందుకు పిలిపించాడో అని తల్లడిల్ల సాగాడు. చివరికి 1661 సంవత్సరపు పుస్తకాల్ని అటక మీది నుండి తీయించి, దుమ్ము ధూళి వదిలించి, పుస్తకాలతో సహా దర్బారులో హాజరయ్యాడు. సింహాసనానికి సమీపించి చక్రవర్తికి సాష్టాంగపడి వందనాలాచరిద్దామని వంగబోతుండగానే అతన్ని వారిస్తూ ముల్లా అహ్మద్ జీవన్ ఇలా అన్నారు. "సేట్ ఉత్తం చంద్! ఏకేశ్వరోపాసకుడైన చక్రవర్తి, మానవ మాత్రులకు ఏమాత్రం వర్తించని, సాష్టాంగపడి ప్రమాణాలు చేసే ఆచారాన్ని ఎత్తేశాడని మీకు తెలియదా? తిన్నగా నిలబడి వందనాలు సమర్పించండి. చాలు!" ఔరంగజేబ్ కూడా ఔనంటూ తలూపాడు. అందుకని సేటు సామాన్య వందనాలు సమర్పించాడు.

"సేట్ ఉత్తం చంద్! 1661 వర్షాకాలంలో మీరు ఖర్చుపెట్టిన వివరాలు చదివి వినిపించండి" చక్రవర్తి ఆదేశించాడు. అదేవిధంగా సేటు చదవడం ఆరంభించాడు. అయితే ఒకచోట కాస్త తటపటాయించి ఆగిపోయాడు.

"ఏమిటి? ఎందుకాగి పోయారు?" చక్రవర్తి ప్రశ్నించాడు.

"మహాప్రభూ! ఇక్కడో పావలా ఇచ్చినట్లు వ్రాసుంది. కాని తీసుకున్న వారిపేరు మాత్రం లేదు."

"తీసుకున్న వారి పేరులేదా? కాస్త జ్ఞాపకం చేసుకొని చెప్పండి. అది మీరెవరికి ఇచ్చారు."

"మహాబలీ! ఇదో పెద్ద కథ. అనుమతిస్తే విన్నవించుకుంటాను" సేటు అనుమతి కోరాడు.

"అనుమతిస్తున్నాము" చక్రవర్తి ఆదేశించాడు.

సేట్ ఉత్తంచంద్ ఇలా ప్రారంభించాడు, "మహాప్రభూ! అదో కాళరాత్రి. కుండపోతలా వర్షం కురుస్తున్నది. అప్పుడు మా ఇల్లు కారడం మొదలెట్టింది. పైకెక్కి కన్నం, చిల్లులు పడినచోట మట్టిపోస్తే బాగుంటుందని నా భార్య చెప్పింది. కాని ఆ ముసురులో, ఎముకలు కొరికే ఆ చలిగాలిలో బయటికెళ్ళి మిద్దెపై ఎక్కడానికి నాకు ధైర్యం చాల్లేదు. ఏం చెయ్యాలో తోచక ఎవరైనా కూలివాడు వస్తే బాగుంటుందని ఆలోచిస్తూ కూర్చున్నా. అయినా ఇంత రాత్రివేళ ఈ

వర్షంలో ఏ కూలివాడు వస్తాడు అనుకున్నాను. అయాచితంగానే తలుపు ఓ రెక్క తెరచి బయటచూడగా, ఒక మనిషి కనబడ్డాడు. కూలీకి వస్తావా అంటే వస్తానన్నాడు. నేను సంతోషంతో అతన్ని లోపలికి పిలిపించుకొని, ఇల్లు కారుతున్న చోటు చూపించి మరమ్మత్తు చేయమని చెప్పాను. అతను వర్షంలో తడుస్తూ మట్టి గంప తీసుకొని మిద్దెపైకెక్కాడు. మట్టిని పోస్తూ కుదిస్తూ, తగిన విధంగా మరమ్మత్తు చేసి నీరు కారకుండా చేశాడు. పని ముగించుకొని కిందికి దిగి వచ్చాడు. అతని పరిస్థితి చూసి నాకు జాలేసింది. తడిసి ముద్దయి చలికి గజ గజ వణికిపోతున్నాడు. చీకట్లో అతను ఎవరైంది నేను గమనించలేకపోయాను. ఎవరైతేనేం, మొత్తానికి మమ్మల్ని ఆ రాత్రి ఆపద నుండి గట్టెక్కించాడు. అప్పుడు నా దగ్గర ఈ పావలే ఉంది. సిగ్గు పడుతూనే ఆ పావలా ఇస్తూ ఉదయం దుకాణానికి వచ్చి కోరిన కూలీ తీసుకొమ్మని చెప్పాను. నేను పదే పదే చెప్పినా కూడా దుకాణానికి రావడానికి అతను అంగీకరించలేదు. ఆ ఉన్న పావలానే ఇమ్మన్నాడు. అది తీసుకొని అతనెలా అదృశ్యమైపోయాడంటే, నేడు పది సంవత్సరాలవుతున్నా నేనతని ముఖాన్ని తిరిగి చూడలేదు. అతనెవరో పాపం, దైవం అతన్ని చల్లగా చూడుగాక!" సేట్ ఉత్తం చంద్ తన కథను ముగించి వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"సేట్ ఉత్తంచంద్‌కు రాజవస్త్రాలు ప్రసాదించి, గౌరవంగా సాగనంపండి" చక్రవర్తి ఆదేశించాడు.

సేట్ ఉత్తంచంద్‌కు రాజవస్త్రాలు ప్రసాదింపబడి, అతను వెళ్ళిపోగానే, ముల్లా అహ్మద్ జీవన్ హర్షాతిరేకంతో, ప్రేమోద్రేకాలతో తన శిష్యున్ని కౌగిలించుకొని, అతని నుదుటిని చుంబిస్తూ "శబాష్ బిడ్డా! శబాష్! నువ్వైతే అద్భుతం చేసి చూపించావు. కష్టార్జితం అంటే ఇదే! అందుకే దైవం ఇందులో ఇంత శుభాన్ని, సమృద్ధిని ప్రసాదించాడు" అంటూ మరోసారి గట్టిగా హృదయానికి హత్తుకున్నారు.

"ఇదంతా ఆచార్యుల వారి అనుగ్రహ ప్రసాదాలే. రాజ్య కోశాగారం నుండి నా స్వంత అవసరాల కోసం ఏమీ తీసుకోను" ఔరంగజేబ్ వినయంగా చెబుతూ పోయాడు. "రాత్రి నాలుగు జాముల్ని నేనీవిధంగా విభజించుకున్నాను."

- మొదటి జాము నిద్రిస్తాను.
- రెండవజాము భుక్తిని సంపాదించుకోవడానికి వినియోగిస్తాను. ఆ సమయాన్ని టోపీలు కుట్టడంలో, ఖురాన్ ప్రతులు వ్రాయడంలో వినియోగిస్తాను.
- మూడవ జాము నా ప్రజల కష్టసుఖాలు, వారి సాధకబాధకాలు తెలుసుకోవడానికి వేషం మార్చి తిరుగుతుంటాను. నా ఈ నశ్వరమైన ఉనికితో దైవం తన ఓ భక్తుని అవసరాన్ని తీర్చేశాడు. ఇదంతా కూడా ఆ కరుణామయుని అనుగ్రహమే."

విధేయుడైన శిష్యుని మాటలు విన్న ముల్లా అహ్మద్ జీవన్‌కు కన్నీళ్ళు ఆగలేదు. హృదయం ద్రవించి పోయింది. ఆయనెంతగా రోదించారంటే కన్నీళ్ళతో ఆయన గడ్డం తడిసి ముద్దయిపోయింది. (ఆయిన-యె-ఔరంగజేబ్- హకీం జిల్లుర్రహ్మాన్, పేజి 51-56)

సమకాలీన చరిత్రకారుడు ముస్తఅద్ ఖాన్ ఔరంగజేబ్ గుణగణాల్ని వర్ణిస్తూ ఇలా వ్రాశాడు :

“స్వర్గీయ ప్రభువుల వారు తన స్వాభావిక సద్గుణాల కారణంగా ధార్మిక విధి బాధ్య తల్ని క్రమం తప్పకుండా పాటించే వారు. ఆయన హనఫీ, సున్నీ ధార్మిక భావనలు కలవారు. ఇస్లామీయ ధర్మంలోని పంచవిధుల్ని పరిపూర్ణంగా పాటించేవారు. వాటిని స్థాపించడానికి, నెలకొల్పడానికి సదా ఉత్సుకతతో ఉండేవారు. ఎల్లప్పుడూ వజూతో ఉండి, నిరంతరం జపతపాల్ని పఠిస్తూ ఉండేవారు. నమాజు ప్రారంభ సమయంలోనే, సామూహి కంగా మస్జిద్‌లోనే సలిపేవారు. సున్నత్, నఫిల్ నమాజుల్ని కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో, లగ్న మనస్సుతో నెరవేర్చేవారు. ప్రతివారంలో సోమవారం, గురువారం, శుక్రవారం ఉపవాసాలుండేవారు. శుభరాత్రులు (పవిత్ర రాత్రులు) జాగరణలో గడిపేవారు. ఈ విధంగా దైవకాంతులతో శోభాన్వితులై, తమ ధార్మిక ప్రకాశంతో జగుత్తునంతా ప్రకాశింపజేసేవారు. రాజప్రసాదపు సమీపంలోని మస్జిద్‌లో రాత్రంతా మహాత్ములతో సంభాషణలతో గడిపేవారు. ధార్మికవిధి అయిన “జకాత్”ను చెల్లించ ఆదేశించే వారు. రమజాన్ పవిత్ర నెలంతా నమాజు, ఉపవాసాల్లోను, తరావీహ్ నమాజు, ఇతర ఆరాధన ల్లోనూ గడిపేవారు. రాత్రి సమయాల్లో ధార్మికవేత్తలతో కలిసి దైవనామ స్మరణలో గడిపేవారు. రమజాన్ చివరి దశకంలో “ఏతెకాఫ్” పాటించేవారు. హజ్ అయితే చేయలేకపోయారు. కాని ప్రతి సంవత్సరం, ఒక్కొక్కప్పుడు రెండవ లేక మూడవ సంవత్సరం పవిత్ర మక్కా మదీనాల్లోని యాత్రికుల కోసం, అర్చకుల కోసం పెద్ద పెద్ద నిధులు పంపించేవారు. ఆయనగారి వ్యక్తిత్వం సర్వ సుగుణాలకు పుట్టినిల్లు. జ్ఞానం వచ్చిన వయసునుండే నిషేధితాలన్నింటి నుండి దూరంగా ఉండేవారు. వివాహిత భార్యలతో తప్ప, పర స్త్రీ లెవ్వరివైపు కూడా కన్నెత్తి చూడలేదు. ఆయన గారి సభలో ఇతరుల చాడీలకు, దూషణలకు, నిందలకు అనుమతి లేకుండేది. సామాన్య ప్రజానీకానికి హాని కలిగించే ఆదేశాన్ని ఆయనెన్నడూ జారీచేయలేదు. గర్వాహంకారాలు ఉట్టిపడే లేక ధార్మికంగా నిషేధించబడిన వస్త్రాల్ని ఆయనగారు ఎన్నడూ ధరించలేదు. వెండి, బంగారు పళ్ళాల్ని వాడకుండా ఆయన అత్యంత జాగ్రత్తపడేవారు. ప్రజలకు బాధ కలిగించే, వారిని చింతావ్యాకులాల్లో పడేసే ఏ చర్యనూ చేపట్టి ఉండలేదు. ఉద్రేకావేశాలకు పగ ద్వేషాలకు లోనై, కేవలం తన స్వంత పగ, ప్రతీకారం కోసం ఏ ఒక్క వ్యక్తిని చంపించలేదు. పేదలు, రిక్తులు, అగత్యపరుల అవసరాలు తీర్చడం కోసం రాజధానిలోనే కాకుండా ఇతర ప్రాంతాలలో కూడా దాన కేంద్రాల్ని ఏర్పాటు చేయించారు. వసతి గృహాలు, సత్రాలు, ధర్మశాలలు లేనిచోట ప్రయాణీకుల కోసం గృహాల్ని నిర్మించారు. ప్రజలకు సౌలభ్యాన్ని, సౌకర్యాల్ని కలిగించే దృష్టితో ఆహార పదార్థాలపై, నిత్యావసర వస్తువులపై విధిస్తూ వచ్చిన రహదారి పన్నుల్ని, కొత్త వస్తువులపై

విధించే పన్నును, వారసత్వపరంగా వస్తున్న బాకీలపై – ఈ విధంగా ఎన్నో రకాల పన్నుల్ని ఎత్తివేశారు. నాయకులు చనిపోయిన తరువాత వారు విడిచివెళ్ళిన ఆస్తుల్ని ప్రభుత్వపరంగా జప్తుచేసుకునే చట్టాన్ని ఎత్తివేసి, దేశప్రజలకు సంతృప్తిని, సంతోషాన్ని ప్రసాదించారు.” (మాసిరె ఆలంగిరి – ముస్తఅద్ ఖాన్ సాఖీ – పేజి 382 – 387)

జదూనాథ్ సర్కార్ ఔరంగజేబ్ తీవ్ర విమర్శకునిగా పేర్కొనబడతారు. కాని ఆయన కూడా ఔరంగజేబ్ గుణగణాల్ని వర్ణించకుండా ఉండలేకపోయారు.

“అతను మహా గొప్పవీరుడు. అతని వీరత్వంలో వివేక వివేచనాలు, దూరాలోచన మరియు స్థిరత్వాలున్నాయి. అతను నిర్భయుడు. ఏ భయమూ అతన్ని లోబరుచుకోజాలదు. రాజరికం కోసం ఆ హోదాను గౌరవించగలగాలి, రాజ్యమేలేటప్పుడు అన్ని విధాలైన యోగ్యత లుండాలి. రాజు మానసిక వాంఛలకు ప్రభావితం కాకూడదు. ఈ అన్ని సుగుణాలు ఔరంగజేబ్‌లో ఉండేవి. అతను విద్యాధికుడు, ఇతరులతో వ్యవహరించేటప్పుడు తన నాలుకను నియంత్రించు కోగలిగేవాడు. తన చర్యలో క్షేమయుక్తాల్ని, మితవ్యయాల్ని పాటించేవాడు. అతను తన బలం, శక్తిసామర్థ్యాల్ని చూసుకొని ఎన్నడూ విర్రవీగలేదు, ఎన్నడూ హద్దుల్ని అతిక్రమించలేదు. అతని వివేకము మరియు అణకువతో ప్రభావితులైన దర్బారు నాయకులు అతనికి మిత్రులై ఉండేవారు. రాకుమారుని దశలో ప్రదర్శించిన తెలివి, యోగ్యత, అణకువను చక్రవర్తి అయిన తరువాత కూడా కొనసాగించాడు. అతను రాజవేష భూషణాల్లో బైరాగి (సన్యాసి) అంటూ అతని దర్బారు చరిత్రకారుడు పేర్కొన్నది ముమ్మాటికి నిజం. అతని వ్యక్తిగత జీవితం, దుస్తులు, ఆహారం మరియు వినోద విహారాలు కూడా అతి సామాన్యమై ఉండేవి. అతను పాపాల నుండి బహు దూరంగా ఉండేవాడు. ధనవంతులు కొన్ని దోషరహిత వినోద కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు. ఔరంగజేబ్ వాటి నుండి కూడా దూరంగానే ఉంటుండేవారు. దివ్య ఖురాన్ నలుగురు పత్నుల వరకు అనుమతించింది. కాని అతని పత్నుల సంఖ్య అంతకన్నా కూడా తక్కువ వుండేది. అతను తన పత్నుల పట్ల విశ్వాసపాత్రునిగా ఉన్నాడు. పరిపాలనా యంత్రాంగాన్ని నడపడంలో, నియంత్రించడంలో అతను పడే శ్రమ, కష్టం అత్యంతాశ్చర్యాన్ని కలిగించేదిగా ఉండేది. ప్రతి రోజూ దర్బారును నిర్వహించేవాడు, తన చేత్తో లేఖలు, ఫర్మాన్లు వ్రాస్తుండేవాడు. తొంబది సంవత్సరాలు వచ్చేంతవరకు కూడా అతని సర్వయోగ్యతలు సురక్షితంగా ఉన్నాయి.” (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ – జదూనాథ్ సర్కార్ – వాల్యూం–5, పేజి 362–364)

ఈ జదూనాథ్ సర్కారే ఇంకా ఇలా వ్రాశారు :

“... అతను తన బుద్ధిసూక్ష్మత, నైతికత మరియు ఘనకార్యాల ద్వారా ఆసియాకు చెందిన మహోన్నత పరిపాలకుల్లో పరిగణింపబడతాడు. అతను అసామాన్యమైన స్థాయి వరకు శ్రమజీవి, చురుకుదనం గలవాడు, మరియు అత్యంత సభ్యత కలవాడు. తన విధుల్ని అతనెన్నడూ మరచిపోలేదు. సుఖవిలాసాల్ని అతను తనపై నిషేధించుకున్నాడు. ఐహిక వాంఛలకు అతను తీవ్ర వ్యతిరేకి. మానవ బలహీనతలకు అతనెన్నడూ ప్రభావితం కాలేదు. అతను తన కాలం

మరియు తన ధార్మిక విశ్వాసాల అత్యంత మేలైన ఆచార సంప్రదాయాల ననుసరించి తన ప్రజల్ని పరిపాలించాడు. (హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - సర్కార్ వా-5, పేజి 1).

"అతని జీవితపు ప్రారంభ 23 సంవత్సరాల్లో ఉత్తర భారత నగరాలన్నింటిలో శాంతి భద్రతలతో కూడిన సమృద్ధి వచ్చింది. అతని త్రోవలోని శత్రువులందరూ తొలగిపోయారు. సామ్రాజ్యమంతా అతన్ని శిరసావహించింది. దేశంలో శక్తిమంతమైన, జాగరూకతతో కూడిన అతని ప్రభుత్వం కారణంగా ఎలాంటి శాంతి భద్రతలు నెలకొన్నాయంటే దాని పర్యవసానంగా సంపద మరియు సంస్కృతి రెండింటిలోనూ పురోగమనం రాసాగింది. ఔరంగజేబ్ మానవ ఉల్లాసాలు, కీర్తి ప్రతిష్ఠల శిఖరాల నందుకున్నాడు. ఇది అతని జీవితపు మూడవ ఘట్టం." (వా-5, పేజి 1, 2).

"అతను బీజాపూర్, గోల్కొండను జయించుకున్నాడు. సాగర్‌కు చెందిన బెరాద్ నాయకుడు అతనికి విధేయత చూపాడు. కలహకారి అయిన మరాఠా రాజు పట్టుబడ్డాడు. ఇంకా అతని కుటుంబమంతా రాజధానిలో అతని ముందు సమర్పించబడింది. ఈ విధంగా ఔరంగజేబ్ సఫలత మరియు విజయాల్లో అడ్డువచ్చే ఏదీ మిగులలేకపోయింది. (వా-5, పేజి 2).

ఇంకొక గ్రంథంలో ఇదే జదూనాథ్ సర్కార్ ఇలా వ్రాశారు :

"ఔరంగజేబ్ ఇస్లామీయ విశ్వాసాల్లో ఒక విశ్వసనీయమైన ముస్లిం. అతను పెందలకడనే లేచేవాడు. వుజూచేసుకొని, అంతఃపురం నుండి సమీపంలోనే ఉండే మస్జిద్ వెళ్ళేవాడు. పశ్చిమ ముఖంగా కూర్చుండి, ఫజర్ (ప్రాతఃకాల) నమాజు కోసం నిరీక్షించేవాడు. నమాజు ముగిసిన తరువాత దివ్య ఖురాన్ పారాయణం చేసేవాడు. ఆ తరువాత నాష్త (అల్పాహారం) సమయం అనగా ఉదయం ఏడున్నర వరకు హదీసుల (ప్రవక్త ప్రవచనాల) అధ్యయనంలో నిమగ్నమై ఉండేవాడు. ఆ తరువాత అతను తన ప్రైవేటు రూంలోకెళ్ళేవాడు. అక్కడ తన అంతరంగికులను, సెక్రటరీలను పిలిపించుకునేవాడు. తూర్పు దేశాల (ప్రభువులకు) న్యాయం అందించడం ప్రథమవిధి కనుక అర్జీలను స్వీకరిస్తూ, న్యాయ విచారణలు చేపట్టేవాడు. రాజధాని నగరం లేక వివిధ సూబాల నుండి న్యాయం కోసం వచ్చిన వారిని సభ పర్యవేక్షకుడు ఒక్కొక్కరిగా ప్రవేశపెట్టేవాడు. అర్జీలు చదివి వినిపించబడేవి. చక్రవర్తి వాటిని స్వయంగా వినేవాడు. అసలు జరిగిన సంఘటన యొక్క పూర్వపరాలను, వాస్తవాలను తెలుసుకోవడానికి ప్రయత్నించేవాడు. షరీయత్తుకు సంబంధించిన కేసులైతే, షరీయత్తు ఆదేశాల క్రమమే తీర్మానించబడేవి. సామాన్యమైన వ్యవహారికమైన కేసులు ప్రభుత్వ చట్టాల ననుసరించే పరిష్కరించబడేవి. ఒక్కొక్క సందర్భంలో చక్రవర్తి తనకు సముచిత మనిపించింది కూడా ఆదేశించేవాడు. రిక్తులు, పేదలు, అనాథలు మొదలగు వారికి ప్రభుత్వ కోశాగారం నుండి ఆర్థిక సహాయం అందించబడేది. శుక్రవారం అతను జామ మస్జిద్‌కు వెళ్ళేవాడు. అక్కడ్నే మైదానంలో నాయకులు తమ తమ తాబీనులను పర్యవేక్షణ కోసం సమర్పించేవారు. దర్శనమిచ్చే గవాక్షంలో అతను దాదాపు ముప్పావుగంట కూర్చుండేవాడు. ఆ తరువాత తొమ్మిదింబావుకు దీవానె ఆమ్ (సర్వసభ) గవాక్షంలో కూర్చుండి, దేశంలో జరుగుతున్న సైనిక కార్యకలాపాల్ని పరిశీలించేవాడు.

మధ్యాహ్నానికి ముందు అక్కడి నుండి లేచి దీవానె ఖాస్ (ప్రత్యేక సమావేశ మందిరం) కు వచ్చేవాడు. అక్కడ రాజ్యానికి, దర్బారుకు చెందిన ప్రత్యేక నాయకులు మాత్రమే ఉండేవారు. రహస్యంగా జరుగవలసిన కార్యక్రమాలన్ని ఇక్కడ్నే నిర్వర్తించబడేవి. మధ్యాహ్నం కాగానే కాస్త విశ్రాంతి (రెస్ట్) తీసుకోవడానికి అతను అంతఃపురానికి వెళ్ళి, భోజనం చేసి, కాస్త నడుం వాల్చేవాడు. జుహర్ (మధ్యాహ్నపు) నమాజు కంటే ముందే లేచి కూర్చుండేవాడు. సామూహికంగా నమాజ్ సలిపేవాడు. ఆ తరువాత తన ప్రైవేటు గదిలోకి వచ్చేవాడు. ఇక్కడ దివ్య ఖురాన్ పారాయణమో, లేక ఖురాన్ వ్రాయడంలోనో నిమగ్నమయ్యేవాడు. కాస్సేపు పూర్వపు ధార్మిక గురువుల ప్రఖ్యాత గ్రంథాల్ని అధ్యయనం చేసేవాడు. సర్వసభలో నాయకుల జోక్యం వల్ల, వారి అర్జీలను, వారి గోడును సరిగా వినిపించుకోలేదని భావించిన బాధితులకు, న్యాయం కోరే వారికి ఇక్కడ అవకాశం కల్పించేవాడు. వారి విన్నపాల్ని ఓపికగా వినేవాడు. ఇక ఎప్పుడైనా పగలు ఇక్కడ పనిలేదని పించినప్పుడు ఓ గంటకోసం అంతఃపురానికి వెళ్ళేవాడు. అక్కడ చేరిన పేద స్త్రీలు, విధవలు, అనాధల గోడును విని, వారికి తగిన విధంగా రూపాయలతోనో, జాగీర్లతోనో లేక నగనట్రలతోనో సంతృప్తి పరిచేవాడు. అసర్ (4-5 గంటల నమాజ్) సామూహికంగా చేసేవాడు. ఆ తరువాత యుద్ధ గతి విధుల్ని, ఇతర ప్రభుత్వ కార్యాల్ని పరిశీలించేవాడు. సూర్యాస్తమయానికి గంటముందు ప్రత్యేక సమావేశ మందిరానికి వచ్చేవాడు. దర్బారు నాయకులను కలిసేవాడు, వారితో ముఖ్యమనిపించిన అంశాలపై సలహా సంప్రదింపులు జరిపేవాడు. మగ్‌రిబ్ (సూర్యాస్తమయం తరువాత చేసే) నమాజ్ తరువాత సున్నత్, నఫిల్ నమాజులు సలిపి, ఓ అరగంట జపతపాల్లో దైవనామ స్మరణల్లో గడిపేవాడు. మగ్‌రిబ్ నమాజు తరువాత ప్రత్యేక మందిరానికి వచ్చేవాడు. ప్రధానమంత్రి చిన్న విషయాలు మొదలుకొని అతి ముఖ్య విషయాల వరకు వినిపించేవాడు. వాటిపై సముచిత ఆదేశాన్ని జారీచేసేవాడు. నృత్యగానాలకు ఎలాంటి అవకాశం లేకుండేది. ఇషా (రాత్రి) నమాజు సలిపి అంతఃపురానికి వెళ్ళేవాడు. అక్కడ అనేక గంటలు జపతపాలు, దైవనామ స్మరణ లాంటి వ్యక్తిగత ఆరాధనల్లో గడిపేవాడు. ఇక పూర్తిగా అలసిపోయిన తరువాత నిదురించేవాడు. దర్బారు చరిత్రకారుల ననుసరించి ఇరవై నాలుగు గంటల్లో అతను కేవలం మూడు గంటలు మాత్రమే నిదురించేవాడు. అతను అత్యంత కష్టంతో, శ్రమతో కూడిన జీవితాన్ని గడిపేవాడు. అతని దర్బారులో పనీ, పనీ మరీ పనే. ఎలాంటి వినోదానికి అవకాశమే లేదు." (స్టడీస్ ఇన్ మొగల్ ఇండియా - జదూనాథ్ సర్కార్, పేజి 67-71)

ఈ నిరంతర పని భారాన్ని చూసిన ఒక ఉన్నతోద్యోగి, "ప్రభూ! ఇంతగా మీరు కష్టపడితే ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముంద"ని చెప్పినప్పుడు అతనిచ్చిన సమాధానం గమనార్హం.

"నేను కష్టపడి కేవలం నా జీవితాన్ని కాపాడు కోవడానికి ఆ సృష్టికర్త నన్నీ లోకానికి పంపలేదు. దానికి బదులు నేను ఇతరుల కోసం జీవించాలి. నా కోసం భోగభాగ్యాలను సమకూర్చుకోవడం కాదు, నా ప్రజల సుఖసౌఖ్యాలనే నా సుఖ సౌఖ్యాలుగా భావించటం నా విధి. నా ప్రజల సుఖం, వారి పురోగతి పట్ల దృష్టి ఉంచడమే నా గౌరవానికి తగిన పని. న్యాయరీత్యా అవసరం అనిపించనంతవరకు, చక్రవర్తి అధికారాలు రాజ్యపరిరక్షణకు అవసరమని పించ

నంతవరకు ప్రజల సుఖశాంతుల్లో ఎప్పుడూ, ఎలాంటి జోక్యం చేసుకోవడం నాకు శోభించదు. (అహ్కామె ఆలంగీరి-హమీదుద్దీన్ ఖాన్, పేజి-2) (రుఖయాతె ఆలంగీరి-షాహానె ఇస్లాం, పేజి 53) (Travels in the Moghal Empire - Dr. Burnier, page 129, 130).

మాసిరె ఆలంగీరి రచయిత ఇలా వ్రాశాడు :

“ప్రతి రోజు ఆయన రెండుసార్లు ఒక్కోసారి మూడుసార్లు (సర్వసభ) దర్బారును ఏర్పాటు చేసేవారు. ఆయన పాలితులలోని ప్రతిమనిషికి ఈ సభలో పాల్గొనే స్వేచ్ఛ ఉండేది. ప్రతి వ్యక్తికి, ఆయనకు (అనగా ఔరంగజేబ్‌కు) వ్యతిరేకంగా లేక ఎంత పెద్ద నాయకునికి వ్యతిరేకంగా గాని ఏదైన ఆక్షేపణ, అభ్యంతరం ఉంటే, లేక బాధ కలిగించి ఉంటే బహిరంగంగా తెలుపుకోవడానికి, కేసు నమోదు చేయడానికి సంపూర్ణ స్వాతంత్రముండేది. బాధితున్ని లేక ఆక్షేపణదారున్ని ఆపే అధికారం ఎంత పెద్ద అధికారికి అయినా లేదు. ఆయన స్వయంగా వారి విన్నపాన్ని ఆలకించడమే కాదు, ధర్మం న్యాయాన్ని పూర్తిగా పాటించేవారు. బాధితునికి సంపూర్ణ న్యాయాన్ని చేకూర్చేవారు. కొన్ని సందర్భాల్లో అర్జీదార్లు కఠిన పదాలతో, కాస్త కటువుగా మాట్లాడేవారు. అట్టి సందర్భాల్లో రక్షణ దళంలోని ఎవరైనా అధికారి ఆ వ్యక్తిని హెచ్చరించినప్పుడు, చక్రవర్తుల వారు అతన్ని వారించి “చెప్పనీయండి. ఇలాంటి మాటలు వినడం వల్ల నా ఆత్మశుద్ధి జరుగుతుంది. నా ఆత్మ ఓర్పు, సహనాలకు అలవాటు పడుతుంది” అంటూ చెప్పేవారు. సామూహిక ప్రయోజనాల ముందు ఆయన తన వ్యక్తిత్వాన్ని, తన ఆత్మను అణచేసుకున్నారు. (మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్, పేజి 384, 385)

రాజరికపు వ్యవస్థలో రాజులు తాము దైవ స్వరూపులనే భావనను ప్రజల మనోమస్తిష్కాల్లో కూర్చుండబెట్టడానికి రకరకాల పద్ధతుల్ని, ఆచారాల్ని ప్రవేశపెట్టారు. అందులో ‘దర్శనం’ పద్ధతి ఒకటి. అంటే ప్రజలు ఉదయమే లేచి రాజుగారిని దర్శించుకునేవారు. ఎప్పటి వరకైతే రాజును దర్శించుకోరో, అప్పటి వరకు వారు అసలు అన్నపానీయాలేం ముట్టుకునేవారుకాదు. ఒక మానవ మాత్రునికి దైవస్వరూప భావననిచ్చే ఈ పద్ధతిని 1667లో ఔరంగజేబ్ నిషేధించాడు.[1]

రాజుల ఆస్థానాల్లో కవులు, భట్రాజులుండేవారు. వారు రాజును ఎంతగా పొగిడేవారు, ఎంతగా పైకి లేపేవారంటే, రాజును దైవంతో సమానం చేసి, దైవ స్వరూపుడనే భావనను కలిగించేవారు. ఔరంగజేబ్ అలాంటి కవుల హోదాలన్నీ సమాప్తం చేసేశాడు.[2]

దర్బారులో ఎవరైనా నమస్కరిస్తే, ప్రతి నమస్కారం చేయడం తమ గౌరవానికి తగినపని కాదనే భావన ఉండేది. అందుకని కేవలం వారి తలపై చేయి పెట్టేవారు. నోటితో ప్రతి నమస్కారం చేస్తే, ఈ రాజుల హోదా, గౌరవాలు తరిగిపోతాయని భావించేవారు. ఇది కూడా సర్వమానవ సమానత్వపు భావనకు విరుద్ధమైనందున ఔరంగజేబ్ ఆ పద్ధతిని నిషేధించి, ప్రతి వారు నమస్కారానికి ప్రతి నమస్కారం చేసేందుకు ఆదేశాలు జారీ చేశాడు.[3]

ఔరంగజేబ్ తన వాక్కర్మల ద్వారా, వివిధ సందర్భాల్లో రాజు కూడా ఒక మామూలు మనిషేనని, దైవం గాని, దైవ స్వరూపుడుగాని ఎంతమాత్రం కాదని, మిగిలిన మనుషులతో ఒక రాజుగా తప్ప, ఇంకేవిధంగానూ ఉన్నతుడు కాడని ప్రజలకు స్పష్టపరిచాడు. 1672లో అతను ఈద్ నమాజు చేసుకొని తిరిగి వస్తుండగా, ఎవరో ఒక మనిషి బలంగా కర్ర విసిరాడు. అదొచ్చి ఔరంగజేబ్ తొడకు బలంగా తగిలింది. అంగరక్షకులు వెంటనే అతన్ని బంధించి తెచ్చారు. అతన్ని ఏమనకుండా విడిచి పెట్టాల్సిందిగా ఔరంగజేబ్ ఆదేశించాడు.[4]

పట్టాభిషేకం 30వ సంవత్సరంలో అతను జామ మస్జిద్ నుండి తిరిగి వస్తుండగా ఒక వ్యక్తి కత్తి కటారం తీసుకొని అతన్ని చంపే ఉద్దేశంతో పరుగెత్తుతూ ఔరంగజేబ్‌ను సమీపించాడు. అంగరక్షకులు అతన్ని బంధించి వధించదలిచారు. అయితే ఔరంగజేబ్ వారిని వారించి అతనికి రోజువారి ఎనిమిదణాల భత్యాన్ని నియమించాడు.

ఈ సంఘటనే గనక ఇంకే రాజుతో నైనా జరిగి ఉంటే, నేరస్తుణ్ని ముక్కలు ముక్కలుగా నరికివేసేవారు.[5]

1674 అఫ్గన్ల విద్రోహాన్ని అణచివేయడానికి అతను హసన్ అబ్దాల్ వెళ్ళినప్పుడు ఒక తోటలో విడిదిచేశాడు. ఆ తోట గోడ క్రింది భాగంలో ఒక ముదుసలి ఇల్లుండేవి. అందులో ఆమె పిండిపట్టే జలయంత్రాన్ని నడుపుకునేది. ఈ జలయంత్రానికి తోట నుండి నీరు వచ్చేది. ప్రభుత్వ ఉద్యోగులు నీటిని ఆపేసుకున్నారు. తద్వారా ఆ జలయంత్రం ఆగిపోయింది. ఈ విధంగా ఆమె భుక్తిమార్గం మూసుకుపోయింది. ఈ విషయం ఔరంగజేబ్‌కు తెలియగానే వెంటనే నీటిని వదిలించాడు. సాయంత్రం భోజన సమయంలో రెండు పెద్ద పళ్ళేరాల ఆహారం, ఐదు బంగారు నవరసులు షేఖ్ అబుల్ ఖైర్ ద్వారా ఆమెకు పంపిస్తూ "నీవు మాకు పొరుగుదానివి. మాకు తెలియకుండానే నీకు కష్టపెట్టిన వారమయ్యాము. దానికి మమ్మల్ని క్షమించాలి" అని కబురు పంపించాడు. తెల్లారగానే పల్లకీ పంపి, ఆవిడను పిలిపించి, అంతఃపురంలోకి పంపించాడు. వాకబు చేయగా ఆమెకు ఇద్దరు అవివాహిత కుమార్తెలు, పనీపాట లేని ఇద్దరు కుమారులున్నారని తెలిసింది. ఆమెకు రెండు వందల రూపాయలు ప్రసాదించాడు. అంతః పురస్త్రీలు, వస్త్రాలు, నగనగ్రాలతో ఆమెను సత్కరించారు. రెండు మూడు రోజులు గడిచిన తరువాత ఆమెను తిరిగి పిలిపించి, కుమార్తెల వివాహం కోసమని రెండు వేల రూపాయలు కానుకగా ఇచ్చాడు. రాణులు, రాకుమారులు ఇతర నాయకులు ఎంతో డబ్బును, బంగారాన్ని ప్రసాదించాడు. చివరికా పేద వృద్ధురాలు మంచి ధనవంతురాలై పోయింది. చివరకి వెళ్ళి పోయేటప్పుడు ఔరంగజేబ్ ఆమెకు ఇంకొక జలయంత్రాన్ని కానుకగా ప్రసాదించాడు. (మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 89-92)

కెప్టెన్ హెమిల్టన్ ఆంగ్లేయ వర్తకుల ఒక బృందంతో 1690లో ఔరంగజేబ్ దర్బారును సందర్శించాడు. తన యాత్రా వృత్తాంతంలో ఔరంగజేబ్ నీతి, నడవడికల్ని అతనిలా వర్ణించాడు. "ఒక దయార్ద్ర హృదయుడైన రాజులాగా ఔరంగజేబ్ ఆంగ్లేయ వర్తకుల తప్పును

మన్నించడమే కాకుండా వారు చేసిన తప్పును అత్యంత వివేక, విచక్షణాలతో వివరిస్తూ, ఇక ముందు ఇలాంటి తప్పు వారితో జరగరాదని బోధించాడు. అంతేకాకుండా, ఈ రాజు తన వాక్కర్మల్లో పూర్తిగా మహనీయ ఏసుక్రీస్తు లాంటి ఓర్పు, సహనాల్ని ప్రదర్శించాడు." (Travels in India - Captain Hemelton-Vol.I page 229, 1737-London)[6]

నేటి ప్రభుత్వాలు తమ గెజిట్లను ఎలా జారీచేస్తున్నాయో, ఔరంగజేబ్ కాలంలో చక్రవర్తి కార్యక్రమాలు, ముఖ్య సంఘటనలతో కూడిన సమాచారాన్ని అందిస్తూ పత్రికలు జారీఅయ్యేవి. వాటిని "దర్బారీ అక్బారాత్" అని పిలిచేవారు. అవన్నీ పర్షియన్ భాషలో ఉండేవి. ఇటీవల కాలంలో వాటిలో నుండి కొన్నింటిని మహారాష్ట్రకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు "సేతు మాధవరావు పగ్డీ" పర్షియన్ నుండి మరాఠీలోకి అనువదించారు. షోలాపూర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది సయ్యద్ షా గాజియుద్దీన్ ఈ మధ్యనే వాటిలో నుండి ఓ చిన్న భాగాన్ని (5 శాతం) మరాఠి నుండి ఉర్దూలోకి అనువదించారు. ఔరంగజేబ్‌కు సంబంధించిన సమాచారాన్ని అందించే ప్రథమశ్రేణికి చెందిన ఆధారాలుగా ఇవి గుర్తించబడతాయి. అందులో నుండి ఒక సంఘటనను పేర్కొంటున్నాము.

**1702, మార్చి 05 :**

చక్రవర్తి తన ఆర్థికమంత్రి ఇనాయతుల్లాహ్ ఖాన్‌తో ఇలా అన్నాడు : "సైనికులకు జీతాలు పంచాల్సి ఉంది. ఖజానాలో రొఖ్ఖం లేదని తెలిసింది. ఖజానా ఇక్కడికి చేరేవరకు షావుకార్ల వద్ద నుండి ఐదు లక్షల రూపాయలు అప్పుగా తీసుకోండి." దానికి ఇనాయతుల్లా ఖాన్ ఇలా బదులిచ్చాడు: "షావుకార్లు అభ్యంతరమేమీ తెలుపరు. కాని చక్రవర్తుల వారు వారి వద్ద నుండి అప్పు తీసుకున్నట్లయితే వారు సైనిక శిబిరం నుండి వెళ్ళిపోతారు. ధనం రాజ్య కోశాగారానికి త్వరలోనే వచ్చి చేరుకుంటుంది." – "సరే! రాజ్యకోశాగారం వచ్చేంత వరకు జీతాల పంపకాలు ఆపేయండి" అని చక్రవర్తి ఆదేశించాడు.

మరాఠాల దోపిడీ దోపకాల వల్ల త్రోవలు అసురక్షితమైపోయాయని, ఖజానా తరలింపుకు తగినంత బలగం లేనిదే ఉత్తర భారతం ఇంకా ఇతర సూబాల నుండి ఖజానాలు సకాలంలో చేరలేకపోయేవనే విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి. సైనికులు కోట ముట్టడిలో నిమగ్నమై వున్నారు. వారికి జీతాలు ముట్టాల్సివుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశానికే చక్రవర్తిఅయిన ఔరంగజేబ్ తన సైనిక శిబిరంలోనున్న హిందూ షావుకార్ల నుండి సామాన్య మనిషిలాగా ఐదు లక్షల రూపాయలు అప్పుగా తీసుకొమ్మని తన ఆర్థిక మంత్రికి సలహా ఇస్తాడు. అయితే తన ఉన్నతాధికారి దీన్ని వ్యతిరేకిస్తూ ఇచ్చిన సలహా సముచితంగా ఉన్నందున తన ప్రతిపాదనల్ని ఉపసంహరించుకుంటాడు. ఒక సువిశాల సామ్రాజ్యాన్ని ఏలుతున్న చక్రవర్తి, ధర్మంగానో అధర్మంగానో ప్రజలనుండి షావుకారుల నుండి, ధనికుల నుండి, జమీందారుల నుండి తనకు కావలసిన ధనాన్ని లాగి సైనికుల జీతాలు చెల్లించలేకపోయాడా? కాని అతనలా ప్రవర్తించలేదు.

సైనికుల జీతాల్ని వాయిదా వేసుకున్నాడే తప్ప, ఒకరు వేలెత్తిచూపే చర్యకు పాల్పడలేదు. ఏకఛత్రాధిపత్యంగా, నియంతగా ఉండి కూడా ఇలా ప్రవర్తించిన తీరు ప్రపంచ చరిత్రలోనే బహు అరుదు! (ఆలంగీర్ కె దర్బారి అఖ్బారాత్ – సయ్యద్ షా గాజియుద్దీన్ – పేజి 264,265)

దారాతో జరిగిన యుద్ధంలో, కేవలం ఇరవై ముప్ఫైవేల సైన్యంతో లక్ష అశ్వికదళం, ఇరవైవేల పదాతిదళం ఉన్న దారా సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. సంకుల సమరం జరుగుతున్నప్పుడు ఒక సందర్భంలో అతని చుట్టూ కేవలం వేయిమంది సైనికులు మాత్రమే మిగిలి ఉన్నారు. ఆ సమయంలో అతను ప్రదర్శించిన వీరత్వాన్ని లేన్‌పోల్ ఇలా వర్ణించాడు:

"యుద్ధం అత్యంత క్లిష్ట స్థితికి చేరుకుంది. అతని ఎన్నుకోబడిన దళాలు సైతం వెనుకంజవేసాయి. ఔరంగజేబ్ పరాజయం పాలయ్యే చిహ్నాలు స్పష్టంగా కనబడుతున్నాయి. అతనొంటరిగా నిలబడ్డాడు. బహు కష్టంగా వేయిమంది సైనికులే అతని వెంట ఉన్నారు. వారు కూడా దారా దాడికి బెదిరిపోతున్నారు. ఇంతకన్నా అపర శూరత్వాన్ని ప్రదర్శించే సన్నివేశం రాబోదు. కాని ఔరంగజేబ్ శరీరంలో మాంసకండరాలకు బదులు, ఉక్కు పిడిచ లున్నాయి. అయితే లక్షమంది సైనికులపై వేయిమింది సైనికులతో విజయం సాధించడం అనేది ఔరంగజేబ్ శూరత్వానికే చెల్లిపోయింది." (ఔరంగజేబ్ పర్.... షిబ్లి పేజి 122)

ఔరంగజేబ్‌లోని ఈ అపర శూరత్వాన్ని, అమితాశ్చర్యకరమైన గుండె నిబ్బరాన్ని, అచంచలమైన అతని పట్టుదల, తెగింపును వృద్ధాప్యం, బలహీనత, నిరంతర ప్రయాణం, పదే పదే వచ్చే ఆపదలు – ఏదీ వంచలేకపోయింది. "1669లో 'సితారా' ప్రాంతంలో మరాఠాలు ఒక మందుగుండు సొరంగాన్ని పేల్చినప్పుడు, వందలాది సైనికులు అసువులు బాసినప్పుడు, ఈ ఎనభై రెండు సంవత్సరాల ముదుసలి, వెంటనే అశ్వాన్ని అధిరోహించి, ప్రమాదస్థలికి చేరుకొని, శవాల్ని, క్షతగాత్రుల్ని తీయించి, ఈ యుద్ధం కమాండింగ్ తానే చేపడతానని స్థిరంగా నిలబడ్డాడు. అయితే ఎంతగానో బ్రతిమిలాడి అతన్నీ ప్రయత్నం నుండి విరమించడం జరిగింది. ఇప్పటికీ అతను సమూగడ్‌లో తన గజరాజు కాళ్ళకు బేడీలు వేయించిన యువకుడే!" ఇవైతే లేన్‌పోల్ వాక్యాలు. ఇక ఖాఫి ఖాన్ ఏమంటున్నాడో వినండి :

"కోటపై దాడికి నియమించబడిన వారు హతాశులయ్యారని, ఎటూ పాలుపోక నిశ్చేష్టు లయ్యారని తెలిసినప్పుడు చక్రవర్తి ఆలంగీర్, పూర్తి రాచరిక ఠీవి, దర్పాలతో అశ్వాన్ని అధిరో హించి ప్రాణాల్ని తృణప్రాయంగా భావించి, చావో రేవో తేల్చుకోవాలని రణరంగంలోకి వచ్చేశాడు. అంగరక్షక దళం కూడా వెన్నంటి వచ్చింది. రణస్థలికి చేరుకోగానే శవాల్ని అడ్డుగా, గోడగా పెట్టుకొని బాణాలు, బుల్లెట్లు వర్షంలా కురుస్తున్నా, లెక్కచేయకుండా ఆగకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆదేశించాడు. అయితే సైనికులు ఎంత నివ్వెరకు గురిఅయ్యారంటే చక్రవర్తి ఆదేశాలు కూడా వారిని కదిలించి స్పృహకు తేలేకపోయాయి. ఈ పరిస్థితిని గమనించిన చక్రవర్తి రాకుమారుడు ముహమ్మద్ ఆజం షాహ్‌ను వెంటబెట్టుకొని స్వయంగా వ్యక్తిగతంగా కోటవైపు బయలుదేరాడు. కాని దర్బారు నాయకులు పట్టుబట్టి ఎంతగానో బ్రతిమిలాడి చక్రవర్తిని

ముందుకు పోకుండా అడ్డునిలిచారు.” (ముంతఖబుల్ లుబాబ్ – ఖాఫి ఖాన్, వా.2, భా.3, పేజి 413)

ఔరంగజేబ్ సంకల్ప స్థిరత్వాల్ని ప్రదర్శించే సన్నివేశాలు అతని జీవితంలో వందలాదిగా కనబడతాయి. అందులో ఒకటి అతను రాకుమారునిగా ఉన్నప్పుడు బల్ఖ్ (అఫ్గనిస్తాన్) రణరంగంలోకి దిగాడు. అబ్దుల్ అజీజ్ ఖాన్‌తో సంకుల సమరం నడుస్తున్నది. యుద్ధం మధ్యలోనే జుహర్ నమాజ్ వేళయింది. శత్రు సైన్యాలు నలువైపుల్నుండి బాణాల వర్షం కురిపిస్తున్నాయి. స్థిరత్వం మూర్తీభవించిన ఈ వీరుడు అత్యంత గంభీరంగా అశ్వం దిగి, నమాజు వరుసను ఏర్పరిచి, ప్రశాంతంగా, నిశ్చింతతో ఫర్జ్, సున్నత్, నఫిల్ ఇలా అన్ని నమాజులు సలుపుతున్నాడు. అత్యంతాశ్చర్యకరమైన ఈ సన్నివేశాన్ని చూసిన అబ్దుల్ అజీజ్ ఖాన్ “యుద్ధాన్ని ఆపేయండి! ఇలాంటి వ్యక్తితో పోరాడడం మృత్యువును కొనితెచ్చుకున్నట్లే” అంటూ అరిచేశాడు. అంతే! యుద్ధం ఆగిపోయింది. (మాసిరె ఆలంగీరి – ముస్తఅద్ ఖాన్, పేజి 387, 388)

ఇక అల్ ఫిన్‌స్టన్ గారైతే తమ గ్రంథంలో ఔరంగజేబ్ ధైర్యస్థైర్యాల్ని, వీరత్వాన్ని, అతని పట్టుదల, తెగింపుల్ని తెలిపే పూర్తి ఒక అధ్యాయమే ఏర్పరిచారు. సుదీర్ఘమై పోతుందని దాన్ని వదిలేశాము.

మొగలు సైన్యంలో “సాదాతె బారహ్” పేరుగల సైనిక దళం తన అసమాన ధైర్యస్థైర్యాల కారణంగా ప్రముఖంగా పేర్కొనబడేది. వాస్తవంలో కూడా మొగలుల విజయాల పరంపరలో ఈ “సాదాతె బారహ్” పాత్ర విస్మరించరానిది. అత్యధిక విజయాలకు కారకులు వీరే. అందుకే వీరు తమ పట్ల అత్యంతగా గర్వపడేవారు. ఒకసారి వీరందరూ కలిసి దర్బారు నాయకులతో పోరాడారు. ఖాజీ న్యాయస్థానంలో కేసును సమర్పించండని ఔరంగజేబ్ ఆదేశించాడు. “మా కేసును మేమే పరిష్కరించుకుంటామ”ని సాదాతె బారహ్ గర్వాన్ని ప్రదర్శించారు. ఔరంగజేబ్ చొక్కాయ చేయిని పైకి మడుస్తూ, “ఎవరైతే నా ఖడ్గరుచిని చవిచూశారో, షరీయతు ఆదేశాలకు విరుద్ధంగా ఇలాంటి మాటలు పలకరు. అందరూ కలిసి న్యాయస్థానానికి వచ్చితీరాలి” అంటూ కటువుగా పలికాడు. అంతేకాకుండా కాపలా మొదలుగాగల కీలక పదవులపైనున్న “సాదాతె బారహ్” అందరినీ తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశాడు. సాదాత్‌ల గర్వమంతా అణగారిపోయింది. (మాసిరె ఆలంగీరి – ముస్తఅద్ ఖాన్ సాఖి, పేజి 259, 260)

రాకుమారుడు అక్బర్ తిరుగుబాటు చేశాడు, డెబ్భైవేల రాజపుత్ర సైన్యాల్ని తీసుకొని సమీపించినప్పుడు, ఔరంగజేబ్ సారథ్యంలో అప్పుడు కేవలం వెయ్యిమంది మాత్రమే సైనికులున్నారు. మిగిలిన సైన్యాలు వేర్వేరు ప్రాంతాల్లో సుదూరంలో ఉన్నాయి. అయితే ఔరంగజేబ్ నుదుటిపై ఒక్క మడత కూడా పడలేదు. అతనే మాత్రం చలించలేదు. స్థిరంగా పర్వతంలా నిలబడ్డాడు. ఇంకా ఆ సమయంలో తరచుగా ఇలా అనేవాడు : “ఈ వీరుడు ఎంతో చక్కని సందర్భాన్నైతే ఎంచుకున్నాడు. కాని వెంటనే తలపడటానికి ఎందుకని వెనుకాడుతున్నాడో”

చివరికి రాకుమారుడు అక్బరే వెనుకంజవేసి, పారిపోయాడు. (మాసిరె ఆలంగీరి – ముస్తఅద్ ఖాన్ సాఖి, పేజి 129, 130)

జదూనాథ్ సర్కార్ ఔరంగజేబ్ వాక్యాల్ని ఇలా వర్ణించాడు : "I am now defenceless. The young Hero has got a fine opportunity. Why, then is he delaying his attack?" (History of Aurangazeb Vol.III, page 238)

రాకుమారుడు ఆజం షా ధైర్యసాహసాల్లోనూ, వీర శూరత్వాల్లోను ఆ కాలంలో దేశ మంతటిలో ప్రఖ్యాతిగాంచాడు. అతని తప్పిదానికి శిక్షగా అతన్ని బంధించిన వెంటనే విడుదల చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆ తరువాత అతను విడుదల అయినా కూడా దాని ప్రభావం అతనిపై ఎంతగా పడిందంటే, ఎప్పుడైనా ఔరంగజేబ్ నుండి లేఖ వచ్చిందని తెలిస్తే చాలు, అతని రంగుమారి పోయేది. భయంతో తెల్లబడిపోయేవాడు. (ముంతఖబుల్ లుబాబ్ – ఖాఫిఖాన్, వా.2 భాగం 3, పేజి 365)

“ఆలంగీర్‌కె దర్బారి అఖ్బారాత్”ల అధ్యయనం వల్ల తెలిసేదేమంటే ఔరంగజేబ్ జీవితం లోని చివరి 26, 27 సంవత్సరాలు దక్షిణ భారత దేశంలోనే గడిచిపోయాయి. ఈ సుదీర్ఘ కాలంలోని అత్యధిక భాగం రాజమహలులో హంసతూలికా తల్పాల మీద కాకుండా మహా రాష్ట్రలోని చిట్టడవి ప్రాంతాల్లో, సైనిక శిబిరాల్లోనే గడిచిపోయింది. పశ్చిమ మహారాష్ట్రలోని రాళ్ళు రప్పలతో కూడిన అననుకూల ప్రదేశం, అతికష్టంగా ప్రయాణించగలిగే కొండ త్రోవలు, అత్యధిక వర్షాలు కురిసే చిత్తడి, చిట్టడవి ప్రాంతం. కొండల్లో, గుట్టల్లో, అడవుల్లో దాగి ఉండి మెరుపుదాడులు, గెరిల్లా దాడులు చేస్తూ త్రోవల్ని అసురక్షితంగా మార్చిన మరాఠా దళాలు మాటువేసి ఉన్న ప్రమాదకర ప్రాంతం. వీటిలో ఏదీ కూడా ఈ చక్రవర్తికి అడ్డు నిలువలేక పోయింది. ఔరంగజేబ్‌లోని ధైర్యస్థైర్యాలు, పట్టుదల, శ్రమకోర్చేగుణం – ఇవన్నీ దక్కన్‌లో అతను గడిపిన 26, 27 సంవత్సరాల జీవితంలో ప్రస్ఫుటంగా కనబడతాయి. నిరంతరం ఘర్షణలతో కూడిన ఈ 26, 27 సంవత్సరాల జీవితం 1707లో అహ్మద్ నగర్‌లో అతని మరణంతో సమాప్తమైపోతుంది. ఇక వయస్సురీత్యా చూసినా చక్రవర్తికి 90 ఏళ్ళు సమీపిస్తున్నాయి. అయినా ఈ శ్రమజీవి 90 ఏళ్ళ వృద్ధాప్యంలో కూడా రోజుకు ఎనిమిది పది మైళ్ళు పల్లకీ మీదనో, గుర్రం మీదనో కొండల్లో, అడవుల్లో సంచరిస్తూనే కనిపిస్తాడు. ఈ తిరగడం కూడా ఏదో షికారుకో, వాహ్యాళికో కాదు సుమా! యుద్ధవ్యూహాల్లో, రణరంగాల్ని పర్యవేక్షించడంలో గడిపేస్తున్నాడు. అతను భారత దేశానికంతటికీ చక్రవర్తి. అతని అధీనంలో లక్షలాది సైన్యాలున్నాయి. వందలాది మన్సబుదారులూ (సైన్యాధికారులూ) ఉన్నారు. రాజధాని ఢిల్లీలో కూర్చుండి హాయిగా తన ఉన్నతాధికారుల, సైనికాధికారుల ద్వారా రాజ్యమేలే అవకాశాలున్నాయి. అతనికన్నా ముందు వచ్చిపోయిన చక్రవర్తులు అలాగే చేశారు. కాని ఔరంగజేబ్ దాన్ని కాదని శ్రమతో కూడిన కఠోర జీవితాన్ని అభిలషించాడు. యుద్ధ మైదానాల్లో, కోటల ముట్టడుల్లో నిర్భయంగా తిరుగాడుతున్నాడు. కోటల పైనుండి శత్రువులు పేల్చే ఫిరంగి

గుండ్లు, తుపాకి గుండ్లు, బాణాలు చక్రవర్తికి సమీపంలో వచ్చిపడుతున్నాయి. అయినా లెక్క చేయటం లేదు. రణరంగంలో ఇంత సమీపానికి వస్తే, ప్రాణాపాయముంటుందని సైనికులు, సైనికాధికారులు బ్రతిమిలాడితే, వీర మరణాన్ని కాంక్షిస్తున్నానని సమాధానమిస్తాడు. ఇలాంటి సామెత చరిత్రలో వేరొకటి కన్పించడం బహుకష్టం. ఇక చెప్పడానికి అయితే సైనిక శిబిరమే కాని, రాజ్యానికి సంబంధించిన సర్వకార్యకలాపాలు అన్నీ అక్కడ జరుగుతున్నాయి. ఆర్థికపరమైన, పరిపాలనాపరమైన, సైనికపరమైన దేశీయ, విదేశీయ శాఖలన్నీ పనిచేస్తున్నాయి. మహారాష్ట్రలోని చిట్టడవి ప్రాంతంలోని సైనిక శిబిరంలోఉన్న చక్రవర్తికి డిల్లీలోని ఒక ఇంట్లో తయారు చేయబడుతున్న దొంగ (నాటు) సారా సమాచారం తెలిసిపోతుందంటే అతని గూఢచార లేక సి.ఐ.డి. వ్యవస్థ ఎంత పటిష్టంగా, సమర్థవంతంగా పనిచేస్తుండేదో అర్థం చేసుకోవచ్చు. రోజంతా దర్బారు నడుస్తుంది. అందులో ఆర్థిక, సైనిక, పరిపాలనా ఇంకా న్యాయస్థానపు సామాన్య కార్యకలాపాలు నడుస్తున్నాయి. ఈ దర్బారు వ్యవహారాలు ఏదో రాజ మహలులోని సువిశాలమైన హాల్లో కాకుండా, పశ్చిమ మహారాష్ట్రలోని అత్యధిక వర్షాలు కురిసే అడవుల్లోనో, లేక కొండ ప్రాంతాల్లోనో ఏర్పాటు చేసిన గుడారాల్లో, సువిశాలమైన టెంట్లలో నడుస్తున్నాయి. ఎగుడు దిగుళ్లతో కూడుకుని దుస్తరమైన త్రోవలు, అపరిచిత వాతావరణం, శత్రువులు వ్యాపించి వున్న ప్రాంతం, రాకపోకల సాధనాలు దుర్లభం – విధి నిర్వహణలో చక్రవర్తి ఇవేం పట్టించుకో లేదు. ఇలాంటి వాతావరణం, ఇలాంటి సంక్షోభ స్థితుల్లో కూడా పూర్తి రాజ్య వ్యవహారాలు నడపడం అనేది నిజంగా ఔరంగజేబ్ ఆలంగీర్‌కే సాధ్యమయింది. (ఆలంగీర్ కె దర్బారి అఖ్బారాత్" – సయ్యద్ షా గాజియొద్దీన్, పేజి 4౦ – 43)

ఔరంగజేబ్‌పై కలం లేపిన ప్రతి చరిత్రకారుడు, అతని సమర్థకుడైనా, విమర్శకుడైనా, కాజింషేరాజి, షానవాజ్ ఖాన్, ముస్తఅద్ ఖాన్, షేర్‌ఖాన్‌లోధీ, ఖాఫి ఖాన్, ఆఖిల్‌ఖాన్ రాజి లాంటి ముస్లిం చరిత్రకారులు కానివ్వండి, సుజాన్‌రాయ్ భండారి, రాయ్ చందర్‌భాన్, రాయె బింద్రామన్, భీమ్‌సేన్ కాయిస్త్, ఈసర్‌దాస్, మున్షి మాధూరామ్, రఘునాథ్ దాస్ అగర్వాల్ లాంటి హిందూ సమకాలీన చరిత్రకారులూ కానివ్వండి, డాక్టర్ బర్నేర్, డాక్టర్ క్రేరి, డాక్టర్ గేమ్లీ, హెమిల్టన్, టూరిస్, మనూచి లాంటి విదేశీయులు కానివ్వండి, ఆ తరువాత వచ్చిన జదూనాథ్ సర్కార్, అల్‌ఫిన్‌స్టన్, లేన్‌పోల్ లాంటి ఆంగ్లంలో రాసిన ప్రాచీన చరిత్రకారులు కానివ్వండి, లేక ప్రొఫెసర్ ఈశ్వరీప్రసాద్, డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే, ఆర్.సి. మజుందార్, ఎచ్.సి. రాయ్‌చౌదరీ, కాళి కింకర్ దత్త, ప్రొఫెసర్ సతీష్‌చంద్ర, డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ లాంటి ఆధునికి చరిత్రకారులు కానివ్వండి, ఎవ్వరైనా సరే, ఔరంగజేబ్ నడవడికల్ని, గుణగణాల్ని, అతని శీలాన్ని పొగడకుండా, ప్రశంసించకుండా ఉండలేకపోయారు. ఔరంగజేబ్ గుణగణాల్ని అతని శీలాన్ని గురించి పైవారంతా తెలిపిన అభిప్రాయాల్ని పేర్కొంటూపోతే ఈ అధ్యాయమే ఓ గ్రంథమైపోతుంది. అందుకని కేవలం ఇద్దరు ముగ్గురి అభిప్రాయాల్ని మాత్రమే మీకు సమర్పిస్తున్నాము.

డాక్టర్ ఈశ్వరీ ప్రసాద్ ఔరంగజేబ్ గురించి ఇలా విశ్లేషించారు : "పరమాత్ముని లీల విచిత్రంగా ఉంటుంది. తన ప్రజల పట్ల ఔరంగజేబ్ ఎంత ప్రేమ, శ్రేయోభిలాష కలిగి ఉండేవాడో, దైవం అతన్ని అంతగానే అపకీర్తి పాల్జేశాడు. (దైవం అనేకంటే పక్షపాతం గల చరిత్రకారులంటే బావుండేది – అబుల్ ఫౌజాన్) ఒకరేమో అతన్ని దౌర్జన్యకారునిగా పేర్కొంటే మరొకరు రక్తపాతిగా అభివర్ణించారు. కాని వాస్తవంలో ఆలంగీర్ (విశ్వ వ్యాపి) గా అతను పొందిన బిరుదుకు అతను అన్నిరకాలుగా అర్హుడై ఉన్నాడు." (History of India, - Dr. Eswari Prasad, page 258, New Delhi, 1971).[7]

ఆర్.సి. మజుందార్, ఎన్.సి.రాయ్ చౌదరి, మరియు కాళికింకర్ దత్త సంయుక్తంగా రాసిన తమ గ్రంథంలో ఇలా పేర్కొన్నారు :

"కొందరు ఔరంగజేబ్‌లోని సుగుణాలను విడిచిపెట్టి కేవలం లోపాల్నే లెక్కించారు. ఇది అత్యంత తప్పైన పద్ధతి. ప్రతి విషయానికి ఔరంగజేబ్‌ను నిందించడం సమంజసం కాదు. వారసత్వం మరియు సింహాసనం కోసం జరిగిన యుద్ధాల్లో కూడా, ఆలంగీర్ తన తండ్రి సోదరుల పట్ల, తన పూర్వీకుల కన్నా మేలైన ప్రవర్తనను ప్రదర్శించాడు.

అతని వ్యక్తిగత జీవితం అతి సామాన్యమైనది, పవిత్రమైనది, ధర్మనిష్ఠతో కూడుకున్నది. అతను తన మానసిక వాంఛలకు దాసుడు కాలేదు. నిషేధిత ఆహారం, దుస్తులు మరియు పానీయాల నుండి కడు దూరంగా ఉంటుండేవాడు. అతని పత్నుల సంఖ్య కూడా ఇస్లామీయ ధర్మశాస్త్రం అనుమతించిన సంఖ్యకన్నా తక్కువే ఉండేది. అతను ఇస్లామీయ ధార్మిక శాస్త్రంలో ఉత్సాహవంతుడైన విద్యార్థి మరియు ప్రవీణుడైన క్యాలిగ్రాఫర్. తన పిల్లల శిక్షణలో అతను పవిత్ర వ్యక్తుల జీవిత సంఘటనలతో సహాయం తీసుకున్నాడు. అతను ఒక ధర్మనిష్ఠగల ముస్లిం. అతను పూర్తి విశ్వసనీయతతో దివ్య ఖురాన్ ఆదేశాల పాలన చేసేవాడు. ఒకసారి బల్ఖ్ యుద్ధమైదానంలో, తీవ్రస్థాయిలో యుద్ధం జరుగుతున్న సమయంలో కూడా వేళ తప్పకుండా నమాజ్ సలిపాడు. తన ధార్మిక విశ్వాసాల్లో ఔరంగజేబ్ చిత్తశుద్ధిని నిరాకరించ లేము.

అతనికి తన లక్ష్యం పట్ల ప్రేముండేది. ఆ లక్ష్య సాధనకోసం అతను అలుపెరుగక శ్రమించేవాడు. అతని ధైర్యస్థైర్యాలు, అతని తెగింపు, అతని తెలివి శత్రువుల్ని కూడా ఆశ్చర్య చకితుల్ని చేసేది. అతని యోచన, అతని దూరదృష్టి, అతని కార్యనిర్వహణ సైనిక వ్యవహారాల్లో అతని విజయానికి దోహదపడేవి. అతని పరిత్యాగము, న్యాయప్రియత్వము సాటిలేనిది. అతని ఓర్పు, సహనాలు ఆదర్శనీయమైనవి. అతనిలో అసామాన్యమైన నిర్ణయాత్మక శక్తి ఉండేది. అతను చట్టాన్ని, శాసనాన్ని ఎంతగా గౌరవించేవాడంటే, ఒకరిని శిక్షించడంలో అసలే తొందర పడేవాడు కాదు. అపరిమితమైన అతని జాగ్రత్త, మరియు నియమపాలన కొన్ని సందర్భాల్లో పరిపాలనలో ఆటంకాల్ని, అడ్డంకుల్ని కూడా ఏర్పరిచేది."

(An advanced History of India - R.C. Majumdar, H.C. Roy Choudhary and Kali Kinker Dutta, page 501-503, 1990 Mac Millan India, Madras)

పై చరిత్రకారులు వెలిబుచ్చిన అభిప్రాయం అనగా “ఒకరిని శిక్షించడంలో అసలే తొందరపడేవాడు కాదు, ఇంకా అపరిమితమైన అతని జాగ్రత్త, నియమపాలన” – దీన్ని అతని సమకాలీన చరిత్రకారుడు ఖాఫి ఖాన్ సమర్థిస్తూ ఇలా ధ్రువీకరించాడు. “శిక్ష, కాఠిన్యత లేనిది రాజ్య వ్యవహారాలు సాఫీగా నడవడం కష్టం. ఇక ఆలంగీర్ పాదుషాల వారు ధార్మికతను పూర్తిగా జీర్ణించుకున్నవారు. అందుకని శిక్షించడంలో అసలే తొందరపడేవారు కాదు.” – ఈ విషయాన్నే ఇదే ఖాఫి ఖాన్, ఒక సంఘటన ద్వారా ఇలా నిరూపిస్తాడు: “బుర్‌హాన్‌పూర్‌లో బాదుషాలవారు ఆగివున్న రోజుల్లో అరక్ కోట మరియు చౌరస్తాకు సమీపంలో ఒక భవనంలో గొప్ప ప్రేలుడు సంభవించింది... దాని తాకిడికి పైకప్పు ఎగిరిపోయింది. ఎంతోమంది గాయ పడ్డారు. ఈ విషయంగా విచారణ జరుపుతుండగానే బాదుషాలవారు విడిది చేసివున్న భవనం సెలార్ (అడుగుభాగం) లో కూడా ప్రేలుడు పదార్థాలు నింపివున్న ముప్ఫయి సంచులున్నాయనే కబురందింది. వెంటనే విచారణ జరుపగా అది నిజమని తేలింది. చక్రవర్తి దక్కన్ విడిచి రాజధానికి బయలుదేరినప్పటి నుండి అవి అక్కడే ఉన్నాయని, ఫిరంగి దళ కమాండర్లు, కోట అధికారులు అప్పుడు వీటిని అక్కడ పెట్టించారని అప్పటి నుండి అవి అక్కడి నుండి తీయబడనే లేదని తెలిసింది. (వారి ఈ నిర్లక్ష్య వైఖరికి) ఫిరంగిదళ కమాండర్లలో, కోటలోని ఉన్నతాధికారుల్లో ఏడెనిమిదిమంది రాజాగ్రహానికి గురిఅయ్యారు. వారి మన్సబులు (హోదాలు) తగ్గించబడ్డాయి. ఇంకా పాదుషాలవారు ఇలా అన్నారు :“ఇదే సంఘటన దివంగత జహంగీర్ ప్రభువుల కాలంలోనే గనక జరిగివుంటే అధికారులందరినీ అవే మందు సంచుల్లో కుక్కి నిప్పంటించేవారు.” – ఔరంగజేబ్ చక్రవర్తి ధార్మికత్వం మూర్తీభవించిన వారనడంలో ఎలాంటి అనుమానానికి తావేలేదు. ఆయన గారి నైతికతలు మహోన్నతమైనవి, దయార్ద్రత అపూర్వమైనది. (అసలాయన శిక్షించేవారే కాదు). ఎక్కువకు ఎక్కువ మన్సబును తగ్గించడమే ఆయన ఇచ్చే పెద్ద శిక్ష. అది కూడా కొన్ని రోజులకు నేరం చేసిన వారి పనితనంలో మెరుగుదల, దర్బారు అధికారుల సిఫారసులతో పాత మన్సబును తిరిగి పొందేవారు.” (ముంతఖబుల్ లుబాబ్ – ఖాఫి ఖాన్–వా. 2, భా. 3, పేజి 254, 255)

పాట్నా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్, డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ ఔరంగజేబ్ గుణగణాలను వర్ణిస్తూ ఇలా వ్రాశారు :

“ఔరంగజేబ్ అత్యంత ధైర్యశాలి, అసామాన్యమైన వీరుడు. నిమ్మళమైన మస్తిష్కంతో ఆలోచించి, ఆచితూచి అడుగు వేయడం అతని స్వభావం. పదిహేను సంవత్సరాల చిరు ప్రాయంలో మదమెక్కిన ఏనుగుల్ని ఏకాకిగా ఎదుర్కోవడం ఒక వైపైతే, డెబ్బది ఎనిమిది సంవత్సరాల వృద్ధాప్యంలో ‘వాగిన్‌ఖేడా’ ను చుట్టుముట్టిన (రణరంగపు) మాటు దిబ్బల్లో నిర్భయంగా నిలబడి తన ధైర్యసాహసాల్ని ప్రదర్శించసాగాడు. నిశ్చయంగా సమీపంలోనే ఉన్న కష్టఘడియల్ని ఇరుక్కోబోతున్నప్పటికీ ధైర్యోత్సాహంతో మాట్లాడటం, ఖజ్వా మరియు ధర్మావత్ యుద్ధాల్లో మృత్యువు కళ్ళలో కళ్ళువేసి వీక్షించడం అతని జీవితంలోని అమర ఘట్టాలు.

ఇతర రాకుమారుల సామాన్య జీవితాలకు విరుద్ధంగా ఔరంగజేబ్ అనేక రకాల పుస్తకాల అధ్యయనానికి ఇష్టపడేవాడు. అత్యంత సూక్ష్మంగా ఆలోచించడం అతని అలవాటు, గాంభీర్యం అతని స్వభావం. ఔరంగజేబ్ పారశీకము, టర్కిష్ మరియు హిందీ ధారాళంగా మాట్లాడగలిగేవాడు, అర్థం చేసుకోగలిగేవాడు. ఈ కారణంగానే ముస్లింల ధార్మిక చట్టాల అత్యంత ఉద్గ్రంథం మరియు ప్రామాణిక గ్రంథం "ఫత్‌వా-యె-ఆలంగీరి" అతని కాలంలో, అతని పర్యవేక్షణలో భారతదేశంలో తయారయింది.

మేలైన, గౌరవప్రదమైన అతని ప్రవర్తన కారణంగానే, అతని రాకుమార దశలోనే, అతని తండ్రి ఆస్థానంలోని ఉన్నతోన్నత నాయకులు అతనికి మిత్రులు, సన్నిహితులైపోయారు. తన ఈ వ్యవహార శైలిని, ఈ స్వభావాన్ని చక్రవర్తి అయిన తరువాత ఇంకనూ పెంపొందించు కున్నాడు. ప్రజలు రాజభూషణాల్లో అతన్ని ఓ ఫకీరుగా కనుగొన్నారు. అతి సామాన్యమైన, నియమబద్ధతతో కూడిన జీవితాన్ని గడిపాడు. క్రీడా వినోదాలతో, పనికిమాలిన చర్యలతో అతను బహుదూరంగా ఉన్నాడు. అతని పత్నుల సంఖ్య, దివ్య ఖురాన్ అనుమతించిన సంఖ్యకన్నా ఎల్లప్పుడూ తక్కువగానే ఉండేది. 1657లో దిల్‌రస్ బానొ చనిపోయింది. 1660 తరువాత నవాబ్‌బాయి ఒంటరి జీవితం గడుపాల్సి వచ్చింది. 1685లో ఔరంగబాదీ పరమపదించింది. అంతకుముందు ఆమె ఎల్లప్పుడూ ఔరంగజేబ్‌తోనే ఉండేది. 1660లో ఉదయ్‌పూరి వివాహం ఔరంగజేబ్‌తో జరిగింది. అతని చివరి రోజుల్లో ఈమెనే ఔరంగజేబ్ వెంట ఉండేది.

పరిపాలనా యంత్రాంగం పర్యవేక్షణ కోసం అతను అత్యంత ఆశ్చర్యకరంగా పరిశ్రమించేవాడు. పనిభారం ఎక్కువైనప్పుడు కొన్ని సందర్భాల్లో అతను రోజుకు రెండుసార్లు దర్బారు ఏర్పాటు చేసేవాడు. ఔరంగజేబ్ చివరి కాలపు ఇటాలియన్ దర్బారి వైద్యుడు గేమ్లీని అనుసరించి[8] "ఔరంగజేబ్ ఎత్తు కురుచగా ఉండేది. పొడువైన ముక్కు, శరీరం సన్నగా మరియు వృద్ధాప్యం కారణంగా కాస్త వంగి ఉండేది. అతని రంగు (వర్చస్సు) గోధుమ వన్నె కలిగి, గుండ్రటి తెల్లటి గడ్డం ఉండేది. వివిధ వ్యవహారాలకు సంబంధించిన అర్జీలు అతనికి సమర్పించ బడినప్పుడు వాటిపై స్వహస్తాలతో వ్రాయడం చూసి అతని పట్ల నా హృదయంలో అత్యంత గౌరవ భావం ఉత్పన్నమయ్యేది. వ్రాసేటప్పుడు, చదివేటప్పుడు అతను కళ్ళద్దాలు పెట్టుకునేవాడు కాదు. అతని ప్రసన్నమైన వదనాన్ని చూసి, తన ఈ పనివల్ల అతను అత్యంత సంతృప్తుడవుతున్నట్లు కనిపించింది.[9] తొంభై సంవత్సరాల వయస్సులో కూడా అతని మనోమస్తిష్కాలు, అవయవాలు పూర్తిగా అదుపులో ఉన్నాయి. అతని జ్ఞాపకశక్తి ఎంతబలంగా ఉండేదంటే ఒక్కసారి ఎవరినైనా చూసినా, లేక ఒక్కసారి ఏదైనా మాట విన్నా, ఇక జీవితాంతం దాన్ని మరిచిపోక పోయేవాడు. గడిచిన కొన్ని సంవత్సరాల నుండి వృద్ధాప్యం కారణంగా కాస్త గట్టిగ చెబితేనే వినిపించేది. ఒక దుర్ఘటనలో అతని కుడి మోకాలు చెదిరి, సరియైన చికిత్స జరగకపోవడం వలన అతను కాస్త కుంటుతున్నాడు. ఈ రెండు లోపాలు ఉన్నప్పటికీ కూడా, అతను బ్రతికినన్ని రోజులు అతని శారీరక శక్తులన్నీ కూడా యథాతథంగా తమ విధుల్ని నిర్వర్తిస్తున్నాయి.[10] ఔరంగజేబ్ సాధుసంతుల లాంటి కఠోరమైన జీవితాన్ని అభిలషించాడు. ఎల్లప్పుడూ అతను అణకువ,

నమ్రతనే ప్రదర్శించాడు. ప్రజలు అతన్ని ఆలంగీర్-జిందాపీర్ (ఆలంగీర్ సజీవ మహాత్ముడు) అంటూ పిలిచేవారు."[11] (ఔరంగజేబ్ - ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 34, 35.)

ఔరంగజేబ్ వ్యక్తిగత గుణాల్ని, యోగ్యతల్ని సమీక్షిస్తూ ప్రఖ్యాత చరిత్రకారుడు డాక్టర్ తారాచంద్ ఇలా వ్రాశారు: "ఔరంగజేబ్ ద్వారా స్థాపించబడిన ఆ సామ్రాజ్యం, తన విస్తీర్ణం, జనాభా, సిరిసంపదల రీత్యా దానికి సాటి, సరిసమానం అప్పటి ప్రపంచ రాజకీయాల్లో వేరొకటి లేదు. (అంటే అది తనకు తానే సాటి). కష్టతరమైన తన విధుల్ని నిర్వర్తించటంలో అతను ప్రదర్శించిన నిర్మలత, ఏకాగ్రత, నిమగ్నత, సంకల్ప స్థిరత్వాలు మరియు పట్టుదల అద్వితీయమైనవి. వ్యక్తిగత జీవితంలో అతనో సజ్జన వ్యక్తికి నమూనా. ఆసియా ఖండానికి చెందిన పరిపాలకులు, రాకుమారుల్లో ఉండే సర్వసామాన్య చెడులకు, రుగ్మతలకు అతను అతీతుడు. అతను అతి సామాన్యమైన ఇంకా చెప్పాలంటే రసహీనమైన ధర్మనిష్ఠ, నిగ్రహాలతో కూడిన జీవితం గడిపేవాడు. తన ఆహార పానీయాల్లో, వేషభూషణాల్లో ఇంకా జీవితానికి సంబంధించిన ఇతర అన్ని వ్యవహారాల్లో అత్యంత జాగరూకతతో మెదిలేవాడు. రాజ్యపరి పాలనా వ్యవహారాల్లో తలమునకలై ఉన్నప్పటికీ తన స్వంత ఖర్చులు పూర్తి చేసుకోవటానికి ఖుర్ఆన్ ప్రతులు వ్రాయటానికి, టోపీలు కుట్టుకోవటానికి సమయాన్ని రాబట్టుకునేవాడు..... తన దైనందిన కార్యక్రమాల్ని అతను కఠినంగా ఆచరించేవాడు. ఇరువై నాలుగు గంటల్లో అతను కేవలం మూడు గంటలు మాత్రమే నిదురించేవాడు. పని తీసుకోవడంలో అత్యంత కఠినుడు, ఇతరుల పట్లనూ, స్వయంగా తన పట్ల కూడాను. సువిశాలమైన తన సామ్రాజ్య సర్వ వ్యవహారాల్ని స్వయంగా పర్యవేక్షించేవాడు. ఇంకా తన సైనిక కార్యకలాపాలన్నిటినీ స్వయంగానే నియంత్రించేవాడు. అతను తరగని శక్తికి, అచంచల మైన సంకల్పానికి యజమాని." (History of Freedom Movement - Vol.1, Page.38, 1985-Delhi) [12]

ఔరంగజేబ్ కేవలం మొగలు వంశంలోనే, దక్షిణ ఆసియా లేక భారత ద్వీపకల్పంలోనే కాదు, ప్రపంచ చరిత్రలోనే అత్యంత ఆదర్శనీయమైన బహు కొద్దిమంది పరిపాలకుల వరుసలో నిలబెట్టదగిన వాడు. అతని వ్యక్తిత్వంలోని సంపూర్ణత సాటిలేనిది. ఒక విచిత్ర విషయం ఏమి టంటే అతని వ్యక్తిత్వంలో ఏకకాలంలో సాధుత్వమూ, రాచరికం రెండింటి సుగుణాలు సమ్మిళిత మయ్యాయి. అదెలాగంటే అతను తన మరణానికి ముందు రాసిన వీలునామా దీనికి ప్రత్యక్ష నిదర్శనం. తను స్వహస్తాలతో టోపీలు కుట్టి దాని కూలీతో కూడబెట్టుకున్న డబ్బుతో తన ఖనన క్రియలు పూర్తిచేయాలని మరణశాసనంలో పేర్కొన్నాడు. రెండవ ఆస్తి తన చేత్తో ఖురాన్ ప్రతులు వ్రాసిన వాటి మూల్యంతో వచ్చిన డబ్బు. ఈ రెండు ఆస్తులు కూడా బహు స్వల్పమైనవి. మొదటి ఆస్తి నాలుగు రూపాయల రెండణాలు, రెండవ ఆస్తి మూడువందల ఐదు రూపాయలు. కాస్త ఆలోచించి చూడండి. భారత దేశంలోనే కాదు, ప్రపంచంలోని ఏ శక్తి అతని సామ్రాజ్యం వైపు కన్నెత్తిచూసే ధైర్యం కూడ చేయలేని, సువిశాల పటిష్ఠ సామ్రాజ్యాధినేత అతను. ఆఫ్గనిస్తాన్ నుండి టిబెట్ వరకు, హిమాలయాల నుండి హిందూ మహా సముద్రం వరకు సువిశాలమైన ఈ సామ్రాజ్యాన్ని ఎడతెగకుండా యాభై ఏళ్ళు సుదీర్ఘంగా పరిపాలించిన చక్రవర్తి అతను.

కాని అతను విడిచి వెళ్ళిన ఆస్తులేవి? నాలుగు రూపాయల రెండణాలు- మూడువందల ఐదు రూపాయలు. నమ్మశక్యమా? నేటి మన చిరుపాలకులు, ఐదేళ్ళు కూడా ఉంటారో, ఉండరో తెలియని పరిస్థితి! కాని ఎన్ని లక్షలకోట్ల ఆస్తులు కూడబెడుతున్నారు? సరే, కూడబెడితే కూడబెట్టు కున్నారు. కాని గురివింద గింజలాగా తమ నలుపును, తమ మురికిని, తమ మలినాన్ని, తమ చెంత ఉంచుకునే నిస్సిగ్గుగా, నిర్లజ్జగా ఔరంగజేబ్‌ను విమర్శిస్తారే! తిట్టిపోస్తారే!! ఒక్కసారి ప్రశాంత మనస్సుతో తమ నైతికతల్ని ఔరంగజేబ్ నైతికతలతో తమ మదిలోనే బేరీజు వేసుకొని మరీ మాట్లాడాలి. నైతికతల రీత్యా ఔరంగజేబ్ ఏ మహోన్నత స్థాయిలో ఉన్నాడో, ఆ స్థాయికి చేరుకోవడం అటుంచి నేటి మన నాయకులు ఆ స్థాయి గురించి కనీసం ఊహించనైనాగలరా? కల్పిత కథల్ని, వక్రీకరించిన వాస్తవాల్ని గుడ్డిగా నమ్మి ఔరంగజేబ్‌ను ఎడాపెడా విమర్శించేవారు ఒక్కసారి ప్రశాంత మనస్సుతో అతన్ని విమర్శించేంత స్థాయి తమకుందా? అని ఆలోచించి మరీ మాట్లాడాలని మనవి చేస్తున్నాము. అందుకే ఔరంగజేబ్ చక్రవర్తిని తనకు తానే సాటి అనడం అతిశయోక్తి కాదు. అణకువ, నిరాడంబరత, నమ్రత, నిశ్చింత, దైవంపై నమ్మకం, ఆత్మ సంతృప్తి లాంటి గుణాలకు అపురూప నిదర్శనమిది. ఆలంగీర్ అసామాన్యమైన తన శక్తి సామర్థ్యాలతో, బలమదాలతో ఎలాంటి అనర్హమైన లాభం పొందలేదు. తనకోసం గాని, తన సంతానం కోసంగాని ఎలాంటి ధనైశ్వర్యాలను కూడబెట్టుకోలేదు, భోగలాలసత్వా లకు లోను కాలేదు. అధికార దర్పాన్ని, గర్వాహంకారాల్ని ప్రదర్శించలేదు. ఎవరైనా ఓ వ్యక్తిపై, ఓ వర్గంపై, ఓ తెగపై దౌర్జన్యానికి పాలుపడలేదు. దైవభీతి అతని స్వభావము, మానవ సేవ అతని పద్ధతి. ముఖస్తుతి చేసే, ఆకాశానికెత్తేసే కవులు, భట్రాజులంటే అతనికి గిట్టదు. తన పొగడ్తను, ప్రశంసను ఎన్నడూ కోరి ఉండలేదు. ధనమదం ద్వారా మొగలు దర్బారులో ప్రాకిపోయిన సర్వ దురాచారాల్ని రూపుమాపిన సంస్కర్త అతను. అక్రమం, అన్యాయం, దౌర్జన్యం అనిపించిన ఆచారాల్ని, తన స్వంత వంశ ఆచారాల్ని, తనకూ తన ప్రభుత్వ కోశాగారానికి లాభదాయక మైనవైనా సరే, వాటన్నింటినీ రూపుమాపాడు. దీనికోసం తండ్రి మందలింపును, కోపాన్ని కూడా ఖాతరు చేయలేదు. సామాన్య రాజుల లాగా రాజ్య ధనాగారాన్ని తన స్వంత ఖజానాగా భావించలేదు. అందులో నుండి కనీసం తన సేవలకు ప్రతిఫలం కూడా స్వీకరించలేదు. టోపీలు కుట్టి, ఖురాన్ ప్రతులు వ్రాసి తన భుక్తిని సమకూర్చుకున్నాడు. సువిశాల సామ్రాజ్యానికి చక్రవర్తి అయివుండి కూడా పంచభక్ష పరమాన్నాల జోలికి పోలేదు. అతి సామాన్యమైన, పేదలు భుజించే ఆహారాన్నే తీసుకునేవాడు.

ఈ విషయంలో డాక్టర్ బర్నియేర్ ఇలా వ్రాశారు. "ఔరంగజేబ్ పరిపాలన చేపట్టిన ఐదవ సంవత్సరం జూన్ మాసంలో రాజధాని అయిన ఢిల్లీకి వచ్చాడు. అప్పుడక్కడ తీవ్రమైన ఎండలు. ఈ ఎండల్లో, వేసవిలో కూడా ఆలంగీర్ రమజాన్ నెలంతా ఉపవాసాలున్నాడు. ఉపవాసంతో ఉండి కూడా సర్వ ప్రభుత్వ కార్యకలాపాల్ని నిర్వహించేవాడు. సూర్యాస్తమయం

అయిన తరువాత ధర్మనిష్ఠులు, దైవభక్తి పరాయణులతో కలిసి "ఇఫ్తార్" చేసేవాడు. ఇఫ్తార్‌లో యవల, మొక్కజొన్నల రొట్టెల్ని భుజించేవాడు. ఆ తరువాత రాత్రిచేసే "తరావీహ్' నమాజ్ కోసం నిలబడేవాడు. రాత్రి అత్యధిక భాగం దైవారాధనలోనే గడిపేవాడు." (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 123-126).(History of Aurangazeb- G.N. Sarkar, Vol.III, Page 7).

ఆ బర్నియరే ఇంకిలా వ్రాశారు :

"ఈ పరిపాలకుడు రమజాన్ నెలంతా ఉపవాసాలు పాటించాడు. రాత్రంతా దైవా రాధనలో గడిపాడు. యవలు, మొక్కజొన్నల రొట్టెలతో ఇఫ్తార్ చేశాడు. ఆ తరువాత ఎంతగా జబ్బుపడ్డాడంటే ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. కాని ప్రమాదకరమైన ఈ వ్యాధి నుండి దైవం అతనికి స్వస్థత చేకూర్చాడు. అయినా ఈ రాజు తన ప్రవర్తనను మార్చుకోలేదు."

ఈ బర్నియరే ఒకచోట ఔరంగజేబ్ తన గురువుతో మాట్లాడిన విషయాన్ని ఇలా పేర్కొన్నాడు :

"ఔరంగజేబ్ (తన గురువు) ముల్లా సాలెహ్‌ను ఇలా ప్రశ్నించాడు : 'మీ విద్యాబోధన వల్ల నాకేం చేకూరింది?' ఇంకా నిరసన తెలుపుతూ ఇలా అన్నాడు. "భారతదేశంలోని వివిధ సూబాల, ప్రపంచంలోని వివిధ దేశాల ప్రత్యేకతల్ని నేను తెలుసుకోవాలని మా నాన్నగారి ఆకాంక్షకాదా? ఆయా దేశాల ప్రత్యేకతలేమిటి, వాటి వనరులేమిటి, వారి శక్తిలోని రహస్య మేమిటి, వారి రణనీతులు, పద్ధతులేమిటి, వారి ధర్మం, వారి సామాజిక ఆచార వ్యవహారాలెలా ఉంటాయి, వారి ప్రభుత్వ నియమాలేమిటి? ఇంకా ప్రభుత్వాలు ఎలా ఏర్పడతాయి మరియు ఎలా పడిపోతాయి అనే విషయాలు కూడా నా విద్యలో చేరాల్సి ఉండేది. గొప్ప గొప్ప పరిపాలకుల వల్ల జరిగిన పొరపాట్లు, తప్పిదాల వల్ల వారి సామ్రాజ్యాలు ఎలా నాశనమయ్యాయో నాకు బోధించాల్సి ఉండేది. చుట్టుప్రక్కల నున్న దేశాలు ఏ భాష మాట్లాడుతాయో, నాకు తెలుపాల్సింది, ఇంకా ఆ భాషలు నేను నేర్చుకోవాల్సింది. ఇవన్నీ నా విద్యాబోధనల్లో చేరాల్సి ఉండేది. కాని మీరు కేవలం నాకు అరబ్బి చదవడం, రాయడం నేర్పారు. ఒక రాకుమారుని విద్యాబోధనల్లో ఏ ఏ విషయాలు చేర్చాలో మీరు మరచిపోయారు. రాకుమారుడు అరబ్బీ వ్యాకరణంలో ప్రవీణుడు కావాలని, ఏది చదివినా, ఏది నేర్చినా అది కేవలం అరబ్బి మూలంగానే రావాలని మీరు తలంచారు. అనవసరమైన విషయాలు నేర్పడంలో నా ఎన్నో సంవత్సరాలు మీరు వృధా చేశారనేది నాకు బాగా జ్ఞాపకముంది. ఈ శాస్త్రాలు, చట్టాలు, ధర్మవివేచనము, న్యాయనీతి మొదలైన ఆవశ్యకములైన విద్యలన్నియు మీరు నాకు నా మాతృభాషలోనే నేర్పలేకుండిరా? అది సులభసాధ్యం కాకుండెనా? వివిధ సంస్కృతుల తత్వాలేమిటో, హేతుబద్ధమైన తార్కాణాలతో మేధస్సు నిజమైన ఫలితాల వరకు ఎలా చేరగలుగుతుందో, దృఢమైన ప్రమాణాల్ని నేనెలా

ఇవ్వగలనో – ఇవన్నీ మీరు నాకు నేర్పాల్సింది. మీరొకవేళ నాకు వివిధ మానవ మనస్తత్వాలెలా ఉంటాయో తెలిపివుంటే, విశ్వ నియమాలేమిటో నాకు తెలిపివుంటే, అప్పుడు అలెగ్జాండర్ తన గురువు అరిస్టాటిల్‌కు ఎంత కృతజ్ఞుడై ఉన్నాడో, నేను మీకు అంతకన్నా ఎక్కువ కృతజ్ఞుడినై ఉండేవాణ్ణి."

(ఔరంగజేబ్ సుదీర్ఘ సంభాషణ వివరాలు కోరేవారు Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 155 -161 చూడాలి).

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపేవారంటే ఔరంగజేబ్‌కు మహాకోపం. అలాంటి వారిని కఠినంగా శిక్షించేవాడు. అందుకే రాకుమారులతో సహా ప్రభుత్వాధికారులందరూ గజ గజ వణికేవారు. రాకుమారుడు ముహమ్మద్ ఆజం షా సూబేదారుగా నున్న గుజరాత్ నుండి అక్కడి వార్తా విలేఖరి ఒక వార్తను పంపాడు. "శత్రువుల (మరాఠాల) సైన్యపు నాయకుడు జానాజి దాలియా, అహ్మదాబాద్ నుండి 80 మైళ్ళదూరంలో సూరత్‌వెళ్ళే రహదారిపై, వర్తకుల్ని దోచుకున్నాడు. ఈ వార్త షా ఆలిజాహ్ (ముహమ్మద్ ఆజం)కు అందినప్పుడు, "ఈ సంఘటన సూరత్ అధికారి (కలెక్టర్) అమానత్ ఖాన్ పరిపాలక ప్రాంతంలో జరిగింది. దానితో మనకేం సంబంధం లేదు" అంటూ సమాధానమిచ్చారు."

ఆ వార్త వచ్చిన కాగితంపై ఔరంగజేబ్ ఇలా ఆదేశిస్తూ ఇండార్స్‌మెంట్ చేశాడు :

"రాకుమారుని అసలు మన్సబు నుండి ఐదువేలు తగ్గించేయాలి. వారికెంత నష్టం జరిగిందో వర్తకులతో తెలుసుకొని, ఆ నష్టాన్ని రాకుమారుని సెక్రటరీ నుండి వసూలుచేసి వర్తకులకివ్వాలి. రాకుమారుడు కాకుండా ఈ తప్పిదం ఇంకెవరితోనైనా జరిగివుంటే, విచారణ తరువాత ఆదేశాలు జారీ చేయబడేవి. కాని రాకుమారునికి శిక్షగా, విచారణ జరుపకుండానే ఆదేశాలు జారీ చేయబడుతున్నాయి. ఆహా! ఎలాంటి రాకుమారునివయ్యా నీవు! అమానత్ ఖాన్ కన్నా తనను అల్పునివిగా భావించుకుంటున్నావు. మేము జీవించి ఉండగానే, సామ్రాజ్య వారసునిగా చెప్పుకుంటావు. మరి మేము జీవించి ఉండగానే ఆ అమానత్ ఖాన్‌ను నీ వారసత్వంలోని ఒక భాగంగా ఎందుకు భావించుకోవు?" మందుతో నయంగాని రోగానికి ఇంకే వైద్యమూ లేదు. ఎవరిలోనైతే మెదడు లేదో, వానికి ఇంకే వస్తువూ అవసరం లేదు. (అహ్కామె ఆలంగిరి – హమీదుద్దీన్ ఖాన్, పేజి 62, 63).

న్యాయ విచారణలో, నిష్పక్షమైన న్యాయాన్ని అందించడంలోనూ ఔరంగజేబ్ ఎన్నడూ అడ్డుపడేవాడు కాదు. అది తన కుమారులకు, సోదరునికి ఇంకా దగ్గరి వారెవరైనా సరే, న్యాయం న్యాయమే. న్యాయం ముందు, తీర్పు ముందు తనతో సహా అందరూ తలవంచాల్సిందేననేది ఔరంగజేబ్ నీతి. దానికో ఉదాహరణ :

"ఖాన్ ఫెరోజ్ జంగ్ (ఇతను ఔరంగజేబ్‌కు దాదీ సోదరుడు) సైన్యంలో ఉంటున్న వార్త విలేఖరి. "ఖాన్ నిండు దర్బారులో ముహమ్మద్ ఆఖిల్ పేరుగల వ్యక్తిని దోపిడీ నేరం

క్రింద వధించాడు" అంటూ వార్త పంపించాడు. దానిపై ఔరంగజేబ్‌ ఇలా ఇండార్స్‌మెంట్‌ చేశాడు. "ఫెరోజ్‌ జంగ్‌ ధర్మశాస్త్ర అనుమతి లేకుండా హత్యచేసి ఒక సుదృఢ దైవాజ్ఞను పడగొట్టినంత పని చేశాడని జుందుల్‌ ముల్క్‌ (ప్రధానమంత్రి) ఫెరోజ్‌ జంగ్‌కు వ్రాతపూర్వకంగా తెలుపాలి. హతుని వారసులు మా వద్దకు వచ్చి, రక్తపరిహారాన్ని తిరస్కరించిన రోజు ఎంత దుర్దినమో! ఆ రోజు ఈ అల్పునికి (ఆలంగీర్‌కు) ప్రతిహత్యకు ఆదేశించడం తప్ప గత్యంతరం ఉండదే! ఎందుకంటే ధర్మశాస్త్ర ఆదేశాల్లో కనికరం చూపటం దివ్య ఖురాన్‌ రీత్యా నిషేధితం. (అహ్‌కామె ఆలంగీరి - హమీదుద్దీన్‌ ఖాన్‌ పేజి 83 84).

రాకుమారుడు ముఅజ్జం షాతో గోల్కొండ ముట్టడి సమయంలో జరిగిన తప్పిదం కారణంగా దాదాపు 5 సంవత్సరాల పాటు అతన్ని చెరసాలలో బంధించి ఉంచాడు. కోపం కాస్త చల్లారిన తరువాత చెరలోనున్న పుత్రుని పట్ల ప్రేమ పెల్లుబకసాగింది. కొన్ని రోజుల తరువాత ముఅజ్జం షాకు కుమారులతో కలవడానికి అనుమతించడం జరిగింది. జైళ్ళకు ముఖ్య అధికారిఅయిన సర్దార్‌ ఖాన్‌కు అనేకసార్లు ప్రత్యేక దుఆలు, జపతపాలు చెప్పి "ముఅజ్జం షాకు తెలిపి వీటిని తరచుగా పఠిస్తూ ఉండమని, తద్వారా విశ్వప్రభువు మా హృదయంలో అతని పట్ల కనికరాన్ని పెంచి, మా నుండి దూరముండి అతను పడుతున్న బాధనుండి అతనికి విముక్తి కలిగించాలని ప్రార్థించమని చెప్పు." - దానిపై సర్దార్‌ ఖాన్‌ ఇలా విన్నవించుకున్నాడు : "రాకుమారుని విడుదల అనేది ప్రభువుల వారి అధీనంలోనున్న విషయం. దానికోసం ఇలాంటి పద్ధతుల, ఉపాయాల అవసరం ఏమిటి?" దానికి ఆలంగీర్‌ ఇలా బదులిచ్చాడు : "ప్రభువులకే ప్రభువైన విశ్వప్రభువు మాకు కొన్ని రాజ్యాల పరిపాలనా అధికారాన్ని అప్పగించాడు. ఎక్కడైనా ఎవరిపైనైనా హింసాదౌర్జన్యాలు జరిగితే ఆ దీనుడు మా వద్దకు న్యాయం కోసం వస్తాడు. కొన్ని ప్రాపంచిక వ్యవహారాలు ఎలా జరిగిపోయాయంటే, మా వల్ల అతనికి కాస్త అన్యాయం జరిగిపోయింది. (కాస్త కఠిన శిక్ష పడింది) అయితే అతన్ని విడుదల చేయడానికి ఇంకా సమయం రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో అతను పరాత్పరుణ్ణి ధ్యానించుకోవడం తప్ప ఇంకే స్థానమూ లేదు. అందుకని అతన్ని ఆశాపరునిగా ఉంచాలి. తత్ఫలితంగా అతను మా పట్ల నిరాశచెందడు. ఒకవేళ ఈ దీనుడు (మా పట్ల నిరాశచెంది) దైవానికే మొరపెట్టుకున్నట్లయితే మా గతేం కాను?" (దీనుని మొర దైవం వెంటనే ఆలకిస్తాడని ప్రవక్త (స) మహనీయుల ప్రవచనం దృష్ట్యా) (మాసిరె ఆలంగీరి-ముస్తఅద్‌ ఖాన్‌ సాఖి-పేజి 239, 240)

కొన్ని రోజుల తరువాత "హాఫిజ్‌ ఖుర్‌ఆన్‌ (ఖుర్‌ఆన్‌ కంఠస్థం చేసిన వ్యక్తి)ని జీవితాంతం ఖైదుకు అర్హుడైనా సరే, యావజ్జీవ కారాగార శిక్ష విధించరాదు" అనే భావం వచ్చే ప్రవక్త మహనీయుల (స) ప్రవచనాన్ని తన స్వహస్తాలతో వ్రాసి ఖైదులోనున్న తన కుమారుడు ముఅజ్జం షాకు పంపించాడు. రాకుమారుడు ముఅజ్జం షా హాఫిజె ఖుర్‌ఆన్‌ ఒకటే కాకుండా వేల

సంఖ్యలో హదీసులు (ప్రవక్త (స) ప్రవచనాలు) జ్ఞాపకమున్నవాడు. అందుకని తండ్రి సూచించిన హదీసును అంగీకరిస్తూనే తానొక హదీసును ఇలా సమర్పించాడు : "హాఫిజె ఖుర్‌ఆన్‌ను యావజ్జీవ కారాగార శిక్ష విధించరాదు అనేది నిజమే, అయినప్పటికీ దైవగ్రంథం కంఠస్తం చేసినందుకు గౌరవిస్తూ కూడా ఒక తండ్రి తన కుమారుణ్ణి శాశ్వతంగా ఖైదులో ఉంచవచ్చు" అనే భావం వచ్చే ఇంకొక హదీసును కోట్ చేశాడు." – ఈ జవాబును చదువుకున్న చక్రవర్తి అత్యంత ప్రసన్నుడైపోయాడు. ఇంకా జైలులోని అనేక కట్టడుల్లో సడలింపునిచ్చాడు. తరువాత కొన్ని రోజులకు అతన్ని విడుదల చేశాడు. (ముంతఖబుల్ లుబాబ్-ఖాఫిఖాన్, వా.2, భా.3, పేజి 355)

ఔరంగజేబ్ నిస్వార్థపరుడు. దైవభక్తిపరాయణుడు, కుల మతాలకు అతీతంగా ప్రజలందరినీ సమాన దృష్టితో చూసే విశాల హృదయుడు. వినమ్రత, నిరాడంబరత, నిస్వార్థత మూర్తీభవించిన ధార్మిక గురువులంటే మహా ఇష్టం. వారి మాటను కాదనేవాడు కాదు. వారి సిఫారసులను తప్పకుండా అంగీకరించేవాడు. వారు నోరువిప్పి అడగకపోయినా తానే స్వయంగా వారి అవసరాలను తెలుసుకొని సమకూర్చిపెట్టేవాడు – అయితే ఔరంగజేబ్‌లోని ధార్మికత్వం పిచ్చి, పడిచచ్చే ధార్మికత్వం కాదు. అతని ధార్మికతలో వివేక, వివేచనాలుండేవి. ధార్మికత్వపు హద్దులేవీ, ధార్మికతను దాటి ప్రాపంచిక వ్యవహారాల్లో చొరబడడం లేదుకదా! అనే దానిపై నిశితమైన దృష్టి కలవాడు. దానికో ఉదాహరణ, సయ్యద్ సాదుల్లా అనే ఒక ప్రఖ్యాత ధార్మిక గురువు ఉండేవారు. 30 సం.ల వరకు ఆయన తన పూర్వీకులతో ధార్మిక విద్యాకళల్ని అభ్యసించారు. అణకువ, నిరాడంబరత, నమ్రత, నిశ్చింతత, ఫకీరు స్వభావం ఆయనలోని ప్రత్యేకతలు. కొన్ని రోజులకు ఆయన హజ్ యాత్రకని మక్కాకు వెళ్ళారు. అయితే 12 సంవత్సరాలు ఆయన అక్కడనే గడిపారు. ధార్మిక విద్య గరపడం, ప్రజల్ని ధార్మికంగా సంస్కరించడమే ఆయన లక్ష్యం. ఆయనలోని ఈ విద్యా విజ్ఞానాలు ఒకవైపైతే, ఆయనలోని అణకువ, వినమ్రత, నిస్వార్థత, నిశ్చింత – ఇవన్నీ కలసి కొద్ది రోజుల్లోనే అధికారులతో సహా మక్కా వాసులందరినీ ఆయన పట్ల ఆకర్షితుల్ని చేశాయి. చివరికి మక్కా పరిపాలకుడు "షరీఫె మక్కా" కూడా ఆయన మాటను కాదనేవాడు కాదు. ఎవరి పట్లనైనా అన్యాయం జరిగితే, లేక ఎవరైనా దౌర్జన్యానికి గురిఅయితే వారు వచ్చి ఈయన్ను వేడుకునేవారు. ఆయన కూడా వెంటనే షరీఫె మక్కాకు సందేశం పంపించేవారు. ఇంకా అది వెంటనే అమలుజరపబడేది. మొత్తానికి ఆయనక్కడ ఎన్నో రోజులు పూర్తి గౌరవ మర్యాదలతో జీవితం గడిపారు. ఒకటి రెండు వ్యవహారాల్లో మక్కా పరిపాలకుడు ఆయన మాటను వినకపోయినప్పుడు ఆయనకు బాధ కలిగి భారత దేశానికి తిరిగి వచ్చి, సూరత్ పట్టణంలో నివసించసాగారు. సూరత్ వార్తా విలేఖరి, ఇంకా ఇతర మార్గాల ద్వారా ఆలంగీర్‌కు ఆయన పరిస్థితులు తెలిసినప్పుడు ఆయనకు

తెలియకుండానే ఏడెనిమిది వేల ఆదాయం వచ్చే రెండు గ్రామాలను ఆయన ఖర్చుల నిమిత్తం కేటాయించాడు. ఇంకా రాజ్యానికి సంబంధించిన భవంతుల్లో నుండి ఒక భవంతిని ఆయన మఠం కోసం, ఆయన సంబంధీకులు శిష్యుల కోసం కేటాయించాడు.

హిందూ - ముస్లిం అనే తారతమ్యం లేకుండా అన్ని జాతుల, కులాల వారు ఆయన్ను గౌరవించేవారు. ఆయన పట్ల భక్తి, ప్రపత్తులతో మెలిగేవారు. ప్రజలందరూ ఆయన్ను తమ ధార్మిక గురువుగా గుర్తించేవారు. ఇంకా అన్ని వర్గాల వారు తమ పనుల కోసం ప్రభుత్వాధికారులకు, చక్రవర్తికి ఆయనతో లేఖలు వ్రాయించి తీసుకెళ్ళేవారు. చక్రవర్తికి కూడా ఆయన పట్ల ఎంతో భక్తి ప్రపత్తులుండేవి. అందుకని ఆయన ఎవరి గురించైనా సిఫారసు లేఖ వ్రాస్తే చక్రవర్తి దాన్ని ఆమోదిస్తూ స్వహస్తాలతో ఫర్మాన్లు జారీ చేసేవాడు. ఆయన ఏది వ్రాసినా చక్రవర్తి దాన్ని ఆమోదించేవాడు. అయితే ఒకసారి ఆయన సస్పెండ్ అయిన ఒక వార్తావిలేఖరి, ప్రభుత్వ వైద్యశాలలోని ఒక వైద్యుని పునర్నియామకం గురించి సిఫారసు లేఖ వ్రాశారు. ఆయన సిఫారసు మేరకు చక్రవర్తి వీరిద్దరి పునర్నియామకమైతే చేశాడు. కాని ఆయన సిఫారసుకు జవాబుగా ఇలా వ్రాయించి పంపాడు : "మీరు ఒక ఫకీరు మనస్తత్వం గల విజ్ఞానులు, విద్యావంతులు, పండితులు. దానితోపాటే ధర్మనిష్ఠులు, దైవభక్తిపరాయణులు. రిక్తులు (ఫకీర్లు), పండితుల కోసమైతే మీ సిఫారసు సమంజసమే. కాని ఎవరైతే దౌర్జన్యపరులో వారితో మీకేం సంబంధం? మా పనిలో మేము నీతిపరులం, దౌర్జన్యపరులం కామని వారు చెప్పుకున్నప్పటికీ వారు మా సేవను, ఉద్యోగాన్ని స్వీకరించి తమ ఆత్మలపై దౌర్జన్యం చేసుకుంటారు. ఇంకా ఈ ఉద్యోగపు విధుల్ని పనుల్ని చేయడానికి అంగీకరిస్తారు. ఇదే కాకుండా వీరిద్వారా ప్రజల ధన ప్రాణాలకు నష్టం కూడా జరుగుతూ ఉంటుంది. దౌర్జన్యకారునికి సహాయపడడమంటే, దౌర్జన్యంలో పాలుపంచుకున్నట్లేనని దివ్య ఖుర్ఆన్‌లో స్పష్టమైన ఆదేశాలున్నాయే! అలాంటప్పుడు మీలాంటి వారి ద్వారా ఈ దైవాదేశపు ఉల్లంఘన ఎలా జరిగిపోతుంది?" (ముంతఖబుల్ లుబాబ్-ఖాఫి ఖాన్, వా.2, భా.3, పేజి 480, 481)

తండ్రి సింహాసనాన్ని పొందడం కోసం కనీసం ఒక సోదరుని రక్తాన్ని చిందించాడనడంలో సందేహం లేదు. తండ్రిని కోట నిర్బంధంలో ఉంచాడనేది కూడా వాస్తవమే. అయితే ఈ విషయాలన్నీ అతను సింహాసనాన్ని అధిష్టించక ముందు జరిగినవి. అప్పటి పరిస్థితులే అలా మారాయి. అప్పుడతను ఆ విధంగా ప్రవర్తించి ఉండకపోతే స్వయంగా అతని ప్రాణాలకు ముప్పు వాటిల్లడం ఖాయం. అది మొగలు రాజవంశంలో అనాదిగా వస్తున్న ఓ దురాచారం. కాని పట్టాభిషిక్తుడైన తరువాత, రాజ్యంలో శాంతి భద్రతలు ఏర్పడిన తరువాత తనకోసం, తన స్వంతం కోసం ఎవరినీ సంహరించలేదు, ఎవరినీ బాధించలేదు. రాజభోగాల్ని అనుభవించలేదు. ప్రజల సంక్షేమానికే, వారి సుఖశాంతులకే, వారి సమృద్ధికే, వారి సంరక్షణకే తన

సర్వ జీవితాన్ని అంకితం చేశాడు. ప్రజల యోగక్షేమాల కోసం తన సుఖసౌఖ్యాలను త్యజించిన త్యాగమూర్తి అతను. ప్రజా సంక్షేమమే, న్యాయం, సమానత్వాల స్థాపనే తన జీవిత పరమావధిగా భావించిన ఆదర్శమూర్తి.

ఔరంగజేబ్ వ్యక్తిత్వం, అతని ప్రవర్తన, పరిపాలనా విధానం, అన్నిటికీ మించి ప్రజల యోగక్షేమాల పట్ల అతని అంకితభావం, సింహాసనాన్ని, రాజ్యాధికారాన్ని అతనే దృష్టితో చూసే వాడనే విషయం అతను తన తండ్రికి వ్రాసిన లేఖలతో స్పష్టమైపోతుంది. అందులో నుండి కేవలం ఒక లేఖను మన పాఠకులకు సమర్పిస్తూ ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాము.

(తన దృష్టిలో రాజ్యం, సింహాసనాల వాస్తవికత ఏమిటో వివరిస్తూ ఔరంగజేబ్ షాజహాన్‌కు వ్రాసిన లేఖ)

"..... పనికిమాలిన ప్రాచీన సాంప్రదాయాలకు నేను కట్టుబడి ఉండాలని ప్రభువుల వారు కోరుతున్నారా? మన సేవకుడెవరైనా చనిపోతే అతని ఆస్తిని నేను జప్తు చేసుకోవాలా? మన (ఆస్థాన) నాయకుడెవరైనా లేక షావుకారు ఎవరైనా చనిపోతే, కొన్ని సందర్భాల్లో ఇంకా జీవం పూర్తిగా పోకముందే, అతనికి సంబంధించిన సర్వధనాన్ని, ఆస్తిని లెక్క కట్టించుకునేంత వరకు (ఆనపెట్టుకునే వరకు), సంబంధితుని సేవకులు, పనివాళ్ళు చిన్నాపెద్ద ఒక్కొక్క వస్తువు గురించి సంపూర్ణంగా తెలుపనంతవరకు వారిపై ఒత్తిడి చేసేవారు, తన్ని కొట్టి ఖైదులో పడేసేవారు. ఇది మొగలు ప్రభువుల తరతరాలుగా వస్తున్న ఆచారం. నిస్సందేహంగా ఇది లాభదాయకమైన సాంప్రదాయమే. కాని అందులోగల అన్యాయం, క్రూరత్వాలను ఎవరు నిరాకరించగలరు? ఒకవేళ ప్రతి నాయకుడు 'నేక్ నాంఖాన్' లాగా వ్యవహరిస్తే లేక ప్రతి స్త్రీ ఆ విధవ షావుకారిణి లాగా తన ధనాన్ని దాచేసుకుంటే, వారికది న్యాయం కాదనగలమా?

ప్రభువుల వారి అసంతృప్తికి నేను అత్యంతగా భయపడతాను, ఏలికవారు నా వ్యవహార శైలి పట్ల తప్పు అభిప్రాయానికి రావడం నేను భరించలేను. పట్టాభిషిక్తుణ్ని అయినప్పటినుండి నాలో గర్వాహంకారాలు వచ్చాయని అయ్యవారు భావిస్తున్నట్లున్నారు. రాచ కిరీటం ఎంత బరువైనదో, ఒక రాజు తన ఆస్థానం నుండి లేచినప్పుడు ఆలోచనల సమూహము అతని మనో మస్తిష్కాల్ని ఎంతగా బాధిస్తాయో, ఎంతగా కలవరపరుస్తాయో, నలభై సంవత్సరాల సుదీర్ఘానుభవం తరువాత ప్రభువులవారు బాగా అర్థం చేసుకోగలుగు తారు. మన ప్రఖ్యాతి గాంచిన పితామహుడు జలాలుద్దీన్ ముహమ్మద్ అక్బర్, తన సంతానం బుద్ధి వివేకాలతో, విచక్షణ మరియు మృదుత్వంతో పరిపాలించాలనే దృష్టితో (మన పూర్వీకుడు) అమీర్ తైమూర్ గోర్‌గాన్‌కు సంబంధించిన ఒక సంఘటనను దృష్టాంతంగా చూపుతూ తమ పరిపాలనా కాలపు చరిత్రలో వ్రాయించి తమ (రాబోయే) సంతానం దృష్టిని ఈ వైపునకు మళ్ళించారు. అందులో ఇలా వ్రాయబడి ఉంది: "బాయజీద్ యల్దరమ్" (టర్కీ ఉస్మానీ సామ్రాజ్యాధినేత) బంధింపబడి అతని (తైమూర్) ముందుకు తేబడినప్పుడు దీర్ఘ శ్రద్ధాలోచనల తరువాత గర్విష్టి

అయిన ఈ ఖైదీ వైపు చూసి ఆయన నవ్వేశాడు. దానికి "బాయజీద్ యల్దరం" అసంతృప్తుడై అమీర్ తైమూర్‌తో ఇలా అన్నాడు: "నీకు లభించిన ఈ విజయానికి గర్వపడకు. గౌరవం, పరాభవం రెండూ దైవం తరఫు నుండే వస్తాయి. నేడేవిధంగా నీకు విజయం వరించిందో, బహుశ రేపు నీవు కూడా నాలాగే బందీగా పట్టుబడవచ్చు!" దానిపై అమీర్ తైమూర్ ఇలా బదులిచ్చాడు: "ప్రపంచం, అందులోని రాజ్యాధికారం మరియు సంపదల యొక్క అస్థిరత, చంచలతను బాగా ఎరుగుతాను. నాకు వశపడిన శత్రువును అవమానపర్చకుండా దైవం నన్ను రక్షించుగాక! నేను నవ్వింది నీ మనసు నొప్పించడానికి కాదు, విషయం ఏమిటంటే నిన్ను చూడగానే మనిద్దరి అంగవైకల్యాల్ని తలుచుకొని అయాచితంగానే నాకు నవ్వు వచ్చేసింది. ఇదోచూడు, నీవు చెవిటివాడివి, నేను కుంటివాణ్ణి. కిరీట సింహాసనాలు, రాజ్యాధికారాల్లో ఏముందని రాజులు దాన్ని పొంది తమ ఉనికినే మైమరిచిపోతారు (ఇవెంత విలువ హీనమైనవంటే) దైవం తలచుకుంటే తన కుంటి, చెవిటి దాసులకు కూడా దీన్ని ప్రసాదిస్తాడు ..... "

కొత్త కొత్త విజయాలు సాధించడంలో, రాజ్యాన్ని విస్తరింపజేయడంలో నేను తగినంత శ్రద్ధ చూపడం లేదని ప్రభువుల వారు భావిస్తున్నట్లున్నారు. అయితే పటిష్టమైన పరిపాలనా యంత్రాంగము, సుశిక్షతమైన రాజ్యాంగ వ్యవస్థ, అంతరంగిక సుస్థిరతలు నా దృష్టిలో అత్యంత ప్రాధాన్యమైనవి. కొత్త కొత్త విజయాల వల్ల ఒక గొప్ప చక్రవర్తి పరిపాలనా కాలం ఒక ప్రాముఖ్యతను, ప్రత్యేకతను సంతరించుకుంటుందనే విషయాన్ని నేను కాదనడం లేదు. నేను గనక ఈ ఆచారాన్ని (అనగా రాజ్యవిస్తరణ) పాటించకపోతే, ప్రఖ్యాతి గాంచిన నా పూర్వీకుడు అమీర్ తైమూర్ గోర్‌గాన్ సంతతిపై మచ్చతెచ్చిన వాణ్ణవుతాను. కాని నన్ను సోమరిగా, చురుకుదనం లేనివానిగా నిందించడం న్యాయం అనిపించుకోదు, బెంగాల్ మరియు దక్కన్‌లలో నా సైన్యాలు ఏమీ చేయకుండా అచేతనంగా పడి ఉన్నాయని ప్రభువులు కూడా భావిస్తూ లేరనుకుంటాను. అయితే ఒక విషయం ఏలికవారికి విన్నవించుకునే దేమిటంటే ఎంత గొప్ప విజేత అయినా సరే, ఎల్లప్పటికీ అందరికన్నా గొప్ప రాజుగా మిగిలి ఉండలేదు. అప్పుడప్పుడు ప్రపంచంలోని సువిశాల ప్రాంతాల్ని పచ్చి కిరాతక, అనాగరిక జాతులు సైతం గెలుచుకోవడాన్ని చూస్తూ ఉంటాము. ఇంకా ఎంతో సువిశాలమైన మహా సామ్రాజ్యాలు కూడా చూస్తుండగానే బహు స్వల్ప కాలంలో ముక్కలు ముక్కలుగా విరిగిపోతాయి. **అందుకని ప్రజా సంక్షేమమే, న్యాయం సమానత్వాల్ని స్థాపించడమే తన జీవిత పరమావధిగా భావించినవాడే వాస్తవంలో అందరికన్నా గొప్పవాడు."** (Travels in the Moghal Empire- Dr. Franciose Burnier, page 167, 168). (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్, రెఫరెన్స్ – ఔరంగజేబ్ ఆలంగీర్ ..సాది సంగర్వరి,పేజి 53, 55).

# 26. మొగలు సామ్రాజ్య పతనానికి కారకులెవరు?

ఔరంగజేబ్ జీవితాన్ని సుదీర్ఘంగా అధ్యయనం చేస్తూ అతనిపై మోపిన నిందల జాబితాను పరిశీలిస్తూ ఇక చివరి ఘట్టానికి చేరుకున్నాము. అంటే మొగలు సామ్రాజ్య పతనానికి కూడా ఔరంగజేబే కారణం అని. ఈ కారణాన్ని విశ్లేషిస్తూ కొందరు సామ్రాజ్యాన్ని ఎంత సువిశాల పరిచాడంటే అది నిలువడం అసాధ్యమైపోయింది అంటూ విమర్శించారు. అంటే దీని అర్థం సామ్రాజ్యాన్ని సువిశాల పరచకపోవలసింది. రాజరిక వ్యవస్థలో ప్రతి రాజు తన రాజ్యాన్ని విశాల పరుచుకోవడానికి ప్రయత్నిస్తాడు. లేక ప్రయత్నించాడు అనేది సువిదితం. యుద్ధాలు చేసి తన రాజ్యాన్ని విస్తరింపజేసుకోవాలనేది ప్రతి రాజు ప్రథమ కోరిక అయి ఉండేది. ప్రతి రాజు జీవిత చరిత్రలో ఈ అంశం కనబడుతూనే ఉంటుంది. ఇలా ప్రయత్నం చేయని రాజును బలహీనుడు, అసమర్థుడు అంటూ ఈ చరిత్రకారులే విమర్శిస్తారు. అంతెందుకు? సభ్యతా సంస్కృతులు శిఖరాల నందుకుంటున్నా యనుకుంటున్న నేటి మన కాలంలో బ్రిటన్, ఫ్రాన్స్ ఇంకా ఇతర యూరోపియన్ జాతులు ప్రపంచంలోని ఎన్ని దేశాల్ని, ఎన్ని జాతుల్ని తమ గుప్పిట్లోకి తీసుకొని తమ రాజ్యాల్ని విస్తరింప జేసుకోవడానికి ప్రయత్నించలేదు. ఎన్ని జాతుల్ని తమ బానిసలుగా మార్చుకోలేదు. ఎన్ని దేశాల్ని తమ కాలనీలుగా మార్చుకోలేదు. ఆసియా, ఆఫ్రికా ఖండాలనైతే ఈ జాతులు తమ మధ్యలో పరస్పరం పంచుకున్నాయే! ఇదంతా రాజ్య విస్తరణ కాంక్షతో చేసినది కాదా? ఇప్పటికి కూడా అమెరికా, ఇంకా ఇతర అగ్ర రాజ్యాలు చేస్తున్నదేమిటి? పేర్లు మారవచ్చు, పద్ధతులు మారవచ్చు, ఆక్రమించుకోవడానికి పన్నే పన్నాగాలు వేరు కావచ్చు. కాని మౌలిక ఉద్దేశం మాత్రం అదే. కొరియా, వియత్నాం, ఇరాఖ్, అఫ్గనిస్తాన్, సిరియా, లిబియా, సోమాలియా మొదలగు దేశాల్లో వేల, లక్షల సంఖ్యలో మారణహోమం జరుగుతున్నది దేనికోసం. పేర్లు వేరు, పద్ధతులు వేరు, ఆ జాతుల్నుండే కొందరు కీలుబొమ్మల్ని అధికార పీఠంపై కూర్చుండబెట్టి వారిద్వారా ఆ దేశ ప్రకృతి వనరుల్ని కొల్లగొట్టి, తాము లాభపడడం తప్ప దీని ఉద్దేశం ఇంకేమీ కాదు. అలాంటిది అప్పుడది రాజుల కాలం. దాడులు జరిపి, రాజ్యాల్ని విస్తరించుకోవడమే రాజుల శక్తి సామర్థ్యాలకు, యోగ్యతలకు ప్రతీకగా నిలిచాయి. ఇక ఔరంగజేబైతే దేశాన్ని సమైక్యపరచడానికి, భారత దేశాన్నంతా ఒకే కేంద్రం కిందికితెచ్చి, సుదృఢ పరచడానికి ప్రయత్నించాడంటే అందులో తప్పేముంది. ఆంగ్లేయులు మనదేశం నుండి పోతూ పోతూ, భారతదేశంలో నున్న సంస్థానాల్ని, రాజ్యాల్ని స్వతంత్రంగా కూడా ఉండవచ్చనే ఒక అవకాశాన్ని ఇచ్చిపోయారు. అయితే భారతదేశ సుస్థిరత మరియు సమగ్రతల కోసం స్వతంత్ర భారత ప్రభుత్వం జూనాగడ్, హైద్రాబాద్, గోవా ఇంకా ఇలాంటి వందలాది సంస్థానాల్ని భారతదేశంలో కలుపుకొని, దేశాన్ని సమైక్య పరచటానికి ప్రయత్నించిందంటే అది కూడా తప్పేనా? ఔరంగజేబ్ అదే చేశాడు. అశాంతి,

అరాచకాలకు నిలయంగా మారుతున్న ఈ చిన్న చిన్న రాజ్యాలన్నిటిని తన రాజ్యంలో కలుపుకొని దాన్ని అఖండ భారతంగా మార్చాడు. దేశాన్నంతా పటిష్ఠపరిచాడు. ఆ తరువాత వచ్చిన అతని వారసులు అసమర్థులు, అయోగ్యులు అయి, వినోద విహారాల్లో, భోగలాలసత్వాల్లో మునిగి, దేశ రక్షణ, సమగ్రతల పట్ల నిర్లక్ష్యం వహించి, దాని పతనానికి కారకులైతే, దాని నిందను ఔరంగజేబ్‌పై మోపడం ఎంతవరకు సమంజసం? ఒక వ్యక్తి వ్యాపారం చేస్తూ నీతి నిజాయితీలతో, కష్టపడి తన వ్యాపారాన్ని పెంచి, లక్షాధికారి అవుతాడు. ఆ తరువాత వచ్చిన అతని వారసులు తమ నిర్లక్ష్యం, అలసత్వంతో, నీతి నియమాల్ని విడనాడి, విచ్చల విడిగా ఖర్చుపెట్టి, తమ వ్యాపారాన్ని నాశనం చేసుకొని బజార్లో పడితే, దానికి వారి తండ్రిని బాధ్యునిగా చేస్తామా? అలా కానప్పుడు వారసుల కుచేష్టల ఫలితంగా పతనమైన మొగలు సామ్రాజ్య పతనానికి ఔరంగజేబ్ బాధ్యుడు అంటూ రాసిన వారి వివేకాన్ని ఏమందాం? ఔరంగజేబ్ పరిపాలనా వ్యవహారాల్లో అత్యంత నియమ నిబంధనల్ని పాటించేవాడు. దేశ, జాతి సంపదను, ప్రభుత్వ కోశాగారాన్ని ప్రజల మరియు దైవం అమానతుగా భావించి అందులో నుండి చిల్లిగవ్వ తన వ్యక్తిత్వం కోసం వాడుకోలేదని చదువుతూ వచ్చాం. ఆ తరువాత వచ్చిన వారసులు దీన్ని తమ స్వంత జాగీరుగా, భావించి విచ్చల విడిగా, భోగలాలసత్వాల్లో వినియోగించి దేశాన్ని ఆర్థిక దివాళాతనానికి గురిచేస్తే దానికి ఔరంగజేబ్ బాధ్యుడా? దేశ రక్షణ, దేశ సమగ్రతల పట్ల ఔరంగజేబ్ ఎంత జాగ్రత్తగా, ఎంత అప్రమత్తంగా ఎంత ఉత్సుకతో ఉండేవాడో అతని జీవితంలోని ఈ సంఘటనను చదివితే మీకే అర్థమవు తుంది. ఔరంగజేబ్ సెక్రటరీ హమీదుద్దీన్ ఖాన్ దాన్ని ఇలా వివరించాడు.

"వర్తకాగ్రేసరుడు ముహమ్మద్ సాదిఖ్ ఈరాన్ నుండి ఒక వార్తను పంపాడు. దీని ననుసరించి ఈరాన్ చక్రవర్తి షాహ్ అబ్బాస్ తన రాజధాని నగరం అస్‌ఫహాన్ నుండి బయలుదేరి ఆరు మైళ్ళ వరకు వచ్చి విడిదిచేశాడు. మరియు పేష్‌ఖీమా (ముందస్తు ప్రయాణ సామగ్రి) అగర్‌ఆబాద్ పంపించేశాడు." ప్రభువుల వారు ఇది విన్నవెంటనే తన అరబ్బుజాతి అశ్వాన్ని అధిరోహించి, బయటికి వచ్చేశారు. ఆ సమయంలో ఎవరికి ఏమీ విన్నవించుకోవడానికి ధైర్యం చాల్లేదు. కాస్త గడుసువాడైన మీర్‌జుమ్లా కుమారుడు ముహమ్మద్ అమీన్ ఖాన్ "ఇంకా పేష్‌ఖీమా (ముందస్తు ప్రయాణ సామగ్రి) కూడా బయలుదేరలేదే! కనీసం అది చేరేవరకన్నా నిరీక్షించడం అవసరం కదా?" అంటూ విన్నవించుకున్నాడు.

"తెలియనంత వరకైతే మేము క్షమార్హులం. కాని తెలిసిన తరువాత ఆలస్యం, అలసత్వం చూపడం పురోగమనం, కీర్తిప్రతిష్ఠల క్షీణతకు చిహ్నంగా పరిగణింపబడుతుంది. పేష్‌ఖీమా (ముందస్తు ప్రయాణ సామగ్రి) చేరాల్సిందేననే అవసరం ఏముంది?" ఆ తరువాత ఈ కావ్య పంక్తిని చదివారు.

"దైవభక్తుడు తూర్పు పశ్చిమాల్లో ఎక్కడా అపరిచితుడు కాడు. అతనెక్కడికి వెళ్ళినా, దేవుని ఈ భూమి అతని నుండి వేరుబడిపోదు."

తోటలో ప్రవేశించిన తరువాత దీవానెఆమ్ (సర్వసభ)ను ఏర్పాటు చేశారు. నాయకులు, సైనికాధికారులు, ప్రభుత్వ అధికారుల్ని సంబోధిస్తూ, "రేపు ప్రయాణం మొదలవుతుంది. లాహోర్‌లో విడిది చేయడం జరుగుతుంది" అంటూ ఆదేశాలు జారీ చేశారు. "ఈ ప్రయాణం అకస్మాత్తుగా చేపట్టడం జరుగుతున్నది. అత్యవసర వస్తువులు సమకూర్చుకోవడం కష్టతరమై పోతుంది" అని విన్నవిస్తూ ఖాఁసామాఁ (వంట ఇంకా ఇతర అత్యవసరాల నిర్వహణాధికారి) ఒక అర్జీని సమర్పించుకున్నాడు.

ఆ అర్జీపై ప్రభువుల వారు ఇలా వ్రాశారు: "ప్రజలు ఎవరూ తప్పించుకోలేని ఆ శాశ్వత ప్రయాణం (అంటే మరణం) కూడా ఇలాగే ఏమరుపాటులోనే, అకస్మాత్తుగానే చేయాల్సి వస్తుంది. అప్పుడేమి చేయగలను? ఈ ప్రయాణాన్ని కూడా దాంతోనే పోల్చుకోవాలి. ఇక్కడి వరకు ఎలా చేరుకోగలిగానో, ఇక ముందు కూడా అలాగే చేరుకోగలను. ఇంకా ఫలానా మజిలీ వరకు అనే నిర్బంధం కూడా లేదు. (గడువు- మృత్యువు వచ్చేవరకు) సాధ్యమైనంతగా ముందుకు సాగుతూనే ఉంటాను."★ (అహ్‌కామె ఆలంగీరి-హమీదుద్దీన్ ఖాన్-పేజి 102)

ఈ విధంగా ఎంతో జాగ్రత్తగా, ఎంతో అప్రమత్తంగా, ప్రేమ అపేక్షలతో దేశాన్ని సమగ్రపరిచి, దాని రక్షణకు అంకితమై పోయిన ఔరంగజేబ్ దురదృష్టం కొద్దీ అతని వారసులు, కుమారులు దేశ సమగ్రత, రక్షణలో, అంతరంగిక శాంతి భద్రతల్ని కాపాడడంలో పూర్తి అలసత్వాన్ని, అలక్ష్యాన్ని ప్రదర్శించారు. ఔరంగజేబ్ కుమారుడు ముఅజ్జం బహాదూర్ షా బిరుదుతో సింహాసనాన్ని అధిష్టించాడు. కాని అతను ఉదయం తొమ్మిది పది గంటల వరకు లేచేవాడే కాదని తెలిసినప్పుడు, ఇక అతని మిగిలిన గుణగణాల్ని ఊహించుకోవచ్చు. ఔరంగజేబ్ భోగలాలసత్వాల్ని అసలు తన దగ్గరికే రానివ్వలేదు. కాని అతని వారసులు దీన్నే తమ జీవిత పరమావధిగా చేసుకున్నారు. ఔరంగజేబ్ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత నిచ్చాడు. ప్రజా సంక్షేమం, ప్రజల రక్షణకు మించింది ఇంకేమీ కాదు, ఇంకెవరూ కారు, అనేది ఔరంగజేబ్ దృక్పథం. దీనికోసం అతనెవరినీ, చివరికి తన వ్యక్తిత్వాన్ని కూడా దీనికి అడ్డు రానీయలేదు. కాని అతని వారసులు ప్రజల గోడే పట్టించుకోలేదు. వారి దర్బారులు నృత్యగానాలకు, నర్తకీలకు, వేశ్యలకు, చెడు వర్తనం గల వారికి ఆలవాలంగా మారాయి. "ప్రజా సంక్షేమమే, న్యాయం సమానత్వాల స్థాపనే తన జీవిత పరమావధి" అంటూ తన లక్ష్యాన్ని తన తండ్రికి విన్నవించుకున్న ఔరంగజేబ్‌కు, ప్రజా సంక్షేమాన్ని అసలే పట్టించుకోని

★ *వివరణ : దీని పూర్వపరాలు ఏమిటంటే 1666లో ఔరంగజేబ్ ఆగ్రాలో ఉన్నప్పుడు, భారతదేశంపై దాడి జరిపే ఉద్దేశ్యంతో ఈరాన్ చక్రవర్తి షా అబ్బాస్ ద్వితీయ తన రాజధాని నుండి బయలుదేరి ఖిరాసాన్‌లో ప్రవేశించాడనే వార్త అందింది. చక్రవర్తి వెంటనే తన రాకుమారుడు ముఅజ్జంను జస్వంత్ సింగ్ తోడుగా పంజాబ్ పంపించాడు. అక్టోబర్ 9న స్వయంగా తాను కూడా ఆగ్రా నుండి ఢిల్లీకి బయలుదేరాడు, డిసెంబర్ 12న పాలం అనే చోట షాహ్ అబ్బాస్ ద్వితీయ ఆగస్టు 22న మరణించాడనే వార్త అందింది.*

వారసులు లభించడం అతని దురదృష్టం కాకుంటే మరేమిటి? “తన సేవలకు ప్రతిఫలంగా రాజ్య ధనాగారం నుండి ఒక్క చిల్లి గవ్వకూడా తీసుకోనని, టోపీలు కుట్టి, ఖురాన్‌ ప్రతులు వ్రాసి తన భుక్తిని సంపాదించుకుంటానని తన గురువుకు విన్నవించిన” ఔరంగజేబ్‌కు ప్రభుత్వ కోశాగారాన్నంత తమ భోగలాలసత్వాల కొరకు, నృత్యగానాల కొరకు, వేశ్యల కొరకు వినియోగించేటటువంటి వారసులు దొరకడం ఎంత విచిత్రం, ఎంత అనూహ్యం!!

కాని వారసులు చేసిన ఈ దుష్కర్మలకు, వారి కుకర్మల వల్ల నాశనమైపోయిన మొగలు సామ్రాజ్య పతనానికి కూడా ఔరంగజేబ్‌నే బాధ్యునిగా చేసిన ఈ చరిత్రకారులు ఎంత న్యాయవంతులో పాఠకులే నిర్ణయించాలి. ఔరంగజేబ్‌ అవలంబించిన ధార్మికనీతి మొగలు సామ్రాజ్య పతనానికి ఒక కారణమంటూ ఇంకొక అపవాదును లేవదీశారు. అయితే ఔరంగజేబ్‌ ధార్మిక నీతి ఎలాంటిది? అతను హిందువులపట్ల, మందిరాలపట్ల, పూజారుల పట్ల ప్రవర్తించిన తీరు ఎలాంటిది అనే అంశాలపై, వివిధ శీర్షికలలో ఇంతకు ముందే చర్చించి ఉన్నాం గనక తిరిగి దాన్నే పునరావృతం చేయడం సమంజసం కాదు. ఔరంగజేబ్‌ కాలంలో సామాన్య హిందూ ప్రజలు ఎంత సంతృప్తులుగా, ఎంత సంతుష్ఠులుగా ఉండేవారనే దానికి ఆ కాలం నాటి కవులు, సాహిత్యకారులు, చరిత్రకారులు వ్రాసిన కవితలు, వాంఙ్మా లాలే హిందువుల పట్ల అతని ప్రవర్తనను సాక్ష్యాధారాలతో నిరూపించే ప్రత్యక్ష నిదర్శనాలు. అవన్నీ ఇంతకు ముందే మీకు సమర్పిస్తూ వచ్చాము. అందుకని ఔరంగజేబ్‌ ధార్మిక నీతే మొగలు సామ్రాజ్య పతనానికి కారణమనే వాదనలో పసలేదు. నిర్హేతుకమైనది. చారిత్రక సాక్ష్యాధారాలు ఈ వాదనను ఖండిస్తున్నాయి.

మొగలు సామ్రాజ్య పతనానికి ఔరంగజేబ్‌ ఏ కోణంతో కూడా బాధ్యుడు కాడు. ఈ బాధ్యత అంతా అనర్హులు, అయోగ్యులు, అవినీతిపరులైన అతని వారసులపైనే వస్తుంది. ఇది కాకుండా ఇంకేమైనా వివిధ కారణాలు కూడా ఉండవచ్చు. కాదనలేము. కాని ఎన్ని కారణాలున్నా, ఔరంగజేబ్‌ మాత్రం దీనికి బాధ్యుడు కాడనేది నిరాకరించలేని సత్యం.

మొగలు సామ్రాజ్య పతనాన్ని ఇంకో కోణంతో విశ్లేషించిన డాక్టర్‌ ఓం ప్రకాశ్‌ ప్రసాద్‌ వ్యాసం సందర్భోచితంగా ఉండడంతో దాన్ని పాఠకులకు సమర్పిస్తున్నాం.

“పైన ఉదాహరించిన అన్ని కార్యకలాపాల్ని, గతి విధుల్ని దృష్టిలో పెట్టుకుంటే మొగలు సామ్రాజ్య పతనాన్ని ఔరంగజేబ్‌లో వెదకడం రుజుమార్గం నుండి వైదొలగినట్లే అవుతుంది.

ఇర్విన్‌ [1] మరియు జదూనాథ్‌ సర్కార్‌లు [2] చక్రవర్తి మరియు రాజదర్బారు ఉద్యోగులు అతి విలాసప్రియులు కావడమే మొగలు సామ్రాజ్య పతనానికి ముఖ్య కారణంగా పేర్కొన్నారు. ఈ విద్వాంసుల ఈ విశ్లేషణనే గనక అంగీకరిస్తే, షాజహాన్‌ కాలంలోనే మొగలు సామ్రాజ్యం పూర్తిగా పతనం కావల్సింది. ఆ తరువాత ఔరంగజేబ్‌ ధార్మిక నీతి కారణంగా హిందూ-ముస్లిముల్లో ఉత్పన్నమైన భేదభావాన్ని జదూనాథ్‌ సర్కార్‌ ముఖ్య కారణంగా చూపించారు.[3]-

అనేక సాక్ష్యాల ఆధారంగా ఔరంగజేబ్‌కు తన వ్యతిరేకుల పట్లనే శత్రుత్వముండేదనే విషయాన్ని ముందే తెలుపుతూ వచ్చాం. ఆ వ్యతిరేకులు తండ్రిగాని, సోదరులుగాని, కుమారుడుగాని కుమార్తెగాని, ముస్లింగాని హిందువులుగాని, వ్యతిరేకులు వ్యతిరేకులే.

మన్సబుదారి మరియు జాగీరు వ్యవస్థలో మొగలు సామ్రాజ్య పతనానికి కారణాన్ని వెదకడంలో సతీష్ చంద్ర సఫలీకృతమైన ప్రయత్నం చేశారు.[4] దీన్ని ఇర్ఫాన్ హబీబ్ కూడా సమర్థించారు.[5] సామ్రాజ్య విశాలత్వమే దాని పతనానికి కారణ భూతమైందని కొందరు విజ్ఞానులు పేర్కొన్నారు.[6]

ఇక్కడో విషయాన్ని తెలుపడం ముఖ్యమనుకుంటున్నాము. రాజ్యాన్ని విశాల పరుచుకోవాలనేది ప్రతిపాలకుని ప్రథమ కోరిక అయి ఉంటుంది. అట్లనుకుంటే మొగలుల కాలంలోనే బీజాపూర్, గోల్కొండ మరియు మరాఠా మొదలగు చిన్న చిన్న రాజ్యాల సామెతలు మన ముందున్నాయి. ఈ చిన్న రాజ్యాలు కూడా తమ పతనాన్ని నివారించలేకపోయాయి.

పద్దెనిమిదవ శతాబ్దంలో మొగలు సామ్రాజ్య పతనమే కాకుండా, విదేశాలలో సఫవీ సామ్రాజ్యం, ఉస్మాని తుర్క్ సామ్రాజ్యం మరియు ఉజ్‌బెక్ సామ్రాజ్యం పతనాన్ని చూపిస్తూ కొన్ని ఇతర సామాన్య కారణాలపై కూడా విద్వాంసులు దృష్టి సారించాలని ఎం.అత్‌హర్ అలీ [7] సూచించారు. బ్రిటన్ మరియు రష్యాల కంటే ముందు పై సామ్రాజ్యాలు పతనమైపోయాయి.

1500 నుండి 1700 మధ్యలో ప్రపంచ వాణిజ్య కేంద్ర రూపంలో యూరోప్ పురోగమనం ప్రారంభమయింది. పదిహేనవ శతాబ్దం నుండి విదేశీ వ్యాపారుల ద్వారా భారత దేశం ఆర్థిక శోషణకు గురిఅయినట్లు సాక్ష్యం లభిస్తుంది. ఈ విదేశీ ఆర్థిక శోషణ కంటే పూర్వం, భారతీయ వ్యాపారుల ద్వారా వస్తున్న రాబడి వల్ల పరిపాలక వర్గం విలాసవంతమైన జీవితం గడుపుతూ ఉండేదనే దృక్పథం నిజం కావచ్చు. అయితే మున్ముందు ఈ విలాసవంతమైన, ఖర్చులతో కూడిన జీవితమే అంతఃకలహాలకు దారితీసింది. ఈ విధంగా విదేశీ శక్తుల ద్వారా జరిగిన శోషణను, అంతరంగిక రాజకీయ కలహాలు మరియు మొగలు సామ్రాజ్య పతనాల సందర్భంగా కూడా పరిశీలించడం అనివార్యమే. (అంటే అంతరంగిక కలహాలు పెరగడానికి, మొగలు సామ్రాజ్యం పతనమవడానికి ఈ విదేశీ శక్తుల పాత్ర ఎంతుందనే విషయాన్ని విశ్లేషించవలసిన అవసరముంది). ఈ దృష్టికోణంతో పరిశీలించినపుడు భారత పాలకులలో ఔరంగజేబ్ ప్రాముఖ్యత తిరిగి పెరిగిపోతుంది. ఎందుకంటే భోగలాలసత్వాలతో కూడిన, విలాసవంతమైన జీవితానికి అతనెంతో దూరంగా ఉండేవాడు. ఇంకా తన మూలంగా ప్రభుత్వ కోశాగారంపై ఎలాంటి భారాన్ని ఎన్నడూ పడనీయలేదు.

మొగలు సామ్రాజ్య పతనానికి అనివార్య వాస్తవంగా భావించబడే భారత దేశ ఆర్థిక శోషణాన్ని యూరోపియన్ శక్తులే ఎలా చేయగలిగాయి? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ప్రాచీన కాలంలో భారత దేశం మరియు రూమ్ (రోమన్)ల మధ్య జరిగిన వ్యాపార సామెత మనముందున్నది. అప్పుడు లాభం గడించే దృష్టితో, రోమన్ కన్నా భారత నిష్పత్తి ఎన్నో రెట్లు

ఎక్కువుండేది. ఈ ప్రశ్నకు సమాధానం సాంకేతిక అభివృద్ధిలో వెదకవచ్చు. యూరోపియన్ దేశాలలో ఎంత పెద్ద స్థాయిలో టెక్నాలజీ అభివృద్ధి జరిగిందో, వ్యాపార వాణిజ్య సంస్థలు ఏర్పడ్డాయో, యంత్రాలతో కూడిన కర్మాగారాలు స్థాపితమయ్యాయో, అంత అభివృద్ధి భారతదేశంలో జరుగలేదు. ఇదేకాకుండా పట్టణాభివృద్ధి కోసం ఎంత ప్రయత్నం జరుగాల్లో, అది కూడా జరుగలేదు. దేశంలోని అంతరంగిక పరిస్థితులు, రాజ్యాల మరియు ధార్మిక పరమైన అరాచకాలు ఇక్కడ ఎంతో పెద్ద స్థాయిలో పెరిగిపోయాయి. శత్రువుల్ని అణచడం ప్రాంతీయ స్థాయిలో శాంతిక్షేమాలతో పరిపాలన చేయడమే ఉత్తర, దక్షిణ రాజ్యాల ప్రధాన లక్ష్యమై పోయింది. కాని దాని ఫలితం ఎలా బయల్పడింది? శత్రువుల్ని అణచనూలేక పోయారు, ఇక్కడి రాజులు, నవాబులు నిశ్చింతతో, ప్రశాంతంగా పరిపాలించనూ లేకపోయారు.

ప్రపంచ పారిశ్రామిక పరివర్తనంతో సైన్యం అత్యంతగా ప్రభావితమైంది. విదేశాలలో ఫిరంగులు తయారుకాసాగాయి. భారతదేశంలో కూడా నిపుణులకు, గణిత శాస్త్రజ్ఞులకు, వైజ్ఞానికులకు తగిన విధంగా ప్రోత్సహించి, ఈ కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉండేది. కాని ఇక్కడ అశాస్త్రీయ పద్ధతుల్లో తుపాకులు, చిన్న ఫిరంగులు మాత్రమే రూపొందించబడేవి. 1700 వరకు ఈ పద్ధతి ఎంతో పాతబడిపోయింది. మొగలులు అప్పటి వరకు కూడా ఖడ్గాలతో పోరాడే అశ్విక సైనికుల మీదే ఆధారపడి ఉన్నారు. 1739లో జరిగిన యుద్ధంలో నాదిర్ షా గెలుపునకు ఒక ముఖ్య కారణం అతని ఫిరంగిదళం. అతని సైన్యం యూరోపియన్ మరియు ఉస్మానియన్ ఫిరంగులతో పోలిన, ఫిరంగుల్ని ఉపయోగించింది.

వైజ్ఞానికంగా వెనుకబడి పోవడం వలన భారతదేశంలో వ్యవసాయిక మరియు వాణిజ్య పరమైన సంక్షోభాలు అధికమయ్యాయి. ఈ ఆర్థిక సంకటం శిఖరాన్ని అందుకోగానే, దాన్నుండే రాజకీయ అనైక్యత మరియు సైనిక వినాశనాలు పుట్టుకొచ్చాయి. సైనిక బలహీనతకు కారణాల్లో ధర్మం పాత్రను కూడా తక్కువగా అంచనావేయలేము. దీని అర్థం మనిషి తన ప్రాచీన ధార్మిక విశ్వాసాల్ని, ఆచార వ్యవహారాల్ని పూర్తిగా విడనాడాలని కాదు, కాని ధార్మిక విశ్వాసాలు, ఆచారాలపై ఉంటూనే, ప్రపంచం ఎటు పోతున్నది, ప్రపంచ పరిస్థితులు ఎలా మారుతున్నాయి అనే విషయాల్నికూడా గమనించాల్సి ఉంటుంది. వాటిని అనుసరించే దేశాన్ని ముందుకు నడిపించాల్సి ఉంటుంది. కాని భారతదేశంలో ఇలాంటి ప్రయత్నాలపై కూడా శ్రద్ధ తీసుకోవడం జరుగలేదు.

మొగలు సామ్రాజ్యం సమాప్తమైన తరువాత హైద్రాబాద్, బెంగాల్, అవధ్‌లాంటి రాజ్యాలు ఉనికిలోకి వచ్చాయి. వాస్తవానికి ఇవి గడిచిన రాజ్యపు భాగాలే. ఈ ప్రభుత్వాలు తమ పరిపాలనా నీతిని, విధానాన్ని మొగలుల పరిపాలనా పద్ధతి ఆధారంగానే రూపొందించు కున్నాయి. ఆ తరువాతి స్థాయిలో మరాఠాలు, జాట్‌లు, సిక్ఖులు మరియు అఫ్గన్ రాజ్యాలు వస్తాయి. ఈ ప్రభుత్వాలు పరిపాలించే తీరు తమదంటూ ఒక వేరే పద్ధతి ఉండేది.[8] ప్రస్తుత కర్ణాటక దాని చుట్టు ప్రక్కల్లో హైదర్‌అలి మరియు టిప్పుసుల్తాన్ రాజ్యముండేది. ఈ రాజ్యం

కూడా మొగలుల రాజ్యవ్యవస్థనే అనుసరించింది. ఈ ప్రభుత్వం సైన్యానికి కొత్త ఆయుధాలు సరఫరా చేయడానికి ప్రయత్నించింది. ఆయుధ నిర్మాణం కూడా చేపట్టింది. వాణిజ్య రంగంలో బ్రిటన్‌ను అనుసరిస్తూ అభివృద్ధి వైపు ముందడుగు వేసింది.[9]

మరాఠా ప్రభుత్వాన్ని మొగలు సింహాసనపు ఉత్తరాధికారిగా, మరియు హక్కుదారుగా భావించడం సంభవం కాదు. ఇది మరాఠాల ఒక అసఫల ప్రయత్నమనేది సర్వాంగీకృత వాస్తవం. 1761 వరకు ఎంతో విజయం సాధించిన తరువాత రాజ్యస్థాపన కోసం వారు నవీన పద్ధతుల్ని చేపట్టడంలో విఫలమయ్యారు. "హిందూ-పద్ పాద్‌షా" అనే నినాదం గర్భస్థ వ్యవస్థలోనే మరణించింది. దీనికి ముఖ్య కారణం ఏమిటంటే తమ నామమాత్రపు ప్రభువు అయిన సతారా రాజుకు, ఎలాంటి గట్టి ఆధారం లేకుండా, పీష్వాలు అంతగా ప్రాముఖ్యత ఇవ్వడానికి సంసిద్ధులైలేరు. వాస్తవమైన లాభం కోసం, పేష్వాలు మొగలు రాజు ప్రభుత్వాన్ని స్వీకరించడాన్ని అత్యంత సమంజసంగా భావించేవారు. ఆ తరువాత కాలంలో నానా ఫర్నవీసు ఈ పేష్వాలను ఒక స్థిమిత కేంద్రంలో బంధించగలిగాడు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై కూడా పేష్వాలు సంపూర్ణ విశ్వాసం ప్రదర్శించలేక పోయారు. మరాఠా రాజ్యవ్యవస్థ దోపిడీ, దోపకాలపై ఆధారపడడం కారణంగా సామాన్య ప్రజల సమర్థనను పొందలేకపోయింది. మరాఠాల సర్వోన్నత లక్ష్యపు కేంద్రబిందువు (అంటే ఉన్నతోన్నత లక్ష్యం) చౌత్ మరియు సర్‌దేశ్‌ముఖి (అంటే చౌత్ వసూలు చేయడం మరియు నాయకులనిపించు కోవడం) లేదా జయింపబడిన ప్రాంతాల్ని విధ్వంసం చేయడం వరకే పరిమితమై ఉండేది.

1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో బ్రిటన్ బెంగాల్‌ను వశపరచుకొని ఏడు సంవత్సరాల కాలంలో తూర్పు భారతంపై తన అధికారాన్ని స్థాపించగలిగింది. ఈ విజయం ఒక అసాధారణ దుర్ఘటన. మొత్తం భారతదేశపు వ్యాపార రూపురేఖలు మారిపోయాయి. బెంగాల్ బిహార్‌ల భూమిశిస్తు ఈస్ట్ ఇండియా కంపనీ రాబడికి ఒక ప్రత్యేక ఆధారంగా మారింది. ఈ కంపనీ 'కోరొమాండల్' ఎగుమతుల దిశను మార్చేసింది. మరియు బ్రిటన్ వైపు ఈ ఎగుమతులు పెరిగి త్వరలోనే యాభై లక్షల పౌండ్లు దాటిపోయింది. ఈ పరిస్థితుల్లో భారతీయ ఆర్థిక వ్యవస్థ నడుము ఎలా విరిగిందో అవలీలగా అర్థం చేసుకోవచ్చు. గుజరాత్ మరియు ఆగ్రాల వ్యాపారం, బెంగాల్ నుండి వచ్చే పట్టు మరియు నూలు వస్త్రాలపై ఆధారపడి ఉండేది. కనుక ఈ రెండు ప్రదేశాల వ్యాపారం పతనమైపోయింది. భూతలంపై అఫ్‌గానిస్తాన్ గుండా జరిగే వ్యాపారం కూడా దాదాపుగా సమాప్తమైపోయింది. పందొమ్మిదవ శతాబ్దంలో ఆంగ్లేయుల అధికారం ఎలా ఎలా పెరుగుతూ పోయిందో, భారత వ్యాపారులు అలా అలా సంక్షోభానికి గురిఅవుతూ వచ్చారు.

ఈ ఆర్థిక పరివర్తనం కారణంగా మరాఠా ప్రభుత్వం మరియు అఫ్‌గన్లపై కూడా చెడు ప్రభావాలు పడడం స్వాభావికమే. 1808 వరకు ఆంగ్లేయుల ప్రభావం ఢిల్లీ వరకు ప్రాకి పోయింది. 1809లో అఫ్‌గాన్ ప్రభుత్వం పతనమై పోయింది. అక్కడి వ్యాపారం తీవ్రగతిన క్షీణించి పోయింది. రైతుల సంఖ్య పెరిగిపోయింది.

ఓడిపోయిన భారతీయ శక్తులు ఆంగ్లేయుల్ని ఎదుర్కోవడానికి మరియు విజయం పొందడానికి సాంకేతిక అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం ఆలోచించదగ్గ వాస్తవం. సింధియా లాంటి కొందరు మరాఠా సర్దారులు తమ సైనికులకు యూరోపియన్ సైన్యంతో శిక్షణ ఇప్పించి కూర్చుండిపోయారు. ఆ తరువాత వారి ఈ సైన్యాలు యూరోపియన్ సైన్యాల అధీనంలో ఉండే పని చేయసాగాయి. ఇది అంతకన్నా చెడుగా జరిగింది. మానసికంగా ఆంగ్లేయుల ప్రభావానికి గురిఅయ్యారు.

ఆంగ్లేయ ప్రభుత్వాన్ని, మొగలు సామ్రాజ్యపు మారిన రూపంగా పేర్కొనలేము. దేశంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్నంతా ఈస్ట్ ఇండియా కంపనీ లాభంగా మార్చడమే, ఆంగ్లేయ ప్రభుత్వ స్థాపన యొక్క ప్రధాన లక్ష్యం. వ్యక్తిగతంగాను, సామూహిక రూపంలోను భారతీయ సంపదనంతా ఇంగ్లాండ్‌కు తరలించడమే ఈ రాజ్యం యొక్క ప్రథమ మరియు చివరి లక్ష్యం. ఈ విధంగా మొగలు సామ్రాజ్య అవశేషాలను ఆంగ్లేయులు తమ స్వార్థం కోసం ఒక దిశలో మళ్ళించారు. మొగలు ప్రత్యేకతను ఏదైనా ఒక పాత వ్యవస్థను పునరుద్ధరించ డానికి వినియోగించలేదు.

ఈ విధంగా, ఔరంగజేబ్ తరువాత సువిశాల సామ్రాజ్యాన్ని నడపడానికి ఎలాంటి యోగ్యులైన పరిపాలకుల అవసరముండేదో, అలాంటి వారు లభించలేదనే నిర్ణయానికి రాగలగుతాము. విదేశాలతో పోల్చి చూసుకున్నప్పుడు మన వద్ద సైన్స్, ప్రత్యేకించి సాంకేతికాభి వృద్ధి పరిస్థితి అత్యంత హీనంగా ఉంది. దీని కారణంగా రైతుల, వ్యాపారుల పరిస్థితి అధ్వాన్నమైపోయింది. యుద్ధయోగ్యత పాడైపోయింది. జాగీరుదార్లు, మన్సబుదార్లు కూడా రైతుల, వ్యాపారుల పరిస్థితిని దిగజార్చడంలో సహకరించారు. ఔరంగజేబ్ కాలం వరకు యూరోపియన్ శక్తుల ద్వారా భారత దేశపు శోషణ ఏ స్థాయిలో జరిగిందో, అంతకన్నా ఎన్నో రెట్ల స్థాయిలో ఔరంగజేబ్ తరువాత ప్రారంభమయింది. ఔరంగజేబ్ పోరాటాలు సామాన్యంగా సిక్ఖులు, మరాఠాలు, రాజపుత్రులు మరియు ముస్లిం రాజ్యాలలోనే జరిగాయి. కాని ఆ తరువాత భారతదేశం విదేశీ శక్తుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. అందులో బలహీన నాయకత్వం వల్ల పరాజయం అనివార్యమైపోయింది. దేశ ఆర్థిక పరిస్థితిని గమనిస్తూ ఔరంగజేబ్ విలాసవంతమైన ఖర్చుతో కూడిన జీవితానికి బహుదూరంగా ఉన్నాడు. కాని ఆ తరువాత వచ్చిన పాలకులు, తమను నియంత్రించుకొని, ఈ సంపదను సైన్స్ మరియు టెక్నాలజీల అభివృద్ధి కోసం వినియోగించలేదు. దేశ ప్రజలందరినీ ఒకే జాతిగా భావించే శ్రేష్ఠత లేక ప్రత్యేకత ఔరంగజేబ్‌లోనైతే కనుగొంటాము. కాని మిగిలిన శక్తులు అనగా బీజాపూర్, గోల్కొండ, సిక్ఖులు, రాజపుత్రులు మరియు మరాఠాలు మొదలైన వారిలో ఒకే జాతి అనే భావన శూన్యం. అదేవిధంగా ఔరంగజేబ్ తరువాత వచ్చిన పరిపాలకులు తమ స్వంత సుఖ సౌఖ్యాల్ని, భోగలాలసత్వాన్ని తమ పరమావధిగా ఎంచుకున్నారే తప్ప జాతీయ సమైక్యతను తమ లక్ష్యంగా ఎంచుకోలేదు.

1750 ప్రాంతంలో పై నుదాహరించిన అన్ని కారణాలు, పరిస్థితులు ఏకకాలంలో ఉన్నాయి. ఫలితంగా కొన్ని సంవత్సరాల తరువాతనే ప్లాసి మరియు బాక్సర్ యుద్ధాలు, ఆ

తరువాత దాదాపు వంద సంవత్సరాలలోపే 1857 సంఘటన సంభవించింది. దానితో భారతదేశం మొత్తానికి మొత్తంగా ఒక విదేశీ సామ్రాజ్య భాగంగా మారిపోయింది.

పైన పేర్కొన్న వాస్తవాల దృష్ట్యా, జాతి భాగ్యాన్ని నిర్ణయించే ఇతిహాసిక శక్తుల్లో కేవలం ఆర్థిక మరియు సామాజిక పరమైనవే కాకుండా కొన్ని సందర్భాల్లో ఒక వ్యక్తి యొక్క పాత్ర కూడా గణనీయంగానే ఉంటుందనే విషయం తేటతెల్లమైపోతుంది. భారతదేశ చరిత్రలో ఒకే వ్యక్తి రూపంలో ఇలాంటి పాత్ర మనకెన్నోసార్లు కనబడుతుంది. కేవలం ఈ ఒక్క వ్యక్తి కారణంగానే చరిత్ర పుటలన్నీ తలకిందులైనట్లు గోచరిస్తుంది. ఈ ఒక్క వ్యక్తి ఒకప్పుడు అశోకుని రూపంలో కనబడితే, ఇంకొకసారి అక్బర్ రూపంలో కనబడతాడు, మరోసారి ఔరంగజేబ్ రూపంలో కనబడితే మరోమారు గాంధీజీ రూపంలో కనిపిస్తుంటాడు.

ఔరంగజేబ్ గతించిన 32 సంవత్సరాల పిదప మొగలు సామ్రాజ్యం పతనమై పోయింది. అతను దక్షిణ ముస్లిం రాజ్యాల్ని మరాఠాలకు వ్యతిరేకంగా సుసంఘటితం చేయలేకపోయాడు గనక ఔరంగజేబే దీనికి బాధ్యుడంటూ అనేకమంది విద్వాంసులు పేర్కొన్నారు. దక్షిణ భారత హిందువులు అతని ధార్మిక వ్యవహారం కారణంగా అతనితో అసంతుష్టులై ఉన్నారన్నారు. రాజపుత్ర సామంత రాజుల సంపూర్ణ సహకారాన్ని తీసుకోవడంలో అతను విఫలుడయ్యాడన్నారు.

ప్రతి విషయంపై దీర్ఘంగా ఆలోచించినప్పుడు పై వాదనలు, తర్కాలు ఆధారరహిత మైనవని తేలిపోతాయి. దక్షిణ ముస్లిం రాజ్యాలు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా మరాఠాలతో సంధి సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా, అతని కుమారుడు అక్బర్‌ను తిరుగుబాటు దారుగా, విద్రోహిగా మార్చడంలో ఈ దక్షిణ ముస్లిం రాజ్యాలే అత్యధిక బాధ్యత వహిస్తాయి.

రాజపుత్రుల రాజ్యంలో, ఇద్దరు పోటీదారుల మధ్య చెలరేగిన వివాద పరిష్కారంకోసం అతను జోక్యం చేసుకున్నాడు. రాజపుత్ర ప్రాంతాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎప్పుడూ అతని అధీనంలోనే ఉన్నాయి. అనేకమంది రాజపుత్రులు ఉన్నత హోదాలపై ఉన్నారు.

ఔరంగజేబ్ తరువాత అయోగ్యులైన అతని వారసుల్ని సామ్రాజ్య పతనానికి స్పష్టమైన కారణంగా పేర్కొనవచ్చు. ఔరంగజేబ్ లాంటి పవిత్ర నడవడికలు, పనిచేసే అసామాన్య యోగ్యత, ఆ తరువాతి పరిపాలకుల్లో కనిపించదు. ఇదేకాకుండా ఈ వారసులు అయోగ్యతతో పాటే పిరికిపందలు కూడాను. అందుకని ప్రజలు వారిని గౌరవించడానికి సంసిద్ధులుగా లేరు. వారసత్వ వివాదంలో నెగ్గిన పాలకుడు, తన నాయకుల్ని, దర్బారు ఉద్యోగుల్ని ఎల్లప్పుడు అనుమానంతో చూసేవాడు. ఇటువంటి పరిస్థితిలో సూబాల గవర్నర్లు స్వతంత్రులయ్యే అవకాశాల్ని వెదుకుతుండేవారు. అవధ్ మరియు బెంగాల్ సూబాల గవర్నర్ల ద్వారా ఏర్పడిన స్వతంత్ర రాజ్యాలు దీనికి చక్కటి నిదర్శనాలు.

ఆర్థిక అవ్యవస్థతను మౌలిక కారణంగా పేర్కొనవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్థికం మరియు వ్యాపారంలో వృద్ధి వచ్చినప్పటికీ, వ్యవసాయిక ఉత్పత్తి తగినంతగా పెరగలేకపోయింది. భూమిశిస్తులో పెంపుదల వల్ల, వ్యవసాయ యోగ్య భూమి ఉన్నప్పటికీ, నిరుద్యోగ వ్యవసాయిక

కూలీల ప్రస్తావన వస్తుంది. మన్సబుదారుల సంఖ్యలో పెంపుదల కూడా ఆర్థిక స్థితిని ఇంకా దిగజార్చింది. జాగీర్లు తక్కువ పడినందున జాగీరుదార్లు తన జాగీర్లను వంశపారంపర్యంగా చేయడానికి ప్రయత్నించారు. ఇంకా ఖాల్సా (ప్రభుత్వ) భూమిని ఆక్రమించుకున్నారు. ఖర్చులు తగ్గించడానికి సైనిక ఖర్చుల్లో కోత విధించడం జరిగింది. దాంతో సైనిక బలంలో క్షీణత వచ్చింది.

మన్సబుదారుల బదిలీల వల్ల ఔరంగజేబ్ కాలంలో బందోబస్తులో (పరిపాలనా వ్యవహారాల్లో) పనితనంలో మెరుగుదల వచ్చింది, కాని అదే ఆ తరువాత కాలాల్లో వచ్చిన పాలకుల అయోగ్యత, మరియు నియంత్రణలో ఉంచే సామర్థ్యం సన్నగిల్లడం వలన ఇలా చేసిన బదిలీల కారణంగా జాగీరుదార్లు మన్సబుదార్లు తక్కువ సమయంలో ఎక్కువ ధనాన్ని కూడబెట్టుకోసాగారు. ఈ విధంగా ప్రజలపై అత్యాచారాలు పెరిగాయి.

ఔరంగజేబ్ తరువాత గుత్త వ్యవస్థ బాగా పెరిగిపోయింది. వివిధ ప్రాంతాల్లో భూమి శిస్తు వసూలు చేసే గుత్తను (పనిని) అత్యధికంగా పాట పాడిన వానికి ఇవ్వబడేది. అందుకని గుత్తదార్లు తమ ప్రాంతాల నుండి అత్యధిక ధనాన్ని సంపాదించుకోదలిచేవారు. అంతకు ముందు జమీందారుల ద్వారా వసూలు చేయబడే రొక్కంలో వారికి కేవలం పది శాతం దొరికేది. కాని అదిప్పుడు సమాప్తమైపోయింది. చివరి, ప్రాణాంతకమైన దెబ్బ విదేశీ ఆక్రమణ రూపంలో పడింది, దాంతో సామ్రాజ్యం తిరిగి ఉనికిలోకి వస్తుందనే ఆ కాస్త ఆశ కూడా లేకుండా పోయింది.

ప్రభుత్వంలో అవినీతి బాగా పెరిగిపోయింది. చిన్న చిన్న ఉద్యోగులు పైరవీ చేసి లేక లంచాలు ఇచ్చి పెద్ద హోదాలను పొందసాగారు. సుశిక్షితులు, మేలైన సైనికుల సంఖ్యలో తరుగుదల రాసాగింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో వైజ్ఞానిక అభివృద్ధి, ఆధునిక యుద్ధ సామగ్రి తయారవుతుండేది. కాని భారతీయ సైన్యం నేటికీ పాత ఫిరంగుల మీదనే గర్వపడేది. యూరోపియన్ శక్తులతో పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి ఈ పాలకులు ఒక అభివృద్ధి చెందిన నావికా సైన్యాన్ని సమకూర్చుకోవాల్సి ఉండేది. కాని అలా జరుగలేకపోయింది. పోర్చుగీసువారు మరియు ఆంగ్లేయుల ద్వారా ఉపయోగింపబడుతున్న కొత్త తరహా ఓడల్ని చూసి కూడా, అలాంటి ఓడల్ని తయారు చేసుకోవాలనే కోరిక లేక ఆకాంక్ష కూడా వారి హృదయాల్లో జనించలేదు.

వ్యాపారం ద్వారా లభించే ఆదాయం, మరియు భూమిశిస్తు ద్వారా ప్రాప్తమవుతున్న ధనాన్ని, దాదాపు ప్రతి పాలకుడు విలాసవంతమైన జీవిత సామగ్రిపై వెచ్చించేవాడు. ఫలితంగా పల్లెల్లోని రైతులు, పట్టణాల్లోని కూలీలు, కళాకారులు, వృత్తి పని మనుషులు దుర్భరమైన ఆర్థిక ఇబ్బందుల్ని ఒకవైపు ఎదుర్కొంటుంటే, వేరొకవైపు ఉన్నతవర్గం, దనికులైన వ్యాపారులు సుఖసౌఖ్యాలతో కూడిన విలాసవంతమైన జీవితాలు గడపడంలో మునిగి ఉన్నారు. అందువల్ల పద్దెనిమిదవ శతాబ్దంలోని ఈ ఉన్నత, అధికార వర్గాల వ్యవహారిక, సామాజిక పతనం

అనివార్యమైపోయింది. అధికార, సంపన్న వర్గాల కుటుంబ సభ్యులు నృత్యగానాలకు, సారాయికి ప్రథమ స్థానాన్ని ఇవ్వసాగారు.

ఈ వర్గం సామ్రాజ్య పతనాన్ని ఆపడంలో అసమర్థమై ఉండేది. వేరొకవైపు సూబాల గవర్నర్ల స్వార్థపూరిత లక్ష్యాల కారణంగా కొత్త రాజ్యాల పరిపాలనా అధికారుల్ని నియంత్రించడంలో విజయం సాధించారు. ఈ స్థానిక గవర్నర్లు తమ లాభం కోసం కేంద్రం పతనాన్ని కోరుకున్నారు. ఇక కేంద్రం కూడా వారి ఈ కోరికను సంపూర్ణంగా నెరవేర్చడంలో వారిని నిరాశపరచలేదు.

అందుకని మొగలు సామ్రాజ్య పతనం ఔరంగజేబ్ కారణంగానే జరిగిందనడం సముచితం కాదు. మొగలు సామ్రాజ్య పరిపాలన మరియు ఆర్థిక విఫలం, జాగీర్ల సంక్షోభం లేక జాగీర్ల లేమి వల్లనే జరిగింది. జాగీర్ల సమస్య ఎన్నో కొత్త సమస్యలకు జన్మనిచ్చింది. వాటిని ఆ తరువాత వచ్చిన పాలకులు పరిష్కరించలేకపోయారు. ఔరంగజేబ్ తరువాత ధార్మిక నీతి మరియు తిరుగుబాటుకు సంబంధించిన అత్యధిక సమస్యలకు సమాధానం బహాదూర్ షా ప్రారంభ కాలంలో కనుగొనడం జరిగింది. మరియు మొగలులకు వ్యతిరేకంగా లేచిన గురూ గోవింద్ సింగ్, జాట్, సత్నామి, మరాఠాల విద్రోహాల్ని శాంతింపజేయడం జరిగింది. అయినప్పటికీ కూడా మొగలు సామ్రాజ్యం వికీర్ణం నుండి బయటపడలేక పోయింది.

**పైన పేర్కొన్న విషయాలే కాకుండా ఔరంగజేబ్‌పై ఇంకెంతో చెప్పాల్సి ఉంది, ఇంకెంతో వ్రాయాల్సి ఉంది. వాస్తవాలకు, చారిత్రాత్మక సాక్ష్యాధారాలకు కొదువలేదు. దేనికైనా కొదువ ఉందా అంటే అది జాగరూకులైన విద్వాంసులదే. నిష్పక్షమైన నవీన చరిత్ర నిర్మాణంలో ఒక్కొక్క ఇటుకలాగా వారు తమ తమ సహకారాన్ని అందించే ఆవశ్యకత ఎంతైనా ఉంది. జాతుల వికాస పురోగమనాల్లో నిష్పక్షమైన నవీన చరిత్ర కూడా ఒక ప్రముఖ ఆధారంగా పేర్కొనబడుతుంది.**

**ఔరంగజేబ్ వీరు చెప్పేంత దౌర్జన్యుడు, కఠినుడు, హిందూ వ్యతిరేకి, భారతీయ సామ్రాజ్య పతనానికి, ఆంగ్లేయ సామ్రాజ్య స్థాపనకు బాధ్యుడు కాదు అనే అధ్యయనానికి మీ ముందున్న ఈ గ్రంథం కేవలం ఒక ప్రయత్నం మాత్రమే.**

ప్రజల్ని ఆర్థికంగా ఆదుకోవడం జాతీయ సమైక్యతకు, జాతి పురోగమనానికి అన్నిటికన్నా ఆవశ్యకమైనదిగా గుర్తించబడుతుంది. పేద ధనిక వర్గాల మధ్య ఉండే అగాధాన్ని పూడ్చి, నిమ్నోన్నతల వ్యత్యాసాన్ని సమాప్తం చేయడానికి సర్వసామాన్యమైన ఆర్థిక, రాజకీయ పాలసీని రూపొందించుకోవడం ఎంతో అవసరం. దీని ఆధారంగానే ప్రస్తుత వ్యవస్థ కూడా జాతి ఐక్యత కోసం ప్రయత్నిస్తున్నది.

**సింహాసనాన్ని చేపట్టిన సమయంలో ఔరంగజేబ్ ముందు ఎన్ని సమస్యలైతే ఉన్నాయో, వాటిని పరిష్కరించడానికి ఏ పరిపాలకుడైనా సరే, ప్రప్రథమంగా ప్రజలపై పన్నుల భారం పెంచేసే వాడు. కాని ఔరంగజేబ్ రాజ్య కోశాగారం కంటే ముందు ప్రజల పరిస్థితిని గురించి ఆలోచించాడు. విలాసవంతమైన జీవిత సామగ్రిపై ధనాన్ని దుర్వినియోగం చేయకుండా అతనెంతో దూరంగా ఉన్నాడు. దీనికతను అసలు ఇష్టపడనే లేదు.**

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీకి చెందిన ప్రఖ్యాత విద్వాంసులు విమల్ ప్రసాద్-[10] గారి అభిప్రాయం ఏమిటంటే ఏ కాలపు చరిత్రను కూడా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే ముందు మూడు అంశాలను దృష్టిలో పెట్టుకోవడం అత్యంత అవసరం. మొదటిది చారిత్రక సంఘటనల అధ్యయనం ఒక నిర్ణీత తేదీ నుండి చేయడం సముచితం కాదు. ఉదాహరణకు 1857లో సంభవించిన ఒక సంఘటన లేక దుర్ఘటనకు సంబంధించిన కారణాలు, పూర్వపరాలు (బ్యాక్‌గ్రౌండ్) నిశ్చయంగా దానికంటే ఓ ఐదు, పది లేక ఇరవై సంవత్సరాలకు పూర్వమే ఏర్పడి ఉంటాయి. రెండవది, "మొగలుల పతనంలో ఔరంగజేబ్ బాధ్యత" లాంటి ప్రశ్నలపై ఆలోచించేకన్నా, భారత రాజ్యాల పతనం ఎలా జరిగింది మరియు ఆంగ్లేయులు భారతదేశంపై విజయం పొందారంటే ఎందుకు? అనే విషయంపై ఆలోచించడం అత్యంత సమంజసంగా, సముచితంగా ఉంటుంది. మూడవది సామాజిక, ధార్మిక, రాజకీయపరమైన ఏ సంఘటనను అధ్యయనం చేస్తున్న కూడా ఆ కాలం నాటి ఆర్థిక పరిస్థితిపై ఆలోచించకుండానే చేస్తే, వాస్తవమైన ఫలితం, లక్ష్యం వరకు చేరడం కష్టతరమైపోతుంది. ఆయన స్పష్టమైన పదాల్లో చెప్పిందేమంటే దీన్ని మనం మార్కిస్ట్ లేక కమ్యూనిస్ట్ ఆలోచనా సరళి అనుకున్నాసరే, కాని ప్రతి చారిత్రక సంఘటన (విప్లవం) ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆర్థిక కారణాలతో తప్పకుండా ప్రభావితమై ఉంటుందనే సత్యాన్ని మనం విస్మరించలేము."

**ఆంగ్లేయ విద్వాంసులు మరియు వారితో ప్రభావితమైన భారతీయ విద్వాంసులు, "పతనానికి ఔరంగజేబ్ బాధ్యుడు" లాంటి ప్రశ్నల్ని లేవనెత్తి జాగరూకులైన చరిత్ర ప్రేమికుల మనోమస్తిష్కాల్లో అసంపూర్ణ, తప్పు సంఘటనల్ని జొప్పించడానికి ప్రయత్నించారు.** వివిధ సంఘటనల్ని మనం ఒకేసారి తులనాత్మక దృష్టితో అధ్యయనం చేసినట్లయితే, అంతకు ముందు పలువురు విద్వాంసులు సమర్పించిన భావనల్లో, ఆలోచనల్లో కానరాని అనేక విషయాలు మన దృష్టిలోకి వస్తాయి.

(ఔరంగజేబ్ - ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 61-71)

# 27. ముగింపు

మొగలు సామ్రాట్ ఔరంగజేబ్ 1618 అక్టోబర్ 24న జన్మించాడు. మొట్టమొదటగా దక్కన్ గవర్నరుగాను, ఆ తరువాత గుజరాత్, ముల్తాన్ సూబాలకు గవర్నరుగా పనిచేశాడు. 1653లో తిరిగి దక్కన్ గవర్నరుగా రెండవసారి నియాకమయ్యాడు. సోదరులతో జరిగిన అంతర్యుద్ధాల్లో విజయుడై 1659 జూన్ 5న భారత చక్రవర్తిగా పట్టాభిషిక్తుడయ్యాడు. అతను దాదాపు యాభై సంవత్సరాల రెండు నెలలు చక్రవర్తిగా భారతదేశాన్ని పరిపాలించాడు. రాకుమార దశలోని 10 సంవత్సరాలు గవర్నరు హోదాను కలుపుకుంటే అతను అరువై సంవత్సరాలు సుదీర్ఘంగా పరిపాలన చేశాడు. దాదాపు తొంబది సంవత్సరాల కొన్ని నెలలు బ్రతికి, 1707 ఫిబ్రవరి 4న శుక్రవారం రోజు ఉదయం దాదాపు 9-10 గంటల ప్రాంతంలో శాశ్వతంగా ఈ ప్రపంచాన్ని వీడిపోయాడు. అతని చివరి కోరిక ప్రకారం ఔరంగాబాద్ సమీపంలోని ఖుల్దాబాద్‌లో అతను సమాధి చేయబడ్డాడు. ఇతర రాజులు, చక్రవర్తుల లాగా అతని సమాధిపై గుమ్మటాలు లేవు. శిల్పకళా ఖండాలు, అందమైన నిర్మాణమూ లేదు. అతని కోరిక ప్రకారం సామాన్య మట్టితో చేసిన సమాధి మాత్రమే ఉంది.

ఔరంగజేబ్ చరిత్రను, అతనిపై మోపిన నిందల్ని, వాటి పూర్వపరాలను సుదీర్ఘంగా అధ్యయనం చేస్తూ ముగింపు ఘట్టానికి చేరుకున్నాము. అతనిపై మోపిన నిందల్ని తెలుసుకోవడానికి, విశ్లేషించటానికి, వాస్తవాలేమిటో, కల్పితాలేమిటో విడదీయడానికి, ఆధునిక చరిత్రకారులే కాకుండా ఔరంగజేబ్ సమకాలీన చరిత్రకారుల వాంఙ్మూలాల్ని కూడా విన్నాం. అతనిపై మోపిన నిందలు ఒక్కటా? రెండా? కోకొల్లలు. అతని ప్రతి పనిలో పురుగులు తీశారు. అందుకే ఒక్కొక్క అపవాదు కోసం ఒక్కొక్క అధ్యాయాన్ని ఏర్పరచవలసి వచ్చింది.

మొట్టమొదటి అపవాదు, సోదరుల్ని చంపి, తండ్రిని నిర్బంధించి బలవంతంగా సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడనేది. తన అనుమతి, ఆదేశాలతో కేవలం ఒక్క సోదరున్ని మాత్రమే చంపించాడని, అదీ అనివార్య పరిస్థితుల్లో, అతన్ని వధించకపోతే తన ఉనికే ప్రమాదంలో పడిపోయే అవకాశాలున్నందున అతనలా చేయక తప్పలేదు. తన విజయాల్ని నీరుగార్చే ప్రయత్నాలు చేసి, తన సోదరుల చేత తనను కడతేర్చ ప్రయత్నించి, చివరికి తాను స్వయంగా కూడా మోసంతో అతన్ని హతమార్చ ప్రయత్నించి, విఫలమైన తండ్రిని, ప్రతీకారంతో హతమార్చ సర్వ అవకాశ, అధికారాలున్నప్పటికీ, అలా హతమార్చకుండా, అతని దౌష్ట్యాలు, దౌర్జన్యాల నుండి తనను కాపాడుకోవడానికి అతన్ని కోటలో నిర్బంధంలో ఉంచాడు. అయినా సకల మర్యాదల్ని చేశాడు, సర్వ సుఖాలను సమకూర్చాడు. సమకాలీన చరిత్రకారులే కాకుండా డాక్టర్ బర్నియెర్ లాంటి విదేశీయుడు కూడా దీన్ని ధృవీకరించాడు. అతని చెడు తలంపుల నుండి తనను కాపాడుకునే హక్కు, అధికారం అతనికి లేదా? దీన్నే దుర్మార్గం అంటారా?

మత పక్షపాతంతో హిందువుల పట్ల అనుచితంగా ప్రవర్తించాడని, వారిని అణచి ఉంచాడని, వారిని ధార్మికంగా హింసించాడని, వారి జీవితాల్ని దుర్భరం చేశాడని ఇలా రకరకాలుగా నిందించారు.

కాని అతను హిందువుల పట్ల ఎంతో మేలుగా ప్రవర్తించాడని, వారిని అణచడం కాదు, సమయానుసారంగా ఆదుకున్నాడని, తన శక్తివంచన లేకుండా వారికి సహాయ సహకారాలు అందించాడని, ధార్మికంగా గాని, శారీరకంగా గాని వారిని అతనెప్పుడూ హింసించ లేదని, ఈ కారణంగానే మరాఠాలు, రాజపుత్రులు ఇతర హిందూ జాతులు చివరికంటూ అతన్ని వెన్నంటి ఉన్నారని చారిత్రక సాక్ష్యాధారలతో తెలుసుకుంటూ వచ్చాం. ఔరంగజేబ్ కాలంలో హిందువుల జీవితాలు దుర్భరంగా లేవని, వారు సుఖంగా, సంతోషంగా, సంతుష్టిగా ఉండేవారనే దానికి ఆ కాలం నాటి కవులు, సాహిత్యకారులు, ఇతిహాసికులు వ్రాసిన కవితలు, వాంఙ్మూలాలే నిరాకరించలేని సజీవ చారిత్రక సాక్ష్యాధారాలని మనం చదువుతూ వచ్చాం. వాటిని కూడా విశ్వసించకపోతే, ఇక ఇంకేమీ చేయలేము.

హిందువుల్ని ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించాడనేది ఇంకొక అపవాదు. కాని మొగలు చక్రవర్తులందరిలో కెల్ల అత్యధిక ఉద్యోగాలు మరియు అత్యున్నత హోదాలు హిందు వులకు ఇచ్చినవాడు కేవలం ఔరంగజేబే అని గణాంకాలతో, నిష్పత్తులతో, శాతాలతో సహా నిరూపణ జరిగింది. అతని కాలం నాటి మన్సబుదారుల, ఇతర ఉన్నతాధికారుల సంక్షిప్త వివరాలతో ఒక అధ్యాయమే రూపొందించడం జరిగింది. సర్వసైన్యాధ్యక్షుడు, సూబేదార్ (గవర్నరు) లాంటి అత్యున్నత హోదాలను కేటాయించిన తరువాత కూడా ప్రభుత్వ ఉద్యోగాల నుండి వంచించాడనడం ఎంతవరకు న్యాయమో మీరే ఆలోచించండి.

జిజ్‌యాను అవమానకరమైన పన్ను అన్నారు. దీనితో హిందువుల్ని వివశుల్ని చేసి మతం మార్పిడి చేయించాడని నిందించారు. అసలు జిజ్‌యా అర్థం ఏమిటో, దాని పూర్వప రాలు ఏమిటో మనదేశంలో దానిపట్ల సరియైన అవగాహన లేదు. అందుకని కొందరు చరిత్ర కారులు కావాలని ఈ పదానికి పెడర్థాలు ఆపాదించారు. జిజ్‌యాకు అర్థం ఏమిటి? దాని లక్ష్యాలేమిటి? ఇది హిందువులకే ఎందుకు? దేనికోసమని ఇది విధించబడుతుంది? అది చెల్లించిన తరువాత చెల్లించిన వారికి లభించే హక్కు, అధికారాలేమిటి? దాని పరిమాణం ఎంత? ఇత్యాదివి తెలుపకుండా కేవలం అది అవమానకరమైన పన్ను అనడం ఎంతవరకు సమంజసం? అందుకోసమనే జిజ్‌యాకు సంబంధించి ఒక ప్రత్యేక అధ్యాయాన్నే ఏర్పరిచాము. అది చదివిన తరువాత కనీసం మన పాఠకులకు దాని గురించి మంచి అవగాహన ఏర్పడు తుందని ఆశిస్తున్నాము. ముస్లిమేతరుల కోసం ఇదో అవమానంగా, శాపంగా గాక, ఒక వరంగా, సర్వహక్కులు, అధికారాలు ప్రసాదించే ఒక అథారిటీగా పరిగణింపబడుతుంది. ముస్లింలపై విధించే 'జకాత్' కొన్ని ధార్మిక కారణాల వల్ల హిందువులపై విధించరాదు. జకాత్ మరియు జిజ్‌యాల భిన్నత్వాన్ని సంబంధిత అధ్యాయంలో మీరు చూడగలుగుతారు.

ఔరంగజేబ్‌ కాలంలో ఎంతమంది మతం మార్చుకున్నారో, దానికి కారణాలేమిటో ప్రొఫెసర్‌ శ్రీరాంశర్మ గారి గ్రంథం ఆధారంగా డాక్టర్‌ ఓం ప్రకాశ్‌ ప్రసాద్‌ సంక్షిప్తంగా వివరించారు గనక తిరిగి దానిపై చర్చించనవసరం లేదు.

ఇక మందిరాల కూల్చివేత గురించి మన దేశంలో ఎంత చర్చ జరిగిందంటే, పిన్నలు, పెద్దలు, పండితులు పామరులు, ఒక్కరననేమి? ప్రతివారి మనోమస్తిష్కాల్లో ఇది నాటుకు పోయింది. అంతకంటే వందల శాతంలో మందిరాలకు, మఠాలకు కానుకలు, ఇనాములు, జాగీర్లు ఇచ్చిన విషయం అసలు తెలియనే తెలియదు, ఇక దానిపై చర్చ ఏం జరుగుతుంది? ఒకటి రెండు లేక కొన్ని మందిరాల కూల్చివేతను ఎంత బహుళంగా ప్రచారం చేయడం జరిగిందంటే ఈ విషయం ప్రతి మనిషికీ తెలిసిపోయింది. కాని వందల సంఖ్యలో ఇచ్చిన ఇనాములు, జాగీర్ల ఊసేలేదు. దాన్ని మరుగుపరిచేశారు. ఇప్పుడు మనం చెబితే నిజమా అని ముక్కుమీద వేలేసుకుంటారు. ఈ పరిస్థితిని సృష్టించిన ఆ చరిత్రకారులు ఎంత న్యాయప్రియులో, ఎంత నిష్పక్షపాతులో మీరే నిర్ణయించాలి. మంచీ చెడు ఉన్నదున్నట్లు పాఠకుల కందించడం ఒక చరిత్రకారుని మౌలిక విధి, బాధ్యత. మందిరాల కూల్చివేతను అట్టహాసంగా పేర్కొని, వాటికి ఇచ్చిన దానాలను, జాగీర్లను పేర్కొనక మౌనం వహించడం చరిత్ర రచనలోని ఏ కోవకు వస్తుందో పాఠకులే నిర్ణయించాలి.

నిస్సందేహంగా ఔరంగజేబ్‌ కాలంలో కొన్ని మందిరాలకు నష్టం వాటిల్లింది. మందిరాలే కాదు మసీదులు కూడా కూల్చివేయబడ్డాయి. అవి ధార్మికత కోసం కాకుండా రాజకీయ, సైనిక కార్యకలాపాల కోసం, ప్రభుత్వ వ్యతిరేక, తిరుగుబాటు, విద్రోహక కార్యకలాపాల కోసం ఉపయోగించబడి నప్పుడు, అవి దానికి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. అది అప్పుడూ జరిగింది, ఇప్పుడూ జరుగుతున్నది. ఇక ముందు కూడా జరుగువచ్చు. సంబంధిత అధ్యాయంలో సాక్ష్యోపేతంగా వివరిస్తూ వచ్చాం. కనుక దాన్నే తిరిగి పునరావృతం చేయనవసరం లేదు.

ఔరంగజేబ్‌ కేవలం మందిరాల విధ్వంసకుడే అయివుంటే, మందిరాలను పడగొట్టడమే అతనికి సరదా అయివుంటే, అతను పరిపాలించిన 50 ఏళ్ళ సుదీర్ఘ పరిపాలనా కాలంలో భారత దేశంలోని ప్రఖ్యాతిగాంచిన ఏ ఒక్క మందిరం మిగిలి ఉండకపోయేది. అంతేకాదు, అలా జరిగివుంటే అతని హిందూ రాజులు, సైన్యాధికారులు, సైన్యాలు ఊరికనే తమాషా చూస్తూ ఊరకుండేవారా? ఇది అసంభవం. వేరొక విషయం. అతను మందిరాల ద్వేషకుడు, విధ్వంసకుడే అయివుంటే బహుళ సంఖ్యలో మందిరాలకు, మఠాలకు, గురుద్వారాలకు, పూజారులకు, అర్చకులకు, మహేంతులకు జీతభత్యాలు, కానుకలు, ఇనాములు, జాగీర్లు ఇచ్చివుండేవాడే కాదు. మందిరాల నిర్వహణ, నిరాఘాటంగా, ప్రశాంతంగా ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాఫీగా జరుగాలనే కోరిక, ఆకాంక్ష ఉన్నవాడే వాటి స్వయం సమృద్ధికి తోడ్పడతాడు కదా! కొన్ని మందిరాలకు భూములు, జాగీర్లే కాదు, గ్రామాలకు గ్రామాలే ఇచ్చివేశా డంటే, బాలాజి మందిరానికి ఏకంగా ఎనిమిది గ్రామాలు దాని రాబడితో సహా దానంగా,

జాగీరుగా, భూమి శిస్తు మినహాయిస్తూ, ఇచ్చాడంటే అతని హృదయ విశాలత్వాన్ని కొనియాడాల్సింది పోయి, మందిరాల విధ్వంసకుడుగా అపకీర్తి పాల్జేయడం ఎంతవరకు న్యాయమంటారు? అతను మందిరాలకు ఇనాములు, దానాలు, జాగీర్లు ఇచ్చాడంటేనే అతను మందిరాల ద్వేషి కాదు అనేది దానంతటదే తేలిపోయింది.

ఇంకొక విషయం అతను ఇరవై ఐదు సంవత్సరాల సుదీర్ఘకాలం దక్షిణ భారతంలో గడిపాడు. దక్షిణ భారతదేశంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వందలాది మందిరాలున్నాయి. అతను మందిరాల పట్ల ద్వేషం గలవాడే అయివుంటే, దక్షిణ భారతదేశంలో కూడా వాటికి నష్టం వాటిల్లాల్సింది. కాని ఒక్క మందిరం కూడా చెక్కుచెదరలేదంటే, దాని అర్థం అతను మందిరాల ద్వేషకుడు ఎంతమాత్రం కాదని రుజువైపోయింది.

మరాఠా, రాజపుత్ర, బుందేలా, సత్నామీల తిరుగుబాటును అణచివేశాడంటే, అది కేంద్రప్రభుత్వ సుస్థిరత, పటిష్ఠతల కోసమే తప్ప, హిందువులైన కారణంగా కాదు, ఈ విషయం అప్పటి హిందువులకు కూడా తెలుసు. అందుకే మరాఠా, రాజపుత్ర, బుందేలా, సత్నామీల తిరుగుబాట్లను అణచడంలో హిందూ-ముస్లిం సైన్యాలు, సైన్యాధిపతులు సంయుక్తంగా పాల్గొన్నారు. హిందువులనేకాదు, కేంద్రానికి తిరుగబడిన అఫ్గన్‌లను, బీజాపూర్, గోల్కొండలను సైతం అణచివేయడం జరిగింది. వీరంతా ముస్లింలేకదా! ముస్లింలని వారిని విడిచిపెట్టలేదే! అక్కడ హిందూ-ముస్లింలనే తారతమ్మం ఏదీ లేకుండేది. కేంద్రానికి తిరుగబడిన వారు ఎవరైనా సరే, అణచివేయబడ్డారు. ఆ తరువాత వచ్చిన చరిత్రకారులు, హిందూ-ముస్లింలలో స్పర్థలు, వైషమ్యాలు ఏర్పరచడానికి అలా విశ్లేషించి చూపించారు తప్ప, ఇది వాస్తవం ఎంతమాత్రం కాదు.

అతను సున్నీ అయినందున, షియా వ్యతిరేకిఅని, అందుకే షియా రాజ్యాలైన గోల్కొండ, బీజాపూర్‌లను సమాప్తం చేశాడని అతనిపై ఇంకో అపవాదు. అబ్బబ్బ! ఎన్ని అపవాదులండి! అంటే అతను చేసిన ప్రతిపనికి అతనిపై ఓ నింద! గోల్కొండ, బీజాపూర్‌ల పతనం రాజకీయ కారణంగా జరిగిందే తప్ప మతతత్వానికి అందులో ఎలాంటి ప్రమేయం లేదని సంబంధిత అధ్యాయాల్లో చారిత్రక సాక్ష్యాధారాలతో అధ్యయనం చేస్తూ వచ్చాం. కనుక తిరిగి చర్చించవలసిన అవసరం లేదు.

ప్రజల సంక్షేమమే, వారి సుఖశాంతులే అతని ప్రథమ, అంతిమ లక్ష్యమని, వారి సమృద్ధియే అతని జీవిత పరమావధి అని అతను స్వయంగా తన తండ్రికి వ్రాసిన లేఖలో పేర్కొన్నాడు. ప్రజల వ్యక్తిగత హక్కుల్లో, ధార్మిక సామాజిక హక్కుల్లో తనతో సహా, ఎవరూ కూడా జోక్యం చేసుకోరాదని అతనో నిర్దిష్టమైన పాలసీని ఏర్పాటు చేసుకున్నాడు.

ముక్కలు ముక్కలుగా నున్న భారత దేశానికి, పదహారవ శతాబ్దంలోనే మొట్టమొదటి సారిగా ఒక సమగ్రరూపమిచ్చి, సువిశాల భారతంగా మార్చే భావన ఒక్క ఔరంగజేబ్‌లో తప్ప, ఆ కాలం నాటి ఏ ఇతర రాజ్యానికి గాని, పరిపాలకునికి గాని, వర్గానికి గాని రాలేదని

చదువుతూ వచ్చాం. ఈ అఖండత, సమగ్రతల కోసమే అతను హిందూ-ముస్లింలనే తారతమ్మం లేకుండా ప్రతి ఒక్కరినీ ఎదుర్కొన్నాడు. ఈ లక్ష్యానికి ఎదురొచ్చిన వారు వారెవరైనా సరే, చివరికి తన కుమారుడు అయినాసరే, క్షమించి వదలిపెట్టలేదు. దేశసమగ్రత, అఖండతల కోసం అతను అహర్నిశలు పాటుపడ్డాడు. ఏ సమయంలోనూ, ఏ క్షణంలోనూ ఈ లక్ష్యం అతని దృష్టి నుండి దూరం కాలేకపోయింది. దేశ సమగ్రత, సంరక్షణల పట్ల అతనెంత జాగ్రత్తగా, అప్రమత్తంగా మరియు ఉత్సుకతో ఉండేవాడనే విషయానికి సంబంధించి కొన్ని సామెతలు చూపించాము. దేశ సంపద, సంపత్తి ప్రజల నుండి వసూలుచేసే పన్నులు, శిస్తులు మరియు ధనాన్ని సామాన్యంగా రాజులు, చక్రవర్తులు తమ స్వంత ధనాగారంగా, కోశాగారంగా భావిస్తూ వచ్చారు. దాన్ని తమకోసం, తమ సంతానం కోసం, రాజ పరివారం కోసం, తమ భోగభాగ్యాల కోసం, విలాసవంతమైన తమ జీవితం కోసం నిస్సంకోచంగా, విచ్చలవిడిగా ఖర్చుచేస్తూ వచ్చారు. కాని వీరందరికి భిన్నంగా ఔరంగజేబ్ కోశాగారాన్ని ప్రజల ఆస్తిగా, దైవ అమానతుగా భావించి, దాన్నుండి తన భోగభాగ్యాల కోసం కాదుగదా, కనీసం తన సేవలకు ప్రతిఫలంగా ఏ చిన్న మొత్తాన్ని కూడా స్వీకరించకుండా, తన ఖర్చుల కోసం, భుక్తికోసం వేరే మార్గాన్ని అవలంబించాడు. తనచేత్తో సంపాదించుకొని తన భుక్తిని వెళ్ళదీసుకున్నాడు. ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా, సంపన్న దేశంగా గుర్తింపుపొందిన సువిశాల భారత సామ్రాజ్యానికి చక్రవర్తియై ఉండి, అతి సామాన్యమైన యవలు, మొక్కజొన్నల రొట్టెలతో కాలం వెళ్ళదీసుకునే వాడంటే, అతను నీతినిజాయితి, ధర్మనిష్ఠత, దైవభీతి యొక్క ఏ శిఖరాగ్రంపై నిలిచి ఉన్నాడో పాఠకులు అంచనా వేసుకోవచ్చు. అతను నీతి నిజాయితీల ఏ ఉన్నత శిఖరాన్ని అధిరోహించి ఉన్నాడో, దాన్ని అనుసరించడం అటుంచి, కనీసం ఊహించడానికి కూడా యోగ్యత లేని, ఆపాదమస్తకం అవినీతి కూపంలో కూరుకుపోయిన నేటి మన రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు అతన్ని విమర్శిస్తుంటే నవ్వాలో, ఏడ్వాలో అర్థంకాని పరిస్థితి. ఔరంగజేబ్ ఉన్నత్వం ఏమిటో పాపం వీరికేం తెలుసు. వీరికి వారి గురువులు నేర్పిందంతే! వారికి వారి గురువులు నేర్పింది కూడా అంతే! ఈ కథల్నే మనం చరిత్ర అనుకొని చదువుకుంటూ వచ్చాం. ఔరంగజేబ్ గురించి వివరంగా తెలుసుకున్న తరువాత ఇప్పుడు చెప్పండి మనం చదువుతూ వచ్చింది నిజమైన చరిత్రే అంటారా? లేక అవి మనో కల్పిత కథనాలా? లేకపోతే నిరాధారమైన అభూత కల్పనలా? కాస్త మీరే ఆలోచించి చూడండి.

వక్రీకరించిన ఈ భారత చరిత్ర ఎన్ని వైషమ్యాలకు, ఎన్ని అనర్థాలకు దారితీసిందో, ప్రారంభంలోనే పేర్కొన్నాము. తిరిగి దాన్నే పునరావృతం చేయనవసరం లేదు. కాని ఈ చరిత్రలే మన పిల్లలు, పెద్దలు, పండితులు పామరులు, అధ్యాపకులు, రాజకీయ నాయకులు నిజమైన చరిత్ర అనుకొని, దాన్నే చదువుకుంటూ పోతున్నారు. దాన్నుండే రెఫరెన్సులు ఇచ్చుకుంటూ పోతున్నారు. ఇలా ఇలా ఈ విషయాలే వాస్తవాలైనట్లు ప్రజల్లో చలామణి అవు తున్నాయి. దాని పర్యవసానాలు కూడా అలాగే బయటపడుతున్నాయి. ఇలాంటి చరిత్ర ద్వారా హిందూ-ముస్లింలనే ఈ రెండు జాతుల్ని దూరం చేయాలని, పరస్పరం శత్రువులుగా మార్చాలని

ఆంగ్లేయులు ఏ పథకాన్ని రూపొందించారో, అందులో వారు నూటికి నూరు శాతం కాదండి, నూటికి నూటా యాభై శాతం సఫలీకృతులయ్యా రనడంలో సందేహముందా? కాని స్వాతంత్ర్యా నంతరం కూడా మన ప్రభుత్వాలు అదే చరిత్రను కొనసాగిస్తుండడం మాత్రం అర్థంగాని విషయం. దీనికి విజ్ఞులు ఏదైనా కారణం చూపుతారేమో వేచిచూద్దాం.

మొత్తానికి ఔరంగజేబ్‌కు సంబంధించిన వాస్తవాల్ని మన తెలుగు సోదరులకు చూపిం చడంలో మేమెంతవరకు కృతార్థులమయ్యామనేది పాఠకులే నిర్ణయించగలుగుతారు. అతనిపై మోపిన నిందల్ని బహుముఖంగాను, పలు విధాలుగాను, రకరకాలుగా తొలగించే ప్రక్రియలో పుస్తకం కాస్త సుదీర్ఘమైపోయింది.

ఔరంగజేబ్ జీవితాన్ని అత్యంత సంక్షిప్తంగాను, సమగ్రంగాను వివరించి అతని వాస్తవ రూపాన్ని మనముందు ప్రదర్శించిన డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ గారి అభిప్రాయాలు అత్యంత సముచితంగా ఉన్నందున వాటిని మన పాఠకులకు సమర్పిస్తున్నాము.

“నేటి మన కాలంలో ధర్మానికి గల ప్రాముఖ్యతే ఔరంగజేబ్ కాలం నాటి భారతదేశంలో కూడా ఉండి ఉంటే, ఆ కాలంలో కూడా ప్రజలు హిందూ-ముస్లిం అనే దృష్టితోనే ఆలోచిస్తూ ఉంటే, ధార్మికంగా ఒక అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఔరంగజేబ్ వేరే ధర్మాన్ని విశ్వసించే అత్యధిక సంఖ్యలో ఉన్న ప్రజలపై ఎలాంటి నీతి, నియమాన్ని పాటించకుండానే ఇంత సుదీర్ఘకాలం వరకు, ఇంత సువిశాలమైన భారతదేశాన్ని ఎలా పరిపాలించగలిగేవాడు?

ఔరంగజేబ్‌కు సంబంధించినంత వరకు భారతదేశాన్ని పరిపాలించిన ముగ్గురు లేక నలుగురు మహాగొప్ప చక్రవర్తుల్లో అతనొకడు అనే అంశంపై భిన్నాభిప్రాయం లేదు. అయితే బి.యన్. పాండే మరియు భారత ప్రథమ రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాధ్‌లు అతనికి సంబం ధించి ఏ చిత్రాన్నైతే పైన గీసి చూపించారో, అదే అతని పూర్తి చిత్రం అనడం కూడా నిజం కాదు. అంతేకాక ఏ మానవ రూపంకూడా పూర్తిగా నల్లగానో లేక పూర్తిగా తెల్లగానో ఉండ జాలదు. అదీగాక ఔరంగజేబ్ కబీరుకాదు, నానకూ కాదు, చిష్తీకాదు, రామక్రిష్ణ పరమహంసనూ కాదు, రామానుజమూ కాదు, తుకారామూ కాదు! అతనైతే కేవలం ఒక పరిపాలకుడు మాత్రమే. ఇంద్రధనుస్సులో ఉండే ఏడు రంగులు ఎర్రది, పచ్చది, నీలం, పసుపు పచ్చది ఇలా అన్ని రంగులూ అతనిలో ఉన్నాయి. అందుకని ఔరంగజేబ్‌ను షైతాన్ (రావణుడు) అంటూ దూషిం చేవారు ఎంత పెద్ద తప్పు చేస్తున్నారో, అతన్ని దైవదూత అంటూ పొగిడే వారు కూడా అంతే పెద్ద తప్పు చేస్తున్నారు. అంతే! మాకు తెలిసినంతవరకు పదిహేడవ శతాబ్దపు చివరి అర్థభాగంలో, కేంద్రాన్ని బలహీనపరిచే శక్తుల్లో సంపూర్ణ భారత జాతీయ భావనే గనక ఉండి, వారు ఐక్యతతో దేశాన్ని సుధృఢపరిచే దృష్టితో కేంద్రంలో పరిపాలన చేస్తున్న ఔరంగజేబ్‌ను వ్యతిరేకించడానికి బదులు అతన్ని సమర్థించి ఉంటే, పైనుదహరించిన కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ కూడా విదేశీ దాస్యత బహుశ రాకుండా ఉండేదేమో, ఒకవేళ వచ్చినా కూడా అది వచ్చేవరకు చాల కాలం పట్టేది. అంతే. ఒక్కొక్కసారి వచ్చే ఆలోచన ఏమిటంటే విదేశీ దాస్య శృంఖలాలను విడిపించుకోవ

డానికి ఇంకో పది సంవత్సరాలు ఆగాల్సి వచ్చినా ఫరవాలేకుండేది కాని దానికంటే ముందు మనం మన జాతీయ స్వభావాన్ని (నీతిని)నిర్మించుకోవడంలో నిమగ్నమై ఉండాల్సింది. స్వాతంత్ర్య సంగ్రామంలో భుజానికి భుజం కలిపి ఎలా పనిచేశామో, అదేవిధంగా ఈ పని చేపట్టాల్సి ఉండేది. ఒకవేళ అదేగనక జరిగివుంటే (అంటే జాతీయ స్వభావాన్ని నిర్మించుకోవడం) నేడు ప్రతిరోజూ మనం చూస్తున్నదంతా చూడాల్సి వచ్చేది కాదు. మరణించే వ్యక్తి నోటితో కేవలం సత్యం, యదార్థం మాత్రమే బయల్పడుతుంది. తన గుణము మరియు స్వభావాల రీత్యా చిన్న చిన్న ప్రశ్నల్ని, విషయాల్ని కూడా ముఖ్యమనుకొని వాటిని అత్యంత దూరదృష్టితో పరిష్కరించ డానికి ఔరంగజేబ్ ఎలాంటి ప్రయత్నం చేశాడో, సభ్యత నెరిగిన కాలం నుండి నేటి వరకు కూడా భారత దేశ చరిత్రలో అలాంటి ప్రయత్నం చేసిన పరిపాలకుడు ఒక్కడూ కనిపించడు. ప్రపంచం ఎల్లప్పుడూ అతన్ని ఓ చక్రవర్తిగానే తిలకించింది. కాని “కుటుంబ యజమానే అందరికన్నా పెద్ద సేవకుడు” అనే లోకోక్తి ప్రకారం, ఈ పాత్రను పోషించడానికి, దైవదూతలాంటి పవిత్రతను పొందడానికి, ఔరంగజేబ్ జీవితపు చివరి ఘడియ వరకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ప్రపంచం అతన్ని భారత సిరిసంపదలన్నిటికీ యజమానిగా భావించింది, కాని అతను తన స్వంత ఖర్చుల కోసం జీవితాంతం టోపీలు కుట్టి, ఖురాన్ ప్రతులు వ్రాసి తన భుక్తిని సంపాదిం చుకున్నాడు. కొందరతన్ని హిందూ వ్యతిరేకిగా పిలిచారు. కాని ప్రజలందరి పట్ల అతని ప్రవర్తన ఒకే లాగుండేది. ముస్లింలలో కొందరు అతన్ని షియా వ్యతిరేకిగా పేర్కొన్నారు. కాని అతని ప్రాణం ఒక షియా(వాని) చేతుల్లో ఉండేది. చదువుకున్న పెద్దలు అతన్ని దుష్టాతిదుష్టమైన పరిపాలకుడన్నారు. కాని నిజానికి అతని ప్రభుత్వం వైశాల్యంలో చరిత్ర అంతకు ముందెన్నడూ ఎరుగని సువిశాల భూభాగంపై, వ్యవధిని అనుసరించి అరవైఏళ్ళ సుదీర్ఘకాలాన్ని పరివేష్టించి ఉంది. మూడు ముస్లిం శక్తుల (అఫ్గన్, బీజాపూర్, గోల్కొండ) మూడు హిందూ శక్తుల (మరాఠా, సిఖ్ఖులు, రాజపుత్రుల) శతృత్వమనే ఖడ్గం సతతం అతని తలపై వ్రేలాడుతూ ఉండేది. కాని రణరంగాల్లో, శత్రుసైనికుల ఖడ్గాల మధ్యలో నిస్సంకోచంగా అతను దైవారాధనలో లీనమై పోయేవాడు. భార్య, కుమార్తెలు, కుమారులు, రాజ్య కోశాగారంలో కుప్పలు కుప్పలుగా ధనరాసులు, సూర్యునిలా ధగ ధగ మెరిసే వ్యక్తిత్వం- అన్నీ ఉండికూడా కేవలం పచ్చి మట్టితో నిర్మించిన సమాధిపై పచ్చగడ్డి పరకల అలంకరణ చాలనే కోరిక కలిగిన చక్రవర్తి ఔరంగజేబ్ విడిచివెళ్ళిన వీలునామాపై - రండి ఒకసారి దృష్టి సారిద్దాం. ఈ విధంగా ఔరంగజేబ్ చక్రవర్తిలో దాగివున్న మనిషి పూర్తిగా బయల్పడిపోతాడు.

## ఔరంగజేబ్ వీలునామా :

1. ధర్మాన్ని మరిచి పాపాల్లో మునిగిపోయిన ఈ అల్పుణ్ని, పవిత్రము పావనము అయిన హజ్రత్ ఇమాం హుసైన్ సమాధిపై పరిచిన గుడ్డలోపల చుట్టి, శవవస్త్రంగా వాడాలి. పాపాల సముద్రంలో మునిగి ఉన్న వారికి దయకు, క్షమకు నిలయమైన ఆ దర్బారును వేడుకోక తప్పదు. ఈ పరమ పవిత్ర కార్యాన్ని నెరవేర్చడానికి అవసరమైన సరంజామా (అంటే హ॥హుసైన్

పవిత్ర సమాధి గుడ్డ మొదలగునవి) సుపుత్రుడు, రాకుమారుడు ఆలీ జాహ్ (ముహమ్మద్ ఆజం) వద్ద ఉన్నాయి. అతని నుండి తోసుకోండి.

2. టోపీలు కుట్టి దాని కూలీతో కూడబెట్టిన నాలుగు రూపాయల రెండణాలు "ఆయాబేగ్ మహల్‌దార్" వద్ద ఉన్నాయి. వాటిని తీసుకొని ఈ దీనుని (ఔరంగజేబ్) శవవస్త్రాల కోసం వినియోగించండి. ఖురాన్ ప్రతులు వ్రాసి కూడబెట్టిన మూడు వందల ఐదు రూపాయలు "సర్ఫ్-ఎ-ఖాస్"లో ఉన్నాయి. గతించిన రోజు అవి ఫకీర్లకు పంచి పెట్టండి. దీనికి కారణం ఏమిటంటే షియా వర్గం వారివద్ద ఖురాన్ ప్రతులు వ్రాసి వాటి మూల్యం తీసుకోవడం నిషేధిత మేమో అనే అనుమానం ఉంది. అందుకని ఈ ధనాన్ని శవవస్త్రాలు మొదలుగాగల వాటిలో వాడకూడదు.

3. ఇంకేమైనా (ఖర్చుల కోసం) అవసరాలు ఏర్పడితే అవి రాకుమారుడు అలీజాహ్ సెక్రటరీ నుండి తీసుకోగలరు. సంతానమంతటిలో ఆయనే సమీప వారసుడు. (ఈ డబ్బు) ధర్మసమ్మతమైందా? కాదా? అనే బాధ్యత ఆయన పైనే ఉంటుంది. ఈ దీనున్ని దాని గురించి ప్రశ్నించడం జరగదు. ఎందుకంటే మృతుడు జీవించి ఉన్నవారి చేతుల్లో (నిస్సహాయంగా) ఉంటాడు.

4. భ్రష్ట మార్గాల్లో సంచరించిన ఈ దీనుని తలపై ఎలాంటి ఆచ్ఛాదనం లేకుండా ఖననం చేయండి. ఎందుకంటే నిరాశ్రయుణ్ణి, పాపిని మహోన్నత ప్రభువు (దైవం) సమక్షంలో (శిరచ్ఛాదనం లేకుండా) ప్రవేశపెట్టినప్పుడు, నిశ్చయంగా అతను దయకు పాత్రుడవుతాడనే నమ్మకముంది.

5. శవపేటికపై అతి సామాన్యమైన "గజీ"గా పిలువబడే దొడ్డు వస్త్రాన్ని మాత్రమే కప్పండి. శవపేటికపై చప్పరము (షామియాన) వేయడం, సంగీత వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్ళడం, ఇంకా దైవప్రవక్త (స) జన్మ దినోత్సవం లాంటి నవీన కల్పనాల నుండి దూరముండండి.

6. ఈ పాపాత్మునితో సన్నిహితంగా ఉంటూ కొండలు, గుట్టలు రాళ్ళు రప్పల్లో ఎడబాయ కుండా ఉంటూ వచ్చిన రాచ కుటుంబీకులతో కాబోయే ప్రభువు సత్ప్రవర్తనతో మెలగాలి. వారితో ఏదైనా తప్పు, పొరపాటు జరిగిపోతే, వారిని క్షమించటానికి ప్రయత్నించాలి. తన క్షమతో ఆ తప్పుల్ని కప్పివేయాలి.

7. లేఖ్‌పాల్‌గా (ముతసద్దిగిరి – లేఖకుడు, కార్యదర్శిగా పనిచేయడానికి ఈరానీయుల (ఈరాన్ దేశస్థుల) కన్నా శ్రేష్ఠులైన వేరొక జాతి లేదు. స్వర్గీయ మహాప్రభువు (హుమాయూన్) కాలం నుండి నేటి వరకు ఈ వర్గం నుండి ఏ ఒక్కరు యుద్ధ మైదానం నుండి ఎన్నడూ పారి పోలేదు. వారి స్థిరత్వంలో ఏనాడూ సడలింపు రాలేదు. అంతేకాక వారు ఆజ్ఞోల్లంఘనకు, స్వామిద్రోహానికి ఎన్నడూ పాల్పడలేదు. కాని వారితో వ్యవహరించడం (అంటే వారిని అదుపులో

పెట్టడం, సంభాళించడం) అత్యంత కష్టమైన కార్యం. ఎందుకంటే వారు తమ పట్ల అత్యంత గౌరవమర్యాదలు, ఆదరము కోరుతారు. అందుకని ఏ విధంగానైనా సరే వారిని సంభాళించుకుంటూ, అదుపులో పెట్టుకుంటూ పోవాలి. అసంభవాన్ని సంభవం చేసి చూపించాలి.

8. తోరానీలు ★ ఎప్పటి నుండో సిపాయీలుగా ఉంటూ వస్తున్నారు. వీరు ఆక్రమణ, పురోగమనం, మరియు రాత్రి సమయాల్లో మెరుపుదాడి చేయడంలోనూ, బంధించడం లోనూ ప్రవీణులు. యుద్ధ సమయంలో ఒక సందర్భంలో వారిని వెనుకకు మరలమని, చేతులు ఆపుకొమ్మని ఆదేశిస్తే, వారెలాంటి అనుమానానికి, సందేహానికి, నిరాశకు మరియు పరాభవానికి లోనుగారు.

ఇక భారతీయులైతే తమ ప్రాణాలు కూడా అర్పిస్తారు గాని యుద్ధ మైదానంలో తమ స్థానాన్ని వదలరు. ఈ జాతిపై నీవు అన్నివిధాల దయానుగ్రహాలు చూపాలి. ఎందుకంటే అనేక సందర్భాల్లో ఇతర జాతివారు విఫలమైన అత్యవసర పనుల్ని ఈ జాతి చేసి పెడుతుంది.

9. బార్‌హా సయ్యదులు ప్రేమాభిమానాలకు, గౌరవమర్యాదలకు, ఆదర సత్కారాలకు పాత్రులు. ప్రవక్త దగ్గరి బంధువులకు న్యాయప్రదమైన వారి హక్కు నివ్వండి అనే ఖురాన్ ఆయతు క్రమం నడుచుకోవాలి. "మీరు చెప్పేయండి, నేను నా బంధువుల్ని ప్రేమించండని కోరడం తప్ప ఈ పనికి మీనుండి ఎలాంటి ప్రతిఫలం కోరను" అనే దివ్య ఖురాన్ ఆయతును అనుసరించి వీరిని ప్రేమించడమంటే దైవప్రవక్త పడిన శ్రమకు తగిన కానుకను సమర్పించుకున్నట్లే. ఇంకా దీని ద్వారా ఆయనగారి వద్ద పుణ్యం, ప్రతిఫలం పొందినట్లే. ఇది ఇహపరాల్లో సాఫల్యం పొందే మార్గం కనుక ఇందులో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం చూపకూడదు. అయితే వీరిపట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. అంతరంగికంగా, హృదయంలో వారి ప్రేమాభిమానాల్లో లోపం రానీయకూడదు, కాని బాహ్యంగా వారి హోదాలను పెంచ కూడదు. ఎందుకంటే అలాచేస్తే వీరు ప్రభుత్వంలో శక్తిమంతులైన భాగస్వాములుగా మారిపోతారు. అంతేకాకుండా వారు రాజ్యాన్నే తమ కివ్వమని కోరడం మొదలెడతారు. ఒకవేళ ప్రభుత్వ పగ్గాల్ని ఏ కొంచెమైనా వారి చేతికిస్తే పర్యవసానంగా నీవు పశ్చాత్తాపానికి గురికావలసి వస్తుంది.

10. సాధ్యమైనంతవరకు పరిపాలకుడు దేశంలో అటూ ఇటూ తిరుగుతూ ఉండాలి. ఒకేచోట కూర్చుండకూడదు. ఇది చూడడానికి సుఖంగా, సౌఖ్యంగా కనబడుతుంది. కాని దాని ఫలస్వరూపంలో ఎన్నో విపత్తుల్ని, కష్టనష్టాల్ని ఎదుర్కోవలసి వస్తుంది.

★ ***తొరాని:*** *సెంట్రల్ ఆసియాలోని టర్కిష్ భాష మాట్లాడే మంగోల్, తాతారి, ఉజ్బెక్ మొదలగు జాతులందరికోసం ఈ పదం ఉపయోగించబడేది. వీరు పరిపాలకుల (మొగలుల) జాతికి చెందిన వారుగా పరిగణింపబడేవారు.*

11. తన పుత్రుల్ని ఎన్నడూ విశ్వసించరాదు. మరియు తన జీవితంలో వారితో చనువుగా, సాన్నిహిత్యంగా, గారాబంతో వ్యవహరించకుండా కాస్త భయభక్తుల్లో ఉంచాలి. ఒకవేళ మహాప్రభువు (షాజహాన్)ల వారు దారా షికూహ్‌తో ప్రత్యేక సంబంధం పెట్టుకొని (చనువుగా) వ్యవహరించి ఉండకపోతే, అతని వ్యవహారాలు ఇంతగా చెడిపోయి ఉండేవి కావు. "రాజు వాగ్దానాలు ఎల్లప్పుడూ అర్థరహితంగా ఉంటాయనే" విషయాన్ని గుర్తుంచు కోవాలి.

12. రాజ్య పరిస్థితులతో బాగా అవగాహన కలిగి ఉండాలి. ఇదే పరిపాలనకు ముఖ్యపునాది. ఒక్క క్షణం చేసిన తప్పిదం సంవత్సరాల తరబడి అవమానానికి కారణ భూతమవు తుంది. నా అజాగ్రత్త కారణంగా శివాజీ తప్పించుకొనిపోయాడు. దాని పర్యవసానంగానే నా జీవితపు చివరి ఘట్టం వరకు మరాఠాలకు వ్యతిరేకంగా కఠిన ప్రయాసలను ఎదుర్కోవలసి వచ్చింది.

తన పుత్రుడు యువరాజు ముఅజ్జం బహాదూర్ షాను చెరనుండి విడుదల చేస్తూ ఔరంగజేబ్ ఈ విధంగా హితోపదేశం చేశాడు:

"ప్రతి పరిపాలకునికి కాఠిన్యత మరియు మృదుత్వంలో మధ్యస్థంగా ఉండాలి. ఈ రెండింటిలో ఏదైనా ఒక గుణం రెండవ దాన్ని అధిగమిస్తే అది రాజ్యం, సింహాసనాల వినాశనా నికి కారణమవుతుంది. మృదుత్వంలో ఆధిక్యత వస్తే ప్రజలు సమంగా, తమను సమాన స్థాయిలుగా భావించుకుంటారు. స్వభావంలో కాఠిన్యతను ప్రదర్శిస్తే ప్రజలు భయభీతులై దూరంగా పారిపోతారు. ఉదాహరణకు నా పినతండ్రి ఉలుగ్‌బేగ్, ఎంతో యోగ్యుడు, అనేక సుగుణాలు కలిగినవారు. కాని రక్తం చిందించడంలో ఆయన ఎంతగా తెగబడ్డారంటే, చిన్న చిన్న తప్పిదాలకు సైతం మరణ శిక్ష విధించేవారు. ఆయన కుమారుడు అబ్దుల్ లతీఫ్ ఆయన్ను బంధించి "నెహావంద్" కోటకు పంపించాడు. త్రోవలో ఆయన ఒక మనిషిని అడిగారు, "నీ దృష్టిలో నా రాజ్యాధికారం సమాప్తవడానికి కారణం ఏమిటో?" అని. దానికా మనిషి ఇలా సమాధానమిచ్చాడు : "రక్తం చిందించడం వల్ల ప్రజలు మీకు దూరమయ్యారు". గౌరవనీయుడైన నా పూర్వీకుడు హుమాయూన్ చక్రవర్తి అత్యధికంగా మృదుత్వాన్ని ప్రదర్శించేవారు, అత్యధికంగా క్షమించేవాడు, పరిపాలనా వ్యవహారాల్లో అనుచిత స్థాయి వరకు మెతకదనాన్ని, మృదుత్వాన్ని ప్రదర్శించారు. బెంగాల్ సూబాలో షేర్‌ఖాన్ ఆక్షేపణీయమైన, గర్హించదగిన చర్యలకు, చేష్టలకు పాల్పడుతున్నాడని పదే పదే వినిపిస్తున్నా దాన్ని పట్టించుకోలేదు (అతన్ని గట్టిగా మందలించనూ లేదు, సంజాయిషీ అడగనూ లేదు). దానికి బదులు అతని తండ్రి హసన్ సూర్‌ను "నీ కుమారుని చేష్టల్ని చూస్తూ కూడా నీవు అతన్ని వారించడానికి ఏమీ చేయడం లేదు" అంటూ కోపగించు

కునేవారు. “అతని పనులు (ఆపగలిగే లేక నచ్చజెప్పే) పరిధుల్ని అతిక్రమించి పోయాయి. ప్రభువుల వారి ఈ ఉపేక్షత కారణంగా ఏ పరిణామాలు బయటపడతాయో నాకు అర్థం కావడం లేదు” అని హసన్ బదులిచ్చారు.

చక్రవర్తి మరియు నీరు ఒకేచోట ఆగి ఉండటం వల్ల చెడు ప్రభావాలు పొడసూపు తాయి. నీరు మురిగిపోతుంది, చక్రవర్తి ప్రభుత్వం అతని చేతి నుండి జారిపోతుంది. తిరుగుతూ ఉంటేనే రాజుల గౌరవం, ప్రశాంతం మరియు ప్రతాపం కొనసాగుతుంది. చాపలు అల్లేవానికి, కంసాలి పని చేయమని ఆదేశించడం వివేకానికి ఎంతో దూరమైనమాట.

తన రాకుమారుడు ముఅజ్జంకు ఔరంగజేబ్ ఇలా వ్రాశాడు :

“అనివార్యమనుకొని, గత్యంతరం లేని పరిస్థితుల్లో నిన్ను కొన్ని సంవత్సరాలు ఖైదులో ఉంచి అత్యంత వినాశకరమైన నీ నడవడికలకు ఈ శిక్ష విధించాను. అయినప్పటికీ కూడా నా జీవితంలోనే స్వర్గతుల్యమైన భారత దేశపు సూబేదార్‌గా నిన్ను నియమించాను, దీనివల్ల భవిష్యత్తులో నీవు చక్రవర్తి అయ్యేది ఖాయమని భావించుకోవచ్చు.”

(ఔరంగజేబ్ - ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 76-81)

# ఆధార గ్రంథాలు



| క్రమ సంఖ్య | పుస్తకం పేరు | రచయిత | ప్రచురణ కర్త |
|---|---|---|---|
| 1. | ముంతఖబుల్ లుబాబ్ వా-1 & 2 | హాషిం అలీ ఖాన్ ఉరఫ్-ఖాఫి ఖాన్ (అనువాదం:మహ్మూద్ అహ్మద్ ఫారూఖీ) | ఫరీద్ బుక్ డిపో ప్రైవేట్ లి. న్యూఢిల్లీ, 2007 |
| 2. | మాసిరె ఆలంగీరి | ముహమ్మద్ సాఖి ముస్తఅద్ ఖాన్ అనువాదం : మౌల్వీ ముహమ్మద్ ఫిదా అలీ తాలిబ్ | ఉస్మానియా యూనివర్శిటి ప్రెస్, హైదరాబాద్,1932 |
| 3. | మాసిరుల్ ఉమరా (వా.1, 2, 3) | సంసాముద్దౌల షా నవాజ్ ఖాన్ అనువాదం : ప్రొ. ముహమ్మద్ అయ్యూబ్ ఖాద్రి | సెంట్రల్ ఉర్దూ బోర్డ్ లాహోర్ 1969 |
| 4. | అహ్కామె ఆలంగీరి | హమీదుద్దీన్ ఖాన్, అనువాదం : ఖాదర్ హసన్ ఖాన్ (లండన్) | మక్తబ అల్‌హసనాత్, న్యూఢిల్లీ, 2005 |
| 5. | ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్ | ప్రొ.సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వీ, ఎం.ఎ. | దారుల్ ముసన్నిఫీన్, షిబ్లి అకాడమి, 3వ ఎడిషన్ ఆజంగడ్, 1990 |
| 6. | ఔరంగజేబ్-ఖుతూత్ కె ఆయినె-మె (ముఖద్దమ... అనువాదం) | షమ్స్ బరేల్వీ, | మదీనా పబ్లిషింగ్ కంపెని, కరాచి, 1978 |
| 7. | ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి | డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్ ప్రొఫెసర్, పాట్నా యూనివర్సిటీ, బీహార్. | K.B. Oriental Public Library, Patna, Bihar, 7th Edition, 2006 |

| క్రమ సంఖ్య పుస్తకం పేరు | రచయిత | ప్రచురణ కర్త |
|---|---|---|
| 8. ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్ | అల్లామ షిబ్లి నొమాని | దారుల్ ముసన్నిఫీన్, షిబ్లి అకాడమి, ఆజంగడ్, (యు.పి.) 1999 |
| 9. హిందుస్తాన్ కే ముస్లిం హుక్మురానోఁ-కి-మజ్‌హబి రవాదారి, వా-1, 2, 3 | సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్రహ్మాన్ | దారుల్ ముసన్నిఫీన్, షిబ్లి అకాడమి, ఆజంగడ్, (యు.పి.) 1984. |
| 10. ఇస్లాం అవుర్ మజ్‌హబి రవాదారి | సయ్యద్ సబాహుద్దీన్ అబ్దుర్రహ్మాన్ | దారుల్ ముసన్నిఫీన్, షిబ్లి అకాడమి, ఆజంగడ్, 1984 |
| 11. తారీఖ్ కీ సచ్చాయియాఁ | ఖుర్షీద్ ముస్తఫా రజ్వి | ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ, 2008 |
| 12. హిందూస్తాన్‌మే- గుమ్ రాహ్ కున్ తారీఖ్ నవేసీ (Distortion of Indian History) | డాక్టర్ ముఖ్తార్ అహ్మద్ మక్కి | అర్రెహాన్ పబ్లిషింగ్ హౌస్, జంషెడ్‌పూర్, జార్ఖండ్, 2005 |
| 13. హిందూ మందిర్ ఔర్ ఔరంగజేబ్ కె ఫరామీన్ | 1. డా. బిషంబర్ నాథ్ పాండే, 2. అతావుర్ రహ్మాన్ ఖాస్మి | మౌలానా ఆజాద్ అకాడమి, న్యూఢిల్లీ, 2006 |
| 14. ఇతిహాస్ పర్ యెహ్ అన్యాయ్? | డా. బిషంబర్ నాథ్ పాండే | మధుర్ సందేశ్ సంగం, న్యూఢిల్లీ, 2006 |
| 15. ఆయిన-యె-ఔరంగజేబ్ | హకీం జిల్లుర్రహ్మాన్ | ఎడ్యుకేషనల్ పబ్లిషింగ్ హౌస్,న్యూఢిల్లీ, 2008 |
| 16. మొహియుద్దీన్ ఔరంగజేబ్ ఆలంగీర్ | సాది సంగర్‌వరి | వహీద్ బుక్ డిపో, లాహోర్, 1998 |

| క్రమ సంఖ్య | పుస్తకం పేరు | రచయిత | ప్రచురణ కర్త |
|---|---|---|---|
| 17. | తారీఖ్–ఎ–హింద్ కా ఇంఖిలాబి కిర్‌దార్–శివాజీ (భారత చరిత్రలోని విప్లవా త్మక పాత్ర–శివాజీ) | ప్రొ. ఎమ్.కె. షాజ్లి, | మహారాష్ట్ర, ఉర్దూ అకాడమి, ముంబాయి, 1990 |
| 18. | శివాజీ కౌన్ హోటా? | గోవింద్ పాన్‌సరే (అను. సయ్యద్ షా గాజియొద్దీన్) | లోక్ వాంగ్మయ గిరహ్, భూపేష్ గుప్త భవన్, సాయాని రోడ్, ముంబాయి, 2004. |
| 19. | ఔరంగజేబ్ | డాక్టర్ అబ్దుల్ ముగ్ని | మర్కజి మక్తబ ఇస్లామి పబ్లిషర్స్, న్యూఢిల్లీ, 1996 |
| 20. | మత సామరస్యం – ఔరంగజేబ్ | అబుల్ ఫౌజాన్ | తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్, హైదరాబాద్. |
| 21. | ఔరంగజేబ్ ఆలంగీర్ | షమ్సుల్ ఉలమా మౌల్వి జకాఉల్లాహ్, | అరీబ్ పబ్లికేషన్స్, దరియాగంజ్, న్యూ ఢిల్లీ– 2, 2008 |
| 22. | ఫతూహాతె ఆలంగిరి | ఈశ్వర్ దాస్ నాగర్, ఇంగ్లీషు అను. తస్నీమ్ అహ్మద్ | ఇదార అదబియాతె ఢిల్లీ, న్యూఢిల్లీ, 1978 |
| 23. | అహదె ఆలంగీర్ కె దర్బారీ అఖ్బారాత్ | (పర్షియన్ నుండి మరాఠీలోకి) సేతూ మాధవరావు పగ్‌డీ,(మరాఠీ నుండి ఉర్దూలోకి : సయ్యద్ షా గాజియొద్దీన్) | ఇదార – బరాయె ముతాల–వ తహ్ఖీఖ్ తారీఖ్–ఎ–దక్కన్ షోలాపూర్, (మ.రా.) 2000 |
| 24. | Travels in the Moghal Empire | Dr.Francois Bernier (Trans.Archibold Constable-2nd Edi. Revised by Vincent A. Smith) | Hamphray Mil Ford, Oxford University Press, London, 1914 |

| క్రమ సంఖ్య | పుస్తకం పేరు | రచయిత | ప్రచురణ కర్త |
|---|---|---|---|
| 25. | The Moghal Nobility under Aurangazeb | M. Athar Ali | Oxford University Press India Paper Back, 2006 (Ist - 1997 & 2001, 2006) |
| 26. | History of Auranga zeb, Vol.I &II | Sir Jadhunath Sarkar | Orient Longmens Limited, Culcutta-13, (O.L.1st Impression)1973 |
| 27. | History of Auranga zeb, Vol.III &IV | Sir Jadhunath Sarkar | -Do- (O.L.1st Impression)1972 |
| 27. | History of Aurangazeb, Vol.-V | Sir Jadhunath Sarkar | -do- (O.L.1st Impression)1974 |
| 28. | Aurangazeb & Tipu Sultan Evaluation of their Religious-Policies | Dr. Bishambarnath Pandey | I.C.S. New Delhi 1996 |
| 29. | Islam and Indian Culture | Dr. Bishambernath Pandey | K.B. Oriental Public Library, Patna |
| 30. | History of Shah Jahan | Dr. Banarasi Prasad Saxena | (Urdu Translation) N.C.P.U. Mini. of Human Resources, Govt. of India, 1971 |
| 31. | ఔరంగజేబ్ – ఔర్ హిందువోఁ కె సాథ్ తాల్లుఖాత్ (హిందువులతో ఔరంగజేబ్ సంబంధాలు.) | Akhilesh Jaiswal | K.B. Oriental Public Library, Patna, Bihar 1996 |
| 32. | మందిర్ బోల్ ఉఠ్ఠే (హిందీ) | డాక్టర్ బిషంబర్ నాథ్ పాండే | మౌలానా ఆజాద్ మెమోరియల్ అకాడమి, లక్నో–2016 |

# పాదసూచికలు

**ఉపోద్ఘాతం**

1. ఔరంగజేబ్ – హిందువోంకి నజర్ మే – అయ్యూబ్ నజీబాబాది, పేజి. 19 (తారీఖ్ కీ సచ్చాయియాం ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి. 13)
2 తారీఖ్‌కి సచ్చాయియాం – రచన : ఖుర్షీద్ ముస్తఫా రజ్వి – పేజి 50, 51.
3. హిందూస్తాన్ మె గుమ్రాహ్‌కున్ తారీఖ్ నవేసి (Distortion of the Indian History - Dr. Mukhtar Ahmed Makki, page 24)
4. 1857 డైరీ – రచన : ప్రొఫెసర్ ఖలీఖ్ అహ్మద్ నిజామి. పేజి 33 – 45 (తారీఖ్‌కీ సచ్చాయియాం – ఖుర్షీద్ ముస్తఫా రజ్వి . పేజి. 44)
5. 1857 డైరీ – రచన : ప్రొఫెసర్ ఖలీఖ్ అహ్మద్ నిజామి. పేజి 33 – 45 (తారీఖ్‌కీ సచ్చాయియాం – ఖుర్షీద్ ముస్తఫా రజ్వి . పేజి. 44)
6. తారీఖ్ కీ సచ్చాయియాం – ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ – పేజి. 25

**1. కాల్పనిక, వక్రీకరించిన భారత చరిత్ర**

1. హిందుస్తాన్ మే గుమ్రాహ్‌కున్ తారీఖ్ నవేసి (Distoration of Indian History) డాక్టర్ ముఖ్తార్ అహ్మద్ మక్కి, పేజి 73–77.
2. ఇంకా వివరాల కోసం రొమిల్లా థాపర్ రచన – అశోక్ తథా మౌర్య సామ్రాజ్య కా పతన్ – ఢిల్లీ, 1977)
3. Eliat & Dawson - History of India as told by its own Historian - Vol.8, London, 1887, Second Edition Kitab Mahal, Alhabad, 1964.
4. Sir Jadhunath Sarkar - History of Aurangazeb (5 Volumes) Calcutta, Anecdotes of Aurangazeb, Calcutta 1942
5. (Medieval Indian Culture - Agra, 1964)
6. (History of Medieval India, Alhabad, 1948),
7. (మొగల్ శాసకోం కీ ధార్మిక్ నీతి, న్యూఢిల్లీ, 1967)
8. (The History and Culture of the Indian People, Part 4 - 6, Bharathiya Vidya Bhavan, Bombay, 1947 - 67),
9. (Akbar the Great Moghal, Oxford, 1919)
10. (Aggrerian System of Moghal India, Bombay, 1963-Technology and Economy of Moghal India, Devaraj Channanna Lectures, Delhi-1907, The Currency System of the Moghal Empire (1566-1707)-Medieval India Quarterly IV (No.1-2) Aligarh 1960)
11. (Zamindars under the Moghals-Land Control and Social Structure in Indian History - L.E.Freekenberg (Edi.) London, 1969, Thoughts on Aggrerian Relations in Moghal India, New Delhi - 1973)

12. సాంప్రదాయకత అవుర్ ఇతిహాస్ లేఖన్-న్యూఢిల్లీ
13. (Moghal Nobility under Aurangazeb, Bombay 1966, మొగల్ సామ్రాజ్య్ కా అంత్, మధ్యకాలీన్ భారత్, ఎడిటర్-ఇర్ఫాన్ హబీబ్, సంచిక - 1, ఢిల్లీ 1981)
14. (Jizya and the State in India during the 17th Century, Journal of the Economic Social History of the Orient XII, London 1969)
15. (ఇర్ఫాన్ హబీబ్ - మధ్యకాలీన్ ఇతిహాస్ లేఖన్ అవుర్ సాంప్రదాయక్ దృష్టికోణ్ (అను.) -ఉత్తరార్థ్, సంచిక 29, జులై 29, 1987, పేజి 40-46)
16. (రోమిల్లా థాపర్, హరివంశ్ ముఖియ, బిపిన్ చంద్ర - సాంప్రదాయకత ఔర్ ఇతిహాస్ లేఖన్ - పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ)
17. (రోమిల్లా థాపర్ - మధ్యకాలీన్ భారత్ - న్యూఢిల్లీ 1970, పేజి 148-174)

**2. ఔరంగజేబ్ సమకాలీన చారిత్రక ఆధారాలు ......**

**3. ఔరంగజేబ్ జననం - బాల్యం - విద్యాభ్యాసం ......**

1. బాదుషానామా - వాల్యూం -1, భాగం-1, పేజి-97, రచన : అబ్దుల్ హమీద్ (ముఖద్దమ-రుఖ్ఆత్ ఆలంగీరి, సయ్యద్ నజీబ్ అష్రఫ్, పేజి 124).
2. పై వివరాలు సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, ఎం.ఎ. వ్రాసిన "ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్" నుండి సేకరించడం జరిగింది.
3. అహ్కామె ఆలంగీరి, రచన : హమీదుద్దీన్ ఖాన్, సెక్రటరీ ఔరంగజేబ్, పేజి 27,28. ఈ సంఘటనను కొద్ది గొప్ప తేడాతో అమలె సాలెహ్, జఫర్‌నామా ఆలంగీర్, బాదుషానామ, మొదలుగాగల అన్ని సమకాలీన చరిత్ర గ్రంథాల్లోనూ యదునాథ్ సర్కార్‌తో సహా పేర్కొనడం జరిగింది.
4. అహ్కామె ఆలంగీరి రచన : హమీదుద్దీన్ ఖాన్, పేజి 29, 30)
5. బాద్‌షానామ (షాజహాన్) - రచన : అబ్దుల్ హమీద్, వా-2, పేజి 65 (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్ - పేజి-135, 136)

**4. దక్కన్ గవర్నరుగా రాకుమారుడు ఔరంగజేబ్**

1. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా-1, భాగం 1, పేజీలు 319, 320.
2. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా-1, భాగం 2, పేజి 115
3. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా-1, భాగం 2, పేజి 125
4. బాద్‌షానామ - అబ్దుల్ హమీద్, వా-1, భాగం - 2, పేజి 129 (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీరి, సంకలనం సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, పేజి 146-147.
5. సామాన్య చరిత్ర గ్రంథాల్లో శివాజి తండ్రి పేరును షాహ్‌జీ భోన్‌స్లాగా పేర్కొంటారు. కాని పర్షియన్ చరిత్ర గ్రంథాల్లో మాత్రం 'సాహూజీ'గా పేర్కొనడం జరిగింది. అందుకనే మేము సాహూజీ అనే పదాన్నే వాడాము. (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీరి, సంకలనం: సయ్యద్ నజీబ్ అష్రఫ్ నద్వి, పేజి 148)
6. అహ్కామె ఆలంగీరి : హమీదుద్దీన్ ఖాన్ పేజి 33 - 38)
7. వివరాల కోసం మాస్సర్ ఆలంగీరి-ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 390-395 ఇంకా మాస్సిరుల్ ఉమర మొదలగునవి చూడవచ్చు.

8. మాలోజి - మాసిరుల్ ఉమర వా-3, పేజి 436, 439, మాలోజి, పర్సోజి ప్రస్తావనలో.
9. బాద్‌షానామ : అబ్దుల్ హమీద్, వా-2, పేజి 105-109 (ముఖద్దమ రుఖ్‌ఆత్ ఆలంగీర్, సంకలనం : నజీబ్ అష్రఫ్, పేజి 150.
10. మాసిరుల్ ఉమరా : వా-3, పేజి 436, మాలోజి, పర్సోజీల ప్రస్తావనలో.
11. బాద్‌షానామ - అబ్దుల్ హమీద్, వా-1, భాగం 2, పేజి 277 (ముఖద్దమ రుఖ్‌ఆత్ ఆలంగీర్ : నజీబ్ అష్రఫ్ పేజి 151)
12. బాద్‌షానామ - అబ్దుల్ హమీద్, వా-2, పే - 373, (ముఖద్దమ రుఖయాత్, నజీబ్ అష్రఫ్, పేజి 157)
13. అమలె సాలెహ్ : ముహమ్మద్ సాలెహ్, వా-2, పేజి 406, (ముఖద్దమ రుఖ్‌ఆత్ ఆలంగీర్ - నజీబ్ అష్రఫ్ నద్వి -పేజీలు 157, 158)

**5. గుజరాత్, ముల్తాన్‌ల గవర్నరుగా ఔరంగజేబ్**

1. బాద్‌షానామ - అబ్దుల్ హమీద్ వా-2, పేజి 411 (ముఖద్దమ రుఖ్‌ఆత్ ఆలంగీర్, నజీబ్ అష్రఫ్, పేజి 162)
2. బాద్‌షానామ - అబ్దుల్ హమీద్, వా-2, పే.510, 511; మిరాతె అహ్మది, పేజి 2 3 1 - 2 3 3 , (ముఖద్దమ రుఖ్‌ఆత్ ఆలంగీర్ - నజీబ్ అష్రఫ్ పేజి : 162, 163)
3. రుఖ్‌ఆత్ ఆలంగీర్ - లేఖ నెం.10 (ముఖద్దమ రుఖియాత్, పేజి 165), ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా-1, భాగం-2, పేజి 208.
4. బాదుషానామ -అబ్దుల్ హమీద్, వా-2, పేజి 294-295 (ముఖద్దమ రుఖ్‌ఆత్ - పేజి 167)
5. బాదుషానామ -అబ్దుల్ హమీద్, వా-2, పేజి 686 - 709 (ముఖద్దమ రుఖ్‌ఆత్ - పేజి167)
6. బాదుషానామ -అబ్దుల్ హమీద్, వా-2, పేజి 694, 695 (ముఖద్దమ రుఖ్‌ఆత్ -పేజి 167)
7. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్, పేజి 387, 388, బాద్‌షానామ - అబ్దుల్ హమీద్ పే.686 - 709 (ముఖద్దమ పేజి 168)
8. హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - జదునాథ్ సర్కార్, (వాల్యూ-1, పేజి-58)
9. ఈ వివరాల కోసం ముహమ్మద్ వారిస్ వ్రాసిన చరిత్ర 'బాదుషానామ' పేజి 14-71 చూడండి (ముఖద్దమ-పేజి-169).
10. ఈ వివరాల కోసం ముహమ్మద్ వారిస్ వ్రాసిన చరిత్ర 'బాదుషానామ' పేజి 19 చూడండి. (ముఖద్దమ రుఖియాత్ పే.169)
11. బాదాషానామ - ముహమ్మద్ వారిస్ - పేజి 19 మరియు 66 (ముఖద్దమ రుఖియాత్ పే.170)
12. రెండుసార్లు ఖాందహార్ ముట్టడి మరియు అందులో విఫలమవడానికి కారణాలు,వివరాలు తెలుసుకోవాలనుకుంటే 'మాసిరుల్ ఉమ్రా' వా-3, పే.296-302, 434- 441; బాద్‌షానామ - ముహమ్మద్ వారిస్, పే. 35-48, 49-64, ఔరంగజేబ్ డైరి లేఖలు 16 -24 చూడాలి. (ముఖద్దమ రుఖ్‌ఆత్ - నజీబ్ అష్రఫ్, పేజి 176-192.
13. కాళికారంజన్ ఖానూన్‌గో - దారాషికూహ్ - రెండవ ముద్రణ, ఆగ్రా, పే. 21-45. ఈ పుస్తకాన్ని అనుసరించి ఖాందహార్‌ను జయించడానికి దారాషికూహ్ తన వెంట మంత్రగాళ్ళను, తాంత్రికుల్ని వెంటబెట్టుకు పోయాడు. ఇంద్రగిరి పేరు గల ఒక తాంత్రికుడు, తన అధీనంలో ఉన్న నలభై

ప్రేతాల సహాయంతో ఖాందహార్‌ను నాశనం చేస్తానని చెబుతూ దారా షికూహ్‌ నుండి అత్యధిక ధనాన్ని రాబట్టుకోసాగాడు. ఒక ప్రత్యేక రాత్రి అతను దారా షికూహ్‌ నుండి ఇద్దరు వేశ్యల్ని, ఒక గేదెను, ఒక గొఱ్ఱెను, ఐదు కోళ్ళను, మరియు ధనాన్ని తీసుకొని మాంత్రిక బలాల్ని మేల్కొలపడానికని ఒక రహస్య ఏకాంత ప్రదేశానికి వెళ్ళిపోయాడు. ఖాందహార్‌ ఏమీ చెక్కుచెదరలేదుగాని, ఇంద్రగిరి లాంటి అనేక మోసగాళ్ళు రెండు చేతులతో దారా షికూహ్‌ను దోచుకున్నారు. (ఇలాంటి చర్యలవల్ల దారా షికూహ్‌కు హిందూ మంత్రతంత్రాల మీద విశ్వాసముండేదని మనం చెప్పుకోవడానికైతే బాగానే ఉంది గాని దీనివల్ల అతని మూర్ఖత్వం బయల్పడుతుంది) (ఔరంగజేబ్‌ ఏక్‌ నయీ దృష్టి – ఓంప్రకాష్‌ ప్రసాద్‌ పే.8 &83)

14. రుఖ్‌ఆత్‌ ఆలంగీర్‌ – లేఖ నెం.3/134 (ముఖద్దమ రుఖ్‌ఆత్‌ ఆలంగీర్‌, నజీబ్‌ అష్రఫ్‌ పేజి 191-194)

## 6. రెండవ పర్యాయము దక్కన్‌ గవర్నరుగా ఔరంగజేబ్‌

1. రుఖ్‌ఆత్‌ ఆలంగీర్‌ – లేఖ నెం.5/37, 16/48, 1/49. (ముఖద్దమ రుఖ్‌ఆత్‌ – పే.196-198)

2. ఇక్కడో విషయాన్ని గమనించాల్సి ఉంది. రాజ్యంలోని అత్యంత సారవంతమైన, లాభదాయకమైన సూబాలు అనగా కాబూల్‌, ముల్తాన్‌, పంజాబ్‌, మరియు అలహాబాద్‌లు దారాకు ఇవ్వ బడ్డాయి. షుజా బెంగాల్‌, ఒరిస్సాలకు శాశ్వత సుబేదారు – ఇక మురాద్‌ కూడా మాల్వా, కాశ్మీర్‌ మరియు గుజరాత్‌ లాంటి సూబాల్లోనే అత్యధికంగా ఉంటూ వచ్చాడు.

3. ఈ విషయంలో ఇంకా వివరాలు మాసిరుల్‌ ఉమర – వా–3, పేజి.414-420 (ఖాద్రి) ముర్షిద్‌ ఖులీఖాన్‌ ఖిరాసాని ప్రస్తావనలో.

4. రుఖ్‌ఆత్‌ ఆలంగీర్‌ – లేఖ నెం.3/59, (ముఖద్దమ రుఖియాత్‌ పేజి 202)

5, 6 & 7. బాద్‌షానామ – ముహమ్మద్‌ వారిస్‌ – పేజి 183 (ముఖద్దమ .... నజీబ్‌ అష్రఫ్‌ పే.298)

8. ఈ ప్రశాంతంగా ఉన్న కారణంగానే పాపం మీర్‌ ఫజ్‌లుల్లాహ్‌ కుమారుడు మీర్‌ అసదుల్లా బుఖారీ తన ప్రాణాల్ని కోల్పోవాల్సి వచ్చింది. (ముఖద్దమ... నజీబ్‌ అష్రఫ్‌ పే. 299)

9. ఆదాబె ఆలంగీరి – లేఖ నెం.132 (ముఖద్దమ... పేజి 299)

10. ఔరంగజేబ్‌ మరియు ఖుతుబుల్‌ ముల్క్‌ మధ్య చివరగా నిర్ణయమైన సంధి షరతుల ప్రకారం కోటి ఇరవై లక్షలు యుద్ధ పరిహారంగా చెల్లించాలి. అందులో నుండి ముందుగా 25 లక్షలు, ఆ తరువాత పది లక్షలు స్వయంగా ఔరంగజేబే తగ్గించాడు. ఆ తరువాత షాజహాన్‌ 20 లక్షలు తగ్గించాడు. ఈ విధంగా అతను కేవలం 70 లక్షలు మాత్రమే చెల్లించాడు. రెండవ షరతు ఏమిటంటే జమానతుగా రాంగీర్‌ ప్రాంతాన్ని మొగలుల అధీనం చేయాలి. మూడవ షరతు సుల్తాన్‌ ముహమ్మద్‌తో ఖుతుబుల్‌ ముల్క్‌ రెండవ కుమార్తె వివాహం జరిపించాలి. నాలుగవ షరతు ఏమిటంటే ఖుతుబుల్‌ ముల్క్‌కు మగ సంతానం లేనందున, అతని తరువాత సుల్తాన్‌ ముహమ్మదే అతని వారసుడవ్వాలి. చివరిది రహస్య ఒప్పందం. అయినా మీర్‌జుమ్లా ద్వారా ఈ విషయం షాజహాన్‌కు తెలిసే ఉంటుంది.(ముఖద్దమ, పేజి 300)

11. ఆదాబె ఆలంగీరి – లేఖ నెం. 187 (ముఖద్దమ రుఖియాత్‌ ... పేజి.301

12. ఆదాబె ఆలంగీరి–లేఖ నెం.187, 188 (ముఖద్దమ రుఖియాత్‌... పేజి 302 – 306)

13. వివరాల కోసం “బసాతీనుస్సలాతీన్‌” పేజి 45, 312 చూడగలరు. (ముఖద్దమ .... నజీబ్‌ అష్రఫ్‌., పేజి 308)

14. వివరాల కోసం - బాద్‌షానామా - ముహమ్మద్ వారిస్ - పేజి 192, 193, (ముఖద్దమ .... నజీబ్ అష్రఫ్, పేజి 321)

**7. షాజహాన్ కుమారులు - వారి వ్యక్తిత్వాలు - గుణగణాలు**

**8. షాజహాన్ అస్వస్థత - సోదరుల అంతర్యుద్ధాలు - షాజహాన్ ప్రవర్తన**

1. ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్ - అల్లామా షిబ్లీ నొమాని, పేజి-75
2. ఇక్కడి నుండి వివరాలన్నీ ఖాఫిఖాన్ రచించిన "ముంతఖబుల్ లుబాబ్" వా.2 నుండే గ్రహించడం జరిగింది. దానికి తోడు అల్లామా షిబ్లీ గారి 'ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్' సహాయం కూడా తీసుకోవడం జరిగింది.
3. ముఖద్దమ స.న. అష్రఫ్ పేజి 436, ముంతఖబుల్ లుబాబ్- ఖాఫిఖాన్, వా-2, భాగం-3, పేజి 61, 62 - ఇంకా వివరాలు కావాలంటే, Travel in the Moghal Empire - Dr. Franciose Burnier, page 40, 41 చూడండి.
4. రుఖ్అత్ ఆలంగీర్-లేఖ నెం.4/119-ఆ, (ముఖద్దమ ..సయ్యద్ నజీబ్ అష్రఫ్, పేజి 437, 438,అను.షమ్స్ బరేల్వి పేజి 223-225) (షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖలు.
5. ముంతఖబుల్ లుబాబ్ - వా-2, భాగం 3, పేజి 41-47. (Travel in the Moghal Empire - Dr. Franciose Burnier, p 64)
6. సమూగద్ యుద్ధం వివరాల కోసం జదూనాథ్ సర్కార్ - హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - వా - 2, పేజీలు 249 - 253, ఆలంగీర్ నామ పేజి - 75, 110, అమలె సాలెహ్ పేజి 21 - 25, జఫర్‌నామ ఆలంగీరి - పేజి 15 - 22, షుజా చరిత్ర పే. 56ఎ, 75బి, కూడా చూడవచ్చు. (ముఖద్దమ .... నజీబ్ అష్రఫ్ పే.442 - 445)
7. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫీ ఖాన్ - వాల్యూం -2, భా.3, పే.52, 53, రుఖ్అత్ ఆలంగీర్ - లేఖ నెం.1/196, (ముఖద్దమ, న.అష్రఫ్, పే.456, 457. అను. షమ్స్ బరేల్వి, పే.310, 311 (షాజహాన్ లేఖలు)

## 9. అంతర్యుద్ధాల పర్యవసానం - ఔరంగజేబ్ పట్టాభిషేకం

1. కొందరు చరిత్రకారులు "ఔరంగజేబ్ అతన్ని తనను అనుసరించమని కోరాడని, కాని మురాద్ రానన్నాడని, అయితే ఔరంగజేబ్ బయలుదేరిన తరువాత అతన్ని వెంబడిస్తూ బయలుదేరాడని రాశారు. (ముఖద్దమ .... న.అష్రఫ్, పేజి. 465)
2. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా.2, భా.3, పే.150, 151. నోట్ : (ఈ ప్రఖ్యాత చరిత్రకారుడు ఖాఫి ఖాన్ తండ్రి మురాద్‌కు నమ్మినబంటు. అతని కోసం ప్రాణాలకు కూడా లెక్కచేయని విశ్వాసపాత్రుడైన సేవకుడు. ఔరంగజేబ్ పట్ల ఖాఫి ఖాన్‌కు గల ద్వేషానికి ఇదో ప్రబల కారణం. అందుకని మురాద్‌కు సంబంధించి, ఖాఫి ఖాన్ ఇచ్చిన ఈ సమాచారం నిస్సందేహంగా విశ్వసించాల్సిందే.
3. మురాద్ నిర్బంధం మరియు ప్రతిహత్య (ఖిసాస్) క్రింద వధించబడిన వివరాలు ఖాఫిఖాన్ రాసిన ముంతఖబుల్ లుబాబ్‌లోనే కాకుండా, ఆలంగీర్ నామా, పేజి 132 - 142, అమలె సాలెహ్ పేజి 32, 33, 42 - జఫర్ నామయె ఆలంగీరి పేజి 29 - 32 - షుజా చరిత్ర పేజి ఎ79, బి 84, హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్-జదూనాథ్ సర్కార్, వా - 2, పేజి 269-273, మొదలగు వాటిలో కూడా లభిస్తాయి. (ముఖద్దమ .....నజీబ్ అష్రఫ్, పే.468 & 469).

**10. షాజహాన్ నిర్బంధం – ఔరంగజేబ్ ప్రవర్తన**

**11. హిందువుల పట్ల ఔరంగజేబ్ ప్రవర్తన**

1. హిందుస్తాన్‌కె ముస్లిమ్ హుక్మురానోఁకీ మజ్‌హబి రవాదారీ–స.స. అబ్దుర్రహ్మాన్, వా.3, పేజి 280–286.
2. ఆలంగీర్ హిందువోఁకె నజర్ మే – అయ్యూబ్ ఖాన్, పేజి 76.
3. హిందుస్తాన్ మే గుమ్రాహ్‌కున్ తారీఖ్ నవేసీ– డా.ముఖ్తార్ అహ్మద్ మక్కీ, పేజి 66, 67.
4. ముంతఖబుల్ లుబాబ్ – ఖాఫి ఖాన్ – వా–2, భా.3, పేజి 196, 197, ఖాఫి ఖాన్ ఈ విషయంలో వివరంగా రాశాడు.
5. ముంతఖబుల్ లుబాబ్ – ఖాఫి ఖాన్ – వా–2, భా.3, పేజి 229
6. ముంతఖబుల్ లుబాబ్ – ఖాఫి ఖాన్ – వా–2, భా.3, పే.232
7. Aurangajeb and His Times - Z. Farooqui - Bombay 1935, pages 190, 191
8. The State and Religion in Moghal India - Makhan Lal Roy Chowdary, Calcutta-1951 P.269)
9. A Social History of Islamic India - Mohammed Yaseen, Lucknow, 1958, pages - 48, 210, 211

**12. హిందీ భాష – ఔరంగజేబ్ ప్రతిస్పందన**

**13. ఔరంగజేబ్ దర్బారులోని హిందూ మన్సబుదారులు,ఇతర ఉన్నతాధికారులు**

1. దీన్ని మొట్టమొదటిసారిగా "Religious Policy of the Moghal Emperors"అనే తన గ్రంథంలో ప్రొఫెసర్ శ్రీరాం శర్మ పేర్కొన్నారు. పేజి 98–101. అందులో వాస్తవమైన సంఖ్యను పేర్కొన్నారు. (Moghal Nobility ... p. 22)
2. ఆదాబె ఆలంగీరి పేజి 24అ,25అ–రుఖ్‌ఆత్ ఆలంగీర్, పేజి.113, 115 లను అనుసరించి ఆసక్తికరమైన విషయం ఏమిటంటే రావుకరన్ అనే పేరు గల ఒక రాజపుత్ర వీరునికి ప్రమోషన్ ఇవ్వాలని ఔరంగజేబ్ చేసిన సిఫారసును, షాజహాన్ తిరస్కరించి నప్పుడు, దానిపై ఔరంగజేబ్ నిరసన తెలిపిన సందర్భంలో ఇలా విమర్శించడం జరిగింది. (Moghal Nobility..... p.22)
3. వీర్ వినోద్ వా–2 పేజి 423, 424, 426, 427. ఆదాబె ఆలంగీరి పేజి 325J, 326J (Moghal Nobility ..... p.22)
4. వీర్ వినోద్ వా–2, పేజి 419, 420, నోటు : 1960లో అలీగడ్‌లో జరిగిన ఆలిండియా హిస్టరీ కాంగ్రెస్ సదస్సులో "వారసత్వం కోసం జరిగిన యుద్ధంలో ధార్మిక వ్యవహారం" అనే మకుటంతో తనచే ఒక వ్యాసం సమర్పించబడిందని, అందులో ఈ నిషాన్ అనువాదం ఇవ్వబడిందని, ఇదే వ్యాసం తిరిగి మిడీవల్ ఇండియా క్వార్టర్లీ, వా–5, పేజి.80–87లో ప్రచురించబడిందని అత్‌హర్ అలి పేర్కొన్నారు. (Moghal Nobility..... Page 22)

**14. హిందూ మందిరాలు – ఔరంగజేబ్ ఫర్మానాలు**

1. వఖాయె ఆలంగీరి – చౌదరి నబి అహ్మద్ సింధ్వేల్వి, పేజి 102–103. (ఆయినయె ఔరంగజేబ్ – హకీమ్ జిల్లుర్‌రహ్మాన్, పే.205, 206).
2. వఖాయె ఆలంగీరి – చౌదరి నబి అహ్మద్ సింధేల్వి, పేజి 103, 104. (ఆయిన–ఎ–ఔరంగజేబ్–హకీమ్ జిల్లుర్ రహ్మాన్, పే.206, 207)

3. ఆలంగీర్ హిందువోం కీ నజర్ మే - అయ్యూబ్ ఖాన్, పేజి 78 (తారీఖ్ కి సచ్చాయియాం - ఖుర్షీద్ ముస్తఫా రజ్వీ, పే.55)
4. హైకోర్టు పేపర్స్, అలహాబాద్, 1934 పేజి 14
5. హైకోర్టు పేపర్స్, అలహాబాద్, 1934 పేజి 14
6. హైకోర్టు పేపర్స్, అలహాబాద్, 1934 పేజి 14
7. హైకోర్టు పేపర్స్, అలహాబాద్, 1934 పేజి 15, 16
8. అలహాబాద్ హైకోర్టు పేపర్స్ - 1934
9. అసాం రీసెర్చ్ సొసైటీ, జనవరి, ఏప్రిల్ 1942, పేజి 1-12
10. జనరల్ ఆఫ్ బొంబాయి యూనివర్శిటీ, వాల్యూం-1, పేజి 55
11. బి.యన్. పాండే, ఖుదాబక్ష్ మెమోరియల్ ఆన్వల్ లెక్చర్, పాట్నా, 1986
12. పంకజ్ పచౌరి - మందిర్ కా మొగలియా రిష్త - ఇండియా టుడే (హిందీ) సంపా.అరుణ్‌పురి సంచిక - 21, 1-15 సెప్టెంబర్ 1987, పేజి 70, 71
13. న్యూస్ లెటర్, 1694 జులై 7 - ప్రొ. శ్రీరాం శర్మ (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 30)
14. (మొగల్ శాసకోంకీ ధార్మిక నీతి - ప్రొ. శ్రీరాం శర్మ, పే.161, మిరాతె అహ్మది. వా.1, పే.263) ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 32.
15. శ్రీరాంశర్మ, మొగల్ శాసకోం కీ ధార్మిక్ నీతి - పేజి 162.

**15. జిజ్‌యా పన్ను - వాస్తవికత**

1. Alligations of Religious Begotary Against Aurangazeb by Satish Chandra, Fakhruddin Ali Ahmed Lecture, Azad Academy General, July 1-13, 1987, page 10, 12
2. Harishankar Srivastav - Moghal Shasan Pranali, Delhi, 1978, page 130.
3. The Jizya and the State in India during the 17th Century - Sathish Chandra, Madhya Kaleen Bharath, Editor : Irfan Habeeb, Issue - I, Delhi 1981 page 69-84
4. Satish Chandra - Allegations of Religious Begotary against Aurangazeb, (Fakhruddin Ali Ahmed Lecture) page 10-12.

5 & 6. ఎక్తెదార్ ఆలంఖాన్ - అక్బర్ కె అధీన్ అమీర్ వర్గ్ తథా అక్బర్ కీ ధార్మిక్ నీతీ కా వికాస్ - (1560-1580) - మధ్యకాలీన్ భారత్, ఎడిటర్ : ఇర్ఫాన్ హబీబ్, సంచిక - 2, డిల్లీ, 1983, పేజి 69, 70.

7. షేఖ్ నిజాముద్దీన్ ఔలియ - ఫవాయెదుల్ ఫవాద్, పేజి 65, 195-197.
8. జధూనాథ్ సర్కార్ - ఔరంగజేబ్ - (1618 - 1703) పేజి 101
9. మాసిరె ఆలంగీరి - పేజి 100

10. & 11. శ్రీరాంశర్మ-మొగల్ శాసకోంకీ ధార్మిక్ నీతి-పేజి 122, మాసిరె ఆలంగీరి-పేజి 162

12. ఆలంగీర్‌నామ - వాల్యూం-2, పేజీలు 392, 432-438.
13. నేరుగా వాటి పన్నులు రాజ ఖజానాలో జమ అయ్యే ప్రాంతాలు.
14. మిరాతుల్ ఖియాల్, వా-1, పేజి 249
15. ద ఇండియన్ ట్రావెల్స్ ఆఫ్ థేవినో అండ్ కారేరి, సంపాదకులు : ఎస్.ఎన్. సేన్, న్యూఢిల్లీ 1940, పేజి 3-4

16. ఖాఫీ ఖాన్ : ముంతఖబుల్ లుబాబ్, వా-2, పేజి 88-89 (బిబ్లియోథిక ఇండిక సీరీజ్).
17. మిరాతుల్ ఖియాల్ - వాల్యూం-1, పేజి 288-291.
18. హరిశంకర్ శ్రీవాస్తవ్ - మొగల్ శాసన్ ప్రణాళి - డిల్లీ, 1978, పేజి 131
19. 1713లో ఫర్రుఖ్‌సైర్ తన ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే జిజ్‌యా మాఫీ చేశాడు, 1717లో తిరిగి జిజ్‌యాను ప్రతిపాదించాడు, 1719లో దాన్ని ఎత్తేశాడు. 1723 మరియు 1725లో తిరిగి జిజ్‌యాను విధించడానికి ప్రయత్నించాడు, ఆ తరువాత జిజ్‌యా విధించిన వివరాలు కనిపించవు.
20. & 21. తులనము - సతీష్ చంద్ర, జిజ్‌యా అండ్ స్టేట్ డ్యూరింగ్ సెవన్టీన్త్ సెంచరీ ఇన్ ఇండియా, పేజి 73
22. English Factories (Editor) - Fauster - 1678 - 1684, page xxix
23. History of Aurangazeb - Jadhunath Sarkar, Vol.-3, Page 270
24. The Aggrarian System of Moghal India, Page 120, Footnote - 5
25. యం. ఫారూఖీ - ఔరంగజేబ్ అండ్ హీజ్ టైమ్స్ - పేజి 158 - 161
26. The Aggrarian System of Moghal India, Page 298, 316
27. ఇస్లామ్ మే బలాత్ ధర్మ్ పరివర్తన్ నహీఁ - అబూ ముహమ్మద్ ఇమాముద్దీన్ రాం నగరి, మధుర్ సందేశ్ సంగమ్, న్యూఢిల్లీ, పేజి 29.
28. హిందుస్తాన్ కే ముస్లిం హుక్మరానోఁకీ ... సయ్యద్ సబాహుద్దీన్, వా-1, పేజి 102-105, (నయీ జిందగీ - మాసపత్రిక, అక్టోబర్ 1946, అలహాబాద్).
29. హిందుస్తాన్ మే గుమ్రాహ్‌కున్ తారీఖ్ నవేసి (Distortion of Indian History) By Dr. Mukhtar Ahmed Makki, Page 66.

## 16. బీజాపూర్, గోల్కొండ రాజ్యాల పతనం

1. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్ - వా:2, భాగం 3, పేజి 288.
2. మాసిరుల్ ఉమరా - షా నవాజ్ ఖాన్ - వా-1, పే.532, జాన్ నిసార్ ఖాన్ ప్రస్తావనలో.....
3. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫీ ఖాన్ : వా-2, భా.3, పేజి 268.
4. మాసిరుల్ ఉమరా - షా నవాజ్ ఖాన్ - వా-3, పేజి 520, మహాబత్ ఖాన్ హైద్రాబాది ప్రస్తావనలో...
5. మాసిరుల్ ఉమరా -షా నవాజ్ ఖాన్ - వా-2, పేజి 351-352. రాజా సాహూ ప్రస్తావనలో.
6. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫీ ఖాన్ - వా-2, పేజి 268
7. మాసిరుల్ ఉమరా - వా-3, పేజి 521, మహాబత్ ఖాన్, హైద్రాబాదీ ప్రస్తావనలో
8. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్ - వా-2, భా.3, పేజి 270,271
9. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా-2, భా.3, పేజి 275, మాసిరుల్ ఉమరా, షా నవాజ్ ఖాన్, వా.3, పేజి 522, మహాబత్ ఖాన్, హైదరాబాదీ ప్రస్తావనలో

## 17. ఔరంగజేబ్ - మరాఠాలు

1. శివాజీ కుటుంబం గురించి ఖాఫిఖాన్ తన చరిత్ర ముంతఖబుల్ లుబాబ్, వా.2, భా.3, పేజి 115లోను, గులామ్ నబీ ఆజాద్ 'ఖజాన-యె-ఆమెరా' పేజి 39లోనూ వివరంగా వ్రాశారు. అయితే

అన్నిటికన్నా వివరంగానూ, పరిశోధనాత్మకంగానూ మాసిరుల్ ఉమరాలో తెలుపడం జరిగింది. శివాజీ మనుమడైన సాహూ ఆలంగీర్ దర్బారులో ఏడు వేల మన్సబు కలిగి ఉండేవాడు. కనుక మాసిరుల్ ఉమరాలో అతని పేరుతో ఒక అధ్యాయమే ఉంది. అందులో అతని గురించి ఇతర వివరాలతో పాటుగా అతని కుటుంబం పూర్వీకులు మొదలగు వాటి వివరాలు కూడా పేర్కొనబడ్డాయి. (మాసిరుల్ ఉమరా, వా.2, పేజి 344-362)

2. ముంతఖబుల్ లుబాబ్, వా.1, భా.1, పేజి 313, 321.... మాసిరుల్ ఉమరా వా.1, పేజి 517-519
3. ముంతఖబుల్ లుబాబ్, వా.1, భా.2, పేజి 46, మాసిరుల్ ఉమరా, వా.1, పే.517-519, జాదురావ్ కాంతియా ప్రస్తావనలో..
4. ముంతఖబుల్ లుబాబ్, వా.1, భా.2, పేజి 79.
5. ముంతఖబుల్ లుబాబ్, వా.1, భా.2, పేజి 94, 115
6. ముంతఖబుల్ లుబాబ్, వా.1, భా.2, పేజి 95
7. ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్, వా.1, భా.2, పేజి 121, 122
8. ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్, వా-2, భా.1, పేజి 116, 117
9. ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్, వా.2, భా.3, పేజి 117
10. హి.ఆ.ఔ. జధూనాథ్ సర్కార్, వా.4, పేజి 19
11. హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, జదూనాథ్ సర్కార్, వా-4, పేజి 20
12. హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, జదూనాథ్ సర్కార్, వా-4, పే. 20
13. హి.ఆ.ఔ. సర్ జ.నా.స., వా-4, పే.20-21
14. హి.ఆ.ఔ., సర్ జ.నా.స, వా-4, పే.21, 22
15. ముంతఖబుల్ లుబాబ్ , ఖాఫి ఖాన్, వా-1, భా.2, పే.306
16. రాంసింగ్ గురించిన అన్ని వివరాలు మాసిరుల్ ఉమరా - వా-2, పేజి 304-306, రాజా రాం సింగ్ కచ్వాహా ప్రస్తావనలో ఉన్నాయి.
17. మాసిరుల్ ఉమరా- షా నవాజ్ ఖాన్, వా-2, పేజి 203-209, రాణా కరణ్ ప్రస్తావనలో
18. మాసిరుల్ ఉమరా - షా నవాజ్‌ఖాన్, వా-2, పేజి 346, రాజా సాహూ ప్రస్తావనలో
19. ఆలంగీర్‌నామ - మున్షి కాజిం షేరాజి, పేజి 968, (ఔరంగ్ ఆలం పర్ .... షిబ్లి, పేజి 28.)
20. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్-వా.2, భా.3, పేజి 178.
21. మాస్సర్ ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖీ - పేజి 39
22. మాస్సర్ ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖీ - పేజి 39.
23. "భారత చరిత్ర" - అల్ఫిన్‌స్టన్ - (అనువాదం) పేజి 1057, అలీగడ్ ప్రచురణ (ఆలంగీర్ పర్ .... షిబ్లి, పేజి 32)
24. మాసిరుల్ ఉమరా-షా నవాజ్ ఖాన్, వా-2, పేజి 351, రాజా సాహూ ప్రస్తావనలో
25. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్, వా-2, భా.4, పే.78
26. హి.ఆ.ఔ. - జ.నా.సర్కార్, వా-4, పేజి 346
27. మాస్సర్ ఆలంగీరి, ముస్తఅద్ ఖాన్ సాఖీ పేజి-314
28. భారతచరిత్ర - అల్ఫిన్‌స్టన్ - పేజి 1117 (ఆలంగీర్ పర్ .... షిబ్లి, పేజి 41)
29. మాస్సర్ ఆలంగీరి -సాఖీ ముస్తఅద్ ఖాన్, పేజి 369
30. మాసిరుల్ ఉమరా - షా నవాజ్ ఖాన్, వా-2, పేజి 354 - ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫిఖాన్-వా.2, భాగం 3, పేజి 34.

31. హిందూస్తాన్ మే గుమ్రాహ్‌కున్ తారీఖ్ నవేసి - డా. ముఖ్తార్ అహ్మద్ మక్కి పేజి - 53.

**18. ఔరంగజేబ్ - సిఖ్ఖులు**

1. "తారీఖ్ గురూ ఖాల్సా" (ఉర్దూ) - భాయి గ్యాన్‌సింగ్ గ్యాని - మొదటి భాగం, ముద్రణ - ఖాల్సా ఏజన్సీ ప్రెస్, అమృత్‌సర్ (మొహియొద్దీన్ ఔరంగజేబ్ ఆలంగీర్ - సాది సంగర్‌వరి-పేజి 136-149)
2. కనిన్గ్‌హం రచన : సిఖోఁ కా ఇతిహాస్ - సంపా. కమలాకర్ తివారి, అనువాదం : రమేష్ తివారి మరియు సురేష్ తివారి, ఇతిహాస్ సంస్థాన్, వారణాసి, డిసెంబర్ 1965, పేజి 76
3. కనిన్గ్‌హం రచన : సిఖోఁ కా ఇతిహాస్ - ఎడిటర్ కమలాకర్ తివారి, అనువాదం : రమేష్ తివారి మరియు సురేష్ తివారి, ఇతిహాస్ సంస్థాన్, వారణాసి, డిసెంబర్ 1965, పేజి 76 - పరిషిష్ట్ 22ను అనుసరించి నానక్, అంగద్, అమర్‌దాస్, అర్జున్, హర్‌గోవింద్ గుర్‌దిత్, హర్‌రాయ్, హర్‌కిషన్ మరియు తేగ్‌బహదూర్ తరువాత అంతిమ మరియు పదవ గురు గోవింద్‌సింగ్.
4. కనిన్గ్‌హం రచన : సిఖోఁ కా ఇతిహాస్ - ఎడిటర్ కమలాకర్ తివారి, అనువాదం : రమేష్ తివారి మరియు సురేష్ తివారి, ఇతిహాస్ సంస్థాన్, వారణాసి, డిసెంబర్ 1965, పేజి 53
5. కనిన్గ్‌హం, రచన : షిఖోఁ కా ఇతిహాస్, ఎడిటర్ కమలాకర్ తివారి, అనువాదం : రమేష్ తివారి మరియు సురేష్ తివారి, ఇతిహాస్ సంస్థాన్, వారణాసి, డిసెంబర్ 1965, పేజి - 55
6. కనిన్గ్‌హం, రచన : షిఖోఁ కా ఇతిహాస్, ఎడిటర్ కమలాకర్ తివారి, అనువాదం : రమేష్ తివారి మరియు సురేష్ తివారి, ఇతిహాస్ సంస్థాన్, వారణాసి, డిసెంబర్ 1965, పేజి - 13
7. కనిన్గ్‌హం, రచన : షిఖోఁ కా ఇతిహాస్, ఎడిటర్ కమలాకర్ తివారి, అనువాదం : రమేష్ తివారి మరియు సురేష్ తివారి, ఇతిహాస్ సంస్థాన్, వారణాసి, డిసెంబర్ 1965, పేజి - 57
8. బ్రౌన్, ఇండియా ట్రాక్ట్స్, వా-2, పేజి 2, 3
9. కనిన్గ్‌హం - సిఖోఁ కా ఇతిహాస్, పేజి 57
10. బ్రౌన్ - ఇండియా ట్రాక్ట్స్ - వా-2, పేజి 67
11. కనిన్గ్‌హం - సిఖోఁ కా ఇతిహాస్, పేజి 77
12. సింహాసనం కోసం అశోక చక్రవర్తి తన వందమంది సోదరుల్ని చంపించాడని ముందే తెలుపుతూ వచ్చాం. సింహాసనాన్ని ఆక్రమించుకోవడం కోసమని చివరి మౌర్య పాలకుడు బ్రహ్‌ద్రత్‌ను అతని సేనాని పుష్యమిత్ర్ శుంగ్ హతమార్చాడు. క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో కిరీటం ధరించడం కోసం అజాత శత్రు తన తండ్రినే వధించాడు. రాజ్యాధికారాన్ని చేజిక్కుంచుకోవడం కోసం తన తండ్రి షాజహాన్‌కు వ్యతిరేకంగా ఔరంగజేబే కాకుండా షుజా, మురాద్‌లు కూడా తిరుగుబాటు చేశారు. స్వయంగా ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా అతని కుమారుడు అక్బర్ తిరుగుబాటు చేశాడు. ఇవన్నీ పేర్కొని చెప్పబోయే దేమంటే సిఖ్ఖు సమస్యను అనవసరంగా విశాల రూపమిచ్చి ఔరంగజేబ్‌ను దోషిగా, సిఖ్ఖు వ్యతిరేకిగా ప్రదర్శించడం, చారిత్రక సాక్ష్యాధారాల దృష్ట్యా ఎంతమాత్రం సముచితం కాదు.
13. కనిన్గ్‌హం - సిఖోఁ కా ఇతిహాస్, పేజి 79, 80
14. యదూ నాథ్ సర్కార్ (తన గ్రంథం 'ఔరంగజేబ్' పేజి 310లో) ఇలా పేర్కొంటున్నాడు. శివాజీ మరియు శంభూజి పల్లెల్ని, వ్యాపారుల్ని, హిందూముస్లిం అనే తారతమ్యం లేకుండా దోచుకునేవారు, ఇక మొగలు సైన్యాలు రాగానే, కనబడకుండా దాక్కునేవారు.
15. మొగల్ సామ్రాజ్య కా ఉత్థాన్ ఔర్ పతన్ - రాంప్రసాద్ త్రిపాఠి, పేజి. 374, అలహాబాద్,1984)

**19. ఔరంగజేబ్ - రాజపుత్రులు**

1. ఈ వివరాలు ఖాఫి ఖాన్ మొదలుగాగల చరిత్ర గ్రంథాలన్నిటిలో ఉన్నాయి. కాని సంపూర్ణంగా, వివరంగా మాసిరుల్ ఉమరా - వాల్యూం-3, పేజి 497-501లో పేర్కొనడం జరిగింది.

2. భారతచరిత్ర - అల్ ఫిన్స్టన్, పేజి 57, (ఔరంగజేబ్-షిబ్లి-పే.47).
3. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 122.
4. భారత చరిత్ర - అల్ ఫిన్స్టన్ - పేజి 1072 (ఔరంగజేబ్....షిబ్లి... పే.51)
5. భారత చరిత్ర - అల్ ఫిన్స్టన్ - పేజి 1077, 1078 (ఔరంగజేబ్...షిబ్లి-పే.52,53)
6. మాసిరె ఆలంగీరి - సాఖి ముస్తఅద్ఖాన్, పేజి 146, 147,
7. మాసిరుల్ ఉమరా - షా నవాజ్ ఖాన్ - వాల్యూం-2, పేజి 209, రాణా కరన్ ప్రస్తావనలో, హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ - సర్కార్, వా-3, పేజి 246.
8. తారీఖ్ కి సచ్చాయియాం - ఖుర్షీద్ ముస్తఫా రజ్వి -పేజి 62-63.
9. యాదె అయ్యామ్ - అబ్దుల్ రజ్జాఖ్ కాన్‌పూరి - పేజి 230, 231, (తారీఖ్ కీ సచ్చాయియాం - ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 67) (ముస్లిమ్ హుక్మరానో .. స.స. అబ్దుర్రహ్మాన్, వా.3, పే. 272, 273)

## 20. ఔరంగజేబ్ - రాజనీతి

1. అహ్కామె ఆలంగీరి - హమీదుద్దీన్ ఖాన్ పేజి 31 - 33.
2. మాసిరె ఆలంగీరి, మాసిరుల్ ఉమరాలో వీరి వివరాలు లభిస్తాయి.
3. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి, పేజి 283
4. వీర్ వినోద్, వా-1, పేజి 419, 420, 423, 424, 426, 427 - ఆదాబె ఆలంగీరి పేజి 325 ఎ, 326ఎ(Quoted in the Moghals Nobility under Aurangazeb, M.Athar Ali, page 22)
5. ప్రభుత్వ జీతభత్యాలు పంచే అతి కీలక హోదాలపై ఇద్దరు పరమతస్తులున్నారని, దైవశత్రువులైన వీరిని తొలగించి అందులోని ఒక హోదాను తనకివ్వాలని తన దాది సోదరుని లాంటి అతి సన్నిహితుడు కోరినప్పుడు అతని విన్నపాన్ని తిరస్కరిస్తూ, అతని అర్జీపై ఈ రెండవ సూత్రాన్ని పేర్కొన్నట్లు T.W. Arnold తన ప్రఖ్యాత గ్రంథం The Preaching of Islam, Page-28, London, 1935 లో పేర్కొన్నారు.
6. ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 30
7. ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 21,22
8. ఆదాబె ఆలంగీరి, లేఖ నెం. 231, ఆలంగీర్ నామ, రుఖిఆత్ లేఖ నెం.21/77 (ఈ పుస్తకపు 21వ అధ్యాయంలో)
9. దేవ్‌గడ్ వివరాల కోసం ముహమ్మద్ వారిస్ వ్రాసిన 'పాదుషా నామ' పేజి 71-73 మరియు 'రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం. 1/78, 2/79, 3/80, 7/93. (ఈ పుస్తకపు 11వ అధ్యాయంలో)
10. రుఖ్ఆత్ ఆలంగీర్, లేఖ నెం. 1/84, 2/85, 3/86, సం. స.న.అ. అను. షమ్స్ బరేల్వి పేజి 177-190. (ఈ పుస్తకపు 11వ అధ్యాయంలో)
11. అహ్కామె ఆలంగీర్ - హమీదుద్దీన్ ఖాన్ - పేజి 41, 42.
12. సర్కార్ - హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, వా-5, పేజి 159-163.
13. రుఖ్యాత్ ఆలంగీర్. లేఖ నెం.4/90, సంకలనం, స.న.అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 195, షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖలు (దక్కన్ గవర్నరుగా)
14. Travel in the Moghal Empire- Dr. Burnier, page 25, 26.

15. ఔరంగజేబ్ - లేన్‌పోల్ పేజి 31- (ఔరంగజేబ్ ..... షిబ్లి - 84)
16. వాఖియాతె ఆలంగిరి - ఆఖిల్ ఖాన్, (మొహియుద్దీన్ ఔరంగజేబ్ ఆలంగీర్-సాది సంగర్‌వరి, పే.119)
17. Travel in the Moghal Empire- Dr. Burnier, page 61, 65, మాసిరుల్ ఉమరా,షా.న.ఖాన్, వా.2, పేజి 692, 693, షాయిస్త ఖాన్ ప్రస్తావనలో.
18. ఆదాబె ఆలంగిరి - ముహమ్మద్ సాదిఖ్ అన్ బాల్వి - లేఖ నెం. 1/186 (ముఖద్దమ రుఖ్ఆత్, పేజి 449) (ముంతఖబుల్ లుబాబ్, ఖాఫిఖాన్, వా.2, భా.3. పే.52, 53, 108.
19. రుఖ్ఆత్ ఆలంగీర్ లేఖ.2/195, సం.స.న.అష్రఫ్, పే.466, అను. షమ్స్ బరేల్వి, పేజి 310.
20. ఔరంగజేబ్ - లేన్‌పోల్ (అను- పేజి 45) (ఔరంగజేబ్ పర్ ..... షిబ్లి, పేజి 87)
21. దీని వివరాలు Travel in the Moghal Empire- Dr. Burnier, page 166 లో లభిస్తాయి.
22. ఔరంగజేబ్ కె ఉపాఖ్యాన్ - సర్ జదూనాథ్ సర్కార్, పేజి 81, ఆగ్రా, 1967, (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 19)
23. మన్‌షఆతె తాహెర్ వహీద్ - పేజి 13, (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగిరి- నజీబ్ అష్రఫ్, పే. 275-276)
24. లేఖలకు, ఇతర వివరాలకు "మన్‌షఆతె తాహెర్ వహీద్" పేజి 13-15 (ముఖద్దమ రుఖ్ఆత్ ఆలంగీర్-నజీబ్ అష్రఫ్, పేజి 277-278) చూడవచ్చు.

**21. ఔరంగజేబ్ - ధార్మిక నీతి**

1. రుఖ్ఆతె ఆలంగీర్ - లేఖ నెం. 7/63, 8/64, 1/82, 2/82, సం. సయ్యద్ నజీబ్ అష్రఫ్, అను. షమ్స్ బరేల్వి, పేజి 156, 157, 183, 184, షాజహాన్ పేర ఔరంగజేబ్ లేఖలు.
2. ఆలంగీర్ నామ - మున్షి కాజిం షేరాజి. (ముఖద్దమ రుఖ్ఆత్ .... నజీబ్ అష్రఫ్, పే.249)
3. Vir Vinod - II, pages - 419, 420, 423, 424, 426, 427 - (The Moghal Nobility under Aurangazeb, page-22- M. Ather Ali) (ఆదాబె ఆలంగిరి, పేజి 325ఎ,326 ఎ)
4. ఔరంగజేబ్ - ఏక్ నయీ దృష్టి - డాక్టర్ ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 30.
5. అహ్‌కామ్ ఆలంగిరి - హమీదుద్దీన్ ఖాన్, పేజి 106, ఔరంగజేబ్ కే ఉపాఖ్యాన్- జదూనాథ్ సర్కార్, పేజి 91, ఆగ్రా, 1967 (ఔరంగ...ఓంప్రకాష్ ప్రసాద్-పే.26)
6. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్, వా-1, పేజి 77, ఆలంగీర్ నామ - కాజిం షేరాజి, పేజి 366. (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి, పేజి 22)
7. మొగల్ శాసకోఁ కీ ధార్మిక్ నీతి - ప్రొఫెసర్ శ్రీరాం శర్మ - పేజి 120 (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 22)
8. మనూచి - 4, పేజి 118-121, మొగల్ శాసకోఁ కీ ధార్మిక్ నీతి - ప్రొ. శ్రీరాం శర్మ, పేజి 162. (ఔరంగజేబ్ ఏక్ నయీ దృష్టి - డా. ఓం ప్రకాశ్ ప్రసాద్, పేజి 32)
9. తారీఖ్ కీ సచ్చాయియాఁ - ఖుర్షీద్ ముస్తిఫా రజ్వి, పేజి 56

10 & 11. తారీఖ్ కీ సచ్చాయియాఁ -ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 65, 66

12. రూద్ కౌసర్ - షేఖ్ ముహమ్మద్ ఇక్రామ్, పేజి 467 (ఆయిన యె ఔరంగజేబ్-హకీమ్ జిల్లుర్రహ్మాన్, పేజి 200, 201.

**22. ఆరాధనాలయాలు - కూల్చివేత**

1. నీలం అగర్‌వాల్, కల్‌హన్ - రాజ్ తరంగిణి - అలహాబాద్-1968, పేజి 253-254.
2. నీలం అగర్‌వాల్, కల్‌హన్ - రాజ్ తరంగిణి - అలహాబాద్-1968, పేజి 253-254.
3. నీలం అగర్‌వాల్, కల్‌హన్ - రాజ్ తరంగిణి - అలహాబాద్-1968, పేజి 253-254.
4. నీలం అగర్‌వాల్, కల్‌హన్ - రాజ్ తరంగిణి- అలహాబాద్-1968, పేజి 253, 254
5. నీలం అగర్‌వాల్, కల్‌హన్ - రాజ్ తరంగిణి -అలహాబాద్-1968, పేజి 253-254.
6. రోమిల్లా థాపర్, హరివంశ్ ముఖియ మరియు బిపిన్ చంద్ర - సాంప్రదాయికతా ఔర్ ఇతిహాస్ లేఖన్ పేజి 34
7. సతీశ్ చంద్ర - మధ్యకాలీన్ భారత్ - రెండవ భాగం - పేజి 107, 108
8. డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారి రచన "ది ఫీదర్స్ అండ్ ది స్టోన్స్" ను చదివితే దానికి సంబంధించిన అన్ని వివరాలు తెలుస్తాయి.
9. డాక్టర్ బి.యన్.పాండే, ఖుదాబక్ష్ మెమోరియల్ అన్వల్ లెక్చర్స్, పాట్నా-1986.
10. ఫరిష్త చరిత్ర - ముహమ్మద్ ఖాసిం ఫరిష్త - వా-2, పేజి 36 (ఆలంగీర్ పర్... షిబ్లి, పేజి 70)
11. ఫరిష్త చరిత్ర - ముహమ్మద్ ఖాసిం ఫరిష్త -నవల్ కిషోర్ ప్రెస్, లక్నో, 1904, వా-2, పేజి 37 (ఆలంగీర్ పర్... షిబ్లి, పేజి 71)
12. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ - పేజి 54, 55
13. My Frozen Turbulence - Jagmohan - page - 40-41 (తారీఖ్ కీ సచ్చాయియాఁ - ఖుర్షిద్ ముస్తఫా రజ్వి, పేజి 22)
14. "సూఫీ" పత్రిక, 1924 అక్టోబర్ 1, (ఆలంగీర్ హిందువోఁ కీ నజర్ మే, పేజి 111-113) (తారీఖ్ కీ సచ్చాయియాఁ - ఖుర్షీద్ ముస్తఫా రజ్వి, పేజి 23.)

**23. పరిపాలనా వ్యవహారాల్లో సంస్కరణలు**

1. ఔరంగజేబ్ - రచన : లేన్‌పోల్, పేజి 116, 117 (ప్రామాణికమైన ఆధారాల ద్వారా లేన్‌పోల్ గారు ఈ వివరాల్ని సేకరించారు (ఔరంగ్ ఆలమ్ గీర్ ..... షిబ్లి, పేజి 106)
2. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 387
3. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్, వా-2,భా.3 పేజి 196
4. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 63
5. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 111
6. ఔరంగజేబ్ - లేన్‌పోల్ - పేజి 75, 76 (ఔరంగ్ ఆలమ్ పర్ .... షిబ్లి, పేజి 112
7. ఔరంగజేబ్ -లేన్‌పోల్ - పేజి 57 (ఔరంగ్ ... షిబ్లీ పే. 112)
8. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 384
9. భారత చరిత్ర - రచన : అల్ ఫిన్‌స్టన్, పేజి 1133 (ఔరంగజేబ్ పర్ ...షిబ్లి, పేజి 112)
10. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 386.
11. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ సాఖి - పేజి 50, 51.
12. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్ - వాల్యూం - 2, భా.3, పేజి 229
13. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్ - వాల్యూం - 2, భా.3, పేజి 230-231
14. ఔరంగజేబ్ ఆలంగీర్ - సాదీ సంగర్‌వరి, పేజి 106 - 111
15. ముస్లిం హుక్మరానోఁకీ..... స.స. అబ్దుర్రహ్మాన్.వా-3, పేజి.214-221.

**24. ముక్కల్ని జోడించి అఖండ భారతంగా మార్చిందెవరు?**

1. హిందుస్తాన్ కె ముస్లిం హుక్మురానోంకీ ... స.స. అబ్దుర్రహ్మాన్, వా.3, పేజి 128, 129.

**25. ఔరంగజేబ్ వ్యక్తిత్వం - గుణగణాలు**

1. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్ - వా-2, భా.3, పేజి 196
2. ముంతఖబుల్ లుబాబ్ - ఖాఫి ఖాన్ - వా-2, భా. 3, పేజి 197
3. మాసిరె ఆలంగీరి-ముస్తఅద్ ఖాన్-పేజి 65, ముంతఖబుల్ లుబాబ్, ఖాఫి ఖాన్,వా.2,భా.3,పేజి 229
4. మాసిరె ఆలంగీరి - ముస్తఅద్ ఖాన్ - పేజి 84.
5. ఔరంగజేబ్ ఆలంగీర్ పర్ ఏక్ నజర్ - షిబ్లీ నోమాని, పేజి 116.
6. Ref. from Hind-Uhad-e-Aurangazeb mey - by Yarjung Samiullah Baig, Ex Chief Justice of Hyderabad State, printed at Delhi, 1966, page 10).Matter from హిందుస్తాన్ మే గుమ్రాహ్కున్ తారీఖ్ నవేసి – (Distortion of Indian History - by Dr. Mukhtar Ahmed Makki, page 29)
7. హిందూస్తాన్ మే గుమ్రాహ్కున్ తారీఖ్ నవేసి(Distortion of Indian History - by Dr. Mukhtar Ahmed Makki, page 28)
8. ఔరంగజేబ్ కే ఉపాఖ్యాన్ – జదూనాథ్ సర్కార్ – పేజి 417, 1967 ఆగ్రా.
9. ఔరంగజేబ్ కే ఉపాఖ్యాన్ – జదూనాథ్ సర్కార్, పేజి 417
10. ఔరంగజేబ్ కే ఉపాఖ్యాన్ – జదూనాథ్ సర్కార్, పేజి 417
11. ఔరంగజేబ్ కే ఉపాఖ్యాన్ – జదూనాథ్ సర్కార్, పేజి 417
12. హిందూస్తాన్ మే గుమ్రాహ్కున్ తారీఖ్ నవేసి(Distortion of Indian History - by Dr. Mukhtar Ahmed Makki, page 59-60)

**26. మొగలు సామ్రాజ్య పతనానికి కారకులెవ్వరు?**

1. విలియం ఇర్విన్ – లేటర్ మొగల్స్
2. జదూనాథ్ సర్కార్ – ఫాల్ ఆఫ్‌ది మొగల్ ఎంపైర్ – 4వ భాగం
3. సర్కార్ – హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ – వాల్యూం-3, పేజి 283-364, కలకత్తా, 1916.
4. సతీష్ చంద్ర – పార్టీస్ అండ్ పాలిటిక్స్ ఎట్ ద మొగల్ కోర్ట్ – 1707-1740, బొంబాయి 1963
5. ఇర్ఫాన్ హబీబ్ – అగ్రేరియన్ సిస్టం ఆఫ్ మొగల్ ఇండియా, 1556-1707
6. ఎం. అత్‌హర్ అలి, "మొగల్ సామ్రాజ్య కా అంత్" మధ్య కాలీన్ భారత్, సంపాదకులు-ఇర్ఫాన్ హబీబ్, సంచిక 1, 1981, పేజి 109, 110.
7. ఎం. అత్‌హర్ అలీ, "మొగల్ సామ్రాజ్ కా అంత్ – మధ్యకాలీన్ భారత్" సంపాదకులు ఇర్ఫాన్ హబీబ్, సంచిక - 1, 1981, పేజి 109, 110
8. ఆజాద్ బెల్‌గ్రామి – ఖజాన-ఎ-ఆమిరా, కాన్‌పూర్, 1871, పేజి 47
9. మొహిబ్బుల్ హసన్ ఖాన్ – హిస్టరీ ఆఫ్ టిప్పు సుల్తాన్, కలకత్తా, 1951, పేజి 344-347
10. 1987 జనవరి నెల చివరి వారంలో పాట్నా యూనివర్శిటీ చరిత్ర విభాగంలో ఏర్పాటు చేసిన ఒక ఇష్టాగోష్ఠిలో ఆయనీ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

**27. ముగింపు**

# రచయిత సంక్షిప్త పరిచయం

| | | |
|---|---|---|
| పేరు | : | ముహమ్మద్ సర్వర్ |
| కలం పేరు | : | అబుల్ ఫౌజాన్<br>(ఈ పేరుతోనే వ్యాసాలు, పుస్తకాలు వెలువడుతాయి) |
| పుట్టిన తేది | : | 15-08-1948 |
| జన్మస్థలం | : | పొత్కపల్లి రైల్వే స్టేషన్, ఓదెల మండలం, కరీంనగర్ జిల్లా<br>(ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా) |
| శాశ్వత నివాసం | : | కరీంనగర్, తెలంగాణ రాష్ట్రం |
| తల్లిదండ్రులు | : | అఫ్జల్ బి-అబ్దుల్ కరీం |
| వృత్తి | : | రిటైర్డ్ డిప్యూటి తహశీల్దార్ |
| ప్రవృత్తి | : | రచనలు, అనువాదాలు |
| విద్యాభ్యాసం | : | ఎం.ఎ. (ఇస్లామిక్ స్టడీస్), ఎం.ఎ.(ఉర్దూ),హిందీ భాషా రత్న |
| ఇంతవరకు వ్రాసిన / అనువదించిన పుస్తకాలు | : | స్వంత రచనలు, అనువాదాలు కలిపి (33) కి పైగా పుస్తకాలు, 400కి పైగా వ్యాసాలు, కథలు, కథానికలు. |
| అర్ధాంగి | : | శ్రీమతి ఖైసర్ సుల్తానా |
| కూతురు, అల్లుడు | : | ఫౌజియ అఫ్జల్ - ముహమ్మద్ ముజఫ్ఫర్ హుసేన్ |
| కుమారులు, కోడళ్ళు | : | Md. అతీఖుర్ రహ్మాన్ (ఫౌజాన్)- రుమాన తబస్సుం<br>Md. తంజీలుర్ రహ్మాన్(అర్సలాన్)-కరీమున్నిసా హుమ<br>Md. హిదాయతుర్ రహ్మాన్ (సుఫియాన్) - సయ్యద షాయిమ అక్బర్,<br>Md. ఇనాయతుర్ రహ్మాన్ (సల్మాన్) |
| మనుమలు-మనుమరాళ్ళు | : | ముహమ్మద్ ముసద్దిఖ్ హుసేన్ (ఇజ్హాన్)<br>అలీనా మహ్విష్ (షీజా)<br>జూనా అరూబ్ (రిజా)<br>Md. హుమేదుర్ రహ్మాన్ (రైద్)<br>Md. నవేదుర్ రహ్మాన్ (జైద్) |

## రచయిత ఇంతవరకు వ్రాసిన / అనువదించిన పుస్తకాల వివరాలు

| | | |
|---|---|---|
| 1. | ముస్లిం సమగ్ర జీవితం | సామాజిక + ధార్మికం |
| 2. | ప్రవక్త సహచరుల సందేశ సరళి | ధార్మికం |
| 3. | దాంపత్య సంబంధాల విచ్ఛిన్నం | సామాజిక |
| 4. | ఇస్లాం-స్త్రీకిచ్చిందేమిటి? | సామాజిక+ధార్మిక |
| 5. | వివాహ శుభాకాంక్షలు | సామాజిక |
| 6. | లైంగిక సంబంధాలు-ప్రకృతి నియమాలు | సామాజిక |
| 7. | ఇస్లాం-సుశిక్షణా వ్యవస్థ | ధార్మికం |
| 8. | ఇస్లాం-ధ్యేయమేమిటి? | ధార్మికం |
| 9. | బాలికల సామూహిక సంహారం | సామాజికం |
| 10. | మానవుని ఆర్థిక సమస్యలు, వాటి ఇస్లామీయ పరిష్కారం | ఆర్థిక |
| 11. | బర్జఖ్ (పితృలోకం) | ధార్మికం |
| 12. | మత సామరస్యం-ఔరంగజేబ్ | చారిత్రక |
| 13. | దైవప్రవక్త సందేశ సరళి - మన బాధ్యతలు | ధార్మికం |
| 14. | ఇస్లాంపై విమర్శలు-సమాధానాలు | ధార్మిక + సామాజిక |
| 15. | ధర్మ ప్రవేశంలో నిర్బంధం లేదు | ధార్మికం |
| 16. | బాలికల భ్రూణ హత్యలు-దాని పరిష్కారం | సామాజిక |
| 17. | మహా వృక్షాలు (మౌలానా మౌదూది ఆత్మ కథ) | సామాజిక |
| 18. | భారతీయ ధార్మిక గ్రంథాల్లో మహనీయ ముహమ్మద్ (స) | ధార్మికం |
| 19. | ఇస్లాం-అపార్థాలు | ధార్మిక + సామాజిక |
| 20. | ప్రపంచ ధర్మాల్లో దైవభావన | ధార్మికం |
| 21. | షహీదె వతన్ - అష్ఫాఖుల్లా ఖాన్ (ఉర్దూ) | సామాజిక + చారిత్రక |
| 22. | ఆఖరి ఇటుక | ధార్మికం |
| 23. | వడ్డీ - కీడు | ఆర్థిక |
| 24. | ఆధునిక యుగంలో వడ్డీ నిషేధం సాధ్యమా? | ఆర్థిక |
| 25. | రఫయదైన్ విషయంలో వివరణ | ధార్మికం |
| 26. | సత్యధర్మ పరిశోధకులు | ధార్మికం |
| 27. | శుచి శుభ్రతలు-నమాజు నియమాలు | ధార్మికం |
| 28. | భారత మూల జాతి ఎవరు? | సామాజిక |
| 29. | దళిత వెతలు-పరిష్కార మార్గమేది? | సామాజిక |
| 30. | ముక్తికి, స్వేచ్ఛకు మార్గమేది? | సామాజిక |
| 31. | శకీల్-బిన్-హనీఫ్ మోసపు వాస్తవికత | ధార్మికం |
| 32. | ఇస్లాం చారిత్రక పాత్ర | చారిత్రక + సామాజిక |
| 33. | దళిత సమస్యకు మూలమెవ్వరు? | సామాజిక |

★ ఇవే కాకుండా ఎడిట్‌లో, ప్రింటింగ్‌లో ఇంకా 12 పుస్తకాలున్నాయి.

# కృతజ్ఞతలు

నాలాంటి సామాన్య రచయితకు  ఇలాంటి ఉద్గ్రంథాన్ని రచించే శక్తి, ధైర్య సాహసాలు, సాధనాలు సమకూర్చి నాతో ఈ పని విజయవంతంగా పూర్తి చేయించిన ఆ పరాత్పరునికి ముందుగా  స్తుతిస్తోత్రాలు,  కృతజ్ఞతాభివందనాలు  సమర్పించుకుంటున్నాను.

రచనా రంగంలో ఎలాంటి అనుభవం లేని నాలాంటి వానికి కలం పట్టడం ఎలాగో, వ్యాసాలు వ్రాయడం ఎలాగో, అనువదించడం ఎలాగో నేర్పి, సంస్కరించి, తమ పత్రికలో నా వ్యాసాల్ని ప్రచురించి నన్ను ప్రోత్సహించి ముందుకు నడిపించిన "గీటురాయి" వారపత్రిక యాజమాన్యానికి  ప్రత్యేకించి  జనాబ్ ఎస్.ఎమ్. మలిక్ గారికి, జనాబ్ అబుల్ ఇర్ఫాన్ గారికి, జనాబ్ అజీజుర్రహ్మాన్ గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఆ తరువాత నేను వ్రాసిన, అనువదించిన గ్రంథాల్ని ప్రచురించి నాలో ధైర్యోత్సాహాల్ని,  ఆత్మ విశ్వాసాన్ని నూరిపోసి స్వతంత్ర రచనలకు దారిచూపిన గురుతుల్యులు తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ మాజీ డైరెక్టర్ స్వర్గీయ అబ్బాదుల్లా గారికి కృతజ్ఞతలు తెలుపుకోకుండా ఉండలేను. ఈ నలుగురి సహాయ సహకారాలు, ప్రోత్సాహమే లేకపోయినట్లయితే బహుశా నేడీ స్థానంలో నేను నిలబడి ఉండ గలిగేవాణ్ణి కానేమో!

'మత సామరస్యం–ఔరంగజేబ్' పేరుతో 2008లో ఒక చిన్న పుస్తకాన్ని రూపొందిం చాను. పలువురు దాన్ని బాగా మెచ్చుకున్నారు. ఏదో సందర్భంలో హైద్రాబాద్‌లో సయ్యద్ నశీర్ అహ్మద్, ప్రొఫెసర్ మహబూబ్ బాషా గార్లతో పరిచయం ఏర్పడింది. 2009 జనవరి మాసంలో కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సు జరుగబోతున్నదని, అందులో తప్పక పాల్గొనాలని వీరిద్దరూ నన్ను ప్రోత్సహించారు. ఆ ప్రకారమే నేను కర్నూలు వెళ్ళాను. అక్కడ ఇతర పుస్తకాలతో పాటుగా నేను రూపొందించిన "మత సామరస్యం – ఔరంగజేబ్" కూడా ఆవిష్కరించబడింది. ఆ విధంగా ఔరంగజేబ్ పట్ల నాకు గల అభిరుచి అందరికీ తెలిసిపోయింది. నేను రూపొందించిన ఆ పుస్తకం చాలా చిన్నది. ఒక రచయితగా మీరు ఎలాగూ ఔరంగజేబ్‌పై దృష్టి సారించారు కనుక ఔరంగజేబ్ గురించి సమగ్రమైన, సవివరమైన పుస్తకాన్ని రూపొందించాలని పలువురు నన్ను ప్రోత్సహించారు. ప్రత్యేకించి ఆ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ బాషా, ప్రొఫెసర్ సాంబశివరెడ్డి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రఘు గార్లు నా పట్ల చూపిన గౌరవమర్యాదలు, ఆప్యాయతల్ని నేను నేటికీ మరువలేకపోయాను. ఆనాడు అలా ఏర్పడిన సంబంధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఆ సదస్సులో సయ్యద్ నశీర్ అహ్మద్ గారు నేను ఔరంగజేబ్‌పై తప్పకుండా ఒక పుస్తకాన్ని రూపొందించాలని నన్ను బాగా ప్రోత్సహించారు. సరేనని ఈ పనికి నేను ఉపక్రమించాను.

అయితే సమాచార సేకరణ అంత సులువు కాదనే విషయం నాకు తరువాత తెలిసివచ్చింది. ఔరంగజేబ్‌పై వ్రాసిన కొన్ని ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాల్ని సంపాదించ గలిగాను. నేనుండేది ఒక చిన్న పట్టణం. అక్కడి లైబ్రరీల్లో నాకు పనికివచ్చే పుస్తకాలు అసలే లేవు. నేను ఔరంగజేబ్ సమకాలీన చరిత్ర గ్రంథాల్ని వెదుకుతున్నాను. వీటి అన్వేషణలోనే

ఎంతో కాలం గడిచిపోయింది. నా పని దాదాపుగా స్థంభించిపోయిన ఈ సమయంలోనే దైవికంగానే ఒక విచిత్రం జరిగింది. అంతకు ముందు ముక్కూ ముఖం ఎరుగని, ఎలాంటి పరిచయం లేని కీ.శే. సయ్యద్ షా గాజియుద్దీన్ (షోలాపూర్, మహారాష్ట్ర) గారితో ఫోనుద్వారా పరిచయం ఏర్పడింది. అది ఆత్మీయతగా, గాఢానుబంధంగా మారి పోయింది.

ఈ ఆత్మీయుడు, ప్రియమిత్రుడు, శ్రేయోభిలాషి, నా పని ప్రాముఖ్యతను, ఆవశ్యకతను బాగా గుర్తెరిగి, బ్రతికినన్ని రోజులు నాకు చేదోడు వాదోడుగా నిలిచి, వెన్నుతడుతూ ముందుకు నడిపించిన, ప్రఖ్యాత న్యాయవాది స్వర్గీయ సయ్యద్ షా గాజియుద్దీన్ గారి గురించి ప్రస్తావించకుండా నేనస్సలు ముందుకు సాగలేను. ఆయన సహాయ సహకారాలు, ప్రేమ వాత్సల్యాలు మరుపురానివి. మరణశయ్యపై ఆసుపత్రిలో కీమోథెరపి లాంటి చికిత్స చేయించుకుంటూ కూడా ఆయన నన్ను, నా పనిని మరువలేదంటే నా పని పట్ల ఆయనకు గల నిబద్ధత, ఆకాంక్ష ఎలాంటిదో అవలీలగా అర్థం చేసుకోవచ్చు. ఆయన వద్ద విలువైన పుస్తక భాండాగారం ఉంది. నేను ఔరంగజేబ్‌పై వ్రాయడం మొదలుపెట్టినప్పుడు, నా వద్ద ఈ సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాల సంఖ్య బహు తక్కువ. ఇక ఔరంగజేబ్ సమకాలీన చరిత్రకారులు వ్రాసిన చరిత్రగ్రంథాలు అసలే లేవు. ఈ లోటును, ఈ అవసరాన్ని గాజియుద్దీన్ గారు దాదాపు సంపూర్ణంగా పూర్తి చేశారని చెప్పవచ్చు.

ఆయనకు తెలుగు రాదు. కాని విషయ సూచికను, అధ్యాయాల్ని ఉర్దూలో అనువదించి ఆయనకు వినిపించినప్పుడు ఆయన అబ్బురపడ్డారు. అత్యంత ఆశ్చర్యంతో, "ఇంత సుదీర్ఘంగా, ఇన్ని అధ్యాయాలు, శీర్షికలు ఒకేచోట ఉన్న గ్రంథం ఉర్దూ, ఇంగ్లీష్‌లో కూడా లేదే! మీరు చాలా పెద్ద భారాన్నే మీదేసుకున్నారు. దీనికోసం చాలా గ్రంథాల్ని రెఫర్ చేయాల్సి ఉంటుంది. నేను మీకు చేతనైన సహాయం చేస్తాను. దైవం మీ ఆకాంక్షను నెరవేర్చు గాక!" - అంటూ ప్రోత్సహించారు. వాగ్దానం చేసినట్లుగానే ఆయన ఎన్నో విలువైన, సామాన్యంగా లభ్యంకాని, అవుట్ ఆఫ్ ప్రింట్ గ్రంథాల్ని జిరాక్స్ చేయించి మరీ పంపించారు. ముంతఖబుల్ లుబాబ్ వాల్యూంలు ఆయన మాధ్యమంగానే నాకు ముట్టాయి. అరుదైన మాసిరె ఆలంగిరి, మాసిరుల్ ఉమరా, ట్రావెల్స్ ఇన్ మొగల్ ఎంపైర్, ఫతూహాతె ఆలంగిరి, ఔరంగజేబ్ ఆలంగిర్ - ఇలా ఇలా ఎన్నో పుస్తకాలు జిరాక్స్ చేయించి పంపించారు. మాసిరుల్ ఉమరా అయితే ఒక్కొక్క వాల్యూం దాదాపు వేయి పేజీల వరకుంటుంది. దాని మూడు వాల్యూంలను జిరాక్స్ చేయించి పంపించారంటే నా పని పట్ల ఆయనకెంత మక్కువ ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఔరంగజేబ్ ప్రభృతుల పర్షియన్ లేఖల అనువాదం కోసం నేనెన్నో వ్యయప్రయాసలకు, కష్టాలకు లోనవుతున్నానని తెలిసినప్పుడు, ఔరంగజేబ్ ప్రభృతుల లేఖల్ని ఉర్దూలోకి అనువాదం చేసిన షమ్స్ బరేల్వి గారి పుస్తకం "ఔరంగజేబ్ - ఖుతూత్ కె ఆయినే మే" (ఇది ముఖద్దమ రుఖ్ఆతె ఆలంగీర్ అనువాదం) మొత్తంగా జిరాక్స్ చేయించి పంపించారు. ఔరంగజేబ్‌పై జదూనాథ్ సర్కార్ వ్రాసిన ఐదు వాల్యూంలు పబ్లిషర్స్ వద్ద కూడా దొరకడం లేదని తెలిపినప్పుడు ఔరంగాబాద్‌కు చెందిన ప్రదీప్ మహిస్కార్ గారి వద్ద నుండి ఆ వాల్యూంలు తెప్పించి జిరాక్స్ చేయించి మరీ పంపించారు. (ఆఖీర్ షహింషాహ్- అనే పేరుతో మరాఠీలో ఔరంగజేబ్‌పై మహిస్కార్ గారు ఇటీవలనే ఒక గొప్ప నవలను వెలువరించారు).

మరాఠా చరిత్ర పట్ల గాజియుద్దీన్ గారికి మంచి అవగాహన ఉండేది. మరాఠాలు- ఔరంగజేబ్ చరిత్ర దాదాపు ఒక్కటే. కనీసం ఔరంగజేబ్ కడపటి జీవిత కాలం వరకు, ఈ కారణంగా ఆయన మొగలుల పరిపాలనకు సంబంధించిన దాదాపు అన్ని సంబంధిత గ్రంథాల్ని సమకూర్చి పెట్టుకున్నారు. అదే సమయంలో ఆయనకు ఛత్రపతి శివాజీ - మరాఠాల చరిత్రతో కూడా అభిరుచి ఉండేది. స్వయంగా ఆయన జ్యోతిబాపులె, షాహు మహారాజ్, డా. అంబేద్కర్ మొదలగు వారి గురించి ఉర్దూ ప్రజలకు అవగాహన కలిగించాలనే దృష్టితో వారిపై ఉర్దూలో పుస్తకాల్ని వెలువరించారు. ఒక విచిత్ర విషయమేమిటంటే మేమిద్దరం ఒక్కటంటే ఒక్కసారి కూడా కలువలేదు. ఫోన్ల మీదనే గంటల కొద్దీ సంభాషణ జరిగేది. ఎన్నో విలువైన రెఫరెన్సుల్ని ఆయన మరాఠి గ్రంథాల నుండి అనువదించి పంపించేవారు. ఆయన మరణం దుఃఖవిషాదాల్నే కాకుండా సాహిత్యపరంగా నన్ను అంగవైకల్యున్ని చేసినట్లయింది. దయగల పరమ మిత్రుడు, మార్గదర్శకం వహించే సాహిత్యవేత్త, చరిత్రకారుడు, దేశంలోని వివిధ వర్గాల్లో సయోధ్యను కుదుర్చి దేశంలో శాంతి సామరస్యాలు, సమైక్యతను కాంక్షించే జాతీయవాది తేది. 31-01-2014 రోజున షోలాపూర్‌లో పరమపదించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, స్వర్గంలో ఆయనకు అత్యున్నత స్థానం ప్రసాదించాలని దైవాన్ని వినయ వినమ్రతలతో వేడుకుంటున్నాను.

ఛత్రపతి శివాజీ, మరాఠా చరిత్రను ఆయన ఎంతగా వినిపించారంటే, ఎంతగా విశదీకరించారంటే, ఈ కారణంగా ఆయన మరాఠా సమాజంలో ఎంతో పాపులర్ అయిపోయారు. అందుకే ఆయన మొదటి వర్ధంతిని మరాఠా సేవా సంఘ్ వారు స్వచ్ఛందంగా, ఘనంగా జరుపుకున్నారు. వేల సంఖ్యలో మరాఠాలు అందులో పాల్గొన్నారు.

నా ఇంకొక ప్రియమిత్రుడు, ఆత్మీయుడు, సోదరతుల్యుడూ, బహు గ్రంథ రచయిత, ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహ్మద్ గురించి పేర్కొనకుండా ఉండలేను. ఔరంగజేబ్‌పై పుస్తకం వ్రాయడం గురించి వాగ్దానం తీసుకోవడమే కాకుండా, నేనీ వాగ్దాన పాలన చేస్తున్నానా? లేదా? పుస్తకం వ్రాస్తున్నానా? లేదా? అంటూ తరచుగా వాకబుచేస్తూ, నా సాదకబాధకాల్ని తెలుసుకుంటూ, సముచిత సలహాలతో సదా నా వెన్నంటి ఉండే నశీర్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలుపకుండా ఎలా ఉండగలను? నన్ను వెంటేసుకొని, అనేకమంది సాహితీవేత్తలు, చరిత్రకారులు, ప్రముఖులకు నాకు పరిచయం చేయించారు. పుస్తకం తయారు కాకముందే ఔరంగజేబ్‌పై బృహత్తర గ్రంథం రాబోతున్నదహో! అంటూ వివిధ వర్గాల ప్రజల్లో ప్రచారం చేసిన ఘనుడీయన. ఇంకా పుస్తకమే రూపొందలేదు, ఎందుకు అనవసరంగా ప్రచారం చేస్తున్నావన్నప్పుడు, దీన్ని రూపొందించడంలో నీవు తప్పక కృతార్థుడవుతావన్నా! అంటూ నాలో ఆత్మ విశ్వాసాన్ని నింపిన దార్శనికుడు. ఈ పుస్తకాన్ని ప్రారంభించి పూర్తి చేసిన ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో ఆయనెన్నడూ నాకు దూరంగా ఉండలేదు. ప్రతివారం, కొన్ని సందర్భాల్లో ప్రతి రోజు ఈ పుస్తకం గురించి మాట్లాడుకునే వాళ్ళం. మొత్తానికి చివరికంటూ పుస్తకం ప్రింటింగ్‌కు పోయే వరకు ఆయన అందించిన సహాయసహకారాలు, ప్రోత్సాహం మరువలేనివి. దైవం ఆయనకు

సన్మార్గాన్ని ప్రసాదించాలని, జాతి సేవకోసం ఆయనకు దీర్ఘాయురారోగ్యాల్ని ప్రసాదించాలని దైవాన్ని వినయవినమ్రతలతో దైవాన్ని వేడుకుంటున్నాను.

ఈ పుస్తకపు డి.టి.పి. పనిని చేపట్టిన సలీం గ్రాఫిక్స్ ప్రొప్రెయిటర్ సయ్యద్ హుసైన్ గారి సేవలు అమూల్యం. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో ఆయన నిరంతరం ఈ కార్యం చేస్తూనే పోయారు. ఎన్నోసార్లు చేర్పులు, మార్పులు జరిగాయి. ఆయన ఏమాత్రం విసుగు చెందక దీన్నొక వృత్తిపరమైన బాధ్యత కాకుండా ఒక సమాజ సేవ అనే దృక్పథంతో చేశారు. ఒక మంచి పనిలో భాగం పంచుకుంటున్నందుకు తనకూ ఆనందంగా ఉందని, ఆయన ఈ పని పట్ల తన సంతృప్తిని వెలిబుచ్చారు. ఆయన నిబద్ధతకు జోహార్లు. దైవం ఇహపరాల్లో ఆయనకు సాఫల్యాన్ని ప్రసాదించుగాక!

ఔరంగజేబ్ మీద సమగ్ర సమాచారంతో ఒక గ్రంథాన్ని రచించి వెలువరించనున్నానని చెప్పగానే ఎంతో సంతోషిస్తూ, "ఔరంగజేబ్" మీద గ్రంథం రావలసిన అవసరం ఎంతో ఉందంటూ ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ గారు (ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపకులు, విశ్రాంత ఆచార్యులు & చరిత్ర శాఖాధిపతి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్) నన్ను ప్రోత్సహించారు. ఈ గ్రంథాన్ని చదివి ముందుమాట వ్రాసి ఇవ్వాల్సిందిగా నేను విజ్ఞప్తి చేయగానే ఎంతో సంతోషంతో అంగీకరించటమే గాక, వ్యవధిలోగా "పరిచయం" వ్రాసిచ్చారు. ఈ గ్రంథాన్ని ఆసాంతం చదివి పలు సూచనలు చేస్తూ, ఈ గ్రంథం మరింతగా ప్రామాణీకత సంతరించుకోవటంలో సహకరించిన మాన్యులు, గౌరవనీయులు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

తెలంగాణా చరిత్ర పరిశోధనా కేంద్రానికి అధ్యక్షులు, ఉస్మానియా యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు మరియు చరిత్ర శాఖాధిపతి, మనదేశంలోని వివిధ యూనివర్శిటీల్లోనే కాకుండా జపాన్; చైనా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా ఇంకా ఆఫ్రికాలోని పలు యూనివర్శిటీల్లో విజిటింగ్ ప్రొఫెసర్ మాన్యులు శ్రీ అడపా సత్యనారాయణ గారు, తరచుగా టూర్లలో నిమగ్నమై ఉన్నప్పటికీ ఈ గ్రంథాన్ని చదివి హృదయ పూర్వకంగా అభినందించారు. తీరిక లేకుండా సతతం టూర్లలో ఉంటూ కూడా సుదీర్ఘమైన ఈ గ్రంథపు ఒక్కొక్క అధ్యాయాన్ని చదివి, ముఖ్య అంశాల్ని ఎత్తి చూపుతూ పోయిన వైనం చూస్తే ఆయన ఎంత శ్రమ పడ్డారో, ఎంతటి సహనం, అభిమానం, అభిరుచితో ఈ గ్రంథాన్ని చదివారో ఆయన వ్రాసిన ముందు మాటతో స్పష్టమై పోతోంది. అద్భుతమైన ముందుమాట వ్రాసి నాలో ధైర్యోత్సాహాల్ని నింపిన ఆయన గారికి నేనెంతో రుణపడి ఉన్నాను. ఒక గ్రంథ రచయితకు ఆ విభాగంలో శిఖరాల నధిరోహించి ఉన్న మాన్యుల ద్వారా గుర్తింపు, ప్రశంస లభించినప్పుడు అతను తను పడిన శ్రమను, కష్టాన్ని మరిచి పులకరించిపోతాడు. నేనూ అలాంటి అనుభూతినే అనుభవించాను. నేను పడిన శ్రమను, రచనను గుర్తించి నన్ను, నా గ్రంథాన్ని హృదయపూర్వకంగా అభినందించిన మాన్యులు శ్రీ అడపా సత్యనారాయణ గారికి ఎలా ధన్యవాదాలు తెల్పుకోవాలో నాకు పాలుపోవడం లేదు.

హృదయాంతరాళాల నుండి వెలువడిన మాటలు హృదయాలకు తాకుతాయని పెద్దలు చెప్పిన సామెత నా ఈ పుస్తకం ద్వారా నిజమని నిరూపితమయింది. ఔరంగజేబ్ నా చుట్టమూ కాదు, ఆయన మాన్యాలేమీ నేను అనుభవించటమూ లేదు. ఔరంగజేబ్‌ను ప్రశంసించటమో,

కీర్తించడమో కూడా నా లక్ష్యం కాదు. ఔరంగజేబ్ మాధ్యమంగా మన దేశంలోని రెండు పెద్ద వర్గాల్లో వ్యాపించిపోయిన అపార్థాలు, అపనమ్మకాలు, ఈర్ష్యా ద్వేషాలు ఎంత నిరాధారమైనవో, ఎంత కల్పితమైనవో తెలిపి, ఇరువర్గాల్లో అన్యోన్యత, ప్రేమైక సంబంధాల పునరుద్ధరణే నా అసలు లక్ష్యం. ఆ నా లక్ష్యాన్ని దొరకబట్టి, బహిర్గతం చేసినందుకు ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ గారికి మరోసారి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ప్రేమ వాత్సల్యాలు, శాంతి సామరస్యాలే తన గుర్తింపుగా చేసుకున్న మాన్యులు, గౌరవ నీయులు డాక్టర్ నలిమెల భాస్కర్ గారు బహు బాధ్యతల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ నా గ్రంథాన్ని స్వీకరించి, దాన్ని ఆసాంతం చదివి చక్కని ఆప్తవాక్యం వ్రాసి ఇచ్చినందుకు ఆయనకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఆయన శాంత స్వభావం, నిజాన్ని నిజమని ఎలుగెత్తి చెప్పే ఆయన అలవాటు, అన్ని వర్గాల్లో ఆయన్ను ప్రీతిపాత్రునిగా, తమవానిగా స్వీకరింపజేసింది. అలాంటి ఉత్తమ వ్యక్తి, ఆదర్శప్రాయుడు నా పుస్తకాన్ని మెచ్చుకోవడం నాకు గర్వకారణం. ఆయనకు దీర్ఘ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ సర్వాంతర్యామిని వేడుకుంటున్నాను.

తనదంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కలిగిన, తమ శక్తిమంతమైన, జీవంగల సంపాద కీయాలతో ఆంధ్రజ్యోతి దినపత్రికకు ఒక కొత్త జీవం పోసిన దాని సంపాదకులు – మాన్యులు, గౌరవనీయులు శ్రీ కె. శ్రీనివాస్ గారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. పలు బాధ్యతలతో సతమతమవుతూ, పలు పర్యటనల్లో ఉంటూ కూడా నా పుస్తకాన్ని చదివి విలక్షణమైన, తన ప్రత్యేక తరహాలో తన అభిప్రాయాన్ని వ్రాసి నా గ్రంథానికి ఒక కొత్త వన్నె తెచ్చారు. ఆయన కలంలో ఇంకా బలాన్ని, దీర్ఘ ఆయురారోగ్యాల్ని ప్రసాదించాలని దైవాన్ని వేడుకుంటున్నాను.

నా ఇంకొక మిత్రుడు, సోదరతుల్యుడు, ఎన్నో గ్రంథాల రచయిత, ప్రత్యేకించి దివ్య ఖుర్ఆన్‌లోని కొన్ని భాగాల్ని అనువదించి, ప్రచురించిన ద్విభాషా కోవిదుడు నెల్లూరుకు చెందిన కె.యం. అబ్దుస్ సుబ్‌హాన్ గారు కూడా నా కృతజ్ఞతలకు అర్హులు. నా ఈ గ్రంథంలోని కొన్ని అధ్యాయాల్ని నిశితంగా పరిశీలించి సముచిత సలహాలు, సూచనలిచ్చారు. ఇంకా ఎన్నో విధాలుగా సహాయపడ్డారు. ఆయన అందించిన సహాయ సహకారాలకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఔరంగజేబ్ ప్రభృతుల లేఖల అనువాదం సందర్భంలో ఏర్పడిన స్థంభన సమయంలో తనకు పర్షియన్ భాషతో సంబంధం లేకపోయినా, సంబంధీకులతో చేతనైన సహాయం అందించిన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్సుకు డీన్ అయిన ప్రొఫెసర్ షేఖ్ మస్తాన్ గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

కె.బి. ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీ పాట్నా, బిహార్‌కు చెందిన డాక్టర్ ఇఫ్తెఖార్ అహ్మద్ మదనీ గారికి, జమ్షెద్‌పూర్‌కు చెందిన డాక్టర్ ముఖ్తార్ అహ్మద్ మక్కి గారికి, అలీగఢ్‌కు

చెందిన అబ్దుల్లా దానిష్ గారికి, వారి సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

సిద్దేశ్వర మందిరం, మచ్నూర్, బ్రహ్మపురి ఫోటోలు మొదలగు వాటిని సమకూర్చిన స్వర్గీయ స.షా. గాజియుద్దీన్ గారి మనుమడు సయ్యద్ సమీమ్, షోలాపూర్ గారికి, అదేవిధంగా చిత్రకూట్‌లోని బాలాజి మందిరపు ఫోటోలు, ఫర్మానా మొదలగునవి పంపిన న్యూస్ – 24 రిపోర్టర్ శ్రీ జుగ్నూ ఖాన్ గారికి, చిత్రకూట్‌కు చెందిన శ్రీ తాహెర్ సాబ్ గారికి కూడా వారి సహాయ సహకారాలకు కృతజ్ఞతలు.

అదేవిధంగా తమ సహాయ సహకారాలందించిన రిటైర్డ్ ఎస్.ఐ. ముహమ్మద్ అహ్మద్ అలీ, గుంటూరు గారికి, ఔరంగాబాద్‌కు చెందిన ముహమ్మద్ గులాం అహ్మద్ అలీ, రిటైర్డ్ సెక్షన్ ఆఫీసర్, హైకోర్టు బెంచ్, ఔరంగాబాద్ గారికి, మహారాష్ట్ర, ఉమర్ ఖేడ్‌కు చెందిన చరిత్రకారుడు ప్రేమ్ హనౌతె గారికి, మహేంద్రనగర్, జహీరాబాద్‌కు చెందిన సయ్యద్ మఖ్సూద్ అహ్మద్ గారికి, షోలాపూర్‌కు చెందిన రిటైర్డ్ డి.ఎస్పీ. మూసా అహ్మద్ ఖాన్ గారికి, ఢిల్లీకి చెందిన ఇస్లామిక్ బుక్ ఫౌండేషన్ యజమాని జనాబ్ ఫిరాసత్ అలీ గారికి, నెల్లూరుకు చెందిన ముహమ్మద్ అహ్మద్ (కువైట్ అహ్మద్) గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

చక్కటి ముఖచిత్రాన్ని, ఆకర్షణీయమైన పేజ్ సెట్టింగ్‌ను చేసి పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన లంకా లక్ష్మీనారాయణ మరియు సయ్యద్ సమీయొద్దీన్ గార్లకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

నా రచనా వ్యాసంగానికి అంతరాయం కలిగించకుండా నాకు ఏకాంతాన్ని సమకూర్చిన నా సతీమణి శ్రీమతి ఖైసర్ సుల్తానా, మరియు నా కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఇహపరాల సాఫల్యం లభించాలని దైవాన్ని వేడుకుంటున్నాను.

ఈ పుస్తకాన్ని రూపొందించడంలో అనేక ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, పర్షియన్, మరాఠీ గ్రంథాల సహాయాన్ని తీసుకున్నాను. ఆ గ్రంథాల రచయితలు, అనువాదకులు, సంకలనకర్తలు, పబ్లిషర్స్ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గ్రంథ రచనలో, ప్రచురణలో ప్రత్య క్షంగాగాని, పరోక్షంగా గానీ సహాయ సహకారాలందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుం టున్నాను.

ఈ గ్రంథాన్ని రూపొందించేటప్పుడు పొరపాట్లు జరుగకుండా, ఒకరి మనసు గాయ పడకుండా సాధ్యమైనంతగా ప్రయత్నం చేశాను. అయినా తెలిసో, తెలియకో అలాంటి ఏదైనా పొరపాటు, లేదా మాటలు, వాక్యాలు దొర్లిపోతే విజ్ఞులైన పాఠకులు దయతో వాటిని మా దృష్టికి తెస్తే మలి ముద్రణలో సవరించుకోవడానికి అవకాశముంటుందని మనవి చేస్తున్నాను.

**– అబుల్ ఫౌజాన్**